భగవద్గీత

# ప్రశ్నోత్తరీప్రవచన గీత



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్ధులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ

# ప్ర[illegible]గీత

రచయిత :

శ్రీ [illegible]

ఓం


[illegible]

ప్రకాశకులు :

[illegible]

వెల ] 1960 [ రూ. 10.

దొరుకుచోటు:— స్వామి శ్రీ సహజానంద, సహజానందగీతాశ్రమము,
[illegible], నంద్యాల. (కర్నూలు జిల్లా)



లోకోద్ధారకులు :

మహర్షి శ్రీ సద్గురు మలయాళస్వామివర్యులు

క॥ గురుదేవ భవత్కారుణన్ - విరచింపని గీత సులభమేట్యత ప్రశ్నో
త్తరముగ వచనము నానా - నరులు తరింపగ ధగకొను నా వందనముల్.



రచయిత :

శ్రీ సహజానందస్వామివారు

# విషయసూచిక


1. ఉపోద్ఘాతము .... ౧
2. వరాహపురాణోక్త శ్రీ గీతామాహాత్మ్యము .... ౧౯
3. గీతాస్తోత్రశ్లోకములు .... ౨౯
4. శ్రీమద్భగవద్గీత — మూలశ్లోకములు .... ౩౬
   - (1) ప్రథమోఽధ్యాయః — అర్జునవిషాదయోగము ... ౩౬
   - (2) ద్వితీయోఽధ్యాయః — సాంఖ్యయోగము ... ౪౦
   - (3) తృతీయోఽధ్యాయః — కర్మయోగము ... ౪౬
   - (4) చతుర్థోఽధ్యాయః — జ్ఞానయోగము ... ౪౯
   - (5) పంచమోఽధ్యాయః — కర్మసన్న్యాసయోగము ౫౩
   - (6) షష్ఠోఽధ్యాయః — ఆత్మసంయమయోగము ... ౫౫
   - (7) సప్తమోఽధ్యాయః — విజ్ఞానయోగము ... ౫౯
   - (8) అష్టమోఽధ్యాయః — అక్షరపరబ్రహ్మయోగము ౬౨
   - (9) నవమోఽధ్యాయః — రాజవిద్యారాజగుహ్యయోగము ౬౪
   - (10) దశమోఽధ్యాయః — విభూతియోగము ... ౬౭
   - (11) ఏకాదశోఽధ్యాయః — విశ్వరూపసందర్శనయోగము ౭౧
   - (12) ద్వాదశోఽధ్యాయః — భక్తియోగము ... ౭౮
   - (13) త్రయోదశోఽధ్యాయః — క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము ౭౯
   - (14) చతుర్దశోఽధ్యాయః — గుణత్రయవిభాగయోగము ౮౨
   - (15) పంచదశోఽధ్యాయః — పురుషోత్తమప్రాప్తియోగము ౮౫
   - (16) షోడశోఽధ్యాయః — దైవాసురసంపద్విభాగయోగము ౮౭
   - (17) సప్తదశోఽధ్యాయః — శ్రద్ధాత్రయవిభాగయోగము ౮౯
   - (18) అష్టాదశోఽధ్యాయః — మోక్షసన్న్యాసయోగము ౯౧
5. శ్రీకృష్ణస్తోత్రములు .... 1
6. శ్రీ గీతామహిమ .... 1

7. ప్రశ్నోత్తరీప్రవచనగీత – గ్రంథారంభము .... 3

(1) ప్రథమాధ్యాయము - అర్జునవిషాదయోగము ... 3
(2) ద్వితీయాధ్యాయము - సాంఖ్యయోగము ... 31
(3) తృతీయాధ్యాయము - కర్మయోగము ... 86
(4) చతుర్థాధ్యాయము - జ్ఞానయోగము ... 122
(5) పంచమాధ్యాయము - కర్మసన్న్యాసయోగము 151
(6) షష్ఠాధ్యాయము - ఆత్మసంయమయోగము ... 166
(7) సప్తమాధ్యాయము - జ్ఞానవిజ్ఞానయోగము ... 196
(8) అష్టమాధ్యాయము - అక్షరపరబ్రహ్మయోగము 230
(9) నవమాధ్యాయము - రాజవిద్యారాజగుహ్యయోగము 264
(10) దశమాధ్యాయము - విభూతియోగము ... 291
(11) ఏకాదశాధ్యాయము - విశ్వరూపసందర్శనయోగము 315
(12) ద్వాదశాధ్యాయము - భక్తియోగము ... 346
(13) త్రయోదశాధ్యాయము - క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము 380
(14) చతుర్దశాధ్యాయము - గుణత్రయవిభాగయోగము 428
(15) పంచదశాధ్యాయము - పురుషోత్తమప్రాప్తియోగము 463
(16) షోడశాధ్యాయము - దైవాసురసంపద్విభాగయోగము 501
(17) సప్తదశాధ్యాయము – శ్రద్ధాత్రయవిభాగయోగము 529
(18) అష్టాదశాధ్యాయము – మోక్షసన్న్యాసయోగము 560

8. మంగళహారతి .... 628

9. తప్పొప్పుల పట్టిక .... 629

ఓం

# ఉపోద్ఘాతము

పక్షిజాతి తమశక్తికొలది నాకసమున ప్రతిదినము విహరించుట అలవాటు. అవి అట్లు విహరించుట నాకసముయొక్క అంతుపొంతు తెలిసికొనవలెననిగాదు. లేదా ఆకసము అంతుపొంతు తెలిసికొనలేక పోయినను తప్పుకాదు. తమ అలవాటును తమధర్మమును వదలవు. ఆకసమున విహరించుటలోనే తమకు నానందము. ఇంక మానవులందరూ ప్రజ్ఞావంతులు, లేదా విజ్ఞానవేత్తలు రాకెట్ వంటి కృత్రిమయంత్రములను నాకసమున నదలుచున్నారు; విమానములనెక్కి తిరుగుచున్నారు; తిరుగగలరు. గ్రహాముల కనిపెట్ట ప్రయత్నింతురు. కాని ఆకసముయొక్క అంతుపొంతు నెన్నటికి తెలియలేరు. తెలియలేకపోయినను ప్రయత్నము చేయుచునేయుందురు. తద్రీతి శ్రీమద్భగవద్గీతా తత్త్వరహస్యవిమర్శన మానవులు చేయక మానరు. ఇయ్యది మానవుల ధర్మము. ఇందులోనే వారికి ఆనందము, ఆశయసిద్ధిగలదు. దాని నిజార్థమిదియేయని గ్రహింపలేక పోయినను సర్వవిధములజేయగలరు, జేతురుకూడ. కాని తత్త్వమిట్టిదని నిర్దేశింప నెవ్వరు సాహసింపరు, సాహసింపలేరు. శంకరునివంటివాడే దుర్విజ్ఞేయార్థమనెను.

ప్రపంచమున తత్త్వజ్ఞులెల్లరు గీతకు భాష్యములు వ్యాఖ్యానములు టీకానువాదములు, తెలుగున గద్యపద్యములు, బుఱ్ఱకథలిత్యాదులు లెక్కలేనన్ని ప్రకటించియున్నారు; ప్రకటింపగలరు; ప్రకటింపవలసినదే. సంస్కృత, ఆంధ్ర, తమిళ, కన్నడ, అరబ్బీ, ఆంగ్లేయ ఇత్యాదిభాషలలోగూడ ప్రకటితమైనది. ఏదేశమువారైనను, ఏమతస్థులైనను, పురుషులైనను, స్త్రీలైనను, తమతమశక్తిసామర్థ్యముల భగవత్తత్త్వమును విమర్శించి వివరించి తృప్తిబొందవచ్చును. అంతరంగవాసియు, సర్వవ్యాపియునగు భగవంతుని అపరస్వరూపులు మానవులగుట తప్పనిసరి గీతకు తమతమ యభిప్రాయము వ్రాయవచ్చును.

భగవత్తత్త్వమును తెలియుట చాలకష్టము. భగవద్గీతా తత్త్వము కూడ తెలియకష్టమే. గీతాతత్త్వమును గ్రహించిన భగవంతుని తెలియు

గలరు. గీతార్థమును జీర్ణమును ఏవిధముగ జీర్ణింపజేసుకున్నను, తాము భగవత్ప్రాప్తి పొందుటయేగాక అనేకులకు నుపకారమొనర్చినవారలగుదురు. ఏ ఒక్కరో మాత్రమే గీతార్థము వివరింపను వ్రాయనర్హులని, తక్కినవారనర్హులనరాదు. అనుటకెవ్వరికి సాహసము చాలదు. గీత యొకరిదికాదు, సకలమానవులకు హక్కుగలదు. ఏ ఒక్కరిదో అయి వుంటే గీత కింతటి ప్రశస్తము గలుగనేరలుగదు. సంకుచితహృదయముల, రాగద్వేషముల మానవులు భావమున, క్రియల సహింప నోపనిచో తాము నారాయణుడే నరుడను మహత్తరస్థితినుండి చ్యుతులగుటయేగాక భగవత్ప్రీతికి దూరులై విశ్వజనద్రోహులగుదురు. అటుగాక జనసామాన్యమునకు భగవత్తత్త్వమును సులభమార్గమున తెలియపరచిన సర్వదానందదాయకులు, కీర్తికరులు, లోకోద్ధారకులగుదురు.

పండితప్రకాండుల యంతరంగమందే భావగూఢమై, దాచిన లోభిధనమువలె, గంభీరముగనుండు నే పరమార్థమైనను లోకమునకు హితకారి కాదని నా నమ్మకము. రోగగ్రస్తుని సమీపమున వివిధరకముల పిండివంటలు ఫలహారాదులున్నను తినయోగ్యముకానట్లు, న్యూనాధికులెన్న యవిద్యాభిమానరోగమున్న వివిధార్థపదార్థరహస్యధర్మరూపిణి యగు గీతాతత్త్వము జీర్ణించుకోసాధ్యముకాదు. సకలప్రాణులకు సూర్యప్రకాశమవసరము. సూర్యుడును పక్షపాతికాడు. గీతాధర్మము, గీతాజ్ఞానము, గీతాకర్మము, గీతామర్మము, గీతాగ్రంథమందరకవసరము. గీతాచార్యుడు గీతాగ్రంథమునకు పక్షపాతము సాంప్రదాయకుల భావమువలె లేదు. నానావిధమానవులకందఱకు నందుబాటుగల్గించుటే పురుషార్థము, పరమధర్మము, శ్రేష్ఠముకూడ. తల్లి తన స్తనములందలి పాలను కనికందులకు నుపయోగించుటయందు ఒకవేళ జన్మించకమునుపే శిశువులకయ్యే తన స్తనముల భగవంతుడుంచిన పాల రహస్యముగనున్న పిల్లలకు కాదని తల్లిచెప్పగలదా? అవి బిడ్డలకేనని తనకుగాదని తల్లిపిల్లకే నుపయోగించి స్వతంత్రులను జేయుచుండుట లోకమెఱుగదా? లేక పక్షపాతముజేసి పిల్లలకు తన స్తనముల పాల నీయనిచో గలిగే రోగబాధ తానే యనుభవించటము. పిల్లలనోట దుమ్ముకొట్టిన పాపము. పైగా నపకీర్తి. పరిజనులలో తలయెత్తి తిరుగగలదా? భగవద్గీతా పరిగ్రహమున నంతయర్థమె

వాటిల్లదా! భగవంతుడే జగత్తునకు తల్లి దండ్రి గురు దైవము తోడు నీడ. ఆయన స్వరూపమును తెలిసినకాని మానవులకు శాంతిలేదు. ఆయనగానే లోకమునకొసంగిన ఆయన దివ్యసందేశవాక్కుల, ధర్మ రహస్యముల వినకూడదనిగాని, చదువకూడదనికాని యనుటలో స్వారస్యములేదు. పాఠశాలనిర్మాణము బాలబాలికలచదువునకేగా! మానవత్వము భగవంతుని గనుగొనుటకేవచ్చినది. ఆ జ్ఞానవిజ్ఞానసత్స్వరూపుడగు పరమాత్మయొక్క వ్యక్తరూపములే ఈ నానాకారములుగలవి. ప్రకార(జాతి) భేదముకాదు. పరిమాణ (తరతమత్వ)భేదమే. మన కాళ్ల క్రింద ప్రాకు క్షుద్రకీటకములకును, లోకమున నుద్భవింపగల మహోన్నత మేధాసంపన్నునికిని గలదికూడ జాతిభేదముకాదు; తరతమత్వభేదమేనని స్వామి వివేకానంద చాటించెను.

మానవులు గీతాతత్త్వరహస్యములను తెలిసికొనియే తీరవలె. జన్మసార్థకము మఱిదేనివలన గాదు. మానవుల కర్తవ్యమిదియె. "ఏకం సద్విప్రా బహుధా వదంతి" మహాత్ములనేకులు బహుమార్గముల గీతకు వ్యాఖ్యానము నొసర్చినను రానురాను ప్రతిమానవునియొక్క హృదయము నా స్వవిషయము, నా స్వధర్మకర్తవ్యనిష్ఠయేగదా గీతావిచారమని తెలియవలెను. ఖురాన్, బైబిలువంటి మతగ్రంథము లెన్నియో యుంటున్నవి. ఆ గ్రంథములందెంత యభిమానము నా మతగ్రంథరహస్యముల నా మతస్థులు సమానాదరణాతిశయముల గ్రహించుట లోకమెఱుగదా! మఱియు గీతయందట్టి యభిమానమేల నుంచరో శోచనీయము. ఎవరో వచించిన దురభిమానగ్రంథములను ద్రవ్యనష్టము, మనోదుర్బలత్వము, భేదశాసనముల గలిగించువానిని, పేరాశలు, చనిపోయినమీదట గలుగునో కలుగవో తెలియరాని ఫలితాల జూపించి, చిత్తకలక యశాంతవంతము గల్గించువానిని నేల వదలకూడదు? గుహ్యము, గుహ్యతరము, గుహ్యతమమని భగవంతుడు వచించుటలోని రహస్యమేమొ భగవంతునివలన నర్జునుడెఱిగినట్లు మహాత్ములవలన తెలియవలెనని తోచెడిని. అయిన నూహాతీతమైన గీతార్థము గుహ్యమన శరీరమునను న్న జీవే. గుహ్యతరమన బ్రహ్మాండమునున్న పరమాత్మను. గుహ్యతమమన పిండాండ బ్రహ్మాండములగల జీవపరమాత్మ లొక్కటియను త్వంపద తత్పదముల

నిర్ణయార్థము. ఇది ఒక రహస్యము. కర్మ, ఉపాసన లేక భక్తి, జ్ఞానమను మూడిటి నిర్ణయము పదునెనిమిది యధ్యాయముల మూడు షట్కముల భాగించి మూడు రహస్యార్థములు అనగా త్వంపద తత్పద అసిపదముల నిర్ణయమని యానందగిరి మొదలైన మహాత్ముల యాశయము.

మదర్థము, మత్కర్మకృత్, మత్పరమ మనే రహస్యములుగూడ నింతే. గీతాప్రచారమవసరమని భగవంతుడే వచించెను. నవ్యనాస్తికతా ధర్మగ్లానియైన లోకమునకు తన యమూల్యసందేశమే గీత. ఆ యవకాశమును పురస్కరించుకొని, ముక్తసరిగ దిగంతవ్యాపకము గీతాప్రచార మొనర్పవలెను. అన్యశాస్త్రములకంటెను - వానిని చదువ భాషనేర్వవలె; సంశయనివారణకు సన్న్యాసుల సేవించవలె. అట్టి వ్యవస్థ గీతపఠనకు తొలగి పోవునుకదా! బైబిలు ఖురానువంటి ఇతర సాంప్రదాయక గ్రంథములు త్వంపద తత్పదముల శోధన యను తానెవరు, పరమాత్మ యెవరను విషయము గనుపడదు. మానవుల స్వరూప స్వధర్మ స్వభావ స్వకర్మలకు ప్రతిబంధకమగు మోహమును మొదలంట కూకటివ్రేళ్లతో సహా పెకలించి వేసి, నిత్యనిరతిశయానందమగు స్వరూపసాక్షాత్కార మొనర్చు ప్రత్యక్ష ప్రమాణపూర్ణగ్రంథము గీత. గీతకు గీతయే సాటి "న భూతో న భవిష్యతి" విధిముఖ నిషేధముఖ ప్రత్యయాల కందని యాత్మస్వరూప తటస్థ లక్షణముల పురుషార్థప్రయోజనమే గీత.

ఒక దేశమునకు, నొక ప్రదేశమునకు, నొక వర్ణమునకు, నొక మతమునకు, నొక యాశ్రమమునకు, నొక కాలమునకు స్త్రీలు, పురుషులు, వృద్ధులు, బాలురు, బాలికలకని నిర్దేశ్యము గీతయందు గనరాదు. ఏ ప్రాంత్యపువారి భాషయందు బుట్టలేదు. దైవభాషయగు సంస్కృతము నందే నుద్భవించినది. సంస్కృతభాషను నేర్చిగాని లేక తమ తమ మాతృభాషలలోనికి ననువదింప జేసుకొనిగాని గీతాతత్త్వార్థము గ్రహింపవచ్చును. సృష్ట్యాదియందే సూర్యునకు గీత జెప్పబడెను. ఏ నాడో యెక్కడ నుండెనో యనిగాని, కొంతకాలము నాచరణలో లేదనికాని చెప్ప వీలులేదు. సంస్కృతభాష నందతెలియగక దాని పొంతకు బోకపోయిన దోషము మానవులదేకాని, గీతాపుస్తకము గీతాధర్మము నొకప్పుడు లేదనికాదు. మనకు భాషలేదు, మఱియు నెమకలేదు. గీతా తత్త్వశాస్త్రము, యోగశాస్త్రము,

అనువాదశాస్త్రము, స్మారకశాస్త్రము, మానవాశయప్రదశాస్త్రము యను పేళ్లతో నెప్పుడు విరాజిల్లుచున్నది.

భవరోగ దుఃఖనివారణమునకు నేకైకసిద్ధరసాయనమగు గీతను జన్మమెత్తిన ప్రతిమానవుడు చదివి జీవితసంగ్రామమున సతమతమై సమసి పరమగతిదూరులై జ్ఞానభ్రష్టులుగాక కర్తవ్యమును తెలిసి సిద్ధిని బొందుట లెస్స. ఏడునందల శ్లోకములున్నవి. మహామంత్రములు, వీనియందే నష్టాక్షరీ, ఏకాక్షరీ, సప్తాక్షరీ మంత్రములు విరాజిల్లుచున్నవి. సుప్రసిద్ధమై ఋషిన్యాస, కరన్యాస, అంగన్యాస యుక్తములై యున్నవి. ప్రస్థానములందు నగ్రస్థాన మలంకరించినది. గీతను గురించి వ్రాసిన వ్యాఖ్యానముల మించి నేనే క్రొత్త ప్రతిపాదన వ్యాఖ్యానముచేసి, పేరు ప్రతిష్ఠల నొందవలెనని నా యాశయము కాదు. నా యంతరాత్మయగు పరమాత్మ యెంత కాలమునుండియో నన్ను పురిగొల్పుచున్నాడు, ప్రబోధించుచుండ నా కర్తవ్యమిదియే యని "బహుజన హితాయ" జనసామాన్యము సులభముగా తెలియుటకొఱకే నా యుద్యమము; మరేమియుకాదు. ఏకునుండి 10, 12, 20, 100, 120 నెంబరు నూలు నెవరెవరి ప్రజ్ఞను బట్టి మెలకువ తీసెదరు; లోకమునకు వ్యాపక మొనరింతురు. ఒక చెలమయందు నీరుచల్లి యెందఱు గొనిపోవుచున్నను, నీరు కొరతవడక యథాగీతినుండుటలేదా? గీతా చెలమ వంటిది, ఏకువంటిది. ఎవరెవరి శక్తి సామర్థ్యముల నర్థముల ప్రతిపాదించుచున్నను చెలమ యేకువలె వ్యాపకమగుచున్నది.

గీతాచార్యుని సేవయే సాత్త్వికగీతాప్రచారము. కాలముతో, వ్యక్తులతో, సమాజములతో, దేశములతో గొన్ని ధర్మములు వృద్ధి నొందును. అదే ధర్మము లొకప్పుడు కాలగర్భమున వ్యక్తులు సమాజములతో సహా గలిసిపోవుచుండును. క్రొత్తధర్మము లవసరమగుచుండును. గీతాధర్మము మాత్ర మట్టిదికాదు. భూతకాలమునకు నప్పటిమానవులకు, వర్తమానకాలపు మానవులకు కాలమునకు, భావికాలమునకు నూతనమైనదిగానేయుండును. అందుకే భగవద్గీత యనిపించుకున్నది. సనాతన ధర్మమే గీత. మచ్చునకు నేడిదెనొక శ్లోకము దీసికొని దాని కర్థము నీరోజు చేసితిమా, అదే శ్లోకము రేపు మఱొక అర్థమును స్ఫురింపజేయును. నిజముగా భగవంతుడు కన్నులకు గనిపించలేదనువారు, ఏ విధ

మునవో మత సాంఘికధర్మము ననుసరించి స్మరణాదుల జేయువారు, భగ వంతుడే లేడనువారు గీతాద్యధ్యాయము చదివి తాత్పర్యము గ్రహించితే చాలు; తమ నాస్తికత్వమును నాస్తికత్వ మెస్పించగలడు. తానే లేనను వాడు తనకు తలిదండ్రులే లే వచ్చిరిననగలడా? ఎట్టివాని కైనను తలిదండ్రు లుండరు. తన తండ్రికి బదులు తాను, తన తండ్రి దస్తూరితో గీత వ్రాసెలు కాదనునా? కాదనలేడు. అట్లే గ్రంథము భగవంతుని సగుణరూపమే వ్యక్త మగు విశ్వము. ఇదే శబ్దబ్రహ్మము. తన సగానకు శబ్దబ్రహ్మ మగు గీత. ఈ విషయమును గీత మాటిమాటికి చెప్పుచున్నది.

పాశ్చాత్యదేశపు సంస్కృతవేత్త డాక్టరు మ్యాక్సుముల్లర్ తన మరణ సమయమున, హే భగవాన్! తిరిగి నేను బుట్టవలసివస్తే నన్ను భారత దేశమున బుట్టించుమని ప్రాణముల వదలెనందురు. ఎందుకు నాలాగు దలంచెను? జర్మను దేశమునకంటె ఇహభోగములు, యంత్రతంత్రములు, మహత్తరవిషయములు భారతదేశమున గలవనియా? సాంప్రదాయకమత ములతో, పక్షపాతములతో, ధర్మమును పేర నధర్మముతో, దోపిడి విధాన ముతో సత్యదూరమైన వచ్చిన సిద్ధాంతములకున్న దాస్యులై, స్వార్థముతో రాక్షసులా! సైతానులా! పిశాచములా! గ్రహములా! యని తెలియ రాని జాతి, మత కక్షిదారుల గుత్తభూమియగు భారతమున తాను గుత్త దారుడ నగుదుననియా? కోట్లకొలది మాతృదేవతలగు స్త్రీలకు, పురుషు లకు స్వాతంత్ర్యత, స్వేచ్ఛ సమానస్థితిలేక పరదేశస్థుల పాలైన పరిభవ మానవులవలె కావలెననియా? రోగములు లేకనే, కక్షలు జెప్పకనే, దేశము తెల్ల నడపకనే, సోదరమాహాత్మ్యమున సృష్టికి స్వర్గానికి నెక్కుట పతిలేని సతి వలె, వెలుగులేని చీకటివలె సమానాదరణ సర్వహక్కులు లేకయున్న దుర్బలమానవులవలె తానగుదుననియా? కాదు కాదు. మహిమన, ఆర్ష గ్రంథములు, అతీంద్రియజ్ఞానులగు మహర్షులుండినది. భగవదవతారము లకు నగ్రస్థానమైనది. ఆత్మానుభూతి గల్గించు నుపనిషద్భావసారమై భగ వంతుని ముఖారవిందమునుండి జనించిన సుదర్శనమగు గీతాశాస్త్రము లేదా అధ్యాత్మవిద్యాశాస్త్రము లేదా విజ్ఞానశాస్త్రమునకు నివాస స్థానము ప్రస్థానము లనేకములు గలిగియుండు దేశమగుట నా ప్రస్థానముల నాత్మానుభూతి తనివిదీర నొందవలెనని గోరెనేకాని మతాంతరుడుగాదు.

స్వామి వివేకానంద యొకప్పుడు 'నా దేశమున నొక కుక్కయైన పస్తుపడి యున్నంతవఱకు దాని కాహార మిడి రక్షించుటయే నా పరమధర్మము. ఇదియే నా మతము. తద్భిన్నమంతయు నధర్మము, కృత్రిమధర్మము. సమస్తజీవరూపుడగు నద్వితీయుని విశేషము నాయార్త నారాయణుని సమస్తదేశీయుల కెల్ల బీదయగు నా భారతనారాయణుని నా యిష్టదేవత నర్చించుటకై నెన్ని జన్మములైన నెత్తెదనుగాక! ఎన్నివేల బాధలైన ననుభవింతునుగాక!' అని కలలగని యదేవిధమున యన్నదాన, విద్యా దాన, జ్ఞానదానముల నేడఖండదేశసేవ లేదా ప్రపంచసేవ రామకృష్ణ మతము యిత్యాది సమాజముల స్థాపించిన దేశభక్తాగ్రగణ్యుడు, విశ్వ మానవ ప్రేమపూరితుడుగాడా! తదుపరి భారతదేశము జాతి మత కక్షలతో సాంప్రదాయ పక్షపాత పిశాచములతో పరదేశస్థులకు బానిసయై పరదేశస్థుల పాదాక్రాంతమైనదాని నిష్కామయోగి, సత్యాహింసాయుధములధారి, విశ్వవైతాళికుడగు మహాత్మాగాంధీజీ దేశస్వాతంత్ర్యమును, భారతీయుల బంధవిమోచన మొనరింపడా. ప్రతిభారతీయుడు ప్రస్థానముల నగ్రగణ్య మగు గీతాశాస్త్రమును చదివి, చదివించి నందలి జ్ఞాన విజ్ఞానములనుగా నొనర్చి భగవత్ప్రాప్తి నొందుటకు దగు సాధనముల గీతాసమాజముల దేశమెల్లెడల నునిచి, పాఠశాలలయందుగూడ పరీక్షాగ్రంథముగానుంచి, యంధవిశ్వాసములు, నయోమయస్థితుల సమాయక దేశముగాజేయుక, నద్వితీయ పరమేశ్వర సగుణవ్యక్తరూపములే మా యీ భారత నాగరిక యనాగరికమున వెలయు మాతృదేవి సంతానము. ఈ సోదర సోదరీ మణుల సమానజ్ఞానవిజ్ఞానముల నశేష సేవజేయుటకై నెన్ని కష్టముల, నెన్ని జన్మములైన నెత్తగలమను ధీమంతులదే గీతాసేవ, గీతామాత.

స్వేచ్ఛయు, స్వాతంత్ర్యము, నిరతిశయానందము గోరు ప్రతిజీవులలో తత్ప్రాప్తిప్రదగణ్యధన్యులు మానవులు. ఆ మానవులయందు భార తీయులు ప్రథములు. సుదర్శనాయుధుడగు హరి జన్మదేశము భారతీయము. "దృశ్యతే అనేన ఇతి దర్శనమ్" మెల్లగజూడక దేని దర్శించిన (తన) దర్శన మగును. సత్యమును దర్శించుటకు సుదర్శనమ్. అవిద్యా మెల్లచూపు జూడ తొలగినంతనె 'సు' చక్కసజ్ఞానము, దాన దర్శనము గాగలది తన స్వరూపము. ఎముకల గోడలు, మాంసపుమట్టి, తోలుతిత్తి, యాకార

ముగా గనిపించి వచ్చిపోవు దేహమునందు మమకారమును స్వస్వరూపప్రతి
బంధకమగు మోహనివృత్తి గావించెను. జగద్గురు శ్రీకృష్ణపరమాత్మ తన పూర్ణావతారము నకోనమును సిద్ధముచేసెను. బుద్ధుడు నీతి సిద్ధాంతముల గనుడనెను. జినుడు త్యాగమును గనుడనెను. శంకరుడు జ్ఞానమును గనుడనెను. రామానుజుడు భక్తి గనుమనెను. మాధ్వుడు నిష్ఠ గనుడనెను. స్వామి వివేకానంద జ్ఞాన విజ్ఞాన ప్రయోగ గనుమనెను. రామతీర్థ స్వేచ్ఛగా జూడుమనెను. బాలగంగాధరతిలక్ శాస్త్రసహిత నిష్కామకర్మయోగమును గనుడనెను. మలయాళస్వామి భక్తిజ్ఞాననిష్ఠను గనుడనెను.

ఎందరెన్ని సిద్ధాంతములు చెప్పినను స్వస్వభేదములతో, సాధ్యముగాని దేశోపద్రవము, అహింసాప్రచారము గల్గించుటకై చేయుచున్న మహోన్నత జీవితముతో ప్రజాసమానత్వము నిరూపించి సమానస్వాతంత్ర్య గోలు పోవుచుండ రక్షించుటకై గీతాసూత్రములను ప్రచారము చేసిన మహాత్మా గాంధీజీ నిస్స్వార్థసేవతో దేశోద్ధరణ, సామ్రాజ్యవాద నాశనము, భావ క్రియలు రెండవసరములు యగునట్లు ఘనులతో స్వర్గము గావలెనను.

ఆ మాతృదేశీయులు గీతా జ్ఞాన భక్తి సిద్ధాంతముల ప్రచారము ఘనముగా ఒనరించి, విశ్వము హరిమయము, హరి విశ్వమయము "భూతాని విష్ణుర్భువనాని విష్ణుః" అను ప్రమాణమును నిరూపించి ప్రచారముల గీతా ధర్మ మత్పరశ్చ తపశ్చ తప్పకుండ నాచారప్రవర్తకులై, ఎందఱో ప్రచారమొనర్చిన శుకునివలె భారతావని సేవజేయు నాచార్య వినోభావేవంటి మహర్షుల గన్న భారతాంబా! పరదేశీయులనుండి నీ బంధము తొలగెను కాని నీ బిడ్డల భేదదృష్టి తొలగి సమానదృష్టి గలిగినపుడే నీకు తుల్యానందము, మాకు సంసారబంధవిముక్తియగును. స్వాతంత్ర్యులై సకలసంపద లంగీకరించిన న్యూనాధికత లున్నంతవఱకు దేశక్షేమము, నాత్మక్షేమము లేదనునది ప్రతిఒక్కరు తెలియవలెను. మానవులెందున్నను సమానులే, ఈశ్వరానుగ్రహులే, ఈశ్వరస్వరూపులే, మనుసంతతులే; వేఱుకాదు.

ఇక నాంధ్రదేశమందమా! కావ్యగ్రంథములతో, నాటక వ్యాకరణ సంగీత చిత్రలేఖన పరిపోషక నాట్యవినోదజనులతో, ప్రాంత్యప్రాంత్యముల కొక్కప్రభువై, తమలో తాము బద్ధవైరులై, తమతో తమ ప్రజలను పరమార్థదూరు లొనరించినట్లు చరిత్ర చాటుచున్నది. మానవకల్యాణ

కరమగు దుఃఖనివృత్తి యానందప్రాప్తికి హేతువులగు దర్శనోపనిషద్గీతల ప్రాధాన్య మాంధ్రమున ప్రచారమున్నట్టులేదు. ప్రాచీనమగు మత సంస్కారముగాని, ఏతత్సంబంధమగు సారస్వతముగాని లేదు. అదేగాక యిందే బుట్టి యిచటనే నిలిచి ధర్మప్రచార మొనర్చిన యాచార్యపరంపర లేదు. మచ్చునకు చూడుడీ. కేరళమునకు శంకరుడు, అరవలకు నాయనారు, లాళ్వారులు రామానుజులీతీరు ప్రతిప్రాంత్యమునకు గలరు. సంస్కృత భాష చాల తక్కువ. శుద్ధాద్వైతకర్తయగు వల్లభుడు, ద్వైతాద్వైత కర్తయగు నింబార్కుడు జన్మతః ఆంధ్రులేయైనను, వారి ప్రచారమంతా నుత్తరదేశముననే జరిగినది. ఇంతేను నాయా కారణాలవలన నాంధ్రులకు జెప్పుకోదగినంత దర్శన శాస్త్రోపనిష ద్వాఙ్మయముగాని, మతసంబంధమగు రచనలుగాని, ధర్మప్రబోధములుగాని లేవు. ప్రస్తుతనాంధ్రులు విమర్శించిన తెలియగలరు.

ఈ కొఱతను యనగా మాతృదేవతలగు స్త్రీలకు, ప్రతియొక్క పురుషసోదరునకు సంస్కృతమును, దానికి దగిన బ్రహ్మచర్యవ్రత నిష్ఠానుకూలసాధనలు, విరక్తజనులకు వైరాగ్య జ్ఞాన కర్మ భక్తి సాధనలు మోక్షమునకు సోపానములుగ క్రమముగ నొనరింపజేయుచు, నా బాల గోపాలము దైవమంటే, సత్యము ధర్మములంటే, మోక్షమంటే, మానవత్వమంటే, పునర్జన్మమంటే, జీవుడంటే, ప్రపంచమంటే, జననమరణములంటే, సంసారమంటే, గృహస్థ వానప్రస్థ సన్న్యాసములంటే, మానవుల కర్తవ్య మేమిటి యనే తెలుపుటకు మాసపత్రికను, వేదపాఠశాలను, సంవత్సరమున కొకతూరి నొక్కొక జిల్లా లేదా ప్రాంత్యముల సనాతనవేదాంతజ్ఞానసభయను దానివలన నలుమూలలనుండివచ్చిన జన సామాన్యమునకు సన్నోదకముల దృష్టి నొసరించుచు, భక్తి జ్ఞాన వైరాగ్య ధ్యాన కర్మ యోగ రహస్యముల నెఱింగిన మహాత్ముల ననేకుల నాహ్వానించి వారి ద్వారా నుపన్యాసంబుల ప్రతివారి హృదయకుహరమున పవిత్రధర్మబ్రహ్మబీజముల విత్తింపించుచు మానవసేవయే మాధవసేవయను రీతి గీతయంటె నేలపైన గీయు గీతయా? లేక పలకపైన గీయు గీతయా? అని యెంచు నాంధ్రులకు భగవద్గీతా రహస్యమును వారి వారి హృదయఫలకముల హత్తింపజేసి, హస్తములయందు గీతనుబట్టి చదువను ప్రోత్సహించి, పదమూడు వత్సర

ములు తప మొనరించి, నైష్ఠికబ్రహ్మచర్యమున తన తపఃఫలము తన శ్రేయస్సు తోడిమానవుల కేసని జన్మతః కేరళమైనను నాంధ్రమున వేద వ్యాసాశ్రమమనుపేర నొక యాశ్రమము స్థాపించి, కన్యాగురుకుల పాఠశాల, బ్రహ్మవిద్యా పాఠశాల నునిచి, విధి విరామములేకుండ నపర వ్యాసులవలె నాంధ్రమాత బిడ్డల కసారసేవజేయు మహర్షి మలయాళస్వామి నెఱుగనివారు ఆసేతు హిమాచలమధ్య భారతమున లేరు. వారి సేవ యమోఘమగుట నాంధ్రులు నిద్రనుండి మేల్కొనినట్లు మేల్కొని చైతన్యవంతులై విజ్ఞాన జ్ఞాన విద్యాదుల సమానసోదర సోదరీమణులై నిప్పు డీప్పుడు దిశల కలయజూచుచున్నారు. ఒక్క యాంధ్ర దేశమే కాదు, సమస్తభారతావనియే కాదు, మానవ మనుగడున్నచోట నెల్ల గీతా ప్రచార మవసరము. ప్రతిదేశమువారి మాతృభాషలోనుండే నియ్యది స్వకపోలకల్పితమనవచ్చు. నేర్చుకొనగలిగాని గ్రహించరాని దైవభాష యందు గీతయుండుటచే స్వతస్సిద్ధముగ భగవంతుడు చెప్పినదియేః మానవ ప్రోక్తముకాదు. ఏ మతస్థులైనను, నేభాషావరులైనను తమ తమ భాషల లోనికి ననువదించుకొని భగవత్ప్రాప్తి బొందుటకు గీతాపారాయణము తాత్పర్యముల నెఱిగి యనుభవ మొనర్చుకొనవలెను. ఆస్తిపాస్తులలో గాని మతే రాజకీయమునగాని కాలానుగుణ్యముగ నీకు నాకు యనే యాతురతతో నీవు ముందా, నేను ముందా యనిగాని విపరీతదృష్టి గలుగ వచ్చు. ఈ గీత భగవంతుని వాణి. విశ్వమయునిలోనివే కాలములు, దేశములు. జీవులు భగవద్గీతవంటి పరమప్రమాణ శ్రేయస్కరమైనది మఱొకటిలేదు. మానవుల స్వరూపస్వధర్మమును, స్వభావమును, స్వకర్మ యనే నీ నాలుగు లక్షణముల సాధనముల సిద్ధావస్థ నొంద సులభముగ తెలిపి భవభీతిబాపు మహోపకారి "తచ్చింతనం తత్కథనమ్" అన్నట్లు గీతాచింతన, గీతాకథన మన్యోన్యమగు తత్ప్రబోధనము తదేకత్వమే నిరంతరము చేయవలెను. ఫలము అభేదమును, అద్వైతానందము స్వతస్సిద్ధము నిర్వాచనము.

అపమానమైన మానవత్వము లభించుటమే నొక భాగ్యము. నదరు మానవత్వము నే దేశములనో, ఏ కాలములనోగాక, నేకాలములనైన యాసియాఖండమున భారతదేశమున జన్మించుటము మఱియొక యదృ

ష్టము. ప్రాచీన అతీంద్రియజ్ఞానులగు ఋషిగోత్రీయులై ,వారి యానాటి యాశీర్వాదబల మెల్లప్పుడు కలిసివచ్చుట మిగుల భాగ్యము. భగవదవతారములకు నెలవై బ్రహ్మర్షి, దేవర్షి, రాజర్షి, మహర్షి, ఋషి, యతి, మౌని, పరమహంసాది మహాత్ములుదయించి, నివసించిన పరమగమ్యము. సత్యాహింస, తపో విద్యా త్యాగ ప్రేమ బ్రహ్మచర్య మార్జవ క్షమా స్తిక్యాది ధర్మరక్షిత పూరుషాకార దీక్షితదక్షులగు నుదారమహాశయుల జన్మభూమి. వేదాంత సాహిత్య రసపోషణమునకు నాటపట్టు. బుద్ధ ,జిన, శంకర, రామానుజ, మధ్వ, రామకృష్ణ, వివేకానంద, రామతీర్థ, బాలగంగాధర తిలక్, మహాత్మాగాంధీ, రమణ, యరవింద, మలయాళ మహర్షి ప్రభృతుల పీఠస్థలము. కృష్ణార్జున సంవాదరూపంబగు వేదసార వేదాంత రహస్య ధర్మ ప్రతిష్ఠిత సకలమత సామరస్య సార్వభౌమత్వ త్రిలోకారాధ్య పూజ్య గీతాభ్యుదయ కురుక్షేత్రస్థ పావనధరణి స్వాతంత్ర్యప్రియుల కాదర్శనీయ పవిత్రయాత్రాస్థలము, నిరుపమానమగు నీ దేశముననుండుట యత్యంత పురాకృత సుకృతము,నిరుపాధికమును శాశ్వతనిరతిశయానంద పరబ్రహ్మము నొందుటకై సాధన మొనర్పక యుపేక్షించు జీవితము నిరర్థకము. సూర్యుడు వెలుగు, చంద్రుడు ఓషధీలతల వర్ధిలజేయు,మానవులు జీవింప, సకల సస్య ఫల తరు నదీయుతములు జీవనదాయకములుగా వేదశాస్త్రాదులు యాశయసిద్ధికి మడుంగులొత్తి సాదరమున సుఖమార్గముల జూపుచుండ సుసంకల్పంబులు వందిమాగధులై పరివేష్టింప నున్నతోన్నతి నొందక తాపత్రయ నీషణాత్రయముల జిక్కుపడి తెరవుగానని మానవులవలె నుండ తగదు. మానవులన యచేతనములగు కాష్ఠపు బొమ్మలు, రాతివిగ్రహములు, మాంసపిండములుగాదు. చైతన్యస్వరూపులు, ప్రకృతినిధానులు, నిత్యముక్తాత్ములు. ప్రతిమానవునియందు దేవత్వము, పూర్ణత్వము స్వతస్సిద్ధముగనే గలదు. తత్ప్రకటనమే మతము, ధర్మము, విద్య యనె స్వామి వివేకానంద.

జ్ఞానేంద్రియ పంచకము, వానికి విషయములగు శబ్ద స్పర్శ రూప రస గంధాభాసకల్పమే ప్రపంచము. ఇట్టి ప్రపంచమున పురుషుడుగానో, స్త్రీగానో యుండి కర్మేంద్రియముల క్రియల నాచరించుచు, నంతరేంద్రియముల, నీషణాత్రయముల ననుభవింప సంకల్పవాసనా వ్యాకోచ మోహా

తులై, యాత్మజ్ఞానదూరులగుట, వారికంతే కనబడటము, అంతేయుండ టము. జడచేతనములు మిశ్రితములై స్థూలసూక్ష్మముల గమనింపరాక యున్న చేతనము గ్రహింప యజ్ఞానులకు సాధ్యమా? పరమాత్మస్థితిని ప్రకాశింపజేయుటకు చదువుకొనుటయే, కాష్ఠమునందు రాపిడిచే నగ్నిని బుట్టింప నది ప్రజ్వలితమై ప్రయోజనమగురీతి సాధనల మూలమున బాగుగా శ్రవణ మనన నిధిధ్యాసములనే రాపిడి నిరంతరము గల్గింపవలెను. "యావ ద్విజ్ఞానసామగ్ర్యం తావచ్ఛ్రేష్ఠ్యం వివర్ధతే" ఎంతెంత విజ్ఞానసామగ్ర్య మగునో, అంతంత శ్రేష్ఠ్యత్వము వృద్ధినొందును. జ్ఞానులగు శ్రేష్ఠపురు షుల నిత్యజీవితమేది? అజ్ఞానులగు పామరమానవుల నిత్యజీవితమేది? గమ నించితిమా! అల్పములగు ఇంద్రియసుఖములే పరమార్థము, పరమార్థ మని, శాశ్వతము, సర్వానర్థవినాశనము, నిత్యస్వతస్సిద్ధము, సహజానందము నెఱుంగక సుఖకలల దిబ్బనిరావలేక పీనుగు పెంటలే స్మశానముల బండి స్వర్గకలలుగను పక్షులవలె గనుచు, భోగసుఖముల దిరుగుచు, స్వార్థ ఫల కెరటముల మునుగుచు, నాశప్రవాహవేగమున కొట్టుకొనిపోయి తుదకు నంతు పొంతు తెలియ సాధ్యముగాని, దాటగరాని యున్న సంద్ర సమమగు సంసారజలధి మునుగుచు, తేలుచు కళలులేని చంద్రునిభాతి, రాహుగ్రస్త సూర్యునివలె, వలబడ్డ మృగము భంగి, చంద్రునిగానని చకో రములవలె నిర్వీర్యులై యుండుటయే సొబగా? ఒకచోట పోయినవస్తు వొకచోట వెదుక లభించునా? చీకటిలో కనిపించని వస్తువును వెలుగున్న చోట వెతకట మేల్లు? చీకటిని బోగొట్టితేగాని వస్తువు కనిపింపదు. వస్తువు లభించినగాని తృప్తిలేదు. తృప్తి లేదా సుఖము లేక శాంతముండదు. లేక పోతే మానె యనుకుంటే చింతాశాంతి దుఃఖములు తొలగవుగా? చింతిం చితే చీకటి తొలగదు, వేడితే కరుణించి కదలదు, బెదరించితే పారి పోదు, పిలిచితే పలుకదు, మఱచితే నున్నదున్నట్లుండును, వేసరి వదలితే పతనమే, విడిచితే విడువదు, రాళ్లమోదినా, గుదిపెల గొట్టినా, చేతుల జఱచినా, అస్త్రముల ఛేదించినా, తుపాకుల గాల్చినా, కలహమొనర్ప బోయిన, విసరిపారవేయబోయిన, దేనిలోనికైన జొనిపిన, గాక మంత్రమొ, జపమొ, తపమొ, వ్రతమొ, కట్టు, వాకట్టుల, ఆజ్ఞల, శాపములు పెట్టిన [illegible] తానే పారిపోయిన తొలగదు. ఈ పనులన్నియు వెఱ్ఱి, పిచ్చి,

యున్మత్త, చేష్టలుగా నుండును. ఇట్టి నాంద్రెండఱు తోడైన జాలిగా మొరబెట్టుకొన్న నేదో దేవతల ప్రార్థించిన, నెట్టి యార్చన లొనర్చిన, ఏ దేశముల కేగిన తొలగదు. దేవతలనే వారు తామే తొలగించుకోలేకుంటే యితరుల కెట్లు సహాయ మొనర్తురు?

తనమీదబడ్డ దోమను తొలగించుకోలేక యెదుటివానిమీదబడ్డ యేనుగు నెత్తబోవుటవంటిది. చతుష్షష్టికళల, చతుర్దశవిద్యల, మతభేదముల, విద్యాగారవముల, ప్రశస్తాడంబరముల, స్వాత్మస్తుతుల, పరతిరస్కారముల తలపడిననట్టు వీడదు. తనంతట తొలగిపోదు. అన్యులెవ్వరు బంపినదికాదు. అంగడిలో నుండునదొకటి యడగట మొకటి, వుండేదొకటి చెప్పేదొకటి, చేయునదొకటి లభించునదొకటి, తలపొకటి ఫలమొకటి, వ్యాధి యొకటి మందొకటి, పుండొకచోట మందొకచోట, ప్రయాణమొకటి చేరునది యొకస్థలము, మంత్రించేదొకటి మనలోనుండునదొకటి, చెప్పేదొకటి వినేది యొకటి, చెడిటిశిష్యుడు గ్రుడ్డిగురువు, మాచకమ్మ నపుంసకుని సంతానమునలె నస్తవ్యస్తమగు నీవ్యవహార మెట్లనర్థకమో చీకటి నివారణోపాయములుగూడ నిరర్థకములేను. ఏమి జేసిన చీకటి తొలగును? దీపము వెలిగించితే చాలు వుండమన్న నుండదు, కనిపించమన్న గనిపింపదు. ఇక దాని పర్యవసానే యుండదు. అసలువస్తు వగుపడింది, యశాంతి తొలగింది, మనస్సున కుదురు దొరికినది.

అనాదినుండి హృదయమున నజ్ఞానమను చీకటి తిష్ఠ వేసికొని యున్నది. భాగవతమున ప్రహ్లాదుడు అచ్చపు చీకటింబడి యని పద్యము జెప్పెను. ఆ యచ్చపు చీకటియదే యాజ్ఞానము. అచ్చమని యెందుకనెను? సూర్యుడు చంద్రాగ్నులతో చీకటి తొలగును. వానివలన నీ యజ్ఞాన చీకటి తొలగదు. అందుకై అచ్చపు చీకటి యనబడును. గీతయందనేక చోట్ల నీ చీకటిని భగవంతుడు జ్ఞాపకము జేసియున్నాడు. అసలు అర్జునుని మోహామునకీ యజ్ఞానమను చీకటియేకదా కారణము! ప్రతివారి హృదయమందలి చీకటి తమ తమ స్వరూపముల మఱచింపజేసి భీరువులుగా దీనులుగా జీవితభయము, జీవితాంతరభయము, జన్మమృత్యుభయము, లోకలోకాంతరవాసభయము, రాగద్వేషరోగలోభ న్యూనాధికభయము లనేకము గల్పించి దిక్కు పరదిక్కు దోపనీయక అడుగడుగునకు క్షణక్షణము,

అనుభవించిన మంచిచెడ్డలు నాగమనములై అంతరదృష్టికి నష్టరావటమొ, క్రొత్త క్రొత్త నూపతుపోహ మానసిక ప్రపంచ మేటరించటమొ, బాహ్య ప్రపంచవిషయ సౌఖ్యములు గిలగింతలుబెట్ట, దశదిక్కుల జూచుచు, రాత్రింబగళ్ళనే కాలచక్కెర్ల నిజీకకొని బండారము బయటబడ పెదవులు తడుపుచు, నాశ్రితులకై వేగిరపడుచు, ఎండ సోకినంతనె ముడుచుకొను పుష్పలతాదులవలె భరజీవితమై యోచించుటకు నిండిన పాప పుణ్య మిశ్రమ కర్మఫల వాసనాజనిత చంచలమెఱుపున శక్తి జాలకనుండుట మానవులకు తెలియనిదికాదు.

దీనికి నుపాయములేదా? ప్రస్థానత్రయమున ప్రసిద్ధివడసిన భవరోగ నివారణ మొసర్చు గీతాదీపమును వెలిగించితే సరి. హృదయకుహరమందలి భవబంధహేతువగు నజ్ఞాన మొగ్గెబ్బలో మటుమాయమై చూతమన్న కనిపించనిదై పోవును. మరల దాని నర్థసముండదను. ఈ జన్మమున లేకపోతే మరొకజన్మమున ముక్తి గావా యన్న, నీ యజ్ఞానముండిన జన్మములు వచ్చును. అజ్ఞానములేదా జన్మలెప్పుడు లేవు. ఈ ప్రశ్నకు అనకాశ మెక్కడ? పుష్పములు వికసించిన వాసనవచ్చు, చంద్రుని గనినంతనె యోషధులు సంతసించు, పౌర్ణమి రాగా సముద్రము డుప్పొంగు, భాను డురా చీకటి తొలగు, వర్షముగా వివిధప్రాణుల జీవనాడులు బలవంతము లగు, ఔషధసేవవలన రోగము తొలగు, ఆరోగ్యముతో నిత్యసంతోషము, తలిదండ్రి దాత దైవ మిత్ర సువ్యాజ్ఞనుతంటి గురువు గల్గిన ఘోరసంసార తాపత్రయ నివారకము, నిత్యానందప్రదము, అతులశాంతము, జ్ఞాన భూమికలు తుదముట్ట నజ్ఞానభూమికలు తమ పేరుతో నదృశ్యములగును. భేదదృష్టి తొలగి యభేదమే. అంతా స్వరూపమే, అతులిత స్వప్రసిద్ధా ద్వయమే, ఖండములులేని యఖండమే. మన పాలిటి భాగ్యలక్ష్మి, విజయ లక్ష్మి, అధ్యాత్మవిద్యారహస్య వివేకోదయ ప్రాప్త మోక్షలక్ష్మి, వాచ్య వాచకాభేదమగు గీతాలక్ష్మిని సేవించవలె. గీతాచార్యుడే లక్ష్మివిభుడు, లీలామానుషవిగ్రహుడు, సర్వసాక్షి, భగవదిచ్ఛ. గీతాశయము మానవ ప్రయత్నము సఫలీకృతము గావలె, గీతామాతను అశేషజను లాశ్రయించి కృతకృత్యులు గావలెను. గీతాసుదర్శనశాస్త్రము పదునెన్మిదధ్యాయము

లలో నాద్యంతములు విమర్శించిన భగవంతుడు జెప్పినట్లు రెండే రెండు యోగములు లేదా సాధనములు; ఒకటి సాంఖ్యము, రెండవది కర్మము జెప్పెను.

ద్వితీయాధ్యాయమున జ్ఞానకర్మలను, తృతీయాధ్యాయమున కర్మ యోగ సమగ్రమును, నాలుగవ యధ్యాయమున జ్ఞానకర్మనిష్ఠలను యధి కారులను, పంచమాధ్యాయమున కర్మజ్ఞాన విశేషములను, షష్ఠాధ్యాయ మున క్లుప్తముగ కర్మజ్ఞాన రహస్యములను, నంతరంగసాధనమగు ధ్యాన యోగనిష్ఠ తత్సాధనలగు సమదృష్టి అభ్యాసవైరాగ్యములు యోగ భ్రష్టుని గతి కర్మజ్ఞానములకు మధ్య భక్తి యుండవలెననెను, సప్తమా ధ్యాయమున జగత్సృష్టి చతుర్విధ భక్తులు మాయ ద్వివిధరూపులు, అష్టమాధ్యాయమున బ్రహ్మాధ్యాత్మ కర్మాధిభూతముల కర్మల ఫలితాల శుక్ల కృష్ణ మార్గములను, నవమాధ్యాయమున సృష్టి భగవద్విలక్షణత భక్తి యజ్ఞాదుల ఫలములు స్త్రీ శూద్ర వైశ్యాదులు పాపాత్ములైనను, తన్ను భజించిన మోక్షమిత్తుననియు, దశమమున తన విభూతులను విశ్వ మంతయు తనయందు నేకాంశమనియు, ఏకాదశమున అర్జునునకు నేత్ర ప్రసాదము విశ్వరూపసందర్శనము, ద్వాదశమున సగుణ నిర్గుణ భక్తులు వారి లక్షణములు, త్రయోదశమున క్షేత్రక్షేత్రజ్ఞుల జ్ఞాన జ్ఞేయ ప్రకృతి పురుషుల రహస్యము, చతుర్దశమున సృష్టితత్త్వము గుణత్రయముల నతి క్రమించు నుపాయము వానివలన గలుగు ఫలము గుణాతీతుని లక్షణము భక్తివలన గుణముల నతిక్రమించు నుపాయము, పంచదశమున సంసార మాయా వృక్షరూపకాలంకారమును పురుషోత్తముడు తత్ప్రాప్తి సాధన ములు క్షరాక్షరముల విమర్శ, షోడశమున దైవాసురసంపద, సప్తదశ మున శ్రద్ధాత్రయ ఓంతత్సత్తులు తత్ఫలితములు, అష్టాదశమున సన్న్యాస త్యాగముల వ్యాఖ్య జ్ఞాన కర్మ భక్తి మార్గములను తత్ఫలితములను గీతా ఫల శ్రుతిని జెప్పబడినది.

విశ్వమునకు భగవంతు డిచ్చిన దివ్యవరప్రసాద సందేశమే గీత. భిన్నభిన్నములగు భక్తి కర్మ జ్ఞాన ధ్యాన మార్గములు మహత్తర యభేద దృష్టిచే సమన్వయము గాబడినవి. మానవుల స్వేచ్ఛకు, స్వాతంత్ర్యము నకు, పరమశాంతమునకు భంగకారియగు స్వధర్మకర్మ. కర్మయే జీవుల

జనన మరణ సుఖ దుఃఖ బాధలకు [illegible] బద్ధమైనదైనను, నిత్యనవరాక మఖండరాక ప్రతిలేక [illegible] చున్నది. సృష్టికి కారణము స్థితిలయకారణము [illegible]. [illegible] వాసనారూపముగ మానవుల నాగరిక [illegible] చేయుచున్నది. దీనినుండి జనసామాన్యమునకు [illegible] సులభోపాయమును, జీవన విధానోపాయము [illegible]. [illegible] ప్రతిపాదించుటము, నిపుణతరా నిరంతరంబగను, [illegible], [illegible] నిష్కార [illegible] మధ్య [illegible], [illegible], [illegible] సౌభాగ్యము, [illegible], [illegible], [illegible] గీతాభగవానిని భగవంతుడు [illegible].

భగవానుని [illegible] మానవ నాశయ [illegible]. [illegible] దుఃఖాస్పదమగు [illegible], [illegible] దోషము, [illegible] బీజము, [illegible] ప్రతిబంధకమగు [illegible]. [illegible] బృహద్బృందావనము, [illegible], [illegible] నిస్స్వార్థప్రేమ [illegible]. [illegible] కృష్ణవాగ్వైభవ [illegible] ప్రసన్న [illegible] దోషరహిత భగవంతుని [illegible]. శ్రీభగవద్గీత సకల కళల సాహిత్యరస పోషణీయము గీత. భక్తిమందారము, జ్ఞానచింతామణి, పరిపాలిత నిష్కామ కామధేనువు గీత. చూడుడీ! చదువుడీ! చదివించుడీ! ప్రబోధించుడీ! ఆద్యంతములు సరిచూడుడీ! ఆర్షేయ దేశజన సేవితము. సకల మానవుల నిజహక్కు. శరణాగతుల స్వహక్కు, ప్రశ్నోత్తరముల రీతి వ్రాయబడినది. భగవంతుని నిజసేన చూడ్కానివంటిది, నన్ను నిమిత్తమొనరించి నా యంతరంగమునందుండి నన్ను ప్రేరేపించి లోకకల్యాణమునకు నీ కార్యమును పుస్తకాకృతిని ఆవిర్భవింపజేసి ప్రకాశింప జేసినవాడు భగవంతుడే. భగవానుడే పోషకుడు. కర్తయు, భర్తయు, పరిత్రాతయు నాతడే. మరణభీతి, పునర్జన్మభీతి, తిండిలేక మలమలమాడుచు నలమట

పడు జీవులవలె, భయవంతులై, యేమి చేయుటకు దోపక, తోచినట్లు నడచువారు కొందఱు, జీవించినంతవఱకు కామసుఖముల ననుభవించి పోదామనువారు కొందఱు, కామసుఖములకంటె వున్నతమైన శాశ్వత సుఖ మొకటిలేదు. కాబోలు ననువారు, అథవా సుఖముండినను అట్టి ప్రాప్తికి తగిన జన్మము, అట్టివారి యిండ్ల బుట్టితేనేగాని లేకపోతే లభింప దేమొ నని నిరాశపడి వేడి నిట్టూర్పులు విడుచువారు కొందఱు, అధికార ములు లేవని అదలించివైవ, దగులుచేత దెసలు పరికించువారు, ఎవరెవరి ఏ కర్మకు నాలోకము, ఏ ధర్మమునకు నా ఫలము, ఏ వృత్తికి యిది తగును. నరకస్వర్గము లిట్టివి, పుణ్యాపాపము లిట్టివి, ధర్మ మిట్టిది, అధర్మ మిట్టిదని యందులకు తగిన ప్రమాణముల జూపుచు, తామొనరించితే మాత్రమే పాపములేదని, తామొనరించునది ఇతరు లొనరించిన పాపమని ప్రతియొక సత్యమార్గమునకు అడ్డుతగులు, పాపభీతిలేని సోదరమానవులతో ఉదార హీనులైన సమానమానవసోదరు లదిగో దొంగలు పట్టుడన్న, దొంగల పట్ట జనినవారు దొంగల చేతిలోనివి దోచుకొని, దొంగలు పారిపోయిరన నిజదొంగ లెవరు? ఈ సంగతి పోలీసులకు తెలియునుగాని యితరులకు తెలి యదు. ఆ ప్రకారము తమ జీవితమే, తమ సుఖమే, తమ దిక్కే జూచు కొను స్వాత్మాభిమాన స్వార్థ కపట దంభాచార ప్రచారములతోడి మాన వులనే దొంగల నారాయణు డెఱుగును. నరనారాయణదేవుడు మనుజ మాధవుడు పురుష పురుషోత్తముడు జనజనార్దనుడు స్త్రీ పురుష రూపం బుల భారతావని పురుషోత్తము డవతరించు భూమి. ఆర్ష సంతతి ప్రకా శించి పర్యటించిన పుణ్యస్థలము. వేదవేదాంగములున్న విశాల ధర్మస్థల మున తల్లిలేని బిడ్డవలె, త్రోవ తెలియని పాంథులవలె, తలుపులుమూయు గృహస్థుల నిండ్ల తిరుగు నిరాశాభిక్షుకులవలె, మగంట్రోల్లని సతుల జీవి

3

తమువలె, ఎండ మాడు లతపుష్పములవలె, నమ్మించి గొంతుకోయువారివలె, రక్షింప దిక్కులేక నేడ్చువారివలె, వెతలుబడు మానవులెందున్న ఏ ప్రాంత్యముననున్న అందరికి భగవద్గీతాప్రచారము, గీతారహస్యము, గీతాసందేశము, గీతాధర్మము, గీతామతము, గీతాజ్ఞానము, గీతాశయము, గీతానుభూతి, గీతాప్రతిభ, గీతాసేవ, గీతాభవరోగ నివారకమైన దివ్య రసాయనము, స్త్రీ పురుషులకు నాబాలగోపాలము కాలాకాలములనక తెలుపవలసినది. అందరు తెలియదగినది. అప్పుడు మానవులము మానవులము, మానవత్వము మాధవత్వమనే జ్ఞానము స్పష్టమగును. అప్పుడే రామరాజ్యము. అప్పుడే నరకమును స్వర్గముగ మార్చుటము, భూలోకమే వైకుంఠము లేక వసుధైక కుటుంబము, భవరోగ నివారకమైన వైద్యశాల, ఆనందక్రీడారంగము, బ్రహ్మన్యక్షేత్రము, బహుముఖోద్దీపము, స్వస్తి నిలయము కాగలదు.

ఓమ్ తత్ సత్

శాంతిః శాంతిః శాంతిః

ఓమ్

# వరాహపురాణోక్త శ్రీ గీతామాహాత్మ్యము

ప్ర॥ గీతామాహాత్మ్య మెందు జెప్పబడినది?

ఉ॥ వరాహపురాణమున.

ప్ర॥ మాహాత్మ్యముయొక్క వుద్దేశ్యమేమి?

ఉ॥ నీ వడుగుట జేసి యనేకుల సంశయమునకు సమాధానము చెప్పబడుచున్నది. ఈ విషయమున పెక్కుజనులకు సందేహముండకపోలేదు. గీతాధ్యయనము జేసినమీద మాహాత్మ్యమును జదవటమేలా? యందురు. వారి యశ్రద్ధయు, బలహీనతయు, మూర్ఖతయు తెలియనితనమని దోచును. పందెము వేసినవాడు యే కొంచెముతో గెలువలేకపోయినను యోడిపోయినట్లే. పరీక్షయందు నేయర్ధమార్కు తక్కువ వచ్చినను ప్యాసు గానట్టేకదా! దస్కతులేని యుత్తరమునకుగాని, మఱి దేనికైన చేవ్రాలు లేనిచో నది యెట్లు జెల్లదో, దేవతను లేదా ఏ దేవుని నష్టవిధముల నర్చించి మంగళహారతి నిచ్చినమీదట తీర్థప్రసాదములు లేదా పణ్యారము బుచ్చుకొననప్పుడు భగవదర్చనం జేయలేదనియేకదా! మఱియు తన కనుభవనీయము గానట్లు తోచును. లేదా సాదము తానే తినుట, ప్రసాదము దేవుని యెంగిలియని గుర్తు. ఈ చెప్పిన దృష్టాంతముల ద్వారా గీతా పారాయణ మొనర్చి మాహాత్మ్యము చదువకపోయిన పారాయణము చేయనట్లు ఫలము లేదు.

ప్ర॥ మాహాత్మ్య మెన్ని శ్లోకములు చదువవలెను?

ఉ॥ అధ్యాయమునకు రెండు శ్లోకముల ప్రకారము జదివిన చాలును. కొన్ని సాంప్రదాయములవారు నాలుగుగాను, మఱికొందఱు మాహాత్మ్య మంతయును, మఱికొందఱు మఱియొకతీరు చదువుదురు. ఎన్ని శ్లోకములు జదివినను అధ్యయనము చేసినమీదట ఫలముగలదు. ఉత్తమ మధ్యమ ముత్తమోత్తమములుగ తీర్థప్రసాదము లందినట్లు, నీ రోజు నీ యధ్యాయము ముగిసినది, ఈ ఫలము గలిగెనుకదా! అని సంతసించుదురు. అధ్యాయముగాని, యింక తక్కువగాని, లేక బొత్తిగ చదువనిదినము

తత్ఫలము దప్పెగదా! అని తిరిగి జాగ్రత్తపడ గలిగెదరు. ఇక గీతను మాహాత్మ్యము జదివితే జాలదా? [illegible] [illegible] మన జన్మమంతా [illegible] [illegible] [illegible] [illegible] జిజ్ఞాసువు [illegible] [illegible] [illegible] [illegible] న్యాసు కాగలదా? లేదా న్యాసు [illegible] జదువుచు జ్ఞానము గలిగేవఱకు పాటుపడవలసినట్లు, గీతను జ్ఞాన విజ్ఞానములు గలిగేవఱకు నధ్యయనమును, మాహాత్మ్యమును ప్రతిదినము చేయుచుండవలసినదే.

ప్ర॥ మాహాత్మ్యమనగా నేమి?

ఉ॥ ప్రభావము, లేక శక్తి, లేక గొప్ప, లేదా ప్రతిభ, నాలుగు శ్లోకముల ద్వారా తెలియగల ఫలము. ఇంగ్లీషు యమ్మనకు. నాలుగు కొన్ని డిగ్రీలుండును. యస్. యస్. యల్. సి., యస్. ఎ., బి. ఎ., బోధన నిమిత్తము ఎల్. టి., ఎం. ఎ., మొదలైన యనేక డిగ్రీలు ఇంగ్లీషు చదివి పొందనిచో నుద్యోగప్రాప్తిలేదు. ఇంగ్లీషు చదువునప్పుడే ఫలాని డిగ్రీ చదువవలెనని విద్యార్థులు తమ శక్తి ననుసరించి కోరుకున్నట్లు, గీతాధ్యయనము చేయువారు ఒకటి రెండు మూడు వంతున వరుసగా శ్లోకములగాని, యర్థశ్లోకము, లేదా పదునెనిమిద యధ్యాయము నొకేదినము నధ్యయనము చేసినవారికి ఫలాని ఫలమని మాహాత్మ్యములో నుంచబట్టి, యధికారి తన ఫలనిశ్చయము చేసుకొనుటకును, స్వప్రతిక నెచ్చుకొనుటకును గాను మాహాత్మ్యము యనుటనము చదువవలసినదే. ఆదికాను స్వల్ప ఫలములను బొందుటకం టెు నిన్ని యధ్యాయములు జదివితే నని గాని, తన గీత నంతయు చదివితే నొకతూరి జ్ఞానసిద్ధి నొందిన పిదప జనన మరణ రహితమగు మోక్షము బొంద నిచ్ఛగించఁగలరు.

ప్ర॥ గీతను చదువుటకై కల్పింపబడిన కల్పితతంతు, యంతియేగాని, గీత జదివినవానికి యెన్ని శ్లోకము లెన్ని యధ్యాయములని తెలియదా? అని కొందర ఁడురు.

ఉ॥ భగవంతుని యర్చించినమీద మంగళహారతి యిచ్చేదానికి, లేదా మంగళహారతి జూచేదానికి, తీర్థప్రసాదములు గొనేదానికి సమయము ఖోగొట్టుకొంటే యతని నెవరైన యడిగితే నేమి జెప్పును? నాకు హారతి తీర్థప్రసాదములు దొక్కలేదన్నప్పుడు యర్చన జరుపలేదనియేకదా అర్థము?

కావున కల్పించిన తంతుకాదు. ఎవ రెన్ని శ్లోకములు లేదా అధ్యాయములు చదివితే గలిగే ఫలమును తెలుపకపోతే పదునెనిమిది యధ్యాయములు పఠించినవాడు జ్ఞానియై పరమపద మధిష్ఠించునే, నాకు లేదేయంటె, నీ వెన్ని యధ్యాయములు చదువుచున్నావన, నేనిన్ని శ్లోకములన్న, యపుడే నీ ఫలము తెలిసిపోదా? అష్టమాధ్యాయమున జీవుల యంత్యఫలితముల జెప్పినట్లు గీతామాహాత్మ్యముగూడ ఫలితములను సూచిగా తెలుపును.

ప్ర॥ ఫలములు గోరకుండకయే భగవంతుడు గీతాధ్యయనము చేయమనటము? మఱి యీ ఫలముల జెప్పుటెందుకు?

ఉ॥ ఫలములు గోరువారికి జెప్పబడ్డది. ఫలము గోరనివారికి భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది. భగవత్ప్రాప్తిగాని, ఫలముగాని, గీతయందు భగవంతునియందు స్వార్థప్రేమనుంచి పారాయణ మొనర్చితేనేగాని, చిత్తమొకవంక, చదువుట మొక వంకనైతే చిత్తముండినవంక ఫలమేగాని పారాయణఫలము లభింపదు. ఆకలి గొన్నవానికి నన్నము లభించినపుడు చిత్తము దేనియందుండును? అన్నమునందుండును. పారాయణపరులు తమ మనస్సు గీతాచార్యాకారస్థిని గలిగి చదివితేనే ఫలముగలదు; లేనిచో లేదు.

ప్ర॥ ఈ ఫలవిషయము నెవ రడిగితే నెవరు జెప్పిరి?

ఉ॥ భూదేవి శ్రీ మహావిష్ణువును మానవుల నుద్దేశించి వైకుంఠమున నడిగెనని సూతుడు జెప్పెను.

ప్ర॥ భూదేవి స్త్రీ కదా! ఆమె వైకుంఠమున కెట్లుపోయెను? భూమి యన జడమగు స్థలము. ఈ యర్థము సమన్వయించుకోను టెట్లు?

ఉ॥ భూమిపేరుగల స్త్రీ యని సామాన్యార్థము. జడమగు భూమి కాదు. పురుషేంద్రియమును భరించుటకు, తదాకార శిశువుల గర్భమున మోసి జన్మించిన పిదప స్తన్యమిచ్చి స్వాతంత్రత గల్గేవఱకు పోషించి నతడే నీ తండ్రియని శిశువులకు జూపించుచు, శిశువుల స్వభావములు తండ్రికి తెలియవు, వారి స్వభావములబట్టి పోషించును. పిల్లలపై తప్పులు తండ్రి వెదకిన తల్లి తప్పులే లేవనును. భగవంతుని లక్షణములు స్త్రీలయందు నేడువిధము లుండుట విభూతియోగమున చదివితిరిగా, రాజకీయము మొదలు నాధ్యాత్మరంగమువఱకు సాహసించి ముందంజ వేయునది

స్త్రీయే. ఆమె స్వభావమె యిట్టిది. కోతికి పిల్లయందు యెక్కువ ప్రీతియేగాని తనకు హాని గలుగుచున్నపుడు పిల్లను మృత్యువునకొసగి తన్ను రక్షించుకొనును. స్త్రీ యిట్టి స్వభావముగలదైనను. తన ప్రాణములైన వదలి బిడ్డలగాపాడును. "మాతృదేవో భవ" అని చెప్పినట్లుగా శ్రుతివాక్య పాండురాజ వివాహముల శాస్త్రములను ప్రవర్తించిన [illegible] స్త్రీ కాదా? ఛత్రపతి శివాజీ శాస్త్రమునకు, మహాత్మాగాంధీయొక్క జీవిత శాస్త్రములకు తల్లులే కారణము. భగవంతుని భాగ్యలలో భాగినియగును నాకు ప్రారబ్ధశరీరధారులగు మానవులకు నిశ్చలభక్తి యేలాగు లభించగలదని యడిగెను.

ధర్మోవాచ — "భగవన్ పరమేశాన భక్తిరవ్యభిచారిణీ। ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో॥" ప్రారబ్ధకర్మమును అనుభవించువారికి స్వాధ్యాయము సంతరించుకొనుటెట్లని భగవంతుని. భగవద్ధ్యాన విచారశీలత. భక్తియనే యీశ్వరానుభవము [illegible] తనే జ్ఞానప్రాప్తి గలుగును.

ప్ర॥ భగవంతుడు యేమి సమాధానమిచ్చెను?

ఉ॥ శ్రీవిష్ణురువాచ. "ప్రారబ్ధం భుజ్యమానో హి గీతాభ్యాసరతః సదా। స ముక్తస్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే॥" తా॥ ప్రారబ్ధానుభవియగు మనుష్యుడు నిరంతరము గీతను అభ్యసించుచుండినచో యీ లోకముననే ముక్తుడై సుఖము నొందును. కర్మలు నంటక యుండును.

ప్ర॥ గీతగాక మరేదేని అభ్యసించినను ముక్తి గలుగునా. కర్మ లంటక వత్తునందురా?

ఉ॥ అవును. న్యాయమూర్తి కానివానిని న్యాయమునడిగిన నేమి తీర్పు చెప్పగలడు? భగవద్గ్రంథము గానిదేదైనను భగవత్కృప బడయజాలకుండును.

ప్ర॥ చనిపోయినమీదటగదా ముక్తి? బ్రతికియుండ నెట్లు గల్గును?

ఉ॥ చనిపోయినమీదట గలిగెడి నాశ క్రమముక్తియను యుపాసకులకే గాని తదితరులకు చనిపోనే లేదు. గీతాజ్ఞానికి బ్రతికియుండగనే ముక్తి. ఇదియే సద్యోముక్తి యన నాత్మను తెలియుట. "అవిచారేణ సంప్రాప్తో బంధో విచారేణ నివర్తతే" గీతాజ్ఞానవిచారణమున నాత్మకు బంధ విముక్తి యిప్పుడే. "మహాపాపాదిపాపాని గీతాధ్యానం కరోతి చేత్।

క్వచిత్స్పర్శం న కుర్వంతి నళినీదళమంబువత్" పద్మపత్రము నీటినంటదు. గీతాధ్యాన మొనర్చుచుండిన మహాపాపములు నతిపాపములుగూడ నంటవు.

ప్ర॥ మహాపాపములేమిటి? అతిపాపములేవి?

ఉ॥ తెలిసి త్రికరణముల లోక శాస్త్ర స్వదృష్టులకుగూడ చేయగూడనివి చేయుట మితము లేనివి తెలిసీ తెలియక జేసిన వతిపాపములు. "గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే। తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై॥" "సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే। గోపాలా గోపికా వాపి నారదోద్ధవపార్షదైః॥" తా॥ ఎచ్చట గీతాగ్రంథముండునో, నెచ్చట పారాయణ మొనర్పబడునో నచ్చట సమస్త దేవతలు, ఋషులు, యోగులు, పన్నగులు, నారదుడు నుద్ధవుడు పార్షదసహితులై గోపాలుర గోపికలు నుందురు.

ప్ర॥ ఈ మాట పచ్చి యపద్ధము. ద్వాపరయుగములోనివార లంతకు మునుపటివార లీనాడు గీతాధ్యయనము జేయుచున్న చోట నుందురనుట. వారేవ్వరేటే తక్కినవారేలనుండి కనిపించరు? భగవద్భక్తులకు తప్ప తక్కిన వారికి గనిపింపరందువా? వారైన నెన్నిచోట్లనో గీతాధ్యయనము జరుగుచున్నది. కనిపించలేదు. కనిపించినట్లెవ్వరు చెప్పలేదు.

ఉ॥ అపద్ధ మెన్నటికిని గాదు. వైద్యునివద్ద మందు తీసుకొనుచున్నావు. ఆ మందు శరీరములోపలికి మ్రింగితే కనిపింపదు. అయితే నది లోపల పనిచేయలేదని చెప్పగలవా? కనిపింపక నారోగ్యవంతుని జేయుచుండ లేదా? కనిపించనేలేదని యందురా? మట్టి విత్తనము చిదుపలుజేసిన వృక్షశాఖలు గనిపింపనంతనే లేవనియా? సూక్ష్మముగా నందేయుండును. దేనికి సంబంధించినవి దానియందుండును. ఒక రూపాయ నాణెము లేదా నోటు యున్నదనుకో. దానియందు గనిపింపని నర్ధరూపాయలు, నాలగణాలు, బేడలు, నయాపైసాలు లేవందువా? లేకపోతే వానిపేర్లు నపద్ధమే. ఆ నాణెములు లేకుండ నుండవలసినదే. భగవంతుని సంబంధములు, భగవద్గీతయున్నచోట, నధ్యయనాదులొనర్చుచోట గీతాచార్యుని నాశ్రయించి నారదాదులు సూక్ష్మముగానుండి,

గీతాధ్యాయనునికి సహాయమొసర్తురు. "సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే, యత్ర గీతావిచారశ్చ పఠనం పాఠనం శ్రుతం, తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి సదైవ హి" తా॥ గీతాపఠనము జరుగుచోట నారాయణుల సహాయము శీఘ్రముగ లభించును. గీతల నాలోచించుచోట, గీతాపఠన పాఠనశ్రవణములు జరుగుచోట నేను సర్వదా యుందును. ఇది నిశ్చయమని భగవంతుడు చెప్పెను.

ప్ర॥ అయిన చెప్పుచున్న భూదేవి యెట్లు నమ్మెను? గీత అధ్యాయ నాదులు జరుగుచోట భగవంతుడు నివసించదలేదే? ఉండిన నేల గనబడు?

ఉ॥ ఇందుకో యీ వృత్తాంతము నీ మిత్రుడను ప్రహ్లాదునిసంహితలో యున్నది. మిత్రుడను యిదివరకు నేనెరుగనను యిదివరకూ విషయమును, చక్షుస్సును స్మృతి జ్ఞానమును సంపూర్ణముగను గనుపడటము లేదా? గాన నాగతి నీకుగాక, నందరెట్లు తెలియును? నా వృత్తాంతముండుచోట నీమిత్రుడను లేదా భగవద్గీతాధ్యాయనాదులు జరుగుచోట భగవంతుడునూనా నేనసచ్చును. "గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహం। గీతాజ్ఞానముపాశ్రిత్య త్రీన్లోకాన్పాలయామ్యహమ్॥" తా॥ గీతయే నాకాశ్రయము. గీతయే నాకు నుత్తమమగు గృహము. గీతాజ్ఞానము ననుసరించియే త్రిలోకములను పాలించెదనని భగవంతుడు భూదేవితో ననెను. "గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః। అర్ధమాత్రాక్షరా నిత్యా స్వానిర్వాచ్యపదాత్మికా॥" తా॥ నన్ను గురించి తెలుపు పరవిద్యయును బ్రహ్మరూపమున్నదది గీత. గీతాజ్ఞానము నవాఙ్మానసగోచరము, వినాశరహితము, నిత్యము, యనిర్వాచ్యపదాత్మికమును యనేవిషయమున సందేహము లేదు. "చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునం। వేదత్రయీ పరానందా తత్త్వార్థజ్ఞానసంయుతా॥" తా॥ వేదస్వరూపమును, పరమానందదాయకమును, తత్త్వజ్ఞానబోధకము నగు గీతను స్వయముగ శ్రీకృష్ణు డర్జునునకు బోధించెను. "యోఽష్టాదశ జపేన్నిత్యం నరో నిశ్చలమానసః। జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్॥" తా॥ గీతను నిత్యము నిశ్చలమానసమున పూర్ణముగ బఠించినవాడు జ్ఞానసిద్ధుడగును. పిదప ముక్తిని యతడొందును.

ప్ర॥ నిశ్చలమానసము లేనివాడు జ్ఞానము బడయలేనపుడు గీతను పఠించుట యెందుకు?

ఉ॥ డబ్బులిచ్చి ఫోటోదీయించుకొనువాడు, కెమిరాగుండ తనరూపు బడుచుండ, డబ్బు యివ్వలేనివాడు ప్రక్కనుండి యకస్మాత్తుగ తొంగి చూచిన, నాతనిచిత్రము ఫోటోబడిపోవును. నిశ్చలమానసము లేక పోయినను నధ్యయనము చేయవలెననే తలంపు, గీత హస్తమున నుంచుకొన్నప్పుడు, వినునప్పుడు భగవంతునియందు తాను, తనయందు భగవంతుడు ఫోటో బడుచుందురు. కొంతకాలమునకు పూర్ణముగ మనస్సు భగవదాకారమొందును. నిశ్చలమానసములేదని వదలరాదు. అభ్యాసమున ననుకూలము గల్గును. "పాఠేఽసమర్థః సంపూర్ణే తతోఽర్థం పాఠమాచరేత్। తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః॥" పూర్ణముగ బఠింపజాలక సగముమాత్రమే పఠించినయెడల గోదానఫలము లభించును. ఈ విషయమున సందేహము లేదు. "త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్। షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్॥" మూడవభాగమున నొక పట్కమును పఠించువానికి గంగాస్నానఫలము లభించును. నాఱవభాగము చదువువానికి సోమయాగఫలము లభించును. "ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః। రుద్రలోకమవాప్నోతి గణో భూత్వా వసేచ్చిరమ్" తా॥ ఒక యధ్యాయమైనను నిత్యము భక్తితో పఠించువాడు రుద్రలోకము నొందును. అచ్చట శివుని యనుచరులగు ప్రమథగణములతో చిరకాలముండును. "అధ్యాయశ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః। స యాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే॥" తా॥ ఓ భూదేవీ! ప్రతినిత్యము నొకయధ్యాయమునుగాని, లేక ఏకచతుర్థాంశమునుగాని పఠించువాడు మన్వంతరము వఱకు మనుష్యుడై జన్మించును. "గీతాయాః శ్లోకదశకం సప్తపంచచతుష్టయం। ద్వౌత్రీనేకం తదర్థం వా శ్లోకానాం యః పఠేన్నరః॥" తా॥ పది, ఏడు, ఐదు, నాలుగు, రెండు, మూడు లేక నర్ధశ్లోకమును పఠించు మనుష్యుడు చంద్రలోకమున వెయ్యియేండ్లుండును. ఇట్లు గీతాపాఠనిరతుడగువాడు మరణానంతరము మనుష్యుడై పుట్టును. ఇతరములగు హీనయోనుల జన్మించడు.

ప్ర॥ అటులైన నందఱేల గీతను పఠింపరు?

ఉ॥ చదువురానికొంత, యర్థమెఱుగనిదాన, లోకు లేమందురో యను సిగ్గు, గీతను తగిలితే సంసారమును త్యజించి సన్న్యాసిని యెక్కడగుతానో యని శ్రుతు లనేకము లుండుటవలన భేదబుద్ధితో పామరులై విషయాసక్తులై ముందుగతుల భావిగతుల ప్రమత్తులై చరింతురు; చదవరు.

"చంద్రలోకమవాప్నోతి వర్షాణామయుతం ధ్రువమ్। గీతాపాఠసమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్॥" "గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తిముత్తమమ్। గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్॥" తా॥ అతడు మరల గీతాపాఠ మొనర్చి, అనగా మనుష్యుడై జన్మించిన పిదప నుత్తమమగు ముక్తిని బొందును. మరణసమయమున గీతాశబ్దము నుచ్చరించిన సద్గతి లభించును.

ప్ర॥ మరణసమయమున గీతాశబ్దము నుచ్చరించినవాడు సద్గతి నొందినది మన కెట్లు తెలియును? దుర్గతికే బోయెనో? పోయినవాడు తిరిగివచ్చి చెప్పినగదా తెలియును?

ఉ॥ భ్రమరకీటకన్యాయము మఱచుచున్నావు. "యం యం వాపి స్మరన్ భావం" గీత మరణసమయమున జ్ఞాపక మొచ్చునది యరుదు. రానే వచ్చెనా సద్గతి దప్పదు.

"గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా। వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే॥" తా॥ గీతను విన నాసక్తుడు మహాపాపియైనను, వైకుంఠమును బొంది విష్ణునితో సహా యానందించుచుండును.

"గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః। జీవన్ముక్తస్స విజ్ఞేయో దేహాంతే పరమంపదమ్॥" తా॥ కర్మిష్ఠియయ్యు గీతార్థమును ధ్యానించువానిని జీవన్ముక్తుడని గ్రహించుము. మరణానంతర మతడు పరమపదమును బొందును. సందేహము లేదు.

"గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః। నిర్ధూతకల్మషా లోకే గీతాయాతాః పరంపదమ్॥" గీతల నాశ్రయించియే జనకాదులగు రాజులు నిహలోకమున పాపముక్తులని ప్రసిద్ధినొంది పరమగతినందిరి.

ప్ర॥ రాజులు తప్ప మఱెవ్వరు గీతల నాశ్రయించ లేదనియా? లేక సమర్థులనియా మీరు చెప్పుట?

ఉ॥ అది కాదర్థము. గొప్పదగు రాజ్యకార్యధురంధరులే నాశ్రయించినపుడు సామాన్యులు, సులభముగా పాపముక్తులై మోక్షము నొందగలరు.

"గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్ । వృథా పాఠో భవేత్తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః ॥" తా॥ మాహాత్మ్యమును చదువనియెడల గీతాపాఠము వ్యర్థమై శ్రమయే మిగులును అని చెప్ప బడుచున్నది.

ప్ర॥ భగవంతుఁడే మాహాత్మ్యమును చదువనిచో శ్రమ దప్ప ఫలము లేదన్నాడే. తప్పనిసరిగా పఠియింపవలసినదేనా?

ఉ॥ అవును. "ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః। స తత్ఫలమవాప్నోతి దుర్లభాం గతిమాప్నుయాత్ ॥" తా॥ మాహాత్మ్యముతోపాటు గీతలను పారాయణ మొనర్చిన జెప్పబడిన ఫలముతోబాటు మోక్షముగూడ లభించును.

సూత ఉవాచ — మాహాత్మ్యమేతద్గీతాయాః మయా ప్రోక్తం సనాతనమ్ । గీతాంతే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం భవేత్ ॥" తా॥ ప్రాచీనమగు నీ గీతామాహాత్మ్యమును జెప్పితిని. గీతలను పారాయణ మొనర్చిన పిదప దీనిని చదివినవానికి చెప్పిన ఫలము లభించును.

ఇది శ్రీవరాహపురాణాంతర్గతమగు గీతామాహాత్మ్యము

ప్ర॥ ఉదయ మధ్యాహ్న సాయంకాలముల రాత్రివేళల గీతాపారాయణము జేయవచ్చునా?

ఉ॥ బ్రహ్మముహూర్తమునన దొరకటిగలదు. ఆ ముహూర్తము దినమునకు రెండుతూర్లువచ్చును. ఆ కాలమున గీతాధ్యయనాదుల నొనర్ప వచ్చును. భోజనము చేయక, నిద్రించక మునుపు గీతాధ్యయన మొనర్ప వలెను. గీతకంటె వ్యావహారికములందే ప్రాముఖ్యముండి, ఏ వేళనో నొక వేళ చదివిన ప్రయోజనముండదు. కాలనియతి సూర్యచంద్రాదులకే నున్నప్పుడు మానవు డొక నియమితకాలము నుంచుకొనకబోయిన విశ్వాసము లేనివాడని యర్థము. "అశ్రద్ధయా హుతం" అశ్రద్ధతో జేసిన

యజ్ఞ దాన తపస్సులు వ్యర్థమగు గీతాయజ్ఞముకూడ నంతే. శాస్త్రము నలక్ష్యముజేసి భోజనకాల వ్యవహారకాల నిద్రాకాలముల పారాయణ ధ్యానాదుల జేయకూడదనునేట తెలిసి పారాయణ మొనర్పవలెను. లేనిచో ఫలము గలుగదు. సన్న్యాసి, బ్రహ్మచారి, వానప్రస్థ, యతి, త్యాగి భక్తులకు నియతమవసరము లేదంద్రము. ఎందుకన ననాదిమయ భయంకర సంసారవిముక్తి నొంద నహంకార మమకార కర్తృత్వాద్యభిమానముల వదలి భగవచ్ఛరణాలనే నాశ్రయించి సతతము తచ్చింతనమునందుండురు గాన కాలమే యనవసరము. అయినను వారుగూడ లోకోద్ధరణార్థము నియమితకాలములనే పారాయణాదు లొనరించుచు తక్కినవారి నాచరింప జేయుదురు.

ఇక తక్కినవారిని జెప్పవలెనా? తప్పనిసరి కాలమవసరము. భగవద్వాక్యముల విశ్వాస ముంచనిచో మఱి దేనియం దుంచవలెను? అస్తవ్యస్తముగ చరింపరాదు. యుక్తాయుక్త మెఱింగి నటింపవలెను. తానే నటింపనపుడు తన యనుయాయుల కెందరకేదేగతి. వేళ పాళ లేకుండ పారాయణాదుల నాచరించితే ఫలము లేనేలేదా? అనవలదు. కుంటి గ్రుడ్డి కురూపి మొదలగు వికలాంగులు, రోగగ్రస్తులు భయగ్రస్తులు యెప్పుడైన జేయవచ్చు. పరుసవేది సోకిన కటికవాని కత్తియైనను బంగారమగుట సిద్ధమైనపుడు గీతార్థాసక్తులకు కాలమే లేదు. కాలస్వరూపుడు భగవంతుడే కదా? చేత ధరించిన, సంకల్పించిన భగవంతుడే నచ్చుపడ హృదయకమలమున నివసింప నాస్తికాస్తి లేమి లేవు. ఆయనను స్మరించినకాల మెట్టిదైన బ్రహ్మముహూర్తమే, బ్రహ్మస్వరూపమే. గీతామాహాత్మ్యవృక్షము భగవంతుని నోటినుండి బీజరూపము ధరించి త్రిలోకముల బెంప సకల మానవులచే శాఖోపశాఖల విలసిల్లుచు కల్పతరువై యున్నది. తథాస్తు.

ఓం తత్ సత్

శాంతిః శాంతిః శాంతిః

# గీతా స్తోత్ర శ్లోకములు

ఓంకారప్రభవం సర్వం త్రైలోక్యం సచరాచరం।
ఓమిత్యేవ పరం రూపం హ్యాత్మబ్రహ్మే చ వ్యవస్థితమ్॥

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే॥

వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషం।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్॥

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమోనమః॥

మునిం స్నిగ్ధాంబుదాభాసం వేదవ్యాసమకల్మషం।
వేదవ్యాసం సరస్వత్యావాసం వ్యాసం నమామ్యహమ్॥

అచతుర్వదనో బ్రహ్మా ద్విబాహురపరో హరిః।
అఫాలలోచనశ్శంభుర్భగవాన్ బాదరాయణః॥

కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణకీర్తనం।
వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్॥

కృష్ణాయ యాదవేంద్రాయ జ్ఞానముద్రాయ యోగినే।
నాథాయ రుక్మిణీశాయ నమో వేదాంతవేదినే॥

ప్రపన్నపారిజాతాయ వేత్రతోత్రైకపాణయే।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః॥

సారథ్యమర్జునస్యాజౌ కుర్వన్ గీతాఽమృతం దదౌ।
లోకత్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః॥

ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతమేకో దేవో దేవకీపుత్ర ఏవ।
ఏకో మంత్రో దేవకీపుత్రనామ కర్మాప్యేకం దేవకీపుత్రసేవా॥

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతాఽమృతం మహత్॥

**తా॥ మధ్యందినమార్తాండుని ప్రకాశము దశదిశల చీకటినిబాపి దుస్సహమగునట్లు తేజమై వాంఛితమున వ్యావృతవస్తువుల ప్రకాశింపజేయుచు నద్వితీయమై యుండునట్టి,**

గొప్పదగు దేవస్థలమునకు ముఖద్వారమగు గాలిగోపురమువలె, పర్వతములలో మేరువు వలె చూడ వేడుకమనోల్లాసమై సముత్తుంగతరంగభంగనినదభరితార్జుననిశ్శ్రేయసకర శాంతకృష్ణ శయసాగారమగు పాలవెల్లివలె నర్జునుడు విన, భగవంతుడు చెప్ప, వ్యాసుడు గూర్చిన, గీతాభగవతికి శ్లోకమొక్కటి తిలకగీటమువలె, మాంగల్యమువలె, మేరువువలె, నానావిధమానవుల హృదయాంధకారము బాపునది. ఖండితపామరులు, మహాపాపిష్టుడు పొందలు మహాసిద్ధపురుషులవగుట గల మానవజీవనదాయకమగు గీతకు నీ శ్లోకము మాతృ మానకంటె మాతృమై, మహాత్మునకంటె మహాత్మ్యరహస్య మిందుయున్నది. గీతా తాత్పర్యాశయమంతయు నిండే నిమిడియున్నది. వేదరహస్యమగు ""శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః"" యను ప్రమాణావగోత్తమే ఈ శ్లోకము.

అమృతమన నీటికి, తల్లిపాలకు, పాలకడలిబుట్టిన యమృతమునకు, పాలవారాశికి గీతకు పేర్లు. మృతమన చచ్చుట, అమృతమన చావులేకపోవుట, 'మహాత్మని' విశేషణ ముండుట, నీళ్లు, దేవతల యమృతము, క్షీరసముద్రము, తల్లిపాలవంటిదికాదని మరియొక విశేషమున్నదని యర్థము. ఈ రహస్యమునే విచారించెదము. వాస్తవముగా నీరు యమృతమే. నీటియొక్క సూక్ష్మాంశమే ప్రతిప్రాణియొక్క ప్రాణము. మధ్యమాంశమే రక్తము. స్థూలాంశమే మూత్రము. సస్యములు పొందలు సకలప్రాణి జీవనదాయకమగుట యమృతమేకాని, చనిపోవు శరీరముల బాపనుండ చేయజాలదు. శరీరము లున్నంతవఱకు నాహారములేకపోయినను నీటితో కొంతవఱకు జీవించవచ్చును. శరీరముల పోషణముల కవసరమేగాని, జీవునకు మోక్షము నివ్వలేదు. ఇఁక తల్లిపాలందమా, పుట్టినశిశువు సర్వస్వతంత్రుడగువఱకు నీరాన్నములులేకుండ పోషించును గాన యమృతమని పేరు. జీవునకు మోక్షసంబంధము కాదు. దేవతల యమృతమంటిమా, ఆకలిదప్పికలులేకుండ స్వర్గసౌఖ్యము మహాప్రళయపర్యంతము ననుభవనీయమేగాని, ప్రళయములో జీవునకు మోక్షకారిగాదు. అప్పుడు స్వర్గముకూడ తప్పి దేవత్వముగూడ తొలగును. పాలకడలి యందమా, వాంఛితార్థములనిచ్చువదేకాని శాశ్వతానందప్రాప్తి కలిగింపజాలదు. వీని యన్నిటికి నమృతములనే పేరులున్నను చేయగలిగినంతమాత్రమే చేయునుగాని, తమకు మించినపని చేయజాలవు. మహద్విశేషణభూషితయగు గీతామృతమన్నదే అది శాశ్వతము లగు, మృతమయములగు, దేహేంద్రియ ప్రపంచసంఘాతమగు జడమునకు నాశ్రయమిచ్చి, భూతభౌతికముల కధిష్ఠానమై, యతివ్యాప్త్యాది దోషరహితమై, త్రికాలాబాధితమైన బ్రహ్మమగు నంతర మధ్య బాహ్యస్థాత్మవు నీవే. మృతములగు దేహాదిద్వైతము నీవుకాదు. నామరూపములు మృతములు లేదా. మిథ్య జీవుడవగు నీవు యమృతమయుడవని ఘోషించుచున్నది. తక్కిన యమృతములు దేహాంతమువఱకేవచ్చి పోవుచున్నవి. గీతామృతము జీవదేహాభేదముతో నేకత్వమైయున్నది. జీవునకు సంబంధించి, జీవుని యమృతుడవని జ్ఞాపక పొనర్చుటచే 'మహాత్మని' విశేషణము ధరించినది గీత.

గోపాలనందనుడంటే కృష్ణునకు, గొల్లకుఱ్ఱవానికి, నర్జునునకు, దేవేంద్రునకు పేర్లు. గొల్లపిల్లవానికి తమ గోవులపిదుకుటకు నెచ్చట శిక్షణ నొందవలసినదిలేక, స్వాయముగ పాలబిండనలవాటే. సకలోపనిషత్తులనే నావులబిండటము దేవమానవులకు సాధ్యమా? కాదు. ఈ పని కృష్ణుడు స్వయముగ నుపనిషత్తుల నావులగాజేసి, దానిలోని సారమగు (పాలవంటి) యమృతమును బిండెను. ఇదియే గీతామృతము. ఈ నేర్పు భగవంతునికే చెల్లును. దూడ ముందు తల్లి స్తన్యముల నేపేవలకు నోటబట్టి బీల్చుచుండును. పీల్చగల్గిన బిడ్డలైు స్తన్యముల నోటబట్టినంతనే తల్లి బిడ్డలకుగల ప్రేమకుబదులు తనప్రేమను బాలరూపమున స్రవింపజేసి, తల్లి బిడ్డ లేకరూపులగుదురు. అనగా నామరూపముల మఱచి స్వరూపానందమున తన్మయులగుదురు. బిడ్డ తల్లివద్దకు రాలేకపోయిన, స్తన్యముల నోటనుంచిన పాల గుంజలేని వత్సముగని తల్లి తనపై బిడ్డకు ప్రేమలేనిదాన, లేదా మఱొకతూరివచ్చితే నివ్వవచ్చునని పాలనేపక మఱెవ్వరికి నీక పాలబిండవచ్చినవాని కాలదన్నును. ఎందుకన, నెవరిని నిమిత్తమై నేనీ పాలస్తన్యముల పొదుగునుండి నేపెదనో, యట్టి బిడ్డ కంటబడలేదు. స్వార్థముకొఱకు బిండుచున్నావని నిరోధించును. బిడ్డ ముందువెనుక త్రాగగల్గితే మధ్యపిండిన వెవరైన నుపయోగించుకొందని, పిల్లతో నేకీభవించియుండుటచే పిల్లను నిమిత్తముజేసి మానవులు సదరు పాలను, పెరుగు వెన్న మీగడ నెయ్యిగా నుపయోగించుకొందురు. గీతాచార్యుడు కురుపాండవసైన్యములో వెదకితే నర్జునునివంటి వత్సము దొరకకపోయినది. దూడ తల్లినే నెమకి, తల్లికొఱకే నఱచి, తల్లివద్దజేరి, తల్లి నేనమ్మి, తల్లిసేవలో నుండుటచే నమ్మకముగ తల్లిపాలు తనకుదక్కునక మఱెవ్వరికి దక్కగలవు? అర్జునుడుతప్ప ఋజువర్తనమున శ్రీకృష్ణునినమ్మి, నీవేదిక్కు నాసర్వస్వము నీవే, నన్ననుగ్రహింప నీవె తగుదువు, నాకేబాధ్యతలు ఫలము లవసరము లేవు, భారమంత నీదేనని నిర్మోహముతో నంతరంగ బహిరంగముల నేకైకభావనతో కృష్ణా! హే గురో! యని భగవంతునికి నమ్మకము గల్గించినాడు. ఉపనిషత్తులనే యావులబిండ. నాపేక్షగల నీవత్సము నిమిత్తమొనర్చి. సకలమానవకల్యాణదాయక మొనరింప ప్రయోజనీయమగు నమృతమును బిండెదనని, కొఱకరాని, విప్పరాని, విమర్శింపరాని, జటిలములగు వేదాంతార్థప్రతిపాదితోపనిషత్తులు నర్జునుని జూచినంతనే "దృశ్యతే అనేన ఇతి దర్శనమ్" దర్శింపగలవి యగుటచే నతనికి నేప కొంచము పుచ్చుకొని శరీరమాద్యంతము నూపిమండెక్కునట్లు, హృదయమునిండి శరీరమాద్యంతము జీర్ణము జేసికొనెను. మిగత యుండిన యమృతమేగీత. "సుధీర్భోక్తా" యన్న బుద్ధిమంతులకు భోగ్యమని యర్థము. 'సు' యనగా మిక్కిలి యపేక్షగల బుద్ధిగలవారని యర్థము. జడవస్తువుల నోరు పానముజేసిన, శబ్దార్థములను బుద్ధి పానమునేయును. బుద్ధిద్వారా పానమొనర్చి తమ యమృతత్వమునుగని, నిర్వీర్యులుగాక, నిర్భయులు, నిర్ద్వంద్వులు, నిశ్రేయసులు గండియని, అన్ని యమృతములలో 'సు' శ్రేష్ఠమగు గీతామృతము నిర్మల

బుద్ధి గ్రోలువారే భోక్తలని యర్థము. గీతాశాస్త్రము ద్రాగిన జననమరణరూపసంసార మృత్యుముఖమునుండి [illegible] [illegible] సమ్యక్ [illegible] చేయు ఏన చా॥ [illegible] గీత తెలుపును. అర్జున, వ్యాస, శుక, యాజ్ఞవల్క్య, [illegible] బుద్ధినిరు నమరులైరంటే [illegible] జనములకు దేహేంద్రియాదులని బుద్ధినొసగి [illegible] వ్యక్తమగుచున్న నిర్గుణబ్రహ్మమే. [illegible] గీతాశాస్త్రమును [illegible] స్వరూపము నమృతమే [illegible]

గీతాశాస్త్రమిదం పుణ్యం యః పఠేత్ ప్రయతః పుమాన్ ।
విష్ణోః పదమవాప్నోతి భయశోకాదివర్జితః ॥
భారతామృతసర్వస్వం విష్ణోర్వక్త్రాద్వినిస్సృతమ్ ।
గీతాగంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే ॥
గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః ।
యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిస్సృతా ॥
గీతాధ్యయనశీలస్య ప్రాణాయామపరస్య చ ।
నైవ సంతి హి పాపాని పూర్వజన్మకృతాని చ ॥
అకృత్యమపి కుర్వాణో భుంజానో వా యతస్తతః ।
ఘోరం వై నరకస్థానం గీతాధ్యాయీ న పశ్యతి ॥
మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే ।
సకృద్గీతాంభసి స్నానం సంసారమలమోచనమ్ ॥
శ్లోకమేకం తదర్ధం వా పాదం పాదార్ధమేవ వా ।
నిత్యం పఠతి యో భక్త్యా స మోక్షమధిగచ్ఛతి ॥
సర్వశాస్త్రమయీ గీతా సర్వదేవమయీ యతః ।
సర్వధర్మమయీ యస్మాత్తస్మాదేతాం సమభ్యసేత్ ॥

## (అథ) ఋషిన్యాసము

ఓం, అస్య శ్రీభగవద్గీతాశాస్త్రమహామంత్రస్య, శ్రీవేదవ్యాసో భగవాన్ ఋషిః, అనుష్టుప్ ఛందః, శ్రీకృష్ణపరమాత్మా దేవతా । అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ఇతి బీజం సర్వ

ధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజేతి శక్తిః, అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ఇతి కీలకం, మచ్చిత్తస్సర్వ దుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసీతి కవచం, కిరీటినం గదినం చక్రహస్త మిత్యస్త్రం, అనాదిమధ్యాంతమనంతవీర్యమితి ధ్యానం, జ్ఞానయజ్ఞేన భగవదారాధనార్థే, శ్రీకృష్ణపరమాత్మ ప్రీత్యర్థే, గీతాపారాయణే జపే వా వినియోగః.

తా॥ గీతామంత్రద్రష్ట శ్రీవేదవ్యాసుడు. మంత్రద్రష్టయైన గీతాతత్వరహస్యము సంపూర్ణముగ గ్రహించి లోకమున తొలుదొలుత ప్రచారమొనర్చిన మహాత్ముడు; దీని యందలి శ్లోకము లొక్కొటిగాగూర్చిన యశోవిశాలుడు. 645 శ్లోకములు అనుష్టుప్ ఛందస్సులో నుండుటచే నీ ఛందస్సుకే ప్రాధాన్యమివ్వబడినది. ఇంద్రవజ్రము, ఉపేంద్ర వజ్రము, ఉపజాతి ఇత్యాదులు 55 శ్లోకములు. గీతాశాస్త్రము లేదా మంత్రమునకు నారాధ్య దైవము లేక ప్రతిపాద్యవస్తువు సాక్షాత్ శ్రీకృష్ణపరమాత్మయే. కావున నీ గీత కాయన దేవత. నీ గీతకు "అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే" యనునది బీజము. సమస్తగీతోపదేశము నీ శ్లోకమునుండియే నారంభమగుట దానిని గీతావృక్ష మునకు బీజమని బీజమంత్ర మనబడినది. ఈ బ్రహ్మాండమను వృక్షమునకు మరణించిన వారినిగుఱించి, జీవించియున్నవారినిగుఱించి దుఃఖింపనిది బ్రహ్మము. సంసారవృక్ష మూలమదియేనని యెఱిగి హృదయమున నుంచటము. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అనేది నీ గీతకు శక్తి. మంత్రము శక్తిలేనిచో జీవచ్ఛవమగును. శక్తియుండబట్టియే నీ శాస్త్రము సజీవమైయున్నది. పరబ్రహ్మము లేక బీజమునే శరణు జొచ్చుట మానవులకు ప్రబలమగు శక్తి.

"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" యనేది కీలకము. గడియారమునకు 'కీ' వలె, లేక త్రాసునకు నడిమిదారమువలె, రైలుఇంజనునకు క్రీము వలె నీ గీతాశాస్త్రమునంతటికిని కీలకమైయున్నది. బీజమగు బ్రహ్మమే శరణ్యమైనపుడు బుద్ధిపూర్వకముగాగాని, యబుద్ధిపూర్వకముగాగాని నొనరించు సర్వపాపములను బోగొట్టి ఫలమగు మోక్షము లభింపగలదు.' ఇదియే గీతకు కీలకము. ఈవిధముగ హృదయ మున నిశ్చయించి వరుసగా ఋషి, ఛందస్సు, దైవత, బీజ, శక్తి, కీలకములను స్మరించి, తదుపరి నా యీ శ్లోకమంత్రములతో కరన్యాస, అంగన్యాసముల నాచరించి యేకాగ్ర చిత్తమున ధ్యాననిమగ్నుడు కావలెను.

పరమపవిత్రము జగద్గురు శ్రీకృష్ణపరమాత్మ అధిదేవతగాగల నీ మంత్రరాజమును వీడి యన్యులచేత కల్పితములై, యన్యదేవతలకు సంబంధించిన మంత్రముల ఋషిన్యాస,

కరన్యాస, అంగన్యాసముల నొనర్చువారు యేల గమనింపరో శోచనీయము. ఏడువందల మహామంత్రములు గల గీతకు నీ మంత్రము నగ్రమునన్నది. భగవంతుని యందు, భగవద్వాక్యముల విశ్వసింపనపుడు యాస్తికుల మనుట నాస్తికులు నవ్వుటకు గాదా? నాస్తికులెవ్వరైనది విమర్శించితే తెలియును. ఈ మంత్రపఠన మొనరించినవారే. స్వామి వివేకానంద, యరవింద, గాంధి, మలయాళ మహర్షులవంటి ధన్యులు, పుణ్యపురుషులు పూజితులై జగదారాధ్యులైరి.

## అథ కరన్యాసః

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ఇత్యంగుష్ఠాభ్యాం నమః, న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ఇతి తర్జనీభ్యాం నమః, అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ఇతి మధ్యమాభ్యాం నమః, నిత్యః సర్వగతస్స్థాణురచలోఽయం సనాతనః ఇత్యనామికాభ్యాం నమః, పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ఇతి కనిష్ఠికాభ్యాం నమః, నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ఇతి కరతలకరపృష్ఠాభ్యాం నమః.

## అథ హృదయాదిన్యాసః

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ఇతి హృదయాయ నమః, న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ఇతి శిరసే స్వాహా, అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ఇతి శిఖాయై వషట్, నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః ఇతి కవచాయ హుం, పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ఇతి నేత్రత్రయాయ వౌషట్, నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ఇతి అస్త్రాయ ఫట్, భూర్భువస్సువరోమితి దిగ్బంధః, ఓం శ్రీకృష్ణపరమాత్మ ప్రీత్యర్థే గీతాపారాయణే జపే వినియోగః.

ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్।
అద్వైతామృతవర్షిణీం భగవతీమష్టాదశాధ్యాయినీం
అంబ! త్వామనుసందధామి భగవద్గీతే! భవద్వేషిణీమ్॥

నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయతపత్రనేత్ర।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥

వాచకః ప్రణవో యస్య క్రీడావ స్త్వఖిలం జగత్ ।
శ్రుతిరాజ్ఞావపుర్జ్ఞానం తం వందే దేవకీసుతమ్ ॥

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనం ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా।
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకే కేశవే॥

పారాశర్యవచస్సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథాసంబోధనాబోధితమ్ ।
లోకే సజ్జనషట్పదై రహరహః పేపీయమానం ముదా
భూయద్భారతపంకజం కలిమలప్రధ్వంసినః శ్రేయసే ॥

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ ॥

యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైస్సాంగపదక్రమోపనిషదైర్గాయంతి యం సామగాః ।
ధ్యానావస్థిత తద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః ॥

## ఫలశ్రుతి

యే శృణ్వంతి పఠంత్యేవ గీతాశాస్త్రమహర్నిశమ్ ।
న తే వై మానుషా జ్ఞేయా దేవా ఏవ న సంశయః ॥

అతఃపరం సంపూజ్య పారాయణాదికం కార్యమ్.

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీప్రవచనగీత

## ప్రథమాధ్యాయము

### అర్జునవిషాదయోగము

శ్లో॥ సమస్తదురితాపహాం మునిజనాళిసంసేవితాం
ముకుందహృది భావితాం విజయజన్యసంబోధితామ్ ।
విముక్తిపథగామినీం నిఖిలశాస్త్రసంశోధితాం
సదా మనసి భావయే విమలతత్వగీతాంబికామ్ ॥

ప్ర॥ జన్మములందు యే జన్మము శ్రేష్ఠము ?

ఉ॥ మానవజన్మము.

ప్ర॥ ఎట్లు శ్రేష్ఠము ?

ఉ॥ అంతఃకరణముగలవి జంగమములు. అంతఃకరణములేనివి స్థావరములు. అంతఃకరణముగలవియైనను జంతువులు, పక్షులు, క్రిమికీటకాదులు తామెవరో, తాము జేయవలసినదేమో తెలియనివై "ఆహారనిద్రా భయమైథునం చ" యను ధర్మములందే మగ్నమై విషయజ్ఞానములుగలవియే యగుటచేతను జ్ఞానవిజ్ఞానయోగ్యములు, జిజ్ఞాసగలవి కావు. జ్ఞానవిజ్ఞానయోగ్యత, జిజ్ఞాస గలదియగుట మానవత్వము శ్రేష్ఠము.

ప్ర॥ మానవజన్మమునకంటె దేవతాజన్మము గొప్పదికదా?

ఉ॥ వ్యావహారికముగ గొప్పదేనని జెప్పినను యాత్మదర్శనము జాగ్రద్వాసనలరూపమగు స్వప్నమున గనలేనట్లు ప్రళయమున నష్టమగు శరీరములనాత్మదర్శనము బొందజాలరు. జరామరణయుతనాభిషాసాది

బాధలు లేక నిత్యసంతోషయుక్తులైనను మోక్షమున కర్హులగుదురు. మానవత్వము మోక్షదాయకముగాన శ్రేష్ఠము.

ప్ర॥ మనముండునది దేనియందు?

ఉ॥ ప్రపంచమునందు.

ప్ర॥ ప్రపంచమని యేలయందురు?

ఉ॥ "ప్రపంచ్యత ఇతి ప్రపంచః - పచ విస్తారే" దృగ్గోచరమగునది పరమాత్మను తెలియుటకు సాధనమైనది. "గచ్ఛతి ఇతి జగత్" నదీ ప్రవాహమువలె జరిగిపోవుస్వభావముగలది. లేక క్షణ క్షణము మారుటయే శీలముగాగలది. మఱియు పంచభూతమయమై స్థావర జంగమనామరూపమయమైనది.

ప్ర॥ ఎందుకట్లు మారుచున్నది?

ఉ॥ ఇయ్యది మిథ్య కాబట్టి చిత్తవృత్తినిబట్టి తోచుచుండును. కాబట్టియే దృష్టిసృష్టి యనెదరు.

ప్ర॥ మిథ్యయని యెట్లుం జెప్పగలరు?

ఉ॥ ఒకప్పుడు సకలమునిసమూహము శ్రీ వేదవ్యాసునిచెంతకు వచ్చి నమస్కరించి, వినుతించి పిమ్మట నిట్లు ప్రశ్నించిరి. ఓ మహాత్మా! వేదాది సమస్తప్రస్థానముల తిరుగవేసి యథార్థము గ్రహించుటకు నొక్క జన్మజీవితము చాలదు, పెక్కుజన్మజీవితములు కావలసివచ్చును. అయినను నొక జన్మవిషయము మఱొకజన్మమున జ్ఞాపకముండుట కెవ్వరి తరము? తాము పరిపూర్ణానుగ్రహమున ప్రస్థానముల నన్నింటియొక్క తాత్పర్యము లేక సారాంశము నొక మాటలో తెలవిచ్చిన మేము ధన్యుల మగుదుమనిరి. భావిజీవుల ధన్యత్వ మనుసరించినవార మయ్యెదమనిరి. అందున కియ్యకొని యా మహర్షి "శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః। బ్రహ్మ సత్యం జగన్మిథ్యా" యనెను. అంత వారు పరమానందభరితులై బ్రహ్మసత్యము జగమబద్ధమే అన్నిటియొక్క తాత్పర్యమని గ్రహించి వెళ్లిరి. "యదసత్ భాసమానం తన్మిథ్యా స్వప్నగజాదివత్" అను ప్రమాణముగూడ స్వప్నములోని గజాదులు మెలకువయందబద్ధమగునట్లు జగత్తసద్రూపమన్నది మిథ్యగానిచో ప్రమాణమేలజెప్పును?

ప్ర॥ కనుపించునది మిథ్యయనుట యెట్లు?

ఉ॥ "నామరూపాత్మకం విశ్వం ఇంద్రజాలం విదుర్బుధాః। అనామత్వాదయుక్తత్వాత్ ఇతి" నిలుకడగల నామరూపములు లేనందున సత్యమనెడి వ్యవహారమునకు యోగ్యము గాకయున్నందున జగము లేక నీ ప్రపంచము గారడీ, మాయా యనబడినది. "ఉలూకస్య యథా భానురంధకారః ప్రతీయతే" గూబాది రాత్రించరులకు పగలు చీకటిగా కనిపించుటలేదా! కన్నులు గలవానికి సూర్యప్రకాశము సత్యముగా గనిపించుచున్నను, గూబాదులకు కనిపించదు. అట్లు యజ్ఞానులవలన జగత్తు యనబడుచున్నది, జ్ఞానులదృష్టిలో లేదు.

ప్ర॥ జగత్తు లేనిదైన వేదాదులందేల జెప్పబడినది?

ఉ॥ కొందఱు మందాంధకారమున దారి నడచునపు డొక త్రాటినిగని యొకడు పామన, మఱియొకడు పుష్పమాల, వేఱొకడు జలధారీలాగు నెవరికి దోచినది వారుగల్పించిరి. సత్యవస్తువైన నిన్ని కల్పితము లేలజేతురు? జేయరు. "అధ్యారోపాపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే" జగన్నిషేధద్వారమున నద్వైతబ్రహ్మబోధకొఱకు నేరీతిగానో గంధర్వనగరమువలె జగత్తుయొక్క యారోపము వేదముచేత జెప్పబడినది. సత్యపదార్థము కాకపోబట్టియే నుపనిషత్తులు జగత్సృష్టిని గుఱించి యనేకరకముల జెప్పుచున్నవి. జగదుత్పత్తి ప్రతిపాదనమందు వేదముయొక్క యభిప్రాయము లేనేలేదు. 'యా మాయా సా మాయా' ఎయ్యది మాయదో అది మాయ. మాయాకార్యము. తమాషాజేయు నిమిత్తమొక దారువుచే నేనుగును తయారుచేయ దాని తొండము వంకరగానున్నది. అయితే దాని చక్కజేయ నెవడు ప్రవర్తించును? ఎందుకన మొదలే యది కల్పితము. నిజమైనర్ప నెవరుత్సహింతురు? అట్లు ప్రపంచనిషేధద్వారమున నద్వైతబోధకొఱకు జెప్పిన ప్రపంచారోపమునం దుత్పత్తిక్రమము నొక్కరూపముగా జెప్ప వేదము ప్రయత్నించదు.

ప్ర॥ అటులైన నెవరికొఱకు జెప్పబడినది?

ఉ॥ మందాధికారులకొఱకై.

ప్ర॥ మందాధికారుల తెలియుటెట్లు?

ఉ॥ పగలెందుకుపోయినది — తిరిగివచ్చుటకు. మనుష్యుడు పుట్టు టెందుకు — చచ్చుటకొఱకు. చావటమూ! — తిరిగి పుట్టుటకే. పుట్టుట చచ్చుటకే యనియు, పుట్టడము పుట్టువు లేకుండా జేసుకుందామను కొననివారు.

ప్ర॥ పుట్టినవారు చావకుండ నుండగలరా? అట్టి చావకుండా వుండుటను తెలిపే విద్య యేది?

ఉ॥ జ్ఞానమనునది. తిరిగిపుట్టకుండా జేయుటేమి; చావేలేదని తెలుపును.

ప్ర॥ చావంటే భయము. ఆ భయములేని ధన్యులుగలరా?

ఉ॥ ముందుండిరి, ఇప్పుడున్నారు, భావియందుండగలరు. ఈ మృత్యు భయము నమరత్వవాంఛ యాదిమానవునికి గలిగినది. ఈ వాంఛ లేని వారు లేనేలేరు. అప్పుడిప్పుడెప్పుడైన గలరు.

ప్ర॥ మానవులకు పరమసత్యమగు పరమగతియేది?

ఉ॥ పురుషార్థములలో చరమలక్ష్యమగు మోక్షము.

ప్ర॥ మోక్షమనగనేమి?

ఉ॥ "ముచ్ల్ మోక్షణే" అను ధాతువునుండి మోక్షశబ్ద ముత్పన్న మైనది. బంధవిముక్తి, లేక సంసారబంధమునుండి విడుదల, లేక పారతంత్ర్య మేమాత్రములేని స్వాతంత్ర్యము, లేదా దుఃఖనివృత్తి - యానందప్రాప్తి.

ప్ర॥ దీనిని బడయుటెట్లు?

ఉ॥ ప్రస్థానములద్వారా బడయవచ్చు.

ప్ర॥ ప్రస్థానము లనగనేమి? అవి యేవి?

ఉ॥ మానవుల జాగృతి మొదలు మోక్షపర్యంత మొనరించు ప్రయాణ సౌకర్యముల తెలుపునవి. వేదములు, స్మృతులు, ఉపనిషత్తులు, దర్శన ములు, పురాణోపపురాణములు, గీత యిత్యాదులు.

ప్ర॥ ఇందులో ముఖ్యప్రస్థానములెన్ని? అవి యేవి?

ఉ॥ శ్రుతి ప్రస్థానము ఉపనిషత్తులు, స్మృతి ప్రస్థానము గీత, న్యాయ ప్రస్థానము వేదాంతసూత్రములు లేక గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్ర ములు. కొందఱు రామాయణ భారత భాగవతములను ప్రస్థానములందురు.

ప్ర॥ ఇవి వేనికి ప్రమాణములు?

ఉ॥ వైదిక పౌరాణికమతములన్నింటికి పరమప్రమాణగ్రంథములు.

ప్ర॥ పరమగతియొక్క రహస్యము జటిలమగుటచే జనసామాన్యమునకు సులభముగా వివరించున దీమూటిలో నెయ్యది?

ఉ॥ గీత.

ప్ర॥ ఋభు, రామ, శివ, బ్రహ్మ, నారద, హంస, అవధూత, అష్టావక్ర, పాండవ, గోపికాది గీత లనేకములుగలవు. తామనున దేగీత?

ఉ॥ ఇందేదియుగాదు. భగవంతునిచే నర్జునునకు జెప్పబడ్డ గీత.

ప్ర॥ భగవంతుడు లేక కృష్ణుడెవ్వరు?

ఉ॥ 'కృష్ణ ఏవాహామస్మి' పరబ్రహ్మమే కృష్ణుడు. 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' స్వయముగా కృష్ణుడే భగవంతుడు. భగవంతశబ్దమునకు షడ్గుణైశ్వర్యసంపన్నుడని యర్థము. 'ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామ గతిం గతిమ్' ప్రాణులయుత్పత్తి వినాశముల, రాకపోకల, విద్యావిద్యల గ్రహించువాడు భగవత్పదవాచ్యుడు. ఆ ప్తకాముడు. 'సత్యానందరూపశ్చిదాత్మామాయా సాక్షీ' వ్యష్టి సమిష్టి బ్రహ్మాండసాక్షి, సర్వభూతాంతర్యామి, అప్రాకృతశరీరి. శబళశబల శుద్ధబ్రహ్మ. 'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి' ఎప్పుడెప్పుడు ధర్మమునకు హాని గలిగితే అప్పుడు వ్యష్టిగాగాని సమిష్టిగాగాని యవతారమెత్తును. 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం' సాధురక్షణము, దుష్టశిక్షణము నిమిత్తము ద్వాపరయుగమున స్వమాయతో దేవకీవసుదేవులకు తనయుడుగా జన్మించెను. సకల ప్రాణుల బుద్ధివాసనల ప్రేరేపించువాడు, జ్ఞానవిజ్ఞానమూర్తి, పూర్ణావతారుడు. కాబట్టియే గీతవంటి తత్త్వశాస్త్రము లేక విజ్ఞానశాస్త్రము చెప్ప గలిగెను.

ప్ర॥ భాగవతము, భారతము, భగవద్గీతలకు 'భ' యను శబ్దము మొదటుండుటేల?

ఉ॥ భక్తి జ్ఞాన వైరాగ్యముల తత్త్వముగని మోక్షమొందవచ్చుననును భాగవతము, భారతము. భక్తిరతునకే ముక్తియనియు, భక్తి జ్ఞాన వైరాగ్యములవల్లనే తత్త్వప్రాప్తియనును గీత.

ప్ర॥ గీత యననేమి?

ఉ॥ 'గీయత ఇతి గీతం' చక్కగా గానము చేయబడి లేక చెప్పబడి యక్షరస్వరూపమున పుస్తకాకృతిగనున్నది గీత. స్వతః ప్రమాణముగలది. 'వాచ్యవాచకయోరభేదః' భగవంతునకు గీతకు భేదములేదు. సాక్షాత్పర మాత్ముని యపరస్వరూపమే గీత.

ప్ర॥ ఇయ్యది యెన్ని శ్లోకములు గలది?

ఉ॥ భాస్కరభాష్యకారులు 'షట్శతాని సవింశాని శ్లోకానాం ప్రాహ కేశవః। అర్జునస్సప్తపంచాశత్ సప్తషష్టిం తు సంజయః॥ ధృతరాష్ట్రః శ్లోక మేకం గీతాయా మానముచ్యతే'॥ 745 శ్లోకములనెదరు, 701 ని కొందఱు, అనేకశ్లోకము లున్నవని యాత్తరాహులకులు, 700 ని కొందఱు, మత త్రయమువారు, వీరి యనుయాయులు నేడునూరులని గ్రహించిరి. నా యభిప్రాయము 701 యని చెప్పగలను.

ప్ర॥ అధ్యాయములెన్ని?

ఉ॥ పదునెనిమిది.

ప్ర॥ స్మృతులు పదునెనిమిది, పురాణములు పదునెనిమిది, భారతము 18 పర్వములు, భగవద్గీత 18 అధ్యాయములు, ఉభయసైన్యము 18 అక్షౌహిణులు, యుద్ధము 18 దినములు. వీనియందలి ముఖ్యార్థములున్న తెలుపుడు.

ఉ॥ 'అష్టాదశోక్తమవరం యేషు కర్మ' యజ్ఞమునకు పదునైదుగురు ఋత్విక్కులు, యజమాని అతనిభార్య యుపద్రష్టకలిసి పదునెనిమిదిమంది యుందురు. యజ్ఞమును తెలుపుట 18 యని కొందఱు. ఆరుకాండములు రామాయణము, భాగవతము 12 స్కంధములు వెరశి 18. శ్రద్ధాభక్తుల గలిగించు వీని ముఖ్యార్థమేనని కొందఱు, మానవుని మేజర్ 18 యని కొందఱు, సూక్ష్మశరీరమున జ్ఞానేంద్రియ కర్మేంద్రియ పంచప్రాణములు వెరశి 15 న్ను జీవుడు బుద్ధి సాక్షి పరమాత్మను తెలుపుటయని కొందఱు. స్మృత్యాదులు 18. వాని రహస్యములే 18 అధ్యాయముల గీత యందురు.

ప్ర॥ తమరియొక్క ఉద్దేశ్యమేమి?

ఉ॥ నేనన్నిటిని యొప్పుకొందును.

ప్ర॥ గీతయందలి గుహ్యము, గుహ్యతరము, గుహ్యతమమను మూడు రహస్యముల వివరింపుడు.

ఉ॥ వేదముల మాటను గుర్తించుట యొకటి. వేదమునగల కర్మ, యుపాసన జ్ఞానములను త్రివిధ రహస్యముల దెలుపుటొక యర్థము. గీతను మూడు షట్కములుగా జెప్పి మొదటి షట్కము త్వంపదశోధన కర్మరహస్యము దెలుపునుగాన గుహ్యము. తత్పదపరిశోధన, నిష్ఠామోపాసన జెప్పునుగాన రెండవషట్కము గుహ్యతరము. త్వంపద తత్పద లక్ష్యార్థాభేదజ్ఞానమును తెలుపునుగాన గుహ్యతమమని, మూడవ షట్కము జహత్ అజహత్ జహదజహల్లక్షణములను తెలుపునుగాన గుహ్య గుహ్యతర గుహ్యతమము లనబడును.

ప్ర॥ యోగమననేమి?

ఉ॥ 'అప్రాప్తప్రాపణం యోగః క్షేమస్తు స్థితరక్షణమ్' లభ్యపడని వస్తువును లభింపజేసికొనుటయే యోగము లేదా యుక్తి లేక యుపాయము.

ప్ర॥ దీని ప్రయోజనమేమి?

ఉ॥ బ్రహ్మవిద్యారూపమగు గీతాశాస్త్రమునకు సర్వానర్థనివృత్తి, పరమానందప్రాప్తియే పరమప్రయోజనము.

ప్ర॥ గీతకు నింత గౌరవమెట్లు ప్రాప్తించినది?

ఉ॥ తులసీదాసొకప్పుడనెను: ఓ రామచంద్ర ప్రభో! నీకన్న నీనామమే గొప్పది. నీవున్న దేశమునకు నీవుండి రక్షించినవారికే నీవు తెలియుదువు. నీ నామమందమా! త్రేతమొదలు నేటివఱకు స్మరింపనివారు, స్తుతింపనివారు, వ్రాయనివారు లేరు. మేరువును కలముజేసి, సముద్రముల సిరాబుడ్డి నొనర్చి, నీరు సిరాజేసి వ్రాసినను సమాప్తిజేయ లేననెను. మఱియు నేను గను, తమాము వదలి దాని చెక్కిళ్లయందలి మధుపాన మొనర్చు మఱిగిన గండుతుమ్మెదలవలె సకలలోకవాసులు వ్యాపకరూపుడగు హరికంటె నాయన యుపరస్వరూపము లేక ప్రాణము లేక హృదయమగు గీతకే రామనామమువలె నెక్కువ గౌరవము గలిగినది. అది పూర్ణమైనది. కర్త కర్మ క్రియలతోటి పూర్ణవాక్యమువలె సూక్ష్మశరీరమందలి మలవిక్షేపావరణములను త్రిపుటిని హరించు కర్మ భక్తి జ్ఞానములతోటి యద్వైతామృతము శ్రీకృష్ణ ముఖారవిందమునుండి బయలుదేరినది. నరులను నారాయణులుగా, మానవుల మాధవులుగా మార్చగలది. భగవంతుని

స్వరూపము. స్వభావగుణకర్మములను తప్పు సంసారలేశమేని వచింపనిది. అన్యమతములచే నణచబడినను క్రిందుపడక నీటిపైఁదేలి సొరకాయ బుఱ్ఱవలె మునుగక నాయా మతగ్రంథములలో ప్రధానమైనదిగ నుంటున్నది. పురాణముని, పురాణఋషియగు వేదవ్యాసుని యభేదబుద్ధిచే గూర్పబడినది. ఎట్టి మానవులైననుసగియే తొలుత సర్వార్థదాయియగు మోహనివృత్తి, తమ స్వరూపస్వధర్మము విశదపఱచుటలో 'న భూతో న భవిష్యతి' గీతకు గీతయే సరి.

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, షడ్దర్శనములలోని సిద్ధాంతములను సామాన్యజనులకు సైతము వారి వారి యోగ్యతానుసారము నందుబాటు చేయుగలది గీతయని పలికితే చాలు, చేధరించిన, విన్నను, వినిపించినను సేవయున్నవారైనను భగవత్స్వరూపులే. గాక నెంతి పాపాత్ములైనను మరణసమయమున మోక్షము తలంచినంతనే నివ్వగలది. దీని సంస్కృతి సుందరము, సరళము. ఎందఱెన్నివిధముల వ్యాఖ్యానాదుల తమ తమ శక్త్యనుసారము వ్రాసినను నిదమిత్థమని నిరూపింపజాలనిది.

ప్ర॥ గీత పూర్ణగ్రంథమనుట యెట్లు?

ఉ॥ ఏదేని యొక సాంప్రదాయకభావము పక్షపాతము యౌదార్యమొసగు భావహీనత గలదేదియు పూర్ణగ్రంథము కాజాలదు. భారతవర్షమున లేదా యే దేశమందైనను సరియే, ఎప్పుడు సాంప్రదాయకమతములు బయలుదేరునో యప్పుడే తమ తమ పుణ్యభూముల జాతి, మత, న్యూనాధిక భేదములతో నశాంతి బయలుదేరును. అంతేగాక జనులలో పరస్పర కక్షలచే కలహములు, మారణములచే సతమతమగుచు క్రమక్రమముగ ధర్మమను పేర నధర్మము ప్రబలి దిక్కులేని పరిస్థితియైపోవును. అప్పుడు ధర్మవిప్లవము, మతవిప్లవము, దేశవిప్లవము, శాస్త్రవిప్లవములు బయలుదేరి పరమగతికి బదులు నరకప్రాప్తి హేతువగును. ఇట్టి పరమదారుణము మన యీ పుణ్యభూమియందు వేరులు పాతుకొని, తిష్ఠవేసికూర్చొని, పరమత పరదేశస్థుల పాదాక్రాంతమగు నట్లొనర్చినది యందఱెఱిగినదే. సాంప్రదాయకభావము పక్షపాతము యౌదార్య మొసగు భావహీనత గల్గుటచేతనే పైన జెప్పిన విప్లవములు గలుగుట. కాని గీతయందు

మెచ్చుకైన విప్లవములు గలిగించు లక్షణములు లేవు. ఏ దేశమైన, ఏ కాలమైన సరే, మానవులైతే సరి, పుణ్యాత్ములు, పాపాత్ములు, స్త్రీలు, పురుషులనే వివక్షత లేక నానావిధమానవులకు సమానప్రాప్తి గలిగించునది యగుటంజేసి పూర్ణగ్రంథ మనిపించుకొన్నది.

ప్ర॥ గీత యే సమయమున జెప్పబడినది?

ఉ॥ సుమారు 5000 సం॥రములనాడు కురుక్షేత్రమున యుద్ధరంగమున.

ప్ర॥ ఎవరికొఱకు?

ఉ॥ పాండవమధ్యముడగు నర్జునునికొఱకు.

ప్ర॥ అర్జునునికొఱకై చెప్పబడ్డది తక్కుంగల మానవుల కేమవసరము?

ఉ॥ ఏదైన నొక ధర్మము వ్యష్టినుండి సమిష్టివఱకు లేదా సమిష్టినుండి వ్యష్టివరకు నాచరణయోగ్యమైనదైననది మానవులకందఱకు నన్వయిస్తుంది. అర్జునునకు గలిగిన విషమస్థితి యొకానొకప్పుడు యెవ్వనికైన గలుగునదియే. అటువంటప్పుడు తక్కినవారికెలా యనుట సరి కాదు. ఏ యొక్కనికో రోగమువస్తే తక్కుంగల వారికేల యన్న నెప్పుడో యొకతూరి రోగము రానివాడుండునా? యుండడు. ఒకచో పాఠశాల నప్పుడున్న బాల బాలికల నుద్దేశించి నిర్మించిన భావికాలపువారికి నవసరము లేదనియా? కాదు. అట్లు అర్జునునికి గలిగిన మోహానివృత్తి నాతని నిమిత్తముజేసి సర్వమానవకళ్యాణముకొఱకు జెప్పబడినది.

ప్ర॥ సకలమానవుల నుద్దేశించి యన్న, స్త్రీలు వేఱు, పురుషులు వేఱు, దేశములు వేఱు, నాచారములు వేఱు, భాషలు వేఱుండునుకదా! అందఱకు నన్వయించు టెట్లు?

ఉ॥ మానవులన స్త్రీపురుషరూపశరీరధారులైన జీవుల నుద్దేశించి చెప్పటము. దేహాచారవేషభాషలకుగాదు.

ప్ర॥ స్త్రీలు, వైశ్యులు, శూద్రులు పాపయోనిసంజాతుల నుద్దేశించి చెప్పినట్లైతే నేల కొందఱాక్షేపింతురు?

ఉ॥ చెప్పినవాడు భగవంతుడు. తాను యాక్షేపింపలేదుగదా! మఱొకఁ డాక్షేపించుట కేమి హక్కు, అధికారము గలదు? గీత నవమాధ్యాయమున "మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయో

నయః, స్త్రియో వైశ్యాస్తథా శూద్రా" యని ప్రమాణము. గీతా మాహాత్మ్యమున స్త్రీయైన భూదేవి వైకుంఠమున విష్ణువుతో భూలోకములోని ప్రారబ్ధశరీరధారులగు మానవులకు నిశ్చలభక్తి యెట్లు గల్గునని యడిగినది. సకల మానవుల నుద్దేశించి నిందెసరెక్కడ. సంజయుడు ధృతరాష్ట్రునకు గీతను వినిపించెను. గీతయందు యుద్ధప్రయోగ మున్నది కాని, ఫలానా వారికని యెచ్చట లేదు. భగవంతుడు జీవులందఱు తన యంశము లేననెను. తానేటికి భేదముజేయును. భేదమనునది యుండి నట్లుంటే వారితో నేల జెప్పుంతురు? తాను జెప్పడు గీత యొప్పదు.

ప్ర! కళ్యాణమంటిరికదా! దాని యర్థమేమి?

ఉ! ఒకనికి గొప్పయుద్యోగము లభించినపంటు తలిదండ్రులు చుట్ట పక్కాలవల్ల లభింపలేదు. స్వయముగచదివి, ఒక్కొక్క తరగతిని గడచి, పెద్దడిగ్రీలు వ్యాసయి సిఫార్సుపైన నుద్యోగి యయ్యెను. తద్విధము మానవజన్మముకూడ స్వయముగజేసిన కర్మవల్ల నొక్కొక్క జన్మముమారి యీశ్వరుని సిఫార్సుచే మానవత్వము లభించినది. చావ డము పుట్టడమనే సంసారద్వయమునుండి విడివడుటయే కళ్యాణము.

ప్ర! జన్మించినవారు చనిపోవటము, తిరిగి రావటమునునది యెట్లు?

ఉ! విత్తనము చెట్టునకు, చెట్టునకు విత్తనము స్వకారణము. విత్త నము వేచబడనంతవఱకు చెట్టురూపమొందుట దృష్టాంతముకాదా! అదే ప్రకారము సంసారమూలబీజమగు యజ్ఞానము లేక యహంకారము నశించనంతవఱకు విత్తుచెట్టులరీతి జన్మమరణములు తప్పవు. జననము వచ్చునది దేహమునకుకాదు, జీవునకు. చనిపోవటము దేహమే. జీవుని కర్మ ననుసరించి చావుపుట్టుక లుండును.

ప్ర! సర్వమానవులు దేనిని కోరుదురు?

ఉ! దుఃఖనివృత్తి, యానందప్రాప్తి.

ప్ర! దుఃఖమన నెట్టిది? యానందమన నెట్టిది?

ఉ! 'అథ త్రివిధదుఃఖాత్యంతనివృత్తిరత్యంతపురుషార్థః' ఆ ధ్యాత్మిక మాధిభౌతిక మాధిదైవికములను మూడు తాపత్రయములు లేదా శమనత్రయములే దుఃఖము. ఈ మూడు లేనిస్థితియే యానందము.

ప్ర॥ ఈ మూడువిధముల దుఃఖము చనిపోతే పోవునుగదా?

ఉ॥ చనిపోయినమీదట నానందము నెట్లు బొందుదువు? అంతము యత్యంతమున, నొకజన్మమునబోక దుఃఖకారణ మున్నంతవఱకు జన్మములుండును. జన్మము లున్నవా, దుఃఖముండును.

ప్ర॥ అర్జును డెవరు?

ఉ॥ పాండురాజు కుంతీదేవులకు జన్మించినవాడు.

ప్ర॥ కురుక్షేత్రమున నెద్ది?

ఉ॥ బ్రహ్మ యజ్ఞమునుచేసిన స్థలము, మఱియు కురువనురాజుచే దున్నబడిన పుణ్యక్షేత్రము.

ప్ర॥ ఆ స్థలమున నర్జునునకు కృష్ణుడు చెప్పగా గీతలగూర్చిన దెవరు?

ఉ॥ శ్రీ వేదవ్యాసమహాని.

ప్ర॥ ఆయనను గుఱించి సంగ్రహముగ జెప్పుడు?

ఉ॥ భారత యాదిపర్వమున పరాశరుడు మత్స్యగంధిని మోహించి క్రీడింపగా సద్యోగర్భమున బుట్టిన వెంటనే తపమున కరిగిన పుణ్యమూర్తి. మానవక్షేమమునకు వేదమును నాలుగుగా విభజించి వేదార్థము తెలియుటకు భిన్న భిన్న పురాణములను నితిహాసమగు భారతమును వ్రాయుచు, తన పుట్టుకను దాపక తెలిపికొన్న నిరాడంబరుడు. జగత్తునకు విజ్ఞానభిక్ష పెట్టిన పరమగురువగు నారాయణుడు. ఉత్తరమీమాంసను వ్రాసిన ఘనుడు. 'మునీనామప్యహం వ్యాసః' భగవంతుడేవ్యాసుడను రహస్యము విభూతియోగమున గలదు. పూర్ణముని యశేషవచనములను వ్రాసినను, సాంప్రదాయక భావము పక్షపాతము యాచార్యభావహీనత నెందైన గనిపింపదు. ఒక విషయము మంచిదని గౌరవించటము, మఱొకటి చెడ్డదని తిరస్కరించటము నాయన పుద్దేశ్యమేకాదు. వ్యాసనామమును త్యాగముచేసి యద్వైతమున నభేదము యేకైకస్థితి కృష్ణుడైనాడు. సనాతనమత ధర్మానికి మతమునకు శాశ్వతత్వమును ఋజువుపఱచి వేదాంత సాహిత్యమునకు రసపోషకుడై భగవద్గీతామంత్రానికి మంత్రద్రష్టయైన మహానుభావుడు.

ప్ర॥ అర్జునునకు నతనియింట బోధింపక యుద్ధమున బోధించుటేల?

ఉ॥ ప్రాప్తవస్తువు ఏసమయమున నెచ్చోట లభింపవలెనో నా సమయమున లభించుట మనమెఱిగినదే. ఇంటియందే బోధించియుంటే మనవలె కెట్లు వచ్చును? అర్జునుడు యుద్ధమునకు పోయినచోట గీత వచింపవలసి వచ్చినది.

ప్ర॥ కురుక్షేత్రమునకు, హస్తినాపురమున కెంతదవ్వు?

ఉ॥ రెండువందల మైళ్లుండును.

ప్ర॥ ఎన్నిదినములు యుద్ధమొనరించిరి? ఉభయసైన్యము లెన్ని?

ఉ॥ 18 దినములు యుద్ధమొనర్చిరి. పదునెనిమిది యక్షౌహిణు లుభయసైన్యము.

ప్ర॥ పాండవులన నెందఱు?

ఉ॥ ధర్మజభీమార్జుననకులసహదేవులు.

ప్ర॥ కురువీరులెవరు? ఈ యిరుతెగలవారికి యుద్ధమేల వచ్చెను?

ఉ॥ ధృతరాష్ట్రగాంధారులకు జన్మించిన పుత్రశతము. వీరే కురువీరులు. ధృతరాష్ట్రుడు పాండురాజుకంటె పెద్దవాడు. వీరిరువురకు తండ్రి యొక్కడే. పాండురాజు గతించిన పిమ్మట చిన్నతనమంతయుగడచి ద్రోవది వివాహమైన తదనంతరము నింద్రప్రస్థపురమునుండి రాజసూయయాగము జేసినవెనుక ధృతరాష్ట్రుడు కొడుకగు దుర్యోధనుని ప్రోద్బలమున సతీసమేతముగ పాండవుల నైదుగురను హస్తిపురికి బిల్వనంపించి ప్రొద్దుపోవుటకు ననే నెపమున ధృతరాష్ట్రుని యంగీకారమున దుర్యోధనుడు శకునిచే ధర్మరాజును జూదమాడించి యోడించినారు. పదిరెండు సంవత్సరము లరణ్యవాసము నొక సంవత్సర మజ్ఞాతవాస మొనర్చిరా భాగ మివ్వబడునను షరతుపై ధర్మరాజు నోడించిరి. పాండవు లార్గురు పదుమూడువత్సరములు ముగించి షరతు ప్రకారము తమపాలు యిమ్మని యడిగిరి. అందుకు దుర్యోధను డొప్పడాయెను. సత్యవ్రతులు, ధర్మపరాయణులు, దయామయులగు పాండవులు శ్రీకృష్ణునిచే మధ్యవర్తిత్వము గావించిరి. కాని ప్రయోజనము లేదాయెను. సామదానభేదము లనే యుపాయముల సాధ్యముకానప్పుడు దండోపాయమే కర్తవ్యమన్నట్లు యుద్ధమునగెల్చి తమపాలు సంపాదింప నేడక్షౌహిణుల సైన్యమునుగూర్చి,

కురువీరులు పదునొకండక్షౌహిణుల సైన్యమును గూర్చుకొని గెలిచిన వారిదే యావద్రాజ్యమన్న యుద్దేశ్యముతో యుద్ధనిశ్చయము జేసికొని కురుక్షేత్రమున జేరిరి.

ప్ర॥ పాండవు లిరువురతల్లుల బిడ్డలయ్యు, భక్తియుక్తులై శ్రీకృష్ణున కత్యంతప్రియులై భాగ్యులనిపించుకొనుటేమి? ఒకతల్లిబిడ్డలగు దుర్యోధనాదులేల భగవంతునకు దూరులై అభాగ్యులైరి?

ఉ॥ ఇయ్యది మాతాపితలదోషము. కృపణత్వముగలది ధృతరాష్ట్రవీర్యము, కుంతి తనకన్న ముందే తనయులగన్నదను నసూయచే గాంధారి గర్భచ్ఛేదము జేసుకొన్నది. తదసూయాదోషము తనయుల కాపాదించినది.

ప్ర॥ శ్రీకృష్ణు డుభయులకు బంధువై యుండి తాసీఘోరవినాశము తప్పింపకపోవటము, నర్జునునిపక్షము జేరుటేలాగు వచించుదు.

ఉ॥ త్రాసుచే దూచువాడు సమముగ దూచినను, దోషదృష్టి గల వానికి క్రిందు మీదు కనుపించును. ధర్మము సమముగా జెప్పి తుదకు విశ్వరూపమును సైతము జూపటము సుభయక్షేమముకొఱకేగదా! ఎన్ని జెప్పినను దుర్యోధనాదులు వినరైరి. తన ధర్మము తాను జేసెను. ఆతతాయులకు ధర్మమెక్కడ? జయమెక్కడ? దుర్యోధనార్జును లిరువురు శ్రీకృష్ణుని యుద్ధసహాయ మపేక్షింప నేనెవ్వర ప్రక్కవచ్చినను, యుద్ధమొనర్పననెను. యుద్ధమొనర్పనివాడేలనని నారాయణ గోపాలుర కృష్ణసములజేసి తన పక్షమున దుర్యోధనుడు గోపాలుర గోరెను. కృష్ణుడను మతించెను. భక్తపరాధీనుడు భక్తులపక్షమునుండుట తథ్యము. అర్జునునకు రథమునడుప నియ్యకొనెను.

ప్ర॥ ఈ చరిత్రకు ప్రమాణగ్రంథమేది?

ఉ॥ శ్రీ మహాభారతము.

ప్ర॥ భారతముయొక్క యభిప్రాయమేమి?

ఉ॥ భక్తిరతులై మోక్షకారకులగు మానవులకు సాంఘికధర్మమున పతితులుగాక భగవత్ప్రాప్తి లేక మోక్ష మరచేతిలోనిదనియు, దుర్యోధనాదుల వంటివారికి నుభయలోకభ్రష్టత్వము తప్పదనియు, ప్రవృత్తి నివృత్తిధర్మముల స్వధర్మముల నెఱింగించుటయే.

ప్ర॥ భారతమందలి పాండవాదిపాత్రలు చరిత్రాత్మకములేనా? లేక కల్పితపాత్రలా?

ఉ॥ చరిత్రాత్మకములైనను, కల్పితములైనను వారితో మనకవసరము లేదు. నీతినియమములను, ధర్మాధర్మములను ప్రతిపాదించునపుడు కొన్ని కల్పితములు, కొన్ని చరిత్రాత్మకములు గావలసివచ్చును. మనకు కావలసినది ధర్మము. తూనిక లేక మాటలతో యే వస్తువు యెంతవుండునది మనకు సంశయమే. తూనిక మన సంశయములను దీర్చినది. అది యెట్టిదైననుగాని కురుపాండవులు మనలో యేకస్థులైనారు. ఎవరు పాండవుల వంటివారో, వారికి జయము. దుర్యోధనాదులవంటివారికి నపజయము. ధర్మము యేపక్షముననున్నదని తెలిసికొనుటకు సంఘోద్ధరణ, మాత్మోద్ధరణమొందుటే మనకర్తవ్యము.

ప్ర॥ శ్రీకృష్ణుడు తన సారథియైయుండ యుద్ధభయ మెఱుంగని యర్జునున కేల గీత నుపదేశింపవలసివచ్చె?

ఉ॥ భారతయుద్ధము 18 దినములకు ముగిసినది. అర్జునునకు జయమైనది. కాని సకలజీవులు పుట్టినది మొదలు లేక జాగ్రతమొదలు మోక్షపర్యంతమైన భోగరూపసంసారజీవితసంగ్రామమున సతమతమగుచు, డిగాలుపడి దిక్కుదోచక దిమ్మచెడి వమ్మయి క్షణక్షణము భయ సంశయ సంకల్ప మశాంతముల మునుంగుచు తేలుచుండుట మన మెఱుగమా! అర్జునునివలె విజయము చేకొనవలెనంటే నాత డిట్టి యశాంతిని గీతవలన దొలగించుకొనును. కావున గీతను సర్వులు నాశ్రయించవలసినదే. గీతాప్రచార మావశ్యకమేనని స్వామి వివేకానందయన్నట్లు విఱివిగా ప్రచారము సాగి మానవుల చైతన్యవంతులుగా జేయుట కిదియే సమయము. అర్జునుడు వినుట కాసమయము, ప్రచారమొనర్పమన కిది సమయము. ఫలము లోకేనమానాధికరణము. సరి కురుక్షేత్రమున ఉభయ సైన్యములు సమరసన్నాహముతో జేరి రెండుదిశల బారులుదీరి తమ తమ నిజాయితీతో నొప్పియుండే సమయమున దుర్యోధనుడు ద్రోణాచార్యుని సమీపించి ధీమంతుడగు తమ శిష్యుడు ధృష్టద్యుమ్నుడు పాండవుల సైన్యమును వ్యూహాకారముగ దీర్చిన నీ విపులసమావేశము నక్కడి మహావీరుల సైతము గాంచుడనెను. కాని ద్రోణుడు దేనికి బలుకడాయెను.

సేనానాయకుల హెచ్చరించినట్లు హెచ్చరించినందుననో, యేలనో పలుక డాయెను. అంత దుర్యోధను డాశ్చర్యపశ్చాత్తాపముల భీష్ముని రక్షించవలెనని పలుకుచుండుటను విని వెంటనే భీష్ముడు తన్నొకడు రక్షింపనవసరములేదను మాడ్కి తన శంఖమును పూరించి యట్టహాసము జేసి దుర్యోధనునకు సంతోషము గలిగించెను. వెంటనే సైన్యమున భేరీ శంఖ మృదంగ తప్పెట గోముఖాది వివిధవాద్యముల ప్రయోగించిరి. అది చూచి వెంటనే పాండవబలమున దొల్త శ్రీకృష్ణుడు పాంచజన్యమును అర్జునుడు దేవదత్తమును భీముడు పౌండ్రమును యనంతవిజయము ధర్మజుడు నకులసహదేవులు తక్కంగలారు తమ తమ శంఖంబుల బూరించిరి. ఆ పాండవసైన్యశంఖాదిఘోష భూనభోంతరాళముల నిండి దుర్యోధనాదులకు వెఱపును నపజయసూచకమును గలిగించెను.

ప్ర॥ ఒక మాట. శ్రీకృష్ణుడు యుద్ధమొనర్పనన్నవాడు యుద్ధారంభచిహ్నమగు శంఖము తొలుత తానేల పూరించెను? ఇయ్యది యధర్మము కాదా?

ఉ॥ ధర్మాధర్మము లెఱిగిన కేశవుని యభిప్రాయము కేశవునకే యెఱుకయైనను సమ్మతముగ విమర్శించుట మన కుచితము. రథికులు సారథులు తమ తమ విజయసూచక ఘోషముల యనిలో ముందుగాని, వెనుకగాని యొనర్చుట తప్పుకాదు, అధర్మమును కాదు. గుఱ్ఱమును మాలీసు చేయువాడు యజమాని యెక్కకమునుపే తానెక్కి యొక పరి స్వారి తీయును. అది యజమానిని తిరస్కరించటముకాదు. గుఱ్ఱమునకు చుఱుకు గలిగించెదుకొఱకు నటువలె శత్రువుల భయపెట్టి యదుపునకు తెచ్చుకొనుటకు రథికుడును, రథము నడుపుటయందు వంచనము లేని నా బుద్ధిబలము జూడుమని సారథి తమ తమ విజయచిహ్నమును, తన రథికున కుత్సాహమును, యెదిరి బలములకు రథికులకు భయమును గల్గించుటకు నిరుపార్శ్వములందలి సారథులు పూరింపవచ్చును. అదియే కాదధర్మపక్షమున నిలిచిన భీష్ముడే ప్రతిపక్షుల భయపెట్టినపుడు ధర్మపక్షమున నిలిచిన నారాయణుడు గెలుపు పాండవులదేనని తెలిసి యిప్పుడైన సంధిచేసుకొన నుభయక్షేమముకొఱకు పూరించెను.

తన గెలుపునకు కాదు, నైష్ఠికబ్రహ్మచారి భీష్ముడు, అస్ఖలిత బ్రహ్మచారి శ్రీకృష్ణుడు. బ్రహ్మచారి ధర్మము మనసు విమర్శించుకో వలెను. అంటే బ్రహ్మచారుల కేలయుద్ధము? ఇరువురిలో భీష్ముడు దారి దప్పెను. మఱియు ప్రయాణీకులైనవారు యెవరైన నావనడుపు వానికెట్లు విరోధులగుదురు? వాడు వారిని గట్టు జేర్చుటయే యతని కర్తవ్యము. పాండవులు దుర్యోధనాదులకు శత్రువులుగదోచినను, అపారయుద్ధవారాశి నుండి పాండవుల గట్టెక్కించుట నావికుడగు హరికి కర్తవ్యమే, ధర్మమే. అటుపిమ్మట తాను తొలుదొల్త నెవ్వరితో రణమొనర్పవలెనో, యెవ రెవ రేస్థానమున నిలిచియున్నారో, ఉభయబలముల తిలకించి ధనువెక్కు బెట్ట నిశ్చయించుకొని యర్జునుడు శ్రీకృష్ణుని నుభయసైన్యములమధ్య మన రథమును నిలుపుమన శ్రీకృష్ణుడట్లొనరించి తన చేయి యెత్తి యొక్కొక్కరిని పేర్కొంటూ దుర్యోధనుని సైన్యమున నున్నవారిని జూపెను.

పిల్లలకు నాటలన్న నెంత సంతోషమో, భూషణాద్యలంకారము లన్న స్త్రీలకెంత మక్కువో, యుద్ధమన్న నంత సంతసము, యుత్సాహము వెలిపెలుంగనివాడు, నపజయమెరుగనివాడు నొక్కదినములో గెలుపు గలిగించెదనని ధర్మజునితో బలికినవాడు దేవదత్తమగు కిరీటము, అగ్నిదత్తమగు గాండీవము, ఈశ్వరలబ్ధపాశుపతము, హనుమత్కేతనము, కృష్ణసారథ్యము గలవాడు నైతికసాంఘికధర్మాచరణ మనోవాక్కాయ ముల గలాడు. ప్రారబ్ధశరీరధారి క్షత్రియుడు పాండుపుత్రుడు నర్జునుడనను యభిమానాహంకారములు గలవాడు. జీవితేచ్ఛ, రాజ్యేచ్ఛ, జయేచ్ఛ, సుఖేచ్ఛగల శూరుడు, వీరుడు — నలువైపులకు దృష్టి సారించెను. అప్పుడతనికి నిరుపక్షములందును తండ్రి, తాత, ప్రపితామహ, భృత్యా మాత్య, భ్రాతృమిత్ర, పుత్రపౌత్ర, జామాతలన్నదమ్ములాది సమూహమే నేవంకజూచిన గనుపించెను. చచ్చిపోవటమో చంపటమో యను నంతిమోద్దేశముతో వచ్చినవారల నందఱ కలయజూచెను. ఏ దిక్కు గెలుపైన నొక దిక్కువారికి గలిగేది దుఃఖమే, ఉభయులు తనవారలే. ఇట్టి స్థితి గలుగునని ముందు తెలియదా? తెలుసు. అది యుభయులకు తెలుసును. కాని, ఎదుట కనుపించక యనుకొనుటకంటే నెదుట గనపడుటవలన

గలిగే పరిణామము వేరు. తనవారల జూచినంతనే యతని హృదయములో నెన్నడెఱుగని యశాంతి గలిగెను. మిన్ను విఱిగి మీదబడినట్లైనది. భూమి లోనికి దిగిపోతున్నానా? లేక నిలబడియున్నానా? యుద్ధరంగమా? కళ్యాణరంగమా? అని తోపక దుఃఖము దయ రోత వీనికి వెనుక నిస్పృహ వెన్నంటినవి. ఈలాటి విపరీతస్థితి నెన్నడు కనలేదు. కాలకేయుల నివాత కవచాదుల తెగటార్చినపుడు ఖాండవదహనాదులనున్న సాహసోత్సాహములు తొలగి చేతినుండి గాండీవము జారటము, శరీరము కంపించటము, నేత్రముల బాష్పములు రాలటము, గొంతు గద్గదము, పెదవులు వాడి మాటలు తడబడటము, నాలుకారటము, వెంద్రుకలు గగుర్పాటొందటము, మనస్సు కలియబెట్టటము అమంగళసూచకముల గనుచున్నానని యిట్లెన్నియో పలికి బంధువుల జంపితే గలిగెడు మంచి కనపడలేదు. జయము వలదు, రాజ్యము, సుఖభోగములు నాకవసరములేదు.

వీరు నన్ను వధించిననుసరే త్రిలోకాధిపత్యమే వల్లనన్నపుడు దుర్యోధనాదుల జంపితే గలిగే యీరాజ్యము నాకు వలదు. పాపాత్ముల జంపితే మఱీ పాపమే రాగలదు అనెను. ఏల నతనికట్లైనది. శత్రువుల బరిమార్పలేకనా? రాజ్యకాంక్షలేకనా? లేక యహింసాధర్మ ముదయించెనా? లేదు. అంతిమనిశ్చయముతో స్వజనులుగాక మఱెవ్వరైననైనచో హతమార్చక నింత దుఃఖించునా? ఇంతకుముందు నిట్టి వెన్ని నాచరింపలేదు. నాడు పాపమని తోచకపోవటమేమి? ఉభయపక్షముల వారికి గెలుపోడులు తెలుసునుగా! అర్జునునకు తన యుద్ధకర్తవ్యమును మఱుగుపరచే సర్వానర్థదాయియగు దాని కార్యము తబ్బిబ్బునేసెను. అదియేది? స్వజనులనెడి మమకారము నేనర్జునుడననే యహంకార కర్తృత్వాద్యభిమానాసక్తిజనితమైన మోహము, లేక భ్రమ వెంటనే ధర్మాధర్మవిమర్శజ్ఞానము తలంపుకు వచ్చెను. ఎవ్వడుకాని తన కర్తవ్యము మోహముచే గోలుపోయినపుడు కర్తవ్యభ్రష్టత సహించలేక దాని గప్పిపుచ్చుటకు నేదో యొక ధర్మసూత్రము పాము పడగవిప్పినట్లు, నెమలి పురివిప్పినట్లు లేవనెత్తును. ఎందుకందమా? అర్జునునకిప్పుడు యుద్ధమే తగినదికాదు పాపభూయిష్టమైనది, కులక్షయకారకము, ధర్మహాని, బంధునాశము, ఆచారము చెడును, సంకరవృత్తి వ్యాపించునని,

యరిష్టము రాగలుగునని వివిధములగు ననర్థము లీయుద్ధమువలన గలుగు చున్నవనే యొక యభిప్రాయముతోటి ధర్మప్రతిపాదన మొనర్చెను. ఒక గ్రామమున నొక పండితు డెచ్చట నేయింట నెవ్వరికిగాని గొప్ప యాపద వచ్చినపుడు లేదా మృత్యువే వచ్చినపుడు తానుపోయి వారికి లెక్క-లేనన్ని వేదాంతోపదేశములుజేసి యాపదలన్నను, మృత్యువన్నను యవి ప్రకృతినియమములు లేదా దైవసంఘటనములు. మానవులు వానిని దృష్టిలో నుంచుకొని తమ కర్తవ్యము గోలుపోరాదని బహురీతులజెప్పి వారి దుఃఖనివృత్తి జేసెడివాడు. ఒకప్పుడు తాను యింటలేని సమయమున తన యనుంగుయిల్లాలు తన మోహరాశి హఠాత్తుగ వ్యాధితో క్రింద బడిపోయి పడరానిబాధలుపడుచు చావనున్న సమయమున నెవరోవెళ్లి యెచ్చటనోయున్న తనకాసంగతి చెప్పినపుడు ప్రత్యక్షముగ నామెను జూడ లేదు. బహుశా చావదనే నమ్మకముతో వేదాంతము జెప్పుచువచ్చెను. ప్రత్యక్షముగజూచి బ్రతుకదనే నిశ్చయము గలిగినంతనే గోడుగోడున నేడ్చుచూ దయగలిగి యశాంతి కేకెత్త నామె శరీరమును బాసిన తన కిక గృహమవసరము లేదనియు నామె తోడిదే నాకు మరణమనియు, నిన్ను విడచి నేను జీవింపగలనా? నీవంటి యిల్లాలు నాకిక లభించునా? నీవు లేనిది యీ సంపదలేల? ఈ జీవితమేల? భోగములేల? అని వెనుక ముందులాడుచు చేయునదిలేక విసుగుతోచి యింటిలో నాడది లేకపోతే రోతయని, యాచారము దూరమని, దేవపితృకార్యములన్నియు పాత మాయెననియు, నేవిధమా యనర్థములు రావటమునకే నీ విధాయకమని నీమెయొక్క-దాని చావువల్ల నిన్ని గలుగనున్నవే యను నభిప్రాయము. ముందు తాను నందఱకు తత్త్వోపదేశము చేయువాడు, తన్నేమైన లోకు లనుకుందురేమోయని దుఃఖము లేనివానివలె మాటలాడుచు చావు మానవులకు తగదు. అందులో స్త్రీలు ముందు చావటము, పురుషుడు మిగలటము ధర్మవిరుద్ధమని ప్రజ్ఞావాదము చేసెను.

చచ్చితే నిరువురు చావవలె, బ్రతికితే నిరువురు బ్రతుకవలె. అయినా వివాహమే యనవసరము, సంసారమే బంధకారణము. ఈలాటి దాంపత్యవిఘాతము గల్గుటకు ముందే నొంటరిగా నచ్చటనైన భిక్ష మెత్తుకొని జీవించుచుండిన నీ దుఃఖము రాజాలదుకదా యన జొచ్చెను.

ఇట్టివే లోకమునకు జ్ఞాపకార్థము తెలిపెద. క్రొత్తగా నత్తింటికివెళ్లు నాడ పడచునకు నీ దురవస్థయే గల్గును. తల్లి పినతండ్రితో సుఖముగా కాపురము చేయుచుండ తండ్రి తల్లిని వధించమన్నప్పుడు తనయునకు నిట్టి స్థితియే గల్గును. ఇట్టివనేకములు గల్గుచుండును. ఇవి హృదయమునందు బుట్టినవైతే మొదలే వివాహము లేకుండెడిది. నా భార్యయనే మమకారము, నేను భర్తననే కర్తృత్వమోహమునుండి నీ ధర్మజ్ఞానము గలిగినది. అర్జునుని స్థితి యట్టిదే, అతనివాదము నీ రీతిదే. ఈలాంటివి ప్రపంచమున తఱచుగా గలుగుచుండుట జీవితములో జూచుచున్నాము. కాని అది యథార్థజ్ఞానము కాదు, అది భ్రమాజ్ఞానము. అట్టిసమయముననే భగవంతు డర్జునునకు గీత నుపదేశించెను.

ప్ర॥ ఇందు కేనా ప్రథమాధ్యాయము విషాదయోగమనబడినది. ఈ యోగముయొక్క ప్రయోజనము, లేదా? తాత్పర్యము సంగ్రహముగా జెప్పి యావల కృష్ణు డేమొనరించెనో వచింపుడు.

ఉ॥ విషాదమన దుఃఖము. దుఃఖమన నాబాలగోపాల మందఱకు దెలియును. కన్నుల నీరువెట్టి గట్టిగ నేడ్వడము, అరచటము. అయితే నీ దుఃఖములు తాను వలచినది పొందుటకునై వెలియాలియేడ్పు, నాటవస్తువులకో మఱేవస్తువులకో బాలుర యేడ్పు, కామికులై భరింపలేని యేడుపు, బ్రతుకలేని యేడ్పు, నిర్బంధితులైనపుడు గల్గునేడ్పు, సోమరిగా నుండక పోలిమను యేడ్పు, రోగబాధతోటి యేడ్పు, యీలాగు నవసరములబట్టి యనేకములుగలవు. అయితే నీ దుఃఖము లెందుకు గల్గినవి? తలచినదానిని సాధించుటకు మాత్రము సాధనములైనవి, నిరుపయోగమనరాదు. కాని చారిత్రకముగ వీనికి యోగమనే యన్వర్థనామములేదు. అథవా అర్జునుని దుఃఖము యోగమనిపించుకొన్నట్లు తక్కినవారి దుఃఖము లనిపించుకొనలేదు. అట్లుంటే గీతకు ముందుగాని, వెనుకగాని దుఃఖించినవారల దుఃఖయోగములు గానిపింపకపోవునా? లేదు. గొప్పవాడేడ్చితే యోగమనెదరందమా? అర్జునునికంటే నెందఱో గొప్పవారు యేడ్చినారు, యేడ్చుచున్నారు, యేడ్వగలరు. కాని వేరు గొప్పలో, బలాదుల గొప్పలో లేదు. విషయము హృదయమునుబట్టి యుంటుంది.

ప్ర॥ రోగమనిపించుకొనే విషాదమెద్ది?

ఉ॥ పురుషుడుగాని, స్త్రీగాని ప్రతియొకవ్యక్తికి స్వధర్మమనునది యొకటుండును. ఆ స్వధర్మాచరణమే కర్తవ్యము. అట్టి కర్తవ్యమును రోత యనిపించెడి యశాంతి హృదయములో బుట్టవలె చూడు. అర్జునుడు క్షత్రియు డతని కర్తవ్యము "సంగ్రామేష్వనివర్తిత్వం ప్రజానాం చైవ పాలనమ్" "అగ్నిదోగరదశ్చైవ శస్త్రపాణిర్ధనాపహః" ఈ రెండు ప్రమాణములు క్షత్రియుల కాతతాయులను సంహరించి ప్రజాపరిపాలనము జేయుట సంగ్రామమున వెనుదిరుగని యుద్ధము నీలాటి తన కర్తవ్యము రోతయనిపించెను. పాపహేతువనిపించి దానిపైన వైరాగ్యము, అనగా త్యాగము గలిగినది. సన్న్యసించు టుత్తమ మనిపించినది. అంతులేని దయ గలిగినది. యుద్ధము చేయవలెనా? మానవలెనా? 'కిం కర్తవ్యం' అని వాపోవుచూ శత్రువులు విడదరని కాని, చూతురని కాని, తనవారేమనుకొందురోయని గాని తోచక ఋజువర్తనమనగా మనస్సులోనున్నది దాచక పుణ్యాకర్మమగు గాండీవమును సైతము వదలి శ్రీకృష్ణుని చరణములపై బడెను. అహంకారము గలవాడు చరణముల బడగలడా? తన కర్తవ్యమును భగవంతుని చేతిలోనుంచి నీవే దిక్కు, నేనేమి చేయవలసినది నీ కెఱుక యని ప్రార్థించినాడంటే యిదియే రోగమనిపించుకొనేది. విను ధర్మసందేహముచే కృష్ణు డతనివాదము నతని మోహము తెలిసికొని వ్యావహారికముగ లౌకికముగ నిట్లనెను. భీష్మాదులగు స్వజనులను గుఱించికదా నీమోహము. అయితే భీష్మాదులు మేము చచ్చెదమేయని యనుకోలేదే? బంధుభావన నీకేల గలిగినది? కాని వారికి గలుగలేదే? వారికి గలిగియుండిన యుద్ధమేల తటస్థించును? లేదు నేను వేయు బాణములవలన వారు బాధనొందుదురందువా! బాధకలుగుననునది తెలిసియేకదా వారు యుద్ధమున నిలచిరి. లేదు వారికి నాయెడ దయాదాక్షిణ్యములు లేకపోయిన నాకేల నుండరాదందువా! ముందే సంజయవిదురులచే నాచే మధ్యవర్తిత్వము జేయించితివికదా! నిన్నెదిరించక నీవు వారివానివనే యుపేక్షవారికున్న నీవు వారి నెదుర్కొన్నగదా నీకు పాపము. "క్షతాత్త్రాయతే" దెబ్బ తప్పించుకొనుటలో స్వధర్మముపయోగింపనిచో, తనకు హానిగలుగునపుడు తాను మొదిరిని మొదుర్కొనుట దోషముకాదు. ఎదుర్కొనుటలో జావవచ్చు,

లేక పారవచ్చు, లేక చంపవచ్చు, నిది నీకర్తవ్యము కాదు. దుర్యోధనాదులంటే సరే. గురువులు పూజ్యులగు ద్రోణభీష్మాదులంటివా! ఆతతాయుల జేరినవారి కాగతిగాక నన్యగతి యెట్లుగలుగును? కొందఱు ధనవంతులతో నిరుపేద యొకడు ప్రయాణ మొనర్చుచుండెను. దారిలో దొంగలు ముట్టడించి కొట్టుచున్నారు. నేను బీదవానిని నన్నేల గొట్టెదరంటే నీవు వీరిలోనుండుటవలన నీకును దప్పవన్నట్లు వారికిలేని మమకారము నీకేల యనెను? కాని యర్జును డంగీకరించెనా! లేదు. మఱియు స్వధర్మమునకంటే భిక్షాటనధర్మము శ్రేష్ఠమని, హింసకంటె నహింసధర్మమని వాదించెను. ఇదియే యోగమనిపించుకొను విషాదము.

అహింసనుగుఱించి, సన్న్యాసులగుఱించి యనెనుగాని అదియే యతని ధర్మమైతే నెందఱెన్ని జ్ఞానములుజెప్పినను వినకుండనుండవలె. ఒకవేళ నట్టివే శ్రేష్ఠమని తలంచి మానినను నీస్వభావము నిన్ను యుద్ధమొనర్పకుండ మానదని భగవంతుడుచెప్పెను. ఎటులనగా, సన్న్యాసమును స్వీకరించినను, భిక్షాటకుడవైనను నెచ్చటజేరితే నచ్చట స్వధర్మమును స్వభావముగా నుపయోగించగలవు. వ్యాపారి వ్యాపారధర్మము, కృషీవలుడు కృషిధర్మము, కార్మికుడు తన ధర్మము, క్షత్రియుడు క్షత్రియధర్మములిత్యాదులు. చిన్న కుటీరము నిర్మించుకొనుటయందు దానియందు జీవితము జరుపుకొనుటయందు తప్పని వారి వారి ధర్మములే నుపయోగింపగలరు. అప్పుడెక్కడుండినను సంసారము స్వధర్మము వెన్నంటివచ్చును. ఎందఱినో జూచుచున్నాము. జడభరతునికథ యొక్కటిచాలు. కావున నర్జునుడు తన స్వధర్మమును మఱచెను. స్వధర్మమును మఱచుట సర్వానర్థదాయకమగును. స్వధర్మమన నాశ్రమధర్మములు, దేశధర్మములు, కాలధర్మములు, శాస్త్రధర్మములు, ఆచారధర్మములు, వర్ణధర్మములు, ప్రకృతిధర్మములు, మానవధర్మములు, పురుషస్త్రీధర్మము. పురుషుడంటే నేపురుషుడు. దేహధర్మములని లెక్కలేనన్ని యున్నవి. అట్టిధర్మములకొఱకు నిట్టి తత్త్వోపదేశముచేయుట మనవసరము. స్వధర్మచ్యుతి స్వబుద్ధిగాగలిగి నాలవయాశ్రమము సహజముగా బొంద శాస్త్రము జెప్పుచుండ గృహస్థాశ్రమమునుండి వరుసగా మారినపుడు సన్న్యాసాశ్రమమును జేరవలసినదే. అటువంటప్పుడు యిది తగదనిచెప్పు టేమవసరము?

వైరాగ్యము గల్గినంతనే వివేకమొదవినవాడు లేక వివేకవైరాగ్యము గలిగినంతనే సన్న్యసించుట శ్రేయమంటే వేషము దాల్చుటము కాదు. సన్న్యాసధర్మము ననుష్ఠించుటయితే దానికి కాలమవసరమందమా? కాలమును బోధించక భగవంతుడు స్వరూపమును, స్వధర్మమును ప్రబోధించుటేల? స్వరూపమునందే వికాసమునొందుటకు స్వేచ్ఛ, స్వతంత్రత, శాంతము, సుఖము, విలాసవంతమగునుగాని స్వధర్మమన్న వేరర్థము జేయు టనుచితమనిపించును. అయితే వివేకవైరాగ్యములు గలుగనిది యదృష్టము ఫలింపనిచో ధర్మమూర్తియగు నచ్యుతుని కరుణబడయుటము ఋజువర్తనము గలగటము నహంకారము తన పుణ్యకర్మను సైతము వదలనిది పరధర్మము శ్రేయమనిపించదు. అర్జునుని విషాదము యోగమనిపించుకున్నది. అతని యావేదన విషాదయోగమున 46-47 శ్లోకముల శోకాకులితుడై నేడ్చుచు సాంఖ్యయోగమున 7-8-9 శ్లోకముల తనస్థితినంత జెప్పుకొని తాను తన శరీరాంగముల సర్వము భగవంతున కర్పించుకొని నేను యుద్ధమొనర్పనని యూరకుండెను.

నీయాజ్ఞ నీవేమొనర్చినను నేకాదనను, తల్లివి దండ్రివి గురుడవు దైవమవు "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ, తస్మాత్కారుణ్యభావేన రక్ష రక్ష జనార్దన" అని శిష్యభావనతో నుండెను. బంధుభావనకు స్వస్తిజెప్పెను.

ప్రథమాధ్యాయము గీతకు నధికారిని నిర్ణయించునది. అనుబంధ చతుష్టయమునుబట్టి యధికారికావలెను. వ్యావహారికముగగాని, పారమార్థికముగగాని అధికారికానివాడు నేవిద్యకైన నసమర్థుడు. లాయక లేనివానికి నుద్యోగము నివ్వరు. స్త్రీకి పురుషుడు, పురుషునకు స్త్రీ తగనిచో వివాహము జేయరు. గురువునకు శిష్యుడు, శిష్యునకు గురువు తగినవారుండవలెను. గ్రుడ్డిగురువు, చెవిటిశిష్యుడు పనికిరారు. చెప్పకనే గ్రహించువాడు శిష్యుడు. చెప్పగలిగిన గురువులే లోకమునకు నాదర్శప్రాయులయ్యెదరు.

ప్ర॥ అధికారి నిర్ణయము లేదా తారతమ్యమంటి రదిమెట్లు?

ఉ॥ ఇయ్యది గొప్పరహస్యము. గీతయెన్నడో చెప్పబడినదనికాదు. కృష్ణార్జునులెప్పుడో పోయినారనికాదు. భారతపాత్రలగు ధృతరాష్ట్ర

దుర్యోధన, పాండవులు పోయిరనికాదు. అసలు విషయము సనాతనమన నెప్పటికని యర్థము. సనాతనవేదాంతమగు గీత, గీతాచార్యుడు, నర్జునాదు లెప్పటికి యున్నారు. ఏవ్యూరులోనో మరెందోకాదు. సకలమానవులలో కలిసే యున్నారు. ప్రథమశ్లోకమున 'ధృతరాష్ట్ర ఉవాచ' యని యున్నది. ఆహా! కృష్ణవ్యాసులు ప్రప్రథమముననే గ్రుడ్డివానిని గీతవంటితత్వశాస్త్రము నకు ముందుంచినారంటే సమదృష్టిని సనాతనధర్మదృష్టిని మదిలో నుంచు కొనియే యుంచినారు. మనమేదైన ధర్మమునుగాని, మతేదైన వినిపించే టప్పుడు చెవిటివాండ్రను, గ్రుడ్డివాండ్రను, ముదుసళ్లను దగ్గరకూర్చుండ బెట్టుకొని చెప్పుటలేదా? వయసుపెద్ద యంధుడగు నాతని ముందుంచిరి. ఇదిరొక యర్థము.

ధృతరాష్ట్రునివంటివారన గ్రుడ్డివంటి యజ్ఞానము, లోభత్వము, అభిమానము, అరాచకము, క్రూరము, దురభిమానము గలవారని, యటు వంటివారికే దొలుతగౌరవమిచ్చి గీతనువినిపించితే నా గ్రుడ్డితనమువంటి యజ్ఞానము తొలగి బాగుపడి యనేకులను బాగుచేయగలరని యొకయుద్దే శ్యము. ఒకవేళ నెంతవిన్నను తమలో మార్పుగలుగనిచో 'ధృత' ధరింప బడిన 'రాష్ట్ర' చెడుగు లనేకముగల ధృతరాష్ట్రులేనని తెలియుటకు మొదట నుంచడమైనది. గీతాజ్ఞానము గీతాధర్మము నాకలింపుజేసుకొను యోగ్యతలేదని తెలియుటకుగూడ నుంచటమైనది. అర్జునునివంటి సరళ వర్తనముగల్లవారలు నర్జునులే. వారు విజయము నొందగలరని నిరూ పించును. అంధులతోగూడినది రోగము, సరళముతోగూడినది యోగము. అర్జునుడేచ్చితే యోగమైనది. ధృతరాష్ట్రుడేచ్చితే రోగమైనది. హాస్తినా పురముననుండి ధృతరాష్ట్రుడు, యుద్ధమున నర్జునుడు గీతనువినిరి. భయం కరమైన అంత్యనిశ్చయములో మృత్యుపిలుపుసమయమగు యుద్ధరంగ మెక్కడ? గీతనర్జునుడు వినటమెక్కడ? నెమ్మదిగా గురువుచెంత గూర్చొని శ్రద్ధాభక్తుల పెక్కుకాలము శ్రవణముజేసితేగాని తెలియరాని విజ్ఞాన మును అర్జునుడు బడసెనన నెంతటి యుద్ధయోధుడో, ఆర్జితజ్ఞానయో ధుడో సవ్యసాచినామము నన్వర్థపఱచుకొ గలిగెను. మోక్షసన్న్యాసయోగ మున నజ్ఞానమునగలిగిన నీ మోహము తొలగినదా? అని కృష్ణు డర్జును నడుగ, తొలగినదనియు నందుకు ఫలము నాకాత్మస్మృతి గలిగెననెను.

ప్ర॥ ఆత్మస్మృతియంటే నేమిటి?

ఉ॥ దేహామేనేనను మోహాము, నేను నావారలను మోహాము, పాపము పుణ్యము సుఖదుఃఖములను ద్వంద్వమోహాములు తొలగి దేహేంద్రియములు నేను గాదు. వీనికి విలక్షణమై దృశ్యములును అచేతనములగు వీనిని దెలిసికొనెడి ద్రష్టనగు నాత్మననే యెన్నడో మఱచిన తన స్వరూప మిపుడు జ్ఞాపకమునకు వచ్చినదనెను. ఆత్మజ్ఞానము గలుగక మునుపు స్వజనుల జంపుట పాపమని వైరాగ్యమును జూపెను. ధృతరాష్ట్రునకు వైరాగ్యముగాని, త్యాగముగాని కలుగకపోవుటచే గీతనువిన్నను నపరోక్షజ్ఞానము గలుగనందున సంశయరహితుడు గాకపోయెను. నిరంతర దుఃఖరోగగ్రస్తుడయ్యెను. అందువలన గీతకు నుపక్రమోపసంహారముల నధికారి నిర్ణయించుటకే ప్రథమాధ్యాయము ప్రస్తావన, లేక యావతారిక, లేక భూమిక యనగలిగినది. ఎందుకై శ్రీకృష్ణుడుపదేశింపవలసివచ్చినదని తెలియుటకు ధృతరాష్ట్రునివంటి యజ్ఞానులు త్యాగముచేయలేకపోతే సంశయము తొలగకపోతే ననర్హులు గీతకని వేదవ్యాసులు వీరిరువుర నాటకమునకు నటీనటులవలె నాందిలో నిరువురు దుఃఖితులే అయితే నెవరి దుఃఖము త్యాగముగల్గించి విజయమును బడయుటకు సంశయరహితులగుదురో లోకము నిర్ణయించుకొని తమకర్తవ్యము నర్జుననివలెనగుటయా లేక ధృతరాష్ట్రునివలె నగుటయా? నిశ్చయించుకొన నుంచిరి. ధృతరాష్ట్రునకు సంశయము తీరి త్యాగమే గలిగియుంటే యుద్ధమేలజేయునిచ్చు? పిదప దుఃఖముతో నితరుల వంచనబడి చావలసిన దేలవచ్చు? గీతాదైవాసుర సంపద్విభాగయోగముననే మానవులలో రెండుస్వభావముల జూపించుటేల? ఒకటి ధృతరాష్ట్రునివంటి యాసురీ, ఒకటి పాండవులవంటి దైవీ యని గమనించుటకే. జాతి, మత, విద్య, ధన, దేశ, కాల, బంధు, హిత, వేషభాషల నాయురారోగ్యవంతులై దంభదర్పముగలవారై నను పైన జెప్పినవానియందలి యభిమానాహంకారములవదలి యర్జుననివలె శ్రీకృష్ణునకు గీతామాతకు దాసోహమననిచో దేశక్షేమము, ప్రాంత్యక్షేమము, గ్రామ, గృహ, యాత్మక్షేమము బడయలేనివారై యెంత విన్నను, నెంత చదివినను, ధృతరాష్ట్రునిసములని ప్రథమాధ్యాయము వివరించుచున్నది. అనగా వినుట, చదువుట, చేధరింప నందరర్హులేగాని విని

సంశయము వదలనిచో, త్యాగములేనిచో, సర్వస్వతంత్రులు స్వేచ్ఛాచారులు గారు. శాంతిలేదు. సుఖములేదు. మఱి యాత్మక్షేమము కాదని యర్థము. స్వధర్మమునకు ప్రతిబంధకమగు మోహానివృత్తి నొనరించుట కర్యే గీత బుట్టినది. గీతోద్దేశ్యము భగవదిచ్ఛ. వెలుగుతోచుట చీకటి బాపుటకొఱకే. తనయులుగలుగుట గతులకొఱకే. మిత్రుడు తనక్షేమము కొఱకే. గీతపుట్టుక మోహానివృత్తికే. ఒకమాట! ఏమి తెలియకపోవుటచే నట్టి యనర్థకమర్జునునకు వాటిల్లినది. ఏది తెలిసి యనర్థకము నివారణమైనది. ఇవి రెండే యుపక్రమోపసంహారములు. తానవరైనది తెలియనందున నాకేమి దోచలేదు. నాకేమి తెలియదని యర్జును డొప్పుకొనెను. తెలియనితనమే మోహమునకు కారణము, నదియే అవిద్య. "న విద్యతే ఇతి అవిద్యా" ఏదిలేదో నది అవిద్య లేదా విద్యచేత బాధింపబడునది యవిద్య. ఇక భగవంతుడు జేయవలసినదేమి? అవిద్యను తొలగించే విద్యనుపదేశము చేయుటయే తన కర్తవ్యమనుకొనెను. గీతనంతయు విన్నమీదట మోహము తొలగినదా? అంటే, తొలగినది; ప్రయోజనమగు నాకాత్మ జ్ఞానము గలిగినదనెను. దయ్యము సోకితే, సోకిన మనిషినిగాదు వదలించవలసినది. పట్టిన దయ్యమును మాంత్రికుడు వదలించును. ఆలాగు దయ్యమువంటి యవిద్యామోహమును వదలించెను భగవంతుడు. గీతయొక్క యాద్యంతముల నరసిజూడ మోహనిరసనమే గీతవలని ప్రయోజనమని తెలియును.

ప్ర॥ అర్జునునివలె నేడ్చినవారున్నారే?

ఉ॥ ఎవరు, ఎప్పుడు, ఎక్కడ?

ప్ర॥ భాగవతమున గోవృషభరూపులగు ధర్మభూదేవతలు, పరీక్షిత్తు, దేవహూతి, గజేంద్రుడు, ధ్రువుడు, ప్రాచీనబర్హి, యోగవాసిష్ఠమున రామచంద్రుడు మొదలగువారు. అయితే నర్జునుని సమయము, స్థలము, నుపద్రష్టయగు పరమాత్మ వేఱు, వారి విషయములు వేరంటారా?

ఉ॥ ఔనౌను! వారిదుఃఖము అర్జునునిదుఃఖమువంటిది కాదనను కాని తారతమ్యము లేనిదే యోగమనిపించుకోదు. యోగముగా తయారు గాగల దుఃఖమునకు లక్షణములు నెవనియందుంటే వాడర్జునుడై వాని

యేదుపు రోగముగానుండును. ఇదియేరహస్యము. అటువంటివాడే గీత కర్హుడు. అర్జునునివలె స్వరూప, స్వధర్మ, స్వకర్మ, స్వభావములను తెలిసికొని జననమరణరూపసంసారదుఃఖనివృత్తియనగా తన్ను తెలియని యనర్థనివృత్తిజేసుకొనుటయే కర్తవ్యమని తెలిసికొనును.

ప్ర॥ స్వరూప, స్వధర్మ, స్వకర్మ, స్వభావముల యర్థమేమి?

ఉ॥ వీనివివరణయే ద్వితీయాధ్యాయమున శ్లో॥ 11 నుండి 18 అధ్యాయములుగానైనది. అయినను క్లుప్తముగ జెప్పెద విను. స్వరూపమన దృశ్యములగు త్రిదేహ త్రిదవస్థలు, త్రికాలములు, నింద్రియప్రాణాదులగు జడముల దెలియు ద్రష్టయగు నాత్మ. స్వధర్మమన్న అన్వయవ్యతిరేకముల పిండాండ బ్రహ్మాండములగల చైతన్యముల యభేదమును అవస్థల వ్యతిరేకించు పిండబ్రహ్మాండములకంటె ననుస్యూతమైన యన్వయుండొక్కడే వ్యాపకబ్రహ్మమని భావించుట. స్వకర్మమన భేదమును గలిగించు నామరూపములకు కారణమగు నవిద్యను బాధించుటకు జ్ఞానప్రాప్తికయ్యే బహిరంగ యంతరంగసాధనలు. స్వభావమన సత్తు, చిత్తు, ఆనందములే లేక జ్ఞానమే స్వభావమని తెలియటము.

ప్ర॥ రోగముగ మారగల దుఃఖలక్షణముల మరొకమాటు జెప్పుడు.

ఉ॥ బాల్యమునుండి లౌకికమున నైతికధర్మము, సాంఘికధర్మముల శాస్త్రనియమము ననుసరించి యాచరించుట; సూక్ష్మశరీరము లేక నంతఃకరణమున వాసనలుగానుండు మలవిక్షేపావరణములను త్రిపుటిలో మల దోషము పూర్తిగా నివర్తికాబడి విక్షేపము కొంతతొలగియుండుట; వేదకృప, దైవకృప, గురుకృప, మనోకృప, ఋషుల యాశీర్వాదముగలిగియుండుట; పూర్వజన్మ సుకృతము కలసివచ్చుట; గర్భజన్మజరామరణ దుఃఖములన్న వెఱచుట; అహంకారమువదలి తనకుపదేశించువారికి నాత్మార్పణ మొనరించుకొనుట; ఆస్తికత్వము, తలిదండ్రి దేవతార్చనల జేయుట. త్రివిధత్యాగములు గలవారెవరైనసరే నర్జునునివలె ప్రథమ శ్రేణిలో నీ లోకమనే పాఠశాలలో నుత్తీర్ణులగుదురు. కిరీటికిరుప్రక్కల నిలచిన స్వజనాళి యేమందురను సిగ్గునువదలి మన కండలకు తన ఋజు

వర్తనము ననగా సరళత్వము, భగవంతునకు నెట్టి నమ్రత్వముతో తన సర్వ కర్తృత్వము నాయనకు నర్పించెను. ఇదియే యోగరూపముగా మారగల దుఃఖలక్షణములు. తన రథమున దేవదేవుని సారథిగానుంచుకొని, పుణ్య కర్మమను గాండీవమును ధరించి, గౌరవమను దేవదత్తమను కిరీటమును దాల్చి, తొలి యగ్నిదత్తమైన దేహమను రథమున నింద్రియములనే గుఱ్ఱముల పగ్గముల తాను రథమున గూర్చొనక మునుపే కృష్ణునిచేతిలో నిడి కృష్ణునికి తన్నర్పించుకొని యన్నింటియందుగల యనురాగమను పూల మాలగా కృష్ణునిమెడలోవైచి, రథమందు ముందుకృష్ణుడు, వెనుక తాను నుండి, కురుక్షేత్ర సంగ్రామమున విజయము సాధించుకొనెను. తన పేరు కృష్ణుడే. నరనారాయణులు పేరులు వేఱు. ఆత్మయొక్కటియే. నరుడే నారాయణుడు. ఇద్దరు కృష్ణులుండరాదు. తాను కృష్ణునందునేకీభవించెను. అద్వైతామృతమగు గీతాప్రభావము "ఏకమేవాద్వితీయం" ద్వైతము లేదు. భ్రమాజ్ఞానములోనే నానాత్వద్వైతము. ప్రమాజ్ఞానమున సర్వము కృష్ణుడే. కృష్ణుడే నర్జునుడు. నీవు నేను నర్జుననివలె సకల భూతాంతర్యామియగు శ్రీకృష్ణభగవంతునియందు ననన్యభక్తిగలిగి మన కర్తృత్వములన్నియు నాయనయందుంచి మనోవాక్కాయముల జీవించుట కొనర్చు కర్మల నైతము నాయనకర్పించినవారమై శల్యునివంటిబుద్ధి సారథ్యమును వదలించి జీవిత సంగ్రామమున జయమొనరించుటకు నాపార్థసారథినే సారథిగానుంచుకొనినచో నలలవంటి ప్రవృత్తులలో, కలలవంటి వెనుకముందరలలో, లేక స్వజనాళిలో, మెఱుపువంటి నాయుస్సులో, పిడుగువంటి మృత్యువులో, సుడులవంటి వ్యవహారములో, చీకటివంటి బాటలో, మోహమువంటి బంధములో, నహంకారమువంటి మబ్బులలోనుండి తప్పుకొనుటకు చక్కగా రథమును నడిపింపగలడు.ఆయన సారథ్యముచేతనేకదా ధనంజయుడు జయమును బడసెను! సత్యము. మనకాయనదూరములో నున్నాడనుట గొప్పపొరబాటు. అంతరంగముననే నవిద్యాహంకారములనే తెరల మఱుగున నున్న వాడు. స్వరూప స్వధర్మముల నెఱుగదలచితిమేని మోహానివృత్తికావలె. అందుకు భగవత్కృపబడయవలె. గురు శిష్య సంవాదరూపంబుననున్న గీతార్థము నాద్యంతమువింటే నాచరణలో నుంచుటకు నాజగన్నాటకుని సహాయమవసరము. ఆయనను ప్రార్థించ

టము యెట్లు. సంసారమును తరింపగల యావేదన మన కర్తవ్యము. మనల రక్షించడము ఆయన కర్తవ్యము. నమ్మకములేదా? ధృతరాష్ట్రాదుల గతియే. నమ్మకమున్నదియా! అర్జునుని గతియే సిద్ధము.

ఇతి శ్రీమద్భగవద్గీతానూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
అర్జునవిషాదయోగో నామ
ప్రథమోఽధ్యాయః

ఓం తత్ సత్



శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## ద్వితీయాధ్యాయము

### సాంఖ్యయోగము - త్వంపదార్థవిచారణ

శా॥ జ్ఞానాగ్నిన్ జెను మోహకారణము యజ్ఞానంబుగాలన్ స్వతే
జానూనాథయతన్ ద్వయాదిభవదోషంబుల్ నివర్తిల్ల వి
జ్ఞానాఖండత నొందు దోపక మహిం గాన్పించు గీతామృతా
పానానందుఁడు కృష్ణుఁడే గద స్థితప్రజ్ఞన్ బుధుల్ నెన్నగా॥

ప్ర॥ విషాదయోగమున లేక గీతాప్రారంభమున నిష్టదేవతాప్రార్థన నుంచక వేదవ్యాసులేల నంధుడైన ధృతరాష్ట్రుని యుంచెను? ప్రథమశ్లోక మున కర్థమేమి?

ఉ॥ విషాదయోగముననే కౌంతవఅకు ధృతరాష్ట్రాదుల విషయము జెప్పబడినది. అయినను క్లుప్తముగజెప్పి శ్లోకార్థము వివరించెద. విను వాడు శిష్యుడు. తెలియనిది తెలుపువాడు గురువు. గురువును మించిన శిష్యులుందురు. గురువుజెప్పినను తెలియజాలని బలహీనులగు శిష్యు లుందురు. పరమసత్యమగు పరమగతికి మార్గములగు ప్రస్థానముల నగ్రస్థాన మలంకరించిన గీతమొదట ధృతరాష్ట్రునుంచుట విను. ఒక హాస్పిటల్‌కు వెళ్ళితే తొలుత రోగి మనకు గనుపించును. ఆరోగ్యవంతుడు కనబడడు. పాఠశాలకువెళ్ళితే మొదట నక్షరాభ్యాసకులే కనుపింతురు. చదువువచ్చిన వారు కనుపింపరు. బ్రహ్మవిద్య లేక నధ్యాత్మవిద్య నభ్యసించుటకు నెరు గనివారికే జెప్పబడేది. అయితే శ్రద్ధావంతుడు నాసక్తి, భక్తి, వైరాగ్య ములుగలవాడు వేగముగా తెలిసికొని యుత్తీర్ణుడు కాగలడు. కొందఅకు మందువల వ్యాధినయమైతే వెళ్ళెదరు. కొందఱు చదివివ్యాసైతే స్కూలు నకు పనిలేదు. రోగియు, విద్యావ్యాసుకానివాడు వ్యర్థులైపోయెదరు. అట్లు

ధృతరాష్ట్రునివలెనే బ్రహ్మవిద్యాధికారి యుండరాదని తెలియుటకు మొదటనుంచటమైనది. గురుశిష్యసంవాదరూపంబగు గీతయందు గురుశిష్యుల నిర్ణయము చేయుటయు "త్యజ ధర్మమధర్మం చ" "సర్వధర్మాన్పరిత్యజ్య" యన్నట్లు శిష్యుడు దేవునికంటె నెక్కువగ గురువును భావించి సేవించవలె. "ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేదవిభాగినే" అను ప్రమాణము ననుసరించి గురువునందు, శాస్త్రమునందు నమ్మకముండవలెను. అర్జునునివంటి శిష్యుడుకావలె. "స్వయం తీర్ణః పరాంస్తారయేత్" స్వయముగ సంసారమునుండి తరించినవాడై నితరుల తరింపజేయువాడుగ గురువుండవలె. చెవిటిగుడ్డియు, గ్రుడ్డికాలుగ, కుంటివాడుగ, దారిపోడ వుగ నుండగూడదు. ఇనుపబొక్కెన రాతిభావిగ నుండవలె గురుశిష్యులు. కృష్ణునివంటి గురువుకావలె, మొద్దుశిష్యుడు తగడు. అకతాయిశిష్యుడు స్వార్థగురువు, మంకుశిష్యుడు పెంకెగురువు యొందులకు బనికిరారు. ప్రయోజనము సున్న. కావున గ్రంథమునకు సంబంధము నధికారి యుపసరము. అందుకే నధికారినే ముందుంచబడినది. "ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః" ప్రథమశ్లోకము. "క్షీయతే ఇతి క్షేత్రం" "ధరతీతి ధర్మః". సమస్తగుణముల ధరించుట దేహార్థము. సమస్తజీవుల ధరించుట భూమ్యార్థము. "ధర్మస్య ప్రభురచ్యుతః" ధర్మములనే యనేకశాఖలకు వృక్షమూలమువంటివాడని యచ్యుతార్థము. ధర్మి కృష్ణుడు. అతని ధర్మములే వాక్కులగు గీతార్థము. ధర్మములకు క్షేత్రమువంటిదిగీత. లేక ధర్మమే క్షేత్రమువంటిది. దానివలన పుణ్యఫలముల లేదా మోక్షమును బండించుకొనవచ్చును. ధర్మక్షేత్రము హృదయము. భగవద్విభూతులు గల పుణ్యతీర్థములు క్షేత్రములే. ధాన్యముబండునవి క్షేత్రములే. స్త్రీల గర్భమునకు క్షేత్రమే, శరీరమునకు క్షేత్రమే. ఇవియన్నియు క్షేత్రపర్యాయ నామములు. కురువన నన్నము. అన్నముచేత శుక్లశోణితముల పరిణామమై దోచునది దేహమే క్షేత్రము, కురుక్షేత్రము లేక శరీరమున, హృదయ క్షేత్రమున, గురుప్రసాదమున బ్రహ్మబీజములునాట, మోక్షఫలము నొందదగునని మంత్రమయముగ దేహమునొనర్చినట్లు హృదయక్షేత్రమును ధర్మక్షేత్రముగ 'కురు' చేయుమని యొకయర్థము. కురుక్షేత్రమన ప్రపంచము. ధర్మక్షేత్రమన సూక్ష్మములగు వాసనలుగల హృదయ

క్షేత్రము. బహిరంగమున దుర్యోధనపాండవాదులుగలరు. అంతరంగమున కురుపాండవులు గలరు. ఈ యుభయులుగలసి ద్వివిధభూముల నేమిజేసిరి? ఎవరు జయించిరి? అని ప్రశ్న. దీనికి నుత్తరము మోక్షసన్న్యాస యోగమున నంతిమశ్లోకమున జెప్పబడినది.

ప్ర॥ గీత పదునేడధ్యాయములలో కేసారి జెప్పబడెనా?

ఉ॥ లేదు. సాంఖ్యయోగమున 11 శ్లోకమునుండి 72 శ్లోకమువఱకు జెప్పబడెను. చెప్పవలసిన, తెలియవలసిన నద్వితీయ ముఖ్యార్థము నీ యోగమునందే కలదు.

ప్ర॥ అటులైన తక్కిన యధ్యాయములనేల జెప్పవలె?

ఉ॥ మొదట సంక్షిప్తముగ జెప్పి, దానినే యభిప్రాయము ముగియు నందున వివరణ మొనర్చుటములో తక్కిన యధ్యాయములు వ్యాపకమైనవి.

ప్ర॥ ధర్మజాదులు, దుర్యోధనాదులుండ నర్జునున కొక్కనికే గీత జెప్పు టెందులకు?

ఉ॥ వర్షబిందువున కెదురుచూచు ముత్తెపుచిప్పకే వర్షము ప్రాప్తించి నపుడు ముత్తెముగా మారిపోవు నవకాశము తక్కినవానికిలేదు. భగవంతుని తనయొద్ద నుంచుకొనే ప్రాప్తము నా యిరుప్రక్కల సైన్యములో నెవరు నోచుకోలేదు. అదిగాక నర్జుననకు బోధించునపుడు చిన్నగా, రహస్యముగా చెవిలో జెప్పలేదు. మేఘ గంభీరభాషణముల నందఱు విని నామరూపమయ, జగన్మిథ్య, బ్రహ్మసత్యం పెక్కురూపములగు నుపాధుల ననేకాత్మలుగా తోచుచున్నాడు. అందుకు కారణమైన అవిద్యను తొలగించుకుంటే నంతా యభేదమే, నఖండమే, నద్వయమే, నేకైకత్వమే. జనన, మరణ, జాతి, మత, బంధు, మిత్ర, భృత్యాది భేదములన్ని యవిద్యా పరిణామములని ఘంటాపథముగా జెప్పెను. తెలిసినమీదట భేదబుద్ధి తొలగితే యుద్ధానర్థకము తొలగును. ఉభయులు శాంతిపడెదరని యను కొన్నాడుగాని, పూర్వజన్మసంస్కారములేని నా జడబుద్ధు లెంతవిన్నను, యెంత జెప్పినను భగవత్సాన్నిధ్యముగాని, విజయసాధనమగు జ్ఞానము నొందరైరి. ఆ ఫల మొక్కయర్జుననకే లభించినది. భగవంతున కర్జును

డొక్కడే వినవలెనను నుద్దేశ్యములేదు. అట్లైన మరొకరీతి జెప్పియుండును. మనదాక రాకయుండును. ఒకాయన యుపన్యసించుచున్నాడనుకొండి. అప్పుడు కొందఱు నిద్రించుచుందురు, కొందఱు వ్యవహారించుచుందురు, మఱికొందరర్థము దెలియక క్రిందు మీదులు జూచుచుందురు. ఇకను కొందఱావలించటము, కొందఱు నశ్యము, కొందరు బీడీ సిగరెట్లాగచుట్ట, తాంబూలము చాటుమాటున నుపయోగించుచుందురు. కొందఱు లేచియే వెళ్లుదురు. కొందఱు యోగమున నున్నట్లు గుఱకలు వినిపింపవులే యని నిద్రింతురు.

ఉపన్యాసము ముగిసినవెనుక బాగుగ విన్నవారు యేలాంటి యుపన్యాసము! ఎంత సుకృతము! యీ యానందానుభవగమ్యమని యెప్పుడు వినలేదని బొగడుచుండ తక్కినవారేమందురు? ఆయనకు మీయందు ప్రీతి, మీకు నర్థమగులాగు చెప్పెను. మాయందు ప్రీతిలేదు. మాకర్థమయ్యేలాగానందము గలిగించ లేదనెదరు. ఇదెవ్వరి దోషము? చెప్పెడివాని దోషముకాదు. అట్లే ధర్మజ దుర్యోధనాదులకేగాదు; అర్జునుని నిమిత్తముజేసి నఖిలలోకస్థులకు విన జెప్పెను. చెప్పినదే గీత. ఎవ్వరు వినరాదనేది భగవంతునకు లేదు. భగవంతునకే నట్టి యుద్దేశ్యము లేనపుడు గీత నందఱు వినవలసినదే, చదువవలసినదే, వ్రాయవలసినదే, చూడవలసినదే. తండ్రిహక్కు ప్రతిబిడ్డకెట్లు స్వతంత్రమో గీతాహక్కు మనకందఱకుగలదు. తండ్రి హక్కు నిలుపుకోలేనివానిచందమున విన్నను, చదివినను ధృతరాష్ట్ర దుర్యోధనాదుల కెంతో నాలాటివారికంతే నని తెలనిచ్చినపుడు రహస్యము వినుటకు హక్కులేదని నిషేధించుటకు భగవంతునికాదని వచ్చిన యీ తత్వవేత్త యెవడు? ఏ దేశము? ఎందుండిటరాక? ఎటుపోక? తాను యెవరు? ఈ జగమేమిటి? దీనికి నధిష్ఠానమెయ్యది? అని తిలకించినవాని దృష్టి కాదుకాదని తెలియుటకే నర్జునునకు వినగలిగిన యీ యవసరము తటస్థించినది. వేదము, యోగము, భగవానుడు, మోక్షము యీవినాల్గు నిత్యసత్యవస్తువులు. ఒకదానికొకటి పరస్పరము యవిభక్తమే. నైతిక బలము, సాంఘికబలము, ధర్మదైవబలము, స్వబలము క్షీణించినవారలకు 'ఇతో భ్రష్టస్తతో భ్రష్టః' అన్నట్లు సుఖము లేదు, మోక్షము లేదు. రెంటికి తప్పినవారుభయభ్రష్టులు. ఇహలోక పరలోకముల నెందు నిలువ

నీడలేదు. పాండవులవంటివారిలో నర్జునునివంటివానికి నన్నిబలములుగలిగి యిహసుఖము, మోక్షము తప్పక గలుగును. అర్జునునివంటివాడు నర్జునుడే. దుర్యోధనునివంటివాడు దుర్యోధనుడే.

ప్ర॥ మానవుల పుట్టుకలో న్యూనాధికములుగలవా?

ఉ॥ అన్నిమతములు, సకలశాస్త్రములు, వేదములు, తత్త్వవేత్తలు, జగత్తు మాయామయమనిన్ని, నీటిబుగ్గవంటి క్షణికములు దేహములనిన్ని, స్వప్నమువంటిది సంసారమనిన్ని వీనికి భగవంతుడు సాక్షియని 'మయ్యేవ సకలం జాతం' అంతా భగవన్మయమేనని 'సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ' నిర్గుణుడగు దేవుడే సాక్షియనియు, శరీరధారులైన జీవులు తమ తమ కర్మఫలము లవిద్యయందుండి నా యవిద్య మాయలో సర్వము సుషుప్తిలో వలె నుండ భగవదిచ్ఛ. 'ఏకోఽహం బహు స్యామ్' నేను బహురూపులగుదు నన్నంతనే సర్వజీవుల యదృష్టము ఫలించి వారి వారి కర్మానుసారము జన్మములు వచ్చుననుచున్నారు. 'జన్మాంతరకృతం కర్మ భుంజతే జంతవోఽధునా' గత జన్మములందలి కర్మఫలము జీవు లిప్పుడనుభవింతురనుట. అనుభవించుటలో న్యూనాధికము లున్నవిగాని జన్మతః దేహములకు లేదు. స్త్రీలకు బుట్టిన దేహములకు న్యూనాధికము లెక్కడివి? ప్రతివారికి గల సూక్ష్మశరీరమున మలవిక్షేపావరణములను త్రిదోషము లుండును. తద్దోషములవల్లనే జన్మములువచ్చును. త్రిదోషములు లేనిచో లింగదేహము భంగమైనగాని మోక్షము లేదనుటేల? వెనుక బుట్టనీ, ముందు బుట్టనీ, మఱెక్కడన్న బుట్టనీ యీ త్రిదోషములతో దేహధారులై వచ్చినవారు వేషములతో, భాషలతో, నాచారములతో, విద్యలతో నధికులుకారు. ఈ త్రిదోషముల భస్మీపటల మొనర్చుకొన్నవా రెవ్వరైన సరియే స్త్రీలుగాని, పురుషులుగాని యధికులు. జన్మమున కధికులుగారు. జన్మము వచ్చినమీదట తరించుటచే వారు ప్యాసైనారని యర్థము. జీవు డెంతవఱకు తరింపలేదో, జన్మము లెత్తవలసినదే. ఒక స్కూలులో నెక్కువన్నవారు తప్పిపోయి, తక్కువన్నవారు ప్యాసు కావటము, ఉద్యోగముల నుండటము మనము చూచుచున్నాముకదా! ఆంగ్లేయుల పరిపాలన కాలమున నాంగ్లేయులు కానట్టివారెవరైన హైందవులకు నాధిక్యత శూన్యము చూడలేదా? ఆంగ్లేయులధికులా? కాదా? అని విచారించితే నా

పరిపాలనమే స్వస్తి కావలె. కాలేదుగదా! స్వబుద్ధిచే జేసినను తుదకు నాంగ్లేయులు పతనమై నీ దేశమే వదలిపోయినది మనము గనమా! జాతిభ్రష్టత, మతభ్రష్టత, దేశభ్రష్టత, మోక్షభ్రష్టత, శాంతిభ్రష్టతే మిగిలేది. ఇకేది మిగులదు. న్యూనాధికము లెన్నువానికి నహంకార మమకారములకు కారణము మోహము. దానికి కారణ మవిద్య. అవిద్యకు హేతు వజ్ఞానము. అది జ్ఞానముద్వారాగాని మతేదానితో తొలగదు. అసలు జగత్తు అజ్ఞానకార్యము. పిండాండ బ్రహ్మాండముల సమిష్టియే జగత్తు. జ్ఞానముద్వారా తొలగవలసిన దజ్ఞానము. ఇకేదానితో తొలగదు. అజ్ఞానము గలవారెవరధికులుగారు. అందులో నొక రహస్యమున్న దేమిటియన, ఎందువలన న్యూనాధికములు గలిగినవని తమలోగల న్యూనతల బాపుకొని యధికులౌటకేగాని మతేమికాదు.

సమానోద్యోగము, సమానాస్తి, సమానవిద్య, సమానాచారము, సమానప్రజ్ఞ గలవాని యనువారెవరులేరు. భిక్షుగాని నందఱనెదరు. తనంతట జీవించువాని ననువారేరి? ఒకప్పుడు రామకృష్ణపరమహంస హరిజనవాడకేగ నక్కడివారు లేచి కూర్చొనగోరిరి. కూర్చున్న వెనుక చంటిబిడ్డయొకతె పరమహంసగారియెదుట మలమూత్రములు విడువ తల్లి పిల్లను దూషించుచు చీపురు కొనిరాఁబోయేలోపల రామకృష్ణుడు తన తలవెంట్రుకలతో దాని నూడ్చివేసెను. అందఱు కళంకములు దీర్చి యంతా భగవన్మయమేనని మూఢులకు సైతము నభేదత్వమును హరికంటే యన్యములేదని నేర్పెను. అదే రామకృష్ణు డొకప్పుడు కల్లు, సారాయి, భంగు ద్రాగువారికి తక్కిన శిష్యులు వలదన్న నుపదేశించెను. మఱొకప్పుడొక పచ్చిపాపాత్ముడు సురత్రాగివచ్చి నాకుపదేశమిమ్మనెను. ఉపదేశము నొందేవాడు గురువునకు దక్షిణ ఇయ్యవలె; నీవేమి యిచ్చెదవన, నీవేమికోరితే యవి యిస్తాననెను. స్త్రీధన మద్యమాంసాదులేమైన కోరితే నిత్తుననెను. ఇవి నాకువలదు; నీకువలదు. ఇవి మానుకున్నగాని గురుత్వము లభింపదని రామకృష్ణుడన నీవు మహాత్ముడివి. నీ మంత్రమున మహిమమున్న నేను యథాప్రకారము జేయుచుండే పనులు జేయుచుండవలె. నాకు మోక్షము రావలెను. లేకపోతే నీవేంటి గురుడవు? నేనన్ని విడిచిపెట్టితే నికనీవు నా కుపదేశమిచ్చు టేమియనెను. రామకృష్ణుడు నవ్వి

నేనట్లనే మంత్రము నొసగెదగాని నీ గురువునకు నాకు నీవేమిచ్చినట్లనెను. అతడు యోచించుచుండ రామకృష్ణుడు నీవేమి నీయవలదు. మనోవాక్కా-యములజేసే పాపపుణ్యకార్యముల రామకృష్ణగురుకీ జై యనియైన జేయు లేవా? అనెను. అంత నతడు యెగిసి, గంతేసి యింతమాత్రము తప్పక జేస్తానని యుపదేశము నొందివెళ్లెను. అజ్ఞానవుపట్టు, కోతిపిల్లపట్టు, గురు కరుణ ప్రతియొక్కపనిలో రామకృష్ణగురుకీ జై యని జేయుచుండ మూడు వత్సరములకది జపమై, తపమై, వ్రతమై, సిద్ధియై యంతఃకరణమున యుక్తబుద్ధిగలవాడై యొకప్పుడు తనలో తానిట్లు దలపోసెను. ఆహా! నా గురుమూర్తి, నా గురుదేవుడు, గురుస్వామి నేనింత పాపముల నొనర్చు చున్నను తనపై నుంచమని భరించుచున్నాడే. ఆలాంటి కరుణామయు డగు తండ్రికి నేను కృతాపరాధినిగాని శిష్యుడనా? కాను కాను అని వెంటనే యింటనున్న పాపవస్తువుల దగ్ధముజేసి, నా వృత్తులన్ని మాని, తలముండనము జేయించుకొని ఫలపుష్పభరితహస్తుడై రాగా రామకృష్ణు డతడు ఫలానావాడని గ్రహించి నాయనా! సుఖవా? అనెను. కన్నుల నీరురాల్చుచు నీచాత్ముడను, పాపాత్ముడను, నీ కరుణాకటాక్షమున నాకీ తెలివిగలిగినది. నేను ధన్యుడ, రక్షింపుమనెను. రామకృష్ణుడు పట్టుదలగల వారెంతటి పాపాత్ములైనను పరిశుద్ధాత్ములయ్యెదరని గీతా నవమాధ్యా యములోని 30వ శ్లోకార్థము నిదర్శనము జూపించెను. చూచితివా! ఎట్టి పాపాత్ములైనను మహాత్ములాశీర్వాదముగల్గిన పునీతులగుచుండ మీరు పాపాత్ములు బొండని మహాత్ములనగలరా? న్యూనాధికములనెంచు పని యేనా తమ పని? కాదు కాదు. మహాత్ముల లక్షణములు, త్యాగుల లక్షణములు, స్థితప్రజ్ఞుల లక్షణములు, దైవాసురలక్షణములు, శ్రామికుల లక్షణములు యెవరెవరి కెట్టిస్వభావము, యేయాచారము తుదకేగతియంటే గీత ద్వితీయము మొదలు నంత్యమువఱకు జదువ తెలియగలరు. అద్దము నెదుట తమ ముఖము కనరాకపోవునెట్లు? గీత యను నద్దమువంటిది. ప్రతివారి శ్రద్ధాస్వభావముల తుదిగతుల దెలుపుట గీతకు సరి మరేది లేదు.

ఒకరికి దెలిసితే తమగుట్టు బయటపడునేమో యని లోపల నుంచుకొన్న నెవరికి తెలియకపోయిన గీత ప్రతివారిధర్మముల బయట

నుంచగలదు. అద్దముచూచినంతనే తనతీరు కనిపించినట్లు గీతను జూచి నంతనే తమగతుల దెలుపును. అందుకయ్యే ననేకులు గీతను చదువ కుండుటకు, వినకుండుటకు కారణము. చెడ్డరోగములు తెచ్చుకొన్నవా డెవరికి జెప్పలేకపోయినను వైద్యునిముఖమున తెలియబడినట్లు తమతమ మనోవాక్కాయముల నొనరించు స్వభావసిద్ధప్రవృత్తుల దాపక చెప్పును. ఇకనైన పథ్యముండి సిద్ధి బొందమనును. గుట్టు బయటబడిన గౌరవము చెడునని పరీక్షాసమయమున కొందఱు విద్యార్థులు సుస్తియని డాక్టరులకు లంచమిచ్చి తప్పించుకొన్నట్లు, ఏదియో నెపమున తప్పించుకొనే మాటలాడుదురు. డాక్టరు చదివిన జ్ఞానముతో రోగముల నెట్లు గుర్తించునో, సాక్షాద్భగవంతునకు మన స్వభావములు తెలిసియేయుండును. అందువలన గీతలోనే గుణముగలవారికి నాగతియని వచించెను. గీతను చదివితిరా పాండవ దుర్యోధనాదు లెవరైనది, న్యూనాధికు లెవరైనది తెలిసికోగలరు.

ప్ర॥ వేదము లెటనుండి వచ్చినవి?

ఉ॥ భగవంతుని నుండియే పురుషనిశ్వసితమువలె బయలుదేరి వచ్చినవి.

ప్ర॥ వాని యుద్దేశ్యమేమి?

ఉ॥ విషముద్దేశ్యమేమి? తిన్నవారిని చంపుటయే. దీపముద్దేశ్యము చీకటిని తొలగించుటయే. అన్నము నాకలిని, నీరు దప్పిని బాపగలుగుట లేదా? భగవంతునినుండి వచ్చిన దేదియైన భగవత్ప్రాప్తి బొందించుట కయ్యేనని యెఱుగవలెను. భగవంతుని స్వరూపము తెలియుటయు నాయనను బొందు సాధనములై యుండును.

ప్ర॥ ఆలాంటి వేదములందు చెప్పదగిన సాధనము లేవి?

ఉ॥ కర్మ, ఉపాసన, జ్ఞానములను మూడు.

ప్ర॥ ఈ మూటిని యొకేసారి నాచరింపవలెనా? లేక నొక్కొక్కటి యొక్కసారి నాచరింపవలెననియా?

ఉ॥ ఒక స్కూలునందు 4-5 తరగతులుండును. అన్నితరగతు లొకే పరి చదువవలెనా? ఒక్కొక్కటి యొకతూరియా? అని చదివెడివాడే

తెలుసుకొనును. మూడొకేతూరి నాచరింపలేరు. ఒక్కొక్కటిగా పరంపరసంబంధములు.

ప్ర॥ ఒక్కొక్కరన్నిసాధించవలెనా? లేక యొకటియే చాలునా?

ఉ॥ అది వారి వారి పూర్వజన్మసుకృతము ననుసరించి, వారి ప్రయత్నమునుబట్టి యుండును. ఒకరికి భక్తి, మఱొకరికి కర్మ, వేఱొకరికి జ్ఞానము మూడొకడే చేయవలసియుండును. హృదయపరివర్తననుబట్టి యుండును. అగ్ని చేసేపని యగ్ని, నీరు జేసేపని నీరువలె యొక్కొక్కటి తమ కర్తవ్యము నిర్వహించునవియే.

ప్ర॥ గీతయందు నీ సాధనములు గలవా?

ఉ॥ వేదములు సంస్కృతవాఙ్మయములు. అర్థము జటిలము. భగవంతుడే వేదసారమునే జెప్పెను, చెప్పుటయే గీత. అందువలన వేదార్థము, గీతార్థము రెండు నొకటియే. వేదముల సులభముగ తెలియనిది గీత తెలియజేయును.

ప్ర॥ భగవంతుని యపరస్వరూపమై గీతయుండ, కొందఱేల వేదములను, సాంప్రదాయిక గ్రంథములను విశ్వసించినట్లు గీతయందు విశ్వాసము లేకుందురు?

ఉ॥ విద్యాభిమానము, సాంప్రదాయాభిమానములు రెండింటితో వేదములలేని గుణకర్మస్వభావముల విపులీకరించి బయటబెట్టుటలో గీత ప్రధానమైనది. భవిష్యద్విషయములగూడ సెఱిగించు దివ్యమహిమగలది. అందుకై విశ్వసింపరు. కాని ఒకతూరి నాద్యంతముల చదివినారా తేనెలోబడ్డ యీగలే, పుష్పముల జొచ్చిన తుమ్మెదలే యయ్యెదరు. పంచమవేద మనబరిగిన భారతమధ్యమున ప్రచండదివాకరుని చందమున యమరజ్యోతియై ప్రకాశించు గీతను వ్రాసినవాడు భారతమును, వేదమును విభాగించిన యపరనారాయణుడగు వేదవ్యాసమహాసీంద్రుడే.

ప్ర॥ సాంప్రదాయకగ్రంథములంటివి యందు ప్రధానములైనవేవి?

ఉ॥ విశిష్టాద్వైతము, స్వతంత్రాస్వతంత్రము, శుద్ధాద్వైతము, ద్వైతాద్వైతము, అచింత్యభేదాభేదవాదము, భేదాభేదవాదము, సమన్వయవాదము, శివాద్వైతము, గాణపత్య, చార్వాక మొదలైనవి.

ప్ర॥ ఉపనిషత్తులెన్ని?

ఉ॥ 1180. ఇందులో 108 ముఖ్యము, లందులోను 10 ఉపనిషత్తులు ప్రశస్తములు.

ప్ర॥ గీతాకాలమునగల న్యాయప్రస్థానములెన్ని?

ఉ॥ న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, పూర్వమీమాంస, ఉత్తరమీమాంసలు.

ప్ర॥ వీని యన్నిటి యన్వయము గీతయందుగలదా?

ఉ॥ వేదములుపనిషత్తులు, షడ్దర్శనములు పురాణములు స్మృతుల సారమే గీత. కావుననే 'కిమన్యైః శాస్త్రవిస్తరైః' అన్నది ప్రమాణము. స్థాలీపులాకన్యాయముగ గీత నొకటిదానివల్ల ప్రస్థానములన్నిటి తాత్పర్యము బడయువచ్చును.

ప్ర॥ అయితే నర్జునునివలె సరళత్వవిరాగత్వములు గలుగనిదే, గీతను మొదలే ప్రయత్నించి తెలియుటేల?

ఉ॥ ప్రాప్తమనునది ముందు జేసితేగాని యిప్పుడు గలుగదు. ఇప్పుడు జేసితే వెనుక గలుగును. జేయకనే యేదియు లభింపదు. ముందు చదివితే వెనుక ప్యాసైన గుర్తు సర్టిఫికెట్టు లభించును. వ్యాపారముగాని, కృషిగాని, కర్మగాని, మరేయుద్యోగముగాని చేసితేనే వెనుక స్వర్గనరకములు బంధమోక్షములు చేయనిదే ప్రాప్తించవు. ముందొనరించిన కర్మఫలమే నీ జన్మము. అర్జునుని నిమిత్తముజేసి చెప్పిన గీతగాని, దేవాలయములుగాని, శాస్త్రములుగాని మనకొఱకే ననగా మానవులకొఱకే నిమిత్తములు భగవత్ప్రాప్తికొఱకు.

ప్ర॥ అర్జునునివంటివారికే యర్హతయున్న నాలాంటి దుఃఖమురానిది యేమి చేయవలె?

ఉ॥ అర్జునుడు దేనిని తెలియక దుఃఖించి, దేని నచ్యుతునివలన దెలిసి దుఃఖనివారకుడయ్యెనో, మనము చదివి తెలిసికొని, అలాంటి దుఃఖము గలుగనందుకు మన హృదయమునగల దోషముల నివృత్తిజేసికొని శాస్త్రార్థము జీర్ణింప జేసుకొనే చింత, దుఃఖమంటే కూలికి నేడ్చే యేడుపు. అభిమానముతో విషయములకై నేడ్చేపిల్లలవంటి యేడ్పుకాదు. యోగ మనిపించుకో లేకపోయినా యావేదన గలిగితే చాలు.

ప్ర॥ సాంఖ్యమంటే నేమి?

ఉ॥ 'సమ్యక్ ఖ్యాయతే ప్రకాశ్యతే పరమార్థతత్వం అనయా ఇతి సంఖ్యా' పరమార్థతత్వము చక్కగ తెలుపునది జ్ఞానముచేత ప్రకాశిత మొనర్పబడు నాత్మతత్వమును సాంఖ్యమందురు. 'శుద్ధాత్మతత్వవిజ్ఞానం సాంఖ్యమిత్యభిధీయతే' శుద్ధమైన యాత్మతత్వమును వివరించునది.

ప్ర॥ 25 తత్వములద్వారా నాత్మను దెలుపునది సాంఖ్యముగాదా?

ఉ॥ అవును. 25-26-36-96 తత్వముల దెల్పు సాంఖ్యములున్నవి. అవి భూతములవలన నాకారము లేర్పడిన విధానమును అనగా సృష్టిని గురించి తెలుపును. ఇయ్యది త్వంపదార్థశోధన నాత్మానాత్మల విచారము మాత్రమే తెలుపును.

ప్ర॥ అర్జునునకు సన్న్యాసమే సమ్మతమైనపుడు దానినే బోధింపక యుద్ధమొనర్ప జెప్పుటేల?

ఉ॥ పరమాత్మ యుద్ధమొనర్ప జెప్పలేదు, స్వధర్మమును వదలమన లేదు, సన్న్యాసివి కావద్దనలేదు. సన్న్యాసము సాంఖ్యము 'న్యాస ఇతి బ్రహ్మ బ్రహ్మా హి పరః' సన్న్యాసమే బ్రహ్మము. 'ఆత్మలాభాన్న పరం విద్యతే' ఆత్మతత్వమును బోధించి, యతనికిగల మోహానివృత్తిజేసి యిక నీయిష్టమనెను. అతను అంటే దేహముకాదు, జీవుడు. జీవునకుగల మోహకారణము తొలగించుటయే నాయన కర్తవ్యము, గీతాశయము. తల్లిబిడ్డల స్వతంత్రుల జేయుటయే నాయమ స్వధర్మము. ఉపాధ్యాయులు బాలబాలికల విజ్ఞానుల జేయుటయే వారి ధర్మము. డాక్టరు మందువేసి యనారోగ్యముబాపుటే యతని విధి. కాని యావల ప్రవర్తించుట వారి వారి కౌశల్యమే కర్తవ్యమునకు మంచి చెడ్డకు.

ప్ర॥ అయితే జగత్తు దేని కార్యము?

ఉ॥ మాయ లేక యజ్ఞానకార్యము లేదా మాయాపరిణామము.

ప్ర॥ మాయయంటే నేమి? దాని స్వభావమేమి?

ఉ॥ 'యా మాయా సా మాయా' వ్యవహారస్థితిలో భావరూపమై, యనాదియై, సర్వప్రపంచకారణమై గానవచ్చుచుండియు పారమార్థికమున శూన్యరూపమగుటయే సాపేక్షిక్రియారూపమైనది. అచింత్యాద్భుతశక్తి

గలదైనను, యుక్తిచేత సంహరింపబడునది యనిర్వాచనీయమైనది. సత్తుగా దసత్తుకాదు, సదసద్విలక్షణము. సావయవముగాదు, నిరవయవముకాదు. అది స్వతంత్రము, నస్వతంత్రము, సాంతము. జ్ఞానులదృష్టిలో లేనిది. అంధకారము తన సిద్ధికొఱకు సూర్యాదిప్రకాశముల నపేక్ష జేయదో, యట్లు యే వస్తువులు తన సిద్ధియం జేయుటకు ప్రమాణము నపేక్షింపక సర్వకార్యముల బుట్టించునో, నా వస్తువునకు మాయయని పేరు. ఇంద్రజాలికుని మాయయందు రెండు స్వభావములుగలవు. ఒకటి మిథ్యాపదార్థము గల్పించుట, మఱొకటి యొక పదార్థము నానాప్రకారముగ జూపుట. అట్లు ద్వివిధ స్వభావములుగల యీ మాయ లేనిదై నిర్గుణపరమాత్మ యొకటైయుండ ననేకముగా జూపుట, మిథ్యాభూతమగు జగత్తును నిజముగా జూపుట నిదియే దీని స్వభావము.

ప్ర॥ దృష్టాంతముల జెప్పుడి.

ఉ॥ అడిగో నది చక్కెర. దానియందు మందేమియు కనిపింపలేదుకదా? దానిని చిలుకలుగాను, మఱికొన్ని రూపముల రంగులువేసి చూపింతుము. ఇప్పుడీచిలుకలు యెక్కడినుండి వచ్చినవి? చేతితో ఆ కల్పితరూపముల నుగ్గుచేసితే గానపింపలేదు. అయితే కార్యములగు చిలుకలయ్యే యవకాశము జక్కెరలో నున్నది. మఱల పాకముతో చిలుకలజేయవచ్చు. ఆ ప్రకారము లేని నామరూపముల గల్పించటము మాయాకార్యమే. చక్కెరను పాలలోగలిపి త్రాగితే కారణముతో సహా కార్యములేదు. ఈ కార్యరూపములకు కారణమగు మాయ జ్ఞానముతో దొలగితే దృశ్యమే లేదు.

ప్ర॥ అందువలన ప్రతివ్యక్తికి తోచు టేది ?

ఉ॥ లేనిది ఉన్నట్లు తోచుట. ఎట్లనిన మందాంధకారములో త్రాటిని జూచి పామనుకొన్నట్లు, మోటుచెట్టునుజూచి మనిషియనుకొనుటలేదా! అణువుమొదలు మేరువువఱకు, పిపీలికముమొదలు బ్రహ్మపర్యంతము మాయామయమే. అజ్ఞాని కానివాడెవడు? అట్టి సామాన్యసృష్టిలో సహజ, కర్మజ, భ్రాంతిజ, తాదాత్మ్యముతో జగత్తుతోచుట, నట్టి జగత్తును దేహమునుజూచి మోహితుడైనపుడు పాముకాదు త్రాడని,

మనిషికాదు మోటుచెట్టని గ్రహించిన జ్ఞానమువలె గురుశాస్త్రాదుల వల్ల యథార్థజ్ఞానము బడసిలే నప్పుడు తనకర్తవ్యము తెలిసికొనగలడు. అనగా, సామాన్యజ్ఞానముండికూడ విశేషజ్ఞానము లేనపుడే భ్రాంతి గలుగును. ఆ భ్రాంతిజ్ఞానములో నానాత్వము తోచుచుండును. అర్జునునకట్లు భ్రాంతితోచినది. శ్రీకృష్ణపరమాత్మ యర్జునుని స్థితినంతయు జూచి విస్మయవంతుడై, యుద్ధముమానివేయమనియా! వపముకాకుండ నర్జునునకు తానే నందఱ వధించుటయా! గెలిచినరాజ్యము పాండవుల కివ్వటమా! లేక ప్రత్యేకముగ వీరి జీవితమునకు క్రొత్తదేశము నిర్మించటమా! నాకెందుకని యూరకుండటమా! ఏదికర్తవ్యమని యాలోచించి యితనికి గలిగిన దుఃఖమునకు కారణమేదియై యుండవచ్చునని యికను కొన్ని మాటలాడి తెలిసికొందామని పరిహసించుచు నీవింత పిరికివాడవు. స్వధర్మమునైన దలపక వదిలే దుర్బలుడవని నేననుకోలేదు. స్వధర్మమునుజూచిన నిట్టి సమయమున నీలాగునుండగూడదు; లెమ్ము. కృతనిశ్చయుడవుకమ్ము. చచ్చి స్వర్గమును, లేక గెలిచి రాజ్యభోగము లను భవించటమనే రెంటిలో నేదానికో నొకదానికి నిలువవలెగాని యిప్పుడు వదలుకుంటే పౌరుషదికాదని చెప్పెను. మౌనముగానున్న యర్జునునిగని యితని మోహమునకు కారణము యవిద్య. దాని వదలించినగాని యితడు దారికిరాడని "న జ్ఞానం వినా మోక్షః" ఆత్మజ్ఞానములేనిది నీ మోహబంధము తొలగదని జ్ఞానము బోధింప మొదలిడెను. త్వంపద వాచ్యపరిశోధన.

ప్ర॥ శ్రీకృష్ణుడు తన యవతారమున నర్జునుని కొక్కనికేనా బోధించినది ?

ఉ॥ లేదు. చిన్నతనమున, మురళీగానమున భక్తిని గోపగోపికలకు బోధించి వారిచిత్తములనే నదులను నీవునేనను భేదము, దేహాభిమానము, విషయప్రపంచ జనాభిమానము భయదకారణములనుఱచి నిజరూపమనే సమాధిసాగరమున నామరూపాదులను వదలి తన్మయులై యుండజేసెను. ఉద్ధవునకు సమస్తవాసనల బాహ్యాంతరములనుండి త్యాగోపదేశము జేసెను. అవతారమూర్తి యేసమయములో నెవరి నేధర్మమున రక్షించ వలెనో నారీతి రక్షించును. సఖునివలె, గురునివలె, తలిదండ్రివలె,

పోదురునివలె నతీంద్రియజ్ఞానలక్షణుడగు నాత్మునగుణముల వర్ణింప నెవ్వరికి నసాధ్యము.

ప్ర॥ భగవంతుడు గీత ద్వితీయాధ్యాయము నేశ్లోకమునుండి ప్రారంభించెను ?

ఉ॥ ద్వితీయాధ్యాయము శ్లో॥ 11 నుండి యనగా "అశోచ్యానన్వశోచస్త్వం" యని ప్రారంభించెను. మరికొందఱు కొన్ని యభిప్రాయము లిచ్చినను ప్రారంభము నీ శ్లోకమునందే తెలియవలెను.

ప్ర॥ అవిద్య లేక యజ్ఞానమును క్లుప్తముగ వివరింపుడి.

ఉ॥ సుషుప్త్యవస్థవలె సాత్మాశ్రయమై యనుభవనీయముగా నుండును. నీ పేరేమియనుచున్నాననుకో. నాకు తెలియదన్నావు. తెలుపుచుండియూ తెలిపెడి వాడెవడా యని తెలియనితనమే యజ్ఞానము. మఱియు లోకానుభవమె ప్రమాణము. నీ పేరేమన్న, నా పేరా ఆ! ఫలానివాడన్నావు. నా నేను యనునే సామాన్యాంశముండియు, విశేషాంశము లేకపోవుట యేదియో యది యవిద్య. దార్ష్టాంతికమునకు దృష్టాంతము నామరూపాదులగు భౌతిక సూక్ష్మాది ప్రపంచమునుబట్టి. విను. ఒక రాణి గర్భవతిగానుండి శత్రువులు మగని చంప తాను రహస్యమార్గమున నెట్లో యడవిచేరి బిడ్డకుగని శాగతించెను. ఆటవికులు నా కుఱ్ఱవానిని గొని పెంచి తమ యాచారము నేర్పికొనిరి. ఆ యలవాటుచే నాతడు నేనాటవికుని; నా పేరు ఫలానివాడనుచుండెను. అట యొకప్పుడు శత్రురాజును ప్రజలు పరిహరించి తమ రాణి గర్భవతియైయుండి యెందో పోయినది. నామె బిడ్డ యుండవచ్చు నాతని దెచ్చి యథాప్రకారము తమ రాజుగా జేసుకుందామని దిశలెల్ల కలయదిరిగి నడవిలో నీ కుఱ్ఱవానిగని యానవాలు బట్టి నీ వెవ్వడవు? నీ నామ మేమి? నీ తలిదండ్రు లెవరన, నేభిల్లుడ. నా పేరు ఫలాని పేరు. నా తల్లిదండ్రు లున్నారనెను. రాణియొక్క రాజు యొక్క చిహ్నములు నాతనియందుంట ననుమానించి పెంచినవారికడ కరిగి బాలుడు వినుచుండ, విచారించ వారు జరిగినదంతయు చెప్పుచుంటే కుఱ్ఱవాడు తానెవడో తెలియనితనమగు నవిద్య పరోక్షజ్ఞానమున తొలగుచు రాజపుత్రుడననే స్వరూపాపరోక్షజ్ఞానము గలిగెను. ఆటవికులకు

గొప్ప బహుమతుల నిచ్చి రాకుమారుని గొని చనిరి. చూచితివా! ఆ బాలుడు మొదట నాటవికుడ ననటము తన స్థితి తెలియకనే కదా. ఇదియే అవిద్య. తన్ను నాప్తులైనవారలవలన తెలిసికొనుట జ్ఞానము. అసత్వాపాదము యభానాపాదమను రెండు పాదములుగలది యవిద్య. పరోక్షమున నసత్వాపాదము, నపరోక్షజ్ఞానమువలన నాభానపాదము తొలగెడిది. 'పాకస్య వహ్నివత్ జ్ఞానం వినా మోక్షో న సిధ్యతి' తన్ను తెలియుటము మోక్షము. మునుపున్నవాడే; క్రొత్తవాడుకాడు. అయితే తన మునుపటి స్థితి మఱచినాడు. కస్తూరిమృగము తనయందలి కస్తూరివాసన తెలియక నెందో నున్నదని పరుగులుబెట్టి తుదకు పండుకొని ముఖము నాభివద్దనుంచి తనయందే గలదని గ్రహించటము, తెలియకపోవుట యజ్ఞానము. తన్ను తెలియుట జ్ఞానము లేదా యథార్థము నెఱుగుట జ్ఞానము. మరొకమాట. గాఢాంధకారమున ప్రతివస్తువు తన దేహముతో సహా నితరులకుగాని, తనకుగాని కనిపించటములేదు. అట్టి సమయమున మనకొకవస్తువు కావలసివస్తె నంతట నావరించిన యంధకారమును బోగొట్టవలసిన పనిలేదు. వస్తువున కావరించిన చీకటిని బోగొట్టితే చాలు. దాని కనుగొందుము. అది చీకటియందు గనిపింపకపోవటము చీకటియే కారణము. మరొక మాట. మందాంధకారమున రస్తాలో త్రాటిని జూచి పాముని భ్రమసి భయపడినాము. నిజముగా పాముకలదా? లేదు. ఇదియే యవిద్య. త్రాడని తెలియునంతవఱకు నీ పాము జ్ఞానముండియే యుండును. 'మిథ్యాజ్ఞాననిమిత్తశ్చ, బంధో న సమ్యగ్జ్ఞానాదృతే విశ్రంసితుమర్హతి' వే॥ సూ॥ తప్పుడు తెలివిచేత గలిగిన బంధము సరియగు తెలివి గలుగనిది పోదు. త్రాడు భ్రాంతిదీపములేక తొలగదు. త్రాడుధర్మము మిథ్యాపామునందు, పాముధర్మము త్రాడునందు నన్యోన్యాధ్యాస గలిగినపుడు సహజ, కర్మజ, భ్రాంతిజ తాదాత్మ్యము గలుగును. అర్జునునకేగాదు సకల జీవులకు నున్న స్థితియే యిది. త్రాడునందు పాము, నేలపఱియ, ములుకఱ్ఱ, జలధారి, చేతిగీత, పుష్పమాల యని యారోపించినట్లు దొక్కడగు పరమాత్మయందు నామరూపాదులే జగత్తుగా కనపడి నీవు నేను, నీది యిది, నాది నీది యను విశేషసృష్టి ద్వారా బంధము దుఃఖము గలుగును. ఎట్ట యెదుట దోచు ప్రపంచమునకు, తన శరీరమునకు నధిష్ఠాన మెయ్యది? శరీర

ప్రపంచముల యధిష్ఠానము రెండా? ఒక్కటియా? అని తెలియకపోవట మజ్ఞానము. 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి'. అద్వితీయ బ్రహ్మవస్తువగు నాత్మజ్ఞాన మొక్కటి కలిగిన సర్వప్రపంచజ్ఞానమగును. సందేహభయములు తొలగును. కర్తవ్యనిష్ఠను సాగింతురు. తొలుత కనపడు ప్రపంచ వస్తువును నాధారముగ జేసికొని కనపడనివస్తువగు పరమాత్మను యూహావేద్యము జేయుటనే తటస్థలక్షణమనెదరు. లేదా ఉపలక్షణస్థితి 'కాకవద్దేవదత్తగృహమ్' కాకినిబట్టి దేవదత్తుని గృహము గ్రహించినట్లు శాస్త్రము ఘోషించును. స్వరూపలక్షణం 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' 'సర్వం ఖల్విదం బ్రహ్మ' యని వ్యాపకబ్రహ్మమును శాస్త్రము జెప్పుచున్నది. అన్వయవ్యతిరేకములద్వారా తన్ను యనగా నాత్మను తెలిసితే మోహనివృత్తి కాగలదు. ఇదియే సవిస్యాలక్షణము.

ప్ర॥ అంత నర్జును డెట్లు జేసెను?

ఉ॥ లౌకికవచనములకు కలతచెందిన యర్జునుడు నగుచు నాత్మానాత్మ లేక త్వంపదార్థశోధన తెలుప 'జ్ఞానాదేవ తు కైవల్యం ప్రాప్యతే' యన్నట్లు జ్ఞానోపదేశము మొదలిడి, చావనివారి గురించి, చనిపోయిన వారిని గురించి జ్ఞానులు దుఃఖింపరు. పండితునివలె మాట్లాడే నీకు చనిపోవునదేది? చావనిదేది తెలియునా? అనెను. రెండు యర్థముల విని యర్జునుడు చచ్చుట తెలియునుగాని, చావనిదేదో నాకు తెలియదనెను. మరి దేనిని గురించి నీ యేడుపు? కనిపించే వీరందరి గురించియా? నీకు తెలిసిన మాత్రము వారికి తెలియదా? చచ్చేది యేదియైనది, ఇక నీకేది యెక్కువ తెలిసి వారికి తెలియలేదని నీ దుఃఖము? దానికి నర్జునుడు సందేహించుచుండ కృష్ణు డిట్లనియెను. ఇదేమిటి? అరటిపండనెను. దీనియందెన్ని భాగములున్నవి? రెండు. ఏవేవి? ఒకటి తినగల్గు గుజ్జు, రెండు విడువతగు తొక్కలు. తొక్కలు, గుజ్జు లొక్కవస్తువులోనె యున్నట్లు చెప్ప గలిగితివి. ఇటువంటివి రెండు నీవే జెప్పు. పనస, నిమ్మ. వీనిలో నేది చూచినంతనె కనిపించు? నేది కనరాదు? పై భాగములగు తొక్కలు, లోపలిభాగమగు గుజ్జు కనిపింపదు. సరి. అదేరీతి నీవు యుంటే నేను దేహము నంటావు. కాని దేహము వేఱు, నీవు వేఱు. నీవు దేహములు రెండు అన్యోన్యాశ్రయములై యుంట నీవు కనిపించటము లేదు. ఇంద్రియజ్ఞానముచే విష

యముల గుర్తెఱుగుదువు. పూతి యింద్రియములకు విషయముగాని నిన్ను తెలియుటలేదు. దేహము దోచుచున్నది. దేహము దోచి నీవు దోచ నంతనే నీవు లేనటులేనా? కన్నులు మూయుము. నీ దేహము, నా దేహము, ప్రపంచము సర్వము కనిపించుచున్నదా? లేదు. లేదనియే కన్నులతో జెప్ప గలిగితివి. బుద్ధి లేక జ్ఞానముచే కనపడనివి లేవందువా? ఉన్నవందువా? లేవని. నీవు లేవా అన్న నొప్పుకొందువా? లేదు. నీవుండబట్టియేకదా నవి కనిపించకపోయినను చెప్ప గలిగితివి? కన్నులు మూసినప్పుడా దేహప్రపంచములు లేకపోయినను నీవుంటివి. కన్నులు దెఱచ నవి కనిపించునపుడు నీవుంటివి. నీవు నన్నిటిని తెలిసికొనుచుంటివిగాని, దేహేంద్రియప్రపంచములా నాతో మాట్లాడునది, కనుగొనేది? పనస, యరటి, నిమ్మలను నీవు తెలిసికొంటివా? అవి నిన్ను తెలిసికొనెనా? నేనే వాటిని తెలియుదును. అటువంటప్పుడు దేహమును దేహావ్యవస్థలను తెలియున దెవరు? నేను. సరి. తొక్కలు గుజ్జు నొకటిగా నున్నట్లు దేహములో నెన్ని భాగములున్నవి? రెండు. ఏవేవి? చైతన్యమగు నాత్మ, యచేతనమగు దేహము. ఇప్పుడు జెప్పు; నీవు దేహమువా? చైతన్యమగు నాత్మవా? నేనాత్మను. నీవు వేఱుగానిది దేహాదుల నెట్లు తెలియగలవు? తొక్కలు గుజ్జును కలిపి తిన్నప్పుడెట్లుండును? తియ్యతియ్యగ, వగరువగరుగ నుండును. కారణమేమి? ఒక్కొక్కదానిని వేఱు చేయనందున. వేఱుజేసి తొక్కలనువదలి గుజ్జునే తిన్నచో నంతయు తీపుగా నుండునా? లేదా? అవును నేను అర్జునుడు. తీపు తీపు, వగరువగరు నన్నప్పుడు రెండు ధర్మములు నొకవస్తువున నారోపించి నట్లైనది. అట్లే దేహమున యాత్మ రెండు కలిసియున్నవి. నిజము చెప్పుము. నీవు దుఃఖించవలెనని యిష్టమా? నీ స్వభావము దుఃఖమేనా? కాదు. మరెట్లుండవలెనని నీ యుద్దేశ్యము? చావులేకుండ సుఖముగ, శాశ్వతముగ నన్నిటిని తెలియువానివిగ నుండవలెనని యంటే చావు లేకుండా నానందముగ నుండవలె. కాని చావున్ను దుఃఖము గలిగినది. తీపుతీపు వగరువగరుగ నున్నదన్నప్పు డొకదాని ధర్మ మొకదానియం దారోపించినట్లైనదా? లేదా? దేహధర్మము లాత్మయం దాత్మధర్మము దేహమునందు నారోపితములగుచున్నవి. కాదా? "దేహస్య క్షుత్పిపాసే ద్వే మనసః శోకమోహనమ్। జన్మమృత్యూశ్చ దేహస్య షడూర్మి

రహితః శివః" జన్మమరణ శోకమోహా మూకలిదప్పికలు షడూర్ములు. "జాయతే అస్తి వివర్ధతే పరిణమతే" పుట్టుట, నుండుట, వృద్ధినొందుట, పరిణమించుట, క్షీణించుట, నశించుట షడ్భావములు. ఎఱుపు, తెలుపు, నలుపాదిరంగులు, పొడవు, పొట్టి, లావు, సన్నము, పురుషుడు, స్త్రీ, బావ, యన్న, వదినె, అమ్మ, నాయన, తాత, కొడుకు, మనమడు, పెద్దయుద్యోగి, చిన్నయుద్యోగి, వైద్యుడు, రోగి, గురువు, శిష్యుడు, నాలు, మగడు, భాష, వేషము, సాధు, వైరాగి, మంత్రి, రాజు లిత్యాదిసంబంధములపేర్లు. అరటిపండ్లు పొడవు కుఱుచ సన్నము లావు నెఱుపు నలుపు లిత్యాదులుండునుగదా! ఇవియన్ని దేనికి సంబంధించినవి? తొక్కలకు. అచ్ఛా! అటులే పై పేర్లు దేనికి సంబంధించినవి? దేహములకు. ఆత్మకు గాదుకదా? కాదు. దేహమునకు నుంచిన వ్యావహారిక ధర్మములు నాత్మనుబట్టియే పేర్లుంతురు. న్యూనాధికతలు, జన్మమరణాదులు దేనివి? దేహాదులవి. ఆత్మకే సంబంధములేదు.

ప్ర॥ అంటే పారమార్థికమున దేహమెట్లుండును ?

ఉ॥ పారమార్థికమున నీ దేహములకు తల్లియగు మాయయే లేనపుడీ పిల్లలగు దేహమెట్లుండును? "ప్రాగభావో నానుభూతశ్చితేర్నిత్యాత తశ్చితిః" చైతన్యమగు నాత్మ ప్రాగభావము నెవ్వడు నెచ్చట జూచి యుండడు. ఆ యనుభవమే లేదు. దేహేంద్రియాది ప్రపంచాభావము సుషుప్తియందు సాక్షిచైతన్యముచే జూడబడుచున్నది. నీవు నేను జెప్పుచుంటే వినుచున్నావు. నీ నలువదిరెండు తత్త్వములేమైన పనిజేయుగల్గెనా? లేదు. స్వప్నము దోచెనా? లేదు. గాఢనిద్ర వచ్చెనా? నేజెప్పినది వినుట యెట్లగును? జెప్పుము. జాగ్రత్స్వప్నసుషుప్త్యాది యవస్థలుగాని యీ స్థితినే పారమార్థికమనెదరు. దేహేంద్రియములు తోచుచుండిన వినుట యెట్లు? మరొకమాట. వినునప్పుడు నీవు నేనే యగుచుంటివి. పిలిచినపుడు బలుకటము రెండగుచున్నవి. చూచితివా! ఈ రహస్యము. మిథ్య, జడము, దుఃఖము, పరిచ్ఛిన్నలక్షణములు దేహమునవి. సత్తా చిత్తానందవ్యాపకము లాత్మయవి.

ప్ర॥ అన్వయవ్యతిరేకములన నేమి ?

ఉ॥ ఒక యవస్థయందున్నపు డొకయవస్థ లేకుండుటయును, ఒక యవస్థలో నుండినది మఱొకయవస్థలో లేకుండుట దీనిని వ్యభిచరించుట యనబడును. విను. జాగ్రత్తప్పుడు స్వప్నసుషుప్తులు లేవు. స్వప్నమున జాగ్రత్సుషుప్తులు లేవు. సుషుప్తియందు స్వప్నజాగ్రత్తులు లేవు. ఈయవస్థలు మూడును పరస్పరవ్యభిచారములు. అన్వయమన, మూడవస్థలయందును సాక్షిగా నుండును నాత్మ. ఈ మూడవస్థలకు పారమార్థిక సత్యత్వాభావము కలుగును.

ప్ర॥ అయితే దేహము వేఱు, ఆత్మ వేఱనవలెనా?

ఉ॥ అవును. ఆత్మ యఖండము సచ్చిదానందము.

ప్ర॥ సచ్చిదానందమనిన నేమి?

ఉ॥ కాలావస్థలచే బాధితము కానిది సత్తు. ఎప్పుడు తెలియునది జ్ఞానము. ఎప్పుడు దుఃఖము లేనిదియే యానందము. ఏ యవస్థల, నేకాల, నేదేశ ములనాశము లేని యీ మూడు లక్షణము లాత్మవి.

ప్ర॥ సరి యింకను జెప్పుడి.

ఉ॥ నీవు వగరు విభజింప లేకపోయినచో దేహాత్మల విమర్శింపలేక దేహధర్మములాత్మయందు, నాత్మధర్మములు దేహమునందును నజ్ఞానముచే నారోపించుకొని నేను ఫలానివానికి బుట్టితిని; నాపేరు ఫలానిది. పుట్టినవాని నెన్నడైన జచ్చెదను. పురుషుడను, స్త్రీని, ముదుసలిని, ఫలానివర్ణస్థుడ, ఫలానిమతస్థుడ, ఫలానియాచార మనుకొను భ్రాంతిజ్ఞానము విమర్శించిన నంతన తొలగును. చెప్పుము. దేహమువేఱు, నాత్మవేఱని తెలిసినది. నీ వనగా దేహమా? వేఱా? యన నర్జునుడు తాను దేహము కాదనెను. ఈ నీ దేహము నీవెన్నడును కాదు. భూతభవిష్యద్వర్తమానకాలముల త్రివిధావస్థల దేహముండదు. దేహముతోటి యవినాభావసంబంధము గల జగత్తుండదు. నీవుమాత్రము నెప్పటికుంటివి. దేహమునకు తెలియకుండ బాల్య కౌమార యౌవన వార్ధక్యములుగా మారుచున్నది. నిన్ను నీవు జూచునప్పుడుగాని, మరణ, మూర్ఛ, సుషుప్తియవస్థలగాని దేహముండదు. అవస్థలు దేహములకు సంబంధించినవియే. "అత్రాయం పురుషస్స్వయంజ్యోతిర్భవతి" స్వయంప్రకాశుడవై, ద్రష్టవై యున్నావు. దేహేంద్రియాదులు దృశ్యములై నీవలన తెలియబడుచున్నవి. ఒకప్పుడుండి యొకప్పుడు లేనివియగుట నవి మిథ్య. నీ వెప్పుడుండుట సత్యము.

గర్భమునుండి చచ్చువఱకు దుఃఖమయము దేహము. సర్వదానంద మయుడవీవు. తన్ను తెలియలేదు. ఇతరము నెఱుంగలేదు. దేహము జడము. నిన్ను నీ వెఱుఁగుదు వన్నిటిని తెలిసికొను జ్ఞానమయునివి. భిన్నభిన్నములుగా దోచునవి దేహములు. అభిన్నమై దారమువలెనుండు వ్యాపకుడ వీవు. 'తరతి శోకమాత్మవిత్' ఆత్మను దెలిసినవాడు సంసారమునుండి తరించును. నీతల్లి కుంతి. తండ్రి పాండురాజు. నీ యన్న దమ్ములు, నీ కనపడు కౌరవాదులు భౌతికములైన దేహములా? వేఱా? దేహములే. ఆత్మ కనిపించునా? కనిపించదు. ఆత్మలేనిచో దేహములు మృతములగును. లాందరునందలి జ్యోతి తనంతటతాను వెలుగుచు, లాందరును తక్కిన వస్తుచయమును ప్రకాశింపజేయును. ఆత్మ, తాను దేహమధ్యమునందుండి దేహధర్మములను తెలిసికొంటు బాహ్యవస్తువుల నవస్థాత్రయముల నెఱుగుచున్నాడు. గృహమువంటిది దేహము. గృహస్థునివంటి వాడాత్మ. రథమువంటిది దేహము. రథికుని వంటివాడాత్మ. ఆధ్యాత్మ్యమధిభూతాధిదైవతములను పదునాల్గునింద్రియముల, నలువదిరెండుతత్వములచే దెలియబడు జాగ్రత నెఱుగుదువీవు. ఇంద్రియాదులు నీవుకావు. సాక్షంతమువంటివాడవీవు. పిన్నుసూదుల వంటివవి. బాడుగయిల్లువలె, రైలుపెట్టెవలె, నావవలె దేహము నీవు కావు. అగ్గిపుల్లనందంతట నలుపుచే కనిపించని యగ్నివలె నితరులు జూచుటకు దేహమున కనిపించుచు కనరాకయున్నావు.

ప్ర॥ దేహము కనిపించుచున్నది; ఆత్మ కనిపించటములేదు. నమ్ముటెట్లు?

ఉ॥ పశువు కనిపించుచున్నది. పాలు కనిపించుటలేదు. పాలున్నవి; వెన్న కనిపించటములేదు. నూగులున్నవి; తైలము కనిపించటములేదు. 'తిలేషు తైలం దధినీవ సర్పిః' అన్నట్లు నీవిన్ని మాట్లాడుచున్నావు. నీ ముఖము, నీకు కనిపించుటలేదు. అయితే లేదనెదవా? అనవుకదా. నీవే లేవన నొప్పుదువా? ఉండియేకద వినుచున్నానందువు. తాను లేననే వాడెవ్వడుగలడు? తన రూపము తన కెట్లసమ్మతమో అద్దముచేత తన ముఖము ప్రయత్నముచే పశువున పాలు, పాలవెన్న, నూగులనూనె బడసిన రీతి 'జ్ఞానాన్ముక్తిః' జ్ఞానసాధనమున యవిద్యను బాధించిన నాత్మను తెలియగలము.

ప్ర॥ అంతట నర్జును డేమనెను?

ఉ॥ నేను సత్యమైతే భీష్మద్రోణాదులు సత్యము కావలెకదా. నావలన బాధ నొందరా? యని నిన్ను నే దృష్టితో జూచితివో నా దృష్టిలో వారు వీరనే ప్రభిన్నముకలదా? లేదు. అయినను నీ దేహము బాల్య కౌమార యౌవనాదులు నీకంటె వేఱువేఱుగా దోచుచుండుట, బాల్యమునకంటె కౌమారము వేఱు, దానికంటె యవ్వనము వేఱు, యవ్వనమునకంటె వార్ధక్యము వేఱైన నీవు మాత్ర మొక్కనివే. దేహాత్మబుద్ధితో వారు వేఱుగా కనిపించెదరుగాని బ్రహ్మాత్మబుద్ధితో జూడుము. నీవు వారు నేను మొదట సముద్రమువలె నేకరూపముననుండి ఆవిరివలన మేఘము దాన వర్షము వానివలన నదులభాతి మాయవలన వేఱు వేఱు కనిపించుచుంటిమి. విత్తనముగా నుండినపుడు వృక్షము శాఖోపశాఖ లెక్కడివి? ఒకటిగా నుండి విత్తుత్యాగమున వేఱువేఱుగా కనిపించినంతనె విత్తనమునకంటె నన్యముకాదు. నీవు వారు నేను 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' స్వజాతీయ విజాతీయ స్వగతభేదములేని బ్రహ్మస్వరూపులమే. 'సదేవ సౌమ్యేదమగ్ర ఆసీత్' సృష్టికి పూర్వము విశ్వమంతయు నామరూపరహితమై యొక్క పరవస్తువుగానె యుండెను. ఈ భేదబుద్ధి యవిద్యాకల్పితము. 'దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యేద్బ్రహ్మమయం జగత్' జ్ఞానదృష్టిచే జూడు నీ సంశయములన్ని తొలగిపోవును. నీవు లేకపోతే వారు లేరు. నిద్రయందు గనిపించు నిరాభాసనామరూపమాయోపాధిని గ్రహించి ప్రతీతమగుచున్నవానివలె నంతఃకరణోపాధులవలన వేఱు వేఱు దోచుట సత్యము. పంచవిధభ్రాంతులవలన గలిగె సర్వమసద్ధము. ఆత్మ వేఱను పరోక్షజ్ఞానమర్జునకాయెను. అయినను సంశయము నపరోక్షత్వజ్ఞానము గలిగెడివఱకుండును. నీవు సత్యము గావచ్చు. జీవులెట్లు సత్యమని యర్జునుడన దేహము బాల్య కౌమార యౌవనాదులుగా మారుచున్నను నాత్మకు తెలియనట్లు భేదము లెట్లో దేహమువదలి మఱొకదేహము వచ్చునది ఆత్మ యెఱుగదు. ఈ రహస్యము తెలిసినవాడు మరణమునుండి దేహాంతరప్రాప్తి గల్గుచున్నను మోహము నొందడు.

ప్ర॥ అర్జునునకు గలిగిన దుఃఖము తనకొఱకుగాక, తనవారల వియోగమునకా?

ఉ॥ అని యుక్తియుక్తమై బోధనోక్తులుగల జ్ఞానేంద్రియములకు శబ్ద స్పర్శ రూప రస గంధములను విషయములకు సంయోగమైనపుడు శీతోష్ణ ములు సుఖదుఃఖములు గలుగును. అట్టే ప్రియాప్రియ సంయోగవియోగ ములుగూడ సుఖదుఃఖములు గల్గించుచున్నవి. ఇవి దేహధారులకు మాత్రమె. ఇవి యున్న అనిత్యములు. వీనిని గురించి దుఃఖించటము వీని ధర్మములు తెలిసితే గలుగదు. సర్వత్ర సామ్యము జూచితే దుఃఖము సహించు కొందుము. ఒక యూరి నొక కుటుంబమున తల్లి దండ్రి కొడుకు కోడ లుండిరి. వారి కొడుకు మోహాజిత్ అను నొక్కపేరుండెను. పెక్కు కాలము తపస్సు చేయు మహాత్ముని నాయొక్క సన్నిధి యొట్టిదో గమనింప పత్రపుష్ప ఫలములతోయుక్తుడై కొడుకు నా తపసిని సమీపించి ఆయన నిష్ఠనుండి లేచినంతనే పత్రపుష్పాదులు సమర్పించి నమస్కరించెను. అంత తపసి కొట్టుచూడ సంతోషించి నీపేరేమని యడిగెను. అతడు నా పేరు మోహాజిత్తనెను. ఆ మాటను తపసి యాశ్చర్యపడి తక్కిన తలిదండ్రి భార్యల పేర్లేమనెను? వారి పేర్లు మోహాజిత్తే యనెను. తపసి హృదయము డిల్లపడి యింతకాలము తపస్సు చేయుచున్నను నా మోహము సడలలేదే, నాకాపేరు సిద్ధించలేదే. గృహస్థులగు వీరి కెట్లు లభించె? పరీక్షింతమని తన యుడుపుల మోహాజిత్తున కొసగి యాతని యుడుపుల తాను గొని మీ తలిదండ్రాదుల జూచివచ్చెద నందాక నిందేయుండుమని తాను మోహా జిత్తు వస్త్రముల రక్తమయము జేసికొని వారి గ్రామము జేరి తండ్రి యున్న స్థలమునకేగి యీ వస్త్రములు నీ తనయునివి, అతడు పులిచే జంప బడెను అనెను. అంత నతడు పక్కున నవ్వి నా కొక పుత్రుని, పుత్రునికి నన్ను తండ్రిగను గల్పించే నీ యీ భ్రాంతి నీ కెట్లు గల్గినది? పులిచేత జంప బడటము, చావటము, చచ్చునది యెయ్యది? చావనిదేది? అవ్యక్తమైన మట్టినుండి వ్యక్తమైన కుండలు మూకట్లు బుడ్లు బానలు వగైరాలు కల్పి తములు. మట్టి కన్యము లేదు. తద్రీతి తండ్రి పుత్రుడు నీవు పులి వస్త్ర ములు నామరూపములు సత్యములా? వీనికి నధిష్ఠానము సత్యమా? తపస్సుచేత బలహీనమైన నింద్రియాదులచే నజ్ఞానమున వాస్తవమెఱుగ వైతివి. నాకెవ్వరులేరు, నేను నేనైయున్నాను. తపసి వింతపడి తల్లివద్దకు జని మొదటిరీతి పలికి వలువల జూపెను. ఆమె యించుకంత నవ్వుతో నీకి

స్వప్నము యెట్లు గలిగినది? నేనెవ్వారి తల్లిని? నాకెవ్వడు తనయుడు? స్వప్నమున నొకరాజు కాలు నక్క గఱచెను. రక్తమయమైన కాలిని బాగు చేసుకొనుటకు స్వయముగానే వైద్యునివద్దకు జని మందు వేయుమన్న నొకరైన వేయరైరి. తుదకొక మంగలిని యడుగ నాతడు కొంత డబ్బునిచ్చిన వేయుగలననెను. రాజుకు నిస్పృహ గలిగి తన యింటికివచ్చి మనస్సులో నీ విధముగ చింతించెను. ఇంత రాజునై యుండి యొక్కడైన బలుకకపోవటయు నక్క కాటు బాగుకాపట మెట్లా యని యనుచున్నంతలో మెలకువరా తనకు జరిగినదంతయు స్వప్నమని నగుకొనెను. నక్క కఱవలేదు, తానెక్కడ తిరుగనులేదు, తనకు దుఃఖములేదు. నీకుగూడ నిది కలయే. దీనినుండి మేల్కొనుము. ఈ మోహము తొలగుననెను. అంత నతడు విస్మయుడై కోడలివద్ద కఱిగి నీ మగడు పులిచే నిహతుడయ్యెనన నామె చిరునవ్వుతో నీవెన్నడైన నింద్రజాలము జూచితివా? ఇంద్రజాలమున గనుపడునవి వాస్తవములా? నీవెవ్వరితో మాట్లాడుచున్నావు? ఇంద్రజాలమువలె నిది యంత యసత్యమనెను. అబ్బురమున నీతో ననెను. శరీరములకు ధరించిన వస్త్రములతోనా? అన నాతడు కాదనెను, అట్లైన నేను ధరించిన దేహేంద్రియములతోనా? యని యన్నంతనే నాయనకు జ్ఞానమాయెను. తాపసి ధన్యుడై నామె పాదముల కెఱిగి మహాతల్లీ! ఈ చిన్నప్రాయముననే నీకీదివ్యజ్ఞాన మెట్లు గలిగినదన నామె నా పుట్టింట తలిదండ్రులు గొప్ప గొప్ప మహాత్ముల రాబనిచి వారివలన శ్రవణముజేసెడివారు. వారి యాశీర్వాదముల బడయుదురు. నాకా సందేశములు వారి యాశీర్వాదములవలన నీ జ్ఞానము బడసితిననెను. అంత తపసి తన స్వవాసమున కరిగెను. సుఖదుఃఖములు, జన్మమరణములు దేని ధర్మములని తెలిసినవాడు దుఃఖమును సహించి మోక్షము నొంద నర్హుడు గాగలడు.

ప్ర॥ ఆత్మ సత్యమైనపుడు దేహేంద్రియ ప్రపంచ మసత్యమైనపుడు కర్మల జేయుటెందుకు?

ఉ॥ ఆత్మను తెలియకుండ నాచ్ఛాదించిన మలవిక్షేపావరణ దోషనివృత్తికొఱకు. కంటికి గలిగిన తిమిరాదిదోషముల నంజనాదిసాధనముల బోగొట్టి నిర్దోషమైన నేత్రములతో వస్తుస్వరూపముల తేటతెల్లముగా జూడగల్గినట్లు నిష్కామకర్మ నిష్కామోపాసనల ద్వారా నిర్మలము నేకా

గ్రముగల్గి ద్వయదోషముల నివర్తిగల యంతఃకరణసహాయముతో నాత్మ స్వరూప యథార్థజ్ఞానము నొందుటకొఱకు.

ప్ర॥ శీతోష్ణాదులు దుస్సహములు. వీనిని సహించుటెట్లు? అని యర్జునుడడుగలేదా?

ఉ॥ అడిగె. అందుకు జవాబు భగవంతుడీవిధము జెప్పెను. అలెగ్జాండరు మనదేశముపై దండెత్తివచ్చి మరలిపోవునపు డొక సాధువును జూచి జంప ఖడ్గమెత్తెను. నన్ను జంపుటకా? దేహమును జంపుటకా? దేహమును జంపదలచిన శిరసునువంచెను. ఆయన సహనమునకు, తెగువకు చకితుడై దాసోహమనెను. సోక్రటీసు భార్య జాంతిభి మేడపైనుండి వాకిలి ప్రక్కనఱుగుపై కూర్చొని జనులకు తత్త్వసలహా నిచ్చుచున్న నాయనపై బిందె నీళ్లు యక్కసుతో పోయ నవ్వుచు శీతలమునకు నవమానమునకు సహించి యా యురుములకీవర్షమనెను. స్వామి రామతీర్థ ఋషీకేశమునకు 30 మైళ్లు దూరముగల దండకారణ్యమున శీతోష్ణాదులేకాదు, భయదకారణము లగు మృగసర్పాదులకు వెఱవలేదు. గాంధీజీ, జీసస్, జిన, బుద్ధ, నానక్, తుకారాం, కబీరువంటి ధీరులు సత్యజ్ఞానులు అసత్యములకు వెఱువరు. సత్తునకు నాశనములేదు. అసత్తునకు నునికిలేదు. సత్తుయొక్క యునికితో తోచును. ముత్తెపుచిప్పపైని వెండి యసత్యము. తన ప్రకాశమునకు నిజమగు ముత్తెపుచిప్ప యధిష్ఠానము. ప్రపంచమసత్యము. దీని ప్రకాశమునకు నధిష్ఠానమగు నాత్మ యుండవలె. సత్తును గన్నంతనె యసత్తు బాధింపబడును. అసద్వస్తువగు పాము రజ్జుపై గాన్పించును. రజ్జుజ్ఞానము గల్గినంతనే పాము తోచదు. ఆత్మను తెలియని యవిద్యచే 'భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః' అవిద్య రాగక్లేశ భయదుఃఖములనే హృదయగ్రంథి యున్నంతవఱకు ననాత్మయగు దేహమునం దాత్మబుద్ధి, దుఃఖమయమగు ధనాదులందు సుఖబుద్ధి, యనిత్యమగు నాకసభాశికాదులయందు నిత్యబుద్ధి, యశుచియగు భార్యాపిల్లలయందు శుచిబుద్ధి గలిగించుచుండును. దీని భేదనమునకు జ్ఞానమే కావలెను.

ప్ర॥ అసత్తు, సత్తు, మిథ్యల విడివిడిగా జెప్పుడి?

ఉ॥ త్రికాల త్రిదవస్థలా బాధితమై 'సిద్ధం బ్రహ్మణి సత్యత్వం జ్ఞానత్వం తు పురేరితమ్' యన్నట్లతివ్యాప్త్యాదిదోషరహితమై నధ్యస్తమగు కల్పిత

విశేషములకు నధిష్ఠాన మాధారమై, స్వసంవేద్యమై, ననాదియై, విధిముఖ నిషేధముఖ ప్రత్యయాలకు నందనిదై 'చకితమభిదత్తే శ్రుతిరపి' శ్రుతి కూడ వర్ణించ శక్తిలేక భయపడు బ్రహ్మవస్తువు సత్యము. త్రికాల త్రిదవస్థల భేదమయమై లేనిది యున్నటుల దోచనిదికూడ గొడ్రాలిబిడ్డ, దున్నపొన్న, పురుషప్రసవము, గగనకుసుమము, కుందేలికొమ్మువలె నెన్నడు లేనిది యసత్తు. మిథ్యయనగా లేకుండినను రజ్జువున సర్పము స్థాణుపురుషునివలె దోచునది. ఇట్లు జగత్తున్ను సుఖదుఃఖాదులు మిథ్య. అసత్తుగాదు. సద్వస్తువగు నాత్మ, గొడ్రాలిబిడ్డవలె నసత్తుగాదు. లేనిది యున్నట్లు దోచు సర్పాదులవలె మిథ్యగాదు. సదసద్విలక్షణము, నాశములేనిది. దాని వినాశ మొనర్ప నెవ్వరు నర్హులుగారు. ప్రత్యక్షాది ప్రమాణముల కేల తెలియరాకూడదన ప్రమాణములు దృశ్యములు, సాపేక్షణీయములు. ప్రమాణాతీతమైన యాత్మయవినాశి. దేహములు నశించినను నశించదాత్మ.

ప్ర॥ ఆత్మ నశింపదని యెవ్వరనెదరు?

ఉ॥ అనుభవజ్ఞులు నతీంద్రియజ్ఞానులగు ఋష్యాది తత్వవేత్తలు. సాక్షాదక్షరతత్వమగు భగవంతుడు, వేదాదిప్రమాణములు ఆత్మ చంపబడునదికాదు, చంపునదికాదు; ఈ రెండు లక్షణములు తెలియనివారు చంపబడును, చంపునందురు. ఆత్మానుభవమువలన నశించదని తెలియుమని యర్జునునకు భగవంతుడు చెప్పెను.

ప్ర॥ చచ్చునది చంపునదియని యనుటకు కారణమేమి?

ఉ॥ దేహదృష్టి, లోకదృష్టి, శాస్త్రదృష్టులవలన నందురు. స్వదృష్టితో జూచితే నేకారణము లేదు.

ప్ర॥ ఆత్మ చావనపుడు నేకార్యమొనరించి నెట్లు ప్రవర్తించితే నేమి? స్వర్గనరకములు, పాపపుణ్యములు, జన్మమరణములు లేవుకదా?

ఉ॥ కాలిగోరు మొదలు శిరోజములవఱకు నా దేహ మనువాడు దేహములో నేయొక్క ప్రదేశములోనో, ఎవరివల్లనన్న హాని గల్గినపుడు అది తనకేనని యోర్చుకోలేనపుడు యావద్విశ్వము తనమయమైనపుడు నేభాగము తనది కాదని యేకార్య మొనరించును? తన దేహమునకు తానే హాని జేసుకొనువాడు కలడా? ఆ ప్రకారమే నేయొక్క కార్యము చేయలేదు. అథవా తనకన్న యన్యము తోచితేకదా?

ప్ర॥ ప్రళయములలోనైన నాత్మ గతించదా?

ఉ॥ గతించదు. గతించుటకు నొకరూపముండవలెను. రూపములేని నాకసమువంటిని ప్రళయములో నాశనమగునా. నిత్యము, నైమిత్తికము, దైనందినము, కల్పాంతము, మహాప్రళయములుకూడ నశించదు. ఈ యైదు ప్రళయములు దేనియందుండగుచుండునో సమ్యాదియెయాత్మ. ప్రళయనాశిని కానపుడు, పుట్టుకే లేనపుడు "అజో హ్యయం పురుషః" చావట మెట్లు? పుట్టగలది చావకతప్పదు. సినిమాహాలులోనున్న తెరవస్త్రము చిత్రములు రాకమునుపు వచ్చినపుడు నవి వెళ్లినమీదట తానుండియే యున్నది. దేహాదులు రాకమునుపు, వచ్చినపుడు, నవి వెళ్లినమీదట గూడ నాత్మ నొకేవిధము నుండియుండును. అచ్యుతి స్థాణువు శాశ్వతము నిత్యము నవ్యయమని గ్రహించిన నెవ్వరిని జంపుట? చచ్చువెక్కడ? మనుజుడు జీర్ణవస్త్రమునువడలి నూతనవస్త్రముల ధరించును. ప్రయో జనరహితములగు ప్రాతదేహములవదలి క్రొత్తదేహముల ధరించు చుండినను యేకైకస్థితిలోనే నాత్మయుండును. ఆత్మ దేహముతోనే పుట్టి దేహముతోనే చచ్చునదియైనచో నకృతాభ్యాగదోషకర్మ, కృత ప్రణాశకర్మ లనుభవమునకు రాక శాస్త్రము సహా పేలవమై పోగలదు. శస్త్రముల గొట్టబడదు. అగ్నికాలదు. నీటతడవదు. గాలిచే నూపబడదు. భూమిచే కప్పబడదు. ఎండకెండదు. చీల్చబడదు. రూపములేని నాకస మును నెవరేమి చేయలేరో, నాకసమునకంటె సూక్ష్మమగు నాత్మ స్థిరమైనది. దాని నెవ్వరేమి చేయుటకు నిట్టిదని తెలియబడినగదా! సర్వవ్యాపి, అచలము, పూర్ణము, సనాతనము, సంకోచవికాసములు లేనిది. శుద్ధము, బుద్ధము, ముక్తము, అసంగము, నద్వైతము, నమృత మఖండము, నభేదము, యేకైకము.

ప్ర॥ ప్రపంచము, కనుపించటము రజ్జుసర్పమువలె మిథ్య యంటిరి. దేనియందీకల్పన?

ఉ॥ ఇది మట్టి, యిది బంగారు, ఇది దూది యీ మూడింటియందు నాదిలో నేవైనకనిపించితే మట్టి, బంగారు, దూదియని యేల బిలుతురు? మొదలేవుంటే కల్పితములని యేల నందురు? మట్టియందు కుండలు, బంగారున నగలు, దూదియందు వస్త్రములు వ్యక్తమైతోచటమే కల్పన.

తోచకుండుట వ్యక్తము. మట్టిలేక కుండలుండవు. కుండలుకల్పిన మట్టి యుండే. జగత్తు బ్రహ్మమునందు కల్పితము; కల్పితమగు జగత్తు బ్రహ్మము నందే. బ్రహ్మమున మాయాపరిణామమే జగత్తు. కుండలు మట్టిని కలియుటయే నవ్యక్తమగు ప్రళయము. ఇక దుఃఖము దేనికి? నావిర్భావతిరోభావములు మాయయందే జరుగుచుండును. శాశ్వతమైన బ్రహ్మాత్మ చావదు; పుట్టదు.

ప్ర॥ మానవులందఱేల చావంటే భయపడి యేడ్చుచున్నారు?

ఉ॥ సీతవేషము వేసినవాడు రామవియోగమునకు నేడ్చుచుండ నా దుఃఖమునుజూచి నిజముగా సీతయని చూచినవారేడ్తురు. అతడు పురుషుడనేది మఱతురు. అది మమకారము మోహమై దుఃఖావహమగును. మఱపే నవిద్య. అవిద్యాపరిణామములగు మనోబుద్ధులులేనపుడు దుఃఖమే లేదు. ఎవరికి లేదు? దుఃఖమాత్మస్వరూపము లేదా స్వభావమైతే నిక దుఃఖనిరోధక మొనర్పవచ్చిన శాస్త్రములు నిరుపయోగము కావలసినదే. రోగము ఆత్మమయమైతే వైద్యుడెట్లు బాగుచేయగలడు? మనము నియమముదప్పి చరించిన నాధిగాను, వ్యాధిగాను తయారగుచున్నది. తత్ప్రకారమే నజ్ఞానముచే సంసారమును కల్పించుకొని దుఃఖించెదము. తన స్వరూపము దుఃఖమయమైతే సుషుప్తి, మూర్ఛ, సమాధుల నేల నుండరాదు? జాతిమతభేదము లుత్పత్తిస్థితిలయము లేలనుండగూడదు? ఎన్నిదినము లేగుచున్నను దినములతో జనదు యాత్మ. కావున దుఃఖము మోహకార్యము. "యథా స్వప్నప్రపంచోఽయం మయి మాయా విజృంభితః" స్వప్నప్రపంచ మెట్లు మాయగానే నాత్మయందు ప్రకటనమైనదో జాగ్రత్ప్రపంచముకూడ మిథ్యయే. ఈ యాత్మవిషయము చెప్పుటాశ్చర్యము. ఆత్మబోధచేయువారు కనిపించుట కష్టము. చెప్పువారు వినువారుకూడ దుర్లభము. వినిన, చదివిన, మననముజేసికొనుట దుర్ఘటము. కృష్ణునివంటి గురువు, నర్జునునివంటి శిష్యుడు లభించితేనే గాని లేకపోతే నాత్మవిషయము తెలియ దుస్తరము.

ప్ర॥ దుఃఖమును గుఱించి మఱొక యనుభవము చెప్పుడి.

ఉ॥ ఒకడు వ్యాధితో బాధపడుచున్నాడు. నీ కెట్లున్నదని యా యవస్థ జూచువారడుగ బలుకడు. వీరలు మా కిట్టిగతిగల్గునని యను

మానపడుదురు. రోగనివ్రత్తియైనమీఁదట బాధపడుచుంటివి, నీ కేలాగుండె నని రోగినడిగితే నాకేమి తెలియదనును. మఱి బాధపడింది యెవరు? మమకారముచే జూచుచున్న తమకా? మమకార మానమయమునలేని యాతని కనియా? మీాకేకాని యాతనికిలేదు. తననిద్ర తనకు తెలియదు. శరీరములు, జన్మమరణములు నాత్మకు తెలియవు. ఇతర శరీరములకు గలుగు వికారముల తనయందారోపించుకొనుటయేగాని యాబాధలు, నా యభిమానము నిద్రలోనుండవు. దేహేంద్రియములకే నిద్ర. ఆత్మకు లేదు. నిద్ర పోయియుండి నీ స్వప్నసుషుప్తులందలి యనుభవ మెవ్వరికి? సూర్యునిలో చీకటియుండగలదా? ఆత్మయందు సంసారము దానివల్ల గలిగే సుఖదుఃఖము లెన్నఁడులేవు. ఆత్మజ్ఞాను లవస్థాత్రయాతీతులు. దేనికై వారి దుఃఖము. దుఃఖమే తన స్వభావమైన శత్రువునకుగల్గిన దుఃఖములపై ద్వేషము గలుగవలె. దుఃఖ మాత్మసుఖమునకై గలిగిన ప్రేమయే. ఇంద్రజాలికునకు తనవస్తువు శూన్యము. వస్తుదృశ్యమునుగుఱించి సుఖదుఃఖములు లేవు. నిద్రలో దుఃఖించువానికి మెలకువలోని తమ వారికి లేదు; మెలకువలోనిదుఃఖము నిద్రలోనివానికి లేదు. మెలకువ గల్గినవాఁడు తననిద్రలోని దుఃఖము నెట్లు నమ్మఁడో, దుఃఖము భ్రాంతి జనితము. జ్ఞానముగలిగిన నది తొలగును. అజ్ఞానమే నిద్ర. జ్ఞానమే మెల కువ. "న హి జ్ఞానేన సదృశం" జ్ఞానమునకు సమానము వేఱేలేదు. కావున దుఃఖ మెవ్వరికిలేదు. రామునిధర్మభార్య కొన్నియేండ్లు కాయనను యడ వెలో గలిసికొని యేకాకియైన రామునితో దుఃఖింపుచు నన్నుగూర్చి నీ వనుకొనుటలేదా? యనెను. దేహాత్మభావనతో బలికిన నామెకు బ్రహ్మాత్మభావనతో నిన్ను మరచేదెట్లు? నిన్నెపుడు జూచుచున్నానని యోదార్చెను. ఆత్మ సుఖస్వరూపి, దుఃఖరూపికాదు. ఎండలో పిల్లలు నేడ్చుచు, నేడ్చుచు నిదురబోదురు. నిదురగల్గుటకొరకే దుఃఖము. దుఃఖమే తమరూపమైతే నిదురెట్లువచ్చును? సుఖనిద్రకొఱకై గలిగినదే దుఃఖము. స్వప్నములో రెండుకన్నుల నీరుచిమ్మినట్లుండును. మెలకువ రాగా కన్నులకు నీరేయుండదు. ఆ స్వప్నదేహమునకు గల్గిననీరు చూచిన దెవరు? నిదురించే స్థూలదేహమా? కాదు. ఆ కంటినీరు నా దేహము. మెలకువలో లేనపుడు యాత్మకేది పగటిదుఃఖము. రాత్రి నిద్రలోలేదు.

రాత్రినిద్రలోని దుఃఖము పగటిలో లేదు. ఈ సంయోగవియోగములు
నావిర్భావతిరోభావముల నెవ్వడెఱుగునాతడే యాత్మ. ఆత్మజ్ఞానము
గల్గినంతనె మిథ్యాదుఃఖములేదు. అర్జునునకు 11 శ్లోకమునుండి 30 శ్లోక
మువఱకు నాత్మతత్త్వము తన స్వరూపముద్వారా తెలిపెను. 'తమేవ
విదిత్వాఽతిమృత్యుమేతి' అర్జునుడు తన స్వరూపమును నెఱిగి ముక్తు
డాయెను. ఈ మహాతత్త్వము తెలిసినగాని మోహగ్రస్తమగు దుఃఖము
నివారణ గాకపోయెను. 'యత్ర హి ద్వైతమివ భవతి' వారు వీరనే నానా
త్వభేదదృష్టి దొలగి యభేదత్వ మేకత్వదృష్టివచ్చెను. క్షత్రియధర్మమగు
స్వధర్మమును భగవంతుడు జెప్పసాగెను. అర్జునుడు తన స్వరూప మెన్నడు
నెవ్వరివలన వినలేదు. సకల శాస్త్రములు చదివినను, దేహాభిమానము
నుత్పత్తి, ప్రాప్తి, వికార్య, సంస్కారములన కర్మ ప్రతిపాదకములే నని
రంగులరాట్నమునకున్న గుఱ్ఱము, జింక, యేనుగు, కుక్క, పులి, సింహము
మొదలగు నామరూపములతో దేనివలన దిరుగుచున్నది? ఏది లేకపోయిన
దిరుగజాలవో, తనవారు యెదుటివారు అనే నామరూపముల కనిపించి
తిరిగెడి దేహము లెవ్వరివలన నిటు నటు తిరుగుచు, పుట్టుచు వృద్ధినొందుచు
జచ్చుచున్నవో యట్టి యాత్మను నేనుగానున్నాను. 'తదాత్మతత్త్వం
ప్రసమీక్ష్య దేహీ ఏకః కృతార్థో భవతే వీతశోకః' శ్వేతా! ఆత్మ
తత్త్వము గాంచినవాడు శోకరహితుడై కృతార్థుడగును. 'తన్మయా
అమృతా వై బభూవుః' ఆత్మజ్ఞానముచే నేను ప్రేమించునది యంతటా
నున్న నన్నేనా? లేక నీ దేహములనా? దేహముల ప్రేమించినను, ద్వేషించి
నను నాకు గలుగబోయెడిది రాగద్వేష యుత సుఖదుఃఖములే యని
తర్కించుకొని గుహనుండి నిద్రలేచి తలవెంట్రుకల విదల్చుకుంటూ నిఱ్ఱ
నీల్గి నావులించి బయలెల్లు సింహమువలె తన్ను సింహావలోకనముజేసెను.
కాని యుద్ధకుతూహలములేదు. ఆత్మజ్ఞానముద్వారా 'అస్తి భాతి ప్రియం
రూపం నామ చేత్యంశపంచకం, ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం
తతో ద్వయం' యని మిథ్యాశరీరముల చంపకపోయినను చావగలవు.
చావని యాత్మ చంపినను చావదు. నేనిక జేయవలసినదేమి? తానే వీరు
తనవారెదుటివారెవరు? రాజ్యమేమిటి యని యంతట నాత్మనే కలియ
జూచుచుండెను. ఈ విధము నాత్మతత్త్వము విన్నంతనే నానావిధమానవు

లకు జ్ఞానము గలుగవలెననియే భగవంతుని యభిప్రాయము. తొలుత నాత్మస్వరూపము దెలిసికొనా, నా వారు అనే మోహనివృత్తివల్ల మిథ్యా జగత్తున మిథ్యాశరీరమున కర్తవ్య మెంతమాత్రము చేయును? ఎట్లు వర్తింప వలెననేది సులభముగా సాధ్యమైతే నొకరికొకరికి రాగద్వేషములులేక నొక తండ్రి సంతానములోనివారికి తండ్రి యాస్తి సమమునిన్ని, యాత్మ యొక్కటి శరీరములు వేఱు, పెక్కయిన యున్నంతకాలమునే శరీరము నకు రాపిడి గలుగనని, మార్గమున వర్తింతురని భగవంతుడు దలచి వచించెను. విద్య రానీ పోనీ, స్త్రీగాని పురుషుడుగాని, పండితుడుగాని, యపండితుడుగాని ముఖ్యముగా నాత్మజ్ఞానము తొలుతనే గలిగిన సర్వానర్థకములు దాపురింపవు. తమ తమ కర్తవ్యములు తెలిసికొని పాఠశాల లోని బాలురు నేయే తరగతులయందున్న నాతరగతుల చదివి ప్యాసుకావటము తమ కర్తవ్యమని చదివినలాగు బ్రహ్మాండమంతయు బ్రహ్మకుటుంబమే, బ్రహ్మమేయున్న నిస్వార్థప్రేమ ప్రవర్తింతురు. అయితే నీ విద్యకు నధికారు లనధికారు లవసరములేదా? అన్న నధికారు లనధికారుల నిర్ణయము విషాదయోగముననే తేలిపోయినది. మఱియు గీతకు నధికారు లనధికారులా లేక నాత్మజ్ఞానమునకా? గీత యొంటిమా పుస్తకము. అక్షరములు జడములు. ముద్రణాలయమున ప్రింటింగుయగును. లేదా గీతాతత్త్వమంటివా ఆత్మను గుఱించి యున్నపుడు నాత్మ లేనివా రెవరుగలరు? ఆత్మగలవారే యధికారులు. అనాత్మ లెన్నటికినిగాదు. కాలేజీలు, విశ్వవిద్యాలయములు స్థాపించటము అధికారుల ననధికారుల నుద్దేశించియా? కాదు. బాలబాలికలకొఱకైగాని చదువక ప్యాసు కాలేకపోతే విద్యకు ననధికారులనవలె. ప్యాసైతే నధికారులనవలెగాని స్కూలునకు నధికా ర్లనధికార్ల చెప్ప కూడదు. అర్థములేని స్వార్థము అసూయ. 'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః' అని వేదమాతయే పక్షపాతములేక మీరు అమృతులరు, మృతులుగారని ప్రతియొక్కరిని నజ్ఞాననిద్రనుండి మేల్కొలుపుచున్నది. 'పుత్రాః' యంటే మీసములుగల మగశరీరములగాదు పేర్కొన్నది. శరీరములనుండి నాత్మపురుషుల ననగా జీవుల పుత్రులుగా సంబోధించినది. దేహాత్మబుద్ధితో దేహములమీద బడి కొట్టుకుంటూ, దేహములమీద నధికారము చెలాయించేవారే నిజముగా ననధికారులు. ఆత్మ స్వరూపము

స్వధర్మముల నెఱింగించిన కర్తవ్యము తెలిపినట్లగుచున్నది. స్వరూపము తెలియదా? కర్తవ్యమే తెలియక చాదస్తచ్ఛాందసత్వముల నిరంకుశపతు పాత సాంప్రదాయములకు దారితీయును. గీత పూర్ణగ్రంథము. అట్టి సంకుచితములిందు లేవు. తండ్రి లేదా తల్లి తన సంతానమున నవయువ విశేషములబట్టి నీవు స్త్రీవి, నీవు పురుషుడవన్నప్పుడు తమ జీవితములో భంగము గలుగని చందమున సంచరించుట వారికర్తవ్యము. పురుషార్థప్రయత్నంలో పురుషుడంటే మగదేహముకాదు. 'తస్మిన్నయం మనోమయం పురుషః' 'పురీ శయనాద్వా పురుషః' యన నష్టవిధములగు జ్ఞానేంద్రియ కర్మేంద్రియపంచకము, ప్రాణపంచకము, తన్మాత్రపంచకము, భూతపంచకము, అవిద్య, కామము, కర్మ, పురీషములు వీనినిగూడినవాడె పురుషుడు. మనోమయపురుషుడనికూడ పేర్కొనుచున్నది శ్రుతి. దేహమును పురుషుడనలేదు. నాటకమున నొకపురుషుడు స్త్రీరూపము దాల్చిన సర్వథా స్త్రీయనియే మనమనగలమా? నమ్మగలమా? స్త్రీదేహపురుషదేహధారియగు పురుషుని స్వరూపము గుర్తెఱుంగజేయుట లెస్సగాని, తన రూపే మఱచినవానికి స్త్రీరూపుడెట్లు తెలియబడును. శివుడు మోహినిరూపమునుదాల్చిన హరిని గుర్తింపలేక వెన్నంటుకథ నిందుకే తెలుపబడమైనది. వేదవేదాంతముల యాశయము, గీతాచార్య గీతోద్దేశము, తమతమస్వరూపముల బోధించి కర్తవ్యమును సాగించుటలో నిశ్చయిష్టమనిరి. అందుకే గీతకు సుదర్శనశాస్త్రమని పేరు. ఒకచో నాత్మవిద్య గ్రహింపని వారెవరైనసరే వారే స్త్రీలని చెప్పబడియున్నది. ఎంత దేహబలముగల స్త్రీయైనను యబలయందురు. ఆమాట యంకుశము వలె బలహీనతను గలిగించుచున్నది. ఏనుగెక్కడ అంకుశమెక్కడ? సరాసరి యెదుర్కొన లేనివాని నొకడు నీవు స్త్రీవి యనును. రోషగించుకొనియైనా ప్రయత్నము చేయునీయని లోకదృష్టి, శాస్త్రదృష్టితో స్త్రీ యబలయైనదికాని స్వదృష్టితో నబలకాదు. దేహాభిమానము ఒకపాశము. మమకారముచే నావార మనుకొనునది యొక పాశము. రెండు త్రెంపగాని సంకెలలు. అపవిత్రస్థలముననున్న పవిత్రవస్తువును గ్రహించి, యపవిత్రమును వదలెదము. తల్లిరక్తమునువదలి పాలను, ఈగలనువదలి తేనెను గైకొన్నరీతి క్షుద్రమై నవరంధ్రములు గలిగి హేయమగు దేహము పవి

త్రముకాదు, దానియందలి యాత్మ పవిత్రమని తెలిసితే, ఏ యొక్క
చెడుగు వ్యావహారికముగ లోకమున కెవ్వడు చేయజాలడు. ఇంత
యుత్పత్తియైనను, నైష్ఠికబ్రహ్మచర్య, గృహస్థబ్రహ్మచర్య, విదురబ్రహ్మ
చర్యముల సనాతనధర్మము తప్పనివారై ఉపనయనత్వమును హస్తగతము
జేసికొందురుకదా. చెప్పేపని యుపాధ్యాయులది, చదివే ప్యాసయ్యేది పిల్లల
పని. అయితే క్రింది తరగతివారికి, పై తరగతి బోధచేసితే గ్రహింపగలడా?
అన వచ్చును. అసలు క్రింది తరగతినుండి పై తరగతికి పోనిది పై తరగతి
యెట్లు వచ్చును? పై తరగతులుకూడ క్రిందితరగతివారికేగా? క్రిందితరగతి
లేనిచో పై తరగతి యెవ్వరికి? అంతా క్రిందితరగతులైతే పై తరగతు లేల?
ముఖ్యముగా తరగతులెందుకు? సోపానములవలె పై తరగతికి పోవుటయే.
చదువే ముగిసిన తరగతు లెక్కడ? క్రింది తరగతివానికి, పై తరగతు
లున్నవని తెలిసితేగా యీ తరగతి చదువగలడు. క్రిందితరగతివానికి పై
తరగతులుకూడ క్రిందితరగతి పై తరగతులు తెలిసితే చదివేదానికి తెలి
యకపోతే చదివేదానికి భేదమున్నది. అది సరియైన సవాలు కానేకాదు.
పై తరగతికిపోతే నగునుగాని పోకనే పై తరగతియని యనుకున్నంతనే నా
తరగతి చదివినట్లగునా? తరగతుల యుద్దేశ్యము తరగతులలోనె నెప్పు
డుండుమనికాదు. తరగతులన్ని ప్యాసై వలయు స్థితిని బొందవలె. అంద
ఱికు తలలున్నవి, బుద్ధులున్నవి, తెలివియున్నది. అంతా పరమాత్మయే.
కాదనుటకు నెవరికేమి హక్కుగలదు? తానెవరు? కాదన్న పతనము
కాగలడు. సుమారు 20 సంవత్సరములకుపైన స్త్రీలకు, వైశ్యశూద్రుల
కునే విద్యలహక్కు యుండేది. తెలియక సదరు కళలు విద్యలు రావేమొ
నని యనికొనెడివారు. ఎందువలన నిట్లున్నదో తెలియదు. కాని పూర్వము
గార్గి మొదలైనవారలవలె రాజకీయము మొదలు నన్నిరంగములలో
ప్రపంచమునగల భాషలన్ని నేర్చినవారు. పాండిత్యమున, విజ్ఞానమున,
విదేశములసహా వైజ్ఞానము గల్గించువారై గలిగించుచున్నారు. ఈలాటివి
నార్జించునది తెలివియా? వర్ణములా? తెలివియేకాని వర్ణములుకాదు.
తెలివి దేనిస్వభావము? విచారించితే తెలియును. తెలియనంతవఱకు
సంఘము లవసరమేగాని తెలిసినపిమ్మట, స్వతంత్రుడైనపిమ్మట
సంఘ కట్టుబాట్లు, వాని వాని జీవితనాశనమునకు శాంతి భంగములే

యనెను స్వామివివేకానంద. వస్త్రములకు రంగులవలె, నేవర్ణములున్న నేమి ఫలము, నీ హృదయము ప్రేమరంగులో ముంచుమనెను కబీరు. ఇతరుల తిరస్కార పురస్కార యుత్తరాలకన్న, నీస్వంతరూపురేఖలే చక్కని సిఫారసు యనె నరిస్టాటిల్. పరువుమర్యాదలన్నవి నీమెడలో వేసుకొను రుద్రాక్షమాలలు, జంజెపుపోగులు కావు, నీ హృదయములో నుద్భవించే యుత్కంఠలనెను మంజేరి ఈశ్వరన్. పాండిత్యముతోను, తర్కముతోను నితరుల నోడింపగల్గువాడు మహాత్ముడు కాడు; నిష్కామప్రేమను ప్రదర్శించుటలో నితరుల నోడింపగల్గువాడే నిజమైన మహాత్ముడనెను అవధూత్ జ్ఞానానందదేవ్. మానవహృదయమునందు ప్రవేశింపగల దురాలోచనలనన్నింటిలోను యితరులకంటె నేనధికుడనను భావము పరమ హేయమైనదనెను స్వామి వివేకానంద. మతముల, జాతుల, గ్రంథముల పరిశోధించునపుడు నీ హృదయమును గూడ పరిశోధించుమనె స్వామిరామతీర్థ. ప్రతిజీవి స్వతంత్రముగా నుండవలె నన్నపుడు గర్భమునుండి పుట్టి స్వతంత్రుడయ్యేవఱకు తలిదండ్రుల పోషణమనే సంఘధర్మముగాని, మత ధర్మముగాని యావసరము. ఆపల నవియే నంటగట్టుకుంటే స్వతంత్రతయే నాశనమగును. అట్లు నాశనముజేసే సంఘములు, మతములు యానామమున కర్తములే గావు. శక్తిహీనునిజేసే మతసంఘముల వదలినగాని మోక్షమేలేదు. సతీసావిత్రి, జానకి, శారద్జీ, మదాలస, విశ్వవర, చూడాల, గార్గి, సులభ, ఇంగ్లండునుండి వచ్చిన అనిబిసెంట్, మీరాబెన్, సోదరి నివేదిత, మాతృశారద, మీరాబాయి, సక్కుబాయి మొదలైనస్త్రీలు, స్వామి దయానంద, రాజారామ్‌మోహనరాయలు, ఠాకూరు, రామతీర్థ, రామకృష్ణ, వివేకానంద, సమర్థ, అరవింద, రమణ, గాంధీ, మలయాళ మహర్షులవంటి పూర్ణవిజ్ఞానవేత్తలు నమరసందేశము నిచ్చు లోకవైతాళికులైనారంటే నాశ్చర్యమేమున్నది? కట్టుబాట్లులేని స్వధర్మపరులైనారంటే నది వైదికసాహిత్యకళాపోషకి సధర్మరూపిణియగు గీతామాతయొక్క యుజ్జ్వలజ్ఞానోపదేశమే కారణము. దేహధర్మమే మనధర్మమనుకున్నాము. ఆత్మను మఱచి, దేహము నేననుకున్నాము. దేహమునకు గావలసినది చనిపోవునంతవఱకు నాకలికన్నము, దప్పికినీరు, మానమునకు గుడ్డ, రోగమువస్తే చికిత్స, నిదురవస్తే నిదురింపజేయుట

ధర్మము. ఆకలి కన్నమవసరమైనపు డవసరమున్నంత తీసుకొని జీవించుట హాయి. దేహమునకు కావలసిన పదార్థముల దేహధారి యార్జించు కొనుటయే స్వధర్మము. అనగా నాత్మను తెలిసికొనుటకు సాధనమైన దేహమునకు కావలసిన పదార్థసేకరణ మితరులకు హానిగలుగకుండ పోషించుకొనుట స్వధర్మముగు కర్తవ్యమగు. అప్పుడు సోమరులుండరు. దేశము దుర్భరతామపరిపీడిత కాదు. మనసునకు తెగులుండదు. అందఱకు జీవితవస్తువులు లభించును. దేహాభిమానము తొలగనంత వఱకు స్వధర్మమంటే తెలియనపుడు నేవిధముగానో జీవించటమే స్వధర్మమను కొందురు. ఆత్మను తెలిసికొనుటకు జ్ఞానము, జ్ఞానమునకు చిత్తశుద్ధి ముఖ్యము. చిత్తశుద్ధికి నంతరంగబహిరంగసాధనములలో బహిరంగ సాధనములగు యజ్ఞ దాన తపస్సుల నిష్కామముగా నాచరించ, యంతరంగములగు శ్రవణ మనన నిధిధ్యాసాదులు స్వధర్మములే కర్తవ్యములే యగును. పాఠశాలయందు తీర్ణు డగువఱకు చదువవలసినది విద్యార్థి ధర్మము. చదివియుత్తీర్ణులైనవారు చదివెడివారికొఱకు నుపాధ్యాయులై తాము చదివినదే చదివెడివారికి నేర్పుటయే నుపాధ్యాయధర్మము. లోకమను విద్యాలయమున నాత్మజ్ఞానము గల్గి యుత్తీర్ణులైన మీదట నుత్తీర్ణులు కాగలుగువారికై తాము నుపాధ్యాయులవలె నాదర్శక స్వధర్మ మొనరించుటయే కర్తవ్యమని సూచుచున్నది. "యావద్విజ్ఞాన సామీప్యం తావచ్ఛ్రేష్ఠ్యం వివర్ధతే" ఎంతెంతవిజ్ఞానము సామీప్యమగునో లోక మంతంత శ్రేష్ఠత్వమొందుట కదియే సాధన. ఆత్మతత్త్వము మానవులకందఱకు సులభముగా నర్థమైనను, అంతఃకరణదోషము పామరజన భేదవాదిజన సహవాసదోషములతో, ప్రయత్నలోపముతో నపరోక్షత్వ జ్ఞానమగుటలేదు. అందువలన 39 నుండి 41 శ్లోకమువరకు కర్మయోగము యొక్క శ్రేష్ఠత్వము జెప్పబడినది.

ఆత్మను తెలిసికొనుటకు జ్ఞానము సాధన, నయ్యది సాధ్యమగుటకు ప్రవృత్తిలో కర్మల దేహాభిమానముతో, నాసక్తితో జేసితే, స్వధర్మము బోధమగును. ఆత్మాభిమానముతో కర్మలచేయుట, యాసక్తి లేనిదగుటచే యోగమై నపరోక్షజ్ఞానమునకు సాధనమగును అని రెండు యభిప్రాయములతో భగవంతుడు వచించెను. ఆత్మను మఱవకుండ

నాత్మనే చింతించుచు నాత్మసుఖముకొఱకే ప్రహ్లాద, శిబి, మాంధాత, అశ్వపతి, సాళ్వ జనకాదులవలె ననన్యత్వముతోఁజేయు స్వధర్మకర్మలే లోకమునకు, తనకు క్షేమము. పతివ్రత పతిని మనస్సులో నుంచుకొని చచ్చినను, బ్రతికినను తన స్వధర్మమదియేనని పాలించును. దానివలన కీర్తిముక్తుల బొందును. సాధకు డీరీతి తన స్వధర్మము నాచరింపవలెను. అంతేకాదు. మనోనిగ్రహమునకు మనఃశ్శుద్ధికి సులువైన తెరవు. జ్ఞాన కర్మమార్గములలో నొకటియగు కర్మ అంతఃకరణశుద్ధికి చెప్పబడినది. జ్ఞానమునకు పరంపరాసంబంధము. అర్జునునకు కర్మయోగము విధ్యుక్త ధర్మమని చెప్పుట, కర్మచేయుట మనకర్తవ్యమని కొందఱనుచున్నారు. ఇందేమి భేదములేదు. జ్ఞానముచే నిన్ను నెఱిఁగి కర్మచేయుమనటము ఆత్మజ్ఞానముకొఱకే కర్మచేయుమనటము నర్థమొక్కటియే. విషయము తెలియక నిష్కామముగాజేయుట సాధ్యముకాదు. అర్జునునకు సైతము నపరోక్షమాత్మయందైనదో లేదో కర్మచేయుమనటములో నాంతర్యము. ఆత్మజ్ఞానము పరోక్షముగా గలిగినను యనుభవైకవేద్యము గానిచో కర్మలవదలటము నాత్మవంచకము, లోకసంకరమగును. శుద్ధాంతఃకరణ గలిగి యపరోక్షజ్ఞానము గలిగెడివఱకు కర్మల చేయుచుండుము. ఒకవేళ నపరోక్షముగలిగిన, జ్ఞానివైతే లోకముకొఱ కొనర్పుము; ముముక్షువైతే మోక్షముకొఱకు కర్మల నిష్కామముగా జేయుమని భగవదాజ్ఞ. అటువంటప్పుడు స్వధర్మ మెవ్వరికి బంధముగాదు. ఇదియే గీతయందలి గొప్పతనము. జనకౌశలము, నాశ్చర్యకరమగు వేడుక, సర్వమత, సర్వ ధర్మముల ప్రతిష్ఠితమగుట, నన్నిసిద్ధాంతముల ననుష్ఠించుటకు, శ్రేష్ఠత్వము నొందుటకు తగినమార్గముల నెమకినదికాని యందులో జ్ఞానకర్మయోగ ములే స్వధర్మమంటే క్షత్రియధర్మమని కొందఱు. కాదు తమతమ వర్ణధర్మమని కొందరు. శాస్త్రనియమితకర్మధర్మమని కొందఱు. ఆచార్య వినోభాగారు తానీ లోకమునకు రాకమునుపు నున్నసంఘసేవ తనరాకకు కారకులైన తలిదండ్రులసేవయే స్వధర్మమనెను. శాస్త్రదృష్టి లోకదృష్టి వాక్యములు స్వదృష్టిలో నంతర్భూతములగును. లేవుకూడ. స్వదృష్టిలో 'స్వ' యనగా తాను "ధర్మ"మన తనధర్మమని యర్థము. ఆత్మకొఱకే చేయుము; దేహమగు పరధర్మముకొఱకు కర్మచేయవలదు. అయ్యది

బంధమగును. భగవంతుని కరుణ యమేయము. స్వధర్మమే మోక్షము, పరధర్మము బంధము.

ప్ర॥ దేహములు తమంతటాము చనిపోవునుగదా ? ఆత్మ చావదు గదా? అటువంటప్పుడు స్వధర్మమెఱిగిన యర్జునుని యుద్ధమొనర్పుమనుట యేల ?

ఉ॥ యుద్ధమున నంతరంగమున సదా కామాదిగుణములకు, శమ దమాదులకు గలుగు సంఘటిలమేనని కొందఱు. ఆత్మసాక్షాత్కారము కొఱకు శమదమాదులచే కామక్రోధాదుల నెదిరించు ప్రయత్నమే యుద్ధమని కొందఱు. వ్యావహారికమగు యుద్ధమేనని కొందఱు, జ్ఞానోపదేశము జేసిన కృష్ణుడే మారణకృత్యమొనర్పుమనవచ్చునా యని కొందఱు. అంతయు విన్న నర్జునుడు నూత్రము తనవారిచంపవచ్చునా యనియు పలువిధముల తలంచెదరు, ఒకప్పుడీసందేహములన్ని యెఱుగుట మన కవసరమే. నొకప్పుడన్ని యనుచితమే. శాస్త్రదృష్టి, లోకదృష్టి స్వదృష్టులు మూటిలో, స్వదృష్టిలో తక్కిన రెంటిని జోడించి చెప్పుట కొందఱకు స్వభావమే యగును. నరనారాయణులు ధర్మరక్షణార్థ మర్జున కృష్ణులుగా జనించివారనునది వారికి చెల్లునని తోచకపోదు. ఒకనిచేతికి డాక్టరు ఆపరేషణ జేయకపోతే శరీరమునకే ముప్పువచ్చునని తెలిపి చేయిదీసి మిగిత దేహమును రక్షించుట డాక్టరునకు పాపములేదు. స్వార్థముగాదు. మఱియు గౌరవము. తద్రీతి లోకస్వరూపుడగు భగవంతునకు నొకభాగములోని దుష్టరోగమువంటి దుర్యోధనాదులకు మధ్యవర్తిత్వము మొదలగు చికిత్సలుచేసినను రోగము మానవపుడు నావరేషణ చేయుగలిగిన భాగమునకు చేటుగలుగుతుందంటే తక్కిన లోకము నాశనమగును. అప్పుడు దుష్టభాగమగు వీరల చంపుట దోషము కాదని యొకయర్థము. భారతము మొదలే ఇతిహాసము, వ్యాసుని రచనా విశేషము. మఱొకవిషయమొక పాతివ్రత్యముగల స్త్రీని యొకడు దుర్మార్గముగ నామెకు నిష్టములేకపోయిన చెఱుపప్రయత్నము బలిమి చేయ తాను ప్రతిభంగమగుటకంటె మానప్రాణరక్షణమునకు వానిని చేతనైతే జంపినను, ముందే చచ్చినను దోషములేదు. అట్టివాడు చచ్చుట చేత ననేకమానవతుల కుపకారమొనర్చుడము, ఇక నెవరినైన దుష్టాత్ములు

తగలకుండయుండడము, చంపగలరనే భయమున దుష్టజనము వదలటము రెండు మేళ్లు లోకమున కొనర్చినట్లగును. అర్జునపురుషార్థము, కృష్ణపురుషార్థము. దుర్యోధనాదు లెదురించక తమంతయూరకున్న చంపుట పాపమే. భాగము నివ్వకపోగా భాగస్థులనే తుదముట్టింప నెదిరించటము. దోషము వారిదే. మరొక రహస్యము. కృష్ణుడు విశ్వరూపమును జూపించటము, తాను కాలస్వరూపుడను, నీవు నిమిత్తమాత్రమనెను. ఇదియే నిజరహస్యము. ఇంకొకమాట. స్వధర్మమునకు ప్రతిఘటనములగు వ్యావహారికములగాని, నాంతరంగికములగాని స్వదృష్టితో నిరోధించుటలో దేహపతనమైనను నంతకులోపలనే జయమైనను భయములేదు.

ప్ర॥ గీత కర్మను యేవిధముగా జేయుమంటున్నది ?

ఉ॥ ప్రతియొక్క మానవుడు తన స్వరూపమును దెలియక దేహాత్మబుద్ధితో జీవితమునకై మనోవాక్కాయముల కర్మజేయుచున్నాడు. కర్మక్రియారూపముగ ప్రారంభించకమునుపే నంతరంగమున నిట్టిదని సంకల్పింపబడును. ప్రతియొక్క కర్మకు మానవుడు తాను కర్తను, భోక్తను యను నహంకారముతో నొనరించును. చేయబడిన కర్మఫలము తాననుభవింపవలయుననేకదా! అన్ని ప్రాణులయిచ్ఛ కర్మఫలము నపేక్షించును. అపేక్షలేక కర్మచేయుటమెలా? కర్మ యెట్టిదియైనగాని ఫలము ననుభవింపవలసినదే. చెడుకర్మయైన చెడుఫలము, చెడుభోగము; మంచికర్మయైన మంచిభోగము. తనకు తెలియుచునేయుండికూడ కీలకము తెలిసికోలేక రబ్బరుచెండువలె నెగిరేది, తనకున్న కాలతన్నేది, నాడు కొనువారి కుండినట్లు కర్మఫలము స్థిరముకలిగింపక నిటునటు సుఖదుఃఖములతో మలయుటమే నీ కర్మఫలము. ఈ జన్మములోనే ముగియక కర్మఫలమనుభవించుటకు బుట్టుచుండవలె. సుఖదుఃఖములకు కారణము దేహము. దేహము కర్మఫలము. అజ్ఞులీరహస్యము తెలియక వాంఛితములజేసి యెడతెగని కర్మలజేయుచుందురు. కర్మఫలము సూక్ష్మముగ సంచితరూపమై యేర్పడి "సంచితాగామికర్మాణి" యనురీతి సంచితాగాములు రెండు ప్రారబ్ధమును గలిగించును. అందువలన నెవరెవరి సుఖదుఃఖములకు వారే కారకులు. మరెవ్వరుకారు. వాచా మంచి మాటలాడినను లోపల దుస్సంకల్పములున్న రెండుదోషములు వచ్చును.

ఎందుకన కపటఫలమెక్కువగును. ఇష్టముతోగాని, అయిష్టముతోగాని, పరేచ్ఛలోగాని నేను జేయుచుండిననే కర్తృత్వముండిన నాఫలము తన్ను నీడవలె వదలదు. ఒకవేళ నకర్మలజేయక మానిన బంధము తప్పునేమో యని యూరకున్న మఱెన్నడైన చేయుటకు గల బలవంతకర్మ నంతరంగమున జేయించుచుండును. కర్మల వదలినను కర్మకారణములగు సంకల్పములు వదలవు. శాస్త్రము కర్మల సంయమమొనర్చిన బంధములేదని చెప్పుచున్నది. కర్మఫలములయందలి యభిమానములేకుండ కర్మచేయటము సాధ్యమా? యన్నదే ప్రశ్న. ఆసక్తిలేకుండ కర్మచేయుటెట్లు? జీవితము జరగటమే దుర్భరము. శాస్త్రము వేనిని వలదంటుందో, వేనిని చేయమంటుందో, నొకశాస్త్రము యొకరీతి, యొక్కొక్కదేశమునకు నొక్కొక్క యలవాటు, నీకర్మలు చేయవలసివచ్చును, ఈ కర్మల బంధములేకుండ చేయుటమేలాగా యని పండితులుగూడ తికమకలగుచుండుట భగవంతు డర్జునునకిచ్చిన సలహా కర్తృత్వముతో, దేహాభిమానముతో జేయుమని కాదు. తానెవరైనది తెలియనపుడు, కర్మలనెందుకు చేయవలెనో నెఱుగనప్పుడు దేహాత్మబుద్ధితో జేయుదురు. ఆత్మ యఖండ మన్నప్పుడు నాత్మదర్శనము, నాత్మానందమునొంద నాత్మకొఱకేచేయు కర్మఫలము నపేక్షించుటచేత, నాత్మదర్శనమునకు బదులు దేహములు వానివలన సకల దుఃఖములు తప్పనిసరిగ గలుగుచుండును. ఆత్మకొఱకంటిమా, ఆత్మ నిర్వికారమగుటచే కర్మఫలము భుజించునది కాదు. ఆకలిదప్పికలు, జన్మమరణములు, సుఖదుఃఖములు లేనిదని కర్మ మానవలదు. కర్మఫలములవదలి నాత్మకొఱకే చేయవలె. కర్మఫలకారకుడవు గావద్దు, అకర్మివిగావద్దు యని నాలుగు ధర్మముల నుపదేశించుట సకల మానవశ్రేయోదాయకమగు నీరహస్యమువిని గీత నందఱుచదివి, నందఱు కర్మఫలత్యాగమొనర్చి నాకర్మఫలము వృథా కాదా! యనక భగవంతునకో, లోకోద్ధరణకో, సంఘోద్ధరణకో వదలి యనహంకారులై నకర్మపరులుగాక కర్మజేయుటయే స్వధర్మమగు కర్తవ్యము. ఏ కర్మఫలము తొలుత తనపైనుంచి చేయు కర్తవ్యముండనో నిప్పుడా తనకనునది వదలి చేయుటము. ఆత్మను జ్ఞానముద్వారా తెలిసినను కొందఱకు చిత్తమున మాలిన్యముండును, డాక్టరుతో మందు

పుచ్చుకొన్నను సరిగా పథ్యములేక రోగహారముగానిచో మరల మందు బుచ్చుకొనవలె. అంతఃకరణదోషనివృత్తికై, కామనారహితులై కర్మల జేయవలసినదేనని యర్జునుని నిమిత్తముజేసి మనకొఱకు భగవంతు డుపదేశించెను. భగవంతునికొఱకేగదా కర్మల నెట్లాచరించితే నేమని తనకన్న నన్యఃయుగు దేహబుద్ధుల నొనరించిన నిష్కామమనిపించుకోదు. ఎంతవఱకట్లు జేయుచుండవలెనన్న నాసక్తిలేనిది యెంతకాలముజేసినను యే దోషము లేదు; ఏ హానిలేదు. ఒకవేళ చేయుటలో సుఖమో, దుఃఖమో, కష్టమో, జయమో పరిసమాప్తి కాకపోతే పాపమేమైన రాదా ? యను చింతలేదు. నిష్కామమగు కర్మచేయుటలో, జేయించుటలోను, జేయుచు గతించుటలోను యంతులేని తేజస్సు, నిర్మలము, నిర్భయము, శుభమే యగుచున్నది. శ్రీకృష్ణుడు చిన్నతనమున గోవుల గాయుటము, గొల్లపిల్లలతో గాయించటము, గోవులకు, గోపకులకు, గోకులమునకు వచ్చు దుస్సంకటముల దూరమొనర్చుటములో నున్నది నిష్కామము. కావున శాశ్వతచరిత్రమై పోయినది. కర్మఫలమునకు హద్దుపద్దు లున్నవి. ఫలరహితకర్మకు హద్దుపద్దు లేదు. ఫలకాంక్ష పాశమగుచున్నది. ఫలరహితకర్మ పూర్వ కర్మఫలపాశముతోసహా తెగి స్వేచ్ఛనిచ్చుచున్నది.

ప్ర॥ కర్మలు యెన్నివిధములు ? ఫలములేవిధము ?

ఉ॥ సాంఖ్యయోగమున కర్మయోగరహస్యము సంక్షిప్తముగా జెప్పుచున్నాను. నీ వడిగిన విషయము మూడవయధ్యాయమున తెలుపబడును. అయినను స్వధర్మమునకు తగిన కర్మలు యేవైనను సరియే నన్నింటి ఫలముల వదలవలె. కర్మఫలత్యాగము నీశ్వరుని స్వధర్మమున జూడు. సకలైశ్వర్యము సకల జీవులకొసగి కాడు లేక కొండగుహ నివసించటము, స్థలములేక భార్యనుసైతము నర్ధశరీరమునదాల్చి గంగకు శిరస్సు, చంద్రునకు ఫాలతలము, పాములకు తక్కినదేహము నొసగి సర్వత్యాగియై, నశేషరూపవ్యాపియై వెండికొండయను శుద్ధసాత్వికవృత్తిగలిగి, త్రిశూలి యను మూడుగుణములులేక నీషణత్రయముల హరించిన ధీశాలి శంకరుడు సుఖరూపి. చతుర్ముఖబ్రహ్మ సష్కామముగా కర్మ జేయుచున్నాడు. విష్ణువాలాగే కర్మ చేయుచున్నాడు. సూర్యు డొడుదుడుకులులేక

నియమబద్ధముగ కర్మనొనర్చుచున్నవి. సూర్యుడు, సముద్రములు, పంచ భూతములు, వృక్షములు, కొన్ని పశుపక్షులు సైతము నిష్కామముగా కర్మజేయుటలోనే నవి శ్రేయోదాయకముల నొందుచున్నవి. కర్మకాము లకు కర్మవిఘ్నమైన భయమో, దుఃఖమో, ఫలమందెవరికి తీవ్రతరమో వారికి పూర్ణసుఖముండదు. కర్మఫలము స్వతంత్రించి చేసినది, ఇతరుల సహాయ మున జేసినది; నెవరో జేసినదైనను లేక మోసముతోనో, క్రూరము తోనో జేయుకర్మ నొకేవిధముగ సాగదు. నడుమనడుమ భిన్నములు గలుగుచుండును. కొందఱు ప్రోత్సాహముతో నొకదేవళము ప్రారం భించి ముగియకనే నాగిపోవును. ఇటువంటివే ధర్మసత్రములు, చలిపంది రులు, స్కాలరుషిప్పులు, సదావర్తులు, కుంటలు, బావులు, చెఱువులు, రస్తాలు, గ్రంథముద్రణలు, ఉచితవిద్యలు, ఉచితాన్నదానాదులన్నియు మధ్యలో నాగిపోవుచుండును. మఱి జుగుప్సగలగటము, అశాంతి రాగ ద్వేషములు హెచ్చుటము తలక్రిందులగుటలేదా? అన్ని నెరవేరితే నద్వోకేటు చేయుటము, కోటి యుపద్రవాలు చెప్పటము చూచుచున్నాము. కర్మఫలాపేక్షులకు కాయికవాచికముల కర్మకు విశ్రాంతి లభించినను మోక్షపర్యంతము నాంతరంగికకర్మ సముద్రతరంగములవలె నడుచుచుం డును. సత్వరజోతమోగుణములకు సంబంధించిన కర్మ పాముపోక వంకరల వలె, నెమిలి పింఛమునందలి కన్నులవలె నన్నియు తలంపులే. పుణ్యము గానో, పాపముగానో, పుణ్యపాపమిశ్రమముగానో పిల్లలచేతిలో బెట్టిన రబ్బరుచెండువలె, పిల్లిచేతిలోని నీరువలె, దారితెలియని పాంథునివలె, కర్మలనివృత్తి యుపాయముగానక నీగవలె, జింకవలె, నేనుగు తొండము వలె, మేకవలె, పులివలె, కుక్కవలె, కోడివలె, నొకదానివదలి మఱొక దాని నాశ్రయించుచు తెలిసికొంత, తెలియకకొంత, నితరప్రోత్సాహ మునకొంత దర్పదంభములతో నవిద్యాచేతస్కులగుటచే వేగముగ ప్రవహించు నదిలో నీతరానివానివలె, గాలికిలేచిన యణువువలె, చేప చేష్టలవలె పరిమితము, స్థిమితము, నిర్మలము, శాంతము, మనస్సున కుండనేయుండదు. అదేగాక, నొకప్పు డదృష్టముపై, నొకప్పుడు తమ కర్తవ్యముపై, మఱొకపు డితరులపై నాధారపడి ధనమున్నను, లేకున్నను, విద్యయున్న లేకున్నను, యూరనున్న, యడవినున్న నీలాటి వ్యక్తుల

కర్మము, మత్తుద్రావ తేలద్రిప్పినట్లు పై త్యాగించినవాని వికారమువలె నుండును. తమకుగాని, తమతోటి యితరులకు జంతుజాలములకుగాని వేయేల; లోకమునకే క్షేమముండదు. ఒక పార్శ్వమునుండి గాలిని తోడుచేసుకొని జాజ్వల్యమానముగ నడవినంత దహించుకుంటూవచ్చు నగ్నికినెదుటనున్న నేవస్తువున కే ప్రాణి కెట్లు శుభములేదో నట్లు యాశాగ్నితోగూడిన వారగ్నివలె నెదుటివారినిగూడ గాల్చక మానరు. మన రామాయణాది పురాణాలలో రావణ, కుంభకర్ణ, మహిరావణ, అహిరావణ, హిరణ్యాక్ష, హిరణ్యకశిపు, శిశుపాల, దంతవక్త్ర, కంస, జరాసంధాదులవంటి జీవితాల మన మెఱుగనిదికాదు. అలాంటి శ్రేణిలోని ధృతరాష్ట్ర దుర్యోధనాదుల జీవితాలు, నాలాంటి పశుబలహింసాపరుల జీవితాలు తమతోపాటు ననేకుల జీవితముల ధ్వంసముజేసిరి. అట్టివారేకాలమునందైన నుందురు. వారే ప్రత్యక్ష ధార్తరాష్ట్రాదులు. నిష్కాములట్టివారుకారు. మొదలు తామే కర్మలవలనగలిగే బంధముల దప్పుకొందురు. ఇక యితరప్రాణులకు హానిగలుగకుండ జూతురు. ఇతరులకయ్యే తమ ప్రయత్నమంతయుగూడ నిష్కామములకు కర్మ చేయకుండ నుండుటపంటే, నేదిమో యొకకర్మ జేయుటలోనే వారికి హాయి, ఆరోగ్యము, సౌందర్యము, తేజస్సు, యశము, ఉత్సాహము, బలము, దృఢము, ధర్మము. పబ్లిక్ బజారులో మీరు స్త్రీలు, మేము పురుషులమను నభిమానములేక వస్త్రహీనులై బాల బాలికలు నాడు యాటలలోని, నిష్కామానందములోని కర్మలలో నెంత మాధుర్యము, ప్రేమ యున్నదో నచ్చుపడ మనకు తెలుసును. వారి జీవితలక్ష్యమునకు నదొక యాదర్శము, నిదర్శనము. రాగద్వేషములు, అశాంతి, దుఃఖము నేకొంచెము లేనిది. ఒకడు పాడుచుండ నొక డాక్షేపించినను, ఒకడు జేయుపనిని తప్పులుబట్టినను, నొకరి తెలివున కొక రడ్డమువచ్చినను వాని వాని సహజానందము నరికట్టినట్లగును. నిష్కామముగ నొనర్చిన యుడుతకర్మ, యుడుత చిన్నదైనను ఫలము చూచితిమా, వామనుని వలె మహామహుల కీర్తులను సైతము దిగమ్రింగి వింధ్యవలె పెరిగిపోవుచున్నది. గడియారము నిముషములు గంటలు తెలుపుటకై నడచు నిష్కామశ్రామికము లోకమునకు సూర్యుడులేని కొరతదీర్చి శుభము

నొసగుచున్నది. చలిపందిళ్లు, కుంటలు, బావులు, వనములు, గ్రంథములు నచ్చొత్తించటము, అన్న, వస్త్ర, పశు, ధన, ధాన్య, విద్య, జ్ఞానదాతలకుండే యానందము ఫలకాములకు లేదు. లోకోద్ధారముకొఱకు యంత్ర, తంత్రములను శిల్పములను తయారుచేయువారికి లభించు నిష్కామానందము కాముకుల కుండదు. శ్రీకృష్ణు డర్జునుని రథము నడపటము, పార్థసారథి యన బిరుదు సాధించటము, నా సుదర్శనము, నాలుకు, గోపకులకు శత్రువుల చేత మాటలు తినటము, శత్రుపుపోటుల బడటము, వారికె మోక్షము నిచ్చుచున్నాడంటె; గుఱ్ఱముల కడగటము, నవతారము లెత్తటము, వింత వింత పను లొనర్చటము నాయనకందేయున్నది యానందము, నాధ్యాత్మిక జీవితకళ. తన రూపమునకు, స్వభావమునకు నాయన యెన్నెన్ని యవతారములెత్తి, యేమేమి కర్మల నొనర్చిన బంధములేదు. ఎందుకన ఫలాసక్తిలేదు. తాను పొందిన యనుభవైకవేద్యమగు నిష్కామకర్మ గొప్ప రహస్యము. తాను జేయుచు గీతద్వారా లోకమునకు చాటియున్నాడు. ఎందఱో రాజన్యులు రాజ్యపాలన జేయుచు, నిష్కామమున మోక్షమును బడసిరి. రామపట్టాభిషేకమున సమస్తజనులకు రాముడు కానుక లొసగు చుండి సీతతో హనుమంతునకు నీ హారమిమ్మన్న నామె నొసగనీ నతడు దానిని నమలి పారవేసెను. ఎందుకు? హారములోని ముత్తెములలో నెచ్చట జూచిన రామనామములేదని. ప్రతిఫలరహితులకు ఫలము రుచింపదు. ఛత్రపతి శివాజీ తన రాజ్యమంతయు గురువునకర్పించి రాచకర్మ మొనరించెనంటే, మహాత్మాగాంధీజీ 18-19 గంటలు నియమబద్ధమైన కర్మ జేయుచుండెనంటే, వారికున్న యుత్సాహము ఫలరహితములో గాంచినారు. బుద్ధునివంటి రాజపుత్రుడు లోకసేవలోయుండే రహస్యము గుర్తించినాడు కాన యవతారమూర్తి బుద్ధభగవాన్ అనిపించుకున్నాడు. దధీచి, భగీరథ గరుడుడు విష్ణు వాహనముగ, వృషభము సదా శివవాహనముగ, నెమలి కుమారుని వాహనముగ నున్నవనుట నిష్కామములో నుండె రహస్యము గుర్తెఱిగినవారు. ఎందఱో మహాతల్లులు ఫలరహితకర్మల నొనరించి, దిగంతవ్యాపితకీర్తికరులుగా, నమరులుగా, నిత్యసంకాశ ప్రకాశులైనారంటే, నా నిష్కామమునం దంతశక్తి యుండబట్టియే గీతోపదేశము బారలు చాచుతూ నుదయించుచున్న సూర్యకిరణ

ములు వ్యాపకమగునట్లు త్రిలోకముల వ్యాపించినది. లంచము దీసికొని వకాల్తు జేయు వకీల్లు, డబ్బు బుచ్చుకొనక తగవులు దిద్దువారు, వీరుభయులలో ఫలాపేక్షులు, ఫలరహితులు గానిపింతురు. ఫలాపేక్షులకు స్వతంత్రస్వేచ్ఛ, ధీరత, ప్రేమ లేదు. వజ్రము సానదీయుకొలది, బంగారు మెఱుగు బెట్టుకొద్ది వన్నె హెచ్చినట్లు, త్రికరణముల నొనర్చు శ్రౌత కర్మలుగాని, స్మార్తకర్మలుగాని, తదితర మేకర్మలైన నిష్కామములోనె మానవజన్మమునకు నిగ్గు. దైవత్వముగా తయారుకాగలరు. ఒకచో నిద్దరు స్నేహితులుండిరి. ఒకడు ఫలకారి, మరొకడు నిష్కామి. నిష్కామివద్ద కొంత డబ్బు తన యక్కరకు ఫలకారి తీసుకొనెను. ఎంతకాలమునకు తిరిగి డబ్బునివ్వ నిష్టము లేకుండెను. ఫలరహితుడు సొంత కష్టతరములేనిదే తన స్నేహితుడు డబ్బు యెందుకు యివ్వడని యతనిని బిలిచి డబ్బుతో నీ యక్కర దీరనట్లున్నది. మఱి కొంత నిచ్చెదను గొనిపోయి నక్కర గడుపు కొమ్మని యిచ్చెను. వాడు మొదటి సొమ్మును రెండవదఫా నిచ్చిన సొమ్మును నొకచో దాచెను. చోరు డది గని దొంగిలించెను. వాడు తన దురాశకు ఫలము గ్రహించి యీ జరిగిన నిజము సంగతి ఫలరహితునితో జెప్పెను. అతడు నవ్వి యయ్యాది మన యిరువురది కాదు. కనుక నీవద్ద నావద్ద లేకపోయినది. ఈ తూరి కొనిపోయి నీ యక్కర దీర్చుకొనుమనెను. ఇప్పుడు జూడు డిరువురలో నిత్యసంతోషి, నిస్స్వార్థప్రేమ యెవరిది? "పరోపకారార్థమిదం శరీరం" అను జీవికి ఫలాపేక్షయుండదు. శిబి మాంధాత రామభద్రాదు లీశ్రేణిలో జేరినవారె. లంక స్వాధీనముగానిదే విభీషణునకు పట్టముగట్ట, వానరులు రామునితో, రావణుడు సీతనుదెచ్చి యిచ్చితే నప్పుడేలా? తమ వాక్య మసత్యముగాదా? అన నిర్వ్యాజ, నిర్మోహ, నిస్స్వార్థపు రాముడు కెవ్వున నవ్వి, నా బుద్ధితో రావణుడు రానే వచ్చితే వానికి నయోధ్య, లంక విభీషణున కనెను. చాకలివాని మాటలకు సీతను యడవి వదలెను. భార్యావిమోహి కాడు రాముడు, ధర్మము నడిపి జూపించిన ధర్మరూపుడు. ఆయన పాలన మంతయు నిష్కామమె. అటులైన వారి కేల రాజ్యము? సన్న్యసించి నడవినుండగూడదా? యన్న సన్న్యసించితె గలిగెడు ఫలము రాజ్యపాలనములో, నిష్కామ

ములోగంటు. లోకులకు నాదర్శమూర్తియై లోకసంగ్రహము గావించి తన యవతారమును పూర్తి జేసెను. మఱియు నిష్కాములు, స్వతంత్రులు, భక్తులు మోక్షము నెట్లు వొల్లరో, నిష్కాములు సన్న్యసించరు. సన్న్యాసముకంటె నిష్కామకర్మయే వారి కానందము, ప్రీతి. కర్మఫలత్యాగులకు మధ్య మధ్య ననేకవిపత్తులు గలిగినను, వాని నెదుర్కొనుటలో వారి కెంతో యుత్సాహము, పరమశాంతము. తమ పరీక్షలని, వానిలో నెగ్గే కొద్ది యుత్తమస్థితి గలుగగలదని వారికి తెలుసు. ఉత్తరగర్భస్థుడగు పరీక్షిత్తును రక్షించి ద్వారకకు వెళ్లుతూ నత్తగారూ! నీకేదైన వరము గోరుకో నిచ్చెదనని కృష్ణుడన కుంతి కన్నుల నానందబాష్పములు రాల్చుతూ, యదునందనా! జనార్దనా! నిరంతర కష్టప్రాప్తి గలిగించుమని కోర, కృష్ణుడట్లేల యడిగితివన, నిన్ను నిరతము మరువకుండుటకు దోహదమగుననెను. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అంతఃకరణము విషయవాసనారహితము, మోక్షము. వాసనలే బంధము, వాసనలే కర్మలం. ఎప్పుడు నెవ్వరి వృత్తి విషయములనుండి నిర్వృతి జెందునో శాస్త్రప్రయోజన మప్పుడు సిద్ధించినదని తెలిసికొందుము. నిష్కాముల వాసనలన్ని క్షీణించి మైలలేని యద్దమువలె హృదయము నేకత్వమున, ప్రశాంతమున నుండగలదు. అప్పు డర్జును డడుగుచున్నాడు. హే భగవాన్! లోకేశ్వరా! నీవు వచించిన జ్ఞానయోగ కర్మయోగ రహస్యములను వింటిని; ఒకటి గుణసహితము, మరొకటి గుణరహితముగ నున్నది. గుణరహిత విషయము, గుణసహితమునుండి వ్యక్తము కావలసినట్లగుపడుచున్నది. ఆనందమైనది అయినను సగుణమగు తంతి మీటడము, తాళ మృదంగ లయముల మేళవించి పాడునప్పుడు గల్గు నిర్గుణము అప్పుడు వీణాదిసగుణము లున్నవో, లేవో నానిరాకారములో నున్నవానికి తెలియజాలదు. అట్లు నాత్మ నిర్గుణము, జ్ఞానము నిర్గుణము, కర్మ సగుణము, కర్మనుండియే జ్ఞానఫలము నొందిన మహాత్ములు చాల దుర్లభులు. అలాటివారు యెలా కూర్చుందురు? ఎట్లు మాట్లాడుదురు? సంచరించుట యెట్లు? ఉండు టెట్లు? అట్టి స్థితప్రజ్ఞుని లక్షణము జెప్పుమనెను.

ప్ర॥ నేనే యడుగుదామనుకుంటే నర్జునుడే యడిగి మేలుజేసెను. ఇందర్జునునకు సందేహమేల గలిగినది?

ఉ॥ నానావిధ కర్మఫలములగూర్చి వినుటచేత చంచలమైనది మనస్సు. పరమాత్మయందు నిశ్చలమును స్థిరము నగుటెట్లనియు నొకవిషయము నాచరణలోబెట్టి తత్ఫలమును బొందదలచినవాడు విషయమును ప్రయోజనమును తెలిసికొనును. జ్ఞానయోగ కర్మయోగము విననను. మొదటిది నిర్గుణనిష్ఠ. బుద్ధియందుంచుకొని ఫలత్యాగమువలన గలిగిన ఫలమును యనుభవమొనరించుకొన్నవారికి నీలోకమే దూరము. అటువంటప్పుడు నా కాలాటి ప్రజ్ఞగలిగినదో లేదో. గలిగియుండినను సరే; కలుగకపోయిన స్థిరత్వముకొఱకు కర్మచేయవలెనా? లేక స్థితప్రజ్ఞ యుండినను నెట్లుందురను సందేహములో నడుగ, భగవంతుడు స్మితవదనుడై యిట్లనెను. స్థితప్రజ్ఞుని లక్షణములు గీత వినిపించుటవలన మానవులకు గీటురాయి. సదరు స్థితి సాధకుల కవసరమని గీతనంతయు ననేకమారులు చదివినను, విన్నను పందెమువేసినవాడు యేకొంతతో నోడిన గెలుపులేదు. గీతాసారము ఫలవంతము కాలేదని తెలియుటకే విషాదయోగమున ధృతరాష్ట్రునికి ద్వితీయాధ్యాయమున 55 నుండి 61 శ్లోకమువఱకు స్థితప్రజ్ఞుని లక్షణములు, 62 నుండి 63 వరకు విషయచింతలకు ఫలము, 64 నుండి 72 శ్లోకమువరకు నింద్రియసంయమము, శాంతిలాభోపాయము, బ్రాహ్మీస్థితి తెలుపబడినది.

ప్ర॥ ఈ స్థితప్రజ్ఞుని లక్షణము సాధకులకు గడ్డువిషయము. సరిచూచుకొనుటకు నాదర్శకములు. అయిన వినవలసినదే.

ఉ॥ యోగికాని, జ్ఞానికాని యీ లక్షణములబట్టి తాము యుత్తీర్ణులమైతిమి, నికను కాలేదని తెలిసికొని ప్రయత్నలోపముచే పతితుడుగాకుండ నుండుటకు భగవంతుడీ గుర్తుల నుంచెను. పరీక్షా ప్రశ్నల వంటివి. సముద్రము దాటవచ్చు, చుక్కల నెంచవచ్చు, సింహముల నాడింపవచ్చు, ఆకసమునకు బ్రాకవచ్చు, అగ్ని బ్రింగవచ్చు, జలమున మునుగవచ్చు, పర్వతముల దాటవచ్చు, దేశమంత పర్యటించి యింతని జెప్పవచ్చు, సకల శాస్త్రముల, సకల మతముల శోధింపవచ్చు, రాకెట్ల గనిపెట్టవచ్చు, చంద్రసూర్యుల పుట్టచెండులవలెబట్టి నాడవచ్చు, కాలగతుల గనవచ్చు, అన్నోదకములు లేకుండ నుండవచ్చు, అనేకులకు నర్థతాత్పర్యోపన్యాసము లియ్యవచ్చు; కాని స్థితప్రజ్ఞుడుగా నుండవలె

నంటె నిజముగా గడ్డువిషయమె; నిది పెద్దప్రశ్న. అర్థము చెప్పటము, వ్రాయటము కాదు. ఇయ్యది యనుభవరీత్యా నెవనంతటవానికే తెలియును. బహిరంగక్రియగాదు; అంతరంగమునకు సంబంధించినది. తుదకంఅది నెఱుకపడగలదు. నీట మునిగినవాడు లోని కొన్నివస్తువులు తెచ్చితే నమ్మెదము. స్థితప్రజ్ఞుడైనందుకు గుర్తులు, స్వార్థతలు భగవంతుడు వివరించెను. ఒక పడవలో కూర్చొని ప్రయాణముసాగించిన నీటియలలకు పడవ యిటునిటు పొరలుచుండును. పడవలోని వానిశరీరము నటునిటు నొరుగుచుండును. తాను కూర్చొనియుండిగూడ భయపడును. తెడ్డువేయువాడు పడవను, పడవపై వారిని మునగకుండ రక్షించటము; తాను మునుగకుండ నున్నవానికి నొడుదుడుకులు లేనట్లు మనస్సనెడి లేదా సంసారమనెడి నీటియందు కోరికలనియెడి తొణుకులకు వెఱవని నావికునివలె కోరికల మొదలంట మనస్సునుండి ఖాళీచేయించి సకరు మనస్సువలన జ్ఞేయస్థితియగు నాత్మానందమున నుండటము. చూచినది, యనుభవించినది, కావలసినది కోరటమనే విషయవాసనలపై జుగుప్స గలిగినవి. మిథ్యలని భావించి యాగమాపాయినములని బాహ్యాభ్యంతరముల మూడవనేత్రమున దన్నెజూచుచు వర్షము యుప్పెన మంచు వగైరాలకు చలింపని పర్వతమువలె "ఏకో వశీ సర్వభూతాంతరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి। తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరాస్తేషాం సుఖమ్" ధీరుడై సుఖదుఃఖరాగద్వేషమానాభిమానముల గలిగినా, గలుగకపోయినా నచలస్థితియుండును. ఇదియొక లక్షణము. ఎట్టి ప్రజ్ఞయుండవలెనో యనుభవమునగాని తెలియదు. అవిద్య దాని కార్యములగు నింద్రియములు, విషయములు జ్ఞాననిష్ఠలేనివాని, కర్మయోగసాధన లేనివాని బొమ్మలాటకాడు తనచేతులతో బొమ్మల నెట్లు త్రిప్పితే నట్లుతిరుగును. అవిద్యేంద్రియము లెట్లుద్రిప్పి జననమరణ ప్రవాహదుఃఖముల ముంచును. ఒకకాలములో నొకయవస్థలోగాకపోయిన మఱొకకాల, మరొకయవస్థలమోసగించి గికురించు వాసనల ప్రవృత్తి తొలకరిమెఱుపులవలె బెదరించుచుండును. అట్టి సమయముల నులికిపడని చలించని స్థితియే స్థితప్రజ్ఞ. రామకృష్ణ, మాతృశారద, వివేకానంద, రామతీర్థ, గాంధీవంటివారల నిదర్శనముల గనవచ్చును. ప్రియాప్రియముల

రాగద్వేషముల నొందడు. శుభమునకు సంతస మశుభమునకు శోకింపక, నింద్రియములను తాబేలు స్వతంత్రించి ముడుచుకొనుటలో చాచుటలో, నపాయముగల్లునట్లున్న ముడుచుకొనటము, నట్లులేనిచో పాదములు చాచి చలించునట్లు విషయముల నింద్రియముల తనలో ముడుచుకొనును. వానియంటడు. ఇంద్రియనిగ్రహమునకు నాహారముమాని యుపవాసములుంటె నింద్రియములు శుష్కించును. నీళ్లులేనప్పుడు వాననీళ్ళు గలిగిన వికసించుతీగవలె నాహారము సమృద్ధిగా బుచ్చుకొన్నంతనె నరటిపిలకలవలె నింద్రియములు రసవంతములై కళ్లెములేని గుఱ్ఱమువలె పరుగెత్తును. కట్టలేని నీటివలె పరుగిడును. దేహముతోనంటకపోయిన వాసనలతోనే నాకర్షించి యనుభవింపజేయును. అందుచేత నింద్రియములనన్నింటిని నాత్మసాక్షాత్కారము లేదా భగవద్దర్శనమున వశమొనరించుకొనును.

ప్ర॥ ఇంద్రియముల తనవశములో నుంచుకొనకపోతే గలిగెడి హానియేమి?

ఉ॥ సారథిగ్రుడ్డి, రథికుడు చెవిటి, పగ్గములులేని గుఱ్ఱములు, నొచ్చుతగ్గులుగల చక్రముల రథము గమ్యస్థానముచేరునా? చేరలేదు. కన్నులకు రూపములు, చెవులకు శబ్దములు, నాసికకు వాసనలు, చర్మమునకు స్పర్శము, నాలుకకు రుచులు నివియే విషయములు. ఈ విషయములకు నింద్రియములకు సంయోగమున నేయింద్రియమునకుగల విషయవాసన బహిరంగముగగాని నంతరంగముగగాని గలిగినంతనె పురుషునకన జీవునకు నాసక్తి గలుగును. నాసక్తివెంటనేకామము, కామించగల్గినది లభ్యముకాకపోయిన క్రోధము గల్గును. క్రోధమునుండి వివేకభ్రష్టత యన తానుముందుబొందిన జ్ఞాననిష్ఠ మఱపుగల్గును. వెంటనే సదసద్విచారనష్టము గల్గును. వివేకము నశించిన మోక్షమునుండి పతితుడగును. కావున నెంత వివేకియైనను నింద్రియముల వశముచేసికొననిచో సంసారము తప్పదు.

ప్ర॥ వివేకులెవరైన నింద్రియముల మూలమున పతితులైనారా?

ఉ॥ శివ, బ్రహ్మ, దేవేంద్ర, బృహస్పతి, చంద్ర, పరాశర, విశ్వామిత్రాదులెందఱో నింద్రియవశగతులైనను మఱి ప్రయత్నమువలన, జపతపవ్రతధ్యానములవలన నున్నతిజెందిరి.

ప్ర॥ వీరేసమయమున నింద్రియనిగ్రహశూన్యులైరి? క్లుప్తముగ జెప్పుడీ.

ఉ॥ శివుడు మోహినిజూచి, బ్రహ్మ కూతును గని, దేవేంద్రుడు యహల్యను, బృహస్పతి యుతథ్యుని భార్య మునిపత్ని మమతయను గర్భవతిని జూచి, చంద్రుడు తారను, పరాశరుడు మత్స్యగంధిని, విశ్వామిత్రుడు మేనకను జూచి పతితులైనట్లు చదువలేదా?

ప్ర॥ కంటికి కనుపించని సూక్ష్మేంద్రియములు పురుషుని మోసముజేయుటలో గీతావచనము సత్యము. తుదకావంటి యాయింద్రియములనెట్లు నిగ్రహింపవలెనో తెలియదు.

ఉ॥ పొలమున గడ్డిగాదము తీయించనిచో నందువేయు విత్తనములు ఫలింపకుండజేయును. తెలిసినరైతు సస్యములు మొలిచి వృద్ధికిరాకుండ నటకాయించు గడ్డిని మొదలే తీసివేయించును; పంటపండించుకొనును. నిత్యానందమగు నాత్మానందమొంద యత్నించు యోగి యింద్రియముల వలన గలిగెడి ప్రతిబంధకముల నిరోధించినగాని బ్రహ్మబీజముల పండించుకొనగాదు. శాశ్వతానందము లభింపదు. కావున నింద్రియనిగ్రహముగలవాడు ప్రియవస్తువుల నాసక్తినుండి నప్రియముల ద్వేషమునుండి విడివడును. స్వాధీనములగు నింద్రియములవలన జీవించుటకు నవసరమగు విషయముల గ్రహించుచు నిర్మలుడుగానుండును. చిత్తము నిర్మలమైన దుఃఖము లన్నియు నశించును. ఏలయనిన నిర్మలచిత్తునకు బుద్ధి శీఘ్రముగ నాత్మస్వరూపమున నిశ్చలతగానుండును. ఇంద్రియనిగ్రహము లేదా వివేకబుద్ధి గలుగజాలదు. అప్పుడతడు యవివేకియే. అతనికి పరమార్థవిషయముల నభిరుచిగలుగదు. పరమార్థచింతాశూన్యునకు శాంతి లభింపదు. వ్యావహారికములగు వస్తుచింతనగల మనస్సు పారమార్థికమగు నిరాకారమున నిలువజాలదు. నిలువనపుడు శాంతములేదు. అశాంతచిత్తునకు సుఖమెక్కడ? ఏకాంతముగాగాని, బహుజనులలోగాని, పాపపుణ్యస్థలములగాని శాంతవంతునకు నశాంతిగలుగదు. అతనిసుఖమునకు భంగమురాదు.

ప్ర॥ జ్ఞానులను యోగులగూడనా లేక విషయాసక్తులగు పామరులనా? ఇంద్రియములు బలవంతము లొనరించటము?

ఉ॥ అగ్నిలో జొచ్చితే నెవరినైన నగ్ని దహింపకమానదు. నీటిలో జొచ్చితే నీరు తడుపకమానదు. మునిగేవాని, కాలెడివాని గుణించికాదు

ఇంతకు మనము చెప్పుకుంటూవచ్చినది. మునుగకుండ, కాలకుండ తప్పించుకొన జూచినవారిని గుఱించియే. ఆ తప్పించుకొను నుపాయములే జ్ఞాన కర్మ సాధనలు. సాధనములున్నను జ్ఞానులగాని, యోగులగాని వాయువశమున పడవ నీటియందు దారి తప్పింపబడిన రీతి విషయముల తగిలి పర్విడు నింద్రియములలో నెద్దాని మనస్సు ననుసరించునో, నా యింద్రియమే నిగ్రహశక్తి లేనివాని వివేకబుద్ధిని హరించును. ఆత్మకు విముఖముగా విషయాభిముఖ మొనర్చును. కావున నింద్రియములు విషయప్రపంచమునుండి సర్వవిధముల నెవ్వనివలన నిగ్రహింపబడుచున్నవో, నతని ప్రజ్ఞ స్థిరమగును. అతడే స్థితప్రజ్ఞుడు, ధీమణి, ముని. ఈలాటి మహాత్మునకు పగలు రాత్రిగను, రాత్రి పగలుగను, రాత్రింబగల్లు రెండు లేనివిగ నుండును. పేకాటగానికి రాత్రి పగలువలె నుండును, పగలు రాత్రివలె నిద్రలో నుండును. విషయచింత లేనివానికి రేయిలేదు, పగలులేదు. ఎవరి దృష్టియందు పగలు నిచ్ఛలేని తనకది రాత్రి, నెవ్వరికి చీకటి నిద్రగా యుండునో, ఇంద్రియవిశ్రాంతియే నిద్ర. ఇంద్రియవిషయములే లేని వానికి రాత్రి పగలుగా నుండును. విషయపోకడలేక నాత్మావలోకన మొనర్చువానికి రాత్రింబవళ్లు లేవు. బ్రహ్మానందపరుని దృష్టి నిద్ర మెలకువ గలిగించు నింద్రియముల వంటిదికాదు. అతడు నితరులదృష్టిలో జగత్తే బాధింపబడినపుడు నిద్ర మెలకువ లెక్కడివి? తన్ను మఱచుట నిద్ర, తన్ను తెలియుటయే జాగృతి. మేలుకొన్న వానికి నిద్రలేదు. ఆవిర్భావ తిరోభావములు జ్ఞానికి లేవు. అజ్ఞానము నిద్ర, జ్ఞానము మెలకువ. జ్ఞానియన దేహేంద్రియములుకాదు, శుద్ధ బుద్ధ ముక్తస్వరూపుడు. సచ్చిదానందాత్మ బోధకొఱకై నారోపింపబడిన నిద్ర మెలకువలు నున్నవి లేవు. జ్ఞాని సముద్రునివలె గంభీరుడు. ఎట్లన, సముద్రము వివిధములగు నదులు వచ్చిపడినను, పడకున్నను నిమ్నముగా నుండును. చెలియలికట్ట దాటిరాదు. జ్ఞాని కేలాటి విషయములు తటస్థించినను స్వప్నవస్తువులవలె, మరుమరీచికలవలె, రజ్జుసర్పమువలె మిథ్యలని, మిథ్యాత్మ నిశ్చయముతో బ్రహ్మమే గావున భ్రాంతిచ్యుతి నెన్నడొందడు. విషయములను చెలియలికట్ట దాటడు. పరమశాంతమూర్తిని జడమగు విషయప్రపంచమేమి చేయలేదు. అహంకారమమకార కారణమగు మోహనివృత్తి

బొంది జ్ఞాననిష్ఠాపరుడై నీవు నేనను భేదములేని మహాత్ముడు శరీరజీవితమునుగూడ స్పృహాశూన్యుడై సంచరించుటవలన నతడు పరమశాంతిని బొందును. శాంతియే యతని ననుకరించి యతని వరించును. ఇష్టపడినవాని ధనలక్ష్మి యనుకరించిన రీతి, బ్రాహ్మీస్థితిని బొందినవారెవ్వరు మోహగ్రస్తులుకారు. మరణసమయమందైన నిశ్చితియన బ్రాహ్మీస్థితి నొందినవాడు మోక్షమును బొందును.

ప్ర॥ మరణసమయమందైనను బ్రాహ్మీస్థితి బొందవచ్చు లేక మోక్షమైన బొందవచ్చునని శ్రీకృష్ణపరమాత్మ యర్జునునకు జెప్పి 72 శ్లోకమనేక సంశయములకు కారణమగును. ఏమన, చచ్చు పర్యంతము కామాదిభోగముల ననుభవించుచు, పుణ్యపాపమిశ్రమకర్మల మనోవాక్కాయముల నాచరించుచు, సూక్ష్మములగు వాసనల హృదయుడై యొకతూరి యొకమాట మరణసమయములో ననుకుంటె మోక్షము రాగలదా? అనే సంశయము. అలాగైతే మరణసమయమున గుర్తెఱుగవలసినది. తక్కిన కాలముల తెలిసితేనేమి? తెలియకుంటేనేమి? అని యొక సంశయము సశ్రద్ధ గలుగును. పాపాదికర్మల నేమొనరించినను చింత లేదని కొందఱు, వైరాగ్యవివేకములు, శ్రద్ధాభక్తి, నిష్కామకర్మజ్ఞానములవసరము లేలయని కొందఱు తలచవచ్చును. మోక్ష మంత సులభమైనది యైనపుడు చిన్నతనమునుండి సాధనములు జేయవలెననుట పెక్కు ప్రస్థానములు, వేదములు నిరుపయోగమనిపించుచున్నది. దీనికి తామేమనెదరు?

ఉ॥ మంచిది నీ సవాలు. అర్జునుని సవాలుకంటే మించినదిగాను, సమస్త జనసంశయనివారకముగాను, లోకకల్యాణదాయకముగా నున్నది. మొదటి ప్రశ్నకు జవాబు. బంగారున కేకకాలము టంకము వగైరాలవల్ల తనవన్నె చెడినది. దానిని మూసలోనుంచి ద్రావకము వేసినవెంటనే మొదటి రకమగుచున్నది. శ్రద్ధావంతుడై జ్ఞాపకముంచుకొని మరణసమయమున హరిని దలంచినంతనే సర్వదోషములు ద్రావకమున టంకము తొలగినట్లు హరిస్మరణ యనే ద్రావకమున హరింపబడి సుగతి నొందును.

మరణసమయమున జ్ఞప్తి తెచ్చుకోలేనివారు చిన్నతనమునుండి యభ్యాసము చేయవలసినదే. విద్యార్థు లెంతోకాలము చదివితేగాని

పరీక్షకాలమున ప్యాసుకాలేనపుడు చదువకనే ప్యాసుకావటము సాధ్యమా? అయ్యది దుస్తరము. చిన్నతనమునుండి యభ్యాసములేక నెట్లు మోక్షము వచ్చు ననుకోరాదు. ప్రైవేటుగ కట్టినవారు ప్యాసు కావటములేదా? చదువుచున్నానులే యను నహంకారమమకారముల తప్పిపోవచ్చు శ్రద్ధ లేక పోవటముచే. చదివితేనేకాని ప్యాసుకాలేనేమొ యనువాడు చదివిప్యాసౌతాడు. కాశీచేరదలచినవారు కొందఱు కాలినడక, రైళ్ళమీద వెళ్లుదురు. విమానముమీద వెళ్ళువాడు వీరికంటెముందు వెళ్ళగలడు. తద్రీతి శ్రద్ధాభక్తి విశ్వాసముల నంత్యకాలములో హరి నెఱిఁగి మోక్షము నొందవచ్చును. "విజ్ఞాయ చరమావస్థాం దేవతాభ్యో నృపోత్తమః। ఖట్వాంగో నామ రాజర్షిః ముహూర్తే మే యివాగా" ఖట్వాంగరాజు, రెండు న్నర ఘడియలకాలములో ముక్తినిగాంచెనని శుకుడు పరీక్షిత్తునకు జెప్పెను. సీతారామాంజనేయ సంవాదమున, పువ్వులు గిల్లుట, కను రెప్పలు గొట్టుట కెంతసమయమొ నంత సమయములో మోక్షము బొందవచ్చునని హనుమంతునకు రాముడెఱిగించెను. పాపపుణ్యము లొనర్చినను చింత లేదనటముకూడ నిందనీయముకాదు. పచ్చిపాపాత్ముడగు వాల్మీకి పవిత్రుడు కాలేదా! మరణసమయమున నజామిళుడు సుగతినిబొందినది చదివితిమి, వింటిమికదా! పాపపుణ్యములు గలవారే కదా పుట్టుతారు. తక్కిన వారేల బుట్టుదురు? పాపపుణ్యములకు పశ్చాత్తాపపడడమే వాని విముక్తి. పాపపుణ్యములకే కదా జప తప వ్రత ధ్యానధర్మాదులు. పుట్టనివారికి నేమోక్షమవసరములేదు. గుఱినేర్చువాడెంతకాలమునేర్వవలె? క్షణకాలములో నేర్చితే వస్తువును గొట్టగలడు. వదలితే తగలడ మెంతకాలముపట్టును? ఆత్మపరమాత్మల భేదమును తొలగించుటకై వచ్చిన శాస్త్రములు సంశయ అసంభావన విపరీతభావనల నివర్తికి సాధనములైన శ్రవణమననాదులవలన జ్ఞానసాధ్యములుగానుండ మహావాక్యమువచ్చి ద్వైతబుద్ధిని తొలగించడమే నదియే మోక్షము. తన్ను పరమాత్మగాదెలియుట, విపరీతభావనవదలి వైరాగ్యమున తన్ను తెలియుటయే జ్ఞానము. తన్నిశ్చయమే మోక్షము. అభ్యాస వైరాగ్యములుండినవాడు మొదటినుండి జీవన్ముక్తినొంది పిదప నంత్యకాలమున విదేహముక్తినొందును. మరణసమయముననే నాత్మను తెలిసినవాడు

జీవితమంతయు జీవన్ముక్తి లేకపోయినను మరణసమయమున విదేహ కైవల్యము నొందును.

ప్ర॥ సాంఖ్యయోగమున డెబ్బదిరెండు శ్లోకములలో కర్మజ్ఞాన రహస్యములను ఫలశ్రుతిని భగవంతుడు వివరించెను. ఆత్మపరమగు జ్ఞానము, జ్ఞానపరమగు కర్మల నాచరించుటే శ్రేష్ఠమనికదా సారాంశము. మరణ సమయమును గుఱించి మరేమైన తెలిపెదరా ?

ఉ॥ మరణము సాధరులకులు లేదా పూర్ణజ్ఞానులగువారు తప్ప తక్కిన వారల గుఱించి తెలుపబడినది.

ప్ర॥ జ్ఞానులు నుపాసకులుగాదా?

ఉ॥ జ్ఞానులు "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" ర్థమును యనుభవైకవేద్య మొనరించుకున్న మహాత్ములు. ఆత్మజ్ఞానము, నాత్మవిశ్వాసము, మిథ్యాహంకార నివారణ సత్యాత్మ ప్రతిష్ఠాపనమని రెండు మాటలలో స్వామి రామతీర్థ యనుష్ఠానవేదాంతిసందేశమున తెలిపెను. దేహదృష్టితో స్వదృష్టి మఱచియుందురు. స్వదృష్టితో దేహదృష్టి మరచిన ప్రపంచ వాసనే యుండదు. మొదలు లేక తుద యెక్కడిది. పుట్టుకగలదా? చావు తప్పదు. చూచితే కనిపించును, చూచేదేలేదా – కనిపించేదేలేదు. ద్వైత బుద్ధిగలదా – నామరూపప్రపంచము సుఖదుఃఖములు గలవు. అద్వైతబుద్ధి గలదా – అమృతమే, నఖండమే, నభేదమే, నచింత్యమే, ననన్యమే, నచంచలమే, నపరిచ్ఛిన్నమే, ననంతమే. అధ్యస్థవస్తు వంకురించుట కవకాశములేని నిరతిశయానందులగు జ్ఞానులకుగాదు "ఏషా బ్రాహ్మీస్థితిః నైనాం ప్రాప్య విముహ్యతి" యనే శ్లోకము చెప్పినది. తక్కిన మానవులునైతము బ్రాహ్మీస్థితి బొందవచ్చు ననటము భగవంతుని యుదారము, నిష్పాక్షికము, సత్యత్వము, నిర్వ్యాజము, సార్వజనీనసాధ్యమేకానీ అసాధ్యము, ముక్తియున లేదు. మరణసమయముననైన గలుగవలసినది నాత్మజ్ఞానమే, ఒకడు చదువునప్పుడు పాఠశాలరుసుము ప్రయత్నించితే చదువే వదలునప్పుడనుమతివచ్చెను. ఒకడుద్యోగమునకు తిరిగి తిరిగి వేసరి యే రోగముతోనో మరణించే సమయములో నుద్యోగ ప్రాప్తివచ్చును. ఒకడు పోగొట్టుకొన్న ధనము మఱొకరీతి లభించును. క్రింది యుద్యోగులు బానిసలు, సేవకులు కాలానుగుణ్యముగ రాజ్యప్రభువులగుటచూడమా! భుజ

బలముతో, ధర్మబలముతో, న్యాయబలముతో వ్యావహారికధర్మప్రవర్తనములు లభించుచుండుట జూచుచున్నాము. బుద్ధిబలముతో, శాస్త్రబలముతో దృఢదీక్ష, జ్ఞానప్రాప్తి నంత్యకాలమున వచ్చును. అదియే సద్యోముక్తి. "అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే" వరుసగా దానముచేత త్యాగి యొకడౌ కాడు. ఒకేతూరి నన్నిటిని వదలి త్యాగి యొకడౌ కాడు. అన్ని యనిన సమస్తవిషయవాసనలు తన్ను వదలటముకాదు, వానిని తాను వదలటమే త్యాగము. అద్దమున తన స్వరూపమును తెలుసుకొందురు. జ్ఞానమువలన తన్ను తెలుసుకొనుటకు సమయమే లేదు. ఏ సమయమున్న తనకు లభించగల పురసతునంతే నా పురసతులలో తన్ను తెలిసినయెడల మోక్షమే. స్థూలసూక్ష్మకారణ మహాకారణ దేహములు గృహస్థునకు గొప్ప యింటియందున్న చిన్న చిన్న గదుల వంటివి. ఒకొక్కగదిలో నేకొన్ని వస్తువులో నా గృహస్థుని యుపయోగమున కుంచుకొనియుండును. గృహస్థుడన్ని వదలవలెనంటె నొకొక్క దానిలోనుండి వెలుపలికి రావట మొక యర్థము. వానియందలి ప్రీతి వదలటము నిజమైన యర్థము. ఆత్మకుగల దేహములు తాను యభిమానించితే మరల తానివసించుటకు యోగ్యమగు స్థూలదేహమును తక్కిన దేహములు తయారుచేయును, ఆ యన్నిటియందలి య భి మా న ము క్రమేణ శ్రవణమననాదులవలన వదలివచ్చును. ఒకేతూరి తన్ను తెలిసి తన యందే యనుగతుడగుట నా సంబంధమే వదలిపోవును. "సాంఖ్య యోగాధిగమ్యమ్" శ్లో॥ ఉ॥ అన్ని యోగములు దీనికి సాధనములు. అన్నిటికి నిది గమ్యము. అడ్డులుకట్టి కలియనీయని నీరునకు కట్టలు తొలగించినంతనే నవ్వలినీరుతో గలియుటవు, పేరుయూరులతో పనిలేక గలసిపోవును. స్త్రీపురుష, జాతిమత, దేశకాలవయులనే యవివేకముతొలగి దేహేంద్రియప్రపంచములకు నధిష్ఠానమగు బ్రహ్మమని యెఱుగుటకు తక్కిన బంధజాలము లడ్డురావు. ఆ యభిమాన ముంటేనే యవి యుండును. అదే బంధము. జన్మము, మరణము, చావటము లేదు. జన్మము లేదు. బహుకాలావృతమైన పర్వతగుహాయందలి చీకటి, వెలుతురు గల్గినంతనె తొలగుటలేదా? పెక్కుకాలమునుండి హృదయగుహయందున్న నజ్ఞానము మరణసమయమున, భగవదనుగ్రహమున జ్ఞానము గల్గినంతనె

త్రోలగును. మోక్షము గలుగుటకు సందేహములేదు. మరణసమయమున హరిని తెలిసినంతనె లేదా జ్ఞానము గల్గినంతనె మోక్షము లభించిన చిన్నతనమునుండి జ్ఞానము గలిగినవానికి ముక్తి గలుగునా లేదా యనే సందేహము పనిలేదు. ఒక దేవస్థలమున దేవుని దర్శనమునకు నుదయమునుండి వేచియున్నవానికి, దర్శనమునకు తలుపుదీసే సమయమున వచ్చినవానికి దర్శనము నేకకాలమున లభింపలేదా. ఉదయమునుండి వచ్చినవానికి దైవదర్శనము లభింపదనే సందేహముండదు. ముందు రావటముతో దేవాలయమున భగవద్విభూతులు జూచి యానందించును. అప్పుడే వచ్చినవాడు దర్శనము లభించునో, లేదో యను వ్యాకులము, నాతురతతో వచ్చుచుండును. అదే నుభయులకు గల తారతమ్యము. అన్నసత్రమున ముందు వచ్చినవానికి, ఆకులువేసినమీదట వచ్చి కూర్చొన్నవానికి నొకే సమయమున నన్నము లభించుచున్నదనెను మహర్షి శ్రీమలయాళస్వామి. ముందువేసిన యుత్తరము, వెనుకపంపిన టెలిగ్రాం ప్రయోజన మొకే ఫలము నిచ్చును. అనేకకాలమునుండి సూర్యునకభిముఖమగు వస్తువుతో క్రొత్తవస్తు వభిముఖమైన సూర్యుడు రెండవదానియందుగూడ ప్రకాశించును. భావము నేధ్యేయస్థితి నొందునో, నా ఫలమె గమ్యము. మరణసమయమున నితరుల ప్రేరణవలనగాని, తనకే జ్ఞాపకము గల్గిగాని, భయము వలనగాని, నేదైవఘటనమువలనగాని మనస్సు భగవంతునియందుగాని, భగవద్భక్తులపైనగాని, భగవత్కళలపైనగాని, భగవద్విభూతులు భగవచ్చరిత్రలయందుగాని, భగవత్కైంకర్యమునగాని, భగవంతునిపేర్లు గల వారిని బిలవటముగాని, భగవద్భజన భగవజ్జన్మకర్మల వినుటవలనగాని కాలము వయసులతో పనిలేక, జాతిమతములతో వివక్షతలేక, భగవత్ప్రాప్తి లేక జ్ఞానము బొందుదురు. ప్రవచించినవాడు భగవంతుడు. సాంఖ్యయోగమున కడపటి శ్లోకములో నాయన పరిపూర్ణత్వమునకు నుదారత్వమునకు నిదర్శనము జూపబడినది. మానవులైతే సరి, నేదేశముల నేకాలముల నేయాచారవంతులైనా సరే మోక్షము సిద్ధమనెను. మరణసమయమున భగవత్ప్రాప్తి నొందవచ్చులే యని తక్కిన కాలముల నశ్రద్ధ చేయుమనికాదు. మరణసమయమున తత్ప్రాప్తి లభించునో లభించదో. లభించకపోయిన మరేమి చేయవలెనో జ్ఞాపకము చేసుకోవలెను; నోటివద్దకు

వచ్చినది వదలితే నోరు తెఱచితే పలవించినపిదప . దొరుకదు. చనిపోవు సమయమున జ్ఞానులు, భక్తులు, నిష్కాములు "నీరోగ ఉపవిష్టో వా రుగ్ణో వా విలుఠన్ భువి। మూర్ఛితో వా త్యజత్యేషా ప్రాణాన్ భ్రాంతిర్న సర్వథా" ఏ రోగములేక సుఖముగా కూర్చున్నవాడు కూర్చున్నట్లుండి ప్రాణములు విడచినను, వ్యాధిచే భూమిమీదపడి పొరలుచు ప్రాణములు విడచినను, మన స్మారకమే లేక ప్రాణము వదలినను జ్ఞానికి వివేకముచే నశించిన ద్వైత భ్రాంతి మరల గలుగదు. జ్ఞాని కానివారలుగూడ తమభావము భగవంతునియందుంచి శరీరము యే రీతి ప్రాణము వదలినను మేలుగాని, కీడుగాని లేదు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
సాం ఖ్య యో గో నా మ
ద్వితీయోఽధ్యాయః
ఓం తత్ సత్

★

ఓమ్

శ్రీ సహజానందసద్గురుపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## తృతీయాధ్యాయము

### కర్మయోగము

---

క॥ పరమాత్మయె తానని యాపరమాత్మకె కర్మఫలము వదలుటవలనన్
దురితము లొందదవు భయము మర్త్యునకిని లేదంచు గీత వరుస వచించెన్.

ప్ర॥ ద్వితీయాధ్యాయముననే కర్మయోగరహస్యము జెప్పబడినది గదా! తిరిగి కర్మయోగము చెప్పటెందుకు?

ఉ॥ సంశయము వచ్చినపు డడుగవచ్చు, బదులుచెప్పవచ్చు. రెండవ యధ్యాయమున జ్ఞానకర్మయోగములను గురించి చెప్పితివి. "ప్రజహాతి యదా కామాన్" అని నారంభించి, "ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ" అని ముగించుట జ్ఞాననిష్ఠవలననే మోక్షమంటూ నన్ను మాత్రము కర్మల జేయ వలసినదే, నీకు కర్మమందే యధికారమనటము హే భగవాన్! కృష్ణా! ఇయ్యది నాకు సంశయమని "జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన" ఈ శ్లోకమున నర్జునుడడిగెను. అదిగాక కర్మలవలన శ్రేయఃప్రాప్తి గలుగు నని చెప్పలేదు. కర్మముకంటె జ్ఞానము శ్రేష్ఠమైనపుడు నన్ను కర్మమున నియోగించుటయేల? కర్మఫలత్యాగమువలన నేలాటి ప్రయోజనము లేదేమోననియు, నొకప్పుడు జ్ఞానము శ్రేష్ఠమనియెదవు, ఒకప్పుడు కర్మశ్రేష్ఠమనెదవు. జ్ఞానకర్మసముచ్చయము నిశ్శ్రేయసకరమనియా? ఏల? యీ విధముగ వచింపుచుంటివో నాకు మోహమయముగనున్నది. లేక కర్మయే యొనర్ప నాకిష్టములేదు. నిజముజెప్పుమని యోగవాసిష్ఠమున సుతీక్ష్ణుడగస్త్యుని యడిగినట్లడిగెను.

ప్ర॥ కర్మమంటే మూడవయధ్యాయమున దెలిపెదమంటిరి. దానిని ముందు వివరింపుడు.

ఉ॥ (డు) డుకృఞ్ కరణే (చేయుట) యను ధాతువునుండి బుట్టి చేయుట లేక త్యాగముచేయుట కర్మ నిష్పత్త్యర్థము “చలనాత్మకం కర్మ” చలన రూపమై నంతఃకరణమున తోలుతబుట్టును. “క్రియత ఇతి కర్మ” క్రియారూపమైనది. అంతఃకరణవృత్తిగా చలించునుగదా! దానియందే జ్ఞాతృజ్ఞానజ్ఞేయములను త్రిపుటియుండును. పిదప వాచిక కాయికముల నొనర్పబడునదియే కర్మ. చలనము లేక వృత్తి, వృత్తి లేక కర్మ యొన రింపనేరాదు. “అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్” యని గీత. శరీరము, అహంకారము, ఇంద్రియములు, ప్రాణములు, ఇంద్రియాధిష్ఠా తలగు నాదిత్యాదిదేవతలు నైదైయెడు సమస్తకర్మలకు కారణములు. మనుష్యులాచరించు ధర్మాధర్మ కర్మలన్నిటికి త్రికరణములే కారణ ములు. సంచితము ప్రారబ్ధము నాగామియును మూడువిధములు. సంచిత మన కర్మఫలరాశి. ఇప్పుడు చేయబడి వెనుక ననుభవమునకు వచ్చు నదిగాక మిగిలియున్న కర్మ, ప్రారబ్ధమన సంచితములోనుండి పరిపక్వ దశకువచ్చి, నీశ్వరసంకల్పబలముతో ప్రస్తుత వర్తమానదేహమునకు ప్రారంభరూపమై యున్న కర్మ, జ్ఞానము గలిగినమీదట లేక ముందు నీ దేహములో మరణపర్యంత మొనరించే కర్మ యాగామి. ఈ కర్మ యజ్ఞానజనితము. ప్రతికర్మయు నేదో యొక దోషముతో నగ్నిని ధూమ మావరించినట్లు నావరించియుండును. వృక్షమునకు బీజమెంత చిన్నదియో, నదికి మూలమెంతచిన్నదియో కర్మమూల మంతసూక్ష్మము. తానుతాను విస్తృతమగుచుండును. సకలజీవుల కర్మఫలము తమ తమ యవిద్యయందుండును. పురోడాశాదికమగు నుత్పత్తి, సోమాదికమగు వికార్యము, మంత్రాదికమగు నాప్యము, ప్రోక్షాదికమగు సంస్కారము నీ నాలుగుకర్మరూపములు. అవిద్యయందున్న కర్మఫలములో నవిద్య మాయ యందుండి నీశ్వరేచ్ఛ శరీరోత్పత్తిగ గలుగుచుండును. కర్మ బలవత్తర మైనది. ప్రతి ప్రాణియొక్క జన్మమరణములకు, సుఖదుఃఖములకు, న్యూనాధికములకు, స్వర్గనరకములకు, స్త్రీ పురుష నపుంసక రూపములకు, బంధమోక్షములకు, సజాతీయ విజాతీయ స్వగత భేదములకు కారణ మైనది. రాజు కింకరుడైన, కింకరుడు ప్రభువైన, దరిద్రుడు ధనవంతుడైన, ధనవంతుడు దరిద్రుడైన, మంచి చెడ్డయైన, చెడ్డ మంచియైన, పురస్కార

తిరస్కార, గౌరవప్రతిష్ఠలకు, ధర్మాధర్మములకు, బలాబలములకు, దైవాసురస్వభావములకు, పుణ్యపాపమిశ్రమములకు కర్మయే ప్రధానము. జీవిత జీవితాంతరములకు కర్మయే సూత్రము. "యత్కర్మ కురుతే తదభి సంపద్యతే" ఎవడెటువంటి కర్మజేసిన వానికి నట్టి ఫలమే గలుగును. "కర్మణా జాయతే జంతుః కర్మణైవ ప్రలీయతే" పుట్టుట, చచ్చుట కర్మచేతనే. "కర్మణా పితృలోకః విద్యయా దేవలోకః" కర్మ పితృలోకము, విద్య దేవలోకము నొందించును. కర్మజేయకుండే సమయమే లేదు. "కర్మణా బధ్యతే జంతుః విద్యయా చ విముచ్యతే" కర్మచేతనే బంధము; విద్యచేతనే ముక్తి.

ప్ర॥ విద్యయనగా నేమి? దానివలన ముక్తి యెట్లు గలుగును?

ఉ॥ విద్యయన జ్ఞానము. అది గల్గినంతనె ముక్తిగలుగును. కర్మలు పరిసమాప్తి నొందును. జ్ఞానము గలుగనంతవఱకు "యథాకారీ యథాచారీ తథా భవతి" ఎట్టికర్మ కలవాడో, ఎట్టియాచారము గలవాడో నట్లే తయారగును. "అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్" చేసినకర్మ యనుభవింపక తప్పదు. ఎందుకు తప్పదనెదవా? "జన్మాంతర కృతం కర్మ భుంజతే జంతవోఽధునా" గతజన్మములజేసిన కర్మఫలమును జీవుడిప్పుడనుభవించుచున్నాడని యనేకప్రమాణములు బలుకుచున్నవి. భాగవతదశమస్కంధమున శ్రీ కృష్ణుడు క॥ కర్మమున బుట్టు జంతువు కర్మమునను వృద్ధిబొందు కర్మమున జెడుఁ, కర్మమె నరులకు దైవతమనెను. వేఱేదైవముండి పక్షపాతముజేసి నొకని నొకరీతి, మఱొకని మఱొకరీతిజూచి లంచగొండితనముచేయు వారివలెజేయు నొకకర్తలేడు. "న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః" మనుష్యులకర్తృత్వము గాని, కర్మలనుగాని, కర్మఫలప్రాప్తినిగాని భగవంతుడు సృష్టించుటలేదు. అవిద్యారూపమగు మాయయే కర్మకారులుగా జేయుచున్నదన్నప్పుడు నెవరికర్మకు వారె కారకులనియు, తమతమ కర్మయే నుత్తరఫలముల నందించుటకు దైవమువంటిదనియు తెలియుచున్నది. భారత శాంతిపర్వమున క॥ విను కర్మంబొనరించును జననము మరణంబు నదియ సౌఖ్యము, దుఃఖము గావించుం దనజేసిన దానింబడక పోవ శివునకు వశమే. అందువలన కర్మనుగుఱించి విన్నను, చదివినను, తలంచినను చింతానుతాపము

గలుగకపోదు. విత్తనమునకు చెట్టు, చెట్టునకు విత్తనములతో నెప్పుడీ దేహముతో జేయుటము మరల పుట్టుటయు తిరిగి చానటము కుమ్మరి సారె, యేతము, భూమి, గడియారపుముల్లు, బండిచక్రములు, విత్తము వలె తిరగటమే కర్మధర్మము. ఛీసు గాలిపే కర్మమాటువింటేచాలు, కంపముగలుగును. కర్మఫలమే లేకుంటే జన్మము లేదని సరళముగా తెలియుచున్నది. తెలియక తెలిసీతెలియక కర్మచేయకుండా నుండుటకే కాదు. అటువంటప్పుడు "త్రివిధం కర్మణః ఫలమ్" అన్నది గీత. ఇష్టకర్మయన దేవమనుష్యులాది నే ప్రాణికి ఫలముకలిగింపని శుభకర్మ వలన దేవతాజన్మము సకలప్రాణికి పీడాకరమైన దుష్టకర్మ పశుపక్ష్యాది జన్మములను, మిశ్రమకర్మ మనుష్యజన్మమును కలిగించునని హెచ్చరించినది. చదివితే నేమిలో చదుకూడ.

ప్ర॥ విడువని శనివంటి, పైశాచికమువంటి నిట్టి కర్మ నెవరంటగట్టిరి?

ఉ॥ ఒకరంటగట్టితే వచ్చునదికాదు, వెన్నంటేదికాదు. తన శరీర ఛాయ తనవెంట రా నెవరు బంపిరి? తన కర్మయే తనకు ఫలకారియగును. పాతకముగ నెవరైనగాని, దైవముగాని, దానికై యుదిరోకాని మతే రీతిగా ప్రాప్తింపజేసినదికాదు. స్వబుద్ధ్యా జేసుతన్న కర్మయే.

ప్ర॥ మనము చనిపోతాము; శరీరములు శూన్యములగును. అప్పుడీకర్మ యెచ్చట నుండును?

ఉ॥ ఇదిగో యిది రూపాయనోటు. దీనిలో పక్కన నాణెము లెక్కడుండును? అదిగో మేఘము. కనిపించక మునుపెక్కడనుండును? నాణెములు నోటునుండె, మేఘము జలమునందే యుండును. ఇదిగో ఒక మఱ్ఱి విత్తనము. ఇది సూక్ష్మముగానుండి భూమిలోపడి వర్షముతో జెట్టుగా మారుచున్నది. ప్రతిజీవికి కర్మఫల శుభాంకారముగా, సూక్ష్మముగా నవిద్యయందుండును. ఆ యవిద్య మాయయందుండును. ఎప్పుడు జన్మాదృష్టము తటస్థించినంతనే నీశ్వరేచ్ఛ జన్మరూపు దాల్చుననుటకు సంశయము లేదు.

ప్ర॥ స్వర్గనరకలోకములను బోతే మరలవచ్చుటకు నీ కర్మఫలమేనా?

ఉ॥ అవును. నీవొక దేశము చూడదలచి ప్రయాణము జేసినపుడు తిరిగివచ్చుటకుగూడ నీవార్జించిన ధనముతో నెగదా వెళ్లుదువు? ఎచ్చోట

నుండి బయలుదేరితివో నచ్చటికే మరల జేరుదువు. "తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే" ఇచ్చట కృషిచేసి సంపాదించినది యనుభవింప వ్యయమైపోవునట్లు పుణ్యవిశేషముచేత సంపాదించిన స్వర్గాదుల ఫలము ననుభవముచేయగా తీరిపోయి నిందే రావలసియుండును. సాలెపురుగు తాను యల్లుకొని తానందె చిక్కికొనుట నిజమో, యపద్ధమో పనిలేదు. సూర్యచంద్రులు రాహుకేతువులచే పీడింపబడుట, దేవేంద్రుడు పదచ్యుతుడగుట కర్మయే. నలుడు, హరిశ్చంద్రుడు కర్మఫలానుభవులేను. అయితే నీ కర్మఫలమును గుఱించి లౌకికులవలె నాంగ్లేయులు తదితరులు మానవజీవితమున కర్మకు స్థానమే లేదంద్రు. మానవుని సుఖదుఃఖములకు నాతడే కారకుడైనపుడు వాని శక్తిసామర్థ్యముల నాధారపడి యుండుననియు, కర్మ యెంత మాత్రము గాదంద్రు. ఒకడు గొప్పవాడైన, నొకడు తక్కువయైన లేదా ఒకని నధిగమించి యొకడు శ్రేష్ఠమైన వాని శక్తిసామర్థ్యములే కాని కర్మకు స్థానమేలేదంద్రు. కనపడని కర్మఫలమునకు లేనిపోని ప్రతికార్యమంటగట్టడము, భయపడడము, మఱొకరిని వెఱపించడము చాలా పొరబాటు యని పెక్కుమార్లనెదరు. మఱికొందఱు ప్రకృతియే సర్వము నొనర్చుచున్నది. అన్ని బాధ్యతలు దానిదే, మఱి దేనిది కాదు అని ప్రత్యక్షప్రమాణాధికారులనెదరు. వారి నమ్మిక మట్లుండుటేల? సూక్ష్మముగా విచారించలేదని తోచెడిని. అదేకాదు ముందుజేసిన కర్మఫల మిప్పుడనుభవించవలసియుంటే, నేకర్మజేయక నూరకున్న నందఱ జీవులకు న్యూనాధికముల కర్మఫలము ననుభవమునకువస్తే సరే. నిద్ర లేచినది మొదలు నిద్రపోవునఱకు కర్మ చేసితేగాని జీవితము జరుగనప్పుడు కర్మకధికారమివ్వటము విశ్వసనీయము గాదనెదరు. వారన్న శక్తి సామర్థ్యములనే రెండు మార్గముల జోడించి చక్కని మార్గము ద్రొక్కిరి. గాంధీజీ ప్రభృతులు మహాత్ములైన ఋషుల నాశయము నింతే. కర్మనేది లేకపోలేదు. కాని కర్మ మానవజీవితమున చాలా తక్కువస్థానము నాక్రమించినది. కర్మను స్వాధీనము జేసుకొని మానవునిశక్తి నుపయోగించి శాంతి యానందాన్ని పొందవలెననిరి. కర్త కర్మ క్రియలని వ్యాకరణమున మనము చదువుచున్నాము. చేయువాడు కర్త; చేయుటము క్రియ; అనుభవించటము కర్మ. కర్తక్రియలు గనిపించునేకాని యనుభవనీయమగు

కర్మ చేయువానికే తెలియును. అనుభవనీయమగు కర్మ కనిపించదుకూడ. ఇద్దరు విద్యార్థులు పాఠశాలలో జదువుచున్నారు. వీరిద్దరు కర్తలు. టెక్స్టుబుక్కులు చదవటము క్రియ. కాని యందు శ్రద్ధ, జ్ఞాపకము, నుపాధ్యాయుల ప్రేమ బడిసినవాడు ప్యాసైనాడు; ఉద్యోగము వచ్చినది. రెండవవానికి శ్రద్ధా జ్ఞాపకాదులు లేవు; తప్పిపోయినాడు. ఇద్దరికి కర్మఫలమేమిచ్చినది? ఒకనికి నుద్యోగము, మరొకనికి నిరుద్యోగము. కర్మ కనిపించలేదా? కర్మఫలము సూక్ష్మముగా నవిద్యయందుండి దృష్టకర్మ నీ జీవితముననే ఫలమిచ్చును. ఒక గ్రామమున ధర్మశాస్త్రపారంగతురాలగు నొక విధవస్త్రీ తన కొక కొడుకుండ నొకదినము బజారులో తనయుని పాము గఱచి చచ్చెననియు, నిదిగో నీ పాపిపామే నీ పుత్ర మృత్యువునకు కారణమని దీని నిప్పుడే చంపెదనని యొక పురుషుడు దాని తోకబట్టి నీడ్చితెచ్చి చంపనున్నవానిగని నా విధవ యిట్లనియెను. చచ్చినది నాకొడుకు, నేనూరకుండ నీవేల దాని జంపెదవు? నిన్నుంటని దీనివధ నీకు పాపముకాదా? యనెను. ఇయ్యది దుష్టజంతువు. ఈరోజు నీ కొడుకును, నింకొకదినము నింకొకని మొదలుబెట్టును. అప్పుడెవడుండురు? అదియుగాక వరులకు నుపకార మొనర్చినట్లగుననెను. అయ్యది నిప్పుడే సృష్టియైనదా? అది యొక్కటేనా లోకములో నుండేది? దీని జంపిన తక్కినవిలేవా? ఒకవేళ కఱవ నుద్దేశించియుంటే, రాత్రివేళ నిదురలో నేల కఱచి మరుగై పోరాదు? కఱవవలెనంటే నిదురలో నెందఱ నాశము చేయగూడదు. దీనిని జంపక వదలటము పరోపకారముకాదా? మఱియు తన్ను త్రొక్కితే కఱవటము దానికి స్వభావము. మనుజులుగూడ తమ తమ యుపయోగవస్తువులచే ప్రతీకారము బదులుకు బదులుచేసి భయపెట్టి, మఱొకసారి తమపై దండెత్తకుండ నుండవలెననియేకాని వేఱుకాదనుచుండ పాము మనుష్యభాషణముల 'నామె వాక్యము సత్యము. నాకా కక్షవానిపై పగలేదు. ఇది మృత్యు వొనర్చిన పని; అకస్మాత్తుగ నెందఱో పాము కఱచి బ్రతుకలేదా? యనుచుండ మృత్యు వేతెంచి నా తప్పు లేదు. కాలుని తప్పన, తక్షణం కాలుడువచ్చి యెవరితప్పుకాదు. ఈత డొనరించిన కర్మయే మృత్యువునకు కారణము. క॥ పామును మృత్యువు నేనును, గామాదారకుని మృతికి కారణ మీతం। డేయే కర్మము జేసెక్, దామృతి బొందించె

నదియో చేసుకొని యున్నది. ప్రాణికి తన కర్మయే ఫలము. ఇత్యాది సుకృతము సుఖమును, దుష్కృతము దుఃఖమును గలిగించును.

ప్ర॥ అబ్బా! ఇంత బలవంతమైన కర్మకు కారణమేది?

ఉ॥ ఆసక్తి. మరేదికాదు.

ప్ర॥ ఆసక్తికేది కారణము?

ఉ॥ ఆసక్తికి కారణము సుఖము.

ప్ర॥ సుఖము లభించినమీదట నాసక్తి యెందుకుండును?

ఉ॥ సుఖము లభించిన నాసక్తి యేల గలుగును? గలుగదు. సుఖము లభించుటయు లేదు. ఆసక్తి తొలగుటలేదు.

ప్ర॥ ఈ యాసక్తి సుఖమునకేనని యెట్లు తెలియును?

ఉ॥ ప్రతియొక ప్రాణికి ముఖ్యములైనవి ధనము, భార్య, పుత్రులు. వీని నార్జించుటయు నేడుచుటకొరకే! అన్నములేక ధనము భార్యపుత్రులు యిల్లు లేక నేడ్చువాండ్రనుజూచి యేల యేడ్చుటే నేమనుచున్నారు? మాకు ధనము పుత్రులు భార్య లేవు, యుంటుండుట జూచుచున్నాము. ఆర్జించటము, నూహించటము సుఖముకొరకే. అయితే కొన్ని యూహలు, కొన్ని క్రియలు ఫలమిచ్చును. కొన్ని పేరాశ గల్గించి మరింత దుఃఖము నిచ్చును. ఉండినదానితో తృప్తిపడనిది యాశ. ఒకనొక గ్రామమున భిక్ష జేసికొను నేకాదశిపండుగ యగుటచే, తన పాత్రనిండ పేలపిండి దొరికెను. దాని దెచ్చుకొను యొక బావిగట్టుననుంచి తాను భుజించక మునుపు వెలికల బందుకొని నిట్లు తలంచెను. ఈ పిండిని యమ్మితే నొక యర్థరూపాయవచ్చును. దానికి కోడిపెట్టను గొనిన నది పిల్లలజేయు, పిల్ల పిల్లకు గొప్ప గుంపుయగును. వాని నమ్మగా వచ్చిన పైకముతో గొర్రెల గొన నవి గొప్పమందయగును. ఆ మందను యమ్ముచో వచ్చిన పైకముతో నావులను గొనిన నా యావు లొక గొప్పమందయైన వాని నమ్మ డబ్బు వేలకొద్దివచ్చును. దానితో పెండ్లిచేసుకొని భార్యాభర్తలము కాపురము జేయుచుండ నొక కొడుకు బుట్టును. వాని నేడుచునపుడు భార్య వాని నోదార్చలేకపోతే, కాలితో నీలాగుతన్నెదనని కాలు జాడించెను. బావియొద్దనున్న పేలపిండిపాత్ర కాలుతగిలి బావిలోపడెను. పిండి యంతయు బావిలోపడి నీటగలిసిపోయి తినేదానికిలేక నిట్లు చింతించెను.

దొరికినదానితో దృప్తిపడక పేరాశతో నిటులైతినని యేడ్చును. ఇటులే యొక్కరి యాశకు కారణము సుఖము.

ప్ర॥ సుఖము లభింపకపోవటము, నాసక్తి తొలగకపోవటమేమి ?

ఉ॥ "నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా । న చాభావయతశ్శాంతిరశాంతస్య కుతస్సుఖమ్" వివేకము లేకపోవుటవలన.

ప్ర॥ వివేకమన నేమిటి? అది యెట్లు లభించును ?

ఉ॥ అనుకున్న యుద్దేశ్యమేమిటి, నది యేచందాన ప్రాప్తించునని విమర్శించటము. అనుకున్న యుద్దేశము సుఖప్రాప్తియేకదా! లేదా దుఃఖనివృత్తియేగదా! దుఃఖనివృత్తి యానందప్రాప్తికేగదా! పలువిధముల నాసక్తి. పాటుపడటము నా యాసక్తికి హద్దుపద్దు లేకపోవటము. ఆసక్తివలన మంచిచెడ్డయనక నాశించటము. ఆదిలో, మధ్య, నంతములో దుఃఖము ప్రాప్తించట మెందువల్లనని సుఖదుఃఖములగురించి విచారించక పోవుట. మిథ్యావస్తుదృష్టిచేత వివేకముగలుగును. వివేకమునకు నింద్రియ నిగ్రహము కావలెను.

ప్ర॥ అట్లు విచారింపకపోవుటకు హేతువు ?

ఉ॥ అవిద్య లేక యజ్ఞానముచేత.

ప్ర॥ అజ్ఞానము దేన తొలగును ? దేని తెలియవలె ?

ఉ॥ సుఖస్వరూపము తెలిసితే. అజ్ఞానము తొలగుటకు జ్ఞానము కావలెను.

ప్ర॥ సుఖము ప్రాప్తించటము నిహలోకమునగాని, పరలోకమునగాని భోగవస్తువుల నార్జింపనిది యెట్లు గల్గును ? అటువంటప్పుడు యాసక్తి లేకుంటే నెట్లు ?

ఉ॥ ఆసక్తితో వస్తువుల నార్జించితే సుఖముగలుగుట సున్న. అదియే నజ్ఞానము. సుఖలక్షణము తెలియక జడములగు విషయముల నిందుగాని, మఱెక్కడగాని లభింపదు. సుఖమునే యానందమనెదరు. అయ్యది నుపాయముకాదు, ఉపేయము. బాగుగా యోచించుకొనుము. "యదర్థం సర్వం యచ్చ నానార్థం తత్సుఖమ్" సుఖముకొఱకే వివిధప్రవృత్తులనే యుపాయముల కర్మ జేయవలసివచ్చుచున్నది. "యో వై భూమా

తత్సుఖమ్" వ్యాపకమైనది లేదా పూర్ణమైనది సుఖము. "యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి" నారదునితో సనత్కుమారుడనెను. ఇంద్రియవిషయములవలన గలిగెడి సుఖమల్పము. అయినా నా స్వల్పసుఖము శాశ్వతసుఖాంశమే; చెఱువునీరు, చెంబెడునీరువలె వేఱుకాదు. చెఱువులో లేనిది చెంబులోనికి నీరువచ్చుటెట్లు? పూర్ణానందములేనిది యల్పానందము లభింపదు. లడ్డు, జిలేబి, బూంది యను వస్తువులనున్న తీపి శెనగపిండి, మైదాపిండిదికాదు. తీపువస్తువగు చక్కెరనుగూడి స్వల్పముగా వానియందు దోచినది. వానికి తీపుగల్గినది. అదే రీతి విషయములకు నింద్రియములకుంటే సుఖములేదు. అవి దృశ్యములగు జడములు. ఇంద్రియవిషయముల నిమిత్తముజేసి యంతఃకరణము నంతర్ముఖమగునప్పుడు నా కొంతసుఖము లభించుననేగాని యావస్తువియోగము గల్గినంతనె విముఖమై మనస్సు దుఃఖముల సుఖముకొఱకై పొందును. సుఖమే లభించిన దుఃఖమే నుండగూడదు. పిండిని వేఱుజేసి పిండిలో జూచిన తీపేయుండదు. అట్లు విషయముల వేఱుజేసి విమర్శించితే దాని యందు సుఖములేదు. ఒకవేళ విషయములవలననే సుఖము లభించునన్న నవి మనయెదుట నున్నవియేకదా! సుఖము దొరయక మరొకమరొక వస్తువుల వాంఛించుచుండటమేలా? ఇనుమునందే స్కాంతశక్తియున్న ఇనుము యనుచేల? స్కాంతముపొత్తు యినుమునకేలా? విషయముల నానందముంటే నేవిషయము వాంఛించితే నది లభించిన నా విషయముతోనే పూర్ణసుఖము లభింపవలె. సుఖమనే స్కాంతమునోకి యినుమువంటి విషయములు సుఖనిమిత్తములగుచున్నవి. ప్రాప్తాప్రాప్తములు దుఃఖమయములగు విషయములుగాని సుఖము ప్రాప్యవస్తువుకాదు; సదా ప్రాప్తివస్తువు. సుఖమెట్టిదో జెప్పుమన్న నెవరుగాని తికమకలు పడతారు. అయ్యది యనుభవమైయుంటే నేల జెప్పరు?

ప్ర॥ తామెందుకు దాచెదరు? నా సుఖమెయ్యది?

ఉ॥ ఆ సుఖవస్తువును కోరినదెవరు?

ప్ర॥ నేను. నేను.

ఉ॥ ఆ కోరిన నీవే సుఖస్వరూపుడవు. సుఖము నీయందె. మఱి దేనిది కాదు. దేనియందులేదు. అందువలన దేనితో లభించటము లేదు.

"యో వై భూమా తదమృతం అన్యదా ర్తమ్" నీకన్న యన్యమెయ్యది యైన మిథ్య. త్రికాలాబాధితమగు నీవు సత్యము, నానందుడవు.

ప్ర॥ ఆహాహా! నేనే యానందమయుడనా? ఆత్మయే నానంద మయుమని తెలియకపోవట మజ్ఞానము. ఆ యజ్ఞానమువలన సుఖమెందో యున్నదనియే అందుకయ్యే నాస క్తి దానివలన కర్మజేయుబడుచున్న దనెదరు. అర్జునున కెఱింగించిన బుద్ధియోగము నియ్యదైనపుడు భగ వంతుడు కర్మచేయుమనటము తన కిష్టములేకపోవుట నిందువలననే తానే సుఖస్వరూపుడైనపుడు కర్మల యగత్యమేమి? అర్జును డడుగవలసినదే. సత్యము. ఆవల భగవాను డేమనెను?

ఉ॥ అర్జునా! కర్మచేయుటమనేది, వదలటమనేది సులభసాధ్యమైన నోటిమాట, వ్రాతాక్షరాలుకావు. సృష్టియే కర్మమైనపుడు వదలటము కర్మమే, చేయుటమే కర్మకాదు. వినుము. సృష్టి యారంభమున జ్ఞాన యోగ కర్మయోగమను రెండునిష్ఠలు వేదముల జెప్పియుంటిని. అవియే నీ కిప్పుడు జెప్పినది.

ప్ర॥ రెండుగా జెప్పుటెందుకు?

ఉ॥ ఇవిరెండు సాధనములే. ఒకటి సాక్షాత్సాధనము, మరొకటి పరంపరాసాధనము. అనగా "కర్మాణి చిత్తశుద్ధ్యర్థం ఐకాగ్ర్యార్థముపా సనా। బ్రహ్మజ్ఞానం వినా మోక్షః" కర్మలు చిత్తశుద్ధికరము, తద్వారా జ్ఞానము, జ్ఞానమువలన నాత్మసాక్షాత్కారము. కావున రెండు నవసర ములే. ఒకేతూరి జ్ఞానయోగ సమర్థనలేనపుడు కర్మయోగమే మంచిది.

ప్ర॥ యోగమన నేమి?

ఉ॥ సాధన లేక యుక్తియని పేరు.

ప్ర॥ కర్మయోగము జెప్పుటేల? కర్మజేయున దెవరికి తెలియదు? అందఱికి తెలియునుగదా?

ఉ॥ యోగమన సాధనయని ముందే జెప్పితిని. ఆ బలవత్తరకర్మ చేయకపోయినను చేయించును. సరే. కాని కర్మలజేయుటయందు నందఱకు తెలియును. తెలిసితే నేమిఫలము? తప్పించుకొనలేక బంధము గల్గించు కొందురు.

ప్ర॥ అట్లేల బంధమగును? నేర్పుగాకనే జేయుచున్నారు. పెద్దపెద్ద విజ్ఞానవేత్తలందఱికి తెలియకపోవుట యేల?

ఉ॥ విజ్ఞానవేత్తలనినంతనే గొప్పకాదు. కర్మబంధమునుండి తప్పించుకున్నవాడు విజ్ఞాని. లేనిచో యజ్ఞాని. ఇది ముందే వివరించితిని. సహజములగు నీ కర్మలు చేయకపోతే తప్పదు. చేసితే ననుభవింపవలె. ఇందులోని రహస్యము మనకు తెలియుటకొరకే భగవంతుడు జెప్పినాడు. సుఖముకొఱకనిగదా ముందు విచారించితిమి. కర్మలవలన సుఖము లేదన్నప్పుడు వదలటముగాదు. నిజముగా జెప్పు సుఖముకొరకై నాసక్తి సుఖము లేనపుడు యేది వదలెదము?

ప్ర॥ ఆసక్తి వదలుదుము.

ఉ॥ ఆసక్తివదలి నూరకుంటే శరీరయాత్ర జరుగుటెట్లు? శరీరయాత్రకై నాసక్తిలేక జేయుటయే నుపాయము లేదా సాధన. మరొకమాట. ఆత్మను తెలియక జన్మించిన ప్రతివారు త్రికరణములజేయు కర్మ నాసక్తిచేతనేకదా? అప్పుడు కర్తృత్వము, నభిమానము గలుగుచున్నది. వానియందే రాగద్వేషములేర్పడి కర్మ పునర్జన్మప్రాప్తి గల్గించుచున్నది. ఇంతకు కర్మ భోగములకేగదా? భోగమువలన గలిగే నానందము తన స్వరూపమైనపుడు యాసక్తి యేల? ఆసక్తి గలవారలు నాత్మనుగాని, పరమాత్మనుగాని, సుఖరూపమునుగాని తెలియక గలుగునటువాంఛ జేయుచుందురు. ఏ సుఖముకొరకై కర్మలజేసి సుఖమును బొందలేక జన్మమరణ సంసారమున మునిగి తేలుటగని యర్జునుని నిమిత్తముజేసి భగవంతుడు యెవరు జేసేకర్మల వారు వదలవలదనియు, కర్మల జేయుచు బంధమునుండి తప్పించుకొనుటకు నాత్మసుఖ లాభదాయకముగ జెప్పినదియే యోగము. కర్మలనుండి విడివడు నుపాయమే యోగము.

ప్ర॥ ఏలాగు నొనర్చితే నుపాయమగు జెప్పుడి?

ఉ॥ ఆసక్తిలేనిది. ఆసక్తి గలిగితే కామము లేదా నిష్కామము. ఇదియె యోగము. కర్మల జేయవలసినదే, ఫలముల వదలవలసినదే. ఫలకాంక్షగలదా బంధము లేదా బంధరహితము. కాంక్షకు కర్తృత్వము, కాంక్షారహిత మకర్తృత్వమగును. ఇంద్రియజన్యజ్ఞానము ప్రమాజ్ఞానము కాదు. ఇది భ్రమాజ్ఞానము. దీనినే వృత్తిజ్ఞానమనెదరు. జాత్యజ్ఞానజ్ఞేయ

ములనే త్రిపుటిగలది, పరిమాణవర్తమానముగలది. "ఆప్తోపదేశః శబ్దః" వేదజ్ఞానము, నాత్మస్వరూపజ్ఞానము, నాత్మను తెలుపునది జ్ఞానము.

ప్ర॥ అయితే సకలమానవులు కర్మలోనె పుట్టి కర్మలోనె వృద్ధిబొంది, కర్మతోనె జచ్చి కర్మతోనె తిరిగి జన్మించుచున్నారు. సుఖస్వరూపమును జ్ఞానముద్వారా తెలిసికొంటె నిక కర్మయోగమేల?

ఉ॥ ప్రతియొకశరీరములో సూక్ష్మశరీరముండును. దానియందు మలవిక్షేపావరణములను త్రిదోషములుండును. పరోక్షజ్ఞానమువలన నాత్మస్వరూపమిట్టిదని తెలిసినను సదరు దోషములు నివృత్తిబొందనిది యపరోక్షజ్ఞానము గలుగదు. అందుకై ముఖమును ప్రత్యక్షముగ గనిపింపనివ్వని యద్దములోని మలినము దుడిచివేయ ప్రయత్నింతుము; మలవిక్షేపములలో నిష్కామకర్మవలన మలదోష నివృత్తియగును. మలదోష నివృత్తిగానిది యేకాగ్రతగాని, యపరోక్షముగాని కలుగదు. చిత్తము నిర్మలమైనచో నేకాగ్రతయు, జ్ఞానము నాత్మసాక్షాత్కారము గలుగును. "యోగశ్చిత్తవృత్తినిరోధః" యని పతంజలి.

ప్ర॥ అనగా నపరోక్షజ్ఞానమునకు ప్రతిబంధకమగు చిత్తశుద్ధి యవసరమన్నమాట.

ఉ॥ అవును. నిష్కామకర్మవలన చిత్తశుద్ధి, తద్ద్వారా జ్ఞానము సాధ్యమగును.

ప్ర॥ కర్మయోగముద్వారా మోక్షము లభింపదా?

ఉ॥ కర్మయోగము మోక్షమునకు పరంపరాసంబంధము. కర్మయందేమిలేదు. కర్మలకు కారణమగు కామ మందేగలదు. శక్తిరంగులవలె కర్మఫలములు కామము ననుసరించియే ఫలకారులగును. కామమేలేదా, కర్మ యెట్టిదిగాని బంధములేదు. చెట్టున కాయ మాగితే తానె తొడిమెను వదలును. కర్మయోగియొక్క కర్మవాసనలు వదలితే కర్మలు తమంతట తామె యోగిని వదలును.

ప్ర॥ కర్మయోగము నాచరింపనిది జ్ఞానము సాధ్యము కాదనెదరా?

ఉ॥ పరోక్షజ్ఞానమువలనగాని లేక జ్ఞానములేకపోనీగాక నవిద్యాపరిణామరూపమగు చిత్తశుద్ధి తప్పనిసరిగా బొందవలసి వచ్చినపుడు, కర్మను నాసక్తిలేకుండ జేయుట యవసరము. లేక ముందు జన్మమునందే

మల విక్షేపముల తొలగించుకొని యావరణనివృత్తి బొందినవారు నీ జన్మమున కర్మయోగ మవసరములేకనే జ్ఞానవిజ్ఞానముల శ్రేయస్సు బొందవచ్చు.

ప్ర॥ కర్మను చేయకుండ బొత్తిగ వదలితే సరిపోదా?

ఉ॥ కాయిక వాచికముల వదలవచ్చు, మానసికముగ వదలతరమా? 'తలలుబోడులైన తలపులు బోడులా' యని మన వేమన్న. మానసికమునే కాదు, నేవిధముగ వదలకాదు.

ప్ర॥ చిత్తశుద్ధి లేకుంటె మోక్షములేదా? జ్ఞానము లేదనెదరు, ఫలములేని కర్మ మెలా చేయునగును?

ఉ॥ నిజము. ఫలము స్వల్పమై, క్షణభంగురములై రంగులరాటము తిరిగిన ట్లొకటి ముగిసి ముగియక మునుపే మఱొకదానికి ప్రయత్నము జేయుచు, దారి తప్పినవాడు కనుగొనెదను.లే, కనుగొనెదనులే యని పోయి పోయి తుదకు కీకారణ్యమున జేరును. నీటబడినవాడు నిదిగో నిచట, నిదిగో నిచట తేలగలనని, నీతరాక మఱొకరి సహాయము లేకపోయిన తుదకు కొట్టుకొనిపోయి చచ్చును. "సుఖాభ్యుదయికం చైవ నైశ్శ్రేయసికమేవ చ॥ ప్రవృత్తిం చ నివృత్తిం చ ద్వివిధం కర్మవైదికమ్" కర్మలను ప్రవృత్తినివృత్తిగా జెప్పటములో నివృత్తికర్మలవలన యను నిష్కామముగా జేయు కర్మలు చిత్తశుద్ధికరములు. ఎన్ని జన్మములనుండియో నార్జించిన సంచితకర్మ ననుసరించి గలిగిన చిత్తవృత్తివలన నడ్డములేని కోరికలనే స్రోతలవలన స్థాపించుచున్న నాశయవస్తువులు నహంకారయుక్తములై కట్టలులేని చెఱువు తెగి నలుముఖముల పరుగిడుపగిది, జరుగు కర్మపరంపరను, శాస్త్రనియమమనే కట్టుబాటుద్వారా చేయుటను సులభము. కర్మలను వదలినట్లు సోమరులై వాంఛల వదలని కపటమతులు లోకవంచకులై తాము సమూలము చెడుదురు. కర్మలను జ్ఞానేంద్రియ కర్మేంద్రియముల తన వశము జేసుకొని కర్మేంద్రియములతో కర్మ నొనర్ప హానిలేదు, బంధములేదు. వాడు ధన్యుడు.

ప్ర॥ కర్మలు యెన్ని విధములు?

ఉ॥ వైదికములని, లౌకికములని రెండు విధములు.

ప్ర॥ వానిని వివరింపుడు.

ఉ॥ శరీరసంరక్షణార్థము జేయబడు ధన ధాన్య వస్త్ర పశు గృహ క్షేత్రారామాదులు వైదికములనునవి. ఉదాసీనకర్మలుగాక తక్కినవి నిత్య నైమిత్తిక కామ్య ప్రాయశ్చిత్తాది కర్మలు.

ప్ర॥ ముఖ్యములగు కర్మలను జెప్పుడి?

ఉ॥ "అగ్నిహోత్రం తపస్సత్యం వేదానాం చానుపాలనమ్। ఆతిథ్యం వైశ్వదేవం చ ఇష్టమిత్యభిధీయతే" అగ్నిహోత్రము, తపస్సు, సత్యము పలుకుట, వేదానుగతము, నాతిథ్యము, వైశ్వదేవనమనునవి ఇష్టకర్మలు. "వాపీకూపతటాకాది దేవతాయతనాని చ। అన్నప్రదానమారామః పూర్త మిత్యభిధీయతే" నూతులు, దిగుడుబావులు, తటాకములు, దేవతార్చన, అన్నప్రదానము, విశ్రాంతిస్థలములు పూర్తకర్మలు. వీనినే శ్రౌత స్మార్త కర్మలందురు; లేదా యజ్ఞ దాన తపములని చెప్పెదరు. తక్కిన కర్మలన్ని నీమూటియం దంతర్భూతములగును.

ప్ర॥ పుణ్యాత్ములాచరించు కర్మలెట్టివి?

ఉ॥ శాస్త్రనియతములు, కర్మల వదలిన నీశరీరయాత్ర జరగటము కష్టమైపోవును. దుష్కర్మ పుణ్యకర్మలకు శరీరమే సాధనము. శరీరము ద్వారా శరీరావసరకర్మల జేయుట సుఖకరము. కర్మఫలకాము లత్యల్ప ఫలముల నొందెదరు. కర్మఫలత్యాగులు కర్మ చిన్నదైనను, ఫల మధిక మొందెదరు. బీదలు వేకువఝామునలేచి కొండలకుబోయి కట్టెలుకొట్టి తెచ్చి యమ్ముకుంటె వెల స్వల్పము లభించటము, మరుదినము మరలపోక తప్పి నదికాదు. అదే బీదలకు నన్నదానము, విద్యాదానము, వస్త్ర గృహ పశు భూములిత్యాదిదానము లొసగుట. చిన్నవిగా కనిపించిన దొడ్డవాడుగ బుట్టుచున్నాడనిన కారణము నిష్కామమనునన్న మహిమయే. మహాత్మా గాంధీజీ సుమారు 18-19 గంటలు పని చేసెడివాడు. ఆయనకంటె నిదుర బోవుచు కర్మనూడిగముగ జేయువారున్నారు గాని ఆయనకు గలిగిన కీర్తి, గౌరవ మమరత్వము వీరికి గలుగటములేదు. ఎందుకు? వీరు కష్టించి యింత కర్మ చేసినను స్వార్థము. ఆయన కర్మకు స్వార్థములేదు. ఇదియె కర్మయోగములోని రహస్యము. జప తప వ్రతములాది యెట్టి కర్మలైనను ఫలము స్వల్పముగా లభించటము తప్ప మరేమతిశయముకాదు. బంధ విముక్తియుగాదు. ప్రహ్లాదుని నిష్కామము, భరతుని నిస్స్వార్థము,

హిరణ్యకశిపుని ఫలకర్మతపస్సు యేమైనది ? తుదకు ప్రహ్లాదు నిష్కామ కర్మమే తండ్రికిగూడ మోక్షమిప్పించినది. సామాన్యముగ స్త్రీలలో తల్లికి కర్మఫలాసక్తి లేనిదానిచేతనే యుత్తమస్థితిని, గౌరవము, కీర్తి, భక్తి, జ్ఞానవైరాగ్యము, మోక్షముసైతము పురుషులకంటె ముందు బొందుచున్నారు. గర్భము మోయుటము, బిడ్డల చాకటము, నింటిపనుల నాచరించుటయు కర్తవ్యమేగాని తనకాబిడ్డలవలన ఫలము గావలెనని స్త్రీ యెన్నడు గోరదు. ఆమెలోని సహజస్వభావమది. కావున రాజకీయ రంగము మొదలు నధ్యాత్మరంగమువఱకు స్త్రీలే ముందంజవేసిరి, వేయ గలరు, వేయుదురు. "ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా। సహస్రం తు పితౄన్ మాతా గౌరవేణాతిరిచ్యతే" పదిమంది యుపాధ్యాయులకంటె నొక యాచార్యుడు హెచ్చు, గౌరవార్హుడు. నూరుమంది యాచార్యులకంటె తండ్రి హెచ్చు, పూజ్యుడు. తండ్రికంటె వేయిరెట్లు హెచ్చు పూజ్యురాలు తల్లియని మనుస్మృతి.

ప్ర॥ యజ్ఞమంటే నేమి ?

ఉ॥ "యజ దేవపూజాసంగతికరణదానేషు — దేవాన్ పూజయతి సంగమయతి దదాతి" దేవపూజయన నర్చన, స్మరణ, కీర్తన, ధ్యానము, సమాధియనినన్ని, సంగతికరణయన నాత్మపరమాత్మల యేకైకస్థితి, దాన మన యన్నదానాది షోడశమహాదానములు. యజ్ఞశబ్దమున కర్థము ఈశ్వరార్పితబుద్ధితో ననహంకారుడై ఫలాసక్తిలేక చేయుకర్మ. ఈ యజ్ఞ విషయము నాల్గవయధ్యాయమున జెప్పబడును. "యజ్ఞో వై విష్ణుః" యజ్ఞము భగవత్స్వరూపముగుటచేతనే కామ్యకర్మలకుగూడ ఫలము యజ్ఞేశ్వరుడిచ్చును. నిస్స్వార్థముగ నొనరించు కర్మ బంధరహితమగును. ఈశ్వరార్పితబుద్ధితో జేయు కర్మలయందు కర్తృత్వముండరాదు. కర్తృత్వ ముండెనా నిష్కామముకాదు. పతివ్రతవలె, నేకపత్నీవ్రతునివలె, నింటి దాసివలె, నుద్యోగివలె దాసి బిడ్డలను చాకగలదుగాని, నా బిడ్డలనునది యుండదు. ఉద్యోగి తానున్న యాఫీసునందలి వస్తువులు తనవికావని తెలిసి యెక్కడమార్చిన నక్కడికరుగును. తొలుతటి యాఫీసునందలి మమతయుండదు. అందువలన నతనికి బంధములేదు. ఇరువురు భార్యాభర్తలు కాశీవిశ్వనాథుని సేవింపబోవుచుండ పతికి తెలియకుండ భార్య

నొక వెలగల వస్తువును వెంటతెచ్చెను. రైళ్లులేనికాలము. బాడుగబండిలో రాత్రి ప్రయాణముచేయునపుడు బండిలో కాశీశుని హృదయములో వేదు కుంటూ నుత్సాహముగనున్న మగనికి మధ్యమధ్య భార్య దొంగలెవరైన వత్తురేమోయని భయము చెప్పుచుండ కారణమడుగ నేనొక వస్తువు నింటినుండి తెచ్చితిని. దానిని జాగరూకతతో చూచుకొనకపోతే నెవరి వలననైన నపహరింపబడునేమో యనెను. అంత నతడు తనచేతికి తీసుకొని విసరి యడవిలో బారవైచి నిక నిమ్మళముగా నుండుమనెను. పోయినదిక రాదనేనిశ్చయముతో తుదకామె నిర్భయురాలైనది. తనదియనే ప్రతి కర్మ బంధమే. అందుకయ్యే బ్రహ్మ ప్రపంచమును సృజించునపుడు మనుష్యులతోబాటు యజ్ఞమునుజేయు విధానము తెలిపెను. యజ్ఞములు కామధేనువు వంటివి. ఏమికోరి యొనరించితే నా ఫలమునిచ్చును. మనుష్యులు దేవతలను తృప్తిపఱచుటవలన వారు మనుష్యులకు కావలసిన వరములిత్తురు. ఇట్లు పరస్పరము నొకరికొకరు సహాయమొనర్చుకొనవలెను. యజ్ఞముల హవిరాన్నముల దేవతలకునివ్వ వారు దయతో కోరిన యభీప్సితములనిత్తురు. దేవతలు దయతో నిచ్చిన పదార్థముల వారికి నొసంగక భుజించువాడు కృతఘ్నుడు; పాపము భుజించినట్లేయగును. ఒకదఫా మానవుడట్లు చేయక తానే హరించిన యాపైన దేవతలు నాతనికి సహాయమొనర్పరు. ప్రతినిత్యము నీళ్లుబోసితే పూలనిచ్చు తీగ నీళ్లుపోయువా మరుదినము పూలనీయదు. ఆహారము, నీళ్లు వేయనిచో పశువు పాలనీయదు. తైలములేదా వెలుగునీయదు. దేవతలకు నర్పింపక తనకై నుపయోగించు పదార్థము ఫలకారికాదు. "అఘం స కేవలం భుంక్తే యః పచత్యాత్మకారణాత్" అనియు "అగ్నౌ ప్రస్తాహుతిః సమ్యక్ ఆదిత్యముపతిష్ఠతే। ఆదిత్యాజ్జాయతే వృష్టిః వృష్టేరన్నం తతః ప్రజాః" అని మనువు. అగ్నియందు విధిపూర్వకముగ నొసగబడిన నాహుతులు నాదిత్యుని జేరుచున్నవి. ఆదిత్యునినుండి వర్షమును, వర్షమునుండి యన్నమును, అన్నమునుండి ప్రాణులును గలుగుచున్నవని. కర్మ ఫలముల త్యాగము స్వతంత్రుని జేయును. సీతను గుర్తించిన హనుమంతునకు నంతటి ఘనత చిరంజీవత్వము. నిత్యపూజ జరుగుచున్నదంటే నతని నిష్కామములోని గొప్ప యంతను గ్రహించినది. తండ్రియగు వాలికంటె

నంగదునకు, నీల, నల, జాంబవదాదులకు రాగల్గిన గొప్ప నిష్కామమే. రావణునకు నతని బంధువులకు, గౌరవప్రకర్షలు రాలేదంటే కామ్యకర్మలు నందు రజోగుణ తమోగుణ యుతములు. అపవిత్రస్థలములో నుండినను, పవిత్ర స్థలమునందున్నను భక్తి, నిస్స్వార్థత, జ్ఞానములేనిచో నెవరికి శాంతము గాని, మోక్షముగాని లేదు. కాళికాదేవికి పూజారి యొకడుండెను. అతను నిత్యము కాళీమాతను పూజించి, నైవేద్యము నారగింపుజేసి దానిని యింట తన పిల్లలకు బెట్టి భార్యాభర్తలు తినుచుండిరి. ఒకపుడు తన కేదో వేఱే గ్రామమున పనియుండి పోవుచు తన కుమారుని మామూలుగా కాళీపూజ గావించుచుండుమని చెప్పి వెళ్ళెను. తన తండ్రి రోజు నైవేద్యము నింటికి గొనివచ్చుట వానికి తెలియదు. కాళీమాత భోంచేయుచున్నదనుకొని యర్చనమాగిసి నైవేద్య మొసగ నెంతసేపటికి నామె దినకున్న జూచి అమ్మా! నాన్న తెచ్చిన నైవేద్యము బుచ్చుకొనటము, బాలుడనైన నేను తెచ్చిన నైవేద్యము పుచ్చుకొనకపోవటము నాతప్పేమి? నీవు పుచ్చుకొనకపోయిన తండ్రి నన్ను దండించును తినుమని బ్రతిమాలెను. తినకపోయిన నీ పాదములవద్ద జచ్చెదననిన నాగ్రహ మొనర్చ నామె గబ గబ తినెను. కాళిపాత్రతో సంతోషముగా నింటికి రా తల్లి వానిని చీవాట్లు బెట్టెను. మీ తండ్రి రానిమ్ము మమ్ముల నన్యాయ మొనరించి యొక్కనివే కాళికాదేవి తినినదని యింతా నీ పొట్ట బెట్టుకొంటివా యనెను. అతడు నిర్విణ్ణుడై యూరకుండె, మరునాడు తండ్రి బాగానే నీ విషయము విచారణకు వచ్చెను. ఓరీ కుంకా! ఇంత చిన్నతనముననే నెంత నేర్చితివిరా? రాళ్లు దేవతలైన రాసులు భ్రమింతురా? అనునది మాకు తెలియదా? ఎంతో కాలమునుండి యమ్మవారికి పూజ చేయుచున్నాను. నేనుండినపుడు తినని యమ్మవారు నాకలిగొని యిప్పుడు తినెనా? సరే. నైవేద్యము తీసుకో, ఈ రోజు నా యెదుట నన్నము తినదాయెనా? నీ యాయువు మూడినట్లేనని తిట్టికొట్టి యాతనిచేతనే నా రోజు పూజ చేయించుచూ, తాను ప్రక్కన నిలచి చూచుచుండెను. వాడు యథారీతి పూజచేసి అమ్మా! నా తిట్లు, నా కొట్లు నీకు తెలియవా? నీవీరోజు తిననిచో నేనబద్ధమాడినట్లు నా యాయువుమూడును. నిందు దేవతలలోగూడ సాక్షాత్కారము లేదనునది లోకమునకు దృఢమైపోతుందని కండ్లనీళ్లు రాల్చుచు నైవేద్యము ముందుం

చెను. ఆమె వెంటనే నోరు దెఱచి యన్నము నోకేతూరి మ్రింగుట తండ్రి గని తనయుని పాదములబడి తన తప్పిదమును, తన స్వార్థమును, నశక్తతను యొప్పుకొని నతనినే పూజారిగా నాటినుండి నియమించెను. చూచితివా! నిస్స్వార్థతచే బాలునికిగలిగిన శాశ్వతామరత్వము తండ్రికేల గలుగలేదు? స్వార్థులు దేవతల సొత్తును తిని పాపాత్ములయ్యెదరు. కావున పవిత్రమైన దేవస్థలముల దేవతలయొద్ద నీలాటివారుండికూడ నపవిత్రులైరి. భగవంతుని యనుగ్రహమునకు దూరులౌదురు. నీటియందుండు కప్ప తామరలందలి మధు వెరుగదు. పక్షులు చెట్టుయందే యుండును, కాని చీమలు గుర్తెరిగిన మధువును తెలిసికోలేవు, అనుభవించలేవు. అటులే, దైవమునకొసగు యజ్ఞఫలమున నాసక్తులైనచో దైవమెట్లు కరుణించునో జూడుము. పత్ర, పుష్ప, ఫలాదులు స్వార్థరహితములు కాబట్టి శివాది దేవతలకు, మనుష్యులకు ప్రీతికరములైనవి. భగవంతుడు పత్ర పుష్ప ఫలాదు లంగీకరించుట స్వార్థుల జూచికాదు, వానిని జూచియేనని గ్రహించుము. అట్టి స్వార్థత్యాగము మనుష్యునకే యున్న ప్రస్థానములేల?

ప్ర॥ పంచమహాయజ్ఞముల వివరింపుడు.

ఉ॥ దైవ, ఋషి, పితృ, మనుష్య, భూతయజ్ఞములని నిత్యకర్మలు. దేవతల నర్చించుట స్వశాఖా-వేదాధ్యయనము లేక నుపనిషత్తులో గీతా పారాయణము చేయుట, ఋషుల తృప్తిపఱచుట, తర్పణాదులు పితృల కొసగుట, అతిథి సత్కారము, కాకశునకాదుల తృప్తిజేయుట భూత యజ్ఞములని యైదు.

ప్ర॥ ఈ యజ్ఞము లొనరించుటవలన నాయా దేవతలకే ఫలమందునా?

ఉ॥ నిష్కామముగ నొనరించిన తప్పక నందును. అథవా వారిలో కనిపించువారు కొందఱు, కనిపించనివారు కొందఱున్నను ఫలము మనకు గలుగుటవలన నాయాదేవత లిచ్చినారనే మన నమ్మకము. ఆయా దేవతలు లేకపోయినను భగవంతుడే నాయాదేవతలరూపమున ఫలముల నిచ్చును. అదేగాక "సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" అన్నిటి ఫలము కేశవుని జేరును. తుదకు కేశవప్రాప్తి సిద్ధించును. విను గవర్న మెంటు యొక్క పెద్ద దైవమునకో. దానికి రూపముగలదా? లేదు. లోకసభ మొదలు నౌకా-కర్మ డిపార్టుమెంటున కొక ప్రభు వుండినపుడు ప్రజలకు

నే శాఖతో నవసరము గలిగితే నా ప్రభువును ప్రార్థించెదరు. అతడు తన వల్లనైతే తానే జేయగలుగును లేకపోతే పైయధికారికి తెలిపి యతని దయ గలిగించును. తానే గలుగజేయునది ముందే గవర్నమెంటు నధికారము యిచ్చియుండురు. అది యితని స్వంతముకాదు. ప్రజల మనవిపత్రమును పైకి పంపును. అన్నిశాఖల ప్రభువులను ప్రజలు గౌరవించుట లేదా? పంచదైవతములను నారాధించుట గృహస్థుల పాపనివారకమగును. మరొకవిధము. రేడియో, టెలిగ్రాఫ్, టెలిఫోనులవల్ల మన సంగతు లితరులకు నందజేయుదుము. మన మనోనిస్స్వార్థమున శ్రద్ధాభక్తుల నపూర్వరూపముగ నందజేయవచ్చు. మఱొకవిధము. ఏ ఋషుల తపోమథనజనిత నవనీతామృతము మనము కృషి జేయకుండనే సిద్ధించుటకు వారికి కృతజ్ఞులమని తెలుపుట కధ్యయనము జేయ వారికదియే తృప్తి. దానిచే నిరహంకారత, నిశ్చలత్వము, పారిశుద్ధ్యము, జ్ఞానవైరాగ్యములు గలుగును. తక్కిన యజ్ఞములను సాంప్రదాయానుసారము భావికాలమున వారికి నాదర్శముగా జేయుబడును. పితృదేవతల నుద్దేశించి పుండరీకుని కథ చదివితే జీవించియున్నపుడు తలిదండ్రుల పూజింపలేనివారికి చనిపోయిన తరువాత పెట్టు శ్రాద్ధాదులవలన ఫలము తమ ప్రాయశ్చిత్తమునకై నుపయోగపడి ధన్యుల జేయును. మఱొకమాట. దైవయజ్ఞమన తమ్ము దైవమున కర్పించుకొని సర్వకర్మల దైవమున కర్పించుట. పితృయజ్ఞమన దైవమును పితృలకు శుభము నిచ్చునట్లు ప్రార్థించుట. ఋషియజ్ఞము వాక్శుద్ధి, మనోశుద్ధుల బడయుటము. మనుష్యయజ్ఞమన మనుష్యులనందఱ తమతో సమముగా జూచుకొని వారియందఱి ప్రేమను బడయుట. భూతయజ్ఞము పక్షి మృగ స్థావరములయందు దైవముగలడు, దైవమే నారూపమున వ్యక్తమైనాడని యజ్ఞాన్నము నివేదించుట. ఇందువలన త్యాగధర్మము స్వార్థరహితబుద్ధికి నలవాటుబడును. అప్పుడు ప్రపంచము దైవమయమనే సులభముగ గ్రహింతురు. భగవంతుడు కర్మల చక్రముగా వర్ణించుటకు హేతువేమన, ఎట్టి కర్మ చేసిన యది యనుభవమునకు వచ్చుటయే. వివిధ కర్మల నీశ్వరార్పితమొనర్పనిచో ఫలవంతముగాదు.

ప్ర॥ ఆత్మ పరమాత్మల కైకస్థితిని గ్రహించి స్వరూపానందుడైన వానికిగూడ కర్మ యవసరమా?

ఉ॥ ఉద్యోగముచేసిన, చేయకపోయిన తనుయున్న నింటికి నద్దె నెట్లు నివ్వకతప్పదో, తాను యానందమయుడైనను బాహ్యమగు దేహమునకు బ్రతికియున్నంతవఱకు నన్నపానములవసరము. వానికొఱకైన కృషిజేయవలె. భిక్షాన్నమైనను కృషియే. అయితే నేబుద్ధితో వానిని గొనును? ఆనందబుద్ధితో. దేహావసరమునకు తగినట్లు గొనును. లేదా ఆలాంటి మహాత్ములు కర్మచేయకపోయిన దోషములేదు. కర్మల యగత్యతలేదు. ఏప్రాణి నాశ్రయించవలసినదిలేదు. తీర్థయాత్ర లోకతూరి సేవించినవారికి మరల సేవించ నవసరములేదు. దైవస్వరూపమే తానైనపుడు "ద్వితీయాద్వై భయం భవతి" యెవరికొఱకు కర్మచేయును? ఉద్యోగము నుండి విరమించినవానికి పెన్షన్ గవర్నమెంటు యిచ్చును. ఈ మహాత్ముల దేహపోషణ దైవమేజూచును.

ప్ర॥ కాము ముక్తులు లోకమునిమిత్తము, ముముక్షువులు మోక్షము నిమిత్తము కర్మజేయుదురంటిరికదా! జ్ఞాని కర్మలజేయుట దోషమేమి?

ఉ॥ గృహస్థులైగాని, సన్న్యాసులైగాని శాస్త్రనియతకర్మల జేయవచ్చును. ప్రపంచము వ్యావహారికములోగూడ మిథ్యయైనప్పటికిని దానిని భగవద్రూపముగ దెలిసి మహాత్ములగు జ్ఞానులు జగత్తునకు మేలొనగూర్చెడి నిష్కామకర్మలననగా కర్తృత్వజ్ఞానములేక చేయుచుండుట నకర్మయగును. కర్మిష్ఠులు సకలవిధములుగనుండు కర్మలను జేసినప్పటికి గూడ జగత్తుయొక్క పారమార్థికసత్త బ్రహ్మరూపముగా నెఱింగి కర్మమార్గమందు నహంకారము మున్నగువానివలన గలుగు బంధమునుండి విముక్తినొందగలరు. ఇదియు నకర్మయే. జనకుడు మొదలగు రాజఋషులు నీలాగు నాచరించిరి యనుటలో సకలమానవులు నాచరించవచ్చుననుట చిన్నవిత్తనములోనుండి గొప్పవృక్షమావిర్భవించినట్లు, సూర్యునివేడి సూక్ష్మమై కంటికి గనుపింపక పెద్దపెద్ద మేఘములను, వానివలన వర్షము, వానివలన గొప్పనదులను బుట్టించుటయు, చిన్నధర్మమువలన నరుడెంతెంత యధికుడగుచున్నాడు. మూడడుగులదానముతో బలి రాజ్యమునంత హరించినవాడే తనకంటె పెద్దయగు బలివాకిట నిరంతరము కావలియుండవలసి రాలేదా? "ధర్మ ఏవ హతో హంతి" ధర్మమును నశింపజేసిన తనకే హానిగల్గును. "ధర్మో రక్షతి రక్షితః"

ధర్మమునుబోషింప తన్ను రక్షించును. పనసపండు తిన యెన్నడెఱుగని వాడు పండునుగోసి దాని గుజ్జు భుజించినమీదట చేతులకున్నైన జిగట నెంతకడిగిన పోనపుడు పనసపండెవ్వడు తినరాదు. తింటే జిగటవదలదని ప్రకటించుట మరొకడు విని, నీకు తెలియకపోతే జిగటను బోగొట్టు కొనుట యందఱకు దెలితుదనియా? ముందే కొంచెము నూనె చేతికి రాసుకొని దానిజోలికిబోతే నేజిగటనంటదనెను. కర్మయోగరహస్యము తెలియనివారు కర్మఫలము పుణ్యముగానో, పాపముగానో, మిశ్రమము గానో తప్పక గలిగించినను వారు పనసజిగటవంటి కర్మలకు మూలమగు కర్తృత్వము ఫలాదుల నంతఃకరణమున వదలనివారు, నొకవేళ కర్మల వదలినను వాసనలు వారిని వదలవు. వదలవలెననుట యీసక్తియె. వదల వీనికిమారు మఱొకరీతి నాచరించుట "యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే। మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియో క్ష్యతి" భగవద్వాక్యమును మఱచినవారు ప్రమత్తులు. మానవుల యల్పశక్తి యెఱింగియే నీ రహస్యము తెల్పెను. కర్మచేయక యూరకుండా మనుకుంటే తనస్వభావ మూరకుండదు. కుక్క స్వభావము కనకపు సింహాసనమున గూర్చుండబెట్టిన వెనుకటి గుణము మానదు. నిష్కామి యెట్లుండునో విను. భార్యాపిల్లలతో నుండస్థలములేక నేచావడులలోనో కాపురముజేయుచు దూదియేకటముగాని, క్రొత్తపరుపుల తయారు చేయుటము లేదా ప్రాతవి చక్కజేయుట నెఱిగి యూరూరుదిరుగు నొక బీదవాడు ఒకనాడొక పెద్దపట్టణమున నొక ప్లీడరుయింట మూడు ప్రాతపఱుపుల తయారుచేయ కూలికినొప్పుకొని బీదువుయింటిలోనున్న నా పరుపులజూప నాతడు వాని మునుగు తిత్తులదీయ నందు మూడు నూరురూపాయలనోట్లు కనిపించెను. అప్పుడతడు ప్లీడరుగారివే యీనోట్లు వారికివ్వవలెనన, తనబుద్ధి యనుచున్నది: నీవు దొంగతవమునకు వచ్చి తివా? దొంగలించితివా? అదృష్టముండి దొరికినవి కొనిపొమ్మనును. నీతడనును: ఈ యింటిలో నాకేకాదు మఱెవ్వరికైన దొరకనివస్తువు నింటివారిదేగా? నిది వారి కిత్తుననెను. బుద్ధి యంటున్నది: ప్రాప్త మున్నచోట ఫలమేల తప్పునంద్రు. నీ ప్రాప్తమున కిడబ్బువచ్చినది. తంద్రి గతించిపోతే పరుపులు తగిలేదానికి ధీమాలేక నెగగట్టెంచి, నీచే దింపించి

నీచే తయారుచేయించు వారిదైతే నింతకుముందే వారిదియై యుండవలె. నీ చేతికెందుకు చిక్కెను? కాన స్థలము, నోట్లు వారివేయైనను ప్రాప్తము నీది కొనిపొమ్మనును. ఈనాడు కాకపోయిన, మఱేనాడైన వారు కను గొనలేరా? మఱచినవస్తువు జ్ఞాపకమునకు రావటము మనకు తెలియదా? ఏవంకనైన వారిదేగాని దీని నపహరింప మనకు హక్కులేదనె నతడు. ఇయ్యది దొంగతనముకాదు, మోసముకాదు, వంచనకాదు, దౌర్జన్యము గాదు. నీకే దొరికినది. ఒకవేళ డబ్బునకు బదులు దుష్టజంతువేదియైననుండి నిన్నంటించిన వచ్చినవారందఱు నీ ప్రాప్తమనెదరుగదా? ఇప్పుడిది నీ ప్రాప్తముకాదా? యను బుద్ధి. ఇల్లువారిది. పఱుపులువారివి. ఉండేది వారియిల్లు. నమ్మికదా తీసుకొమ్మన్నారు. లేదా నెదుటనుండి యేల తనిఖీచేయరు? నమ్మినవారిని జెఱచుట మోసమే, వంచనయె, కపటమే యగునని. వేళయగుటచే నన్నమునకు తాముదిగిన సత్రమునకువెళ్ళి నీ సంగతి భార్యకెఱిగింప, తనచేతికితీసుకొని దేవుడు మనకొఱకై నిచ్చెను. ఈ పిల్లలపోషించలేక నెతలుపడుచున్నాను. ఈ వ్యూర నికనుండతగదు. మన కూలిదీసికొనిరమ్ము. రేపే వెళ్ళుదమనెను. బీదలము కాదా? యనెను. అతడు వారి తండ్రివిదెూ, లేక వారివిదెూ, మన పరీక్షకై యుంచిరో చెప్పక కొనిపోవుటము పచ్చిమోసము. తెలిసిన నమ్మకము చెడిపోవును యనిచెప్ప, భార్య యివ్వక ప్రయాణముకట్టి కూలిదీసుకొని రమ్మనిచెప్ప నాతడుపోయి మీ పనిముగిసినది. రేపే వెళ్లుచున్నాను. కూలియిమ్మన, ప్లీడరుగారిచ్చిపంప, నాతడారేయి నిదురించక మరుదినము ప్రయాణము జేయుచు నుదయం 9 గంటలకు సుమారు మూడుమైళ్లు దాటిరి. అక్కడ భార్యతో నేను రాను. నీవీడబ్బుతో నీ పిల్లల బ్రతికించుకో. నేనెక్కడ నైన వెళ్లెదను. పరధనమెన్నడు మన మంటము. కష్టించి పనిజేసి, జీవించు మనకు నీ బ్రతుకు దగదని నిలిచెను. భార్య మఱుమాటాడక నానోట్ల నతనిచేతికిచ్చి వేగముగా నిచ్చిరా యన, నతడుత్సుకతతో పరువెత్తి ప్లీడరుగారు కాఫీవగైరాల తీసుకొని బయలెల్లనున్నసమయమునవచ్చి నేడ్చుచు నేనపరాధిని. ఎన్నడు తప్పుజేసి యెఱుగను. తమయింట నపరాధముజేసితి క్షమించుడని తనచేతిలోని వందరూపాయల నోట్లు ఘూడక్కడవుంచి శెలవా యనెను. ప్లీడరుగారు, నాయింటివాండ్రందరు

నాశ్చర్యులై నీ వెట్లుపకారివి? నోట్లెక్కడివి? మాయింట దొంగిలింపలేదే? యనిరి. తనకు దొరికిన విషయమును, బుద్ధికి భార్యకు తనకు గల్గిన సంవాదము వినిపించి, నాకుఁ దప్పంగ దేవు డొప్పలేదు. నా దేవుడు నన్ను బరీక్షించె ననెను. ప్లీడరు తనకండ్ల నానందబాష్పములురాల్చుచు నా నోట్లపైని శాలకమునుజూచి, తన తండ్రివ్రాతయని గ్రహించి తన కొడుకునుబిలిచి మరొక నూరురూపాయలనోటును తెప్పించి ఓయీ! నీవు మోసకాడవు, వంచకుడవు, దొంగవు కావు. సత్యవ్రతుడవు. నా తండ్రి నీ కొఱకై యుంచిన వాడీ మూడునోట్లు. సత్యము జెప్పినందుకు, నా తండ్రి నీ ఋణమును దీర్చుకున్నందుకు సంతసించి నీ నోటు చేనిచ్చితి కొనిపొమ్మన, నాతడంటడాయెను. ఇంటివారందఱు బ్రతిమాలి యిచ్చ కొనిపోయెను. చూచితివా నిష్కామమెంత జ్యోతియో! సూర్యుడు వెలుగనిచోటగూడ వెలుగుచున్నది. ఎంత చలువో, నెంత క్షీరవారాశియో, నెంత మంగాంగు పసిడియో, నెంత జుంటితేనియయో, నెంత కామదుగ్ధయో తెలిసెను గదా! మఱియు లోకమునకు శ్రేష్ఠపురుషులవలననే శుభముగల్గును. ఒకప్పుడు కీడు వారివల్లనే గలుగును. వారెప్పు డధర్మప్రవర్తకులయ్యెదరో వారిని యనుసరించియే జగత్తునకు తెగులుజూపును. మన దుర్యోధనాదులు గొప్పవారే. కాని ఆతతాయులైరి. వారితో వారి నభిమానించిన వారితో సహా క్షయమైరి. పేరు గొప్ప, కులము గొప్ప, మతము గొప్ప, వేషాచారముల గొప్పలో లేదు. గొప్ప గుణమునయున్నది. గుణమెవ్వరిది? వజ్రమో, బంగారమో, సత్యమో, వారు లోకక్షేమంకరులు. "యుక్తియుక్తముపాదేయం వచనం బాలకాదపి" యుక్తియుక్తమైన వచనము బాలకునిదైన గ్రహింపదగినదే. పాపభూయిష్ఠులగు దుర్యోధనాదులు, వారి సంతానము, వారి పితరులునై తము పతితులైరి. ఒకరివల్ల ననేకులు చెడిరి. రాముడు నిష్కాముడు, లోకాభిరాముడు, గుణధాముడు, ధర్మపరుడు. తాను వెళ్లినపుడు తనతో వచ్చినవాండ్ర పశుపక్ష్యాదులతో సహా వైకుంఠమునకు గొనిపోయెను. ఆయన యుదారత వర్ణింపరానిది. ధర్మజుడు తన వెంటవచ్చిన కుక్కనువదలి స్వర్గమునకు రానననెను. ఈయన ధర్మముజూడు మెట్టిదో! భగవంతుడు యుగయుగముల నవనిపై నవతరించుట సమిష్టివిప్లవమైన తాజన్మించి, నావిప్లవమునడంచి లోకముల

పాలించును. వ్యష్టివిప్లవమైన వానివాని లోపలనుండియే మఱొకరీతి రక్షించును. పాపాత్ముడైన యజామిలుని వాల్మీకియిత్యాదుల సముద్ధరించెను. తనగీత నవమాధ్యాయమున "అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్" "క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి" అత్యంతపాపాత్ముడైనను నన్ను భజించితే వాడు సాధువే. మఱియు నన్ను భజించుచు శీఘ్రముగ ధర్మచిత్తుడగుచు నిత్యశాంతిని బొందుననెను. ఏ సమయములోజూచిన తాను పనిచేయుచునేయున్నాడు. తనకు నాసక్తి లేదు. కాన నవతారములెత్తుచు ధర్మమును రక్షించటములోనే నాయన యవతారమునకు పూర్ణత్వము గలిగినది. భగవంతుడే తనకర్మనుజేయుట మానెనా, లోకముగూడ కర్మలనదలి భ్రష్టులయ్యెదరు. ప్రపంచము యుపయోగరహితమై, రైళ్లు మనుష్యులు బొత్తిగాదాని రైల్వేజంక్షన్ వలె, పూజాపురస్కారములకు దేవుడులేనిగుడివలె, వాడకపోతే త్రుప్పుబట్టు నినుపకత్తివలె వ్యర్థమైపోవును. తాను చేయుచుండబట్టి లోకమంత కర్మల జేయుదురు.

ప్ర॥ ఇందులో కొంత చేటుయున్నదని యుంటుందని యనుకొనెదను. భగవంతుడే చాలా మంది భార్యలపెండ్లాడి, యితరభార్యల పరిగ్రహించి, సంతానము పెక్కుగని, చిన్నతనమున చిలిపిపనులు తనకిష్టములేనివారల దునిమి తన్నుప్రేమించినవారల నుద్ధరించెననుట నాయనయే నాలాటి పరివర్తనుడైన నాయనవలె మనము చేయుటలో తప్పేమియని తోపదా?

ఉ॥ భగవంతు డనుగ్రహించినవి మనకు ప్రసాదములు. ఆయన యొనర్చు పనులలో తనకు లోకమునకు నరిష్టముదోచే పనియొనర్పడు. మన బుద్ధులకు దూరదృష్టి కాలజ్ఞానములేదు. ధర్మము నధర్మముగాను, యధర్మము ధర్మముగాను జూచెదము. అదియుగాక నెవనెవని తప్పులను తాను యాచరించునపుడు కనుగొనలేడు. ఆయన సర్వకర్త, సర్వజ్ఞుడు, సర్వభోక్త, సర్వత్రాత, సర్వనియంత, సర్వజగన్నియామకుడు. మానవులలోగల స్వార్థబుద్ధిని దూరమొనరించి నిశ్శ్రేయసులుగా నొనరింప సామదానభేదదండోపాయముల జగత్తున ప్రయోగించును. సర్వత్యాగుల సర్వస్వతంత్రులజేయుట తన్ను కనుగొనే దానికే నుపాయములన్ని చెప్పి యున్నాడు, చేయును. వైద్యుడు జేయు నాపరేషను భేదిమందులుగాని

డబ్బు పుచ్చుకొనక నిరాడంబరముతో మన యారోగ్యమునకై చేయు చున్నవెట్లు పాపయుతములు గావో, నారీతి పరాత్పరుని నియమము వర్ణనాతీతము. భాగవతమున జెప్పిన యనేకమైన కథలకన్నిటికి నర్థమొక మాటలో జెప్పెద తృప్తిబొందుము. గోపికలు మోహమున, కంసాదులు భయమున, యాదవులు బంధుత్వమున, పాండవులు ప్రేమమున, జరాసంధా దులు వైరమున, నారదాదులు భక్తిచేత, జ్ఞానులు నాత్మరూపమున పరాత్పరుని దర్శించి ముక్తిగొనిరంటే నాయనకర్మలు కొందఱకు విపరీత ముగ దోచినవెందుకని యర్థమయ్యెనుగదా! ఈ రహస్యమేమిటియంటే స్వార్థమున్నంతవరకు హరినుర్మము గనలేము. గజేంద్రుడు స్వార్థియై యున్నంతవఱకు హరికటాక్షము లేనాయెను. నీవే దిక్కని యన్నియాశ లను వదలినంతనే రక్షించెను. ద్రౌపది తన మానమును నొకచేత మూసుకొని నొకచేత రక్షించుకొందుననుకొలంపున నొకచేయెత్తి హరిని పిలిచిన రాడాయెను. రెండవచేయి యెత్తుచు నిక నీయిష్టమనెను. వెంటనే చీరలిచ్చెను. కర్తవ్యము వదలనిది న్యాయనచరిత మవాజ్మానస గోచరము.

ప్ర॥ కర్మల జేయుటములో కర్తృత్వమే బంధమంటారా?

ఉ॥ ఔను. కర్తృత్వమే కాలపాశము. కర్తృత్వము లేదా బంధ మేది? ఒకప్పుడొకడు నొకామెను వివాహమాడెను. కాపురమునకు రావటముతోనె తను కర్తయై, సిదిగో నాగసవుగ్రోయుము, నీ చెంబుల శుద్ధిచేయుము, నామంచ మిటువేయ్యి, నీవంట చేయుమని మగనికి నిదుర వచ్చువఱకు పనులు జెప్పి జేయించుచుండెను. అతడిది యేమియన్యా యము! నాకు పనులు చెప్పబట్టితివేయని యనుటకు పురసతు గల్గింపక పెక్కుకాలము పనిచేయించుచుండ, నొకరోజు పాలపాత్ర పిల్లి త్రోసి పాలన్ని పోవుటచే నెందుకు నీలాగు చేసితివని మగని దండించ, పిల్లిచేసిన పని నేను జేసినది కాదనిచెప్ప, కోపగించుకొని యొక లిస్టు తయారుచేసి దానిప్రకారము పనులొనర్పుమని యాజ్ఞాపింప, నాతడు చేయునదిలేక చింతించుచుండ, నా మరుదినము ఇంటివెనుక చాలలోతులేని బావిలో కాలుజారిపడి భార్య నన్ను లేవదీయుము, చలికి చచ్చుచున్నాను, వేగ ముగా రమ్మనెను. ఏదోయొక పనిచేయుచుండు పెనిమిటి తన లిస్టుకాగి

తము జూచుచుండ, నెందుకని యామెయడుగ, నిందులో బావిలోపడితే నిన్ను గట్టుకుదీసేది వ్రాశినావో. లేదో, వ్రాయకపోతే చెప్పునిపని కాగి తముపై వ్రాయునిపని నేను చేయగూడదుకదా! యని వెదకుచుండుట గని భార్య తనతప్పు తెలిసికొని, నాతప్పు క్షమించు కాపురమునకు వచ్చినది మొదలు నేటివరకు నేనార్చిన పాపఫలము నీరీతి యొసర్చినది. ఇక నెన్నటికి కర్తవ్యము వహించను. ఇంటిపనులన్ని జేతునన, గట్టుకుజేర్చెను. ఇంటిపనులన్నియు కర్తవ్యములేక చేయు భర్తకు బంధమేలేదు. కర్తవ్యత నామెకు బంధకారణమైనది. కర్తవ్యమునకు శరీరాభిమానమె పెద్దపాశము. జైలుసూపరింటెండెంటు కొందఱ ఖైదీల దగ్గరకుబిల్చి మీరెవ్వారు యన, ఫలానివ్వారని చెప్పిరి. మరీ శిక్షనెందుకు జెప్పిరన, ఫలానినేరమున కనిరి. మీ గ్రామమున జనాభాయెంత యన, చాలా కలదనిరి. వారందరేల జైలునకు రాలేదన, వారిపై యేనేరములేదు. అందున రాలేదని తామే యొప్పుకొనిరి. కర్తృత్వము నెట్టి కర్మయొ రించిన నట్టికర్మఫలము యనుభవమునకురాక తప్పదు. దుర్వాసుడు త్రిమూర్తులకెఱిగి దశదిశలపరుగిడి తిరిగి యంబరీషుని పాదములబట్టె నంటే కర్తృత్వమనే యభిమానమెంతవానినైన తిప్పలుబెట్టక నూరక వదలదు. అయితే నిజముగా కర్మములు జీవులొనరించుటలేదు. సర్వకర్మలను ప్రకృతియే సత్వరజోతమములను గుణములఘోరము, మూఢము, ప్రశాంతములను జాగ్రత్స్వప్నసుషుప్తుల, సుఖదుఃఖమోహాముల జేయుచున్నది. పరుగెత్తునది, నిలుచునది, నిలవేయునది, బొగ్గునీరుకొనునది రైలుయొక్క యింజనేకదా ? దానియందు కూర్చున్నవారు కదలమెదల వలసిన పనిలేదు. నడువవలసినది, నాయాసపడవలసినది లేదు. అయితే బండిపోవుచున్న పోవుచుంటిమనియు, నిలుచుచున్న నిలుచుంటిమని యన, నదియే కర్తృత్వాభిమానము, దురహంకారము. పోవుట, నిల్చుట బండికర్తవ్యము. బండిలోని వారికెవ్వరికి కర్తవ్యములేదు. ఉండినచోటనేయున్నారు. బండిలోనివారు తాముతాముగానేయున్నారు. బండిగా లేరు. అదియచేతనము, తాము చేతనులు. దానిని తాము తెలిసికొనెదరు, మిమ్ముల నది తెలుసుకోలేదు. అదియే తెలివితనము. జరుగునదంతయు బండివలననేయని యుదాసీనుడై యున్నవాడు ధన్యుడు.

తద్రీతి భోజనము, నీరు, దేహమునకు కదలుట, నిలుచుట, మలమూత్రములు వదలుట మొదలగు సకల సూక్ష్మస్థూలకర్మలనన్నిటిని ప్రకృతియే జేయును. ప్రకృతిచేయు పనులజూచుచు సాక్షియైయుండుటయే పురుష ధర్మము. తాను సాక్షియేగాని ప్రకృతిసంబంధమగు దానిపనుల తన యందు నారోపించుకొనుటయే బంధము. తెలిసియుండుటయే మోక్షము. సకలకర్మ భగవంతుడు నభిన్ననిమిత్తోపాదానకారణముగా కుండలకు కుమ్మరివానివలె, జగత్తునకు నిమిత్తము. తమఃప్రధాన ప్రకృతియనే యుపాధిని స్వీకరించి కుండకు మట్టివలె జగత్తునకు నుపాదానకారణ మగును. సాన్నిధ్యసాధనకర్తృత్వము, సాధనసాన్నిధ్యకర్తృత్వముల జేయుచుండ నీవెవరు? నేనెవరు? నితరు లెవరు? నిమిత్తమాత్రులమై యర్జునునివలె నున్న క్షేమము కాదా? అహంకారమువదలి కర్మచేయుటయు సుగమము. తాను కర్మజేయుటలేదు. కర్మసాక్షియగు సూర్యుడు లేనిచో పుణ్యపాపమిశ్రమకర్మలు జరగవు. జరిగిన నాయన నంటవు. కర్తవ్యము లేనందున సూర్యునకు కర్మలఫలము బంధకారణము కాలేదు.

ప్ర॥ ప్రకృతియే నిత్య నైమిత్తిక కామ్యకర్మలను యజ్ఞ దాన తపస్సుల జేయునా?

ఉ॥ ఈ విషయము క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగమున, గుణత్రయ విభాగయోగమున విపులముగానిందువు. అయినా కొంచెముగ వివరించెద. కాష్ఠముతో, నినుముతో తయారైన రైలుబండ్లు మానవుల యవసరములనుబట్టి కర్త, కర్మ, క్రియల రూపముగ నన్నికర్మలు వానివల్లనే జరుగుచున్నవి. మనుజులు నిమిత్తమాత్రులుగా నుంటున్నారు. ఒక మిషన్ ఉంది. పప్పునువేయు, నూనెనువేరు, విప్పినివేయు జేయుచు పని యంత తానే జేయుచున్నది. డ్రైవరు నిమిత్తమాత్రుడు. ఓనరు మిషను కర్త. అదేరీతి నా భాసుకుడు శరీరయింజనునకు డ్రైవరు. బొగ్గు, నీరు వేయుట తక్కినపనులు జేయువారగు క్లీనరులే మనసుబుద్ధులు. అంతర్యామియగు భగవంతుడే గార్డు. బండికి నీ బండ్లన్ని ప్రకృతిమయములే. నాత్మయకర్తనభోక్త నసంగుడు. వికారిగాడు. నిరవయవుడు. ఆత్మవేత్త నెప్పుడు నేదియు నేజేయుచున్నాననడు. మోక్షాసక్తుడగు నారురుక్షువు నహంకార మమకారములవదలి పరమేశ్వరుడే కర్త, భోక్త, రక్షకుడని

శాస్త్రనియతములగు నిత్యనైమిత్తికాదికర్మల తనకొఱకను బుద్ధివదలి భగవంతునికొఱకు భగవత్ప్రీత్యర్థమై నిశ్చింతతో కర్మల నొనర్చు తాపత్రయ రహితుడగును.

ప్ర॥ ప్రకృతియే సర్వకర్మల జేయుచున్నట్లు మనమెట్లు తెలియుదుము?

ఉ॥ పైన జెప్పిన విధముగా నెఱుగవలెను. మఱియు విను. ఇద్దఱు మిత్రులు చెఱువుకట్టపై రాత్రి వెన్నెలలో నడచిపోవుచుండ, చంద్రుడు నీటబడి నీటియలల తలక్రిందుల మునుగుచున్నటులగని చంద్రుని రక్షించి గట్టుజేర్పనెంచి యొకడు నీటిలో దుమికి చంద్రునికొఱకు గట్టుకువచ్చి వణకుచు, నీటిలో చంద్రుడు పడెను, దుమికితే చేతికి దొరకలేదనువానికి రెండవ వాడు మింటజూపి చంద్రుడందుండ నీటియందు ప్రతిబింబమునుజూచి భ్రమసితి వంతేయనెను. మఱొకడు తనస్థలమున కదలక మెదలక యున్నను పైత్యముతో తాను తనస్థలము వద్దనే రాలు తలక్రిందు తిరుగుచున్నవన, రెండవ వాడు పైత్యమని గ్రహించెను. ఏటియొడ్డున వృక్షములనీడ తలక్రిందుల గనపడును. రైలు పరుగెత్తుచుండ ప్రక్కనున్న గుట్టలు, గ్రామములు, చెట్లు పరుగిడుచున్నట్లు కనుపించును. ఆకసమున మేఘములు బరువెత్తుచుండ చంద్రుడు పరిగెత్తినట్లున్నది. భూమివేగముచే సూర్యుడుదయించి యస్తమించినట్లగపడుచున్నది సత్యమా? కాదు. వాస్తముగా మన భ్రాంతిచే తలంచుటయేగాని అవియన్ని యున్నవియున్నట్లే యున్నవి. బ్రహ్మాండము పిండములందలి సూక్ష్మకారణ శరీరములు, త్రిదవస్థలు, కాలములు, భేదములు, నామరూపములు, సత్త్వరజోతమో గుణస్వభావములు, పంచకోశములు, ప్రాణములు, స్త్రీపురుషసంయోగ వియోగములు, మనసు, బుద్ధ్యాదులు, రాగద్వేషములు, కోరికెలు, సంకల్పములు, సంశయము, శ్రద్ధాశ్రద్ధా, ధృతిరధృతి, సిగ్గు, ధీ, భీతులిత్యాదులన్నియు ప్రకృతిమయములే. ఆత్మ యేవికారము లేనివాడు.

ప్ర॥ భగవంతుని యాజ్ఞ విననివారేమయ్యెదరు?

ఉ॥ భగవంతుని విరోధించి భగవంతుని వాక్యముల విశ్వాసము లేనివారై నిరంకుశముగా సంచరించువారికి నగ్నిజూచి భయమున మనము దోలగ నందులోజొచ్చి చచ్చుమిడుతలవలె భగవద్ద్రోహులు భవబంధపాశమున బంధింపబడి దుఃఖజలధిలో ననవరతము మునిగెదరు.

ప్ర॥ జ్ఞానికూడ తన ప్రకృతిననుసరించియే ప్రవర్తించుచున్నపుడు తక్కిన యజ్ఞుల మాటయేమి?

ఉ॥ అట్లనవలదు. ప్రతిజీవులు వారివారి పురాకృతకర్మఫలము ననుసరించియే పనులు జేసెదరు. అందు ప్రవృత్తి ప్రారబ్ధము, నివృత్తి ప్రారబ్ధము; ప్రవృత్తిప్రారబ్ధము జ్ఞానియైనను జనక, సాళ్వ, అశ్వపతి, రామచంద్ర, గాంధీజీప్రభృతులవలె స్వధర్మమునందనురక్తులగుదురు. నివృత్తి ప్రారబ్ధాదులగు జ్ఞానులు శుక, బుద్ధ, శంకర, రమణ, మలయాళమహర్షులవలె జేయుదురు. నిగ్రహమువలన ప్రయోజన మేమిటియనుట పొరబాటు. ప్రతి యింద్రియమునకు ననుకూలవిషయమున రాగము, ప్రతికూలవిషయమున ద్వేషము లుండియేయున్నవి. వానివశము గాకుండుటయే కర్మయోగి కర్తవ్యము. అదియే పౌరుషము. పురుషార్థముకొఱకు నింద్రియచరితార్థముల "యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే। ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః" ఆదిమధ్యాంతములుగల విషయభోగములు దుఃఖహేతువులు, హేయభావములని గ్రహించిన జ్ఞాని వానిని ప్రతిఘటించి పూర్ణానందమగు పురుషార్థమును బొందును. అట్టివాడు సన్న్యసించినను, సన్న్యసించక పోయినను, యింటనున్న నడవినున్న నొక్కటే.

ప్ర॥ అట్లైన ఇంద్రియవిషయాదులవలన గలిగే రాగద్వేషములనుండి తప్పుకోవటమునకు మఱొకమార్గ మవసరమా?

ఉ॥ మఱొక మార్గమైనను తొలుత సులభముగా సుఖముగాదోచిన మేలనిపించినను తుదకు కల్యాణదాయకముగాదు. మఱియు విపత్కరము. అనగా స్వధర్మమున నాత్మ యద్వితీయబ్రహ్మవస్తువని, నదియే సకలరూపములనున్నదని యాత్మయొక్క యాశ్రితమైన ప్రకృతిగుణకర్మల నేను జేయుటలేదు, నేను ద్రష్టను, యవి నాచే దెలియబడే దృశ్యములగు జడములని నిశ్చయించుకొని చేయుటయే స్వధర్మము, స్వకర్మము. తన ధర్మములమఱచి చేయు ప్రతియొక్క కర్మ యెట్టిదిగాని తనకు బంధమే, ప్రకృతిబలాత్కారమే యగును. సమానజాతిగల మనుష్యుల విజాతీయములగు పశుపక్ష్యాదుల స్థావరములుగల చైతన్యము, తన చైతన్యము నొక్కటియేనని, వానిని గాంచినపుడు తనవలె జూచి దేహావసరకార్య

ముల నిస్పృహుడై చేయుటయే స్వధర్మము. అటుమీఁద నర్జునుడడుగు చున్నాడు: హృషీకేశా! ప్రపంచమునబుట్టిన నేమానవుడు తనకిష్టము లేకపోయినను నెవరివలన ప్రేరేపింపబడి తనకు వలదన్నది తటస్థించటము లేదా సిద్ధించటము, కావలెనన్నది లభింపకపోవటము, పుణ్యమునకు బదులు పాపకారియగుచున్నాడు. రామచంద్రునిపై చాకలివానికి కోపమా? రాము డెన్నడైన వాని కేమినర్చెను? నిరపరాధియగు సీతేమి జేసినది? సీతారాముల వాడు, వానిని సీతారాము లెన్నడైన జూచి నారా? చాకలివాడెందుకు రాముని నిందించటము? రాముని నిందించ వలెనని వానికేమైన యుద్దేశ్యమా? లేదుకదా! కారణములేకుండనే పాపకార్యము లొనర్చుటకు కారణము? ఇట్టి దుర్ఘటనలెన్నియో లెక్క లేనన్ని యెప్పుడు జరుగుచునేయున్నవి. ఒకప్పుడు ధర్మమధర్మముగా, నధర్మము ధర్మముగా నుండుచున్నది. ఒకదేశమునకు గలిగిన ధర్మ మొక దేశమునకు సరిపడదు. ఎవరికివారే స్వతంత్రులు నస్వతంత్రులుగా కని పించెదరు. దొంగతనము, వ్యభిచారము, క్రూరత్వము, వంచనము, దురాగ్రహము, నింద, అసూయ, అన్యాయము, అనిష్ట, అప్రతిష్ఠ వర్గాలు నొకప్పు డొకదేశమున కొకకాలమున కొక పుణ్యాత్మునకు వర్తించును. మఱొకప్పుడు పాపాత్మునకు వర్తించును. అర్జును డీవిషయ మునే శ్రీకృష్ణు నడుగ నాయన యిట్లనియె. ఎడతెగని యాశ, కోపము మానవునకు బలవంతమైన యంతరంగశత్రువులు. బహిశ్శత్రువులైన నొక ప్పుడు దయాదాక్షిణ్యములు గలిగియుందురు. కాని యీ శత్రువులకు నేరాగమునో, ద్వేషమునో పాపసంజాతకారణముల నంటగట్టుకొనియుండి స్థలము, పరస్థలము, తగును, తగదు, వీనివలన గలిగే ఫలమేమిటి యని విచా రించక, భూమిని ద్రవ్వుచుండు కొక్కులు మూషికములవలె, ప్రాకుచుండు పాములవలె, తృణమైన నూరకుండని ఈగలవలె, జలతరగలవలె రజోగుణము గలిగి పాపకార్యముల చేయించును. ఒకనిచేత వాడికత్తియున్న దన్న కనపడిన మొక్కలనెల్ల తెగవ్రేయ గమకించును. పచ్చనిపైరు జూచిన తినతగదని తెలిసికొనక పశువుజొచ్చి మేయునట్లు, పల్లమునకే నీరు ప్రవ హించునట్లు పాపములనే జేయుంచును. పొగవలన యగ్ని, మైలవలన నద్దము, మావివలన పిండము, పాచివలన నీరు, బెరడువలన చింతగింజ

గప్పబడి యానరానిరీతి, కామమువలన నీ వివేకబుద్ధి నావరింపబడియున్నది. ఎఱ్ఱను జూపి బోను నందు గాలమునందు జిక్కిన చేపవలె, ఆహారముకొఱకుబోయి బోనులోబడ్డ నలుకవలె నీ కామక్రోధాదులను శత్రువులకు జిక్కిన మానవుడు కామమనెడు గాలముచే పట్టుపడి సంసారమున పరితపింపవలసినదే. “పునరాలింగ్య నేత్రాంతే పునశ్శేష చ భుజ్యతే” అనుభవింపబడిన భార్యయే, తినబడిన భోజనమే, చూడబడినవస్తువే తినుచుతినుచు కోరికెలగోరుచు ననుభవించుటకు ప్రీతిపొందుచు ధనపుత్రకళత్రాదులందు నాయు రారోగ్యమునందును నాశనమై యైశ్వర్యముకొఱకు లేక భోగముకొఱకు నెట్టి పాపములనైన జేయుచు సంకోచముగాని, పశ్చాత్తాపముగాని గలుగ నీయదు కామమనెను.

ప్ర॥ మండుచుండునగ్ని నెన్ని సమిధలు నెయ్యివేసిన నంతకంతకు నాలుకలు జాచుచు నాత్రప్రదేశమును గాల్చి బూడిద యొనరించురీతి నీ కామమంత హద్దులేనిదై పాపములకు మూలమిదిరో యని తెలిసి నదిగాని, దీనిజయించు నుపాయమర్జునునకు భగవంతుడు వచింపలేదా ?

ఉ॥ అర్జునుడడుగక నుండడు; హరి వచింపక యుండియుండడు. దేని కొఱకై తానవతరించెనో, నా యవతారమున నొనర్చుపని ముగించక మానడు. ఈ కామముచేతనే శూర్పణఖ, రావణ, వాలి, కీచక, దుర్యో ధనులవంటివారు నిహతులైరి. కామఫల పర్యవసానము దుఃఖమే. కామము మొనలెత్తిన యంకురములవంటిది. సంఘధర్మముల, మతధర్మ ముల, శాస్త్రనియమముల, స్వధర్మములకు స్వస్తిజెప్పించును. భాగవత మున నజామిలుని చరిత్రమువింటే తెలియును. ఒక పట్టణమున నొక ధన వంతుండుండెను. అతనికి నొక తనయుడుండెను. వానిని బి. ఏ. డిగ్రీ చదివించియుండెను. కాలేజినుండి యింటికి వచ్చియుండెను. ఒక దినమొక లారీఓనర్ డ్రైవరు క్లీనర్ లారీతో సాయంకాలమునవచ్చి తమవద్ద పదివేల రొక్కమున్నది. వ్యాపారము వెళ్లుచుంటిమి. రాత్రియైనది. ఉద యమువఱకు నీడబ్బు దాచవలసినది. ఇందేపరుండి వెళ్లెదమని నా ధనవం తునిచేతికి ధనమునిచ్చిరి. అతడు డబ్బుచూచినదిమొదలు వీరిని చెఱిపి డబ్బు యివ్వకుండా యుండేమార్గమేదియని యాలోచించుచు వారికి భోజ నాదులుబెట్టించ డ్రైవరు క్లీనరు వెలుపల లారీలో బరుండ, ఓనరు ధన

వంకానియింట పఱచబడి శయనించెను. తనకొడుకు పరుండుస్థలము కొంచము సమీపముననుండెను. కొడుకు సినిమాకు వెళ్ళియుండుటచే ఓనరునకు నిద్రరాక తనస్థలమువదలి నతనికొడుకు స్థలమున నిద్రించెను. ప్రొద్దుపోయిన కొడుకువచ్చి తనస్థలముననెవరో పరుండుటెఱిగి నిద్రాభంగ మేల చేయవలెనని ఓనరు స్థలమున నిద్రించెను. ధనికుడీసంగతి నెఱుంగక ఓనరేనని నతనిని జంపిన డబ్బుమిగులునను నాశతో నాతని భార్య తాను కడజేసి యొక రహస్యస్థలముననుంచి చీకటి విచ్చినంతనే వారు తమ ఓనరును ఢిల్లీ డబ్బుతీసుకొని యిప్పుడే వెళ్లెనని చెప్పవచ్చుననుకొని యుండ చీకటియుండగానే ఓనరు తిక్కినవారిరువురు మాడబ్బుయిమ్ము, మేము వెళ్లెదమనిరి. ధనవంతుడు కాళ్ళుతడబడ నోటమాటలేక చేతులు వణక డబ్బు యివ్వకపోయిన చనిపోయినవాడు కొడుకే యుండునని కేసు యెట్లుండి యెట్లువచ్చునోయని డబ్బిచ్చి వారిని సాగనంపి కొడుకేనని తెలిసి వగవ నారంభించెను. ఆశ యెంతపని యొనరించెనని చావకనె చచ్చెను. పాపము తనకుబండెను. ధృతరాష్ట్రుడీవిధముగ భీమునిచే నేటు పోటు మాటలబడుచు కొంతకాలము పాండవులనింట జీవించి తుదకెట్లు పోయినది మనము చదువమా! ఎట్టి స్థలములనైన భేదించుకొనిపోయి నీటిని గ్రోలు చెట్టువేళ్లులవలె, నెట్టి ప్రాకులనైన తొండమున విఱుచు నేనుంగులవలె, నెట్టి స్థలములనైన ప్రాకగల కోతులవలె, నెట్టి వస్తువునైన గాల్చునగ్నివలె నీ కామశత్రువు రంధ్రములను వెతకుచుండును. కామ క్రోధములు భీకరులు. ఎటువంటి వారికైన వీరు తగరు. శక్తిహీనుల పీల్చి పిప్పిచేయును. శక్తివంతుల "కో వా దరిద్రో హి విశాలతృష్ణా" దరిద్రులజేసి నాశాపాశముల బంధించును. సింహకిశోరములు నేనుగులపై నుఱికినభాతి, పులిగున్నలు లేళ్లపైకి లంఘించురీతి, ఎలుకలపై పిల్లులు బహుభంగి దుస్సాంగత్యము, దుర్మంత్రము, దుష్టచరిత్రములు, దుష్టభావములు, దురాచారము, దుర్మదాంధము, దౌర్గర్వము దర్పము పిడుగులవలె, ప్రళయములవలె, మృత్యువువలె, కామలోలురపై బడనుందురు. తొలుత నీకామమును పాములజాడ, మృగయులు మృగములజాడ, శత్రువుల రిపులజాడ నెఱిగినరీతి దీని బుట్టుకను వృద్ధిని తెలిసి నంతమొందింప కామక్రోధాదులజాడయే నుండదు. రైలులో ప్రయాణమొనరించునపుడు

పెట్టెలలో 'దొంగలున్నారు జాగ్రత' యని వ్రాసియుందురు. ఆ మాటను మఱచితిమా మనవస్తువులు దక్కవుగా. ఎందుకో ప్రతిబండిలో ప్రతి నిత్యము 'మావి ఫలానివి పోయినవి. మా జేబికొట్టిరి. మా పెట్టెనెత్తిరి. మామూటనెత్తిరి' యను పిర్యాదులను వినుటలేదా! నా దొంగల కెట్లు పాపమని తోయుటలేదో, నీకామమనేదొంగ శరీరములను పెట్టెలలో నుండి "జ్ఞానరత్నాపహారేణ" జ్ఞానమును పొందకుండ రాగమునో, ద్వేషమునో, మిశ్రమమునో గలిగించి పాము నాలుకలుచాచినట్లు, పాము విషకోరలవలె కామమనే పాముచిత్రముగ నాలుకలుచాచి సుఖదుఃఖముల గలిగించుచే దీనివని. ఒకప్పుడు ఒక మేక తనబిడ్డతో నేను వచ్చువఱకు వెలుపల పోవలదు. దుష్టులగు తోడేళ్లుందురు. ఇంటనే నుండమని చెప్పి మేతకై వెళ్లెను. తల్లి పోయిన కొంతసేపటికి నీళ్లు త్రాగుటకు నెవరుండరు కదా! వేగముగా త్రాగి లోపలికి రావచ్చునని వాకిలిదాటి సమీపమున నున్న నీటికాలువవద్దకు వచ్చేటప్పటికి నొక తోడేలు నీరు త్రాగుచుండెను. భయభక్తులు జూపిన కరుణించునని పేతనైనంత పరుగెత్తి తలుపువేసి కొనక లోపలవచ్చి మీదపడునేమోయని తోడేలునకు తగ్గుభాగమున నీళ్లుత్రాగి వెనుదిరుగుచుండగా నెనీవేమెంగిలి నీళ్లు నాకురా త్రాగవా? యనెను. నీ క్రిందిభాగములోని నీరెమెంగిలినీళ్ళ నేనే త్రాగితిననెను. నీవు ఆరు మాసములక్రిందట నన్ను తిట్టితివటయన, నేను బుట్టి మూడు మాసములేనన, పొగరుబోతా! తల్లి కడుపులో మూడుమాసములు, పుట్టి మూడు, నారు మాసములు గాలేదా? యని పైబడి కారణములేకనే చంపెను. కామపిశాచముచేయు ఘాతుకకృత్యము లకారణములే. ఒకప్పు డెంతో దూరముననున్న భార్యకొఱకు తులసీదాసు నడచి వెళ్లి వేళకాని వేళ తలుపుదట్టి పిలువ భార్య లేచి వాకిటివద్దకు వచ్చి తలుపు తీయకనే నిట్లనెను: ఏమి నీ యీయాగడము. రక్తమాంసమయమై మల మూత్ర ములనిండి హేయమగు నీశరీరముపై నుండే ప్రేమ లోకేశ్వరుడగు హరి జగ ద్గురిరామునిపై నుంచలేకపోతివా! ఈ క్షుద్రదేహముగల బలహీనుడవు, భవరోగవంతుడవు, దుఃఖతప్తుడవయ్యె విందేకాని నీకు హాయిలేదని నంతనే లక్షణము కామఫలమును గుర్తించి యంత నామెను కంటనైనజూడక నామె యెంతవేడి కొన్నంటినను పలుకక వెళ్లి రామభక్తుడయ్యెను. కామమద

మణఁగెను. మోక్షాధికారియైన కర్మయోగి ప్రపంచమున శరీరమను బండిలోఁగూర్చొని కామక్రోధములకు లోఁబడక కామునకాశ్రయమిచ్చే మనోబుద్ధీంద్రియముల జయింపవలెను. తృష్ణారూపమగు కామము వివేకబుద్ధి నావరించుచున్నది. ఇయ్యది జ్ఞానియొక్క చిరశత్రువు. అగ్నివలె నిండింపబడరానిది, మహాగొప్పది, తీరరానిదియునగు నీకామము వివేకబుద్ధి నావరించుచున్నది. దేహాభిమానియగు జీవుని బంధించుచున్నది.

ప్ర॥ ఔరా! కామముయొక్క దురంతము. కామమునకు నాటపట్టగు నింద్రియముల నేమి జేయవలె?

ఉ॥ జయించవలె. భగవంతు డర్జునునకు దొలుత నింద్రియముల జయించ నాదేశించెను. తన యదుపులోలేక విచ్చలవిడిగ పరుగెత్తు రథమునకు గట్టిన గుఱ్ఱములు పగ్గములు వదలిన దోషమని గ్రహించి సారథిని హెచ్చరించి పగ్గముల కదియబట్టి తన వశములో గుఱ్ఱముల నడిపించిన గమ్యస్థానము రథికుడు చేరును. కావున నింద్రియముల జయించియే తీరవలెను. కామమునకు నే యింద్రియమో నొక యింద్రియము సహాయముండవలె. అట్లు సహాయమొనరించే నింద్రియములే నూరకున్నచో, సేనలేని శత్రువువలె కామశత్రువు జిక్కును. రెక్కలు గలిగిన పక్షి వియద్వీథిన విచ్చలవిడి విహరించును. రెక్కలులేనిచో నేల గూలి పడిపోవును. ఆ విధము నింద్రియములే కామమునకు బలము, నాశ్రయములు. ఇంద్రియాదుల నధిష్ఠించియె తనశక్తిని యినుమడింపజేయుచుండును. చత్తచదారము, నెయ్యినూనెల నాశ్రయించి యగ్ని ప్రజ్వరిల్లదా? ఇంద్రియములను, విషయములను, రథమును, రథికుని, సారథిని, పగ్గమును, ఇచ్చను తెలిసినచో విషయముల ప్రవృత్తిని నివర్తింప జేయవచ్చును.

ప్ర॥ వానిని విమర్శగా తెలుపుడు. భగవంతు డర్జునితో నేమనెను?

ఉ॥ ఉపాయము జెప్పుచున్నాడు. మొదట నింద్రియములను జయించుమనెను. విషయములకు నింద్రియములకు సంయోగము గలిగించకు; నాత్మయగు నన్నె దలచుచు, జీవితేచ్ఛలేక జ్ఞానమును, విజ్ఞానమును బాధుచేయు నీ కామమును జయింపవచ్చునని మఱియొక యుపాయము జెప్పెను. "ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః" కనిపించే స్థూల

శరీరమునకంటె కర్మేంద్రియములు శ్రేష్ఠములు, వానికంటె జ్ఞానేంద్రియములు శ్రేష్ఠము, వీనికంటె మనస్సు శ్రేష్ఠము, దానికంటె బుద్ధి శ్రేష్ఠము, ఆ బుద్ధికి ద్రష్టయగు నాత్మ నేను సర్వక్రియలగు కర్మలకు మూలమగు కామము, యవిద్యాపరిణామము, నేన కర్తనని వానికి సాక్షినైయున్న కామశత్రువును తొలగింపవచ్చు. "చక్షుషో ద్రష్టా శ్రోత్రస్య ద్రష్టా వాచో ద్రష్టా మనసో ద్రష్టా బుద్ధేర్ద్రష్టా తమసో ద్రష్టా సర్వస్య ద్రష్టా" నామరూపములకు ద్రష్ట చక్షువులు, చక్షువులకు ద్రష్ట ఆత్మ, సకలశబ్దములకు శ్రోత్రములు ద్రష్ట, శ్రోత్రములకు నాత్మద్రష్ట, సకలపలుకులకు వాక్కు ద్రష్ట, వాక్కున కాత్మద్రష్ట. ఇట్లే నన్నిటికి ద్రష్టయగు తన్ను తెలిసిన కామము సులభముగా నిగ్రహింపబడును. ఆత్మనిశ్చయము భగవద్భక్తి గలిగి వివేకవైరాగ్యశ్రద్ధావిశ్వాసముల భగవత్కరుణ నిజముగ ననంతఫలదాయకమగు సిద్ధిని బొందవచ్చును. "ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా" నిశ్చయబుద్ధి గలుగవలె. లేనిచో క్రీడాపిపాస, మద్యపానపిపాస, జూదాదిపిపాస గల బాలురు, యువ్వనులవలె మనస్సు స్థిరముగ నిలువదు. నిలువనపుడు ధ్యేయస్థితినిగాని, జ్ఞేయస్థితినిగాని నొందజాలడు. బుద్ధికి నవ్వలనున్న నాత్మను మాటిమాటికి గ్రహించి మనస్సాపగిది నొందెనా కామశత్రువు శేషించుటకు వీలులేదు.

ప్ర॥ కామమంత చెడ్డదియైనపుడు భగవంతుని బొంద గోరునది కామమేగదా? మఱియు ధ్యేయస్థితి జ్ఞేయస్థితులన నేమి?

ఉ॥ రజోగుణసంభూతమగు కామమే క్రోధమగును. హద్దుపద్దులేని కామమునకు తృప్తిలేదు. కామము యానందమునకై గలిగిన ప్రేమయే. ఆనందవస్తువేదియని తెలియకపోవుట మోహమైనది. ప్రతి యింద్రియ విషయమున నానందముగల్గునేమో యని చూచును. కాని నింద్రియములు, విషయములు జడములు, వాని సంయోగము నొకింతగల్గు నానందము దేనియంశమని తెలియకపోవుట యవిద్యాసంపూర్ణానందము గలిగేవఱకు నీపగిది విషయవాసనల దిరుగుచుండు కామము నిమిత్తమాత్రమున దోచిన విషయానందలేశమునకు మూలము భగవంతుడు శేకయాత్మయని తెలిసి భగవంతుని సగుణరూపము మనస్సు నొందుటే ధ్యేయము. ధ్యేయస్థితినొందే నాకామము, దాని కారణమగు రజో

గుణము పొడవడంగును. సత్వగుణమను విభీషణుడు గుణాతీతుడగు రాము నెప్పుడు జూచునో బలవంతుడు కామక్రోధాదులే స్వభావముగా గల రజోగుణమగు రావణుడు రామునిచే హతమాయెను. జ్ఞేయస్థితియగు సత్యజ్ఞానానందలక్షణములుగల తెలియదగిన తత్పదవాచ్యబ్రహ్మమును తెలిసినంతనే కార్యసహిత యజ్ఞానము బాధింపబడి వృత్తిరహిత మనస్సు బ్రహ్మాకారతనొందుట నవిద్య లేకపోవుటచే ముత్తెపుచిప్పనుజూచి వెండి యనుకొనురీతి మనసు వ్యవహారములయందు చెదరుటలేకుండును. జీవునకు బాహ్యసాధనములగు మనోబుద్ధులగూడి కామము విషయములనే విషసర్పముల గఱిపించి విషము నెత్తికెక్కించి జీవమూలమును మరువజేయును. సుషుప్త్యవస్థలో తమోమూలమగు నవిద్యయందుండు బాహ్యసాధనము లవిద్యనే బాధించిన జ్ఞేయాకారమైనది. అవిద్య లేకపోవుటచే నన్యథాకారము దాల్పలేము. అన్యథాస్థితియగు మార్పులేదా నదియె సుఖము, గీతాఫలము, భగవదాదేశము.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
కర్మయోగో నామ
తృతీయోఽధ్యాయః
ఓం తత్ సత్.

★

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## చతుర్థాధ్యాయము

### జ్ఞానయోగము

క॥ కర్మాకర్మవికర్మల మర్మము హరిజన్మకథన మాహాత్మ్యంబుల్
ధర్మంచర, సత్యంవద, కర్మరతాయోగ మిదియు సజ్జనులారా!

ప్ర॥ కర్మయోగముతో భగవంతుడు జెప్పవలసినదంతయు జెప్పెను కదా. జ్ఞానయోగము చెప్పవలసిన యవసరమేల? మఱియు నర్జును డడుగకనే తానే జెప్పుటేమి?

ఉ॥ కర్మయోగమంతటితో ముగియలేదు. చెప్పవలసినది ముగియ నపుడు చెప్పువారే ప్రారంభింతురు; అడుగవలసినది లేదు. అందువలన స్వయముగ భగవంతుడే నారంభించినందున నిదియొక అధ్యాయ మైనది. లేక నర్జునుడు సంశయముతీరక నడిగినచోటనుండి యారంభించిన నధ్యాయారంభమగును. ఈ జ్ఞానకర్మయోగములు రెండు ప్రస్తుతము నాకొఱకే జెప్పితివా? ఇంతకు మును పెవరికైన బోధించియుంటిరా? యని యడుగకమునుపే బహుపురాతనమైనదని యతనిబుద్ధికి విశ్వాసము గల్గించుటకు సృష్ట్యాదియందు సూర్యునకు, నతడు తనపుత్రుడగు మనువునకు, మనువు తన పుత్రుడైన నిక్ష్వాకునకు నుపదేశించెనని భగవంతు డర్జునునకు జెప్పెను.

ప్ర॥ ఓహో! అటులైన నీ రెండుయోగము లిప్పటివికావా? అవ్యయములై యనాదిగా నున్నట్లున్నది. తెలియవలసినదే. తర్వాత నర్జును డేమనెను?

ఉ॥ హే భగవాన్! నీవా యిటీవల జన్మించినవాడవు. సృష్ట్యాది సూర్యున కుపదేశించితి వనుమాట నమ్ముటెట్లు? మధ్యలో నియ్యది పరంపరగా నెందుకు రాలేదు? అనగా భగవంతుడు నే నిదివరకు లోక

సంరక్షణకొఱకు ననేకజన్మముల నెత్తితిని. నా జన్మకర్మములే గీత. అది నన్ను, నేను దాని ననుసరించియే జన్మింతుము. అవ్యయమని వాడిన శబ్దమున కర్థము నేనుగాని మోక్షము, యోగము, వేదము, నాశము లేనివని యర్థము. మధ్యలో నెందుకు పరంపరగా రాలేదంటివి. దానిని వినుము. ఒక క్షేత్రమున్నదనుకో. దానిని ప్రతిసంవత్సరము ననుభవించే తాతతండ్రుల తరమునుండి యుండును. ఒకప్పుడు దానిని పరంపరగ జేసేవారు లేనప్పుడు క్షేత్రముగూడ లేదనియా? ఒకరిదృష్టిలో లేక పోయినను మఱొకరిదృష్టిలో నుండును. ఎవరిదృష్టిలో నుండునో వానికి లేదనునది యెక్కడ? దృష్టిలో లేనివానికే లేదేమోనని సందేహము గలుగవచ్చు. ఆచరణలో నుంచేవారు కొంతకాలము కొంత ప్రదేశములో లేకుండవచ్చుగాని గీతాధర్మ మెప్పటికి యుండియేయున్నది. సూర్యుడు లేడా? నేను లేనా? ఒకదేశముననుండి యది మఱొకదేశమున లేకుండ వచ్చు. లేనంతనే లేదని యనగూడదు. వ్యాపకముచేసేవారు లేకపోతే నందఱకు తెలియదు. గీతామృతము నాశకారిగాదు.

ప్ర॥ భగవంతుడు జన్మములెత్తినాడంటె కర్మఫలసంజాతులగు జీవులకు సమానుడే. అలాంటప్పుడాయన గొప్పేమి యుండును?

ఉ॥ ఈ విషయము వినవలసినదే. ఆయన జన్మములెత్తినను నాయా జన్మములనన్నిటిని తెలుసుకొనగలను. తక్కిన జీవులు తమ ముందటి జన్మల తెలియలేరుగా? శుద్ధసత్వమగు మాయావశము చేసుకొని జన్మించెదను. సకల భూతాంతర్యామిని. అలుప్తజ్ఞానశక్తిస్వభావుడను. నీ వందమా, మాయావశాత్ముడవు. నీ జన్మము తెలియలేనివాడవు. కాలముల గుర్తెఱిగేది నేను. నీవు గుర్తెఱుగలేవు. నేను స్వతంత్రుడను. నీవస్వతంత్రుడవని యర్జునునిలో భగవంతుడనెను. తెలిసినదా? మానవులలో మానవుడుగానేయుండి మానవు లెవ్వరు సాధింపలేనిదానిని సాధించెనంటె మానవత్వమనగలమా? దైవత్వమందుము. ఎల్లజీవులకు, నాయనకుగల తారతమ్య మిదియే సుమా!

ప్ర॥ అర్జునునివలె సకలజీవులు భగవంతుని తెలిసికోలేకపోవుట యేల?

ఉ॥ అర్జునుడు మాత్రము పూర్తి యుద్ధమధ్యమున విశ్వరూపమును జూపినపుడు గ్రహించెను. "హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి అజానతా మహిమానం తవేదం" కృష్ణా! యాదవా! సఖా! యని చనువుచేనంటిని; నాపొరబాట్లు క్షమింపుమని వేడెను. కృష్ణునియందు నమ్మకము ననన్యభక్తి గలవాడగుట గుర్తెఱిగెను. తక్కిన జీవు లవిద్యాపరవశులై సంసారవిషయముల నెరుగుదురుగాని భగవంతు నెట్లెరుగుదురు? తెలియుటకై ప్రయత్నమైనను జేయరు. చదువనివాడు పాస్సెట్లగును?

ఉ॥ కర్మయోగము "యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః" ఆత్మయందే ప్రీతిని, నాత్మయందే తృప్తిని, నాత్మయందే సంతుష్టినొందు మహాత్మున కేకర్తవ్యములేదు. ఆయనయే జ్ఞాని. జగత్తున కర్మానుష్ఠానమున నేలాటి ప్రయత్నము లేదు. కర్మ యొనర్పకున్న పాపములేదు. పిపీలికాదిబ్రహ్మపర్యంతముగల నేప్రాణితో నాయనకు ప్రయోజనము లేకపోయిన లోకసంగ్రహముకొఱకు నసంగుడై కర్మజేయుచున్నాను. నీవు నన్నడుగ నేల వచ్చినది? నీవడుగ నేజెప్ప నవసరమేమి? నేనే లేకపోయిన ధర్మమిది, నధర్మమిదియని గ్రహించుటకు నీకు తెలియక చిత్తవృత్తి ననుసరించి నశాస్త్రీయమగు దోడ్డిమార్గమున బడిపోదువు. నిన్నను గ్రహించి నీవడిగినంతనే జెప్పుట కనుగ్రహించినమాడ్కి భగవంతుడు సకలలోకములలో నేలోకమున నేకాలమున ధర్మము క్షీణించి యధర్మము తలయెత్తి సంఘవిప్లవము, దేశవిప్లవము, పాతకబుద్ధులు, నౌదార్యభావము లేదో, అప్పుడు జన్మించి యధర్మములను ధర్మేతరుల నేవంక ధర్మము ననుష్ఠింపజేయువలెనో నామార్గమున జగత్తనడి సంసారమున వర్తింపజేయును. అయితే తానే యవతారమెత్తుటకంటె తన శాసనముతో నడుపరాదా యనవచ్చు. పశుపక్ష్యాదుల నట్లే జేయును. మనుష్యులు దేవతలకంటె శ్రేష్ఠులు. వీరికి శాసనములు పనికిరావు. చేసిచూపినకాని యొప్పని తర్కబుద్ధిగలవారు. అవసరమైనచోట తనశాసనమే పనిచేయదు. సూర్యచంద్ర పంచభూతకాలముల నాజ్ఞగాకేమున్నది? తానే పుట్టవలసివస్తే పుట్టగలడు. మనకేదైన నొక యక్కరవస్తువు మన యుత్తర్వునకు నుత్తరమునకు సులభముగా లభింపదని దోచినచోటికి మనమే పోవుట లేదా? ధర్మమును నడపించువాడు తాను నడచుచు నిరతరుల నడిపించు

టకు, తాను లేక నడిపించుటకు భేదములేదా? అందువలన తాను బుట్టి ధర్మమాచరించుచు నితరుల నాచరింపజేయును. ఒకప్పు డక్బరుపాదుషా వద్ద నీచర్చరాయేవచ్చి దీనిసమ్మతమును ఋజుపరచవలసినదిగా తనయాస్థానములోని వీరబలునకు నాజ్ఞనివ్వ, కొలది దినములు గడువుతీసుకొని యక్బరుయొక్క కడపటి మూడేండ్ల కుఱ్ఱవానివలె కర్పూరముతో నొక బాలుని తయారుజేయించి యొకనాడు తానే నదిదాటి యవ్వలవిహారింప నక్బరును ప్రోత్సహింప తగినవారితో నక్బరు పడవమీదకూర్చొని యికను వీరబలురాలేదేమని నిరీక్షించుచుండ నాత డక్బరుకొడుకువంటి కర్పూరము బొమ్మనునెత్తుకొనిరావటముజూచి దూరమునుండియే నక్బరు యేల నయ్యా వానినెత్తికొని వచ్చుచున్నావన, నతడు నన్ను వదలలేదందువలన నెత్తుకవచ్చితినని కర్పూరపుబొమ్మగా కనుపించకుండచేసెను. పడవ నావలి గట్టునకుచేరకనె మధ్యలో వీరబలు తనచేతనున్న బొమ్మను నక్బరు చూచుచుండ పొరబాటున జారిపడినట్లు నీళ్లజారవిడిచెను. వెంటనే నీటదుమికి తనబిడ్డను చేతులతోనెత్తి గట్టుకుచేర్చెను. అది బొమ్మయని తెలియటము తనవస్త్రములన్ని నీటదడవటముజూచి వీరబలు చేసినపనికి కోపపడసాగెను. వెంటనే వీరబలు ప్రభూ! మేమందరముండ, నీవు యాజ్ఞాపింప జేయుగలవారుండ నేపరికరములు లేక నేల దుమికితివన, నా తనయుడనే ప్రేమ నన్ను దుమికించినదన, నన్ను మీరొకదినము భగవంతు డేల యవతారము లెత్తవలె? తనయాజ్ఞచే నేల పరిపాలింపకూడదు? దీని దృష్టాంతముగ చెప్పుమని యడిగితి రందుకీదృష్టాంతము జేయవలసివచ్చినది. నీ కొమరునియందు నీకెంత ప్రేమయో భగవంతునకంత ప్రేమయుండును భక్తులపై యనెను. జూచితివా! ఇందుకే నవతారము లెత్తుట.

ప్ర॥ అయితే భగవంతు డెన్ని యవతారము లెత్తెను?

ఉ॥ లోకమనాది కాబట్టి యవసరమైనపుడెల్ల నవతరింపవచ్చు. అయినా పెక్కుయవతారము లెత్తినట్లు చెప్పుదు రందు సుప్రసిద్ధములైనవి మత్స్య, కూర్మ, వరాహ, వామన, నారసింహ, రామ, పరశురామ, బలరామ, కృష్ణ, బుద్ధాదులు పది.

ప్ర॥ అవతారములు తెలిసికొనుటవలన ప్రయోజన మేమైనగలదా?

ఉ॥ ప్రపంచమున నొకదేశమున జయిలునం దొకడెంత శిక్షయనుభవించ వలసినవాడై యున్నను, నాదేశమునకు క్రొత్తగా నొక ప్రభువు గద్దెకెక్కుతున్నాడన్న, లేక ప్రభువుదర్శనమైన జయిలునుండి నందఱవిడుదలజేయ మనము చూచుచున్నాము. భగవంతుని గుళ్లదగ్గర జేరితేనో, యాయన తీర్థప్రసాదము లభించితేనో యిష్టసిద్ధి గలిగించుచుండ నాయన జన్మ కర్మముల రహస్యము తెలిసికొన్న ఫలము తక్కువా! జననమరణరహిత శాశ్వతమోక్షము నొందగలరు. సందేహము లేదు.

ప్ర॥ ఏలాంటివారు తెలిసికొన్నను భగవత్ప్రాప్తి నొందగలరా?

ఉ॥ అహా! అందుకు సందేహము లేదు. ఎంత రోగగ్రస్తులైన మందు తీసుకుంటే గుణము కాగలదుగదా! రోగులకొఱకే గదా మందు. రోగులు లేరా? మందేల, వైద్యులేల? రోగగ్రస్తులవంటి నెట్టి పాపాత్ముల నైన భగవంతుడు తన జన్మకర్మల నెఱిగిన భవబంధరహితుల నొనర్చును. ఉడుత, బోయెత, పక్షి, మృగములనే రక్షించినవాడు; రక్షించుటకయ్యే యున్నాడు. అదిగో నానీటిలో మునిగిన మలినము నెవ్వరికైన పోగలదా! యీనీట మునిగిన మొండపాపులు మునిగి పోగొట్టుకొనుచున్నారు. మలినరహితుల నొనర్చుటకయ్యేయున్న నీరు నెవరిని యొద్దన గలదు? వద్దనదు. భగవంతుని పాదారవిందముల జన్మించిన గంగయే యింతపావనుల నొనర్చుచుండ నిక భగవంతుని విషయము జెప్పనలెనా? ఎప్పుడు భగవంతుని నెవడు బొందదలచిన నప్పుడే తన స్వభావగుణములగు కోపతాపాదులనువదలి పరమాసక్తిచే భయరహితుడై మనస్సు భగవంతుని యందుంచి యన్యమువదలి నాయననే శరణుజొచ్చిన పెక్కుమంది నాత్మజ్ఞానమను తపస్సునలన శుద్ధులై మోక్షము నొందుదురు.

ప్ర॥ తానొక్కడై యుండ పెక్కురీతుల లోకమున నేల భగవంతుని వర్ణించుచున్నారు?

ఉ॥ "లోకో భిన్నరుచిః" యని యొక్కొక్కనికొక్క బుద్ధియున్నది. ఆ బుద్ధులబట్టి యొక్క దేవునినే ననేకముగ దలచి ప్రార్థింతురు. ఒకనికి సమ్మతమైన దేవుడొకనికి వరమిచ్చినదేవుడు మఱొక్కని కిష్టముండదు. ఇది మాయామహిమ, భగవంతుడా నిరాకారము, సాకారమును గలవాడు. "ద్వైధా బ్రహ్మణో రూపే పరాం చ పరం చ" ప్రమాణము.

నిరాకారమును భజించువారు, సాకారమును భజించువారు, ఆకారమును భజించువారని మూడురకములు గలరు. ఎవరెవరెట్టి నిష్ఠతో నేరూపమున నెందులకై ప్రార్థిస్తే నయ్యది యారూపమున ననుగ్రహించును. ఇతర దేవతల పేర్లతో పూజించెదరే యనెదవా? నయ్యదియే మూడవరకము. అల్పఫలముల నల్పకాలములో నివ్వగలిగెదరు. గొప్పదేవుడని గొప్పదేవళమని గొప్ప జనసమూహముతో నెక్కువడబ్బు నెక్కువ పేరుప్రతిష్ఠలు గల వారికిమాత్రమే పోవుటకు నారాధించుటకు దర్శించుటకగును. ఆ శక్తిలేనివార లేమిజేతురు? ఎచ్చోట సులభముగ దర్శనము గొని పోయిన కానుకతోనే సరిపోగలదో నచ్చోటికి ననేకులు వెళ్లెదరు. అట్టి సులభసాధ్యమగు దేవుళ్ళ ననేకులు గొలుతురు. భగవంతునికన్న నితరదైవములు లేకపోయినను మనము సంకల్పించి స్థాపించిన దైవరూపముగ సాకారదేవుడగు నా దైవమే శక్త్యనుసారము ఫలముల నొసంగగలడు.

ప్ర॥ భగవంతు డొక్కడైనపుడు నీ పెక్కుదేవతల కల్పించుకొనుటేల? తమలో తాము మా దేవుడు గొప్ప, మా దేవుడు పెద్ద, మేము గొప్ప యని తగవులాడుకొని మారణకృత్యములగూడ జేసికొని పెచ్చుపెఱిగిన ద్వేషముల మూఠాలుగాజేరి దేశమును నల్లకల్లోలములో నుంచనేల?

ఉ॥ బాగుబాగు! బాగుగ నడిగితివి. ఒకదేశమును కొన్నికొన్ని ప్రాంతములుగామార్చి నాయాప్రాంతములకు నాప్రాంతీయుల యోగక్షేమముల దెలిసికొనుటకు తగిన యుద్యోగుల నుంచెదరు. ఈ యుద్యోగులు తమవలన కాగలిగినవి ముందే కేంద్రమునుండి యిచ్చిన నధికారములకు తగిన యోగక్షేమములు తామే జూతురు. తమ యధికారమును మించినవి కేంద్రస్థానమునకు తెలుపుచుందురు. ఈ ప్రజలకు నవసరములుపడితే చీటికిమాటికి నాపెద్ద ప్రభువులదర్శనము చేయ సాధ్యము కాదు. అనేక కష్టములున్నవి. ఆ ప్రభువు దగ్గరకు సిఫార్సుదెచ్చుకొని సమీపమునకు బోయ్యేలోపల నీ చిన్న యుద్యోగినే కలిసి చెప్పుకుంటే చాలు. మనమొఱ నక్కడ తెలిపి తనవలననే మనకు ఫలముల గలిగించును. అట్టి విధాయకములు మనము చూచుచున్నాము. ఆప్రకారము కేంద్రమున కుపలక్షణములైన చిన్నయుద్యోగస్థులవలె నా గొప్ప వ్యాపకదైవమును కనుగొన సాధ్యముకాదు. ఆయన బ్రహ్మాండమునకు ప్రభువు. అట్టి

తఱి కొందఱచే నెన్నుకోబడిన మెంబరు లేక చిన్నయుద్యోగస్థులవలె వివిధములగు చిన్నదేవతలు నా పెద్దదైవమువలన నీయల్పఫలకాంక్షుల పూజాపురస్కారములుగొని తృప్తినొంది వీరికి ఫలములొసగుట నాపెద్ద దైవమువల్లనే ప్రాప్తించును. అయితే నే ప్రాంతప్రజనులకు నా ప్రాంతపు మెంబరు మేలుగలిగించితే తక్కిన ప్రాంతీయులకు నెట్లు తక్కిన మెంబర్లపైన విశ్వాసము నా మెంబర్ల మొఱపెట్టుకొని వీరిపై కక్షుబగట్టినట్లు ప్రజల తబ్బిబ్బుల విప్లవములేకాని మఱేమికాదు. మఱొకమాట. పరమేశ్వరుని గనుగొనుటకు నీకల్పితదేవతల నుపలక్షణముగ నాధారము చేసికొని యుపలక్షణదేవతలవలన నంతఃకరణశుద్ధి యేకాగ్రతనొంది సకల జీవులు దేవతలు నొక్కపరమాత్మయే యనుజ్ఞానము గలుగును. దాని కొఱకే కల్పితములుకాని జ్ఞానముగాని, చిత్తశుద్ధి యేకాగ్రతలు నాయా దేవతల ననుగ్రహములేనివారలే మూఢులగు నజ్ఞానులు. ఇట్టి విప్లవకారకులై యుట్టికి, స్వర్గానికి తప్పినవారయ్యెదరు. మేడపై నేమి లేదు. విహారస్థలము. కాని దాని బొందుటకు నిచ్చెన, దానికి మెట్లు యవసరముగురీతి పరమాత్మదర్శనమునకుగాని, ఫలములకుగాని యితర దేవతలు నవసరమే.

ప్ర॥ ఒకడే పెక్కుదేవతల నారాధించుచుండును. అటువంటప్పుడే దైవము నేమి యొసంగినదని తెలియుటెలాగు? లేక నొక ఫలసిద్ధికై నింద రనుకూలముజేతురా?

ఉ॥ తానుగా పెక్కుదేవతల నెవ్వడు కల్పించి కొల్వలేదు. మునుపే ననంతమైన దేవతల ననేకులు గల్పించికొని యుందురు. అట్టి దేవతల నెవ్వరెందుకై నారాధించి ఫలములబడసిన నాదైవమునే నమ్మియుందురు. కొందఱన్నిదైవముల నారాధనలవలన ఫలముసిద్ధించిన నన్ని దేవతల గొల్తురు. తమఫలసిద్ధికి నందఱనుకూలము వేగముగా జేతురని కొందఱి యభిప్రాయము. తనఫలము సిద్ధించకుండపోదనే నమ్మకము. ఉద్యోగస్థులనేకులకు పరిచయమైన నా యుద్యోగస్థులు తనకనుకూలురైన తనపని యొకనివలనగాకుంటె మఱొకరివలననైనా కాగలదనియు, లేక నందఱనుగ్రహించిన త్వరగ జయమగునని నమ్మకము. తద్రీతి ననేకుల యారాధన కూడ నింతియే. మఱియు నందఱి సమానప్రతిపత్తితో సేవించితే నందఱి

సమానఫలమునిస్తారు. ఎవరి నెంతప్రేమించితే నంతఫలమిచ్చెదరు. ఇన్ని దేవతారూపముల నొక్కదేవుడే ఫలసిద్ధిగల్గించును. ప్రతియింటికి, ప్రతి రోడ్డుననున్న యొక్కొక్క కొళాయిలోనుండి వచ్చేనీరు యొకటియే. కొళాయిలువేరు. దైవములువేఱు. ఫలమొసగునది యొకదైవమె. విద్యుద్యంత్రమువలె నన్నిబుడ్లయనే దేవతలవలన వెలుగుయనే ఫలమిచ్చునది యొకడే. ఎల్లయుద్యోగుల ననుగ్రహము సర్వగవర్నమెంటుదే. ఎల్లదేవతల యనుగ్రహ మొక్కభగవంతునిదే. గవర్నమెంటు యనుగ్రహము లేదా నీ యుద్యోగులు చేతుల వెలికిల త్రిప్పెదరు. దేవతలంతేను. కొంతమంది పెక్కునాశలనుంచుకొని యొక్కొక్కదేవత నర్చింతురు. ఒక్కఫలమున కొక్కనే ప్రార్థించెదరు. వీరిలో శాస్త్రవిహితులు కొందఱు; ఇచ్ఛానుసారులు కొందఱు. అయితే నీ ఫలకాంక్షులు మోక్షకాంక్షులుగారు. గవర్నమెంటుద్యోగులవలె కల్పితదైవములు భగవంతునికుపలక్షణములు.

ప్ర॥ చిన్నచిన్న దైవముల నర్చించుటలో ఫలము వేగముగ గలుగుచున్నది. అందువల్ల చిల్లరదేవతల పెక్కుమంది నారాధింతురు. దైవమునుపాసింపలేరు గదా.

ఉ॥ నిజము. ఒక భిక్షకుడు భిక్షకొఱకు ప్రతియొకయింటికి పోవును. బీదలు, మధ్యమరకము గృహస్థు లడుగుచుండగనె లేదనటమో, లేక నే స్వల్పమొ వేగముగ నందింతురు. అంతే వారిశక్తి. లేక ధనవంతుల నిండ్ల జూవుదురు. గొప్ప ధనవంతుని యింటివద్ద వీని మొర వినువారెవరు? లోపల నెక్కడనో వారిపనులలోనున్న నా ధనికులు వీని కగుపడరు. వాకిటి కావలివారు పొమ్మనటమొ, లేదనటమొ గలుగును. మొండికిబడి వాకిటికావలివానిద్వారా 'భిక్షకుడు పోలేదు. భిక్షపుట' యని విన్నవించిరా, చాలానేపటికిగాని వెలుపలికిరారు. ఎందుకంటివా, పెక్కుబీదలయిండ్ల భిక్షమెంతయుండునో నంతపదార్థ మన్నిపదార్థముల కలుపుకొని తెచ్చి వడ్డింతురు. చూచితివా! అల్పఫలముల నల్పదేవతలు నతిత్వరగ నిత్తురు. గొప్పదేవునకు పెక్కుకాలము నారాధన సలుపవలె. అన్నిటియందు వైరాగ్యము గలుగవలె నప్పుడు దయచేసి వరము నిచ్చునా, నిక తక్కినదేవతల నవసరముండ పనిలేకపోవును. ఇంతేల, మోక్షము నివ్వజాలరుకదా తక్కిన దేవతలు. భిక్షకుడేమనుకొనును?

ధనికుల పలుకరించుకొనుట కష్టమేగానివారు కళ్లుదెఱచితే నీచిల్లరయిండ్ల వారివల్ల లభించు భిక్షకంటె ననేకరెట్లు లభింపగలదనుకొనును. అయితే చాలాతడవు ఓపికతో వారి యిండ్లవద్ద నిలిచి దయగలిగేటట్లు ప్రార్థించవలె. అట్లు ప్రార్థించలేక తక్కిన బీదలనడిగినంతనే లభించు నే యల్పవస్తువు గైకొనవలె. అది చాలకపోతే మాటిమాటికి నభ్యర్థించుచుండవలె. ఇట్టి విధము రోజు చూచుచున్నాము. అవతారమూర్తులైన దేవుళ్లనేగాక పెక్కుదేవతల గల్పించికొని సదరు దేవతల నారాధించుచు, దేవతలకు దేవతలకు వైషమ్యము తమలో తాము గల్పించుకొనెదరు. ఒక్కదైవమునే పెక్కురూపముల నారాధించుచున్నామనుకొనక భగవంతుని యవతారముల భేదబుద్ధితోగాని, తక్కిన దేవతల భేదబుద్ధితోగాని కొలుచుచు మాదేవుడు గొప్పయని తగవులాడువారు దేవుని నలక్ష్యముచేసినవారై తుదకు గతులుగానక నెవరికివారే యమునాతీరే కావటము తప్ప ఫలము సున్నయని తేలుచున్నది. తులసీదాసు చూడుడు. తన రామాయణమునకు నెన్నిదైవముల ప్రార్థించి యారంభించెనో! ఆయన వ్రాసినది శ్రీరామచరితము. విఘ్నము రాకుండ రామచరితము పూర్తియగుటకు శివపార్వతి హనుమద్విఘ్నేశాదిదైవముల ప్రార్థించెను. మూర్తు లుత్సవవిగ్రహములవలె వేరైనను మూలదైవమొక్కడే. భూషణములు వేరువేరైనను బంగారొక్కటియే, పశువులువేరైనను పాలొక్కటియే ననే యభిప్రాయముతో గీతను పూర్తిచేసి యకలంకమూర్తి, యేకైకమూర్తి, యానందమయుడయ్యెను కృష్ణభగవంతుడు.

ప్ర॥ మహమ్మదీయ, క్రైస్తవ, జైన, బౌద్ధ, శాక్తేయ, చార్వాక, గాణాపత్యాది భేదమతము లెన్నిగలవు ?

ఉ॥ భేదమతము లనేకములుగలవు. సందర్భానుసారము లెన్నిమతము లున్నది క్లుప్తముగ వివరించెదను. కాని ప్రస్తుతము దైవ మొక్కడే యని గుర్తించుటకు నుంచిన గుర్తులవల్ల పూర్ణదేవుని గనుగొనవలెననే వారికి నీ తగవులుండు టొక వింతకాదు. "ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరం। సర్వదేవనమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అన్న ప్రమాణముగంటె సంశయము లేదు.

ప్ర: "చాతుర్వర్ణ్యం మయా సృష్టం" అనే శ్లోకమును నర్జునుడడిగేది యొకటైతే భగవంతుడీ వర్ణవిషయము దెచ్చి నిచ్చటుంచుటేల? పై సందర్భమునకుగాని, యీ శ్లోకమున కుత్తరమునగాని వర్ణవ్యవస్థ ప్రస్తావన వచ్చే యవసరమే లేదే. ఏల నీ శ్లోకమును జెప్పెను? భగవంతునకు వర్ణములతో నవసరమేల వచ్చినది? వర్ణవ్యవస్థ నర్జునుడు ప్రస్తావించలేదు. అతనికి గలిగినది మోహము, తన్నివారణము. తత్త్వమునన త్వంపదతత్పద పరిశోధన. చెప్పుటలో సందర్భములేకనే జెప్పనేశ్లోకములో లేని సంశయము నిక్కడెందుకున్నదో శోచనీయము. కొందరు మహాత్ములీ శ్లోకము నెత్తుకొనక నవ్వలి శ్లోకార్థమువద్దనుండి వ్యాఖ్యానించిరి. అప్పుడు వారికికూడ నిది సమ్మతముగ లేదనియేకదా! కల్పితములైన వర్ణముల కాలానుగుణముగ నేమి తారుమారుజేసెదరో భగవంతుడే జెప్పినాడంటె కొంత ఋజువైన యుండునని కల్పించిరా యేమి ఎవరైనా యని యనేకులు సందేహించుచున్నారు. ఎవరెవరి దేశముల సాంప్రదాయధర్మములతో భగవంతుని కేమిపని? దేశమునకొకతీరు కాలానికొకమార్పు ప్రజలు యేర్పఱచుకొనెదరు. గ్రామగ్రామమునకుగల పంచాయతిబోర్డు లేమి? తక్కువ వర్ణస్థులు పెద్దయుద్యోగముల, పెక్కు చదువుల, పెక్కు దేశోద్ధారకపను లొనర్చుటలో భగవంతుని యీ శ్లోకమున కేమిచెప్పవలె? భగవంతునిమాట యేమైనది? ఇది గొప్పసంశయము. దీనిని వివరించుడి.

ఉ: నీవన్నమాట వాస్తవమే, నడుగ సులభమే; చెప్ప గహనమైనది. అయినను దోచినవరకు నంతర్యామియగు శ్రీనాథు డేది యందిచ్చిన దానింజెప్పెద. అంతే నీ సర్వము నాయనయే జెప్పుచున్నాడు. భగవంతుని దోషము లెన్నుటము నెవ్వరికి తగదు. ఆయన సర్వసాక్షి. ఏ పుణ్యపాపములకు కారణుడు కాడు. పక్షపాతరహితుడు. ప్రాణుల కర్మల ననుసరించి ఫలమొసంగువాడేకాని యాయన సృష్టిలో న్యూనాధికములు లేవు. ఆయనను తెలిసినవారు యాయనను తెలియనివారికంటె గొప్పయనవచ్చు. కాని నా గొప్ప వారితరపుల భగవంతుని నెఱుగనివారిని యోగ్యులనుట నుచితము. సముద్రమున్నదనుకో. ఎప్పుడు తన్నంటబెట్టుకొనియుండే నదులు వర్షవేగమున ప్రవహించివచ్చి తనలోగలిసే యేఱుల నొకటిగా

జూచిన వేసవికాలమున నీళ్లులేనినదులు సముద్రమును జూడజాలవు. జీవనదు లెప్పుడు తనలోనుండును. వర్షాకాలమున ప్రవహించు నదులవలె భగవంతునిపేరు విన్నవారు యోగ్యులుగారు. సముద్రములో కలియు నపుడు మధ్యలో సెలయేఱుల పేరులు సముద్రమునకు తెలియవు. జీవనదులపేర్లు తనకు తెలియదు. తనలోజేరితే నన్యముగా జూడక తన్నుగానే జూచును. తనలో వేఱువేఱు కనిపింపవుకదా! అదియే సముద్రధర్మము; నాశయముగూడ. అట్లు జన్మతః సకలప్రాణులు తనయంశములే; నుపాధి భేదముల ననేకములుగా తోచబడుచున్నది. ఒకస్కూలులోచేరు బాలబాలికలొకే యుద్దేశ్యముతో చదువ ప్రవేశింతురు. చదువుచు తెలివిశేటలచే పెద్ద డిగ్రీలుపొంది గొప్ప యుద్యోగముల నొందినవారుగలరు. అట్టి స్థితి పొందలేనివారు కలరు. ఆయా డిగ్రీల పొందుటలోనే న్యూనాధికతలు గలవు. కాని జన్మతః నందఱు నొకటేస్కూలులో ప్రవేశించుట నొకటియే. "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః" యను శ్లోకమునకు భగవంతుని వుద్దేశ్యములో నీ శ్లోకమునకు సంశయములుండినను శంకరానంద, ఆనందగిరి, మధుసూదనసరస్వతి మొదలగువారి యుద్దేశ్యమున్న వారివారి బుద్ధుల ననుసరించి విద్యాబలములబట్టి యనేకార్థములజెప్పినను సత్యబుద్ధితో విచారించిన వారివారి గుణకర్మలగుఱించి గలిగెడు స్వభావము సత్వరజస్తమస్సులనియే తెలియవలెను. సత్వగుణకర్మలు బ్రాహ్మణులు. రజస్సధికముగ సత్వము స్వల్పముగ గలవారు క్షత్రియులు. రజస్సు, తమస్సు గలవారు వైశ్యులు. తమస్సధికముగ, రజస్సు స్వల్పముగ గలవారు శూద్రులని యర్థము. "ఏకవర్ణమిదం పూర్ణం విశ్వమాసీద్యుధిష్ఠిర" అను ప్రమాణప్రకారము గుణకర్మలే స్వభావవర్ణములనవచ్చు.

ప్ర॥ బ్రాహ్మణు లన్నప్పుడు విప్రులేనా ?

ఉ॥ కాదు. విప్రులు వేదపఠనాదులు, షట్కర్మనిరతులు. బ్రాహ్మణులు మోక్షసన్యాసయోగమున జెప్పిన లక్షణములు గలవారు. "జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః వేదపాఠేన విప్రః" యన్నది ప్రమాణము. మనువనునొక ప్రాచీన మహాపురుషుడు గంగాతీరమున స్నానమొనర్చి సముచితస్థలమున గూర్చుండి ప్రార్థనాతత్పరుడై

యుండ చిఱుచేప యొకటివచ్చి నన్ను రక్షింపుమని వేడెను. అతడు దాని నొక నీటికుండలోనుంచి దాని రాకకు కారణమడిగెను. పెద్దచేప యొకటి తరుముచున్నందున సంరక్షణార్థమువచ్చితి ననెను. దానినింటికి గొనిపోయి కుండనుంచ, తెల్లవారగనే నాకీకుండ చాలదని నిండి యుడుగ, దానిని గొని చెరువులో మనువునిచెను. మఱునాటి యుదయమునకు చెఱువునిండి యిదిగూడ నుండ చాలదనెను. అంతట దానిగొని యొకనదిలోవదల, నది యమున కది నిండ, చివరకు నేవిధముగానో సముద్రములో దానినుంప నది యాయనతో నిట్లనియెను: 'మనూ! నేను సృష్టికర్తను. ఈ భూలోకమును ప్రళయజలరాశిలో ముంచుచున్నాను. నీకిది సమకాలమున దెలుపుటకై నీ రూపమున వచ్చితిని. నీవు పెట్టెయోడ నొకదాని నిర్మించుకొని జీవకోటిలో ప్రతిజీవి కొక్కొక్క జతవంతున నందుంచి నీవు సకుటుంబముగ దానిలో ప్రవేశించియుండుము. జలరాశిలోనుండి నా కొమ్ము బయటికి పొడుచుకొనివచ్చును. దానికి నీయోడను బిగించి కట్టియుంచుకొని వెల్లువ తీసిపోయినపిదప వెలికివచ్చి భూలోకమునందు మరల జీవకోటి నభివృద్ధిచేయుము. అట్లే భూలోకము ప్రళయార్ణవములో మునిగిపోగా మనువు తన కుటుంబమును ప్రతిజీవియొక్క జత నొకదానిని ప్రతివృక్షజాతి విత్తనములను పదిలపఱచి భూమిని మరల జీవకోటితో నిండించెను. ఆ మనువువంశమువారమగుటచేతనే మనకు మానవులని పేరువచ్చెను. పూర్వోత్తరసందర్భములకు నీ శ్లోకము సంబంధములేనిదిగానె కనిపించును. తీపులో గలసిన నితరవస్తువువలె నిదియు తీపేనని గ్రహింతము.

ప్ర॥ మనువెవరు? ఏమనుసంతతివారు మానవులు?

ఉ॥ చతుర్దశ మనువులు గలరు. స్వాయంభువమనువను ప్రథమమను సంతతివారు మానవులు. మర్త్యుడు మరణమే స్వభావముగాగల శరీరము గలవాడు మానవుడు. దేశముల, కాలముల పెక్కువిధములుగా మానవులు జీవితమొనరించుచుండుట దేశచరిత్ర చదివిన తెలియగలవు. వీనిని గుఱించి విమర్శింప పనిలేదు. మనకు గలిగిన పరిభవము ప్రకృతివలన నింతంతవరాదు. జన్మమరణ సంసారరూపమున పుట్టుట చచ్చుటతోనే సరిపోజేయుచున్నది. దీని జయించు నుపాయమే శ్రీ భగవంతుడు మనకు

కర్మ అకర్మ వికర్మల గుర్తెఱిగి జేసిన ప్రకృతిబంధమునుండి విడివడగలరని యాదేశించెను. ఆ రహస్యముల దెలిసికొని స్వేచ్ఛాప్రవర్తకులమై సర్వస్వతంత్రులమై యుండుటే మన కర్తవ్యము. గుణకర్మలు మోక్షమునకు నుంచిన డిగ్రీలు. మహోత్కృష్టమాట. ఆచార్యవినోబా వర్ణాశ్రమముల నూతనభాష్యము విను. శమ, దమ, శ్రద్ధ, దయలని నాలుగువర్ణముల జెప్పెను. ధర్మము సూత్రముగా నుండును. పైపై జూచినంతమాత్రాన నది తెలియదు. అంతరాళములో నిలిచిచూస్తే నప్పుడది తెలియును. చతుర్విధవర్ణాలు, చతుర్విధాశ్రమములు, భాషవ్యవేషాలు గావు. అవి తత్వాలు, అనుభవాలు. చతుర్విధవర్ణములకల్పన ప్రజలలో నుచ్చనీచముల కల్పించుటకుగాక సమాజమందు గుణవికాసమునకు నేర్పఱుపబడ్డది. చతుర్విధాశ్రమములుగూడ గుణవికాసమునకే. మేము శ్రోత్రరూపములో చతుర్విధవర్ణాశ్రమాలను పెంపొందించెదము. ప్రతివ్యక్తిలోను నాలుగాశ్రమాలు నాలుగు వర్ణాలుండాలని నాకోరిక. శమ, దమ, దయ, శ్రద్ధలనే నాలుగువర్ణము లనెను. ప్రతి పాఠశాలయందు కొన్ని తరగతులుండును. ఆయా తరగతులు ప్యాసైనవారే పాఠశాల వదలవలసియుండును. ఆ తరగతులను పరీక్షించు నుద్యోగికి పిల్లలవర్ణములతోగాని, వారి జీవితములతోగాని పనిలేదు. ఉచ్చనీచవివక్షత నాయన కవసరము లేదు. ప్యాసైతే చాలు. యోగ్యతాపత్రము లిప్పించుట మాయన ధర్మము. చదువకనే ప్యాసుకాకనే యేగొప్ప జెప్పికొన్న నధికారివలన సర్టిఫికేట్ దొరకదు. తరగతులకుదగిన యోగ్యతాపత్రముల చూచునట్లు నీ లోకమనెడి పాఠశాలయందు మానవులు భగవద్గతి నొందుటకు నాలుగు తరగతులు గుణకర్మస్వభావములనుబట్టి భగవంతుని పొందవచ్చునని యీ శ్లోకాభిప్రాయము. కర్మనుబట్టి గుణకర్మ లుండవు. గుణమునుబట్టియే కర్మాసక్తులగుచున్నారు. వ్యావహారికముగ నేదైన మాటల సందడిలో ఫలానివానిగుణము మంచిదికాదు. అందువలన నతడు జేసినపని మంచిది కాదనెదము. సత్వరజోతమోగుణములే వానివాని కర్మస్వభావఫలములకు కారణములు. స్కూలులో ప్యాసైనవానికే సర్టిఫికేట్. కానీ ప్యాసైనవాని వంశములో చదువకనే నితని సర్టిఫికెట్టును బట్టి ప్యాసుచేయరు. సర్టిఫికెట్టు నివ్వరు. ఇచ్చుట కేదిమార్గము. అట్లివ్వ

టము కానేకాదు. అట్లెక్కడ జరుగ చూడలేదు, వినలేదు, జరుగలేదు, జరుగబోదు కూడ. అట్టి ప్రమాణము లెందులేవు. ఎవరియోగ్యతకు వారే జవాబుదారియైనపుడు భగవంతుని జెందుటకు నెవనెవని యోగ్యతయేకాని యొకనియోగ్యతయె నందఱకు ప్రాప్తింపదు. రామానుజులు నతని భార్య, రామదాసు యాయన భార్య, సమర్థుడు యాయన తల్లి, యీ ప్రకారము నాదినుండి విమర్శించితే నెవరికివారే. ఒకడు భుజింప భుజింపనివానికి తృప్తియగునా? ఒకడు పుట్టనందఱు బుట్టులెట్లు? ఒకడు మరణించ నాతఁడమె నందఱు చనెదరా? ఒకరి కర్మఫల మొకరికిరాదు. ఒకని దరిద్రత మఱొకనికిరాదు. వానివాని గుణకర్మలప్రాప్తియే కారణము. సదరు తరగతు లిండ్లకు మనుష్యులకు నంటగట్టరు. గుణము నాచారమునుబట్టి దైవము యోగ్యతాపత్ర మొసంగును. లేక మన మనసైనన నియ్యవలె. పేరులచేత, వేషములు భాషలు నాచారములచేత గొప్ప గలిగేటట్టుగానుంటె వేషధారులు, మాటకారులు, దైవాత్ములు కావలసియుండును. చదువకనే డాబులు గొట్టువానిని సర్టిఫికేట్టు చూపుమన్న పలుకకపోతే నేమనవలెను? ఎవరైనసరే. మోక్షసన్న్యాసయోగమున జెప్పిన నాలుగు తరగతుల ధర్మముల యోగ్యత నొందవచ్చును. నాలుగు తరగతు లొక్కొక్కనికే జెప్పినవిగాని, అసలు తరగతులే వేఱుంటె నిప్పుడుద్యోగములే దొరకవు. ఎట్లన నొకటవతరగతి వారొకటవతరగతిలోనే, రెండవతరగతివారు రెండవతరగతిలోనే, తక్కిన తరగతులీవిధమైతే క్రింది తరగతివారు పై తరగతికిపోకపోతే నా పాఠశాలాశయమే చెడిపోవును. పోనీ మొదలీ తరగతు లెట్లువచ్చెను? అసలు తరగతుల యుద్దేశ్యమేమి? పై తరగతిలో చేరుట క్రిందితరగతి చదువక సాధ్యమగునా! అట్లైన నందఱ పై తరగతిలో చేర్చిన క్రిందితరగతి యేల? అది నిరుపయోగము. ఒకేతరగతియైన నందఱ దొకేతరగతియగును. ఉచ్చనీచము లెక్కడివి? అదిగాక పై తరగతికి క్రిందితరగతి చదివి ప్యాసుకానిదే నే స్కూలులోను జేర్చుకోరు. యోగ్యతలేనివారి నామాదిరి చేసితే తల్లక్రిందైపోవునుగదా! అనేక మహర్షులు గుణకర్మలవలననే బ్రహ్మర్షులు, దేవర్షులు, రాజర్షులు, మహర్షులునైరి. పుట్టుకతోనే కాలేదు కదా! పుట్టుకతోనే నైనారంటె నా పుట్టినవిధాయక మెట్లో చెప్పుమంటే

దానికి నోరెవరికుండదు. నారద, పరాశర, వసిష్ఠ, వ్యాస, శుక, మాండవ్య, శౌనకాదుల జన్మములు చదువమా? ఈ లోకములోబుట్టి తన గుణకర్మలవలననే గొప్పతనము, దైవప్రాప్తి బొందినవారల, బొందే వారల జూచుచున్నాము. బుద్ధ, జిన, నానక్, దావూద్, కబీరు, జీసస్, మహమ్మదు, రామకృష్ణ, వివేకానంద, మహాత్మాగాంధీ, రమణ, యరవింద, మలయాళమహర్షులిత్యాదు లనేక మహాత్ము లధికులైనా రంటె వారు పడినపాట్లు, భగవత్సేవకై తపించినవిధము లోకమెఱుంగదా! భగవంతుడెఱుగడా! దేవుడు లంచగొండి కాడు. పక్షపాతికాడు. "న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః" అనే ప్రమాణము చదివితే తెలియును. లేక వ్యావహారికముగ నంటిమా నదియు యొప్ప బడదు. తరగతులన్ని ప్యాసైనవాని లక్షణములు తమతమయందుంచు కొని యేతరగతికి యేతరగతికి యోగ్యులమైనామని తెలియుటకై గీతాటెక్స్టుగ్రంథము యావత్ప్రపంచమనే పాఠశాలకు భగవంతుడుంచిన గ్రంథము. దానవులు, భిల్లులు, వానరాదులే భగవద్దర్శన మొనర్చినట్లు చదువుచున్నాము. జూడుడు. అశుచివంతుడగు తనయుని శుచివంతుని జేయు తలిదండ్రులు తలంతురుకదా! భగవంతుని కోరికె నానావిధమానవుల సమానముగ జూచుటయే. భార్యాభర్తల సంసారముతోటి తగులాటముపడి తన జీవితమునే మఱచినవారికి గతియేలేదు. భగవదవతారము సమస్త సాత్వికజనులేగాక మానవులందఱు సధర్మము ప్రబలినపుడు తమదిక్కుకై తమతమ మనస్సులలో సంకల్పింప నదియే తపమై వారి యందలి సత్వాంశమంతయు నొక దివ్యమయమైన యవతారముగవచ్చి భగవంతుడనిపించుకొని జగత్కల్యాణ మొనర్చును. అప్పుడు జగత్తున కొక ధర్మరక్ష.

ప్ర॥ కర్మ అకర్మ వికర్మ లననేమి ?

ఉ॥ పండితపామరుల కందఱకు కొఱకరానిదైనదీ సమస్య. స్వధర్మమునకు తగిన కర్మచేతనే సిద్ధిబొందవచ్చుననియే గీతాశయము. స్వధర్మమన్న నేదియో తికమకపడవలసి వచ్చుచున్నది. ఎవనియాచారము వానికి సిద్ధిస్తుందని యర్థమగును. కాని అది యనవస్థయగును. స్వధర్మమునకు గల మాహాత్మ్యము మఱి దేనికిలేదు. అంతఃకరణశుద్ధి గలుగుటకు

గాని, యదృష్టము ఫలించుటకుగాని వారిని దర్శించుటము. సకల జీవో ద్ధారుడగుట, నిత్యానందము, స్వప్రకాశము లభింపవలెనంటె నిష్కామ మునకున్న శక్తి, సామర్థ్యము, మహాత్మ్య నచింత్యము. కామితమున కింత శక్తిలేదు. నిష్కామాచరణలో కొన్నికొన్ని లోకమునకు వేలువేలుగా కన్పించినను నవి సౌభాగ్యములై నవియేయగును. భగీరథుడు శివునిగూర్చి చేసిన తపస్సు భగీరథగంగ యనుచున్నామాలేదా! గంగనేకాదు; భగీ రథుడేయనుట. గంగ తన నివాసమగు హరిపాదములవదలి భూలోకమునకు వచ్చి యిక్కడనే నాగిపోయిందంటే నిక్కడ సకల జీవుల నముద్ధరించు టలో నుండె స్థితి హరియందుగూడ లేదేమో యనవలసివచ్చుచున్నది. పిల్లలు వెలుపలజేరితే ననేక బాలురతోగూడియుండుటే వారికి ముచ్చట. సంకుచితమగు స్వార్థము తొలగుటకే విత్తనము త్యాగము జేసినదంటే తనయందలి వృక్షాంగములను సమస్త జీవనోద్ధారముకొఱకు గదా! గురువు శిష్యుల తయారుచేయునంటే ననేకదేశముల ననేక ప్రాంత్యముల గడ్డకట్టియున్న ఛాందసాచారముల దూరమొనర్చి యజ్ఞానమను నిద్రలో నున్నవారల మేలుకొలిపి పతితులైనవారల నుద్ధరించుటకేగదా! కష్ట నిష్ఠురములువచ్చినను పతియే నొల్లకనో, మతేవిధముననో గలిగిన మానావమానములకోర్చి తనలోని యద్భుతశక్తిని విజృంభింపజేసి లోక మునకొకపెట్టనికోటగ పతివ్రత గన్పించునంటే నందులోనే నామె జీవితాని కింపు సొంపు నానందము. స్వధర్మముదప్పి వెనుక ముందెఱుగక పాపయాత నలపాలగుచున్న పేదమానవుల పావనుల నొనర్చుటయే మహాత్ములకును, భగవంతునకు నానందము. పాములకు విషముండు టందఱు నెఱుంగుదురు. అలాటి పాములతోనే నిరంతరము జీవనమొనర్చు పాములవారికి పాముల భయముండదు. పాములవాని జూచినంతనె వానికి భయపడి పాములు మెంతో నుపకారులగుచున్నవి. వర్షఋతువుధర్మము మఱొకఋతువున కంగుకాదు. తక్కిన జీవులకు ప్రియముగాదు. నోట తినగలిగిన పదార్థ ములు నోటికనుకూలముగా నుండుటుచితము. చేతులతో నొనర్చగలది పాదములతో, పాదముల నొనర్చునది చేతులజేయ తృప్తియుండదు. మన స్సున సంకల్పించినది వాక్కుతోగాని, తలతోగాని సంకల్పించ సాధ్యమా? వాక్కునకు వచనములు, పిల్లలకు నాటలు, స్త్రీలకు వస్త్రమాల్యాదులు,

నర్చనకు పూజాద్రవ్యాదులు, భగవద్భక్తులకు భగవద్గ్రంథములు, భగవద్భక్తులు, భగవద్విభూతులు, భగవత్ప్రాప్తి, భగవద్దర్శనము, భగవత్ప్రార్థన, భగవత్కైంకర్యము, స్వధర్మము, ప్రియతమము. దొంగకు పరుల సొత్తపహరించుటెట్లో, ఏనుగునకు భ్రమాకుల విఱచుట ప్రియము. నదులు వడివడిగా వంకరటింకరగా తిరుగుచు నడచటములోనె లోకమునకు తన కందము. చంద్రుడు దినదినాభివృద్ధి బొందటములోను, దినదినము క్షీణించుటలో నుండే యానందము నొకేరీతి నుండుటలో లేదు. ఇష్టవస్తువే ప్రతియొక్క జీవి జీవితలక్ష్యమునకు సాధనము. ఏ యొక్కనికైన నుంటే స్వధర్మము ననుసరించి కాలానుగుణ్యముగ నన్యమేయుండవలెను. కన్నులతోజూచి చదువవలె. కన్నులు కనపడవు. అద్దము లవసరము. అద్దములుండిన చదువగలము. అద్దమువలన కన్నులు నక్షరములు జూడగల్గినట్లు మానసికసిద్ధికి నవసరములగు ప్రతిక్రియలు ముఖ్యమే. భక్తుడు దేవుని పూజింపక నొక ఫలము, నొక పత్రము, నొక పుష్పములోనే తృప్తి పడడు. పలురకముల పుష్పముల పత్రములతోనె సంతుష్టినొందును. రాగము తీయువానికి గొంతు సుస్వరముగా విననందముగ నుండవలె. దుకాణాదారునకు వ్యాపారము బాగుగ జరుగుచున్నదా ఆకలిదప్పుల మాటయే యెఱుగడు. చాకలి మాపునవేసినబట్టల, నందుకూర్చుండజేసిన పిల్లను తీసివదలితే తనయాహారము తానుగా సంపాదించుటలోనె గాడిదకు నానందము. తల్లికి తన బిడ్డడు స్తన్యము నోటబట్టి పీల్చుటములో గలికే మక్కువ వేఱుగనుండదు. కోయిలలు కాకులు కానకుండ తమ గ్రుడ్ల వానిగూటిలోనుంచుటయే తమకు కూర్మి. తేతీగ లొకదానినుండి యొకదానిని ప్రాకి పోవుచుండుటయే గాఢము. కాబట్టి నిష్కామమున కున్న గొప్పను భగవంతుడు మాటిమాటికి చెప్పినాడనుటలో నిష్కామముతో నెన్నిజన్మములనైన నెత్తవచ్చు. నేదేశముననైన నుండవచ్చు. నేలాగునైన తనకందమేయైనపుడు నదియే ముక్తి. మనము నడచుచుంటే గమ్యస్థానము తనకై తాను వచ్చును. ఆ రస్తాయే మనల గొనిపోవును. రైలులో కూర్చుంటే నదియే తీసుకపోవును. మనము బండిలో నటునిటు పరుగెత్త పనిలేదు. భక్తుడైయుంటే భగవంతుడు వచ్చును. శిష్యుడైయుంటే గురువుపదేశించును. పాకముజేసియుంటే వంటవండును. చేసి

యుండే ఫలమువచ్చును. శాస్త్రము లన్నిటిని చదివి సారముగ్రహించి మననము జేయుచుండే సరి, జ్ఞానముగలుగును. నిష్కామమునందే సత్యము, దయ, అహింస, తపస్సు, శౌచము, దానము, త్యాగము, శాంతము, శ్రద్ధ, బ్రహ్మచర్యము, ఆర్జవము, సంతోషము. పాలకడలి మధించగా లక్ష్మి, చంద్రుడు, ధన్వంతరి, అమృతము, దేవేంద్రుని గుఱ్ఱము, యేనుగు మొదలైనవి లభించుటయేగాక, పాలకడలివలె స్వధర్మమనే కర్మ మధనము చేయవలె. నా పురుషుడే లక్ష్మియను స్త్రీకాదు మోక్షలక్ష్మిని సాధింప గలడు. కర్మ అకర్మ వికర్మలు మూడు స్వధర్మమునే నిష్కామమునే నామోదములు కావలెను. పదునాల్గవ శ్లోకమునుండి 23 వ శ్లోకమువఱకు నీ కర్మరహస్యమునే ప్రబోధించెను.

ప్ర॥ మన తండ్రి, మన తల్లి, మన బంధువు కాడుగద భగవంతుడు. ఆయన కేల మనపై నింత మమత, యారాటము? మనమేమైతే తన కేమి? తన కేమి చేటులేదుకదా ?

ఉ॥ తను చేటులేనివాడగుటచేతనే ప్రతిజీవుల తనవలె చేటులేనివిధముగ చేయదలచెను. ఉత్తమపురుషుల లక్షణము. తాను మనవలెనేయుండే మన కెట్లు చెప్పగలడు? మనమెలా వినెదము? చదివి యుత్తీర్ణుడైన చదువు చెప్పును. చదువే రానివాడేమిచెప్పును? తనకే తెలియనిధర్మము తానెట్లు జెప్పగలడు? త్రోవనెఱుగనివాడు త్రోవ, నీతనేర్వనివాడు నీత, కవిత నెఱుగనివాడు కవిత్వము, మూగవాడు గ్రంథపఠనము నితరులకు జెప్ప జాలరు; జూపజాలరు. లోకములోని తల్లికి తల్లి, దండ్రికి తండ్రి, బంధువునకు బంధువు, గురువునకు గురువు, రక్షకునకు రక్షకుడైన ప్రభువే మనకు తండ్రి. ఆయనయే సర్వస్వము. తండ్రి వీర్యమును తన గర్భమున ధరించి తొమ్మిదిమాసములు మోసి కని, స్తన్యమిచ్చి పోషించి విద్యాబుద్ధులతో జీవింప స్వతంత్రుల జేసినది తల్లి. మనతండ్రి మనబుట్టుకకు తన వీర్యమును తల్లియందుంచి, జన్మించినమీదట పోషించటము, జీవితకళల నేర్పించి, దిద్ది నిగ్గుదీర్చుటము బంధువందమా? మేలునకు మేలు, ప్రతికి ప్రతి జేయు నంతియే. విద్యను, జ్ఞానము, ధర్మము, న్యాయము, నితరచరిత్రము గురువెలిగించును. భగవంతుడందమా, తండ్రి వీర్యమును తల్లి ధరించే టట్లు నాకాశము తానైయై, గర్భములో నెట్టి విధముల జావకుండ

పోషించి, మనశరీరములలో తానేయుండి, మన తలిదండ్రాదులకు తెలియని నవ్యమగు నంతర్విషయముల భూతభవిష్యద్వర్తమానకాలము తోడు నీడయైయుండి మనకర్మలకు ఫలముల నొసగుచు, మంచిఫలముల బొందినపుడు చెడుఫలముల బొందినపుడు గలిగెడు మేలుకీడులకు పడుపాట్లుగని వానిని దప్పించుటకు నుపాయములనే సాధనల గీతాస్వబోధసుధాకరమున ప్రకాశిలజేసెను. ఆ సాధనలద్వారా మనము నైహికాముష్మికాదులవదలి నాయుననే ప్రేమించితే జన్మమే లేకుండజేయును. కఠినశిలలు, కాష్ఠప్రతిమలు, నట్టబొమ్మలు, కాగితపురంగులబొమ్మలే, భావము వానియందుంచి ప్రార్థిస్తే మనకు మేలుగలుగుచుండ సర్వలోకారాధ్యుడు, సమదృష్టిపరుడు మనమేలు గోరడా! పశువులు, పక్షులు, క్రిమికీటకవృక్షనద్యాదులే పరోపకారార్థము పనిచేయుచున్నవి. బ్రహ్మాండమే తన స్వరూపము. ప్రభువు తన దేశక్షేమముకోరును. యజమాని తన యభిమానస్థలముల క్షేమమేకోరును. దైవము సకల లోకజీవుల క్షేమమే కోరును. మఱియు శరీరమున యేయొక నవయవమునకు బాధగల్గిన తనకేనని శరీరధారి గ్రహించినరీతి బ్రహ్మాండధారి యన్నిరూపములు నన్నిపేరులు తనవియే యెఱుగుట నేయువయవమున కేచేటు గాకుండ చూచుకొనుట నాయునధర్మము. రక్షణల సాధనలే గీత. ఇఁక నారాటమంటివా, కరచరణాద్యవయవములుండి పొరబాట్లు పడుచున్నామంటే చూడగలడా! గజేంద్రమోక్షము వినవా! చదువవా! సూర్యచంద్రాగ్నినక్షత్రముల వెలిగించుచు పంచభూతముల ప్రపంచజీవుల కవసరములుగా నుంచి సస్యఫలాదులనొసగి, సమస్తజీవుల కేది లభ్యము గలిగించవలెనో నారీతి లభ్యముచేయు మనతండ్రి, మనతల్లి, మనగురుడు నాదేవదేవుడు కాడా ?

ప్ర॥ భగవంతు డెట్లుండును? ఏమిచేయుచుండు? సేవగిది ప్రకాశించు? నెటు దిరిగియుండును? భగవంతుని యర్జును డీవిధము నడుగలేదా!

ఉ॥ అవతారము లెత్తుట నార్తుల రక్షించుటకే. తానున్న చోటనుండి గాని, మఱేవిధముననైన రక్షించుటయే నాయున స్వధర్మము. భగవంతుని ప్రేమ నిరుపాధికము. ఒకదేశపు రాజునకు భగవంతుడంటె విశ్వాసము లేదు. ఉండియుంటే నేల కనిపింపడు? ఎవరు చూచినదిలేదు. అయినా

యీా విషయము తెలిసికొ౦దామని యెంచి, తనపండితులనందఱ నీ నాల్గు విధములకు సమాధానము నీయవలెననియు, లేనిచో నందఱు సభనుండి వెడలింపబడుదురనియు నందులకు కొ౦తగడువునిచ్చెను. చూడనివాని రీతుల నెఱిగింప నేరితరము. గడువు సమీపింప కొ౦దఱు ముందే పట్టణమువదలి పోయిరి. ఒకపండితుడు రేపు వెళ్లుదాము, నీరాత్రియంతయు నూహిం చుతామని చింతలోనుండ, నచటికి నతని పరిచారకుడువచ్చి సమాచార మడుగ, నీవలన నగునది కాదని గద్దించెను. వాడు చెప్పేవఱకు విడువక చెప్పినంతనే నవ్వి దీనికేనా నింత తారుమారు! తాము 'నేనెందుకు, నా శిష్యుడు చెప్పగల'డని ప్రకటించి నన్నచ్చటికి వెళ్ళేటుగాజేయండి, నేను జెప్పెదననెను. అందుకు పండితుడు సంతసించి నేనేలాగైన జెప్పజాలనందుకు నెవరు జెప్పితే నేమున్నది. అయినా వీనిలో నెంతశక్తియున్నదో నని, యటేవిధముజెప్పి గడువు దినమున సేవకుని బంపెను. ఈ వింతరహస్యము తెలియ సభ కిటకిటలాడుచుండెను. ప్రభువు వానిని బిలిచి నాలుగు ప్రశ్న లకు సమాధానము చెప్పగలవా? జెప్పుమనెను. అతడు నిర్భయముగా ప్రభువునొద్దకువచ్చి చెప్పువాడు సింహాసనమున నుండవలెను, వినువారు క్రిందనుండవలెనన, నీమహత్తర రహస్యము జెప్పువాడు నిజముగ పైనుండనెంచి రాజు సింహాసనమునుండి లేచి నతనియందు గూర్చుండ జేసి, తాను క్రింద సభికునివలె గూర్చొనెను. ఒకపాత్రలో బచ్చిపాలదెమ్మన నట్లే యొనరించిరి. తైలముతోటి వత్తిగలదీపమును దెమ్మనెను. తెచ్చిన మీాదట తానీరీతి జెప్పసాగెను: ఓ రాజా! భగవంతు డెట్లుండునని నీ మొదటి ప్రశ్న. ఈ పాలలో వెన్న గనపడకుండనున్నట్లు జడమగు ప్రపంచమున కనిపింపకయున్నాడనెను. ఏరీతి నుండుననికదా రెండవప్రశ్న. దీపమును వెలిగించి యీా దీపము జ్యోతి తనంతట వెలుగుచు నితరముల చీకటిని బాపి ప్రకాశింపజేసినట్లు స్వయంజ్యోతియై సర్వప్రపంచమును వెలి గించుచు, నంతర్యామియై సాక్షియైయున్నాడు. ఏ వంకకు దిరిగియుండునని కదా మూాడవప్రశ్న. నిర్మలమైన మనస్సుతో తన్నే నమ్మినభక్తుని వంకదిరిగియుండును. ఏమిచేయుననికదా నాలుగవప్రశ్న. గొప్పవాడవని పించుకొన్న నిన్ను క్రింద గూర్చుండజేసి, నన్ను సింహాసనమున గూర్చుండ జేసినట్లు లోకమున మెలఁచి చరించు జీవుల క్రిందుమీాద జేయుచుండునని

జేసెను. రాజు, సభికులు సంతసించిరి. రాజు తగు బహుమతితో గౌరవముతో నాతని, నతనిగురువును సత్కరించెను. భగవంతుని గుఱించిన ప్రశ్న కిది సమాధానము. అర్జును డీవిధము నెఱిగినవాడె. భగవన్మహిమ, భగవంతున కేదప్ప నన్యులెఱుగనేరరు. అవతారము లవసరమైన నావిర్భవించి తీరును. ఒక్కొక్కప్పు డొక్క దేశమునకు నొకమతమునకే సంబంధించి యవతరించును. ఒక్కొక్కపు డన్నిమతములకన్ని దేశములకు నన్ని భాషలకు సంబంధించిన యంశావతారమునుగాక పూర్ణావతారము దాల్చును. వేడిమి యెక్కువగుచో మేఘము లేర్పడును. అన్ని జలరాసులయంశము మేఘము. సమస్త జీవుల సమస్త దేశీయుల సత్సంకల్పాంశములే పూర్ణావతారమునకు దోహద మొనగును. దుర్యోధనాదులగు దుర్మార్గుల విషయములోను ధర్మముకొఱకే ప్రయత్నించెను. కర్మాకర్మ వికర్మల విను. అహంకారరహితుడై పూర్వులచే పూర్వయుగముల ననుష్ఠింపబడిన కర్మమునే మొదట నాచరింపమని భగవంతు డర్జునునకు జెప్పెను. మఱియు ఆత్మయున్నది. దేహేంద్రియాదులున్నవి. ఆత్మ నిరవయవుడగుట కర్మచేయుటలేదు. కర్మచేయగలడని యేశాస్త్రము నెవ్వరు జెప్పలేరు. జడములగు దేహేంద్రియాదు లిట్టిది కర్మయని చెప్పలేవు. దేహేంద్రియములు నిదురించునపుడున్న ప్రాణమంటిమా, నదియచేతనమే! అది చేయునాకర్మ? మఱేదికర్మ? ఇంద్రియాదులు జడములు. ఆత్మచేతనము. నిరాకారము. కర్మ దేనివలన జరుగుచున్నది? కర్మకారకులెవరు? అకర్మయన కర్మగానిది. వికర్మమన కర్మమున మిశ్రమై యుండుట. సాపేక్షతో చేసినది కర్మ. అదియె హింసగూడ. అనాసక్తిచేత జేసినది యకర్మయు నహింసయునగును. అకర్మ యెట్లగునందమా, కర్మల వలన గలిగె ద్వంద్వముల తెలిసి ద్వంద్వములబాయ మనస్సును వానినుండి అనగా విషయములనుండి విముఖముగుటయే నకర్మ లేక యనాసక్తి. తన యాశ్రమమునకు నెదురింట నివసించు వేశ్యనుజూచి సాధు వామెకు హితమొనర్ప నొకదినము నామెయింటికేగి, నామె యాచారమువలన గలిగెడు పాపమును వినిపించి మందలింప, నామె తర్కించి నాయన పోయినమీదట దిగులొంది బ్రతుకుటకు వేఱె యుపాయములేక ననాది సాంప్రదాయాచారమునకు భగవంతుని భక్తితో ప్రార్థించి యానాటినుండి తన కర్తృ

త్వము, కర్మఫలములు భగవంతుని యందుంచి నిర్మోహముతో సంతద్విష యాల్లో, బాహ్యావిషయాలలో నీ యేకైకధర్మముతో విధిలేక కులవృత్తి సాగించుచుండెను. మరల నొకదప్పా తనయింటికి పోవుచున్న పురుషుల లెక్కించి వేసినరాళ్లగుట్టను చూపి సాధు వదలించెను. ఆమె భయముతో నింటిలోనికి జని, రాళ్లగుట్టనుదలంచి భగవంతుని స్మరించుచు ప్రాణమే వదలెను. భగవంతుని దయను ముక్తినొందెను. ఎట్లన మొదట సాధువు జెప్పినపుడే తన కర్తవ్యము వదలినది. కాన నీయుదియే అకర్మ. వికర్మతో నకర్మమైనది. చేయుపనియందు నాపేక్ష లేకపోవుటయే వికర్మ. డాక్టరు గారు బాగుపఱచ నెందఱజనుల నాపరేషనులను జేయును. ఇందు నతనికి స్వార్థములేదు. ఇదేరీతి శత్రువులో దొంగలో సంగముల స్వార్థతతో ఛేదించ హింసయనిపించుకొనును. ఇదియే కర్మ. మొదటిది స్వధర్మము, నకర్మమైనది. తంతెను మీటుటలో నేకళ లేకపోతే తుప్పబడును. ప్రతి మానవుడు తనస్వధర్మమనునపుడు నాశ్రమధర్మములు, వర్ణధర్మములు, దేశధర్మములు, ప్రకృతిధర్మములు, కాలధర్మములు, స్త్రీధర్మములు, పురుషధర్మములు, వస్తుధర్మములని చెప్పలేదు. ఎందుకన దేనిధర్మము దానికుండనేయున్నది. ధర్మయుక్తముగాని దొకటిగాని యుండదు. ఒకప్పు డొకరి ధర్మము నొకరికి హింసగాను, అహింసగాను యుండును. వయస్సున్నంతవఱకు గుఱ్ఱము, పశువు మొదలగువానితో నుపయోగము లొనర్చుకుంటు ముదుసలి యైనంతనే వదలివేతుము; లేదా కసాయికిత్తుము. ముదుసలులగు తలిదండ్రుల నీరీతి సాగనంపగలమా! పశువుల విషయములో జేసినది ధర్మమనుకొనెదము. ముసలితనమున తలిదండ్రుల పూజించి నర్చింపలేక, చనిపోయినమీదట శ్రాద్ధాదుల తర్పణాదులచేయుట ధర్మమనుకొందురు. ఈ రీతి ప్రతిధర్మము నధర్మముగాను, అధర్మము ధర్మముగాను యుండును. ఒక కుటుంబమున జన్మించిన యన్నదమ్ములు వేఱుపడి నొకరిధర్మ మొకరొప్పరు. ఇది ధర్మమేనా? ధర్మముల గుఱించి విమర్శింప జీవితములెన్నైన చాల వనుకొనెదను. అయినను గీత స్వధర్మమనునపుడు మానవులంటే స్త్రీదేహ పురుషదేహములనుండే పురుషునకు ననగా జీవునకు తన స్వధర్మము జెప్పినది. కాని యచేతన ములు ననాత్మలైన దేహేంద్రియాదులకుగాదు. దేహీయని సాంఖ్య

యోగమున జెప్పెను. దేహామే మానవుడనలేదు. స్వధర్మ మాత్మధర్మమే కాని వేఱుకాదు. శ్రౌతస్మార్తమునగునదెల్ల కర్మ. దానిని త్యజించుట కర్మయని కొందఱు. శ్రుతిస్మృతులు వచించినది కర్మ, విధింపనట్టిది యకర్మయని కొందఱు. వైదికమనగా నిష్టాపూర్తాదుల నొనరించునది కర్మ, వదలుట నకర్మయని కొందఱు. చలనరూపము కర్మ, నూరకుండుటకర్మయని కొందఱు. వైదిక లౌకిక సమస్తకర్మలు దేహేంద్రియాదుల చేతనే జేయబడుచున్నవి, దీనికే కర్మయని కొందఱు. ఇట్టి యాపాధికమైన కర్మ చేష్టామాత్రము నాత్మచేయలేదని యెఱుగునో నది యకర్మయని కొందఱు. దేహేంద్రియవ్యాపారవిరామరూపమగు నకర్మమునకు వ్యవహారములేని స్థితియందు సంకల్పరూపకర్మను జూచునో యది కర్మ యనబడును. పురుషుడు కర్మలేనివాడు నయ్యు నన్యమైనదాని కర్మచేత కర్మగలవాడుగ నున్నాడు. మేఘవేగముతో చంద్రుడు, నీటికదలికచే సూర్యుడు నెట్లు క్రియగలవారుగాను, రైలుబండి వేగముతో పార్శ్వములందలి వస్తువులు కదలినట్లు దేహతాదాత్మ్యమువలన స్వతః వికారరహితుడుగానుండ ప్రతియాత్మ కర్మకలదిగా నున్నట్లున్నది. బ్రహ్మవేత్త దేహాదులతో సంబంధములేనందున నవి జేసెడికర్మను యకర్మముగా చూచుచుండును. "అకర్తారం స పశ్యతి" ఇక మూఢుడు దేహేంద్రియాదులు తనవిగా నారోపించుకొని వాని వ్యాపారము నిలిచిపోతే నేనేమి చేయలేదనును. ఒకవేళ సుఖముగాని, దేహేంద్రియాదుల సుఖబుద్ధి నవి చేయకుండిననే తను జేయకున్నట్టివాడుగ జూచుచున్నాడు. ఆత్మజ్ఞాని యట్లు చూడడు. అవిద్యయన కర్మయని, జ్ఞానమన నకర్మయని. గీత నీవిషయమునే జెప్పినదికూడ. కర్మ నిష్కర్మలఫలమొక్కడున్నను వెన్నంటివచ్చును. బాహ్యక్రియ కర్మము. దానియందు మనస్సుంచుట వికర్మము. కర్మ వికర్మల కలయికవలన గలిగేస్థితియే నకర్మయని యాచార్యవినోభా యనెను. సృష్టియే కర్మ. లయమే వికర్మ. సృష్టిస్థితి లేనిసమయమే నకర్మ. జాగృతియే కర్మ. సుషుప్తియే నకర్మ. ఆత్మ వీనికి విలక్షణముగ నుండుటయే వికర్మ. శాస్త్రవిధి కర్మ. శాస్త్రనిషిద్ధ మకర్మ. ఉదాసీనకర్మలే వికర్మ. ప్రకృతిప్రవర్తనయే కర్మ. దాని తెలియుటే వికర్మ. అందు ఫలాసక్తిలేకుంట నకర్మ. తెలియక చేయుటయు కర్మ.

తెలిసి యొనర్చుటము వికర్మ. తత్ప్రీతినొందుట కర్మ. నీప్రకారము లెక్కలేనన్ని కర్మాకర్మల విమర్శింపవచ్చు. వాస్తవమున నారురుత్తువులైన వారి విధాయక మంతియే.

ప్ర॥ గృహస్థులకు సిద్ధపురుషులగు జ్ఞానులయాచరణలో కర్మభేద ముందునా?

ఉ॥ విను. అగ్రమన ఫలము. సమ్యగ్రమన ఫలసహితమని. గృహస్థుల, జ్ఞానుల గుఱించి పరమేశ్వరారాధనరూపమగు కర్మము జ్ఞానహేతు వగుట బంధకారణముకాదు. ఫలతః అకర్మమేయగును. ఇఁక జ్ఞాని యాచరించుకర్మయందు కర్తృత్వజ్ఞానములేనందున నది యకర్మమే.

ప్ర॥ వివిధయజ్ఞముల నేల జెప్పెను?

ఉ॥ యజ్ఞములన కర్మలే. అయితే వాని యుద్దేశ్యము రెండు రకములు రెండుప్రాప్తముల గల్గించును. "బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం" అను శ్లోకమునుండి యిరువదినాల్గవ శ్లోకము వఱకు వివిధయజ్ఞముల దెల్పెను. యజ్ఞఫలము లనుభవించుటకు కామ్యములు, మోక్షాపేక్ష చిత్తశుద్ధికి నిష్కామములగును. స్థాలీపులాకన్యాయముగ పెక్కుయజ్ఞములలో కొన్నిటినిమాత్రమే భగవంతుడు జెప్పెను. ఒకొక్కటిగాని, అన్నియజ్ఞములుగాని యొక్కడే యాచరింపవచ్చును. నిష్ఠాపరుడై జ్ఞానసాధ్యముకొర కాచరించునపు డొక్కయజ్ఞమే చాలును. అందుకే నేయజ్ఞమైనను "బ్రహ్మార్పణం బ్రహ్మహవిః" ఆహుతిసాధనములు, హవి, అగ్ని, హోత, హవనక్రియ, కర్మవలన గలుగు ఫలము బ్రహ్మమేనని యనగా నంతయు బ్రహ్మమేనని నాచరించునది యెట్టిదియైన బ్రహ్మమే నన్నప్పుడు, కర్తృత్వభోక్తృత్వము, ఫలకాంక్షలేదుగాన చిత్తశుద్ధికరమగును. దైవప్రీతి యదృష్టప్రదము. సంఘసేవితము. సత్యప్రదమగును. భగవదుద్దేశ మిదియే.

ప్ర॥ క్లుప్తముగ తక్కిన యజ్ఞముల జెప్పుడు?

ఉ॥ దేవతాసంబంధమగు యజ్ఞము బ్రహ్మమను నగ్నియందు జీవాత్మయను నాహుతి నొసగునది యన, సోపాధికజీవుని నిరుపాధిక బ్రహ్మదర్శన మొనర్పజేయుట జ్ఞానేంద్రియముల విషయముల బోకుండ

నరికట్టునది శబ్దాదుల నింద్రియాగ్నియందు నాహుతి యొనర్చునది. జ్ఞానప్రదీప్తమగు నాత్మనిగ్రహమను యోగాగ్నియందు నింద్రియ కర్మముల ప్రాణాది పంచవాయుకర్మల నాహుతి యొనర్చునది. ద్రవ్య దానమనునది చాంద్రాయణాదిరూపమగు తపోయజ్ఞము. ప్రాణా యామ ప్రత్యాహారములతో గూడిన యోగయజ్ఞము. వేదాభ్యాసమను స్వాధ్యాయయజ్ఞము, వేదార్థనిశ్చయమను జ్ఞానయజ్ఞము. అపానవాయు వున ప్రాణవాయువు నాహుతి యొనర్చుట, ప్రాణవాయువున నపాన వాయువు జేర్చుట, ప్రాణాపానములరెంటిని నిరోధించుట మఱికొందఱు నాహారసంయమమొనర్చి వాయువులను నితరవాయువుల నాహుతి యొనర్చు యజ్ఞము. ఇవి యన్నియు యజ్ఞములేను. మంత్రమును, మంత్రార్థమును, మంత్రరహస్యమును ధ్యానించువాడు ధ్యానము నొకటే ధ్యేయమై జేయువాడు చేయునది యొకటైన స్థితియే నకర్మ. జ్ఞానమను స్వరూపమను నానందమను నన్నియజ్ఞముల ఫలమదియే. యజ్ఞానంతరము మిగులు నమృతమును భుజించువారు నిత్యమగు బ్రహ్మమును బొందు దురు. కురుశ్రేష్ఠా! యజ్ఞమొనర్పనివానికి నల్పసుఖయుక్తమగు నీలోకమే లేదు. పెక్కుసుఖములతోడి పరలోక మెక్కడిది యని భగవంతు డర్జునునితో ననెను.

ప్ర॥ ఈ యజ్ఞములలో నెయ్యది శ్రేష్ఠము?

ఉ॥ జ్ఞానయజ్ఞము శ్రేష్ఠము.

ప్ర॥ ఇన్ని యజ్ఞము లుండ జ్ఞానయజ్ఞ మెట్లు యెక్కువ చెప్పడి?

ఉ॥ జ్ఞానయజ్ఞము కర్మయజ్ఞము దేనికదిగొప్పదియే. ఒకదానికొకటి తీసిపోదు. కర్మము కామ్యమైనపుడు భోగకారియగును. నిష్కామ మైనపుడు చిత్తశుద్ధికరమగును. జ్ఞానము యింద్రియజన్య విషయజ్ఞాన మైనపుడు బంధమేయగును. శ్రేయోదాయకముగాదు. కోతి తన పిల్లను తనకపాయము రానంతవఱకు ప్రేమించును. తన కపాయ మగునపుడు తనపిల్లనే సాధనముగా తీసుకొని తన క్షేమము జూచు కొనును. కర్మ జ్ఞానములు సాధనలైనపుడు పవిత్రములు పునీతుల నొనర్చును. అయితే రెంటి నొకే కాలమున సాధింపరాదు. కర్మ బహిరంగసాధనము. జ్ఞాన మంతరంగసాధనము. కర్మఫలములం వదలి

వపుడు మట్టిని తోడ నీరుగనిపించురీతి, కాష్ఠము మథింప నగ్ని యుద యించిన రీతి, సర్వకర్మయజ్ఞము లొనరింప జ్ఞాన ముదయించును. జ్ఞాన ముతో కర్మల సమాప్తియగును. సాపేక్షనీయములు నిరపేక్షనీయములు కావలె. వంట తయారైన తక్కినవన్ని యనవసరములగును. డిగ్రీ ప్యాసగునంతవఱకు చదువవలసినదే. రోగము తీరువఱకు మందు అవసరమె. సంసారమున్నంతవఱకు బంధమే దుఃఖమే. త్యాగములేనంతవఱకు భోగ రోగములుండును. సూర్యుడు రానంతవఱకు చీకటి తొలగదు. పుత్రు డుదయించనంతవఱకు పున్నామనరకమే. ఋణమున్నంతవఱకు బాధలే. శత్రువులున్నంతవఱకు భయమే. భేదములున్నంతవఱకు బద్ధమే నశాం తమే. జ్ఞానము గలుగనంతవఱకు కర్మసాధన లవసరమే. జ్ఞానము గలి గెనా వానికి పనిపూర్తియై పోవును. క్రియారూపకము లడంగినగాని భావరూపము వ్యక్తముకాదు. ఒక గృహస్థు తనబిడ్డ నొకనికిచ్చి వివాహ మొనర్ప, నాతడు నామెను వదలి నెటకో పండ్రెండువత్సరములు వెళ్లెను. పండ్రెండవయేట నాయూరికి నొకబ్రహ్మచారివచ్చి యూరబావి వద్ద కూర్చొనియుండ కొందఱు స్త్రీలు అనుమానముతో నితడు వారి యల్లుడే నిల్లు కనుగొనలేక కూర్చున్నాడని యాసంగతి పిల్లగలవారి కెఱిగింప వారువచ్చి యిల్లు కనుగొనలేక సిగ్గుపడినావా? రమ్మని తోడు కొని వెళ్లిరి. కాని బ్రహ్మచారిమాత్రము నాస్త్రీవంటక తక్కిన వ్యవ హారములు నామె తనమగడేనను భావమున సేవజేయు నతడు తన భార్య కాదని జీవితము గడుపుచుండ, మరొకయేడు నిజముగ భర్తవచ్చి యదే బావివద్ద నాడువారితో మామామగారి యిల్లెక్కడ? నేను చాలా దినములగుట నిల్లుమఱచితినన అప్పుడు కొందఱు స్త్రీలుపోయి నిజముగ మీ యల్లుడు వచ్చినాడని జెప్ప నిజమగు పెనిమిటి వచ్చెనని మొదటి వాడెవడని భార్య యత్తమామలు విచారింపకమునుపే నతనిరాకవిని నిత డెవరికి తెలియకుండ పారిపోయెను. చూచితివా! పెనిమిటి రానంతవఱకు మొదటివాడుండెను. కర్మలు కర్మఫలములు జ్ఞానమురానంతవఱకు వ్యభి చారదోషుడైన నాభాసుడగు జీవుడుండును. జ్ఞానమువచ్చినంతనే నా భాసుడులేడు. కర్మలు లేవు. కర్మఫలములు లేవు. ఉండుటకు పరమా వధిలో, పరాకాష్ఠలో, అభేదములో, నిత్యముక్తిలో ద్వయదోషము

లుండవు. వెన్న బడసేవఱకు తఱచటము, అగ్ని బుట్టేవఱకు చకుముకికొట్టి యవసరమగునట్లు కర్మలవలన తెలియబడని వస్తువు తెలియజేయుట, ప్రత్యక్షము ప్రమాణము "న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే" జ్ఞానమునకు సదృశము మఱొకటిలేదు. అది పవిత్రమైనది. అసహాయవస్తు వప్రమేయము జ్ఞానము. అవిద్యావస్తువు సాక్షాత్కారమునకు ప్రతిబంధకము. జ్ఞాన మవిద్యాకర్మలకు విరోధి, పరమార్థము, పరమప్రయోజనము, ఏకాలానికైన తక్కిన సాధనలద్వారా నెవ్వరైన జ్ఞానమును బొందియే తీరవలెను.

ప్ర॥ జ్ఞాన మెట్లు గలుగును?

ఉ॥ శ్రద్ధావంతుడై బడయవచ్చును. తత్త్వజ్ఞానులైన గురువులవలన మహాత్ములగువారిని సేవించి, వారిద్వారా నా పరమజ్ఞానమును బడసిన భవబంధకారణములగు నఖిల పుణ్యపాపమిశ్రమఫల సంచితముతో గూడ దూదిపర్వతముల కగ్నిసోకిన దగ్ధమగు నటుల పచ్చికట్టెలు వట్టికట్టెలుగాని, చత్తచదారముగాని, పచ్చి వట్టి కొబ్బరిగాని, హవ్యములుగాని, యొకటి యననేల, నగ్నిచే దహింపబడని వస్తువు లేనేలేదు. దహింపజేసి యగ్ని తాను లేకుండపోవును. వేలువేలు కనిపించుచు నపవిత్రములగు వస్తువులెల్ల నగ్ని తప్తమైనంతనే పవిత్రములై యగ్నితో కలిసి తమ నామరూపములు మిథ్యలని కనిపించకనే పోవును. అగ్ని తానువచ్చినపని నపవిత్రముల పవిత్రమొనర్చి చీకటియందు గనిపించని వస్తువును గనిపింపజేసి వెళ్లును. ఈ జ్ఞానము బహుజన్మ సుకృతములు నొకటిగా కలిసి వస్తేనేగాని లేకపోతే జ్ఞాన ముదయింపదు. ప్రపంచమున మానవులనేకులు గనపడుదురుగాని జ్ఞాని కనిపించవలెనంటే నే వెయ్యింటికో, నే లక్షకొక్కడో గనిపించును. అంతా జ్ఞానులైతే నిన్నియనర్థము లేల గలుగును? పెక్కు కాలము కూర్చితేగాని యొకడు ధనికుడుగాడు. అనేక పాపము లొనర్చితేగాని పాపయోనిసంజాతుడుగా బుట్టడు. పెక్కు వత్సరములు చదివితేగాని పట్టపరీక్షలో ప్యాసుకాలేడు. నవమాసములు నిండినగాని ప్రసవముకాదు. జలబిందువులన్ని యేకమైతేనే గాని నదిగా ప్రవహింపదు. రాళ్లను, చెక్కలను, మట్టిని చేర్చితేగాని యొక యిల్లు తయారుగాదు. కొన్ని వస్తువులనేకముజేసినగాని మందు తయారుకాదు. తద్రీతి, జ్ఞానాగ్ని మనుజుని

హృదయమున వికాసించవలెనన్న పెక్కు జన్మముల శ్రద్ధతో నొనరించిన పుణ్యఫలబలమే. శ్రద్ధయుంటే త్రికరణముల నలసతనొందక సాధింపదలచిన వస్తువు సాధించుటతో చనిపోవుటయో యని ప్రారంభింప, నిదురగాని యాకలిదప్పికలశ్రమలు తోపవు. శ్రమను గమనింపక చేయు కృషివలన ఫలము లభింపగలదు. స్వామి రామతీర్థ చదివినచదువు, పడినపాట్లు, స్వామి వివేకానంద, రాజ్యముకొఱకై మహాత్మాగాంధీజీ ప్రభృతులు పడిన శ్రమ తెలియదా! అనహంకారులై యార్జింపవలసినది హస్తగతమగు వఱకు కృషిచేయుటచేత లభ్యము కాగలదు జ్ఞానము. జ్ఞానముతోనే యందము, నానందము, తేజము, నవ్యాజము, నభయము, నుత్తమోత్తమము, మానవులలో ప్రభువు, పక్షులలో హంస, మృగములలో సింహము, పర్వతములలో మేరువు, నదులలో గంగ, సముద్రములలో క్షీరసముద్రము, దేవతలలో దేవేంద్రునివలె జ్ఞానవంతు డందఱిశ్రేష్ఠుల కంటె శ్రేష్ఠుడు, పూజనీయుడు, స్వతంత్రుడు. యముడు నచికేతుని పూజింపడా దివ్యత్వము, విశ్వముయొక్క నేకైకత్వానుభూతి పొంది సమస్త విశ్వము తానుగాన జూడగల పరమతత్త్వవేత్త.

ప్ర॥ సంశయము, అశ్రద్ధ, జ్ఞానములను నీ మూడు కలవాడేమగును?

ఉ॥ సంశయాశ్రద్ధాజ్ఞానలక్షణములే. వేదము కర్మను ప్రతిపాదించునా? బ్రహ్మమును ప్రతిపాదించునా? జగత్కారణము బ్రహ్మమా? ప్రధానాదులా? యను ప్రమాణప్రమేయముల సంశయము, మహాత్ముల యనుభవమున యవిశ్వాసము, వేదశాస్త్రాదులయందు, గురువులు సజ్జనులయందు, భగవంతుడు పరలోకమునందు శ్రద్ధ లేకపోవటము, పెక్కుకాలము విన్నను, చదివినను, చెవిటి, గ్రుడ్డి, కుంటి, మూగ, మొండి, ఉన్మత్తాదులకు తమ స్వాభావికము తప్ప నన్యము గ్రహింపరాదు. అజ్ఞాని జ్ఞానిగాలేక సంశయాశ్రద్ధలజతతో సంపూర్ణ సంబంధముండదు. ఈ లోకమునగాని, పరలోకమునగాని, సోమరుల కెక్కడున్ననేమి లభింపదు? శ్రద్ధావంతు డెందున్నను సుఖమును సాధింపగలడు. కావున భగవద్దర్శనమున ధర్మాధర్మముల త్యజించి, జ్ఞానమువలన సమస్త సందేహములు తొలగినవాడు నగు నప్రమత్తపురుషుని కర్మములు బంధకారణములు గాజాలవు. అవివేకసంజాతమును, హృదయమునందు

గలదియును, నాత్మవిషయకమునగు నీ సంశయమును జ్ఞానఖడ్గముచే ఛేదించి నిష్కామకర్మయోగము నాశ్రయించి స్వధర్మ మొనర్చ సిద్ధుడవు గమ్మని భగవంతు డర్జునునితో ననెను. ఔనో కాదో! నట్లగునో, యేవిధానమో నెవరికేమి తెలియును? దేవతలకే, మునులకే, ఋషులకే, ప్రభువులకే, పరశ్రమగలవారికే నిత్యసుఖము శాశ్వతానంద ముండినట్లు లేదు. మన కెక్కడనినే సంశయమునకు స్వస్తిజెప్పి అస్తవ్యస్తులుగాక, నాస్తికాస్తులుగాక, కుందేలును తాబేలు శ్రద్ధతో గెలిచినట్లు, శ్రద్ధావంతు డెందును నవజయమొందదు. ఆత్మ పరమాత్మ యగునా? కాదా? యను సందేహ మవసరములేదు. శ్రద్ధతో శ్రవణమొనర్చుచురాగా హృదయమందలి దోషములు తొలగినంతనె సంశయము తీరును. అను భూతి గలుగును. కాన నీ మూఢు నెవరికి తగవు. శాంతికాములు, స్వధర్మనిష్ఠాపరతులు, పరోపకారధురీణులు ప్రపుణ్యాత్ములే కాదు. సకల మానవులకు శ్రద్ధయే ఫలకారి. శ్రద్ధకు సమము, పుణ్యము, యోగము, తపము, జపము సమములు కావు. ఏకలవ్య, కర్ణ, బలిచక్రవర్తి, అర్జున, నారద, మారుతి, నచికేత, నుపమన్యు లిత్యాదిమహాత్ముల శ్రద్ధయే వారి పరమగతికి కారణము. అజ్ఞానమనే చీకటికి జ్ఞానమును అశ్రద్ధకు పట్టుదల సంశయమునకు శ్రవణ మొనరించి లేదా శమషట్కమున విషయాసక్తి శ్రవణమున ప్రజ్ఞామాంద్యము, మననమునకు తర్కము నిదిధ్యాసమువలన విపర్యయదురాగ్రహము నశించును. తరువాత నా మాటిని తమతమ స్వధర్మముల ప్రతిఘటింపకుండ జూడవలె. నేడో రేపో యనకూడదు. నేటిమాపు స్థితిగతులు వేఱు. ఎప్పటి కర్తవ్య మప్పుడు చేయవలెను. చేసి తీరవలెను. ఇదియె తత్వజ్ఞానము.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం

యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే

జ్ఞానయోగో నామ

చతుర్థోఽధ్యాయః

ఓం తత్ సత్

★

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## పంచమాధ్యాయము

### కర్మసన్న్యాసయోగము

క॥ కర్మానుష్ఠానముతో, కర్మత్యాగంబు తిరిగి గావించుమనే
మర్మ మెఱుంగుటయే మన, ధర్మము గుణవంతులార తర్కింపుడెసఁగ.

ప్ర॥ ఇయ్యది యే యధ్యాయము?

ఉ॥ కర్మసన్న్యాసయోగము.

ప్ర॥ అర్జును డేమి ప్రశ్నించెను? ఎందుచేత? కర్మయన సన్న్యాసమన నేమి యర్థము?

ఉ॥ కర్మను సన్న్యసించు నుపాయమని యొకయర్థము. కర్మము సన్న్యాసమునకు పరంపరసంబంధమని యొకయర్థము. కర్మసన్న్యాసములు రెండు మోక్షసాధనములని యొక యర్థము. కర్మను వదలుట కర్మనుచేయుట నీ రెండింటిలోనే మానవుల సంసారబాధ మోక్షము లంటియుండును. ఈ సంశయము కలుగ కెట్లుండును? జ్ఞానకర్మలనే నర్జునునకు జెప్పెను. నాలుగవయధ్యాయమున కర్మ త్యాగమును, కర్మానుష్ఠానమును చెప్పుట చేత నీ రెండిటిలో నెయ్యది శ్రేయస్కరమని యడుగవలసినందున తొలుతనే యర్జును డడిగెను. కర్మసన్న్యాసమనిన సన్న్యసించుట యెందులకో తెలియకపోవటము, సన్న్యసించుట మేలేనని సన్న్యసించటము. ఇదిగాక నాశ్రమసన్న్యాసములని కొన్ని యున్నవి. అవి వేషాచారములతోటివి. అందులో నెయ్యది మంచిదను సంశయము రాక మానదు. కర్మసన్న్యాస మని జ్ఞానమని రాధ్యర్థము. ఇటువంటప్పుడు జ్ఞానయోగ కర్మయోగ ముల నిశ్చయము జేసుకోవలసి యుండును. మానవులందఱికు నవసరమే. కర్మను వదలితే నేలాటి బంధముండదు. తలంచి వదలుటయే కర్మ.

అడవిలో, కొండగుహాల, చెట్లమొదళ్ల, పొదల మఱెందైననుసరియే నున్నచో నాకలి, దప్పి, యెండ, గాలి, మంచు, ఉప్పెన, జననమరణ రోగ వృద్ధాప్యము లుండనే యుండును. అక్కడకూడ నిది నా స్థలము, నియ్యది నాది, నీయది నాకవసరమనే విశేషసృష్టి యుండనేయుండి, సన్న్యాసిని సంసారిగా జేయును. ఆహార, నిద్రా, స్థల, వాత, పానీయముల నియమము తప్పిన చాల బాధగల్గును. కన్నులజూచుట, చెవులవినుట, నాలుకతో రుచి, నాసికతో వాసన, చర్మముతో స్పర్శము తెలిసికొనుట, ముందనుభవించినవి జ్ఞాపకానికి రావటము నవి లభింపవనియో, లభించుట కుపాయమొనర్చుటయో, నొకస్థలమున బరుండ నేర్పఱచుకున్న కుక్క, అందే సంతానము కనుటకు నా స్థలమునే నిశ్చయించును. సుఖమని వద లిన సన్న్యాసము సంసారమైతీరును. మొదలే నపుంసకుడు, స్త్రీలమధ్య నుండరాదన్నను నుండిన నొకటియే. అంతరంగమున కర్మలకు మూలము లగు సంకల్పములు లేనపుడు సంసారియే సన్న్యాసి కాగలడు. సంకల్పము, వానిఫలకాంక్ష సంసారి. సంకల్పరహితుడు సన్న్యాసి. అన్ని వృక్షములే కాని కల్పతరువు వేఱు. అన్నివృక్షములకు నీరు, గాలి, భూమి యవసర ములు. కల్పతరువున కివి యక్కరలేదు. సదా యడిగిన వర్థులకు నిచ్చు చుండును. ఒకరివలన ప్రతిఫలము కోరుటలేదు. మానసికమున యరటి పిలకలవలె కర్మశేషము మిగిలియుండిన, శిరస్సునన్ను వెంద్రుకలు యెన్నితూర్లు గొరిగినను మొలచుచుండును. తద్రీతి పాపపుణ్య మిశ్రమ కర్మఫలము లుండియుండును. మనసు కెమరా లేక బ్లాటింగుపేపరువంటిది, లేక యద్దమువంటిది. చూచినవి, విన్నవి, చేసినవి యనగా జ్ఞానకర్మేం ద్రియముల నాచరించినవి తనయందు నచ్చువేసి వెనుకటి ఫలములకు మూలకారి యగును. ఇదే సంసార మనెదరు. ఏకుచేతితో వడకక పోయిన దారము యేకులోనెయుండును. జ్ఞానము గల్గినమీదట సన్న్య సించటమా సన్న్యసించటమేజ్ఞానము. తదనంతరము జ్ఞానమనేది లేదు.

ప్ర॥ సన్న్యాసమే జ్ఞాన మెట్లగును?

ఉ॥ సర్వకర్మల పరిసమాప్తికి జ్ఞానమే ఫలము. సూర్యరశ్మి సోకినంతనె లేమయింతును, లేక చీకటి విచ్చును. జ్ఞానము గలిగినంతనే సర్వత్యాగము గలిగేయుండును. మఱియు సన్న్యాసము, జ్ఞానము రెండు నొకయర్థమె.

జ్ఞానము కొఱకంటిమూ, జ్ఞానముకొఱకే ఫలత్యాగముకూడ. అటువంటప్పుడు చిత్తశుద్ధియైనది, లేనిది తెలియవలెనంటే కర్మఫలత్యాగము వలన తెలిసినరీతి కర్మసన్న్యాసమూలగ తెలియదు. కష్టపడిచేసి పంటపండించు వానిశ్రమ భిక్షుకునకు, సోమరికి తెలియదు. ప్రసవవేదన గొడ్రాలికి తెలియదు. రోగమువచ్చిన దినములలో నాలుకపై నేదియుంచుకున్నను చేదుగానుండి వలదనెదరు. ఆ వ్యాధి వదలియుంటే రోగము తీరినంతనే మరల సన్నిపదార్థముల రుచి యనుభవింప ప్రారంభించుచుందురు. చెట్లకు నాకులు రాలినంతనే మరల పుట్టవని కాదు. క్రొత్తవి పుట్టుటకే ప్రాతవి రాలును. సృష్టివిధాన మింతయే. క్రొత్తకోరికలు మొలకెత్తుటకు ప్రాతవాసన లుండును. అనుభవము చేయుటయన క్రొత్తవినార్జించుటగాని లేక బహిర్వాసనల నటకాయించినపుడు ప్రాతవి యంతములేక వచ్చుచుండును. ఇసుకలో నీరు కనిపించదు. జలము దీసినంతనె నీరు యావిర్భవించును. ఇక నెందఱు చల్లుచుండినను నీరు యూరుచుండును. సన్న్యాస శబ్దము నోటితో సులభముగ జెప్పి కలముతో వ్రాయవచ్చును గాని, సన్న్యసించుట లేక కోరికలులేకుండ నుండుట కాదు. గాలికన్న, యగ్నికన్న, నీరాకసముకన్న సూక్ష్మమై, రూపములేనిదై యున్న మనస్సు స్థూలమునో, సూక్ష్మమునో నంటబెట్టికొని యుండును. ఒక ఫ్యాక్టరి యజమాని యూరకుండువానికి రూ. 5—0—0 లు, పనిచేయువానికి రూ. 2—8—0 ది 1-కి కూలియిచ్చెదనన, యూరకుండువారు ననేకులువచ్చి కూర్చొనిరి. మధ్యాహ్నము యజమాని మీరూరకనున్నారా? యన ఔననిరి. వెలుపల కర్మేంద్రియములు కాదు, లోపల మనస్సు యూరకున్నదియా? యన లేదని వారి త్రోవ వారు వెళ్ళిరి. మనస్సూరక యుండునా? మనస్సు మహిమ గొప్పది. దానినే చిత్రగుప్తుడని యనెదరు.

ప్ర॥ యమునివద్ద నుండు చిత్రగుప్తుడుకదా పాపపుణ్య లెక్కలు వ్రాయువాడు. మనస్సునకు చిత్రగుప్తుడనుట యెట్లు?

ఉ॥ చిత్రమన లేనివి యున్నవి క్రొత్తవి రాత్రిస్వప్నమున గల్పింప జేసినది మనస్సే. అందువలన చేసిన ప్రతికర్మల చిత్రములరీతి గుప్తముగ దాచి సమయమువచ్చిన ప్రదర్శించునుగాన చిత్రగుప్తు డనియెదరు.

ప్ర॥ కొండలలోను, తీర్థస్థానముల, తక్కిన స్థలముల సన్న్యాసు లనేకులు గనిపింతురుగదా? వారు మహాత్ములు గారా? మనస్సును జయించిన వారు కారా?

ఉ॥ మనస్సున కొక రూపము లేదు. దేనిదలంచితే నా పరిణామము నొందును. కోరికలు మొదలంట త్యజించినవారు సన్న్యాసులు, మహాత్ములు; వాసనలు గలవారు కారు.

ప్ర॥ మనస్సు దేనియొక్క పరిణామము?

ఉ॥ అనాద్యవిద్యాపరిణామము. భూమిలేనిచోట భూమిని, నది లేనిచోట నదిని, ఇల్లులేనిచోట నిల్లును, వస్తువులేనిచోట వస్తువును, సూక్ష్మముగానో, స్థూలముగానో పిల్లి తనపిల్లల నొకచోటనుంచక ననేక చోట్లకు మార్చురీతి, లేనిపోనిసృష్టి జేయుచుండును. నిడివికాలమగు జాగ్రతలోని ప్రపంచమును కుఱుచకాలములో స్వప్నమున దీపింపజేయు మహత్తరశక్తి గల మనస్సునకే సన్న్యాసము కావలెగాని, కర్మసన్న్యాసముతోనె ముక్తిలేదు. సన్న్యసించబోవునపుడు, సన్న్యసించినంతనే నొక విధమగు భయము, దిగులు, వికారము, విస్మృతి, చింత, వేగిరము గలిగించును. ఒకదిక్కు వేషముతో సన్న్యాసిమైనను మానసికముగ సంసారియగుచుండును. నేనన్ని వదలితినని యంటుండవచ్చు; వదలినది లేనిది తనకు తనమనస్సునకు తెలుసు. వదలితి ననటము, వదలటము, వదల లేదనటమేయగును. చెట్టునకు మూలమునుంచి తక్కిన భాగములన్ని కొట్టివేసినను, మోడుమైనంతనే నశించినదియూ కాదు. కొంతకాలమునకు తిరిగి మొలకలెత్తును. నదిమూలమున్నంతవఱకు ప్రవహింపక మానుకోదు. పాలుబోసి సాకినదికదా అని ముద్దుగొనిన పాము కఱవక మానదు. మనము పెంచినదని బోనునుండి వదలిన దుష్టమృగము మనపైబడక వదలదు. తద్రీతి మనస్సొకటి మంచిదిగా మన కనుకూలించునట్లుదోచినను ప్రతికూలమైనవి మనకు తెలియకుండా ననేకము జేసివైచును. కావున మన మేస్థలమునున్న నొక్కటియే. మనోమూలమును, సంసారమూలమును, దుఃఖమూలమును గుర్తెఱిగి ఫలాసక్తివదలితిమా! చాలు. అదియే శుద్ధమగును. "అద్భిర్గాత్రాణి శుద్ధ్యంతి, మనస్సత్యేన శుద్ధ్యతి" దేహశుద్ధి స్నాన మొకపూట జేసినంతనే గలుగును. మఱుదినము మరల

మలముండకపోదు. దేహమున్నంతవఱకు స్నానమవసరమె. మనోసిద్ధి నొందవలెనంటే మాటలతో నగునా? కబీరు యనెను: "పహాలే కరో ఫిర బోలో" మొదట చేయుము, పిదప జెప్పుమనెను. ఆ రీతి హఠాదియోగాభ్యాసములవల్ల సిద్ధియనర్ప ప్రయత్నించినను, నాయా యభ్యాసకాలములదప్ప తక్కిన కాలముల భోగముల తయారు చేయును. అయితే సాధకులు తమ ప్రయత్నము పట్టుదలగలిగి ధ్రువ, నారద, ప్రహ్లాద, రామతీర్థ, వివేకానంద, గాంధీజీలవలె యుండుటవలన దాని బలాబలము తెలిసికో గలుగుదుము. కర్పూరమువలె, వెన్నవలె, మంచువలె కఱగునది కాదు. ఇనుము, రాయికన్నను వజ్రకఠినమైనది. మనస్సు కుక్కతోక వంటిది. ఎన్నితూర్లు చక్కజేసినను ముడుచుకొనుటయే. దీనిమూలములో వశించినగాని న్యాసికాదు. సన్న్యాసమునకంటె కర్మమునందే సులభముగా నిర్జింపవచ్చును.

ప్ర॥ నిష్కామ కర్మయోగము, కర్మసన్న్యాసము నీ రెండు ముక్తికరములని భగవంతు డనలేదే. సన్న్యాసమునకంటె కర్మయోగమే శ్రేష్ఠమని యర్జునుడు "సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి" శ్లోకము నడుగ "సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ" యను శ్లోకమున శ్రేష్ఠమని యేల జెప్పెను?

ఉ॥ ఆ పరాత్పరునకు తెలియని దొకటియు లేదు. కర్మల త్యజించటము సులభమే. సంకల్పముల వాసనల త్యజింపనగునా? కాదు. శివుని వేషము వేసిన శివుడగునా? "శం సుఖం కరోతీతి శంకరః" సుఖమును గలిగించువాడు సుఖస్వరూపుడైనపుడే శంకరుడు. భార్యాబిడ్డల సంసారమును భరించలేకనో, వ్యాధులమూలముననో, కర్మ సోమరియై బలవంతులాదే పరిభవింపబడినపుడో, కపటముకాల సహవాసదోషమున చిఱుదిండ్లు, దొంగతిండ్లు, మత్తు యాలవాట్లు, పరపీడాకరములగు నీచవృత్తులకు పాల్పడినపుడు కులముచేత, శాస్త్రముచేత, గొప్పవారిచేత బహిష్కరింపబడినపుడో, బ్రతుకలేనపుడో, శాస్త్రవిధికర్మల ననుష్ఠింపనిష్టములేకనో, తెలిసికొనకనో, యుదాసీనతనో, మరేవిధముననో లేక తిక్క, యున్మాద, పిచ్చి, దీర్ఘరోగము మొదలగు గతులచేతనో సన్న్యసించుట సన్న్యాసము కాదుకాదు. సన్న్యసించుటకు తగిన యోగ్యత కావలెను. తగిన

కారణ ముండవలెను. అట్లు లేనిచో కర్మభ్రష్టుడును, నుభయభ్రష్టుడగును. చారలు, మచ్చలు వేసినంతనే గ్రామసింహము నడవిసింహమగునా? పసుల కాపరి న్యాయమూర్తి యగునా? కోతి జలచారి యైనట్లాయి, కుక్కకు సింహాసనాధ్యక్షత తగునా! ఆశ్రమసన్న్యాసములు క్రమముగ నని వేఱు. గృహస్థమునుండి వానప్రస్థము, తదుపరి సన్న్యసించుట కాదు. బ్రహ్మచర్యమునుండి లేదా గృహస్థమునుండి సన్న్యసించుటలో సిల రహస్యములనే భగవంతు డర్జునునకు యోగ్యతాయోగ్యతల తెలుపవలసివచ్చినది. అర్జునుడు గృహస్థుడు, క్షత్రియుడు, రాజ్యపాలకుడు. తన కుటుంబమేగాక, రాజ్యములోని బహుకుటుంబములను తమతమ స్వధర్మములను హానిరాని విధమున మతకలహములు, సంఘవిద్రోహము, వ్యక్తిస్వాతంత్ర్యములకు భంగమురాకుండ జూడవలసినవాడు. తన మొట్టమొదట గలిగెడు నసర్థములను విచారించి సన్న్యసింపదలచెను. ఒకడు తనతల్లి పినతండ్రితో నానందముగ సుఖింపుచుండ, తండ్రి యాతల్లిని చంపుమనిన తండ్రి యాజ్ఞ మీరలేక కన్నతల్లి యానందమును విధ్వంసము నొనరింపలేక నీ యనర్థముల జూచుటకంటె నీ స్థలము వదలితె నిది తీరిపోవునుగదా అని యనుకొనును. మఱొకడు తన యూరివారు తన్నవమానపఱచి తరుమ నొంటరియైనపుడు తన యూరివారికి విరోధులువచ్చి తన్ను సహాయ మపేక్షించినారనుకో నిపు డూరివారిపై క్రోధముతో తనవూరును పరులచేతికి నందియ్యదమా! నివి రెండును విషాదసంఘటితములే. అప్పుడు తప్పించుకొనగోరు తాత్కాలిక ప్రజ్ఞావాదమే సన్న్యాసమునకు దారితీయును. న్యాసమన వదలుట. 'సం' యని విశేషణముంచుట గమనించవలెను. జగత్తులోని యేదియుకరికైన నొకప్పుడు స్మశాన పురాణవైరాగ్యములు గలుగును. అవి నిజములుకావు. సంతానము గలుగనంతనే స్త్రీకి సంతానవాంఛ తొలగినదనవచ్చునా! నపుంసకుడైనంతనే కర్మ త్యజింపనగునా! పాండవు లరణ్యముల ముండుండలేదా! అందులోని యనుభవ మర్జునునకు తెలియదా! సన్న్యసించ నిచ్ఛయుంటే నింత యనర్థకమునకు పాల్పడనేల? నిరంతర మడవులనున్న జంతువులు సన్న్యసించినట్లేనా? ఇంద్రియములు బలహీనములైనను, సూక్ష్మేంద్రియముల విషయములు నప్పటికప్పుడు నూత్నములగునుకదా! సన్న్యసించకూడదని భగవంతుని యుద్దేశ్యమా! యోగ్యత

గల్గిన సన్న్యసించవచ్చు. భగవంతుడు వలదన్నను మానగలమా! కర్మను జేయుటయు, వదలుటయు కీలక మెక్కడనున్నది? వదలవలె నన్నపుడు దీనివలన గలిగే రోత, భయము, నపాయము తెలిసి యనర్థములేని స్థితి బొందదలచినపుడు దేనిద్వారా ప్రపంచమును దేహమును ప్రేమించెనో, నా ప్రేమను వానియందుండి వదలి ప్రేమింపగల వస్తువుపై నిచ్ఛగలుగ వలె. ఒకనికి యొకనివలన నవమానము జరిగిన నిక నాతనిమాట, నాతని పేరు నాతనికి వైరాగ్యమేకదా! అవివేకియై సన్న్యసించినను, యవివేక తతో నున్నచోట కర్మిష్ఠి కాకపోడు. ఇటువంటి కర్మసన్న్యాసులకంటె కర్మ మాచరించుచు, సదరు కర్మనే సాధనముగ మార్చుకొనగలగటమే శ్రేష్ఠమనె భగవంతుడు. అనాది స్వధర్మకర్మలనెందుకు వదలవలసివచ్చునో, నా కారణముచే కర్మల సాధనలగా నా ఫలము బొందవచ్చునని తెలియదా! కర్మల వదలితే సుఖము, శాంతము లేక మోక్షమంటివా, కర్మలకు కారణమగు కర్తవ్యము వదలక సన్న్యసించుటకంటె కర్తవ్యాభిమానములవదలి కర్మ యొనరించుట శ్రేష్ఠము. ఒక గంగిరెద్దు యింటింట పత్తిగింజలు పచ్చిక తినమరిగియుండ గంగిరెద్దులవారు దానిని యేలనో వదలిరి. మఱొకరికి సేద్యముసేయు పనికిరాక తన కాహారము దొరకక కృశించి గతించెను. చూచితివా! మొదలు సన్న్యాసివలె పనిలేక హాయిగ బ్రతుకమరిగిన మనస్సు, నిజముగ సన్న్యసించియుంటె బ్రతుకునకు భయమేల?

ప్ర॥ సన్న్యసించుటకు కారణముండవలె నందురా? అది యెట్టిది?

ఉ॥ ఐహికాముష్మిక సుఖములు నిత్యములు, దేహేంద్రియములు జడములు, సంసారము క్షణభంగురము, నింద్రియసుఖములు స్వల్పములు శాశ్వతసుఖము గలుగునట్లు నా శాశ్వతసుఖము గలిగినగాని నా జన్మ సార్థకము గాదన్నవాడు శాశ్వతానందముకొఱకు వీనిని త్యజించగలడు. త్యజింపవచ్చు. శాశ్వతానందసుఖమును తెలిసికొని కర్మ జేయవచ్చు; మానవచ్చు. శాశ్వతసుఖము కొఱకయ్యే కర్మఫలములం దాసక్తివదలి జేయగలడు. ద్వేషము లేకపోవుట నాసక్తిలేకుండుట కర్మముల నాచరించుచున్నను, నిత్యసన్న్యాసియని భగవంతుడు బిరుదొసంగెను. సుఖదుఃఖాది ద్వంద్వరహితుడు గావున ననాయాసముగ ముక్తి నొందగలు

గును. పరోపకారార్థమై స్వార్థత్యాగియైన నిర్వ్యాజప్రేమగల ధీమంతుడు, సదా భగవద్ధ్యానరతుడై సన్న్యసించినవాడు నిరువు రొకటే.

ప్ర॥ కర్మయోగ, సన్న్యాసయోగములు రెండు నొకే ఫలకారులేనా?

ఉ॥ సందేహము లేదు. కర్మయోగముగాని, మోక్షముకొఱకు సన్న్యసించిన లేక జ్ఞానకర్మఫలము కైవల్యమే. కర్మఫలాసక్తి లేదు. కావున సంచితాగాములు తొలగినవి. జ్ఞానము కలిగెనా మోక్షమే. రెండును మోక్షము నుద్దేశించినవే యగును. చిత్తశుద్ధిలేక సన్న్యసించితే మోక్షమును బడయుటకు బదులు దుఃఖపర్యవసానమే కాగలదు. కర్మయోగినే మునియనిగూడ జెప్పెదరు. ఏకాంతమున వసించి మనన మొనరించు జ్ఞానులలో చేరినవాడే నిష్కామి. కావున ముని యనబడెను. ఉరుము యుఱిమిన మనస్సున భయము, మెఱుపుమెఱిసిన కన్నులకు మిఱుమిట్లు గొల్పును. ప్రక్కవాటుననుండి యెవరైన బెదరించిన గుండె యాగును. మిక్కిలి కర్మల ఫలము తెలిసి సన్న్యసించనివారు మనస్సువలన, నింద్రియములవలన, సూక్ష్మసంస్కారవాసనలవలన మాటిమాటికి పరిభవింపబడుదురు. సన్న్యసించితే సుఖమనేది యందఱకు తెలియును. సన్న్యసించితే జీవితమంత జరుగుట దుర్లభమైపోవును. శరీరయాత్ర కొఱకై చేయు భిక్షాన్నము, సంచాటనముకంటె స్వతంత్రుడై స్వధర్మమును పాటించుట మేలు. ఒక కర్మసన్న్యాసి, ఒక కర్మయోగియిద్దరు నొకస్థలమున నివసించుచుండిరి. కర్మయోగి స్వతంత్రించి త్రికరణముల నేదియో యొక కర్మచేయును గాన నతని శరీరయాత్ర సుఖముగ జరిగిపోవుచుండెను. సన్న్యాసికి పదేపదే భిక్షకై పరుల నాశ్రయించటము, వారికొకసారి గాకపోతే యొకసారి యేవగింపు తిరస్కారభావము గల్గ లేదుపో యనుట యూరూరువిడచి యస్తుపస్తు పడియుండవలసివచ్చినది. దీనికన్న నిరువురు కర్మను కర్తవ్యత్వములేక చేయుటలో బంధముగాని, భయముగాని లేదు. ప్రపంచములోనేనుండి ప్రపంచవాసనల వదిలితే చాలు. ఒక గ్రామమునకు దూరమున సన్న్యసించి తపస్సుచేయు నతడు ప్రతిదినము తపస్సునుండి లేచి యా గ్రామమున భిక్షగొని చను యలవాటుండెను. కొన్ని సంవత్సరములు గడిచినమీఁద నొకనాడు తను నివసించుస్థలమున

నున్న చెట్టుపై కొంగ గ్రద్ద వాదులాడి తపస్సులోనున్న నతనిపై యొకటి రెట్టవేసెను. ఆయన పైకిజూచినంతనే నది భస్మమాయెను. అతడు తన తపస్సు ఫలించినదని యెంచెను. మామూలుగా గ్రామమునకు భిక్షకు వచ్చి యొకయింటివద్ద భిక్షమడుగ నా యింటియిల్లాలు నా పెనిమిటికి స్నానము జేయించుచున్నాను.కొంచెమాగుమనెను. ఆగి మరల భిక్షమడుగ నా భర్తకు నన్నము వడ్డించుచున్నాననెను. తలనూచి కొంచెమాగి మరల నడిగెను. నా పెనిమిటి యలసివచ్చి పరుండెను. కనుమూసినంతనె భిక్ష మిడెదననెను. అంత తనభర్త తనసేవచే నిదురింప నామె భిక్షగొనిరా నాయన యాననమునుగని యేమయ్యా! కొంగను గ్రద్దను జూచినచూపు చూచుచున్నావే యన నతడదరిపడి తనకోపము తనంతనారిపోవ స్తబ్ధుడై యెట్టకేలకు నామెకు నమస్కరించి తల్లీ! నీకెట్లు తెలియునన, నాస్వధర్మమె నన్నీస్థితికి దెచ్చినదనెను. కర్మఫలము సంఘమునకో, భగవంతునకో మత్రెవ్వరికైనను వదల నదియే స్వధర్మము. కాన సన్న్యసించవలసివస్తే సన్న్యసించవలసినదే. లేక కర్మనుచేయుచు ఫలత్యాగమొనరించుటయే శ్రేష్ఠము, నానందము. కర్మసన్న్యాసమున నీయానందము లభింపదు. తినుచుండిన, పలుకుచుండిన, నాడుచుండిన, నిదురించుచుండిన, స్పర్శించుచుండిన, నాఘ్రాణించుచుండిన, స్వప్నము గనుచుండిన, కన్నులుమూయుచున్న, తెఱచుచున్న, చూచుచుండిన, నడచుచుండిన, కూర్చుండిన, లేచుచుండిన, చదువుచుండిన, త్యాగము చేయుచున్న నింద్రియములు తమతమ పనుల విషయప్రవృత్తములగుచున్నను, తానేమి జేయువాడను గాదనియు, ననియతములై సంచరించువానికి విలక్షణుడనని యకర్తను, నభోక్తను, నసంగుడ, నసక్తుడనని తెలిసి ఫలాసక్తిని త్యజించి పరమేశ్వరార్పణ, లేక నాత్మార్పణము నాచరించువాని, నీరు తామరాకు నంటనట్లు, నాకసమును ధూళియంటనట్లు, నగ్ని చెదలంటనట్లు, పుణ్యపాపమిశ్రమము లంటజాలవు. ఫలత్యాగి నీరీతి నానందము నొందును. కర్మఫలత్యాగి యొకవేళ జన్మము లెత్తవలసివచ్చి నెన్ని జన్మములెత్తినను బంధముగాని, దుఃఖముగాని యుండదు. ఆత్మ వేరు, ననాత్మయగు దేహేంద్రియాదులు వేరని దృఢముగా తెలిసినవాడు నెన్నిజన్మము లెత్తినను బంధమేలేదు. కర్మ యకర్మ వికర్మల నాల్గవాధ్యాయమున జెప్పినట్లు కర్మ వికర్మల

ఫలత్యాగి నకర్మియే యగును. జ్ఞానికి దేహాభిమానమే లేదు గావున నాతడు సదా యకర్మియే యగును. దేహాలయమునందలి దేవుడే మంచిచెడ్డల నెఱుగకుండ నా దేవుడుండును. పగలంత పనిజేసి యింటికివచ్చి రాత్రియైనంతనే నిదురించువారి జీవునివలె దేహమున జీవుడు నేఫలకారికాక చేయు కర్మవలన కలిగేఫలము సదా నిష్ఫలముగా ననుభవించుచుండును. మఱొకమాట. భగవంతుడొకరికర్మకు కర్మఫలమునకు ప్రేరకుడుకాడు. కర్మ చేయువలదని చెప్పుటయు భగవంతుని వాంఛకాదు. అంతయు నవిద్యవలననే కర్తృత్వాదికము లాత్మయందు నారోపింపబడుచున్నవి. పరమాత్మ యెవ్వని పాపముగాని, పుణ్యముగాని గ్రహించుటలేదు. అజ్ఞానమువలన వివేకజ్ఞానము నావృతమగుటవలన జీవులు మోహగ్రస్తులయ్యెదరు.

ప్ర॥ అట్లైతే కర్మల ప్రేరేపించున దెవరు ?

ఉ॥ అదియే నవిద్య. కర్మలకు కారణము "కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే" యని గీత జెప్పినది. అవిద్యలేదా కర్మయే లేదు; కర్మఫలసంజాతములగు జన్మమరణాదులు లేవు.

ప్ర॥ పరమాత్మ తానేమి చేయునపుడు జీవు డేల కర్మను జేసుకొని బద్ధుడగుచున్నాడు?

ఉ॥ జీవుడు పరమాత్మావిద్యలు మూడనాదులు. "అవిద్యోపాధికో జీవో మాయోపాధిక ఈశ్వరః", ప్రకృతికి స్వతః కర్తృత్వము లేకపోయినను జీవునకు నిజముగా భోక్తృత్వము లేకపోయినను యన్యోన్యాధ్యాసవలన తాదాత్మ్యసంబంధముగలిగి యినుమును గూడిన వేడివేల్పునకు సమ్మెట పెట్లబ్బినట్లు స్వవిచారములేనందున భ్రమాజ్ఞానముచే గమనాగమనములు, సుఖదుఃఖములు, యౌవ్వనవృద్ధాప్యములు, జన్మమరణాదులు రాత్రివేళ కదలెడిజలమున కదలు జలచంద్రునివలె బద్ధుడగుచున్నాడు. "యథా చ తక్షోభయథా" వడ్రంగి యులిబాడిసెవలన పనిచేయుచున్నను కర్తయు, నకర్తయుయగుచున్నాడు. జీవుడుకూడ నుభయథాకర్తగాను యకర్తగానున్నాడు. అవిద్యాతాదాత్మ్యసంబంధమున పుణ్యపాపముల కర్తయగుచున్నాడు. అవిద్య యున్నంతవఱకు నొకరికర్మకు తత్ఫలమునకు వారే కర్తలు.

ప్ర॥ జ్ఞానము చేయు పని యేమి?

ఉ॥ జ్ఞానము సూర్యునివంటిది. ఆత్మ పరమాత్మల యైక్యస్థితికి ప్రతిబంధమగు హృదయమునందలి యజ్ఞానమను చీకటిని పారద్రోలి సాక్షియగు కూటస్థుని ప్రకాశింపజేయును. "జ్ఞానం జ్ఞానవతామహమ్" జ్ఞానము పరమాత్మయే. అనాత్మవస్తువులైన దేహేంద్రియాది ప్రపంచమును, వానికి భిన్నమైన యాత్మను మాటిమాటికి వివేచించును. అనాత్మవస్తువులగు నహంకారాదులకు నాత్మకు గల్గిన తాదాత్మ్యసంబంధమనే హృదయ గ్రంథిని పూర్తిగా తొలగించి తిరిగిరాకుండ నశించిపోవునట్లు చేయును. ఆత్మపరమాత్మల యభేదమే జ్ఞానానికి విషయముకూడ.

ప్ర॥ ఆత్మజ్ఞానము లేదా బ్రహ్మజ్ఞానము గలవా రెట్లుందురు?

ఉ॥ "ఏకమేవాద్వితీయులై" స్వయంజ్యోతిస్స్వరూపులై, సర్వస్వాతంత్ర్యులై, గగనధునీతరంగములను డోలికల నూగుచు, పద్మనాళముల మెక్కుచు నానందించు పరమహంసవలె వ్యాపకమూర్తియగు పరబ్రహ్మసంద్రవారాశి యనుభూతులను స్వరూపవీచికల నూగుచు తన్మయులై, నిష్కల్మషులై మోక్షము తామేయై యుందురు. భావాద్వైతము, వాచాద్వైతము, క్రియాద్వైతమని మూడువిధములు. శాస్త్రజన్యజ్ఞానమున పరోక్షజ్ఞానముగల్గి దృఢాపరోక్షులుగాక యండ పిండబ్రహ్మాండముల వెలుపల లోపల పరమాత్మయగు నాత్మ యున్నాడని, కుక్కను కుక్కనుగా, స్త్రీని స్త్రీనిగ, పురుషుని పురుషునిగ, చండాలుని చండాలునిగ, గోవును గోవునుగ చూచుటయే భావాద్వైతము. మాటలు, వ్రాతలు, చదవటము, వినటము, శాస్త్రపఠనము నంతయు బ్రహ్మమే. బ్రహ్మముకన్న నన్యమేది లేదు. చేయువాడు చేయునది యంతయు బ్రహ్మమేననుట వాచాద్వైతము. సచరాచరము లోపల వెలుపల నిండి నిబిడీకృతమైయున్నది సచ్చిదానందబ్రహ్మమేనని పరోక్ష జ్ఞానమువలన హృదయగ్రంథి నిర్భేదింపబడి పంచభ్రాంతులు తొలగి త్రిదోషహరణత్వమున సదా తన్నుగానె జూచుచు, వాచా భావాద్వైతములవలె శూన్యక్రియ శుష్కవాదముగానిదై యొకరికొకరికి నేమేలుజే యుని వాచా, భావాద్వైతములనేగాక త్రికరణముల సర్వము బ్రహ్మమేనని

యనుభవైకవేద్యమైనది క్రియాద్వైతము. భావాద్వైత, వాచాద్వైతముల సమ్మేళనక్రియయే క్రియాద్వైతము. తెలుపు, నలుపు, ఎఱుపు, పసుపు నీలములుగల వస్త్రములలో గనిపించు తన రూపును వర్ణభేదములచే నెవ్వడైన ననాదరణ జేయునా? చేయడు. మఱెవ్వడైన నాక్షేపించినను యంతట నున్నదే నేనని యఖండత్వమున నిర్వచించును. శంకరుడు గంగా స్నానముజేసి విశ్వేశ్వరు నారాధింపవచ్చుచుండ నాదిశంకరుడు చండాల వేషమున కుక్కలతో తటస్థింపగా, తగులకూడదు నశుచియనే పూర్వ వాసన భావముతో "గచ్ఛ దూరం" యనెను. వెంటనే శివుడు వ్యాపక రూపుడగు చైతన్యాత్మను దూరము బొమ్మనెదవా? వ్యాప్యవస్తువగు దేహమును బొమ్మంటున్నావా? దేహబుద్ధితో బొమ్మనియెదవా? నాత్మబుద్ధితోనా? దేహబుద్ధితోనైతే రక్తమాంసమయ మలమూత్ర యుతమగు జడశరీరము నేను యనే యభిమానమును దూరముచేయక లేక దానియందే మిణుకుచు నశుచివస్తువే నేననుకొంటున్న నీకంటె నెయ్యది యశుచిగా జూచి మాట్లాడుచున్నావు. నీవు నేను ద్వైతమే. రాగము ద్వేషమే. నశుచియు రోతయే. అద్వైతము బోధించు నీకీ ద్వైతమెక్కడిదన తన పొరబాటును వెంటనే గ్రహించి "చండాలోస్తు స తు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ" యని మనీషాపంచకమును జెప్పికొనెను. శుద్ధబుద్ధితో జూచితే నశుచివంతులగు తనబిడ్డలు తనకెట్లు నింపో, తద్రీతి జ్ఞానికి నీవు నేను, నాది నీది, యది యిది, స్త్రీలు పురుషులు యనే ద్వైతము లేదు. బ్రహ్మాకారవృత్తితో తనమయమని నవ్వటము, తానొక్కడనేనని యాశ్చర్యపడడము, తానొక్కడే పెక్కురూపులని మురియుటయు యుండును. తన్నుమఱచి జాతిమతభేదముల నంధులైరేయని దుఃఖము. రాళ్ళలో బుట్టినను మణి మణియేకాని రాయి కాదు. జడమయమగు ప్రపంచమున తన్నేజూచు నిర్మలాత్ములాత్మ జ్ఞానులు. ఒకప్పుడు స్వామి వివేకానంద పాశ్చాత్యఖండమున నుపన్యసించు నపుడొకవేశ్య తాము యీదినము నాయింటికి భిక్షకు వేంచేయవలె నన్న స్వామి కొంచెము నిరుత్తరుడై యుండ వెంటనే నామె మహాత్మా! నిజమగు పరుసవేది దుకాణములోని యినుమునుమాత్రము బంగారునుజేసి కటిక వానికత్తిని బంగారుచేయలేదా? యన స్వామి యందులకు సంతసించి భిక్ష

గై కొనెను. రామకృష్ణు డీట్టివి యెన్నియో సమదృష్టిజూచెను. ఇక గాంధీజీ హరిజనవాడలలోనె దిగి వారి సేవలోనే యుండెను. కబీరు కుక్క రొట్టెను గొని చన వెన్నదీసికొమ్మని వెన్నంటెను. శిబి పావురమునకై తన మాంసము కోసి కిచ్చెను. ధర్మజుడు కుక్కరానిది స్వర్గమునకు నేను రానిననెను. కృష్ణుడు విదురునింట కుడిచెను. రాముడు శబరి యెంగిలిపండ్లు భక్షించెను; వానరులలో కలిసి వానరులిచ్చినవి భుజించెను. దేవునకే లేని యిట్టి భేద దృష్టి నేపండితునకున్న నతనిని గీత పండితుడనలేదు.

ప్ర॥ అటువంటప్పుడు వర్ణాశ్రమము లుండవలసినదేల ?

ఉ॥ చతురాశ్రమము లుండవలసినదే. వర్ణములులేని యేకైకకుటుంబ మైన నది స్వర్గమేకాదు, నిజముగు బ్రహ్మమే. కాని యనాదినుండి వచ్చిన వీసాంప్రదాయములు. బ్రహ్మాకారస్థితి మనస్సుబొంది నీ జీవిత మునసే సంసారమును జయించిన వారివలె నుందురా ? నుండలేరు. గుణ దోషాదిరహితముగు సమస్వరూపము, బ్రహ్మము సమదృష్టిగలవారు బ్రహ్మమును జూచుటయేకాని యన్యముకాదు. అన్యమైన జీవన్ముక్తి యుండదు. బ్రాహ్మీస్థితినిబొంది స్థితప్రజ్ఞుడై, మోహశూన్యుడైన ప్రతి హతమనస్కుడై, ప్రియాప్రియములులేక యథానోక్కరీతి బాహ్యవిష యముల నాసక్తి లేనివాడై, యంతఃకరణమున తద్వాసనలు సైతము లేనివాడై, సమాహితబ్రహ్మచిత్తుడై యక్షయముగు బ్రహ్మానందమునకు నధికారులు వారె; తద్గతివారిదే. అయినను ఆశ్రమములు మాత్రము మోక్షమనే యుప్పరిగకు సోపానములవంటి సాధనలు. అద్వైతస్థితిగల వారికి వర్ణాశ్రమములు వారిదృష్టిలో లేవు. లోకదృష్టిలో, శాస్త్రదృష్టి స్వదృష్టిలో లేనేలేవు. ఉన్నవనుట యదియే నవిద్య యవివేకత.

ప్ర॥ బ్రహ్మాండమంతయు పరమాత్మగాజూచుట కన్నులతోనేగదా ?

ఉ॥ కాదు; కాదు. ఊహాజ్ఞానముగాక, మనోరాజ్యముగాక, బుద్ధి వ్యాయామముగాక, స్వప్నవ్యవహారజ్ఞానముగాక, నింద్రియజన్యజ్ఞానము గాక, స్మృతిజ్ఞానముగాక నుత్తమమై, పవిత్రమై, త్రిపుటిరహితమై స్వరూపముతో బ్రహ్మాండాకారవృత్తి యేదో నదియే జ్ఞానము. దానివల్ల బ్రహ్మాండము పరమాత్మగా జూడవచ్చు. "దృష్టిం జ్ఞానమయీం

కృత్వా పశ్యేద్బ్రహ్మమయం జగత్" అని ప్రమాణము. అయ్యది శుద్ధబుద్ధివృత్తియే యగును. ఇదియే త్రినేత్రము.

ప్ర॥ సమదృష్టి గలుగవలెనంటె నే దోషములు నివర్తించవలె?

ఉ॥ అవును. వారే బ్రహ్మవేత్తలు. వారికి పునరపి సంసారముండు నది లేనిది వారికే తెలియును. వారి యంతఃకరణమె వారికి సాక్ష్య మిచ్చును. విషయసుఖములు నంతవంతములు దుఃఖమయములునని సూక్ష్మశరీరమునగల మలవిక్షేపావరణముల లేక నీషణాత్రయముల నివృత్తి బొందియుండవలెను. రాగద్వేషమోహము లేమాత్రమున్నను బ్రహ్మ మును గుర్తింపలేడు. ఏ మహానుభావుడు కామక్రోధాదులవలన గలిగెడి వికారములను నీజీవితమున మరణపర్యంతము సహింపగల్గుచున్నాడో నతడే యోగి, నానందమయుడగు పురుషుడు. అంతస్సుఖమును నవిరామ సుఖము, నాత్మానందప్రియుడై విషయసుఖము లనిత్యములని నృత్య గీతాదులుగాని, బాహ్యక్రియలగాని మరేవిషయసంజాలమువలన గాక నాత్మసుఖమునే జూచునో నాతడె నీలోకమునను బ్రహ్మమయుడగును. సుఖము గలిగిన దుఃఖముండగూడదు. దేనివలన పూర్ణసుఖము నొందెనో యది యాత్మసుఖమేగాని వేఱుకాదు. పుణ్యపాపవిముక్తులు, సకల సంశయరహితులు, సంయతచిత్తులు, సర్వభూత కల్యాణనిరతులు, సత్య ధర్మవ్రతులు, కామక్రోధవియుక్తులు, నాత్మజ్ఞులు నగు మహాత్ములు శరీరత్యాగమునకు పూర్వము తరువాతను వారికిమోక్షమే. పునర్జన్మము లేదు. అమృతమయులై, సిద్ధాద్వైతులై, స్థితప్రజ్ఞులై తము కన్న తలి దండ్రులకు, తామున్నస్థలమునకు, దేశమునకు, ప్రాంతమునకు తమ చతుర్పార్శ్వములనున్న భూతములకు,పితృదేవతలకు,గురువులకు,శిష్యులకు శుభమునుగల్గించి నుపద్రవము గల్గింపనివారై నెల్ల తపస్సుల ననుభవించు వారు నగుదురు.

ప్ర॥ విషయసుఖము లనిత్యములు వాస్తవమెకాని నిత్యసుఖమగు నాత్మసాక్షాత్కారమునకు మార్గమేది?

ఉ॥ ఇంద్రియములకు విషయములు, వీనిని గూడి కామము మనో బుద్ధులతో ననుభవింప కోరును. వానివలన పూర్ణశాంతి లేదని తెలిసి

కామయుత మనస్సును మోక్షోయుక్తమొనర్చి నాసికామధ్యమున దృష్టి నిలిపి ప్రాణవాయువుల సంచారమున సమానమొనర్చి మనసు బుద్ధి యింద్రియముల నొకటిగ నియమించి యిచ్ఛాభోగక్రోధములవీడి మోక్ష మొక్కటియే సదా ప్రాప్యముగ నెంచుయోగి సర్వదా బంధవిముక్తుడు. ఇదియే మార్గము.

ప్ర॥ ఈ మార్గము నంతరంగమునకు సంబంధించిన ధ్యానయోగమువలె నున్నది. ప్రాణనిరోధము సేయవలెననెదరా? భగవంతుని యుద్దేశ్యమేమి?

ఉ॥ వివిధబుద్ధులు, వివిధవాసనలు గలవారి కేది యవసరమో వాని నెల్ల భగవంతు డర్జునునకు వినిపించెను. ధ్యానము మనోనిరోధమునకు నాత్మసాక్షాత్కారమునకు ప్రధానమైనదియే. విక్షేపశక్తి నణచుటకును, విక్షేపము తొలగినది లేనిది తెలుసుకొనుటకు నిది సుమార్గము. తపో యజ్ఞములకు భోక్తగను, సర్వలోక మహేశ్వరునిగను, ప్రతిజీవులకు మిత్రునిగను, భగవంతుని యోగి గ్రహించి శాంతిని బొందుననెను. భగ వంతుడు 29 శ్లోకములుగల నీ యధ్యాయమున జ్ఞానకర్మయోగముల ప్రసిద్ధిని యర్జునునకు నెఱిగించి సకలయజ్ఞముల తపముల భోక్తను నన్నుగా దెలిసి నన్నే సర్వత్రజూచి పరమశాంతమును బొందుము. అన్యథా యశాంతి గలిగించుననెను. ముముక్షువులీ రహస్యములనెఱిగి కృత కృత్యులు గావలె. "తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి" నాత్మతత్వము నెఱింగిన నా ముక్తపురుషులు సదా ముక్తులే. వారే ధన్యులు, పూజ నీయులు, భవరోగనివారకైకస్వరూపులు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
కర్మసన్న్యాసయోగో నామ
పంచమోధ్యాయః

ఓం తత్ సత్

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## షష్ఠాధ్యాయము

### ఆత్మ సంయమ యోగము

★

క॥ తనకున్ శత్రువు బంధువులును దేరెందుల రిపువరులు బంధువులున్
తనకుందా న రక్షణమునకును నాశంబునకు ముముక్షువులారా!

ప్ర॥ పంచమాధ్యాయమున కర్మసన్న్యాసముల జెప్పుచు, భగవంతుడు కర్మయోగము శ్రేష్ఠమనెను. ఆరవయధ్యాయమున నర్జును డడుగకనే భగవంతు డేల ప్రారంభించెను?

ఉ॥ ఇయ్యది పతంజలి యోగశాస్త్రమును జ్ఞాపకము దెచ్చుచున్నది. నాలవాధ్యాయమున కర్మ యకర్మ వికర్మల విమర్శనే మరల ప్రారంభించి కర్మఫలముల వదలెడు జ్ఞానయోగులనుగురించి పంచమాధ్యాయమున జెప్పెను. ఈ యధ్యాయము నుపక్రమించుటలో విశేషమున్నది. ఏమన బ్రహ్మచర్యమునుండి సన్న్యసించినవారికి దృఢత్వము గల్గుటకు మనస్సు విషయముల బరువెత్తి వికలతను గల్గించకుండుటకై నంతరంగ సాధనగా నుపదేశించెను. అర్జును డడుగునేమోయని తానే ప్రారంభించి యతని సంశయముల దీర్చెను.

ప్ర॥ కర్మయోగి కానపుడు జ్ఞాని కేల నాత్మసంయమము?

ఉ॥ జ్ఞానినిగురించి కాదు, సంపూర్ణ జ్ఞాని కాగలవానికై నంతరంగ సాధన మొదలుబెట్టెను. ఆత్మ సంయమమన మనస్సును నిగ్రహించుటని యొకయర్థము. ఆత్మదర్శనమని యొకయర్థము. ఈ రెండు రూఢ్యర్థములే. నలుబదేడు శ్లోకములుగల యీ యధ్యాయమున 1 నుండి 4 వ శ్లోకము వఱకు కర్మసన్న్యాసములను పునరుద్ఘాటించెను. ఎవడు అవశ్య కర్తవ్యాకర్తవ్యములగు కర్మలను ఫలమపేక్షింపకుండ నాచరించునో యాతడె

సన్న్యాసి,నాతడే యోగి. కాని యగ్నిహోత్రాది శ్రౌతస్మార్తకర్మలను త్యజించువాడు సన్న్యాసికాడు, యోగికాడనెను.

ప్ర॥ భళే; వేదములు తనయందే బుట్టెనంద్రు. గీత తనహృదయము నుండి వెడలెను. వేదధర్మములు గీతాధర్మము లవినాభావసంబంధము గలవి. ఆయనకన్న జెప్పెడివాడెవడు కలడు? అగ్నిహోత్రాదు లిష్టకర్మలు సన్న్యాపేక్షలేని తపోదానాదులు పూర్తకర్మలు చేసియే తీరవలెనని భగవదాజ్ఞ మతేమనెను?

ఉ॥ సన్న్యాసమనుదానినే నిష్కామకర్మానుష్ఠానయోగముగ గ్రహింపుమనెను. ఆయన యుద్దేశ్యము సంకల్పముల త్యజించలేనిది అసలు కర్మనిష్ఠయందుగాని, లేక జ్ఞాననిష్ఠయందుగాని యోగి కాలేడని సమ్మకము. కర్మమును, సన్న్యసించినను కర్మఫలత్యాగ మొనర్చినను రెండు నొకటియే. ఎవ్వరికి మోక్షాపేక్షులగు నారురుక్షువులకు ఫల సంకల్పత్యాగ మీరెంటికి సామాన్యమగుటవలన నతడే సన్న్యాసియు, సంకల్పత్యాగము వలన నతడే యోగియగును కదా!

ప్ర॥ కర్మ, అకర్మ, వికర్మలన్నైననే భగవంతుడు తన యావద్విజ్ఞానము నుపయోగించుటకు కారణము.

ఉ॥ జననమరణ సుఖదుఃఖసంసారహేతువునకు కర్మయేకదా ప్రతి జీవునకు దాటరాని వారాశి. కర్మకు స్థానమేలేకపోతే భగవాను డింతదీర్ఘముగా జెప్పవలసియుండడు.

ప్ర॥ అయితే నీ కర్మరహస్యము జ్ఞానుల నుద్దేశించియేనా?

ఉ॥ పుట్టుకతో జ్ఞానులువేరు, యోగులువేరు. పుట్టుకకు కారణము కర్మయే. కర్మను వదలకుండ జ్ఞానమును బొందవలెనంటె నదియే యుపాయము.భగవంతుడందించిన ఫలత్యాగమనేయోగము,నీయోగము జ్ఞానులు కానివారెల్ల నాచరింపవచ్చు. జ్ఞానియైనను కాకపోయినను బంధములేదు. దత్తు వ్రాయించుకొన్న, పూర్తి యాస్తి యిచ్చినా యివ్వకపోయినా నాద్యుడు దత్తుపుత్రుడే. నీరుపోసి ముందుపెంచి చెట్టు బ్రతికితే పిదప ఫలము లివ్వనీ యివ్వకపోనీ యేఫలమో యొకటి తప్పదు. జ్ఞానము వచ్చువఱకు నందఱు యోగులే. నిష్కామముతో జేయక స్వర్గప్రాప్తికొఱకు గాని, సత్యలోక ప్రాప్తికొఱకు నాచరించువాడు యోగులే. అందువలననే

గీత మోక్షేచ్ఛగలవారల నుద్దేశించి చిత్తశుద్ధికొఱకు శాస్త్రము సన్న్యాసమని చెప్పుదానినే నిష్కామకర్మానుష్ఠాన సాధనముగ గ్రహింపుమనుచున్నది. సంకల్పత్యాగి కానివాడు యోగి యెట్లగును? జ్ఞాని యెట్లగును? మోక్షాపేక్షగలిగి జ్ఞానముకొఱకు సర్వసంగపరిత్యాగ మొనర్చి యేకాకియైనను సర్వకర్మఫలత్యాగియై కర్మచేయువాడైన నొకటే.

ప్ర॥ తామీ విషయము సులభముగా నర్థమగునట్లు వచింపుడి?

ఉ॥ కర్మచేయుటయు కర్మఫలానుభవముకొఱకే. కర్మను వదలితే కర్మ సంకరము లోకముయొక్క యావశ్యకతే నిష్ప్రయోజనమైపోవును. ఒక స్కూలున్నదనుకొ. నది యెట్లుండవలెనంటే చదివెడివారు చదువుచుండ, ప్యాసై పోవువారు ప్యాసై పోవుచుండవలె. రైలుజంక్షను యుంది బండ్లు వివిధములైనవి వచ్చుచుంటే పోవునవి పోవుచుండవలెను. దిగెడివారు దిగుచుండ నెక్కెడివారెక్కుచుందురు. లేకపోతే వాని రెంటి యుద్దేశ్యము పాడగును. ఆప్రకారము జీవుల నుద్దేశించినదియే జగత్తు. పుట్టువారు పుట్టుచుంటె, చనిపోయెడివారు చనిపోవుచుంటె నిందులో నున్నత స్థితిని నీచస్థితిని బొందేవారు బొందుచుంటే మధ్యమస్థితిలోనుందువారు, నిక నధమాధమస్థితిగలవారు, పుట్టుక లేకుండ బొయ్యెడివారు పోవుచుంటే నిది యొక లోకముగాని లేక కర్మబంధకారణమని యుచ్చనీచములకు కారణమని వదలివేస్తే దీనిప్రయోజనమే నాశమగును. పాఠశాలలో చదివి ప్యాసై యుద్యోగమునగాని మఱేరీతిగానో యుత్సాహవంతులగుచుండ ప్యాసు కాలేక నేడ్చువారేడ్చుచుంటే బొత్తిగా స్కూలునకు రానివారు రాకుండ యుంటే యెట్లున్నదో, మానవాశయముల కీలోకము వరప్రసాదము. మఱియు తమతమ స్వభావమూరకుండ నిచ్చునా? లోకమే సంకరమై పోవును. ఒకవేళ కర్మల త్యజించినంతనే యకర్మగాదు. కర్మ వాసనలు బొత్తిగ లేకపోతే నకర్మయగును. గొడ్రాలికి బిడ్డలు లేనంతనే సంతానమంటే కలిగెడు దుఃఖము పోయినదియా? కాదు. పిల్లలుండినను దుఃఖము లేనివారికి పిల్లలుండుటయే యానందము. ఒక్కడుగా నాటలయందానందము లేనప్పుడైదారు బొమ్మలనైనా తయారు జేసుకొనును. నలుగురు చెలికాండ్ర గూడితేనే యానందము చిక్కును. అయితే గొడ్రాలితనము దుఃఖహేతువా? సుఖదాయకము కాదా? యనవచ్చు. పిల్లలు లేకపోయి

నను వాసనాత్రయాదులులేకపోతేగా యానందము. ఆనందమున దుఃఖలేశ ముండనేరదు. పొయ్యిలోనుండు పచ్చికట్టెలున్న నెంతమండించిన నుండవు, వంటయుకాదు. సన్న్యాసము కర్మయోగములు రెండు వేఱువేఱుగా జెప్పబడినను రెండిటివలన నొకే ప్రయోజనమని గీతాచార్యులనుచున్నారు. అట్లైన జ్ఞానకర్మసముచ్చయము మోక్షహేతువు కాదందువా! పరంపరా సంబంధముచే మోక్షహేతువగునట్టే నిష్క్రియమైనజ్ఞాన, కర్మయోగస్థితి యొకటే నని నిరూపించినది గీత. భేదము శబ్దోచ్చారణములందప్ప ఫలమొక్కటియే.

ప్ర॥ గీతోపదేశము కర్మసన్న్యాసులకే కదా?

ఉ॥ అదొక్కటి పొరబాటు. సన్న్యాసులు, యోగులు మోక్షేచ్ఛగలిగిన వారలై తేనే వేషసన్న్యాసులు బాహ్యక్రియారూపమహిమాదులకొఱకో, పేరు ప్రతిష్ఠలకొఱకో, మతే యితరములకో ప్రయత్నించువారు యోగులు గారు. మోక్షముకొఱకే తమ సన్న్యాసము, యోగము తప్ప పేరుకొఱకే యగును. సమస్త మానవుల నుద్దేశించి గీత జెప్పబడినది. గీతను ప్రబోధించిన యచ్యుతుడు సన్న్యాసికాడు. అర్జునుడు సన్న్యాసికాడు. అనేకులు నాలాగు తలంచటము వాస్తవమే. వేదాంతగ్రంథములన్ని సాధువులకొఱకేననిరే. అయితే సాధువులంతా యెవరు? ఎక్కడనుండి వచ్చిరి? ఎపుడు సాధువులైరి? మొదలంతా సంసారులే. మోక్షముకొఱకు సాధువులుగావలె. అంటే మానవులకు వేదాంతగ్రంథము లనవసరమనలేదు. సర్వమానవులు జన్మించటము మోక్షముకొఱకే. సంసారము త్యజించటము సాధుత్వముకాదు. సాధుశబ్దమునకు స్వాదుశబ్దమున విశాలార్థమున్నది. స్వాదు అన తీపు. తీపునందభిరుచి లేనివారెవరులేరు. తీపంటే నందఱకు మక్కువే. ఆరు రుచులలో తీపున కెట్లగ్రస్థానము నీయబడినదో, సాధుశబ్దమున కంతకంటె నెక్కువ స్థానముగలదు. వేయేల? సాధుశబ్దమునకు వెల కట్ట నెవ్వరికి సాధ్యముగాదు. అది సత్యస్వరూపము, భగవద్రూపము. శరీరేంద్రియములు సాధుకావు. కాలములు, ప్రాణములు సాధుకావు. ప్రకృతివికృతులు సాధుకావు. దుర్మార్గులగాని, సన్మార్గులకాని సమాదరణ జేసెడివాడు, పృథివిలోని యే ప్రాణికి నపకార మొనర్పనివాడు అపకార మొనర్చె బుద్ధిలేక నొకవేళ తనకే నపకారము గల్గినను, సహించుకొనుట, యపకారమునకు నుపకార మొనర్చుట, చెడుతలంపులులేని నిర్మల,

నిష్కలంక, నిర్మోహ, నిరాడంబర బుద్ధికే సాధువనియు, నా బుద్ధిగల జీవునకు సాధువనెదరు. దిద్దిదీర్చిన స్ఫటికము పుటము వెట్టిన బంగారు మథింపబుట్టిన నవనీతము సమస్త పుష్ప మకరందముల నొక్కటిగజేర్చిన జుంటితేనియ షోడశకళల నిశాకరుడు. లోకబాంధవుడగు సూర్యుడు. సూర్యుడు లేదా వెలుగు లేదు. అంతయు చీకటియే. సకలప్రాణి విహారనివారణమే, లోకమంతా నిరుపయోగమే. అథవా సూర్యు డొక్క వెలుతురు నిచ్చేవాడే గాని కార్యకారణముల గుఱించి వివరింప లేడు. సాధువు పరలోక యిహలోకములను, దేవతలను, కర్మఫలములను, న్యూనాధికతలను, ధర్మాధర్మములను, పరమాత్మప్రపంచములను, దేహా త్మలనుగుఱించి, బంధమోక్షములగుఱించి వివరింపగలడు. ఆదర్శమూర్తి సాధువే లేకపోతే దేశముగాని, లోకముగాని, వివిధశాస్త్రేతిహాసపురా ణములు వేదములన్నియు నిష్ఫలములు. "న హ్యమ్మయాని తీర్థాని న దేవమృచ్ఛిలామయా" "తే పునంత్యురుకాలేన దర్శనాదేవ సాధవః" "సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం। సంభాషణం కోటి తీర్థం వందనం మోక్షసాధనమ్" పచ్చిపాపాత్ములనైన పరమపుణ్యాత్ము లనుగా తయారుచేయుటయు, పాపభూయిష్టమును పవిత్రమొనర్చుటయు మోక్షము నిచ్చుటకు గతి వారేగాని మఱెవరులేరు. విగ్రహములతో, తీర్థములతో, దేవతలతోగాని సిద్ధావస్థ నొక్కసాధువుచే తప్ప మఱేది యంతటి పవిత్రవస్తువులేదు. సాధువర్తనమునే నందఱు యనువర్తింతురు. జీసస్ ప్రవర్తన పాశ్చాత్యుల కందఱకు పరమప్రసాదమైనది. జీసస్ తనకు ప్రాణవియోగము గలిగించినవారి యజ్ఞానము తొలగింపమని దైవమును ప్రార్థించెను. ప్రతిక్రియ దలంపలేదు. మహమ్మదు ప్రవర్తనే మహమ్మ దీయులకు, సోక్రటీసునకు విషము బెట్టితే నానందమున భుజించెను. ప్రతీకారము దలంపలేదు. గాంధీజీ పడరానిపాట్లు పడి పరమాత్మయే ప్రపంచమని గ్రహించి ప్రపంచసేవయే పరమాత్మసేవయని నవిరళనవీన శ్రామికుడయ్యెను. వీరే లోకమాన్యసాధువులు. అలాటి సాధువులుగా తయారగుటకే గీత ప్రవచించుచుండు సత్యధర్మాదేశము. గీతోపదేశము వింటే సాధువులైపోయెదరు, సన్న్యాసులయ్యెదరు. సంసారము చెడును. సాధుదర్శనమే వలదు. ఎంతో పాపముజేసియుంటేనే యాదిక్కులేని స్థితి

రాగలిగేది. సాధుసాంగత్య మనవసరము. సాధు శబ్దము వినకూడదు. సత్రములలోనో, కుటీరములలోనో దిక్కు దివానము లేని రీతి సంచరించి బ్రతుకునకై, గృహస్థుల నాశ్రయించేవారి పాత్రే వలదను వారనేకులు గలరు. వినోదముకొఱకు నింద్రజాలికు డొనర్చిన వస్తువులు నిజమనుకొని యావస్తువుల ప్రేమించినవారిచందమున మిథ్యయగు జగత్తు నిజముగా దోవనార్జించిన వానివలన తమకేమొ నొకగొప్పమేరువు నెక్కినరీతి పామరులై, విషయాసక్తులై, భ్రాంతిమంతులై, తామార్జించువస్తువులు కల్పితములే, తమ దేహాదులు కల్పితములే, నియతములేనివి మాయాపరిణామములే నిజమని నమ్మినవారికి సాధువిషయము తెలియదు. సత్యవస్తువగు తన్ను తెలిసి కర్మను చేయుచుండుము. తానే పరమాత్మయనే దృఢాపరోక్షము గలుగువఱకు నిష్కామముగ కర్మలాచరించు పరమాత్మను తెలిసినంతనే దృఢజ్ఞానివై నంతనే సంసారము త్యజింపవలదు. సంసారము నాత్మజ్ఞానము లేనివానికి బంధముగాను, జ్ఞానికి సుఖముగా నుంటూ యున్నది. పాముతో జీవించువాడు పామును తల క్రిందనుంచుకొని నిద్రించును. తదితరులు దానిజూచి వెఱగుపడుదురు కదా! కష్టించి పనిచేయు వారితో పనిచేయలేనివానికెంత నాయాసమో, అట్లు వృత్తికోరికెల వదలని సన్న్యాసము, త్యాగములేని పూర్ణకర్మ రెండు నిరుపయోగములగును. ఇదియే గీతాసందేశము, మానవకల్యాణకరము, జీవితయాత్ర జరగటము. కర్మవదలుము, లేక చేయుము. బంధము లేక శాంతముగా నుండు మార్గము జూడు మనును గీత. ఒకడు చేతిలో నొక కుఱ్ఱవానిని, భుజముపై నొకని నెక్కించుకొని నడచుచు నితరులతో మాట్లాడుచు నానందముగనుండును. పిల్లలబంధ మతనికి గనిపింపలేదు. అదిచూచి ఆహాహా! ఎంతకష్ట మెంతకష్టము. పిల్లలమోయుట మేలా యనుకున్నవాని కందులోని యానందము తెలియదు. నిరంతరము వ్రాతయందే నానందముందు కవి కళలకూర్చుచునే యుండును. ఎండ, గాలి, వాన, మంచు, చలి, నాకలివంటివాని నన్నిటిని యోర్చుకొనుచు శ్రామికుడు పొలమునందే నీళ్లు త్రాగుచు, నాహారముగొనుచు, జేసినపనిలోని మంచి చెడ్డల గమనించుచు నానందించును. శిల్పి తన నైపుణ్యముచే సకల కళలమూర్తికి పోసి ప్రజానందమె తనయానందముగ నెంచును. కర్మ చేయ

కుండ నుండ నెవ్వరికిని సాధ్యముకాదు. పడవలోనుండి నదిలో పడి కొట్టుకపోవువానికి మధ్యలో బల్లను కొంగడివలె కనపించిన వస్తువు నాధారముతో గట్టుచేరెను గాని కొంగడికదా బ్రతికితినని దాని వదలిపోదా మనుకొన్న నది కొంగడి కాదు వెలుగుటచే నతనిని వదలదాయెను. అప్పుడతడు నేను వదలిన నిది నన్ను వదలదే యనుకొన్న రీతి కర్మఫలములగు వాసనలు కర్మచేయకుండ వదలినను నవి వదలవు. గీతాకర్మరహస్యమును గురించి యనేకవ్యాఖ్యాత లనేకభావముల మూలపదములకు విరుద్ధములేని రీతి వ్రాసిరి; వ్రాయుగలరు.

ప్ర॥ నిష్కామముగ కర్మ నాచరించుచుండ మనోనిగ్రహయోగ మెందుకు ?

ఉ॥ సంసారము వదలిన వారికొరకు కొన్ని సాధనములు చెప్పబడ్డవి. అవియు కర్మలే. బ్రహ్మచర్యమునుండి సన్న్యసించువారు, కొద్దికాలము గృహస్థాశ్రమమునవుండి త్యజించినవారు వరుసగా గృహస్థాశ్రమమునుండి వానప్రస్థ సన్న్యాసముల ప్రవేశించువార లందరికు నీ సాధనము లవసరములే. అయినను ప్రత్యేకించి శాస్త్రముద్వారా నేర్పరుపబడిన కొన్ని మార్గములు పతంజలికారుని యోగశాస్త్రమునకు సంబంధము. ఇచ్చట భగవంతు డాత్మసాక్షాత్కారమున కుపాయముచెప్పుచు తనకుతానే రక్ష, తనకుతానే నాశము బొందించుకొనుచున్నాడు. జీవుడు తన్ను రక్షించుటకొరకే తానే ప్రయత్నముచేయవలెనని 5 వ శ్లోకము నుండి 6 వ శ్లోకమువరకు జెప్పెను. తన్నుతాను రక్షించుకుంటే ననేకుల రక్షించగలడు. తాను వ్యాసైతే ననేక బాలబాలికల కుపాధ్యాయుడు కాగలడు. తాను పడవనడుపగలిగితే నందరి గట్టునకు చేర్చును. తానే మునుగగలడా? ఎవ్వరిని తేల్చగలడు. నన్నెవ్వడో రక్షించగలుగుకాడని యనుకోవటము యేమి తెలియక నూరకుండుటగాని తమాము చెడుదురు. ఈ త్రోవ దొంగలుండురన వారి బారిబడకుండ రక్షించుకొనేది సుఖము. తన్నుతాను రక్షించుకొనుటకు ప్రయత్నముచేయవలె. అంటే మనుష్యుల మేము నిద్ర, స్నాన, పాన, భోజన, రోగములకు నౌషధము, జీవితమునకు ద్రవ్యార్జనచే రక్షించుకొనుచున్నాము. దేహమును కాపాడుకొనుచున్నాము. ఇంక గీత క్రొత్తగ మాకు జెప్పేదేమున్నదని కొందరు.

అదికాదు ఆ యర్థము. దేహాభిమానియైన జీవుని సంసారమునుండి తేలికగ రక్షించుకొనవలెను. సంసార మన జననమరణాదులే. వీనినుండి విముక్తి లగుటకు గీతాదేశము తమ్ముపాయము రక్షించుకొనియేయుంటే దేహపోషణకు, రోగబాధకు, ముదిమితీరునకు, జన్మగర్భనరకములకు దుఃఖించుటేల? ఈలాటి దుఃఖములుండగూడదు. అలాటివి గల్గేటప్పుడు రక్షించుకోబడినామనుటేలాగు? పోలీసు కష్టడిలోనున్న మనుజుడు నేను యథారీతినున్నాననుకొనునుగాని స్వాతంత్ర్యమేది? ఎవరెంతటి వారైతేనేమి; పోలీసులకాదని మీరకలేరు. గోడకున్న యద్దమువద్ద నిలిచితే నీవేరూపువాడవని ప్రత్యక్షముగ మనరూపము జూపును. ఇది యద్దముయొక్క స్వధర్మము. గీతాశాస్త్రము నిన్ను నీవు జూడు; నీ వెవరో తెలుసుకో, క్షుద్రమైన దేహేంద్రియాదులా? లేక వీనికి విలక్షణవస్తువునా? కాదా? యని తెలుసుకోమనును. దృశ్యములు జడవస్తువులు లేవిగాను, ద్రష్టనగు చైతన్యాత్మనని తెలిసికొనవలెనంటే గీత యందించిన నాప్తవాక్యమునుబట్టి నీయొద్దయుండే కలుషితమైన యద్దమనే యంతఃకరణముతో నిన్ను జూడలేవు. చూడవలసిందేమి నా యంతఃకరణముతోనే నప్పుడు మనఃశుద్ధి యేకాగ్రతను గలిగించవలె. అదియె యోగమనిపించుకొనును. అద్దము మాలిన్యము తొలగనిది స్వరూపము స్పష్టముగా గనిపింపదు. అంతఃకరణమాలిన్యము తొలగనిది యంతర్ముఖము గాలేదు. ఆత్మాకారత నొందలేదు. అంతఃకరణశుద్ధి యేకాగ్రతనొందెనా, ఎదుటి ప్రపంచమును, దానియధిష్ఠానమును సులభముగా గ్రహింపవచ్చును. వివేకానందస్వామి యనెను: నీకై నీవు పుణ్యాత్ముడను, పాపాత్ముడను, స్త్రీని, పురుషుడను, పండితుడ, నవిద్వాంసుడ, నిర్ధనుడ, ధనవంతుడ, మూర్ఖుడ ననుకొని బద్ధుడవు, దుఃఖితుడవగుచున్నావు. నేను సచ్చిదానందుడ, శాశ్వతుడ ననుకొన నీకు బంధములేదు; దుఃఖమేలేదు. బంధమోక్షములకు కారణము నీయజ్ఞానమే ననెను. కావున నేను బద్ధుడననేది వదలి తనశక్తిని యినుమడింపజేసితే తెలియును. హనుమంతుడు తనశక్తి తనకు తెలియక నూరకగూర్చున్నపుడు నీవింత వానివని జాంబవంతుడన్నంతనే ద్విగుణీకృతశక్తుడై, నూరుయోజనముల సముద్రముదాటి, లంకజొచ్చి, సీతనుగాంచి, లంకగాల్చి, రావణునిజూచి

మాట్లాడివచ్చును. అంతయేల, నేనాట్టికైన నీవింతవాడవన్నపుడు గలిగే నాసక్తి యెక్కడిది? అదియే యాత్మశక్తి. అదియుంటేనే ధీమా! ఏ యింటిచిలుక కాభాష యను సామెత. తలిదండ్రులు, విద్యాగురువులు, శాస్త్రము చిన్నతనమునుండి ప్రతియొక్కరికి యుండియుంటే నీ యవస్థ వచ్చునదికాదు. చిన్నతనమున భయమంటె నెఱుగరు. పాములతో, క్రూరమృగములతో, వాపీకూపతటాకములతో లేనిభయము మధ్య వచ్చినది. ఇది రేయి, ఇది నూయి, ఇది అగ్ని, ఇది చీకటి, ఇది దయ్యము అని పెంపకముతో వచ్చిన మిథ్యాతంత్రమే బంధమైనది. ఆ భ్రమలే పాశములై, స్వేచ్ఛకు భంగము గల్గించినవి. ఏ యలవాటు వలన భవబంధకారకులైరో నా యలవాటును దప్పింపవలె. యోచించితే మనస్సు తప్పేమిలేదు. మనకు శత్రువు కానేకాదు. తెలియనిజీవుని ప్రవృత్తులే మనసున కలవాటైనవి. పశువు మంచిదే; పదిరోజులు దొంగ మేతకు వదలితే దానివలన నితరులచే వాదులొచ్చినపుడు పశువును నిందింతుము. కాని పశువు నాలాటి యభ్యాసపఱచిన దెవరు? చెడుగు యభ్యాసము మనమే మఱపి తుదకు దుఃఖముప్రాప్తింప మాకర్మ యందుము. ఆ కర్మ తనకు తెలియకకాదు. తొలుత నియమములేక తిండితీర్థముల నుపయోగించుటలో రోగములువచ్చును. తన్నివారణార్థము మందులేకనే యుపవాసమువలన నారోగ్యము నొందవచ్చును. అట్లే నీ యోగము అభ్యాసయోగమని వ్యవహరింతురు. వైద్యునిసలహా రోగికివలె, మహాత్ముల సందర్శనము, వారి యాశీర్వాదము వారిసలహాతో భగవత్కృపతో గీతామృతము సేవింప భవరోగము నివర్తించును.

ప్ర॥ మనస్సుతో భగవదర్పితమనుకొని బాహ్యక్రియల నేలాగైన చేయవచ్చునా?

ఉ॥ బాహ్యక్రియలు స్వధర్మమునకు శాస్త్రనియతములై కర్తృత్వ ముంచుకొని యాసక్తితో జేసిన వందువలన గలిగే ఫలభోగములకు తానే కారకుడగును. బాహ్యక్రియలైనను, యంతరంగచింతలైనను భగవంతునికే ఫలసహితముగ వదిలితేగాని లేక భగవంతునిసేవ భగవంతుని కొఱకేనని యొనర్చు కర్మఫలము మనకు బంధకారికాదు. రైలు మనలను, మనవస్తువులను మోసి మనకు భారములేనట్లు చేయుచుండ మనకెక్కడిది

భారము. తద్రీతి కర్మఫలములన్నియు భగవంతునకే సర్పింప మన యోగక్షేమముల నాయనయే జూచుకొనును. మనస్సాయన కంకిత మొనర్చితే చాలు.

ప్ర: చిత్తసంస్కారియగు జితేంద్రియు డెట్లుండును?

ఉ: 7 నుండి 9 శ్లోకమువఱకు నాతని లక్షణముల భగవంతు డర్జునునకు జెప్పెను. ప్రశాంతుడు, ఇంద్రియనిగ్రహుడు, సమస్తద్వంద్వముల సహించువాడు, పరమాత్మయందే స్థితమైనమనస్సుగలవాడు, శాస్త్రజ్ఞానమువలన త్రికరణముల ననుభూతిబడసి సంతృప్తినొందినవాడు, సమబుద్ధిగలిగి సదా యానందమున ననాసక్తుడై సుహృత్తు, మిత్ర, శత్రు, ఉదాసీన, మధ్యస్థ, విరోధి, బంధు, సదాచారి, దురాచారి వీరియందరందును బ్రహ్మబుద్ధిగలిగి రాగద్వేషశూన్యుడై యోగారూఢుడనబడు నట్టి తృప్తాత్ముడే యోగసిద్ధినొందినవాడు. ఈ లక్షణములు ప్రతియోగి యగువాడు తనయందున్నవియా లేవా? యని చూచుకొన్నచో తమ పొరపాట్ల దిద్దికొనగలరు.

ప్ర: యోగాభ్యాస నియమము లేవి? చిత్తమును యేకాగ్రత నొనరించు టెట్లు?

ఉ: 10 నుండి 18 శ్లోకమువఱకు నీ విషయమునే వినుము. చిత్తైకాగ్రతయన్నను చిత్తనైర్మల్యమన్న నొక్కటే. శ్రుతు లనేకము వినుటవల్లగాని, వినకపోవుటవలనగాని యిష్టాయిష్టకర్మలవలనగాని, బహుజన్మఫలవాసనాసహితకలుషితమైన చిత్తమును నిర్మలమొనరించుటె యోగము. "యోగశ్చిత్తవృత్తినిరోధః" యని పతంజలి. చిత్తనిర్మలములేనిదే ధ్యేయస్థితిగాని, జ్ఞేయస్థితిగాని నొందలేడు. అటువంటప్పుడు ప్రతీకములగు నిష్టదైవతారాధనలగాని, పరమేశ్వర సగుణనిర్గుణానుసంధాన మొనర్చుటగాని, లేక నాత్మనే గనుటగాని సాధ్యముకాదు. అతీంద్రియజ్ఞానలబ్ధపరమావధి నిలుకడలేక త్రిదవస్థల త్రికాలముల షోడశ వికారముల నొందు మనస్సు వృత్తిని విడిచి వృత్తినినొందునప్పు డెక్కడిది యవధి. అయితే నందుకై నేమిచేయవలెను? కన్నులు కొంచెము కనిపించనివానికి బొత్తిగా కన్నులే తీసివేసిన స్వారస్యముండదు. చికిత్సచేత కన్నులవలన వస్తువుల దర్శింపజేసుకొనవలెను. ప్రతిబంధకములగువాని బొత్తిగ తొల

గించ నన లుద్దేశ్యమే భగ్నమగును. అడుగడుగునకు నెదుర్కొన వలసిన ప్రతిఘటితవస్తువుల నేల నిర్మూలనివలెననిగాని, అవియేల నెదుర్కొన వలెననిగాని యనుటలో ప్రయోజనములేదు. వాని నెదురించుటలోనే మననేర్పు, మనయోగ్యత, మనకుశాంతి, పరమప్రయోజనము గలుగుచున్నది. ఆత్మవస్తుదర్శనమునకు చిత్తశుద్ధి యవసరము. అష్టాంగ యోగము లందుకొఱకే ననబడినవి. అసలు చిత్తమునే లేకుండజేయటము కాదు. అది మిథ్యావాంఛ. స్థూలదేహమును కనిపింపకుండ వాతపిత్త శ్లేష్మదోషముల రోగములువచ్చి బాధగలిగించిన నారోగనివారణకు వాతపిత్తశ్లేష్మముల సమస్థితికి మందు పుచ్చుకొందుము. మనస్సులో మలవిక్షేపావరణములను లేదా త్రిదోషములు, త్రిగుణములు, తాప త్రయములు, పంచక్లేశములు, వాసనాత్రయము, పంచమలములిత్యాదు లనే వానిని యంతఃకరణమునుండి తొలగించనంతవఱకు ప్రశాంతములేదు. వీనిని తొలగించు నుపాయమే యభ్యాసము. దీనియనంతరము చిత్తము నిర్మలమగును. గుఱ్ఱములగాని, యెద్దనుగాని, తొలుత నభ్యాసము చేయించకపోయిన మన కక్కఱకురావు. బాలబాలికల విద్యాభ్యాసమునకు, కార్మికుల శ్రామికాభ్యాసమునకు క్రమశిక్షణ యవసరము. క్రమశిక్షణ లేని సైనికులు పరాభవమునొందుట, నపజయమొందుట సత్యము. ఆకస మునకెగిరి సంచరించవలెనంటే పక్షులకు రెండు రెక్కలుండవలె; నొక్కటే యున్న సంచరింపలేవు. "అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః" అభ్యాస మునకు వైరాగ్యము తోడుపడవలె. వివేకవైరాగ్యములు లేక జిజ్ఞాస ముముక్షుత్వము పక్షిరెక్కలవలె నివి రెండు నొకటి వదిలేది యొకటి గ్రహించేది. ఒకటి నిషేధ, మొకటి విధాయకము. సాధకునకు నివి ముఖ్యములు. త్రోవ నడువవలసివస్తే కసవు కంప మొదలగువాని తొల గించుకుంటూ నేర్పఱచుకొన్న రస్తాన నడచెదము. త్రోవ సరిలేనిచో ప్రయాణము సాగదు. నదిలో నీదునపుడు నొకచేత నీటిని కడుపుక్రిందికి తీసుకుంటూ నొకచేయి నీటిపై ముందుకు వేయుచుండవలె. పారెడినదిని నీదుటకు నీ-యభ్యాసము కావలె. ప్రకృతిమయము ప్రపంచము. ప్రకృతి మయమే నింద్రియములు, విషయములు. ప్రకృతిమయమే సంసారము, చిత్తము. చిత్తమునందలి గుణస్వభావములు కర్మతో సహా ప్రకృతిలో

నానందము శాశ్వతశాంతియు లేవు. కావున మహాత్ములు ప్రకృతిశక్తుల నెదురించుటకు నీ యభ్యాసవైరాగ్యములు ప్రాధాన్యముగ తీసుకొని చీకటివెలుతురులులేని దివ్యపథము సాధించిరి. మోక్షమునకు ప్రకృతిశక్తు లెదుర్కొనుటయే కాదు. అనంతరతపస్కులలో ప్రకృతి నెదురించుచునే యున్నారు.

ప్ర॥ చిత్తైకాగ్రత పరమాత్మ సందర్శనమునకేనా యుపయోగము. ప్రతియోగము స్త్రీలు నాచరించవచ్చునా?

ఉ॥ స్త్రీ పురుషుల విషయము ప్రప్రథమముననే వివరింపబడినది. చేతనమగు నాత్మయే పురుషుడు. అచేతనములగు దేహములు స్త్రీ పురుషులనుట వ్యావహారికము. మోక్షము ప్రతియొక్క శరీరికి యవసరము. చిత్తైకాగ్రత నెవ్వరైన నొనర్చవచ్చు. ఏకాగ్రత యన్నివిషయముల నవసరమే. మిషను కుట్టువానికి నేకాగ్రతలేదా కుట్టు వేరై పోవును. చతుర్దశ విద్యలకుగాని, చతుష్షష్టికళలకుగాని, శరీరవ్యాయామమునకుగాని, పరిశ్రమములకుగాని దేనికైన నేకాగ్రత కావలసినదే. టీచరెన్నితూర్లుజెప్పిన నేకాగ్రతలేనపుడు బాలబాలికలు పలుమారడుగుచుందురు; చదివినవి జ్ఞాపకములేనివారై యుండెదరు. గుఱికొట్టుట, గురిగాల్చుట, గురిజూచుటకు నేకాగ్రత యుండవలె. రాజకీయవేత్త, మతప్రవక్త, తత్త్వవేత్త, భక్తుడు, జ్ఞాని, యోగులవంటివారందఱు నేకాగ్రతగలవారె. లౌకిక యలౌకికముల కన్నింటికిగూడ నేకాగ్రత యుండవలె. ఏకాగ్రతగలవాని పనులక్షరములు నచ్చులోవలె దిద్దవలసియుండదు. చేయుచు చేయుచు తన లక్ష్యమును మఱచినారా నిష్ఫలమగును. ఒకప్పుడు రామకృష్ణపరమహంస మహమ్మదీయమసీదున ఖాజీచెప్పుచుండ నందఱు ప్రార్థన జేయుచున్న సమయమున తాను వడిగావచ్చి ఖాజీచెంప నొకవ్రేటు చిన్నగ గొట్టెను. ఖాజీ తను గొట్టినాడని గల్లంతుసేయ తక్కిన మహమ్మదీయులెల్ల రామకృష్ణుని గొట్టరాగా నాతప్పు జూచి కొట్టుండి. మనమున్నది దైవస్థానము, మనము చేయునది దైవప్రార్థన. ఇట్టిసమయమున ఖాజీ మనకు చెప్పుచుండి యింటియందు ఆవునకు చొప్పలేదని చింతించుచుండె దైవప్రార్థన సమయమున నిది తగునా యడుగుడీ ఖాజీ యనెను. వార

డుగ నాయన నిజమేననెను. తెలిసినదా! పేరు గొప్పలో నేకాగ్రత కుదురదు.

ప్ర॥ నీవు చెప్పే విషయము వింటుంటే గుండె గభీలుమనుటయేగాక సంసారులకు నీయోగము సిద్ధించదేమోనని సందేహము గలుగుచున్నది.

ఉ॥ అట్లనవలదు. యోగాభ్యాసము, జ్ఞానాభ్యాసము లేనంతవఱకు నందఱు సంసారులే. మొదలే యోగులైతే నభ్యాస మెందుకు? మానవులకే నివి. మృగపక్ష్యాదులకుగాదు చెప్పియుండేది. ఇక భయమంటావా త్రోవ నడచువాడు త్రోవనడువ నిది యెంతదూరమోనని, చదువువాడిన్ని పుస్తకము లిన్నినియమములా యని, మందుతినువా డింత పథ్యమా యున్నాళ్లాయని, యుద్ధభూమి కరిగినవాడు యుద్ధమెట్లోనని భయపడుటయు, దిగులుపడుటయు వాస్తవమే. రామకృష్ణ, సోక్రటీసు, గాంధీజీ వంటివారు గృహస్థులేను; మన యర్జునుడు గృహస్థుడే. మఱియు బాహ్యాభ్యంతరముల నేకాగ్రతలేనిది యష్టావధానము, శతావధాన మిత్యాదు లెట్లుచేతురు. ఒకరూపుజూచి యాతీరు వ్రాసెదరు. ప్రాతబడిన వత్తుదు కాగితము యింకిని బీల్చలేదు. దోషరహితముగాని చిత్తమున కేకాగ్రత యుండదు. ఏకాగ్రతలేనిచో నేది జ్ఞాపకముండదు. అందుకు నియమము లుండవలె. ఏశాస్త్రముగాని, పఠితలకు సాధకులకు వస్తువిషయమగు పరోక్షజ్ఞానమును సాధనవిధానమును ప్రసాదించును. ప్రతియొక్క ప్రవృత్తికి శాస్త్రముండియే యుండవలె. జీవవ్యవహారమును సంయుత మొనర్చుటకుగాను శాస్త్రము విధినిషేధముల వివరించును. ప్రకృతినుండి నివృత్తిమార్గమునకు గొనిపోవుటయే శాస్త్రోద్దేశము. స్వాభావికముగ నుపక్రమింపని కర్మముల నాచరింపజేయుటకు శాస్త్రము విశేషముగ ప్రయత్నించును. త్రోవవంటిది,యర్థమువంటిది శాస్త్రము. శాస్త్రములన్నియు దుఃఖనివృత్తికి మార్గములే యగును. ఈ మార్గము లనుసరించియే మహాత్ములందఱు తమతమ ప్రవృత్తినుండి నివృత్తికినడచి నిర్మల సదనము గనిరి.

ప్ర॥ కొందఱు భక్తిచేతను, కొందరు కర్మయోగముచేతను, కొందఱు జ్ఞానయోగముచేతను తదితరమార్గముల ముక్తిబడయుచుండ నీ ధ్యానయోగమేల?

ఉ॥ నీ నోటినుండి నీవె యనుచున్నావు ఒక్కొక్కరికి నొక్కటి ప్రియమని. భగవంతు డీవిషయమును పదమూడవాధ్యాయమున 24 నుండి 25 శ్లోకములవఱకు నెవరెవరి కేది యుచితమొ నా మార్గమున నన్ను బొందవచ్చుననెను. దుకాణములో మనకు కావలసినవియే యెందు కుంతురు. ఇతరులకు కావలసినవీ యుంతురు. డాక్టరొకని కిచ్చేమందే యెందుకుంచుకొనును. దేనికెవ్వరర్హులో వారికి నాయామందు లుంచును. యూనివర్సిటిలో నెవ్వనికే విద్యయవసరమొ నదియే జెప్పుదురు. ప్రపంచమున జన్మించిన మానవులంతా నొకేబుద్ధి, ఒకేస్వభావముగలవార లెక్కడుందురు? తలకొక స్వభావముండును. అందుకై దర్శనషట్కముల నభిప్రాయమును, ఉపనిషత్తుల సారాంశమును బిండి పాకమొనర్చినది గీత. ధ్యానయోగము నందఱువిని చదవవలసినదే. అవసరమైనవా రుపక్రమింపవలసినదే. కోరికలేక నిర్జనస్థలమున నేకాకియై, నపరిగ్రహుడై దేహమును, వాక్కును, మనస్సును నొకేస్థితి నుంచవలె. కూర్చొనుస్థలము హెచ్చు తగ్గులులేనిదిగను, మంచిగాలిగల పవిత్రస్థలము, నీరుగలిగి పుష్పలతాదుల తోటి వృక్షములుగలదియునునగు స్థలమున దర్భ, దానిపై జింకచర్మము, దానిపై మృదువైన వస్త్రమును, స్థిరాసనముగ నిర్మించి యందాసీనుడై, బాహ్యేంద్రియకార్యములను నిరోధించి యేకాగ్రమనస్కుడై చిత్తశుద్ధి కొఱకు యోగము నభ్యసింపవలెను. మేరుదండమును, కంఠమును, శిరస్సును స్థిరముగ, సమానముగ నిలిపి కదలక దిక్కులుజూడక నాసికాగ్రమున దృష్టిని నిబద్ధమొనర్చి ప్రశాంతచిత్తుడును, భయరహితుడును, బ్రహ్మచర్యవ్రతుడై మనస్సును నియమముగ భగవంతుని యందుంచి భగవదాకారము జేయవలెను. ఇట్లు నిరంతరము సమాహితచిత్తుడై మనస్సును సమాధానమొనర్చి నాయధీనమగు, నిర్వాణమగు శాంతిని బొందునని భగవంతుడు.

ప్ర॥ బాగుగ భుజించువారికి, నింద్రియభోగము లనుభవించువారికి యోగనిష్ఠ కుదురదా?

ఉ॥ వాంఛ కాయాహారనిద్రాభోగములే తెలియును. యోగఫలము తెలియదు. మిక్కుటముగ భుజించుట, బొత్తిగ తినకుండుట, యెక్కువ నిదురించుట, అమితముగ మేల్కొను వారికి ధ్యానము కుదురదు.

పరిమితాహారవిహారములు, జపతపప్రయత్నములుగూడ కర్మలపరిమితము, నియతములగు నిద్రామెలకువలు గలవానికే ధ్యానయోగము సిద్ధించును; సంసారదుఃఖమునుండి విముక్తుడగును. ఇహపరలోకవాంఛ భోగలాలసత నుండి విడివడి నిస్పృహచిత్తుడై, యాత్మయందే జొక్కినవాడై యుండవలెను. గాలిలేనిచోట దీపశిఖవెలిగినట్లు చంచలములేని చిత్తముతో ననుభవించిన విషయములనుండి మరలినదై తిరిగి వానిని వాంఛించదో, నే స్థితియందు చిత్తము శుద్ధమై నాత్మచైతన్యమునే దర్శించుచు పరితుష్టి నొందుచుండునో మఱియు నే స్థితియందు యింద్రియవిషయనిరపేక్షతయు, బుద్ధిగ్రాహ్యము నతీంద్రియమునగు ననంతసుఖము ననుభవించునో, ఏ స్థితియందుండిన నాత్మతత్త్వమునుండి యణుమాత్రమైన తొలగి చలింపడో నది ధ్యాననిష్ఠ. 19 నుండి 28 వఱకు ధ్యానము సమాధిలక్షణము భగవంతు డెఱిగించెను. ధనముగాని, విద్యగాని, రాజ్యముగాని, యాత్రగాని, మఱేవిధభోగములుగాని యోగస్థితిబొందిన మహాత్మకస్థితి దలపునకు వచ్చును. ఆత్మస్థితి బొందెనా దుఃఖములులేనిది, గుణములులేనిది, యింతింతని యనరానిది, రూపనామములులేనిది నిరతిశయానందము నొందెనా, శస్త్రనిపాతము శీతోష్ణాదులవలన గలిగెడు మహాదుఃఖమును గూడ లెక్కించడు; చలించడు. ఇతరలాభముల గోరడు. దుఃఖముయొక్క యాత్యంతికనివృత్తియగు నా స్థితిని యోగమని గ్రహింపుము. విసుగులేని చిత్తముతో పట్టుదలబూని నీ యోగము నభ్యసింపదగును. సంకల్పమువలన గలుగు కామములనన్నిటిని సంపూర్ణముగ త్యజించి మనస్సువలన నింద్రియసమూహమును సమస్త విషయములనుండి మరలించి ధైర్యముతోగూడిన బుద్ధితో మనస్సును మెల్లమెల్లగ నుపరతమొనర్పవది. మఱియు నాత్మయందు మనస్సునునిల్పి మరేమి చింతింపవలదు. చంచలమగు మనస్సు స్థిరముగ నొకచోట నుండునదికాదు. ఏయే విషయములకూ పరుగిడుచుండును. నాయావిషయములనుండి మరల్చి నాత్మయందే స్థిరమొనర్పవలెను.

ప్ర॥ అబ్బబ్బా! ఎంత కష్టమెంతకష్టము. నిజము. ఈ మనస్సును నిరోధించు టసాధ్యమే. మనస్సువశము నిలుకడలేదా అదియే దుఃఖము, బంధము నగును.

ఉ॥ కష్టమని, దుస్సాధ్యమని వదలితే నిక యోగిగలిగియే. శ్రోతా శూన్యతగలిగెనా, చిత్తము ప్రశాంతమునను. నిష్పాపుడాయెనా, బ్రహ్మభావుడగు యోగియే పరమసుఖమునందును అందుకై సర్వదా యోగయుక్తమొనర్చి నిష్పాపుడైన యోగియే ననాయాసముగ బ్రహ్మా నుభూతిని బొందును. భగవదాకారస్థితియందు నైతిననికాని, కాలేదనే ద్వంద్వములుండవు. దేహము వచింపలేదు. చిత్తము నన్యవస్తువును తెలియలేదు. తీపులో కలసిన మరొకపదార్థము తీపురూపమై తన సహజ భావ మంతరించును. భూమణములన్నింటిని కలిగింప నేకమై బంగార మగును. కావున నేకాగ్రత స్త్రీలకు, పురుషులకు, గృహస్థులకు సన్న్యాస బ్రహ్మచర్యాలాదివారికండటకు నవసరమే.

ప్ర॥ శరీరము దినదినానికి వృద్ధావ్యస్థితికి వచ్చుచుండును. అపు డేలాగు ?

ఉ॥ వృక్షము ముదుసలిదగుచున్నను వి త్తనమగుటలేదు. శుక్లశోణిత ములు రెండుచేరి వృద్ధిబొందుచువచ్చి కరచరణాద్యవయవము లేర్పడు నప్పటికి జ్ఞానమెట్లు వచ్చునో, నీ శరీరము ప్రాతదియగుచుండేకొలది సంస్కారపరులచిత్తము నాత్మాకారత నొప్పియుండును. అందువలన దానికి యభ్యంతరములులేవు. భగవంతునియందు లేదా అఖండాత్మయందే మనస్సు నుంచవలెను.

ప్ర॥ గాలివలె, సముద్రలహరలవలె నిలుకడలేని యీ చిత్తము నాత్మ యందు నిలుచుటెట్లు ?

ఉ॥ ఆకసమున చాలా పైభాగమునకుపోను గాలి బొత్తుగా లేక పోయిన వస్తువు తనంతనిల్చును. అవస్థాత్రయ విలక్షణమై త్రికాలా బాధితంబగు నాత్మయందు నొకతూరి యాత్మస్థితినొందిన మనస్సు విషయములపై పరుగెత్తదు. ఇంటియందు సమృద్ధిగ మేతయబ్బిన పశువు పొడత్రాదుద్రెంచుకొని యన్యపైరు సమీపమునసున్నగూడ మేయబోదు. తృప్తిగలిగినమీదట తక్కినవస్తువులు సమీపమునసున్నను వానియందు మమత గలుగదు. ఇదిగాక నగ్ని మ్రింగవచ్చు, గాలి బట్టవచ్చు, నాకసమున కెగబ్రాకవచ్చు, సింహముతో నాడవచ్చు, విషము నైన హరింపవచ్చు, నిక నేమైనజేయవచ్చునుగాని మానసమును నరికట్ట

సాధ్యముకాదు. తనకిష్టమున్న, లేకున్న మనస్సుమాత్రము కాలమును కొనక, దేశమునుకొనక, యుచ్చనీచములనుకొనక, విధినిషేధములనుకోక ధర్మాధర్మముల లెక్కింపక నెదుటివారికి నేమిజేయునట్లు శరీరావయవములు గనిపించిన శాంతింపదు; శాంతింపదు. శాంతింపదని మానటమా? దుర్బలతయగును. శత్రువును సామదానభేదదండోపాయముల జయించు రీతి దీనినిగూడ స్థైర్యముతో నెదుర్కొనవలెను. అప్పుడు మెల్లమెల్లగ నాత్మాభిముఖము కాగలదు. అట్లు లేనిచో మహాత్ములంద తేమగుదురు?

ప్ర॥ దానిని జయించుట కభ్యాసవైరాగ్యము లేనా ఉపాయములు, మరేమైన గలవా?

ఉ॥ కుఱ్ఱవానికి చదువురానిది మనకు తెలియును. మొదట స్కూలునకు వెళ్లగలయభ్యాసముచేసితే తదనంతరమువాడే చదువును; దానివల్ల విజ్ఞానము నార్జించును. విత్తనములు భూమియందు పూడ్చి మొలకలెత్తి మెల్లగా వృక్షములై తమంతనాహారము దెచ్చుకొనునంతవఱకు నీరు పోయవలె. ఉపయోగములు కావని శాస్త్రము జెప్పువానిని వదలించి వ్యావహారికముల పామరజనభేదవాదజనగోష్ఠి వదలవలె. శబ్దస్పర్శరూప రసగంధము లను విషయసుఖములకై పరువెత్తు మనసును నావంకకుపోకుండ నందులేశమైన సుఖములేదని తెలుసుకొనవలె. ఏయే యలవాట్లవలన రాగద్వేషభయసందేహదుఃఖములు గల్గుచున్నవో నా యలవాటుల దప్పింపవలె.

ప్ర॥ మీరన్నట్లు లౌకికముల కలవాటుపడిన మనసు నలౌకికమున నిల్పుట కష్టమే. పురాణహరికథలిత్యాదులు వినుచుంటే నిలుచునా?

ఆ॥ మంచిదేకాని యాలాటివి ప్రతినిత్యము కాలక్షేపము చేయువారున్నారు కదా! వారికి మనస్సు పారిశుద్ధ్యమగుటలేదు. శాంతించుట లేదు. పట్టుదల, సహనము, నిర్వ్యాజము, నిరాడంబరము, సత్కర్మ, సద్గోష్ఠి ఇత్యాదులవలన చిత్తము శుద్ధియై నంతర్ముఖమగును. సీత క్రూరరాక్షసులలో నుండికూడ రాముని మఱువలేదు. విశ్వామిత్రుని ద్రఢిమ మెన్నితూర్లు తపోవిఘ్నమైనను, బ్రహ్మర్షిత్వము సాధించేవఱకు విడువలేదు. ధ్రువుని ధృవత్వము నంతియే. అంతయేల నానాజాతి, నానా

మతములు,నానారాజులుగల భారతదేశమునుండి యాంగ్లేయుల పారద్రోలి దేశమునకు స్వాతంత్ర్యము బడయవలెనంటే మహాత్మాగాంధీజీ తక్కిన నాయకులెంత ప్రయత్నమొనర్చి సాధించిన దెఱుగమా! ఎందఱు చచ్చి రెందఱు జయిలులో పడిరి. కాని తుదకు స్వాతంత్ర్యము దక్కెను. "నాస్తి శ్రద్ధాసమం పుణ్యం నాస్తి శ్రద్ధాసమం తపః" అని శ్రద్ధాభక్తి యనే సాధనలు విశ్వాసముతో నుండవలెను. నామస్మరణ, దివ్యతీర్థసేవ, తీర్థస్నానము, మహాత్ములదర్శనము, శక్తికితగిన దానము, సమస్తభూతముల యనురాగము, నపకారికి నుపకారము, మృత్యువును జ్ఞాపకము చేయటము, తుదిగతుల విచారించటము, చేసిన స్థితిగతుల సింహావలోకనము జేయటము వివిధములగు నుపాసనలచే చిత్తమున కేకాగ్రత గల్గును. ధ్యానమును మొసగించి నిద్రవచ్చును. అది సమాధియని కొంద ఱందురు. కొంతమంది ధ్యానమునుండి క్రిందపడటము, ఏడవటము, అరవటము, అవులించటము, పాటలు పద్యాలు చెప్పెదురు. మేము సమాధి నొందితిమని యనుకొనెదరు. మఱికొందఱు గురకపెట్టి నిద్రించుచు,మేమెంతసేపైన నిష్ఠలోనుందు మనుకొనెదరు. మఱికొందఱు గ్రుడ్లు నిక్కబెట్టిచూచుచు నంతయు నదృశ్యము యున్న దేవచలమందురు. తొలుత ధ్యేయస్థితి, పిదప జ్ఞేయస్థితి నీ రెండే సగుణనిర్గుణములు. సగుణఫలమే నిర్గుణము. చిత్తము పంచావస్థల గూడినది. రజోగుణప్రధానమై సుఖదుఃఖాది విషయముల చంచలతగలది క్షిప్తము. ఇది దైత్యదానవులగతి. తమోగుణప్రధానమై కృత్యాకృత్యవిమర్శనాజ్ఞానవివేచనలేక క్రోధాది యంతరంగ కార్యముల ప్రవర్తించిన మూఢము. ఇది పిశాచరాక్షసులది. సత్వగుణాధిక్యమైన భోగశాంతజ్ఞానసాధనలయందు ప్రవర్తించునది విక్షిప్తము. ఇది దేవతలకు గలుగును. బాహ్యవిషయముల నేమాత్రము ప్రసరింపకనుండునది యేకాగ్రము. వృత్తులులేనిది పూర్వసంస్కారము లొక్కటిగూడ లేక నిష్కలంకమైనది నిరుద్ధము. ఇది యొక విధము. ధ్యేయాకారముగ త్రిపుటితోనుండు ద్వైతస్థితియే సంప్రజ్ఞాతసమాధి. కార్యసహిత యజ్ఞానము జ్ఞానముచే బాధింపబడినపుడున్న స్థితి యసంప్రజ్ఞాతసమాధి. దీనియందు జ్ఞాతృజ్ఞేయజ్ఞానములను త్రిపుటిగూడ లేనిదై యుండును. నిర్బీజము నగునిది నిదిధ్యాసనముయొక్క పరిపక్వావస్థయేగాని పృథక్‌సాధ

నముకాదు. సమాధి నిదిధ్యాసనముయొక్క సంతర్యాతమే, వేఱుకాదు. చిత్తము నిద్రబొందితేనే శరీరము క్రిందపడటము మొదలైన వికారములు గల్గును.

ప్ర॥ చిత్తమునకు నిద్ర గలదా?

ఉ॥ అవును. నిదురయన తన మూలస్థానమున గలియుట. అనగా మూలావిద్యలో జేరుట. స్వప్న జాగ్రత్తి, స్మృతులులేని స్థితియే నిదుర. ఇట్టి నిద్రగలిగితేనే దేహేంద్రియములకు జీవకళ లుట్టిపడ ప్రకాశించును. ప్రపంచమున నిదురయే లేకుండ బహుదినాలు తిరుగుచు పనిచేయుచుందురు. ఆ పనులలో తలంచినదేదో లభించేవఱకు చేయుచుందురు. అయితే నది లభించినదా లేదా యని గమనించటము లేదు.

ప్ర॥ అనుకున్న తలంపేది యనెదరు?

ఉ॥ పరమసత్యమగు పరమగతియగు పరిపూర్ణసుఖము లేక నానందము.

ప్ర॥ చనిపోతే నేకష్టములేదు. అప్పటిస్థితి సుఖముగాదా! శరీరముండగ లేకపోయిన సుఖము మరణించిన కలుగుట కాదా!

ఉ॥ శరీరము చనిపోతే గలుగునది యానందమనునది యెవరికి తెలుసును. ఆ యానందానుభవమును గుఱించి యే ప్రమాణము లేదు. చనిపోయిన వానిసుఖము బ్రతికిన వారికెట్లు తెలియును. జాగృతిలో నెవరికో కడుపు నిండితే నాకు కడుపు నిండినదని యెవడైన ననగలడా! చనిపోతే నానందము గలిగితే దేహము దహించటమేల? పూడ్చుటేల? సుఖము చనిపోయిన దేహమునకా లేక నింద్రియములకా; చనిపోయిన దేహముద్వారా సుఖమొందు వాడెవడులేడు. దేహము శవమైనది. ఈ దేహముండగ సుఖమును బొందవచ్చు. క్షణభంగురమైన నీ దేహము పోకమానదు. అయితే నమరత్వమొందునది దేహముకాదు. "సుఖమాత్యంతికం యత్తద్బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్" అన్నది గీత. ఇంద్రియములచే తెలియబడని శుద్ధబుద్ధితో గ్రాహ్యమగు సుఖము చనిపోతే పొందగలమా! ఇట్టిది లభించిన నన్యమొకటున్నదని యెంచరు. సమస్తానర్థకముల కారణ విధ్వంసమే యోగమనెదరు. లేక సాధన భూమిసాగుచేసినచో సస్యఫలకాది యగును. సాగులేదు. పంటలేదు. బుద్ధిశుద్ధిలేదు. సుఖములేదు. అపవిత్రస్థలమున నిర్మించు నెట్టి కట్టడములైన నివాసయోగ్యములు కావు. కాని

విగ్రహముగా దీర్చ పూజనీయమైపోవును. పద్యగద్యముల సుమధుర శృంగారరసముల గూర్చు ప్రజల కెంత ముచ్చటగునో విన శ్రావ్యముగా నుండును. వీధులన్నియూడ్చి పరిశుభ్రమొనరింప చూడవేడుక నింపుగా నుండును. ఈ ప్రకారము యిది నాయిల్లు, నా సకలసంపదలు, నా దేశము, నా ప్రాంత్యము, నాదేహము, నావర్ణము, నామతము, నావారు, నా గ్రామము, నాసేర్పు, నాగొప్ప, నాతీరు యనే కర్తృత్వాభిమానముతో రాళ్లు చుట్టి లేకనే కోటల భూమిమట్టమునకు పడదుడిపినగాని, కాంతులు దూరమొనరించి ఫలముల నీటవదలి బాధ్యతలకు స్వస్తిజెప్పి, నిర్మోహముగ మనస్సుననుండి వానినన్ని వదలితేగాని కుదురు దొరకదు. అగ్ని శేషము, ఋణశేషము, శత్రుశేషము, వాసనాశేషములున్న మరల వృద్ధినొందక మానవు. శేషములేకుండజేయ నిర్విశేషమగును. త్రోవట ద్రోసిన కాష్ఠము నుసుపువలె, దగ్ధబీజమువలె, కాలీసంచివలె, శుద్ధియైన గ్లాసువలె, కోరికెలులేనిదై మనస్సు యలసటలేని అహంబ్రహ్మాస్మి యనిగాని, శివోఽహం యని, ఆనందోఽహం, అఖండోఽహం, అభేదోఽహమ్మనిగాని యుండినపుడు స్థావరజంగమములయందు సమదృష్టి ప్రాప్తిస్తుంది. ప్రతిదృశ్యము తనకంటే నన్యముగా దోచదు. ఇదియే బాధ, సమానాధికరణము.

ప్ర॥ భగవంతు డీయోగము నంతరంగసాధనగాజెప్పినది సత్యమేగాని, దీనిని సాధించుట కష్టము. మఱేమార్గములైన గలవా?

ఉ॥ నారదుడు కైలాసమునకు వెళ్లునపుడు దారిలో తపస్సుచేయుచు ధూళిధూసరితములచే గప్పబడి వాల్మీకివలెనున్న తపసి నారదునిగని రాబిలిచి యతని గమనమెఱిగి యా శంకరునితో నే నిట్లెంత కాలము తపించవలెనో, తానెన్నడు ప్రత్యక్షమై యభీప్సితములనిచ్చునో తెలిసికొని పోవునపుడు చెప్పుడనెను. నారదుడు సరేనని మఱికొంతదూరము పోవ రెండుపాదములు నొక చెట్టుకొమ్మకుతగిలించి తలక్రిందుగ తపస్సుచేయు నాతడు నారదుని చేరబిలిచి నేనెంతవఱకు నిట్లుండవలెనో తాము కనుగొనివచ్చి శెలవిమ్మనెను. అచ్చటనుండి కదలగా కొంతదూరమున కౌపీనధారియై నిలిచినచోట నిలువక, కూర్చొనక, పరుండక, నిద్రించక, మలమూత్రముల విడచుచు దొరికినదానితో తృప్తిపడునతడు నారదుని,

గని, చేరబిలిచి తన వర్తమానముచెప్పెను. నారదుడు మంచిదేనని కైలాసమునకరిగి నీ మువ్వుర వృత్తాంతముజెప్పెను. కైలాసపతి తనతో జెప్పిన వార్తను తిరిగివచ్చి మొదటివానికి, నీకు నిక పదిసంవత్సరములకు గాని దర్శనమీయ నన్నాడనెను. ఆత డందులకు చాలా నాయాసపడి వేడినిట్టూర్పువిడిచి కరుణలేని శంకరుడు నేను చాలాకాలము భరించ లేనేమొ చావనున్నాననుచు నిక గడువుపెట్టెనా ? యని నిరుత్తరు డాయెను. మధ్యమునివద్దకువచ్చి నీకు నైదేదులు గడువుపెట్టెను. అటు మీాదటగాని ప్రత్యక్షము గాదట యన నతడు కన్నుల నీరురాలువుచు పాదములగతి జూపించెను. కాయలుగాచి నవిసిన వెంతనిర్దయుడనెను. మూాడవవానితో నల్లదిగో నాకనిపించువృక్షమునకు నెన్నిపత్రములున్నవో నన్నిసంవత్సరములకుగాని శంకరుడు దర్శనమీయడట యనెను. అతడు నగుచు, పరుగెత్తుచు నారదా! భగవానున కెంతదయ, యెంతదయ యనుచు నశాంతిగాని, అతృప్తిగాని, నిస్పృహాగాని, భేదముగాని నొందక నానందమున నెగురుచు బోవుచున్న నతనికి నా దినముననే శంకరుడు ప్రసన్నుడై నభిమతము లొసగెను. చూడు సాధనలందు మొండిపట్టుదల, అభిమానము, నాయాసము కనపఱచటము నభిమత ఫలదూరులయ్యెదరు. పట్టుదల యెందుకో కొద్దికాలమునకు సడలిపోవును. హిందూదేశమున మొండిజాతి యనువారు నాగదారికల్లపై వెల్లకిలబరుండి యెండలో నఱచుచు శరీరమును కత్తితో రక్తమువచ్చులాగు కోసికొని యార్భాటముచేసి భిక్షబెట్టించుకొనేవారు. అందువలన మొండివాండ్రం దరు భిక్షబెట్టనిది పోనేపోరు. ఆ విధముగా సాధనలనే బుద్ధితో నెట్లు ఆచరించితే నట్లు ఫలముదక్కును. సాధన లెట్టివైనను, అశాంతములేక ప్రశాంతముగ నిస్పృహలేక నాచరించునది నెయ్యదియైనను ఫలకారి యగునని భగవంతుని యభిప్రాయము. ఆత్మసంయమ మన నియమ బద్ధములేక క్రమశిక్షణదాయకమగునదంతయు సాధనయనియే. అంతరంగ మునగాని, బహిరంగమునగాని యయ్యది లోకమునకు, తనకు సుస్థిర శాంత మిచ్చునదిగ నుండవలె. స్థలము వెతుకవలె, శరీరారోగ్యముండవలె, గాలి, నీరు, కాలము, సమయము మంచిగానుండవలె, చీమ మొదలు నేమృగముల బాధలవలన విఘ్నములు గలగకుండనుండవలె, నాహార

నిద్రావ్యవహారములు పరిమితములై యుండవలెననుట సాధకుడు తెలిసికోవలె; తెలిసికొనగలడు. ఇష్టము పట్టుదల లేనివారికి నన్ని యనుకూలములైనను సాధించలేరు. పై పెచ్చు స్థలవాదన, శరీరప్రకృతులు సరిపడనిచో రోగములు వచ్చును. రాగద్వేషముల నహంకార మమకారముల వదలినవారు ననేకులుగలరు. నియబద్ధునకు నాహార మెట్టిదైనను జీర్ణముకానిది, యాకలిలేనిది భుజింపడు. కల్పితభోజనముల, నజీర్ణ వస్తువుల భుజింపడు. ఆలస్యము, నిద్ర, ఆయాసము, సోమరితనము గల్గించునవి తినడు; ఆశింపడు. స్థలము, వాతావరణము, నీరు, గాలి యుపద్రవరహితమై యుండుట మంచిదే. కాని నిరంతర మాలాంటి పవిత్రస్థలముల నేకాకిగానున్నవారు కోట్లకొలది గలరు. కాని వారికి నేకాగ్రతలేదంటే స్థల గాలి నీరు కాలాదుల లేదు. దోషము హృదయములో నున్నది. ప్రపంచవ్యామోహముచే తనకు గలిగిన కీడును గమనించిన వివేకయుక్త స్త్రీగాని, పురుషుడుగాని పంచేంద్రియముల, నంతరేంద్రియముల, కాయికవాచికముల తన కంట్రోలులో నుంచుకొనియే తీరును. పొరపాట్లు పడడు. నీ పతి యొంటిశిరస్సు, రెండుచేతులు, ఒక్కమానవుడు, తండ్రి వెడలనూకితే శక్తిజాలక నడవికి నిన్ను తోడితెచ్చుకొని, నిన్ను రక్షించలేకపోయిన నా మగనివదలి నన్ను చేపట్టుమని రావణు డెన్నియో నయ భయముల సీతకు జెప్పెనుగాని, యా దృఢపతివ్రత, యాసాధ్వీమతల్లి రామునితప్ప నన్యమెఱుగనిది, రామరావణుల తారతమ్యము దెలిసినది నీచుడా! నీ బలము నీవే పొగడుకొనుచున్నావు. రామునితో సమానమా నీవు. అటువంటివాడవైన నీ నీచవృత్తికేల పాల్పడుదువు ? నీకు తపోబలమెంత రక్షణీయమౌ నాపాతివ్రత్యము నాకంత యభయమిచ్చును. రాముడు వచ్చును. అప్పుడాయన బలము, నీ బలము చూచెద వెళ్లుమనెను. ఎదురెదురు యుద్ధము చేయువారిలో నొకనిదెబ్బ యొకనికి తగలకుండ తప్పించుకొనుటకు, విజయము నొందుటకు యేమరుపాటు పడరు. ఇది భయంకరయమసీమ. వెనుదిరుగుమన్నాడు సావిత్రిని యముడు. పతిలోకమే సతికైన భయమెక్కడిదని యముని భయపెట్టినది సతీసావిత్రి. ఈలాటి మహాతల్లుల, మహాత్ముల పట్టుదలనియతి నిర్మలము, నిర్మోహము గనిన నెట్టి దుర్ఘటస్థలములైనను పవిత్రములే యగును. అప్పుడు గీతా

ర్థముభయలక్షణయుక్తమును జెప్పుచున్నదని తెలియును. సాధకుడు ప్రపంచములోని నేయొకవస్తువు నామరూపములతోనుండునో, నయ్యది మధ్యవచ్చి మధ్యపోవునని తెలిసి వానియందలి మమత వదలవలె. చెవులతో శబ్దముల, కన్నులతో రూపముల, నాలుకతో రుచుల, శరీరముతో స్పర్శముల, నాసికతో వాసనల, కామము మనస్సుతోగూడి బయలు వెడలినను హే భగవాన్! ఈ జగత్తు నిందులోని నాయీ దేహేంద్రియాలు, నేను, సంసారము నీయది. నీవు యజమానివి, నేను సేవకుడను; నీవు నోటివి, నేను నాలుకను; నీవు హస్తమవు, నేను హస్తమందలి వస్తువును;నీవు కర్తవు, నే నిమిత్తుడను. ఈ ప్రపంచస్వరూపము నీయదియే. ప్రపంచములోని వస్తువుల కోరడము నీ కోరకైతే, నేలేకపోతే దండితుడనే, నపరాధినే నంతరంగవాసివైన నిన్నే ప్రేమించి నన్ను నీకే నర్పించితి నన్ను ప్రపత్తిహృదయుడగు నిష్కపటికి, నిర్మలునికి చిత్తము స్థిరత్వము నొందుట నొక వింతగాదు.

ప్ర॥ నిర్జనస్థలములతప్ప తక్కిన స్థలముల యోగము పనికిరాదా?

ఉ॥ తొలుత నభ్యాసికి నిర్జనస్థల మవసరమే. కాని పట్టుదలగల మహాత్ములకు నేస్థలమైన నొకటే. నిర్జన నిర్మలస్థలాభ్యాసికి జనపదముల కష్టమగును. 29 నుండి 32 వఱకు యోగసిద్ధి ఫలము సమదర్శనము దుఃఖనివృత్తి యనే ఫలశ్రుతిని భగవంతు డర్జునునకు జెప్పెను. మనస్సు తనకు వశమైన మహాత్ముడు సర్వభూతములలో బ్రహ్మమును దర్శించును. తన యాత్మను సమస్త బ్రహ్మాండ స్థావరజంగమంబులలో జూచును. సర్వభూతములను తనయందు చూచును. అద్దములోని ప్రతిబింబము నిన్ను, నీవా ప్రతిబింబమును చూచునట్లు నాత్మజ్ఞుడు సర్వభూతముల భగవంతుని జూచును. తన్ను సకలభూతముల జూచును. అటువంటప్పుడు నేను నతడు నన్ను జూడకుండము. ఒకరికొకరము ప్రత్యక్షమేగాని యప్రత్యక్షమేసమయమున నుండదనెను భగవంతుడు. ఏ దేశములో నేకాలమున నే పనియందున్నను బ్రహ్మాభేదభావప్రతిష్ఠితుడై సర్వభూతముల వెలయు నన్ను భజించుయోగి సర్వవిధావస్థల నాయందే యుండును. సర్వభూతముల సుఖదుఃఖముల తనవిగా జూచును. అతడే శ్రేష్ఠుడని నా యభిప్రాయమని భగవంతు డర్జునునితో జెప్పెను.

ప్ర॥ అట్టి మహాత్ముల కొందఱ జెప్పుడి?

ఉ॥ పుండరీకుడు తనభార్యచేయు నవివేకతకు వగవలేదు. సోక్రటీసు తన భార్యజూపిన హేయతకు జుగుప్స వహింపలేదు. రామానుజులు తన సతి విషయములో క్రోధించలేదు. సమర్థుడు తన్ను పొలముకాపరి కొట్టి నను నతనిచేనికి పన్నులేకుండ జేయించెను. గాంధీజీ తన్ను కొట్టినవారిని ప్రేమించెను. భగవాన్ బుద్ధ యే చిన్నప్రాణి కపాయము గల్గునట్లున్న తనకేవని దుఃఖించును. జినుడీతెగలోనివాడే. ఈలాటి మహాత్ములు సమ ద్రష్టలు, గొప్పవారు, దుఃఖనివృత్తి బొందినవారు.

ప్ర॥ ప్రపంచమున నెవరివల్లనైన నపవాదములు వచ్చిన నోర్చుకొను టెట్లు?

ఉ॥ భాద్రపద పౌర్ణమినాడు చంద్రుని జూడగూడదను నపవాదమున కాయన తొట్రుపడలేదు. లోకులు గల్పించేకథ యెంతమాత్రము నిజమో, యేమి యెఱుగని నాయన కేమిలేదు. కుడిచేయి జేయువని నెడమచేయి చేయదని భేదదృష్టిచే నాచేతిని దూరమొనర్చువారెవ్వరుగలరు ? రెండు చేతులు తనవియే. శ్రీకృష్ణునకు సత్రాజిత్తువలన వచ్చిన నపవాదమునకు ఋజువర్తన గనుపఱచెను. అపవాదము రానివాండ్రెవరుండరు. కాని నిదానమున సరళమార్గమునుగని లోకము గుర్తించును. నీ వడిగినది వాస్తవము. చిత్తశుద్ధిలేనివారు నింటాబయటా తగవులాడుకొనుట, నొకరి పై నొకరు వాదముజేసుకొని తుదకు కోర్టులకెక్కుట, నొకరి యాస్తి నొకరపహరించుట, నొకరినొకరు చంపుకొనుట, దగాచేయుట, నిరుపేదల బీడించుట, నొకరు బ్రతికేది చూడలేక నసూయబడుట, మెతుకులకై తగవులాడు కాకులవలె, నెంగిలి విస్తళ్ళకై తగవులాడు కుక్కలవలె మానమర్యాదలేక మాటలాడుకొనుట, తన పక్షమువారిని స్తుతించుట, నెదుటి పక్షమువారిని నిందించుట, నార్పువారులేక మండు గ్రామాకులవలె, శాస్త్రీయనియమనిష్ఠ లేనపుడు చిత్తవృత్తు లిట్లు చేయును. చిత్తశాంతి గలవారికి మానావమానములే, నాటి ద్వంద్వములే యుండవు. ఉండినను సహించుకొందురు. అపవిత్రస్థలములనుండరు. ఒకవేళ నుండిన నా స్థలము పవిత్రమగును. నిందాస్తుతుల జేయరు.

"అమృతేన తు తృప్తస్య పయసా కిం ప్రయోజనం।
ఏవం తత్పరమం జ్ఞాత్వా వేదైర్నాస్తి ప్రయోజనమ్॥"

కృతకృత్యులైన యమృతపానులకు వేదముల ప్రయోజనమే లేనపుడు జగత్ప్రయోజన మేముండును? ఒకప్పుడు సోక్రటీసును తుంటరిపిల్లలు అప్పుడే ప్రసవించి కన్నులు తెఱువని చిన్నపిల్లల నాలుకతో నాకుచుండు నాడకుక్కనుజూపి యిది యెంత రోత జేయుచున్నదో చూడుడీ నీచము. నీచజంతువులింట నుండరాదుగదా? అన, మెల్లన నవ్వి, యట్లనవలదు. ఆ కుక్క తానెట్లున్నను తన పిల్ల లెంత రోతలై యున్నను, వానిని పరిశుభ్రపఱచుటములోనే తనకు నానందమని కర్తవ్యమనుకున్నది. ఆలాగు మహాత్ములు చూచుటకు సేవగింపుగా నసహ్యముగా గాన్పించినను, నితరుల సంకుచితములను నశుచుల దూరమొనర్చి పరిశుద్ధాత్ముల నొనరించుట యొందే వారికి నున్నతాశయము; వారి కర్తవ్యముకూడ. లోకమును యజ్ఞానమను నిద్రనుండి మేల్కొల్పుటయే వారి జీవితకళలకు శోభ. ఇంద్రియము తన కెప్పుడు హద్దుపద్దులో నిల్చునో, గ్రామము సమీపించే కొలది గ్రామములోని కోవెల, పెద్దగోపురము, తరువాత కోవెల, నటుపై ప్రాకారమండపము, లోభాగము, తుదకు దైవదర్శనమగు రీతి, అంతా విశ్వాత్మానుభూతియే. "భూతాని విష్ణుర్భువనాని విష్ణుః" అన్న నుడి యనుభవైకవేద్యమైనది. "క॥ ఇందుగల డందులేడని సందేహమువలదు చక్రి" ప్రహ్లాదుడన్నది నిశ్చయమైన రెండవది లేనేలేదు. జీసస్‌కు తీర్పు జెప్పుచు జడ్జి నీవేమి జెప్పుకొనెదవా జెప్పుకొనుమనెను. ఆయన చిరునవ్వుతో చెప్పుకొనునది నీ హద్దులో నా హద్దులో లేదనెను. బుద్ధభగవానుడు ప్రపంచదుఃఖనివృత్తికై తన దేహమును అర్పించుకొనెను. కృష్ణుడావులలో, గోపిక గోపాలురు వృక్షవనవాటికలలో, శత్రువులలో, తన్ను చూచి యాడుట, యెక్కుట, పాడుట, చంపుట, ప్రేమించుటలో తాను రాణించినాడు. రాసక్రీడయం దొక్కొక్క గోపిక కొక్కొక్కడైనాడంటె యర్థమేమి? ప్రతిశరీరములలోనున్న నన్నిబుద్ధులనే కాంతలకు సాక్షియై యున్నాడనుట. కొందఱు శరీరమునకు వృద్ధాప్యమువచ్చుకొలది చిత్తశాంతి గల్గునందురు. ఇది సత్యమా? కాదు. అప్పుడే దైవభక్తి, పెద్దలసేవ, ఆత్మనిష్ఠకు ననువైన సమయమని మఱికొందఱందురు.

తైలము తక్కువై వత్తియంతా మండిపోవుచు వెల్గు ఆరిపోవుచుండు సమయమున, సూర్యుడస్తమించు సమయమున తన వస్తువుల వెదకికొన సాధ్యమా? శ్రీమచ్ఛంకర, వివేకానంద, రామతీర్థ, రామకృష్ణులు శైశవాయమున శాంతి నార్జించి జగద్వైతాళికులైరి. గాంధీజీతల్లి 'దుష్ట బుద్ధివాని సహవాసము జేసితివట. అలాటి సహవాసమువలదు. నీవు చెడెద'వన, 'అమ్మా! నేను మంచివాడననిగదా! ఆ దుష్టుని తల్లి నా కొడుకు గాంధీ సహవాసముబట్టెను. ఇక మంచివాడు కాగలడనుకొనును. దాని కేమందు'వన నామె తిరుగు జెప్పలేదు. కావున జితాత్ములైన మహాత్ముల జీవితములు చిన్నతనమునుండే శోభిల్లుచువచ్చును. ఒక శరీరమున నంగములు వేఱు వేఱు కనిపించినను, నా శరీరములోనివేకదా అని యర్థమైన దృశ్యములన్నియు ద్రష్టయం దధ్యస్తమై ద్రష్టగానె యున్నవని వారి నిశ్చయము. వారికి మఱపు తెలుపు లుండవు.

ప్ర॥ మనస్సును జయించుటకు ముఖ్యసాధనముల మఱొకతూరి జెప్పుడీ.

ఉ॥ 33 శ్లోకమునుండి 36 శ్లోకమువఱకు నర్జునుడడుగ భగవంతుడు జెప్పెను. విను. లయవిక్షేపశూన్యమైన మనస్సు కేవలాత్మాకారమున వెలయుటయు, నాలాటి మహాత్ముల వినిపించితివి కాని గాలివలె, నలలవలె చంచలమైన మనస్సును సమత్వభావమున స్థిరమగుననునది నేనమ్మజాలను. దేహేంద్రియముల క్షోభను గలిగించు ప్రబలమును, అతిచంచలము నగు మనస్సును విషయవాసనలనుండి నివృత్తి మొనర్చుటము కష్టము. నాకస మందలి వాయువును నిరోధించు ప్రయత్నమువలె నసాధ్యమని యర్జును డన, భగవంతుడు నీవనునది వాస్తవమే; ధ్యానాభ్యాసమున వైరాగ్యము సమదృష్టివలన నిరోధింపవచ్చును. అభ్యాసవైరాగ్యములు లేనివానికి చిత్తనిరోధము కష్టమే. కాని మరల మరల ప్రయత్నించువాడు, జితేంద్రియుడగు వ్యక్తి శాస్త్రవిహితములగు నుపాయముల నవలంబించి యోగము నొందవచ్చును.

ప్ర॥ మనస్సును జయించితే సమదృష్టి గలుగునా? సాధ్యమా?

ఉ॥ జితాత్మునకు, జ్ఞానవిజ్ఞానాత్మునకు సమదృష్టి సాధ్యమే. నదుల వలన సముద్రమున కభేదము లేదా? వనమందలి వృక్షములు వేఱువేరైన సమముతో వనమనిపించుకొనుటలేదా? ఒక వంశము నొకవూర, నొకనికి

సంబంధించి జన్మించియున్నను, మతమనుదానిలో చేరినపుడు సమిష్టి సమ దృష్టి యందులో గలిగి సమానత్వమున వెలయుట గనమా. అంతఃకరణ లోని దోషములు హరింపబడినంతనే దివ్యత్వము, నాత్మశక్తివలన గలుగును. వారు విశ్వమును ప్రేమించుటము మోహముచేత గాదు. నిస్వార్థపు, నిర్వ్యాజ, నిర్మోహమగు నాత్మజ్ఞానముతో కొండలనుండి దిగజారు నీటికాల్వలవలె, మేఘమునుండి స్రవించు వర్షబిందువులవలె, పౌర్ణమి నింటి కెగబ్రాకు పూర్ణసముద్రమువలె వారి యానందమునుండి ప్రేమవాహినులు బయలుదేరును. అపారదయాకారులగు వారి పూర్ణత్వము లోకక్షేమకరము.

ప్ర॥ అంతట నర్జునుడేమనెను ? కృష్ణుడేమి జెప్పెను ?

ఉ॥ అర్జునుడు సందేహములున్న, యూరకుండునా ? కల్పవృక్షము దరినున్నవాడేల నుపవాసముండును ? శ్రద్ధతో యోగము ప్రారంభించి నాడనుకో, ప్రయత్నలోపముతోనో, లేక చిత్తస్థైర్యమును గోల్పోయిన యోగభ్రష్టుడు ఓరిమి, నియమనిష్ఠ తప్పుటచే నాలాటియోగి మోక్షము లేనందున యేమగును? చెదరిన మేఘము లొక్కటిగానట్లు, మోక్షప్రాప్తి మార్గమున నిష్కామకర్మ యంతరంగసాధనమగు ధ్యానము నుండి భ్రష్టుడు, నిరాశ్రయుడైనయోగి యనగా పతితుడైనవానిగతి యేమి యన, మనసున సంస్కారమైనవి యెట్టివైన నశింపవు. పుణ్యాపాపమిశ్రమ కర్మలలోగాని, నిష్కామకర్మ నిష్కామోపాసనలలోగాని సూక్ష్మముగా విత్తనమున వృక్షమువలె, దూదియందు దారమువలె, మేఘమునందు నీటిబిందువులవలె తైలమున రుచి, యగ్నియందు దహనశక్తి యుండినట్లుండును. చదువుచుండెడి విద్యార్థి పరీక్షలో నొక సంవత్సరము, నొక సబ్జక్టు తప్పిన, తప్పినది చదువవలెనేగాని, తక్కినవి చదువ నవసరములేదు. ఒక పొలమున సాయంత్రమునకయ్యేపని యొకవేళ ముగియకపోతే నా కొదవ మరుదినము పూర్తి ముగింతురు. ఒకచోటికి ప్రయాణమైనవాడు సంకేత స్థాన మొకదినములో నొందకపోయిన మరుదినమైన జేరగలుగును. చదివెడి పుస్తకముగాని, వినెడి శ్రవణముగాని, యిచ్చిన ఋణముగాని యొకసమయమున పూర్తిచేయలేకపోయిన మరుసారియైన పూర్తిజేతురు.

ఇంతకు కొదువపడినదేకదా పూర్తిచేయవలసినది. మొదటినుండి చేయు పనిలేదు. యోగులైనవారు కర్మల నీశ్వరార్పణమొనర్చుటచేత, లేక కర్మఫలములను త్యజించుటచేత స్వర్గము లభింపదు. యోగసిద్ధి నందక పోవుటచేత మోక్షము సిద్ధించదు. స్వర్గమోక్షములకు రెంటికి చెడిన వారగుదురు. ధ్యానయోగమున సగుణధ్యాననిష్ఠ పూర్తియై నిర్వికల్ప సమాధి లభింపకమునుపే శరీరమువదలిన యోగి యోగభ్రష్టుడను పేర బిలుతురు.

ప్ర॥ అందునకు భగవంతుడేమనెను ? ఎందఱో యోగభ్రష్టులు కావచ్చు. అటువంటప్పుడు తొలగిన ధైర్యము నిలుపుకొనుటకు నీ రహస్యము తెలిసికోవలసినదే.

ఉ॥ భగవంతుడనుచున్నాడు: ఇంగువకట్టిన గుడ్డలో నింగువవాసన నున్నరీతి, ధ్యాననిష్కామయోగముల వాసన చిత్తమున నుండుగాన మరణసమయమున మోక్షము బొందలేకపోయినను భయములేదనెను. వీనినే యదృ(ష్ట)ధాపరోక్షుడందురు.

ప్ర॥ యోగభ్రష్టుడొకవేళ పుట్టవలసివస్తె నెక్కడ బుట్టును?

ఉ॥ దేవతలు, ఋషులు, తక్కంగలవారలెవ్వరు నీ సంశయము దీర్పలేరు. పెక్కు జన్మముల విషయము తెలియుట భగవంతునకే నన్యులకు సాధ్యముకాదు. ఇహలోకమున పతనమునుగాని, నిందలగాని, తదితరములగాని బొందడు. పరలోకమున నరకమునుగాని, హీనజన్మములగాని, రోత(బ్ర)తుకులనుగాని బొందడు. శుభమొనర్చువా డెన్నడైన దుర్గతిని బొందడు. దుష్టాత్ములు, పాపరతులు, పాషండులున్న స్థలమున పరమ సత్యాస్తికు డందఱకు ప్రియతముడుగానున్న మహాదేశమునకు బోతే భయమేముండును. అశ్వమేధాది పుణ్యకర్మ లొనర్చువారికి ప్రాప్యములగు, శుభలోకములగు బ్రహ్మలోకాదుల బొంది నట చాలాకాలము నివసించి అనంతరము సదాచారసంపన్నులగు గృహస్థుల యిండ్ల బుట్టును. లేక యోగభ్రష్టుడగు పురుషుడు జ్ఞానవంతులగు యోగుల వంశముననే జన్మించును. ఇటువంటి జన్మము నీ లోకమున నత్యంత దుర్లభము గలుగవలెనంటె మహాలోకమాట యోగభ్రష్టుడీజన్మమందు పూర్వజన్మసంస్కార

మనుసరించు బుద్ధిని బొంది, సిద్ధిని బొందుటకై మునుపటికంటె నెక్కుడు ప్రయత్న మొనరించును. తాను స్వయముగ నిచ్ఛగింపకపోయినను, పూర్వజన్మాభ్యాసబలము యోగసాధన దెసకు నాకర్షింపబడుచున్నాడు. యోగస్వరూపము నెఱుగగోరువాడుకూడ వేదమున జెప్పబడిన కర్మముల ఫలము నతిక్రమించి, దానికంటె నెక్కుడగు ఫలమును బొంది ముక్తుడగుచున్నాడు. ముందటి జన్మమునకంటె నెక్కుడు శ్రద్ధతో ప్రయత్నమొనర్చి పాపమునుండి విడివడును. అనంతరము పూర్వాపూర్వములగు జన్మములందలి సాధనాసంస్కారములవలన మోక్షసిద్ధిని బొందును. వింటివికదా! భగవంతుని సంపూర్ణకటాక్షము ప్రపంచమున యోగముల నాచరించుచు మోక్షము నొందలేక భ్రష్టులైనవారల గుఱించి నిస్సంశయముగా తెలిపెను. అనేకులు యోగము పూర్తియగునో కాదో పూర్తియయ్యేటుగానుంటే పరవాలేదు. లేకపోతే మనకెందుకు? మఱియు దాని వలన దోషము లేమైన నాపాదించునేమోయని భయ సందేహముల నొంది యుందురు. అట్టివారి సంశయములన్ని తీర్చివేసెను. 46 నుండి 47 వఱకు భగవద్భక్తుడే శ్రేష్ఠుడగు యోగియని నిరూపించెను. మరణమన దేహమునకేగాని, యాత్మకుగాదు. ఆత్మకు నిదుర తెలియదు, మరణము తెలియదు. మేఘముయొక్క, గాలియొక్క, శబ్దముయొక్క, యగ్నినీటియొక్క రాకపోకలు నాకసమునకు తెలియవు. ఆత్మకు నిదుర జన్మ మరణ గమనాగమనములు, వృద్ధిక్షీణములు లేవు; తెలియవు. సూర్యునకు, చీకటి నాత్మకు మరణములోటి యజ్ఞానము లేదు. సూర్యుడు లేడు చీకటి యుండును. మరపులేదు, మరణములేదు. సచ్చిదానందమగు నాత్మను మఱచటమే నిద్ర. మృత్యువు జ్ఞాపకము చేసికొనుటయే యోగము. దాని ఫలము సుఖము.

ప్ర॥ కృచ్ఛ్రచాంద్రాయణాది తపోనిష్ఠులవంటివాడేకదా యోగి?

ఉ॥ నీవన్నవారికంటె నెక్కువవాడు. వారి సాధనలు బహిరంగములు, నతని సాధన మంతరంగము. వారు పరిమితకాల ప్రవర్తకులు, నతడు కాలమే లేనివాడు. నాకసమువంటివాడీతడు, అద్దములోని నాకసమువంటివారు తపోనిష్ఠులు. అంతేకాదు భగవంతుడు నీ యోగికి భక్తుడనే మరొక బిరుదముగూడ నిచ్చెను. శాస్త్రజ్ఞులగు పండితులకంటెను,

మఱియు నగ్ని హోత్రాది యజ్ఞపరాయణులగు కర్మిష్ఠులకంటెను గొప్పవాడు. అర్జునునిగూడ యోగివి కమ్మనెను. ఎవడు శ్రద్ధాళువై భగవంతునియందే చిత్తమునుంచి భగవంతుని భజించునో, వతడు రుద్రాదిత్యాదిదేవతలను ధ్యానించు యోగులకంటెనుగూడ శ్రేష్ఠుడనియు, నిది నా సిద్ధాంతమనియు ననెను.

ప్ర॥ యోగి భక్తుడగునా? భక్తుడు వేఱు, యోగి వేఱుకాదా?

ఉ॥ అట్లనవలదు. ధ్యానమొనర్చుయోగి, నిష్కామకర్మియగువాడు నెవ్వని గుఱించి వీరి ధ్యాననిష్కామములు? భగవంతుని గుఱించియే కదా. ఇందువలన భక్తి నిష్కామకర్మలంతర్భూతమే. అందువలన యోగియన్న భక్తుడన్న రెండు నొకటియే. మఱియు ద్వితీయషట్కము తత్పదవాచ్యపరిశోధన కావున నందు నజహల్లక్షణను విడువని లక్షణమగు భక్తికవసరమగుటచే భక్తిని సూచించెను. ఈ యధ్యాయము తన్ను తాను రక్షించుకొనవలె, తానే చైతన్యవంతుడు కావలె, తన్ను తాను రక్షించుకొనుట యోగము. తానే చైతన్యవంతుడగుట భక్తి.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
ఆత్మసంయమయోగో నామ
షష్ఠోఽధ్యాయః
ఓం తత్ సత్

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## సప్తమాధ్యాయము

### జ్ఞానవిజ్ఞానయోగము

—: తత్పదనిర్ణయము :—

మ॥ వినుడీ! తత్పదనిర్ణయంబు మునిరాడ్వేద్యంబు విజ్ఞానరం
జనమౌ జ్ఞానము కార్యకారణము విశ్వాకారమాయావిధం
బు నవాఙ్మానసగోచరుండు హరి నిర్మోహాత్వభక్తిం భజిం
ప నభేదంబున జన్మమృత్యుభయముల్ పాయున్సదా నేరికిన్.

ప్ర॥ ఆత్మసంయమయోగముతో గీత ప్రథమషట్కమంటిరి. ఆ షట్కసారాంశము జెప్పుడి.

ఉ॥ టంకము పొందిన బంగారును మూసలోనుంచి కరిగించి, ద్రావకము వేసి, టంకమును బోగొట్టి నికరపు బంగారును కమసాలి తీర్చినట్లు భగవంతుడు యనాది, యవిద్య యనే టంకముతో గలిసి స్వరూపు మఱచిన లోకశ్రేయస్సునకు నర్జునుని నిమిత్తముజేసి నాయన మోహనివృత్తి జేయ, నీవెవరు? ఈ దేహమా? ఇంద్రియములా? దృశ్యద్రష్టలలో నెవ్వడవు? దృశ్యమవా? యాదివా? యనాదివా? యని త్వంపదార్థవిచారణ చేయించి, త్వంపదలక్ష్యార్థమె నీవనుదానికి నర్థమని వివరించి, యపూర్వమైన నత్యంతాశ్చర్యమైన దివ్యజ్ఞానమును ద్వితీయాధ్యాయమున జెప్పెను. మూడవయధ్యాయమున నిష్కామకర్మముద్వారా చిత్తశుద్ధికరమును, నాల్గవాధ్యాయమున నాత్మనిష్ఠ కనుకూలములగు ద్వివిధ నిష్ఠలు, కర్మజ్ఞానముల జెప్పుచు, నకర్మ కర్మ వికర్మల వివరణొనర్చి, కర్మసన్న్యాసమున కర్మాకర్మవికర్మల వివరణనే విశదమొనరించి, నారవాధ్యాయమున సాధ

కునకు నభ్యాసము, ధ్యానము చెప్పబడినది. ఈ ధ్యానమునకు వైరాగ్యము, నభ్యాసము, చిత్తైకాగ్రత, సమదృష్టి, యోగభ్రష్టతవలన గలిగె నభయస్థితి యోగియొక్క గొప్పతనము వర్ణింపబడినది.

ప్ర॥ ద్వితీయషట్కము దేనిని గుఱించి వివరించును?

ఉ॥ ప్రథమషట్కమున త్వంపదార్థవిచారణమను గుహ్యమును వింటివికదా. ఆరవయధ్యాయ మంత్యశ్లోకమున "యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా। శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః" నాయందు మనస్సునుంచి శ్రద్ధతో భజించువాడే సర్వోత్తమయోగి యన్నంతనే నర్జునునకు సంశయము వచ్చినది. నేనన్నప్పుడు నా స్వరూపము దేహేంద్రియములు కాని చైతన్యవస్తువని తెలిపెను. నాయందు మనస్సునుంచి యన్నప్పుడు తానెవరు? మఱి చతుర్భుజముల తోటి యీ ఆకారమా? లేక నేది? ఎట్లు ధ్యానింపవలె? నని యనుకొనెను.

ప్ర॥ అర్జునునకేకాదు, సమస్తమానవులకు సంశయములే. చిత్తము తనయందుంచవలెనన్న తన స్వరూపము తెలిసితేకదా భజింపవచ్చును? కంటికి కనుపించునదిగానో, స్పర్శింపదగినదిగానో యుంటేనే కాని లేకపోతే భజింపరాదు.

ఉ॥ అర్జునునకు గలిగిన సందేహము భగవంతుడెఱిగియే నీ యధ్యాయమును ప్రారంభించెను.

ప్ర॥ ఈ యధ్యాయమునకు నేమి పేరు?

ఉ॥ అద్వితీయమైన ప్రకృతి పరిణామ యోగము, ప్రపంచవికాస యోగము, పరమాత్మాభిన్న యోగము, జ్ఞానవిజ్ఞానయోగము నిదియే. భగవంతుని స్వరూపమును తెలిసికొని భజించు తత్త్వదనిర్ణయ గుహ్యాతర మియ్యది. ద్వితీయషట్కమున ప్రథమాధ్యాయము లేక సప్తమాధ్యాయము, సప్తాంతరి జ్ఞానభూమికల సప్తావస్థలయోగము జ్ఞానమును తెలియుటనునదియే యోగము లేక సాధన. తత్ఫలమే విజ్ఞానమను యనుభవమగు నభేదమని యర్థము. భగవత్తత్త్వమును దెలిసిన గీతాతత్త్వము దెలియును. గీతాతత్త్వము దెలిసిన భగవత్తత్త్వము తెలియును. భగవత్తత్త్వము భగవంతుడెఱిగించుటచే మనము సులభముగా దెలిసికొని ధ్యానించగలము. భగవత్తత్త్వము తెలియక భజించుటెట్లు? మఱి

భగవత్తత్త్వమును దేవమానవు లెరిగింతురా? ఎఱిగింపలేరు. భగవంతుడే కావలె నందుకై భగవంతుడు కరుణామయు డవతరించిన దిందుకే. లేనిచో ప్రకృతి శక్తుల నారాధించటము, మనఃకల్పితముల మనోలగ్న మొనరించి తుదకు తీరని దుఃఖముల నొందు మానవులకు తనయందు నేకాగ్రచిత్తము నుంచి ధ్యానించుటచేత ఫలము శాశ్వతమగు దుఃఖరహిత నిరతిశయానందము నొంద వివరించెనంటే నొక్క యర్జునుని కేకాదు; ప్రాప్తము మానవులందఱిది. జ్ఞానమంటే సామాన్యముగా పశుపక్ష్యాదులకు, మానవులకు విషయముల తెలియు జ్ఞానముకాదు. ఆ జ్ఞానము దెలుపుటలో గీతకుగాని, గీతాచార్యునకుగాని గలిగే గొప్పేముండును? పరాత్పరుడగు వాసుదేవుని నెఱిగించునది జ్ఞానము, తద్గతి నొందుటయే విజ్ఞానము లేక యనుభవజ్ఞానము.

ప్ర॥ అయితే నిప్పుడు గంజాయి మొదలగు మత్తుపదార్థముల సేవించి మైమఱచుట, గుడ్డపేలికల మ్రింగి వెలుపలికిదీయుట, ఆసనాలు వేయుట, నీటిపై నడచుట, నీటిలో మునిగి చాలసేపుండుట, భూమిలో బూడ్చబడి నింతకాలమని యుండుట, పెక్కునీళ్ళు ముక్కురంధ్రములతో బీల్చి నోట రానిచ్చుట, భూమిపైకి కుంభించి లేచుట, ముక్కుమూసికొని కండ్లుమూసి లేక తెఱచిగాని శ్వాసబీల్చుచు శ్వాసపై నిగాయుంచుట, పంచముద్రలు, పంచపంచీకరణములు, మండలద్యుతులు, నాదదశకము, సప్తకమలములు నిరువదొక్కవెయ్యి హంస యజపగాయత్రీవివరణ, 25, 36, 96 తత్త్వముల విమర్శ షడధ్వములు, పెక్కుకాల ముపవాసము, కదలక కూర్చుండి నిద్రబోయినది లేక సమాధియైనది తెలియకుండుట, కనిగ్రుడ్ల భ్రూమధ్యమునజేర్చుట, యేమిజేసిన నేమిలేదని నిచ్చవచ్చినరీతి తినుట, త్రాగుట, చరించుట, స్వరభేదము, ఫలప్రశ్నలు, సాముద్రికాది చతుష్షష్టికళలు మొదలగునవి జ్ఞానలక్షణములు గావా? వీనికొఱకు నెంతోకాల మెంతో కష్టము కృషిజేసినట్లు జెప్పుచుందురే? వీనివలన భగవంతుని తెలియుట సాధ్యపడదా!

ఉ॥ సాధ్యపడదు. ఇంద్రజాలికుని విద్య తన జీవితముకొఱకేగా? దానిని వినోదమనెదరు. ఇవియన్నియు బహిరంగలక్షణములు. ప్రజల భ్రమింపజేయునవి; వైరాగ్యవంతములు గావు. అంతరంగలక్షణము

పరమార్థముకాదు. సముద్రములో చెక్కాలముండుట, దానిలోనే జీవనముచేయుట, లోపలివస్తువుల వెలుపలికి గొనివచ్చుట, వాయుగుండ ములబట్టి వర్షము, తుఫాన్ మొదలైన వొలుగుట, జలాంతర్గాములు, స్టీమర్లు, విమానములు, రాకెట్లు, రేడియోలు, టెలివిజన్, టెలిఫోన్, టెలిగ్రాం, రైలు, ప్రళయబాంబులు, భూగోళ, ఖగోళ, వృక్ష, రసా యన శాస్త్రముల గనిపెట్టిన నాంగ్లదేశీయులు, మనదేశీయులెందఱో గలరు. ఇకను గొప్పగొప్పవి కనిపెట్టవచ్చు. కాన అవి యన్నియు గారడి వంటి బహిరంగవిద్యలే; పరమార్థమగు భగవత్తత్త్వమును దెలియు జ్ఞాన ముకాదు. ఒకడు వివిధదేశములు దిరిగివచ్చి ననేకుల కావింతల నెఱిగిం చుటలో నెంతోగొప్పవాడుగా గనిపించెను. కాని యాతడు దేశాటన మునకు వెళ్ళకమునుపు తనదొడ్డిలో నెన్ని మొక్క లుండెను? ఇప్పుడెన్ని లేవు? ఎన్ని యెక్కువైనవి? చెప్పుమన నాతడు నిరుత్తరుడాయెను. చూచి తివా! అవి యన్నిజ్ఞానముకావు. 'న హి జ్ఞానేన సదృశం' అని భగవంతు డనుటలో విశేషము లేకపోలేదు. జ్ఞానమునకు సమానమైన దొక్కటియు లేదు. ఈ యధ్యాయమున వివరింప విందువుకదా. గంభీరమగు పార మార్థికతత్త్వజ్ఞానము "దృష్టిరవిద్యావృత్తిః దృష్టిసమనమయాస్సృష్టిః దృష్టిస్సృష్టిః" అని సృష్టిరహస్యము. మాయామయవిధానము విమర్శగ తెలుపునది యగుట జ్ఞానవిజ్ఞానయోగము. ఇంద్రజాలికుడు చేయువిద్యను నమ్మినది జ్ఞానముకాదు. వాడు చేయునది యెఱుగుట జ్ఞానము. కల్పితము లన్ని మిథ్యయని తెలియుట విజ్ఞానము. ప్రపంచము కనిపించుచున్నది. పరమాత్మ కనిపించడములేదు. పరమాత్మను తెలిసికొనుట జ్ఞానము. ప్రపంచము మిథ్య. పరమాత్మ, జీవు లొక్కటని యెఱుగుట విజ్ఞానము.

ప్ర॥ ధ్యానము చేయువా డేమగును ?

ఉ॥ ధ్యేయవస్తువగు పరవాసుదేవుడే యగును. సగుణము సాపేక్ష ణీయము. 1 మరియు 2-వ శ్లోకములలో జ్ఞానవిజ్ఞానములగుఱించి నర్జునున కెఱిగించెను. "మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్మదాశ్రయః" నాయందే నాసక్తిగలిగి నన్నే యాశ్రయించవలె ననెను. చూపులొకవంక మనస్సొకవంక నుంచకూడదని భావము. భావమేకాదు క్రియ యొకటిగానె

యుండవలె. దృశ్యములగు నచేతనవస్తువులయందు ప్రేమయుండిన నాతత్త్వము గ్రహించలేవనెను.

ప్ర॥ ఫోటోతీయునపుడు నేకాగ్రతగా నుండుటలేదా ? అనంతస్వరూపుని గ్రహించుటకుగూడ నాసక్తి యేకాగ్రతలుండవలసినదే. ఎవరికుండినను వాసుదేవుని గనెదరు. వాసుదేవు డంటేనేమి ?

ఉ॥ సర్వభూతాధివాసం చ, యద్భూతేషు వసత్యపి" సర్వభూతములకు నివాసస్థానము సర్వభూతమునుండి యనుగ్రహించువాడే వాసుదేవుడు. భగవంతు డిందో లేడు. భగవంతుని తెలిసికొనుటకు నుపయోగించే జ్ఞానము రెండవశ్లోకమున భగవంతుడు వివరించెను. సూర్యుడు వచ్చినా చీకటి తొలగును, అన్నివస్తువులు కనిపించును. సూర్యుని వెలుతురు లేనపుడు తక్కిన సాధనలన సూర్యుని యొక్క యంశము స్వల్పము. దీపముగ వెలగించితే పరిమితస్థలములందలి వస్తువుల ప్రకాశింపజేయును. దీపము మనకల్పితము, సూర్యుడు మన కల్పితవస్తువు కాదు. అందువలన దీపమువంటి స్వల్పవిషయముల దెలియుజ్ఞానము జ్ఞానము కాదు. స్వప్నజ్ఞానము, మోహజ్ఞానము, భేదజ్ఞానము జ్ఞానముకాదు. మహావాక్యమే సాధనముగాగల జ్ఞానము జ్ఞానము. "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" ఎద్దానినెఱిగిన నిదంతయు తెలియనగు నన్నట్లు బ్రహ్మజ్ఞానమును విజ్ఞానసహితముగ చెప్పుచున్నాననెను భగవంతుడు. కొదవలేక పరిపూర్తియైనది; ఇక తెలియవలసిన నవసరము లేనిది. మఱొక కర్థము. మనకు తెలియుని సత్యజ్ఞానానందస్వరూపము నెఱిగించు శాస్త్రజ్ఞానము తద్ద్వారా నపరోక్షమగు ననుభవమొందుట విజ్ఞానము. దీనివలన బంధములేని ముక్తి. ప్రతియొక జ్ఞానమునకు ననుభవజ్ఞానములేదా ప్రయోజనము లేదు.

ప॥ పరోక్షాపరోక్షా లంటారే వాని యర్థమేమి ?

ఉ॥ శాస్త్రముద్వారాగాని, యాప్తులవల్లగాని విన్నజ్ఞానము పరోక్షము. విన్నది యనుభవైకవేద్యమగుట నపరోక్షము. నీవు కాశిని జూచితివా ? జూచితివా ? యన విన్నది పరోక్షము. కాశిని జూచుట నపరోక్షము. బ్రహ్మము నిర్వికారమన్ననది పరోక్షము. వృత్తి నిర్వికార బ్రహ్మాకారము దాల్చుట యపరోక్షము, లేక సాక్షాత్కారము. 'ద్వేధా

బ్రహ్మణో రూపే పరం చాపరం చ" సగుణనిర్గుణస్వరూపుడని ప్రమాణము. నిర్గుణముయొక్క వ్యక్తత్వమే సగుణము. "యత్ర ధూమ స్తత్ర వహ్నిః" లింగమునుబట్టి లింగియును, కార్యమగు ధూమమునుబట్టి కారణమగు నగ్నిని గ్రహించుట. తద్రీతి నామరూపములగు కార్య ప్రపంచమునుబట్టి నిర్గుణమగు కారణమును తెలిసికొనుట. శాస్త్రము చెప్పిన నిర్విశేష పరబ్రహ్మమును శ్రవణమననములద్వారా నపరోక్ష మొనరించుకొనుటయె విజ్ఞానము. పరమాత్మ లేక నాత్మ నీ రెండిటిలో నేది తెలియబడినను జడమగు దృశ్యమగు ప్రపంచము వెంటనె తెలియ బడును. అదిగో! అది యొక్క పెద్దపేపరు; దానియందు రంగురంగుల బజార్లు, మిద్దెలు, మేడలు, జనులు, ప్రాణులు, జంతువులు మొదలైనవి గనిపించుచున్నవి. వానిని జూచి నది యొక్క దేశము లేక గ్రామమొ నని చెప్పెడి జ్ఞానము మిథ్యాజ్ఞానము. రంగురంగుల నామరూపాదుల కాశ్రయ మిచ్చిన కాగితమును గుర్తెఱింగిన జ్ఞానము యథార్థజ్ఞానము. అప్పుడు కాగితమందు కల్పితచిత్రములు కాగితమునకంటె వేఱులేవు. కావున నవి కూడ కాగితమనుట దోషముకాదు. బాధ సమానాధికరణము.

ప్ర॥ ప్రపంచము మి థ్య య ను ట యిందుచేతనేనా? ప్రపంచ మంతయు వాసుదేవుడేయైతే కొందఱు రాముడు, కృష్ణుడు, నారాయణు డీలాంటి పేర్లతో నుపాసించెదరు. మఱికొందఱు రూపముజూడక నెక్క డుండేది తెలియక నెక్కడనో యొక దిక్కు లేదా అంతటా యున్నాడని గాని లేక మా మత మిట్టిదని ప్రార్థించే మతాలనేకములున్నవి. ఇన్నివిధ ముల నర్చించుట కారణమేమి? ఫలమేమి?

ఉ॥ నీవడుగునది సత్యమే; దేవుడున్నాడని యే విధముగానో నర్చించు వారు కలరు. భగవంతు డెట్టివాడని తెలియక కొందఱు,నితరుల ప్రేరణవలన కొందఱు, సాంప్రదాయధర్మముల కొందఱుపాసింతురు. మొదటి ప్రవ ర్తలు వైరాగ్యానురాగముల సాధించి తెలిసికొందురు. వారివలన శాస్త్ర నియమమువలన గుర్తెఱుగువారు కొందఱుందురు. రాను రాను ప్రయత్న లోపముల వేఱు వేఱు మార్గముల బట్టుదురు. రామకృష్ణాదుల యవ తారముల మానవులచే ధర్మము నడిపింపలేక ధర్మరక్షణకొఱకు తమకన్న

నన్యముగ నొక మూర్తిని యవతరింప సంకల్పింతురు. అయ్యది కొంత కాలమునకు ఫలించి నందజాశేయాంశముల సత్త్వగుణప్రధానమగు మాయావశవర్తియై జన్మించును. అట్టి యవతారము భజించినను మోక్షముగలదు. మనుష్యులలో గొప్పవాడెట్లో, నవతారములలో భగవంతుడంతే. రూపములగాక నిర్గుణము నర్చించువారు నంతర్యామిగా నున్నాడని యర్చింతురు. ఆయారీతుల శ్రద్ధాభక్తి విశ్వాసములబట్టి వివిధ రీతుల నందును. ఇత్యాది యుపాసనావిధము; జ్ఞే యవిషయమట్టిదికాదు. విత్తనమును దెలిసితే వృక్షశాఖలు దానివేనని తెలియునుగదా. పరమాత్మను తెలిసిన ప్రపంచము తెలియబడును. నదులన్నియు సముద్రునిజేరిన రీతి, యాకసమునుండి పడిననీరు సముద్రునిజేరిన పగిది నే దేవుని యర్చించిన భగవంతునే నర్చించినట్లగును.

ప్ర॥ ఈ జ్ఞానము నందఱకు నేల గలుగుటలేదు?

ఉ॥ అన్ని జన్మములలో నుత్తమమైన మానవజన్మమే. అయిన నీశ్వరానుగ్రహము, పురాకృతసుకృతము, ప్రయత్నము గలిగితే తప్ప లేదా తెలుసుకోలేదు. తెలుసుకోలేమని నూరకుండ తగదు. ప్రయత్నము చేయవలసినదే. ధన ధాన్యాదులు లేకపోతే జీవించుట కాదని చచ్చువారు గలరా ? ఏదియో నొక ప్రయత్నముజేసి యాహారము దొరికించుకొనుట లేదా ? ఇప్పటి ప్రయత్నము నుత్తరకాలమునకైన పనికివచ్చును. మునుపటి జన్మములోని ప్రయత్నఫలమే నిప్పటి జన్మముకాదా? సముద్ర మందరు నెగిరినారా? హనుమంతు డొకడేను. ఉభయసైన్యముమధ్య గీత విన్నవాడొకయర్జునుడే. ఆకాశగంగను భూమికి దెచ్చినవాడు భగీరథు డొకడే; ఉక్కుస్తంభమున హరి యుదయించుటకు భక్తి సల్పినది ప్రహ్లాదుడొకడేకదా. అటువలె శ్రద్ధావంతులు నీ రహస్యము దెలియుదురని మూడవశ్లోకమున కర్థము. సినిమాలంటె పుక్కిటి పురాణములు, తిరునాళ్లంటే, లాభకారిపనులంటే హస్త సాముద్రిక జ్యోతిషాది యనేకమయకార్యములకెంతో డబ్బు ఖర్చుచేసి యెంత దూరమైన సరే వేన వేలు జనులు జమకూడుట చూడలేదా? వేదాంతము వినుట కెవ్వరొత్తురు? జ్ఞానసిద్ధిని బొందగోరినవారిలో నేయొకడో జ్ఞానసిద్ధిని బొంది నన్ను తెలిసికొనగలడనియు, నట్లు తెలిసినవాడే నన్ను బొందగలడని భగ

వంతుడనైను. జ్ఞానము నీ జన్మములోనే సాధించవలె; నందుకే నీ జన్మము వచ్చినది. పవిత్రజ్ఞానమార్జింపనిచో వ్యర్థజన్మములమగుదుము.

ప్ర॥ భగవంతు డర్జునునకు భగవత్స్వరూపము, ప్రపంచము నీ జ్ఞానము ద్వారా తెల్పెనా? తెల్పిన చందము జెప్పుడి.

ఉ॥ ఏ రహస్యమైతే నీవు వినుచున్నావో, నా రహస్యము దెలిసితే గల్గే యానందము మనుష్యానందము మొదలు ప్రజాపతి యానందమువఱకు గల కామనాసంబంధముల మించిన బ్రహ్మానందము. అందువలననే ప్రతి ప్రాణి ప్రయత్నించుచున్నది. అందఱి యాశయు నిదియేకూడ. అయ్యది పొందజాలనపుడు తక్కిన యానందముల కాలము ముగిసినంతనే పునర్జన్మము లెత్తవలసినదే. ప్రపంచ పరమాత్మ లెట్లున్నవన యొకటి చేతన మొకటి యచేతనము; ఒకటి వికారాకారము నొకటి నిరాకారము; ఆధేయ మొకటి యాధార మొకటి; ప్రమేయ మొకటి అప్రమేయ మొకటి; దూది దారము, మట్టి కుండలు, బంగారు నగలు, విత్తనము శాఖలవలె నొకటి సూక్ష్మాతిసూక్ష్మ మొకటి స్థూలముగనున్నవి. చెఱకులోని రసము, పాలలోని వెన్న, రక్తములోని పాలు, వాయువునందగ్ని, యగ్నియందలి జలమువలె మిశ్రమముగ నున్నవి. ఈ రెండింటితోనే నీవు, నేను, నీ యఖిల బ్రహ్మాండము. అయితే పాలనీటిని వేఱుపఱచిన రీతి, జడచైతన్యముల విమర్శించుటే జ్ఞానమునకు స్వరూపము. వినుము. 4 నుండి 7 వ శ్లోకము వఱకు పరాపరశక్తులు జగదుత్పత్తిని గుఱించి వివరించుచున్నాడు. పరా ప్రకృతి యపరాప్రకృతియని జగదుత్పత్తిహేతువులు రెండు కలవు.

ప్ర॥ అయితే పరమాత్మ పరాపరాప్రకృతుల సమ్మేళనమే ప్రపంచమనె దరా? పరమాత్మలేకనే యీ పరాపరప్రకృతులవలననే ప్రపంచము కానే రదు. వీనిని వివరింపుడి.

ఉ॥ సప్తమాధ్యాయమంటే నిదిగో నిదియే రహస్యము. సప్తాక్షరీ మంత్రమనియు, జ్ఞానవిజ్ఞానయోగమన సప్తవిధముల ప్రకృతులు గలవని యర్థము. ఆకసము, వాయువు, అగ్ని, జలము, పృథివి, మనస్సు, బుద్ధి, యహంకారముల సమూహమే నపరాప్రకృతి. దీనినే క్షేత్రము, క్షరము, మలినసత్త్వమందురు.

ప్ర॥ పంచవింశతితత్త్వములవలనగదా ప్రపంచమాయెనందురు. ఈ యెనిమిది విధములగు నపరాప్రకృతియే నింత వ్యాపకమగునా?

ఉ॥ ఇరువదైదు తత్త్వములు స్థూలపంచభూతముల సంబంధమగు విధానము. అహంకార మనోబుద్ధులు సూక్ష్మశరీరసంబంధముగా గ్రహింపవలె. "అష్టౌ ప్రకృతయః షోడశవికారాః పురుషః అవ్యక్తం బుద్ధిరహంకారః పంచతన్మాత్రాణి" తత్వసమాస. సాం॥ సూ॥ మూలప్రకృతియే ముఖ్యప్రకృతి, బుద్ధ్యాదులు గౌణప్రకృతులందురు. వ్యష్టి సమిష్టి స్థూల సూక్ష్మశరీరముల సముదాయప్రపంచమే నపరాప్రకృతి. ఈ ప్రకృతియే ప్రపంచము. పేరులు, రూపములు, జన్మమరణాదులు, చిత్రవిచిత్రములన్నియు దీని స్వరూపములే. అదిగో! అది యొక యింజను. అది యినుముతో జేయబడి రూపము పేరు నొందినది. ఆ యింజను నడుపవలెనన్న నొక శక్తి యుండవలె, నదియే స్టీమ్ లేక పవర్ లేక గ్యాసనెదరు. అది యుంటేనే యింజను కదలును, పరుగెత్తును. తక్కిన యింజనులన్ని నిట్లుగానే తెలియుము. జడములగు నష్టప్రకృతిమయశరీరాదుల నడిపించు శక్తి యొకటుండవలె నదియే పరాశక్తి. దీనినే మాయ, యక్షరము, క్షేత్రజ్ఞుడు, పురుషుడు, శుద్ధసత్వప్రధానమనికూడ నందురు. అది పరమాత్మయందు నిత్యానపాయినియై యుంటున్నది. అనాదియై భావరూపమై, సర్వప్రపంచకారణమై యనిర్వచనీయముగ నున్నది. మట్టియందు కుండలాకార నామములు, దూదియందు వివిధములగు నూలు వస్త్రాలు దాగియున్న రీతి నాయవ్యక్తతత్త్వమునందే నీబ్రహ్మాండభాండములన్ని నవ్యక్తముగనుండును. అయితే నిది పరమాత్మయందు నారోపింపబడినదే కాని వస్తుతః పరమాత్మ కాదు. ఇంత పెద్ద బ్రహ్మాండముగా గనిపించునుగాని జ్ఞానము గలిగెనా బాధింపబడును.

ప్ర॥ ఈ మాయాశక్తిని కనుగొను టేరీతి?

ఉ॥ మట్టియందు కుండలుగా మార్చితే, మారగలశక్తి యొకటిలేనిచో కుండలాకారములుగావు. అగ్నియందు దహనశక్తి, పృథివియందు కఠినశక్తి యుండలేదా? అట్లు పరమాత్మయందుండుటచే దీనినిగూడ చేతనాశక్తియందురు. ఇదియే పరాశక్తి. అపరాప్రకృతికంటె నన్యమైన పరా

శక్తిమఱొకటున్నదనినది. భగవంతుడు దీనినే జీవరూపముగనున్నది. దీని చేత ప్రపంచము కదలింపబడుచున్నది. ఒకటి జడము, నొకటి చేతనము.

ప్ర॥ ఉపనిషత్తులయందు ప్రపంచమును సృజించి తానే యందులో ప్రవేశించినాడంటే, నీ పరాప్రకృతి యెక్కడిది? పరాపరప్రకృతులకు పరమాత్మ వేఱుకాదా?

ఉ॥ పరమాత్మను తెలుసుకోవలె; స్థూలసూక్ష్మములనుబట్టి లేదా ఇంద్రియోపాధులబట్టి గ్రహించవలె. నిర్వికారుడగు పరమాత్మ నుపాధులద్వారా జగత్తునకు కారణత్వము గల్గిన విధ మిదియే. సూర్యప్రకాశ మంతటా ప్రకాశించుచున్నది. కాని నెవరినైన గాల్చినదా? లేదు. ఇట్లు నిర్వికారపరమాత్మగలడు. సూర్యమణిలేక భూతద్దమునుంచిన సూర్య ప్రతిబింబము నద్దమునుండి మన మెచ్చట జూపిన నచ్చట బడి కాలగల వస్తువుల గాల్చును. కాల్చినది యద్దమా? లేక నిజమైన సూర్యుడా? కాదు. కాల్చినది ప్రతిబింబమే. అయితే అది యెవ్వరిది? సూర్యునిదేను. సూర్యునిగాదని యులాదాగానున్నదా? లేదు. ఉపాధి యద్దము. ఎంతద్దమో నంత ప్రతిబింబము. ఆ ప్రతిబింబమునకు గల జ్వాలనశక్తి సూర్యునిదే యగును. ఆలాగే నిర్వికారమైన పరమాత్మ వ్యాపకమై నిరాకారముగ నున్నది. అంతఃకరణోపాధిగల స్థూలశరీరముల చిదాభాసుడై తెలుసుకొంటు దేహధర్మముల, దేహారక్షణముల చూచుకుంటు నద్దము పోవుచుంటే ప్రతిబింబము పోవుచుండును. అంతఃకరణమునకు, దేహమునకు చలనత్వము గల్గించి నవి పోయినట్లు గమనాగమనములు జేయుచు, నటువలెనే జన్మమరణ పరలోక గమనాగమనాదుల గనుచున్నాడు. జడప్రకృతి యగు శరీరమునకంటే శ్రేష్ఠమైనది. ఇక జూడు. శరీరాంతఃకరణముల దోచు పరాశక్తి జీవుడు పరమాత్మయేకదా. ఎంత యింజనుకైన కదపడని గ్యాస్ నడిపితేగాని యది నడవదు. ఆ గ్యాసు దేనిది? వ్యాపకమగు నగ్నితత్వమునదేను. నిమిత్తోపాదానకారణముల, నపరావరాప్రకృతుల యావద్విశ్వము భగవంతుడనియే నర్థము.

ప్ర॥ స్థావరముల పరమాత్మలేడా? పరాశక్తిలేదా?

ఉ॥ అంతఃకరణ లేనివానియందును పరమాత్మ యున్నాడు. కాని జీవత్వము సుషుప్తియందు జీవసాధనములు లేకపోతే బాహ్యావిషయము

గోచరించనట్లు వానికి కదలికగాని, తెలిసికొనుటగాని లేదు. తక్కిన స్థితి యంతగలదు. పరమాత్మ వ్యాపకుడు. కావున జీవుడే ధారణకర్త. ఉపనిషత్తులు జెప్పిన రీతి పరమాత్మయే ప్రవేశించినాడన్నది విదితమాయెను గదా. 'జీవుడే దేవుడు' "జీవో దేవస్సనాతనః" జీవదేవు లిద్దఱొకటియే. ఇద్దతేల? పరాప్రకృతి, అపరాప్రకృతి ద్వయముతో సర్వము పరమాత్మయే.

ప్ర॥ అట్లైన పరమాత్మకంటె వేరేమి లేనేలేదా?

ఉ॥ లేనేలేదు. నేను నేను యంటు సర్వత్రా స్థావరజంగమముల తానే యున్నాడు. ఇది పారమార్థిక సత్యము. ఏకుండనుబట్టినా మన్నే, నే రూపము జూచిన తానే నని జెప్పి 8వ శ్లోకమునుండి 11వ శ్లోకమువఱకు జ్ఞానముద్వారా సర్వము పరమాత్మగా తెలుసుకోలేనివారికి వ్యావహారికముగ నిత్యజీవితములో భగవంతుని సందర్శించ నుపాసించే విధానము వినిపించెను. పరమరహస్యమగు నీయాధ్యాత్మతత్త్వమును జ్ఞానము గల వారే నిజము గ్రహింతురు.

ప్ర॥ ఏడవశ్లోకార్థ మేల తాము జెప్పలేదు?

ఉ॥ పూసల లోపల, పూసలమధ్య నేమున్నది? దారము. దారము లేదా దండయే లేదు. భగవంతుడారీతి, పూసలవంటి స్థావరజంగమ శరీరంబుల జీవరూపము నేను నేనంటు తనయందే ప్రపంచమును ప్రకాశింప జేయుచున్నాడు. తానే లేడా ప్రపంచములేదు. ఇదిగో త్రాడు, మందాంధకారములో కొందఱు మనుష్యులు జూచి పాముని, పూలమాల యని, జలదారియని, నేలపటియు, ములుకట్ట, గీతయని భిన్న భిన్న యభిప్రాయముల, నామరూపముల గల్పించిరి. అప్పుడు వారు గల్పించిన యన్ని నామరూపములు దేనియం దధ్యస్థమై యుంటున్నవి? అన్ని నామరూపముల నా త్రాడేయైనది. త్రాడే లేదా, వీరి యభిప్రాయకల్పిత నామరూపము లెట్లు రాగలవు? త్రాడును తెలియనంతవఱకు త్రాడధిష్ఠాన చైతన్యమందలి యవిద్యా తమోగుణంబులో క్షోభగల్గి నాయా రూపములు గల్గ తమ తమ శరీరాంతర్గత సాక్షిచైతన్యము నాశ్రయించిన యవిద్యాంతఃకరణ సత్త్వగుణాంశమున నాయారూపముల జ్ఞానము నొకేతూరి పుట్టి భ్రాంతియైనది. భ్రాంతి తొలగితే త్రాడొక్కటే యున్నది. అయితే నొక పేరునకొక పేరునకు, నొక రూపమున కొకరూపమునకు భేదములే

గాని, త్రాటిదృష్టిలో నీ భిన్నభావములే లేవు. సజాతీయ విజాతీయ స్వగతభేదములుగ దోచు నీయావద్విశ్వము హరియే. హరి వివర్తము. మాయాపరిణామమే భిన్న భిన్నములుగ భ్రమాజ్ఞానములో పూసలవలె సచరాచరముగ గనిపించుచున్నది. హరి లేడా, నవి యుండవు. హరియం దివి యన్ని యధ్యస్తములై నపుడు దారమువలె నంతటా తానేయున్నాడు. నీటిలో మునుగనంతా నీరే. ప్రాతిభాసిక, వ్యావహారిక, పారమార్థికముల వెలయునది భగవంతుడే. ఉపాధులతో, భేదముతో, ప్రారబ్ధకళలతో, నావిర్భావతిరోభావముల సుఖదుఃఖ కల్పవికల్పమయములు పరమాత్మకు వికాసములేగాని మరేమికాదు. వ్యాప్యవస్తువులనే చూచుచున్నాము; వ్యాపకవస్తువును జూడవలె. వ్యాపారి వివిధవ్యాపారములలో సరుకు మంచిది, లాభము చూచును. గ్రుడ్డివాడన్ని వస్తువుల తడవిచూచును. చెవిటివాడు పలుకుభావముల గ్రహించును. భ్రాంతిగలవాడన్నిటిని వేఱు వేఱుగ జూచును. జ్ఞానము గలవాడంతటా పరమాత్మనే జూచును.

ప్ర॥ మణులలో దారమువలె నంతటా తానే యుండినా భేదములుగ గనిపించు వ్యావహారికమున భగవంతుని మఱువక నుపాసించవలెనంటె సాధ్యమా?

ప్ర॥ పట్టుదల యుండి, భగవద్విషయము తెలిసిన నుపాసింపగలరు. బట్టల దుకాణమునకు వెళ్లితే నొకని కొక వస్త్రము, మఱొకనికి మఱొక వస్త్రమునం దిదేరీతి, ప్రతివ్యక్తి కొక్కొక్కదానియం దనురాగము, తక్కినవానిపై ద్వేషమున యయిష్టము. ఇవే రాగద్వేషములు. ఒకని ప్రేమ మఱొకనికి ద్వేషము. ఈ రాగద్వేషములు, వస్త్రములు లేక బట్టల గొనువారివల్ల తమలో తమకు గల్గును. చిత్రవిచిత్రములగు బట్టలన్ని ఒకే నేతగానివలన తయారయ్యె నతనికి రాగద్వేషము లొదవింపవు. కొనెడి వారికే నైకైకభావము గలుగుటకు బదులు, రూపములు వేఱగుట, భిన్న భిన్న భావము లుదయించును. సుఖదుఃఖములకు కారణము నా బట్టల గొనువారికేగాని, బట్టలకుగాని, నేతనేసినవానికిగాని లేవు. మఱియు నాతని నైపుణ్యమే నీ రాగద్వేషములకు కారణము. భగవంతుడనే చిత్రకారుని వలన నానావిధములుగ కనపడు సృష్టి యొకని కొకవిధము, మఱొకనికి మఱొకవిధము; నొకని కొకటి ప్రేమ, ఒకనికొకటి ద్వేషము. అనగా

అహంకారమమకారములు కల్గించుచున్నవి. అంతయు నొకని మహిమయేనని గ్రహించుట కష్టమే. ఒకనివద్ద ననేకవస్తువు లున్నవనుకో, నెవరికీయకపోయిన, నొకవేళ నిచ్చిన, తిరిగి రావటములోగాని బొత్తిగా నీయకుండ నుండుటకు వీలులేకగాని, కొనిపోయిన వారివల్ల మార్పుచేయుటకుగాని వీలులేకుండ నన్నిటిపై తన పేరు లేదా విలాసమున్న నెవరేమోసము జేయుటకు వీలులేదు. ఎక్కడున్న తన విలాసమేనని, తనకుగాని, తదితరులకుగాని పొరపాటులేకుండ నెట్లుండునో నట్లే నంతటా భగవంతుడేనను భావవిలాసము వేయవలెను లేదా భగవంతుడనునది విలాసమేగాన నీవేమన్న నది భగవంతుడేయగును.

ప్ర॥ ఇదియొక యుపాయమే. దీనపాత్ర పలానివానిదని కన్నట్లు ప్రతి వస్తువున పరమాత్మను గనవచ్చు. భగవంతుడుజెప్పిన పాత్రలవిలాసముల గుర్తించినట్లుగాక, పాత్రలకు తేక కొలతతూనికెలకు వేసిన మోర్లవలె గుర్తించు భగవద్గుర్తులు వివరింపుడి ?

ఉ॥ భగవంతుని యుద్దేశ్యము నేయుపాయముతోనైన తన్ను గుర్తింపజేయవలెననుటే. జలమున రసస్వరూపముగ చంద్రసూర్యులలో ప్రకాశముగ, వేదములయందు ప్రణవముగను, నాకసమందలి శబ్దము, మనుష్యులలోని పౌరుషశక్తియు నేనే యన్నాడు భగవంతుడు. ఈ రహస్యములు తెలియుటచేత నది భగవత్కళ భగవత్ప్రసాదమేనని గుర్తెఱుంగుటయేగాక త్రాగుట, స్నానమొనర్చుట మొదలైన క్రియలేగాక ప్రాణశక్తి నీ రసమే బలము. నీటియందు భగవచ్ఛక్తి లేదా, మనము జీవచ్ఛవములమే. ఆ నీటిచేత నపవిత్ర మంత పవిత్రమై మనుష్యులు, తక్కిన ప్రాణులు తేజోవంతులగుట భగవన్మహిమయే నందువలన నీరు భగవత్స్వరూపముగ భావింపవలె. చంద్రునివలన నోషధులు చల్లదనము ప్రాణోత్పత్తికి కారణము. సూర్యుని ప్రకాశముచే వర్షము, నపవిత్రస్థలములు పవిత్రములగుట, చీకటితొలగటము, జీవకళలు సర్వప్రాణులకు గలగటము నందువలననే చంద్రసూర్యుల భగవద్రూపములుగ నర్చించటము. యోగులయొక్క చంద్రనాడి సూర్యనాడులనునవి కాలగతులు నుత్తమ లోకప్రాప్తికి నీ సూర్యచంద్రులె కారణములు. వారియందు భగవత్కళ యున్నది. శరీరమునకు తలవలె, నింద్రియములలో కన్నులవలె వేదములకు

ప్రణవము ప్రధానము. ఎచ్చట జూచిన ప్రణవాత్మకమును ప్రవాసియుండుట, చదువ్రాని బాలబాలికలకు నోమ్మని కూడలె రుద్దించటము, పరమాత్మను వాచ్యము క్రమము క్రీంచ్చునది ప్రణవమునే నుపాసింతురు. శుభములకు ప్రణవమునే నగ్రమున నుంచటము, ప్రార్థించటము జరుగుట, ప్రణవము నుండియే అ ఉ మ్ నర్థమాతృకలతో విశ్వామంతరమైన దనెదట ప్రతిహారిలో నున్నది. 56 అక్షరములు బుట్టుచోట బుట్టునది కాదు. కంఠ్యములు, తాలవ్యములు, దంత్యములు, నోష్ఠ్యము, లనునాసికములు, కంఠతాలవ్యములు, దంతోష్ఠ్యముల బుట్టునదికాదు. ఇదియే రహస్యము. ఎక్కడబుట్టి నెక్కడణగుచున్నదని తెలిసితే నోంకార లక్ష్యమదియేనని తెలియును. ఆకసమందలి శబ్దము, ప్రతియొకశబ్దము నాకసమున నుండి కలిగి స్వర్గనరకములకు, ధర్మాధర్మములకు, బంధమోక్షములకు కారణమగుచున్నది. ఈ శబ్దముయొక్క స్వరూపము భగవంతుడనుటచే 'నిశ్శబ్దం బ్రహ్మముచ్యతే' శబ్దమునుండి యేకైకస్థితి నొందవచ్చును. మనుష్యులలో పౌరుషము అనగా ప్రయత్నము. ప్రయత్నముచేత. నేమహత్తైన సాధించగలము. ప్రయత్నహీను లేమి సాధించలేరు.

ప్ర॥ ఇంతేనా భగవంతుడు వచించిన రహస్యములగు తనవిభూతులు?

ఉ॥ భూమియందలి గంధగుణము, నగ్నియందలి తేజస్సు, సర్వభూతములలోని జీవనము, తపస్సంపన్నులలో ద్వంద్వసహనరూపమగు తపశ్శక్తియును, సకలభూతములకు సనాతన బీజమును, బుద్ధిమంతులలోని బుద్ధి, తేజశ్శాలురలోని తేజస్సు, బలవంతులలోని కామరాగరహితమైనబలము, సర్వభూతములలోని ధర్మమునకు విరుద్ధముగాని కామమును నేనేయనెను భగవంతుడు నివియే విభూతులు.

ప్ర॥ భగవంతుడేస్వర్గముననో, నేరూపముననో, యెందో నున్నాడని తెలియబడదని కల్పితదైవముల ప్రతిష్ఠించి వృథాప్రయాసపడుచున్నారే. ఆదినుండి గీతాశాస్త్రములేదా? ఇంత స్పష్టముగ కనిపించే ప్రతివస్తువున నున్నట్లు చెప్పియుండుటే నేల తెలిసికోలేక నీ యనర్థములు నేటికిని పడుచున్నారో చిత్రము. ఇంటికొక్కదేవుడు, మనిషికొక్కదేవుడు, గ్రామా

లకు, పట్టణాలకు, ప్రాంత్యాలకు, దేశాలకు నెగుమతులు, దిగుమతు లగుచు, పటాటోప ప్రతిష్ఠల ప్రాలుమాలుచున్నారంటే నేమి కారణ ముండును ?

ఉ॥ గీతా ప్రచారము విశేషించిలేదు. అందువలన నిన్ని విపరీతదృష్టుల రోగమొకళ్ళైతే మందొకటిచ్చినరీతి, అంగడిలో నుండేదొకటి, యడుగున దొకటి, అంగడిలో నుండునదొకటి యమ్మునదొకటి, మనస్సులో నొకటి మాటలో నొకటి "సత్యంవద ధర్మంచర" ప్రమాణమున్నచోటనేనుంచి తమ తమ జీవితావసరములబట్టి జరుగుచున్నది. పృథివియందుండే గంధ గుణములేదా, పృథివి యుండనే యుండదు. పృథివీతత్వము లేరూపమున నున్న నది సూక్ష్మమైయుండి కాపాడును. కావున దానిని భగవంతునిగా జూడవలె. శబ్ద స్పర్శ రూప రస గంధము లనునవి భూమికి సంబంధించినవే. అగ్ని యందఱకు నవసరమె, రాత్రి వెలిగించు దీపమునకు, వంటకమునకు, యజ్ఞమునకు ప్రధానమైనదగుటచే దాని నుపాసింతురు. సమస్తజీవుల జీవనశక్తిలేక ప్రాణము భగవంతుని యంశమే. నాది నీది యంటున్నాము గాని పొరబాటు; భగవచ్ఛక్తియే కారణము. తపస్సు చేయువారిలోని తపనశక్తి భగవంతుడే. అందువలననే శపించటముగాని, యనుగ్రహించుటగాని, యెందుకు పనికిరానివాడు మహాత్ముడగుట, మాననీయుడగుట భగవద్విభూతి యుండబట్టియేకదా. సకల భూతములకు కారణము తానే. తాను లేకా భూతములే యుండవు. స్థావరజంగమముల వెలయునన్నిటికి కారణభూతుడు భగవంతుడే. బుద్ధిమంతుల బుద్ధి సమదృష్టిగలవారిలోని దేది నదియే బుద్ధి. ప్రతిరంగమున బుద్ధిమంతులనేకదా యెన్నుకొనెదరు? బుద్ధిహీనుల పరామర్శింపరు. తేజశ్శాలురలోని తేజస్సు. బుద్ధునిజూచి గజదొంగయగు నంగులీమాలుడు లొంగటము, శంకరున కందఱు దాసోఽహ మనటము తేజస్సుచేతనేకదా. మృగ పక్షి మనుష్య దేవతల పై తమ నాకర్షింప జేసుకుంటున్నారంటే నది భగవచ్ఛక్తియే. బలవంతులలోని బలము తానే, బుద్ధిబలము, దేహబలము, స్థానబలములతో గలిగిన బలత్వమునకు భగవంతుడే కారణము. చీమ మొదలు బ్రహ్మపర్యంతముగల సజాతీయ విజాతీయ స్వగతభేదగతులగు ప్రాణుల స్వేచ్ఛకు భంగము కలుగని ధర్మవిరుద్ధముకాని కామము భగవంతుడే. బ్రహ్మచర్యమునకు, దేహ

బలమునకు, మానసిక వికారమునకు, భవబంధమునకు దారి జూపని కామము దైవస్వరూపము. చూచితివా! ఎందు జూచిన నిండియున్న భగవంతుడు తానే యనే దారములో నీ సర్వమును గూర్చియున్నాడు. తను గూర్చకపోయిన స్ఫాంతమునంటిన పిన్నులవలె నాయన నంటి బ్రహ్మాండమున్నది. ఈ రహస్యము తెలుపువారులేక విద్యాబుద్ధులులేక యాచార జ్ఞాన లేనివారగుట, లోకోద్ధారకులు లేకపోవుట నన్ని దేవతలు, మంత్రములు, ప్రతిష్ఠలు జరుగుచున్నవి. గీతను విన్నారా, పొరబాటేలపడెదరు? పడరు. భగవంతుని సులభముగా నుపాసింపవచ్చును.

ప్ర॥ ఆయన కళలంతేనా? ఇక ననేకములుగలవా?

ఉ॥ అనంతస్వరూపునియందు నేకాంశ మీ జగత్తు. అందే వివరించితే వర్ణనాతీతమగు నాయన కళలు గలవు. మొదలె చూపు తక్కువ. అద్దమెందుకను రీతి నిప్పుడు వినిపించిన విభూతులతోనే మన జన్మము తరింపగలదు. పెక్కువానితో పని యేమి? ఒకటి సాధించితే నన్నిటిని సాధించిన ఫలమువచ్చును. బహు ప్రయాస యేల? కొందఱకు సుఖము, జ్ఞానము, శాంతమునందు ప్రేమ, రాగ ద్వేష కామ లోభాదులందు ప్రేమ కొందఱకు, నిద్రాలస్య ప్రమాద సోమరిత్వ యులసతలనిన ప్రేమ కొందఱకు, నీమూడు తరగతులకు ఫలమేమి? సుఖము, దుఃఖము, మోహము నివిగూడ శాశ్వతములుకావు. వీనిని పోగొట్టుకొనిన పోగలవు. ఇవి యవిద్యా దోషయుక్తములు. 12 నుండి 13 వఱకు శ్లోకములలో జగత్తు త్రిగుణాత్మకమని చెప్పబడినది. పైస్వభావముల ప్రాప్తమే లోకము. సత్వ రజో తమో గుణముల సమ్మిళిత వ్యాప్తియే జగత్తు. ఉత్పత్తి, స్థితి, లయము లందు వలన జగత్తు త్రిగుణాత్మకము.

ప్ర॥ త్రిగుణమయియగు మాయాగుణాలేనా ప్రపంచము? ఈ మూడు గుణములు జడములుగదా? వీనికి సృష్టించు శక్తి యెక్కడిది? వీనికి నాద్యు డొక్కడు కలడా? ఉన్నచో నెందుకు గనిపింపడు?

ఉ॥ స్వర్గమర్త్యపాతాళములని మూడుగుణముల లోకములుగలవు. మఱియు నాయాలోకములందుగల స్థావరజంగమప్రాణులలోను వీని మూటి ప్రభావముండును. ప్రకృతి జడమేయైనను పరమాత్మయొక్క సత్తాచే

పరిధవిల్లును. పరమాత్మను కాదనలేవు. ఇవియే పరమాత్మ యెందుకు కాదనవచ్చు. కాని మాయాగుణముల ప్రకాశింపజేయువాడే కాని మాగుణములవలన తాను ప్రకాశింపడు. ఎఱుపు, నల్పు, తెలుపు రంగుగల చిన్న పెద్ద బుడ్లను కరంటు ప్రకాశింపజేయును. కాని సదరు లైట్లవలన కరెంటు ప్రకాశింపజాలదు. స్పెల్సువలన బలుపు వెలుగును. బలుపువలన స్పెల్సు వెలుగదు. జగద్రూపముగ, నంతఃకరణములుగ మాయయే పరిణమించినది. మాయాగుణముల నతిక్రమింపజాలనివారు మాయచేత బంధములో బడుదురు. రంగులరాట్నమువలె ప్రపంచము దానియందలి జీవులుండుచున్నారు. పరమాత్మ వీనికి విలక్షణముగానుండును. తిరుగునట్టి రంగులరాట్నమువంటిదే మాయ. వానికినుంచిన చిత్రవిచిత్రముల బొమ్మలే గుణముల మిశ్రమము. వాని నెక్కిన, లేక వాని నభిమానించువారే జీవులు. దాని యధిపతియే నీశ్వరుడు. నడుమనుండు గుంజయే పరబ్రహ్మము. ఆయన ననుసరించే రాట్నము తిరుగుచుండును. కాని నాయన దేని కంటడు.

ప్ర॥ ఇంతవఱకాయన నన్నిటియందున్నాడన్నప్పుడు నన్నిటి నాయన నంటకుండు టెలా ?

ఉ॥ గోడకున్న పెద్దయద్దములో నెదుటనున్న స్థావరజంగమములన్నియు తోచును. అయితే నవి యద్దములో లేవా ? యున్నవి. మఱి యద్దములో గలవా ? లేవు. వాని స్వరూప మద్దమా ? అద్దములేక నవి యుండగలవా ? వానిని యద్దము తెలిసికొనవచ్చుగాని, అద్దమును నవి తెలిసికొనగలవా ? తెలిసికొనలేవు. అద్దమువంటి భగవంతునియందు దోచు జగత్తున కాధారమధిష్ఠానమేగాని, పూసలలోని దారమువలె లోననున్నాడన్నపుడు నాకాశమువలె నున్నాడని గ్రహించవలె. త్రిగుణాతీతుడాయన. ఆయన యధిష్ఠానముచే సర్వము ప్రకాశించును. త్రిగుణజాతములగు నీ రాగద్వేషమోహాదులవలన లోకము భ్రాంతినంది నిరుపాధికమగు నాయన స్వరూపమెఱుగజాలదు.

ప్ర॥ ఈ గుణమయమగు మాయ నేమనెదరు ? దీనిని తరించుటకు నుపాయమేమి ?

ఉ: 14 నుండి 15 శ్లోకమువఱకు నీ వడిగినవిషయమే నర్జునునకు భగవంతు డెఱిగించినది విను. దైవమాయ అని భగవంతుడు పేరుబెట్టెను. ఇయ్యది దాటశక్యముగానిది. కాని దానికి యునికిలేదు. మేఘమునకు, నింద్రజాలకుని మాయకు నునికిలేదు. లేనిది యున్నటుల దోచును. దాని గుణములతో ప్రకాశించును. ఇంద్రధనుస్సు గంధర్వనగరమువలె నెంతటి వారినైన భ్రమింపగలదు. నీటికి దెలియకుండ పాచివలె పరమాత్మను నాశ్రయించియున్నది. ఆయనందే బుట్టి నాయననే సూర్యుని నావరించిన మేఘమువలె నావరించినది. కాని పరమాత్మ నేమిజేయజాలదు. ఒక ధనవంతుని సాకుడు కుక్కయొకటున్నది. అది రేయింబూట ధనవంతునికి తెలియకుండ నెవ్వని రానివ్వదు. ఆయనతో పనియుండినవా రాయనకు వినపడేలాగు దూరమునుండి కూయిడ నతడెప్పుడు బలుకునో, కుక్క యపుడే నూరకుండును. భగవంతుని తెలియనీయక కుక్కవలె నావరించి యున్న నీ మాయను నిర్వ్యాజ, నిర్మోహ, నిశ్చలప్రేమతో, ఋజువర్తనతో భగవంతునకు తన మొర వినులాగున దుఃఖముతో కూయిడిన భగవంతు డెప్పుడు తన కభిముఖమగునో అప్పుడే మాయతొలగును. మీటర్ వత్తేది తెలియకపోతె నింటిలోని చీకటి తొలగదు. మీటరు వత్తినామా, వెలుగు ప్రకాశించేకొలది చీకటి దూరమగును. భగవంతుడే గజేంద్రుని మొరవిని పరుగెత్తుకొనివచ్చినరీతి నార్తులై బిగ్గరగా ప్రార్థింప భగవంతుడే వచ్చును. తక్కిన యుపాయములకంటె భగవచ్ఛరణాగతి భగవద్భక్తి యుండవలె.

ప్ర: అయితే భగవంతునకు శరణాగతుడు కావలెనంటారా?

ఉ: భుజబలమునగాని, ఆయుధబలమునగాని శత్రువు నెదుర్కొన లేనివాడు నన్యులసహాయ మపేక్షించుట మనకు తెలియదా? మాయను నెదిరింపగల ధీమంతు లేవెయ్యింటికో లేకపోలేదు. వారికి దైవసహాయ మవసరములేదు. ఎదిరింపజాలనివారు భగవంతుని నాశ్రయింపవలసినదే. ద్రౌపది, ధ్రువుడు, నారద, విభీషణ, యర్జున, గాంధీప్రభృతులవంటి వారెందఱు శరణాగతులు కాలేదు? నీవు నేనుగూడ శరణాగతులము కావలసినదే. లేదా నా మాయాకుక్క స్వతంత్రులగాని, దైవప్రాప్తి గాని బొందనీయదు. భక్తిచేత సులభముగా ముక్తిలభించును. శరణాగతి

పొందలేకపోతే మాయాభిమానముతో నశించెదరు. భగవంతుని యాశ్రయించితే నెట్టి మాయనైన తొలగగలము. హనుమంతుడు లంక జంపను, వారిధి దాటను, విభీషణుడు చిరంజీవియగుటకు, ధ్రువపదము ధ్రువుడందుటకు, నర్జునుడు విజయమొందుటకు, శరణాగతియేగతి, రక్ష. మాంత్రికుని జూచి గ్రహము వదలదా? బదనికజూచి పాము పరుగిడదా? ఔషధము చికిత్సవలన రోగము తొలగదా? తద్విధము భగవద్భక్తి, మాయ తొలగును.

ప్ర॥ భగవదనుగ్రహములేకనే మాయను హరించినవారు గలరా? ఎట్లు? మాయను తమంత జయింపలేనపుడు భగవచ్ఛరణాగతి బొందని వారి గతేమి? మోక్షములేదా?

ఉ॥ క్రమశిక్షణగలవాడు రోగముబొందడు. వానికి వైద్యుడు మందు నవసరములేదు. ప్రకృతి సంబంధములగు గుణమయవికారములనంటని ధీరుని మాయ యేమిజేయును? వారికి భగవంతుని నాశ్రయింపవలసిన పనిలేదు. అంటే భగవంతుని తిరస్కరించిరనిగాని నాస్తికులనిగాదు. భగవత్సమ్మత యుదాసీనులు. ఇద్దరు వాదులాడ నొకతీర్పరి యవసరము. వాదులాటే లేనివానికి తీర్పరెందుకు? శంకర, వివేకానంద, రామతీర్థ, శుక, సులభ, గార్గి ప్రభృతులు మాయామయ ప్రపంచమునె నిరసించిన ధీరులు. ధీరులుగాక భగవంతుని ప్రార్థనజేయనివారు దుష్కృతులు, మూఢులు, నరాధములు, మాయాపహృతజ్ఞానులు, నాసురభావాశ్రయులు నగువారు భగవంతుని దలంపరు. భగవంతుని జెందరు. వీరు మాయచే గట్టువడినవారై, యుత్తమగతులుగానక, జన్మజన్మముల పాపాత్ములగుదురని భగవంతుడే అనెను. ఈ యైదు రకాలవారు శ్రద్ధలేక దుర్విషయులై, శాస్త్రార్థమును బాటింపక, ప్రమత్తులై, విరుద్ధార్థముల, పరోపద్రవకారులై, దేహాత్మబుద్ధులై, చెప్పినను గ్రహింపలేనివారు మాకొకరు జెప్పేవారా మాకు తెలియని దేమున్నదని నహంకరించి, శిశుపాల, దంతవక్త్ర, కంస, దుర్యోధనాదులరీతి కైపెక్కిన, పైత్యగించిన, కామోద్రేకముగల్గిన భంగి తమతమ స్వధర్మములమఱచి ప్రవర్తించినట్లు, మాయ తన గుణముల విజృంభింప తెలివిగానక క్రొత్తనీటికి నెదురెక్కి వలల కొడెములబడిచచ్చు చేపలవలె నశింతురు. సుగతిలేదు.

ప్ర॥ భగవంతుడు దయామయుడు. పచ్చిపాపాత్ములనైన రక్షించెద నన్నవాడు. తాను సంకల్పించితే నేమైన జేయగలడు. అటువంటివాడు వారియందు దయలేక పోవటమేమి? వారి నేల సాధువులుగా మార్చ కూడదు?

ఉ॥ భగవంతుడు కరుణామయుడగుటచేతనే నామాయలో పడవద్ద నెను. గుణముల వశము గాకుడనెను. ఆ గుణములనే బొందవలెనంటే వానిఫల మనుభవింపుడనెను. తనశక్తినే నంతట నుపయోగించి, చేపట్టితే నందఱు సోమరులౌతారు. స్వతంత్రులు గానివారెన్నడైన నొంటిజనిన మరల మాయ మ్రింగగలదుకదా? పురుషత్వమగు పౌరుషేయమునే నాశము జేస్తారు. వేదవేదాంత ధర్మశాస్త్రములే తీసివేయవలసివచ్చును. లోకనాటక చాన్సే తప్పుతుంది. ఆయన దృష్టికోణములోనే కాదు, సజ్జనుల దృష్టిలో దుర్మార్గులే లేరుకదా? దుర్జనుల పనులు సన్మార్గుల క్రమశిక్షణ సాధనలుకదా? దుర్జనులకు సజ్జనులే లేరు. తమవలెనే, నంతట నందఱను జూచెదరు. రైలుపెట్టెలో దొంగలున్నారు జాగ్రతయని ముందే వ్రాయబడినది. ఇక పొరపాటెవరిది? ఈ వస్తువు తినవద్దు, రోగ మతిశయించు. నిబ్బరములేక, పథ్యముండక, రోగమెక్కువైతే నెవరితప్పు? కష్టించి పని చేయి, సోమరివిగాకు, ఋణము చేయకుమంటే పని చేయక నున్నది, దిగమ్రింగి యప్పులొనర్చిన తప్పెవరిది? తల్లిపాల వదలి జముడు పాల త్రాగుట దోషమెవరిది? మనకంటె ముందే గీతాశాస్త్రమువంటి ప్రస్థానములు రోడ్డున కస్తాలుదెలుపు పోలీసువలె నుండ, స్వబుద్ధిచే దోషాత్ములమగుచున్నాము. తప్పుచేసినను గమనించియైనా రక్షించమంటే భగవానుడు కాదవలేదే. దుర్యోధనాదులవద్దకే పోయి వెనుకగల్గిన ధర్మ గతులు మధ్యవర్తిగాజెప్పితే వినలేదుగా! విశ్వాసము భక్తియుంటే చాలు, రక్షించును. అసలు దుర్మార్గులనుసైతము రక్షించేదెవరు? తానే. ఎప్పుడో ఒకతూరియైన కనుగొనెదరనియె నాయన యభిప్రాయము.

ప్ర॥ ఈ జన్మము నెత్తకపోతే నీ గీతను వినేభాగ్యమే యుండదుకదా! మాయను, సంసారమును భగవంతుని తెలిసి సంసారమాయలనుండి భగవంతుని శరణాగతులై ముక్తినొందవచ్చు; లేకపోతే నధోగతి నొంద

వచ్చు. భగవంతునిజెందె నుపాయముల తెలియవలె. శరణాగతి యనే యుపాయములెన్ని? వారెట్టివారో వివరింపుడి?

ఉ॥ 16 నుండి 19 వ శ్లోకము వఱకు చతుర్విధ భక్తులను వినిపించెను. "భక్త దుఃఖకర్షిత్వాత్ కృష్ణః" భక్తుల దుఃఖముల దూరమొనరించు శ్రీకృష్ణుడు "భజసేవాయాం" తన్ను సేవించువారి ననుగ్రహింప గలడు. ఆర్తుడు, జిజ్ఞాసి, యర్థార్థి, జ్ఞాని యని లోకములోని భక్తుల నాలుగువిధములుగ విభజించెను. ఆచారనియమముల, వేషభాషల, యుచ్చ నీచముల నెట్లుండిన నలుగురిగానె తన్నర్చించువారిగ నర్జునునకు జెప్పెను. చిన్నతనమునుండి యేస్వభావము నేయభ్యాసముండునో, తుద కదేగతి ప్రాప్తించును. కుక్కగాబుట్టి సింహాము, సింహాముగాబుట్టి కుక్క కావలెనన్న కాజాలవు. భగవంతుడు జెప్పిన నలుగురు భక్తులలో జేరిన వారినేగాని తక్కినవారి విషయముకాదు. అయితే యీ నలుగురను జూచి తొలుత "మహాపాతకినాం త్వార్తే" ఎట్టి పాపాత్ముడైన నార్త భక్తుడుగా జేరవచ్చునట. ఈ నలుగురు భక్తులే దైవమున్నాడను యాస్తిక్యము గలవారు. ఈ యాస్తిక్యము గలుగుటే నొక పెద్ద పుణ్యము. పాపాత్ముల కాస్తికత్వమెక్కడిది? ముందుజన్మమునందలి పుణ్యము లేదా, ఏభక్తుడు స్వాభావికముగా కాలేడు. దుఃఖము లేని వారెవరు? దుఃఖనివృత్తికొఱకే నితరయుపాయముల వెదకెదరు. గర్భమునందుండి పుట్టి చనిపోవువఱకు దుఃఖము దేహేంద్రియసంబంధమెట్లు వదలును? ఒకజన్మములో బోయెటుగానుంటే భగవంతుని శరణుజొచ్చు టెందుకు? ఆస్తికులంటే "అస్తి పరలోకమితి మతిర్యస్య సః ఆస్తికః" పరలోకము, దేవుడు, వేదముల నమ్ముటాస్తికమనెదరు. నమ్మకపోవుట "నాస్తికో వేదనిందకః" నాస్తికులనెదరు. నిజమైన యాస్తికులు వేద ధర్మములరీత్యా భగవత్సాక్షాత్కారము నొందినవారుతప్ప, కుహాస్తిత్వము నిరుపయోగమగును. వీరికంటె నాస్తికులే మేలు. దుఃఖనివృత్తికి నితరోపాయముల వెదకెదరుగాని, భగవంతుని వెదకరు. ఆరీతి వెదకిన వాడే నార్తభక్తుడు. తల్లినివెదకు శిశువు, పాలకై తల్లినివెదకు వత్సము, నక్కరకై జేయు వెచ్చము, నాకలికొఱకు దాసత్వము నివి తాత్కాలికములు. ఏమైనగాని నా తాత్కాలిక సమయమునైన సరళత్వముచే

నన్యథా నమ్మక భగవంతునియందే శ్రద్ధాసక్తులుంతురుగాన వీరే నార్తభక్తులు ద్రోవది గజేంద్రు డిత్యాదులు. భగవంతుడేలాటివాడు? అయనను తెలుసుకొనవలెననే జిజ్ఞాసి రెండవభక్తుడు ఉద్ధవునివంటివారు "కోఽహం కథమిదం జాతం కో వా కర్తాఽస్య విద్యతే" నేనెవ్వడను? ఈ ప్రపంచమెక్కడిది? దీని కర్త్యత్వుడెవ్వడని తెలియగోరువారు. భగవల్లక్షణముల నెఱుగుటకై దేశదేశముల, నాశ్రమముల, శాస్త్రముల, సాధుసజ్జనుల, సత్క్రతువుల, మంచిస్థలముల వెదకెదరు. ప్రకృతిశాస్త్రజ్ఞలగు విజ్ఞానవేత్తలు నెంత ప్రయత్నముజేసి యణుశక్తుల గనిపెట్టిదరో తత్వజిజ్ఞాసులు నిరంతర కృషి జేయుచు నిరీక్షించుచుందురు. ప్రతి మహాత్ముల దేవుని జూచితివా? జూపింపగలవా? అని మన స్వామి వివేకానందయు, రాత్రిళ్లు రాచకార్యమువదలి నేసన్న్యాసుల భక్తుల మరుగుననో నుండి భగవద్విషయము తెలియగోరు మన ఛత్రపతి శివాజీ, లండన్నుండి వచ్చిన పార్‌బ్లాంటక్, అనిబిసెంట్, నివేదిత, మీరాబెన్, బుద్ధ, జినుల వంటివారెందఱో జిజ్ఞాసులయ్యే తదుపరి మహాత్ములయిరి. జిజ్ఞాస బీజమువంటిది, రాను రాను వృక్షము కాగలదు. సత్యార్థ విచారులు తమ జీవితము నందుకై వినియోగింతురు. వారే మహానుభావులు. పూర్వకాలమున నిట్టి జిజ్ఞాసు లొకరివద్ద కొకరు జని తత్త్వమును తెలిసికొనిరి. పక్షి యాకసమున నెంతెత్తు యెగురుచున్నదన్న తనయెరను నంత సులభములో గనిపెట్టుటకై యెయ్యోనని మనమెఱుగమా? శరీరసాధన, మనోసాధన, వాక్సాధనల, మంత్ర తంత్ర యంత్ర జప తప వ్రత యజ్ఞముల నంతరంగ బహిరంగముల వెదుకుట జిజ్ఞాసులయ్యే నేసాధనమున, నేస్థలమున, నెవ్వారి వలన తమ జిజ్ఞాస పూర్తియగునో నంతవఱకు నన్వేషించుచునే యుందురు. దీనినే శుభేచ్ఛ యందురుకూడ. మూడవవాడు ఫలాపేక్షపరుడు. ధనమో, ధాన్యమొ, రాజ్యమొ, ప్రదేశమో, సంతానమొ, లోకహితమో, మాహాత్మ్యమో వాంఛించి యందుకొఱకై భక్తుడగును ధ్రువ, భగీరథులవంటి వారు. ఈ ధనాదుల పరోపకారార్థము నుపయోగించువారుత్తములు, స్వార్థులు మధ్యములు. నాల్గవవాడు జ్ఞాని భక్తుడు తక్కిన ముగ్గురకంటే శ్రేష్ఠుడని భగవంతుడే జెప్పెను.

ప్ర॥ ఈ నలుగురు భక్తులలో జ్ఞానిభక్తు డెట్లు శ్రేష్ఠుడో చెప్పండి?

ఉ॥ మొదటార్తుడై, పిదప నర్థార్థియై, నటువెనుక జిజ్ఞాసియై జ్ఞాని కావచ్చు. సగుణభక్తులై పిదప నిర్గుణభక్తులు నగుదురు. ఈ విషయము నీవలె నర్జును డడిగెను. అర్జునునికేగా దీనంశయము; విశ్వజనీనమైనది. నేను నీ నలుగురిలో నేభక్తునయ్యెదనని జ్ఞాపకము జేసుకొనుటకు నడిగెను. మొదటి ముగ్గురు భగవంతుని నన్యథా పరోక్షముగ దలంచెదరు. ఎచ్చటనో నొకచోటనుండి తమ యభీప్సితముల నిచ్చుచున్నాడని వారి నమ్మకము. జిజ్ఞాసి యెందుగలడో యనియే నన్వేషించును. జ్ఞానిభక్తు డపరోక్షముగ ననగా భగవంతుడు తనుగానే నెఱిగి సేవించును. ఇతని భక్తి నిష్కామము, నిర్గుణము. తక్కినవారిభక్తి సగుణము, కామ్యము. రుక్మిణి,ప్రహ్లాద, శుక, సనకసనందనాదులు నిర్గుణభక్తులు. తక్కిన భక్తులు సగుణులు. సగుణభక్తులు నాయా సమయములందే భజించెదరు. జ్ఞాని "ద్వితీయాద్వై భయం భవతి" భయకారణము గల్గు రెండవవాడున్నాడనే భేదబుద్ధిలేక "సర్వమిదమహం చ బ్రహ్మ" నేను సమస్తప్రపంచము బ్రహ్మమే "అహమేవేదం సర్వమ్" యనువాడు "తచ్చింతనం తత్కథనం అన్యోన్యం తత్ప్రబోధనమ్" యని తన చింతనే, తన కథయే, తన కన్న నన్యములేదనియే తెలిసియుండువాడు. తక్కిన భక్తులు ఫలప్రాప్తి కొఱకై ద్వైతబుద్ధితో నుపాసింతురు. జ్ఞాని యద్వైతబుద్ధితో ధ్యానధ్యేయములన్ని స్వాత్మరూపముగా జూచును. ఇందుకయ్యే తక్కిన భక్తులకంటె జ్ఞానిభక్తుడే నా కెక్కు డత్యంతప్రియుడని భగవంతుడనెను.

ప్ర॥ జ్ఞానిభక్తుడు స్వాత్మరూపముగ భగవంతుని జూడడము యహంకారము, స్వార్థముకాదా?

ఉ॥ ఒకడొక గొప్ప యుద్యోగి కావలెనంటే నెంతకాలము బట్టును? ఉద్యోగియైనమీదట నెంత ప్రదేశమున కుద్యోగియగునో, నదియంతనాది నేను యని చెప్పుటలో దోషముగాని, విరుద్ధార్థముగాని లేదు. బీజముగా నుండి వృక్షమగుట కెంతకాలము బట్టును? ఆ వృక్షములోని భాగములన్ని నేనేనని బీజము చెప్పుటలో భేదములేదు. ఎంతకాలమొ నార్జింప నార్జింపమైన ధనవంతుడు ధనమంత నాదియే,నేనే యనుటలో ప్రభేదమేమున్నది?

స్వల్పకాలములో, సద్యోకాలములో ప్రాప్తించునవియేనా? కావు. బాహ్యవిషయములకే నెంతోకాలము గావలసివస్తే మనతోపాటు బుట్టి జ్ఞానియైనాడనుట క్రిందటి జన్మము లనేకములలో జ్ఞాని కాబోయ్యే పుణ్యాపను లొనర్చినందున నీ జన్మము తత్ప్రాప్తి ఘటిల్లినది. లేనిచో నీ జన్మము లోనే జ్ఞానియై సర్వము బ్రహ్మమయము లేక వాసుదేవమయమని గ్రహించుట దుర్లభము. తక్కిన భక్తులు భగవంతుని దెలిసికొని ఫలమును ముందుంచుకొని సేవించెడివారు. భగవంతుడు వేఱు, తాము వేఱు యనియు మాకన్న గొప్పవాడు కాబట్టియే మా కోరికెల నిచ్చెను; మఱచితే నేమగుదుమో యని భయముచే కృతజ్ఞతకొఱకు నితరవ్యామోహములుండియే భజింతురు. ఆటలమీద తల్లి నిమఱచి పాలకొఱకువచ్చినపుడు తల్లి యొడిలో నుండు కుఱ్ఱవాడు సమయమొచ్చిన మరల బరుగెత్తగలడు. తత్ప్రకారమే ఫలకారులగు భక్తులు దేవుని నర్చించుటకద్దు. జ్ఞాని భక్తు డట్టివాడు కాడు. పరమాత్మయే జ్ఞాని, యైక్యైకస్థితి వేఱు వేఱున్న చెప్పవచ్చుగాన యాస్థితి జ్ఞానికే తెలును. అయినా భగవంతుడు నా యాత్మయే జ్ఞానియనెను. ఎంతవాడు కానిదే నింత మాటననా? ఈ యొక్క గుర్తే చాలు.

ప్ర॥ ఈ జన్మములోనే జ్ఞానులగుట సాధ్యము కాదా?

ఉ॥ ఉద్యోగి కావాలంటే నొకసంవత్సరములోనే కాగలడా? పెక్కు సంవత్సరములు చదివి, ప్రతిసంవత్సరము తప్పకుండ ప్యాసై, సిఫార్సు దొరికితే యుద్యోగి అగును. ఈ జన్మములో జ్ఞానియెవ్వడు కాజాలడు. అనేక జన్మములనుండి పుణ్యకర్మలనే తరగతుల గడిచివచ్చినవాడై నీశ్వరానుగ్రహముగలవాడు జ్ఞానికాగలడు. నీ విప్పుడు జ్ఞానికా నపేక్షించుచున్నావంటే బహుజన్మ పుణ్యఫలము అనియే చెప్పవలె. "అనేక జన్మభజనాత్ స్వవిచారం చికీర్షతి" అనేకజన్మములయందు జేసిన భక్తి ఫలము తన విషయమునుగురించి శ్రద్ధతీసుకొనును. జ్ఞానికి నిది యంతిమ జన్మము. అంతిమజన్మములోని ఫలమే జ్ఞానియగుటకు కారణమని భగవంతుడు వచించెను. తక్కిన భక్తులు పరంపరజ్ఞానమునకు సంబంధులే. తక్కిన భక్తులమార్గము జ్ఞాని మంతనుభవించినదియే. అతడు నిజముగ

వాసుదేవుడే. ఇట్టివారు లోకములో మహాదుర్లభులు. వారిని దర్శిస్తే చాలు,హరిదర్శనమే. వారున్నదే పుణ్యస్థలము. వారి పల్కులే వేదములు; వారే భగవద్రూపులు.

ప్ర॥ భగవంతుడు మూడుషట్కములగు గీతలో ప్రథమషట్కమున త్వంపదార్థవిచారణ నిష్కామకర్మ జెప్పినాడు. తృతీయషట్కమున తత్త్వమసి నిర్ణయార్థము సభేదజ్ఞానము తెల్పినాడు. ద్వితీయషట్కమున తత్పదవిచారణ జెప్పినాడుగాని భక్తిని చెప్పుటేలా?

ఉ॥ భక్తినే ప్రేమ, సేవ, శరణాగతి అనే పేర్లజెప్పెదరు. వీనిలో సకామముతో జేయుట ఫలప్రదము. నిష్కామముతో నొనర్చుట చిత్తశుద్ధి, జ్ఞానప్రాప్తి, జీవన్ముక్తి లభించును. ఈ యధ్యాయమున నఖండమగు నద్వితీయపరమాత్మను పరోక్షముగజెప్పుచు సులభముగ భగవత్ప్రాప్తికే గాక, ముందువెనుకలజెప్పిన జ్ఞానకర్మలకు మధ్య భక్తియుండిన గలిగే సత్యదర్శనము, కర్మకు కళ, జ్ఞానానికి పోషకత్వము గలుగుననే యుద్దేశ్యముతోను, భక్తిలేకపోతే సత్యదర్శనం బొందుట కష్టమని దానియుంచెను. అదేకాక నందఱు కర్మిష్ఠులే, నందఱు జ్ఞానులే నుండరు. ఇద్దరు వాదులాడునపుడు మధ్యనొకడుండి నా తగవునుదిద్ది, వారి యశాంతములను బాపి శాంతవంతులుగాజేయును. జ్ఞానకర్మలకు మధ్య భక్తియుంచటము భగవంతుడు తన పూర్ణావతారత్వమునకు, గీతా పూర్ణత్వమునకు విశ్వాసము గలిగించెను. చీకటి వెలుతురులకు, కలిమిలేములకు, పుణ్యపాపములకు, స్వర్గనరకములకు, దైవాసురులకు పరస్పర విరుద్ధములవలె జ్ఞానకర్మలకు పరస్పరవిరుద్ధమే. రెండుభిన్నములే; లక్ష్యములు వేఱు. జ్ఞానముచెప్పినది కర్మ కాదనును, కర్మ జెప్పినది జ్ఞానముకాదనును. కర్మమతములో జగత్తు సత్యము. జ్ఞానమతములో జగత్తు మిథ్య. కర్మిష్ఠిగావలె నంటుంది కర్మ. నిష్కామిగావలె నంటుంది జ్ఞానము. అజ్ఞాన నివృత్తి జ్ఞానము. ఉత్పత్తి, ప్రాప్తి, వికార్య, సంస్కారములు కర్మకృత్యము; జ్ఞానము ప్రకాశము, కర్మ జడము. జ్ఞానమునకు విషయము సిద్ధవస్తువగు బ్రహ్మము ఫలము, నిత్యసిద్ధమగు నిశ్శ్రేయస్సు. కర్మకు విషయము సన్నుష్ఠానసాపేక్షమగు ధర్మజిజ్ఞాస, ఫలము నభ్యుదయమగు సుఖాపాద్యాదులు.

ఈ విరుద్ధము మధ్య సామాన్యజనులు నలిగిపోకుండ హతమనస్కులు గాకుండ భక్తియుండుట, రాసక్రీడలో గోపికలమధ్య కృష్ణుడున్నరీతి, నీ కళ యుండుట నుత్తమము.

ప్ర॥ శాస్త్రీయమగు కర్మల నిష్కామముగా నాచరించ భగవంతుడు సెలవిచ్చెనుగదా. అటువంటప్పుడు విరోధమేమున్నది?

ఉ॥ నిష్కామముగ నాచరించుచున్నను, సమత్వము సిద్ధించేవఱకు మిథ్యాభూతమగు జగత్తును జగత్తు సత్యముగానున్నట్లు నాచరించుటలో భక్తి మధ్యలేకపోయిన కర్మజ్ఞానముల రెంటికి పూర్ణత్వమే సిద్ధింపదు. కావున కర్మమిశ్రిత భక్తి, కేవల శుద్ధభక్తి, జ్ఞానమిశ్రిత భక్తి సకల విధాధికారులకు కల్యాణము జేకూర్చును; సకల సాధనలకు ప్రాణతుల్యమై యుండునుగూడ. శుద్ధభక్తి శుద్ధజ్ఞానము రెండు నొకటే యనెను రామకృష్ణపరమహంస. భక్తి యుపాయము జ్ఞాన ముపేయమనె శంకరుడు. భక్తి ముక్తికి జ్ఞానికైన కర్మిష్ఠునకైన నవసరమనె నాచార్య వినోబా. భక్తి జ్ఞానకర్మలు పరస్పరము వేఱు వేఱు లేవు, ఒకదానికొకటి యవినాభావ సంబంధమున్నదనెను మహర్షి మలయాళస్వామి.

ప్ర॥ భక్తి లేకపోతే కర్మజ్ఞానములు రెండు సమస్తమానవులకు మోక్ష మివ్వలేవా?

ఉ॥ కుంటికి, గ్రుడ్డివానికి పొత్తు కుదరదు. జ్ఞానకర్మ సముచ్చయము మోక్షదాయకముగాదు. యోగవాసిష్ఠమున సుతీక్ష్ణుడనువాడు నగస్త్యుని నీవిషయమై నడిగితే మోక్షదాయకములు గావనెను. ముందుకు నొక చక్రము, వెనుకకు నొక చక్రము తిరిగేబండి గమ్యస్థానమును జేర్పలేదు. కాలికి త్రాడున్నంతవఱకు పక్షి నాకాశమున సంచరించలేదు. కర్మయనే త్రాడున్నంతవఱకు రెక్కలనే జ్ఞానమున్నను, పైకి నెగిరి స్వాతంత్రించి విహరింపలేదు. మోక్షమను నాకాశమున జ్ఞాని కర్మిష్ఠులుగాని, జ్ఞాననిష్ఠులుగాని భక్తి లేకపోతే కర్మ జ్ఞానములు రెండు బంధనములుగా మారవచ్చు. భక్తిలేని కర్మ దంభము, కర్తృత్వాభిమానము గల్గించును. భక్తిలేనిజ్ఞానము శుష్కమై చిత్తమున తర్కబుద్ధిగలిగి యహంకారము గల్గించును. భక్తియున్న భక్తిరతుడై లోకసేవ భగవత్సేవగాను, భక్తినాత్మ

రతుడై జ్ఞాని దంభము బంధము లేనివాడగును. ప్రపంచము వ్యావహారికములోగూడ మిథ్యయైనను దాని భగవద్రూపముగ తెలిసికొని మహాత్ములగు జ్ఞానులు జగత్తునకు మేలొనరించు కర్మల కర్తృత్వజ్ఞానములేక చేయుట నకర్మయగును. మహమ్మదువెంట నిద్దరు భక్తులుండిరి. శత్రువులు తరుమునప్పు డొకడు తప్పుకొనగా మిగిలిన భక్తుడు మన మిరువురమేనే యన, మహమ్మదు కాదు ముగ్గురమనెను. మూడవవాడు భగవంతుడే. "హత్వాపి స ఇమాన్లోకాన్న హంతి న నిబధ్యతే" అను నహంకారరహితుడై నర్జునునివలె శత్రుజయము సాధించెను. అది యకర్మయే. కావున కర్ములగువారు సకలకర్మల జేసినప్పటికిని జగత్తుయొక్క పారమార్థికసత్యము బ్రహ్మముగా గుర్తెఱిగి నహంకారములేక కర్మలు చేయుట నకర్మయే యగును. పాత్రలో నన్నమున్నది, తిన నోరున్నది, మధ్యలో చేయిలేదా, యెక్కడిదక్కడనే యుండును. వంటపాత్రలో అన్నము, భోజనపాత్రములో నుంచ మధ్య గరిటె యవసరము. ముందు వెనుకల తిరుగు చక్రములేవైయైనను, మధ్య యిరుసు వుండకపోయిన వీని రెంటిపనులు కావు. పాలనిచ్చు నావున్న,పిండువాడున్నను, మధ్య నేపుటకు దూడ యుండవలె. భార్యాభర్తలకు మధ్య తాళి యుండవలె. త్రాసునకు రెండు సిబ్బెలకు మధ్య కట్టెగాని, త్రాడుగాని లేనిచో నేది ముందు, నేది వెనుకాడుచున్నదనేది తెలియదు. ఆ ప్రకారము భక్తిలేనిచో జడమగు కర్మకు త్రాణలేదు. హల్లునకు అచ్చులేనిచో ప్రాణమేలేదు. కర్మకు భక్తి యుండుటచేతనే దానికి ప్రాణము గలుగును, ఫలకారియగును. పెట్టెల కన్నిటికి నింజనులేదా, అవి యుండినచోట నుండవలసినదే. జడమగుకర్మ పెట్టెల వంటిది. దానికి భక్తిగాని, జ్ఞానముగాని, నిష్కామముగాని నాధారము కావలెను. ఒకప్పుడు కర్మిష్ఠుడొకడు, పరోక్షజ్ఞాని యొకడు తమలోతాము నొకచోచేరి నేను ముందు మోక్షమునకు, లేదు నేను ముందు మోక్షమునకు బోదునని తగవులాడుచుండ నా మార్గమున జనునొక వేశ్య వారి తగవులుజూచి, నేను బోతే బోవచ్చునని వెళ్లిపోయెను. వీరిరువు రాయర్థము తెలిసికొనలేక నామెనుజేరి పాదములబడి మాకంటె నీవు ముందుబోయే మార్గము తెలుపుమన సిగ్గుపడి నాకేమార్గము తెలియదు. నేను నేననే యహంకారముబోతే బోవచ్చునంటినిగాని మరేమార్గము కాదన, వారు

సిగ్గుపడి తమ తమ యహంకారములకు స్వస్తిజెప్పి పరస్పరులోకటియై, అ స్తవ్య స్త వ్యవహారము మాని సుఖించిరి. వీరిరువురకు భ క్తిలేనిదాననే కదా అహంకారము పొటకరించి వివాదము బెంచెను. అహంకారమే లేనిచో వారిరువురి మార్గములు వేరైన భేద మెక్కడిది? ఇందువలన భ క్తినిచేర్చి చతుర్విధభ క్తులను నిరూపించి భగవంతుడు జెప్పెను. "మోక్షసాధనసామగ్ర్యాం భ క్తిరేవ గరీయసీ" మోక్షమునకు భ క్తి సులభమైన సాధనము, ప్రాధాన్యమైనది. తగరపుకత్తి, పూటకూలివాని భ క్తమర్యాద, వేశ్యయొక్క ప్రియత్వము,జాటిలోని కొయ్య, పెరటిలోని బండ, పండనివృక్షము, దాతృత్వములేని ధనికుడు, విశ్వాసములేని మిత్రుని వంటి భ క్తి యిత్యాదులు నిరుపయోగకరములు. "శుకాద్యాః సనకాద్యాశ్చ పురా ముక్తా హి భ క్తితః। భ క్త్యైవ మామనుప్రాప్తా నారదాద్యాశ్చిరాయుషః" భ క్తివలననే పూర్వము శుకాదులైన బ్రహ్మములు, సనకాదులైన సిద్ధయోగులు ము క్తులైరి. నారదాదులు జీవన్ము క్తులై చిరాయువుగలవారైరి. భగవంతుని నర్చించుటకు హృదయమొక్కటియె చాలు. తల్లివంటి పెక్కుస్త్రీలగన్నను, తల్లిని జోగొట్టుకొన్న కుఱ్ఱవాడు వారిముఖాలకేసిజూచి తల్లిగాదని నిషేధించి,తల్లిముఖమునే గనెనా,సర్వము మఱచును. గంధపుచెక్కను ప్రేమించుటము వాసనకొఱకే. కావున భక్తులు నిషేధముఖమున ప్రియవస్తువగు పరమేశ్వరుని ప్రేమించి, తన్మయత్వమున కృతార్థులగుదురు. "వాసుదేవ స్సర్వమితి"యను శబ్దార్థమును జీర్ణమొన రించుకొని నిర్మలుడై తన్మయుడైనవాడె జ్ఞాని భ క్తుడు. ఒకతూరి బాధింపబడిన పాము మాటిమాటికి స్ఫురించినను, త్రాడేనను దృఢజ్ఞానము వలె బాధింపబడిన జగత్తు, మాటిమాటికి దోచినను, జ్ఞానికది బ్రహ్మమే. ఇదియే బాధితానువృ త్తి.

ప్ర॥ మహాత్ముడనిపించుకోవలెనంటె జ్ఞానికావలె; జ్ఞానమురావలెనంటె ననేకజన్మలముల పుణ్యఫలముగలుగవలె. భగవంతుడే బిరుదుయివ్వవలె; నెవరో యిచ్చిన బిరుదులు సరిగాదు. మహాత్ముడంటే నన్నియవస్థల సర్వత్ర మహాత్ముడే కావలె. అయితే నీ వేషధారులు భాష్యకారులు గాదన్నమాటయేనా?

ఉ॥ వేషములు భాషలు నుండగూడదని కాదు; వారికితగిన వైరాగ్యము, చిత్తనైర్మల్యము, భగవదాకారస్థితిబొందే భక్తి లేకపోతే నే ప్రాప్తిగలుగదు. ఇంతకు జ్ఞానము సూర్యునివంటిది. జ్ఞానముగల నిర్గుణభక్తుడు ముఖ్యభక్తుడు. "భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్" వాగ్భూషణమే సుభూషణమని భర్తృహరియన్నట్లు, జ్ఞానియే గౌణభక్తులకంటె సౌందర్యయుతుడు. వానిని వర్ణించ నేరికిని సాధ్యముగాదు. అతనికంటె నన్యథా యేముండబట్టి. సాధించితే జ్ఞానాన్ని సాధించవలె. అదియే పురుషప్రయత్నము. మానవత్వానికి సొబగు. తలకు కిరీటమువలె, లోకమునకు మాణికెవంటివాడు. ఇరువదినుండి ౨౩వ శ్లోకమువఱకు నన్యదేవతల నారాధించువారిని భగవంతుడు జెప్పుచున్నాడు.

ప్ర॥ అన్యదేవతలగు చిల్లరదేవతల నుపాసించు టెందుకు? సకలలోకారాధ్యుడును, స్వయంప్రభువునగు గీతాచార్యుడుండ నట్లేల జేసెదరు?

ఉ॥ నీవలెనే నర్జునునకు నీవిషయమున సందేహమే. విశాలబుద్ధి యనగా దీర్ఘముగా నాలోచించి నిశ్చయించునది. విచారణశక్తి లేనివారు కొంచెము తాళితే మృష్టాన్నము లభించును. కొంచెము రోపికబట్టితే దైవదర్శనమగునని యనుభవజ్ఞులు దెల్పినను స్వల్పమతులు కనిపించిన నేయన్నమునైన దిని తృప్తిబొందటము, దైవదర్శనమునకు బదులు మఱొకటి దర్శించి నింతే యనుకోవటము, యోచనలేని యదృఢభావులు వస్తువు నరసమంటే నచ్చుటికే పరుగెత్తుదురు. సులభదర్శనము, సులభకానుక, సులభార్చన అన్నచోటికి పరుగిడుదురు. ఈలాగు స్వల్పమతులై స్వల్పముతో తృప్తినొందువారు నిహలోక పరలోకములకు సంబంధించిన పుత్ర, పశు, కళత్ర, సంపద, నాయువు, నారోగ్యము, బలము, ప్రతిష్ఠ, పేరు రాగలిగినవానియందు లౌకికదృష్టితో కనిపించేవానికొఱకై నేయే దేవతలకు సేవేవి యర్థములో నవి యాచరించి యా దేవతలచే నభీష్టముల బొందెడివా రనేకులు గలరు.

ప్ర॥ ఆ గొప్పదేవుని వీరు నారాధించకపోవటమేల? చిల్లరదేవత లెచట నుండి వచ్చిరి?

ఉ॥ వట్టిచేపల యంగడియందు సువాసనద్రవ్యములకు నవకాశ ముండదు. గ్రుడ్డివానికి తన పాదముల నేదిక్కునుంచిన అతనికది రస్తాయే యగును. చెవిటివానికి తన యూహలే యితరులవల్ల విన్నవనుకొనును. కుంటివానికి నిలుచున్న స్థలము పవిత్రమే. ఆవిధము కల్పితదైవములు, కల్పితనివాసములనుంచి భుజించెదరు. పోస్టుప్యూన్ వలన మనకు వుత్తరము లభించినదంటే నా డిపార్టుమెంటువలన లభించినది గాని ప్యూను వలన లభింపదు. పోస్టలు డిపార్టుమెంటు మనకంటికి నగపడదు. చిల్లర దేవత లిచ్చేవరములు పరమాత్మవల్ల నివ్వబడినవే. చిల్లర దేవతల నర్చన గొప్పదేవుడగు భగవంతునకు చేరును. ఫలము నాయనవలన లభించును. చిన్న చిన్న యుద్యోగులవద్దకు పోవుట సులభమే; వారికి మన విన్నపముల విన్నవించుకొనుట సులభమే. మనకు ప్రాప్తమగుట వీరివలననే. కాని మన విన్నపము పైకి బంపించి నక్కడనుండి జారీయైతేనే నీ చిన్న యుద్యోగస్థులు మనకందిత్తురు. పైవారి యుత్తరువు లేకనే నివ్వగలవి, తాము చేయగలవి, చేయుదురు. అదేరీతి నల్పదేవతలిచ్చు ఫలప్రాప్తులిట్లుండును. ఏ దేవతల నారాధిస్తే నా దేవతారూపముల వారి శ్రద్ధను మరింత తీవ్ర మొనరించుచు కోరిన ఫలములు నా దేవత లిచ్చునది నేనే యిచ్చుచున్నా ననెను భగవంతుడు.

ప్ర॥ ఈ యల్పదేవతలిచ్చు ఫలము శాశ్వతమైనది కాదా?

ఉ॥ శాశ్వతమనేది తెలిసితే నీ దేవతల నెందుకు నారాధింతురు? తమ కేసమయమున నేది కావలసివచ్చితే దాని నీ దేవతల నారాధించి బడయుదురు. ఎవరెవరికెంత శక్తియున్నదో, కోరినవారెట్టిది కోరుదురో, నంతఫలమే నివ్వగలరు. ఈ దేవత లివ్వలేనివి వీరడగనేలేరు. ఒకవేళ యడుగదలచిన నీ దేవతలవదలి గొప్ప దైవము నారాధింతురు. స్వల్ప కేసులకు స్వల్పప్లీడరుల నుంతురు. పెద్ద కేసులకు నీ చిన్నప్లీడర్లు తామే ఒక పెద్ద బారిష్టరునుగాని, లేక యొక పెద్దప్లీడరునుగాని యుంచమని చెప్పుదురు. కేసువచ్చినవారు యే ప్లీడరు తగునని ముందే నాలోచించుదురు. ఆ ప్రకారమే శాశ్వతమగు మోక్షసిద్ధి నొందగోరువారు గొప్ప దైవము నారాధింతురు. అన్యదేవతాఫలములు శాశ్వతములుగావు. ఒక

చిన్న యుద్యోగి మనవి చేసుకుంటె కొంత సహాయము చేసినాడు. కాని ఆయన మారిపోతే మరొకాయనవచ్చి నా సహాయము చేయ కాద న్నాడు. చూడు, ఫలమిచ్చినవాడు స్థిరముగ నుండువాడు గాకపోవుట నాతడిచ్చు ఫలముగూడ స్థిరము గాకపోయెను. అల్పమతుల ఫలము లంత వంతములె. దేవతోపాసకులు దేవతలను, నన్నుపాసించువారు నన్ను బొందెదరని భగవానుడు తెలివిచ్చెను. ఒకప్పు డొక సన్న్యాసి తనవద్దకు వచ్చు భక్తులకు యెండ వాన శీతల బాధ నివారణకొఱకు కొన్ని సత్రములు కట్టించిన బాగుండుననని, డబ్బుకొఱకు అక్బరుచక్రవర్తిని యడుగబోవ నతడు నమాజు చేయుచు తనకు కావలసిన వరముల దేవుని యడుగుచుంట విని వెనుకకు తిరిగివచ్చుచుండ అక్బరుగని రావటమేమి? పోవుచుంటివేమన, నీకే కొరతగల్గి దైవమును నారాధించి కోరుకుంటుంటే నేను నిన్నడగట మేల? నీకే తక్కువై యుండ నీవిచ్చునదేమి? నీవారాధించే దైవము నే నారాధించితే నివ్వడా? యని వెళ్లెను. మనము పుష్పములపై కూర్చుంటే పుష్పములు కావలసినవారు వానిచెంతకు వచ్చినరీతి తుమ్మెదలవలె భగవంతుడే యన్ని యివ్వగలడు. సారాంశమేమన శాశ్వతమును మఱచి దుఃఖభాజనములగు నల్పసుఖములకై నల్పవరముల నల్పదేవతల నారాధించి నవి ముగిసినంతనె మరల ప్రయత్నించెదరు. దేశప్రజల నారాధించి దేశమంత తన పలుకుబడి జెండవలె నెప్పటికారీతి కాదు. దేశప్రభువునే నారాధించితే ప్రజల నారాధించ పనిలేకనే వశులౌదురు. దేవుడే మన వశమైన దేవతలు వశముకారా? 'విష్ణుమయతలేమి' యని భాగవతమున గజేంద్రుని నేల దేవతలు రక్షించలేకపోయిరి? సర్వజ్ఞత్వములేదు. ఒక పార్శ్వము నందలి యుద్యోగికి నా పార్శ్వములోని స్థితిగతులే తనకు తెలియును గాని అన్యప్రాంత్యముల విషయము తెలియదు. దేశప్రభువున కన్నిపార్శ్వముల విషయము లెప్పటికప్పుడు తెలియును. భగవంతుని విషయమింతియే. 24 నుండి 27 వ శ్లోకమువఱకు మోహకారణము వినిపించుచున్నాడు.

ప్ర॥ అల్పబుద్ధిగల్గి అన్యదేవతల నారాధించువారు నభయప్రదుడైన హరియుండ నల్లేల దలంతురు?

ఉ॥ అర్జునున కీసందేహముండ భగవంతు డీసందేహము దీర నిట్లు జెప్పెను. పైత్యగించినవానికి ప్రపంచము తిరిగినరీతి, మాయామహిమచే

జ్ఞానము లేనివారై ముత్తెపుజిప్పను వెండిగా చూచుట నవివేకమే. ఇంద్ర జాలికునివలన గల్గించు వస్తువుల నమ్మటము యవివేకమేయగును. వెండి గాదోచు ముత్తెపుచిప్ప ముత్తెముగా దోచటము లేదు. ఇంద్రజాలికుని మఱచి నతనివస్తువుల నమ్మినరీతి నవిద్యవలన భగవంతుని గోచరింప జేసుకో లేరు. నిజభక్తులకు మాత్రము భగవంతుడు గోచరించును. ఒక యజ మానుడు తన నౌకరును నీకు నాయందెంత మాత్రము విశ్వాసము గలదన కుక్కమాత్రముగలదన నతడేవగించుకొని నావద్ద వలదనెను. అంత నా నౌకరు కుక్కను తెచ్చి చెవులు తోకకోసి దూరముగా వదలివచ్చి బిలువ మరల దగ్గరకు వచ్చెను. మరొకతూరి నదేకుక్కకు నొక కాలు తీయించి విడిచి బిల్వ మరల దగ్గరకువచ్చెను. ఈ కుక్క విశ్వాసమును గనిన యజ మాని నాతని బుద్ధిసూక్ష్మతకు నచ్చెరువంది తన్ను నిందించుకొనెను. భగవద్భక్తుడీరీతి భగవంతుడు తన మాయల నెన్ని యవాంతరముల గల్పించినను నవి మహాప్రసాదమని త్రికరణశుద్ధిగ పాలించు భక్తుడొక్కడే భగవంతుని గనును. మోహముతో నశ్వరస్వరూపుడగు భగవంతుని లోకము తెలియజాలదు. సూర్యుడండఱు జూచుచుండిన గ్రుడ్డివాండ్రకు సూర్యుడు కనిపింపడుకదా. ఆడించెడివాడు వేరైనను, బొమ్మలే నాడు చున్నవనుకొనుట నెట్టిది? పోయినకాలమును, నా కాలభూతములను, వర్తమానకాలములోని సర్వమును, భవిష్యత్కాలములోని స్థావరజంగమ ముల తానెఱుగును. కాలత్రయాది వ్యవస్థల నెరుగువారెవ్వరులేరు. కాలాదులనే తెలియలేనివారు తన్నెట్లు నెరుగగలరు? కావున "మాం తు వేద న కశ్చన" యనెను. దేశప్రభువును సామాన్యజనులు తెలియలేరుగాని, వారి యాచారజీవితముల నా ప్రభు వెఱుగును. కుండల యుత్పత్తి స్థితిలయ ముల కుమ్మరెఱుగును; నాతని యవి యెఱుగజాలవు. 28 నుండి 30 శ్లోకములవఱకు భక్తివలన మోహమును, జరామరణములును తొలగి ఈశ్వరానుభూతి లభించును.

ప్ర॥ సుఖదుఃఖములు గలుగుటకు నేమి కారణము?

ఉ॥ దేహముతోవచ్చిన మోహము దీనికి కారణము. రాగద్వేష ములు, వానివలన సుఖదుఃఖములు గలుగును. వ్యాపకమూర్తియగు భగ వంతుని నాశ్రయింపక మోహగ్రస్తబుద్ధితో నితరదేవతల నారాధింప

పాల్పడెదరు. జీవులు సమ్మోహితులగుటచే నాయనను తెలిసికొనలేకయున్నారు. ఈ ద్వంద్వమోహము పామునకు పాలుబోసి పెంచిన కోరల విషము వృద్ధియగును; ప్రమాదము గల్గించును. దేహమున కారోగ్యము లేదా, మందు పుచ్చుకొనెదరు. ఈ రాగద్వేషమోహము పాపమువల్ల వచ్చినది. ఎవరు పుణ్యకర్మలనొనర్చి పాపము లన్నింటిని తుదముట్ట నశింపజేసికొనెదరో నాలాంటి జనులు దృఢవ్రతులై ద్వంద్వమోహము నుండి విడివడగలరు. భగవంతుని యారాధించెదరు.

ప్ర॥ అయితే భగవంతుని నారాధింపని పాపాత్ములు భగవంతుని జేరలేరా ?

ఉ॥ తప్పుజేసినవాడు సుద్యోగిని చేరలేడు. మునిగినది తేలలేదు. ఈతరానివాడు సాధనలేనిచో మునుగును. పుణ్యమనే సాధనయుంటే జనన మరణరూప వారాశిలో మునగడు. పాపము సుఖదుఃఖములతోనే విధివిరామములేకుండ జేయుచుండ తీరుబాటే నుండదు. పుణ్యఫలముండిన నేకాగ్రత కుదరగలదు. దృఢహృదయులగుట భగవంతుని నారాధించెదరు.

ప్ర॥ సమస్తము భగవంతుడనే యభేదజ్ఞానము గలవారు పొందే ప్రయోజన మేమి ?

ఉ॥ ఏదివింటే, నేదిచూచితే మానవులు భయపడెదరో, యెవ్వటికైన వద్దనెదరో అదేది? అదేమరణము, ముసలితనము. ఇవి గొప్ప దుఃఖభాజనములు. జన్మించిన ప్రతియొక్కరికీ వదిలేవికావు. ముసలితనము, మరణమనే దుఃఖములనుండి తప్పించుకొనదలచినవారు భగవంతుని నాశ్రయించి తత్ప్రాప్తిసాధన నొనర్చిన వారు తత్పదవాచ్యమగు బ్రహ్మమును సమస్త సచరాచర భూతుడగు నాత్మను, సమగ్రమగు కర్మను తెలిసికొనెదరు. ఎవరు అధిభూతము, నధిదైవము, నధియజ్ఞములతోగూడ భగవంతుని నుపాసించెదరో నటువంటి సమాహితచిత్తముగలవారు మృత్యుసమయమునగూడ భగవంతుని మఱచిపోరు.

ప్ర॥ జరామరణముల భగవంతుడు పేర్కొనుటలో విశేషముగలదా?

ఉ॥ చనిపోయినమీదట నేమయ్యేది నా దుఃఖము తెలియబడేది కాదు. పుట్టుకమునువున్న దుఃఖాలు గడచినవి తెలియబడకుండ పోయినవి.

జన్మించి జీవించేవారినిబట్టి బాధించేవి. వీనినిబట్టి ముందు వెనుక జన్మాల గతులట్టివేననిగూడ తెలియుటకొఱకు ముసలితనము తనకేకాదు, ఎవరికి పనికిరానిదై వికారముతో నెఱుకయుండి ప్రయోజనము లేకపోయినది. ఎంత ముసలితనమైనగాని చావకుండ నిక్కడనే నుండదలంచుకుంటే కోడిని నేమఱించి కోడిపిల్లను గ్రద్ద తన్నుకపోయినట్లు మృత్యువు నెప్పుడో యొకతూరి తన్నుకపోక మానదు. ముసలితనము మృత్యువురాకమునుపే బ్రహ్మము, నాధ్యాత్మ్యము, కర్మ, యధిభూతము, హిరణ్యగర్భుడను నధిదైవము, నంతర్యామియగు నధియజ్ఞరూపుల నెలయునది భగవంతుని స్వరూపమేనని భజించితే మాటిమాటికి బుట్టి జరామరణములనొందెడి యనర్థములు తొలగును. ఉపలక్షణములతో సహా తానేనని సమగ్రముగ జ్ఞానవిజ్ఞానయోగమును భగవంతు డర్జునున కుపదేశించెను. ఈ రహస్యము నెఱిగినవారు జరామరణములనుండి తప్పుకొందురు; కృతకృత్యులగుదురు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం

యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే

జ్ఞానవిజ్ఞానయోగో నామ

సప్తమోఽధ్యాయః

ఓం తత్ సత్

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## అష్టమాధ్యాయము

### అక్షర పర బ్రహ్మ యోగము

క॥ మరణనివారణకౌఱ కక్షరతత్త్వము శుక్లకృష్ణసరణుల వివరం
బెరిగి స్మరింపగ తారక వరయోగమటంచు కృష్ణపరమాత్ముడనెన్.

ప్ర॥ ఈ యధ్యాయము పేరు యేమి?

ఉ॥ అక్షరపరబ్రహ్మయోగము, మహాపురుషయోగము, బ్రహ్మాక్షర నిర్దేశ్యయోగము, అభ్యాసయోగము, తారకబ్రహ్మయోగము, ధారణా యోగము, ఫలితాలయోగమని పేరు. ౨౮ శ్లోకముగల నపూర్వరహస్య విచారణాయోగము.

ప్ర॥ ఏ యే రహస్యములు లేనిదే నీ యధ్యాయమున కిన్ని బిరుదు లుండునా? అర్జునుడేమనెను?

ఉ॥ సప్తమాధ్యాయ చివర రెండు శ్లోకముల ఫలశ్రుతిని వివరించుచు జరామరణములనుండి విముక్తి గలుగుటకు బ్రహ్మాధ్యాత్మకర్మ అధిభూత మధియజ్ఞాదులనే నేడు ప్రశ్నలు, సప్తావస్థలు, సప్తాక్షరి, సప్తజ్ఞానభూమి కలు, సప్తకమలములు, సప్తలోకములకు సంబంధించిన సప్తమాధ్యాయ మున వివరించి జరామరణములనుండి విముక్తి పొందుటకు నీ యధ్యాయ మును ప్రారంభించెను. అష్టాక్షరివంటి యష్టప్రకృతులు శ్రీకృష్ణు డుద యించిన నష్టమదివసమువంటి యనన్యశరణ్యమైన యవ్యయానందప్రాప్తి యోగము నీ యష్టమాధ్యాయము. అక్షరపరబ్రహ్మమును బొందు సాధన వివరింపబడును. తిరుపతి వేంకటేశ్వరుని దర్శించవలె నన్న.వారికి ముందు పోవుటకు మార్గములు తెల్సికొందుము. మానవులమైన మనము యేవనిమీద యెందేగవలసిన నా పోవవలసిన మార్గములను తెలిసికొని

పోవ ప్రయత్నింతుము. అయినను నొక గొప్ప రహస్యము వినిపించెద వినుము. మతములు నొక కోటియుండనీ, సాంప్రదాయము లనంతకోటు లుండనీ, స్వర్గ, సత్య, వైకుంఠ, కైలాసాది లోకము లేనుగాదు రొంక యర్బుదముండని, స్థూలశరీరముతోనో, సూక్ష్మశరీరముతోనో నుండనీ, యేదేవత లేదేవులు ప్రత్యక్షముగాని, స్త్రీలవల్ల పురుషులకు, పురుషుల వల్ల స్త్రీలకుగాని, ధన పుత్ర మిత్రాది వివిధభోగములవల్లగాని నేమి బొందవలెనని మన యాశయము. వివేకవంతులకు నీ రహస్యమే చాలు. ఇంద్రియముల నిగ్రహించు మరేవిధముగాని, యమనియమాది యష్టాంగ యోగములవలనగాని, మంత్ర జప తప వ్రత నియమనిష్ఠలవల్లగాని పొంద దలచినదేదో తెలియకపోయిన నీ కేప్రయోజనముగలదు? విను. అంద మైన స్త్రీతో గలవనెంచితివనుకో, నీవేమి బొందవలెనని? లేదు నొక దైవ సాక్షాత్కారము బొందితివనుకో, నీవేమి బొందవలెను? ఏ లోకమున కేగిన నీ యుద్దేశ్యమేదియని తెలియక నాచరించు ప్రయత్నములన్నియు వ్యావ హారికముగాగాని, పారమార్థికముగాగాని యే మతస్థుడవైన సరే, నే పండి తుడవైన నేమి? ఆకలి తెలియక భోజనము, దప్పి తెలియక నీరు, పనిలేక తిరగటము, వలసటలేక నిద్ర, రోగమును, సోమరితనమును, నిరుపయోగ వంతులనుగ జేయును. లేదు సాలోక్యముక్తి యనెదవా ఒక రాజ్యము లోని ప్రజలు నా రాజు ననుసరించిన రీతి, యిష్టదైవతాలోకమున నివసిం చుట మంచిదే. నివసించి యేమి బొందవలె? సారూప్యముక్తియనెదవా, రాజు నన్నిహితపరిచారకునివలె తన యిష్టదేవతా సన్నిధియుండుట. ఇందు వలన బొందేదేది? సామీప్యముక్తి యనెదవా, రాజుగారి సోదరులవలె నిష్టదేవతాసమీపమున సమానరీతి నొందుట. దీని నేమి బొందవలె? సాయుజ్యముక్తి యంటివా? రాజుగారి పట్టపుకుమారులవలె నాయా యిష్టదేవతలవద్ద నుండుట లేక నా దేవస్వరూపముతో నుండుట నేమి బొందవలెనని చెప్పు. విద్వాంసునివైన సరియే, నవిద్వాంసునివైన సరియే, కర్మివైన, నిష్కామకర్మివై ననసరే, నవరసభరిత చరితాత్ముడవైన సరియే, యావద్విశ్వముయొక్క యిష్టమేది. ఎందుకో అది తెలియక శిష్యుడవైన, గురుడవైన, పెద్దవైన, చిన్నవైన, నేవర్ణ మేయాచారమైన, నేభాష యేయుద్యోగమైన, నేధర్మ మేయధర్మమైన, నెచ్చోటనున్న, యెచ్చోట

నుండకపోయిన, తిరిగిన, కూర్చున్న, నిద్రించిన, తనువులెత్తిన, మృతి బొందిన కర్మగాదు, భక్తిగాదు, ధ్యానముగా దేమైననరే యేమనెదవు?

ప్ర॥ అబ్బబ్బా! తామిప్పుడు సవాలుచేసి సకలజీవుల యభీష్టమేమి తెలుపుమంటున్నావు. ఎన్నిరోజూ వింటినిగాని, చదివితిగాని నాకీరహస్యము తెలియలేదు. మహాత్మా! దయచేసి వచింపుడి?

ఉ॥ అదియే దుఃఖాభావమైన యానందము కాదా! ఇందునకే గదా సకల ప్రయత్నములు కాదా!

ప్ర॥ ఆహాహా! తెలిసినది కీలక మందుకే వేదాంతము దుఃఖనివృత్తి యానందప్రాప్తి యన్నది. ఔరౌరా! యెంత రహస్య, మెంత రహస్యము. ఓ యతీంద్రియ జ్ఞానదక్షులగు పరమహంస శ్రేష్ఠులగు ఋషులారా! మీకు కృతజ్ఞతాభివందనములు. ఉద్దేశమన, యాశయమన, కోరికయన నిదియే మూటికి ముమ్మాటికి సత్యము, ఆనందము కొఱకే,

ఉ॥ చెప్పుము నాయానంద మేరీతి యుండును? దాని వర్ణ మేమి? రూపమేమి? దాని స్థితిగతులు, దాని పుట్టుపూర్వములు, దాని నిలయము, దానిని నోటవచింపుటకు, కలముచే వ్రాయుటకు, పుస్తకముల జదువుటకు, వేయేల, మన కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాంతరేంద్రియముల తెలియదగినదేనా? కాదు. గీతారహస్యమును కొందఱు బాహ్యార్థము గాను, కొందరంతరార్థముగాను, కొంద రంతరార్థబాహ్యార్థములజోడించి తమతమ యభిప్రాయముల వ్రాయుచున్నారు, వ్రాసిరి, వ్రాయగలరు. వ్రాయవలసినదే. ఎందుకు నిదియే నెదురుచుక్క. ఇదియే గడ్డు ప్రశ్న. ఆస్తికుడు, నాస్తికుడు తగవులాడిరనుకొ, నుభయులప్రక్క దేశప్రజలొందువిధములైరి యనుకొ. వీరి ఉభయుల యుద్దేశ్యము?

ప్ర॥ ఆనందమే నానందమే నానంతమే.

ఉ॥ లోకములు, లోకస్థులు, నామరూపములు జడములా? చేతనములా?

ప్ర॥ అన్నియు జడములే, తమ్ము తెలిసికొనలేవు. యెదుటి వానిని గ్రహింపలేవు. చేతనాచేతన మిశ్రమమైయున్న నీ బ్రహ్మాండమున చేతనమే లేదా · బ్రహ్మాండము ప్రయోజనహీనము. జడవస్తువుల నానందము లేనేలేదు. నిశ్చయముగ, నికరముగనైన నెందుండు వచింపుడి?

ఇది ఆనందము, పరమసుఖము, పరమశాంతము, పరమగతి, జ్ఞానపరమావధి, పరాకాష్ఠ అను పర్యాయపదములు గలది యానందమే. ఈ పరమసుఖము నొందుటకే నీ లోకమునకు వచ్చితిమి. స్కూలులోజేరిన నుద్యోగముకొఱకు, నా యుద్యోగమువలన నేమి యనుభవించ నిచ్ఛ? యానందమే. మానవోద్యోగము పరమసుఖముకొఱకే. సుఖమందఱకు కావలె, కాని యనుభవమేమని దానిలక్షణము జెప్పుమన్న ప్రతివారు తటపటాయింపబడుటగలదు. దుఃఖమును జెప్పుమంటిమా చిన్న బాల బాలికలుగూడ చెప్పగలరు. "యదర్థం సర్వం యచ్చ నానార్థం తత్సుఖమ్" సుఖలక్షణము. సర్వ ప్రవృత్తియంతయు సుఖముకొఱకే లేక నానందముకొఱకే. బాహ్యాంతరంగముల నెన్ని యుపాయములు లేక సాధన లొనర్చినను దేనికొఱకు?

ప్ర॥ సుఖముకొఱకు. మన యాశయ మదియేననియు, నదియే చరమ లక్ష్యమగు పురుషార్థమనియు నర్థమైనది.

ఉ॥ ఆనందము యుపాయమా లేక నుపేయమా? చెప్పుము. బహిరంగ యంతరంగ సాధనములను యుపాయములు దేనికొఱకు? సుఖముకొఱకు. సుఖముపేయము. సాధనలవలన మన మార్జించునవి యేవియో కొన్ని నామరూపాదివస్తువుల లేక క్రియాలాపముల భావోద్రేకములను జూచుచున్నాము. ఆనంద మందున్నదియా? లేదు, ఆనందము గలిగెనా, దుఃఖమే యుండగూడదు. ఉపాయములవలన ప్రాప్తము నొందగలుగుటకు నెక్కడ యున్నదని? రక్తమాంసమయశరీరముల, ఇంద్రియములు జడములు. వీనియం దానందముగలదా? ధనమునందు, పుత్రుని యందు, భార్యయందుగలదా? భార్యతో సంగమింపక మునుపు భార్య వద్ద భర్త, భర్తవద్ద భార్య యుంటున్నారే ఆయానందము దేహములలో నుంటే, దేహములే నానందమయములైతే వారిరువురు సమీపమున నుండ నానందములేక దుఃఖాస్పదములగు సంకల్పవికల్పములు, క్రియాలాపములు రొనర్చు కొందురు? అది కాదు రహస్యము. భర్తకు భార్యతోనుండగోరిన నామె కిష్టము లేనపు డామెకు యానందముగలదా? అదే రీతి భర్తతో నుండగోర భర్త కిష్టము లేనపుడు భర్తకానందము గలదా? లేదు లేదు. ప్రాప్యవస్తువు సమీపముననున్నను, నానందప్రాప్తి

గలుగనిదేమి? భార్యాభర్తలు తదానందముకొఱకే రమించిన నిరుపురకు గలిగిన యా స్వల్పానంద మెక్కడిది? రతిలోనిదియా? రతియంటే నర్థమేమి? ధ్యానము, ధారణము, భక్తి, భరము, జ్ఞానము, జ్ఞేయము నను పర్యాయపదముల తత్ప్రాప్తికై నానమయమున సమస్తవిశ్వమును మఱచుట నది జపము, వ్రతము, తపము, తన్మయము, అమనస్కము, అనిర్వచనీయమైనది లభించుట యెక్కడనుండి లభించెను? భార్యాభర్తలన దేహములా? ఆనందము దేహములకా కావలసినది? చెప్పు.

ప్ర॥ ఎంత విచార మెంత విచారము! దేహములకు కాదు. అవి జడములు. వానికి గలిగిన నానందము మన కెట్లు తెలియును? రెండు దేహములలోని బుద్ధులకు తెలియును.

ఉ॥ అప్పుడాబుద్ధులు నిశ్చలముగానుండును. చలనముతోనుండునా? బహిర్ముఖముగనుండునా? అంతర్ముఖమగునా?

ప్ర॥ బహిర్ముఖమాయెనా, చంచలతయుండును. చంచలత లేదా, నిశ్చలము నంతర్ముఖమగును.

ఉ॥ అంతర్ముఖమగుటవలన నేమి లభించినది? అదియేగదా యానందము. భార్య కభిముఖమైన నిశ్చలతెట్లు గలుగును? భార్యకు భర్త, భర్తకు భార్య తమ తమ బుద్ధివృత్తి యంతర్ముఖమగును. అప్పుడుగలిగిన స్థితియే యానందము. దేహమున కంతరముగనున్న నంతరేంద్రియములలో బుద్ధి యభిముఖమైనపుడు గల్గెడి యానందము దేనిది యందువు?

ప్ర॥ ఆత్మది యగును. జడమగుబుద్ధి తత్ స్థితి నొందుటకు నామరూప రహితమైనది యగుటచేత నాత్మాకార మొందినది. ప్రియవస్తువు నిమిత్తముచేసి యాత్మకభిముఖమైన గల్గు నానందము తమ తమ యాత్మలదే నని తెలిసెను.

ఉ॥ ఆనందము నిత్యప్రాప్తమా? కాదా? సదా ప్రాప్తమైన దవిద్యచే తెలియక విషయములగల్గు స్వల్పానందముచే తృప్తి గలుగుటలేదు. కావుననే పురుషార్థములలో ధర్మార్థకామములను వానిని త్యజించి ముందంజవేసిన ధన్యాత్ములు, ధీమంతులు ముఖ్యమగు నాత్మానందము గనిరి. "యో వై భూమా తదమృతం అన్యదార్తం" యన్నది ప్రమా

ణము. ప్రియతమమగు నాత్మానందము మన హృదయమందే కలదు. విషయప్రీతికి కారణమేది? సుఖమే. ఆ సుఖ మానందముయొక్కయే ప్రకాశము. ఆత్మసంబంధములేదా, యేదియు ప్రియముకాదు. గాఢ నిద్రలో, మూర్ఛలో, మరణములో, సమాధిలో నేల విషయములు ప్రియము కాకూడదు? ప్రేమించువాని యభిమానము లేనిచో నివి యన్నియు వ్యర్థములే. "కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాద్యదేష ఆకాశ ఆనందో న స్యాత్" హృదయగుహాయందానందములేనిచో నెవడూర్చును? నిట్టూర్చుననగా బ్రతుకును? "రసో వై సః రసం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీభవతి" తై॥ ఆతడు రసమునకు జీవుడు. రసమును పొందియే గదా యానందియగును. సారములేక స్థిరాంశమే రసము. దాని గ్రోలియే మన మానందింతుము. విషయసుఖమునం దిది విశ్వజనీనము. ఈ బ్రహ్మానందమే శాశ్వతానందము. క్షరమున నశించునది. అక్షరమున నాశములేని యా పరమానందమయునకే నక్షరపరబ్రహ్మము. అతని తెలియు నుపాయమే నష్టాక్షరీమంత్రమువంటి నీయధ్యాయము ప్రారంభింపబడినది. పుట్టిన ప్రతి శిశువు తన మలమూత్రముల నోట యందుకోవటము, నా మలమూత్రములలో బడి పొరలాడటము, నీ స్థితి తల్లిజూచి యా శిశువు నేరడని వానిని శుద్ధిజేసి వానికి హితవు గరపుచువచ్చును. తద్రీతి యవిద్యాంధకారమునకు మడుగు లొత్తుచు విషయలంపటులై, చర్వితచర్వణులై శ్రేయస్సును గననివారికి జ్ఞానగురుడగు నా సచ్చిదానందపరబ్రహ్మమగు గీతాచార్యుడు విరోధముచే నాస్తికులై, ప్రేమీయులై, యాస్తికులైనను తన స్వరూపస్థితి నెఱిగించుటే నాయన కర్తవ్యము. అక్షరపరబ్రహ్మశబ్దములు సగుణములు, సాపేక్షణీయములైనను వాని నుండి వాచ్యమగు నానందమయుని గనుటకు నుపాయమును జెప్పెను. సగుణ నిర్గుణ స్వరూపాల బోధించును.

ప్ర॥ ఈ యుపాయమునదప్ప మఱొక మార్గమున నా బ్రహ్మము బడయరాదా?

ఉ॥ పొందవచ్చు. అదియే క్రమముక్తి. మఱియు నర్చిరాదిమార్గ మనెదరు.

ప్ర॥ క్రమముక్తి యనగనేమి? ఈ యోగము నేముక్తియంద్రు?

ఉ: క్రమముక్తి యెట్లనగా నుపాసించి మరణించి బ్రహ్మలోకమున కరిగి యచట జ్ఞానప్రాప్తియై యుండవలెను పిదప ప్రళయములో బ్రహ్మతో సహా పరబ్రహ్మము నొందెదునది. ఇక సద్యోముక్తి. చావకనే పరబ్రహ్మను తెలిసి భేదమును బాధించి స్వరూపమై యుండుట.

ప్ర: సప్తభూమికలు, సప్తావస్థలంటిరే యవి యేవి?

ఉ: తన్ను లేదా తన దేహమునందుండు సాక్షిస్వరూపుడైన నాత్మను మరచుట యజ్ఞానము. దేహములో పరమాత్మస్వరూపుడైన నాత్మ యొకడుండి మనకగపడుటలేదు అని తెలిసికొనుట యావరణము. ఆప్తవాక్యమగు తత్త్వజ్ఞానముచే విచారించి తనకు గలిగిన నావరణము నివర్తింప నేను బ్రహ్మమని మెలగుట విక్షేపము. గురుమూర్తి సచ్ఛాస్త్రములద్వారా తానైన బ్రహ్మము దేహమునందు నధిష్ఠానముగ నున్నదని తెలియుట పరోక్షము. గురుశాస్త్రములవల్ల పరోక్షమైన బ్రహ్మమున సంశయాసంభావనవిపరీతభావనలు లేక కూటస్థుడే బ్రహ్మమను నిశ్చయమే నపరోక్షము. జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు యను భేదమును తొలగించుకొని యభేద మొందుట, దుఃఖము లేకుండుట, సకల జీవులు బ్రహ్మస్వరూపమే, శరీరములే వేఱు, నాత్మ యొకడను బ్రహ్మాకారస్థితియే నానందము. సప్తభూమికలన శుభేచ్ఛ, విచారణ, తనుమానస, సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థభావన, తుర్యగ యనునవి. సప్తావస్థలు జీవునకు సంబంధించినవి. జ్ఞానభూమికలు జీవుని తరగతులు.

ప్ర: క్రమముక్తి కష్టమైనదియే. చనిపోయినమీదటగూడ బ్రహ్మప్రాప్తి గలిగేవఱకు నేమఱకుండవలె. ఇది యసాధ్యమైనదియే. అర్జును డడుగ హరి మఱేమి చెప్పెను?

ఉ: అక్షరశబ్దము బ్రహ్మవాచకమగు నోంకారమే. అందువలన సగుణ నిర్గుణముల గుఱించి, యోంకారమును గుఱించి నీ యధ్యాయము తెలుపును. ఈ లోకమున పుట్టినట్టి ప్రతిజీవియు చనిపోవుచు, బుట్టుచుండుట నిదియే సంసారము. ఈ సంసార మాయానందప్రాప్తికయ్యే గలిగినది. ఆనందప్రాప్తి బొందిన నీ సంసారము తప్పిపోవును. ఐహికాముష్మికముల నొందినను, యానందప్రాప్తికగు నుపాయముల నిందే తెలుపబడును. జీవులకు నుపాయము లిందున్నవి.

ప్ర॥ ఈ మార్గములు తెలియక చచ్చి పుట్టేది బాగుండదనెదరా?

ఉ॥ పూటి పూటికి రావటము పోవట మెంచక నెదరు. తన యుద్దేశ్యము సమాప్తికాక నేకదా. తన యాశయము మానవత్వమున సుముఖమొనరించుకొనలేకపోయిన మరొకజన్మమున సార్థకము గలిగించుకొనునా? మఱియు మానవుడాచరించే నేయే కర్మలో సుఖపడుచున్నారు? ఎన్నెన్నియైనా తన సుఖముకొఱకు చేసి "నో వా దరిద్రో హి విశాలతృష్ణః" యని యాశకు నంతులేకపోవటము నీయానందము దొరకకపోవుటచేతనే. లేక నెన్ని క్రొత్త మార్గముల నన్వేషించి, యార్జించి వెంట బెట్టబడ్డనైన గొనకపోయెదరు. ప్రపంచమున జన్మించినందుకు యాశయసిద్ధి నొందించుకొనుటయే పౌరుషేయమని నిర్వచనము.

ప్ర॥ తాము జెప్పే మార్గము లేరెక్కరు గమనించి ప్రయత్నించటము లేదే?

ఉ॥ తనకు దోచిన మార్గము మంచిదనియే యనుకొనెదరు. కాని భూగర్భశోధన, వృక్షశోధన, వంటిశోధనల నెందఱు జేయువారు కనిపింతురు? ఏ యొక్కడో కదా. ఆ యొక్కనివల్ల కనిపెట్టిన ప్రయోజనమే విశ్వమానవశ్రేయోదాయకమగుటలేదా.

ప్ర॥ మన మెక్కడినుండి పుట్టితిమి? తిరిగి యెక్కడ పోవలెను?

ఉ॥ చింతకాయకు స్వభావము పులుపు. అది చింతచెట్టునదే. మన యాశయము మన స్వభావము నానందమే. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" ఆనందమునందే బుట్టి నందే వృద్ధిబొంది నానందమునవే లయించటము. ఆనందమునుండి పుట్టుట, నానందము బొందితే పుట్టులేదు. ఆనందముకొఱకే బుట్టుటగూడ. విశాలాకాశమున గమనము చేయవచ్చిన మేఘములు నలుదిశల దిరిగి తమ స్వస్థలము జేరుటకు నుఱుములు, మెఱుములు గల్గించి వర్షరూపమున నదులై ప్రవహించి సముద్రమునజేరి శాంతి నొందుచున్నవి. వానికి మఱెక్కడ శాంతిలేదు. అలాగు ప్రతిజీవుల యుబుకులాటమంతయు మూలస్థానమగు పరబ్రహ్మమునుజేరి తిరిగి రాకుండనుండుటకే. కాని జీవులీరహస్యము తెలియరు.

ప్ర॥ అందుకే నర్జునుని కొక్కనికే దొరికినదీ రహస్యము.

ఉ॥ అర్జునునకేకాదు, నీకును, పృథివియందుబుట్టిబోయ్యేవారికి, పుట్టియున్నవారికి నందఱకు నీరహస్యము తెలియవలసినదే.

ప్ర॥ మానవులకు తెలియని దేమున్నది యనుకుంటినిగాని యీరహస్యము మాకేమి తెలియును?

ఉ॥ సప్తమాధ్యాయమునంత శ్లోకముల నుపలక్షణముగా లేక పర్యాయపదములుగ జెప్పిన బ్రహ్మవస్తువును ముసలితనము వృద్ధాప్యము రాకమునుపే తెలియవలెనని భగవంతుని యాతురత. అందువలన మరణము రాకమున్నే నీ స్థితిని తెలిసికొనవలెను. కుక్క యిల్లిల్లు దిరిగినట్లు, కోతి యూరకుండక తిరుగులాగు మానవులు పడెడు వృత్తులింతే. ఆ వృత్తి రహితమొనర్చుకొనుటలోనె సొబగు. ఎవరైనను అనగా నే జీవులైనను తెలిసిగాని, తెలియకగాని తను పోవు మార్గము ముందే వెదకికొనుచుండుట సహజము. రైలుస్టేషన్ జేరినామనుకో, ఏవ్వారికో టిక్కెట్టుకొనియే నందఱు వెళ్లుచుందురు. తాము చేరదలచిన స్థలము తెలియక టిక్కెట్టడిగిన తప్పే, అసలెట్లు యిచ్చెదరు. టిక్కెట్టు తీసుకొనునప్పటికి తను చేరు స్థలము తెలియవలె. ఆమాదిరి ప్రపంచమను పెద్దస్టేషనులో బలహీనులు బలవంతులు తమ తమ యాశయస్థానమునకు వేంచేసేదానికి పుట్టినది మొదలు తిరిగి చచ్చువఱకు చేసే యన్వేషణ గమ్యస్థానముకొఱకే. నదులెంత పెద్దవి యే పేరు ప్రఖ్యాతులొందిన తుదకు సముద్రమే. అన్ని జీవుల నాశయమంతియేనైన సహవాసదోష, సహజదోషములనో, మరేతీరుననో నాశయస్థానము జేరుటలేదు. ఇక్కడ పేరుప్రతిష్ఠల నొందుటకంటె గమ్యస్థానము జేరినవారే ధన్యులు.

ప్ర॥ అయ్యది తక్కినవారికెట్లు తెలియును?

ఉ॥ తన్ను తుపాకితో గాల్చునపుడు గాంధీజీ, హైరామ్, హైరామ్, హైరామ్ యనెను. ఈలాగు సాధనపరులు దుస్థితితోగాని, మంచిస్థితితోగాని దేహమున కంత్యకాలము తెలిసిగాని, తెలియకగాని, హఠాత్తుగా రాని తన యనుభవము గంధపుచెక్కకుయున్న వాసనవలె, పాలకున్న తెలుపువలె, సముద్రమునీటికున్న యుప్పువలె నుండిపోయియుండును. తమ జీవితమంతయు మనోవాక్కాయముల వ్యావహారికముగాగాని, పారమార్థికముగాగాని హరివలె హరిమైయే యుందురు.

ప్ర॥ జరామరణములను గుఱించి భగవంతుడు తెలిపెను. అవి రెండిం తలు దుఃఖభాజనములా?

ఉ॥ మరణమని కడపట వాడుటయు, ననేకములలో నేరి కోరి పరిశేష ముగా నీ రెంటిని జెప్పుట వాస్తవమే. అయినను లోకమునకు మేలు జేయలేనిది తనకు మేలు గలిగింపలేనిది యందరిచేత తిరస్కారభూయిష్టమై చేయునది లేక యుండునది ముసలితనము. ఇక మరణమంటిమా, మన మనుకున్న స్థలమున మన యిష్టప్రకారమువచ్చి నగుచు తీసుకొనిపోవునది కాదు. ఎంత తత్త్వవేత్తయైన, నే పృథ్వీ నిఘంటరైనను, నెట్టివారినైన నేమాదిరి యెంత కష్టములో, నేస్థలములో జంపునో తెలియదు. వేళా పాళాలేదు, కాలాకాలములు లేవు. దానిని తిరస్కరింపగాని త్రిప్పుటకుగాని నేదేవతకు, నేమంత్రమున, కేయంత్రమునకు, నేశక్తికి, నేబలాబలాలకు వగ్గునదికాదు. మఱియు ముసలితనముయొక్క వికారము నెవ్వరు గోరరు. వృద్ధాప్యమే నేరికి యిష్టములేదు, మరణము నిష్టములేదు. దుఃఖముల లో నివి రెండు మఱువరానివి కావు. నీ రెండు తటస్థింపక మునుపే మేలు కొమ్మని భగవదాజ్ఞ. రైలు రాకమునుపే టిక్కెట్టు కొనియుండవలె, పరీక్ష రాకమునుపే నన్ని పాఠములు చదివియుండవలె, భగవద్దర్శనము కాకమునుపే భగవంతుడై కూర్చొనవలె నప్పటికిగాని స్థితప్రజ్ఞ దొరక దనియు, తిరిగి పుట్టవలసిన పని తటస్థింపదనియు దృఢముగా జెప్పెను.

ప్ర॥ అందుకొఱకై మానవులేమి చేయవలె?

ఉ॥ భగవంతుని నాశ్రయింపవలె. మఱేది నాశ్రయించినను సంసార దుఃఖము జరామరణాదులు తప్పవు. పుండాకచోటనుండ మందొక చోటనుంచ ప్రయోజనముండదు. జరామరణ దుఃఖములనుండి విముక్తి నొందుటకు భగవద్భక్తియే సుగమమైన మార్గము. తక్కినమార్గములు నిరుపయోగకరములు; మోక్షము నివ్వజాలవు.

ప్ర॥ భంగిత్రాగి కన్నులుమూయుట, ననేకశక్తుల నారాధించుట, యుపవాసాదుల నొనర్చుట మొదలగు మార్గములు పరబ్రహ్మమునొంద సాధనములుగాదా? దుఃఖహేతువులేనా?

ఉ॥ అవును. "పిండం త్యక్త్వా కరం లేఢి" లడ్డును వదలి చేయినాకిన రీతి నవియన్నియు పరమార్థము నొసంగు మార్గములుగావు. బాహ్య

క్రియలు. అంతరంగమునకు సంబంధించినది ముక్తి. అదియే పరమార్థస్థితి.

ప్ర॥ అందుకు భగవంతుడర్జునున కేమిజెప్పెను ?

ఉ॥ ఒకటినుండి 5-వ శ్లోకము వరకు బ్రహ్మాధ్యాత్మాధిదైవముల తెలియ నర్జునుడు వేద జ్ఞానముగల్గినది ముక్తిలేనందున అధ్యాత్మజ్ఞానమగు పరిభాషార్థ వివరణ భగవంతుడు జెప్పెను.

ప్ర॥ అర్జును డడిగిన వేవేవి ?

ఉ॥ అధ్యాత్మము, బ్రహ్మము, కర్మము, అధిభూతము, అధిదైవతము, అధియజ్ఞములనుగూడిన నిన్ను నెట్లు తెలిసికొని ప్రయాణసమయమునకు సిద్ధముగనుండవలెనో నా విషయము తెలుపుమనెను.

ప్ర॥ ఔరా! అర్జునుడడిగి లోకమున కెంతయుపకార మొనర్చెను! వీనిని తెలుపు జ్ఞానముగలిగితేనేగాని లేకపోతే మానవుడు మానవుడేకాడు. సప్తమాధ్యాయమనే శివజటాజూటమునుండి పావనమగు జ్ఞానగంగ అష్టమాధ్యాయమనే విశ్వమున ప్రవహించుచు విస్తారవంతమైనది. ఈ గంగలో మునిగినగాని పావనులుగారు. ఆవల భగవంతుడేమనెను ?

ఉ॥ చిత్తసమాహితపరులగు మహాత్ములు తత్పదవాచ్యబ్రహ్మమును యేలా తెలిసికొనవలెను ? నీకుపలక్షణములు లేవా ? నీ స్వరూపములైన అధ్యాత్మాదుల ననుభవమునకు దెచ్చుకొనుటెట్లో, సులభముగ నర్థమగునట్లు వివరింపుడన, శిష్యునికొరకే నవతరించిన గురువు లోకోద్ధారముకొరకే నవతరించిన నా యధ్యాత్మ పూర్ణపురుషుడగు భగవంతు డరలేనివాడై, నర్జునుని నెగాదిగజూచుచుండ నర్జునుడు తదేకదృష్టితో నా పురుషోత్తముని కేసిచూచుచు తన్మయుడై, తల్లి స్తన్యములోని పాలకెదురు జూచు నర్భకునివలె వినమ్రుడై యుండ భగవంతుడిట్లనెను. తత్పదవాచ్యమగు బ్రహ్మమునేకదా యీ యధ్యాయమునకు ప్రారంభము. పురుషోత్తమప్రాప్తియోగమున సంసారవృక్షమునకు మూలపురుషు డెవడను ప్రశ్నకు సరియైనదీ గోప్యము. ప్రపంచమున నానావిధమానవులు, నానావిధములజేయు ప్రయత్నములన్నియు జేసికొనుటకో నదియే బ్రహ్మము.

ప్ర॥ తాము బ్రహ్మయే గొప్పయని, భగవంతుడు జెప్పెనని జెప్పెదరా ? ప్రతిమతస్థులు తమతమ దైవముల బేర్కొనుచున్నారే, ఆ దైవము లెవరు ? తామెజెప్పు బ్రహ్మమెవరు ?

ఉ॥ ఎవరెవరి మతములో నేదేవుడని నమ్మి సేవింతురో, నీ బ్రహ్మ మునే ఈ బ్రహ్మమనంతము తత్ పదవాచ్యుడు. 'తత్' అన నది అని అర్థము. బ్రహ్మకు నిది విశేషముగనున్నది. నిన్ను నేనే అనెదవు. నీ ఎదుటి వాని నీవు యనెదవు. నీవు నేనే పదములుగాక నెదుటివస్తువు నేమందువు? అది యందువు. అది శబ్దమున కొకే యర్థముగలదు. ఉత్తమపురుష, మధ్యమపురుషములుగాని ప్రథమపురుషార్థము. వీనిరెంటిని వదల నిక నంతయు నదియను పదార్థమే. అయ్యది దూరముగా నున్నట్లర్థము జెప్పెదరు గాని యెదుటిదని. ఎదుటిదేది? నేను అన్నప్పుడు దేహేంద్రియ ములుకాదని తెలిసికొంటివిగదా! నీ వన్నప్పుడు దేహేంద్రియ ప్రాణా దులుకావు. అది యన్నప్పుడు స్థావరములుగాని, జంగమములగు నామ రూపములుగానిదని యథార్థము. అహమర్థము నాత్మ, తత్పదార్థము బ్రహ్మము. బ్రహ్మము నిర్గుణము, వ్యాపకము, వతివ్యాప్త్యాది దోష రహితము. వాచాతీత, మనోతీత, భావాతీతమైనది. ఇంద్రియములవల్ల నెరుగరానిది; నిత్యానుభవమైనది. సుప్తిలోనిది. ఒక చింతచెట్టు, మరొక చింతచెట్టుతో నేను నీవు మన యెదుటనుండే చింతవిత్తనమును. అది యన్నప్పుడు నదియును చింతగింజయేకదా? నేను నీవు రెండుచెట్లులు. విత్తనము స్వరూపముతోనున్నది. వృక్షములు సోపాధికమున నామ రూపాదులతో నున్నవి. అది పదార్థము. దృశ్యముకాదు, జడముకాదు, పరిచ్ఛిన్నముకాదు. అయితే నిది గురువులద్వారా తెలిసికొనవలెను.

ప్ర॥ అదియంటే నెదుట బ్రహ్మము కనిపించలేదే; గురువులేక నీ రహస్యము తెలియదనెదరా?

ఉ॥ ఉత్తమఅధికారులకు చెప్పినంతనే యర్థమగును. తదితరులకు కష్టముగా నర్థమగును. అది స్వర్గము, నిది నరకమనెదరు. నరకమువలె బాధగాగనిపించునది నమీాపార్థము స్వర్గము గనిపించలేదు. దానిని అదర్థ మందురు. అయ్యది బోధవలన నర్థమగునేకాని నేయింద్రియములకు దోచునదికాదు. మఱియు స్వర్గముగాని వైకుంఠ సత్యలోకాదుల శాస్త్రము చెప్పినదే. బ్రహ్మమును శాస్త్రమే చెప్పినది. స్వర్గము పుణ్య కర్మలొనర్చినవారు మరణానంతరమున గనెదరు. బ్రహ్మము తరంగ

సాధనలద్వారా తటస్థన్యాయముగా శాస్త్రగురూపదేశాలవలన తెలియ బడును. అర్జునునకు భగవంతుడగు జగద్గురువే గురువై జెప్పెను. అర్జునుడు గురువు కన్న తానన్యమనుకొనలేదు. కాబట్టి నా విద్యను గ్రహించెను.

ప్ర॥ బ్రహ్మమంటే చతుర్ముఖబ్రహ్మగాదా ?

ఉ॥ బ్రహ్మశబ్దము చతుర్ముఖబ్రహ్మ, ప్రణవము, మాయ, వేద మును, యజ్ఞమునకు నర్థము. నిరుపాధికము, నిర్విశేషము. తక్కినవి సోపాధికములు, సవిశేషములగును. సూక్ష్మాతిసూక్ష్మమైన నా బ్రహ్మము బోధరూపముగాని తెలియబడవలె. 'అక్షరం బ్రహ్మ పరమం' శ్రేష్ఠమైన బ్రహ్మమని యొకర్థము. అజ్ఞానమునకు విలక్షణమైనదని యొకయర్థము. అక్షరమన నాశము లేనిది. క్షరముగానిదని యొకయర్థము. అక్షరమన జీవునకు, మాయకు, నక్షరసంజ్ఞకు పేరులగును. అందువలన నతివ్యాప్తి దోషమురాని శ్రేష్ఠమైన యక్షరమే బ్రహ్మమని అర్థము. ఇదియే తత్పద వాచ్యము. అధ్యాత్మమన్న త్వంపదార్థమునకు సంబంధించినది. నీవు యను పదార్థమునకు జీవుడని అర్థము. తత్పదవాచ్యము బ్రహ్మమని నేదిజెప్పితే తెలిసికుంటిమి శాస్త్రము. నీవు యను జీవుని తెలిసికొనుటకు నేమి సాధనకావలె.

అందఱుముఖములగు దృశ్యముల దేనివల్ల జూచెదవు? నీ ముఖము వలన. నీ ముఖము జూడవలెనంటే నేమి జేతువు ? అద్దమును జేరుదువు. సమస్త విషయముల గ్రహించు నీ బుద్ధి యంతర్ముఖమైన గ్రహించెదవు. అది శబ్దమునకు నంతట నిండిన యాకసము నర్థము కాదా. అదే యాకసము శరీరములోనున్న నేమనుదువు? హృదయాకాశమందుము. అంతట నిండిన దానిని వాయును నది పదముతో జెప్పుదుము. శరీరములో నున్నదాని ప్రాణమందుము, నీ ప్రాణ మా వాయువుకాదా? అంశము వాయునందు సంచరించుచుండలేదా? అపానమును నందువదలి ప్రాణమును గొనివచ్చుట లేదా? తత్ప్రకారమే వ్యాపకరూపుడగు బ్రహ్మమే నధ్యాత్మస్వభావముగా నుండుచున్నాడు. అంటే బ్రహ్మస్వభావమే నధ్యాత్మము, వాయువు స్వభావమే ప్రాణము.

ప్ర! ఆహా! ఇప్పటికి సకలసంశయములు తీరినవి. సర్వవ్యాపకుడే నధ్యాత్మమనుకొనని దోషము దుఃఖమును గలిగించినది. నేనంటే దేహమనుకుంటిని.

ఉ! నేను యనే దేది? అదియే బ్రహ్మము. తత్పదవాచ్యుడే త్వంపదవాచ్యుడని యర్థము. దేహేంద్రియాది సకలపదార్థముల నన్నింటిని సంబంధించి వాని నన్నిటికి శక్తి నిచ్చుచున్నది. సెల్ వంటిది యాత్మ, బల్బు వంటిది బుద్ధి, దేహమువంటిది బ్యాటరి. ఆత్మ శాశ్వతమైన బ్రహ్మమేను; సచ్చిదానందలక్షణములుగాగలది.

ప్ర! కర్మమంటే నేమిటియంటారు?

ఉ! స్థావరజంగమాత్మకమంతయు భూతజాతికాలు. వాని భావము, వాని యునికి, వాని పుట్టుక యేది? అదియే విసర్గము. అనగా అంతర్భూతములుగానున్నవి. బహిర్భూతములగుట ఇదియే త్యాగమందురు. విత్తనము తనయందలి ప్రకాండమును, శాఖోపశాఖలను, పత్రపుష్పఫలముల వాని వాని స్వభావసిద్ధముగనే త్యాగమొనర్చితేనే నివి యన్ని యవ్యక్తమై విత్తనమున నుండినవి వ్యక్తమైనవి. త్యాగమునకే కర్మ యని పేరు. ప్రాణులభావము లేదా యిచ్ఛవల్ల గలిగే జన్మాదులు కర్మమనబడును. ప్రతిబజారునకు, ప్రతియింటికి నుండే కొళాయిలన్నింటికి నొక కేంద్రము వద్ద నొక యంత్రముండి యక్కడ వదలుట లేక త్యాగముచేయుటచేతనే నక్కడి నీరు ఏ యే స్థలములకు వెళ్లవలెనో నక్కడికి వెళ్ళును. తద్రీతి కర్మఫలము లవిద్యయందుండి, నా యవిద్య మాయయందుండి "మాయినం తు మహేశ్వరః" మాయ నీశ్వరు నాశ్రయించియుండును. సకలజీవుల యదృష్టము ఫలితమునకురా ఈశ్వరునకు నిచ్ఛగలిగి మాయనుండి త్యాగమొనర్ప నాజీవులు తమ తమ కర్మఫలమునకుదగిన రూపము లెత్తుదురు. ఇదియే కర్మ. పరమాత్మయే తన రూపమును "ఏకోఽహం బహుస్యామ్" జీవుల సమిష్టి సంకల్పబలమే నీశ్వరునికి గలిగించి తానే బహురూపుల వెలసెను. దీనినే యజ్ఞమని, కర్మమని చెప్పెదరు.

ప్ర! అయితే నీ కర్మచక్రము నాపుట సాధ్యముకాదా?

ఉ! రంగులరాట్నమునుండి నీకు యిష్టములేకున్న దిగివెళ్ళవచ్చు, నది యూరుకొనదు. ఆత్మను తెలిసికొన్నవాడు నీ కర్మచక్రములోబడడు.

ఈ కర్మచక్ర మాగదుకూడ. అధిభూతమన "క్షరో వినశ్వరో భావో దేహాది పదార్థః" నశించే స్వభావముగల నామరూపములన్నిటి నధి భూతములనెదరు. అధిదైవమంటే హిరణ్యగర్భుడే. సూర్యమండల ములో దానికి నభిమానదైవముగలడని నతడే నధిదైవమని. వ్యష్టి సమిష్టి సూక్ష్మశరీరముల కధిపతెవ్వడు నాతడే హిరణ్యగర్భుడు. అధియజ్ఞమన నేనేనని భగవంతుడు జెప్పెను. మానవులొనరించు కర్మఫలాల ననుభ వించువాడే నధియజ్ఞుడు. దేహేంద్రియములకు విలక్షణుడగు యజ్ఞభోక్త.

ప్ర॥ అధియజ్ఞు డాకరూపముతో నుండునా?

ఉ॥ పంచభూతములలో నొకరీతి నాలుగుభూతములు, పృథివి, జలము వాయువాకసము గనిపించును. అగ్ని కనిపించదు; అయితే లేదనియా? మన నమ్మక మంతర్యామియుండలేదా! అధియజ్ఞు డట్లు శరీరముల నంతర్యామియైయున్నాడు.

ప్ర॥ ఈ ఆరు ప్రశ్న లడుగకపోతేనేమి? ఒక బ్రహ్మమధ్యాత్మము కర్మ చాలదా?

ఉ॥ ఒక దేశప్రభువును, నాతని ప్రజలు, నాతని దేశమును, నాతని పరిపాలనా చాలునంటావా? ఏయే డిపార్టుమెంటు లెందఱుద్యోగస్థు లుందురనది యెఱుగనవసరములేదా? మొత్తము నా దేశవిషయమంత తెలియుటమే విజ్ఞానము. అప్పుడా దేశము ప్రజలాదులంత నారాజునే కదా యంతర్భావము? అదేరీతి బ్రహ్మమధ్యాత్మ మధిభూత మధియజ్ఞములన్నియు బ్రహ్మమే. ఇదియే నఖండస్థితి. ఈ యారు నుపాస కులకు నిన్నిరకముల జెప్పబడ్డది. "అహమాత్మా గుడాకేశ" ప్రాణుల హృదయమున వెలయునది నేనే, మనస్సు నేనే, జ్ఞానుల జ్ఞానము నేనే. "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి" సర్వశరీరములలోని క్షేత్రజ్ఞుడ నేనే. 'క్షరశ్చాక్షర ఏవచ' క్షరాక్షరములని చెప్పుటచేత విచారించితే నంతయు బ్రహ్మమే. శాస్త్రపరిభాషవేర్లకు సమాధానము గలిగినది. "యథోర్ణ నాభి సృజతః" సాలెపురుగువలె నభిన్ననిమిత్తోపాదాన సహకారకారణ ములుగ సర్వము తానేయైయున్నాడు.

ప్ర॥ సాలెపురుగు దృష్టాంతము వివరింపుడు!

ఉ॥ కూడునకు దారము ముపాదానము, సాలెపురుగు నిమిత్తము, తన పాదములు సహకారకారణములు. భగవంతుడట్లు సృష్టికి భిన్ననిమిత్త కారణుడు. మాయ యుపాదానము. కర్మ, కాలయదృష్టములు, జీవులు సహకారకారణములు.

ప్ర॥ అంతిమకాలమున దేనిని ముఖ్యముగ స్మరింపవలెను?

ఉ॥ అంతిమకాలములో కాదు, యంతిమకాలమువఱకును నంతిమములోనని అర్థము. ఇహలోక పరలోకములంటే, నందలి సుఖవిషయములంటే, నడవకుండా పైనబోయే విమానములంటే, ఫలితజ్యోతిషములంటే ఎన్నియో తెలిసి పలికెదరు. తమకు తెలియనిదేదియు లేదందురు. కావున మరణసమయ మెవరికి తెలియదు. మరణము నేవిధముగానైన నెదుర్కొనని యా మరణభయదుఃఖము లేకుండ నొడుదుడుకులు లేకుండే స్వధర్మము తెలియవలె. "సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖం" అనే ధర్మము ననుష్ఠింపవలె. ఇదియే మరణవిద్య.

ప్ర॥ మరణమంటే నెందుకో నంత భయము ప్రాణులకు?

ఉ॥ తనకుగానిది తనకనుకొనుట భయమే. అవిద్య బాధించినవారికి మరణభయములేదు. ఎంతోకాలము జీవించినను మరణ మెప్పుడైనా పొందవలసినదే. మరణ జన్మములు దేహధర్మములు. తయారుకావటము, జీర్ణమైపోవటము వస్త్రధర్మము. తాను అనగా నాత్మ. ఈ యాత్మ చనిపోవునదికాదు. ఈ రహస్యము తెలియకుంటే భయమే. మరణ రహస్యము తెలియకపోతే పశుపక్ష్యాది యధమజన్మమో, మధ్యమతరగతియగు మనుష్యజన్మమో, నుత్తమమగు దేవతాజన్మమో రాక తప్పదు. భూమి తిరుగుటలేదా నావిధము రాకపోకలు తప్పవు. ఈ జన్మములో సాధించలేని మననేర్పు మరొక జన్మమున సాధించగలమంటే నది మృష. అందువలన నంత్యకాలమున నెయ్యది ప్రార్థించవలసింది భగవంతుడు జెప్పుచున్నాడు.

ప్ర॥ మరణమెప్పుడో వచ్చుటకు నిప్పటినుండి స్మరించుటేల?

ఉ॥ ఉత్తమోత్తముడగు హరిస్మరణ మిప్పుడెందుకంటు మరెవ్వరి స్మరణజేయవలెనని? ఏయొకవస్తువు నీకు తెలియునంతకు మారకుంటివి. తెలిసినతరువాత నెట్లు మరతువు? ఇప్పుడెవ్వరిపైన ప్రేమగలదో, నంత్య

కాలమున నా స్మరణయే రాగలదు. విద్యార్థులు సంవత్సరము పొడవున జదువు లెందుకు ? పరీక్షరోజు చదువకూడదా ? అప్పుడు చదివి యేల ప్యాసు కాకూడదు ? పదినెలలు చదివినను జ్ఞాపకశక్తి, యుత్సాహశక్తి, ధైర్యశక్తి లేనివారు తప్పిపోవటము చూడమా ? కొందర నెదరుకదా; ఈ శరీరముతో ననుభవించవలసిన కర్మ ముగిసి మరొక శరీరముతో ననుభవించవలసిన కర్మమింకా నుత్పన్నము కానటువంటి సంధిసమయము మరణమనెదరు. ఆ సంధిసమయముననే భగవంతుని స్మరించుటకు సౌభాగ్యమైన సమయము. మరణము తెలిసినను బహుచింతనాపరుడెట్లు హరిని స్మరించలేడు. బహుకాల చింతనాపరుడే హరిని జేరగలడు. మరణము తెలిసివచ్చేటుగానుంటే ననేకజీవులు తగు ప్రయత్నము లొనరింపక నూరకుందురా ? అన్నము, నీళ్ళెట్లు దేహమున కవసరమో, జీవునకు జరామరణనివర్తికై భగవచ్చింతన మవసరము.

ప్ర॥ అందుకే కాబోలు నీయాధ్యాయము నుపాసనాఫలితాల యోగమనెదరు ?

ఉ॥ అభ్యాసము నుపాసన సంపూర్ణజ్ఞానుల కవసరములేదు. వారు దేహమున్నప్పుడే ముక్తినొందిన జీవన్ముక్తులు. యుద్ధములో నేసమయమున మరణము సంభవించునో అనునది యర్జునునకు భయముండవచ్చు. తక్కుంగలవారి కేమి యనవలదు. ప్రతిక్షణము యుద్ధము నంతరంగ బహిరంగముల ప్రకృతిశక్తుల నెదుర్కొనుచు, నోడుచు, గెలుచుచునే యున్నాము. "అంతకాలే చ మామేవ" ప్రతిక్షణము నశించు శరీరము నెప్పుడో జచ్చుననునది భ్రమ. మరణసమయములో, ఫోటోసమయములో, రతిసమయములో నేభావముండునో దానికి సంబంధించియే నుత్తరజన్మస్థితులుండును. అందువలన మన యీ సాధనాలు సంస్కరింపబడి యుండవలె. ఒక్క ధర్మజుడక్క భీమార్జునులేమైరి ? తమకు తెలియకనే పడిపోయిరి.

ప్ర॥ అభ్యాసకులు వేఱు, జ్ఞానులు వేరునా ?

ఉ॥ సగుణమని నీవు ముందే అడిగితివి. అజ్ఞానకార్యమె ప్రపంచం. అజ్ఞానమును జ్ఞానముద్వారాబాధించి బ్రహ్మమయులై నజ్ఞానులు సదా ముక్తులే. సాధకు లంత్యకాలమువరకు నభ్యసించవలెగాన అభ్యాసకులు వేఱు.

ప్ర॥ అర్జునుడు యుద్ధమధ్యమున నీ తత్త్వమును బడయు సాధ్యమా ?

ఉ॥ అష్టావధానము, శతావధానము చేయువారు నందఱమధ్యనుండి కదా చేతురు ? ప్రజ్ఞ గలవాడు, నాతురత అన_క్తి విశ్వాసముగలవాడు నెచ్చటనైన గ్రహింపగలడు. వైరాగ్యాదిలక్షణములు లేనివా డేండ్లతరబడి విన్నను మఱింత యజ్ఞానాభివృద్ధియేగాని జ్ఞానాభివృద్ధి కలుగజాలదు. అంత్యకాలమున మఱవు రాకుండుటకు నభ్యాసము ప్రాధాన్యమే. ప్రతిదినము ప్రయాణముజేయుచునే యున్నాము. కాని ప్రయాణముచేయు లేదనుకొనుచున్నాము; మరచినాము. ట్రంకు, బెడ్డు తీసుకొని చుట్టాల, మిత్రుల మొదలు తమాషాకెళ్లెడి ప్రయాణములవలె ననునిత్యము ప్రయాణము చేయుచునేయున్నాము. ప్రయాణములో నివియన్ని మజిలీలు. ఈ ప్రయాణమెక్కడంటే నదిగో నావూరు, నీ యూరని జెప్పెదవు. లేక వారియింటికి పీ రి యిం ం టి కనెదవు. ఆ వూరివారి చుట్టాలాచుట్టాలు, మిత్రులు నీవలె వారు ప్రయాణీకులే. నీవు వారిని, వారు నిన్ను నమ్ముట చేత నుభయభ్రష్టత్వము నిరాశాకారణమగుచున్నది. గమ్యస్థానము తెలియని ప్రయాణ మధోగతి గల్గించును.

ప్ర॥ మరణసమయమున చిత్తము భగవదాకారము జెందవలెనా ?

ఉ॥ అవును. భగవదాకారము కావలెను. నీ వెట్లచ్చొత్తింప నక్షరము లచ్చుపడును. ఫోటోతీయునపు డెబ్బంగియున్న తత్ప్రకారమే ఫోటోబడును. మనస్సునకు రూపములేదు. ఏయాకారమున కంటించిన నాయాకారము నొందును. ఇద్దరు బాలురు పరీక్ష కొకడొక పాఠము, మఱొక డొక పాఠము నిదురవచ్చువరకు చదువుచున్నారు. మెలకువ వచ్చునప్పటికి తాము చదివినదే జ్ఞాపకమగును. స్టేషను, స్టేషనువద్ద బండి యాగి నీతో వచ్చిన వారు దిగిపోవుట లేదా వారివారి లక్ష్యమెయ్యదియో నా స్టేషనువచ్చినంతనె దిగుదురు. వారికి, నీకు తెలియుటకొఱకే ప్రతిస్టేషన్ రావటము. ఇది మాయదియా ? కాదా ? అని తెలియుటకు నీ స్టేషన్ వచ్చెనా ? తప్పనిసరిగ నీవు దిగుదువు. ప్రక్కస్టేషనులో దిగేవారినిజూచి నీవుదిగే స్టేషన్ కొఱకు మెలకువతో నెదురుచూచుచుందువుకదా ? మఱచినావా ? లేదు. ఒకవేళ మఱచితివా ? మఱెక్కడ దిగుదువో తెలిసినది కాదుకదా ? రైల్వేయుద్యోగస్తులతో నేమి తొందరో, దిక్కులేనిచోట

పడే యీ దుఃఖము నేమనుకొందువు? జడభరతుడేమాయె? తెలివితక్కువతో నిట్లాయెగదా అనుకొనెదవు. ఎవరెవరి సమయమువచ్చితే దేహమనే పెట్టెలోనుండి దిగిపోవలె. అందుకై మన చేరుస్థలము సదా జ్ఞాపకములో నుండవలెను, లేనిచో ప్రమాదము తప్పదు. ఇప్పటినుండే విషయాకారముల నలవాటుపీడిన చిత్తమును భగవదాకారమొనర్చ నన్యమెట్లు తిరుగును? ఇంటియందలి ప్రాముఖ్యవస్తువును దొంగలు దోచుదురుకాని, స్వల్పవస్తువున కంత పనిజేయుదురా? తథారీతి చిత్తమున కేవస్తువున అనురాగ మెక్కువయుండునో, మరణసమయమున కదియే తటస్థించును.

ప్ర॥ కుక్కనక్కల జన్మము వచ్చునా? అనుకున్నట్లు తయారగు టెట్లు?

ఉ॥ మారేది దేహముకాదు; చిత్తము. దాని ననుసరించి జీవుడు. అతనికి దేహము లేదుకదా? కెమెరాలో శరీర మిక్కడనేయుండినట్లుండ, దానిలో ప్రతిబింబించి ఫోటోబడినరీతి, మనస్సనే కెమరా నా ఫోటోను ఎత్తింపజేయును. అనగా తద్రీతిదాల్చును.

ప్ర॥ భగవంతుని ప్రార్థనజేయుటకు, భగవత్ప్రాప్తినొందుటకు జాతి మతము లవసరములేదా?

ఉ॥ భగవంతుడు గీతయందు యిచ్ఛాబద్ధప్రయోగ మొనరించెనేగాని, ఫలానివారను సాంప్రదాయికభావము, పక్షపాతము జూపలేదు. పక్షపాతాదులుండిన భగవంతుడను పేరెందుకు? ఉదారభావముగలవాడు నీ రహస్యమును గుర్తెఱుంగును. భగవంతు డొకరివాడేకాదు; అందఱివాడు. ఒకదేశమునకు ప్రభు వొకయింటికి యజమానుడున్నాడనుకో. ప్రభువు ప్రజలలో నొకనికి, యజమానియింటిలోనివాని కొకనికే ప్రభు వెట్లు కాగల్గుతాడు? తప్పుజేసిన నెవరైన దండితులే. "న శూద్రా భగవద్భక్తాః విప్రాః భాగవతాస్స్మృతాః। సర్వవర్ణేషు తే శూద్రాః యే హ్యభక్తా జనార్దనే॥" ఈ ప్రమాణము చదివి తెలుసుకో. భక్తిలేనివాడు శూద్రుడు. ఏ వర్ణమువాడైన భక్తిగలవాడే భాగవతుడు. భక్తిలేనివాని కేప్రాప్తిలేదు. కులమనున దేమిటికి? అదియొక బంధము. నందనారు, మతంగముని, శబరి, ప్రహ్లాద, నారద, గుహ విదుర సంజయులు నాల్వారులలో నంబియారు లిత్యాదులందరికి కులముతోనా ముక్తి,

కీర్తి. భగవత్స్వరూపులగు వారికేల కులము ? భగవంతు నర్చించుటకు కులగోత్రము లవసరమైతే భగవంతుడే కులగోత్రములుగలవాడుగా నుండవలె. చదువుటకు, సినిమాలకు రైలుటిక్కెట్లు నుద్యోగములగతియేమి చెప్పవలె? టిక్కెట్టులేనిది కులగోత్రాదులకు వదలుతారా ? ఉద్యోగము లిత్తురా ? చదివినవాడెవడైన నుద్యోగమిత్తురు. సినిమాకు, రైలునకు డబ్బు. కులముతో బనిలేదు. భగవంతునికి కావలసినది భక్తి. అగ్నితో కాగిన నినుము నెట్లుదీర్చితే నట్లగునుకదా ? ఆ ప్రకారమే చిత్తమెట్టి సంస్కారముగలదైతే నట్టిజన్మముల గలిగించును.

ప్ర॥ భగవంతుని సంస్మరించుచుంటే తక్కిన సంసారమేలాగు ?

ఉ॥ భగవంతునియందే నాధారపడినవానివి, సంసారము నాయనదేనని చేయుము. నీ దేహేంద్రియాదుల యందును తక్కిన లోకాలవాంఛయే లేనపుడు సంసారముమాత్రము భగవంతునిదని చేయలేవా ? ఎంత ప్రదేశము తిరిగిన స్త్రీ తాను స్త్రీ ననియే సంచరించును. పనిచేయుచున్న స్త్రీననియే తననమ్మకము. కవి తానెట్లు సంచరించి నేపనిజేయుచున్న గద్యపద్యముల వదలడు. దొంగ యెటుసంచరించినను చిత్తము తస్కరించుచునే యుండును. సంతానముగల తల్లి నింటిపను లొనర్చుచునే పిల్లల కేపగిది వర్తించవలెనో నట్లు వర్తించును. అందులోనే నామె చిత్తము సంస్కరింపబడియుండును. పనులొనర్పక నూరకకూర్చొని భగవంతుని సేవించమంటే వీలగు నందురు కొందరు. వివేకములేనిమాట. మనోబుద్ధులు రెండు మనల ననుసరించితే నెట్టిసమయమునందైన ధ్యానింపగలము. మనస్సు వెలుపలవస్తువుల జ్ఞాపకముచేసితే లేక కోరినలోపల బుద్ధి నన్నిటిని జమకట్టివేయును. అవి రెండు తమపనుల మానవలె. భాగవతమున పురంజనుడు, జడభరతుడు, వాసుదేవుడు యిత్యాదులు మరణసమయమున దలంచిన రూపములబడసిరి. వెనుక చింతించిరి. మనస్సు సంకల్పించును; బుద్ధి నిశ్చయించును. మనోసంకల్పము, బుద్ధి నిశ్చయము భగవంతుడేకావలె. అదియే యభ్యాసము.

ప్ర॥ మనోబుద్ధుల విషయవాసనలనుండి మరలించి భగవంతుని వంకకు ద్రిప్పసాధ్యమా ?

ఉ॥ గానుగతిరుగ గంగిరెద్దగుటకు నెద్ద తర్ఫీదుచేయరా? స్వారిచేయ బండిసీద్వ సేద్యము వగైరాలవనుల, గుఱ్ఱాల నెద్ద నేనుగు నొంటెల కఱతుల నభ్యాసపరుపరా? ధనార్జనకొఱకు సర్కసుజేయువారు గొప్ప యేనుగుల తమ వక్షస్థలముల నిలుపుకొనెదరు. ఏనుగు డంబు మీద నడిపింతురు. వినువీధినుండి క్రిందికి నూలుపోగు నోటబట్టుకొని దిగుదురు. తంతెమీద నడతురు. క్రూరమృగముల మచ్చికజేతురు. ఎదుటివారికి నివి సాహసపనులువలె గనిపించును. వారి కందమా? ఆటలాడుపిల్లలవలె ననాయాసముగ సహజక్రియలై యుండును. చిలుకలాది పక్షుల మన పనుల కలవాటుపడజేయుటము, మాటలనేర్పడము, తంతెలతో మాటల బలికించటము, ఎద్దులు లేకుండ బస్సు, సైకలు, మోటారు కారు, రైలు, విమానము, స్టీమర్లిత్యాదులు నడపుట, కృత్రిమసృష్టిచేత నొకవృక్షమున ననేకరంగులపూలు, నాలుగైదురకముల పండ్లు బండిం చుటలేదా? పుష్పముల తలనూనెలు, సబ్బులు, టెలివిజన్, రేడియో, టెలిఫోన్, గ్రామఫోన్, రాకెట్టుల, చెట్టులనుండి ద్రావకముల, నౌషధ ముల నెన్నెన్నియో జేయుచున్నారు. మనస్సు బుద్ధుల నదేరీతి నభ్యాసము చేసి యిష్టార్థసిద్ధి బడయవచ్చు. మనోబుద్ధుల నేకీభవింపజేసి యభ్యాస మునకు రానిది యివి యెట్లు ననుభవమునకు రాగలవు? ఇవి వ్యక్తమగు టెట్లు? సాధనలద్వారానే ప్రతియొకటి సాధింపగలము. సాధన మొదలు కష్టమై, తుదకు తేలికయై సహజములగును. మంత్రములకంటె మంత్ర దేవతలు, వీరికంటె యంత్రదేవతలు, యంత్రదేవతలకంటె తంత్రదేవతలు, వీరందఱికంటె స్వతంత్రదేవతలు శ్రేష్ఠము. ఇద్దరు స్నేహితులుగల రొకడు చెడుకార్యము లొనర్చి జయిలులో నుండుట, మఱొకడు భగవద్భజన సత్కార్యలంపటుడై, బహుజనహితుడై, సర్వత్ర కీర్తిగలవాడై నాడంటె నెవరుజేసిన తంత్రము. భగవంతుడుజేసినదా? కాదు. వారివారి చిత్త వృత్తులవలన దామొనరించిన కర్మఫలమె సాక్షి. ఇటువంటివి చూడడము లేదా? ఈతరానివాడు నీటమునిగిన తేలలేడు. చదువనివాడు ప్యాసు కాలేడు. పద్యము చదువలేనివా డర్థము జెప్పలేడు. నడువలేనివాడు తన గమ్యము జేరలేడు. చెట్టు ప్రాకలేడా పండ్లు కోయలేడు. ధర్మము చేయక దాతకాడు. యుద్ధమొనర్పలేడా జయము లేదు. కన్నులులేక

వస్తువుల జూడలేదు. చెవిటి వినలేడు. కాళ్లులేనివాడు నడవలేడు. దృష్టి నిలుపలేనివాడు లక్ష్యము కొట్టలేడు. మనోబుద్ధుల నొక్కటిగా భగవంతునియం దనవరతము నుంచలేనపుడు హరిస్వరూపప్రాప్తి గలుగ నేరదు. జీవదేవులభేదము తొలగించేదానికి నవిద్యాభిమాన, కర్తృత్వాభిమానభ్రాంతిని యంతఃకరణదోషముల దూరమొనర్చుటకొఱకే శాస్త్రములు, సాధనలు, ధర్మాలు, సంఘాలు, గురువులు, మతాలు, నుపదేశాలు బుట్టినవి. వాక్కుతో భగవంతుని కథలను, పద్యములను, గద్యములను, వాక్యములను, భగవద్రహస్యముల పలుకుచుండటము, నితరుల ప్రేమచే బలికించుచుండటము, నితరులచే తెలిసికొని పలకటము, చేతులతో నష్టవిధపూజలు, షోడశోపచారముల నొనర్చటము, దేవియందైన భగవద్భావము నుంచటము, భగవద్భక్తులకు ప్రేమచే జలమును గాని, భిక్షగాని, వస్త్రముగాని, షోడశదానములలో నెయ్యదియైన తను న్యాయముతో నార్జించిన ధనముతో నొనర్చుట, దైవమును గుఱించియే వ్రాయుట, దైవకార్యమునకే హస్తముల నుపయోగించుట, పాదములతో దైవాంగణముల ప్రదక్షిణనొనర్చుట, దైవమందిరముల, దైవతీర్థముల, దైవవిభూతుల, దైవతములగు గురువుల సేవించుట, దేహమును దైవసేవకై వినియోగించుట, అంతఃకరణమున భక్తి చేయుటయు నభ్యాసమే. మంత్రమయము భగవన్మయమైపోతే భవరోగము తొలగును. ఇందులకు పట్టుదల శ్రద్ధయుండవలె. తనయందు, భగవంతునియందు, తదితరమందు నొకేశ్రద్ధ, కార్యము చిన్నదైన పెద్దదైన నొకేరీతి యుండుటయే శ్రద్ధ. "స తు దీర్ఘకాలనైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః" ఎంతకాలమైన నెడతెగక నాదరాతిశయముతో సేవింపబడవలె. సముద్రపుటొడ్డున టిట్టిభములు నాలుమగలు నివసింపుచుండ పెంటి గ్రుడ్లుపెట్టుసమయమున నిచ్చోవలదు. భూమియందున్న గ్రుడ్ల సముద్రుడు పౌర్ణమి యమావాస్యల బొంగివచ్చి ముంచి లోనికిగొనిపోవును. మఱెక్కడనైన వెళ్లి మనసంతానము గని సంతసించెదమన పురుషపక్షి సముద్రమునకు మనసంగతి తెలియదా? అన్యాయముచేసితే నోర్వగలమా? ముందు మన మాతని కేమిహాని రొనర్పలేదు. భయపడవలదు. భయపడి సందడిగిన నింతే బ్రతుకగునను

మాటలు సముద్రుడు విని యౌరా! చూతము వీరిసాహసమని పెల్లైగసి వారు లేనిసమయమున పొంగి, నా గ్రుడ్లను ముంచి లోనికి గొనిపోయెను. సతిపతి లిరువురు తమస్థలముల గ్రుడ్లగానక తల్లడిల్ల భార్యయిట్లనెను. మన కనువైనస్థలమునకు వెళ్లుదమిందు నివసింపదగదు. మనకేమి దేశము లేదా? ఈ సముద్రుడు ప్రతిదఫా గ్రుడ్లను హరింపగలడు. నేడే వెడలుద మన పతి నవ్వి యెన్నడింత పట్టుదలతో నీవు చెప్పలేదు. నేనంత శ్రద్ధ తీసుకోలేదు. పోయిన దొకచోట వెదకచిక్కునా? సముద్రుడు పెద్దయని బెదరవాకు చూడు. నీవు నేను నోటితో నీ నీటిని తోడివేయుదము. ఎంతకాలమున కిన్నినీళ్లు తోడగలమని యోచించవలదు. ఎంతకాలమైన కానీగాక మనగ్రుడ్లు బడయువఱకు నిటుల జేతుమని తమజాతిపక్షులు వలదనినను వినక వారిని బురిగొల్పి నందఱుగలిసి తమతమ ముక్కులతో వచ్చినన్ని బిందువులుగొని దూరముగ విడిచివచ్చుచుండ పెక్కుకాలము జరిగెను. సముద్రుడు గ్రుడ్లనివ్వలేదు. పక్షులు తమ పట్టుదల వదలలేదు. నారదుడుగని వైకుంఠమునకరిగి గరుడునితో నీ బిరుదు నేటితో పోవును. టిట్టిభపక్షులు సముద్రునితో జయమొందిన పక్షులకు రాజు కాగలరనెను. అంత నతడు నేరుగావచ్చి తన రెక్కలచేత సముద్రములోని నీరును నలుదెసల చెదరి యింకిపోవ విసరెను. ఈలాగు చేసేటప్పటికి సముద్రుడెఱింగి తానువచ్చి గరుత్మంతునికెఱిగి నమస్కరించి తన క్షమాపణజెప్పికొని వారిగ్రుడ్లనిచ్చి యిక నెన్నడట్లు చేయననిచెప్పి వెళ్లెను. గరుడుడు తన దారిపోయెను. పక్షులు చచ్చుటో, సాధించుటో, విజయమో, వీర స్వర్గమో యని ప్రారంభించి తుదకు విజయము సాధించెను. కాబట్టి యభ్యాసియైనవానికి మధ్యమధ్య నంతరాయము లనేకములు గలిగినను ప్రహ్లాద, భగీరథ, పార్వతి, జానకి, హరిశ్చంద్ర, నల, మీరా, గాంధీ ప్రభృతులవలె శక్తిసామర్థ్యముల నుపయోగించి సిద్ధిబొందవచ్చును. 'శ్రద్ధావాన్' శ్రద్ధావంతుడు విజయముల సాధించగలడు. పరమగతి లభ్యము గాకపోదు. ఈ విధముగ నంతరంగ బహిరంగముల సాధకున కడుగడ్డున ద్వంద్వములె యెదుర్కొనుచుండును. అంతరంగమున దప్పితే బహిరంగమున, బహిరంగమునదప్పితే నంతరంగమున, కర్ణార్జునుల ద్వంద్వయుద్ధమువలె నుండును. సముద్రము దానిపొడవు, వెడల్పు,

పెద్దపెద్దయలలు, నురుగుముద్దలు, చిన్నతరగలతో, జలకరేణువు లతో, సుడులతో, నకాదులాతులతో, త్రాగుటకు నొక గ్రుక్కయైన ఉపయోగపడని నీరుతో, నానావిధ జలజంతువులతో లోపలిభాగము నుండును. సముద్రము బాహ్యాభ్యంతరముల మనుష్యులకు తేలిక జీవిం చుట కుపయోగపడకపోయినను సాధనలగు పడవలు, స్టీమరులు మొద లగువానితో సాధించి సముద్రము నుపయోగించుకొనుచున్నారు. గంభీర మైనది, కంటికి కనపడనిది, ప్రమాణములేనిది మన సంసారసముద్రము. ఉప్పునీటిని త్రాగుటకు కానిరీతి నీ సంసారసాగరమున నొకక్షణమైన సుఖమెవ్వరికి కనిపించుటలేదు. అంతరంగమున కామక్రోధాదిగుణములు బహిరంగమున బంధుమిత్రకళత్రాదు లీయుభయమధ్య పూర్ణశాంతిలేక పరిపరివిధముల, బహుళప్రయాసముల నీమణాత్రయములను జలజంతు వులు వాసనలనే పగడతీగెలతో, కోరికలనే తరగలతో, సంశయములనే సుడులతో నీ వారాశిదాట నెవ్వరికి సాధ్యమగునదికాదు. ఈ వారాశి తరింప నిజమగు సాధనలు తద్ద్వారా సిద్ధావస్థబొందుటకు భగవద్గీత ధర్మపేటికనుండి గీతాచార్యుని యాదేశముతో, రత్నములనే సాధనలతో సాధించడమే మనకర్తవ్యము. తప్పక భగవంతునే సర్వకాల, సర్వావస్థల స్మరించవలెను.

ప్ర॥ భగవత్ప్రాప్తిగాక నితరదేవతల నారాధించి, యితరలోకములకు బోయే జీవులకు శాశ్వతముక్తి లేదా?

ఉ॥ భగవద్రూపమునొందిన జ్ఞానులకు, ఉపాసనాపరులకు తప్ప తక్కినవారికి శాశ్వతముక్తిలేదు. ఆయాదేవతాలోకముల తమ పుణ్య ఫలము ముగిసినంతనె మరల తిరిగి రావలసినదే.

ప్ర॥ అనన్యభక్తిపరులకు శాశ్వతముక్తిలేదా?

ఉ॥ వీరు నుపాసకులే. ప్రణవమురొక్క వాచ్యమునేకదా భజించె దరు. వీరికే ముక్తియున్నది. తక్కినవారలకు లేదు. సత్కర్మల కామ్య సిద్ధికి నాచరింప నాయాలోకముల "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" కామ్యకర్మలఫలము ముగిసినంతనె నచ్చటనుండి మరల బడుదురు. 6 నుండి 7-వ శ్లోకమువరకు మరణసమయమున నీశ్వరునిభజింప నీశ్వర ప్రాప్తి, నన్యమును భజింప నన్యప్రాప్తి తెలిపి 8 నుండి 9-వ శ్లోకము

వఱకు నిరంతరములగు శ్రవణమననాదులే శ్రేష్ఠసాధనములజెప్పి 10 నుండి 15-వ శ్లోకమువరకు మరణకాలీన నోంకారధ్యానవిధి పునర్జన్మనివృత్తిని అర్జునున కెఱిగించెను. మనము గ్రహింపవలసినది పరమేశ్వరస్వరూపము. వెల్లిపాయను వలువవలువ నేమి మిగులుచున్నది? పొరలవంటి చిత్తచదారమగు నవిద్యాపరిణామ కార్యముల నిషేధింప మిగులునది మన స్వరూపమే. భగవంతుడు నాత్మస్వరూపము రెండు నొకటే.

ప్ర॥ ప్రాణప్రయాణసమయమున నెన్నడు భగవంతుని మఱువనివాడు మఱచినవాని గతియేమి?

ఉ॥ ప్రాణము వదలేటప్పుడు, నోటితో భగవంతుని మఱచినను, మనస్సుతో మఱచినను అన్యము కోరలేదా? అటువంటివానికి భయము లేదు. భగవత్ప్రాప్తి తప్పదు. పతివ్రత నొకడు బలవంతమొనర్చినను ఆమె వ్రతభంగముకాకుండ తప్పించుకుంటే పాతివ్రత్యమునకు దోషము లేదు. ఆ రీతి భక్తుడు మరణసమయమున మఱచినను ముక్తుడే. లేదా? రెండవజన్మమున జీవన్ముక్తితో ప్రకాశించును.

ప్ర॥ భగవంతుని లక్షణములు కొన్ని చెప్పుడి?

ఉ॥ మేఘములకు, నదులకు సముద్రునివలె సకలభూతములకు సృష్టికర్త. నదులలో, మేఘములలో నీరేయుండుపగిది సర్వభూతముల నుండు గావున సర్వభూతాంతర్యామి. మేఘము, నదులు, ఫలవృక్షములు, సాధు మృగములవలె సుహృత్తు. మూడుకాలముల నొకటిగానుండి తెలియు వాడు సర్వమును దెలియు సర్వజ్ఞుడు సర్వనియంత దేనియందపేక్ష లేకుండ నిరపేక్షకుడు. పదునాల్గులోకములకు సూర్యునిరీతి నతడేసాక్షి. ఒకదేశ ప్రసిడెంటు నుత్తర్వుతో ప్రజలు జీవించురీతి కాలములు, దినములు, యుగములు, సకలభూతములు, నుత్పత్తిస్థితిలయములు నడుచు చుండును. భారతయుద్ధమున నేను నేనని యహంకారము పొటమరింప నర్జునుని నిమిత్తమొనర్చి కాలరూపుడగు భగవంతు డందఱ సంహరించెను. బుద్ధికి సర్వవిషయక సామర్థ్యమిచ్చుచున్నాడు. ఆయన లేనిచోనది జడము. ఈశ్వరునిదే దానికి సామర్థ్యము. భగవంతుని భక్తులుననేక పేర్లతో ధ్యానింతురు. పేర్లుపెట్టుకొని భక్తులు ప్రార్థించటము వారి

కిష్టమేగాని భగవంతున కేపేరులేదు. అన్నిరూపము లన్నినామము లాయనవే. అజ్ఞానమునకు విలక్షణమై సకలదృశ్యములకు ద్రష్ట.

ప్ర॥ చనిపోవునపుడు నీ పేరులలో నేపేరో యొకపేరుతోగాని, నన్ని పేర్లతోగాని పేర్లన్ని యొకనిపేరేనని ధ్యానించువాడు శరీరమునుండి నిర్గమించే త్రోవయేది ?

ఉ॥ ప్రయాణము జేయువారు రైలునకు ముందే కావలసివస్తువుల గొనివెళ్లి రైలుకొఱకు నెదురుచూచుచు బండిరాగానే వస్తువులతో బండిలోచేరి వెళ్లినరీతి, మరణసమయము రాకమునుపే మనోబుద్ధుల నభ్యాసపఱచి పారమ్యేరస్తా తెలిసికొన్నవాడు భగవంతుని స్వరూపముగ మనస్సు నొనర్చి యోగబలముతో ప్రాణములను భ్రూమధ్యమునకు జేర్చితే చాలు. తదుపరి భగవంతుడే తక్కినస్థితి బొందించును. వెంట వచ్చేది నేర్చితే చేపట్టుకొని త్రిప్పెదరు.

ప్ర॥ అట్టి సమయమున విషయములు జ్ఞాపకము రాకుండ నుండవలె కదా ?

ఉ॥ అవును. కంసాలి బంగారును నేయాభరణములుగా మార్చితే నట్లు మారును. గోధుమపిండిని, చక్కెరపాకమును, మట్టిని, ఇనుమును నెట్లు మార్చిన నట్లు మారగలవు. బుద్ధినిగూడ వ్యావహారికవస్తువుల ప్రేమించిన నారూపు మారును. లేక యోగబలమున, నభ్యాసపాటవమున సుషుమ్నానాడినుండి నిర్గమించును. ఉపాసకులే నీ మార్గమున వెళ్లెదరు. ఉపాసనారహితులు, జ్ఞానహీనులు తక్కినమార్గముల వారి వారి కర్మసాధనల ననుసరించి వెళ్లెదరు. జ్ఞానులు, జీవన్ముక్తులు వారెచ్చటికి పోవలసిన పనియేలేదు. వ్యాప్యవస్తువుకాదాత్మ; వ్యాపకవస్తువు. అది యెక్కడ జనును ?

ప్ర॥ ఓంకారము నుచ్చరించుచు ప్రాణమువదలినవాడు సంశయము లేక నన్నే పొందగలడని భగవంతు డనెనుకదా ? ఇతరనామముల ధ్యానించువారి గతియేమి ?

ఉ॥ వేదవేత్తలు పరబ్రహ్మ నక్షరమనెదరు. వైరాగ్యముగలిగి విషయనిస్పృహులైన యతులు ప్రవేశించునది. బ్రహ్మచర్యవ్రతులై దేనిని తెలిసికొందురో అదియె బ్రహ్మము. వేదముయొక్క జ్ఞానము

తెలిసినవారు, విషయవాసనాశూన్యులు, పరబ్రహ్మను తెలియు సనక సనందనాదులవలె ప్రయత్నమొనరించువారు నోంకారము ధ్యానింతురు. వ్యాపకదేవుడగు పరమాత్మకు ఓంకారము వాచకముగావున సంశయము లేక నాయనను బొందుదురన్నది వాస్తవమే. నీ సంశయము తొలగ వలసినది నిక్కమే. ఓంకారము నితరనామము లన్నిటికి నుపలక్షణము. లేక ఓంకారమే వాచ్యవాచకము నగుచుండుట, తక్కిన నామము లుపలక్షణములు. నిష్కామముగ నితరనామముల ధ్యానించిన చిత్తశుద్ధి తప్పితే సాలోక్య సారూప్య సామీప్య సాయుజ్య లోకాలప్రాప్తి గలుగును. ఆ నామములు భగవంతునికి వాచకములుగావా ? వాచకములే. ఆ నామములన్ని యోంకారమున బుట్టినవేకదా ? ఓంకారమే లేనిచో నా నామములెక్కడివి? అందువలన నోంకారమునే నుచ్చరించితే చాలు ననెను. శుద్ధమనస్సున భగవంతుని ప్రార్థించువానికి భగవత్ప్రాప్తి తప్పదు. మరొకమాట. ఓంకారము నొకేయక్షరము పలుకుట చెప్పుటకు సులభమైనది. బ్రహ్మమొక్కటే యక్షరము. ఓంకారమే సాధనగాను, సాధ్యముగాను జెప్పినాడు. వాచకవాచ్యములకు, నామమునకు నామము గలవానికి నభేదము చెప్పినట్లుగాలేదా ? అందువలన నేనామముతోనైన నామింతుగు పరబ్రహ్మను బొందవచ్చును.

ప్ర॥ చాలకష్టము. భావనాదృష్టి తప్పిన, యింద్రియసంచలనము గలిగిన నిరుపయోగమగును. దృఢతరపట్టుదల, యేకాగ్రత నింద్రియవశీకరణ ముండవలెకదా ?

ఉ॥ అవును. ఇంద్రియముల క్రొత్తగా మరలించిన మరలవు. చంద్రుడొకేదినము పూర్ణచంద్రుడు కాడు; దినదినాభివృద్ధితో యగును. ఇంద్రియములను విషయములవలన గలిగే ఫలితముల గమనించి, వాటిని మరలించి తన హద్దులోనుంచికొనియుండి మనస్సును బుద్ధియందు, బుద్ధిని బ్రహ్మరంధ్రమునజేర్చి ప్రాణము వదలుసమయమున ఓం అనే యక్షర బ్రహ్మన్ని స్మరించుచు తత్పదమునొందును. కష్టములేని విద్య యేదియు లేదు. అన్నిటికంటె ధ్యానయోగము కష్టమే. అయితే సాధనద్వారా భగవదనుగ్రహముతో గురునాజ్ఞ సులభమగును. కొంద అభ్యాసపరులు ప్రాణమును నాధారమునుండి సప్తకమలముల నొక్కొక్కటి వద్దకు

రానిచ్చి, శరీరమును పైకి పక్షివలె లేపుదురు. పాతంజలయోగసూత్రమున నోంకారమును గుఱించి చెప్పబడినది. మఱికొందఱు నోంకారమును ధ్యానించుచు, ప్రాణమును రేచకపూరకముల కుంభించి, లోని పెద్దప్రేగు చిన్నప్రేగులలోనికిచేర్చి, యచ్చటనుండి వెన్నముకలోనికి రానిచ్చి, అక్కడనుండి తలపుచ్చుకుండ నంగిలిద్వారా బ్రహ్మరంధ్రమునకేర్చి బ్రహ్మ రంధ్రము పెకలించుకొని పోయెదరు. ప్రపంచములోని ప్రతియొక్కదాని యందు వైరాగ్యముగలిగి శాశ్వతవస్తు వపేక్షించువారు నెంతకష్టమైనను మెల్లగా సాధించెదరు. ఓంకారార్థము శబ్దముచుముచు నపరావస్తువునకు నొకయర్థమగును. అసలు ఓంకారము పరావరములుగల దేవునకు వాచకము. ఓంకారమున కర్థము నేవిషయముకాదు. శ్రీరామ యను రాముడు సాధ్యమైనట్లు నిష్కలంకముగు పరబ్రహ్మము బోధించును. ఓంకారము నుచ్చరించుచు ప్రాణమువదలినవాడు క్రమముక్తి [illegible]ను చతుర్ముఖ బ్రహ్మలోకమునకు జని అచ్చట జ్ఞానముగల్గువఱకుండి ప్రళయములో చతుర్ముఖునితోసహా పరబ్రహ్మము నొందును. ఈ విధముగ యోగి ప్రయాణము ధ్యానధారణలద్వారా చేయవలె, నభ్యాసికే గాని జ్ఞానిమార్గముకాదు.

ప్ర॥ అభ్యాసిగాక మఱొకమార్గమున భగవంతుని ప్రార్థించ,ముక్తిలేదా?

ఉ॥ భగవంతుడు సెలవిచ్చినాడు విను. ముత్తెపుచిప్ప యెప్పుడు నోరుదెఱచుకొనియుండును. సముద్రుడెప్పుడు నడ్డుపెట్టుకొనియుండడు. నోరుతెఱచుకొననిచో నీటిబిందువు ముత్తెపుచిప్పలోబడదు. అయితే పడే బిందువే పడునన్ని బిందువులు పడవు. సముద్ర మన్నినదులకడ్డులేక తన్ను చేర తనముఖద్వారములే లేకుండజేసినది. ఎచ్చటినుండి వచ్చియైనా కలిసికో వచ్చు. భగవంతుడట్లే నేయే సేర్పుతోనైన తన్ను జేరుటకు తెరవులనేక ముఖముల దెఱచియున్నాడు. కావున తప్పక ముక్తియున్నది. దుఃఖమయము నశాంతమైన జన్మము వారికి రావసను. సతతము స్మరించినవారెంత పాపాత్ములైనను ముక్తి బొందవచ్చు. భగవద్దయకు పాత్రులు గానివారికి మాత్రమే ముక్తిలేదు.

ప్ర॥ బ్రహ్మలోకమునెదరే, నక్కడ వెళ్లినవారుకూడ మరల రావలసినదేనా?

ఉ॥ 10 నుండి 15 శ్లోకములవఱకు భగవంతు డోంకారధ్యానవిధి పునర్జన్మరహితమని జెప్పి, 16_వ శ్లోకార్థము జెప్పుచున్నాడు. బ్రహ్మలోక పర్యంతముగల లోకములకు వెళ్లిన తిరిగి రావలసినదే; నన్ను బొందిన మాత్రము పునర్జన్మము లేదనెను. బ్రహ్మలోకము ప్రళయమైనపుడుండదు. లోకములన్నియు ప్రళయములై బ్రహ్మలోక మొక్కటుండునంటే, పర బ్రహ్మకు నుపలక్షణముగ జెప్పిన సహస్రముఖ బ్రహ్మలోకాలు, నా బ్రహ్మ శాశ్వతమైన పరబ్రహ్మ మేమికావలె? అతివ్యాప్తిదోషము, నద్వైతహాని రాదా? బ్రహ్మలోకముతోగూడ నని యే యర్థము. మరొక యర్థము. అన్ని లోకములకంటె నాఖరులోకమగు బ్రహ్మలోకము నొందినను గూడ తన కర్మఫల ముగిసితే నటనుండి తిరిగి రావలసినదేనని యర్థము. తిరిగి రావల సిన దెప్పుడైతే కలదో నప్పుడాలోకము శాశ్వతముకాదు. అయ్యది శాశ్వతమైన నక్కడ చేరినవాడేల తిరిగివచ్చును? అప్పుడు నన్నే భజించుడని భగవంతుడనవలసిన పనేలేదు. బ్రహ్మలోకము వెళ్లినవారికి పునరావృత్తి లేదని యొకవంక నుపాసకులకు జెప్పుచు, తిరిగివత్తురనుటలో సందేహము కాదా! "మాముపేత్య తు కౌంతేయ" అనుట యేల? నా విషయమును వివరించెద.

ప్ర॥ పుణ్యకర్మము లొనరించువారికి నేప్రాప్తి లభించును?

ఉ॥ నీచేత డబ్బుయున్నది. దేశదేశములు తిరిగెదవు, చూచిరావలె ననుకొన్నావు. డబ్బు యున్నంతవఱకు తిరిగి చూచి, డబ్బు ముగిసినంతనె మరల స్వస్థానమునకు వత్తువు. కడులోభి చేయెత్తి దానము చేసినవాడు గాడు. అతనికి పెద్దవ్యాధి వచ్చినది. ధనమివ్వకుండా మందులిస్తే తినెద ననెను. ఒక సాధు డబ్బులేకుంటే మానె. నేను జెప్పినది చేయుమని యొక కుంట త్రవ్వించమనెను. త్రవ్వించితే మా కుంటలో నెవ్వరైన నీరు త్రాగరా? ఇతరు లుపయోగించుటకేనా త్రవ్వించటమనెను. ఎవ్వరు త్రాగ కుండ కావలి యొకని యుంచుదామన, కూలి యెవ్వడిత్తురనెను. అట్లైతే కూలి లేకుండ నేనే యుండెదనని సాధు ప్రోద్బలమున కుంట త్రవ్వించి తయారగునప్పటికి నా ధనికుడు చనిపోయెను. యముని యెదుట నాతని జీవుని చిత్రగుప్తుడు నిల్పెను. చిత్రగుప్తుడు లెక్కల నన్నిటినెత్తి జమా ఖర్చుల చూచి యమునితో ప్రభూ! నీతని జమ యేమియులేదు, నంతయు

ఖర్చుయున్నదనెను. అప్పుడాధార్మికుడు జబ్బురయుండి చిల్లిగవ్వయైన దాన మీయకనైతి. నేనెంత వ్యర్థుడను, నన్నెవ్వరుద్ధరింతురు ననుకొనుచుండ, చిత్రగుప్తుడు చక్కగ వెతికి స్వామీ! అతని జమ యొక్కటియున్నది. ఏమన నతడు చనిపోయే సమయమున త్రవ్వించిన కుంటనీరు నొక యావు త్రాగినది. అది మాత్రము గలదన, ప్రభు వేమయ్యా! ఒక వత్సర మాదును స్వర్గమునుండి తక్కిన కాలమంత నరకమున నుండెదవా, లేక నరక మనుభవించివచ్చి స్వర్గమనుభవింతువా? నీ యుద్దేశము జెప్పుమన నాతడు నిర్విణ్ణుడై ముందు స్వర్గానికి వెళ్లెదననెను. స్వర్గానికి పంప నట స్వర్గమనుభవించుచు నేను త్రవ్వించిన కుంటలో మరల నొక జీవజంతువైన త్రాగకుండునా! కానిమ్ము. యముడేమి జెప్పునో యని తన సంవత్సరము ముగిసినంతనే యముడు పిల్చి బంపి నరకమునకు వెళ్లుమన ప్రభూ! నేను యిక్కడ వచ్చినమీదట నా జమ యేమైన వచ్చినదేమో జూడుమనుడన, చిత్రగుప్తుడు లెక్కలుచూచి ప్రభూ! ఈతని జమలెక్క నంతవచ్చినది. చీమలు దోమ ఈగలు పశు పక్షి మనుష్యాదులనెను. జముడు నవ్వి వెళ్లు స్వర్గానికేననెను. చూచితివా! అందుకయ్యే పుణ్యము చేయువలె; పుణ్యకర్మ లొనరింపలేదా నరకమె గతి యనుకొ. పుణ్యముకొఱకు ధన ధాన్యాదులు త్యాగము చేయువలె నందుకై నతనినిగూడ యోగియనెను భగవంతుడు. జ్ఞాని యుత్తమయోగి, యుపాసకుడు మధ్యమయోగి, సత్కర్మపరత్యాగి యంత్యమయోగి. ధనత్యాగ మొనర్చినందున నితనిని యోగి యనవలసివచ్చినది. జ్ఞానిగాక యుపాసకుడు, ధనత్యాగి కానివారిని గుఱించి చెప్పటముచేత నొకటి మంచిదన, మరొకటి చెడ్డయని మనకనే తెలియులాగు నీ ముప్పురిస్థితి తెలిసినమీదటనైన తక్కినవారు తమ జీవుల సుగతి కొఱకు జాగ్రతపడెదరని భగవంతుని యభిప్రాయము.

ప్ర॥ అయితే తక్కినవారు యేలాంటివారైన వారి గతి యేమి?

ఉ॥ అధోగతియే అనగా పునరపి జననము, పునరపి మరణము తప్పిన కాదు. జ్ఞానప్రాప్తి గలిగేటంతవఱకు నా యవస్థ తప్పినదికాదు.

ప్ర॥ 17 నుండి 19 శ్లో॥ వఱకు బ్రహ్మయొక్క దివారాత్రములు 'చతుర్యుగసహస్రం తు బ్రహ్మణో దినముచ్యతే' కృత త్రేత ద్వాపర కలి యుగములు నాల్గుసహస్రయుగములైన బ్రహ్మకొక పగలు. అట్టివే సహస్ర

యుగములైన నొక రాత్రి, బ్రహ్మదేవుని పగలైనపుడు లోకములు, భూతములు ప్రభవించును. రాత్రియైనంతనే నవ్యక్తములో చేరిపోవును. ఇవియే నావిర్భావతిరోభావములు, లేక సృష్టిప్రళయములందురు. బ్రహ్మదేవుని యొక్క పగటిలో పదునాల్గు మనువులు మారిపోయెదరు. బ్రహ్మదేవునికి కాలపరిచ్ఛేదము యుండబట్టి బ్రహ్మలోకాన్ని యసత్యమనవలెను. బ్రహ్మదేవుని యాయువు, నతని స్థితిగతు లట్లుంటే మనల నేమి చెప్పవలె? ఇంద్రియముల ప్రళయము నిత్యప్రళయమనియు, బ్రహ్మకు రాత్రియైనంతనే భూతములవ్యక్తములో చేరిపోవును. ఇదియే దైనందిన ప్రళయము. ఈ ప్రళయములో స్వర్గాదిలోకాలు, మూర్తద్రవ్యములు నశించును కాని పంచభూతములు నశింపవు. బ్రహ్మకు నూరేండ్లు నిండినంతనే మహాప్రళయంవచ్చును. అప్పుడు పంచభూతములు భౌతికములు మూలప్రకృతిలో లయించును. దీనిని ప్రాకృతికప్రళయమందురు. జ్ఞానదశలో ప్రకృతి బాధింపబడును గాన నది నాత్యంతికప్రళయమనెదరు. మన గాఢనిద్రలో "సుషుప్తికాలే సకలే విలీనే తమోభిభూత"మని మన సంసారములయించి మన జాగ్రతలో నుద్భవించును. బ్రహ్మదేవుని సంసారమంతే. అవ్యక్తము నుండి వ్యక్తము కావటము క్రొత్తసృష్టికాదు. వెనుకటి కల్పములోని జీవులె తమ కర్మానుసార ముద్భవించెదరు. స్థూలశరీరములు మారును, సూక్ష్మశరీరము లప్పటివేయుండి మరల నావిర్భావతిరోభావముల వేషధారులవలె మారటమేకాని క్రొత్తవేమిలేదు. కాలేజిలో చదివే బాలురకు ఎండాకాలము శెలవు యిత్తురు. అప్పుడు కాలేజిమాత్రముండును; బాలబాలికలుండరు. కాలేజి తెరచినంతనే నంతకు మునుపు చదివెడివారే చేరుదురు. బ్రహ్మయొక్క వ్యక్తావ్యక్త రాత్రింబవల్లంతే; ఉన్నజీవులే ప్రళయములో సూక్ష్మస్థితిలోనుండి, నాయనకు పగలుకాగానే మరల తమ తమ కర్మఫలములబట్టి నవతరించెదరు. వ్యక్తమగుట స్థూల, మవ్యక్తమగుట సూక్ష్మము. సూర్యునిచుట్టు భూమి తిరుగుచున్నదందుచేత మనకు రాత్రింబవళ్లేర్పడుచున్నవి. రాత్రియందు పగటివి వ్యక్తమగుటలేదు. పగలైనంతనే మునుపటివే వ్యక్తమగును. సూర్యునకేమి తెలియదు. మనస్సులోనుండుట సూక్ష్మము, నవ్యక్తము. అవి స్థూలములగుట వ్యక్తములు. సినిమాయందు గాని, బొమ్మలాటయందుగాని యాట ముగిసినంతనే బొమ్మలు వ్యక్తము

గావు. నాట ప్రారంభించినంతనే వ్యక్తమగును. సూత్మశరీరాలు కర్మఫలము లతో నవ్యక్తమగు మాయయందుండి యాదృష్టమువచ్చేసరికి సృష్టి నీశ్వ రేచ్ఛ గలుగును. మున్దెన్నడులేని యొకభావము సృష్టికాదు, ఉన్నభావ మెన్నటికిపోదు. ఉద్యోగమునందున్న నాయొక్క మార్పునకె ముక్తిగల్గేటంత వఱకు నీమార్పు తప్పదు. అందుకే బ్రహ్మప్రాప్తి బొందవలెనని భగవం తుడు మాటిమాటికి హెచ్చరించుచుండెను.

ప్ర: బ్రహ్మకు ప్రళయములో పుణ్యాపాపములతో భయములేదే, జీవులు ప్రళయములో బోతే నుత్పత్తిలో క్రొత్తజీవు లొత్తురుకదా?

ఉ: పైన జెప్పిన రహస్యమును చక్కగా విమర్శించిన నీ సంశయము తొలగును. ఈశ్వరుడు మాయాసంబంధము, జీవుడు యావిద్యభేదము లనాదులన్నప్పుడు క్రొత్తవారెరి? లేరు.

ప్ర: పరమాత్మప్రాప్తి ప్రాధాన్యమని తెలిపినది. 20 నుండి 21 శ్లోకము వఱకు పరమేశ్వరుడే పరమగతియని, భగవంతుడు చెప్పినదే నిజము, గాని యుపాసకుడు సత్కర్మత్యాగి యేవిధముగ ప్రయాణ మొనరింతురు?

ఉ: బ్రహ్మయొక్క యవ్యక్తాకస్థకంటె నన్యమైనదియు, చక్షురాది యింద్రియములకు నగోచరమగు చేతనము స్వతంత్రము నగు బ్రహ్మము పంచప్రళయములలో నశింపదు. వినాశరహితుడగు నేయక్షరపరబ్రహ్మ మును బొందితే తిరిగిరారో నయ్యదియె నా పరమధామమని భగవంతు డనెనుకదా! ఆ పరబ్రహ్మమును బొందని యుపాసకుని గతి విను. 21 నుండి 27 వఱకు దేవయాన పితృయానముల 28-వ శ్లోకము ఫలశ్రుతి వివరించెను. అక్షరబ్రహ్మోపాసకులు నగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షము నారునెలల నుత్తరాయణముగల మార్గమున బ్రహ్మప్రాప్తి నొందెదరు. దీనినే దేవ యానము నుత్తరాయణ మనెదరు.

ప్ర: వాని యర్థము లింతియేనా? వేఱుకలవా?

ఉ: ఉత్తరాయణమార్గము జ్ఞానమనెదరు. నిష్కామకర్మోత్తర కాల మున ప్రాప్తించును గాన జ్ఞానమని కొందఱు; అగ్నిహోత్రమునుండి సూర్యుడు, సూర్యునుండి హైరణ్యగర్భుడు, నైష్ఠికత్వము, బ్రహ్మలోక ప్రాప్తి, యటనుండి ముక్తియని కొందఱు; సాధనచతుష్టయములు నాల్గు,

తర్వాత జ్ఞానప్రాప్తి నుత్తరాయణమార్గమందుచు కొందఱు. సూర్యనాడి నుండి సంబంధిపోవుట నుత్తరాయణమని కొందఱు. ధూమాదిమార్గము దక్షిణాయనము, పితృయానమని, కర్మపరులమార్గమని యందురు. దీనికే కృష్ణపక్షము ధూమము, కృష్ణగతి, రాత్రి యభిమానదేవతచే చంద్రలోక ప్రాప్తి యగుననియు, చంద్రనాడిమార్గమని కొందఱందురు. జగత్తు మిథ్యయైనపుడు శుక్ల కృష్ణ మార్గముల గతి యేమి యనెదరు? భగవంతుడు చెప్పినవి యబద్ధములు కావు. అర్థము లనేకములు వారి వారి సాంప్రదాయముల కనుకూలముగ జేసికొందురు. ఇంత యేల? సద్యోముక్తి క్రమముక్తులు విన్నమీదట ధూమమార్గస్థితి తెలిసినది, వారి వారి యిష్టము. తక్కినవారి మార్గము భగవంతుడు తెలవు నియ్యలేదు. స్కూలులో నాలుగు తరగతులుంచిరి. అవి చదివేవారికి ప్యాసయ్యేవారికేగాని, అసలు స్కూలునకే రానివారి కెక్కడివి తరగతులు? వారికి తెలియనే తెలియవు. పాఠశాల విద్యార్థులనేది వారికి తెలియదు. తెలిపినను వినరు. వారుండేది స్కూలునకు తెలియదు. శుక్ల కృష్ణ మార్గము లిష్టపడి సాధించేవారు సాధింపవచ్చును. భగవంతునినమ్మి సర్వదా భజించినవారి కన్నిమార్గములు నాయనయే కాగలడు. ఇది సులభము.

ప్ర॥ బ్రహ్మలోకము పోయినవారు తిరిగి రారుగదా? పునరావర్తితు దని యేల ననెను?

ఉ॥ పంచాగ్నివిద్య యనునది నాచరించినవారుమాత్రము నుపాసకులతోపాటి బ్రహ్మలోకము జనుదురుగాని, వారి కర్మఫలము ముగిసి నంతన వెనుకకు వత్తురు.

ప్ర॥ శుక్లకృష్ణమార్గముల తెలుపు టెందుకు?

ఉ॥ త్రోవలు తెలియకపోతే ప్రయత్నము జేయలేరనియు, జేసినవారి మార్గములు తెలిసి యన్యులు ప్రయత్నింతురనియు, మోహాబద్ధులు, జడ బద్ధులుగాక, నుభయభ్రష్టులుగాక తెలిసినవారు మార్గము తప్పక వర్తింతురనియు, సర్వకాలసర్వావస్థల నందుకే యోగయుక్తుడవై యుండమనియు భగవంతు డర్జునునకు తెలుపుటచేత నన్నిమార్గము లుండనీ యుండకపోనీ భగవద్భక్తులమైయుంటే మన యోగక్షేమము లాయనే జూడగలడు.

ప్ర॥ ఈ యధ్యాయమునకు ఫలశ్రుతి యేమి జెప్పెను?

ఉ॥ వేదము లధ్యయనముచేయఁ గలుగు ఫలమునకంటె, యజ్ఞ ఫలముకంటె, బహువిధములైన తపోఫలములకంటె, నుత్తమకాలమున నుత్తమదేశమున లేక నుత్తమస్థలముల సత్కర్మముల దానము లొనర్చిన వచ్చు ఫలముకంటే అనగావీని యన్నిటికంటె నెక్కుడుఫలము, గతి నొందెదరు. పవిత్రస్థలములు, పవిత్రనదులు, విభూతులు, మన మొనర్చు తపములు వగైరాలన్ని యెవ్వనియందలి యీధ్యస్థప్రపంచమునుండి చేయుచున్నామో నా పరమాత్మప్రాప్తియే తప్పక గలుగును.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
అక్షరపరబ్రహ్మయోగో నామ
అష్టమోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## నవమాధ్యాయము

### రాజవిద్యారాజగుహ్యయోగము

మ॥ భగవత్ప్రాప్తికి సాధనంబు నిగమాపారార్థసారంబు సూ
రిగణోత్కంఠప్రశస్తహృద్యనుతశౌరీవాణి గీతామృతం
బు గురూత్కృష్టము భక్తిగమ్యము భవాంభోరాశితారంబు నే
పగిదిం జూచిన లేదునొండు సమమబ్బా గీత కేనాటికిన్.

శ్లో॥ బుద్ధ్వా న బోధ్యం పరిశిష్యతే కిం శివప్రసాదం సుఖబోధరూపం।
జ్ఞాతే తు కస్మిన్విదితం జగత్స్యాత్ సర్వాత్మకే బ్రహ్మణి పూర్ణరూపే॥

తా॥ దేనిని తెలిసికొనిన నింకొకటి తెలిసికొనదగినది మిగిలియుండదో నదియే మంగళస్వరూపము, శుద్ధము, జ్ఞానస్వరూపము, నానందఘనము నగు పరమాత్మస్వరూపము నపుడే; ధన్యత్వము.

ప్ర॥ ఫలితాలయోగమగు నష్టమాధ్యాయమును జెప్పి నర్జును డడుగక మునుపే భగవంతు డేల నీ యధ్యాయము నారంభించెను? ఈ యధ్యాయము పేరేమి ?

ఉ॥ హారముయొక్క నడిమినాయకమణివలె మధ్యమషట్కమున వెలయు తత్పదార్థనిర్ణయము, మానవశ్రేయోదాయకంబగు గుహ్యతరము, ప్రియతరము, మధ్యమషట్కమున పరబ్రహ్మప్రాప్తి సాధనము తెలిపి నీ యధ్యాయము తానే ప్రారంభించటమున విశేషము లేకపోలేదు. మృతినొందినమీదట నుపాసనజేయువారిని, స్వర్గగమనమొనరించువారిని, జ్ఞానభక్తులను జెప్పి నీ యధ్యాయము జెప్పుటకు తనహృదయము తహతహపడి దీనులను, పాపాత్ములనేగాక నానావిధమానవులకు సులభోపాయమేదియని యోచించి, సులభసాధ్యమగు భక్తిమహిమను చెప్పదలచి

ప్రారంభించెను. గంగయమునలమధ్య సరస్వతిరీతి, గీతకు నీ యధ్యాయము పావనమై పదునెనిమిది యధ్యాయములమధ్య వెలుగుచున్నది. క॥"చిక్కుడు వ్రతముల గ్రతువుల జిక్కడు దానముల శౌచశీలతపములం। జిక్కడు వృత్తిని భక్తిని జిక్కినక్రియ" యనియు, క॥"విష్ణుకథారతుడగు నరు। విష్ణుకథల్ జెప్పునరుని వినుచుండు నరున్, విష్ణుకథాసంప్రశ్నము, విష్ణుపదీజలముపగిది విమలుల జేయున్॥" భాగవతము. "సాపరాఽనురక్తిరీశ్వరే" శాం॥ సూ॥ భగవానునియం దంతములేని భక్తిగలిగియుండుటది శ్రేష్ఠభక్తి. "భక్తిరేవ పరమార్థదాయినీ, భక్తిరేవ భవరోగనాశినీ। భక్తిరేవ పరవేదనప్రదా, భక్తిరేవ పరముక్తికారిణీ." భక్తియొక్క ప్రాముఖ్యము నభివర్ణింపబడినది. జ్ఞానమునకు, పాపనాశమును వారించుటకును, భవదుఃఖముల బాపుటకును, పరతత్వమును ప్రకాశింపజేయునది. "స్తుతిస్మరణపూజాభిర్వాఙ్మనఃకాయకర్మభిః। సునిశ్చలా భవేద్భక్తిరేతదీశ్వరపూజనమ్" వాక్కుచేత స్తుతి, మనస్సుచే స్మరణ, కాయముచే పూజనిదియే నీశ్వరప్రీతికరము. లేక భగవంతునకు తన్నర్పించుకొను ప్రపత్తిమార్గమొక్కటియే నన్యశరణ్యమై, భయదసంసారనివర్తనీయమై, పరిపూర్ణ శాంతప్రదాయకమై, భవబంధరోగవిధ్వంసనీయమై, దిగంతయశోవిశాలమై, బుధజన మనోభిరామమై, యతులితగాథానురాగప్రపంచపరిసేవితమై నొప్పారునది. "స్వస్వరూపాఽనుసంధానం భక్తిరిత్యభిధీయతే" తనస్వరూపసాక్షాత్కారమునకు భక్తియే శ్రేష్ఠసాధన. "అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనం। దేహాంతే తవ సాయుజ్యం దేహి మే జగదీశ్వర" అపరా పరాభక్తులలో పరాభక్తియే వివిధభక్తులలో నగ్రగణ్యమైనది. బిడ్డపై ప్రేమగల తల్లియే పరామర్శించి వానిరోగక్షేమములకొఱకు కుఱ్ఱవాడడుగకపోయినను యే సమయమున కేదియవసరమని గ్రహించి పోషించును. గురువు శ్రద్ధాభక్తివిశ్వాసముగల శిష్యుడైన తన యనుభవమగు వేదాంతరహస్యము నడుగకనే బోధించును. దినమునకు నాలుగుజెప్పితే పదిమఱచేవాడైతే నడిగినను జెప్ప సాహసింపరు. తనయుడుత్తముడైన తండ్రి సర్వవిషయముల వానినే యనుసరించును. భగవంతుడు దయామయుడు. తలిదండ్రిగురుకన్న నెక్కువ

ప్రేమగలవాడు. భక్తుని పారవశ్యమును గ్రహించి తానే చెప్పగలడు. భక్తుని సర్వకార్యములలో తానే సేవకుడై యాచరించును. ఏకనాథునింట నీళ్లుమోసెనంటే, సక్కూయింటస్తంభమున గట్టుబడెనంటే, బలిచక్రవర్తి తొలిద్వారపాలకుడయ్యెనంటే, బాణుని రక్షకుడయ్యెనంటే, అర్జునునిరథము నడపటము, గుఱ్ఱముల కడగటము, వాని వీపున దగిలినబాణములు దీయుటము, వాటి మేపు నీళ్లు విచారించటము, రాజసూయయాగమున నెంగిలివిస్తళ్లు నెత్తివేయుటము, శబరి ఎంగిలిఫలముల భక్షించటములోనే నాయనకు సంపూర్ణముచ్చట. ఉదారవంతులు దయామయులైన మహాత్ముల యాశయములు లోకకల్యాణకరములు. అర్జునునకు గురువై, రథసారథియై, సఖుడై పరతత్వోపదేశము చేసెను. సచివుడై మంత్రాంగము చెప్పెను. శుక్లకృష్ణమార్గముల పూర్వాధ్యాయమున జెప్పి నుత్తరాధ్యాయమగు దీన యంతకంటె సులభమార్గమును బోధించెను. ఒకడు ఎండవేళ విశ్రాంతికి మార్గాయాసము తొలగ నొక చూతవృక్షము క్రిందబరుండి నిద్రించి మెలకువరా పండ్లతో వెలయు నా వృక్షమునుజూచి తానిట్లనుకొనెను. దేవునకెంత బుద్ధిలేదు, ఇంత పెద్ద చెట్టునకు నింతచిన్న ఫలములనుంచటము, నా సమీపమున తీగలుబారి గొప్పగొప్ప గుమ్మడికాయలగాచిన దాని కింత పెద్దఫలములనివ్వటము సరిగాదనుచుండ, గాలికి చూతఫలమొకటి నాతని నెత్తినపడినంతనే వెంటనే దైవఘటనమును నర్థము జేసుకొని యిట్లనెను. ఓరా! భగవంతుని తెలివి. గుమ్మడిపండ్లవంటివి నీ మామిడిచెట్టుకున్న నాతలపైబడి నీవేళకు బద్దలైపోయియుండును. గొప్పవి క్రింద, చిన్నవిపై ననుంచటము నిందుకే నని తన తెలివి తక్కువకు చింతించుచు దేవునిబుద్ధికి వినుతు లొనర్చెను. ఆ ప్రకారము భక్తసులభుడగు భగవంతుడు మన యూహాకందని మార్గముల మనకొఱకు నుంచెను. మనము వాని ననుసరించి నాయనను బొందితే చాలు. విమర్శ మన కవసరములేదు. చూచుటకు కన్నుల, వినుటకు చెవుల, నాఘ్రాణించుటకు నాసికముల, రుచులచూచుటకు నాలుక, మాటలాడ వాక్కు, స్పర్శించ చర్మమును, చేయ హస్తముల, నడువ పాదముల, తక్కంగల నంతకేంద్రియముల నిచ్చెను. ఈ యింద్రియముల నీయకున్న నీ విషయచింతలబడక నిరతసుఖమున నుందుముగదా!

యని కొందరనుకోవచ్చు, అదియే నామాట. ఆ మాదిరి వృక్షస్థావరములకు నిచ్చియున్నాడుగదా! అవి సాధించిన దేమున్నది? అవి యుండిననేమి, లేకపోయిననేమి? ఎందుకొసగినదందుకే వినియోగించితే నిత్యనిరతిశయానందము నొందకపోము. ఉద్దేశమొకటి, నుపకరించుట మొకటి యైనది. దీన యనర్థకములు ఏర్పడవలసివచ్చినది.

ప్ర: ఈ యధ్యాయమునందే సాధన ప్రతిపాదించెను. దీనికేమి పేరు నుంచెను?

ఉ: నీ యిష్టముజెప్పు నట్టిసాధన జేయవలయునని నీ యుద్దేశ్యము?

ప్ర: ప్రపంచములోగల సాధకు లాచరించుసాధన లన్నిటిలోను సులభమైనది కావలెనని యిచ్ఛ?

ఉ: ఈ యధ్యాయమున గుహ్యతమ మనికూడ అనెను. అత్యంత రహస్యమని యర్థము. ఆర్జించుటములో సులభము, కీర్తినార్జించుటములో సులభము నీలాగు మానవులు బడెడు నిహపరలోక మోక్షమార్గము లన్నిటియందు నొక సులభమార్గముండేది నెవ్వరెఱుగరంటే నది గుహ్యతమమనియే నర్థము. మఱొకర్థము. తత్పదవాచ్యుని మర్మమును తెలుపుటయు, నైకైకస్థితికైన ఉపాయమును తెలుపుట మొదటిపక్షము. త్వంపదవాచ్యము కర్మరహస్యమును చెప్పెగాన అది గుహ్యము. ఇది రెండవపక్షము. ఉపాసనావిధము జెప్పెను గాన నిది గుహ్యతరము. గుహ్యతమ మనుట మూడవపక్ష ఫలితార్థమును ప్రశంసించుటకు జెప్పెను. మానవులకు నెయ్యది తెలియక సకలానర్థకములు జన్మజన్మముల గలుగుచు శాశ్వతసుఖము లేకుండనున్నది. ఎయ్యదిబంధము, నెయ్యదిసంసారము, తానెవ్వరైనది తెలియకపోవుటయే శాస్త్రనిర్దేశ్యములగు సత్యజ్ఞానానంద పరమాత్మను తెలియుట జ్ఞానము. ఆ పరమాత్మ నేనని యెఱుగుట ననుభవమగు విజ్ఞానము. అందుకే "జ్ఞానం విజ్ఞానసహితం" అనెను. పరమాత్మనని యెప్పుడు తెలియునో నప్పుడు సకలానర్థములు నొకక్షణములో తొలగును. సంసారలేశము నుండదు. 'తద్విజ్ఞానాదమృతత్వం' ఆ బ్రహ్మ మిట్టిదని యెఱుగుటవలన మోక్షము సిద్ధము. "నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే" ఆ పరమాత్మనెఱిగినా మృత్యుముఖమునుండి విడివడుదురు, లేదా మృత్యుముఖమునబడక తప్పదు. నదిని దాటవలె

నావ, నావికు డవసరమె. మోక్షము కావలె. సాధన, గురువుకావలె. కావున 1 మరియు 2 వ శ్లోకములు సుఖసాధ్యమగు సాధనను జెప్పెను. వెంకటేశ్వరునికొండకు మార్గము లేవి ? కాలినడకతో బోవుట, డోలీలతో బోవుట, ఇప్పుడు సులభముగ బస్సుపైన వెళ్లవచ్చు. రాజాయంటే అర్థమేమి ? ఇష్టమని; అనగా నా యిష్టమువచ్చిన మార్గమని అర్థము. చంద్రుని కర్థము. ప్రభువున కర్థము. 'రంజయతీతి రాజా' ప్రజల రంజింపజేయువాడు రాజు. తన యింద్రియములను ప్రాణములను శరీరములనే ప్రజల కష్టపెట్టకుండ హరినిగను మార్గము రాజవిద్యయనియు నేమార్గముతోనైన రాగలదని యర్థము. రాజులుమాత్రమే గ్రహించునదియని యొకర్థము. విద్యలగు నవిద్యాసంబంధము లనర్థకము గల్పించునది అనేకములున్నవి. అట్టిది కాదుగాన రాజవిద్యాయనియు, తన యిచ్ఛవచ్చినరీతి నడిచి హరిని గనవచ్చుట రాజగుహ్యమని అర్థము. జీవేశ్వరుల యభేదమును మానవులకందఱకు తెలియజేయుట స్వర్గాదులవలె నప్రత్యక్షముగాదు. క్రమముక్తి వచ్చిసాధించేదికాదు. పంచాగ్నివిద్యవంటిదిగాదు. సంశయింపతగినది పెక్కు కాల సాధనాఫలమని కాదు. ప్రత్యక్షఫలమగు సాక్షాత్కారవంతమైనది. నాశధర్మముగలదిగాదు, యవినాశి. ఎప్పుడో నాకతూరి యపవిత్రమగునదియేమొ ననుకొనకుండ పవిత్రమైనది. భూమి జల మగ్ని వాయ్వాకాశములు తక్కిన వన్ని యపవిత్రములే. లేక మార్గములు ఫలితము లపవిత్రములే గావచ్చు, నిత్యుదట్టిదికాదు. మధ్యమాధమములగు ఫలప్రాప్తి గలిగించునదికాదు, ఉత్తమమైనది. పరోక్షముగ తెలిపిన త్వంపదవాచ్యుడగు జీవుని, తత్పదవాచ్యుడగు నీశ్వరుని యభేదస్థితి తెలుపు రహస్యము. అశుభమగు సంసారమునుండి తరింప పవిత్రహృదయులుగావలె. దోషహృదయులగు దుర్యోధనాదులందేయుండి తెలియలేదన్న నపవిత్రమగు ననూయాదోషమే. అర్జును డొక్కడే నధికారియా ? యనుకోవలదు. డబ్బువుండి పరమలోభి సినిమాకు బోలేకపోతే సినిమావారు రానివ్వలేదనికాదు. డబ్బుయిచ్చిన వారెవ్వరైననరే సీటు జూపింపగలరు. విశ్వసినిమా యజమానియగు హరి తన హాలుదెఱచి రారండీయని బిలుచుచున్నాడు. చెవుడున్నైవినబడనివో నేమిచేయుదు! తలో అపూర్వమైనది. మంచియవకాశము. నానావిధ

మానవులు చేరవగా ప్రయత్నిస్తే తేలికగా గ్రహించగలది, చొచ్చగలది గాన రాజవిద్య నిత్యప్రాప్తమైన తనస్వరూపమే. లోకములోని జీవులందఱి కోరికకూడ పవిత్రముగను శాశ్వతముగ నుండవలయుననియేకదా! అటు వంటప్పుడు జీవితమును మాధుర్యమొనరించుకోవలెను.

ప్ర॥ మాధుర్యము లేక పవిత్రత మన కెట్లు తెలియును?

ఉ॥ ఒకప్పుడు కబీరుదాసు నొకడు భగవంతు డెట్లుండునని యడుగ, నాయనొక మూగవానినిజూపి బెల్ల మెట్లుండునని వానిని యడుగమనెనట. మూగవాడు బెల్లమిట్లుండునని జెప్పగలడా? చెప్పిన మూగవాడని యేల ననిపించుకొనును? వాని సంజ్ఞలచే నెదుటివాడు గ్రహించినలాగు భగవంతుని గ్రహింపవలెననెను. ఆ రీతి ధర్మసారము, మాధుర్యము, మత గ్రంథము లనేకముగలవు. అన్యప్రచారము లనేకముగలవు. అనేక సాంప్రదాయములుగలవు. వాని ధర్మఫల మశాశ్వతము. "కల్పితస్య వికారస్య ధారణాత్ ధర్మః" కాలకృతములు, దేశకృతములు, వస్తుకృతములు కల్పితము లందువలన దుఃఖములే. గీతాధర్మ మట్టిదికాదు. అది యెందోబుట్టి యెందెందో ప్రవహించుచున్నది. తద్రీతి గీతాప్రవాహము హరిముఖారవిందమున బయలుదేరి యెందెందో ప్రవహించుచున్నది. ఇందులో మునగనివారే లేరు. మునిగితే సరి పవిత్రులే. ధర్మమును నాచరణలో నుంచుటయే మాధుర్యము. తల్లి తన పాల బిడ్డలకిచ్చుట ధర్మము, పిల్లలు గ్రోలునపుడు గలుగు స్థితియే మాధుర్యము. పిల్లలు త్రాగలేదు, తల్లి యివ్వలేదు. పాలు లోననిల్చి గడ్డలుగట్టుటధర్మము. బాధ గల్గుట దుఃఖమగు విషయము. గీతాధర్మము మానవులు వినుటయే ధర్మము, నాచరణలో నుంచుటయే మాధుర్యము. భగవంతుని సేవించుటయే ధర్మము, నాయనలోగలిసి తన్మయులై జొక్కి సమస్తము మఱచుటయే మాధుర్యము. పశువుల పాలవల్ల ననేకోపకారము జరుగునేకాని పశువుల మేపి, సమయమెఱిగి పాల బిండు నేర్పుకావలె. పిండగల్గి వెన్నగా మార్చగల్గినపుడు మనకది ప్రత్యక్షఫలము. వేదధర్మములగు కర్మల ననుష్ఠించటములో భావము సంపూర్ణఫలత్యాగ మొందినపుడే లేక వాసనా త్యాగము గల్గినంతనే మానవులకు మాధుర్యము. మానవత్వము యోగ్యమగును. యోగ్యులైన మహాత్ములే ధర్మపాలనముజేసిరి. రామ, కృష్ణ,

గోవింద, నారాయణాది నామముల పలుకుటలో, వ్రాయుటలో, స్మరించ టములో నుండే సులభత్వము మఱి దేనియందున్నది? గీతాధర్మ మాలాటి సులభసాధ్యమే. కపటరహితుడై నాచరించు కర్మలకంటె శ్రేష్ఠతమ మగును.

ప్ర॥ విద్యయనే నీ యోగమునకు దేనిచేత హానిలేదా?

ఉ॥ నేర్చుకొనే విద్యలేగాదు. సాధింపబడే సాపేక్షవిద్యకాదు. బ్రతు కులకొఱకై యుపద్దనపద్దముల, వింతవేషముల, తంతుకర్మల, రంతు మాటలవంటి విద్యకాదు. ప్రపంచమాది మాయతో సహా పంచప్రళయ ములలో లయమగునదికాదు. "అధ్యాత్మవిద్యా విద్యానాం" విద్య లలో నాత్మవిద్య భగవత్స్వరూపము, ఆత్మవిద్యయే బ్రహ్మవిద్య, బ్రహ్మ మశాశ్వతముకాదు. బ్రహ్మను తెలుపు విద్య యశాశ్వతముకాదు. 3 నుండి 6-వ శ్లోకమువఱకు శ్రద్ధారహితు డనధికారియనియు, భగవం తుని యోగైశ్వర్యముల తెలుపుచున్నాడు.

ప్ర॥ భగవంతుడు చెప్పిన యీ ధర్మరహస్యము నమ్మనివారికి, శ్రద్ధ లేనివారి కేమిగతి?

ఉ॥ భగవద్వాక్యముల నమ్మకము లేనపుడు భగవంతుడు నమ్మకము లేదు. భగవంతునియందు విశ్వాసము లేనపుడు తనయందు నమ్మకము లేదుకదా! వీరె నాత్మవంచకులు, నాత్మఘాతకులు. హనుమంతు డంగ దుడు విభీషణు డెంతజెప్పిరి రావణునకు. రాముడు దేవుడని నమ్మెనా? లేదు. సమూలము నాశనమాయెను. దుర్యోధనాదుల కెంత జెప్పె హరి మధ్య వర్తిత్వము జేయబోయినపుడు, వినిరా? లేదు. విశ్వామిత్రుని తనయులెంత వినిరి? హరియందు నమ్మకములేని నాస్తికులు హరిధర్మము లెన్నడును వినరు. వారి యజ్ఞానమంతజేయును. ధర్మరహస్యములయందు శ్రద్ధ యుండదు. స్త్రీల గుఱించి, ధనధాన్యముల గుఱించి, తరతమభేదముల నిహలోక పరలోకముల నాసక్తులై యున్నవారొకరు జెప్పిన వినరు. తాము తెలిసికొనరు. శ్రద్ధలేనివిద్య, ధర్మము తనకు మేలొనరించలేవు. అట్టివారు భగవత్ప్రాప్తి నొందక "యథా ప్రదీప్తం జ్వలనం పతంగా విశంతి నాశాయ" మిడుతలు నగ్నియని తెలియక దానిని భక్షించవలెనని పోయి యగ్నిలోబడి చచ్చిపోవుటయేగాని, తినటముగాని, బ్రతికి తిరిగి రావటము

గాని లేదు. "యథా నదీనాం బహవోఽంబువేగా సముద్రమేవాభిముఖా ద్రవంతి" నదీప్రవాహములు తొందర తొందరగ ప్రవహించి సముద్రమున గలిసి తమ పవిత్రత బాయునట్లు, కామతము యిచ్చవచ్చిన తెఱగుల పరువెత్తి తుదకు దుఃఖభాజనమగు నరకమున ప్రవేశింతురు. తద్రీతి మృత్యుమయమగు సంసారమార్గమున కుమ్మరిసారెవలె పుట్టుట, చచ్చుట యనేయవస్థల నొందవలసినదే. శ్రద్ధారహితు డీగతి నొందునని భగవంతు డర్జునున కుపదేశించెను.

ప్ర॥ భగవంతు డేవిధముగనుండును? ప్రపంచవస్తువులలో తానెవ్వడు?

ఉ॥ మోటరు నడుచుచుండ, డ్రైవరు నడుపుచుండ నుదాసీనుడై లోపలగూర్చున్న యజమానివలె, సినుము పెక్కురకముల కొరముట్లగుటకు నధిష్ఠానము నుండురీతి, రామకృష్ణుడన్నరీతి. ఒకటి దేవుడు, సున్న జీవుడు. సున్నకు విలువ సంఖ్యయున్నపుడె. లేనిచో దానికి విలువేది? అలల కాధారము సముద్రుడెటులనో, యిా సగుణప్రపంచమున కాధారమై యధిష్ఠానమైనవాడే చిదాకాశస్వరూపుడగు భగవంతుడు. యావద్విశ్వమునకు సూర్యుడొక్కడై దేని నంటక నన్నిటికి ప్రకాశమిచ్చి, వానిని కనిపింపజేయుచు సాక్షియై యుండురీతి. "సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ" సమస్త చేతనాచేతనములం దంతటనిండి, యన్నిటిని ప్రకాశింపజేయుచు, దేనిని నంటక సాక్షియైయున్నాడు. మఱియు నాకసమంతట నిండియుండి దేనికి యంటదు. ఆకసములేనిచో సమస్తమున కవకాశమేయుండదు. తద్రీతి భగవంతు డుదాసీనుడై యంతటానున్నాడు. "క॥ ఇందుగల డందులేడని సందేహము వలదు చక్రి" అని ప్రహ్లాదుడనెను. భగవంతుడు లేనిస్థలమే లేదు. బజారునకు నెదుటనుండు గోడలోని నొక పెద్దయద్దములో వీధిలోని సమస్తము కనిపించును. దేనివలన? సూర్యుని వెలుతురువలన. మఱి యద్దములో బజారులోని వస్తువులున్నవా? లేవు. లేవందమా? యున్నవి. అద్దమునకు నద్దములో కనిపించు వస్తువుల కేమైన సంబంధమా? తాదాత్మ్య సంబంధమంతే. అద్దములేవా అవి కనిపింపవు. అద్దము వానికంటదు. ఆ యద్దమువలె "మాయాతతమిదం సర్వం జగత్" అండ పిండ బ్రహ్మాండములెల్ల నా యవ్యక్తమూర్తియందే యున్నవి. కాని భగవంతుడు వానియందులేడు. అవి జడములు "యద్దృశ్యం తన్నశ్యతి" ఎయ్యది

దృశ్యమో నశ్యాది నశించును. నశించునవి ద్రష్టచే తెలియబడును, మఱియు సద్దములో వస్తువులు లేకపోయిన నున్నట్లు కనిపించటమే నా మాయావైభవము. ఇంద్రజాలికుని కల్పితముచే గనిపించు వస్తువులు వానిలో లేవు. వాడు లేకపోతే నవి ప్రకాశించునా? ప్రకాశింపవు, నుండవు. వానియందతడు లేడు. అవి నాతనికి దృశ్యములు, నాతడు ద్రష్ట. విశ్వమయుడగు హరి ప్రాణులకన్నిటికి వ్యష్టి సమిష్టి స్థూల సూక్ష్మ కారణశరీరములగు స్థావరజంగమముల విశ్వతైజసప్రాజ్ఞ జీవాభిమానులుగాను, సమిష్టి విరాట్ హిరణ్యగర్భ యవ్యాకృత శరీరములకు సూత్రాత్మ వైశ్వానర యంతర్యామిరూపముల కన్నిటికి ప్రభువై, తానే యన్నిటిని గుర్తెఱుగుచున్నాడు. ఈలాటివాడగుటచేతనే గురుశాస్త్రాదులవలన తెలిసికోవలసివచ్చినది. జీవుడు శరీరమును ధరించి పాలించుచు నహంకారమున తత్సంశ్లిష్టుడై యందు వెలయుటలేదా? భగవంతు డన్ని భూతముల బాలించుచున్నను యహంకారలేశము లేనివాడగుట వాని నంటననెను.

ప్ర॥ అయితే జీవులందఱు నాయనయందే యున్నారా?

ఉ॥ అలలు, నురుగుకుప్పలు, జలబుద్బుదములు, సుడులు సముద్రమునానే కలవా లేదా? సముద్రుడు లేనిచో నవి యెక్కడివి? జీవులకు భగవంతుడు లేవా, జీవులే లేరు. అదిగో యది మిఠాయి దుకాణము. లడ్డు, జిలేబి, బూంది మొదలైనవి భిన్నభిన్న రూపములతోనుండి సమస్త జనాదరణ బడయుటకు నేది యుండవలె. కంటికి కనరాని తీపులో నవి యన్ని యున్నవి. తీపులేదా వాని ప్రకాశమునకు, వానికి యునికియే లేనపుడుండుట యెట్లు? మొదలే గొడ్రాలు, నీ బిడ్డడు చాల దుడుకంటే నెట్లుండును? వెఱ్ఱిపోయినది, రోకలి తెమ్ము రుమాల జుట్టుకొనెద ననునవి విశ్వసింపరానివి. అథవా నా పదార్థముల నోటిలో నుంచుకొన్నప్పుడు నామరూపము లేమగుచున్నవి? ఏది యనుభవించుచున్నాను? మధ్యలోని నామరూపము మిథ్యలై యొక తీపుమాత్రమే నుంటున్నది. సుడిగాలి, వేడిగాలి, చలిగాలి, పిల్లగాలి, వడగాలి యని వేర్వేరు పేలరేగే వారియు నెందున్నది? నాకసమున కాదా? ఆకసము లేదా వాయుసంచలన మెందుండు. సకలప్రాణులు స్తంభించి పోవలసినదే. అయితే వాయు వాకసమా? కాదు. అపగిది చరాచరము హరియందున్నది. సర్వత్రా

సగుణనిర్గుణముగ భగవంతుడున్నాడు. "నిత్యోఽనిత్యానాం చేతన శ్చేతనానా" మని యనిత్యములగు నామరూపాదులందంతట చైతన్యవంతుడై యున్నాడు. ఉన్నాడా అంటే కనరాడు. లేడా అంటే యున్నాడు. సదసద్విలక్షణుడు. కుండలు, మూకట్లు, బుడ్లు నైనదేది? మట్టియే. నామరూపముల మన్ననరు. మన్నంటే నామరూపములకు స్వారస్యముండదు. మన్ను రూపముతో నొక విధము. తాను రూపము లేకనే యున్నది కదా? అద్వితీయుడగు భగవంతుడీరీతి యున్నాడు. ఏకదేశంబగు జగత్తున సాకారనిరాకారముల నున్నాడు.

ప్ర॥ భగవంతుని జీవులు కనుగొనలేక పోవటమేమి? సృష్టి యెట్లొనర్చును?

ఉ॥ సృష్టివిషయము సప్తమాధ్యాయమున వివరించినను, చేతనాచేతనముల నంటనివాడు సృష్టి యెట్లొనరించును? సృష్టిస్థితిలయముల నొనరించుట నాయనకు నొకయాసక్తియే కదా? అప్పుడెట్లు బద్ధుడు కాకుండుననిగదా నీతలంపు. 7 నుండి 10 వ శ్లోకమువఱకు తాను నిర్లిప్తుడనని తెలిపెను. ఆశ్చర్యకరము, విచారణీయవిషయమే. మన శరీరములు తలిదండ్రులు నిమిత్తమాత్రులై యొనరించిరి. కుమ్మరి నిమిత్తమాత్రుడై యుపాదానకారణమగు మట్టితో కుండలాదుల యొనర్చెను. అప్పుడు సృష్టికి నభిన్ననిమిత్తకారణుండైన కుమ్మరిరీతి భగవంతుడీ సృష్టిని తనయందున్న యనపాయినియగు మాయచే సృష్టిని తయారు చేయును. మాయ త్రిగుణాత్మకము. ప్రళయకాలమున సర్వభూతములు తమ కర్మఫలములతో నవి కలసి మాయయందుండి సృష్టి యీశ్వరేచ్ఛచే గలుగును. సూర్యుని యాకర్షణశక్తితో నీరు యావిరిగామారి మేఘములగును. ఆ మేఘములు వర్షముగా కురియును. కురవబడిన నీరు నదులై ప్రవహించుచు మరల తమ మూలస్థానమగు సముద్రమున కలియుచుండ సూర్యుడు సాక్షియై యుండును. సూర్యుడులేక వర్షపు సృష్టియే లేదు. లయముండదు. సూర్యుడు సాక్షి, నిమిత్తమాత్రుడు. భగవంతుడు నాయాజీవుల ప్రాక్తనసంస్కారవశమున జన్మమృత్యువుల కలిగించుచున్నాడు. ఒకవ్యక్తి తనయింటికి వైవాహికమునకు వచ్చిన

బంధుమిత్రాదులకు కబీరు గొప్పభక్తుడు, రామదర్శనుడని ప్రస్తావనలో నన వారు మాకు రాముని చూపించగలవా? నీకంత పరమమిత్రుడైతే నీ మాట కాదనునా? అని ప్రార్థింప, నతడు సరేనని కబీరువద్దకు వెళ్లి నమస్కరించి తన బంధువుల యభీప్సితముజెప్పి భగవద్దర్శనము చేయించమన, నాయన కొంతవడికాగి రేపుమధ్యాహ్నము 3 గంటలకు వచ్చును, బాగుగ సత్కరించి పంపుడని చెప్పిపంపెను. అతడు తన యింటికిజని చుట్టపక్కముల కీవార్త నెఱిగించి భగవంతుడొచ్చే స్థలము, నాయన నిలువగలస్థలమున నత్తరు, పన్నీరు మొదలగు సుగంధద్రవ్యముల నలది వస్త్రమాల్యాదుల నలంకరించి తామలంకరించుకొని, కూర్చొని భగవంతునిరాక కెదురుచూచుచుండిరి. చెప్పిన సమయమునకు నొంటినిండ రొల్లుబురదబూసికొని శరీరమునుండి బురదజారి క్రిందపడుచుండ నొక దున్నరూపున వచ్చెను. రావటములో నా స్థలమంత యపవిత్రమై పోవుటయు తమతమ వస్తుచయములు బురదమయములుగా పాడగుటచూచి గుదిపెలు తీసుకొని కొడుచు పాడుదున్నా! భగవంతుడొచ్చునని యలంకరించిన సమస్తము నాశనమొనర్చితివా? అని కేకలుబెట్టసాగిరి. దెబ్బలుతినిపోయి కబీరునకు తన వీపుజూప కంపితగాత్రుడై కన్నీరు మున్నీరుగా నేడ్చుచు వారి యవివేకమునకు పశ్చాత్తాపపడి భగవంతుని క్షమాపణవేడెను. సాయంత్రము వర్తకుడువచ్చి భగవంతుడు రాలేదన, కబీరు 'బాగుగచేసినారు, వచ్చినవానిని యర్చించుటకు మారు కొట్టిపంపితిరి' అన, నతడు భగవంతుడురాలేదు; దున్నవచ్చినదనను? కబీరు దేవుడంటే ప్రత్యేకించి యేరూపున నుండునని నీ యుద్దేశ్యము. నా దృష్టిలో నాయన భగవంతుడు. నీ దృష్టిలో దున్నగానుండెను. మీ దృష్టి సంకుచితము. హరిని జూచేస్థితి రాలేదు; పొమ్మనెను. నిరాకార, సాకారమూర్తియే నా యాకారమున వ్యక్తమైనాడని జ్ఞానియు నిజభక్తుడు తెలియగలరు. తక్కిన వారు దేవుడంటేనే మండలాధిపునివలెనో, నాటకము, డ్రామాలలో వేషములు వేసినవారివలెనో కాగితములపై వ్రాసిన బొమ్మలవలె, రాళ్లపై తీర్చిన బొమ్మ, లేక విగ్రహామువలె నున్నాడనుకొందురు. ఈ విశ్వమాయన శరీరమే. భగవంతుని నెఱుగనివారికి మృత్యువు తప్పదు, సంసారము వదలదు. భగవంతుని నెఱిగినవాడు "తమేవం జ్ఞాత్వా

మృత్యుపాశాత్ ఛినత్తి" మృత్యుపాశమును చిదురుపలు చేయగలడు.
ఆకారముల గనిపించువాడు పరమాత్మయే. పరమాత్మకాదనియే యజ్ఞా
నులు దలతురు. భగవంతుని రూపముల నర్చించుటయే మనకర్తవ్యము.
మరొకమాట. నీ వెవరో తెలియకపోయినను రొయింటిగానుండి డబ్బు
నధికముండుటచే తమాషైన గదులు, వింతవింత మేడలు, ప్రాకారములు
గట్టించితివనుకో; అవి నీవికావా? నీవియేనైతే నీవు కట్టితివా? లేదు.
నీవు తొలుత నవరికి తెలియకుండ సంకల్పించిగదా నీ యిష్టప్రకారము
గట్టించితివి. నీవులేకనే, నీ తలంపులేకనే తయారగునా? కాదు. మొదట
సృష్టి సూక్ష్మముగా నీలో జరిగి పిదప స్థూలమై బాహ్యమున జాగ్ర
దవస్థలో గనిపించును. మఱొకమాట. నీయందుండు సర్వవిధసంకల్పములు
మరెవ్వరికైనా తెలియునా? తెలియవు. నీకుమాత్రము తెలియును.
ఆ సంకల్పరూపములు సూక్ష్మముగా నీలోయున్నవా? లేక నీవు వాని
యందుంటివా? నీలో నుండెనా? సుషుప్తి యవస్థయందేల నుండగూడదు?
తలంపులన్నియు నవిద్యయందుండును. ఆయవిద్య సుషుప్తిలో నజ్ఞానమున
నవ్యక్తముగా నుండును. మెలకువ వచ్చినంతనె సంకల్పము లన్నిటిలో
నవిద్యాంతఃకరణరూపపరిణామ మొందుచుండును. 'సుషుప్తికాలే సకలే
విలీనే' సుషుప్తియే ప్రళయము. జాగ్రతయే సృష్టి. నీయందే యగు
చున్నది. ఇది నిత్యప్రళయము. సమిష్టిసృష్టి నీశ్వరు నిచ్ఛవలన సకలజీవుల
నదృష్టముచే సృష్టిగలుగును.

ప్ర॥ ఆయన నిర్వికారుడుగదా? ఎట్లు సృష్టిజేయును?

ఉ॥ ఈ ప్రశ్నకు మొదలే నుత్తరమీయబడినది. అయినను విను.
క్రొత్తచింతపండును జూచినంతనే ప్రతియొకరినోట నీరూరుచుండును.
చింతపండు నోటిలో నున్నదా? లేదు. నోటిలో లేకపోయినను దానిని
జూచినంతనె నోట నీర్లూరినరీతి మాయనధిష్ఠించి పురాతనసంస్కారణ
వశమున జన్మమృత్యువుల కధీనమగు చతుర్విధభూతముల సృజించును.
జీవుల సృజించటము, లయమొనరించటము వ్యక్తిజీవునికంటె గొప్ప
సంసారియామొను. ఆయనకు బంధములేదా యని అనవచ్చు. సృష్టి తనకై
సృష్టించుకొనుటలేదు. స్వార్థముగాదు. జీవుల కర్మఫలాల యనుభవ
మునకే సృష్టించును. దాన తనకేమి యాసక్తిగలదు? బంధమెట్లగును?

ఇకను నాయన నుదాసీనత్వము తెలిసి యాసక్తిలేక కర్మల నాచరించి బంధ రహితులు గావచ్చు. కర్తృత్వములేదా యెవరికి బంధములేదు. తన యధ్యక్షతతో త్రిగుణమయియగు మాయ ఈ విశ్వరూపమును సృజించుచున్నది. ఇందువలన జగత్తు వివిధరూపముల వ్యక్తావ్యక్తమగు పరివర్తన బొందుచున్నది. నేను శుద్ధ, బుద్ధ, ముక్త స్వభావుడననియు మూఢులు మనుష్యదేహము ధరించటమున కగునా యని నమ్మకయున్నారు. 4 వ శ్లోకమున యవతారవిశ్వాసము గలుగుట కష్టమని తెలిపెను.

ప్ర॥ ఏల నవజ్ఞ మానవులొనరింతురు ? మఱి యధికారి యవసరమా ?

ఉ॥ కాకాసురుని రక్షించెను. ద్రోహియగు మూర్ఖుడగు రావణునకు మోక్షమిచ్చెను. తన్ను స్మరింపవలదని ప్రహ్లాదుని బాధించిన హిరణ్యకశిపునకు, నతని యిరువదొక తరములవారికి మోక్షము నిచ్చెను. భగవంతుడు మనయందు తల్లివలె దోషముజూపడు. మన దోషములు మనకే బంధము. ఆయన దృష్టిలో నందఱొకటియే. అధికారానధికారులు లేరు. ఒక కుఱ్ఱవాడు పచ్చని కండ్లజోడు తగిలించుకొని నేడ్వసాగెను. తల్లి వచ్చి యేమని యడిగినది. నాకీ ప్రపంచము, మీరందఱు పచ్చగా కనిపించుచున్నారు. నాకండ్లు చెడిపోయినవనెను. అద్దములద్వారా వీనికి సర్వము పచ్చగ గనపడెనేగాని తల్లికిగాని, తదితరులకుగాని గనిపించలేదు. అట్లు దోషదృష్టి గలవారిలోనే పక్షాపక్షములు దోచును. భగవంతుడు నిష్పక్షపాతి. అసలు యీ జగత్తు యెవరి రూపమని? ఎందుకుగాను పొరపచ్చముచేయును? అధికారు లనధికారులు మానవులే. ఒకప్పుడొక తీరు, ఒకప్పుడొక రకము మారెదరు. చూడు. దశరథుడుపట్టముగట్టెదనని కొడుకునకుపట్టము గట్టలేకపోయెను. దుర్యోధనుని సైన్యమున, దుర్యోధనునితో సహా అందరు యుద్ధమున కధికారులే. ఒక్కరైన జయము సాధించలేకపోయిరి. ఒక విప్రుడు 8, 9 వత్సరములు కృష్ణుని గుఱించి తపస్సు జేసి, కృష్ణుడు ప్రత్యక్షము గానందున రుక్మిణివద్దకువచ్చి, యున్నాడా లేడా నీ మగడు? ఇన్నినాళ్లు నన్నొదకముల వదలి యుపవాసములుండి తపస్సొనరించిన ప్రత్యక్షము కాడాయెనే? ఏడీ? యెక్కడ? యని గద్దించి మాట్లాడెను. ఆమె పరమశాంతముతో, చిరునవ్వుతో నోయయ్యా! తొమ్మిదివత్సరములుగ నాపతి యేకనాథుని యింట నీళ్లుమోయుచున్నా

డనెను. అనధికారియైన విప్రుడు లోకనాథు డెట్టివాడో యని నివ్వెరపడి పోయెను. పేరులతో, నాడంబరములతో, ప్రతిష్ఠలతో నధికారులుకారు. కార్యసాధనసాఫల్యములో నుండును. నిరుపాధికప్రేమలో నుంది యధికారము. నిజమైన భక్తుడెవడు? మోక్షమును సైతము లక్ష్యపెట్టడని యనెను తుకారాం.

ప్ర॥ సృష్టిని గుఱించి ద్వితీయ, సప్తమ, అష్టమ, త్రయోదశ, చతుర్దశ, పంచదశాధ్యాయముల విశేషించి చెప్పటమెందుకు?

ఉ॥ జగత్తనునది మిథ్య. సృష్టి మిథ్య. మందాధికారులకు పలుమారు సంశయము తీరుటకు, భగవంతునకంటె వేఱేమిలేదని తెలియుటకు తెల్పెను. అయిన నొక్కమాట విను. ప్రళయమున జీవులు మాయయందు లీనముకాగా, కల్పారంభమున నేను వాని సృజించుచున్నాననటము జీవులు, ప్రకృతి, సంబంధము, పరమాత్మ, పరస్పరభేదము లివియన్ని యనాదులంతకుమునుపు లేనివికావు. ఆ రహస్యమేమన్న సూర్యుడు కదలడు మెదలడు. రాత్రింబవళ్లు గలుగుచున్నవి. సూర్యునిరీతి సృష్టికి కారణుడంతియేకాని యాయన దేనికి నంటడు.

ప్ర॥ అధికారు లనధికారులు, లేక భక్తులు, కామాసక్తు లెట్లుందురు?

ఉ॥ మానవులందఱు భగవంతుని యెఱుగరు. వారు శాస్త్రము వినరు. బుద్ధిచే యోచింపరు. విషయములే వారి జీవితకళలు. బిడ్డలులేని గొఱ్రాలి స్తన్యముల పాలున్నవని నమకిన బాలురవలె విషయములు జడములు, నవియే పరమార్థమనువారింతే. మానవమాత్రుడుగ నవతరించిన సర్వశక్తిమాన్ప్రభువును యజ్ఞానమున గ్రహింపక ననెదరు. అదియు భగవంతుని స్మరణయేకాని నిందకాదు. గాంధీజీ, ఆచార్యవినోబా, రమణ, అరవింద, మలయాళమహర్షులవంటివారిని మానవులుకదా యని విమర్శించువారెందరో గలరు. రామ, కృష్ణ, బలరామ, పరశురామ యవతారముల విమర్శించువారు స్వమత అన్యమతములలోను గలరు. విమర్శించువారుండబట్టియే వారి విమర్శవలన తేలినసిగ్గు, గీటురాయివల్ల తీర్చిన మచ్చుతునకలగు వీరు భగవత్స్వరూపులని తెలియుటకైనది. సామాన్య మానవుల నెవరు విమర్శించెదరు? బంగారునుకదా గీటురాయిమీద గీచెదరు? ఇనుము నెవ్వడు గీయగలడు? వారిని గ్రహించి

భజించినవారు, దైవీప్రకృతి గలవారు విమర్శించి యన్యదేవతల దల చుచు, దైవమునువదలి వ్యర్థకాములై, విఫలమనోరథులై, జ్ఞాన హీనులై తామస రాజస భ్రంశబుద్ధిస్వభావము గలవారు నాసురీ ప్రకృతి గలవారు. కృష్ణుని వెన్నంటిన గోపికలు, గోపాలురు, గోవులు, పిల్లనగ్రోవి, నందయశోదలు, యజ్ఞాన్నమిచ్చిన విప్రస్త్రీలు, అక్రూర, ఉద్ధవ, రాధ, మైత్రేయి, విదుర, సంజయాదులు దైవీప్రకృతులు. పూతన, శకటాసుర, అఘాసుర, తృణావర్త, కంస, శిశుపాల, దంత వక్త్రాదులు నాసురీప్రకృతులు. నాస్తికాస్తికులు, వీరుభయులు భగవ ద్భావతత్పరులే. ఉభయులు భగవద్భక్తులే. దైవీసంపదగలవా రే ప్రేమతో నర్చించుచున్నారో నదే ప్రేమతో నితరులకు ద్వేషముతో గనిపించి, యాసురీసంపద గలవారే ముందు భగవంతుని బొందుచున్నారు. 12 నుండి 13 శ్లోకమువఱకు దైవాసురప్రకృతులజెప్పి 14 నుండి 19 శ్లోకమువఱకు సర్వమును సర్వత్ర నీశ్వరుడేయను భావివివేకము నెఱిగించెను.

ప్ర॥ భక్తిభేదము లెన్నివిధములు గలవు?

ఉ॥ భక్తియన ప్రేమ నీప్రేమను మానవులు శాస్త్రీయముగ నశా స్త్రీయముగ భగవంతుని విషయములో నుపయోగింతురు. మంత్రము లచే స్వభావముగ స్తోత్రము జేయువారు కొందఱు. దృఢసమ్మకముతో దైవజ్ఞానమునొంద కొందఱు ప్రయత్నింతురు. మహాప్రీతిపూర్వకముగ నమస్కారములు త్రివిధముల నొనరించువారు కొందఱు. అవహితచిత్తులై కొందఱు ప్రార్థింతురు. యథార్థజ్ఞానమున సర్వాత్మరూపమున నుపా సించువారు కొందఱు. ఏకత్వభావనతో కొందఱు ధ్యానింతురు. అనగా సర్వము తానని యభేదబుద్ధిచే కొందరు దైవము వేరను భావముతో దాసోహమని యర్చింతురు. ఒక గ్రామమున నొక విశిష్టాద్వైతి యుపన్య సించుచు తానున్న స్థలమున గోడకు దాసోహమ్మని వ్రాసియుండెను. అదే గ్రామమునకొక యద్వైతివచ్చెను. ఆయన గోడపై వ్రాసిన యర్థమును చదివి, నా యక్షరముల దుడుపకుండ ముందుభాగమున 'స' నుంచెను. అనగా సదా సోహమ్మనే యర్థము వచ్చునట్లు వ్రాసిపోయెను. మామూ లుగా తను వ్రాసినది చూచు విశిష్టాద్వైతి యా యర్థము సహింపక

నా యక్షరమును తుడుపక 'స' కుముందు 'దా' నుంచెను. ఇప్పుడేమైనది? దాస దాసోహమ్మని పూర్తిచేసెను. అది గని యద్వైతి మరల 'స' నుంప సదా సదా సోహమ్మని యర్థమొచ్చెను. విశిష్టాద్వైతి గని 'దా' మరల నుంచి దాస దాస దాసోహమ్మని యర్థమొచ్చునట్లు వ్రాసెను. ఈ రీతి నుభయులు దాస దాస దాస దాసోహమ్మని విశిష్టాద్వైతి, సదా సదా సదా సదా సోహమ్మని యద్వైతి వ్రాయుచుండ, నా గోడలు నిండిపోయి నీ వింతను గని యుభయవేదాంతియగు నొక మహానుభావుని గొనితెచ్చి వీరి భేదమును నివారింపుడన యప్పుడాయన నిరువుర బిలిచి నాయనలారా! మీ యిరువుర యుద్దేశ్యము లొక్కటియే. ఒకటి జ్ఞానభావన, మఱొకటి భక్తిభావన, లేక ప్రపత్తిమార్గము నహంకారము లేని నిరహంకారభావన. సర్వము నీవే యనునది భక్తి. సర్వము తానే, తనకన్న వేరేమి లేదనునది జ్ఞానము. శుద్ధజ్ఞానము, శుద్ధభక్తి యొకటియే నతద్వ్యావృత్తిచే "అథాతో దేశో నేతి నేతి" అను నిశ్శబ్దస్థితి. వీని రెంటి గమ్యస్థాన మొకటియే. మీ భావభేదమేగాని, దైవమునకు భేదము లేదు. ఒకడు లింగమన, మరొకడు శివుడనురీతి, ఒకరు దైవమును భేదభావనతో, నొకరభేదమున. ఒక గుడిలోనికి రావలెనన్న నలుదిశల మార్గములుండును. ఎవరేద్వారమున లోబ్రవేశించిన నొకే దైవమునే జూతురు. ఉభయుల యుద్దేశ్యము మార్చుకొనవలసిన పనిలేదు. ఎవరెవరిష్టమెచే వారు భగవత్ప్రాప్తి బొందితే చాలని తెలిపెను. మానవుల చిత్తములన్ని నొకే విధమున నుండవు. ప్రతీకముగ కొందఱు, అహంగ్రహోపాసనగా కొందఱు నా భగవంతునినే యారాధింతురు, వేఱేమి లేదు. దేహబుద్ధితో దాసభావన కొందఱు, జీవబుద్ధితో నాయన యంశభావనతో కొందఱు, నాత్మబుద్ధితో కొందఱు. "దేహబుద్ధ్యాస్మి దాసస్తే జీవబుద్ధ్యా త్వదంశకః। ఆత్మబుద్ధ్యా త్వమేవాహం ఇతి మే నిశ్చితా మతిః" ఆ లోకేశ్వరునే బ్రహ్మ, విష్ణు, శివ, విరాట్, హిరణ్యగర్భ, యవ్యాకృతులాదిరూపముల "అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృది దైవతం। ప్రతిమా స్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శనమ్" అగ్నియే దైవముగా కొందఱు, హృదయాంతరవాసిని మునులు ప్రతిమలను స్వల్పబుద్ధులును, సర్వత్రసమదర్శనులు నారాధించెదరు. ఒకేపురుషుని భార్య మగడని,

కొడుకు తండ్రియని, మనుమడు తాతయని, అల్లుడు మామయనియు, పెత్తండ్రి, పినతండ్రి, మామ యిత్యాదుల బిలిచినరీతి భగవంతుని నానా విధముల దలచి ప్రార్థించుదురు. ఇందులో దోషమేమున్నది? భక్తి, విశ్వాసము, వైరాగ్యము, వివేకము, శీలత లేకపోతే దోషమున్నది గాని వీనిలో తారతమ్యములేదు. వసిష్ఠుడు రామచంద్రునకు నాత్మజ్ఞానము బోధించుచు రామా! సీత నీకేమి కావలెననెను. నాకు భార్యయున, లక్ష్మణుని యడుగ వదినెయనియు, కౌసల్య కోడలియనియు, జనకుడు కూతురనియు, ప్రజలందరు తల్లియనియు యనిరి. వసిష్ఠుడు రామా! ఏమి సీత నీయదియేనా? అన నూరకాయెను. లోకనాథు డొకరివాడుకాడు. ఎవరేవిధమున దలంచిన యట్లనుగ్రహించును. "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం" ఎవరెట్లెట్లు ప్రార్థించిన యట్లే నను గ్రహింతునని భగవంతుడే జెప్పెను. భ్రాంతి భావనల నొకేద్వైతము ననేకములుగా భావింతురు. ప్రవృత్తిచే ధ్యానించుట సుగమము. ధ్యేయవస్తువుగ సదా చింతించుట నభ్యాసము. "అద్భిర్గాత్రాణి శుధ్యంతి మనస్సత్యేన శుధ్యతి। విద్యాతపోభ్యాం జీవాత్మా బుద్ధిర్జ్ఞానేన శుధ్యతి" దేహము నీటివలన, మనస్సు సత్యమువలన, బ్రహ్మవిద్యాభ్యాసమువలన జీవుడు, జ్ఞానమువలన బుద్ధి శుద్ధియగును. శ్రౌతయజ్ఞ స్మార్తయజ్ఞ, శ్రాద్ధకర్మ, యౌషధ, మంత్ర, హోమ, ఘృత, హోమాగ్నులను ధ్యానరతులై నంతఃకరణదోషనివర్తులై హరిని బొందవచ్చు.

ప్ర॥ సప్తమాధ్యాయమున భగవద్విభూతులు తెలిపినరీతి, భగవంతుని లక్షణములికను కొన్ని తెల్పితే, జనసామాన్యమునకు దైవమెందో గలదనునది, కనరాడే యను దురూహ్యము దూరమగుట మేలు. పార్థునుద్దేశించి భగవంతుడావల నేమిజెప్పెను?

ఉ॥ ఆహా! చెప్పకేమి? దైవమును సులభముగ తెలిసికొనుటకు, సులభముగ నర్చించుటకు ప్రవేశమార్గము లుండుటచేత నీ యధ్యాయమునకు నింత ఘనత గల్గినది. విద్యాపాండిత్యప్రజ్ఞలు లేకపోయినను, శ్రద్ధాభక్తి చాలునని సూచించెను. వేద, స్మృతి, శ్రాద్ధకర్మ, ఔషధాది యజ్ఞములు నేనేయని భగవంతుడు.

ప్ర॥ ఇవియన్నియు మనము కల్పించికొని చేయుకర్మలు దేవుడెట్లగును?

ఉ॥ ఏ యుద్దేశ్యముతో నెవ్వరికై నివి కల్పింపబడినవి? దైవప్రాప్తికే, దైవసాక్షాత్కారమునకే గా? అటువంటప్పుడవి దైవస్వరూపము లేల కావు? మనమే భావనయందుంచితే నది యారూపమగును. భావనలేనపుడు సాక్షాత్తు భగవంతుడు సాక్షాత్కరించితే నేమి ప్రయోజనము? జగత్తునకు తండ్రి, తల్లి, కర్మఫలదాత, పితామహుడు, తెలియదగినవాడు. పరిశుద్ధప్రదాయకమగు వస్తువును, ప్రణవమును, ఋగ్వేద సామవేద యజుస్సులుగూడ నేనేనని భగవంతుడు చెప్పెను.

ప్ర॥ ఇప్పుడర్థమైనది. ఎవరేరీతి ప్రార్థించిన భగవంతునేననియు, వలదనే యధికారము లేదనియు తెలిసినది. మరేమి చెప్పెను?

ఉ॥ కర్మఫలమున్ను, జగత్తునకు పోషకుడు, జగత్ప్రభువు, సర్వప్రాణుల శుభాశుభముల ద్రష్ట, సకలప్రాణులకు నాయనయే నివాసము. శరణాగతుల నార్తి హరించినవాడు. ప్రత్యుపకార మొనర్పక హిత మొనర్చువాడు, స్రష్ట, సంహర్త, ఆధారభూతుడు, ప్రళయోత్పత్తిస్థానము, సూర్యరూపమున వేడి నొసగువాడు, జలము నాకర్షించి వర్షించువాడు, మోక్షమును, మృత్యువును, స్థూలసూక్ష్మములగు వస్తువులన్నియు తానే నని నర్జునునితో. అర్జునుడు నిర్విణ్ణుడై వినుచుండెను.

ప్ర॥ ఇప్పుడుకదా లోకములో నెట్టి మానవులైనను యెందో నే రూపముననో భగవంతుడున్నాడనే సంశయముతీరి, భేదబుద్ధులు తొలగి సదా సత్యమున వర్తింతురు. ఎవరెట్లుపాసించిన పరమాత్మనే; నావల జెప్పుడి.

ఉ॥ గీతను చదివి భగవద్వాక్యముల నర్థమును గ్రహించి యనుభవ మొనర్చుకొనక నితరశాస్త్రముల నితరమత మితరవ్యక్తుల వాక్యముల నమ్మినవ్యక్తులు శీఘ్రముగ ఫలము నొందగోరి కల్పితులగు నన్యదేవతల నాశ్రయించువారలు నేకత్వముతో, వేఱుభావముతో భగవద్భజన మొనర్పనివారు, జన్మమృత్యుప్రవాహమున మునుగక తప్పదనియు, 20 నుండి 21 వఱకు యజ్ఞాదుల ఫలము లనిత్యములని దెలిపెను. యజ్ఞమను పేరుతో నన్ను బూజించి, యజ్ఞాంతమున సోమపాన మొనర్చి పాపవిముక్తులై

స్వర్గగమనముగోరి పుణ్యఫలమగు స్వర్గమున నప్రాకృతములగు భవ్య భోగము లనుభవింతురు.

ప్ర॥ ఈ కామ్యకర్మలవలన గలిగిన స్వర్గసౌఖ్యము ననుభవానంతర మేవిధి గావలె.

ఉ॥ కొండెక్కిన దిగును. బండిలో నెంతకాలమున్నదిగవలె. చేతిలో డబ్బున్నంతవఱకు తిరుగవచ్చు. డబ్బు ముగియగానె డబ్బు సంపాదింపవలె. స్వస్థలమునకు రావలె. మర్త్యలోకమునకే మరల రావలసినదె.

ప్ర॥ ఎందుకై వారు భగవంతుని నర్చించి శాశ్వతమగు మోక్షము నొందక పునరపి మరణము, పునరపి జననములగు సంసారమున తిరుగుచున్నారు ?

ఉ॥ వేదకర్మలు శీఘ్రముగ ఫలమిచ్చునను యుద్దేశ్యముతో విచారశీలితలోపమున భోగలాలసచేత, నింద్రియనిగ్రహములేక విషయవాసనలు తొలుగ పారినెఱుగక బద్ధులగుదురు.

ప్ర॥ భక్తులు భగవంతునే నమ్మియుంటే నమ్మినవారి యోగక్షేమము లెవ్వరు జూతురు?

ఉ॥ పక్షులు పిల్లలకు నెర తినిపించుట, తల్లులు పిల్లలకు పాలనిచ్చుట తల్లులపైన నాధారపడినవారు గాన వారి యోగక్షేమములు తల్లియే చూచును. సమస్త ప్రపంచములోని విషయవాసనల నిరోధించి తన్నే నమ్మిన భక్తుల తానుగాక మఱెవ్వరు జూతురు? తల్లిగర్భములో నున్నపు డెవరు రక్షించిరి? గుడ్డులోని పిల్లను, రాతిలోని కప్పను పోషించిన దెవరు? గర్భములో నున్నపుడు రక్షించిన దేవుడే నమ్మినచో యోగక్షేమముల తానే జూచును. భక్తులనేకాదు, నమ్మనివారినిగూడ నాయనయే పోషించును. భగవంతుడే దిక్కని భక్తుడెఱుగును. నాకు నేనే పోషించుకొనుచున్నానని యజ్ఞాని యనును.

ప్ర॥ యోగక్షేమముల విమర్శించి తెలుపుడి ?

ఉ॥ తాను నిమిత్తమాత్రుడై సామర్థ్య సర్వజ్ఞత్వాదుల ప్రకటించుట. సూర్యుడు నిమిత్తమాత్రమంతే. మేఘము, దానినుండి వర్షము, నదులు నేర్పడినవి. తానేమి కాలేదు. అగ్ని తన సామర్థ్యమున నినుమును కొర

ముట్లుగా తనసామర్థ్యమే జరుగలదు. విద్యుచ్ఛక్తిచే బండ్లునడవడము, స్టాంత చక్రముచే ట్రాంబండ్లు నడవడము, తనశక్తిచే విమాన, రైలుబండ్లు, మనుష్యుడు నడిపించడము. అనగా తానుగాక తనశక్తివలన పనులు నడచుట "అప్రాప్తప్రాపణం యోగః క్షేమస్తు స్థితరక్షణమ్" లభ్యపడని వస్తువును లభింపజేసుకొనుట యోగము. లభించియే యున్నదాని కాపాడు కొనుట క్షేమము. ఇంద్రియములద్వారా లభింపగలవి ప్రాప్యవస్తువులు. ఇంద్రియములద్వారా లభ్యముగాక సదా ప్రాప్తమై సాధనలవలన లభ్యమగునది యాత్మ. ఇదియే యోగము. అది యెప్పుడు తానుగాన యున్నది. అజ్ఞానాది మఱుపులేకుండ నుండుటే క్షేమము. భక్తివిశేషము జెప్పెద. పండరిక్షేత్రమున తలిదండ్రులతో పాండురంగని సేవింపవచ్చి స్వామిదర్శనమపుడు పాండురంగని కౌగలించుకొని విడువజాలని కూతురను వదలిపోవ, నొక ధనికుడు సంతానములేనివాడు కొనిపోయి బాల్యముననే భక్తిపరవశురాలైన నీమెను భార్య కప్పగించెను. భార్యాభర్త లాబాలికతో సతతము భగవత్కీర్తనలు, భగవత్పద్యములు, పాటలు పాడుట, నాటలు నాడుట వింటు చూచుచునుండే సమస్తము మఱచెడి వారు. ఆమెతో నిరంతర మానందమనుభవింపుచు నామెకు నలాదా శయనించుటకు నొక గదినిచ్చిరి. ఆ అమ్మాయి భగవంతుని స్మరించుకుంటు నిదురించేది. ఒకప్పుడు గొప్ప గాలివానవచ్చి బాలిక శయనాగారము చుట్టుగోడలు గబగబ విరుగపడి వాన గాలి లోపల ప్రవేశించుచుండెను. బాలిక నిదురపోవుచుండెను. పాండురంగడు పడునట్టి గోడల భక్తురాలు తడువకుండ వేగముగ గట్టుచుండెను. గోడలుపడే శబ్దమువిని బాలిక పెంపుడు తల్లిదండ్రులు చూడవచ్చిరి. నలుదిశలు గోడలుపడి కప్పు స్తంభములతో నిలవటము, పాండురంగడు గోడల తయారుచేయు చుండుటజూచి చేతులజోడించి తమ భాగ్యమునకు ముగ్ధులగుచు ప్రార్థింపుచుండ, గోడలదీర్చి పాండురంగ డదృశ్యుడయ్యెను. చూచితివా యోగక్షేమముల నెవ్వడు చూచునది? అడవిన రక్షకుడు రక్షింపబడుట నెవ్వనివలన? భగవంతునివలననేగదా! నీవు వినుట, నేను జెప్పుట నా దేవదేవుని కరుణయే. ౨౩ నుండి ౨౫ శ్లోకము వఱకు నన్యదేవతాపూజ, నజ్ఞానపూర్వకపు నీశ్వరారాధన జెప్పుచున్నాడు.

ప్ర॥ ఇంద్రాదిదేవతల నారాధించిన భగవంతుని గొలిచినట్లే కదా? వారేల మోక్షము నొందక తిరిగి జన్మాదులకు వచ్చుచున్నారు?

ఉ॥ భగవంతుడే నింద్రాదిదేవతల రూపున నభీప్సితముల నిచ్చుచున్నాడని మూఢులు తెలియరు. జ్ఞానులు భక్తులన్యదేవతలున్నారని యెఱుగరు, ననరు. ఏయే దేవతల నేయే ఫలముల నాశించి నారాధించితే నాయాదేవతలరూపున భగవంతుడే ఫలముల నిచ్చుచున్నాడని యెఱుగని వారే మాటిమాటికి జన్మమరణాదు లెత్తుదురు. ఒక గొప్ప జిల్లాడాక్టరుండ లెక్కలేని వైద్యుల నేల నాశ్రయింతురు? దేవతల నుపాసింప దేవతల, పితృదేవతల నారాధింప పితృదేవతల, భూతముల నారాధింప భూతముల నొందెదరు.

ప్ర॥ ఆహా! భగవంతుని నారాధించితే నేమగుదురు?

ఉ॥ భగవంతునే పొంది శాశ్వతముక్తి నొందుదురు. 16 నుండి 19 వఱకు భక్తు లిచ్చు నర్ఘ్యపాద్యాదుల గ్రహించుదుననెను.

ప్ర॥ అంత గొప్పదేవుడుగదా! ఆయన కర్పింపగల నెటువంటి పదార్థములు కావలె?

ఉ॥ పదార్థముల నెవికి నివ్వవలెనంటే లోకముల సృజించి యాలోకములు తానయై సచరాచరముల నిండియున్న పరిపూర్ణమూర్తికి నివ్వగలిగిన దేమున్నది? ఎందులేదు. కన్నది తల్లి, కాపాడినవాడు తండ్రి. వారికొసగున దేదిగలదు? సరళభావమున వారికి నమస్కరించి వారి ప్రవర్తన కానలవఱచుకొను టొక్కటే చాలు. భగవంతునకు నివ్వ మనవల్ల కాదు. అయినను మన కల్పితముల, నాడంబరముల, పటాటోపముల, నహంకారాభిమాన గర్వార్జితవస్తువుల నొప్పనే యొప్పడు. భగవంతుడే సృజించిన వస్తువులలో పత్ర పుష్ప ఫల తోయముల భక్తితో నమ్రమనస్కులరై నిరహంకార నిర్మోహమున నర్పించిన చాలు, పరిగ్రహించును. ఇది బాహ్యభక్తి. అన్నినామరూపములు తానేయైనపుడు మన రూపములు నాయనయే అని గ్రహించుటయు నాంతరంగికభక్తి; లేక నేకాంతభక్తి. తనకన్న నన్యములేదని తనతోసహా నాయనకు నర్పించుకొని కర్తవ్యము లేనివారమై యుండుటే యనన్యభక్తి. భగవంతుని

తృప్తిపడుపటవు: నాడంబరమున కెన్ని వస్తువుల నర్పించినను తృప్తి నొందడు. ఆయనకు కావలసినది ప్రేమ. నీటియందలి జలతరగలు నీటి కంటె నన్యముగదోచినను నీరే. అట్లే యీ ప్రేమ భగవంతుని యపర రూపు. ఇది యన్యముగదోచినను భగవంతునికొఱకే. అయితే మనప్రేమ దేహముపై, భార్యాబిడ్డలపై, ధన, పశు, గృహ, క్షేత్రములపై, నితర భోగ్యవస్తువులపై నుండి యర్పించే పూజలకు, నర్పించేవస్తువులకు నెక్కువ ఫలమున్న, యాస్తికత్వమునకు, మనకు కొద్దిఫలము నివ్వగలడు. శబరి యెంగిలి పండ్లలో, నుడుతలోక కుచ్చేలో, విదురు నరటిపండ్ల తొక్క లతో, రుక్మిణి తులసిదళముతో, గజేంద్రుని పుష్పముతో, రంతిదేవుని యుదకముతో తృప్తిబొందినాడంటే కారణమేమి ? వస్తువులు, స్వల్ప ములు క్షుద్రములైనను వెలలేనిప్రేమచేత సంతుష్టిజెందెను. మోక్ష మిచ్చెను. భక్తిలేని పూజ పత్రిచేటనె మన వేమన.

ప్ర॥ విదురునింటిలోని నరటి తొక్కలతో భగవంతుడు తృప్తిబొందిన దొక్కటి చెప్పండి?

ఉ॥ శ్రీకృష్ణుని మధ్యవర్తిగ పాండవులుబంప, హస్తినాపురము వెళ్లినపుడు దుర్యోధనాదులు విందుకు నాహ్వానించినారు. ఆయన పోవక విదురునింటికే నరిగెను.

ప్ర॥ అహాహా! భగవంతా! నీకున్న ప్రేమ మానవులలోలేక మతములు వేఱు జాతులు వేఱని యుచ్చనీచతలగల్గె బండపోరులు చూడలేకున్నాము. భగవంతా! భక్తసులభా! నమస్కారములు, నమస్కారములు. ఆవల జెపుడి?

ఉ॥ హరిరాక నెఱిగి విదురుడు భార్యాసమేతుడై తలమొల లెఱుగక నానందమున నర్ఘ్యపాద్యాది విధుల పూజించి భోజనము చేయునపుడు నరటిపండ్ల నర్పింపనెంచి భార్యాభర్తలు నాత్రిగుణాతీతుని, చతుర్ప్రాకృత శరీరుని, నా మూలపురుషుని జూచి తబ్బిబ్బులై మావంటి బీదలిండ్లకు నెంత దయలేనిదే రాగలడా! యను సంభ్రమమున నరటిపండ్ల గుజ్జుకు బదులు తొక్కలనందివ్వ కృష్ణుడారగించెను. ఆవేశము వీడి కృష్ణునివద్ద నున్న యరటి గుజ్జునుగని నివ్వెరపడి తండ్రీ! క్షైమమఱచి తొక్కలందివ్వ

నారగించితివా? యన నన్నుజూచి మీరాదు మఱచితిరి. మిమ్ముఁజూచి నేను మఱచితిని. ఏమిజరిగినదో నెవరికెఱుక? ఇక చాలుననెను. చాలు ననునది ద్వైతబుద్ధి. తొక్కలివ్వటము చేసుట యద్వైతబుద్ధి. అదియే నభేదము. చూచితివా యెట్టి యల్పవస్తువులనైనను భావన భగవంతుని యందున్న నాహారిని బొందజేయును. వాహనములు, వస్తువులడుగలేదు. పత్రపుష్పఫలాదులవలె హృదయకమలముండవలెననియె భగవంతుని యభిప్రాయము.

ప్ర॥ పత్రపుష్ప ఫలాదులనేమైన రహస్యమున్నదా?

ఉ॥ పత్రములుగాక చిగురులాయెనా చెట్టునుండి కోసినంతనె వాడి ముడతలుపడును. పక్వముగాని చిగురులుకోయుట దోషముట, చెట్టున నుండక నిటప్రూజకు పనికిరాకపోవును. ఎండుపత్రమాయెనా క్రింద రాలి యుండును. చెట్టుననేయుండి చెడక శుద్ధమైనవి పత్రములు. కచ్చఫలమాయెనా తినరానిది భగవదర్పితము చేయరాదు. కలమాగెనా సుపరోగములేక తొడిమెనుండి నదియే పనికిరాక క్రిందపడును. తొడిమెను విడువక క్రిందపడనిపండు శుద్ధమైనది. పుష్పములు మొగ్గలాయెనా వాసనయుండదు. క్రింద రాలియుండినా వాడి వాసనపోయియుండును. అప్పుడె వికసించనున్నవి శుద్ధము. నీరుయందమూ సదా శుచియే, నశుచి యగు దేహముల, వస్త్రమాలిన్యాదుల బోగొట్టుట మనమెఱిగినదే. నీరు యమృతమనియు, భగవంతుని స్వరూపమేననియు మనకు తెలియును. ఈలాంటివాని బాహ్యభక్తియందు భావ మేకీభవింపజేసి యర్పించిన భగవంతునకవి సమ్మతములు. మనసు బుద్ధి యహంకార చిత్తములనే నాల్గింటిని లోకవస్తువులకొఱకై నర్పించినపు డశుద్ధములు. భగవంతునికొఱకయ్యే నర్పించిన యవి శుద్ధములు. ఇదియే దీనిభావము. శాస్త్రవిహితములగు కర్మలునేమైన, వ్యావహారిక కర్మలను, తినువానిని, నితరులకిచ్చువానిని, తపోదానముల హోమాధ్యయనాదుల భగవంతుని కర్పింపుమనెను.

ప్ర॥ ఇందులోగూడ నేమైన రహస్యమున్నదా?

ఉ॥ మనకు తెలియక తెలియునదంతయు రహస్యమే. సమస్త కర్మల భగవదర్పిత మొనర్చినపుడు కర్మలలో నిష్టాయిష్టములతోగూడిన కర్మ

ఫలములు ననుభవించుటకు జన్మమెత్తవలె. జన్మములెత్తుపనిలేకుండ ముక్తులగుదుమని నర్జునుసుద్దేశించి భగవంతుడు తెలిపిచ్చెను. భగవంతు నకు శుభాశుభకర్మల ఫలములగాని, కర్మలగాని నర్పించుటయే త్యాగము లేక సన్న్యాసము లేక యోగము.

ప్ర॥ కర్మముల భగవంతునకర్పింప భక్తులకు ఫలము?

ఉ॥ నిత్యానివృత్తమైన దుఃఖనివృత్తి సదానందప్రాప్తి సిద్ధించును.

ప్ర॥ జీవులందఱు భగవంతునకు సమానులంటిరికదా? అందరకేల మోక్షమివ్వకూడదు?

ఉ॥ ఒకదాత దానమిచ్చుచున్నాడు. నాకు వలదన్నవాని నేమను, నెట్లివ్వగలడు? తీసుకోలేడని క్రోధమా? లేదుకదా! భగవంతునినమ్మి కర్మఫలములు నాయనకే నర్పించితే నెటువంటివారినైన రక్షించగలడు. తనకు ప్రియాప్రియులు లేరని భగవంతుడే యనెను. 30 నుండి 34 శ్లో॥ వఱకు భక్తివలననే మహాపాపులుకూడ ముక్తినొందుదురని యభయమిచ్చి ప్రబోధించెను.

ప్ర॥ పాపాత్ములనుకూడ రక్షించునా?

ఉ॥ దుర్వాసనతో కంపుసహింపరాని రోగినైనా డాక్టరు వలదనునా? ఆతనినేకదా బాగుపఱచ శ్రద్ధ తీసుకొనును. బంగారపవిత్రమైన ద్రావకము ద్వారా శుద్ధ మొనర్చెదరు. పరుసవేది సోకినంతనె యినుము బంగారగును కదా! భగవంతుడనే పరుసవేది సోకిన పచ్చిపాపాత్ముడును పావనుడగును. కేవలము మాసినవస్త్రముల నుతుక శుభ్రమగును. బొత్తిగా చదువు రాని వాని విద్యావంతు నొనర్తురు. తద్రీతి యజ్ఞానకార్యమగు జగత్తున యవి ద్యాభానులైన జీవులు మోహపరవశులై తెలియకగాని, తెలిసిగాని యాచరించిన త్రికరణకర్మలు పాపాతిపాపములైనను వానిని దహింపజేసి పవిత్రుల నొనర్పవలెనంటే భక్తి జ్ఞానసాధనలతో పవిత్రులై భగవ త్ప్రాప్తి నొందగలరు. ఎంత యశుచివంతుడైనను బిడ్డను తల్లితానే శుచి జేసి పవిత్రునిజేయదా? ఎంత పాపాత్ముడైనను సరియే నన్ను మనసార చేర్కొంచాలు వాడు పవిత్రుడేనని భగవంతుడు. మన యజామిలుడు, వాల్మీకి మొదలగు పాపాత్ముల పావనుల నొనర్చినది యేది? భగవన్నా మమేకదా. పక్షులలో గరుత్మంతుని, పన్నగులలో వాసుకిని, మృగము

లలో సురభి, వృషభము, గోవు, వానరులలో హనుమదంగదాదుల, సింహము, ఏనుగు, గుఱ్ఱము, జింక, కుక్క యిత్యాదుల, వృక్షాదులలో బోధివృక్షము, పుష్ప, పత్ర, ఫలాదుల, మానవులలో స్త్రీలు మొదలు నెట్టివారలనైన రక్షించె, రక్షించు, రక్షించుచున్నాడు. జాతియన మానవజాతి. వృక్ష పశుపక్ష్యాది జాతులకంటె వేరు. మతమన యభిప్రాయము. భక్తియే మతము. భగవత్ప్రేమయే భాగవతజాతి. ప్రజలందఱు ప్రభుభక్తిగల్గియుంటే ప్రభువేమిచేయుచుండును? తత్ప్రజలయందే భేదరహితుడై యుండును. చిన్నచిన్న నదులు, పెద్దపెద్ద నదులు ప్రవహించి తనలో గలియుటకు నప్పుడప్పుడు దయయనే వర్షము సముద్రుడు కురియించుచుండును. ఎంతకాలమునుండి ప్రవహించుచుండి తనలో కలియలేక కల్మషవంతమై పరితపించు నూటకాల్వల పారెడి చిన్నవాగులు సైతము కాల్వలలోని మురికినీరుతో సహా వర్షపునీరుతో కలిసికొనిపోయి యథాస్థానము చేరుచుండును. ఆరీతి భగవంతుడు నెంతెంతకాలమునుండియో కులమత, పక్షపాత, సాంప్రదాయక పీడాబలముల నణచబడి దిక్కులేక యున్న జీవులతో కలిసిన కర్మల భస్మీపటలమొనర్చి సమానవంతుల నొనరించే కొఱకు దయయనే యవతారముదాల్చి తన భావముల గ్రంథరూపముల విశదపఱచి కల్యాణమొనర్చును. భగవంతుని యర్చించుటలో నోటితో గట్టిగా నుచ్చరించుటగాని, తనకే తెలియులాగు పెదవులతో నుచ్చరించుటగాని, మనస్సుతోగాని, స్మృతిజ్ఞానముతోగాని, యథార్థజ్ఞానమునగాని యర్చించినను, భగవత్ప్రేమకు కొదవయుండదు. తండ్రికి యొకడు నేర్పరి, యొకడు మూగవాడు, నొకడు సాధు, మఱొకడు జ్ఞానియైన వారినందఱి భిన్నభిన్నలుగా జూచునా? చూడడు. తన తనయులని గారాబముచేయును. అయితే వారివారి యభిప్రాయములను మూగవాడు సంజ్ఞలతో, మాట్లాడువాడు వాక్కుతో, తక్కినవారు తక్కినరీతుల తెలుపుదురు. అందఱియభిప్రాయముల తండ్రి గ్రహించును. హంస పాల గ్రహించి నీరువదలురీతి, భగవంతుడు ద్వైతబుద్ధి మృతబుద్ధి, జాతిమత, వయోవృద్ధ, దేశ కాల, న్యూనాధికతల, స్వచ్ఛతాస్వచ్ఛతలనే ద్వంద్వముల చూచుటకు నాయనకు ద్వైతబుద్ధిలేదు. అద్వైతబుద్ధియే నాయన పూర్ణత్వము.

ప్ర॥ కరుణాసాగరుడగు హరిని యెన్ని రీతుల వర్ణించిన తక్కువే. ఎందుకన వర్ణనాతీతుడు. జీవుల యుద్ధారమునకై నెన్ని మార్గములు, నెన్ని ధర్మములు, నెన్ని యుపగతుల జూపెను! ఆ దేవతాసార్వభౌమునకు కృతజ్ఞతాభివందనములు. ఆయన జేసే మేలునకు ప్రతిమేలు మనవలన కాదు. అటువంటప్పు డర్జుననివలె మన భారాలు, మన భావాలు, మన వాక్కులు, మన ఫలితాలు యనే కర్మల నాయన హస్తగత మొనర్చి నిర్మోహముతో, నిశ్చలతతో నిమిత్తమాత్రులమై యుంటే పురుషార్థము. ఓహోహో! అర్జునా! ఫల్గునా! పార్థా! కిరీటీ! ధనంజయా! శ్వేతవాహనా! భీభత్సా! అనే కొమరారు నామముల బిలిపించుకుంటూ నాయనతోనే సలహాలడుగుచు, సారథిత్వ మొనరించుకొని ద్వంద్వయుద్ధమున బాహ్యాభ్యంతర సంసారమునుండి విజయము సాధించితివంటే అర్జునా! అనాది పుణ్యార్జిత గాండీవహస్తచాపవిసర్జనా! జీవేశ్వరాభేదదర్శిత తత్వోపార్జనా! నిన్ను గన్నవారయా! తలిదండ్రులు. నీవున్నదే పవిత్రదేశము. నీపేరు యన్వర్థనామధేయమై, ధృవతారకమై యఖిలభవిష్యజ్జనాదర్శకుడవైతివంటే నీవు ధన్యుడవు, నీవు నరుడవు, ఆయన నారాయణుడు. మీ నరనారాయణుల పూర్ణావతారము అపూర్ణమానవుల నుద్ధరించుటకే గదా! అమ్మా! జగజ్జననీ! సకలసంసారదుఃఖ విధ్వంసినీ! అపారజనసేవిత జ్ఞానకర్మ పాదద్వయినీ! మోక్షామృతార్థ యుగస్తన్యాద్వయినీ! భగవతీ! గీతా! పాహిమాం, పాహిమాం, పాహిమాం. ఆవల భగవంతు డేమనెను?

ఉ॥ భగవంతుడిచ్చిన యంత్యసందేశమేమంటే సాంఖ్యయోగము 47 శ్లోకమున నాల్గు కర్మధర్మములు యేవన, కర్మఫలముల నాసక్తివలదు, కర్మఫలముల ప్రాప్తకారకుడవు కావలము, కర్మ వదలవలదు, కర్మచేయు నధికారమేనని చెప్పెను. ఇదియు కారకధర్మము లేదా క్రియాధర్మము. ఈ యధ్యాయము కడపట భావగంభీరపూరితధర్మములు నాలుగు జెప్పెను. మనస్సు నాయందే నిలుపు, నా భక్తుడవుకమ్ము, నన్నే పూజింపు, నాకు నమస్కార మొనరించుమనె. అయితే నాకు ఫల మేమన, నన్నే పొందెదవనెను. మనస్సు దేహేంద్రియములు, భార్యాపుత్ర బంధు మిత్రాదులయందు నుంచకు. ఏదైన యుద్యోగమునకో, గద్దె నెక్కించే

గౌరవాలకో నితరులకు దాసుడవు కావద్దు. ధనకాంక్షతో, నాయురారోగ్య బలవర్ధకమునకై నెవని పాదములకు మడుగు లొత్తవాకు. సంకుచితదృష్టితో బోద్రోయలేక మీరజాలని ఫలాపేక్షకై నమస్కారము జేయవాకు, నవి క్షణభంగురములు. శాశ్వతవస్తు వందువలన రాబట్టలేవు అన్నాడు. భావన దేనియందుండి యెట్టి కర్మల జేయుచుందురో, నవియే ప్రాప్తించునని ప్రతియొకరికి నర్థమయ్యేలాగు చెప్పెను. చెనగపిండి, జొన్నపిండి, కొఱ్ఱపిండి యిత్యాదులు వేఱు వేఱు రుచులు, గుణములు, పేర్లు గలవియైనను, చక్కెరను జేరినంతనే తీపియగును లేక సదరు పిండిపదార్థములలో కారముగూర్చిన కారములగుచున్నవి. ఇదేరీతి చక్కెర పాకముజేసియే భావనగల పేరులతో నెన్ని చిలుకలు మొదలైనవి తయారు చేయుదురు. భావన ననుసరించియే బాహ్యక్రియ జరుగును. ఇదియే కర్మ. ఎట్టి కర్మమైనా భావనకు విరుద్ధముగానుండదు. అప్పుడాకర్మఫలము ననుభవమునకు రాకపోదు. కర్మల భగవంతునకే మనస్సును జేర్చి యాచరించర్పించిన యాచరించేవాడు భగవదాకారుడై పోవును. ఇంతటి మహోపకార మొనర్చిన గీతామాయికి, నధ్యాత్మకజగద్గురువగు గీతాచార్యునకు, దీనినిగూర్చిన పూర్ణమౌని వ్యాసభగవానునకు, పూర్ణాధికారియగు నర్జునునకు సదా మనము కృతజ్ఞులమై వారి యభిన్నముతో మనమభిన్నులమై "ద్వితీయాద్వై భయం భవతి" యనే ప్రమాణసత్యము నొందెదముగాక. కృష్ణోఽహం శివోఽహం బ్రహ్మోఽహం అని మనుదుముగాక! ఈ ధార్మికగ్రంథము నలుమూలల వ్యాపింపజేయుటయే భగవంతుని సత్యసేవ. ఇందు విశ్వాసముంచుటయే భక్తి. ఇదియే రాజయోగరహస్యము. "బహుజనహితాయ" పరమమంత్రము.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
రాజవిద్యారాజగుహ్యయోగో నామ
నవమోఽధ్యాయః

ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## దశమాధ్యాయము

### విభూతి యోగము

క॥ వివిధములగు భగవంతుని
యవినాశములైన సగుణ మమలవిభూతుల్
వివరణమొఱిగిన సర్వము
యవగాహనయగును జగము హరియే యనుచున్.

క॥ శౌరికథారతులగుడీ - శౌరికథల్ చెప్పికొనుడీ చతురత వినుడీ
శౌరికథాసంప్రశ్నము - శౌరి నదీజలమువగిది శ్రేష్ఠులజేయున్.

ప్ర॥ దేశకాలవస్తుకృతదోషము లేక చదువతగిన యమూల్యగ్రంథమేది?

ఉ॥ అతీంద్రియజ్ఞాను లనవరతము హస్తముల ధరించి యానందాశ్రువు లొలుక నిరీక్షిత సమీచీన హృదయవేద్యంబగు పరతత్త్వప్రసాదంబగు భగవద్గీతయే.

ప్ర॥ రాజవిద్యారాజగుహ్యమగు నవమాధ్యాయమును విని తనివిదీఱకున్నది. విభూతియోగముగూడ భగవంతుడర్జును డడగకమునుపే తెలుపుటాశ్చర్యమే. అర్జునికేమొగాని, నాకు విన కుతూహలమగుచున్నది చెప్పుడీ.

ఉ॥ సింహావలోకన మొనర్చిన పిదప కర్తవ్యము నూహించుట శ్రేష్ఠ పురుషలక్షణము. చేసిన కార్యము, చదివిన చదువు, చేసిన భక్తి, యొఱిగిన జ్ఞానము, విన్న శ్రవణము, నడచిన ప్రవృత్తిని గుఱించి జ్ఞాపకము చేసుకున్నవారు తప్పక నాయా పనులలో, ధర్మములలో, లోపము లున్నను, కొదువలున్నను చక్కబెట్టికొని వెనుక కుంఠితములు గలుగని విధము చూచుకొందురు. సింహము తాను గదలిన స్థలమునుండి 10, 15 అడుగులు నడిచినమీద వెనుదిరిగి చూచును. ఇయ్యది తన గాంభీర్య

తకు తగిన చిహ్నము. ఆరీతి గీతాప్రచారము, గీతాధర్మము, గీతాజ్ఞానము, గీతాభక్తి, గీతాసేవ, గీతాకర్మము, గీతాజ్యోతి, గీతాఫలము, గీతానవనీతము, గీతానవమాధ్యాయమును జూచితే, సాగరమధ్యమున నున్నవ్యక్తి తను చేరదలచిన యుత్తరతీర మెంతదవ్వున్నదని గడచినదెంత దవ్వైనది యెఱిగినంతనే నిక యింత ప్రయాణము చేయవలసియుండునని యుజ్జాయింపుకొచ్చును. ప్రథమాధ్యాయము మోహము, విషాదము, కర్తవ్యభ్రష్టత; ద్వితీయాధ్యాయమున మోహనివృత్తి, త్వంపదవాచ్య స్వరూపలక్షణము, స్వధర్మము, కర్తవ్యనిష్ఠ, స్థితప్రజ్ఞత్వము, బ్రాహ్మీస్థితి చెప్పబడినది. కర్మాకర్మ వికర్మల మర్మమును మూడు నాల్గు నైదవాధ్యాయముల జెప్పబడినది. ఆరవ యధ్యాయమున నకర్మ లేక జ్ఞానసిద్ధికి చిత్తశుద్ధికరములగు వివిధసాధనలు నభ్యాసవైరాగ్యములు నవసరములని, యేడవాధ్యాయమున నీశ్వరునిశక్తిద్వయము వర్ణింపబడి భగవన్మహిమ తత్ప్రాప్తి విజ్ఞానమున గలుగుటకు భక్తిసాధనలు తెలుపబడినవి. అష్టమాధ్యాయమున మార్గవర్ణన సద్యోముక్తి క్రమముక్తులవివరణ ఫలితాల సాధన, నవమాధ్యాయమున లేక మధ్యమాధ్యాయమున ఫలితాలకు సరళమైన సాధన భగవంతునిచే నిర్దేశింపబడినది. "మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు। మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః". ఈ శ్లోకము చతుర్భుజములు వారికి యున్నరీతి చతుర్విధసాధనలు తెలిపెను. అడుగకనే పాలిచ్చుట తల్లి, యడుగకనే విద్య జెప్పుట గురువు, నడుగకనే జ్ఞానోపదేశము చేయుట నాచార్యుడు, యడుగకనే దానమిచ్చుట దాత, ఉదారవంతులగు మహాత్ముల నిత్యాశయము. సందర్భానుసార మొకప్పుడడుగబడి చెప్పుటకలదు; అడుగక చెప్పుట కలదు. భగవంతుడు దగ్గరనున్న అర్జునునికొఱకుగాదు, అర్జునుని యెదుట తాను సాక్షాత్తుగానుండ విభూతుల వివరింపవలసిన దేముండును? తన్ను సాక్షాత్కరించుకొనలేని భావిసామాన్యమానవుల నుద్దేశించి తన్ను తెలిసికొనుటకు నొకవేళ నర్జునునకుగూడ భేదబుద్ధి తొలగుటకై భక్తి, భజన సాధ్యములగు విభూతులను జెప్పెను. తల్లి ఉపదేశము తనయుడెట్లు మరువతగినదికాక, తల్లినిగుఱించి జ్ఞాపకము చేసికొని దుఃఖించునో, భగవంతుని యపారకరుణాకటాక్షమునకు

నాయనజేసిన ఉపదేశమును జ్ఞాపకముజేసుకొని దుఃఖితులముగావలె. ఆయనజేసిన మేలునకు మనము ఋణగ్రస్థులమే. ఈ మహాఋణము తీరవలె నంటే నాయన ఉపదేశమును మనము పాటించి దానిని జీర్ణముజేసుకొని నాయనలో జేరిపోతేనే తప్ప మరేవిధముగ తీరదు. సముద్రుడు తనయందు జలజంతువులున్నను వాని గాంచి సంతసించడు. పౌర్ణమినాడు చంద్రుని జూచిన కౌగలింప నగ్రబాకును. భగవంతుడన్న భక్తుల కంతప్రీతి.

ప్ర॥ విభూతియోగమన నేమి?

ఉ॥ భగవంతుని కళలు లేక యంశములు భగవంతుని సత్తవిశేషముగ గలవానిని తెలియుసాధన అనిపేరు. 1 నుండి 3వ శ్లోకమువఱకు నీశ్వరుని యనాదిస్వరూపజ్ఞానము ముక్తిదాయకమని తెలుపుచున్నాడు. ఉపాధ్యాయుడు బాలబాలికల విజ్ఞానవృద్ధికిగాను నల్లబోర్డుపైన దేశపు మాప్‌నువ్రాసి దేశము నలుదిశల గల నెల్లలను, ప్రవహించు ముఖ్యనదులను, పుణ్యక్షేత్రములను, పర్వతముల, చిన్నకొండల, చిన్నదేశపురాజుల, చెఱువుల, కాలువల, రస్తాల, రైల్వేలైనుల, ముఖ్యపట్టణముల, సముద్రముల, హార్బరుల, దేశమున బండు సస్యముల, ముఖ్యవ్యవసాయముల దేశమంతదిరిగి చూడకపోయినను ఫలానిది ఫలానిస్థలమున గలదని జ్ఞానముచే దెలియురీతి భగవంతుని తెలియవలెనంటే జనసామాన్యమునకు తన విభూతులను అనగా ప్రధానాంశముల కొన్నికొన్ని తెలుపుటయే నీయధ్యాయము. మాప్‌లో జూపిన గుర్తులనుబట్టి దేశమంతట పిల్లలెతిగినమీదట పరోక్షమునగలిగిన నా విషయము ప్రత్యక్షమునపోయి చూడగలరు. ఒక భగవద్విభూతిని దృఢనమ్మకమున సేవించిన భగవంతుని జూడగలరు.

ప్ర॥ విభూతులను వివరించు టెందుకు?

ఉ॥ భగవంతుని సంపూర్ణముగ తెలియుటకు నొకపట్టణమున ప్రతి బజారున, ప్రతియింట వలసినన్ని బార్‌లైట్లు, తదితరలైట్లు పెద్దవి, చిన్నవి, నలుపు, యెఱుపు రంగులతో రాత్రివేళ వెలుగుట మనము జూచుటలేదా? వ్రేలితో మీటర్‌ను వత్తినంతనె అది వెలగటము, నారిపోవుటము నెఱుగుదుము. ఈ వెలుగెక్కడినుండి వచ్చుచున్నది? యోచించుము. తెలియకపోతే నితరులవలన తెలిసికొందుము. విద్యుత్

కేంద్రమునుండి నా విద్యుత్తే నీ విధముగ వచ్చినదని గ్రహించినరీతి "యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్" సూర్యచంద్రాగ్నులనే లైట్లు నే కేంద్రమునుండి ప్రకాశించుచున్నవన, భగవత్కేంద్రమునుండి అని, భగవంతుడననే అనెనుగదా! భగవచ్ఛక్తి యెక్కువగల వానినిబట్టి నాయన వ్యాపకత్వమును గ్రహింపవచ్చును. గీతాగ్రంథము చిన్నదే. కాని ప్రతిదేశముల, ప్రతిమతముల, ప్రతిగ్రంథములలో నిదియే నగ్రస్థానమున నున్నదంటే నన్ని ధర్మములలో గీతాధర్మము వెలయుచున్నదన్నపుడు నవియున్ని గీతావిభూతులే కదా? ప్రభుత్వమంటే, ప్రజలంటే పెద్దఉద్యోగులు, చిన్నయుద్యోగులు, వారికార్యములు, కార్యాలయముల నెఱుగనిమూఢుడు ప్రభువంటే, దేశమంటే నేమని అనుకొనును. మొదలు చిన్నఉద్యోగుల, చిన్నవిషయముల తెలిసికుంటే కొద్ది దివసములకు దేశవిషయము తెలియును. చిన్నయేరు, పెద్దయేరులను గ్రహించిన వీనియన్నిటికంటె మఱిపెద్ద సముద్రమును తెలియును. విభూతులవలన భగవంతుని తెలియుట సులభము. స్థాలీపులాకన్యాయము నొక మెతుకునుబట్టి అన్నమంత యుడికినది, లేనిది తెలిసిన విధము, కార్యమునుబట్టి కారణమును గ్రహించుట యర్థాపత్తిన్యాయమగును. ఇవి యుపలక్షణములనిగూడ జెప్పవచ్చును.

ప్ర॥ దేవతలకు ఋషులకుగూడ భగవద్విషయము సంపూర్ణముగ తెలియదా?

ఉ॥ తెలియదు. వారందఱకు, మనకందఱకుకూడ మూలము పరమాత్మయే. ఆయనను తెలిసికొనుట వారికి నసాధ్యమె. ఆయన ఉత్పత్తిని యెఱుగరు.

ప్ర॥ ఏల తెలియజాలరు? వారు గొప్పవారుకదా!

ఉ॥ ప్రభుత్వోద్దేశము చిన్నఉద్యోగులకు, ప్రజలకు తెలియకపోయినను పెద్దఉద్యోగస్థులకు తెలియుననుకొందురు. కాని వారికి తెలియదు. తద్రీతి నాయనవలన ఉత్పత్తియైన వారేలాగు తెలియుదురు?

ప్ర॥ అటులైన మనుష్యులు తెలిసికొనుట మాత్రము సాధ్యమా?

ఉ॥ అందులకే విభూతులను దెలిపినాడు. విభూతులనుబట్టి మెల్లగ గ్రహింపనగు.

ప్ర॥ అర్జునుడు ధన్యుడే. ముఖాముఖి చెప్పుచుంటే వినటము నెంత యదృష్టము! భగవంతున కెంతదయయో నిన్ని రహస్యముల దెలిపెను. దేవతలకు ఋషులకే సాధ్యముకానపు డర్జునున కెట్లు సాధ్యము?

ఉ॥ అర్జునునియందే కాదు; నాయనకంటే, మనయందే నెక్కువ ప్రేమయుండుటచే తెలిపెను. అతీంద్రియజ్ఞాను లింద్రియమూలమున నెఱుగదగినది వారికేమి తెలియు? ఏదో యొక భోగములనున్నవారికి నేకాంతస్థితి నెఱుగుటెట్లు? మానవత్వము శ్రేష్ఠమనుటిందుకే. మానవులే సౌభాగ్యులు.

ప్ర॥ ఎవరైన తెలిసికొనవచ్చుననెదరా?

ఉ॥ నీవు భగవంతుని జూచితివా, యెట్లున్నాడు, ఎక్కడున్నాడు, ఏమిచేయుచున్నాడంటే నేమి యందువు?

ప్ర॥ నాకేమి తెలియదని అనెదను.

ఉ॥ నిన్ను ముసలితనమువలని భయము, చావుభయము, పునర్జన్మ భయము దీర్పవలెనంటే నీ బంధువులో, నీ యాప్తులో, భార్యాపిల్లలో, రాజ్యమేలు ప్రభువులో, లేక శాస్త్రపారంగతులో, నాయుర్వేదయూనాని వైద్యులో, గొప్పగొప్ప బిరుదులుగొన్న లెక్చరర్లు, ప్లీడర్లు, కేసులు తీర్మానించే జడ్జీలు, శరీరసంబంధులు, బలవంతులు, ధనవంతులు నీ చావు ముసలితనములవలన గలిగే భయనివారణ జేయగలరా? ఈ కేసుకు మందునిచ్చెదరా? జాతిమతకక్షులలో, బద్ధక్రోధములతోటి వారు సమాజస్థులు కాపాడగలరా? జెప్పుము.

ప్ర॥ నాగతియే వీరందఱకుబట్టియున్నప్పుడు నన్నీ భయమునుండి వీరెవరు రక్షింపలేరు. వారిని వారే రక్షించుకోలేరు.

ఉ॥ ప్రహ్లాద, నారద, బలి, శిబి, రామకృష్ణ, వివేకానందవంటి మహాత్ముల నెవ్వరు రక్షించిరి? వీరెవరిని నమ్మిరి? ప్రపంచమానవులనా?

ప్ర॥ వారు భగవంతుని నమ్మిరి. మానవులనమ్మలేదు. భగవంతుడే వారికభయమిచ్చెను. అందున అమరులైరి. మన మాభగవంతుని శరణుజొచ్చి భయరహితులము కావలెనని తెలిసినది. భగవంతుని తెలిసికొనుటయే మనకర్తవ్యము.

ఉ॥ మన కర్తవ్యము తెలిసికొనుటయేనని గీతోపదేశము. ఎవరైనసరె తెలియవచ్చు. ఎవరు భగవంతుని జన్మము లేనివానిగను, సర్వలోకేశ్వరుని గను, కారణరహితునిగను, మూలకారణునిగను తెలిసికొందురో యట్టివారు మనుష్యులలో మోహశూన్యులై సర్వపాపములనుండి విడివడుదురు. ఒక పట్టణమునయున్న మురికికాల్వ తన కేహేయమై తన చుట్టుప్రాణులకంత నీచముగా నున్నపుడు నాయశుద్ధము బాపుకొనుటకు తన మూలకారణ మగు సముద్రమును దెలిసిగాని, లేక గొప్ప నదులకలిసి వాని సహాయ మున సముద్రమునుబొందిగాని పవిత్రతబొందును. మురికికాల్వ పేరులేదు, దాని స్థలములేదు. పచ్చిపాపాత్ముడైనను తినకుతానే తన పాపమును గురించి పశ్చాత్తాపపడి భగవంతునిజేరి పావనుడగును. సందేహమేలేదు.

ప్ర॥ చెప్పండి చెప్పండి, యీ జన్మాంతికితోడు గీతారహస్యబోధ యబ్బుట కెంతసుకృతమో! మరొక్కమాట - కొంతమంది దేవుడు లేదంటారు. ప్రకృతిపరిణామమే ప్రపంచము, భగవంతుని గురించినవన్ని యూహావేద్యములంతేగాని వేరేమి లేదనెదరు. ఇంత విస్పష్టముగ వచించిన గీతను సాంగముగ జూడలేదేమో?

ఉ॥ ఆవాదము ననాదినుండి యుండియేయున్నది. అందఱకు గలిగిన విచారమే. ఆవిచారమును పట్టుదలతో విచారించినవారు తుదకు భగవంతుని గ్రహించుచున్నారు. పట్టుదలలేనివారు వట్టితర్కముతో నుభయభ్రష్టులగుచున్నారు. 'కోఽహం కథమిదం జాత'మని శంకరుని నిర్వచనము. నేనెవ్వడను, యీవిశాల ప్రపంచ మెట్లు బుట్టినది, దీనికారణమెయ్యదని విచారించిరి, గ్రహించిరి. అదిగో! అదియొకచెట్టు. దానికి విత్తనముండవలదా? ఆవిత్తనము మనకు కనిపించుచున్నదా? అయితే విత్తనములేకనే చెట్టుగలదని చెప్పగలమా? చెట్టంత వెదకితే నెందైన విత్తనమగుపించునా? చెట్టులో సూక్ష్మముగా విత్తనములేదా? లేనిచో శాఖలనుండి ఋతుకాలములో కాయలెట్లువచ్చుచున్నవి? తద్విధముగ నీజగత్తనే చెట్టునకు మూలకారణము భగవంతుడని శాస్త్రములు చెప్పుచున్నవి. ఆయనను గనుగొనవలెనంటే మనలో ముందెక్కడగలదో, నేనుయంటే నెవరో తెలిసికుంటే "ఏకవిజ్ఞానేన సర్వం విజ్ఞాతం భవతి" అద్వితీయ బ్రహ్మవస్తువగు తన్ను తెలిసితే విశ్వవిజ్ఞానము వెంటనే తెలియును. అయితే

ప్రయత్నము కావలెను. మందుడు స్త్రీని గోరినరీతి, మూఁగ గ్రంథము చదువఁగోరినరీతి, ప్రకృతిమయమా? పరమాత్మమయమా? యని తెలియ సాధించవలెను. ప్రకృతి లేదనికాదు, భూత భౌతికమయమంతా ప్రకృతియే. కాని, యీ ప్రకృతి దేనిచేత చైతన్యవంతమై పరిణామమును, సాపేక్షము నొందుచున్నది? విచారించితే నీ వాదములేదు. హిరణ్యకశిపుడంతటా హరిలేడని వాదకెను. ప్రహ్లాదుడంతటా గలడని గ్రహించెను. ఒకడాస్తికుడు, మఱొకడు నాస్తికుడు. కృష్ణార్జునులవలె హిరణ్యకశిప ప్రహ్లాదులు ప్రపంచమున కాదర్శకులే. హరియవతారము చూడకముందు తనయుని వివిధమారణోపాయముల చావకునికి తనలో నీ రహస్యము గ్రహించెను: పరవస్తువేదోయున్నది, లేనిచో వీడేల భయపడడు, చావడు? భగవంతుని గనవలెనని హిరణ్యకశిపుడు పడినపాట్లు భాగవతము చదివిన తెలియ గలదు. తండ్రీకొడుకు లిద్దఱు యాస్తికులే. అసత్తొకటే నాస్తికము. కాన శుష్కవాదములకంటే వెదకుటమంచిది. తెలిసినవారివలన తెలియుట మఱీమేలు. భగవద్విభూతులు గల్గియున్నచోటనెయుండి యష్టైశ్వర్యముల నార్జించి యది సద్వినియోగముచేయుట మనకు కనిపించుటలేదా? కొందఱు తను కౌశలబుద్ధిచేతనే దానమొనరించుచున్నారు. నాస్తికలార్జించుటకు నుద్యోగములేనిచో జీవితముభరమనుకొన్నారు. నిజముగ భగవంతుని దర్శనములేక భక్తులవేషముతో సంచరించు నుద్యోగులు కలరు. అన్నవస్త్రాదులే ప్రధానములైనవికూడ భగవంతుని దయవలననే లభ్యమగుచున్నది. పోనీ నాస్తికులుగాని, యాస్తికులుగాని ఫలమెవ్వరిచ్చేది తెలిసితేచాలు. ఇదో వీరాలుమగండ్రు, వీరికి సంతానమివ్వటము తనకే బిడ్డయైనది తెలియకపోవటము తామే సంతానకారకులంటే నేబిడ్డ యెన్ని యేండ్లు బ్రతుకుననేది తెలియదు. కృషిజేయుచున్నావే, యింతపంట వచ్చునని మొదలే నేలతెలుసుకోగూడదు? వ్యాపారముచేయుచున్నావు, మొదలే యెంతలాభము వచ్చునదేల నెఱుగరు. వేషమువేసినారందాము, భక్తివేషమునకు గలిగేఫలము నెవ్వరినిజూచి నెవ్వరిచ్చిరి. భగవంతుని యెంచి భక్తులిచ్చెదరు. ఇదియైన తెలిసికొని శుష్కవేషములు వేసితేనే పొట్టగడుచుచున్నదే, నిజముగా భక్తులైతే నాయన పోషింపగలడనే

నమ్మకముండదా? ఒకయూర గృహస్థుడొకడుండె వానికి నొక కూతురుండెను. ఆమెకు యుక్తవయస్సురాగానే వివాహముజేయ ప్రయత్నింప భార్య నాపార్శ్వములోనివారికివ్వవలెనని, భర్త నాపార్శ్వములోనివారికివ్వవలెనని పేచీవచ్చి వివాహమాగిపోయినది. ఏ యుపాయముతోనైన పెండ్లిచేయవలెనని నిరంతరము తండ్రి విచారించుచుండెను. ఒకప్పుడు రాత్రి గాఢనిద్రలో నున్నసమయమున నాతని మేడకు కన్నమేసి యొక దొంగ దిగివచ్చుచుండ నాధనికునికి మెలకువవచ్చి భార్యతో పేచీవదలి, యామెను యనుకూలపఱచుటకు నప్పుడొక యుక్తిదోప భార్యను లేపెను. అంత దొంగ వినుచుండ వారిరువురిట్లు మాట్లాడిరి. తెల్లవారి మన యింటికి నేభక్తుడు వచ్చునో అతనికి మన బిడ్డనివ్వదలచితిని. నీ పార్శ్వము వలదు, నాపార్శ్వమువలదన, నామె సమ్మతింప నంత నిదురించిరి. దొంగ నేనేల దొంగతనము చేయవలెను. భక్తుని వేషమున నుదయమే వచ్చితే పిల్లనిచ్చి పెళ్లిసేతురు. ఆస్తి దొరుకగలదని కన్నమునుండి దిగి వెళ్లి తెల్లవారులోపల భక్తుని వేషముతో నాయింటివైపు వచ్చువానిని పిలిచి, తలిదండ్రులు రాత్రి యనుకొన్నమేరకు తమ బిడ్డనిచ్చి వివాహము సేయ బ్రయత్నింప మొదట పెళ్లిచేసుకుందామని వేషధారియై వచ్చిన దొంగ, మంత్రాలు ప్రారంభమై తాళిగట్టే సమయము వచ్చునరి కతనిబుద్ధిమారెను. భగవద్భక్తునివేషము వేసుకున్నందుకే నింతటి వైభవయుతభార్యయు, నాస్తి గలుగుచున్నదే, నిజభక్తుడనైన కొదవుండదని వారిని బ్రతిమాలి నేదొంగనని రాత్రి జరిగిన కథ విన్నవింప వారు మహానుభావా! అప్పుడు దొంగవే యిప్పుడు భక్తుడవై సత్యము జెప్పుచుంటివి కదా? మాబిడ్డను పెండ్లాడుమనిరి. వారందఱకు నమస్కరించి బ్రతిమాలి వెళ్లిపోయెను. కావున నిజమైన భక్తునకు తక్కువేమియుండదు. దైవము లేదనువారు భగవద్భక్తుల మనోనిశ్చలత గనవచ్చు. జడవాదము, వితండవాదము నగ్నిపరీక్షకు నిలువజాలవు. అగ్నిశక్తిలేక నినుము వస్తు పరిణామము బొందదు. స్కాంతశక్తిలేక నినుము ఆకర్షింపబడదు. విమానములు, రైలుయింజనులు, కార్లు, బస్సులు, పెట్రోలు బొగ్గు నీరు తీసికొనినవియే యన్నివ్యవహారము లేల చేయగూడదు. డ్రైవర్లు లేకపోతే మెలానడచును. లేదు, ఊహాతీవేద్యమంటే జగత్తూహాయే.

సంకల్పమాత్రమే దానిని మహాత్ములు నిజమనుకొనరు. సాపేక్షణీయమగు జగత్తు సత్యజ్ఞులచే దీనియుత్పత్తిని గురించి యనేకవిధముల జెప్పిరి. ప్రతి దృశ్యము దృష్టి, సృష్టిలాగు యూహాపేక్ష్యమే. తానుగూడ నూహా వేద్యమేకాని యసత్యమంటే నెవరొప్పుదురు? తాను సత్యమా! దైవమును గుర్తెఱింగినటులేయగును.

ప్ర॥ ప్రతివ్యక్తికి నంతరంగమున సంకల్పసృష్టిగలిగి దానికి బాహ్య క్రియలు జరుగుచున్నవంటే నప్పుడు భగవంతుని గొప్పేముండును?

ఉ॥ ఆకాశతత్త్వమున వాయువు నగ్నితత్త్వమున్నపుడు సూక్ష్మముగా నంతటా యగ్నియున్నది. కనిపించటము లేదు. అగ్గిపుల్లలోనుండి పుట్టిన యగ్ని నేవస్తువునకు దగిలించిన దహించివేయుచున్నది. అయితే నీ యగ్గిపుల్లలోని యగ్గి యెక్కడిదనెదవు? వ్యాపకాగ్నియే వ్యాప్యవస్తువగు పుల్లయందున్నట్లు "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత" వ్యాపకుడనగు నేనే సర్వదేహములందు క్షేత్రజ్ఞుడుగా నున్నాననెను భగవంతుడు. అటువంటప్పుడు భగవంతుడు కానివాడెవ్వడు? ఆయన యిచ్ఛాక్రియారూపముల నేలకాడు? ఎన్నిజన్మము, లెన్ని దేహము లెన్ని వింతలుకావలె నన్ని కాగలవు. మఱొకవిషయము. ప్రతిమానవుని హృదయమందు సూక్ష్మవిషయగ్రహణసామర్థ్యము, ఆత్మాదిపదార్థముల జ్ఞానము, అసమ్మోహము, సత్యము, దమము, శమము, సుఖదుఃఖ జన్మమృత్యుభయాభయములు, అహింస, సమచిత్తత, సంతోషము, తపస్సు, దానము, ధర్మనిమిత్తమగు కీర్తి, యపకీర్తి మున్నగు గుణములు లేదా భావములు నీవన్నట్లు బుద్ధిలో సంకల్పింపబడి బాహ్యక్రియలగుటకు దేహేంద్రియములుండ దైవానుకూలమేల యనవచ్చు. 4 నుండి 7 శ్లో॥ వఱకు భగవంతుని విభూతియు యోగములివి. కాని బుద్ధిజడము. అది యాత్మకాదు. పరమాత్మా జీవాత్మాకాదు. అదిగో! అదియొక గోడ. గోడకు నొక యద్దమున్నది. అద్దమునందు వెలుపలి వస్తువులన్ని కనిపించును. ఎవరివలన? సూర్యునివలన కాదా? సూర్యుడు లేదా నవి ప్రకాశింపవు. బుద్ధి పంచభూతముల సమిష్టిసత్త్వగుణాంశము, నిర్మలము. దానియందు బాహ్యమందలి విషయములన్ని ప్రతిబింబించును. అప్పుడు సకలపదార్థముల విషయత యను సామర్థ్యము గల్గినదంటే నాత్మసాన్ని

ధ్యముచేతగాదా! బుద్ధి పరమాత్మకు నుపాధిగానున్నది. స్వయముగ విషయులయొక్క సామర్థ్యము నద్దమునకు లేనిరీతి దీనికిలేదు. అద్దమేకాదు, జలముకూడా యెట్లు సూర్యుని ప్రకాశము తీసుకొని ఘటభిత్త్యాదుల లేక సమస్త చిత్రవస్తువుల ప్రకాశింపజేయుచున్నదో, నటుల చైతన్యప్రకాశము తీసుకొని బుద్ధి సకలపదార్థముల ప్రకాశింపజేయును. పరాక్రమవంతుడు, వీరుడు, శూరుడు, ధీరుడే యర్జునుడు. శత్రువుల నిశ్శేషముగా జయించి నాడంటె నెవ్వని సాన్నిధ్యమున? భగవంతుని సాన్నిధ్యమున కాదా! కొమ్మలుపకొమ్మలు పత్రపుష్పఫలసంజాతములన్ని విత్తనమునుండి నావిర్భవించుటకు నీరు భూమి గావలె. భూమియుండియు నీరు లేదా మొలవదు. సినిమాలోని బొమ్మలన్ని డైనమారొక్క శక్తిచేత నొక్కొక్కటియే వచ్చి తమతమ విధుల ననువర్తించి వెళ్లుచున్నవంటే డైనమాయే దానికి శక్తినిచ్చునది. భగవంతుడులేక నర్జునుడు సాధించిన దొక్కటికూడ లేదు. భగవత్ప్రేరణచే ప్రతివారి హృదయములోని భావములన్నియు కాలానుగుణ్యముగ నుత్పన్నములగుచు పోవుచుండును. రెండవవిధము. భగవంతుని గొప్పేమియంటె నెవడు భగవంతుడ నేనని తెలిసికొన్నచో తెలిసికొన్నవాని ప్రేరణయేనని గ్రహింపజేయుటయే భగవంతుని యభిప్రాయము. అట్లైన భగవంతుడు గొప్పయే.

ప్ర॥ నాకు నొకసంశయము. గోడకున్న యద్దములో బాహ్యవస్తువులు సూర్యప్రకాశముచే ప్రకాశించునంటిరి. అదేవిధముగ బుద్ధి విషయత ప్రకాశతకు నాత్మయంటిరి. వెలుపల వస్తువుల చూడకుండ నున్నను బుద్ధిలో నెప్పటివో, నీ గుణములున్నవి కదా! అద్దమువలెనైతే తటస్థపడినవానినే ప్రకాశింపజేయవలె కదా?

ఉ॥ అద్దము నెదుటనున్నవి యెప్పటియట్లనే చీకటియందు కనిపించక వెలుతురు గలిగినంతనే యగుపించును. వెలుతురో కొన్ని తటస్థములుగ నాప్రక్కకు నీప్రక్కకు వెళ్లునవి కనిపించిపోవుచుండును. చీకటిలోనున్నవి వెలుతురుపడినపుడు కనిపించటము, వెలుతురులేనపుడు కనిపించకుండటము గలుగును. తద్రీతి బాహ్యవిషయవస్తు ప్రతిబింబములు, బుద్ధియందు సుప్తిలో కనిపించక జాగ్రత్స్వప్నముల నాత్మవలె కనిపించును. బుద్ధి విషయప్రవృత్తుల గనినపుడు లోనివి జ్ఞాపకముండవు. బాహ్యవిషయ

ప్రవృత్తిలేనపుడు నది ప్రకాశించదు. సుషుప్తియందు బుద్ధియుండదు కాన వాసనలు ప్రకాశింపవు. ఉద్ధరించిలా సాధనము బుద్ధి బాహ్యవిషయసాధన. ఇదియే నేత్రాంతగలవాడాత్మసందర్శనమునకు సాధన.

ప్ర॥ ఆహా! ఎంత గొప్ప రహస్యము. బాగున్నది. కాని, చతుర్దశ మనువులు సప్తర్షులు సనకాదు లెవరినుండి బుట్టిరి?

ఉ॥ విత్తనమునకు ప్రకాండము, ప్రథమశాఖలు మొదట గలిగితే నాశాఖలే తదితరశాఖలకు కారణము. భగవంతునివలన స్వాయంభువమన్వాదులు గలిగిరి. వారివల్ల నీ జగత్తు వ్యాపకమైనది.

ప్ర॥ ఒకచో నావల్ల, నొకచో ప్రకృతి, నొకచో ప్రకృతియొక్క నాయొక్క సమ్మేళనమువలన, నొకచో మన్వాదులు, నొకచో మరీచ్యాదులవలన జగత్తు గలిగెననటము నేదినమ్మవలె? ఈలాగు జెప్పుటెందుకు?

ఉ॥ ఒక చిత్రకారుడు తనచేతికుంచెతో రంగులవలన చిత్రములదీర్పగా, కనిపించు కల్పితచిత్రములకు కారణమెవరందము. కుంచెయా? రంగులందమా? చిత్రకారులందమా? ఏవి లేకపోయిన సృష్టి యుద్దేశ్యమే చెడిపోవును. చిత్రకారుని చిత్రసృష్టికి నతడు లేక కుంచెగాని, రంగులుగాని కారణములుగావు. అవిలేక నతడేమి చేయగలడు. కుంచె రంగులసాధనలతో చిత్రకారుడు సృష్టిజేయునపుడు కుంచెతోనన్నను, రంగులతోనన్నను, నావల్లనన్నను, లేక నేనేయన్నను విరుద్ధమేమున్నది? భగవంతు డారీతి ప్రకృతిమొదలైన సాధనలచే నీకల్పితసృష్టిజేయుటలో సాన్నిధ్యసాధనము లేక సాధనసాన్నిధ్యమును తాను వహించును. ఒకప్పుడు తనపేరు మఱొకప్పు డొకరిపేరు చెప్పినను మూలపురుషు డాయనయేనని మనము గ్రహింపవలె. ఒకపని యొకప్పు డొకరిచేతను, యొకప్పుడు మనమే చేయుటలేదా! "యథా చ తత్త్రోభయథా" వడ్రంగి వులి, గూటము మొదలగు సాధనలచే నొకపని నిర్మాణముజేయును. అప్పుడు నిమిత్తోపాదానము, సహకారికారణము తానే యగుచున్నాడు. ఏదియుగాకయునున్నాడు. కుమ్మరి, కంసాలియు, సాలెయు నీమాదిరి యూర్ణనాభిసృష్టివలె నొకప్పుడు తాను మఱొకప్పు డాస్వాయంభువాదులజెప్పిన నుభయము తానె. మఱియు సృష్టి యసత్యమగుటవలన

మిథ్యానిరూపణకు నియమముండదు. ఒక ప్రభుత్వము మారినపుడు దానియాక్టు మారుచుండును. అనియమితకార్యములకు సత్యత్వముండదు. "అర్థ్యస్థస్య కుతస్సత్వం" మిథ్యావస్తువునకు సత్యత్వము యునికియుండదు. కార్యములకు నియమితముండిన కారణమదియే యనవలసివచ్చును. కావున సృష్టిలోని విభూతులను నీ యోగముల గ్రహించినవారు సమ్యగ్దర్శనము బొందుదురందుకు సందేహములేదు.

ప్ర॥ ఇంతటిరహస్యము దెలియవలెనంటే నెంతకృషిగావలె! మోహాత్ములకు సాధ్యమా?

ఉ॥ భగవంతుని స్వరూపలక్షణముల తటస్థలక్షణములగు జగదిత్యాది కార్యసాధనముల గ్రహించగల్గితే భక్తియుక్తులై, ననన్యశరణ్యులై, మనస్సు ద్వంద్వములగు విషయవాసనలనుండి యకలంకముగా హరిరూపునొందును. అందున మోహనివృత్తిగలిగి యానందమొందెదరు. బుద్ధియందలి నణువదిగుణములు బుద్ధిగల దేహధారుల నందఱయందుండియే యుండును. ఒక పెట్టకోడి యున్నదనుకో. గ్రుడ్లు దానియందే యుండును. గ్రుడ్లను బెట్టుటలో దాని యుద్దేశ్యమేమి? తనరూపు తెలియజేసి త్యాగులై, స్వతంత్రులై, స్వేచ్ఛులై, నిరతానందము బొందగల్గెదరు అనే నమ్మకమున గ్రుడ్లయందలి జీవుల యదృష్టమునుబట్టి తన సంకల్పమున నెంత సృష్టి యవసరమో, నన్ని గ్రుడ్లను బెట్టి తన కడుపుక్రింద నుంచుకొని పొదుగును. సృష్టి యారంభముదాక గ్రుడ్లలో తనయందే నా జీవులుండురు. సమయమురాగానే తన్ను యన తల్లిని తెలిసియే జీవుడు కోఽహం కోఽహమ్మని యనునో వెంటనే యప్పుడు తనరూపు నచ్చుపడ తన ముక్కుతో, గ్రుడ్డులోనుండి వెలికిరా తయారైన పిల్లముక్కు సూటిగ బొడుచును. వెంటనే ప్రాణము "ఆత్మతః ప్రాణః" యని వచ్చును. అదియే శ్వాసరూపమునవాడ శరీరమున వ్యానవాయువునిండ శరీరము నుబక గ్రుడ్డుపగిలి ప్రయ్యలుగాగ వెలుపలికి సోఽహమ్మనివచ్చి, పిల్ల తల్లిజేరును. తల్లిని బాత్తిగా తెలియుని లేక తలపని పిల్లలు సదృష్టములో గ్రుడ్డులోనుండి తల్లిక్రిందనే యుండినను, వానికక్కడికే ప్రాప్తి గాని తల్లినికేకే ప్రాప్తి లేనందున తల్లిని పిలవటముండదు. ఎప్పుడు పిలువనో సమయము దప్పునో, మరిగిన గ్రుడ్లని తలచి వానిని తల్లియే నెట్టి

వేయును. తల్లిరకు సురక్షితముగానున్నవి యుండును. ప్రపంచమున ప్రతి జీవి యుండేవి హరియందే. హరియే మాయచే గ్రుడ్లవంటి శరీరముల బుట్టించి జీవులతోసహా శరీరముల తనయందే నుంచుకొనును. గ్రుడ్డునం దుండు పిల్లకు రెండుపొరలు తల్లిని కనుగొనకుండయుండును. ఒకటి పై బొప్పి, రొకటి లోని తెల్లనిపొర. అదేమాదిరి జీవునకు దేహముపై బొప్పి లేక సూక్ష్మశరీరము లోపలిపొర. లేక రొకటియవిద్య, రొకటి యహంకారము. ఈ రెండు పొరలలోనుండి హరిని గనుటకు చాలక బుద్ధి మోహపరవశుడైన జీవునకు దేవుడు దూరుడై యుండును. "తదేజతి తన్నైజతి తద్దూరే" అహంకారాభిమానముల దూరమొనర్చి భగవంతుని ప్రార్థించు వారికి చలనరహితుడై, నిరుపాధికుడై నింద్రియములవలన చలించినరీతి గనిపించు నా యాదిమదేవుడు తనలో జేర్చుకొనును. అవిద్యయె మోహకారణము. తన్నివారణార్థము నిన్నియుపాయములు భగవంతుడుజెప్పెను. గ్రుడ్డులోనుండు పిల్లకు తల్లి దెలియనిరీతి యవిద్యాహంకారాభిమానగ్రస్తులు దేవుడంటే నేమొ యెఱుగనే యెఱుగరు. దేహాభిమానత్యాగులకు మొదటక్షరముల, మరల శబ్దముల, మరల వాక్యముల, మరల సమాసముల నన్నియు నక్షరములేనని బాలురు గ్రహించినరీతి చీమ మొదలు బ్రహ్మపర్యంతము బ్రహ్మమని యెఱుగును. సర్వవ్యాపి పరబ్రహ్మ, పరమపావనుడు నాదిదేవుడని వేదములు, ఋషులు, నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడుగూడ నిట్లే నెఱిగిరి. నీవట్లే చెప్పుచున్నావని యర్జునుడంటూ నీ పుట్టుకను దేవదానవులు తెలియరు. నిన్ను నీవే తెలిసికొందువుగాని నిన్నవరెఱుగరు. కాని నీవు నీ విశ్వమున నేవేవి నీ విభూతులో నాయావిభూతుల వర్ణింప నీవే సమర్థుడవు. ఆయా విభూతుల నేను తెలిసికొన్నచో నిన్ను జ్ఞాపకము చేసుకోవచ్చును. ఏది వెంటనే ధ్యానింప నుత్సాహమగునో, యాలాంటి నీ దివ్యవిభూతులను వినుపింపుమనెను.

ప్ర॥ పతివ్రత తనభర్త యుంగరమునుగాని, ఫోటోనుగాని నుంచుకొనుటవలన వానిని జూచినపుడు పతిని సేవింప భక్తి గలుగును. తద్రీతి విభూతులను దెలుప భగవంతుని దెలుసుకొనుటకు, జ్ఞాపకము వచ్చుటకు నిది చక్కని సాధన. 8 నుండి 11 శ్లో॥ వఱకు తాము జెప్పలేదెందుకు?

ఉ॥ అజ్ఞానముతొలగి జ్ఞానము గలుగుటకుగల రహస్యముల నందుజెప్ప బడియున్నది. సమస్తజగత్తునకు సామర్థ్యము నుత్పత్తిస్థానము భగవంతుని వలననె గలుగుచున్నవి. ఈరహస్యము తెలిసినవారేల భక్తియుక్తులై సేవింపకుందురు. దేహములుమూడు ప్రాణముల నంతరేంద్రియ బాహ్యేంద్రియముల భగవంతునకే నర్పించి, యింద్రియములు భగవత్స్వాధీనములైనచో షడ్గుణైశ్వర్య సంపన్నయుతుడగు భగవంతుని కథాప్రసంగముల జననాదుల ప్రసంగ మొనర్చుచు, సంతోషమున నానందము బొందుదురు. ఆ యానందము నూరకనే కలుగునా? ప్రీతిపూర్వకముగ నిత్యయుక్త మనస్కులరై యెవరు సమస్తయాశల త్యజించి భగవంతుని భజించెదరో వారికి తత్త్వవిషయకమగు జ్ఞానమును భగవంతుడే ప్రసాదించును. జ్ఞానముగల్గినా, భగవంతుని నాత్మరూపునిగ గ్రహింతురు. భక్తుల ననుగ్రహింప మన బుద్ధివృత్తులయందుండి సమ్యగ్దర్శనదీప్తితో నుజ్వలమగు వివేకదీపమును వెలిగించి యవివేకజనితము, మిథ్యాప్రత్యయ రూపమునగు మోహాంధకారమును బోగొట్టును. భక్తియంటే చిన్న విషయముకాదు. మఱువరాని ప్రేమ యుండవలె. 12 నుండి 18 శ్లో॥ వఱకు విభూతిని విన నర్జునుడుత్సహించుటచేత 19 నుండి 40 శ్లో॥ వఱకు విభూతులను భగవంతుడు వచింపసాగెను.

ప్ర॥ భగవంతుడర్జునుడడిగినంతనే విభూతుల వినిపింప నుత్సహించెనా?

ఉ॥ స్తన్యములలో పాలులేనితల్లిని బిడ్డడు పాలడుగ తల్లి పలుకదు. స్తన్యమున పాలుగలతల్లి వానికొఱకే నుంచుకొన్నదిగాన, బిడ్డడడుగలేదే యనుకుంటుండ కుఱ్ఱవాడడుగకనే పాలు తమంతటయవి స్రవించును. భక్తకల్పద్రుమమగు భగవంతుడు మన్నుతింటినా యమ్మా! అన్నాదు లపద్దమాడెదరు, తినియుండిన నోటనుండవలదా? చూడుమని నోఱు తెఱచి విశ్వరూపమును తల్లికి జూపించె. తాను కొడుకు, యశోద తల్లి యనే మోహమును మాన్పిన యా నందగోపాలుడే యుద్ధమధ్యమున నడుగుచున్న నర్జునునకు తన విభూతులను వినిపించెను.

ప్ర॥ తాము నాకు వివరింపుడు. ఆయన ప్రారంభించినదెక్కడనుండియో, వీని విభూతులను వినే భాగ్యము మున్నెన్నడొనర్చితినో! కుల మసురత్వమైనను విభీషణునకు రాము సందర్శనభాగ్యము, శబరికి గలిగిన

ప్రాప్తము పురాకృతసుకృతము. రామకృష్ణగురు కరుణబొందిన స్వామి వివేకానంద "మన్ చలో నిజనికేతనె సంసార విదేశే విదేశీ వేషె భ్రమ కెనొ అకారణె" మనసా! స్వస్థానమునకు వెడలుదరమ్ము, విదేశమగు నీసంసారమున భరుడవై యేల పరిభ్రమించెదవని పాడెను. భగవంతుని కటాక్షముగలిగినవారు ధన్యులు.

ఉ॥ విభూతులవలన ప్రయోజనముండదా? ఒక్కొక్క విభూతిని భగవంతునిగా భావించి యుపాసింపవచ్చు. ఏ కొన్నింటినైన కలిపి నుపాసింపవచ్చు. ఒకదానితర్వాత నొకదాని నుపాసింపవచ్చు. లేక నన్నిటిని యుపాసింపవచ్చు, లేదా విశ్వమునే యుపాసింపవచ్చు. సాధకుల కంతరంగ శుద్ధిగలిగి మోహానివృత్తులై జ్ఞానముద్వారా జగద్భ్రాంతి నశించి పారమార్థిక పరబ్రహ్మప్రాప్తి ఘటిల్లును. ప్రతి పూసలోనుండు దారమువలె ప్రతి శరీరమున నేనునేను యనునది యెవరని గ్రహింపు తొలుత. ఒక బాలికనుగాని, బాలునిగాని పిలిచి నీ పేరేమను. నాపేరా! యని యెదమీద చేయివైచుకొనును. చేయిని తెచ్చి రొమ్ముమీద నుంచినదెవరు? తనపేరు దేహమనియా, రొమ్మనియా? ఎందుకు చేయి అక్కడవచ్చినది? నాస్తికుడుగాని, యాస్తికుడుగాని తన చేయినక్కడవుంచనిది చెప్పలేడు. నాస్తికునికి స్థలముండకూడదుగదా? ఆస్థలమాస్తికముగాదా? నేనుయనే సామాన్య జ్ఞానమెవ్వరిది? విశేష జ్ఞానములేక దేహమునేననటము నదియేయవిద్య, యహంకారము. మరొక మాట. నేను మనుష్యుడ, ఫలానివాడ, ఫలానిదేశము, ఫలానిజాతి మతము నను భ్రాంతినివృత్తికి విభూతులవలన సర్వము హరియేనని తెలియ గలరు. హరియెందో, నేదేశములోనో, నేరూపుననో నున్నాడనుభ్రాంతి తొలగును. ద్వైతబుద్ధి, నానాత్వబుద్ధి, బంధబుద్ధి నశించి పూర్ణసుఖము నొందుదురు.

ప్ర॥ ఆహాహా! మతము లనేకములై యథార్థమెఱుంగక తారసిల్లు చుందు రెందుకు? గీతాశాస్త్రము జదువరేమొ? వామనావతారమున పెరిగిపెరిగి మూడులోకముల నాక్రమించిన పాదముగల జగన్నాటకుని తంతునెఱుగుట కాయన కృపగావలె. ఆయన మంచిదంటే దరిద్రుడు

ధనవంతుడగును. అవిద్యావంతుడు విద్యావంతుడగును. పరమలోభి దాతయగును. నరకము స్వర్గమగును. మంచిదనలేదా! యపూర్వవస్తువులేకాదు, నేమైన తృణీకరములగును. వచింపుడి. విభూతుల వినెదను.

ఉ॥ నీవన్నమాట నిజమే! గీతాశాస్త్రము లేకపోలేదు. కాని దానిని పట్టి చదివి యందలి రహస్యముల గ్రహించలేదు. ఎవరైనజెప్ప వినలేదు. జీవనదాయకమగు గీతాశాస్త్రము వినక, చదువక, చూడక, వ్రాయక, వినిపించక, గ్రహించక తనయింటనుంచనివాడు ఏదేశస్తుడనవలయునో, అతనియింటి నేమనవలెనో ప్రపంచమునకే వదలుదాము. అంగడిలో నష్టభాగ్యము నల్లుని నోటిలో శనియున్నరీతి యార్షేయదేశమున యచ్యుతుని హృదయమగు భగవద్గీతయుండి వివిధములగు మతగ్రంథములను, నానానికృష్టమార్గములబోయి పూర్ణసుఖము లేక పోవుచున్నది. భగవంతు డర్జునునకు తన విభూతులను వినిపించుచున్నాడు. విస్తారమగు వానియందు కొన్ని జెప్పెద.

ప్ర॥ అనగా దివ్యములైన యనంతవిభూతులు గలవనుట. ఇట్టి లోకము లెన్నిగలవో నెవరికెఱుక ? ఆయనకే నెఱుక.

ఉ॥ జీవులందఱిహృదయమందుండు నాత్మను నేనే యనెను. ప్రాణుల యుత్పత్తిస్థితిలయకారణుడను నేనే యనెను. ప్రతిశరీరమున నేను నేనను నది తానే, ద్వాదశాదిత్యులలో విష్ణువును, జ్యోతులలో విశ్వవ్యాపకుడగు సూర్యుడు, మరుద్గణసప్తకమున మరీచియు చంద్రుడును, వేదములలో సామమును, ముప్పదిమూడుకోట్లదేవతలలో దేవేంద్రుడును, యేకాదశేంద్రియములలో సంకల్పవికల్పము లొనర్చు మనస్సును, ప్రాణుల శరీరమునందు జ్ఞానశక్తియు, ఏకాదశరుద్రులలో శంకరుడును, యక్షరాక్షసులలో కుబేరుడును, అష్టవసువులలో నగ్నియు, శిఖరముగల పర్వతములలో మేరువును, మహర్షులలో భృగువును, శబ్దసమూహమున నేకాక్షరమును, బ్రహ్మవాచకము నగు నోంకారమును, యజ్ఞములలో జపయజ్ఞమును, స్థావరములలో హిమాలయమును, వృక్షములలో నశ్వత్థమును, దేవర్షులలో నారదుడును, గంధర్వులలో చిత్రరథుడును, సిద్ధులలో కపిలుడును, యశ్వములలో నుచ్చైఃశ్రవమును, ఐరావతమను యేనుగును, మనుష్యులలో రాజును, ఆయుధములలో వజ్రాయుధమును, ఆవులలో

కామధేనువును, మోహనాకారములో మన్మథుడును, సర్పములకు నధిపతియగు వాసుకియు, నాగులలో ననంతుడును, జలదేవతలలో వరుణుడును, పితృదేవతలలో నర్యముడును, శాసించువారిలో యముడును, దైత్యులలో ప్రహ్లాదుడును, గణకులలో కాలమును, మృగములలో సింహమును, పక్షులలో గరుత్మంతుడును, పవిత్రవంతులలో వాయువును, ఆయుధధారులలో శ్రీరాముడును, మత్స్యాదులలో మొసలి యనబడు మత్స్యజాతియును, నదులలో గంగను, సమస్త సృష్టిస్థితి లయకారణుడును, విద్యలలో నధ్యాత్మవిద్యయును, తార్కికుల వాదజల్పవితండములలో వాదమును, అక్షరములలో నకారమును, సమాసములలో నుభయపదప్రధానమగు ద్వంద్వమును, ప్రవాహరూపకాలమును, సర్వతోముఖుడగు కర్మఫలదాతయు, సంహారకులలో సర్వసంహారకుడగు మృత్యువును, భవిష్యత్తున గొప్పతనమును గల్గించెడి కళ్యాణగుణములలో నభ్యుదయమును, స్త్రీలలో కీర్తి, శ్రీ, వాక్కు, స్మృతి, మేధ, ధృతి, క్షమయు, రథంతరాది సామసమూహమున బృహత్సామమును, ఛందోవిశిష్టములగు ఋక్కులలో గాయత్రియు, మాసములలో మార్గశీర్షమును, ఋతువులలో వసంతఋతువును, వంచనపరులగు వారిలో జూదమును, ప్రభావశాలుర తేజమును, జయశీలుర విజయమును, ఉద్యమపరులనుద్యమమును, సాత్త్వికులగు పురుషుల సత్త్వగుణమును, యాదవులలో శ్రీకృష్ణుడును, పాండవులలో నర్జునుడును, మునులలో వేదవ్యాసుడును, కవులలో శుక్రుడును, శిక్షించువారల దండనీతియును, జయించ నిచ్ఛగలవారల రాజనీతియును, గోప్యమైన వస్తువులలో మౌనమును, జ్ఞానవంతుల జ్ఞానమును, సమస్తభూతములకు మూలకారణమగు నదేదో యదియును నేనేనని భగవంతుడు జెప్పెను. మఱియు తాను గాక చరాచరము లేనేలేదనెను. "పాదోఽస్య విశ్వా భూతాని" సర్వభూతములు బ్రహ్మముయొక్క పాదమే. ఈ విధముగ తన విభూతులను నెఱింగించినంతనే ధనంజయుడు పులకితగాత్రుడై విస్మయమును ముప్పిరిగొనిన సంతోషమును యొక్కతూరి ముఖమున దిగ్దర్శన మొనర్చెను. చేతులుజోడించి పునఃపునః తదేకదృష్టితో జూచుచు నమస్కరించెను. మఱి మౌనమువహించి కొంతవడి కూరకుండెను. తాను యేమి

చేయుచున్నది, యేమి వినుచున్నది, యెట్టి పరిస్థితి యనే విషయమునే మఱచెను.

ప్ర॥ తాము చెప్పిన విభూతుల నొక్కొక్కదాని మాహాత్మ్యమును వివరించిన బాగుండును.

జ॥ నిజము. కాని గ్రంథవిస్తరమగును. అయిన నొకరహస్యమును విను. ఏ దేశముననైన నాదేశగవర్నమెంటొకటుండును. గవర్నమెంటను నది ఆబాలగోపాలము. వ్యావహారికముగ చూచినరీతి మాటలాడుట వినుచున్నాము. గవర్నమెంటున ప్రధానమైనది లోకసభ, ప్రసిడెంటు, ప్రధానామాత్యుడు. ఆయనవెనుక నొక్కొక్కశాఖకు నొక్కొక్క మంత్రి యుండును. ఒక్కొక్కరాష్ట్రమున కొక్కగవర్నరుండును. ఒక్కొక్క జిల్లా కొక్క కలెక్టరొక్క తాలూకా కొక్క తహశీల్‌దారు, నొక్క గ్రామమున కొక్క ప్రసిడెంటు నొక మునసబునుందురు. ఒక్కొక్కయింటికి పురుషుడో, స్త్రీయో యజమానుడుగ నుండును. గవర్నమెంటు మన కగపడదు. పరిపాలన కాలమును దేశమును ప్రాంత్యమునుబట్టి జరుగుచుండును. ఇంతకు నధికారమంత గవర్నమెంటుదే. గవర్నమెంటు కనిపింపకపోయినను గవర్నమెంటు రూలులేదా! శాసనము నమలుపఱచు నుద్యోగులుమాత్రము ప్రతిశాఖకు గనిపింతురు. ప్రతియొక చిన్నయుద్యోగిపై నొక పెద్దయుద్యోగి యుండును. చిన్నయుద్యోగికంటె పెద్దయుద్యోగికి పవరు లేదా యధికారము నెక్కువయుండును. ఆ యధికారమె గవర్నమెంటుసత్త లేక శక్తిచేత నా యుద్యోగులవలన శాసనమువలన నా దేశము పరిపాలింపబడుచుండును. తత్ప్రకారము నీశ్వరగవర్నమెంటొక టున్నదనుకో. పార్లమెంటులో మంత్రులవలె నొక్కొక్కశాఖకు నొకరిద్ద రధికారులవలె, బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు లేక సూత్రాత్మ వైశ్వానర యంతర్యామి యనువారు, నష్టదిక్పాలురు, సూర్యుడు, చంద్రుడు, పంచభూతములు, నదులు, పర్వతములాది గొప్పవస్తువు లీడిపార్టుమెంటునకు నీశ్వర సత్తా లేక శక్తి గలిగియుండురు. ఈ రూపకాలంకారము కఠోపనిషత్తున, పురుషోత్తమప్రాప్తియోగమున ప్రథమశ్లోకమున "ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్" అను దానిలో పరమేశ్వరుడే మూలకారణ మీ సంసారవృక్షమున కని యభివర్ణింపబడినది. భగవత్సృష్టి ఎవరి

యం దెక్కువయుండునో, వారే తక్కినవారికి సహాయభూతులుగా నుందురు. మఱొకవిధము. సూర్యుడుగలడు. ఆయన ప్రకాశము తన కెదురుగ సమీపమునయున్న వస్తువులపై విశేషించిపడును. సూర్యునకు కడుదూరములోనున్న నాయన ప్రభ తక్కువయుండును. ఇట్లే పోను పోను దూరము గలవానియందు ప్రకాశము తక్కువగును, సమీప వస్తువుల యందెక్కువగనుండును. మఱొకమాట. సూర్యున కెదుర కోట్ల కొలది యద్దములుండినను, యుత్తమ, మధ్యమ, యధమ, యధమాధమముల నద్దములు శుద్ధమలినముల నుండిన, శుద్ధమగువానియందు స్పష్టముగను, అటులే శుద్ధము తక్కువగుచు రాగా ప్రకాశము తక్కువయుండును. ఆ ప్రకారము భగవద్విభూతులుగల వస్తువులు భగవంతునకు సమీపములై, భగవచ్ఛక్తి నెక్కువగలవి యే జాతియైనను విభూతిమంతులే. స్థావరములలో మేరువు, పక్షులలో గరుడుడు, పాములలో ననంతవాసుకులు, మృగములలో సింహము, యావు, యేనుగు లిత్యాదులందు పరమాత్మ యెక్కువ ప్రకాశించుచుండబట్టియే తక్కిన జీవులకు నవి యాదర్శకములుగను, జీవనదాయకములుగను, పరమాత్మ ప్రతినిధులుగను, పరమశ్రేయోదాయకజీవులుగను, పరమోపకారులుగను, పూజనీయములుగ నుండుచున్నవి. ఈ విభూతుల దేవుని సమముగనెంచి, పూజించి, సేవించి, ప్రేమించి, భావించి, దర్శించిన భగవత్స్వరూపమును సందర్శించగలరు. మోహాత్ములై భ్రాంతితో నీశ్వరగవర్నమెంటును మఱచినను, తెలియకపోయినను భగవంతుని కనుగొనలేరు. భగవంతుడు తన సత్తా నెక్కువగల వస్తువులద్వారా సమస్తప్రపంచమును బాలించుచున్నాడు. భగవద్విభూతులను సంపూర్ణముగ గ్రహించినవారు విశ్వమంతయు భగవద్రూపముగనే యెంచి సేవింతురు. గవర్నమెంటునకు రూపములేదు, కనిపింపదు. అట్లే భగవంతుడు కనిపింపడు. రూపములేదుగాని, సర్వమును తానే యైయున్నాడు. "జాగ్రత్స్వప్నసుషుప్త్యాది యత్ప్రపంచం ప్రకాశతే। తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా" జాగ్రత్స్వప్నసుషుప్త్యాది యవస్థల ప్రకాశించు నే ప్రపంచముగలదో నా ప్రపంచప్రకాశమునకెయ్యది కారణమై నదియే బ్రహ్మము. ఆ బ్రహ్మమే లేనిచో రసాభావముగల నీ విశ్వము ప్రకాశింపనేరదు.

ప్ర॥ అయితే నేయొక్క విభూతియు పరమాత్మప్రకాశములేక ప్రకాశింపలేదా?

ఉ॥ అవును. పరమాత్మప్రకాశముచేతనే ప్రకాశించును. పెద్దపెద్దలైట్లు చిన్నచిన్నలైట్లు గ్లాసుశుద్ధిలేనివి అంతటియందు నగ్ని యుండియేయున్నది కదా. శుద్ధిలేనివి శుద్ధముగ ప్రకాశించుటలేదు. శుద్ధముగలవి తేజస్సుగా నుండును. భగవచ్ఛక్తి యొక్కువగలవి మనకు కనిపించుచున్నవికదా. విభూతులకు పరిమితి లేకపోయినను సంగ్రహముగ జెప్పెను భగవంతుడు. వానిని దెలిసి పరమాత్మనుగ్రహించి భజింపవలె. 40 నుండి 42 వఱకు విశ్వమంతయును భగవంతుని నేకాంశమనియు నెఱిగించెను. విభూతులెక్కువ నెఱుగుటవలన నాస్తికత్వముతొలగి, యాస్తికత్వము గలుగును. నిరాకారమైన భగవంతుని తెలియలేకపోయిన నీ విభూతుల నారాధించినను శ్రేయస్సు లభించును. చిన్న యుద్యోగస్థునకు మన కాండెక్టు మంచిదిగాతోచిన గవర్నమెంటునకు సిఫార్సుచేయును. తద్విధముగ నీ విభూతుల దైవముగ నర్చించిన భగవత్ప్రాప్తి నొందెదరు. అందుకేగదా మన దేశమున నగ్నిహోత్రమును, సాయంత్రము దీపమును, నఖండిలమును, సూర్యుని, గంగను, దేవతలపేరున విగ్రహములను, తీర్థములను సేవించటము. వీనిని భగవద్రూపములుగనెంచి భజించియేకదా యనేకులు ముక్తులైరి.

ప్ర॥ కొంతమంది విగ్రహారాధన యవసరములేదనెదరే వారి యుద్దేశ్యమేమి?

ఉ॥ వారిమాట సత్యమే. విగ్రహాది భగవద్విభూతులపైననే భక్తిభావనలేని సామాన్య జనులేమి, పండితులేమి కంటికగపడని భగవంతుని నారాధించుట సాధ్యమా? మేడపైన విహరింపవలెనన్న మెట్లకలనే యుపాయములులేక పైకిబోగలరా? మనమనుకున్న స్థలములకు బోవలెనన్న బస్సు, సైకిలు, వాహనములాది సాధనములద్వారా గమ్యస్థానము జేరిన వీనిని వదలుచున్నాముకదా? ఉపలక్షణములుగాను, తటస్థలక్షణములుగానున్న నీ కల్పితవస్తువులయందుగాని, భగవద్విభూతులయందుగాని భక్తిభావన లేనివారు భగవంతునర్చింపగలరా? పావుకూడు దినువారికి భిక్షయివ్వలేనివారు, శేరన్నము తినువారికి భిక్షయివ్వగలరా? నడువలేని

వాడు పరుగెత్తగలడా? కళ్లులేనివాడు చూడగలడా? మహాత్ములైన వారికితప్ప తక్కినవారికి నిరాకారుడగు భగవంతుని యర్చించుట కష్టమే. అయితే నొకేసారి నిరాకారుని గనుగొనవలదని యెవరి యుద్దేశ్యముకాదు. నిరాకారమును గుర్తించిన తత్త్వవేత్తలు లోకమేమిటియని గ్రహించలేనపుడు పూర్ణజ్ఞానులు కారనవలసివచ్చును. ఆకసమున గనుపించు నామరూపములు నాకసమును కాదనగలవా? ఆకసమునకన్న సూక్ష్మమై "అణోరణీయాన్ మహతో మహీయాన్" అణువుకన్న యణువై మహత్తుకంటె మహత్తైనవాడైనపుడు నామరూపాది జగము నెవ్వారి రూపని గ్రహించలేని యేకదైవారాధకులు బాగుగా విచారింపవలెను. 'ఎద్దుయీనినదనిన కొట్టాన గట్టివేయు'మన్న రీతి చెప్పినంతనె వినకూడదు. నాలోచించవలె, విమర్శించవలె. మహాత్ముల సందేశముల వినవలె, నంతఃకరణదోషముల నరికట్టవలె, నా పిమ్మట గమనింపవలె. మానవుల శరీరములనెచ్చోటనేమచ్చయున్న రీతి, భగవంతునియందీ విశ్వమున్నదని యర్జునునకు భగవంతుడు చెప్పెను. "అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున! విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్" జగత్తు భగవంతుని యేకాంశమే: "సర్వం విష్ణుమయం జగత్" అన్నదిందుకే.

ప్ర॥ పదునాలుగు లోకములతోటి బ్రహ్మాండమంత యచ్యుతుని యేకాంశమంటే సంశయమే. అచ్యుతుడెంతవాడైనది గనిపింపదు. లోకమా గనిపించుచున్నది. ఇంతలోక మాయనం దేకాంశమంటే నమ్మవచ్చునా?

ఉ॥ సముద్రజలమునుండి నురుగువచ్చును, ఉప్పుగల్లును. అది నీటికంటె కఠినమైనది. వాటినిబట్టి జలమునకు పృథ్వికార్యమనుటకాదా? కాబట్టి పృథ్వికంటే జలము సూక్ష్మము, వ్యాపకము. వస్త్రములో నీరుపోస్తే కారిపోవును. కాని భూసంబంధమగు మట్టి, రాళ్ళు నీళ్ళవలె దిగజారిపోవునదా? భూమి నెచ్చోట త్రవ్వినాకూడా తప్పక నీరువచ్చును. భూప్రదేశముకంటె పదిరెట్లు జలప్రదేశ మధికమని శాస్త్రపురాణములనుచున్నవి. ఇన్ని కారణాలవలన పృథ్వికంటె జలము సూక్ష్మము, వ్యాపకము. వేడిమికి దేహములో చెమటగారును. ఉక్క యధికమైతే వర్షమువచ్చును. దీన్నిబట్టి జలము యగ్నియొక్క కార్యము. కావున జలాని

కంటె నగ్ని సూక్ష్మము, వ్యాపకము. నీరు కుండలో బంధింపబడును. కాని తేజస్సు యావిధముగ బంధింపబడునా? బంధింప సాధ్యముకాదు. జలానికంటే తేజస్సు పదిరెట్లు అధికమని చెప్పుచున్నవి శాస్త్రములు. అందుచే జలమునకంటె నగ్ని సూక్ష్మము, వ్యాపకము. అగ్నియొక్క యావిర్భావ తిరోభావాలు వాయువున కధీనము. కావున తేజస్సు వాయువునకు కార్యము. సూర్యాదుల తేజస్సు ఘటాదిపాత్రల్లో బద్ధముకాకున్న కంటికి గోచరింపగలుగును. వాయువు కంటికి కానవచ్చేదికాదు. తేజస్సు కంటే వాయువు పదిరెట్లు నధికవిస్తారమని పురాణప్రసిద్ధి. ఇందువల్ల తేజస్సుకంటే వాయువు సూక్ష్మము, వ్యాపకము. వాయువుయొక్క ఉత్పత్తిస్థితిలయములు నాకసములో సంభవించును. వాయువునకంటె నాకసము సూక్ష్మము. ఆకసమునకు వాయువు కార్యము. కార్యమున కంటే కారణము సూక్ష్మము, వ్యాపకము. వాయువు చూపునకందనిదే యైనను చర్మానికి గ్రాహ్యమగును. ఆకాశాన్ని చర్మశక్తి గ్రహించలేదు. పురాణశాస్త్రాదులు వాయువునకంటే పదిరెట్లు నాకాశమును విస్తారముగ జెప్పినవి. ఇందువలన వాయువునకంటే అది సూక్ష్మవ్యాపకము. ఆకసమునకు పైన ఏమున్నది? ఏమున్నదో తెలియదనేది జవాబు. బుద్ధి యంత వఱకు నూహించి చెప్పగలిగింది. అచ్చటికి వచ్చేటప్పటికి కుంఠితమైనది. ఆ కుంఠీభావానికి నాశ్రయవిషయమేది? అదియే నజ్ఞానము. ఆకాశము అజ్ఞానముయొక్క కార్యము. ఆకసము చర్మగ్రాహ్యము కాకున్న మనోగ్రాహ్యము కాగల్గును. అజ్ఞానము మనస్సున కందరానిది. అజ్ఞానము నాకసమునకంటె ననంతగుణిత మధికవిస్తారమని శాస్త్రము లనుచున్నవి. కావున యజ్ఞానము నాకసమునకంటె సూక్ష్మము, వ్యాపకము. అదేమో నాకు తెలియదు అనే అనుభవానికి విషయమైన యజ్ఞానాన్ని ప్రకాశింపజేసేది జ్ఞానరూపకమైన చేతనమే. ఆ చేతనమే పరమాత్మ. అజ్ఞానమున్నది, అది తోచును. అది అజ్ఞానికి ప్రియముగనుంది. ఈ విధముగ నజ్ఞానములో నస్తిభాతిప్రియరూపముగ ననుస్యూతమై బ్రహ్మ చేతనము ప్రకాశించుచున్నది. బ్రహ్మ నాశ్రయించి యజ్ఞానమున్నది. అజ్ఞానమునకంటె బ్రహ్మచేతనము, సూక్ష్మము, వ్యాపకము. మనస్సుతో జ్ఞానాన్ని గ్రహించ వీలులేదు. దాని నేనెఱుగను అని యనవద్దు. అది


యొక్క అనుభవమేకదా? అనగా నదియొక్క సత్తే. ఆ సద్రూపముగా సర్వా నము యూహింపబడును. పరమాత్మ స్వయంప్రకాశము. ఆకసమున సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములుంటున్నవి ఏకదేశములా కాదా? చంద్రునియొక్క యేకదేశములోని శుక్లపక్షకదా తనవంటి బాలబాలికల మనసుల గల్గించుచున్నది, ఆకసము నెల్లదిశల నిండియున్నది. ఆకసమునకు తెలియకుండ వచ్చిన మేఘము నేకాంశమున యున్నదా? లేక ననే కాంశమా? ఏకదేశీయమేకదా. ఆ యేకదేశీయమగు మేఘము శుద్ధ తెలుపుగాను, మలినముగాను యేర్పడి యురుములు, మెఱుపులు, పిడుగులు, గరకలు, వర్షముతో బయలుదేరి వంకలు, వాగులు, చెఱు వులు, కుంటలు, నదులు మొదలైన రూపముల ప్రవర్తించే వ్యవహార మంతయు నాకసమున నేకదేశమగుటచేతనే నొక వంక వర్షమైన నొక వంక వర్షముండదు. ఆకసముండే ప్రదేశమంత కురవలేదు; ఆకసము నంటలేదు. మేఘము సాంతవంతములగు వస్తువులు పరిమితములు, సాపేక్ష ణీయము. లేదివియు నిరపేక్షములైతే పరమాత్మ అనవలసినదే. వ్యాపక వస్తువు నవ్యాప్తవస్తువు లల్పములేనని గ్రహింపుము. ప్రపంచమును సాధనముగ తీసుకొని పరమాత్మను గ్రహించవలెను. నిరపేక్షకుడు హరి. “పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే” పరమాత్మ పూర్ణుడు. ప్రపంచము దానికది పూర్ణమే. పారెడు నదీజలము పూర్ణము. బిందెలోని నీరు పూర్ణము. అయితే నీ బిందెను నదిలోనుంప సాంతమై బిందెనీరు మెన్నవయంశమై యుంటున్నది. ఏది ‘అవశిష్యతే’ మిగులు చున్నదో నదియేకదా? విత్తనము చిన్నదే. చెట్టు గొప్పది. అయితేనేమి? విత్తనము దృష్టిలో వృక్షము చిన్నదియే.

ప్ర॥ ఆపేక్షికవ్యాపకమంటే నేమి?

ఉ॥ ఒక వస్తువున్నది. రెండోవస్తువుయొక్క దీటులో చాలపెద్దది. కానీ వేఱే మూడవవస్తువునుజెప్పి దాని దీటులో చూస్తే చిన్నదిగానె తెలును. అట్టి యా మొదటివస్తువును యాపేక్షికవ్యాపక మనెదరు. ఒక అణావున్నది. ఒక రూపాయఉన్నది. అణా రూపదృష్టిలో, దానిదీటులో రూపాయ చాలపెద్దది. కాని యొకతులము బంగారు తెచ్చియుంచితే దాని

దీటులో మాయ చాలచిన్నది. అట్టి మాయకు నపేక్షికవ్యాపకత్వాన్ని జెప్పెదరు. భూమికంటె నీరు పదిరెట్లు విశాలము. అప్పుడు భూమి పరిచ్ఛిన్నమైనది. నీరు విశాలమైనది. ఆ జలము తేజస్సుయొక్క కార్యము. జలానికంటే తేజస్సు పదిరెట్లు పెద్దది. తేజస్సు దీటులో జలము పరిచ్ఛిన్నమైనాకూడా భూమియొక్క దృష్టిలో వ్యాపకము. కావున జలాన్ని యపేక్షికవ్యాపకమనెదరు. తద్రీతి, పృథివి మొదలగు వాని యపేక్షికతో మాయ మఱింత వ్యాపకమైనది. విస్తారమైన, విశాలమైన అధికప్రదేశాన్ని మాయ యాక్రమించినను పరమాత్మతో పోల్చి చూచితే మాయ పరిచ్ఛిన్న వస్తువే. కాబట్టి మాయను యపేక్షిక వ్యాపక మనెదరు. మాయాకార్యమగు జగత్తు భగవంతునియందు పరిమితమై యేకదేశమున నున్నది. వింటివా? జగద్రూపకుడగు భగవంతునకు కృతజ్ఞతాభివందనములు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
విభూతియోగో నామ
దశమోఽధ్యాయః



ఓమ్

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## ఏకాదశాధ్యాయము

### విశ్వరూప సందర్శన యోగము

---

ఉ॥ భూతకథాతికంబగు విభూతులతోటి జగంబు సర్వముగా
చేతనరూపుడైన హరి చిత్రవివర్తనగాక వేఱు లే
దాతతనామరూపముల యాకృతభేదములన్ని తానె వి
ఖ్యాతవిభుండు కృష్ణుడు నగణ్యగుణాకరు డోజవేడుడీ.

ప్ర॥ విభూతులను వినిపించి తనరూపము నిర్దేశించిన హరిని యర్జును డేమి యడుగలేదా? వినవలెనని మన ముచ్చిళ్లూరుచున్నది.

ఉ॥ అతులితవైభవంబులు సముజ్వల తేజోమయములగు విభూతులను విన్న వెనుక నీ సంపూర్ణరూపముజూడ యోగ్యుడనని తలచేయెడల షడ్గుణైశ్వర్యయుక్తమగు రూపమును జూపుమనెను. శ్రీమద్రామాయణమున నశోకవనముననున్న సీతను హనుమంతుడు జూచి రామువార్త దెచ్చితినన, నీవెట్లు వచ్చితివి? లంక నెటు శోధించితివి? వన్నెలా గంటివన, కామరూపమున యన, నీ నిజరూపు జూపుమనియు రాముకార్యము సాధింప సమర్థుడవని యెట్లెఱుగ నగునన, తన నిజరూపము హనుమంతుడు జూపెను. అర్జును డదేరీతి యడిగెను.

ప్ర॥ భగవంతుడందుకు నంగీకరించెనా? విశ్వరూపమునుజూప తన రూపము మారునా? విశ్వరూపమును సందర్శింప కుతూహలమగుచున్నది.

ఉ॥ 'విశ్వ' మన సమస్తము నుండునదియే, లేనిదికాదు. లేనిది యాలుక్కి. దాని నెట్లు జూపనగును? రూపమన సమస్తరూపముల సందర్శనము జూపుటానికి యోగమ్మనిపేరు.

ప్ర॥ ఓహోహో! భాగవతమున నారదులవారు నీవు లేనియింట నేనుండదలచితినన, భగవాను డుండుపొమ్మన, నారదు డెందుజూచిన నాయనయుంట నెఱింగి విశ్వము హరిమయమని పోయెను. ఆ మూర్తియే నీ మూర్తి. పార్థుని యదృష్టమెట్టిదో! హరితో గలసిమెలసియుండుచు, నిరంతర మవతారరూపమును జూచుచు, విభూతుల విని, తుదకు నాయన విశ్వరూపమును జూడదలచటము, హరి జూపించటము, సారథియంటే నట్లుండవలె, రథికుడంటే నిట్లుండవలె. సరే అర్జునుడు తన చర్మచక్షువులతోనె విశ్వరూపమును జూచెనా?

ఉ॥ 1 నుండి 4 శ్లో॥ వఱకు అర్జునుని విశ్వరూపసందర్శన ప్రార్థన. నీవు కూడా చూతామనియా? ఔనౌను. ఎవరికైన జూడవలెననే యిచ్ఛ యుండకపోదు. కానీ మనట్టివారలకు నంతభాగ్యమా యని తమలో తామనుకొనువారు నిరుత్సాహులై చేయునదిలేకయుందురు. కృష్ణార్జునులనే నరనారాయణులందురు. నరుని విడిచి నారాయణుడు, నారాయణునివదలి నరుడుండలేడు. అనగా దీనియందలి యాంతర్యమేమి? నరత్వమునగాని నారాయణుడు తెలియబడడనియు, నరత్వమున నారాయణుడు తన్ను తాను గాంచగలడని యర్థము. ఐతరేయమున వ్యాపకమూర్తివైన నీవేల నిన్నిరూపములు దాల్చి నరదేహమున బ్రహ్మరంధ్రముగుండ ప్రవేశించి యుండవలెననియంటే 'త్వం'పదార్థమును గ్రహించుటకనెను. వేదాంతపంచదశి "పరమాత్మాద్వయానంద పూర్ణపూర్వే స్వమాయయా। స్వయమేవ జగద్భూత్వా ప్రావిశజ్జీవరూపతః" నిర్విశేషంబును సత్యజ్ఞానానందమయంబగు బ్రహ్మము నద్వితీయుడైన బ్రహ్మమే ననిర్వచనీయమగు మాయవలన జగత్తును సృష్టించి యా జగత్తులో మాయావశంబున తానే శరీరమున వ్యష్టిగ ప్రవేశించుట జీవుడాయెను. మఱియు "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అద్వితీయుడైన బ్రహ్మమే "ఏకోఽహాం బహుస్యామ్" ఒక్కడైన నేనే పెక్కురూపులగుదునని సంకల్పించెనట. ఇందువలన విశ్వము నెవ్వనిరూపమనునది యీ ప్రమాణముల ద్వారా గ్రహించవలెను. ఒక్క నరుని యదృష్టమే కాదు, మన యందర యదృష్టము. సురముని, సంయమీంద్రులు, త్రిమూర్తు లెఱుంగని రహస్యమును వినటము, తెలిసికొనటము, ప్రయత్నించి యీ విశ్వరూపమును

దర్శించుటకు నందకభాగ్యమే. పశుణామునకు ప్రతిభటభయంకరమైన యుద్ధభూమిని అర్జునుడు విశ్వరూపమును సందర్శించెనంటే యుద్ధభూమిలో లేదు, కృష్ణుని విశ్వరూపు జూపు నేర్పులో లేదు, కాలములో లేదు, అదృష్టములో లేదు. అర్జునుని శ్రద్ధయు, విశ్వాసము, దృఢమగు పట్టుదల, ప్రేమ, ధైర్యము, ఉత్సాహము ప్రయత్నములోనున్నది విశ్వరూపము. అధ్యాత్మతత్త్వము నాకు జెప్పితివి. దీనివలన నా మోహము తొలగినదనియు, నీనుండి విశదముగ భూతముల యుత్పత్తి స్థితిలయములను యథార్థముగా నీ మాహాత్మ్యమును వింటిని. నీవు తెలిపిన విభూతులనుబట్టి షడ్గుణైశ్వర్యయుక్తమగు త్వదీయ విశ్వరూపమును పూర్ణముగ జూడగోరితి, యోగ్యుడనని నీకు తోచితే నా రూపమును జూపుమని యర్జునుడు వేడెను. పుణ్యతీర్థములగాని, వింతస్థలములగాని కొన్ని గ్రహించి మఱియు గలవంటే నన్ని జూడవలెనని యెవరికైన మనస్సుండును. ఆత్మానాత్మల తాదాత్మ్య సంబంధమువలన గలిగిన మోహము నిర్మూలన మొనరించినందున భగవంతుని స్తోత్రించుచు సంశయరహితుడై యడిగెను. గురుశిష్యు లిట్లుండవలె. శిష్యునిది పెడముఖము, గురువున దధోముఖమైనను, గురువు మోటితిండవలెను, శిష్యుడు వణుకుడుచేతులు శ్రద్ధలేనివాడు నయితే ప్రయోజనమేమి? హనుమన్న సూర్యునివలన వేదవిద్యలు, రామునివలన బ్రహ్మవిద్యను, యాజ్ఞవల్క్యుడు సూర్యునివలన, జనకుడు వసిష్ఠులవలన, రాముడు వసిష్ఠునివలన శిష్టాచారప్రకార మెఱింగి ధన్యులైరి. విశ్వరూపమును సందర్శింప యోగ్యత గావలె. శిలయే భక్తునికి శివుడుగను, లౌకికునికి రాయివలెను గనుపించును. అద్దములో మలినముండిన నేరూపునైన నెట్లు స్పష్టముగ గనరావో అట్లే మనశ్శుద్ధి లేని వారికి విశ్వరూపము సందర్శించుట కష్టము.

ప్ర॥ ప్రతియొకవ్యక్తి విశ్వరూపమును జూడవచ్చునా?

ఉ॥ అభ్యంతరములేక జూడవచ్చును. చూడడానికి డబ్బుగాని, యొకరి సిఫారసుగాని పనిలేదు. సినిమాలోని బొమ్మల జూచుటకు ప్రపంచమును జూచుటకు నేమి ఖర్చు యగుచున్నది? శ్రద్ధాభక్తిగలిగి యానందగోపాలుని నమ్మితే చూడగలము, సులభము. “సా కస్మైచిత్ పరమాప్రేమరూపా” అనన్యప్రేమ చాలు. ౫ నుండి ౮ శ్లో॥ వఱకు నర్జునునకు

దివ్యనేత్రములిచ్చుట. వివిధవర్ణములతో, ననేకాకృతులతో ప్రకాశించు ననేకములగు దివ్యరూపములను నీవుగాని, యితరులెవ్వరుగాని యెన్న డెఱుగని యద్భుతముల, నశ్వినీకుమారు లిరువురు, నష్టవసువులు, ద్వాదశాదిత్యులు, నేకాదశరుద్రులు, మరుద్దేవతాసప్తకమును, అంతేకాదు నీవు జూడగోరు దానినంతను నీవిరాట్ రూపమున నవయవమువలె నొక్కట వెలయుచున్న స్థావరజంగమాత్మకమగు విశ్వమును జూడుమనెను. అయితే ప్రాకృతమగు నేత్రములతో జూడజాలవు. ఈ చక్షువులు చిన్నవస్తువుల పెద్దగ జూపుకన్నులకు పెట్టుకొను జోడువంటి వంతియేకాని వానికి స్వకీయముగ నున్నవస్తువు నున్నట్లు గ్రహించే శక్తిలేదు. విగ్రహముల కమర్చిన కన్నులవంటివి. దివ్యనేత్రము నిచ్చెద, తద్ద్వారా నా యోగమహిమ జూడుమని భగవంతు డర్జునునితో ననెను.

ప్ర॥ ఆ దివ్యనేత్రము మనకెవ్వరిత్తురు? అనా డర్జునునకు హరియిచ్చెను. ఈనాడెక్కడిది?

ఉ॥ అనా డర్జునున కొక్కనికే నిచ్చెను. తక్కినవారి కివ్వలేదుగద? ఆనాడు లోకమున్న దీనాడు యున్నది. అయితే భగవత్కారుణకు పాత్రులై భగవద్రూపమును జూడవలెననే వారు అప్పు, డిప్పు, డెప్పుడైన జూడవచ్చు. బ్రతుకని బిడ్డకు పేర్లు మెండు, చేతగానివానికి మాటలు మెండు. అనా డీనాడు అను భేదములు మన సంకుచితదృష్టిలోనే, లోక దృష్టియేగాని భగవంతు డెప్పుడు లేకుండాయున్నాడు? అప్పు డిప్పు డెప్పుడు గలడు. ఆయన లేదా జగత్తెక్కడ, నీవెక్కడ, నేనెక్కడ? సర్వము శూన్యముకావలె. గొడ్రాలికి బిడ్డలులేకపోతే నంతా శూన్యమనియా? నీకు తెలియకపోతే నందఱకు తెలియదనియా? ఋజువర్తనము గలిగితే నా నటనసూత్రధారియే గురురూపమున చూడదలచిన వారికి దివ్యనేత్రము నివ్వగలడు.

ప్ర॥ ప్రతియొకరికి గురువవసరమేనా? గురువు లేనిది యేవిద్య తెలియ శక్యముగాదా?

ఉ॥ కృష్ణభగవానునికి సాందీపుడు గురువుండినాడు. మన వేదశాస్త్ర పురాణేతిహాసములు గురువులేనివిద్య గ్రుడ్డివిద్యయనియు గురువు యుండ

వలెనని చెప్పుచున్నది. అర్జునునకు కృష్ణుడే గురువైనాడు. ఈ జన్మమున కాకపోయిన మరొకజన్మముననైన గురువుండవలసినదే. లేదా పోయిన జన్మముననైన గురువుండియుండవలె. అవిద్యలకే గురువులవసరమైతే బ్రహ్మవిద్యకు గురువగత్యములేదా? "ఆచార్యవాన్ పురుషో వేద నేతరః" గురువులేనిది యేదియు తెలియుజాలడు. గురువుగలవాడే బ్రహ్మను దర్శించును. ఒకరినమ్మక మొకరికిలేని గురుశిష్యులైన, శిష్యునిసందేహాము తీర్పలేకపోయిన, గురుకృప బడయని శిష్యుడైన బ్రహ్మవిద్యకు బదులు కర్మబద్ధులగుదురు. వేదముయొక్క వాచ్యార్థాన్ని, లక్ష్యార్థమును తెలిసి యుండి జీవునకు లక్ష్యస్వరూపమైన యాత్మ బ్రహ్మమేననెడి నిశ్చయము గలిగి శిష్యుని యంతఃకరణములో వ్రేళ్లు పాదుకొనియున్న పంచభేదాల నున్మూలించగలిగి యవిద్యాదిదోషరహితము నద్వయమునైన బ్రహ్మ మును దర్శించి యెండమావులయందలి నీటివలె నామరూపాత్మకప్రపంచము మిథ్యయనెడి ఉపదేశమును యుక్తిసహితముగ నుపదేశింపగలిగి ప్రాపంచిక బుద్ధిని కాసింతైన శిష్యునిలో బాడమనీయని మహానుభావుడే గురు పదమున కర్హుడు. వేయేల నాయనయే దేవుడు. సాక్షాత్ గురుడు దేవుడు. అట్టి గురువునందు "యస్య దేవే పరాభక్తిర్యథా దేవే తథా గురౌ" దేవదేవతలయందు, కన్న గురువునందు శిష్యునికి ప్రేమయుండవలె. గురు శిష్యులు నాదర్శప్రత్యక్షదేవతలు, పూజనీయులు. వారే లోకమునకు దీపములు, వెలుగులు, ధర్మధ్వజములు, ధర్మచక్రములు. రామకృష్ణ వివేకానందు లిరువురేచాలు. పెక్కండ్రతో పనిలేదు. సముద్రమువంటి వాడు గురువు, మేఘమువంటివాడు శిష్యుడు. నరకమును సైతము స్వర్గముగమార్చే శిష్యుడు, స్వర్గమును సైతము శిష్యునికందిచ్చే గురువు లభింపవలె.

ప్ర॥ అర్జునునకిచ్చిన దివ్యనేత్రము విన్నమీాదట తెలియ నిచ్ఛబోడమి నది. దివ్యనేత్రము భగవంతునియొద్ద నుండునా? భగవంతుని నేత్రము లేనా? లేక భక్తులుగోరితే నిచ్చుటకు భగవంతుడు తనవద్ద వేఱుగా నుంచుకొని యుండునా? అథవా నేత్రములిచ్చినను అవి జడములుగదా? వానివలన తెలియుటెలాగు? వాని నెక్కడుంచుకొని నెట్లు జూడవలె? ఈ విషయ మెఱిగింపుడి?

ఉ॥ మోక్షమునకు సాధనముజేయుటకు సోపానములగు విభూతి యోగము గడచినది. అద్వైతమున కాధ్యాత్మ మభేద మనాదియునగు పరమాత్మను వ్యావహారికప్రత్యక్షమగు పదనొకండవ సోపానమునెక్కి తిలకించవలసియున్నది. "దుర్లభో మానుషో దేహో దేహినాం క్షణ భంగురః" దుర్లభమైన మానవజన్మము బడసినవారు నీ విశ్వరూపమును జూచినచో భేదభ్రాంతులగు పంచభ్రాంతులు బాధింపబడి స్వసంవేద్యులై సదానందమున నుండగలరు. దివ్యనేత్రము భగవంతునివద్ద ప్రత్యేకముండునని కాదు; మరెచ్చటనుండునది కాదు. అంత్యాది జడముగాదు. అదియు ప్రతి యొకరిలోను యున్నది. ఉన్నదని తెలియజెప్పటము, నేత్రము నివ్వటము నొక్కటే. విశ్వమయుడగుట, తననేత్రములే నంటిటనుండుట తనద్వారా జూడడమని అర్థమగును. జడములగు నేత్రములు గ్రహింపలేవనుటనిక్కమే. గురుకృప అన్నాముకదా! గురువు మనలోనుండు నేత్రమును తెల్పితే, మనము దాని విప్పిచూచితే నీ విశ్వము నెవరిమయమగునది తెలియును. మననేత్రములతో గనపడు ప్రపంచము పంచభ్రాంతులతో తోచుచున్నది. అయినను నేదిలేకపోయిన గనపడదు? సూర్యుడు. సూర్యుడులేని రాత్రి యందు? చంద్రునివలన. చంద్రుడు లేనపుడగ్నివలన. చంద్ర సూర్యాగ్నులు లేనపుడు? బుద్ధితో. బుద్ధిని తెలిసికొనేది నేనని అంటావు. చెప్పుము. చంద్ర సూర్యాగ్నులు లేనపుడుండే బుద్ధిని తెలియునది, బుద్ధిని ప్రకాశింపజేయు నదేది? ఈ సూర్యచంద్రాగ్నులేనా? కాదుగదా.

ప్ర॥ అవునౌను. బుద్ధియు సూర్యచంద్రాగ్నులుంకాదు.

ఉ॥ గాఢసుషుప్తిసమయమున బుద్ధిగలదా? వ్యావహారికమా సుషుప్తి? కాదు. వ్యావహారికములోని సూర్యచంద్రాగ్నులు బుద్ధిలేనితరి నా శూన్యమును ప్రకాశింపజేయునదేది? ఎవరంటే నేమనెదవు?

ప్ర॥ నేను అని అనెదను.

ఉ॥ ఆ నేనుయను నాత్మయే తెలియును శూన్యమును.

ప్ర॥ ఆత్మ దేహేంద్రియములవలె జడముకాదా? దేనితో తెలియును?

ఉ॥ జడమగుబుద్ధి శూన్యమగు సుప్తిని తెలియునది. జడమైతే తెలిసికొనేదెవరు? ఆత్మజ్ఞానమయుడు. నేత్రమన జ్ఞానము. ఆ జ్ఞాననేత్రము ద్వారా నర్జునుడు విశ్వరూపమును దర్శించినాడు.

ప్ర॥ జ్ఞాననేత్రముతో నెట్లు తిలకించెను?

ఉ॥ నీవు కన్నులతో చూచితే, వృక్షము శాఖోపశాఖలచే నానాగన పడుచున్నదికదా! నానాయను భేదభ్రాంతి యవిద్యామయము. కానిమ్ము. నాకొమ్మలన్నియు నొక విత్తనములోనివే యని గ్రహించినపుడే కన్నులతో గ్రహించితివి చెప్పు. కన్నులుకావుగదా! నానాకనపడుచున్న లేదు యొకవిత్తనమే వృక్షమంటివి యవ్వాను దేనితో? జ్ఞానముతోనే కదా! "చక్షుషో ద్రష్టా శ్రోత్రస్య ద్రష్టా" చక్షురాది యింద్రియములు యథార్థమును గ్రహించలేవు. వీనియొక్కొక్కదానికి ద్రష్టయైనదేది? జ్ఞానమే కాదా! ఇంద్రియములు చూపించునవి, జ్ఞానము తెలియునది. మఱొకమాట: నీవు ముందెన్నడో చూచిన వస్తువులిపుడు నీయెదుటలేవు. ప్రస్తావనవచ్చితే వానితీరంతయు నీకు లోపల గోచరించునా? లేదా?

ప్ర॥ అవును గోచరించును.

ఉ॥ ఆ గోచరింపజేసిన దేది? జ్ఞాపకము చేయునదేది? తిలకించటము. ఓమ్మనే యక్షరమును ప్రణవమనెదరు. దానినె బ్రహ్మవాచకమనెదరు. ఆ యోంకారమున అకార ఉకార మకారార్థ మాత్రకలున్నవి. అకార ఉకార మకారార్థ మాత్రకలవలన సర్వవర్ణములుగలిగి "ద్వేవిద్యే వేదితవ్యే" పరాపరవిద్యలని రెండు తరగతులు. అపరావిద్యయగు వేదముల వలన తెలియదగిన ధర్మాధర్మముల, తత్ఫలముల బోధించు వాక్యములైనవి. ఒక్కొక్క యక్షరము రెండు, మూడు, నాలుగైదు యక్షరములుగలిసి శబ్దమగుచున్నవి. అర్థముగల నక్షరసముదాయమే శబ్దము. ఒంటియక్షరము మొదలు నాలుగైదక్షరములు గలిసి శబ్దములుండును. శబ్దములు వాక్యములైనవి, వాక్యములతోటివే విశ్వమున గనిపించు శాస్త్రపురాణేతిహాసాది సమస్తగ్రంథములు. వానిలోని ధర్మాధర్మములు భూతమానవుల, వర్తమాన మానవుల, భవిష్యన్మానవుల గుఱించినవి. నశింపు లేనట్టివై సదరు వర్ణములే నర్థాలంకార, శబ్దాలంకార యుక్త విశేష్యవిశేషణములతో ఛందోబద్ధమై, షడంగయుక్తమై, గణనాతీతమై యున్నవి. అందులో నేయొక్క గ్రంథమునో చదివి దాని ధర్మ మెఱింగి ననుష్ఠించడములోనే మనుజులు సతమతమై జీవితములు చాలకయున్న

పుడు సమస్తవిద్యల నెఱుంగు టెంత కష్టము? ఎంతకాలము బట్టును? విశ్వ మన్నపుడు మనమున్న భూమండలమేనా? స్వామి వివేకానంద చికాగోలో నుపన్యసించునపుడు విశ్వమతమహాసభలో మా మతము గొప్పది, మా మతము గొప్పదనేవాదము లిట్లుండునని యొక సామెత జెప్పెను. సముద్ర ములోనికప్ప బావిలోనుండు కప్పవద్దకురాగా, మీ నివాసమగు సముద్ర మెంత యుండునని నోరుదెఱ నంతకంటె పెద్దదనెను. కాళ్లుజాపి నింత కంటెనా? అన దానికన్న పెద్దయనెను. ఈ బావికన్ననా యన నింకా పెద్ద యనెను. ఆ తీరు విశ్వమంటే మన భూమండల మట్టి వెన్నియున్నవో మనకు తెలియునా? స్థాలీపులాకన్యాయముగ "ద్వేవావబ్రహ్మణో రూపే మూర్తం చైవామూర్తం చ" మూర్తములగు రూపాదులు నమూర్తములగు నాకాశవాయువు కాలాదులను రెండురూపముల విశ్వము నెఱుగుట చాలు. ఒకటి నిరాకారము, రెండవది సాకార యాకారముల స్థూలసూక్ష్మములతో విడంబితముగ కనిపించుచున్నది. ప్రతియొక విగ్ర హమునకు వెనుక నిరాకారము, ముందు నాకారము వ్యక్తీకరింపబడు చున్నది. ఇందువలన తెలియదగినదేమి? అక్షరుడే క్షరరూపున నున్నాడని సూచనయగును. అద్దమునుగాని, నీటియందుగాని ప్రతిబింబరూపములు కనిపించును. అయితే నా రూపములకు నద్దముగాని, నీరుగాని యుండదు. ఆ యుంటని యద్దము నీరువలెనున్న నిరాకారము ముందు నాకారములుగ దోచు నామరూపము లుండజాలవు, ప్రకాశింపవుకూడ. నామరూపాదులు వానిలో కల్పితముగా లేకపోతే వానిని తెలియుటకేగాదు. "కల్పితస్య సర్వస్య ధారణాత్ ధర్మః" కల్పితనామరూపముల ధరియించు ధర్మమే ధర్మియగు పరమాత్మది. విశాలమగు నాకసము శబ్దగుణమయమై యాక సాగ్ని జల పృథివ్యాదుల నంతట గలదు. అగ్ని శబ్దస్పర్శరూప గుణ మయమై యాకసవాయువు జలపృథివ్యాదులగలదు. ఇట్లే నొకదానియం దొకటి పరిణమించియున్నవి. జలమునందలి జలచరములు ననంతములు, ఖేచరములగు పక్షు లనంతములు, భూచరములగు మృగమానవు లనంత ములు, క్రిమికీటకాది స్థావరములందలి యోషధాదు లనంతములు, మింట గనిపించు నక్షత్రము లనంతములు, సూర్యచంద్రులు సూక్ష్మరూపులగు దేవగంధర్వ కిన్నరగరుడ ఖేచరసిద్ధ సాధ్యయక్ష గుహ్యక దైవాదులు వివి

ధములగు సస్యములు నెన్నరాని వెన్నోయున్నవి. ఒక్కొకశాఖను విమర్శింపనెంచితే నెన్నో జన్మములు కావలసివచ్చును. దూరదర్శినితో జూచిన కనిపించు నల్పజీవు లెన్నియోయున్నవి. నాయం దేకాంశమని భగవంతుడనటము వాస్తవము. ఈ జగద్విషయమే నింత యపారమైయుండ నాయన విషయ మెంత యవాఙ్మానసగోచరమో, ఆయనకే తెలియును. ఆయనం దీజగత్తేకాంశము నెక్కడికో నాదియంత్యము గనిపింపకున్నది. మనమున్న గ్రామమున, మనమున్న ప్రాంతమున, మనమున్న దేశమునే విచారింప సాధ్యము కానపుడు మఱియెవ రేయాచారులో, నే భాష మాట్లాడగలవారో, నెయ్యది యాహారమొ, నెంతకాల జీవితమొ, నెవ రెంత యెత్తు, నెంత పొడవు, పొట్టి లావు సన్నము గలవారో, వివిధరంగులు గలవారో, నెవ రెంత యందచందములు గలవారో, నంగహీనులెందఱో, నేయే యుద్యోగులో, ముందే దేశస్థులో, నేజన్మముల నేమొనర్చుచుండిరో, నేమాడ్కినుండిరో, నెవ రేమి గ్రహింతురో, నెవరేమి గ్రహింపరో, నెవరికేవి రుచికరములో, నేవి యరుచికరములో, నెవరు మిత్రులో, నెవరు శత్రువులో, భృత్యులో, పుత్రులో, నాచార్యులో, నాప్తులో, సఖులో, సచివులో, ప్రభువులో, కవులో, గాయకులో, హాస్యకరులో, నటకులో, శిల్పులో, సాధువులో, నసాధువులో, యతులో, హంసలో, పరమహంసలో, ధూతలో, నవధూతలో, దిగంబరులో, యోగులో, జోగులో, భోగులో, త్యాగులో, విరాగులో, గృహస్థులో, ఋషులో, మహర్షులో, బ్రహ్మచర్య వానప్రస్థ సన్న్యాసులో, వివిధ మతస్థులో, వివిధ సమాజములో, ననేకధర్మములో హింసలో నహింసలో సత్యమో యసత్యమో తెలియుటకు నూహాకందనిదిగాయున్నది. ఒకదేశమున నొకధర్మము, నొకవ్యక్తికి నొక యలవాటు, నొకప్పటి ధర్మమొకప్పటి యధర్మము, ఒకరి ధర్మము నొకరికి నచ్చుటలేదు, గర్భముననున్న శిశువు ధర్మము, పుట్టి బాల్యకౌమార యవ్వన వార్ధక్యముల మారుచున్నవి. ఒక వ్యక్తిలోన పలుధర్మములు, దేహధర్మములు, యింద్రియ ధర్మము, లవస్థాధర్మములు, కాలధర్మములు, జీవధర్మములు బుద్ధిపూర్వకముగ, నబుద్ధిపూర్వకముగ నంతరంగ బహిరంగముల వెలయుచున్నవి. సత్వగుణ, రజోగుణ, తమోగుణములు, సత్వరజము, రజోతమము, తమోసత్వములనే

గుణకర్మల తెలియక కర్మలు వాని ఫలములు వచింపరాకున్నవి. నిత్యము క్షణక్షణము భూతవర్తమాన భవిష్యత్తులే మారుచున్నవి. రాత్రిపోవుట, పగలు రావటము, నిదుర స్వప్న జాగ్రతలు గలుగుచున్నవి. మూడవస్థలు కొన్ని జీవులకు, రెండవస్థలు కొన్ని జీవులకు, నొక యవస్థ కొన్ని జీవులకు గలుగుచున్నది. ఏ యవస్థలో ప్రాణవియోగమో, నే యవస్థలో నావిర్భావమో, నే యవస్థలో నే రోగమో, నేరోగ మెంతకాలమో, నొక్కొక జీవునకెన్ని జన్మములో, మరెన్ని రాగలవో, ముందెక్కడనో నెవరు బంపిరో, నెవరి ప్రేరణయో, స్వబుద్ధియో గుర్తెఱుగరాకున్నది. ఒకచో ధన ధాన్య సంపదల తులతూగుచు దానధర్మముల జేయువారు, సంపదలుండి దానధర్మములుచేయ నిష్టపడనివారు, నిచ్చువారిని నియ్యవలదని హితము సాధించువారు, తాము తినక నొకరికియ్యక దాచుకొనువారు, తమకు లేకపోయిన యాచించి నొకరికి సహాయము జేయువారు, తమ జీవితముకొఱకే యాచించువారు, తిన తిండి, కట్ట బట్ట, నుండ నిల్లు, విద్య జ్ఞానము లేనివారు,రోగగ్రస్తులైనవారు, నొకరి ప్రేరణవలన దానము చేయువారు, భయముతో దానమిచ్చువారు, నాడంబరమునకు ప్రతిఫలమునకు దానము చేయువారు, నాడంబరమునకు పేరు ప్రతిష్ఠలకు యాచించి దానము చేయువారు, దానధర్మములు చేయువారు, చేయుచున్నను నవి లభింపనివారు, హరికథలు, పురాణములు, నితిహాసములను జెప్పువారు, నాటకములు, డ్రామాలు, సంగీతము, భోగము మేళములు, తుంబుర మద్దెలవీణా తాళముల భజన చేయువారు, నవలలు, చరిత్రలు, కట్టు కథలు, విలాసకథలు, సినిమాకథలు, తదితర కథల జదువువారు, వినువారు, వ్రాయువారు, మతగ్రంథములు సమాజగ్రంథములు, సాంప్రదాయిక గ్రంథములు, వర్ణాశ్రమాచారముల పాటించువారు, మతసమాజములలో జేర ప్రోత్సహించువారు, మతద్వేషులు, వ్యాపారులు, భూఖామందులు, కార్మికులు, సోమరులు, అలసులు, దొంగలు, జారులు, దుర్మార్గులు, హస్తసాముద్రికములు, జ్యోతిషములు, వాస్తులు, సర్వశాస్త్రములు, ఫలజాతకములు, వారములు, తిథులు, నక్షత్రములు, యోగములు, త్యాజ్యములు, వారశూలలు, మహిమలు జెప్పువారు, యాత్రల కేగువారు, సంకల్పముల జెప్పువారు, పిండదానముల జేయించు

వారు చేయువారు, దేశముల స్థలముల దేవారాధనములు జరుపువారు, కొండల, గుహాల, చెట్టుమొదళ్ల, క్షేత్రముల నుండువారు, గ్రామ పట్టణ పల్లెల నుండువారు, నేకాంతులు, బహుకుటుంబికులు, కనుపించువారు, వివిధములగు రకముల విశ్వమును వర్ణింప నేవంక జూచిన యద్భుతముగా నున్న లోకమును జూచిన యర్జునునకేగాదు మానవులందరు విచారింప వలసిన యమూల్యసమయము, గీతాకాల సమయము, విశ్వరూపదర్శన విషయము, సర్వదానందభరితము, సర్వదుఃఖనివర్తికరము.

ప్ర॥ మహాత్మా! ధనంజయునిపై కరుణగలిగి, భగవంతు డనుగ్రహింప మీకెంత ప్రేమయో, నడిగి నానియోపికతో జెప్పుచున్నారంటే నా కృతజ్ఞతాభివందనములు. ఆవల విశ్వరూపము నెట్లు సందర్శించెను?

ఉ॥ పుండరీకుడు విశ్వమయుని తన తలిదండ్రులలో గాంచెను. రామకృష్ణుడు కాళీమాతయందు హరిని దర్శించెను. తులసీదాసు రామనామమున భగవంతుని దర్శించెను. విఘ్నేశ్వరుడు మాతాపితలలోనే విశ్వమును చుట్టివచ్చెను, చూచెను. యశోద బాలకృష్ణుని నోటియందు బ్రహ్మాండనాయకుని విశ్వమును గనెను. గోపికలు రాసక్రీడయందే విశ్వేశ్వరుని గనిరి. భయముతో గంసుడంతటగనెను. కామముచేత రాధ గనెను. బంధుత్వముతో యాదవులు గుర్తించిరి. భక్తిచే నారదాదులు సందర్శించిరి. మహాత్ములు తమ యాత్మగ దలచి చూచి నిత్యానందులైరి. వారివారి భావన, వారివారి విశ్వాసము ప్రేమల తద్రూపము గన వచ్చును. విశ్వాసము ప్రేమలేని కృపణులు విశ్వమయుని చూచుచుండినను ప్రత్యేకించి ధృతరాష్ట్రునివంటి వానికి చూపినను మాయామోహితులగుటయే దుర్యోధనాదులు నింద్రజాలమనిరి. స్వార్థులకు కల్ల నిజము, నిజము కల్లగ దోచుచుండును. "యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం" ఎంత భక్తి శక్తి యుక్తియుండి భజించితే నంత మాత్రమే భగవంతు డనుగ్రహించును. అనగా తమ యిష్టప్రకారము సాక్షాత్కరించును. తన యింటియందే యుంచుకున్నది కృష్ణునిసత్య. అయితే మాత్ర మేమాయె? నారదునివలన కృష్ణునిబడసేదానికి తన వస్తువులు తక్కిన వారి వస్తువులన్నియుంచికూడ కృష్ణునిసమముజేసి మగని నారదునివలన గైకొనలేకపోయెను. ఒక్క తులసీదళముచేతనే రుక్మిణి

బడసెనంటె కారణమేమి? మతియెంతో గతియంతే, ముందెంతో వెనుకంతే, కార్యమెట్లో కారణమంతే, నడకెంతో చేరటమంతే, చేయుటెంతో కలగటమంతే, చూచుటెంతో గ్రహించుటంతే, వినటమెంతో వ్రాయుటమంతే. ప్రేమనుబట్టి భావముండును. భావముద్వారా బాహ్యమునగాని, యంతరంగమునగాని, యప్రత్యక్షము ప్రత్యక్షమాయగును. తేనెనంతయు గ్రోలకపోయినను నొకబిందువు నోటవైచికొని దాని మధురము గ్రహింపవచ్చును. ఒక పూసలదండలో ప్రతిపూసకు లోపలను, పూసకుపూసకు మధ్యను, దారము, దారమని దారమేయుండును. దారమే లోపల మధ్యన లేనిచో దండాకారము, భిన్నములగు పూసలు వరుసగా నుండగాదు. తద్రీతి భిన్నభిన్నములగు స్థూలసూక్ష్మశరీరముల లోపల, వెలుపల నేను నేనుయనే దారమువంటి చైతన్యరూపుడగు త్రివిక్రమదేవుడే లేకపోతే జడములగు పిండసమూహబ్రహ్మాండము భావరూపమై నుండజాలదు. అందువలన జడమయమగు విశ్వములోపల, వెలుపల చైతన్యమూర్తి "సర్వభూతేషు గూఢః" యనురీతి యున్నాడు. ఇదిగో నిదియొకచెట్టు. ఈచెట్టు దేనివలన నింతదిగా కనిపించుచున్నదనిన నేమనెదవు? విత్తనమువలన ననెదవు. విత్తనములేదా చెట్టు లేదనుట సిద్ధము. ఎంత చెట్టునకైనా విత్తనము యొకటేకదా! ఒక్క చెట్టునకే క్రింద వ్రేళ్లెన్ని, పైభాగమున శాఖోపశాఖలు, పత్రపుష్పఫలములెన్ని యుండును. సంవత్సరసంవత్సరము రాలే యాకులు రాలుచుంటే బుట్టుయాకులు పుట్టుచుండును. రాలే పుష్పములు, రాలేపండ్లు రాలుచుండ మరల నావృక్షమునుండియే తయారగుచుండును. క్రిందపడిన విత్తనములు మరల వృక్షములుగా తయారై నలుదిశల వ్యాపించి పెద్దవన మనిపించుకొనును. రాలినవెన్ని! క్రొత్తగ తయారైనవెన్ని! లెక్కింపగలరా! తద్రీతి సృష్టి పూర్వము స్వజాతీయ, విజాతీయ స్వగత భేదరహితమగు "సదేవ సోమ్యేదమగ్ర ఆసీ"త్తని సద్వస్తువగు పరమాత్మ యొకటే నామరూపరహితమై యుండినదనుచు నుపనిషత్తులు ఘోషించుచున్నవి. విత్తనముగా నున్నపుడు చెట్టు యాకారము దాని లోపల వెలుపల లేదు. చెట్టు యాకారము మిథ్యయైనను, చెట్టులోనంతట సూక్ష్మముగా విత్తనమేయున్నది. ఉండబట్టియే నేకొమ్మనైన కాయలు పుట్టుచుండును. "బృహత్వాత్ ఆత్మైవ బ్రహ్మ"

అన్నరీతి నొక్క పరమాత్మయే బ్రహ్మాండమనే వృక్షముగానున్నాడు. విత్తనమణువైనను విత్తనముయొక్క స్థూలాకృతి చెట్టురీతి పరమాత్మ యణువుకంటె నణువైనను, నాయన జాగ్రద్వ్యవహారసత్తయగు ప్రపంచము స్థూలముగా కనిపించుచున్నది. "ప్రతిలోమానులోమాభ్యాం విశ్వారోపాపవాదయోః" అనులోమవిలోమముల ప్రపంచము నధ్యారోపాపవాదములయొక్క విచారణలో విశ్వమయుడే శేషించును. పరమాత్మ సృష్టి చేయదలచి తనయందనపాయినియగు మాయ నవలంబించి యాకాశము, వాయువు, నగ్ని, జలము, పృథివి యయ్యె. మరల నోషధులు, నన్నము, దానినుండి వీర్యము, వీర్యమునుండి ప్రజలు సమస్తమాయెను. దీనినే యధ్యారోపము లేదా యనులోమమందురు. ఇప్పుడు చూడుము. అంతా పరమాత్మయేగాక వేరేమైనగలదా? దీనినే విధిముఖమున గ్రహించుట నందురు. నిషేధముఖము లేక విలోమము లేదా నపవాదముఖమున విమర్శించిన పరమాత్మయే కారణమగును. ప్రజలకు వీర్యము, వీర్యమున కన్నము, నన్నమునకు నోషధులు, వానికి భూమి, భూమికి జలము, జలమున కగ్ని, యగ్నికి వాయువు, వాయువున కాకాశము, నవతల నేమున్నదనిన తెలియదందుము. అదియే మాయ. మాయాకార్యము ప్రపంచము. ఆ మాయకు నాశ్రయుడు పరమాత్మ. అంతయు పరమాత్మ. దృశ్యమున్నదంటే నామముండును. నామమున్నదంటే రూపముండును. అణువునకంటే నణువన దాని నేమనవలె? పరమాత్మయే ననవలెగాని, పరమాత్మగాదని ద్వైతముగా వేఱేయొక్కటియులేదు. అదిగో నదియొక బట్టలదుకాణము. ఎన్నిచిత్రముల నెన్ని రంగుల, నెంత వెలగల స్త్రీలకనుకూలమగు పురుషుల కనుకూలమగు వస్త్రములుగలవు. లెక్కలేనన్ని యున్నవి కదా! వీని నేమందురు? బట్ట లనెదరు. నానారకములగు బట్టల దూదియేయన్న, దారమేనన్న వ్యావహారికమునకు నాగరికతగా నుండదుగాని, యావస్త్రములన్ని దారమనుటలో సందేహముండునా? చిత్ర చిత్రతర రకములు, రంగులు, పొడవు, వెడల్పు, నన్నము, లావుతోనింపుగా పేర్లతో విలసిల్లుచుండుట మనము చూచుటలేదా! అదియంతయు దూదియేకదా!

ప్ర॥ మాయ యంటె యేది?

ఉ॥ "యామాసామాయా" వ్యావహారికమున భావరూపమై, ప్రపంచ కారణమై, పారమార్థికమున లేనిదై యనాదిగ నుండునది.

ప్ర॥ "మాయినం తు మహేశ్వర" మ్మని దీనిచేతనేనా భగవంతుడు విశ్వరూపమును దాల్చినది?

ఉ॥ అవును. ఒక్క-శరీరమును పిండమనెదరు. పిండముల సమూహము బ్రహ్మాండమనెదరు. ప్రతి పిండాభిమానియగు జీవునకు వాచ్యము స్థూల సూక్ష్మకారణ శరీరములు. విశ్వతైజసప్రాజ్ఞులనువారు ముగ్గురు మూడు శరీరాభిమానులు. జాగ్రత్స్వప్నసుషుప్తులనునని మూడవస్థలు. జీవత్వము, నానాత్వము, నల్పజ్ఞత్వము, పరిచ్ఛిన్నత్వాదులతో వ్యక్తి జీవలక్షణము. జీవుల సమిష్టిస్థూలదేహములే నీశ్వరుని విరాట్ దేహము. సమిష్టి సూక్ష్మ దేహములే హిరణ్యగర్భదేహము. సమిష్టి కారణశరీరములే నవ్యాకృత దేహము. ఇవి మూడు భగవంతునకు వాచ్యములు. సూత్రాత్మ, వైశ్వానర, యంతర్యామియనే ముగ్గురు నా శరీరాభిమానులు. సృష్టి, స్థితి, లయము లాయన యవస్థలు. సర్వజ్ఞత్వ, సర్వనియంతృత్వ, సర్వేశ్వరాదిగుణములు గలిగియుండునదే విశ్వరూపుని స్వరూపము. ఈ విశ్వము భగవంతుని సమిష్టి స్థూలదేహమగు విరాడ్రూపమే. కనిపించెడి పొడవు, కుఱుచ, లావు, నల్లము, నెఱుపు, తెలుపు, నలుపు, నూదా మొదలగు రంగులు, నందము, నందవిహీనము నగు శరీరములు, శిరస్సులు, ముఖములు, నోరులు, కన్నులు, చెవులు, నాసికలు, దవడలు, కనుబొమలు, నొసళ్లు, నాలుకలు, భుజములు, చేతులు, వ్రేళ్లు, కంఠములు, నెదలు, కడుపులు, నడుములు, తొడలు, పాదములు, వెంట్రుకలు, పురుషత్వ స్త్రీత్వ, నపుంసకత్వములు, తలకిరీటములు, టోపీలు, పాగాలు, రుమాళ్లు, తురాయిలు, పాపటబిళ్లలు, చెవుల కుండలములు, కంఠహారములు, నడిమి డాబులు, ముంజేతిమురువులు, వ్రేళ్లనుంగరములు, పాదముల కంజెలులు, పట్టువస్త్రములు, హేమమణిగణభూషణాలంకృతములు, నవపుష్పమాలాలంకారములు, చందనగంధము, కస్తూరి, పునుగు, జవ్వాది, పన్నీరులలదినవస్త్రమేనులు, వివిధాయుధహస్తములు, శృంగార, వీర, కరుణాద్భుత, భయానక, భీభత్స, హాస్య, దుఃఖరసమూర్తుల లెక్క-లేని సూర్య ప్రకాశములు నా దీప్తికి సమానములుగాక, భూలోక, భువర్లోక, స్వర్గ

లోక, మహర్లోక, తపోలోక, సత్యలోకాది యూర్ధ్వలోకములు, నతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళాది యధోలోకములు, నాలోకేశ్వరులు, లోకస్థులు, లోకధర్మములు, లోకాచారములు హరిమయమై నాదిమధ్యాంతములులేని యనాది హరి విశ్వరూపీలాగు నర్జునుడు 9 నుండి 14 వఱకు సంజయకృత విశ్వరూపవర్ణనము 15 నుండి 31 శ్లో॥ వఱకు దర్శించెను.

ప్ర॥ ఔరా హరిమహిమ! అద్భుత మానంద మహదాశ్చర్యకరము, భవబంధనిర్మూలనకరము, సదాప్రశస్థితము, మంగళమయము. అర్జునుడు దివ్యనేత్రముతోనే గదా జూచెను?

ఉ॥ ఈ కనపడునది చూచుచున్నావుకదా! విశ్వరూపవర్ణనమంతయు నీకన్నులచేతనే జూచితివా! కాదు. ఇదిగో! నిది పులి, యిది యావు, నిది మనిషి, యిది కుక్కయని మట్టితో తయారు చేసినపుడు కనిపింప నాపేర్ల నారూపముల కంటితోనే గాజూతువు. అయితే నవి యన్ని మట్టి యన్నప్పుడు కన్నులేనా గ్రహించునది?

ప్ర॥ కాదు. కన్నులు జూచునవియేగాని విషయము జెప్పలేవు.

ఉ॥ మఱి మన్నే యనినది యేది?

ప్ర॥ తెలివి లేక నెఱుక లేక జ్ఞానము.

ఉ॥ రూపములు, నామములు నొక్కటని తెలియునదియే జ్ఞాననేత్రము. దానిద్వారా జూచి యర్జునుడు భయసంభ్రమ విస్మితాననుడై చేతులు జోడించి తనకు కనిపించేరూపములనుజూచి చరాచరజగత్తును, దేవతల ఋషుల రక్షకాది సర్పసమూహముల బ్రహ్మను నానావిధరూపముల నలంకారయుక్తములగు శరీరముల జూచుచున్నాను. నీవు పరబ్రహ్మవు. సనాతన ధర్మరక్షకుడవు. నిత్యుడవు. నఖండశక్తిపరుడవు. చంద్రసూర్యనేత్రములు నీ ముఖమండలమున నగ్నిజ్యోతిరూపమై దీప్తమంతమై వెలుగుచున్నది. నీ తేజముతో జగత్తును తపింపజేయుచుంటివి. క్రిందుమీదుల నలుదిశల నీవే నిండియున్నావు. నీ యుగ్రరూపమునుచూచి ముల్లోకములు భయమందుచున్నవి. యుద్ధమొనర్చు మనుష్యులు, పశువులు మొదలుగాగల దేవతలు నీయందు ప్రవేశించుచున్నారు. కొందఱు

భీతిచే బొగడ, కొందఱు లోకమునకు శాంతికొఱకు స్తుతించుచున్నారు. రుద్ర, ఆదిత్య, వసు, సాధ్య మొదలగు ముప్పదిమూఁడుకోట్ల దేవతలు విస్మితులై నిన్ను జూచుచున్నారు. అనేకముఖ బాహూపాద నేత్రయుదరములతో నొప్పు నీయసంఖ్య దంష్ట్రిలతో భయంకరమై లోచుచున్నది. ఈ రూపము సకలప్రాణులకు, నాకు భయముగానున్నది. సర్వవ్యాపివి, గగనశీర్షుండవు. నానావర్ణయుక్త విస్ఫారవదన యుజ్వల నేత్రములనగు నీ రూపము జూచిన ధైర్యము జాలకున్నది. కోరలతో నొప్పు నీవదనములు జూడ భయమగుచున్నది. ధృతరాష్ట్రి పుత్రులు రాజ్యముతో సహా నీ ముఖ వివరముల ప్రకాశించుచున్నారు. భీష్మ ద్రోణ కర్ణాదివీరులు మన పక్షమున జేరిన వీరులతో ధృష్టద్యుమ్నాదులు నీయందు ప్రవేశించుచున్నారు. తొందరపడుచు వారందఱు భయదంష్ట్రిల వదనగహ్వరముల ప్రవేశించుచున్నారు. కొందఱు పిండితశిరస్సులై దంతములమధ్య చిక్కికొన్నారు. నదులన్ని సముద్రాభిముఖములై సముద్రుని జేరినరీతి మేము వీరులమనే వీరందఱు నీ ముఖగహ్వరముల బ్రవేశించుచున్నారు. మిడుతలగ్నినిబడుట చావుకొఱకైనరీతి ప్రాణులందఱు చావ వేవేగముగ నీ ముఖవివరముల బ్రవేశించుచున్నారు. నీముఖముల దశదిశల ద్రిప్పి వదనముల దెఱచి పారిన బోనీక నన్నివైపులకు నాలుకలుజాచి యాస్వాదించుచుండ నీ ప్రభలు కాంతులతో జగత్తు నింపినవి. ఉగ్రమూర్తివగు నీ వెవ్వరో నాకు జెప్పుము. నీకు నమస్కారము. నీ యుద్దేశ్యము తెలియకున్నది. ప్రసన్నుడవుకమ్ము. నేను భక్తుడ, నీవు నా తండ్రివి, నా దైవమవు. నీ కరుణాకటాక్షముచేత నేనే నీ విశ్వరూపమును జూడగల్గితిని.

ప్ర॥ తాము చెప్పుచుంటే వినువారికి నెంతో భయము నాశ్చర్యముగానున్నది. దర్శించినవారి నేమనవలె! అర్జునుని మాటకు భగవానుడేమనెను?

ఉ॥ 32 వ శ్లోకము "కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో" లోకసంహారార్థము విజృంభించిన కాలుడను, ఇపుడు ప్రాణుల సంహరింప దొడగితిని. నీవు యుద్ధమొనర్పకపోయినను, శత్రుపక్షములోనివా రెవ్వరు జీవింపరనెను. నాచే వీరు ముందే జంపబడిరి. శత్రునిష్కంటకమగు రాజ్యమును భోగింపుము. నీవు నిమిత్తమాత్రుడవు గమ్మనియు, భీష్మ ద్రోణ

కర్ణ జయద్రథభీష్ముల తదితరులగు యోధుల నేనిదివఱకే జంపియుంటిని. చచ్చినవారినే నీవు వధింపవలసినది. శత్రువుల గెలువగలవు. యుద్ధమొనర్పు మన కిరీటి వణకుచు భయముతో చేతుల జోడించి నమస్కరించి గద్గద కంఠుడై పలికెను. ౩౩ నుండి ౩4 శ్లో॥ వఱకు నర్జును డీరీతి యనెను.

ప్ర॥ భగవంతు డనుమాట విశ్వరూపసందర్శన మొనరించు నర్జునునకు తిరిగి యడిగేటంత లేకపోయిన మన మేల యడుగకూడదు? తనచేతనే జంపబడియుండిన నర్జునుడు జంపనేల? 18 దినములు యుద్ధ మెందుకు జరిగెను? ఈ మాట సంశయముగానున్నది వచింపుడి.

ఉ॥ అవును. కాలస్వరూపుడ నని యొకమాటు, నాయొక్క యోగ మాయావిలాసమని యొకమాటు, నాయొక్క సమిష్టి స్థూలశరీరములగు విరాడ్రూపమని యనుటయందు విశేషము లేకపోలేదు. గహనమైన సమస్య. పంజరములలోనున్న పక్షులు బంధింపబడినవి. వానికి స్వాతంత్ర్యము లేదు. ఎవ్వఁడు చేయదలచుకున్న చేసినటులే యర్థము. శరీరములనే పంజరముల, నభిమానములనే త్రాళ్ల గట్టబడిన జీవుల వ్యావహారిక జీవితములు నీశ్వరుని చేతిలోనున్నవి. మాయ తనదే. మాయయనే యుచ్చులచేత జీవులబడద్రోసి శరీరములనె పంజరముల నుంచెను. వానిని మఱొకని నిమిత్తము జేసిగాని, తానేగాని చంపినాడన్నపుడు మఱెవ్వరు లేరు. తానే ప్రాణవియోగములకు కర్త, కాలము తన స్వరూపమే. పదునెనిమిది దినములన వరుసగా నేయే జీవు లేదినము నంతము గావలెనో, నాదినమందఱే యగుదురు. వరుసగా 18 దినములకు శత్రుశేషము లేకుండ బోయిరి. ఒక పాఠశాలలో చదువువా రొకేదినము నెంతమందియో చేరుదురు. పరీక్షలో ప్యాసైనంతనే యెంతోమంది వెళ్లుదురు. ఇంతమంది యొకేతూరియా యనుకోవలదు. ప్రాణుల యుత్పత్తి యెంతో మరణమంతే. విస్తారముగా జెప్ప గ్రంథవిస్తరమగును. ఒకశరీరమున చెడుభాగమును నాపరేషన్ జేయించి మిగత భాగమునకు ముప్పురాకుండ జూచువాడు డాక్టరును నిమిత్తముజేసి చెడు భాగము నాపరేషన్ జేయించును. జేసినవాడు నిమిత్తమాత్ర మంతే. బ్రహ్మాండమే తన శరీరము నందులో నాశభాగమగు దుర్యోధనాదులు తదితరులు నాశముచేసి తక్కిన భాగముల రక్షించుకోవలసిన యవసరము భగవంతునకు నవసరమందున

అర్జునుడను నిర్మోహమోటము గలవాని, సరళభావముగలవాని, యోగ్యుని నా పనికి నునిచి నాపరేషన్ జేయించెను. తన కిష్టము లేకున్న నర్జునుడేమి చేయుగలడు? అర్జునుడు హృషీకేశా! నీ మాహాత్మ్య కీర్తనమున జగత్తంతయు నానందించుచు ప్రీతి బొందుచున్నది. కొందఱు భయపడి పరుగిడు చున్నారు. కొందఱు తపోయోగసిద్ధులు నమస్కరించుచున్నారు. అనగా బ్రహ్మకుగూడ గురుడవైన నీకు దేవతాదులు నమస్కరింపగా నని యాయన యోగ్యతను విమర్శించి నమస్కరించెను.

ప్ర॥ ఏమేమి యోగ్యతల విమర్శించి నమస్కరించెను? విశ్వరూపమును సందర్శింప సామాన్యులకు సాధ్యమగునా? అయినను తామనేక దృష్టాంతముల జెప్పితిరి. నా యదృష్టము నావలజెప్పుడి?

ఉ॥ ౩౬ నుండి ౪౭ శ్లో॥ వఱకు నర్జునస్తవము. మఱొకదృష్టాంతము వినుము. విత్తనము లేక చెట్టులేదు. హరి లేక జగము లేదు. చెట్టునకు ముందు విత్తనము. జగత్తునకు ముందు హరియుండును. నిద్రలో స్వప్నమువచ్చినది. సూర్యుడుప్రకాశించుచుండ ప్రపంచము గానిపించును. కనిపించిన సమస్త జగత్తు ప్రకాశించుటకు నెయ్యది హేతువు? అందుదోచిన నామరూపములా? లేక సమయమా? లేక నేది? మనోబుద్ధు లింద్రియములు గావుగదా! నవి జడములుకదా! సూర్యచంద్రాగ్నులు లేవుకదా! చక్షువులు మూసికొని పోయినవికదా! ఆ స్వప్నప్రపంచ మెవ్వరియందుండి యెవరివలన వెలుగుచున్నది? ఆ ప్రకాశింపజేయు నతడేయాత్మ. ఆత్మయందే నా ప్రపంచమున్నది. ఆత్మకన్న వేఱుకాదు. ఇదిగో పెద్దపేపరు. దీనిలో వివిధదేశముల వివిధజాతుల మనుష్యుల, వారివారి రంగుల, వారివాహనముల, నదులాదిజలాశయముల, నడవుల, నందలి మృగతతి, పక్షిస్థావరాది సమూహము, చర్చిలు, మసీదులు, దేవస్థలములు, మిద్దెమేడలు, రస్తాలు, ప్రమదావనములాదిరూపములు చిత్రవిచిత్రములుగానున్నవనుకో. వానిలో నేరూపమును గనినను కాగితములుకాదా! కాగితములులేక నారూపములుండగలవా! లేక కాగితమునుగాదని నారూపముల వేరుజేయసాధ్యమా! అటులొనర్ప నసలుద్దేశమే చెడును. కాగితమని చెప్పసందేహ మేమి కలదు. అట్లు సగుణనిర్గుణమన్నను సాకారనిరాకారములన్నను హరికే

పెట్టు, కాశితము నిరాకారము. కానియందున దోషము సాకారములు నానికాకారములోనే యుండుట సాకారమునవలెనివచ్చినది. జగత్తు హరి స్వరూపము. ఈలాగున కని జనము సేవించవలసిన విధాయకములో ననుష్ఠించటములోను హరిస్వరూపము గోచరింపగలదు. ఉభయసైన్యము హరివదనవివరమున ప్రవేశింప వచ్చుచున్నవని నాయన నేను కాలరూపుడ నని, రాత్రింబగలనే వానిరెండుపోవడమువలన దినములు, వారములు, పక్ష ములు, నెలలు, ఋతువులు, అయనములు, సంవత్సరములు, మన్వంతర ములు, ప్రళయములు పునరపిసృష్టి జరుగుచుండును. రాత్రింబవళ్లే నాయన వదనగహ్వరము. "స బ్రహ్మ స శివస్సేంద్రస్సోఽక్షరః పరమస్స్వరాట్ స ఏవ విష్ణుః సః ప్రాణ స్స కాలోఽగ్నిః" సర్వము తానే. ఆయన వదన గహ్వరకాలములోనే నన్నిప్రాణులు హతులగుదురు. జ్ఞానము, నిచ్ఛ, ప్రయత్నము, దిక్కు, కాలము, నదృష్టము, ప్రాగభావము, ప్రతిబంధకా భావములనే ఎనిమిది యీయన సర్వకార్యములకు సాధారణ కారణ ములు, అసాధారణకారణములుగూడ నీయనయందే జరుగుచుండును. కావున జగత్తు లేదా హరిరూపము దుర్జనులకు భయము, సుజనులకు సంతసము మంగళకరము. ఇంతకు జగత్తు హరిమంగళమయ స్థూలశరీ రమే వరప్రసాదము. ఈ జగత్తున మనమేమి క్రొత్తవి సంకల్పించుటకాని, కూర్చుటగాని హరిని ప్రేమించటముకాదు. హరినికాదని యహంకరించు టయేయగును. నిస్స్వార్థతతో గూర్చుట, హరికొఱకే యగుచో, జగత్తు నకు శాంతి, సకామజగత్తునకు నశాంతియగుట భగవత్ప్రీతికాదు. ఒకరు ప్రేమించినది మరొకరు ప్రేమించటము నజ్ఞానమె. అవిద్యాపరులగు మానవులు హరిని గుర్తింపలేకుండుట చిత్రము.

ప్ర॥ అవిద్య చేయు పనియేమి?

ఉ॥ "న విద్యతే ఇతి అవిద్యా" భ్రాంతిరూపమై, ముత్తెపుచిప్పను వెండిగా జేయునది వ్యవహారమునందు మనస్సును ద్వైతబుద్ధిగా చెదరు రీతిజేయును. దీనిప్రభావమే నాస్తికులజేయును. ఒకప్పుడు పెక్కు కాలము తపస్సుచేయు తపసి స్నానాన్నపానాలకులేచి పత్రము, పండ్లో, తోయమొ దొరికినవి తీసుకొనుచుండెను. అట్లు తపోనిష్ఠనుండి లేచిన సమయమున "దేవుడు లేడు. ఉన్న యెడల నుచ్చనీచము లెందుకుండును?

పాపపుణ్యములేమి, స్వర్గనరకములేమి యనువారు. నున్నాడనువారు. తగవులాడుచు, దేవుడు లేడనువారు లేడని నిరూపించిరి.

ప్ర॥ ఏ విధమున నిరూపించిరి ?

ఉ॥ దేవుడుంటే నేల కనిపించడు ? ఎంతో కాలము బ్రతుకవలెనని యుంటే కొంతమందిని గర్భములోనే, కొంతమందిని పుట్టినవెంటనే, కొంత మందిని బాల్యమున, కొందఱిని వయస్సున, కొందఱిని ముసలితనమున, నేరోగముతోనా, నేవిపత్తుతోనా చావచేయుట మేల? వృద్ధాప్యము లేకుండ యవ్వనమే సదా యెందుకుండనీయగూడదు? అథవా పుట్టించితే కొందఱు ధనవంతులుగా, కొందఱు ధనహీనులుగా, కొందఱు నల్పాయువులుగా, కొందఱు దీర్ఘాయువులుగా, కొందఱారోగ్యులుగా, కొందఱు నారోగ్యులుగ, కొందఱు ప్రభువులుగ, కొందఱు బీదలుగ, కొందఱు పుణ్యాత్ములు వేగముగ చావటము, పాపాత్ములు బెక్కుకాలము జీవించటము, నుండనిల్లు, పండమంచము, కట్టబట్ట,తినతిండి లేనివారు కొందఱు, తినిత్రేపుచు నఱిగిరాక మసలేవారు కొందఱు, మంచిరూపములు కొందఱకు, చెడురూపములు, నంగహీనములు కొందఱకు, వికృతరూపులు కొందఱు, సంతానము కొందఱకు, సంతానహీనత కొందఱకు, నొకరి కొకరి కసూయ, బద్ధస్పర్ధ, విరోధము, పెద్దకులములు, చిన్నకులములు, మంచిమతము, చెడుమతము, నొకరికి కీర్తి, యొకరి కపకీర్తి, మూగలు కొందఱు, వాచాలురు కొందఱు, ప్రతియొక మానవులేగాక ప్రతిప్రాణిలో నేదియో యొకటి కొరతనుంచే యీపక్షపాతము దేవునకేల, మొఱబెట్టితే పలుకని నిర్దయుడు అనే పరుషోక్తులు నిరూపించుచుండ నాస్తికులు నోరురాక నూరకుండిరి. తపస్సునుండి తపసి లేచినసమయమున నీవార్తలు ప్రతిదినము విని విసుగుతో వారిమాట నిజమే నుండవచ్చు. నేను పెక్కుకాలమునుండి తపస్సుచేయుచున్నాను. నాకేమి కాన్పింపలేదు. నేనే దేవుని ప్రార్థించుచున్నానో నా దేవునేకదా వీరు నిందించుచున్నారు. తపస్సుచేత తెలియబడటములేదు. కాళ్ళుడక నలుదిశలుదిరిగి కనిపించే వఱకు వెదకెదనని దీక్షతో భయలుదేరిపోవుచుండెను. కొంతదూర మేగుసరికి నొక యువకుడు దారిలో తోడుపడెను. నీవెవ్వడవని తపసి గాని, తానెవ్వరని యువకుడుగాని పరామర్శించుకొనక తపసి తనభావ

మున పోవుచుండ, యువకుఁడు తపసిపార్శ్వమున వెన్నంటి నడచుచుండెను. తపసి యెందుఁబోయిన నతఁడందుఁబోవుచుండెను. ఇట్లు కొన్నిదినములు నడచినడచి యొకపట్టణము జేరిరి. ధనికుఁడొకఁడు నాదినము వారికి నాతిథ్యము నిచ్చునప్పుడు ప్రతి పాత్ర కల్పకమువలె బంగారుమయమై యుండెను. భోజనమైనపిదప యువకుఁడు నొక మంచి వెలగలపాత్రను దాచుకొనెను. తెల్లవారినంతనే ప్రయాణమగు తపసివెంట రాబయనమాయెను. ఆతిథ్యమిచ్చినందుకు నితఁడెవ్వఁడో వారిసొత్తు దొంగిలించె వీఁడు నావెంట నుండటము తగదనుకొని నాతని దిక్కు చురచురజూచుచు చేయునది లేక పోవుచుండ నాతఁడు వచ్చుచుండెను. లోలోన నెంత అన్యాయ మనుకొనుచు నూరువల్లెలు, వంకలు, వాగులు, గుట్టలు, తిప్పలు, పొదలు, దట్టమైన చెట్లు, పుట్టలు, చెత్తచదారము దాటుచు రెండుదినము లీలాగు బోయిపోయి తుంపరవర్షము చలిబాధతో తడుచుచు చీకటియందు నడవిలో నొక పూరిగుడిసె గనిరి. అందుజొచ్చుటకు తలుపువేసియుండ తలుపులనే కొంతసేపాగ, కొంతసేపటికి లోపలినుండి యెవరో తలుపులు దీసి వీరెవరో చలివర్షమునకు బాధపడుచున్నారని లోనికి బిలిచి నిప్పుల కుంపటివద్ద కూర్చొ నియమించి చలికాచుకున్న వెనుక నాయింటివారు తాము కాచికొన్నగంజి వీరికి కొంతయిచ్చి తాము ద్రాగిరి. వీరు నాగంజి ద్రాగి నచ్చుటనే నారాత్రిగడిపి తెల్లవారి ప్రయాణముచేయ యువకుఁడు తాను దొంగలించిన పాత్రను నటవదలివచ్చుట తపసిచూచి యితఁడెవరో నక్కడ దొంగిలించి యిక్కడ నడుగనిదే జారవిడచివచ్చుచున్నాఁడు. ఈతని చర్య నసహ్యముగనున్నదని లోన తర్కించుకొనుచు యువకుఁడు వెంట రాఁబోవుచుండెను. అట్లు కొన్నిదినములుగడచి యొక పట్టణము జేర నాదినమే పుత్రునకు నామకరణము జేయించుచు షోడశదానము లొసరించు ధనికుఁడు వీరల నాతిథ్యమున కాహ్వానించెను. ఆ రాత్రి నచ్చటనే యుండి ఉదయమే ప్రయాణముచేయదలచి యా ధనికుని సేవకుని యొకని తనకొకచోట దారిజూపుటకు పంపుమని తపసి గోర వల్లెయని యొకసేవకుని వారివద్దనుంచి వారెప్పుడు బిలువనప్పుడుబోయి దారిచూపిరమ్మని చెప్పి యాధనికుఁడుపోయి శయనించెను. అతిథులు నాలుగుగంటలకులేచి ప్రయాణమగు సమయమున నుయ్యెలలో నిదురించు శిశువును యువకుఁడు

మెడనులిమి చంపివచ్చెను. తపసి యిదియంతయు కన్నులార నీక్షించి నాశ్చర్య చకితగాత్రుడై సమయముజూచి యాతనితో గట్టిగ మందలించి తన వెంట వదలించుకోదలచి పనివానితోగూడ నొక కొండనెక్కుచుండెను. అక్కడొకచోట గొప్ప సరికరా వెనుకనున్న యువకుడు ధనికుడంపిన సేవకునియెత్తి నా సరికలో ద్రోయు నతడు జచ్చెను. ఇంతలో తెల్లనారెను. తపసికి నిబ్బరముచాలక నివ్వెరపాటుతో నీ వెవ్వడవు? వచ్చిపాపాత్ము లొనరించు కార్యము లాచరించుచు నా వెంటనేల వచ్చుచుంటివి? నీ పాప మంతయుజూచి నాకు చుట్టుకొనకుండునా? అన సతడించుకనగి నీ ప్రయాణ మెందుకనెను? దైవమును గన అనెను. ఆ దేవు డెచ్చట నుండును? ఎచ్చట నుండునో తెలియదు. కనిపించువఱకు నా యీ ప్రయాణ మాగదన, నేనే దేవుడ ననెను. నీవు దేవుడవైన నిట్టి కార్యము లేలజేయుదువన, నేనుగాక మఱొకరికి నీ రీతి జేయసాధ్యమా? నేను చైతన్యస్వరూపుడను. తక్కినది జడము. కాలస్వరూపుడను. ఏకాలమున కేది జేయవలసినది తెలిసిచేయువాడను నేనే. మొదట పాత్రను దొంగి లించిన దెందుకన, నా ధనికునకు ధనమిచ్చినది నేనే. కాని వాడు నన్ను మఱచి కర్తవ్యాహంకారముతో బీదలకు సాయమొనర్పక వారినే బీడిం చుచు పేరుప్రతిష్ఠలకు, నాడంబరముగ బంగారుపాత్రలజేయించి తను యిష్టపడినవారికి భోజనము లిచ్చుచుండెను. చేయియెత్తి దానమొనర్పని వాడు. అలాటివాని పాత్ర దొంగిలించటముతో నిక నాలాటిపాత్రల బడాయిగనుంచుకోక యిత్తలి, రాగి, కంచుపాత్రల నుంచుకొనును. వానిగర్వమాలాగు మార్చితిని. గంజిపోసినవారు బీదలు. ఒకరికి దానము చేయుటయే యెరుగనివారు. ఆ యింట నీ పాత్రవదలటముతో నింటికివచ్చిన యతిథులకు రెండులోటాల గంజికే భగవంతు డింత వెలగలపాత్ర నిచ్చెనే శక్తికొలది ప్రతిదినము దానమొనర్ప భగవంతుడు తక్కువ చేయునర్పడనే దానగుణము వారికి నేర్పితిని. పుత్రునికి నామకరణ మొనర్చిన భార్యా భర్తలు నా భక్తులు. వారిని బరీక్షించుటకు నొకతనయు నివ్వ నన్ను బూర్తిగ మఱచిరి. వారి పుణ్యఫలము వైరాగ్యజ్ఞానముక్తులు గలిగే సమయమైనది, అప్పుడు నీ కుఱ్ఱవాడుండతగదు. కాన వాని జంపి వారిని నిరుపాధికవైరాగ్యవంతులుగా నొనర్చితిని, మనకు త్రోవ జూపవచ్చిన

నీ సేవకుడు నీ రాత్రి వారియింట గొప్ప దొంగతనము చేయ సమకట్టి గాన నీ పాపాత్ముని కృతఘ్నుని నిచ్చట జంపితిని. ఏదో నొక రూపమున గన్పించి పోవుటకంటె కాలరూపుడనై నీ వెంటవచ్చి నీకే పనుల సర్థమగులాగు జేసి చూపించ నవ్వాడీవు గ్రహింపగలవని నీపను లొనర్చితిని. ఏ వేళ కేది యొనరింపవలెనో, నావేళ కది యొనరించుచుందును. నా మాయలో జిక్కి నన్ను నా మాయ నెఱుంగనివారు, దేవుడున్నాడా? లేడా? అని శంకించుచు వాదము లాడుదురేగాని నీవలె ప్రయత్న మొనరింపరు. యత్నించిన సమాధానము దొరకకుండబోదు. వారు నేను లేననుకొన్న నిక నీ వేమను కొనెదవో యనుకొనుమని యదృశ్యుడాయెను. అదృశ్యమగుచుండి యీలాటి తర్కములు తరచు జరగటముచే నెన్నడైన నన్ను గనుగొనుట కెవ్వరికైన ననుగ్రహింతుననెను. తపసి కంటనీరు ధారాప్రవాహమై రాల నలుదిశల జూచుచు నెందు దాగెనో, మరల వచ్చునో, పలుకునో యని వాపోవుచు, నింట జిక్కిన కుందేలివలె నావెంటవచ్చిన వారిని తెలిసికొన లేక బోగొట్టుకొంటినని పరితపించుచు మౌనము వహించి వెనుదిరిగెను. ఈ కథాసారాంశము విశ్వరూపుని నిత్యవిధాయక మిదియని తెలిసికొన వలెను. దేవుడు లేకుండపోలేదు. లేడనువారు తాము లేకపోతే నా మాట యనవలె, క్షణక్షణమునకు మనకు దెలియకుండ చిత్రవిచిత్రవర్తనము లొనరించు సర్వాంతర్యామియే నీ విశ్వరూపుడు.

ప్ర॥ నాతో నడిగించేవాడు, నీతో జెప్పించువాడు, నుభయబలముల సన్నద్ధ మొనర్చినవాడు యుద్ధమధ్యమున నర్జునునకు గీతారహస్యము వినిపించినవాడాలోకైకనాయకుడేనని నాకు తోచెను. అయితే నొక సంశయము. ఆయన ముఖగహ్వరమున చంపకనే బడి చచ్చుచున్నారనుట యెట్లు?

ఉ॥ ఒక శరీరమున నాలుక రుచుల, నోరు మాట్లాడ, చెవులు విన, కన్నులుచూడ, చేతులిచ్చుకొన పుచ్చుకొన, పాదములు నడవ, నాసిక యాఘ్రాణింప, చర్మము స్పృశింప నేయే యవయవము చేయు పని నది జేయుచున్నదనుకో. ప్రతి యవయవము నాయా సందర్భముల నా శరీరి ప్రేమింపక విడువడు. అందులో నంటరాని, సహించరాని స్థలములున్నను

వానినిగూడ ప్రేమతోనే దూరముంచును. కనుకపురోనికి గంచి పదార్థములు, వంటచెఱుకుల నగ్ని దహించిన రీతి, జీర్ణమై పోవుచుండుటగూడ దేహికి తెలుసు. ఒక శరీరముననుండి యవయవముల నన్నిపనులు జేయించు దేహివలె నీ విశ్వమయుడు సమస్తశరీరముల తన కవసరమని తోచినపుడు చంప నొకని నిమిత్తముజేసి చంపించును. ఒకని యనునది వ్యావహారికముగ మనదృష్టికోణములోనగాని చంపువాడు తానే. దేహబుద్ధివదలి యాత్మబుద్ధితోజూడ కర్త యెవడు? కార్యమేది? తెలియగలము. ఆ చంపువాడు నోటికి నాలుకవలె, చేతిలోని కత్తివలె, తన యవయవమే నక్కఱకు రానివానినిగూడ ప్రేమించును. చంపబడేది తన యవయవమే. దుష్టాంగమును నాపరేషన్ జేయించి తక్కిన యంగముల రక్షించుకొను రీతి, వానిని తానే హాత మొనర్చును. చంపటము ప్రేమయే, చంపబడటము ప్రేమయే. విశ్వేశ్వరునిరూపమున ప్రతియొకవస్తువును దేహావయవముల ప్రేమించిన రీతి, మనము ప్రేమింపవలె. మన నోటిగుహయందున్న బయలువలె నంతట కనిపించు నానందమయుని సంచరించుచు, నాటల నాడుచు, సభల జరుపుకొని చర్చించుకొనుచు, పాటలబాడుచు, ప్రణవాదుల నుచ్చరించుచు, భజించుచు సదవకాశము గల్పించిన హరి బయలున ననన్యశరణ్యులమగుట మన జీవితమున పెట్టనికోటవంటి నూతనానందభద్రము. అటువంటి బయలుగల ప్రదేశములు, కొండగుహలు, భూగర్భములు, నేల సొరంగములు, పుట్టకోములు గనిపించినంతనే భగవంతుని యణుస్వరూపము జ్ఞాపకమువచ్చి యా నిర్భయులువలె మహానమున భగవంతుని చిద్బయలుననుండి సుఖింతుము. వాయువుయొక్క నానా చేష్టలు, మనము ప్రేమించు శరీరములోని ప్రాణము రీతి ప్రేమింపదగియున్నది. "ఆత్మతః ప్రాణ"మన్న రీతి నా వాయువు దైవరూపమే, దైవగతుల నెఱిగించుచున్నది. ఒకప్పుడు సుడిగాలి, వడగాలి మలయముతో వీచును. ప్రాణుల సత్వరజో తమోగుణ స్వభావముల హరి పాలించుచున్నాడు. గాలికి బహుముఖముల చెట్లయాకులు గదలుచుండే నెత్తు గాలికి గుడిసెలు తృణములు పైకిలేచి గగనమున నణుసైన్యము భంగి విహరించుచుండే గుడిసెలు పోయినవారు బయలున నిలిచి కడగండ్లు పడుచుండె, నుదారవంతు లాదరించుచుండే, స్వరముల బలుకుట కవ

తాళమిచ్చి యాకసమం ప్రతిధ్వనులతో వాయువు క్రియాకలాపముల నొన రించు వింతలు హరి మహిమలే. వానిని మనము భేదదృష్టిచే జూడక ననుక్షణము నభిలషించు నానందమును యానందమయుడగు నాత్మను యందు జూడవలె. అగ్ని యది హరి స్వరూపమే. కాని దాని జూచి నేర్చుకొనవలసినదేమి? పాపకార్యములు జేయరాదనియు, నాలాటివానికి భయంకరరూపుడనియు, నపవిత్రవస్తువుల పవిత్ర మొనర్చుటయేగాక దూరముననుండి యాహుతుల నొనర్చిన పాపహర మొనర్చునని తెలిసెడిని. నీరు యమృతమయమై హరి స్వరూపమును స్పష్టముగ ప్రేమింపజేయును. సర్వజీవులకు నీరు ముఖ్యప్రాణము. నీటియొక్క సూక్ష్మాంశమే శరీరముల నున్న ప్రాణము. నీరు హరిగ నెంచి ప్రేమింపవలె. పృథివియందమా! గంధ గుణముగలది. దుర్గంధమయములగువానిని పవిత్రమొనర్చును. మన శరీర ములు బుట్టి మరణించుటకు, నివసింప, సంచరింప, మలమూత్రములనిడ, జీవనోపాయముల బండించుకొన, విహరింప, జప తప వ్రత జన్మము లొన రింప తల్లిదండ్రికంటే ప్రేమింపదగు భవ్యరూపు నా పంచభూతములకు, భౌతికశరీరాదులకు నవినాభావసంబంధమున్నది. భూతభౌతికములయం దున్న చేతనశక్తి యాకసమున శబ్దరూపము, వాయువున శబ్దస్పర్శ రూపము, నగ్నికి శబ్దస్పర్శరూపము, జలమునకు శబ్దస్పర్శరూపరసములు, పృథివికి శబ్ద స్పర్శ రూప రస గంధములైదును గుర్తించునది పరాశక్తియే. కేనోపనిషత్తు: "కేనేషితం పతతి ప్రేషితం మనః" ఎవ్వని ప్రేరణచేత మనస్సు సంకల్పవికల్పములు జేయును. ధృతమగుచున్నదను మాడ్కి నీ భూతములు పరమాత్మ ప్రేరితములగుట పరమాత్మయే యని ప్రేమింప వలె. దేవాలయముల, నవగ్రహముల పూజించుట, దేహమునందలి నవ గ్రహరూపుడగు హరిని ప్రేమించుట నొక్కటియే. ప్రతియణువునందు పర మాత్మయొక్క యచింత్యాద్భుతశక్తియే మనల ప్రేరేపించుచున్నది. నోటిదంతముల మధ్యబడిన వస్తువులు నమలబడి చూర్ణములైనరీతి, రాత్రింబవళ్లనే భగవన్ముఖదంతముల నేను నేనను యహంకారులంత హతముకావటమే క్షణమైన యానందములేక నసూయతోను, బద్ధస్పర్ధల తోను, పక్షపాతములతో, భేదవాదములతో, దంభదర్పమానక్రౌర్య సంకుచితనిందలతో, రాక్షసులకంటే, పైశాచ సైతాన గ్రహముల

కంటే, మిన్నలైన శాంతవంతులై, తుదకు నేగతినొందుదురో వారికే తెలియదు. మనశరీరముల ఫోటో నెత్తించగా నట్టపై కనిపించు మనరూపు చిన్నదైనను దాని యాద్యంతముగని మురియుచుందుము. ఎన్నితూరులు జూచిన తనివిదీరదు. ఎవరిరూపమన్నా మైతే జూడనేజూడము. పూల మాలలు వేయుటము, గంధమక్షతలు నుంచటము, మంచిస్థలమున నుంచ టము, శృంగారించి యనేకులు జూడనుంచటము జేయుచుందుము. ఒక్క- ఫోటోవిషయమే నిట్లున్న విశ్వేశ్వరుని తనయందు తనలో నాయన నామ రూపముల నంతములందంతటజూచి మాటికి ప్రేమించి రమించుటయే విశ్వరూపమును గాంచుట. గొప్పదగు యజ్ఞభిషన్నందుగల ప్రతివస్తువును బహిరంగముగ కొనుటయు, చూచుటయు, నంతరంగమున భావైక్య మున నానందించుచుందురు. ఏవ్యక్తిలో నానందము లోపించి వస్తుదృష్టి దూరమైపోయి యహంకార మమకారాభిమానయుక్తుడై, భేదబుద్ధిచే నఖిలాత్మను చెడ్డగజూచెనో, చెడగోరునో యట్టివాడు కాళిరూపుడగు హరి భయంకరరూపమున కాహుతి యగుచున్నాడు. చిలుకల పలుకు లలో, కోయిలకూతలలో, నెమళుల క్రేంకారముల, కోళ్లకూతలలో, పిక రవములలో, భగవంతునికళ లుట్టిపడుచుండును. హరి సద్రూపము నానందజ్ఞానరూపము, శాంతరూపము, దేవతయందు, దేవమానవుల యందు, నావు, గుఱ్ఱ, మేనుగు, జింక, రొయింటె యిత్యాది దేవతాజంతు వుల హంస, గోరువంక, చిలుక, పావురము, నెమలి, గరుడ, పాలపక్షి యిత్యాదులందు నరటి, మామిడి, టెంకాయ మొదలగు దేవతావృక్ష ముల హరిరూప మతిశయించి మానవుల కన్యోన్యమైత్రిగల్గి సుఖింప దోహదమగుచున్నది. రాక్షసమానవులు, రాక్షసులు, రాక్షస మృగ పక్షి వృక్షములు ననగా పులి, చిఱుతపులి, ఎలుగు, గృధ్ర, కాక, గూబ, రాబందులిత్యాదులు, మల్లె, జముడు, గచ్చ, కల్ల మొదలైన రాక్షస వృక్షములు, నీళ్లులేని వట్టికుంట, చెఱువు, వంక, వాగులు, నదులు హరి భయంకరరూపములు. కావున వీనిని జూచినంతనే సజ్జనులకు భయము గల్గుచుండును. నందనారు తంజావూరు దేవాలయమున శివున కెదుటనున్న వృషభమునుజూచి యది పరమశివున కడ్డముండుటచే "హే పరమశివా! శంభో! నా పాపరాశి యీ బసవనిరూపమున నిన్ను

జూడకుండజేయుచున్న దేంతటి పాతకుండనో యని దుఃఖించెను. ఒక్క క్షణములో బసవడు ప్రక్కకు గదలెను. మిల్టనుకవి జెప్పినరీతి నరకమును స్వర్గముగ మార్చవలెనంటె నట్టి భయంకరదుస్సహాములనైన దైవభక్తు లెదుర్కొని మార్పగల్గెదరు. సక్కుబాయిమీరాబాయి యిత్యాది భక్త లోకము పడినపాట్లు తుదకు తమ నరకముల స్వర్గముగ మార్చినవిధము ప్రపంచమెఱుగదా! వారెవ్వరితోను జెప్పుకొనలేదు. తమయత్తలిచ్చెడు బాధలు తమ క్రమశిక్షణలుగా భావించిరి. బాధలలోనే సహజానందము నొందిరి. నదిలో మునిగి యక్రూరుడు లోపల నాదిశేషసహిత బలరామ కృష్ణుల వెలుపల రథమునకునున్న రామకృష్ణుల మఱచెను. మురళీనాదము చేతనే గోపికలు విశ్వమునుమఱచిరి, యంటే విశ్వమయులైరి. ఛత్రపతి శివాజీ గురురూపమందే విశ్వమును గాంచెను. సోక్రటీసు విషమునందే విశ్వమయుని గాంచెను. జీసస్ శిలువయందే యాజవిశ్వమయుని గన్గొ నెను. గాంధీజీ పిస్టల్ దెబ్బలు మూడింటియందే "రామ ఏవ పరబ్రహ్మ" అనంతవిశ్వమయునిగనెను. కనుతెఱచిన, కనుమూసిన, స్వప్నమందెల్ల కనుపించునది పార్థసారథియే. కానీ, యన్యములేదు. అధిష్ఠానములేక నధ్యస్తవస్తువు కనిపింపదు. అదిగో నది మందాంధకారము. త్రాడు జూచి యొకడు పాము, నొకడు పూలమాల, నొకడు ములుగఱ్ఱ, కడునేలపఱియ నిత్యాది యధ్యస్తవస్తువులు త్రాటికన్న యన్యము కావుగదా! పామన్న త్రాడే, పూలమాలయన్నను త్రాడే. త్రాడులేక భ్రాంతిమయవస్తువులే లేవు. తద్రీతి నీ విశ్వము భ్రాంతిమయమైనను హరిస్వరూపమేనని యర్జును డడిగినదానికి 31 వ శ్లోకమునకు బదులు జెప్పెను.

ప్ర॥ ముందే చంపబడియున్న యుద్ధ మొనర్పమనట మేల?

ఉ॥ దేహాత్మబుద్ధిగలవారు మృతులు. దేహాత్మ వివేకముగలవా రమృతులు. దేహాత్మబుద్ధిగలవారు చావ నిశ్చయించుకున్నారు. దేహ ముల జంపుమృత్యువు భగవంతుడే. మన యహంకారకర్తృత్వము వదలి చూచితే నన్ని తానేజేయుచున్నాడు. చేయునది చేయుబడునది మిథ్యయే. నిదురవచ్చునది, మెలకువవచ్చుట, పోయినకాలముల జ్ఞాపకముచేయుట,

రాగలకార్యముల గుర్తెఱుగుట, ప్రతిబుద్ధివృత్తుల ప్రకాశింపజేయుట, హరిగాక మఱెవ్వరుగలరు. దేహము నెప్పటికి చంపబడిన చంపఁబోయిన దేహాత్మబుద్ధి తొలగినంతనె హరిమయమగుట దేహములు చంపబడినట్లుగా లేదా! యుద్ధ మెందుకంటే పారమార్థిక దృష్టిలేనివారికి వ్యావహారికముగ జేయురీతి నిమిత్తముగ నుండుమనెను. అంతరంగబహిరంగముల నొనర్చునది యంతయు యుద్ధమేనంటే ప్రకృతిని ప్రతిఘటించటమే. తోలుబొమ్మలవాడు బొమ్మలనాడించటములో నెన్నింటినో జంపును. అవి ముందే బచ్చినవి. జడములగు దేహములం దాత్మాభిమానమే వానిబ్రతుకు నభిమానములేదా! మృతమయములే గావా! శిఖండిని ముందుంచుకొని యర్జునుడు భీష్ముని గెలిచినపగిది నర్జునునిముందుంచి భగవంతుడే యుద్ధప్రక్రియ నుపక్రమోపసంహారముల నొనరించెను. హరిని యానందపరవశుడై, యర్జునుడు వినుతించెను. ప్రతియొక్కరు విశ్వరూపమున జెప్పిన శ్లోకముల భక్తిచేపఠింప ధన్యులగుదురు. రూపాయనోటునందు బంధువులంపిన యుత్తరములందు నెంతప్రేమయుండి యెన్నిమార్లు చదువుచు చూచుచు దాచుకొనుచున్నాము. చూచితివా! యెంత విశ్వాసము. ఆ ప్రకారము భగవంతునిచే జెప్పబడిన గీతాశ్లోకములలో నీ యధ్యాయ శ్లోకముల పఠించుట యష్టవిధముల నర్చించటము షోడశోపచారము లొనరించునట్లగును. భావరతులమనుట సంశయము లేదు.

ప్ర॥ అర్జునుడు విశ్వరూపునిజూచి యెట్లు వర్ణించెను?

ఉ॥ ఆదిదేవుడవు, పురాణపురుషుడవు, విశ్వాలయస్థానుడవు, జ్ఞాతవు, జ్ఞేయమవు, పరంధాముడవు, వాయు, యమాగ్ని, వరుణచంద్ర ప్రజాపతి రూపమున లోకమునకు తండ్రివి, బ్రహ్మకు జనకుడవగుట ప్రపితామహుడవగు నీకు నమోసహస్రములు. మరల నమస్కారములు, తిరిగి నమస్కరింతుననెను. సర్వాత్మా! నీకు ముందటవెనుక నన్నివైపుల నమస్కరించెద. నీ బలపరాక్రమముల కంతములేదు. విశ్వమంత వ్యాపించితివి. విశ్వరూపుడవైన నీ మహిమ గుర్తింపజాలక సఖుడవని యెంచి పొరబాటున చనవుచే కృష్ణా! యాదవా! సఖా! యని వినయరహితముగ దేని సూచియించియుంటినో. మఱి యచ్యుతా! విహార, ఆహార, శయన

కాలములగాని, నీయొంటిగా, నేముండునప్పుడుగాని, నీ వొక్కడవై యుండునప్పుడు గాని, లేక యితరులతో నుండునప్పుడుగాని, పరిహాసార్థము నీకొనర్చిన యమర్యాదను, అప్రమేయుడవగు నీకు క్షమాప్రార్థన మొనరించుచున్నా ననెను. స్థావరజంగమాత్మకమగు నీ జగత్తునకు స్రష్టవు. పూజనీయుడవు. గురుడవు. పెద్దవు. త్రిభువనములలో నీకు సమానము లేదు. నీకంటే శ్రేష్ఠు లింకెక్కడ దేవా! కనుక నీకు సాష్టాంగనమస్కారములు. పూజనీయుడవు. ఈశ్వరుడవగు నిన్ను నన్ననుగ్రహింప వేడుచున్నాను. తండ్రికొడుకు యొక్కయు, స్నేహితుడు స్నేహితునియొక్కయు, ప్రియుడు ప్రేయసి యొక్కయు లోపముల సహించినపగిది, నీవు నాయపరాధముల క్షమింపు. నేనుగాని, యితరులుగాని, యింతకుమునుపుజూడని విశ్వరూపమును గాంచి యానందము నొందితిని. నామనస్సుభయవ్యాకులమగుచున్నది. దేవేశా! జగన్నివాసా! జగన్నాటకా! జగదాధారా! ప్రసన్నుడవై మునుపటిరూపమును జూపుము. సహస్రహస్తా! నేను నిన్ను పూర్వరీతిని కిరీట చక్రగదాశార్ఙ్గహస్తధరునిగజూడ గోరుచుంటిని. దుర్నిరీక్ష్యమగు నీ విశ్వరూపముపసంహరింపు. విశ్వమూర్తీ! చతుర్భుజరూపము వహింపుమని ప్రహ్లాదుడు హిరణ్యకశిపునిజంపి యుగ్రుడైయున్న నృసింహుని వేడినరీతి నర్జునుడు వేడెను. పంచేంద్రియముల విషయప్రపంచము హరియే. నిజముగ హరియె.

ప్ర॥ భగవంతుడీరీతి ప్రార్థింప నేమనెను? విశ్వరూపసందర్శనము తపో యజ్ఞ దానవ్రతములవలన, వేదముల నభ్యసించినవారు జూడలేరా?

ఉ॥ జూడజాలరు. వారు వ్యక్తిగతాభిమానులై, ద్వైతబుద్ధులు గనుక ఫలముల గ్రహింతురు. భగవంతుడనెను: ఓ యర్జునా! యథార్థముగు నన్నుగురించి శాస్త్రజ్ఞానము, ప్రత్యక్షసాక్షాత్కారము, మోక్షమును కేవలము ననన్యమగు భక్తివలననే లభించుననియు, ననన్యమగు భక్తియొక్కటియే విశ్వరూపమును దర్శింపజేయగలదనెను. తక్కిన తపో దానాదుల సాధ్యముకాదనెను. భక్తులు భగవంతునిచేతిలోని వస్తువులైతే మనకు మేలనుకుంటే దానికి దోషముగలదు. అందువలన భగవంతుడు ధరించిన వస్తువునకు భగవంతునకు మధ్యయుండుట భక్తి

సులభముక్తి. ఎందుకంటే భగవంతుని చేతిలోని యొకవస్తువుగావలెనన్న యహంకారమే. అహంకారమేమాత్రమున్నను వస్తుస్వరూపము తొలగి ద్వైతస్వరూపము సంభవించి దురహంకారత లోకమును పీడింపగల్గుదురు. కావున దేవ, గురు, తలిదండ్రి మొదలగు పూజ్యుల నణురూపులై యనన్యులై యుండుటే శ్రేయము. హనుమంతుడొక్కడే రావణాదుల జంపగల శక్తిగలవాడు. కాని రాముని పాదరజమువలె ప్రవర్తించెను. ఒకప్పుడు నారదుడు వైకుంఠమునకురా జయవిజయులు హరిమందిర ద్వారమున కావలియుండి లోనికి జొచ్చనీయరైరి. కారణమేమన, హరి పూజారతుడై యున్నాడనిరి. నారదుడాశ్చర్యపడి హరి వచ్చువఱకు వేచియుండి వచ్చినంతనే పాదములకెఱిగి నమ్రుడై నీవెల్లవేల్పులకు పెద్దవు. నీ వెవ్వరినిగుఱించి పూజించెదవు వివరింపుమన, ఘక్కునవ్వి వికసితవదనుడై నారదుని సత్కారపూర్వకముగ గూర్చుండనియోగించి సాదరమున నేడు ద్వారములు దాటిపో లోపల నొకపెట్టెయున్నది, అందులో నేడఱలుగల డబ్బియున్నది, దానియందుండేవస్తువును పూజింపుచున్నాననెను. నారదుడు పరుగిడిపోయిచూడ ధూళియుండెను. మరల వచ్చి యీ ధూళియున్నదన నయ్యది ధూళియనవలదు, పరమపవిత్రమైన నా భక్తులపాదరజవస్తువనెను. నా భజనకు నా పూజకు నర్హమైనదనెను. నారదుడు పరమాశ్చర్యపరుడై మహాసంతసమున తేలియాడుచు నాహా! నారాయణా! నీయపారకరుణకు నమస్కారములని యరిగెను. దగ్ధబీజవత్తహంకారము లేశమైనలేని నిర్మలభక్తిచే విశ్వేశ్వరుని కృపబడయవచ్చు. "మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః" యనే ౫౫ వ శ్లోకముతో భక్తుల కుండవలసిన లక్షణముల జెప్పెను.

ప్ర॥ ఏవేవీ? అవి యాచరింప సాధ్యములేనా?

ఉ॥ సులభసాధ్యమగునవియే జెప్పెను. మనోవాక్కాయముల నాచరించు కర్మల నాయనకొఱకేననియు, పురుషార్థమగుమోక్షము తానే యని నిక్కముగనమ్మటము,ధనపుత్రకళత్ర దేహాదులందాశలేకుండుటయు, సర్వకాలసర్వావస్థల తన్నే యాశ్రయించియుండటము, సర్వజీవులు విశ్వరూపునిరూపములగుట, వానియందు వైరభావము లేకుండుటయు ననే

య్యైమలక్షణముల ప్రణవపంచాక్షరిమంత్రమువలె జెప్పెను. పంచాక్షరీ మంత్రమునకెను వీని నాచరణ సేయించుట భక్తులుగ తలపబడును. దేవాలయమున మూలవిగ్రహములవలె నిరాకారుడును, ఉత్సవవిగ్రహములవలె సులక్షణ సాకారస్వరూపమునన్న విశ్వరూపమును, విశ్వము హరి, హరియే విశ్వము. “భూతాని విష్ణుర్భువనాని విష్ణుః” అనే నైర్మలక్షణముల సాధించి హరిరూపులే యను పృథకముగ చెప్పుటే ఫలము. ఇందుకు సందేహము లేదు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
విశ్వరూపసందర్శనయోగో నామ
ఏకాదశోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచన గీత

## ద్వాదశాధ్యాయము

### భక్తియోగము

---

ఉ॥ భక్తిమహామృతంబు నిరుపాధికశుద్ధరసాయనంబు ని
ర్వ్యక్తభవార్ణవోద్ధృతము ముక్తిప్రదంబు జనాంచితంబు స
ద్వ్యక్తనిధానగమ్యము నవాప్తవిమోహము ధర్మసూక్తసం
యుక్తము నిత్యప్రాప్తము పయోరుహనాభునిగీత గాంచుడీ.

ప్ర॥ ఈ యధ్యాయమునకు ప్రత్యేకించి భక్తియోగమని పేరు పెట్టు టేలా?

ఉ॥ ద్వాదశమంత్రమువలె నీపండ్రెండవ యధ్యాయము సప్తాక్షరీ, యష్టాక్షరీ మంత్రములవలె సప్తమాష్టమనవమాధ్యాయముల జెప్పు కొంటువచ్చి వాని యన్నిటికన్న కాశీ మొదలగు స్థలముల విడిచి హరి ద్వారముననున్న గంగకు పవిత్రనామము వచ్చినరీతి, గాంధీజీకూడా నీ యధ్యాయమునకు వేదవేదాంగములకంటె నెక్కువ ప్రాధాన్యమిచ్చుటయే గాక వివాహకాలముల వధూవరులు ముందు కంఠస్థము జేసికొనియుండి బంధువులాది వియ్యంకుల యెదుట పారాయణముజేసి వివాహమాడు నియమ మేర్పఱచెను. తను జీర్ణించుకున్న పరమప్రేమ, సేవాధర్మము, శరణాగతమార్గము నీ యధ్యాయముననే యున్నది. ఇరువది శ్లోకములు గలది. సగుణోపాసకుల నిర్గుణోపాసకులగు భక్తుల తారతమ్యము సగుణ నిర్గుణ భక్తుల లక్షణములు నన వారి యర్హతలు తెలుపబడినది. ద్వితీయ షట్కముయొక్క యంత్యమాధ్యాయము ద్వితీయషట్క సారాంశ మంతయు నిందుగలదు. ఈ యధ్యాయాంతమున "యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే" ఇయ్యది ధర్మ్యామృతము. గీతాక్షీర

వారాశి జనియించిన భగవతి జయలక్ష్మి. లక్ష్మి జనించినంతనే దైత్యులు దేవతలు నన్ను వరించు, నన్ను వరించుమని సమీపింప నామె కోరికె లేనివాడెవడో వానిని వరింతుననెను. కోరికలేని మహాత్ములసొమ్ము నీ సంసారవిజయలక్ష్మి. ఈమెను బడయు సగుణభక్తుని లక్షణములు 13 శ్లో॥ నుండి 20 శ్లో॥ వఱకు నలువదిరెండు కల్యాణగుణములు జెప్పి ఆయా గుణములతో నొప్పువాడు నాకు యిష్టుడంటు నీగుణములన్నిటితో నొప్పువా డత్యంతశ్రేష్ఠప్రియుఁ డనెను. శుద్ధభక్తి నానబట్టినవజ్రము, ఒరుపుబెట్టిన బంగారు. సముద్రుడు తనయం దెన్నిరకముల జలచరములు చిత్రవిచిత్రముగనున్నను, వాని జీవితరూపములకు సంతసించుటలే దొక్క చంద్రునికొఱకే నెదురుచూచును. భక్తిరతులు విశేషించి లోకమున నన్య దైవతములున్నను, వాని గుఱించి యనుకొనుటయేలేదు. గీతాచార్యు డున్నను, గీతయున్నను వారికి ప్రాముఖ్యము.

ప్ర॥ అర్జును డీయధ్యాయమున తానే ప్రశ్నించటమేలా?

ఉ॥ సందేహము గలిగినపు డర్జునుడే కాదెవరైన యడుగవచ్చు. నీకు సందేహమున్న నన్నడుగుచుంటివికదా? కారణమేమిటియంటే విశ్వరూప సందర్శనయోగాంత్యశ్లోకమున "మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగ వర్జితః। నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ" కర్మలు భగవంతునికొఱకే నర్పించి భగవంతునే పరమపురుషార్థముగ తలచి పుత్ర మిత్ర కళత్ర ధన ధాన్యములందు నాసక్తిలేక తన్నే యాశ్రయించినవాడు, సర్వజీవులయెడ వైరభావము లేనివాడు నన్ను బొందునన్నమాట చెప్పుటకు సులభమే. చదువుట, వ్రాయుట, చూచుట సులభమేగాని, యాచరించటములో పట్టుదల, స్థిరదీక్ష, తొలగనిప్రేమ, యేమరని బుద్ధి "రామ కాజ్ సాధేబినా మోహి కహా విశ్రామ్" తు॥ రామా॥ రామకార్యము సాధింపనిదె నాకు విశ్రాంతి యెక్కడిదనెను హనుమంతుడు. రామకార్యము సమాప్తమైన రాముడే విశ్రాంతి నిచ్చుననెను. భగవత్ప్రాప్తి బొందువఱకు భక్తులకు విశ్రాంతి యుండదు. ఎన్నియో కుంట్లు తిరిగి నదులు నెన్నియో నాలుకలుచాచి యగ్ని ఎన్నియోదిశలకెగబ్రాకి పవనుడు సంచరించెడరన్న తమ తమ గమ్యస్థానముల జేరుటకు పడే యాతన లేక వేదన జడభరతుని విప్రజన్మమున కున్నగతి శుకుని బ్రహ్మనిష్ఠ తుకా

రాము నిరహంకార యుగంధరు నూక్ష్మప్రేమ, సమర్థుని యువాత్మజప్రేమ, గాంధీజీ ప్రశాంత మానవసేవయే మాధవసేవ. తులసీదాసు భక్తిప్రపత్తివలె నుండినగాని యునస్వార్థనామమున బిలువబడరు. ప్రపంచమున మానవులు సాధింపరాని దెద్దియులేదు. అయినా సాధింప సులభసాధ్యముగాని దొకటున్నది. "న స పునరావర్తతే" తిరిగి జన్మములేని భగవంతుని బొందుట.

ప్ర॥ జన్మమరణాదులు వచ్చుట యజ్ఞానముచేతనేకదా! అజ్ఞానము పోయిన నవి తొలగగలవు. అజ్ఞాననివర్తికి జ్ఞానముచాలు. భక్తియేమిటికి?

ఉ॥ జీవితమునకు నవసరమగు పాలనిచ్చునది పశువు. అయితే దానిని చక్కగ బోషించితేనే మనపై ప్రేమజేసి కాలదన్నకుండ కుంత బగలకుండ, మూతినొయ్యకుండ, వెలికిలబడకుండ తనయందలి పాలనిచ్చును. జ్ఞానవికాసమునకుగూడ నంతఃకరణము మలినరహితమై యేకాగ్రతగలదిగా నుండవలెనని యింతకుమునుపే విన్నావు. అంతఃకరణశుద్ధి గలిగినంతనె మహావాక్యముద్వారా జ్ఞానము భాసించి యజ్ఞానము నివర్తిల్లును. అప్పుడే మోక్షము. కంటికి కనిపించు పంచభూతములు, పర్వత, సాగర, స్థావరజంగమములు, కాలములు, మంత్రములు, యంత్రములు, తంత్రములు, నిరుక్తమార్గములు, వేదములు శబలితబ్రహ్మములగు సాపేక్షణీయముల సాధింపవచ్చు. మోక్షమునకు ప్రతిబంధకమగు నవిద్యయే కొలకరానిదై తొలగింపరాని వజ్రకఠినమై తికమకలు గల్గించుచున్నది. అదియె సంసారరూపము. వివిధములగు ప్రస్థానములన్ని యవిద్యా సంసారనివర్తకమ్యో తటస్థనీయములై, యాప్తవాక్యములై "ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత" అనుచున్న మానవలోకము కన్నులుదెఱవకున్నది. పంజరమునయున్న పక్షులు, బోనునయున్న మృగములు, జయిలులోనున్న ఖైదీలు, నరకమునయున్న పాపులు తమతమ స్వేచ్ఛ స్వాతంత్రములకు భంగమగు ప్రతిబంధకముల వదలించుకొన పలుమారు ప్రయత్నించుటలేదా? చెత్తచదారము, దుమ్ము మీనుగుపెంటలు, కుల్లు కంపుతోనైన తిప్పలు, గుట్టలు, కొండలు, చెట్లు, పొదలు తదితరము లడ్డగించిన తన యేకైకస్థానము పరుసవేదివంటి పరిశుభ్రస్థానముజేర పరుగిడుచుండును. ఏరై లేచ్చుట బయలుదేరినదో దిగేవారు దగుచుంటే, నెక్కేవారు నెక్కుచుంటె రాలేక, నెక్కలేక డబ్బులేనివారికొఱకు నెదురు

చూపక [illegible] [illegible] [illegible] [illegible] [illegible] చేసి [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] కూడ కట్టి యుంచుకొనవలెను! ఏకాంత [illegible] [illegible] వచ్చిన బాలబాలికలు ముందే వచ్చియున్నారని ఉత్తరములు వ్రాసి వెంటనే తమ నివాసమునకు వెళ్లుచుందురు. తల్లులజేయుటకు [illegible] [illegible] [illegible] బాలుని అలుచుచు [illegible] [illegible] [illegible], తల్లులనే నమ్ముచు దాట్లుతీయుచున్నారు. [illegible] [illegible], [illegible], పశువులు [illegible] [illegible] [illegible] తమ నివాస్థానము చేరుట విహంగములు నేర్చుకొన్న దెట్టి [illegible] విహరించుచు సాయంకాలమగునప్పటికి [illegible] [illegible] [illegible] మనకు పాఠము నేర్పుచున్నవా? అవి [illegible] [illegible] [illegible] [illegible] ఎక్కడికో తెలియదు. బస్సులు, ట్రాములు, కారులు రైళ్లు, నోడలు, సైకిల్లు, బండ్లు, గుఱ్ఱములు, నొంటెలు, [illegible] నెన్నితూర్లు [illegible]; ఎన్ని తూర్లు నెగలేదు; ఇక నెన్నిమార్లెక్కగలము. దినదినము బిజిలీలు లెట స్థించుచున్నవి. మనలక్ష్యమేమెను [illegible]. [illegible] పేరే జ్ఞాపకము లేని మందులమైతిమి. కొవ్వుజవి ధ్యూర్, రైట్ అనుబుల్ మొదలగు బిరుదుల బండారముతో, నార్త్రాపత్రికలతో, మీటింగులతో, పదవుల నెన్నికలతో, నాడంబరజీవితములతో, పేరుప్రతిష్ఠలతో "అజ్ఞాతజ్ఞాపకం హి శాస్త్రమ్" మనుదినాని నెఱుగజేయు శాస్త్రము ప్రతిక్షణము ఘోషించుచున్నను తప్పత్రాగినవానికి, మూర్ఛవచ్చినవానికి నిదుర బోతుకు మెలకువరానట్టు మెలకువరాలేదు. ఒకవేళ రాకపోయిన జెప్పితే వినటము, నాలోచించటము నేవాక్యములనైనను కొట్టుట కూడలేదు. తిరునాళ్లకు, తీర్థాలకు, వైవాహికములకు, ప్రవాసములకు, తమాషలకు, విందులకు, భోగము మేళములకు నప్పైనజేసి, డబ్బుఖర్చుచేసి నిదుర, తిండితీర్థము నైన యాలోంపక తిరుగుదురు. ఎన్నిపోకలు తిరిగిన స్వస్థలము జేరవలెననే యాతురతుండుటలేదా? ఎన్ని జన్మములెత్తి, ఎన్ని కాపురములు జేసి, నేయే దేశముల, నేయే ఆచారభాషల నేతీరు గడిపినాము తెలియదు. నేడు ఇందువచ్చి ఇట ఉన్నాము. ఏసమయమున కెటబోదుము తెలియదు. అంతిమ దివసమున తిరిగి వెళ్లుదుము. మనముజేసినవన్ని యేమైపోవునో

లోకమునకు నొకవిధముగా తెలియును. అయితే మన జన్మస్థానమేది? మన కేంద్రమేది? అని అనుకోను పురసతులేని కార్యవ్యాపార బాహుళ్యమున శాశ్వతముగ నిందేయుంటామని కట్టేమేడలు గట్టుచుంటే, కొనేభూములు కొనుచుంటే, వ్యాపారముల, కృషి, కార్మికముల నొకరిని మించి యొకరు జీవితము పోరాటముగ జరుపుకొనవెంచుచు టక్కరతోనో, మోసము, ద్రోహము, దగా, చోరత్వ క్రూరత్వములతోనో, మరేవిధముననో బ్రతుకుల, భాగ్యముల పోటీలలో ద్వేషములతో, మతములతోటి మతము, నాదర్శములతోటి నాదర్శము, జాతి జాతికి, వ్యక్తికి వ్యక్తికి, సంఘానికి సంఘానికి, బజారు బజారునకు, ప్రాంత్యము ప్రాంత్యమునకు, దేశదేశములకు మత్సరక్రోధాసూయల రెచ్చగొట్టు కుంటూ వ్యక్తమగా చంపుకొనట యొకరిరక్త మొకరు పీల్చటము, దుర్బలుర నేపడము, బలవంతుల పీచమణచటము, స్థలవాదన, గృహవాదన వస్తువాదనము లనేకములతో, నాదినీది అనే భేదములతో, తర్జన భర్జనల, పటాటోపాట్టహాసముల తలబిరుసులతో, బహు చదివినవార మొకరికి జెప్పనేర్చినవారము నెన్నిప్రాయగలము, నెందఱనో యాక్షేపింపగలము. మాకు సరేరీ అనువారలు సైతము పోలీసులు తీసుకపోయి కారాగారము నేమిజేయునది తెలియనిరీతి నెక్కడికి పోవున, దెవ్వారికితో చెక ప్రయాణముజేసెదమనిన మానవుల యోగ్యతయేది? దేనిమహిమ యిది? మాయ లేక సంసారమహిమ యపారపారావారము గంభీరము.

ప్ర॥ ఆ సంసారమును వేషములువేసి భక్తులమని తిరుగువారలు తరించిన వారేనా?

ఉ॥ నాటకములలో, సినిమాలలో, తదితర పరివర్తనములలో, భక్తుల వేషములు చూతుము. వారలు నాయావేషముల నున్నంతవఱకా యా యక్కరలు దీరువఱకే భక్తులు. తక్కినకాలమున మీారు భక్తులేనా? అని అడిగిన నొప్పరు. భక్తులైనందుకు తక్కిన వానిపైనున్న భక్తి వదలియుండవలె. అసలు భక్తియెందుకో తెలియవలె. అందుకే నీ యధ్యాయమున భగవద్భక్తుల లక్షణములు తెలిసికొనుమనను. వేషమువేసి, భావములునేర్చి గంగ, ప్రయాగ, సరస్వతీత్యాది నదులమునిగినను, పెక్కుచిహ్నములగు బొట్టుజుట్టులమార్చినను, కీర్తనల పద్యముల

పాడిన, కోళములువేసిన, తంతెలుమీటిన, తలలు త్రిప్పిన, రుద్రాక్షలు దాల్చిన, భూతిబూసిన, తిరుచూర్ణముకొట్టిన, తలలు బోడులైన, తంబుర బట్టిన, గజ్జలుగట్టిన, తైతెక్కలాడిన, యరేరీతినుండిన పిల్లల దాగుడు మూతలాటరీతి చెవిటివ్యవహారము, గ్రుడ్డిప్రయాణము, మతిహీనునిలెక్క, మందమతి ఉపన్యాసము, కుంటిచేతుల యంత్రప్రయోగము, సంధవిశ్వాసము, సబలల చేతివస్తువులు, నాడువాంఛ యంతరంగములోని మాటలు, హాస్యకుని యేడ్పు, వేశ్యలనీతులు, దొంగలవ్యవహారములవలె భగవత్ప్రాప్తికరములుగావు. చెప్పుము నీ ప్రేమ నెవ్వరిపైనిది?

ప్ర॥ భగవంతునియందలిదికాదు. తమతమ దేహములపైన, వాంఛిత వస్తువులపైన ప్రేమ.

ఉ॥ దేహముకొఱకై భగవంతునిపేరుజెప్పి కర్తృత్వభ్రాంతితో నేయే వస్తువుల వినియోగింతురో నా వస్తువులను మాత్రమే భగవంతుడు మేలు జేయును. ఎందుకన నెదుటనుంచిన పత్ర, పుష్ప, ఫల, తోయాదులు నేకైకభావమున నుండును. అందుకై వానికి భగవంతుడు మేలొనరించును. వారికి నన్యవస్తువులపై నిచ్ఛయుండుటచే వారికేమివ్వగలడు? ఆ నిర్ణయము తమ మనస్సు జేసియుండును. భగవంతునియందుగాక తక్కినవానిపై ప్రేమ ప్రేమ కాదది మోహము.

ప్ర॥ వస్తువులనగా నేమి?

ఉ॥ పత్రపుష్పాదులవంటివి, దీప ధూప నైవేద్యాదులు. వీనికే భగవంతుడు ఫలమిచ్చును. భక్తిలేని పూజారులైతేనేమి, కుక్కలజన్మము వచ్చునని శ్రీమద్రామాయణమున నుత్తరకాండలో రామునితో కుక్క చెప్పలేదా? తొలి జన్మమున కోయిల పారుపత్తెమునసుంటిని, దాని ఫల మీ కుక్కజన్మమనెను. ఒక్క రామకృష్ణపరమహంస మాత్రమే ప్రతిఫలరహితుడై యుంబను ప్రత్యక్షపఱచుకొనెను. బమ్మెరపోతన, గోపన్న, సూరదాసు, కబీరుదాసు, రోహిదాసు, త్యాగయ్య పెక్కుమంది వారీమతల్లు లప్రతిహతమనస్కులై దేశచరిత్రల శిలాక్షరస్థాపితులైరంటే మనము వినమా, చదువమా.

ప్ర॥ పురుషార్థమగు మోక్షమునకు భక్తిమార్గము తేలికయగుట నిదియే చాలనెదరా?

ఉ॥ మోహా[illegible] [illegible] [illegible] [illegible] [illegible] ఏ గ్రంథ కారులైన చెప్పిన [illegible] ప్రస్తుత [illegible] గలది, ఆనేకాపూర్వమైనది, [illegible].

ప్ర॥ ఈ సంసారమును [illegible] భగవంతుడేమి సహాయము చేయుడా?

ఉ॥ మనయందెంత దయను భగవంతుం డెన్ని మార్గములు తెలిపెనో తెలియదా? మన మానవులకు "అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ" భక్తి రుదాహృతః" యన్నరీతి యాతడిన జెప్పిన మార్గములలో నేదియొక్క మార్గమైనబట్టి యొకతేగని దీపపు తైలధారవలె నామమును స్మరించుచు, నమ్మి నడచితే చాలు, సంసారమునుండి ముక్తి గలిగింపగలడు.

ప్ర॥ ఏకాదశాధ్యాయమున విశ్వము భగవత్స్వరూపమన్నపుడు భగవంతుడు కానివస్తువేమున్నది? ఈ యధ్యాయము చెప్ప నవసర మేమంత కనిపింపదు.

ఉ॥ అట్లనకుము. విశ్వము విశ్వేశ్వరుడన్నది గీతాశాస్త్రము. దీనిని జ్ఞానులు తెలిసికొందురు. అజ్ఞానులు లేదా సామాన్యజను లేమెఱుగుదురు? "వాసుదేవ స్సర్వమితి" వాసుదేవుడే అనును జ్ఞాని. భక్తుడు సర్వము భగవంతుడేయనును. ఒకటి జ్ఞేయ, మొకటి ధ్యేయ, మొకటి జ్ఞాన, మొకటి బుద్ధి. 'కలౌ స్మరణాన్ముక్తిః' కలియుగమున నామస్మరణామే ముక్తిప్రదమనెదరు. కలియుగము కావర్ధము. యుగములు రెండు. అవి యేవి? కర్తృత్వ భోక్తృత్వములు లేదా అహంకార మమకారములు. కలియన యవిద్య. అవిద్యవలన యహంకార మమకార యుక్తులై శాంతి లేక నానావస్థలుపడువారికి హరియన బంధముల హరియించుననియు, నామమున సర్వపాపములనియు, నట్టి నామస్మరణ పునీతుని జేయునందురు. అదికూడ నమ్మకముండవలెనే. లేకపోతే నేమి జేయులేదు. విశ్వరూపముననే సమగ్రముగ వర్ణింపబడినదియైనా "మత్కర్మకృత్తని" ఐదు లక్షణాలు జెప్పిన నాలక్షణాలలో నేదియొక్కటి దప్పినను, యెంత మూర్ఖ తక్కువైన హైస్కూలులో పిల్లల పాసు చేయునిరీతి, హరిని బొందుటకు దూరులగుదురని తోచును. కోరు సంకల్పములు, చేయు

కర్తృత్వములుగా చేయు పనులుగా నుండగూడదు. స్వార్థములైన సంకల్ప కార్యములు భగవత్పరముకావలె, నిస్స్వార్థము గనపడవలె. "సా కస్మై చిత్ పరమా ప్రేమరూపా" నా॥ భ॥ శ్రేష్ఠభావము గలిగి యుండవలె. 'మత్పరమ' భక్తుని ప్రేమ కొలతలో నొకవిశ్వాసము మిళితమై యుండ గూడదు. స్త్రీపాత్రగాని లేక నొక వేషము వేసిన నటుడు హాస్యరసలేక తన సహజరూపుననున్న తను జేసే పోషణ ఫలానివాడనెవరుగాని వేషము కాదందురు. దారము లేకపోతే నొక్కటిగ పూసలు హారముగ నెట్లు నిలువగలవు? ప్రతిపూసకు దారము లోన వెలిగనుండురీతి సంతరంగబహి రంగముల భగవంతుడుగానె యుండవలె. ఒక పదార్థముపైని తీపుగల్గి లోపల చప్పనయుండిన మంచిది కాదందుము. తీపు లోపల వెలుపల నంతట యుండిన రీతి భగవద్భక్తి యుండవలె. "సాపరానురక్తి రీశ్వరే" శాం॥ సూ॥ అంతములేని యభేదస్థితిచేత "తుష్టే భర్తరి నారీణాం తుష్టాః స్యు స్సర్వదేవతాః" భార్య భక్తివలన మగడు తృప్తినొంద తక్కిన దేవ తలు సంతుష్టి నొందుదురు. భగవంతుడే మెచ్చెనా ఇక యన్యుల జెప్ప వలెనా? ముందే తనివి జెందుదురు. పెద్దచెఱువునిండెనా, చిన్నకాలువల కేమి తక్కువ? సూర్యుడేయున్న దివిటీలేల? సముద్రస్నానమేయైన నన్ని నదుల మునుగ పనిలేదు. ఎవరో మెచ్చుటలో నేమి ప్రయోజనములేదు. భగవంతుడు మనపట్టుండవలె. భీష్మ ద్రోణ కర్ణాది వీరు లెందఱు తమ పట్టైన నేమి? జయ మొందెనా దుర్యోధనుడు? ఒక్క హరి తన పక్షమగుట విజయనామము సార్థకమాయెను అర్జునునకు. ఎన్ని చుక్కలున్న నేమి? చంద్రుడు లేనిచో. నన్నిగ్రహములున్న నేమి? తనకు వాసములేనివి. యెంద రున్న నేమి? తన్ను రక్షించలేనపుడు. గజేంద్రుని, ధ్రువుని, ద్రౌపదిని, విభీ షణుని, సుగ్రీవుని, నహల్యను నొక్క దేవుడేకదా. 'మద్భక్త' యనుట విశ్వమున నీవు చూచిన స్థలముల కల్పితదేవుళ్లగాదు వానికి మూలకారణు డగు నన్నే యవిభక్తిగ భజింపుమనెను. తన పెనిమిటి వ్యాపారముకోవ తనకొక వెలగల చెవి కుండలముల తెమ్మని భార్యయడుగ మగడు తెచ్చిన మీదట చెవులకు బెట్టుకొని చూడవచ్చిన యమ్మలెల్ల చెవులకు తగిన సొమ్ము లెంతబాగున్నవని ముచ్చటపడి, విఱుగబడి చూచుచుండ నా

త్రోవన జను వివేకియొకడు యది యంతచూచి విని గులమిడిగల చెవులకు కుండలములు బెట్టితే నంతయందముగనున్న చెవు లిచ్చినవానిజూచిన మ జెట్లుండుననె, చెల్లాచెదరై సిగ్గుతో వెళ్లిరి. చెవుల నొక్కదాని ప్రేమిం చటముకాదు. అన్ని చెవు లన్ని యవయవములుగల సర్వమయుని ప్రేమిం చితే సరి. తన కిష్టమైనది ప్రేమించి, యయిష్టమైనది ప్రేమించకపోతే ద్వైతము, నానాత్వము, ద్వంద్వము, నసంపూర్ణత వాటిల్లగలదు. “సంగవర్జితః” కమలము నీటనున్నది నీరు నంటదు, గచ్చకాయ ధూళి యందున్నది ధూళి నంటదు. మునిగిన విషజంతువగు పాముతో బెనగి నది కఱచిన విషమెక్కకుండ నకులవల్లి నములును. పాములవాడు తన తల క్రింద పాములపెట్టె నుంచుకొని నిద్రించిన రీతి విషజంతువు తనవద్దనున్న భయములేదు. ఆకసము సూర్య చంద్ర నక్షత్ర పర్వత వృక్షాదులు నీట గన పడినను యంటనిరీతి, జలచరములు నీటనుండి యంటని భంగి, మజ్జిగ యందలి వెన్న విధము, పాలయందలి తెలుపు పగిది, గర్భముననున్న బిడ్డనంటని తల్లి చందము, వంటక పదార్థముల ప్రయోగించు గరిటె పగిది తాను యసంగుడుకాన, యసంగదృష్టితో తాదాత్మ్యము బాధింపబడి నందున కోరికదృష్టితో లేనిచో భంగములేదు. జ్ఞానదృష్టితో సర్వము తానే, భక్తిదృష్టితో సకలము భగవంతుడే వ్యక్తమగుచుండ నేది కోర వలెను? కోరున దెందుకు? అంటువలన గలిగెడిదేమి? తనకు వైరులు, మిత్రులు లేరు. అద్వైతమే, నఖండమే. ఏకనాథునికూతురు యుదయ మున స్నానమొనర్చి వలువలు ధరింపక దిసమొలతో లోపలరా, సంతో భా చూచి పెడముఖయగుటగాంచి యేకనాథునితో నాయనా! సంతో భా కింకనుయభిమాన మున్నందున భేదబుద్ధి తొలగలేదనెను. భాగవతమున వ్యాసుని జూచి చీరెలు ధరించిన దేవస్త్రీల భంగి సంతోభా యాననెను. దుర్వాసుడు రుక్మిణిని బండిగట్టి నీడ్పించి నామెపై యొండిన పదార్థము లన్ని బూసి రోతకొనర్చిన కృష్ణుడు చిరునవ్వునవ్వ నామె యించుకంతయు చలించలేదు. దుర్వాసు డాచిన్మయుని యోగకౌశలము, రుక్మిణియందలి నిరభిమాన నిర్మోహ గాఢాభేదస్థితికి నానందించి యతనికి నీవు, నీకతడు తగునని యథారీతి నాశీర్వదించి వెళ్లెను. అభేదము సాధ్యరూపమై సహ జము కావలె. “భక్తిరేవ పరమార్థదాయినీ” భక్తి నిరుపమాన నిరం

ఫలకమై తనకు తానై తేగాని యనుభవమగు నద్వైతభ క్తిగాదు.

ప్ర! "జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ" తెలుసుకొనుటకు సాక్షాత్కరించుకొనుట యనే యర్థము సరేకాని ప్రవేశించుట యనేమాట యందే సంశయము. అనేకమతస్థు లీమాదిరియే వాదుదురు. జీవుడు వేఱుగానుండి దేవునిలో గలియుటమా? లేక నేమనియర్థము?

ఉ! జీవేశ్వర శబ్దములు సాపేక్షనీయములు. "అవిద్యోపాధికో జీవో మాయోపాధిక ఈశ్వరః" అవిద్యోపాధికుడు జీవుడు, మాయోపాధికుడు యీశ్వరుడు. ఒక తండ్రికి నొకపుత్రుడుండ నాతనికి కౌన్సిల్ మెంబర్ పని పంచాయితీ ప్రెసిడెంటుపని యుండెను. మెంబరోపాధిని, ప్రెసిడెంటోపాధిని వదలిన నెప్పటికి భేదమె. ప్రెసిడెంటుకు మెంబరునకు ముఖ్యసమానాధికరణము కుదరదు. ఉపాధుల భేదము తొలగించిన జీవుడే దేవుడు. "జీవో దేవ స్సనాతనః" దేవుడే జీవుడుగాని, జీవుడే దేవుడుగాని వేరేమిలేదు. సదాభేదమే. పొందుటయున నుపాధిద్వయమును తొలగించుకొనుట. సాధనాసాధ్యవస్తువు పరమాత్మ. సాధన భేదమును తొలగించుటకే.

ప్ర! విరాడ్రూపములో నంత్యమైతే పార్థుడు సగుణము శ్రేష్ఠమా? నిర్గుణము శ్రేష్ఠమా? యని "ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే" శ్లోకములో నడుగడమేల?

ఉ! తనకేగాక ననేకభావిమానవుల శ్రేయము నుద్దేశించి యడిగెను. మఱి తనకేది సులువో తెలియుటకూడ నొకటి. గీతా వికసితహృదయమువంటిది. వికసించిన పుష్పమురీతి, సందేహముల నివర్తికయ్యే నవతరించిన యశేషలోకజన యేకైకమాత, వేదమాత, గోమాత, భూమాత, స్వమాత నీ నలుగురిలో గీతామాతయే నిత్యానుసంధాయిని. నలుగురు తల్లుల ప్రయోజనము తానే నాశ్రితుల గతసందేహముల నొవర్చు భువనైకమాత. 1-వ శ్లో! అడిగిన సగుణము నుపాసించువారు నిర్గుణము నుపాసించువారి విశేషమేమని యడుగుట తప్పుకాదు. నిర్గుణోపాసకత, సగుణోపాసకత తెలిసిన జనులు తామే యధికారులైన నద్దానివలన భగవత్ప్రాప్తి నొందెదరు. రెండు త్రోవ లొకేదైవమార్గములే. పెద్ద పెద్ద కొండల నెక్కలేనివాడు డోలీలపైన ప్రయాణ మొనర్చును. ఎక్కెడువా

డేల డోలీ గోరును? చదివినవానికి నాశ్చర్యమేమిలేదు, చదువనివానికే నన్ని తెలియవలెను. సోపాధికభక్తికి సాధనలవసరమే, నిరుపాధికమున కవసరములేదు.

ప్ర॥ నిర్గుణభక్తి లేక నిర్గుణమననేమి?

ఉ॥ సప్తమాధ్యాయమున ఆర్త, జిజ్ఞాస, యర్థార్థులను సగుణ భక్తుల నిర్దేశించి నిర్గుణభక్తుడు జ్ఞానియనెను. సగుణనిర్గుణులలో నెవ రెక్కువ యనునది అర్జునుని సందేహముతో నీ అధ్యాయము బయలు దేరినది. అహంగ్రహోపాసకులు, జ్ఞానభక్తులు వీరికి నుపాస్యద్వైతమే వేరులేదు; ఉపాసించుటయేలేదు. మాటవరుసకు నిర్గుణోపాసకు లనెదరు. రూపసహిత మిథ్యాప్రపంచమున కధిష్ఠానమే నిర్గుణము.

ప్ర॥ భగవంతు డెయ్యది లేక నెవరు శ్రేష్ఠులనెను?

ఉ॥ ఈ రెంటి ప్రయోజన మొకేసిద్ధికై చెప్పబడ్డ సాపేక్షశబ్దములే. 2 నుండి 8 వ శ్లోకమువరకు సగుణోపాసనయే శ్రేష్ఠమని వివరించెను. సాధనచతుష్టయసంపన్నుడైన ప్రౌఢునకు నిర్గుణము తక్కిన వారికి సగుణము సుగుణమనెను. తల్లి తన పుత్రులలో స్వతంత్రుల యోగ క్షేమములు తనుజూడదు. వారు సర్వశక్తిమంతులైరి. నడువలేని, యన్నో దకముల నందుకోలేని పసికూనలనే పోషించును. ఇంతయేల? ఆరూఢు లకు సాధన యవసరములేదు. ఆరురుక్షులకు సాధన లవసరమే. మానవుల యోగ్యతల నిర్దేశించునవియైన సగుణనిర్గుణముల తారతమ్యము గమనింప తగినది. తల్లి యెక్కడ జనిన నెందున్న వెదకికొని తల్లిమరుగుజొచ్చు పసి పాపలు, తదితరజాతుల కూనలవలె సగుణభక్తులు భగవంతునియందు చేరి యుండవలసినవారు; భగవంతునియందు వారు, వారియందు భగవంతుడు కనిపెట్టుకొనియుందురు. స్వతంత్రులు, భయరహితులు, సందేహనివర్తకులు, ద్వైతాతీతులు, నిజేచ్ఛారతులు నిర్గుణభక్తులు ఒకప్పుడు. శివపార్వతులు కుమారద్వయముతో నాసీనులైయున్న తరి తనయుల వివాహచర్చ వచ్చినది. అంతలో నాకుముందు, నాకుముందు పెళ్లి అని కుమార విఘ్నేశ్వరులు తలిదండ్రుల పోరుబెట్టిరి. పార్వతి సమాధానము చెప్పుమని పతినడిగెను. శివుడు నవ్వుచు త్రిభువనముల నెవ్వడు ముందు జుట్టి యమ్మ సమీపించునో వానికి పెళ్లి ముందనెను. వారిరువురు

ప్రయాణముతో కుమారుడు నెమలినెక్కి హుటాహుటివెళ్లెను. వినాయ
కుడు తల్లి, పుష్ప, ఫల, తోయములు తలిదండ్రులకర్పించి వారిని మూడు
మారులు చుట్టివచ్చి, నమస్కరించి లేచి సేవకుడుగు వచ్చితినను చుండ
నెలుకవాహనముతో నూ అస్త్ర బసలుజేరి యెన్నియోడ్లకు చుట్టి
వచ్చునో నాకంతలో పెళ్లియై సంతానముగలుగ నెత్తుకొని యెదురేగుదు
గదయును నూహిస్తూ వేగముగవచ్చి తలిదండ్రులకు నమస్కరించి యెవరు
ముందొచ్చిరి? ఎవరికి ముందు పెళ్లి? అని అడుగుచు నన్న యింటనే
నున్నట్టున్నదే యని శివపార్వతులు నవ్వుచు పెద్దకుమారుని జేరదీసికొని సాదర
మున పెద్దవాడైన వినాయకుని తమ్ముడనకంటే నీవెట్లు ముందు చుట్టి
వచ్చితివో తమ్ముడు వినజెప్పుమన, తలిదండ్రులారా! తమ్ముడు, మీరు
వేఱు, మీకంటె విశ్వము వేఱనుబుద్ధితో ప్రయాసపడి చుట్టివచ్చెను.
"యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్" త్రిభువనము
లెవ్వనియందు బుట్టి నలరారుచున్నవో, ఎవరు లేనిచో నీ భూతజాలము
లేవో అట్టి జగత్పాతులు మీరు. మీకన్యముగ భువనములే లేవు.
జడమగు, మిథ్యయగు విశ్వమును జుట్టుటకన్న సాక్షాత్ప్రత్యక్షప్రమాణ,
పురాణచైతన్యులగు మిమ్ముల జుట్టిన, విశ్వము జుట్టుట కాదే అనెను.
తమ్ముడు సిగ్గుపడెను. తలిదండ్రులు అతని సమయస్ఫూర్తి వివేకబుద్ధికి
విస్మయమొందిరి. అర్జునుని సందేహకారణములగు నుపాసనాపరుల నిర్ణ
యము కుమార వినాయకుల బోలియున్నది. వినాయకుడు నిర్గుణ
భక్తుడు. కుమారుడు సగుణభక్తుడు. తలిదండ్రుల కైలాసము హద్దు
పెట్టుకొని యావద్విశ్వము తలిదండ్రులుగా జూచి సేవించెను గణపతి.
పూసలదృష్టి, భూషణములదృష్టి, యావులదృష్టి, కుండల దృష్టి జూచి
కుమారుడు సేవించెను. దారము, బంగారు, మట్టి, పాలదృష్టి వినాయ
కునిది. ప్రతీకోపాసకులవలె విశ్వమును హరిరూపముగ ప్రతియణువునందు
జూచి ప్రేమించుట సగుణము. దృశ్యమే మిథ్య యధిష్ఠానమునకన్న
నన్యము గాదను బాధసమానాధికరణముద్వారా కృతకృత్యులైనవారు
నిర్గుణులు.

ప్ర॥ చెప్పినదే చెప్పటము, వినినదే వినగ, చర్వితచర్వణముగ భగ
వంతు డేల నొక్కమాటకునకై నిన్నితూర్లు చెప్పెను?

ఉ॥ నిద్రమానవులు, తిండిమానవులు, కర్మభోగమానవులు, నలస మానవులు, దురహంకార మానవులు తినినదే తినుచు, కట్టినదే కట్టుచు, ననుభవించినదే అనుభవించుచు, చూచినదే చూచుచు నంతులేని "స్తో వా దరిద్రో హి విశాలతృష్ణః" విశాలాశాపరుల చర్య చర్విత చర్వణము కాదా ? వారేకదా దరిద్రులు. వారిని గుఱించియే మాటిమాటికి చెప్పెను. స్థూపము నిల నాటునపుడు మాటిమాటికి ఘట్టనజేసి కదలకుండునటులాగు సేతురు. అట్లే మాటిమాటికి నడిగి నకల సంశయములు దీర్చుటములో దృఢముగల్గినదా ? లేదా ? అని తెలిసికొనియే జెప్పుదురు. తల్లిపాలు పిల్లలకు నెన్నిమార్లు త్రాగినను బలమును, విశ్వాసము పెంపొంద జేయునేకాని మఱేమికాదు. గీతామృత మారీతి నలసుల చురుకుగలుగ, సబలుఃబలుల, నశుద్ధుల శుద్ధుల, నధీరుల ధీరుల, నపూజ్యుల పూజ్యుల, నజ్ఞానుల జ్ఞానుల, ననర్థుల నర్థుల, నశాంతుల శాంతుల, నజయుల జయుల, నవిద్యావంతుల విద్యావంతులుగ, నల్పాయువుల నాయువులుగ, మర్త్యుల నమర్త్యుల, దుఃఖితుల నానందితుల, పాపుల పరిశుద్ధుల, సందేహుల నిస్సందేహుల, నయోగ్యుల యోగ్యుల, నాస్తికుల నాస్తికుల, యసూయపరుల ననసూయుల, ద్వైతుల నద్వైతుల, మృతుల నమృతుల జేయుచున్నది. అంతటి యశోవిశాలమైనదగుట చేతనే త్రిలోకారాధ్యమైనది. బాలురకు నుపాధ్యాయులు జెప్పినదే చెప్పి తర్ఫీదిత్తురు. గీతాచార్యుని యాంతర్యమింతయే. రాజకీయమో, వ్యావహారికమో మఱేదైన లౌకికధర్మములైతే నిన్నితూర్లు జెప్పవలసియుండదు. వాడవాడ, యిల్లిల్లు, పట్టణపట్టణము, ప్రాంత్యప్రాంత్యము, దేశదేశము, సమస్తదిశల గీతాధర్మము, గీతాజ్ఞానము, గీతాభక్తి, గీతానవసుందరోజ్వల సమానకౌశల్యము ధ్యేయరూపమై, జ్ఞేయమై, సహజావస్థయగు సచ్చిదానందఘనవ్యాపకనిశ్చయ తాత్పర్యమే చెప్పుటకు కారణము.

ప్ర॥ జనసామాన్యమునకు భావయుక్తమగు సగుణము సుగమమా ?

ఉ॥ నూతనముగ పాఠశాలకు వెళ్లు విద్యార్థికి, నంతకుముందే వెళ్లి చదువుచున్న విద్యార్థికి చదువులోను, యనుభవములోను భేదమున్నది. నూతనునకు నక్షరసంజ్ఞనుండి యక్షరశబ్దజ్ఞానము గలుగువరకు పాఠశాల యందభిరుచి, విద్యయందు పట్టుదల నేయభ్యాసికి తొలుత గలుగదు.

ఎన్ని తప్పులెన్ని పొరపాట్లు గలుగుచున్న విద్యార్థి డిగ్రీనందుకోవలచి నపుడు నాయాస ప్రయాసల లెక్కింపడు. గీతాభక్తులీరీతి పారాయణ కాలమునగాని, ప్రేమలోపమునగాని, చదువుట వినుటయందుగాని, ధ్యానరత శ్రవణమననాదులందుగాని, తక్కిన కార్యకలాపములగాని, తమ కెన్ని యంతరాయములు గలిగిన నన్నిగతులకు హరియే దిక్కని నమ్మి భావించి గట్టెక్కుదురు, నెక్కవలెగూడ. హరికన్న యన్యమే బంధము, హరి సర్వమే మోక్షము. ఒక పట్టణమున నిరుపేదలగు తల్లి కొడుకు లిరువురొక పూరిగుడిసె నివసించుచుండిరి. కొడుకు 8, 9 వత్సరముల వయస్సు. చదువుకొన పాఠశాల కరుగుచుండెను. ఏనాటి కానాడు కూలి జేసి వచ్చినదానితో జీవనము చేయుచు బిడ్డని చదివించుకొనుచు భగవదాయత్త చిత్తముననుండు తల్లితో బిడ్డడు ముచ్చటలాడుచు కాలము జరుపుచుండ నొకదిన మకస్మాత్తు బాలుడు పాఠశాల కరిగినమీదట తల్లికి పనికి పోవుటకు బదులు గొప్ప జ్వరమురా ముసుగుబెట్టి నొకమూల తల్లిపడి యుండెను. పాఠశాల వదలినంతనే మామూలుగ పూజ్యయగు మాతను దర్శించుటకు తోడిబాలురవదలి ధుముకుచు, పాడుచు తల్లిని సమీపించుకొంటు వచ్చినంతనే తల్లియొడిలో నొకింత ముచ్చటలాడు నతడు తల్లి వద్దకు వచ్చెను. వచ్చిన చేరదీసి కౌగలించు తల్లి ముసుగుతో నేలబడి స్మారకము లేనిస్థితిగని యామె ముఖమున తన ముఖమును జేర్చి తట్టుచు తల్లిని లేపబోయెను. చెమట ముఖముతో, వాడిన పెదవులతో, నెఱుపు నేత్రములతో తన్ను జూచినంతనే బారలుచాచి కౌగలించుకొని ముద్దాడు తల్లి తన దెస జూడక మాటలాడలేక నుస్సురనుచు వేదనతోనున్న తల్లిని గని కారణమడిగి నామెపైనున్న ప్రేమతో నమ్మా! డాక్టరును తోడి తెత్తునా యనెను. నాయనా! నీ ప్రేమ డాక్టరునకు నాయందేల నుండును? ధనవంతుల డాక్టర్లు మనకెట్లు లభింతురు? డబ్బు లేకుండ నీ లోకమున గాకపోయిన పరలోకమునైన సుఖమిచ్చు డాక్టరు మన తండ్రి భగవంతుడే. పేరాసవలదు, శ్రమపడకు. ఋణమున్న బ్రతుకగలను, లేనిచో నిన్ను వదలిపోయెదను. నీకు దైవమే దిక్కు. ఈ నాడింటియందన్నము నీకు లేదని మూల్గుచు పడిపోయెను. తఱచుగా డాక్టర్లు డబ్బుగలవారిండ్లకొచ్చిపోవుట చూచినవాడగుట తన యింటికి బిలిచితే రారా యను నమ్మకముతో

బయలుదేరి బూటు, సూటు, కోటు గలవాఁడైనట్టి డాక్టరు! బహుశా బజారులలో వచ్చుచు పోవుచుండవచ్చు గారిలో కాచికొనియుండి వచ్చినంతనె తోడి తేవచ్చునని యాకలి మఱచి బజారులో వచ్చి నిలబడి యిటు నిటు జూచుచుండ జపనమూహాంతమున డాక్టర్లు కనిపింపరైరి. ప్రొద్దెక్కుచుండ నమ్మ యేమైనదో యను బెంగ వెంటాడ నిరాశతో జూచుచున్న నతనికి దూరమున దూరము వెళ్లుడని హెచ్చరిక చేయుచు కొందఱు సేవకులు ముందు నడువ బూటు సూటు గల ప్రభువు గుఱ్ఱపుసార్టులో వచ్చుట గని యతడే డాక్టరని, యెదురెక్కి డాక్టరుసాబ్, డాక్టరుసాబ్ అమ్మ రోగముచే బడిపోయినది. మందివ్వవా? నీకొఱకై చాలసేపై నది కాచుకొని యని కేకలు పెట్టుచు వచ్చి కోచివాడు గుఱ్ఱముల నదలించుచు దారి కడ్డమువచ్చి చేతులుజాపి దీనముగ కళ్ల నీళ్లు నిండి కూతలిడుచు నా బాలుని కెలగోలతో నౌకర్లు దూరము బొమ్మనుచుండ వినుపించుకొనక డాక్టరే యను నమ్మకముతో పోయిన దొరకడను తొందరతో నఱచెడి వాని మాట లెక్కచేయక బండి తోలబోవ తనదిక్కే జూచుచు చేతులు జాపి పిలుచు బాలుని సంజ్ఞ తనకొఱకే నేమోయని ప్రభువు కోచివాని బండి నిలుపమనెను. బాలుని చేరపిసి కారణమడుగ విషయమంతయు జెప్ప దయామయుండగు నా ప్రభువు తన జేబునుండి రూ. 10 తీసి నీ డబ్బుకొని యీ నెంబరుగల యింటికి బసి డాక్టరును బిలువు రాగలడనుచు నీ యింటి నెంబరు బజారు చెప్పుమని తెలిసికొని పరిజనుల నక్కడనుండ బంచి కుఱ్ఱవాడటుజన తాను, ప్రజలాశ్చర్యమొంద సందుగొందులబండిని పూరిగుడిసెవద్దకు బోనిచ్చి బండిదిగి తానే లోనికరిగి పడియున్న బాలుని తల్లిని చూచి లేవనెత్తి గూర్చుండబెట్టి కాగితముపై నేదియో వ్రాసి డాక్టరువచ్చిన నిమ్మని భయపడవలదని నమస్కరింప నామెను నాదరముతో జూచుచు బండినెక్కి వెళ్ళిపోయెను. కుఱ్ఱవాడు బండిలో డాక్టరును తీసుకొనివచ్చెను. తల్లిని డాక్టరు పరీక్షజేసి మందునిచ్చి వెళ్లునపుడు రెండు కాగితముల నామె యతని కిచ్చెను. డాక్టరా కాగితముల జూచి యదరిపడి యామెకు నమస్కరించి తనుగొన్న డబ్బును వాపసిచ్చి ఖజానలో కొంత మొత్తము దెచ్చి తానె యిచ్చి, ప్రతిదినముచితముగ మందు పథ్యమునకు తగిన సదుపాయము లొనరించి ప్రభుదయకు పాత్రుడయ్యెను.

తల్లి బ్రతికెను, బిడ్డ డానందించెను. చూచితివా! దీనులపాలి దైవము నమ్మినవారి యోగక్షేమముల జూతునన్న నుడి యథార్థమయ్యెకదా. తల్లియందలి ప్రేమచే నసాధ్యమును సాధించి ప్రభుదర్శనము, ప్రభుకృపను బడసిన బాలుడు మన ధ్రువ, భగీరథ, నారదుల కేమాత్రము తీసిపోడు. తల్లిని మఱవని ప్రేమ యచంచలదీక్షతో నెట్టిదానినైన సాధించెను. తల్లి ప్రేమ, తనయునిప్రేమ లొకటియై, యన్యోన్యమై ననవరతానుభవనీయమై యుండుభంగి, సగుణభక్తుడు భగవంతునియందు మనోవాక్కాయముల నర్పించి భగవత్సేవయే తమ ధర్మము, తమ వాక్కు, తమ ప్రాణము, తమ దిక్కు, తమ కర్తవ్యమని యుదాసీన కర్మలవలె, శాస్త్రనియత కర్మలగాని, తదితరకర్మలగాని భగవంతునికొఱకు చేయుటలోనే తమ కానందము, ముచ్చట. తలంచినది సిద్ధించువఱకు దేహేంద్రియముల నేక లక్షణ వీక్షణులై నేయంతరాయములకు చలింపక నెందుకైతే భయము గలుగునో, నాస్థానమున హరిని యుంచి నిర్భయముగ నుండగలరు. సముద్రమునందలి జలబిందువులరీతి నమ్మకములేని దేహములతో నల్పభోగములకై వెతలెందుకని "భక్తదుఃఖకర్షిత్వాత్ కృష్ణ" భక్తుల దుఃఖముల దూరమొనరించు నా భగవంతుని జెందుటకై దినములు, మాసములు, వత్సరములు గడచిపోవ కాలచక్రము కుమ్మరిసారె భంగి తిరుగుచుండ నేడా రేపా, కడదినమనే యుద్దేశ్య ప్రయత్నముల జేయుచు "త్వమేవ మాతా చ పితా త్వమేవ" తల్లివి తండ్రివి సమస్తము నాకు నీవేయని సకలాశలవదలి నిదురలేచినది మొదలు నిదురవచ్చువఱకు హరిని చింతించుచు, బొగడుచు, పాడుచు, దివ్యవర్ణనముల, యవతారకథల నాకర్ణింపుచు, హరిభక్తుల సేవించుచు, హరిప్రశ్నించుచు, హరిమయమే నఖిలమనుచు, బ్రహ్మగతులను సాలోక్యాది ముక్తులగనుచు నడవిని, పట్టణముల, జనమధ్యమున, నేకాంతమున పదునాల్గింద్రియముల స్థూలదేహమును భగవత్కైంకర్యమునకు నియోగించి యాత్మార్పణ తత్పర ప్రపత్తులై హృదయము ధ్యేయాకారముగా 'భజ సేవాయాం' ననురీతి సేవించుటయే భక్తి. పతివ్రతస్త్రీభంగి సేవక శిష్యులవలె, మిత్రులవలె, శివలింగముపై బడు ధారవలె, నోటనూరు జలమువలె రాధా,

మురళీ, గోపిక, గోపాల, నంద, యశోద, అక్రూర, చైతన్యస్వామి, తులసీదాసాదుల పగిది నిరంతరము తన్మయులై మోక్షమునైన నొల్లక పెక్కుజన్మములు భగవంతుడిచ్చినను వెలితిపడక హరిపరాయణచిత్తులైన వారే సగుణభక్తులు. వారు నిరంకుశప్రేమమయులై యుందురు.

ప్ర॥ స్త్రీలు సగుణనిర్గుణముల నుపాసించిన వారుండిరా? ఇప్పుడుపాసింపవచ్చునా?

ఉ॥ ఈ మాట నడుగతగనిది. ముక్తికొఱకు భగవంతుని నారాధించుట ఏకాలమైన నొకటే. స్త్రీలలో ముందటికాలమున సగుణనిర్గుణభక్తులుండిరి, ఇప్పుడున్నారు, ఇకమీదట నుండగలరు. స్త్రీలంటే నేమనుకొని యడుగుచున్నావు. స్త్రీపురుషదేహములనున్న వాడాత్మయే లేక జీవుడే. అతనికి రూపనామములు లేవని అనేక ప్రమాణములు చెప్పుచున్నవి. ఆధునికకాలముననే గాక నాదిమకాలమునగూడ నగణిత సంఖ్యగల స్త్రీరూపభక్తులుండిరి. లోకములకు తండ్రికంటే, వేదము గురుదైవముకంటే ప్రధానమైన నాదర్శరూపులు స్త్రీలు. పతిభక్తి, గురుభక్తి, దైవభక్త్యాదుల స్త్రీలే నగ్రగణ్యులు. సృష్టికి ప్రాధాన్యులే. గృహధర్మములనేకాదు, రాజకీయాది సమస్తరంగముల సిద్ధహస్తలు స్త్రీలు. వైదికలౌకికముల రెంటను వారిదే పైచేయి. "ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా। సహస్రం తు పితౄన్ మాతా గౌరవేణాతిరిచ్యతే" యనెను మనువు. పదిమంది ఉపాధ్యాయులకంటె నొక యాచార్యుడు హెచ్చు, నూరుమంది యాచార్యులకంటే నొకతండ్రి హెచ్చు, వేయిమంది తండ్రులకంటే నొక్కతల్లి గౌరవనీయురాలు, హెచ్చుగలది, పూజనీయురాలు. గ్రుడ్డును పిల్ల వెక్కిరించెనను భంగి మహామహుల, భక్తుల, జ్ఞానుల, ప్రభువుల, మహర్షుల, పండితుల, పూజ్యులాది పురుషుల, స్త్రీలగన్నదియు తల్లులేకదా? తల్లుల మతులనుబట్టియే సంతానము గలుగుచుండును. ప్రపంచమున బాలబాలికలకు మొదటి ఉపాధ్యాయుడు తల్లియే. తానెట్లుదీర్చిన నట్లు తయారుకాగలరు బిడ్డలు. ధృతరాష్ట్ర పాండురాజ విదురుల జన్మలకు బీజము వ్యాసుడేగాని, తలంపు లెట్లుండెనట్లు బుట్టుటకు కారణ మంబాంబికలేకదా! క్రమశిక్షణ నిచ్చు తల్లి, ఉపాధ్యాయుడే నిగ్గుతీర్చగలవారు. రామలక్ష్మణులవంటి

సుతుల, రావణకుంభకర్ణులవంటి సుతుల, వ్యాస, శంకర, రామానుజ, మధ్వ, రామకృష్ణ, వివేకానంద, రామతీర్థ, సమర్థ, తుకారాం, జయదేవ, తులసీదాసు, ఛత్రపతి శివాజీ, గౌతమబుద్ధ, జిన, జీసస్, మహమ్మదు, గాంధీ, తిలక, అరవింద, రమణ, మలయాళమహర్షివంటి లోకోద్ధారకుల గన్న తల్లులు పరమపూజ్యులు. అప్రతిహతదిగంతసంచారులు, ధర్మదేవతలు. తనయుల ఘనతలకు కారణము తల్లులే. వారివల్లనే యుద్భవించి వారినే యనాదరణమొనర్చు కుమతులు పతితులే. "కీర్తి శ్రీర్వాక్చ నారీణాం" స్త్రీలయందు భగవచ్ఛక్తి యేడువిధములుగనున్నదని గీతా ప్రమాణమే చాటుచున్నది. స్వబుద్ధిగా నీకాలమునగాని, యేకాలమునగాని మఱేకాలమునగాని యేయుద్యమమునకు స్త్రీయుంచు ప్రేరకురాలుగాదు. అలాంటి మహాతల్లుల నుచ్చనీచస్థితికి, పుణ్యాపాపకార్యములకు సరికట్టజేయువారు పురుషులే యైనను మహామహులగు కొందరన్నియు నెఱిగియుందురు. గార్గి, సులభ, విశ్వవర, మదాలస, చూడాల, పౌతిమాసి, మైత్రేయి, శార్ఙ్గి, శాండిలి, తమసి, దమన, దాలణి, దేవహూతి, అనసూయ, సీత, రుక్మిణి, దమయంతి, చంద్రమతి, సక్కు, మీర, జేబున్నిసా, నివేదిత, మీరాబెన్, అనిబిసెంట్ మొదలగు పెక్కు నారీమతల్లులు సగుణ నిర్గుణ భక్తులు గలరు. నిర్గుణము జ్ఞానము. సగుణము సగుణసాధన రెండు నొకదానినొకటి విడరానివి. శంకరుడు జ్ఞానముపేయము, భక్తి ఉపాయమనెను. రామకృష్ణపరమహంస శుద్ధభక్తి, శుద్ధజ్ఞానము లొకటే యనెను. ఒకరితత్వమొకరు తెలిసికొంటేనేకదా యెక్కువ ప్రేమించెదము. తెలిసికొనుట జ్ఞానము. తెలిసికొన్నమీద గలిగే విశ్వాసమే ప్రేమ లేక భక్తి. భగవంతు డీవిధముగ సగుణనిర్గుణములలో సన్న్యాసముకన్న కర్మయోగము శ్రేష్ఠమను భంగి సగుణభక్తియే శ్రేష్ఠమనెను. "మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే" అని ప్రారంభించెను. నాయందు చిత్తమునిల్పి యేకనిష్ఠులై యెవరు పరమ శ్రద్ధతో సర్వజ్ఞుడనగు నన్ను భజించుచున్నారో వారే శ్రేష్ఠులనెను.

ప్ర॥ మనస్సు తనయందుంచవలెనంటే సంగడిలోని వస్తువా నుంచుటకు? పలువుత్రాడా? మఱేదైన రూపముగలవస్తువు కాదుగదా? తక్షణం

భగవంతునియందుంచుటకు తోచుచున్న జగత్తు వానియందున్న వస్తువులపై మమకారము, దేహాభిమానము మిథ్య అని తెలిసితేగాని వదలవు. దుఃఖనివృత్తియో భయకారణమోయుంటే భగవంతుని వేగముగ మనస్సు నాశ్రయించును. లేనిచో మనసు హరియందు నిలుప సాధ్యమా?

ఉ॥ మనస్సునకు రూపము లేకపోయిన నదియొకవస్తువు గాకపోయినను ఏలాగు మమకార యభిమానములనే వస్తువులందుంచుచుంటిమో నాలాగే భగవంతునియందుంచు దుఃఖము లేక భయమైనయుంటే నార్తభక్తిగానైన నుండునేమో. ఏకారణములేక మనస్సు నిలుచుటెట్లు అనవలదు. మనస్సెప్పటికి మన శత్రువుకాదు. మనమునేర్పిన అభ్యాసమే మహాభయంకరమై పతమతమొనర్చుచున్నది. కొంతకాల మభ్యాసమొనర్చిన నిలువగలదు.

ప్ర॥ భక్తు లెన్నివిధములు ?

ఉ॥ నానావిధ భక్తులున్నను సగుణభక్త్యంతర్గతములే. సగుణనిర్గుణములు రెండేయున్నవి. సగుణభక్తుని రక్షణ భగవంతునిదే. భగవంతుడే నాతనికి దిక్కు.

ప్ర॥ నిర్గుణభక్తి నిర్వహణమెట్లు? నిర్గుణార్హతలు తత్‌స్థితి యెట్టిది ?

ఉ॥ అక్షరము, నిర్దేశ్యము, నవ్యక్తము, కూటస్థము ననే తత్వమే నిర్గుణము; తచ్ఛబ్దవాచ్యము. దీని నుపాసించేవారు నిర్గుణభక్తులు. వారి లక్షణాలు సమస్త భూతములయందు సమబుద్ధి 'సర్వత్ర సమబుద్ధయః' 'సర్వభూతహితేరతాః' చరాచరభూతములకు హితమొనర్చుట 'సన్నియమ్యేంద్రియగ్రామం' ఇంద్రియముల నన్నింటిని వానివాని విషయములనుండి మరలించి పిడికెడులో బ్రేళ్లణగినరీతి నదుపునాజ్ఞలో నుంచుకొనుట.

ప్ర॥ నిర్గుణతత్వము వింటుంటే సర్వమే కాలేదే. ఉపాసించుటెట్లు ? ఇంద్రియముల నదుపులో నుంచకపోతే వాని స్వభావమేమి ?

ఉ॥ రూపము నామముగలదా, దృశ్యమగును. దృశ్యమా "యద్దృశ్యం తన్నశ్యతి" ఏది దృశ్యమో యది నశించునది. అక్షరతత్వము నాశములేనిది, యే రూపనామము లేనిది. "పరాఞ్చిఖాని వ్యతృణత్స్వయంభూ" పరమేశ్వరు డీయింద్రియముల విషయాభిముఖను లగువానినిగ

నిర్మించెను. అందువలన విషయముల ప్రవృత్తములగునే కాని యంతర్ముఖ మగుటకు వలనుపాటులేదు. ఇంద్రియములకు విషయములకు గల్గే పరస్పర సంబంధమేమనగా ఘర్షణ లేదా రాపిడిచే సుఖదుఃఖములు రాగద్వేష ములు గల్గును. ఈ ఘర్షణవలన గలిగే యశాంతికి తాళుకొనలేక భాగవత మున దేవహూతి తన కొడుకైన కపిలునితో కని అసదింద్రియ ఘర్షణ మున-వసుమతి నిర్విణ్ణనగుచు వసరెషి నాకు, వీని బారినుండి తప్పి పరమ శాంతము నొందుగతి జెప్పుమనినది. ఇంద్రియములు స్వాధీనములోనుంటే నే ప్రయాసలేదు. స్వర్గ, వైకుంఠ, కైలాస, సత్యలోకములు తనకై భూమికి దిగివచ్చును, కల్పవృక్షము, చింతామణి, కామధేనువు తన కరి గాపులగును. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు। బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ" మనస్సు పగ్గముగ, నింద్రియములు గుఱ్ఱములుగ, బుద్ధి సారథిగ, జీవుడు రథికుడుగ, రథము దేహముగ వర్ణించు రూపకాలంకారములోని స్వారస్యమేమన రథికుడగు జీవుడు, ఇంద్రియములను గుఱ్ఱము లడ్డాదిడ్డములుగ విషయములపై నుఱకకుండ మనస్సనే పగ్గమును, బుద్ధియనే సారథి శల్యసారథ్యము జేయకుండ చూచుకోవలె. శల్యసారథ్యమువలె నాఁడునా! రథికుడు కర్ణునిరీతి నధో గతి జెందును, జయములేదు. మనసు నీటికన్న సూక్ష్మమై, వాయువున కన్న యణువై, చలనమయమై నేయొక రూపమునో పట్టుకొంటేనేగాని, నిరాకార పరిణామము నొందలేదు. వస్తుపరిణామము మాత్రము సులు వుగ బొందుచుండును. "మాత్రాస్పర్శాస్తు శీతోష్ణసుఖదుఃఖదాః" శీతోష్ణాదులు, ప్రియజన సంయోగ వియోగములు నింద్రియములు విష యముల నంటుటచేతనే గలుగును. "శక్నోతి యస్సోఢుం" శరీర విమో చనమునకు ముందే కామక్రోధాదుల గల్గించే నింద్రియాల లేదా కామ క్రోధాదుల గలిగించకుండ సరికట్టవలె. ఇంద్రియాలకు గల కొన్ని లక్ష ణాలు తెలియుట మంచిది. విశేషించి పతంజలిశాస్త్రమున చూడవచ్చు. స్థూలవస్తువులనో, సూక్ష్మవస్తువులనో యంటబెట్టికొని యుండుటొకటి, నిద్రజెందుట రెండు, ఎదుట గనిపించు శబ్ద స్పర్శ రూప రస గంధాదులగు విషయముల ననుభవింపగోరుట మూడు, ననుభవించిన విషయముల మాటిమాటికి జ్ఞాపకము చేయుట నాలుగు, గాలిలో మేడలు కట్టుటైదు,

వ్యవహారకాలమున బెదరుచుండుటూరు, స్వాతంత్ర్యముగ స్వేచ్ఛగను గల్పిం
చుట యేమి, ఏది సౌఖ్యప్రదము శూన్యమగునంచు తెలిసితివి. మఱి
యనేకవిధముల స్వర్గమునకు, పాతాళమునకు, పిల్లి తన పిల్లల నిల్లిల్లు
మార్చిన రీతి మారుచుండును. పొంచియుండి హఠాత్తుగ జంతువులమీద
బడు క్రూరమృగముల భాతి నున్నట్టుండి పరిభ్రమల ముప్పిరిబెట్టును.
ఎన్నో యుద్యోగములు సంపాదించెదము. ఎన్నో యార్జించెదము.
ఎంతటి శత్రువులనైన జయించ గలిగెదము. ఇంద్రియముల జయించవలె
నంటే చుక్కెదురు. తపమో, వ్రతమో, జపమో, విరాగమో, నియమమో,
నిష్ఠయో; హోమమో, నష్టాంగయోగములనో నా యింద్రియముల నిగ్ర
హించినామంటే నంతటితోనే కాదు; సమబుద్ధి కావలె సర్వత్ర. అనాది
నుండి యలవడిన భేదబుద్ధి, భ్రాంతిబుద్ధి లేదా ద్వైతబుద్ధి యద్వైతము
కాగలుగునా? ఏకాలమైన, నేవేళనైన, నేదేశమైన, నేస్థలమునైన,
నెవ్వరితోనైన తనకు బాధ గలిగిన నొప్పిపడక వారలకు ప్రతీకారమొనర్ప
దలపక, నొనర్పక, కట్టుబట్ట, తినయన్నము యిత్యాదులు లోపించినను
వేసరక, దుఃఖింపక, నిట్టూర్పు విడువక, నితరులతో సంగలార్చక, దొరికిన
దానితో తృప్తినొందుచు, మానావమానములను, కొట్టుతిట్టులను, తిర
స్కార పురస్కారములను, న్యాయాధికతలను లెక్కింపక సదా యోర్పుతో
పరమశాంతముతో నుండుచు, నొకరి దుఃఖమే తన దుఃఖము, నొకరి
సుఖమే తన సుఖము, సకల జీవేచ్ఛలకు స్వాతంత్ర్యతలకు నడ్డుచేయక వ్యక్తి
లో వ్యక్తి, సమాజములో సమాజమువలె నుండుట సర్వత్ర సమబుద్ధి
యగును.

ప్ర॥ అబ్బబ్బా! ఎంత జటిల మెంత జటిలము! సమబుద్ధిపరు లెవరైన
నుండిరా? నుందురా?

ఉ॥ లాహోరులో స్వామి వివేకానంద స్వామి రామతీర్థను కలిసి
కొనెను. స్వామి వివేకానందకు రామతీర్థ తన బంగారు గడియారము ప్రీతి
పూర్వకముగ నివ్వ, స్వామి రామతీర్థకు తెలియకుండ నాయన జేబులోనే
తిరిగి యుంచెను. నాలుగేండ్ల మహమ్మదీయ బాలికలను యుమాకుమారీ
భావమున యమరనాథ యాత్రానంతరము నావ నడపువాని కూతు రను
కొని స్వామి వివేకానంద యారాధించెను. ఒకప్పుడొక సాధువు నొక

ప్రభువు జూచి యాతఁడు మహానుభావుఁడని గ్రహించి నీకు కావలసిన వస్తువు లిత్తు నా వెంట వత్తువా యనెను. నేను వానిని సాధువు ఏ ను ముతో వేసుకొన్నను రానని. అయితే నిన్ను చంపెదనని ప్రభువన రాజుననే బుద్ధిచేతనున్న నీవు యిట్టిమాట నన్ను దనియుండవు. నన్ను దేహమునా నీవు చంపునది? గానికి నెంతకు శస్త్రములకు పుకేయుటిచేత జావనివాడను. దేహమూ నీవు చంపకబోయినను జచ్చును. ఇందేది నీ చేత నయ్యేదనెను. ప్రభువు యీ ధీరత యెట్లు వచ్చినదని చింతించి యడుగ, నిది యాధ్యాత్మిక ధీరతయనెను.

ప్ర: అధ్యాత్మిక ధీరత గొప్పదా? పరాక్రమవంతుల ధీరత గొప్పదా?

ఉ: పరాక్రమవంతుల ధీరత సింహము, పులి, మొదలగు నడవిజంతువులవంటిది. తనకు లోబడువాని వెన్నంటుటలో పులి కేసరివలె ధీరులే. తమకు మించిన బలవంతుల బోనులలో చిక్కి నాటలాడుచు తప్పించుకొను వెరవుగానక యుండుట చూడమా? పరాక్రమవంతుల ధీరత? దుర్బలుర మోసముచేతను లేదా సమానులనైన సామదాన భేదములచే తన జయమో నెదుటి జయమో తెలిసికొనలేక నుండు ధీరత గొప్పదికాదు. తమంతట చనిపోవు శరీరముల జంపుటయా ధీరత. ఆత్మ ప్రేమించిన కొన్నాళ్లు బ్రతుకు జీవుడా యుని బ్రతుకును. ఆత్మ యభిమానము వదలెనా దాని బ్రతుకే చచ్చినది. తన్నెప్పుడైన జంపవేచిన మృత్యువును జయించినగదా పరాక్రమశాలి. అధ్యాత్మిక ధీరత యిట్టిదికాదు. ప్రళయములకు జంకనిది, మృత్యువునకు వెఱచునా? ఒకప్పుడు శిపాయీల తిరుగుబాటులో సాధుసత్తముడగు నొక స్వామిని మహమ్మదీయుడొకడు ఖడ్గముచే బొడిచెను. హిందువు లాయపరాధిని చంపుటకై స్వామివద్దకు దెచ్చిరి. స్వామి యాతని ప్రశాంతదృష్టితో చూచి సోదరా! నీవాతడవే నని ప్రాణములు వదలెను. చూచితివా సమదృష్టి ధీరత, నిర్గుణభక్తి! స్వామి వివేకానంద యానందము గలిగించు కీర్తనల బాడుకొనుచుండ నెన్ని దినములనుండియో వేచియున్న నొక బాలవితంతువు స్వామిని తన్నేలుకొమ్మని ప్రార్థింప, నెవరు లేనిసమయమున లోనరా, వెంటనే తల్లీ! నీతనికి ప్రపంచమున నందఱు తల్లులేగాని, యీయాతుఁడ యేలుకొను కాంతలేదు. ఆలస్యముచేయక నీ పొరబాటును దిద్దుకొమ్మని పంపెను. కామినీ కాంచ

నములపై నాశగలదే లోకము. పరాక్రమవంతు లీసమయమును జార విడుతురా? ధీరుడగు నాధ్యాత్మిక తత్త్వవేత్త వినియమము లేనిస్థితిజూడు. నందనారు, సోక్రటీసు, జీసస్, జిన, బుద్ధ, సుధామాదు లేలాగు జీవించు చున్నను తొలగని ధృతిగలవారు. పురాణపురుషులలో ప్రహ్లాద, శిబి, హరిశ్చంద్ర, సావిత్రి, జానకీ మొదలగు వారలు ధీరులే. జీసస్‌ను యూదుల జడ్జి శిక్ష జెప్పుచు, నీ వాఙ్మూలమేమి జెప్పెదవో జెప్పుకొనుమనెను. ఆ యాధ్యాత్మిక సింహము నీకు నాకు నేహక్కులేదని జెప్పి మౌనము వహించెను. సమబుద్ధి గలవారి ధీరత లిట్లుండును. తక్కినవారి ధీరత చేతి నుండి వదలిన బాణము మధ్య నిలువనిభంగి నాటుపట్టులేని, యాకారము లేని మేఘమువలె నొక స్థలమున నొక స్థితితో మనస్సుండదు. అందువలన వారికి నిర్మలముండదు. నిర్గుణోపాసకుల లక్షణాలు, నర్హతలు, ననుభవ ములు వచించి భగవంతుడు దేహాభిమానముగలవానికి నిర్గుణోపాసన యత్యంత కష్టమనెను.

ప్ర॥ దేహాభిమానము వదలటమే కష్టము. అభిమానము వదలితే సుల భమే. భగవంతున కన్ని తెలియునుగాన విశదపఱచెను. అర్జునుడట్టి త్యాగియే. అందుకే గీతార్థము 'తా'ను ముందుంచి 'గీ' వెనుకనుంచ త్యాగియను అర్థమేర్పడుచున్నది. భగవంతు డావల నేమనెను?

ఉ॥ చెట్టెక్కగలవానికి నెక్కలేనివానికి గల భేదము, ఈతవచ్చిన వానికి రానివానికి గలభేదము, చూచిచెప్పుటకు చూడకచెప్పుటము, మేరువున కణువునకు, నాకసమునకు పాతాళమునకు, సముద్రమునకు జలబిందువునకు, సూర్యప్రకాశమునకు కల్పితజ్యోతికిగల భేదమంత భేదము సగుణభక్తులకు, నిర్గుణభక్తులకు గలదని 5-12 శ్లోకములవఱకు నిర్గుణభక్తులకు సాధ్యమగు నవ్యక్తతత్త్వము సగుణు లుపాసింపలేరు కావున సమస్తకర్మలను భగవంతుడనైన నాయందే నాసక్తిగలిగి ఉపా సించువారల శీఘ్రముగ సంసారమునుండి ఉద్ధరించెద, వారికే భయము లేదనెను. అయితే భగవంతుడుద్ధరించగలడని ఇంటిపనుల, బంధులాప్తుల, పుత్రమిత్రాదుల, పశుక్షేత్రారామగృహాకట్టడాదుల విషయము జూచుకుంటు, వానియందలి మమత, నవి తనవియే అను యాకాంక్ష చేయుచు జ్ఞాపకముగల్గినపుడు నెప్పుడో ధ్యానించుమనికాదు భగవంతుడు

జెప్పినది. స్త్రీకి భర్తగట్టినతాళి స్త్రీయేమి చేయుచున్న మెడలోనున్న భంగి, పురుషుడెందు సంచరించిన పెండ్లియై భార్యగలదను కాలియందలి మెట్టెయుపగిది, లేపులోగలిసినీరు, రంగువేసినవస్త్రము, నీటముంచినఉప్పు, నగ్నికలిసిన కర్పూరమురీతి భగవన్మయముకావలె. అదియే సగుణోపాసన. అభ్యాసయోగులవలె సకలకర్మలాయనంతునివసే యభ్యాసము యోగముకావలె.

ప్ర॥ కర్మలను జేయునపు డొకప్పుడుగాకుండ నొకప్పుడైన కర్తృత్వము లేకుండజేయు టెలాగు ?

ఉ॥ మన చేతిలోని కత్తి లేక బాణము మనము జెప్పిన రీతి జేయును గాని యవియే నేకార్యము జేయలేవు. అవియే జేసేలాగైన నందఱ నొక నాడే నీరొనర్చును. ఏనుగు మనుష్యుల మోయుటయు, గుఱ్ఱము, ఒంటె మొద్లు తమకేమాత్రము కర్తృత్వములేక మానవుల కన్నిపనులు చేయు చున్నవికదా! భగవంతుడనెను: శరీరేంద్రియాదుల నాయందుంచలేకపోతే నవి మీావిగానే యుంచుకొనుడి, కాని కర్తృత్వబుద్ధి మాత్రము వదల మనెను. కర్తృత్వమే బంధము.

ప్ర॥ కర్తృత్వమంటే నేమి?

ఉ॥ కర్త చేయువాడు, కర్మ యనుభవించునది. క్రియ చేయుటయు. క్రియవలన యనుభవమునకు రాగలకర్మ. అసలు కర్తలేనిచో నది జడము తనంతట చేయలేదు. అనుభవ మెవ్వరికెఱుక. కర్తయుండిన తానే కర్మ ననుభవించ క్రియ యొనర్చును. క్రియ యెట్టిదైతే నట్టి కర్మ యనుభవ మునకు వచ్చును. ఫలానుభవమే కర్మ. దాని ననుభవించవలెననేగదా అందఱ యుబుసులాట? కర్మకు స్వతంత్రతలేదు. నా నేననియో, నీవనియో, భక్తికో, జ్ఞానమునకో, మరేదాని నుద్దేశించియో కర్మను తగిలించితే నంటుకొనునుగాని కరెంటువంటి కర్తృత్వములేదా; కర్మయే లేదు. ఒకవేళ చేసినను లేదు, చేయకున్న లేదు. అపేక్షగలవాడు బాధ్యతలు, భారాలు, వచ్చే ఫలితాలకు నేనే కర్తను, భోక్తను యన్నపుడు నది యెట్టిదైన తనదే. ఒక ప్రభువు నొద్దకు నొకడువచ్చి నమస్కరించి నిలిచెను. ప్రభువేమన నీపై బెట్టి పండెమాడ నిదిగో నీ పెద్దయావు వచ్చినదన ప్రభువు సంతసించి నింట

గట్టివేయుమనెను. మఱొకతూరి మరలవచ్చి ప్రభూ! నీపేరట పందెమూడ నీ గుఱ్ఱము వచ్చినదన దానిని కట్టివేయుమనెను. మూడవతూరివచ్చి ప్రభూ! ఈసారి తమపేర పందెమువేయ నొక లక్ష రూపాయలు నష్టమువచ్చినదన ప్రభువు చింతించి నష్ట మచ్చుకొని యిక నా పేర నేది వేయవలదనెను. మొదట యావు గుఱ్ఱము ఫల మనుభవింప కర్తవ్యముంచుకొనెను. పిదప రాగల నష్టమున కధికారి తానే యయ్యెను జూచితివా.

ప్ర॥ భగవంతు డింకేమి యుపాయము జెప్పలేదా?

ఉ॥ ఉపాధ్యాయుడు బాలురకు నోటితో జెప్పును. తెలియకపోయిన చేసంజ్ఞల జెప్పును. అప్పటికర్థముగానిచో బోర్డుపై వ్రాసి చూపించును. భక్తవత్సలుడు చెప్పకేమి? కర్తృత్వము వదలలేకపోతే కర్మలవలన గలిగే ఫలితాలున్నవే యవి నాకర్పింపుమనెను. గీతకు నిదియే గీటురాయివంటిది. కావున భక్తుడు కర్మఫలత్యాగ మొనర్చువాడైన కావలె. కర్తృత్వము వదలలేక కర్మఫలత్యాగము వదలలేనపుడు యెలా భగవంతు డనుగ్రహింప గలడు? అప్పుడు మన కాయునయందు నమ్మకములేదు. పడవవానికి పడవ బాడుగనివ్వక బాడుగకూడ మిగిలించుకుందామని, యీత రానివాడు గొప్ప ప్రవాహములో దిగి యొడ్డుచేరలేక కొట్టుకొనిపోయిన రీతి సంసార వారాశిలో మునిగిపోవలసినదే. ఒకప్పుడు త్యాగయ్య రామచంద్రునకు పూజ చేయుచుండ నా పట్టణ ప్రభు వాహ్వానమంపెను. త్యాగయ్య రాజు వలన గలిగే తాత్కాలికగౌరవాదులకు, ఫలితాలకు మురిసిపడి యాసక్తి నొందక రాజరాజు మా రామరాజు నొక క్షణమైన వదల సమయము లేదనెను. రామరాజుకంటె వేఱె ప్రభువుగాని, ఫలితాలగాని నాకు వల దనుకొనెను. భక్తుడు నిరంతరము కర్మల చేయుటయందే చిత్తముండవలె గాని, ఫలములయందాసక్తి యుండగూడదు. నదులు, మేఘములు, పశు సంతతి, వృక్షజాతి నిరంతరము వృద్ధికావటము ఫలితాలకుగాదు, పరోప కారార్థము.

ప్ర॥ ఫలాసక్తి యుంటేనేమి?

ఉ॥ నిత్యనిరతిశయమగు భగవత్ప్రాప్తి తప్పి, దుఃఖభాజనమగు ఫల మనుభవింప జన్మమరణము లొందుచుండవలెను. కర్మవలన లభించును భోగము.

ప్ర॥ కృష్ణ, కృష్ణా! భగవంతుడు కావలె, కర్మఫలములు కావలె, కర్తృత్వముండవలెనను హృదయము. ఏమి చేసేది?

ఉ॥ నీవన్నమాట నిజమే. హృదయమునందేమిగలదు? నీయందుగలదు. నీవు నాశల కారణమగు కర్తృత్వాభిమానము వదలలేవా! జయములేదు, మోక్షములేదు. మిగుల యజ్ఞానివి యని యర్థము. ఒక మిత్రునింటి కొకడురా, ఆతడు తన నానావిధయాతనలవంటి కష్టపరంపరల జెప్పి నాకేదైన యుపాయము జెప్పుమన నావెంట రమ్మని యడవికేగి తాను నొక పెద్ద మ్రానిని కౌగలించుకొని కేకలిడెను. ఏమని? మిత్రమా! పెద్దదగు ననేక యేరులు శాఖలుగల నీ మ్రాను నన్ను వదలలేదు. ఇందుకేదైన యుపాయముగలదా యని మొరపెట్ట పకపకనవ్వుచు నీవే మ్రానిని బట్టుకొని నన్నది వదలలేదనటము నీ యవివేకాభిమానమేకదా! చేతులు వదలు; మ్రాను మ్రానియే, నీవు నీవే యనెను. అంత నతడు చేతులువదలి నాకు బుద్ధి చెప్పిన నీవు నీ వేదనలెన్నో తెలిపి తీర్చుమంటివికదా! నావి యనే కర్తృత్వాద్యభిమానము వదలు నవి నవియే, నీవు నీవే, నీకెక్కడిది యాతనయనెను. చూచితివా! యభిమానము వదలనిది భగవంతునకు నీవెవరని. ఒక జిల్లా కలెక్టరున్నాడనుకో. జిల్లాకెన్ని తాలూకాలో, తాలూకాకెన్ని గ్రామములో, ప్రతియొక గ్రామములో నెన్నియిండ్లో, నేయింటిలో నెందఱుందురో, యెవరెట్టివారో, యేరీతి యున్నారో నాయనకు తెలియదు. ఏ గ్రామములో నేయింటివాడో, నొక విన్నతిపత్రము నంపుకొనెనా? దాని నందుకొని కలెక్టరు ఫలానివాడని, యతని యోగక్షేమముల, నా విన్నతి పత్రము ననుసరించి చూచును. అనేకులలో నాతడెట్లు తెలియబడెను విన్నపమువలన. దురహంకారియై నాకంటే కలెక్టరేమి పెద్ద యనుకొని యొనరించు కర్మఫలము తానే యనుభవించును. కలెక్టరునకు వదలితే నాయనయే జూచు, నాలాగు భగవంతుడఖిలలోకములకు ప్రభువు. ఆయనకు మన దురభిమానము వదలి నీవే గతియని శరణాగతులమైన భారమంత తానే వహించును. అరేబియాదేశస్థుల కుంకుమము తామె మోసికొనిపోయి వ్యాపార మొనర్పవలెనన్న నెంత మోయుదు రెంత లాభము నెన్ని దినములు బట్టును? ఒంటెపై వేసిన నెంతభారమైన మోయును, తమ్మును మోయును. అవివేకముతో, నహంకారముతో నొనర్చు

నభ్యాసయోగములకంటె విషయజ్ఞానము, దానికంటే శాస్త్రజ్ఞానము మంచిదనియు, శాస్త్రజ్ఞానమునకంటె ధ్యానము శ్రేష్ఠమనియు, ధ్యానము యేకాగ్రత గల్గించును. అంతకంటే కర్మఫలత్యాగమే శ్రేష్ఠమని భగవంతుడు వచించెను.

ప్ర: శాస్త్రజ్ఞానముగూడ ఫలకారి కాదంటారా?

ఉ: అనువాదశాస్త్రమైతే శ్రేష్ఠముకాని, విధిశాస్త్రము విధానముల నేర్పఱించి ఫలానుభవుల నొనర్చును. అందువలన నది శ్రేయస్కారికాదు. ఉండేది మూడే వస్తువులు. ఒకటి ప్రపంచ, మొకటి ప్రపంచాధిష్ఠానమగు పరమాత్మ, మరొకటి నేననే జీవుడు, వీనికి సంబంధించిన యనువాదశాస్త్రము లేక తత్వశాస్త్రము. ఈ మూడిటిని తెలుపని శాస్త్రములన్ని యంధవిశ్వాసములు, కుంతితలక్షణాలు, గౌణ పురుషార్థము. ఛాందోగ్యోపనిషత్తున యుద్దాలకుడు తన తనయుడగు శ్వేతకేతువును సకలశాస్త్రపారంగతుడై తనసరి లేరను యహంకారముననున్న తనయునిగని నీవన్నియు తెలిసికొంటివా యన్న నౌననెను. "యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతం" దేనిని తెలిసిన యశ్రుతము శ్రుతము, అమతము మతము, అవిజ్ఞాతము విజ్ఞాతముగ దీని నెఱిగితివా? అన లేదనెను. అంతే శాస్త్రజ్ఞానము. మఱియొకప్పుడొక శాస్త్రజ్ఞాన పండితుడొక నదిని దాటవలసివచ్చి పడవ నడపువానితో కూలి యేర్పాటు జేసుకొని పడవలో గూర్చొనెను. నావికుడు పడవనడుపుచుండ పండితుడు వాని గోచిపాత మడ్డితనమునుజూచి తనలో వీని జన్మము వ్యర్థమై పోయినదే, జడుడనుకొని తన గొప్పయనే యహంకారము బొటమరింప వానితో నీవేమి జదివితివన, నాకేమి రాదు బాబో యనెను. భారత, భాగవత, రామాయణములైన తెలియునా యన నేనేమి యెఱుగననెను. ఓరీ! నీ జన్మము వ్యర్థమైనదికదరా యని జాలిగొని మాటలాడుచుండ పడవ నడినదిలోనికి జేరెను. క్రొత్త నీరెక్కిరావటముజూచి వాడు జాలిగొనిబాబూ! శాస్త్రమన్నీ నేర్చినారు; గొప్పవారు. ప్రభో! క్రొత్తనీరు వేగముగ పైనుండి వచ్చుచున్నది. దాని తాకిడికి పడవచేతనైతే గట్టు చేర్పగలను. లేకపోతే నేనుమాత్రము తప్పించుకొని గట్టెక్కనేర్తు. నీవు వళ్లెఱుగుదువా? యన పండితున కామాట పిడుగుబడినట్లయ్యెను. నోట

ఈదుట రాలేదు. నావికా! నన్ను గట్టుచేర్చు నీచేతికొక్క. గట్టెక్క నాకు తెలియదనెను. ఓశాస్త్రీ! నీ జన్మము వ్యర్థమేయని శాస్త్రికి పడవ నావల జేర్పలేక తాను గట్టుజేరుకొన శాస్త్రియు పడవతో గొట్టుకొనిపోయెను. వింటివా? శాస్త్రజ్ఞానఫలము నిన్ను రక్షించజాలదని యీలాటి శాస్త్రజ్ఞానమునకంటె ధ్యానము మంచిది.

ప్ర॥ అయితే ఫలత్యాగ మొక్కటి యొనరించి తక్కినవి వొదల వలెనవియూ? ధ్యానయోగమునకన్నా నెట్లు గొప్పయగును?

ఉ॥ ధ్యానయోగమునందు సూక్ష్మములగు వాసనలుండును. అధికారు లనేకవిధము లుందురు. దేశకాలద్రవ్యములనుబట్టి కర్మఫలత్యాగ మొనర్ప జాలనివారు తక్కినవాని సాధించవచ్చు. కర్మఫలత్యాగికి తక్కినవన్ని యంతర్భాగములగును. అందుకే సన్న్యాసమునకంటె త్యాగము దొడ్డదనటము. ధ్యానమునకు దేశ, కాల, స్థల, వస్తువిభాగయుక్తము లవసరము. త్యాగము, ధ్యానము, భక్తి, యోగము తుదకు జ్ఞానమగును. "త్యాగేనైకేనామృతత్వ మానశుః" త్యాగ మొక్కదానిచేతనే జ్ఞానులయ్యెదరు. మోక్షము లభించును. ధనమువల్ల, పుత్రాదులవల్ల, యజ్ఞాది కర్మలవల్ల జ్ఞానమురాదు; మోక్షములేదు. ఖడ్గమునకున్న పదును, యగ్నికున్న సర్వభక్షకత్వమువంటిది త్యాగము. త్యాగమంటే నన్నిటిని వదలి పోవటముకాదు. ఫలాసక్తి త్యాగము. ఈషణాత్రయత్యాగము చాలు. ఇకను చెప్పవలెనంటే త్యాగియే సుఖభోగి; త్యాగికానివాడు రోగముతోటి దుఃఖభోగి. ప్రభువు లోకమునకు పెద్దత్యాగియే. 'కర్మ బ్రహ్మోద్భవం' ఒక్కడైన భగవంతు డనేకము గావలెనను త్యాగమే కర్మము. సృష్టిస్థితిలయములు త్యాగమే. సాధనచతుష్టయములో మొదలు నీ త్యాగికే జ్ఞానాధికారియని బిరుదిచ్చిరి. త్యాగి యిరుప్రక్కల పదునుగల కత్తివంటివాడు తన్నంటబోయిన నవియే తునియలగును; తానంటిన తునియలగును. పదునాల్గులోకముల త్యజించిన త్యాగి, చనిపోయిన బ్రతికినటులే. భూదేవత కెంతో మేలు. త్యాగికానివాడు బచ్చెనా? లోకమంత దూషించటమే, నింటిలోనివారంత సంతసించటమే పిసినిగొట్టు పోవుట మంచిదియని. లోకపూజ్యుడు త్యాగికాడా? యుద్ధవీరుడు కాడు. త్యాగికాడా? అసలు భోగికాడు. ఖర్చుయగునని అస్తులుపస్తులుండువాడు

త్యాగి, భోగికాదు. త్యాగి కాడా? కీర్తిలేదు, గౌరవములేదు. గుడిలోని విగ్రహము కండ్లుమూయుట నెప్పుడు తెలియుకొనని పూజారి మొదలు వచ్చే పోయెడివా రేమేముచేయునది వీక్షించుభంగి శ్రద్ధావంతుడు త్యాగి యగును. గాంధీజీ మరణసమయమున నెన్ని దేశములు నాయాదేశప్రజ లేమైరి; యెంత దుఃఖించిరి. సూర్యాస్తమానము నెవరి కెట్లు యిష్టము లేదో, త్యాగసూర్యుని యస్తమానము నేలోకమున కిష్టముండదు. త్యాగి నందరు రాహ్వానింతురు. అందఱు భూషింతురు. త్యాగికానివాని నెవ్వ రాహ్వానింపరు; తిరస్కరింతురు, దూషింతురు. త్యాగి దేనినంటడు. తన్నేవి నంటవు. సూర్యప్రభవంటివాడు, ధర్మదేవత, సత్యమూర్తి, లోకబాంధవుడు, జ్ఞానచక్రవర్తి వేయేల? మాధవుడే. కలంకములేని యకలంకుడు. వేదవేదాంతములు స్వస్తి జెప్పుచుండ, మతమతాంతరులు జోహారు లొనర్చుచుండ, నెల్లవేల్పులు వినతులొనర్ప, సమస్త పుణ్యతీర్థములు పాదములుకడుగ, లోకాలోకము లాతని నుతులకై నెదురుజూడ, భూమి సింహాసనమై, నభంబు గొడుగై, పర్వతములుతగ్గ, సాగరములుపొంగ, నమృతము తెల్లవోవ కుంఠితములేని వికుంఠహృదయుడై రాజిల్లు నమ్మహాత్ము లెవ్వరైననసరే వారే నమస్కారార్హులు. వారికే నమస్కారము. గీతకు త్యాగముపై పక్షపాతము మెండు. గీతాచార్యుని సందేశమిదియే. ఇన్ని ఉపాయములు త్యాగమొక్కదానికే, త్యాగము లేనిచో నీయుపాయములన్ని [illegible]ముండవలసినదే. తల్లిపాల గ్రోలలేక దుర్బలుడై చనిపోవు కుఱ్ఱవానికి తల్లిపాలు తల్లిలోనుండవలసినదే. పాల ఉపయోగము కుఱ్ఱవానికిలేదు.

ప్ర॥ నిజభక్తుల లక్షణాలు చెప్పండి?

ఉ॥ ఇప్పుడు చెప్పబోవు నలువదిరెండులక్షణాలు నివియన్ని యొక్కని యందుండవచ్చు. లేక నేకొన్నియో నొక్కొక్కని యందుండవచ్చు. 13 శ్లోకమునుండి 14 శ్లోకము వఱకు జెప్పిన లక్షణములుగలవాడు తనకు భక్తుడే. "అద్వేష్టా సర్వభూతానా"మని ప్రారంభించెను. విన నర్జును డుత్సహింపుచుండ భగవంతు డాపుకొనలేని దయతో జెప్పెను. దైత్యులు నానాహింసలుబెట్టిన, తల్లి చూడకపోయిన, తండ్రి చంపదలచినా, బంధువులేకాదు; తన్నెవ్వరు రక్షింపరాకపోయిన ప్రహ్లాదుడు తలిదండ్రి వగై

రాలు దూషించలేను. పైపెచ్చు భగవంతుడు వీరందఱకు సజ్ఞానము తొలగించిన మేలగుననియు తన ప్రారబ్ధ మనుభవింపబడుట తనకింక ఋణశేషము లేదనియు బాధ నోర్వలేక నెవరిని రక్షింపుమని కోరలేదు. హరి పరతంత్రుడై యుండ చదివితిమి; వింటిమి. తద్రీతి నితరులవలన తనకు నెన్ని కష్టనిష్ఠురములు ప్రాప్తించిన దైవశిక్షితములని యోర్చుకొని యపకారుల కుపకార మొనర్చుటయు మాటలతోగాక చేసిచూపించేవి నీ లక్షణాలు. తనదొక ఫోటోయున్నది. దాని కేభాగములో చెడుపుగల్గిన సహించలేడు. దానికి చెఱుపుగలగకుండవలె ననేకవిధములుగ కనిపించే రూపములన్ని భగవద్రూపములని, తనవంటివేనని, రాగద్వేషములు రానీయక చూడవలె. మైత్రియన — కృష్ణార్జునులరీతి నితరులు తనయెడ నెట్లున్నను తనుమాత్రము వారిని ప్రీతిగజూచుట మైత్ర్యము. దయ యన ప్రతి ప్రాణిక్షేమమే తనక్షేమము. ప్రజలకు, ప్రభువునకు, గురువునకు, శిష్యునకు, భార్యకు, భర్తకు, తల్లికి, బిడ్డకు దయలేక ప్రవర్తించితే దస్యుములనెదరు. సంఘక్షేమము, వ్యక్తిక్షేమము, దేశక్షేమమునకు దయయొక సోపానమువంటిది. మమకారాహంకారములు రెండుండిన భక్తలక్షణములుండవు. గోడకు పునాదివంటి వీరెండు జన్మకారణములు. మమకారాహంకారములతోనే రావణకుంభకర్ణ, శిశుపాలదంతవక్త్రాదులు, కంస జరాసంధులని అర్థము. సమస్తవిప్లవములకు నివియే మూలములు; నూడలుదిగిన మఱ్ఱి. శుభాశుభములకు, జన్మమరణాదులకు పుండువంటివి. మెలికలు దిరిగిన నిఱ్ఱికొమ్ములవంటివి. ఏనుగుతొండము, తేలుకొండి, పామువిషము, పులిఘాతుకము, నక్కవంచనము, కొంగజపము వంటి నీ రెండు సుఖదుఃఖకారణములు. ఇవి సమము కావలెనంటే నహంకార మమకారముల వదలితేచాలు. గాంధీజీ తక్కిన నాయకులతో రైలులో ప్రయాణమొనర్చుచుండ; మఱొక స్టేషనులో ధనవంతుడొకడు గాంధీజీ యున్న పెట్టెనెక్కి గబగబ నేప్రక్కజూచిన హోదాగలవారు గన్పడ హోదాలేని గాంధీజీవద్దకువచ్చి నాయనను జూడకనే కొంచెము సర్దుకో యన నాయన సర్దుకొన బెడ్డుపెట్టుకొని పరచుకొనుటకు కొంచము సర్దుకో యని తన పాటునకై సర్దుకో యనుచుండ స్థలమంతవదలి గాంధీజీ నిలబడ, నాతడు నెమ్మదిగాకూర్చొని యటునిటుజూడ కొందఱు నాయకులు

తాము నిలుచుకొని యెవ్వడ వెక్కడికిబోయెదవన వార్ధా పోతాను గాంధీదర్శనమున కనెను. అతనికి గాంధీని జూపిరి. పైనున్న యొంటిబట్ట పేదమానిసివలెనున్న గాంధీని గని పాదములపై బడి క్షమింపగోరెను. చూచితివా? గాంధీగారి నిర్మమనిరహంకార సుఖదుఃఖ సమలక్షణములు. డబ్బున్నదని మందిలోగూర్చుండ యాలజడి తనసుఖమునకు భంగమని మొదటితరగతిలో కూర్చొనే వారెట్టివారో? ఆలోచించుకొమ్ము. సుఖమును ప్రేమించినరీతి దుఃఖమును ప్రేమింపవలె. పట్టముగట్టే సుఖలగ్నమునకు నడవికేగే దుఃఖలగ్నము గలిసివచ్చినా రాముడు పట్టముగట్టుకొనేదానికంటె నడవివెళ్లుట ననేకరెట్లు సుఖమని తలచెను. క్షమయన యోర్పు. సుఖదుఃఖములు సమమే నోర్పునొక్క పర్యాయశబ్దము. సతతవస్తువు భగవంతుడే. అటువంటప్పు డోర్పుయుండు టబ్బురముకాదు. అంగడిలో లాభమువచ్చే దినము నాకలిదప్పికి నోర్చుకొనుట యోర్పు కాదు. ఫలాభిలాషకై మొండిగాచేయు హిరణ్యకశిపు తపస్సు, రావణ కుంభకర్ణాదుల తపస్సునొక్క యోర్మి యోర్మికాదు. జీవితమే నొక యుద్ధము. అంతరంగబహిరంగముల ప్రతీకారశక్తులు ప్రతిఘటించుచునే యుండును. అలాంటప్పుడు సంతుష్టి దొరకట మేలాగు. సత్యవస్తువగు భగవంతుని తెలిసినవానికి నిత్యసంతోషముండును. బుద్బుదములతో తరంగములతో నుప్పొంగుచున్న మహోదధి. నదు లపవిత్రముల దెచ్చి కలుపుచున్నవని యనుకోదు. తనలోచేరిన నవి పవిత్రములే. యోగమన నుపాయ మంతరంగ బహిరంగముల నిరంతరము విడువని ప్రేమయే. వేశ్యాప్రేమ, పూటకూలివానిభక్తమర్యాద ప్రేమనూదిరి యుండగూడదు. నిగ్రహముగల చిత్తము, దృఢనిశ్చయము, మనోబుద్ధుల భగవంతుని వశమొనర్చి యాయన యిష్టప్రకారము నడచుకొనుట, కులసతి శరీరమనోవాక్కులు తనవేయైనను, సర్వస్వము మగని కంకితమొనర్చురీతి, భాగవతమును పోతన రామున కంకితమొనర్చెను. ఫలకాములగు పండితులు నితరుల కమ్ముకొనిరి. భగవంతుని గుణము వదలిన భగవద్భక్తుడు గాడు.

ప్ర॥ ధనధాన్యసంపదలు, పేరుప్రతిష్ఠలు గలవారికేల భయసందేహాలు?

ఉ॥ ధనధాన్యాదులేకాదు. సమస్తరాజ్యము తమదేయైనను, ప్రభువులేయైననుగూడ నట్టివారికి భయసందేహములు మఱీ యధికము. ఏ

వ్యక్తికి తగిన బరువు నా వ్యక్తికి యిచ్చియుండును. గాడిదబరువు గాడిదకు, గొఱ్ఱెబరువు గొఱ్ఱెకు, ఏనుగుబరు వేనుగునకు, చీమబరువు చీమకుండును. గుఱ్ఱము జబ్బుపడ తెలివితక్కువయగు బండివాడు గానుగెద్దును బండికిగట్ట గిఱ్ఱున త్రిప్పునుగాని ముందుకు పోదు. దానినివదలి గంగిరెద్దునుగట్ట నింటింటివద్దకు నిలిచి తల యూపును. భక్తివిశ్వాసములు లేని పామరభక్తులకు సందేహభయములుండును. సజాతీయ, విజాతీయ, స్వగతభేదములతో నరణ్యాలలోని క్రూరమృగములకంటె హీనమైన దురహంకారముతో వ్యక్తికి వ్యక్తికి, వర్గానికి వర్గానికి, సంఘానికి సంఘానికి, జాతికి జాతికి, నంతర్బాహ్యముల జరిగే జీవితసంగ్రామాలు చూడడములేదా! ఏ దేశమునుండి యే కాలములో నేయుపద్రవము వచ్చునోయని శాంతిలేక తహతహపడు మానవుల కా భయసందేహములు లేనిది? భీష్మద్రోణాశ్వత్థామకర్ణాది వీరులుండి, కురుక్షేత్ర యుద్ధరంగమున పదునొకండక్షౌహిణులుండిగూడ దుర్యోధనునకు భయసందేహములుండనేయుండెను. అపజయముగల్గినదంటే కారణమేమి? ధర్మదేవతయగు నచ్యుతా డర్జునునివంక యుండబట్టి. అర్జునునకు భయసందేహము లంతర్బహిస్సుల తొలగియే విజయము గాంచెను. భార్యాభర్తలు కాశికిపోవుచుండ, మార్గమడవి నిర్జనమగుట, మగడు తనలో పాడుకొంటు నుత్సాహముతో నుండ, భార్య మాటిమాటికి నాయన సంతోషమునకు భంగము గలిగించుచుండ, నీ భయసందేహములకు కారణమేమన, తనయొద్దనున్న బంగారుపాత్ర యనెను. మగడు దాని చేతనందుకొని కనుమేర దూరము విసరివేసి యిక భయసందేహములు లేక నుండుమనెను. మగని శాంతమునకు భంగముకలిగించి తాను భయసందేహమొందినదంటే నేముండబట్టి? నాది నావస్తువుయనే మమకారాహంకారములే భయసందేహముల గలిగించెను. నిజమైన భగవద్భక్తునకు జ్ఞానికి తప్ప ధీరత, నిశ్చింతత మఱెవ్వరికి గలుగదు. 15, 16 శ్లోకార్థము: ఎవ్వరికి నాతురత గల్గింపక నొకరివల్ల తాను నొచ్చుదుడుకులు పడుట భక్తునకు సుతరాం యిష్టముకాదు. వస్తువు లభించితే గలిగే తాత్కాలికానందము, విషాదము, భయము, సంక్షోభముల

నొందనివాడు భగవంతునకు ప్రియుడు. అనిత్యమగు సంసారమున దాని యందలి యల్పసుఖముల నెప్పుడు శాంతించునో నప్పుడు తెరవెనుక తెరవలె ప్రియాప్రియములుండును, భయసందేహము లుండును. బోనులోలేని మృగమునకు స్వేచ్ఛయుండును. నిస్పృహుడంతశ్శౌచ, బాహ్యశౌచ, దక్షత్వ, పక్షపాతరహితుడు, సర్వసకామ కర్మత్యాగి నా కిష్టుడనెను భగవంతుడు.

ప్ర: ఈమాదిరి యుండవలెనన్న బహుజన్మ సుకృతము, నీశ్వరానుగ్రహముండవలె. లేకపోతే గాలిలోలేచిన యణువువలె నెచ్చటపడు తాడా తెలియదు. మాదేవుడు మాదేవుడు, మాగీత మాగీత యనే పొల్లుమాటలుకావు. సీతను పెండ్లాడవలెనంటె శివువిల్లు నెత్తవలె. మాగీత మాదేవుడంటే పై లక్షణాలుండవలె. ఇకనేముండవలెను?

ఉ: ఇవి యుండుటవలన శాంతమా? దేహమంతా దురద గజ్జ గలవానికి శాంతమేది? ఎందుజూచిన నప్పులుగలవానికి సుఖమేది? దక్షత్వమేది? గుణములనే శత్రువుల తుదముట్టించినవాడు దక్షుడు. సాధించినవాని దక్షుడందుము, రక్షకుడందుము. చెప్పేది ధర్మము, చేసే దధర్మము. ఈలాటి పక్షపాతము, నొకదవుడమృత, మొకదవుడ విష ముండకూడదు. "ముఖం పద్మదళాకారం వచశ్చందనశీతలం। హృత్కర్తరీ సమం చాతివినయం ధూర్తలక్షణమ్" భక్తునకట్టి లక్షణాలుండవు. ఒడియబోసినతేనె, మథించినవెన్న, తొడిమెనమాగినపండు, పుటముబెట్టిన బంగారు, క్షీరవారాశివంటివాడు. సర్వకర్మల కోరికెల త్యజించినవాడె దైవభక్తుడు. 17, 18, 19 శ్లోకార్థము: శుభములు తటస్థింప సంతసము, నశుభములురా దుఃఖము లేక ద్వేషము, ఇష్టవియోగమైన దుఃఖము. లేనివస్తువును గోరటము, పుణ్యపాపములనిచ్చు కర్మల చేయుటము భక్తునకు తగదు. పై లక్షణములుగల భక్తుడే భగవంతునికి ప్రియుడు.

ప్ర: భక్తులంటే పేర్లుబెట్టుకొనుట చాలుననుకొంటిని. ఏ డిగ్రీ లేభాష లైన చదువవచ్చు, పొందవచ్చు, చెప్పవచ్చు. ఈ చదువు మానవుల యోగ్యతాయోగ్యతల నిర్ణయ చదువుగానున్నది. ఇయ్యది పరీక్షమైన గాని బంధరహితుడుకాడు కదా?

ఉ॥ శత్రుమిత్రుల నొక్కటిగ, పూజాపరాభవములు, శీతోష్ణ సుఖదుఃఖములు, నిందాస్తుతులు వీనియెడ సమదృష్టిగలిగి లభించిన నేదోద్ది తోనో పరితృప్తినొందుచు మౌనియై స్థిరనివాసములేక నిశ్చలచిత్తమును భక్తిరతుడు భగవద్భావముగలవాడే భక్తుడు.

ప్ర॥ భక్తులకు స్థిరనివాస మెందుకుండగూడదు?

ఉ॥ ఇయ్యది నాది యని స్థిరబుద్ధి యుండకూడదు. స్థిరవస్తువు పరమాత్మ. అస్థిరములవాంఛ వదలి స్థిరమందే నుండుటొకయర్థము. ఒక్కచోటనేయున్న భక్తివ్యాపకము, భగవంతుని సందేశము నంతటా వ్యాపించు టెట్లు? తిరుగకపోయిన నేభక్తు లేతీరున నుండెనది తెలియుటెరీతి? భక్త లభక్తుల యనుభవ మొకటేనను సందేహము తీరు టెట్లు? తనలోపములు, తనయొప్పులు లోకమున కెట్లు తెలియవలె? భగవత్స్వరూపమే విశ్వమగుట నెచ్చటనైన నుండవచ్చు. పెన్షను పొందిన యుద్యోగివలె నెక్కడనున్న భగవంతుడే యోగక్షేమము లరయును. సంకుచితము వ్యాకోచమగును. ధ్యానభక్తుల, కర్మభక్తుల, జ్ఞానభక్తుల, త్యాగధర్మల జూడవలెనంటె నంతట తిరుగవలె. ఒకచోటనేయున్న స్థలాభిమానము, యనేకులకు చౌకగల్గును. 20 శ్లో॥ గీతాభక్తులకు, భగవంతుడు ఫలశ్రుతిని వివరించెను. శ్రద్ధావంతులై పరమసత్యమగు భగవంతుడే దిక్కనినమ్మి యమృతమయమైన నీధర్మమును తాను జెప్పిన పగిది నెవరాచరించెదరో వారు నా కత్యంతప్రియు లనెను. "యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే। శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః ॥" ఆయాగుణములతో నొప్పువాడు నాకు ప్రియుడని భగవంతుడు చెప్పినాడుకాని నీగుణములన్నిటితో శోభిల్లువాడు నా కత్యంత ప్రియుడనెను. నలువదిరెండొక్కనియందే యుండవలెనని విశేషార్థము. శ్రద్ధారహితులకు నీధర్మ్యామృతము జీర్ణము కాదు. శ్రద్ధావంతులకు నీయమృతముగ్రోలి భగవంతుని స్వరూపులై యమృతవంతులై భగవంతుని కత్యంత ప్రేమనీయ భక్తులు. వారికి భగవంతుడు పరమప్రియుడు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## త్రయోదశాధ్యాయము

### క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

చ॥ అసిపదనిర్ణయార్థము మహాత్ముడు కృష్ణుడు దెల్ప నర్జునుం
డసదృశహర్ష మొందె వివిధాకృతులన్నియు నావె జూచితే
వెస నడపండి మోహము వివేకత గాంచుడి మీర లెవ్వరో
వసనములన్ని నూలుగతి వాస్తవమింతయె జూడు డంచనన్.

శ్లో॥ "ఆత్మా బ్రహ్మైవ బ్రహ్మాత్మైవ అత్ర హ్యేవ న విచికిత్స్యమ్" ఆత్మ బ్రహ్మమే, బ్రహ్మమే యాత్మగానున్నది. ఈ విషయమున సంశయమువలదు. శ్లో॥ "అధ్యస్తస్య కుతస్సత్త్వం అసతస్తు కుతో జనిః। అజాతస్య కుతో మృత్యుః ప్రారబ్ధమసతః కుతః॥" కల్పితవస్తు వధిష్ఠానవస్తువున నధ్యస్తమగుట ప్రతీతి గలంతకాలమే దాని యునికి. అధిష్ఠానజ్ఞానము గల్గినంతనే బాధింపబడునదికాన యథార్థములో దానికి యునికియే లేదు, గాన మిథ్య. అసత్యవస్తువునకు జన్మమెక్కడ? అనగా గొడ్రాలిబిడ్డ, కుందేటికొమ్ము, గగనకుసుమమిత్యాదులు అసలే లేవు. పుట్టుక చెప్పుటెట్లు? పుట్టుకలేని పారమార్థికసత్యమునకు మృత్యువెక్కడ? అసలే లేనిదానికి ప్రారబ్ధమే లేదు.

ప్ర॥ ఇదేకదా మూడవషట్కము. తత్త్వంపదార్థ వివరణ లేక నసిపదార్థ రహస్యనిర్ణయము. అందుకేనా యర్జునుడు తొలుత నడిగెను?

ఉ॥ మొదటిషట్కము త్వంపదమును, రెండవషట్కము తత్పదమును విశదపఱచి, మూడవషట్కమగు నసిపదార్థనిర్ణయ ముపక్రమించుటకు ముందే గీత భక్తియోగమున సగుణ నిర్గుణ భక్తుల నెఱింగించెను. అడుగవలసిన ధర్మసందేహము చెప్పగల యనుభవజ్ఞుల సమయము దొరికినపు

డుగక సమయము మించిన నెవరివలన తెలియఁగలరు? అడుగువాని ప్రశ్నలు, చెప్పువాని నాకలింపు జేసుకొనువిధానుండిన నుత్తరము తప్పక జెప్పెదరు. యోగ్యతాయోగ్యతలఁకూడ నరసెదరు. సమయమూ యుద్ధ సమయము, వినటమూ తత్త్వశ్రవణము. ఇంద్రియవేదికనుండి యడగటమూ లేదు తత్త్వవిచారవేదికనుండి యడుగబడినది. ఉభయబలములకు వారిరువురుగ తోచినను, వారిరువురి దృష్టిలో నెవ్వరులేరు. వారిరువురు కారొకఁడే. "ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిధిధ్యాసితవ్యః" ద్రష్టవ్యః ఆత్మయే తెలిసికొనదగినది, వినదగినది, యుక్తులతో ననుభవము తలచి తెలిసికొనదగినది. అదియే సత్యము. ధ్యానించటము లేక చింతించటము. "తచ్చింతనం తత్కథనమ్" ఆత్మనే చింతించుట, యాత్మవిషయమే శ్రవణము చేయుటయే సర్వోపనిషత్తుల యంతిమోద్దేశ్యము. 'త్వం తదసి' యని యుపనిషత్తులు జగద్బ్రహ్మాత్మల విచారోపసంహార మొనర్చెను. ఈ యధ్యాయప్రసంగమున కర్జునుని ప్రశ్నలే కారణము. భక్తియుపాయము నిర్దేశించి యుపేయముగు సాధ్యజ్ఞానము లేనిదే పూర్ణముక్తిలేదు.

ప్ర. అర్జును డేయే ప్రశ్నల నడిగెను? భగవంతుఁడు నర్జును డట్లడుగ వచ్చునా? తానే జెప్పగలఁడు కదా. భక్తుని లక్షణములబట్టి తా జెప్పక మానునా? అర్జును డడిగెడు ప్రశ్నల శ్లోకము గీతయందు లేదందురే?

ఉ॥ ఈ రహస్యము సద్గురు కటాక్షమున తెలియఁగలరు. నీవన్న మాట సత్యమే. మొదట నర్జును డడిగిన శ్లోకము లేదని కొందఱు, నున్నదని కొందఱందురు. ఈ శ్లోకము లేనిదై యెవరైన జేర్చిరనినచో, నట్లుచేర్చిన వనేకమున్నట్లు గనిపించుచున్నవి. అడుగకనే జెప్పగలవి జెప్పెదరు. చెప్పిన గ్రహించలేడేమొ యనునవి జెప్పరు. అడిగితే చెప్పెవి, యడుగవలసినవి యుండ జెప్ప మఱచిన నడుగవలసియుండును. కర్మయోగ, కర్మసన్న్యాస యోగ, మక్షరపరబ్రహ్మయోగముల నర్జునుడే తొలుత నడుగ భగవంతుడు జవాబిచ్చెను. ఆ యధ్యాయ శ్లోకముల నర్జును డడిగినట్లొప్పుకొనటము నీ యధ్యాయశ్లోకము నర్జును డడుగలేదంటే అసలు నర్జునుడు వినలేదు, భగవంతుడు జెప్పలేదంటే కాదనువారెవరు? "కార్పణ్యదోషోపహతస్వభావ" యని ప్రారంభించి యడిగినవా డర్జునుడేకదా. నీవు కాదు,

నేను కాదు, మఱెవ్వరు కాదు. రోగి యర్జునుడు, వైద్యుడు భగవంతుడు. విద్యార్థి యర్జునుడు, నుపాధ్యాయుడు భగవంతుడు. ధర్మసందేహము గలిగినది. కర్తవ్యభ్రష్టత నొందబోవుచున్నవా డాపార్థుడేకదా. ఆయన యడుగుచు రావటముతోనే గీత విశాలవృక్షమై త్రిభువనంబుల వ్యాపించినది. అడుగకపోతే ముందు జెప్పినదానితోనే తృప్తి నొందినాడేమో యని వక్త యనుకోవచ్చు. ఎంతసేపు బిడ్డ తల్లిని పాల నడుగక నేడ్వనపుడు తనకై తాను పాలిచ్చుటెట్లు? అథవా ఇచ్చెనందమా త్రాగనప్పు డేమి చేయగలదు? బలవంతమున త్రాగించెనా, వమన మొనర్చిన నేమి జేయును? తల్లి బలాత్కారమున బిడ్డడే నభిమానమునకు త్రాగెనా, అజీర్ణవ్యాధి వచ్చి బాధపడును. అధికారిగూడ నడుగుటయే ధర్మము. అడుగక జెప్పటము వక్తధర్మమే. వినకపోయిన, నభిమానమున విని వదలిన నేమి జేయగలదు? అంగడి యున్నది. అంగడికి బేరము వచ్చినవాని కేది యిష్టమో తెలియక నీకిది తగునని యంగడివాడివ్వ కొనువాడొప్పునా? ఎంత యుదారవంతుడైన పూర్వాపరముల నడుగనిది యెట్లు నిర్దేశింపగలడు? పోనీ భగవంతున కేమంత పట్టుదల లేదు. కల్పితశ్లోకమంటిమా సందర్భానుసారముగా గల నీశ్లోకమే గీతలో లేదన్న సందర్భానుసారముగ లేనివి కొన్ని గలవు. భగవంతుని యనగలమా! గీతలగూర్చిన వ్యాసుని యనగలమా! శ్రద్ధాతత్పరుడైన నర్జునుని యనగలమా! నా యుద్దేశ్య మీ శ్లోక మవసరమనే యనుకొందును. ఈ గీతకు ప్రశ్నోత్తరీప్రవచనగీతలంటిమి. నీవడుగకపోతే నేను జెప్పుటయందేమి స్వారస్యము? గురుశిష్యరూపముగ కృష్ణార్జునులకు జరిగిన సంవాదమే గీత. ఈ యధ్యాయము పారమార్థిక భావగంభీరమై పురుషార్థప్రదము. తెలియకపోతే కఠినము, తెలిసితే సులభము. గీతకు శిరోరత్నము, సర్వవేదాంతసారసంగ్రహము, సకలసంశయవిచ్ఛేదకరము. నానావిధ శరీరజీవులకు బ్రహ్మాండవ్యాపక పరమాత్మకు నిత్యసిద్ధమగు నభేదమును ప్రతిపాదించునది. అందువలన నర్జునుడే యడిగియుండునని నా యభిప్రాయము. నిర్దేశ్యము భగవంతునిదే కాని మఱొకరి కధికారములేదు.

ప్ర॥ జీవేశ్వరులు భిన్నులనేది జగత్ప్రసిద్ధమైయుండ భగవంతు డెట్లు నభేదమును జూపగలడు? గొప్పవాడగు వ్యాసుడెట్లు దీనిగూర్చును? అర్జును

డేరీతి నంగీకరించెను? ఆ కాలమున భగవంతునకు బదులాడ నెఱచి యర్జును డూరక నంగీకరించిన మనమెట్లంగీకరింతుము? పద్మవ్యూహమువలె నభేద్యమైన నీ రహస్యమును వివరించుడీ?

ఉ॥ అదిగో బూచి! యనియు, నవిగో నదులనేకము! లనుమాట జగత్ప్రసిద్ధియేకదా! బూచి నెవ్వరుజూచిరి? నదులు సముద్రమేకదా! ఇందులో దోషమేమున్నది? తత్ప్రకారమే నీ రహస్యము తెలియక జీవేశ్వరులు వేఱుయనుచుంటిమి. భగవంతుని మీఱజాలక వ్యాసార్జును లొప్పలేదు. ప్రత్యక్షదృష్టాంతముల సంశయముదీర్ప నంగీకరించిరి. సంశయముండిన నెవ్వరైన నేలాగు నొప్పుదురు? సంశయముతీరెనా, యొప్పుకొనక పోవుటెట్లు? ఒక్కటగు వేదమును యభిప్రాయము తొలగనందున నాలుగుగ విభాగించి యనేక పురాణములను, బ్రహ్మసూత్రములను, భారతాదుల మానవోద్ధరణకై శ్రమకోర్చి యశేషనిస్సందేహ నిష్పక్షవచనములచెప్పిన యపరనారాయణుడు వ్యాసుడు. ఆయన జీవితము నుదయించు భానుడొక్కటిగాదోచి రానురాను దిగంతవ్యాపకమైన ప్రకాశముభంగి ప్రతి మానవుడు తన్నుతాను పరిశీలించుకొని పూర్ణమగు బ్రహ్మానుభవము నొందుట కభేదజ్ఞానముగల గీతలగూర్చి యభేదముతో సంపూర్ణమైనది. వ్యాసుని సత్యాన్వేషణ, సత్యవ్రతము, సమత్వప్రతిపాదనమే వివిధములుగ దోచు జీవుల పంచవిధ భేదభ్రాంతుల గ్రహించి తన్నివారణోపాయముల సంఖ్యలజూపి గీతాచార్యునియం దేకీభవించెను. ఇక భగవంతుడంటిమా, జగత్తునకు తానే నభిన్ననిమిత్తోపాదానకారణుడు, బహురూపములుగదోచి పరిభ్రాంతిగల్గించు మాయ లేక నవిద్యను తొలగించుకుంటే చాలు మోహనివృత్తియై నిత్యాభేదమే, స్వతసిద్ధమైన తానేగాని యన్యములేదని చూపించుటయే లేక నైకైకత్వమే భగవంతుని యవతార ప్రవచనములు. అర్జునుడంటిమా, సామాన్యమానవుడుకాడు, అధికారయోగ్యతగలవాడు. అర్జునుడడుగ భగవంతు డతని సందేహముల దీర్చెను. మనకుమాత్రము సందేహముతీరిన నొప్పుకొనక మానుదుమా? అనేక సందేహములకు నాస్పదములగు నుపనిషత్తులు దర్శనశాస్త్రముల లోని కొరతల దీర్చగలిగినది యగుటచేతనే గీత చిన్నదైనను విశాల

కీర్తియు, నుపనిషత్తు యనిపించుకొన్నది. 'ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం' అని ప్రమాణము.

ప్ర॥ ఒకమాట గీతజెప్పినది కృష్ణుడుగాదా ?

ఉ॥ కాదు. "వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః" విభూతియోగమున యదుకులములోని వాసుదేవుడను, పాండవులలో నర్జునుడ నేననెను. మఱియు కృష్ణగీత యనక భగవద్గీత యనుటేల ? దేవకీ వసుదేవుల తనయునేకదా అర్జునుడు సారథిగా నంగీకరించెను. ఆ సారథియైన కృష్ణుడు జెప్పినగదా గీతయనవచ్చు. ఆమాట సరియే. విను. చతుర్థాధ్యాయమున నీ యోగమును సృష్ట్యాదిసూర్యునకు జెప్పితిననెను. అప్పుడు చెప్పినది కృష్ణుడేనా ? "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" స్వయముగ భగవంతుడే కృష్ణుడు.

ప్ర॥ త్వంపదార్థ, తత్పదార్థ, అసిపదార్థశోధన గీతయందు తమ స్వంత యభిప్రాయమేనా ?

ఉ॥ ఉపనిషత్తులు జీవేశ్వరాభిన్నప్రతిపాదకములు. గీత ఉపనిషత్తుల సారమగుటచేత నుపనిషత్తే. మఱియు భగవంతుని వాణి. కొందఱాచార్యు లంగీకరించిరి. నా అభిప్రాయ మిదియే.

ప్ర॥ త్వంపద తత్పదములంటే జీవేశ్వరు లేనా ?

ఉ॥ అవును. త్వంపదార్థమునకు జీవుడు లేక తాను, తత్పదార్థమునకు నీశ్వరుడు. ఎవరైతే జీవేశ్వరు లభిన్నులా? భిన్నులా? యను నీ విచారణ నేతురో వారికి ఫలము సంసారదుఃఖనివృత్తి, యానందప్రాప్తి లభింపగలదు.

ప్ర॥ తానంటే దేహమేకదా ? ఇది అందఱకు తెలిసినదే. పరమాత్మ అంటే మనకు తెలియదు. మఱియు కనిపించుటలేదు. ప్రపంచమా కనిపించుచున్నది. కొందను త్రవ్వి ఎలుకను బట్టినరీతి నీ విచార మంత ఫలదాయకము గాదనుకొనెదను.

ఉ॥ "కోఽహం కథమిదం జాతం కో వా కర్తాఽస్య విద్యతే" యనె శంకరుడు. నేను యెవడను? నీ ప్రపంచమున కెట్లు వచ్చితి? నని విచారించమనెను. త్రోవన బోయెడివారిని నీ వెవరు, నీదేవూరని అడిగే యలవాటున్నది. పాఠశాలలో జేరదలచిన ముందు తనపేరు జెప్పవలె. తానెవడో నింతవఱకు విమర్శించుకొననేలేదు. జీవుడు తన్నెపుడు విచారించి గ్రహిం

చునో, అప్పుడు సర్వము తెలియగలడు. దేహమునకున్నాడు. దేహమా జడము. యంత్రము త్రిప్పితే బొమ్మలెరిగిన భంగి శరీరమును తిరుగులాగు నొనర్చువాడొకడుండవలె. కీ నీకలోయిన గడియారము పెద్దముల్లు, చిన్నముల్లు తిరుగవు. నిమిషములు, గంటలు తెలుపవు. 'కేనేషితం' ఎవనివలన నింద్రియప్రాణవాక్కులు, దేహములు సంచరించగలవు. అదిజడమా చేతనమా అని విచారించకపోవట మజ్ఞానము. విచారించి తెలియుటయు జ్ఞానము. అట్టి జీవుని వివరము, పరమాత్మవివరమే నీ అధ్యాయము నెఱిగించును. ఆత్మానాత్మల వివేకము నన్వయవ్యతిరేకముల భగవంతుడు నిరూపించుచున్నాడు. పరమాత్మవిషయము మనకు తెలియకపోయినను శాస్త్రము లిట్టివాడని నిర్దేశించుచున్నవి. ఇదియొక పెద్దదేశము. ఈ దేశప్రభును నీవు చూడకపోయిన చరిత్రయే తెలుపును. పరలోకముల, లోకాధిపతుల, నక్కడి పరిస్థితులు మనకు తెలియకపోయిన శాస్త్రమేగదా తెలుపుచున్నది. శాస్త్రమెఱిగించిన పద్ధతినిబట్టి యథావిధ్యము జేసుకొనుము. ప్రపంచమంటే నేమి? స్థావరజంగమములకు జీవనమునాయనే. అర్థాపత్తిరీత్యా కార్యమునుబట్టి కారణము నూహించటము. అదిగో పొగ; కనిపించకపోయిన లింగిమునకు నగ్ని యున్నదందుము. ఇదో నొక గోడను నెవ్వడో నల్పకనే యెట్లు రూపొవ యోగమగును. తద్రీతి నీ బ్రహ్మాండమునకు నొకకర్త లేనిచో నిది యెట్లు గనిపించును. ఆ కర్తనే శాస్త్రము పరమాత్మయనును. జీవుని స్వరూపము మన బుద్ధిద్వారా మనమే కనుగొనవలెను. శాస్త్ర మవసరము లేదు. అద్దమున గనిపించే మన ముఖముజూడ శాస్త్రమేల? అద్దము చాలు. ఆ యద్దమైన వెనుకకుత్రిప్పిన, నెదుటివస్తువు లద్దమున గనిపించును. మనరూపు గనపడదు. అద్దమువంటి మనస్సు, బహిర్గతమైన ప్రపంచము దోచును. అంతర్గతమైన నాత్మయే కదా కనిపించును. జీవునిస్వరూపమును శాస్త్రముజెప్పే పరమాత్మస్వరూపమునకు భేదము లుపాధులేగాని జీవేశ్వరు లొకటియే.

ప్ర॥ అబ్బా! ఎంతమాట! జీవుడు భగవంతుడొకడేనంటే విశ్వము నమ్మునా?

ఉ॥ విశ్వము నమ్మేదేమిటి? అది జడము. నమ్మకపోవుటేమిటి? నీవు కదా నమ్మవలె. నీవు నమ్మవా యెవ్వరు నమ్మనట్లే! పుట్టినది మొదలు నిన్ను మఱచినావు. దేహమే నేననుకొన్నావు. నీధర్మములు దేహధర్మము లన్యోన్యాధ్యాసయై అనగా తాదాత్మ్యము నొంది దేహధర్మములు నీయందారోపించుకొంటివి. చిన్నమాట. చావవలెనని నీ యిష్టమా? దుఃఖించాలని యిష్టమా?

ప్ర॥ చావకుండనుండవలెననియు, దుఃఖము లేకుండనుండవలెననియు యిష్టము.

ఉ॥ పుట్టునదేది? చచ్చునదియే. అదియే దేహధర్మములు. దుఃఖము మనోధర్మము. ఈ ధర్మములు నెప్పటికుండవలెనన, సత్తు సదానందముగ నుండవలెననే యానందము, నన్నియవస్థల దెలియు జ్ఞానమునన సచ్చిదానందమే నీ స్వరూపము. నీ ధర్మములు దేహముపై నుంచి దాని ధర్మములు నీయందు నారోపించుకొనుట నీ యవివేకమేకదా. చచ్చెదను పుట్టెదను ఫలానిజాతి యింతవయస్సు నిలుచుంటిని కూర్చుంటిని యనుచుంటివి. నీవెవరో నీకు తెలియదు. అదిగో నదియొకకారు పోవుచున్నది, నిలుచుచున్నది యందుమా లేదా? అందుము. ఎవరినివదలి నెవరిధర్మము లెవరిపై నుంచితిమి? డ్రైవరును వదలి నతని ధర్మములు కారునందుంచితిమి. అతడు లేనిచో నది కదలగలదా? జీవుడు లేకపోయిన కారువంటి దేహము నేమందురు? శవమందురు. అప్పుడేల నది కదలదు మెదలదు? మరణించిన దేహమునుజూచి జీవుడు వెళ్లిపోయినాడందుము. ఆ వెళ్లిన జీవుడు లేకుండబట్టికదా దేహము చచ్చినది. జీవుడుండిన దేహము చరియించగలదు. జీవుడే దేహమునకు ద్రష్ట. ఇపుడుచెప్పు జీవుడు దేహము లొకటియేనా?

ప్ర॥ కాదు. జీవుడు వేఱు దేహము వేరని తెలిసినది. జీవుడు దేహములో నెట్లున్నాడు?

ఉ॥ దేహమునకున్న నవయవములు నింద్రియ ప్రాణచేష్టల నెవ్వ డెఱుగు, అవస్థల నెవ్వడు తెలియు నతడవు. వీని రూపునామముల చేష్టలు దెలిసికొనుచున్నాడు.

ప్ర॥ దేహేంద్రియాద్యవస్థలు జడములని, జీవుడు చైతన్యమై తెలిసి కొనుచున్నాడని తెలిసినది. జీవుడు లేనిచో నవి తమ్ముతాము తెలిసికో లేవు. మతేమి తెలిసికొనలేవు. సరే నాత్మానాత్మ విచారమంటిరే యదియేది?

ఉ॥ ఆ విషయము భగవంతుడు తెలుపగలడు విందువులే. ఒక్క శరీరమున నున్నవాడన్నిటిని తెలిసికొనుచున్న, బ్రహ్మండమును తెలిసికొనే వాడు వేఱుగానుండునా? ఒక్క పాఠశాలలో నొక్క విద్యార్థిని పరీక్షించినవాడు జిల్లాలోని యెన్ని పాఠశాలలనుండు విద్యార్థుల నతడేగదా పరీక్షించును. ఒక దేహమున కర్తయుండిన, బ్రహ్మాండమునకొక కర్త యుండవలె. నీ యిద్దరు కర్తలెవరు? వీరిపేరేమి? శాశ్వతులా? యశాశ్వతులా? ఒక్కటియా? కాదా? యని విచారించవలె. ఇంటికి యజమానుడు లోకమునకు ప్రభువు నొకడేనైతే నుపాధుల జూచితే నిద్దరు. వానిని తొలగించిన నొకడే, నభిన్నులే. జీవత్వమీశ్వరత్వము వ్యష్టిత్వసమష్టిత్వముల గలిగినపేరులే. "కార్యోపాధిరయం జీవో కారణోపాధిరీశ్వరః" మాయావిద్యలనే కార్యకారణోపాధులే నఖండపరమాత్మకు భిన్నత్వము గలిగించుచున్నవి. "జీవేశావాభాసేన కరోతి మాయా చ విద్యా చ స్వయమేవ భవతి" గవర్నమెంటనే మాయ నొకడనే వ్యక్తికే రెండు ద్యోగము లిచ్చుచున్నది. అఖండపరమాత్మకు జీవేశ్వరోద్యోగములు. మాయ యిచ్చుచు నదియే భేదమగు నవిద్యయైయున్నది. కార్యకారణముల తొలగించిన నఖండమే నద్వైతమే "పూర్ణమదః పూర్ణమిదం" పరిపూర్ణమే మిగులుచున్నది.

ప్ర॥ జీవుడెందుకు నఖండస్వరూపునిగ తెలియడు? దేహాత్మబుద్ధి చేతనా? ఇందుకు కారణమవిద్యయనెదరా? అయితే నిప్పుడేమి సేయవలెను?

ఉ॥ దేహేంద్రియముల వదలమనికాదు. దేహేంద్రియావస్థలకు విలక్షణమైనవాడను, దేహము నేనుకాదు, ద్రష్టనని దేహబుద్ధివదలి బ్రహ్మబుద్ధి యుండుటచే. దేహోపాధి జగత్తోపాధుల వదలిన జీవత్వమీశ్వరత్వ సాపేక్షశబ్దములు లేవు. ఉపాధు లద్వితీయ బ్రహ్మవస్తువే, నదియే సత్వమిదియే యనిపదార్థనిర్ణయము.

ప్ర॥ ఈ రహస్యములు తెలియకనే పురుషార్థములంటే సర్వకామముల నిరంతరము విధివిరామములేక సుఖదుఃఖములతో శాశ్వతానందము లేకున్నది. ఇవియేనా పురుషార్థము? కాదు. పురుషార్థమన ధర్మార్థ కామమోక్షములలో ధర్మమోక్షములే. లేక మోక్షమే పురుషార్థము. ఇది ముఖ్యము, తక్కినవి గౌణములు. ఈ రహస్యము తెలిసితే సర్వకామముల వదలి నిశ్శ్రేయసమగు మోక్షము నందుదు. నొంది యభేదస్థితితో నైకకుటుంబము లేక వసుధైకకుటుంబమైపోవును. బంధరహితము, స్వేచ్ఛావర్తనము, శాంతిసదనము మనదే. దైనందినకృత్యములన్ని నకర్మములే. సరేగాని తాము జెప్పుచుంటే నుత్సాహమేకాని నీవునీవుగా నేనునేనుగా ప్రపంచము ప్రపంచముగా కనిపించుచున్నదే, నభిన్నముగా గనిపించుటలేదా? అంతా వింటే నాఖరులో మారుననెదరా?

ఉ॥ బాగు, బాగడిగితివి. అర్జునునకు విశ్వరూపము జూడుమనుచు నీ నేత్రములతో జూడజాలవు అని వేరేనేత్రము నిచ్చినరీతి ముందు వింటివి కదా? ఆ నేత్రముతో జూడవలె. ఇప్పుడు నీవు జూచునది వృత్తివిషయ జ్ఞానము. ఈ జ్ఞాన మన్నిజంతువులకు సాధారణముగనున్నదేకదా? నా కన్నుల కేమి కనపడవంటే అద్దములబెట్టికొనిన నన్ని స్పష్టముగ జూతుము గదా? అద్దములరీతి నభిన్నముగ జూచుటకు మఱొక నేత్రము కావలె. 'ఆప్తోపదేశః శబ్దః' శాస్త్రమువచ్చి 'త్వం తదసి' ఆ బ్రహ్మమే నీవను దృష్టిగల్గింప గల్గినదాన నపరోక్షమగును. అద్వైతబుద్ధి లేకనే ద్వైతబుద్ధి చేత సర్వానర్థకముల గల్గించుచున్నది.

ప్ర॥ ఈ యధ్యాయము పేరేమి?

ఉ॥ క్షేత్రము, క్షేత్రజ్ఞుల విభజించుసాధన క్షేత్రక్షేత్రజ్ఞవిభాగ యోగము.

ప్ర॥ అర్జునుడడిగిన ప్రశ్న లేవేవి?

ఉ॥ "ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞమేవ చ" కేశవా! క్షేత్రక్షేత్రజ్ఞు లెవరు? ప్రకృతిపురుషు లెవరు? జ్ఞానజ్ఞేయము లేవి? యని నీ యారు ప్రశ్నలడిగె. అయితే భగవంతుడు మొదట క్షేత్రక్షేత్రజ్ఞులను తెల్పెను. ఇదియే నాత్మానాత్మ విచారము. ఆత్మయన తానగుచై తన్యము నానాత్మయన తానుగాని యచేతనమగు దేహేంద్రియాలు. శరీరమును

క్షేత్రమనియు, శరీరమునందుండి దీని నభిమానించి దీని నెఱుగువాఁడు క్షేత్రజ్ఞుఁడనెను. మాఁకులు, బెల్లము, నీరు, నగ్నిగలవనుకో. నేనొక్కటినే జెప్పితిని. లోకమంత నిట్లే చెప్పును. ఈ నాలుగులో సూక్ష్మముగానుండునవి నీవే జెప్పు.

ప్ర॥ మాను, తీపు, రుచి, దహనశక్తి గలవు. ఇవి సూక్ష్మములు.

ఉ॥ మాఁకులు మొదలగు వస్తువులలో నేవి సూక్ష్మముగా లేకున్న వీటి ప్రయోజన మేమిటి? క్షేత్రము క్షేత్రజ్ఞుడని యిట్లే వేరుజేసి తెలియువలె భగవంతు డీవిషయము తనయొక్కనిపైన నుంచుకొనక మనకు విశ్వాసముండదని క్షేత్రక్షేత్రజ్ఞ వివేకముగల మహాత్ము లనెదరనెను. శ్రద్ధావంతుఁడై భయంకర యుద్ధరంగమున నట్టి రహస్యము లేక జ్ఞానము నర్జునుడు వినెనంటే అదియే నతనిలోనున్న మహత్తరవిశేషము. ప్రొద్దుపోకన్ను, తీరికలేకపోయిన నేదోయొక లోకవ్యవహారమునకైన మానవులు కాలము గడిపెదరు. తీరికెగలిగితే బద్ధస్పర్ధలుగలిగే వ్యవహారములో మునిగెదరు. ఇనుప బీరువలలో విలువగలవస్తువు లుంతురు. పాడువస్తువుల నుంచమంటే నగిసీ మిన్నందుకొందురు. కాని పవిత్రమగు తమ హృదయపేటికయందు నిద్రించుచున్న, గుడుచుచున్న, తిరుగుచున్న, మాటలాడుచున్న,మఱేవిధమునయున్న నవాచ్యవిషయములే,ఒరుగుబొరుగుగద్దెలే, పాపచింతలే కాని మఱేమియుండవు. ఇనుపబీరువనపవిత్రములుంచరు. బీరువలో నేమిబెట్టిన నున్నవియే కాని యెక్కువ జేయలేదు హృదయమందమా, ఒకటికి వెయ్యిజన్మ కర్మసంకల్పబీజములవాటి యుత్తరజన్మమునకు హేతువగును. గీతార్థమును విని పదునెనిమిది దినములలో విజయము నాతడు సాధించితే తదర్థము నాకలింపుజేసుకొని కొన్నివేలయేండ్లకైన విజయము సాధింతమనుకోరు లోకులు. పశువులు మేసినమీదట తినిన యాహారము నెమరునకు తెచ్చుకొనువిధము, నీ మహారహస్యము శ్రద్ధగా విని మననమొనర్చి, సకల సంశయనివర్తి జేసుకుందామని అనుకోరు. కోడి భూమి రక్కిన భంగి, కుక్క అంతటా తిరుగురీతి మనోచాంచలముతో నేదియోయొకవిషయమునుబట్టికొని మాటలాడుచునేయుందురు. అథవా యెవరి ప్రేరణవలన శ్రవణమొనర్చిన చెప్పినదేమి తెలియదు. నిద్ర కూర్చొనీయదు, విననీయదు. ఏమి నిద్రించుచుంటిరన, లేదు యోగమనెదరు.

చెప్పగా విన్నది లోనయుంటే నేసమయమున కేయుపద్రవము తెచ్చునో అని లేచి బట్టలధూళి విదిలించుచు శ్రవణముజెప్పినవారికే వదలి ఖాళీగా బోదురు. ఎన్నాళ్లువినినా యింతేనాయుంటే సన్యాసులకేగాని గృహస్థులకు కాదందురు. డబ్బు యెంతైన ఖర్చుబెట్టి సినిమాలు, హరికథలు, చెంచునాటకములు, తిరునాళ్లు మొదలైనవాని నాడంబరముగ జూచి వత్తురు. అర్జునుడు త్రైలోక్యాధిపత్యమే వల్లననెను. అది త్యాగము. ఏ మంచిపనికిబోయిన లాభముతో నింటికి రావలె ననెడివారికి గీతేమి జెప్పును.

ప్ర॥ క్షేత్రమంటే శరీరమే. విశేషార్థమున్న వివరింపుడు ? ప్రథమాధ్యాయ ప్రథమశ్లోకమున ధర్మక్షేత్రమనెను.

ఉ॥ ధర్మక్షేత్రమన కురుక్షేత్రముననే గాక ననేకార్థములుగలవు. 'శీర్యతే ఇతి శరీరం' జీర్ణముగాగలది శరీరము. 'జాయతే అస్తి' షడ్భావవికారములుగలది. 'ప్రాణస్య క్షుత్పిపాసే ద్వే' మనస్సు శోకమోహనమ్మను షడూర్మలతో గూడినది. సప్తధాతుమయమై బాల్య కౌమార యవ్వన వార్ధక్యములు గలది; నవరంధ్రములు గలది. స్త్రీపున్నపుంసకముల నొప్పునదే దేహము. 'క్షీయత ఇతి క్షేత్రం' స్వభావముచే నేర్పడు గుణములు వీనియందుండును. గుణధర్మములు గలదియగుట ధర్మక్షేత్రము. శాస్త్రధర్మములకు క్షేత్రమువంటిది. పుణ్యక్షేత్రమునకు, గర్భక్షేత్రమునకు, హృదయక్షేత్రమునకు, సస్యములు పండుభూమికి, కురుక్షేత్రమునకు మఱి యనేకార్థములు గలవు. అపవిత్రమును పవిత్రమొనర్చు పుణ్యక్షేత్రము. ఎట్టిబుద్ధితో నేసమయమున పురుషుడు వీర్యమునుంచిన నట్టి సంతానమిచ్చుట గర్భక్షేత్రము. భూమిలో కొన్ని సస్యములుంచిన ననేకసస్యముల ఫలింపజేయు భూక్షేత్రము భంగి హృదయక్షేత్రమున పుణ్యపాపమిశ్రమ కర్మఫలముల బండించుకోవచ్చు లేక బ్రహ్మబీజముల విత్తి మోక్షము బండించుకోవచ్చును. "క్షత త్రాణాత్ క్షయాత్ క్షరణాత్" కవచమువలె జీవుని కాపాడునది, నశించుస్వభావముగలది, జీర్ణమైపోయ్యేదని యర్థము. శరీరమన్నపుడు స్థూల సూక్ష్మ కారణ శరీరములు మూడు, కోశములైదు, నింద్రియములు పదునాలుగు, దశవాయువులు, వీని యధిదేవతలు

మొత్తము మూడవస్థలలో శరీరము లేక క్షేత్రమందురు. గృహమన్న దంతెలు, స్తంభములు, గోడలు వగైరాలుకలిసి యొకటిగానుండును. గృహస్థుడన్న నా యింటిలో కాపురముండువాడు. నాతడు గృహము కాడు. గృహము వేఱు, నాతడు వేఱు. బాడుగయింటివలె నచ్చితే యుండును లేకపోతే మఱొకయిల్లు జేరును. క్షేత్రజ్ఞుడు క్షేత్రముకాదు. గృహస్థునివలె వేఱు. కొంతకాలముండి దానిని వదలి నింకొకటి జేరును. గృహము నెఱుగు గృహస్థునివలె క్షేత్రము నెఱుగువాడే క్షేత్రజ్ఞుడు. గృహము దృశ్యము, గృహస్థుడు ద్రష్ట. క్షేత్రము దృశ్యము, క్షేత్రజ్ఞుడు ద్రష్ట. సాంఖ్యులు "వ్యక్తావ్యక్తజ్ఞ విజ్ఞానాత్" అవ్యక్తము, వ్యక్తము పురుషుని విభజించుటే జ్ఞానమనెదరు. భగవంతుడు క్షేత్రము, క్షేత్రజ్ఞుల విభజించి తెలిపెను. 'జ్ఞ' శబ్దార్థము తెలిసికొనుటయే. క్షేత్రమున తచ్ఛబ్దము లేదు. కావున క్షేత్రము తన్ను తెలిసికోలేదు,తదితరముల తెలియదు. గృహము గృహస్థుడన్నపుడు 'స్థ' శబ్దము గృహమున నున్నవాడనియు, గృహధర్మముల తెలిసికొనే గృహాభిమానియని పేరు. శరీరాభిమాని యగుట క్షేత్రజ్ఞుడు. 'ఇదం' శబ్దముచేత జెప్పబడేది క్షేత్రము. 'అహం' శబ్దముచేత జెప్పబడువాడు క్షేత్రజ్ఞుడు. క్షేత్రము జడము, దుఃఖమయము, పరిచ్ఛిన్నము, మిథ్యాలక్షణములుగలది. క్షేత్రజ్ఞుడు సచ్చిదానంద ఘన వ్యాపకలక్షణములుగల చేతనుడు. ఒక శరీరమునేకాదు, ప్రపంచమునే కాదు, స్వప్నప్రపంచమును, శూన్యమును, నిద్రను, పరలోకములను, తుదకు తన్ను తెలుసుకొనేవాడు.

ప్ర॥ అయితే క్షేత్రజ్ఞుడు శరీరములో నెచ్చట నుండును?

ఉ॥ ఇదిగో ఇది యొక రేడియో. దీనియందు ఫలానివా డుపన్యసించునంటే మనము రేడియోవద్ద కూర్చొని విందుము. ఉపన్యాసకుడు రేడియోలో నక్కడుండును? రేడియోను కాదని పలుకగలడా? ఆ రీతి శరీరమనే రేడియోలో శరీరమునకు విలక్షణముగానుండి తెలిసికొనుచుండును. శరీరమెంతగలదో నభిమానించితే నంతటాగలడు. అభిమానింపకపోయెనా తాను తానుగా నుండును. రేడియో వేఱు, నుపన్యాసకుడు వేఱని తెలిసినది. దేహము వేఱు, దేహి వేఱు. కరుణించి భగవంతు డీరహస్యము తెలుపటమేమన, భ్రాంతిజ తాదాత్మ్యముచే పురుషుడ,

స్త్రీని, క్షత్రియుడ, బ్రాహ్మణుడనను నిత్యాదిభేదములు తొలగగలవు. చచ్చెదనను భయము, పుట్టెదనను భయముదీరి పుణ్యపాపములు వెంట నంటును భీతి తొలగిపోయేనానికై క్షేత్రక్షేత్రజ్ఞులు లేక నాత్మానాత్మ వివేకముతో నొక క్షేత్రమును తెలిసికొన్న "యథా పిండే తథా బ్రహ్మాండే" పిండమెట్లో బ్రహ్మాండమట్లే, పిండమంటే నొకటి, బ్రహ్మాండ మంటే సమస్తశరీరముల పిండసమూహమని యర్థము. క్షేత్రమసత్యము, క్షేత్రజ్ఞుడు సత్యము.

ప్ర॥ క్షేత్రమసత్యము, క్షేత్రజ్ఞుడెట్లు సత్యము?

ఉ॥ ఒకడు పుణ్యం, నొకడు పాపము జేసిన వీరిద్దరు మృతి నొందిరి. బ్రతికియున్నపుడు వీరిరువు రొనర్చిన పుణ్యపాపకర్మ ఫలమెవడనుభవించ వలె? చేసినది యనుభవమునకు రాకపోతే కృతవిప్రనాశ దోషము రాగల దనును శాస్త్రము. పుణ్యపాపము లొనర్పనే యనుభవమున కొచ్చిన వంటే నా కర్మలు చేయువారు లేకపోయిన నెట్లు యనుభవమునకు వచ్చును? అట్లు వచ్చిన నకృతాభ్యాగదోషమనెదరు. ఆత్మ లేకపోతే కర్మ చేసేవారు లేరు. అనుభవ మెవ్వరికి? దేహముతోపాటు నాత్మ చనిపోయిన నీ కర్మ ఫలములు నిష్ప్రయోజనములగును. "అజో హ్యయం పురుషః" జన్మము లేనివాడాత్మయని ప్రమాణము. స్థూలసూక్ష్మకారణ శరీరములు నాయా యవస్థల నాత్మచేతనే తెలియబడును. ఆత్మయే లేదా తెలుసుకొనేది యెవరు? సుషుప్తిలో నాత్మయున్నట్లు నితరులకు గోచరములేదు. ఆత్మకు తాను లేననుసది యాసమయమున లేదు. తాను యుండియేయున్నాడు. మెలకువ గలిగినంతనె హాయిగా నిద్రించితిననును. అనుభవించినది యను భవమునకు తెచ్చుకొనుట ప్రత్యభిజ్ఞ యందురు. ఇది నా శరీరము, నిది నా ప్రాణము, నా యింద్రియములని తెలియువాడే క్షేత్రజ్ఞుడు లేక నాత్మ. "ప్రకృతిం పురుషం చైవ" యను మొదటిశ్లోకములోని క్షేత్రక్షేత్రజ్ఞుల వేఱుపఱచి "ఇదం శరీరం కౌంతేయ" క్షేత్రక్షేత్రజ్ఞులే పరాపరప్రకృతులు రెండు. అర్జునా! భోగాయతనమగు నీ శరీరమునే క్షేత్రమనియు, క్షేత్ర జ్ఞుడు వేఱని నీ శ్లోకము పూర్తిచేసి "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వ క్షేత్రేషు భారత" ఆబ్రహ్మస్తంభపర్యంతముగల శరీరముల జీవరూప మున వెలయునది నేనేయని గ్రహింపుము. క్షేత్రక్షేత్రజ్ఞుల గుఱించిన

జ్ఞానమే జ్ఞానమని నా యభిప్రాయము. మఱియు, తక్కిన జ్ఞానమంతయు నజ్ఞానమనెను. క్షేత్రజ్ఞుని స్వరూపమునే విపులముగ నర్చెను. ఒక శరీరములో తెలుసుకొనే క్షేత్రజ్ఞుడెవరో యనుకొనకు, తక్కిన శరీరముల నుండున దెవరో యనుకొనకు, అనగా వేఱువేఱనుకొనకు, సమస్తక్షేత్రముల నున్నవాడ నేనేయనెను. ఒక వీధిలో పది కొళాయిలుగలవు. కొళాయిలు వేఱే యైనను, ప్రతి కొళాయినుండి వచ్చునీరు యొకటిగాదా. ఇదే సత్యజ్ఞానము.

ప్ర॥ అన్ని క్షేత్రములలో నున్నది తానొక్కడే నెట్లగును? క్షేత్రమున కొకడుండుట నందరెఱింగినదే. క్షేత్రజ్ఞుడొక్కడైతే దేహములు వేఱు వేఱేలా? క్షేత్రజ్ఞులందరొక్కపరమాత్మయైతే నిన్ని దేహములెట్లువచ్చును? పరమాత్మ జీవాత్మయగు టేరీతి?

ఉ॥ క్షేత్రములన్నిటిలో నేనొకడనేయున్నాను. క్షేత్రములు వేఱు వేఱైన భగవంతుడొక్కడే, నందుకే తానేకవచనమున క్షేత్రముల బహువచనమున జెప్పెను. చెఱువులు, కుంటలు, బావులు, నదులు వేఱువేఱైన నీరు యొకటియేకదా. కుండలు వేఱైన మన్నొకటే, నగలు వేఱైన బంగారొక్కటియే, పూసలు వేఱైన దారమొక్కటియే, గృహములు వేఱైన గృహముల నాకసమొక్కటియే, శాఖలు వేఱైన వాని విత్తనమొకటియే. క్షేత్రజ్ఞులు వేఱువేఱుకాదు, ఒక్కడేనని నిర్ణయము.

ప్ర॥ ఏమేమీ! ప్రతిశరీరములో వేరువేరుగానున్న జీవులొక్కపరమాత్మయేనా? వహవ్వా! ఎంత యదృష్టము. భగవంతుడు లోకాల కిచ్చిన యమరసందేశమువింటే యా లేదు, నూ లేదు. నేను నేననిస్ఫురించువాడు తానే ననెదరా?

ఉ॥ అవును. నేను నేననునది యాయనయే. నేననెదవు. చేతిని రొమ్ముపై నుంచుకొందు వెందుకు? చేయి జడము. దానిని రొమ్ముపైకి లాగినదెవరు? నేను యన్నవాడే నేనిందున్నానని జూపుచున్నాడు. మనము దేహము నేనని జూపుచున్నాడనుకొందుము. అన్నమనిన మెతుకుల సమూహము. వనమనిన వివిధరకముల చెట్లసమూహము. క్షేత్రమనిన వ్యష్టిదేహమే గాక దేహములందంతటా తానేయుండుటచేత ప్రత్యక్షముగ, నప్రత్యక్షముగ దోచులోకములు, దేశములు, కాలములు, నవస్థలు, సృష్టిస్థితిలయ

ములు, నామములు, రూపములు, స్వచ్ఛతాస్వచ్ఛతలు, నుచ్చనీచములు భగవంతుని సమిష్టిక్షేత్రమే. విశ్వరూపమున నీ విషయము విశదపఱచియే యున్నాడు. అనాది యవిద్యవలన నహంపదవాచ్యము నెఱుగక వ్యావహారికముగ జెప్పెడు షోడశకర్మలు, నిష్టాపూర్త, దత్తకర్మలు, నభ్యాసములు, వారములు, నెలలు, ఫలములు నాత్మకు సంబంధించినవికావు. బ్రాడ్‌కాస్టు జేయువాడొక్కడేనైనను పెక్కురేడియోలెందుకందమా! ఎన్నియున్నను నిత్యానందమే, నంతాముచ్చటయే, నంతసొబగే, నంతయు విలాసమే నగుట క్షేత్రములన్నిటియందలి యక్షరతత్వము తానే. అక్షర పరబ్రహ్మయోగమున "అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మ ముచ్యతే" నాశనరహితుడై శ్రేష్ఠమగు నే బ్రహ్మముగలడో ప్రతిశరీరమునను దధ్యాత్మ తానె యనెను. విభూతియోగమున "అహమాత్మా" నేనే ప్రాణులందరి హృదయమున నున్నవాడననెను. రేడియోలు ప్రధానము గాకపోయినను బ్రాడ్‌కాస్టానర్చువాడు ప్రధానము త్రాటిపై దోచు మిథ్యాసర్పముభంగి యొక్క పరమేశ్వరునియం దిన్నిలోకములు నధ్యస్తమై దేహములుగా భూతములుగ తోచుచున్నవి. త్రాడుపై దోచిన పామసత్యమైనను త్రాడుకంటె నన్యముకానందున పాము త్రాడేయగును. భగవంతునియందు దోచు నీ సర్వశరీరముల సమూహముకూడ భగవంతుడే.

ప్ర॥ అంతా పరమాత్మయైతే నొకనికొకతీరు మరొకనికొకతీరు జీవుల జీవితములు గనిపించుటేల?

ఉ॥ సూర్యుడేమొ నొక్కడే నుచ్చనీచోపాధుల న్యూనాధికములుగ దోచును. దోషము నుపాధులగలదుగాని భగవంతునకు సూర్యునివలె నెచ్చుతగ్గులులేవు. అంతఃకరణదోషములు ప్రారబ్ధశరీరములబట్టి జరుగును. అసంగుడగు నాత్మకే వికారదోషము లంటవు. సుఖదుఃఖములు మంచి చెడ్డలుంలేవు.

ప్ర॥ అర్జునునకు యుద్ధము తటస్థించటము నీ పరమగోప్యమగు తత్వ రహస్యము వినుటకే కాబోలు?

ఉ॥ ఆ యర్జునునకంటే మన యదృష్టము గొప్పది. ఈ తత్వరహస్యము నర్జునునివలకే వచ్చి యాగిపోక, భావిమానవులమగు మనయందఱ

వఱకు వచ్చుట యున్నవారు రాబోవువారలంతా ధన్యులే. తొలుత క్షేత్రము, క్షేత్రజ్ఞుల వేఱుగ గుర్తెఱిగి చరాచర క్షేత్రములన్ని యొక్క క్షేత్రమే, క్షేత్రముల నన్నిటియందు క్షేత్రజ్ఞుడు పరమాత్మయే నని తెలుసుకున్నదే జ్ఞానము.

ప్ర॥ ప్రకృతి పురుషుల జ్ఞానజ్ఞేయముల ముందుజెప్పక క్షేత్రక్షేత్రజ్ఞుల నేల చెప్పటము?

ఉ॥ శాస్త్రపరిభాషలో నొకశబ్దమున కొకవస్తువున కనేకార్థము లుండును. అనేకమున కొకేయర్థము నన్వయించుకోవలె. క్షేత్రము, ప్రకృతి, శరము, నపరాప్రకృతి నివి యన్నియు పర్యాయపదము లొక్క క్షేత్రమునకే పేరులు, క్షేత్రజ్ఞుడు, జీవుడు, నాభాసకుడు, నక్షరుడు, పరాప్రకృతి, యధ్యాత్మ, కూటస్థుడు, నాత్మ పర్యాయపదము లొక్క క్షేత్రజ్ఞునకే పేరులు. ప్రకృతిపురుషుల నధ్యాయాంతమున తెలుపుటకు క్షేత్రక్షేత్రజ్ఞుల తెలిపినమీద జ్ఞానజ్ఞేయముల జెప్పెను. "ఏకవిజ్ఞానేన సర్వం విజ్ఞాతం భవతి" అద్వితీయాత్మవస్తు జ్ఞానముగలిగితే తక్కిన విశ్వ జ్ఞానము వెంటనే యర్థమగును. "అజ్ఞాతజ్ఞాపకం హి శాస్త్రం" మఱచి పోయిన తన్ను నెఱిగించుటకే శాస్త్రము.

ప॥ క్షేత్రక్షేత్రజ్ఞుల జ్ఞానము తెలిపి "తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్" యను మూడవశ్లోకము జెప్పుటేల?

ఉ॥ ఒకతల, యొకబుద్ధిగలవారము మనము. "తత్సర్వతోఽక్షిశిరో ముఖమ్" సమస్త శిరములు, కన్నులు, బుద్ధులు తానుగాగల భగవదుద్దేశ్యము మనకు తెలియదు. ఆయన నగ్నసత్య మాయనకే తెలియును. చతురానన, పంచానన, షడానన, సహస్రాననాదు లెవ్వరు నెఱుగజాలరు. మనబుద్ధికి తోచినంతమటుకే మనము తెలిసికొని తృప్తినొందవలె. ఇంతకు నాయన మానవులుగానున్న తన యపరరూపులకు యథార్థము నెఱిగించి భయసందేహముల దీర్చుటయే. క్షేత్రక్షేత్రజ్ఞులు వేరని విశదము జేసెను. కాని క్షేత్రముయొక్క స్వరూప స్వభావములు, క్షేత్రజ్ఞుని స్వరూపస్వభావములు జెప్పిన, వినువారికి, తెలియువారికి నిక నేమున్నదో యను సంశయముండదు. చెప్పుటానికి నంతయు జెప్పితిగాని ఫలానిది

కొదవయున్నదే, దీనివలన నేమి యనర్థకము వాటిల్లజేసుకొందుమో ననియు, నింతజెప్పి ప్రయోజనముండక పోయెనని చింతిల్లునది యుండదు. వ్యాసుడు భారతము వ్రాసి ప్రజలకు శాంతియొసగూర్చుమార్గము తెలుప నైతినేయని వాపోవుచుండ, నారదుడు వచ్చి భక్తివైరాగ్యజ్ఞానయుక్తమగునది వ్రాయుమన్నగదా భాగవతము వ్రాసెను. క్షేత్రమని యెందుకనెదరు? ఎట్లు వచ్చెను? దీని వికారము లేవి? ఇంతకన్న నేల పెద్దదిగా యుండకూడదు? లేక చిన్నదిగా నేల నుండకూడదు? పెక్కువేలయేండ్లు లేక బొత్తిగ చావకనే నేల యుండగూడదు? రోగము లెందుకు? జరా యెందుకు? మరణమేల? సారవంతమా? నసారవంతమా? అయితే నీప్రశ్నలకు మీమాంస యొనర్చుటములో వేదములు, షడ్దర్శనములు, శాస్త్రములు నేకాభిప్రాయమునకు రాలేక తర్కవితర్కములతో వ్యర్థప్రసంగము లొనర్చుచు తారుమారైనవి. లోకమంత నాటికి నేటికి నీ విషయములగురించి వాదోపవాదములు, నొకరిమాట నొకరికి యొప్పక, నొకరివంక నొకరుచూడక మతవిచ్ఛిన్నములైనవి. మఱియు నూహాపోహల దుస్థితి యేర్పడినది. ఏవైపుచూచిన నశాంతి తాండవమాడుచున్నది. అహామనునది ప్రతియింట జగడమొనర్ప జేయుచున్నది. నాస్తికులు తాళములువేయు, నాస్తికులు నాటలాడ, తదితరులు మద్దెలులుగొట్టు లోకనాటకము క్రిందుమీదులుగ జరుగుచున్నది. సంకల్పవికల్పములతో వెలుపలనున్న విషయసంజాతములనే విత్తనములు తెచ్చి లోననుంచు మనస్సు వ్యాపారి, బుద్ధియందమా వ్యాపారార్చితవస్తువుల సంచితముగ ననేక జన్మములకు ఫలకారులగురీతి పుణ్యఫలము లొకవంక, పాపఫలము లొకవంక, మిశ్రమఫలము లొకవంక, సత్వగుణ రజోగుణ తమోగుణ బొక్కసములలోనుంచి జాగ్రత్స్వప్న సుషుప్తులను, తలుపుల నేవాకిట వచ్చినవా, వాకిటనుంచుచు విశ్వతైజస ప్రాజ్ఞులను, జీవాభిమానులకు భోగకాంతయై విషయములనే వలువల ధరించుచు వదలుచుండును. అహంకారమందమా? క్షేత్రగుత్తదారుడు, లేక పెత్తనదారి. ఏ సమయమున నేవస్తువులచే ననేకక్షేత్రముల తయారుచేయవచ్చునని క్షేత్రక్షేత్రముల కంట్రాక్టతడేచేయును. చిత్తమా, అవిద్యాస్వభావము, ప్రకృతి సముద్రమునందలి తరగలవలె నంతరంగ బహిరంగ విషయముల

భూకంపము గలిగించి రొమ్ముదుడుకులు గలిగించుచుండును. పంచప్రాణములు దేహమునకు వాయుప్రపట్టులు. కోశములు క్షేత్రమునకు విహారస్థలములు. క్షేత్రజ్ఞుడు వీని నభిమానించును. ఈ క్షేత్రము కేవలము జీవునిచేనవి యనుటకు వీలుపడదు. జీవుడు ప్రవాసిమాత్రమే. దీనియందుండుటవలన నాతడు దీనిని కాపాడును. సాంఖ్యశాస్త్రకారులు పురుషుని భోగాపవర్గముల నిమిత్తము త్రిగుణాత్మిక ప్రకృతి దేహేంద్రియాకారముగ పరిణమించిన సంఘాతమే శరీరము స్థూలసూక్ష్మరూపమనియు, దీని ప్రకాశింపజేయువా డాత్మయని జెప్పుదురు. ఈ క్షేత్రవిషయమగు పక్షము లనేకములైనవి. మహర్షులున్నారే యతీంద్రియజ్ఞానముగలవారు పెక్కురీతుల వర్ణించిరి. పురాణములందు గూడ ననేక చర్చలు వీని గురించి జరిగినవి. ఛందస్సులలో పెక్కురకముల వీనినిగూర్చి వివరించిరి. వేదములు సైతము పరిపూర్ణమైన గమ్యమేనని యభివర్ణించినవి. సంశయమునకు నాస్పదమివ్వని బ్రహ్మసూత్రములవల్లను తెలియబడినది. నేను నీకు వాని యాధారముతో జెప్పుచున్నాను వినుమని యర్జునునితో భగవంతుడనెను. వినట మర్జునుడు, చెప్పుటము కృష్ణుడు. వీరికే చెల్లును నీ గురుశిష్యన్యాయము.

ప్ర॥ నాలుగవ శ్లోకార్థము, క్షేత్రక్షేత్రజ్ఞులగురించిన యభిప్రాయము లట్టివి. క్షేత్రమును తెలిపితిరి. ఇకను క్షేత్రమును గురించి తెల్పెదరా?

ఉ॥ క్షేత్రమును గురించి తెలుపసాగిన గ్రంథవిస్తరము గాకమానదు. అయినను క్షేత్రధర్మాలతో సంగ్రహముగ జెప్పెద. 5, 6 శ్లోకములకు "కామసంకల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధా ధృతిరధృతిః హ్రీః ధీః భీరిత్యేతత్ సర్వం మన ఏవ" బృ॥ కామము, సంకల్పము, సంశయము, శ్రద్ధాశ్రద్ధలు, ధీరతాధీరతలు, సిగ్గు, బుద్ధి, భయము లన్నియు క్షేత్రస్వభావము లన్నది. గీతేమంటున్నది? "మహాభూతాన్యహంకారో" యని ప్రారంభించినది. ఆకసము, వాయువు, నగ్ని, జలము, పృథివి యైను భూతాలు పంచీకృతములుగాని యపంచీకృతములు. వీనినే తన్మాత్రలందురు. వీనికి కారణమైన సమిష్టి యభిమానరూపమగు నహంకారము, అహంకారమునకు కారణమైన సమిష్టిరూప మహాతత్త్వము లేక బుద్ధి, దీనికి కారణమగు ప్రకృతి యనే నవ్యక్తము, వీని వరుసగా జెప్పును.

ప్ర॥ అవ్యక్తము, మహత్తత్వము, మహావహంకారము, పంచతన్మాత్రలు వెరశి యెనిమిది.

ఉ॥ "అష్టౌ ప్రకృతయః షోడశ వికారాః పురుషః" సాంఖ్యుల యొక్క యష్టప్రకృతులివియే. పదకొండు యింద్రియములు, తన్మాత్రలగు భూతము లైదు వెరశి యిరువదినాలుగందురు. షోడశవికారములన జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు పదియు, మనస్సొకటి, శబ్దస్పర్శాదులగు మాత్ర లైదు వెరశి పదునారు. ఇరువదియైదవవాడు లేక పదిహేనవ వాడాత్మయగు పురుషుడందురు. అవ్యక్తమన వ్యక్తముగాని త్రిగుణముల సామ్యావస్థ లేక మన యూహాకందని జగన్మూలమగు మహామాయ.

ప్ర॥ సాంఖ్యసూత్రముల నెవరు జెప్పిరి ?

ఉ॥ కపిలుడు 'తత్వసమాస' అను గ్రంథము సాంఖ్యమును తెలుపును. ప్రకృతి యొకటియే యనియు, పురుషులనేకులనియు, ప్రకృతి పురుషులు నిత్యులందురు. ప్రకృతి స్వతంత్రయనికూడ జెప్పెదరు. గీత అభిప్రాయ మదికాదు.

ప్ర॥ అదికానిచో "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి" అని నేలయన్నది ?

ఉ॥ బ్రహ్మము, ప్రకృతి సంబంధము, ఈశ్వరుడు, జీవుడు, పరస్పర భేదము లనునవి యనాదులనియే వేదాంతమంగీకరించును. కాని విచారించితే జ్ఞానమున బాధించబడవు గావున నీ యారు సాంతములనిరి. ఇదే గీతోద్దేశము. సృష్టినిగురించి వేదాంతుల విధానము వేఱు. మలిన సత్వప్రధానమగు మాయను, శుద్ధసత్వమగు, మాయోపాధియగు నీశ్వరుడు వీక్షించుటచే తొలుత సూక్ష్మసృష్టిచేత సత్వరజోగుణ సంజాతములగు జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు, పంచప్రాణములు, మనోబుద్ధి చిత్తాహంకారములుగలసి పందొమ్మిది తత్వములతో సూక్ష్మశరీరమైనది. తమోగుణమయము స్థూలశరీరముగలిగెను. ఈ రెంటికి నజ్ఞానమే కారణ శరీరము. వ్యష్టి శరీరత్రయము నవస్థలు జీవులు గలిగినవి. వీని స్వభావములు విను. అదిగో నదియొక రైలుయొక్క యింజను. అది దీని రూపము, స్వభావము సూక్ష్మమగు గ్యాస్ లేక స్టీమ్. దానినుండి గఫగఫ అను ఫూత్కారశబ్దము, ఈలవేయుటము, పరుగెత్తుటము, పొగవిడవడ

ములు స్వభావములే. కామ, క్రోధ, లోభ, భయ, మోహములు ఆకాశసంభూతములు. పరుగెత్తుట, నిలుచుట, ముడుచుట, చాచుట, నీల్గుట వాయుస్వభావములు. ఆకలి, దప్పి, నిద్ర, యాలస్యము, సంగమాదులు నగ్నితత్వములు. మూత్రము, జొల్లు, చెమట, శుక్లము, శోణితములు జలసంబంధములు. ఎముకలు, మాంసము, చర్మము, నఖములు, వెండ్రుకలు పృథివీగుణములు. వ్యష్టి క్షేత్రధర్మములే. సమష్టి శరీరములు, నవస్థలు, నభిమానజీవులుగలిసి యంతరంగ బహిరంగముల పిండాండసమూహమే బ్రహ్మాండక్షేత్రము.

ప్ర॥ ఇంతవిచారముసేయు టెందుకు ?

ఉ॥ అతద్వ్యావృత్తిరీతి నిదిగా దిదిగాదనే సర్వక్షేత్రములు, వాని స్వభావములు జడములని యా జడశరీరముల నభిమానించు జీవుడు క్షేత్ర ధర్మములు తనయం దారోపించుకొని సర్వానర్థకములు బడుచున్నాడు. క్షేత్రధర్మములు తనవి కావని తెలిసి యభిమానమువదలితే సర్వత్రానుండునది తానే అను జ్ఞానముగల్గి భయసందేహరహితుడై నిష్కలంకముగ నుండును. ఒకటి చేతన మొకటి యచేతనము. అచేతన సమూహములు రైలుపెట్టెలవంటివి. చేతనము యింజనువంటిది. ఇంజను లేదా పెట్టె లెక్కడి వక్కడనే యుండును. చేతనుడగు నాత్మ లేదా జడములగు శరీరములు మట్టిబొమ్మలవలె నుండినచోట నుండిపోవును. చైతన్యుడనగు నేను శరీరముగానని తెలిసికొనుటయే ఫలము.

ప్ర॥ ఈ క్షేత్రవికారము లేవి ?

ఉ॥ ఇచ్ఛా లేక కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, సంఘాతము, ధృతి, చేతన నీ యేడు క్షేత్రవికారములు. ఈ వికారములను, క్షేత్రమును విచారించ నపుడు క్షేత్రజ్ఞుడు వికారగుణము లేడు తనవియే యనుకొనడి వాడు. ఈ విచారమువలన క్షేత్రము దాని వికారములు నావి కావనియు నకలంకుడనగు నాత్మను వికారరహితుడనని నిర్విచారముగనుండును. ఏయే యనర్థకములుండవు. ఈ యేడు గుణములు సత్వరజతమములగలసి నెన్నియో గావచ్చు. ఒకేతూరి యుద్రేకించి నెప్పటికో కేలాగునుండునా? ఉండవు. వీనికి నియతములేదు, కాన ననియతములనెదరు. ఒకటి తొలగ

నొకటావిర్భవించుచుండును. క్షేత్రజ్ఞుడెప్పటికుండును గాన నియామకుడు. అనియమముల రాకపోకల, మంచిచెడ్డల గుర్తించుచుండును. క్షేత్రజ్ఞుడు కూడ రాకపోకలు గలవాడైతే పోయిన తరువాత స్థితి తెలిసికొని చెప్పే దెవరు? వెనుక ముందర విషయముల జ్ఞాపకముగ జెప్పవలెనంటే క్షేత్రజ్ఞుడు సదా స్థితుడు.

ప్ర॥ శరీరమనిన నింత విచారము జేసితే తెలిసియున్నది. విచారము లేదా తెలియదు. అయితే నీ శరీర మెవరికొఱకు?

ఉ॥ పడవ నెవనికొఱకు, జీవించుటకు, నావికునికొఱకు. అటులే శరీరము జీవునికొఱకు. దీని నభిమానించి దీనివల్ల గలుగు ననర్థకములు పడమని కాదు. తన పని చూచుకొనిపోవుటకు నివాసయోగ్యము. గ్రామాలు, పట్టణాలలో, ఛత్రములు, రైలుస్టేషనులలో ప్రయాణీకులు నిలుచు రూములుండును. ఎంతవఱకు? తమ తమ పనులు చూచుకొనువఱకు. అంతే దేహాభిమానము. జీవుని పని యేమి? పెండ్లి జేసికొని భార్య, పిల్లలు, మిద్దెలు, మేడలు, క్రొత్త క్రొత్త ప్లానులతో కట్టడాలు కట్టుటగాదు. కట్టి నవి యున్నవి. కట్టినవారెవరులేరు. ఎవరుకట్టి యేమి ప్రయోజనము. పాఠ శాలలోజేరిన విద్యార్థి ప్యాసు కావలె. దేహి నేనెవ్వడనను విచారము జేసి సద్గురు సచ్ఛాస్త్రములవలన నేను వ్యాపకబ్రహ్మనని తెలుసుకొనేవఱకే జననమరణములు దేహధర్మములు, రాగద్వేషములు మనో ధర్మములు, కర్తృత్వాద్యభిమానాలు అహంకారధర్మములు, అంతు నంతఃకరణ వికారములే నాత్మవి కావని తెలిసికొనుటయే ఫలము. రంగుల రాటమునకు నున్న బొమ్మలు నొకటి పురుషుడు, నొకటి స్త్రీ, యొకటి పులి, యొకటి యావుయుండ బాలురొక్కొక్కదానినెక్కి నేను పులిని, నేను స్త్రీని, నేను చిరుతపులిని, నేను యావునందురు. వారెక్కిన వాహనముల నభిమానముతో ననగలిగిరి. కాని వారు పురుషబాలురే. ఆ రీతి స్త్రీ పురుష, మృగశరీరముల నభిమానించి పరమాత్మ నేను ఫలానిది, నేను ఫలానివాడనని వ్యావహారికముగ ననుచుండు నలువదిరెండు తత్వముల వికాసజాగ్రదవస్థలోగాని, సుషుప్తియవస్థలో తానేగదా యుండునది. అప్పుడు నామరూపప్రపంచ మేదిలేదు.

ప్ర॥ విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞులంటిరే వీరు యెవరు?

ఉ: అదిగో! అది యొక ధనికుని గృహము. అతనికి గ్రామ మునసబు పని, యొక సమాజమునకు పెద్ద, కొన్నిటికి మేనేజరు. ఈ మూడు పనులు నతడే మూడుపేరుల జేయును. గ్రామపనిలో మునసబందురు, సమాజములో పెద్ద. ఆయా యుద్యోగముల నభిమానించుటచేత నా పేర్లు వచ్చినవి. ఏదో యుద్యోగమువదలి రెంటవదానికి వచ్చినప్పుడు మొదటిపేరు నా యుద్యోగమక్కడికే మణిగియును. తక్కిన యుద్యోగములు నాపేరు లంతేను. గృహమునకు వచ్చినాడా మొదటి పేరే, మొదటివాడే, నెప్పుడుండువాడే. వారు ముగ్గురు నా యుద్యోగములు లేవు. ఆ రీతి స్థూల శరీరము నభిమానించి జాగ్రదవస్థలో విశ్వుడై నీ యవస్థ మారుచుటకు నుండి స్వప్నమునకు వచ్చేటప్పటికి సూక్ష్మశరీరాభిమానియై తైజసుడన జాగ్రద్వ్యవహారము లా శరీరాభిమాన మా పేరు తొలగును. స్వప్నావస్థ మారి సుషుప్తికారణశరీరము నభిమానించు ప్రాజ్ఞుడగునప్పటికి స్వప్నావస్థ సూక్ష్మశరీరాభిమాన తైజసోద్యోగములేదు. మూడవస్థల మూడు శరీరముల నభిమానులు. తానుగనుండే తుర్యమునలేరు. తానొక్కడే స్వయం జ్యోతి. తెలిసినదా.

ప్ర: భగవంతుడు క్షేత్రక్షేత్రజ్ఞుల జెప్పి లోకమునకు నూత్నవికాసము గలిగించెను. ఇకేమి జెప్పును?

ఉ: క్షేత్రమును వివరించెను. క్షేత్రజ్ఞుని జెప్పవలసియుండి యధికారి నిర్ణయము చేసెను.

ప్ర: క్షేత్రజ్ఞుని యింతవరకు తెలిపెనుగదా. అధికారియంటే మానవులంతా నధికారులేకారా? అటువంటప్పుడు విభిన్న దృక్కులేల?

ఉ: విభిన్నదృక్కులేమికాదు. ఎవరైన నధికారులే గీతకు. చదువుటకు, వినుటకు, చెప్పుటకు నధికారులే. ఇప్పుడు విమర్శించిన వ్యష్టి, సమష్టి, విచారమునకూడ నధికారులు కావచ్చు. వీనిని తెలుసుకొనుటకు సాధనములుగూడనున్నవి. క్షేత్రజ్ఞుని నింతవరకు తెలిపినది వాస్తవమే. క్షేత్రాధారమున తెలియదగిన క్షేత్రజ్ఞ బ్రహ్మ సూక్ష్మాతిసూక్ష్మవస్తువు. నేను బ్రహ్మమును లేక క్షేత్రజ్ఞుని తెలిసికొంటినిలే యని సంతసించవచ్చు. కాని తపస్సులు దేనికొఱకై యొనర్పబడుచున్నవో, నిష్కామకర్మ మెద్దాని

కొఱకై చేయబడుచున్నదో, నిష్కామోపాసన, క్రమముక్త్యుపాసన లెద్దానికై యొనర్పబడుచున్నవో, యనేక మహాత్ముల సందర్శించి, సేవించి, వారి కృపకు పాత్రులై వారి వచనామృతమును బహిర్గతమై శ్రోత్రగహ్వరముల నంతర్గత చీకటి తొలగజేయునదేదియో, మునులు నిరంతరము మథింప ప్రకాశించునదెద్దియో, సకలశాస్త్రము లెద్దానివలనవచ్చి నాగిపోవునో, నెయ్యది గలిగిన ననంతజన్మ దుఃఖకారణమగు నజ్ఞానము తొలగునో, నెయ్యది తెలిసిన నిక తెలియదగినదిలేదో, దేనితో సమస్తము సమాప్తమగునో, నేది లేకపోయిన జీవునకు నశుభమో, యోగము లెట్టిదానికై నొనర్పబడుచున్నవో, సకల పుణ్యముల ఫలఃమంత నొక్క జన్మమున నొక్కపరి కలిసిరా నంతిమజన్మమగునో, తత్త్వమస్యాది మహావాక్యము నెద్దానికి నంతరంగమగు ముఖ్యసాధనమగునో, సకలసాధనఫలమో, శ్రద్ధావంతుల లక్ష్యమెయ్యదియో, యభిన్న, మభేద, మఖండ, మచంచల, మనంత, మమృత, మానందమో నట్టి పురుషార్థమునకు సాక్షాత్ప్రమాణమెయ్యది సురగంధర్వాదులందరానిది, పశుపక్ష్యాదులకు తెలియరానిది, కొండెవాడు, ఆతతాయి, స్వార్థుడు, కృతఘ్నుడు, మూఢుడు, బుభుక్షువునగు శిష్యుడు విద్యావివేకము, నిస్స్వార్థత, నిర్వ్యాజప్రేమ, సాధనారతుడు, శాస్త్రజ్ఞానము, ననుభవజ్ఞానములేని గురువు తెలియజాలనిది యేది? అదియే జ్ఞానము. బ్రహ్మాండమే క్షేత్రము. బ్రహ్మాండమున కధిష్ఠానమే క్షేత్రజ్ఞుడు. క్షేత్రజ్ఞుని తెలిసికొను నధికారి యవసరము. అర్జునునివంటివాడు కావలె. ఇప్పుడు జెప్పబోయే జ్ఞానలక్షణములు గలవాడే అధికారి. మేము జ్ఞానులమనువారు నీ జ్ఞానలక్షణములు తమలో యున్నవియా? లేవా? యని విచారించుకొని యవి తమలోలేకపోయిన కలిగించుకోవలెను. జ్ఞానలక్షణములలో నేకొన్ని గలిగిన తక్కినవి తమంతట తామే సిద్ధించును. మహాత్మాగాంధీజీ నీ లక్షణములు తనలో నున్నవియా? లేవా? యని నిరంతరము సింహావలోకన జేసుకొనెడివాడు. కర్పూరము వెలిగించితే నది వాసనతో భగవదైక్యము దెలుపును. బత్తీలను వెలిగించిన నొంతో దూరము వాసన గలిగించును. జ్ఞానము గలిగెనా, వాని గుర్తులు నొక్కొక్కటే తదితరులకు, జ్ఞానము గలిగినవానికి తెలియును.

ప్ర॥ సులభసాధ్య మొకటియు లేదే. చెప్పండి వాని చిహ్నములు విందాము?

ఉ॥ "కథం జ్ఞానమవాప్నోతి, కథం ముక్తిర్భవిష్యతి" జ్ఞాన మేవిధ ముగ సిద్ధించును? ముక్తి యే విధముగ లభించును? "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" శ్రద్ధావంతుడు జ్ఞానము బొందును. అమానిత్వమనే శ్లోకము వద్దనుండి ఐదు శ్లోకములు నిరువదిలక్షణముల దెల్పెను. లోకము తన్ను నవమానించిన గౌరవించిన నొకటిగ తలచునో జాతి, మత, విద్యా, స్థాన, జన, దేహ, బలాదులచే తన్ను తాను బొగడుకొనడో, గర్వింపడో, దేహాభిమాన, దేశాభిమానాదులు లేకుండుట యమానిత్వము, లోభి తను దాచిన ధనమును నితరులు ప్రాణముదీసిన నెట్లు జెప్పడో, మానవతి తన్ను బలాత్కరించ ప్రాణమైన వదలునుగాని తన మానము నెట్లు కాపాడుకొనునో, నారీతి తన దానధర్మపుణ్యకార్యముల నితరులతో జెప్పడో, నితరులు బొగడిన నొప్పడో, తనవిద్యను, జ్ఞానమును లౌకిక కీర్తికొఱకై నొసగజల్లడో "న్యాయార్జితేన ద్రవ్యేన కర్తవ్యం పారలౌకికమ్" తన జీవితావసరమునకు న్యాయముగ నార్జించి దానిలోనే పరోపకార మొనరించు నదంభిత్వము. ప్రతివారు తమతమ మతముల సమాజముల వర్ణము వ్యక్తిగతముగ ననేకరీతుల నహింసను వర్ణింతురు. పూర్వ మీమాంసలో నేమిజెప్పెదురా ఫలవంతములగు వృక్షములగొట్టి మిద్దె మేడలు వేయుట, నొక జంతువునుజంపి తమ యాకలితీర తినుట, నివాస ములబడగొట్టి దేవాలయమునిర్మించుట, సంతానముగల్గలేదేదో హింస యొనరించి సంతానము బడయుటయు, వర్షము రాకున్న, రోగము బోకున్న, రాజ్యమరాచకముగనున్న నొకటిహింసించి మరొకదానికి నుపకార మొన ర్చుట నిది యహింసకాదు. మచ్చురాతిపై మాత్రమే బంగారు వన్నె తెలియును. జ్ఞానము మనస్సుతో కలిసినపుడే యహింస కొదవును. ఇతర ప్రాణులకు తన ప్రాణము లర్పించుచో నది యహింస. తన పదునాల్గు నింద్రియముల బాహ్యాంతరముల నే ప్రాణికి హానిగల్గింపకుండుట, యితర ప్రాణులవలన తన కేసమయమున కీడు మూడరాదనుభావన నితరులయెడ నుండుటయే యహింస. గాంధీజీ, భగవాన్ బుద్ధ, జిన, జీసస్, సోక్రటీసు లీ ధర్మతత్పరులు. శృంగి శపించ, తిరిగి శపింపశక్తిగలిగి పరీక్షిత్తుశపింపక

తనదోషమే ననుకొనెను. రావణుడు భార్యను గొనిపోయిన, కైక యడవి కంపిన, చాకలివాడనిన క్షమించెను రాముడు. ఎట్టి విపత్కరములనైన పర్వతమురీతి చలింపని ధృతిగలుగుట క్షమ. అంతరంగబహిరంగముల నొకేబుద్ధి. త్రికరణముల నొకేలక్ష్యము. సూర్యుడుగాని, పంచభూతములుగాని, నదీవృక్షసముదాయముగాని, యందరయెడ నొకేరీతినున్నవి. తల్లియందఱిబిడ్డల కొకే తీరున్నది. సమస్త జీవులయెడ లోపల నొకటి వెలుపల నొకటి నుండకుండుట నార్జవము. ఏ విద్యకైన గురువవసరము. గాంధీజీ నాకు నిరువదిమంది గురువులనెను. జనకునకు నూటొక్క మంది గురువులు. రామ, పరీక్షిత్తు, సమర్థ, రామకృష్ణ, వివేకానందులవంటి వారందఱు గురుపుత్రులే. కొందఱకు గురువులే. లౌకికవిద్యలకు గురువవసరమైన బ్రహ్మవిద్య కవసరముండదా? పంచభ్రాంతుల నివర్తింపజేసి జీవుని లక్ష్యమైన యాత్మబ్రహ్మమే నను నిశ్చయముతో శిష్యుని యంతఃకరణములోని దోషముల నిర్మూలించి జీవుని కడతేర్చువాడు గురువు. తన గతియేమైనాసరే గురువును పరీక్షించుట, నభిమానమునకు శ్రవణము జేయువాడు, గురుఋణము తీర్పలేనివాడు నాచార్యోపాసకుడు కాడు. చతుర్విధశుశ్రూషలు సాధనచతుష్టయసంపన్నత్వముగలిగి, చకోరములు చంద్రునికొఱకు, పతివ్రత మగనికొఱకు వేచుకున్నపగిది గురుసేవారతులు తనువు, ధనము, మనస్సునర్పించి గురునాజ్ఞారతులై యుండవలెను. ఛత్రపతి శివాజీ, మిథిలాధినాథుడు, నర్జునుడు, నుపమన్యు, వేకలవ్యుడు, కృష్ణుడు, కుచేలుడు, శబరి యిత్యాదులనేకులు స్త్రీపురుషులు గుర్వనుగ్రహమునకు పాత్రులైనవారలు గలరు. మాతాపిత, దైవభక్తులగునవారే సులభముగ గురుభక్తులయ్యెదరు. "యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ" గురువనుజ్యోతికి తైలమురీతి బ్రాకి పోగలుగుట నాచార్యసేవ. శరీరశుచి, వస్త్రశుచి, వాక్శుచి, స్థానపాత్రశుచి, నంతరంగశుచి రెండొకరీతి నుండవలె. స్నానపానాదులు బాహ్యశుచి కవసరము. కామక్రోధాదులు లేకుండుట నంతశ్శుచి, యపుడే శౌచార్థము జీర్ణింపజేసుకొవటము. అంతశ్శుచి ముఖ్యము. స్త్రీ మగని కౌగలించుకొనును. తనయుని కౌగలించుకొనును. కాని మనసున కామవికారత తనయుని కౌగలింపగలుగదు. మిగుల నురవడిలో నదులువచ్చి కలియునుగాని సము

ద్రము కలిగినొందెను. "జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా" స్థానముచే సమలోష్టత్వము గలవాడగు. "విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః। నిర్మమో నిరహంకారః" సర్వకోరికల నడంచి యహంకారమమకారము లేక నిశ్చలతనుండుట స్థైర్యము. ఒక బౌద్ధసన్న్యాసి భిక్షకు దిరుగుచు నొక వేశ్యయింటికి వచ్చెను. భిక్షుకుని వేశ్య నాయకునిజూచి మోహించి 'నా కెవరులేరు, చిఱుత ప్రాయము నాది, నన్నేలుకో, నాయింటనుండుము, నీకేల భిక్షాటనము. నేనే నీవు భుజించుని బ్రతిమాల భిక్షువు కొంతవఱకు మానసమున [illegible] గడువు బెట్టిపోయెను. మూఁడవమాసమున వచ్చి భిక్షుకుని నతనికై నెదురుచూచు నామెగని 'నేల వాయిదా నుంచెదవు రమ్ము లోనికి' యని బలవంతము జేసెను. గడువు దాటిరానని చెప్పి వెళ్ళిపోయెను. అయిదవ మాసమున నొకధనవంతుడామెయింట చంపబడి కేసుబెట్టి జడ్జివిచారించి నామె రెండుకన్నుల రెండు ముంజేతుల దీయించెను. మొండిచేతులతో కన్నులగ్రుడ్డితో నుండ నారవ మాసమున భిక్షువచ్చి భిక్షుకుడుగ లోనికి రమ్మని బతిమాలు నామె నాడు పెదవివిఱచి చేతులు ద్రిప్పుచు లొట్టకన్నులతో తనదేహమే తనకు సేవగింపుగానుండ నిట్లనెను: 'బాగున్న దినముల నెంతవేడిన రావైతివి, నీ వికలాంగితో నేమనుభవింతు'వన యామెయున నగుచు 'నమ్మాయీ! ఆరు నెలల కేగతి యగుననది తెలియక ముచ్చటపడి తొందరించిన నీవు, నీ శరీరమే నీకిప్పుడు పనికిరాక హేయమైనది. నాకు తగలగట్టి నన్నే గంగలో త్రోయుచుంటివి. రక్తమాంసమయమగు దేహము. క్షణభంగురము. మేలు జేసితి'వని దీవించివెళ్ళెను. అంగాల యువతి తానై వలసివచ్చినది. భోగ భాగ్యముల ననుభవింపవచ్చునని కామవికారమున చలితనొందెనా భిక్షు? లేదు. వీనిని తృణీకరించే వజ్రకఠినమగు నాత్మజ్ఞానసాధన ఫలమది స్థైర్యము.

గడియారములోని ముల్లులవలె, కాలిలో విఱిగిన ముల్లురీతి, కంటిలోని నలుసువలె, చెవులోని బాధభంగి, ఋణతీవ్రతరీతి నింద్రియములు విషయముల సంచరించుచునే యుండును. ఎంతవఱకు నింద్రియములు నిగ్రహింపబడవో జీవున కంతవఱకు శాంతములేదు. హఠయోగాది యభ్యాసముల నింద్రియముల తాత్కాలికముగ నిగ్రహించిన వాసనలుండుటవలన

సమయమొచ్చినంతనె పెను పడగలెత్తును. విషయప్రయోజనముల విచారించి యుండు పూర్ణసుఖము లేదని తెలిసిన వైరాగ్యము వాని కేర్పడ్డ, మన వశవర్తియగును. తెలియక మాంసము వడ్డించిన, నా యలవాటులేని యింద్రియములే వల్లవు. వలువలవిడిచి స్నానముజేయు మగువలజూచి శుకుని యింద్రియము లేమియు లేదు. ఇంద్రియములకు విషయవైరాగ్యమే మందు. శాఖోపశాఖలకు బీజాంకురమువలె, కామక్రోధాది శాఖలకు, స్థూలసూక్ష్మశరీరాదుల నావిర్భావతిరోభావములకు నంకురమువంటిది యహంకారము. విషముష్టికి తీపుండదు. పాముకోరలకు నమృతముండదు. దుష్టాత్మునకు మంచితలంపుండదు. రాతికి మెత్తదనమురాదు. అహంకార ముండిన సుఖముండదు. కాన నహంకారము మోక్షమునకు బద్ధవిరోధి. రావణకుంభకర్ణాదు లహంకారపడగల పాములవలెనెత్తి నుభయభ్రష్టులైరి. జీవేశ్వరుల మధ్యగల వజ్రపుగోడ దీనిని భేదింప జీవపరమాత్మల భేదముండదు. నూతిలో నొక కొయ్య నడ్డమువేయ నూతిని రెండు భాగములుచేయును. అహంకారమనే కొయ్య ద్వైతముగల్పించి యున్నిటిని నెదుర్కొనుచు తాపులదినుచుండును. కానీ అది యూరకోదు. నా యహంకారము లేకుండుటయే ననహంకారము. పుట్టుక, మృత్యువు, వ్యాధి, వృద్ధాప్యము దుఃఖభూయిష్టములు. వీనిలో దుఃఖములేని దొకటి లేదు. ప్రభువుమొదలు పాకీవానివరకు నేయాచార, మేసమాజ, మేవర్ణస్థులైనను వీనిని దప్పించుకోలేరు. ఇవి నెవరిని వదలవు. వీనిని తప్ప మిగిలిన వానికి నే విధమైన సిఫారసులు, లంచగొండితనములు పనిమీాదబడవు. వీని నెవరు దప్పించుకొందురో వారు నిత్యము వీనిని గమనించి తమ లక్ష్యమును మఱువకముందే సిద్ధముగనుందురు. చావనివారే లేరు. ఎందు దాగిన చంపును. దుర్యోధను డెందెందు దాగుకోబోయి యేమాయెను ? విషయసుఖములవలన దుఃఖదోషాలు తొలగుననుట వెఱ్ఱితనము. దుఃఖమును గలిగించేవానిని తెలిసికొని వెలువుగలిగిన మార్గమున తప్పించుకోవలెను. అప్పుడే శాశ్వతసుఖము, ఆసక్తిబంధము, ననాసక్తిమోక్షము. "మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ" భార్యాభర్తలిరువురు బీదలు. కొండకేగి కట్టెలు కొట్టితెచ్చి యమ్ముకొని వచ్చినదానితో నతిథి యభ్యాగతుల విచారించుచు నుదయసాయంతనముల భగవచ్చింతనజేసెడివారు.

ఒకదినము మామూలుగా కొండకేగి నారపాదను ఛేదించుచుండ ప్రాణఘాతకి అని వీరు పేరుబెట్టిన బంగారునాణెములు గనపడెను. వానిజూచి ప్రాణఘాతకి యని పరుగిడుచుండ సిద్ధాన్నదమ్ములు కారణమడిగి, వీరు వెఱ్ఱివారని తాముజూచి దానికొనితెచ్చుచు, నన్న దానే యుపహరింప దలచి తమ్ముడా! ఇంటికేగి యన్నము దెమ్మనెను. తమ్ముడు పోవుచు తానే నంత యుపహరింపదలచి అన్నములో విషముగల్పి తెచ్చెను. అన్నము వడ్డించు తమ్ముని యన్న తలనఱికి తానా యన్నముదిని యంతయు నపహరించవచ్చునని తిన నాతడు జచ్చెను. ఆసక్తిలేని భార్యాభర్తలేమైరి? ఆసక్తులైన యన్నదమ్ము లేమైరి? "ఆశాహి పరమం దుఃఖం దురాశా దుఃఖమేవ తత్" ఆశ దుఃఖకారి. భార్యాపుత్రాదులందలి యాసక్తి, ధనాదులయందలి యాసక్తి, గౌరవ ప్రతిష్ఠలపైన యాసక్తి పరులై చచ్చేచావు, పొయ్యేపోక తెలిసికోలేక పోయినవారెందఱు పోవుచున్నారు. పోయెదరు, వచ్చునపుడేమి కొనివచ్చుటలేదు. పోవునపుడేమి కొనిపోవుటలేదు. మధ్యలో నాదియనే యాసక్తి తన స్వాతంత్ర్యమునకే భంగముగలిగించి యస్వాతంత్ర్యుని జేయగలదు. నూనె రాచుకొన్నచేయికి సబ్బేసి కడగనిదిపోదు. జిడ్డుతగలనిచేతి కేమున్నది చిక్కు. ఆసక్తియే లేదా బంధమేలేదు. అదియే సద్యోమోక్షము. గ్రీష్మఋతువురాని, వర్షఋతువురాని సముద్ర మొకేతీరునుండును. ఎక్కడెక్కడి బండ్లైనవచ్చిపోని స్టేషనుమాత్రము గదలదు. ఋతువు లెన్ని పర్యాయములుమారిన శిలావిగ్రహమున కేమిలేదు. ఈ రీతి ఎవడు సుఖదుఃఖములయందు భిన్నత్వమునొందక నాకసమువలె సమభావముండునో, వతనిజ్ఞానము పూర్ణమైనది. అతడెల్లప్పుడు స్థిరుడు. "ధీరాస్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్" ఇతరులకు లేదు, ధీరత్వము, శాంతము, సమబుద్ధి గలవానికే శాంతమని భగవంతు డర్జునునితో జెప్పెను. ఆకలికొఱకు దాసరి కాకూడదు. సేవకొఱకు దాసుడుకావలె. తలచినవి ఫలిస్తే దేవుడు, లేకుంటే లేడనుట భక్తికాదు. ప్రకృతిశక్తులు ప్రతిక్షణము ప్రతిఘటించే నవాంతరాంతరాయములలో సైతము మనోవాక్కాయముల భగవంతుని విడువకుండుట ప్రవహించిగాని ప్రవాహమునకు నడ్డులుకట్టి నిరోధించితే నింకిగాని, లేక గాలిద్వారా నావిరియైగాని సముద్రమునిజేరి

సుఖమొంద సేవించు నదులరీతి, నీటినిబాయని జలచరములరీతి, సూర్యుని వదలని కిరణముల పగిది భక్తుడుండవలెను. భాగవతమున 'పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట' యని తనకర్తృత్వములేని నిరహంకారముతో రామచంద్రునికే సర్వము వదలెను పోతన. అనన్యమైన భక్తి భగవంతుడు వేరు, తాను వేరనను భిన్నము క్షణమున లేనిదే పూర్ణభక్తి. తనంతటనుండుట, నెవ్వరులేని స్థలమునయుండుట నొక్కనికి భయమనేవాడు భగవచ్యుతుడు. మహాత్ముని శిష్యుడు తాను పోవుచుండ శత్రువులువెన్నంట మన మిరువురమేనే అను శిష్యునితో పలికి నావు మనము ముగ్గురమనెను. మూడవవాడెవడి యనగ నేనసమయమున కేది సేయవలెనో జేయగల యల్లాయనెను. తనున్నచోట భగవంతుడున్నాడు. భగవంతునిలో మనమున్నాము. సాధకులకు నేకాంతవాస మవసరమే. అంతరంగములో ననేక వాసనలు లేకుండుట నిదియే నేకాంతము. ఇవిరెండు నుత్తరోత్తర ముఖ్యములే. తానొప్పు డేకాంతుడే. ఘోటోతీయువాని కెమరావంటిది మనచిత్తము. చూచినవాని నాకలింపు జేసుకొనును, తనయందు నారూపము నత్తుకొనును. ఇంద్రియము లట్టివే నందుకై యేకాంతస్థల ముత్తమము. జనసంగమున ప్రీతిలేకుండుట, భేదవాదజనులలో నుండకుండుట, మూఢులు, పాపరులు, విషయాసక్తులు, కుతర్కులు మొదలగు వారిపొత్తున నుండకూడదు. రాగి బంగారున కలిసి బంగారైనది. బంగారు మఱేవస్తువుతో గలిసిన దాని రూపమే అగును. సహవాసదోషము తన స్వధర్మమునకు ప్రతిబంధకము గల్గించే స్థలముల నుండరాదెన్నడు.

ప్ర॥ లోకమంతా పంచభూతమయమే; జనులందఱొకటే; నెటువంటి వారితో సంబంధ ముండవలె?

ఉ॥ తనకు తెలియని ధర్మముల తెలిపి దిద్దగలవారు "సాధూనాం దర్శనం పుణ్యాం స్పర్శనం పాపనాశనం। సంభాషణం కోటితీర్థం వందనంమోక్షసాధమ్" యనే సత్పురుషుల సంబంధము, పాపనాశము, పుణ్యఫలము, తీర్థఫలము మోక్షసాధన లభించును. పురుషార్థమెఱిగిన సత్పురుషులసేవ, భగవత్సేవ రెండు నొకటే. సతతము నాత్మానాత్మవిచారజ్ఞానతత్పరుడై యుండవలె. అనాత్మయగు దేహేంద్రియ ప్రపంచవిషయముల కాదా

త్స్మృతి స్వరూపచ్యుతి గలుగును. "ఆసుప్తేరామృతేం కాలం నయే ద్వేదాంతచింతయా" అనెను వేదాంతడిండిమము. "ఆవృత్తిరసకృదుప దేశాత్" అపరోక్షజ్ఞానము గలిగెడివఱకు మాటిమాటికి చింతించుచుండ వలెను. అన్నివిషయముల నలవాటైన మనస్సు నిర్వికారమగు నాత్మ యందు నిలువదే యనవచ్చు. నిజమే. "అభ్యాసేన తు కౌంతేయ" అభ్యాసముతో నేకస్థితి నొందగలదు. ఆసక్తి దేనిపైననో నుంచి నానా కార్యము లొనర్చుట నందఱకు నలవాటే. ఆత్మాసక్తి గల్గినపుడు పనులు చేయుచుండినను మనస్సు నొకే యాత్మస్థితియందే యుండునట్టి స్థితియే నధ్యాత్మజ్ఞాననిత్యత్వం. ఇప్పుడు చెప్పినది సాధనలలో కడపటిది. తత్వ జ్ఞానమునకు ప్రయోజనమేమిటి? మోక్షము. ఆ మోక్షమనే కేంద్ర స్థానమునందే లక్ష్యముంచవలె.

ప్ర॥ ఈ సాధనములన్ని రొక్కడే సాధించవలెనా?

ఉ॥ అవును. ఇందులో నొక రహస్యమున్నది. ఒక సంవత్సరము పాఠశాలలో విద్యార్థి ప్యాసైనాడా, ప్రతిసంవత్సరము కాగలడు. ఉత్తీర్ణుని కావలెననే పట్టుదలయుండును. పరీక్షలు సహజములై, స్వాభా వికములై పోవును. జ్ఞానసాధనములు మోక్షము సాధింప పట్టుదలయుండిన నొకటి, రెండు, మూడు గుణములు ప్రాక్టీసయ్యేవఱకే నన్నిగుణములు తమంత తామే నతని పొందును.

ప్ర॥ అమానిత్వ దంభత్వము లేసాధనలు?

ఉ॥ అజ్ఞాన లక్షణములు. ఈ లక్షణములు గలవారికి మోక్షము లేదు. భగవంతుడు రెండేరెండు జ్ఞానసాధనలు జూపి, వీనిని సాధించలేని వా రజ్ఞానులనెను.

ప్ర॥ ఇప్పుడుజెప్పబొయ్యేదేకదా జ్ఞేయము? దీనినేకదా తాముసూక్ష్మ గ్రాహియైనగాని తెలియ లేడంటిరి? దీని గ్రహించువానికుండు లక్షణములే కదా అమానిత్వాదులు? ఆ యర్జును డేపాటివాడో, భగవంతుని ముఖా ముఖి నీ సూక్ష్మమును గ్రహించినాడంటే నొరేమొ మింగెదనమును, గొంతు మింగనివ్వనంటున్న దన్నగతి యర్జునునివలె గ్రహిస్తామనే యాశ

యుంది. ఈ గుణముల సాధిస్తానో లేదో యను దిగులున్నది. నాభాగ్యమెట్లున్నదో! అవల జెప్పుడి!

ఉ: "జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వాఽమృతమశ్నుతే" యను పండ్రెండవ శ్లోకమునుండి పదిహేనవ శ్లోకమువఱకు జ్ఞేయమగు బ్రహ్మమునుగుఱించి చెప్పెను. జ్ఞానమున తప్ప మఱేయుపాయమున లభ్యమగునది కాదు. జ్ఞానములభించిన మరే యితరము తెలియదగినదుండదో, నేజ్ఞానమునొంది నీయపారసంసారమునుండి జ్ఞానులు తరించిరో, తదితరులు తరింపగలరో నదియే జ్ఞేయము, తెలియదగిన బ్రహ్మము. దాని తెలిసిన ఫలము మోక్షము. "ఆదావంతే చ యాన్నాస్తి వర్తమానేఽపి తత్తథా" ఆదిమధ్యాంతములులేక భూతవర్తమానభవిష్యత్తుల నుండగలది కాన యనాది. ఆదియుండిన యంత్యముండును. పరబ్రహ్మము అజ్ఞానమునకై పరమై, లేదా శ్రేష్ఠమై, లేదా పరాపరములలో నపరమగు వేదాదులు, చతుర్ముఖుడు, ప్రణవము, మాయ కానిది. ఇంద్రియములవలన తెలియరానిది, విషయము గానిది, సత్తుగానిది, యసత్తుగానిది.

ప్ర: తాము చెప్పుచుంటేనే నిరాశా, భయముగానున్నదే. ఈ జ్ఞేయమును తలలెక్కుడున్నవారైతే గ్రహింతురేమో, నొంటితలకాయవానికి దుస్సాధ్యమని తోచుచున్నది. మహమ్మదీయ, క్రైస్తవ, వైష్ణవ, శైవమతము లిత్యాదులెన్నియో విన్నానుగాని, సత్తుగాని దసత్తుగాని దంటే తల పగులగొట్టికొనిన నీసత్తసత్తులేమిటో నా బ్రహ్మమేమిటో యనిపించుచున్నది.

ఉ: అందుకే జ్ఞానలక్షణములు జెప్పినది. జ్ఞానసాధ్యపరులుతప్ప తలలెన్నియున్ననేల? పదితలల రావణుడు రామునిమహిమ గనలేక హతుడైనాడు. ఒక్కతల సూక్ష్మబుద్ధిగల విభీషణుడు "రామ ఏవ పరబ్రహ్మ" రాముని పరబ్రహ్మగా గుర్తించి చిరంజీవియైనాడు. అర్జునుని కెన్ని తలలుండెను? నొక్కటియేకదా! గ్రహించుటకు తలలుకాదు, బుద్ధి కారణము.

ప్ర: నాకు బుద్ధియున్నది. ఏమి ఫలము. గ్రహింపగలుగుదునా? లేదా? యని వ్యథ.

ఉ॥ తలలంటే బుద్ధిలోని తలపులేనని యర్థము. ఒంటితలయన తలపులేని బుద్ధియైతే చాలు గ్రహించును. జ్ఞేయమన క్షేత్రజ్ఞుడే.

ప్ర॥ పరబ్రహ్మము సత్తసత్తు కానిదన, తెలియుట యేలా?

ఉ॥ "దర్శయతి చాథ అపి స్మర్యతే" విధిముఖ నిషేధముఖ సత్తసచ్ఛబ్దములు సాపేక్షములు, బ్రహ్మము నిరపేక్షము. సత్తసత్ప్రత్యయములకుగూడ నగోచరము. సదసత్తులు యింద్రియగోచరములు. అయిన చిన్నయుపాయము తెలిపెద విను. అసత్తనగా నునికియే లేనిది. "నాసతో విద్యతే భావో" త్రికాలముల, త్రిదవస్థల, దేశముల లేనిది, యున్నటుల దోచనిదికూడ, నెవ్వరు జూడనిది. గొడ్రాలిబిడ్డ, కుందేటికొమ్ము, నాకాశపుష్పము, దున్నపెన్న, పురుషప్రసవము లిత్యాదులు. సత్తంటే నున్నట్లుదోచు రజ్జుసర్పము, స్థాణుపురుషుడు, ముత్తెపు చిప్పయందలి వెండివలె లేనిదియున్నట్లు గోచరించుట. పాము బొత్తిగా గొడ్రాలి బిడ్డవలె లేదా? భ్రమ యెక్కడిది? నిజముగా పామైనత్రాడు కపిపించి పాములేకుండా బోవుటెందుకు? విచారించకపోతే పాము, విచారించితే త్రాడు. 'ఇదం'శబ్దముద్వారా సామాన్యజ్ఞానముండియు, రజ్జ్వధిష్ఠానవిశేషజ్ఞానము లేనపుడు గలిగిన భ్రాంతితో నసత్తు సత్తులకు నధిష్ఠానాధారములు రజ్జు లేక రజ్జుపహితచైతన్యముండియే పాము తోచుచున్నది. సత్తువలె కనపించు పామునకు గొడ్రాలిబిడ్డవలె లేని యసత్తునకు విలక్షణము రజ్జువు. జగత్తసత్యమా? కాదు. కనిపించుచున్నది. అయితే నిజముగా నున్నదా? అధిష్ఠానవిశేషజ్ఞానము గలిగినపుడు మిథ్య. లేనిది యున్నట్లు దోచేజగత్తు లేక క్షేత్రమునకు నధిష్ఠానము నాధారమేదో నదియే బ్రహ్మము. స్వరూప తటస్థలక్షణములతో తక్కిన శ్లోకార్థముల పూర్తిజేయుచు, కుండలన్ని మన్నే, నగలన్ని బంగారమే, నన్నిపశువుల పాలొక్కటే, శాఖోపశాఖలన్ని విత్తనమే, నలలు, బుడగలు, నదులు, మేఘములు, వర్షము సముద్రమే లేదా జలమే. విశ్వరూపమున ముందే వర్ణించినదానినే నిట ననులోమవిలోమముల జెప్పుచున్నాడు. చీమ మొదలు బ్రహ్మవఱకు గల బ్రహ్మాండములోని యన్నితలలు, నన్ని కన్నులు, చేతులన్ని, యన్నికాళ్లు, చెవులు, కడుపులు, పిక్కలు, డొక్కలు, వీపుల్లు, భుజములు, నడుములు, తొడలు, వ్రేళ్ళు, రోమ

ములు, నస్థులాది సప్తధాతుమయములు, ప్రాణములు, నోళ్ళు, నాలుకలు, నొకటననేల? నన్నియు నా బ్రహ్మరూపములే. డైనమోతో సినిమాలోని బొమ్మ నచేతనములైనను చేతనమువలె క్రియల నభినయించు భంగి యచేతనములగు స్థూలసూక్ష్మకారణసహిత బ్రహ్మాండమునకు చలనశక్తి తానేయై నారోపదృష్టితో నన్నియు తానే, నపవాదము లేక స్వరూప దృష్టితో తానేదియుకాడు, అన్నియగును కాడు. ఆయన లేశా నివి యన్నియు లేవు. లేవనువాడు, వినువాడెవరు లేరు. జ్ఞేయబ్రహ్మము గలడా నన్నియు గలవు. ఇంటిలోని దీపము లోపల ప్రకాశింపుచు, దర్వాజ కిటికీలగుండా వెలుపల ప్రకాశించునట్లు, బ్రహ్మ ముభయత్ర నంతరంగబహిరంగముల ప్రకాశించుచున్నాడు.

ప్ర॥ అయితే నెందుకందఱకు స్పష్టముగా నగుపించడు?

ఉ॥ నీవిన్ని మాట్లాడెదవే; నీ ముఖము నీకు గనిపించుచున్నదా? కనిపించ నందున లేదనుకోవుగదా. ముఖముండియే చూచుట, వినుట యను పంచేంద్రియముల విషయము నెఱుగుచున్నాననేది నీకు నిత్యసిద్ధమే కదా. నీ ముఖము నెవరు లేదన్న నీవు రొప్పవు. అదే తీరు నీవే లేవనునది నీకు రొప్పితమగునా? కాదు. నీలేమి రొప్పుకోవు. అయితే నీ యింద్రియములకు కనిపించుచున్నావా? ఇంద్రియములకు విషయమైన జడమగును. దృశ్యమగు నసత్యమగును. నీచే నన్ని తెలియబడునపుడు నీవెట్లు లేక పోలేదో, నీవుంటేనే నీ యింద్రియప్రాణములు పని చేయుచున్నవి. నీవు లేవా ఇవి శవములేకదా. నీవే బ్రహ్మముకూడా. గ్రుడ్డికి వస్తువు కనిపింపదు. కన్నులు గలవానికి కనిపింపనిదే లేదు. గ్రుడ్డి పగిది విషయబుద్ధులకు బ్రహ్మ గోచరింపడు. నిర్విషయులకు నా కాదనే విచారణేలేక తానై యున్నాడు. ఆకసము సర్వత్రయున్నది. బ్రహ్మము సర్వత్రయున్నాడు. బ్రహ్మము లేక క్షేత్రజ్ఞుడు, క్షేత్రోపాధి ధర్మముల మిథ్యారోపము క్షేత్రజ్ఞుడనవలసివచ్చినది. సృష్టి స్థితి లయములకు కారణమైయున్నది బ్రహ్మమే. జ్యోతిర్మయుడు "అత్రాఽయం పురుషస్స్వయంజ్యోతిర్భవతి" సూర్యచంద్రాగ్ను లొకప్పుడు లేకపోయిన నుండి సూర్యచంద్రాగ్నుల ప్రకాశింపజేయుచున్నదే నాత్మ. సూర్యచంద్రాగ్నులు లేని యవస్థల ప్రకాశించునది యేది? అదియే చిదాత్మ. జాగ్రత్స్వప్నసుషుప్తుల సాక్షియై

నాయీ యవస్థలు నేజ్యోతివలన తెలియబడునో, నా జ్యోతిని సూర్య చంద్రాగ్నులు ప్రకాశింప జేయలేవు. చంద్రునికి, నగ్నికి సూర్యకాంతి యవసరము. సూర్యున కాత్మ ప్రకాశ మివ్వవలె. అఖండమగు నాత్మ స్థావరజంగమములందంతట, నంతఃకరణముగల, నంతఃకరణములేని జీవులలో నంతట నిండి "ఈశావాస్యమిదం సర్వం" తనకంటె నన్యములేక యున్నాడు.

ప్ర॥ సూర్యచంద్రాగ్నులుండబట్టి ప్రపంచవస్తువులు గనిపించుచున్నవి. ఆత్మజ్యోతితో కనిపించవెందుకు? ఆత్మయుంటె నీ జ్యోతులేల?

ఉ॥ సూర్యచంద్రాగ్నులు జాగ్రతయందు ప్రకాశింపజేయునేగాని, సృష్టి స్థితి లయముల నామరూపాది స్థితిగతుల తెలిసికొనలేవు. ఆ సూర్య చంద్రాగ్నుల తెలియువాడుసైత మాత్మయే. ఆత్మలేనిచో సూర్యాదుల నెవ్వడెఱుగు? సూర్యచంద్రాగ్నులులేని స్వప్నసుషుప్తుల నెవ్వడెఱుగు? నెవ్వనిచే బ్రకాశించు? నప్పుడు సూర్యాదులేరీ? లైట్ వెలుతురుతో సినిమాలోని కల్పితబొమ్మలు ప్రకాశించినను, వాని విధాయకము నాత్మ లేనిచో నేమైనది, యే యాటయైనది యెవరి కెఱుక?

ప్ర॥ అయితే భగవంతుడు మనలోనే యున్నాడా?

ఉ॥ మనలోనే కాదు, జగత్తున నిండి నిబిడీకృతమైయున్నాడు. ఆత్మ మన శరీరములో నున్నాడనటము యౌపచారికము. ఆత్మయందే శరీరము లన్నియున్నవి. అన్వయవ్యతిరేకముల జూచిన, వ్యతిరేకములగు దేహేంద్రియగుణసంఘాతములన్నీ యొక యవస్థలోనుండి, యొక యవస్థలో లేవు. అదిగో నొక ముత్తెపుచిప్ప, నొకడు వెండియనెను, నొకడభ్రకము, నొకడు కాగితమనెను. కాగితమన్నపుడు వెండి యభ్రకములు లేవు. అభ్రకమన్న వెండి కాగితములు లేవు. వెండియన్న కాగితాభ్రకములు లేవు. ఈమూడు ముత్తెపుచిప్పయం దారోపింపబడినవే. ముత్తెపుచిప్పలేదా వీనికి స్థానమేలేదు. ఈ మూడు ముత్తెపుచిప్పయే. ఆత్మయందు మూడు దేహము లారోపితములు, నొక యవస్థలో నొక దేహముండదు. ఆత్మయే లేదా దేహములు మూడింటికి రూపనామములేవు. దేహములు మూడు నాత్మయే. ఎంత వృక్షమైన విత్తనములోనిదే, విత్తనమందే చుట్టున్నది.

ఒకడు చతుర్వేదపారంగతుడైన చదువంత వానిలోనేయున్నది. వాడు వ్రాసిన బెక్కు బండ్ల గ్రంథముల విషయము వానిలోనిదే. వాడేమి కన రాడు, వాని కార్యము మనకు కనపడుచుండును. హృదయమనట మెందుకు, పరిశుద్ధ హృదయస్థులు గనవచ్చుననియు, భూతసమిష్టి సత్వగుణ ప్రధానము సంతఃకరణమాభాసునకు కారణమనుటచే నా మాట భగవం తుడు జెప్పెను. "ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయ" మని ఫలశ్రుతిని గూడ వచించెను. క్షేత్రము, క్షేత్రజ్ఞుడగు జ్ఞేయము, జ్ఞానము నీ మూడిం టిని తెలిసికొన్న నా భక్తుడు నన్ను బొంద యోగ్యుడగుచున్నాడనెను. భగవంతుడందించిన నీ రహస్యము వేదాంతవేత్తలగు బ్రహ్మజ్ఞపురుషులు విస్తారముగా బహుముఖముల జెప్పియున్నారు.

ప్ర॥ ఈ శ్లోకములో భక్తుడే శ్రేష్ఠుడన్నాడే, జ్ఞానికాదా శ్రేష్ఠుడు?

ఉ॥ భక్తుడుగానిది జ్ఞానికాడు. భక్తుడైతేనే పరమాత్మను వెదకి తెలుసుకొనును. తెలిసికొనుటకు జ్ఞానము కావలె, భక్తియుండవలె. భక్తునకు పరమాత్మ సారథి గురువై విజయము జేకూర్చును. తక్కిన యజ్ఞానులకు బుద్ధి సారథి బుద్ధి యింద్రియవిషయముల శరీరమను రథ ముతో శరీరికి చూపించగలదు. భగవంతుడు స్వరూపావస్థితిలో జీవేశ్వరా భేదాన్ని ప్రసాదించును. 19 నుండి 23 శ్లో॥ వరకు ప్రకృతిపురుషుల భగ వంతు డర్జునునకు విన జెప్పుచున్నాడు.

ప్ర॥ సాంఖ్యులు జెప్పిన ప్రకృతిపురుషులనేనా భగవంతుడు జెప్పేది?

ఉ॥ సాంఖ్యులు జెప్పునది యీ ప్రకృతిపురుషులే; అయితే ప్రకృతికర్త, పురుషుడు భోక్తయని సాంఖ్యులందురు. పురుషుని భోక్తృత్వము వాస్త వముగాదు, అది మిథ్య యనెదరు వేదాంతులు. ప్రకృతియన్న, క్షేత్ర మన్న నొకటేయనియు, క్షేత్రజ్ఞుడు పురుషు డొకడేనని ముందే జెప్పితిని కదా. మోక్షసన్న్యాసయోగమున "అధిష్ఠానం తథా కర్తా" యనే శ్లోక ములో కర్మకు నైదు కారణములు జెప్పబడినవి. ఆ కారణములలో నాత్మను జెప్పలేదు. రైలుబండియొక్క కర్తృత్వ కార్యత్వ కరణత్వములు డ్రైవరునకుగాని, గార్డునకుగాని, అందులో గూర్చున్నవారికిగాని లేనవు డాత్మకుమాత్రమెక్కడివి? కర్తృత్వ భోక్తృత్వములు మిథ్య. సమస్త వికారములును ప్రకృతియే.

ప్ర॥ సుఖదుఃఖములు బొత్తుగా నాత్మకు లేవంటారా?

ఉ॥ ద్వితీయాధ్యాయములోనే యీవిషయము వివరింపబడినది. స్వాయముగ ప్రకృతికి కర్తృత్వములేదు. ఉండినా చైతన్యమగును. స్వాయముగా నాత్మకు భోక్తృత్వములేదు. పరాశక్తి లేక జీవుడనువానికి ప్రకృతి తాదాత్మ్యముతో నారోపింపబడినది. ఒక చెఱువుకట్టపై నిరువురు మిత్రులు రాత్రి వెన్నెలలో నడచుచుండిరి. నీటి యలలచే పై చంద్రుడు నీటిలోబడి కొట్టుకులాడుచున్నాడు, మునుగుచున్నాడు, పైకి దేత్తామని యొకడు దుమికి నెందునుగానక, పైకివచ్చి చూచితే కనిపింప, దుమకడము చూచి రెండవవాడు కారణమడుగ, చంద్రుడు నీటపడి మునుగుచుండ తేల్పబోవుచుంటినన, నగి పైన జూప, వాడు సిగ్గుపడి యూరకుండెను. ఆత్మకు యథార్థముగ సుఖదుఃఖములున్న సుషుప్తి, మూర్ఛల నెందు కుండవు? స్వప్నములోని కల్పితసుఖదుఃఖములు జాగ్రతలో నేల నుండ కూడదు? చంద్రుడు నీట మునుగకపోయిన, నాభాసుడగు ప్రతిబింబమునకు నీటిచలనము గలిగినది. నిజమా? కాదు. ఆభాసుడగు జీవునకుగలిగే గమనాగమనములు, పుణ్యపాపములు, స్వర్గనరకములు తనకులేకపోయిన నంతఃకరణదోషచలనము తనకున్నట్లు దోచును. "దృగ్దృశ్యయోః సంయోగో హేయహేతుః" చూడబడునది చూడబడునదిగ, చూచువాడు చూచువాడుగనున్న యే గజిబిజి యుండదు. ఆభాసకుడు తన్ను మఱచి స్వల్పకాల స్వల్పస్థలాభిమానియై సుఖదుఃఖముల భ్రాంతితో గనును. తనకు స్వాభావికములుగావు. సుఖదుఃఖము లాత్మస్వరూపములే నైతే తన్నివారణార్థము నాప్తవాక్యములగు శ్రుతిస్మృతీతిహాసోపనిషత్తులు ఘోషించుటేల? మధ్యవచ్చినరోగములకు డాక్టర్లు మందులివ్వగలరుగాని, రోగిస్వభావమేయైతే డాక్టర్లు యేమిచేతురు? డాక్టర్లూ రోగులే కదా! ఇక డాక్టర్లేరీ? భ్రాంతిజములుగాబట్టి శాస్త్రము జ్ఞానము గలిగించి తన్నివారణ మొనరించుచున్నది. ఆత్మకు నేవికారములులేవు. ఆరోపమున్నట్లు నా యారోపనిరసనార్థము తటస్థలక్షణముగ శాస్త్రములు ప్రయోజనకారులైనవి. "ఉపద్రష్టాఽనుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః" అవిద్యాకారణము, సూక్ష్మశరీరము కర్త, స్థూలశరీరము కార్యము. వ్యష్టిసమష్టిగ వీనికి సాక్షియగుట నాత్మకే నుపద్రష్ట. తన యనుమతిలేని

దివేవి కదలవుమెదలవు. అందువలన ననుమంతయనియు దేహేంద్రియాది జడవస్తువుల భరించుటచేత భర్త. వేదమంత్రముల నూర్యుని కర్తా భోక్తా అనెదరు. యజ్ఞాది చరు పురోడాశముల స్పర్శించుగావున భోక్త. అనుభవించటము లేదు కర్త. సమిష్టిశరీరముల నధ్యక్షుడగుట మహేశ్వరుడు. "పూర్ణమనేన సర్వమితి" సకలము నిండిన పరమాత్మయే దేహముల నుండు జీవుడు. వ్యాపకమూర్తియగు పరమయాత్మయే క్షేత్రజ్ఞుడు.

ప్ర॥ జీవుడే దేవుడనే నిశ్చయము భగవంతుడు జెప్పెనా ?

ఉ॥ చెవిటివాడు శంఖమెంతయూదిన నేమి యనును ? గ్రుడ్డివాడు నడుచునది త్రోవేయైనను కాదనుకొనును. నీవు నదేరీతి అడుగుచుంటివి. భగవంతు డాదినుండి జెప్పుచు వచ్చునది వింటున్నావు. "అమృతస్య పుత్రాః" యనే వేదోద్దేశము. భిన్నముగ, నిజముగదోచు సంసార తాపత్రయముల దగ్ధమొనరించి జీవేశ్వరాభిన్నస్వరూపానందస్వారాజ్య పట్టాభిషిక్తుల జేయవలెననియే "య ఏవం వేత్తి పురుషం" యని ఫల శ్రుతిని భగవంతుడు జెప్పెను.

ప్ర॥ ఏమని భగవంతుడు శెలవిచ్చెను?

ఉ॥ గుణములతోగూడిన ప్రకృతి లేక క్షేత్రమిట్టిదనియు, క్షేత్రజ్ఞుడిట్టివాడని యెవ్వడెఱుగుచున్నాడో వాడెట్టి వ్యవహారముల నేకాలమున నెచ్చట వెలయుచున్నను కర్మనంటడు. పునర్జన్మము నొత్తడనెను.

ప్ర॥ 24 నుండి 25 శ్లో॥ వఱకు జెప్పిన వార్లగతులేమి ? విచారము చేయుటకు చదువు జ్ఞానము లేని కర్మాదులొనరించువారి గతియేమి ?

ఉ॥ వీరందఱు నధికారులే. ధ్యానముచేత కొందఱు, ప్రకృతి పురుష భేదవిమర్శనమను సాంఖ్యమున కొందఱు, నిష్కామకర్మమున కొందఱు, నష్టాంగయోగముల నొనర్చి కొందఱు ముక్తిలేక నాత్మను దర్శించెదరనెను. వీరిమార్గములు వేఱేగాని, వీరు పొందుస్థితి యొక్కటియేనని నిరూపించెను. అందఱు ప్రయాణీకులే, నెవరేరీతి ప్రయాణమొనర్చిన గమ్యము జేరగలరు. ఒక పట్టణమునకుగాని, దేవాలయమునకుగాని దర్వాజాలు నాలుగుండును. ఎవరేరస్తాన వచ్చిన పట్టణములో జొత్తురు, లేక దేవళము చేరి దైవమును గాంతురు. మా యోగము గొప్పది, మా సాధన మంచి

దను తగవులు దీర్చెను. అల్లా యన్న, హరి అన్న, గాడ్ యన్న పేరు భేదములే, నందఱి యభిమతప్రదమ్యమే మోక్షము.

ప్ర. ఆత్మజ్ఞానమునకు, ధ్యానమునకు, కర్మయోగమిత్యాది సాధనములకు నర్హులు గాలేక, శక్తిచాలక సంసారమునుండినవారల గతి యంతేనా ? భగవంతు డేమైన జెప్పెనా ?

ఉ॥ తండ్రికిగల బిడ్డల సమర్థులకుతగిన మార్గములుజూపి సమర్థతలేని వానికి వాని సమీపమునకే సమర్థతగలవారిఫలము నందజేయును. భగవంతుడు లోకజనకుడు. ఆయన కన్ని తెలియు. పై నాలుగు మార్గములకన్న వీరికే మంచియేర్పాటుజేసెను. నాల్గుసాధనల నవలంబించి యుత్తీర్ణులైన వారి ద్వారాగాని, లేక నీ నాలుగుమార్గము లొకడే ననుభవముజేసిన వానిద్వారాగాని వీరిలో ననరిపై శ్రద్ధాభక్తిగల్గునో, వారివలన వీరు వారిని గురువులుగానో, పూజ్యులుగానో, తటస్థులుగానో, భగవద్బంధువులుగానో భావించి, సేవించి శ్రవణమననముల ధ్యానధారణ సమాధుల మోక్షము నొందవచ్చుననెను. అయితే శ్రవణమొనర్చువీరలు శ్రద్ధా, భక్తి,విశ్వాసములు గలవారలుగా నుండవలెను. పుష్పములుగాతయారై యుంటే నటకే యందరు వత్తురు. అంగడిపెంచుకొనియున్న ప్రతియొక్కరు రాగలరు. నదియై ప్రవహించుచుంటే స్నానమొనర్ప నెందఱో వచ్చుచుందురు. ఫలవృక్షమై కూర్చొనియుంటే చెట్టుక్రిందికి రానిదెవరు? విద్యార్థులైయుంటే నుపాధ్యాయులరుదెంతురు. దాతవై యుంటే దానము గొనువారు రాకపోరు. సత్యముగా నట్టి శ్రద్ధయుండిన మహాత్ములు వీరలకు దాపరింపకపోరు. భగవంతుడే అట్టి యవకాశము గల్పింపగలడు. ఏకాలములో నేది పండవలెనో, నేది యెండవలెనో, యేది పుట్టవలెనో, నేది చావవలెనో, నెయ్యదిప్రకాశిలవలెనో, నెయ్యదిప్రకాశహీనముగావలెనో నాతడు రాత్రింబగళ్లవలె నావిర్భావతిరోభావము లొనర్చుచుండును.

ప్ర॥ శ్రుతిపరాయణులనను వినమనికదా! ఇక ధ్యానాదు లొనరించు టెలాగు ?

ఉ॥ శ్రవణమంటే నేమనుకొంటివి. శ్రద్ధావంతునకు నపూర్వమైన సద్యోఫలకారి. అందుకే నధికారుల నరయవలెననేది. జప, తప, వ్రత,

యజ్ఞములగు బాహ్యసాధనములకంటే నిదిశ్రేష్ఠము. అందుకే నంతరంగ సాధనము నందురు. నిదిధ్యాసము యొక్క పరిపక్వావస్థనే సమాధి యందురు. ఇందువలన సమాధి నిదిధ్యాసమున నంతర్భూతముగ నున్న దంద్రు. అయ్యది పృథక్సాధనముకాదు. ధ్యానమువలన సమాధి, తత్సమాధి శ్రవణమనననిదిధ్యాసములవలననే లభించుచున్నది. "శ్రద్ధావాన్ లభతే" శ్రద్ధావంతుడు శ్రవణాధికారి. తక్కినసాధనములన్ని శ్రద్ధకు సమములే, లేక శ్రద్ధ కంతర్భూతములే. శ్రవణశక్తి గొప్పది. అర్జునుడు, రాముడు, పరీక్షిత్తు, జనకుడు మొదలగువారు శ్రవణమననములవలననే నిదిధ్యాసాపరోక్షులైరి. 26 శ్లో॥ "యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావరజంగమమ్" దయామయుడు సర్వజ్ఞచక్రవర్తి స్వయంజ్ఞానోజ్జ్వల వికాసితమయ జగన్నియామకుడు భగవంతుడు. మధ్యకాలములో, మధ్యయుగములో, శ్రవణమధ్యలో, ప్రవచనమధ్యలో సంశయము గలిగినవారికి నెవరు దీర్తురు? గురువుండవచ్చు, లేకపోవచ్చు, నుండిన సంశయము దీర్పజాలనివాడైన ననుపయోగమని వెనుకరాబోవు భావిమానవుల సంశయవిచ్ఛేదము తానే యీ శ్లోకమున కర్థమువినిపించి సంపూర్ణముగ తెలిసికొంటే నిక తెలిసికోవలసిన దుండదని దృశ్యద్రష్టలు, ప్రకృతిపురుషులునంతా పరమాత్మయేనైతే జన్మమరణాదియవస్థ లెందుకురావటము, ఈ సంసారమేల వచ్చెనను శంకనుదీర్పదలచి స్థావరజంగమాదుల ఉత్పత్తికి కారణము క్షేత్రక్షేత్రజ్ఞులే కారణమనెను. క్షేత్రము జడము, క్షేత్రజ్ఞుడు చైతన్యము. వస్తుతః దేహమునకు, వస్తుతః చైతన్యమునకు లేశమేని సంసారములేదు. అగ్నినిగూడిన యినుము నానారక యుపయోగవస్తువుల పరిణామమొందును. అగ్నినిగూడిన జలముష్ణమై తండులాదులన్నమగును. సెల్సు కనెక్షనుతో బలుపు వెలుగును. విద్యుచ్ఛక్తిచే బుడ్లువెలుగును. అంతఃకరణముతోగూడిన నాభాసకు నంతఃకరణమే స్థూలసృష్టికికారణము. ప్రతియొక బీజములో నాత్మశక్తియుండును. వానిని భూమినీరు తోడు చేసిన నది వృద్ధియగును. భూమికి, నీరుకు సమానము. రక్తము, వీర్యము వీనికితోడు శరీరము, ప్రాణము, జోడై శరీరములుగా పరిణామము నొందును. చిదాభాసగల విట్లు, చిదాభాసలేనివారీతి తయారగును. ఒక యింటిలో నిప్పు నొకయింటివారు గొనిపోవ, నా యింటినుండి మరొకరు

గొనిపోవ నిట్లూరంత నొకయగ్నియే వెలుగుకిరితి సచ్చిదానందాభాస కత్వమే జగన్మయము. క్షేత్రజ్ఞునకు, క్షేత్రమునకుగల్గిన తాదాత్మ్య సంబంధమే సంసారము. లేదా జననమరణములు గలుగుచున్నవి. తాదాత్మ్యమున కజ్ఞానమే కారణము. జ్ఞానముగలిగిన కార్యసహిత యజ్ఞాన నివృత్తియగును. 27 నుండి 28 శ్లోకమువఱకు సమదర్శనము గుఱించి తెల్పెను.

ప్ర॥ యావద్విశ్వము క్షేత్రజ్ఞుడేనైతే సమదృష్టి రాకయుండునా? అయినా చెప్పుడి.

ఉ॥ "సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్" అక్షరములు, శబ్దములు వాక్యములతో లెక్కలేని గ్రంథములైనా మూలమొక్క ప్రణవమే. రంగుల రంగుల పటములు గన్పించినను దారమే లేక దూదియే. క్షేత్రక్షేత్రజ్ఞు లనేకత్వముతోటి యీ గంభీరసచరాచరము నాయొక్క క్షేత్రజ్ఞుడే. పిలుచువాడు, పలుకువాడు, వినువాడు, చదువువాడు, నూహించువాడు, కోపించువాడు, దుఃఖించువాడు నాతడే. క్షేత్రములుగాదు, క్షేత్రములకంగు నాయనవలన లభించినదే. రేడియోలలో, టెలివిజనులలో, గ్రామఫోనులలో, టెలిగ్రాంలో, టెలిఫోనులో, వీణలో, ఫిడేలులో, హార్మోనియములో, మేళములో, జలతరంగిణిలో, స్పీకరులో వెలయు సూక్ష్మాంశము వ్యాపకబ్రహ్మయొక్క చిదాభాసకమే, అనగా బ్రహ్మమే. కోట్లకొలది తయారై వచ్చు క్షేత్రక్షేత్రజ్ఞులితడే, నుండువాడతడే, క్షేత్రములు భూతక్షేత్రముల గలియు తాను తానుగా నుండువాడు విశ్వంభరుడే. ఒక శరీరావయవములు వేఱువేఱైన నా శరీరాభిమానికి నావి యనే యభిమానముండును. విశ్వమంతయు క్షేత్రజ్ఞుడని గనుటయే యథార్థదర్శనము. రాతి రథములో రామాయణములోని రామ రావణాది పాత్రల తీర్చియుందురు శిల్పి. అవి యన్నియు రాయియే యని గ్రహింప రావణుడు చెడ్డవాడు, రాముడు మంచియనే దేమున్నది? ఇక భేదబుద్ధియుండదు, తన్నుతాను హింసించుకొనడు. తన దేహము నేభాగమున కేహాని గల్గిన తనకేనని దృఢముగా నెఱిగినవాడు హాని కోర్వలేడు. విశ్వమే తన రూపు చెప్పు. నీకన్న యన్యము లేదుగదా. ఇదియే సమదర్శనము.

ప్ర॥ 29-వ శ్లో॥ ప్రకృతి ప్రస్తావన భగవంతుడేల మరల తెచ్చెను?

ఉ॥ అపుడు నాప్తునికి ప్రియమైన వస్తువు కొని తెమ్మనిచెప్పి మఱచు నేమోనని మాటిమాటికి మఱచేవు, మఱచేవని యావస్తువును జ్ఞాపకము జేయును. భగవంతు డర్జునునితో మనోవాక్కాయకృతికర్మ లన్నియు ప్రకృతియే సత్వరజస్తమోగుణస్వభావముల నిర్వహించుచున్న దనియు, కార్యకరణకర్తృత్వములు ప్రకృతివియే, నాత్మకు భ్రాంతిచేతనే కార్యకరణకర్తృత్వములు గలుగుచున్నవి. నేనకర్తనని యెఱిగినవాడే పూర్ణదృష్టిగలవాడు, తక్కినవాడిది దోషదృష్టి. పటమున దోచు దేశము లన్ని పటమునందేయున్నవి. సూర్యకిరణములు సూర్యునిలో, నగ్నిదీప్తు లగ్నిలో,వాయుచలనము వాయువులో,సింధుతరగలు సింధులోనేయున్నవి. వాని వాని కారణమునుగాదని కార్యములులేవు. అదిగో సూర్యుడు, నిదిగో మేఘము. మేఘము సూర్యుడా? కాదు. మేఘమేమిటి? నీరు. సముద్రము మేఘకార్యమునకు కారణము. అయితే మేఘముగా నేర్పడ వలెనన్న నెవనిసత్త గావలె? సూర్యుని కిరణాకర్షణ గావలె. సూర్యుడుదాసీనుడు. తనకు తెలియకుండ తన దీప్తిచే సముద్రము మేఘమై, వర్షమై, నదులై ప్రవహించి సముద్రములోనే కలియుచున్నది. సూర్యునిలో కలియుటలేదు. సూర్యుడెందుకలియడు. ఆత్మ సూర్యునివంటివాడు. ఆత్మాశ్రయ మజ్ఞానము, దాని కార్యమే యవిద్యయు, త్రిగుణములు, త్రిలోకములు, దేవ, మానవ, తిర్యక్కులు, జాగ్రత్స్వప్న సుషుప్తులు లేక సృష్టిస్థితి లయములు. నావిర్భావము ఆత్మసత్తాచే ప్రకృతియే యగును. తిరిగి తిరోభావము జెందుట ప్రకృతియే. ఆత్మ దేనికి నంటక నుదాసీనుడై యుండును. ఈ రహస్య మెఱిగినవాడు బ్రహ్మను బొందును. “అనాదిత్వా న్నిర్గుణాత్వాత్” పరమాత్మ యనాదియగుట నంత్యములేదు, నవ్యయుడు. శరీరములు నశించుచున్నను, యాత్మ నశింపదు. కర్మతోగాని, కర్మఫలముతోగాని యాత్మకు నెట్టి బాధలులేవు. వేడిమివల్ల వర్షమేరాని, జీవులే తపింపని, కుష్ఠమంత నెండని, తేమమింకని, దప్పిగల్గని, లేత తీగెలు మాడని, ప్రపంచము నానావస్థల దురటిల్లని, దురటిల్లకపోని సూర్యునకేమి లేదు. సూర్యాదులకు సత్తాయైన నాత్మకేమియు గలుగదనుట నిస్సందేహము.

ప్రాకృతముగ చిత్తశుద్ధిలేక, యేకాగ్రతలేక శ్రద్ధ విశ్వాసములు లేనిచో నీపరమరహస్యము, నీదివ్యమూర్తియు, నీదివ్యబోధ గ్రహింప రానిది. ఎండకు మంచు కఱఁగురీతి, వేడికి వెన్నకరఁగు భంగి, కర్పూరమగ్ని కరుగువిధము, నాహృదయము కఱఁగిపోవుచు నీన నుప్పొల్లారుచున్నది. భగవంతుండిక నేమి జెప్పెను?

ఉ: 33 నుండి తరి శ్లో॥ వఱకు దృష్టాంతములతో తన సిద్ధాంతము స్పష్టీకరించెను. "యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే" పృథివి జలాగ్ని వాయువులకన్న నాకసము సూక్ష్మమైనది. శబ్దస్పర్శరూప రసగంధములు లైదింటికి నంటదు, ఒక్కొక్కదానికి నంటదు. దశదిశల పూర్ణమై బాహ్యాభ్యంతరముల వెలయుచున్నది ఎచ్చటెచ్చట రంధ్ర గుణములున్నవది యాకసమే. శబ్దమున కవకాశమిచ్చునది యాకసమే. మాట్లాడునోటనుండు బయలాకసమే. సంకల్పించుట కవకాశమిచ్చినదే హృదయాకాశమే. ఆకసములేని స్థలమేలేదు. ఆకసముండబట్టియే రాతిలో కప్ప, యాకసముండబట్టియే నీటిలో జలచరములు, నాకసముండబట్టియే పృథివిలో నీరు, నీటిలో నాకసమున్నది, యగ్నిలో నున్నది. ఆకసమందే బ్రహ్మాండమంతయు నున్నది. ఆత్మ యాకసముకన్న సూక్ష్మమగుట భూత భౌతికములనందంతట నిండియున్నాడు. ఆత్మయుంటేనే దృశ్యము. తాను ద్రష్ట. దృశ్యములేదా ఆత్మ లేదనవలసివచ్చు. కావున ఆకసమువలె బాహ్యాభ్యంతరముల నిండియుండును. ఏకదేశీయమగు బ్రహ్మాండ మాత్మయుందొక నలుసువంటిది. "యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః" ఇది రెండవ దృష్టాంతము. సూర్యప్రకాశముచే బ్రహ్మాండము తెలియఁబడుచున్నది. సూర్యుడులేడా చీకటి. చీకటియం దేమున్నదో నెవరికేమెఱుక? సూర్యుడొక చీకటిని బోగొట్టుటయేకాదు, భూతభౌతికముల నాయురారోగ్యములకు క్రమముక్తి స్వర్గాది దివ్యలోక ప్రయాణ సౌకర్యముల మార్గము పరిశుద్ధుల నొసర్చును. ఈశావాస్యోప నిషత్తులో "పూషన్నేకర్షే యమసూర్య ప్రాజాపత్య" యని బ్రహ్మ పుత్రుడు సమస్తజీవుల శాసకుడనియు తెలుపబడినది. సూర్యుడు మరుగు పడడు. జ్యోతి యారిపోదు. ఎవరెలిగించినదికాదు. భగవంతుడగు నాత్మ యిట్టివాడే నమసిపోడొకరు వెలిగింపలేరు, తనకు చీకటిలేదు. స్వయం

జ్యోతి. స్థూలసూక్ష్మములనందంటె లోపల, వెలుపల ప్రకాశించు చున్నాడు. శూన్యవస్తువుకాదు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" ఏ ప్రత్యయమునకు విషయముకాదు. ఎందుకంటే శబ్ద ప్రవృత్తినిమిత్తములగు జాతి, గుణ, క్రియ, సంబంధ రూఢ్యాదులు దాని యందు లేవు, ప్రమేయముకాదు. "ఏతదప్రమయం ధ్రువమ్" "ఐత దాత్మ్యమిదం సర్వం తత్సత్యం స ఆత్మా" ఆత్మకానిదేదియులేదు. ఉన్న దనిన యాత్మయే పరమార్థసత్యము. ఈ జగత్తునకంతటికి నాత్మయే నిజ మగు స్వరూపము. నేను నేనని చెప్పుకొనుచుండెడి లోపలి తమ స్వరూప మా యాత్మయే యైయున్నారు. ఇదియే సత్యము.

ప్ర॥ ఫలశ్రుతి నేమన్న భగవంతు డనుగ్రహించెనా?

ఉ॥ అవును. 35 శ్లోకము "క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమంతరం జ్ఞాన చక్షుషా" క్షేత్రక్షేత్రజ్ఞుల భేదమును గుఱించిన జ్ఞానవంతమైన బుద్ధి మాత్రమే వాస్తవదృష్టి గలదగును. అదియే శబ్దార్థముయొక్క సారాం శము సరిగా గ్రహింపగలదు. క్షేత్రక్షేత్రజ్ఞుల భేదము నెఱుగుటకై బుద్ధి మంతు లనవరతము నతీంద్రియజ్ఞానుల నాశ్రయించియుందురుకూడ. నామ రూపాది పరిణామకార్యము నొంది వివిధములుగ దోచుచు వాస్తవస్థితిని మఱుగుపఱచుచు కల్పితకారణమైన మాయ దానియొక్క సాంతత్వము లేక దాని యత్యంతమిథ్యాత్వమును దానినుండి విముక్తి నొందు నుపాయ మును జ్ఞానముతో నెవరు తెలుసుకొనుచున్నారో, వారాపరబ్రహ్మము నొందుదురని భగవంతు డర్జునునితో జెప్పెను. కాన లోకలోకాంతర ములు, ఖండఖండాంతరములు, మతమతాంతరములు నీ క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగమే వేఱుకాదు. అంతయు నొకటే, నొకటే నంతయు. నీవు నేను ప్రపంచము పరమాత్మయే. ఇదియే జ్ఞానచక్షువు, దివ్యనేత్రము, మూడవనేత్రము, గురువరప్రసాదము, భగవత్కటాక్షము, పురాకృత పుణ్యఫలము, మహర్షుల నాశీర్వాదబలము, స్వప్రయత్నము, శాస్త్ర వికాసము, సజ్జన సుసంస్కృతము, మహాద్భాగ్యము, దైవవినుతము, దిగంతవిఖ్యాతము, పరిపూర్ణము.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీ కృష్ణార్జున సంవాదే క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగో నామ త్రయోదశోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## చతుర్దశాధ్యాయము

### గుణత్రయవిభాగయోగము

చ॥ త్రిగుణములన్ పరాత్పరుని తీరని భక్తి యొనర్తురేని యా
సగుణవిలక్షణుండు కడు సంతసమంది స్వకీయమాయ బా
పగలడు వేఱుమార్గము భవంబుల బాపగజాల దెట్లనన్
జగతి మహానదిం గడవజాలరు నావికుడొండు లేనిచోన్.

ప్ర॥ వింటే, చదివితే, జెప్పితే, చూచితే, గీతనే వినవలె, జదువవలె, జెప్పవలె, చూడవలె. మధురాతిమధురము, నుపనిషత్తులనుండి పిండినరసము, భవబంధలత ద్రెంప లవిత్రము. వినవలెననే సరదా! క్షేత్రక్షేత్రజ్ఞవిభాగ యోగమును జెప్పి యంతటితో ముగింపక భగవంతుడు నీయాధ్యాయము తానే ప్రారంభించుటము 'రొట్టె విరిగి నేతిలో బడిన'ట్లైనది నాకు. దాన మిచ్చువచ్చినరీతి నిచ్చిదాత వెడలిపోవు. దానము గొనువారల నిలవమన్న, నేమో మఱొక విశేషమున్నదనుకొందురు. ఆథంగి నేమో రహస్య మున్నదనుకొనెదను. తాము నోరుదెఱచితే నా హృదయము నిండును. ఆ నరనారాయణుల భవ్యకథామృతరహస్యసారము వినినచెవులే చెవులు, నా గీతనుబట్టిన హస్తములే హస్తములు, చదివిన నోరేనోరు, వ్రాసిన చేయియే చేయి, ఆ గీతాగ్రంథమును జూచినకన్నులే కన్నులు, గీతాసారమునింపిన హృదయమే హృదయము, లోకమునకు గీతను విన జెప్పునతడే భగవత్సేవకుడు, నిజభక్తుడు, పురుషార్థరహస్యవేది, సుజనజన ప్రియుడు, స్వేచ్ఛారతుడు, స్వాతంత్ర్యప్రియుడు, శాంతసదనస్థితుడు, స్వప్రకాశుడు నతనికి జోహారులు.

ఉ॥ తింటే గారెలు, వింటె భారతమన్ననుడి, నీవన్నమాట నొక్కటియే. అది లోకదృష్టి, శాస్త్రదృష్టి. నీవన్నది స్వదృష్టి. తేనెలోబడ్డ నీగవలె కామిని బొందు మఱిగిన విటునివలె గీతామృతమును చవిగొన్నచిత్తము నన్యథాయత్తముగాదు. ప్రహ్లాదు డీమాటే యనెను. "యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః" ఎట్టి స్థితిని బొందిన తదితరముల నభిలషింప తలంపుపుడదో యది. "అమృతేన తు తృప్తస్య పయసా కిం ప్రయోజనమ్" అమృతపాన మొనర్చినవానికి నమృతమును పేరున్న నీరేల నాశించును. "తాలవృంతేన కిం కార్యం లబ్ధే మలయమారుతే" చల్లని మలయమారుతము వీచుచుండ వీవనతో నవసరమేల? బ్రహ్మాండభాండముల తనయనంతత్వంబున నేకదేశంబుననిల్పి యంతర్బహిస్సుల, భూతభౌతికముల సాక్షియగు సచ్చిదానంద పరబ్రహ్మ, వ్యక్తగ్రహవిజ్ఞాన, చిద్రసామృతభాండము గీత. ఇంద్రియములద్వారా భూతభౌతికములు బుద్ధిచే జీవులుగదోచు దృశ్యకల్పితజగంబునందంతట నిండిన సత్యజ్ఞానానంద పరబ్రహ్మతప్ప రెండవది లేదని క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగమున నుద్ఘాటించిన యా జ్ఞానదేవుడు, సర్వలోకారాధ్య, జ్ఞానవిజ్ఞానపాదద్వయ జగద్గురు కారణములేనిదే వచింపడు. రెండుకారణములు లగపడుచున్నవి. అన్నదాత యాచించువాడెంతెంతగోర, నంతంత వడ్డింప నుత్సహించును. సమస్త దానదాత యడుగువారల హృదయముల పవిత్రతగంటే వలదనను దానమిచ్చుచుండును. విద్యార్థి వర్తననెఱిగిన యుపాధ్యాయుడు కొదవలేని విద్యనొసగును. జ్ఞానగురుడు శ్రద్ధాభక్తుల నమ్రభావము గలవాడై ముత్తెపుచిప్పవలె, చంద్రునిగాకను చాతకములవలె శ్రోత్రనీటికెదురెక్కు మత్స్యములరీతి నోటినుండివచ్చు ప్రవచనముల కలరి యమందానందిత హృదయుడగు నపుడేల నూరకుండును. జడివానవలె నమృతవర్షము కురిపించును. సమర్థుడగు శిష్యుని గన్న గురువేమగును. దక్షిణేశ్వరాలయమున రామకృష్ణునిగన్న వివేకానందుని నొకపాట పాడించి రామకృష్ణు డెంతకాలమో నెదజూసిన వస్తుదర్శనమైన నుప్పొంగి నరేంద్రుని లోనికి గొనిపోయి రెప్పపాటు కాలములో శరీరమునుమఱచి యపూర్వస్థితి బడయుజేసెను. రామకృష్ణు డందఱికే లట్లొనర్పలేదు? కపటముకాదు. యోగ్యతజూచెను. భగవంతు డర్జునుని యోగ్యతను

జూచితే సమాప్తమొనరించితమను బుద్ధిపుట్టలేదు. రహస్యాతిరహస్యముల గనులలోనుండి బంగారమును, వజ్రముల వెలికిదీసి యిచ్చురీతి, హృదయమను గనిలోనుండి యపూర్వవస్తువు నందివ్వసాగెను. గీతాకస్య పెరుగసాగెను. రెండవ విషయము. "బాధం నంతి వ్యాసార్థస్య హేతవశ్శ్రుత్యనేకతా, అసంభావ్యత్వమర్థస్య విపరీతా చ భావనా" శ్రుతు లనేకము లగుటచే ద్వైత, విశిష్టాద్వైతములవంటి మతాభిప్రాయము లనేకము లుండుటచే బ్రహ్మముతప్ప నన్యము లేదను సద్విషయమున సంశయముండు నని యఖండైకరసరూపమగు నద్వితీయబ్రహ్మమును లోకవిలక్షణవస్తువుగ భావింపను, నేను కర్తను, నేభోక్తను, నేను ఫలానివాడనను సంశయము, నసంభావన, విపరీతభావనలు గలుగునేమో యని ద్వితీయాధ్యాయమున స్థితప్రజ్ఞుని, షష్ఠాధ్యాయమున యోగి, భక్తియోగమున భక్తుడు, క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగమున జ్ఞాని, గుణత్రయవిభాగయోగమున జెప్పబోయే గుణాతీతుడు వీరలు పేరులకుమాత్రము వేఱు. వారు బొందే ఫలమొక్కటియేనని తెలుప, నిరీశ్వరవాదులు ప్రకృతి స్వతంత్రతచేతనే సృష్టియగునందురు. సృష్టికి ప్రకృతి స్వతంత్రతగాదు ప్రకృతి జడము. ప్రకృతియే కారణమన్న స్వభావవాదుల, లౌకికవాదుల, నాస్తికవాదుల బలపఱచుటమేగాక, వారి నంగీకరింపజేసినరీతి యగును. ఈశ్వరేచ్ఛవలననే సృష్టి గలుగుచున్నదనియు, సదసద్యోనిజన్మములకు గుణసంగమే కారణమనియు, సత్త్వాదిగుణములుగూర్చి సృష్టివైచిత్ర్యము వివరింపబూని ప్రశంసించుచు తానే పలుకవలసివచ్చి మందాధికారులకు గ్రహింపనగునో కాదోయని యీ రహస్యము తొలుత ప్రారంభించెను.

ప్ర॥ ఏకునుండి దారము, చలమునుండి నీరు, స్తన్యములనుండి పాలు వచ్చురీతి భగవంతుని ముఖారవిందమునుండి యొకదానినిమించిన రహస్యమొకటి బయలుదేరి వినవచ్చుచున్నదే; సంజయు డెంత ప్రపుణ్యుడో, నాకాలమెట్టిదో వచింపుడు? ఈ అధ్యాయము పేరేమి?

ఉ॥ 27 శ్లోకములుగలది గుణత్రయవిభాగయోగము. ఈ గుణములు ప్రకృతిస్వభావము లొక్కొక్కగుణమువలన నయ్యే సూక్ష్మస్థూలసృష్టులు, వానివలన గలిగేఫలములు వివరించుచున్నాడు. 1 నుండి 4 శ్లో॥ వఱకు

సృష్టితత్త్వము. "పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్" అర్జునా! "జ్ఞానానాం జ్ఞానముత్తమమ్" ఈ యుత్తమజ్ఞానమనాదియే. పరమమన స్వర్గలోకమని లోకులందురు. కాదు శ్రేష్ఠమని పేరు. ఎందు కన తక్కిన జ్ఞానములన్ని నెండుకట్టెల వంటివి. ఈ జ్ఞానాగ్ని సోకినంతనే బూడిదెయైపోగలవు. "అధ్యాత్మవిద్యా విద్యానామ్" అధ్యాత్మవిద్య జ్ఞానము. తక్కిన వవిద్యాసంభూతములు. నానార్థమగు ద్వైతబుద్ధి బుట్టించి చావులేకనే చావు, దుఃఖములేకనే దుఃఖము, పుట్టుకలేకనే బుట్టువు, జాతులు, మతములు ననేకములగు యెరికెలగద్దెవంటి వన్ని యున్నట్లు జూపుజ్ఞానములు మిథ్యాజ్ఞానములు, ఘూకనేత్రములవంటివి. పగటివంటిదీ జ్ఞానము. ఈ జ్ఞానము నొందినవారె మునులు, శాశ్వతులు. సంసారమనే పడగల నత్తనివ్వరు. నాతోసములు. దేహాధీనులుగా నుండరు. ఈ జ్ఞానలబ్ధులే బ్రహ్మర్షులు, దేవర్షులు, మహర్షులు, ఋషులు, రాజర్షులు, హంసలు, పరమహంసలు, నవధూతలు. వీరే భగవత్సమానులని భగవంతుడనెను.

ప్ర॥ ఉత్తమజ్ఞానమంటే నేమి?

ఉ॥ విషయజ్ఞానము, దేహజ్ఞానము, భ్రమజ్ఞానము కాదు. ఫలశ్రుతిని గూడ భగవంతు డీశ్లోకములోనె వినజెప్పెను. ఈ జ్ఞానము నొందిన భగవత్స్వరూపులై నిత్యులగుదురు. ప్రళయోత్పత్తులు వారికుండవు. సచ్చిదానంద ఘనస్వరూపులై నేను నీవను భేదములేక, లోకాలోకములవాంఛలేక నూతనసృష్టిలో రారు. పాయ్యేప్రళయములో గలియరు. ఎఱుపు, తెలుపు, నలుపు, పసుపులాది వర్ణముల రంగులబుడ్లలో మీాటర్ వత్తి నంతనె నాయా రంగులజ్యోతులు వెలిగి భేదబుద్ధి గలిగించును. ఆరిపిన నా జ్యోతులన్ని యేకమై నొకటియేయగును. బుడ్లువేఱు. దేహాత్మ బుద్ధులుతొలగి పూర్ణులైన జ్ఞానుల కేసంసారములేదు. "ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః" వీరు కడుంగడు ధన్యులు. వీరికి వీరే సములు, దుఃఖాతీతులు.

ప్ర॥ మనము మునులము గామే, మనకీ జ్ఞానమెట్లు లభ్యమగును? సంసారమెట్లు తప్పును?

ఉ: ప్రకృతి, దానిగుణములు, నాగుణసంగమమునగలిగే సంసారము, దానివలన లభ్యమగు జన్మమరణ సుఖదుఃఖములు, జీవునకు నిత్యదాయక ములా? భ్రాంతిదాయకములా? జీవులెవరు? ఈ సంసార మెవరిది? యని, గుణములసంగమే సంసారబంధము, వాని యసంగమే ముక్తియని మననముచేయు మననశీలురెవరైన మునులే. "బహుజన్మ దృఢాభ్యాసా ద్దేహాదిష్వాత్మధీః క్షణాత్" బహుజన్మములనుండి దేహమే నేను, నేనే దేహమను దృఢాభ్యాసము నొక్కక్షణములోనే దేహాత్మలు వేరని విన్నంతనే పోదు. సత్పురుషులవలన విని శ్రద్ధగా మననమొనర్చిన బ్రహ్మ బుద్ధి దృఢమగును. ఎంతకాలమునుండియో వాడని గంధపుచెక్క ధూళి ధూసరితమై తనవాసన లోపించియుండును. నీళ్లతోకడిగి నూరగనూరగ తనస్వభావసిద్ధమగు సహజవాసనయే మరలవచ్చును, క్రొత్త దేమిరాదు. బాహ్యాంతరింద్రియములు, ప్రాణములు, దేహము, సూక్ష్మదేహము నవస్థల విషయ మొకనాడైన విచారించనపుడు, చక్కగా పోషించి తమ్ము దేవతలకు బలియిత్తురేయని తెలియక మనుష్యుల వెంటనంటు పశుపక్ష్యా దుల భంగి, దేహమువలన చావు పుట్టుక, దీనదుఃఖము నెందువలన గలుగు నని విచారింపక "అవిచారేణ కృతో బంధో విచారేణ నిబధ్యతే" ఈ దేహము నేనను మూఢవిశ్వాసము బంధము, సంసారకారణము.

ప్ర: దేహేంద్రియములు వేఱు, జీవుడు వేఱంటారా? ఈ గుణ ములు దేనివి?

ఉ: దేహేంద్రియములు, గుణములు వేఱు. జీవుడు వేఱు. ఈ గుణ ములు ప్రకృతిస్వభావములు. "ప్రకరోతి ఇతి ప్రకృతిః" త్రిగుణముల సామ్యావస్థయే ప్రకృతి. "మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్గర్భం దధామ్యహమ్" ప్రకృతికి మహద్బ్రహ్మమని యేల పేరు? "మయాధ్యక్షేణ ప్రకృతి" భూమిలో విత్తనముల నుంచిన కోట్లకొలది సస్యముల బండించు భంగి ప్రకృతిక్షేత్రము నాసంగమమువలన నా యీక్షణమను బీజము వలన సకల భూతకోటియనే పంట పండించును. అన్నిటికి మూలమగుట నవ్యక్తమని భగవంతుడు. దీని కనేక పేర్లుగలవు. కొందరజ్ఞానమందురు. ఆత్మస్వరూపమును తెలియకుండ నావరించియున్నది. పాలను నిప్పుపై పెట్టి గిరగిర త్రిప్పుచున్న మీగడ కట్టదు. నిలుకడగనుంచిన మీగడ

కట్టును. ఈ యజ్ఞాన మట్టిదే. క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగమన నిదియే. ఒకటి సాకంత మొకటి కాది సంయోగము లేదా వేఱు నేతే. సంయోగముకలదా రెండు నొకటిగ దోచు. బిజిలీబండ్లు నడచుటలేదా? ట్రాం నడచుటలేదా? ఈ సంయోగమువలె నాత్మతత్త్వముయొక్క స్వాభావిక ధర్మమే నీ యజ్ఞానము ననుసరించి యాత్మ యాత్మస్వరూపమునే జూచును. కాని దానికది యనేకములుగా దోచును.

ప్ర॥ ప్రకృతిజడము. దానివలన సృష్టికిగాను భగవంతుడు తన బీజము నుంచటమంటే నామతి కెక్కలేదు. అనగా నర్థము కాలేదు.

ఉ॥ ప్రకృతి జడమే, కావని కాదు. సూది జడమే సాకంతమును వెన్నంటును. ఇనుము జడమే నగ్నిసంబంధమున నానావస్తుపరిణామము నొందును. ప్రకృతి దేశకాలముల నతిక్రమించునది. స్వతంత్ర, నస్వతంత్రయు,సావయవ నిరవయవములుగలది. దానియందు బీజమన చిదాభాసనుంచెను. ఇదే బీజము. నిద్రించు మానవులవద్ద నుండును, మేల్కొన్నవారికి సేవజేయును. మూర్ఛనుండి, గాఢనిద్రనుండి లేచేటప్పటికి నేను స్వర్గముపోయియుంటి నందురు. స్వప్నములో ననేకము గన్పించును, వీని నన్ని నెక్కడ నుంచుకొనియుండును? దానియందే యుండును.

ప్ర॥ ఈ సృష్టి యెప్పటినుండి జరుగుచున్నది?

ఉ॥ ఇది యనాది. భగవంతుని సంయోగము నొందిన పిదపనే గర్భము ధరించును. అవియే నష్టప్రకృతులు. ప్రకృతి పురుషుల సంయోగమువలన బుద్ధి, దానినుండి మనస్సు, మనసునుండి యహంకారము, దీనినుండి పంచ మహాభూతములు బుట్టును. భూతములయొక్క స్వభావమెట్టిదనిన విషయములు మఱియు నింద్రియములతో తమంత తామే నంలగ్నమై యుండును. ఈ రీతి నింద్రియములు, విషయములుగూడ జన్మించును. వికారము లీరీతి వృద్ధినొందినపుడు త్రిగుణములు వాని నత్తికొనును. "సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః" ఉచ్ఛసీచ ముల ప్రకృతియే దేవ, పితృ, మనుష్య, పశ్వాది యోనులనుండి యుత్పన్నములగు దేహములన్నింటికి ప్రకృతి తల్లి నేను తండ్రిని యని భగవంతు డర్జునునితో ననెను. ప్రకృతి మిథ్యకదా యన్న దాని కాశ్రయ మిచ్చినదేది నదియే నీశ్వరుడు. సదసద్యోనిజన్మములకు గుణసంగమె కారణము.

యోనిసంజాతులకు ప్రకృతి తల్లి, పరమేశ్వరుడు తండ్రియగును. తనతన కర్మఫలముల ననుభవించుటకే ప్రకృతి పరమేశ్వరు లిరువురు కారణులే గాన తల్లిదండ్రులుగా భగవంతుడు చెప్పెను. అద్దములో ప్రతిబింబించేదానికి నవకాశమిచ్చినది అద్దము, బిడ్డను జన్మించేదానికి నవకాశమిచ్చినది తల్లి. కన్న శిశువునకు భగవంతుడు తండ్రి. అద్దములోని ప్రతిబింబమునకు తండ్రి బింబమగును.

ప్ర॥ నిరీశ్వర సాంఖ్యమును స్పష్టముగ జెప్పుడి.

ఉ॥ ప్రకృతి పురుషులిద్దరు స్వతంత్రులు. అవస్థాభేదమువలన పురుషులనేకులు. పురుషుని స్వర్గమోక్షములకొరకై స్థూల సూక్ష్మాకృతి దాల్చిన ప్రకృతి మహత్తు మహదహంకారము పంచతన్మాత్రలు ననియే సప్తప్రకృతులు. దీనిలో ప్రకృతి యొకటి, ప్రకృతి వికృతులన మహత్తు నహంకార పంచతన్మాత్ర లేడు, ప్రకృతినుండి పుట్టినవి వీనినుండి సూక్ష్మసృష్టి గల్గించ గల్గినవి, ఏకాదశేంద్రియములు, పంచభూతములుకలిసి పదహారు. మొదటివి యెనిమిది, ఇవి పదునారు వెరశి 24 తత్త్వముల శరీరములాయెనంద్రు. ఇదియంత ప్రకృతియేను. పురుషుడు 25వ వాడు. అష్టప్రకృతులు, షోడశవికారములని వీనినేయందురు. అధ్యాత్మిక, మధిభౌతిక, మధిదైవికములనే త్రివిధ దుఃఖములకు కారణము. ప్రకృతిగుణములు మూడు. ఆ గుణసంగమము గలుగకుండ ప్రకృతిపురుషుల విభాగించునదే వీరి జ్ఞానము. "జ్ఞానాన్ముక్తిః" ఈ శరీరము నశించగనే ప్రకృతి వ్యాపారము నశించును. అట్టి నివృత్తివలన జీవుడు నేకాంతమును, నంతర రహితము నగు కైవల్యమొందునంద్రు.

ప్ర॥ భగవంతుడు జెప్పే యుక్తి యే విధమనదరు?

ఉ॥ నీ చేతిలో డబ్బు పాకెట్టులో నుంచెదవు. ఆ పాకెట్టును జోబిలో నుంతువు. ఆ జోబిగల చొక్కా తొడిగికొన్న వాని నాశ్రయించియుండును. డబ్బు లేయే సమయమున నేజీవులకు ఖర్చుపెట్ట నుద్యోగించిన జోబి పాకెట్టులోనుండి తీసి ఖర్చు పెట్టుదువు. ఖర్చు లేనపుడు జోబియందే యుండి నంతయుండును. తత్ప్రకార మవిద్యయందు ప్రతిజీవుల కర్మమనే డబ్బు యుండును. ఆ యవిద్య చొక్కా-జోబియనే మాయలోనుండును.

పాకెట్టువంటి దవిద్య, పురుషునిచొక్క నాశ్రయించిన రీతి, మాయ యనపాయినియై భగవంతుని నాశ్రయించియుండును. జీవులొనర్చిన కర్మ ఫలాలు పరిపక్వానికి రావటముతో నానిమిత్తముగా వారికి భోగానుభవం గల్గించేటందుకోసం పరమాత్మకంటే వేఱుకానరాని మాయతో సృష్టి సంకల్పము నేర్పడింది. పరమాత్మయొక్క సంకల్పబలముతో మాయయందు క్షోభగల్గింది లేదా కల్లోలం గల్గింది. ఎట్లంటావా? రాత్రి స్వప్నములో నొక స్త్రీతో గలిసినట్లు కలవచ్చింది. రేతోస్ఖలనమైనది. తెల్లవారి జూచితే స్ఖలనసృష్టియైనది. స్త్రీయేది? లేదు. మఱొకవిధము. చంద్రుడు పౌర్ణమిదినమున నుదయించినంతనే సముద్రమున క్షోభ గలిగినది. చంద్రునికేమి సంబంధములేదు గాని సముద్రకల్లోలానికి కారణమతడే. అగ్ని సమీపములో నొక బంగారుప్రతిమ నుంచినారు, మఱచినారు. కొద్దిసేపటికి బంగారు కరిగి విగ్రహము లేదు. తత్ప్రకారము శుద్ధసత్వ మాయోపాధికుడగు పరమాత్మ జీవుల నవిద్యయనే మలినసత్వప్రధానముపై తన దృష్టి బరపినంతనే యాకస వాయు వగ్ని జలము పృథివి యనే యైదు నపంచీకృత సూక్ష్మభూతములు, వాని సమిష్టి సత్వగుణాంశముచే నంతఃకరణము, వ్యష్టి సత్వగుణాంశముచే జ్ఞానేంద్రియములు, సమిష్టి రజోగుణాంశముచే ప్రాణము, వ్యష్టి రజోగుణాంశముచే కర్మేంద్రియములు గలిగెను. ఇవి పందొమ్మిదికలిసినదె సూక్ష్మశరీరము. తక్కినతమోగుణాంశమును పరమాత్మ యీక్షించుటచే ప్రతిభూతము రెండుభాగము లాయెను. ఒకభాగమును నాలుగుగా జేయ నాల్గుభాగాలలో నర్ధభాగం కల్పితే నయిదగును. ఇట్లు పంచీకృతము చేయ నిరువదియైదుతత్వములై సమిష్టివ్యష్టిరూప స్థూలసృష్టియేర్పడింది. సమిష్టిగతమైన స్థూలసూక్ష్మకారణప్రపంచానికి నభిమాని యీశ్వరుడు. ఈయన సర్వజ్ఞుడు. మాయ నీయన స్వవశంలోనుండును. ఆయన నిత్యముక్తుడు. జీవుడల్పజ్ఞుడు, అవిద్యాబద్ధుడు. ఇయ్యది శుద్ధబ్రహ్మమున జరిగిన యారోపము. ఈ యారోపము సత్యమా? యసత్యమా? అని విచారించితే బ్రహ్మమొక్కడేనని తెలియును. ఆరోపించినపుడు మాయోపాధితో నీశ్వరుడు సమిష్టికి, వ్యష్టికి నవిద్యతో జీవుడగును. "అవిద్యోపాధికో జీవో మాయోపాధిక ఈశ్వరః" మాయావిద్యల, పంచవిధ భ్రాంతుల నంతటా తానేయైనాడు. మాయను, మాయాకార్యముల

నన్వయ వ్యతిరేకములజేసిన తానేతప్ప నసేమి మిగులదు. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" యను ప్రమాణము సత్యమగును.

ప్ర॥ కొందఱు ముప్పదియాఱు, కొందఱు తొంబదియాఱు, కొందరు యిరువదాఱు తత్వములందురే, తాము యిరువదిరెండే జెప్పితిరి. మఱియు నీ యారోపము యెప్పుడు ఎవనివల్ల గలిగినది?

ఉ॥ ఎప్పుడెవ్వరిద్వారా యను నధిక ప్రసంగముతో వివేకికి పనిలేదు. అందులో నొక రహస్యముగల దశేంద్రియజ్ఞానులు గనిపెట్టిరి. బ్రహ్మ ప్రకృతి ఈశ్వరుడు జీవుడు పరస్పరభేదము సంబంధములను నారు యనాదులేకాని బ్రహ్మముతప్ప యనంతము తక్కినవి సాంతములని యెరిగిరి. మిథ్యయనుట నిందుకే. విత్తుముందా, చెట్టుముందా యను సమస్య నిట్టిదే. అదియు ననాదియేయైనను విత్తనము వేచితే మొలవదనేది గనిపెట్టిరి. నేనెవ్వడ, జగత్తేమిటి, బ్రహ్మమెవరని విచారింప నంతవర కనాదియై యన్నిసత్యమే. తన్ను తెలిసినంతనే బ్రహ్మమగు తానుతప్ప తక్కినవి సాంతములని తెలియును. మఱియు తన్నెప్పటినుండి తెలియ లేదో నప్పటినుండియే నవిద్యవల్ల నారోపింపబడినది. మందాధికారులకు నారోపింపబడినదందురు. వాస్తవములో జగత్తులేదనియే సిద్ధాంతము. ఎన్నితత్వములజెప్పిన నాత్మ మిగుల్చుటకే.

ప్ర॥ సదసద్యోనుల జన్మించుటకు గుణసంగమే కారణమంటిరి. ఎట్లు?

ఉ॥ స్వయముగ తనంత నాకసమున విహరించు పక్షి కాలికి త్రాడు గట్టి క్రిందికిలాగిన రాకయుండునా? క్రిందికివచ్చినను నది పక్షియే. వదలిన మఱల నెగిరిపోగలదు. నామరూపములులేని యసంగు, ద్రష్టయాత్ముడు, నిత్యపరిపూర్ణుడు, స్వయంప్రకాశకుడేయైనను విను. ఒకధనవంతుడొకడే జబ్బుతో నొకమూల నింటియందు పడియుండ, నెవరో రాత్రివేళ తలుపు తట్టినట్లాయనా పరుగెత్తిపోయిచూడ నెవ్వరుండరు. నాలుగైదు తడవ లిట్లయినది. కారణమేమందువు? తలుపు నెవరైనా తట్టిరా? లేదు. నాలుగైదుదఫాలు లేచిపోయి చూచివచ్చేకార్యము దేనివల్లనైనది చెప్పు? తుదకు నా మనస్సేనని నిబ్బరముగనుండ నే చప్పుడులేదు. మొదటిభ్రాంతి తన్నివర్తికే తానే కారణము. అదే యవిద్య. నిజము విచారించితే తానే నప్పుడేదిలేదు. ఈప్రకారమే నవిద్యతో ననాత్మలగు దేహేంద్రియ సంఘాత

సంబంధమునకు గుణములవలన లోగబడి సుఖదుఃఖమోహశోకకారణములగు ను త్తమాధమ మధ్యమజన్మములను నొందుచుండును. ఒక జన్మము తోనేగాక పెక్కు లోకాంతరగమనము జేయువలసివచ్చుటయుగలదు. వ్రణబాధ, ఋణబాధ, శత్రుబాధ, యాగ్నిబాధ, దరిద్రబాధల భంగి గుణసంకరమువలనగలిగే తాదాత్మ్యము నెంత విచారించినను చేదరించి ముంచిముంచి లేవనెత్తుచుండును. ఒక్కొక్క గుణమునకుగల స్వభావ ములను పూర్తిగ తెలిసి లేనిబాధను. తాదాత్మ్యమువలననే గలిగినట్లున్న దని యర్థమైనంతనే నా గుణదోషములు తన్నంటవు. శమంతకమణి కేగి నపుడు గుహలో జాంబవంతునితో కృష్ణుడెన్నిదినములో పోర జాంబ వంతు డీయన హరియని తెలియలేడాయెను. తెలిసినంతనే తన ప్రయాస వ్యర్థమని తోచెను. అడవియందు నభిమన్యునితో బెనగిన ఘటోత్క చుడు, సౌగంధికపుష్పముల కరుగునపుడు భీమాంజనేయులకు, కౌరవ పాండవులకు యుద్ధమారంభము కాకమునుపు కర్ణ పాండవులకున్న స్థితు లనాదులనియు, నవిద్యాసంబంధగుణవికారము లేయనియు దానసర్వానర్థక ములు వాటిల్లు నట్లుండునుగాని యథార్థమెఱిగినంతనే వృథాయాసమని యనుకొందురు. మిథ్యాభావము గోచరించును.

ప్ర॥ గుణములు మూడంటిరి. అవి యొక్కొక్కటి నే స్వభావముగల వని? ఎట్లు వదలవచ్చు? అందుకు భగవంతు డందించిన ఉపాయమేమి?

ఉ॥ 5 నుండి 18 వ శ్లోకము వఱకు గుణములు బంధించురీతి జెప్ప బడెను. గాంధీజీ చిన్నతనమున చీకటి యనిన వెఱచువాడు. తల్లి యేదో పనిమీద గాఢమగు చీకటిలో బొమ్మన, నమ్మా! నేబోను, నాకు భయ మనెను. తల్లి నవ్వి లోనికి బిలిచి యా చీకటికి భయపడని యుపాయ మంత్ర మొకటిచెప్ప నాయన చీకటిని గెలిచెను. మఱికొందరు లైటు చేతనుంచుకొని వెళ్లుదురు. మఱికొందఱు చీకటి తొలగువఱకు వేచియుండి వెళ్లుదురు. మఱొకరి సహాయమున కొందరు చీకటిలో సంచరింతురు. కొందఱెల్లప్పుడు చీకటిలోనే యుందురు. "సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః" సత్త్వరజోతమోగుణములు, ప్రకృతిస్వభావములు, వానిచే మూడులోకములు, సృష్టిస్థితిలయములు, నొక్కొక్క శరీర మున బాల్యయౌవన వార్ధక్యములు, జాగ్రత్స్వప్నసుషుప్తులు, మనోబుద్ధి

యహంకారముల, కర్తకర్మక్రియల, నుత్తమమధ్యమ నధమకార్యముల, వాతపిత్తశ్లేష్మముల భంగి, నధ్యాత్మ మధిభూత మధిదైవికముల, నీషణత్రయముల సుఖదుఃఖమోహకారణములఁజేయుచుండును. ఆత్మ యసంగుఁడే. పైనజెప్పిన చీకటినిబాయు నుపాయముల భంగి, నీ యజ్ఞానగుణవివర్ధన మొకటి, జాగ్రత పగలునొకటి, రాత్రివెన్నెల స్వప్నము నొకటి, సుషుప్తి వంటి చీకటిగలిగించు సమిష్టి వ్యష్టుల బంధము గల్గించుచున్నవి. అంటే నవి వాని స్వభావము. ఆత్మను బంధించవలెనని బంధించుటయుకాదు. అవి జడములు. బంధించవలెననేది తమకు తెలియదు. వానిని యంటించు కొనటము బంధము. వాని స్వభావములు తెలిసి యుదాసీనుడైన వాని నేమిజేయలేవు. వాని జయించినవారి సహాయముతోగాని, భగవద్భక్తి చేతగాని, జ్ఞానమను లైటువలనగాని వానినుండి తప్పించుకొనవచ్చు. అసలజ్ఞానము, దానిగుణములు, గుణకార్యములు జడములు. వీని కెందు స్థానములేదు. ఆత్మాశ్రయత్వముననే వీనికి వికాసము. ఆత్మ తన్ను తెలిసి కొనినా, యజ్ఞానమే లేదు; వీని కార్యములే యుండవు. జ్ఞానమున వానికి వికాసమే లేదు. కర్తృత్వము లేదా యభిమానముంటేనే యవి పెంపు; లేదా వాని జాడయే యుండదు. వానిని మీరు దయ, నీశ్వరదయ, భక్తి యిత్యాదిసహాయముల నపేక్షించిన, సాగనంపువానివలె కొంతవఱకు వచ్చిపోవును. కల్లు, భంగి, సారాయి, విషము మొదలగువాని కేమి తెలియును? నవి జడములు. కాని వానిని సేవించిన నా గుణవికారముల జూపించును. సేవించినవాడు తనస్వభావమే యనుకొనును. తదితరులు నితడు మంచివాడే, త్రాగినదాన క్రిందుమీదు మాట్లాడునందురు. లేత తీగెకు నొక యాధారము. నీటికి ప్రవహించ పల్లము. వృక్షము వ్యాపింప బయలు. అగ్నిమండుటకు సమిధలు. బండి లాగుటకు నెద్దు. వృద్ధాప్యమున చేతికఱ్ఱయుండిననే నడువగలడు. వీనికిప్రతి, దానికి నాధారముండవలె. లేనిచో వాని వికాసమునకు ప్రయోజనముండదు. వానికి నాధారమైన వస్తువు, నాధేయవస్తువు, గుణము తనయందారోపించుకొనుటకు నా గుణములే కారణములు. జాలరివాడు మత్స్యముల, వ్యాధుడు మృగపక్షుల, వేశ్య యువకపురుషుల తమసత్వగుణమనే సుఖమును, జ్ఞానమనే తంతును

లాగినంతనే వారనే జీవులు నంజు తగులొందురు. కనురెప్ప గొట్టులోపల విశ్వమును మార్పగల నఘటనఘటనాపటీయసమునగు, నచింత్యప్రజ్ఞావిలాసినియగు ప్రకృతిప్రవర్తన, కుమ్మరిసారె, గానుగరీతి, రంగులరాట్నము వగిది దిరదిర తిరుగుటలో నొకప్పుడు సత్వ, మొకప్పుడు రజ, మొకప్పుడు తమస్సు, వేఱొకపుడు మూడు మిశ్రమమై రంగులుగల రబ్బరుచెండు యీ రంగుతో దొరలుచున్నదనుటకు వచింపరానట్లు ప్రకృతి శాసించుచుండును.

ప్ర॥ సత్వగుణమును వివరింపుడి ?

ఉ॥ "తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశకమనామయమ్" జ్ఞానాభిమానము నొకచో తన్ను గౌరవించి పాదసేవలు, పండ్లు, బహుమానములు, మహాత్ముడని బొగడినంతనే గలుగు నల్పసుఖమునకు గర్వపడును. ఇకను కొంచెము విశేషము గల్గిన నావలె సౌఖ్యదాయి యెవడనుకొనును. పరుగెత్తెడి రైలు నొకేచోట నిలువదు. తన స్టేషను వచ్చినంతనే ప్రయాణీకుడు దిగును. సత్వగుణకార్యము ముగిసినది, బండి దిగినావు. మూటే ముల్లె నొకచోట బెట్టుకొనుటలో ప్రాణము విసిగినది. కూలీ కూలీ యన్నావు. కూలివాడు రాగానే నొక క్షణము సంతసము, వెంటనే దిగులు. ఎంతడుగునో! బేరములో గీచులాట, కోపము, తిరస్కారము, నట్టహాసము, నేనిచ్చెదింతే, నేనింతైతేనే మోసెదనని వాడు. రాకపోతే క్రోధముతో, పౌరుషముతో మోసికొనుచు పాడుబరువు యెవరు లేరైరి యని సణుగుకొనుచు నిల్లుజేర, నెదురొచ్చి మూటె ముల్లె తీసుకొనిరా సంతోషము; వాకిలి బిగించి యెవరు పలుకరైరా, నార్భాటము. ఈ రీతి యేయొకని జీవితము జూచిన కొంత సుఖము, కొంత ద్వేషము, మోహము నిత్యదాయకములుగానున్నవి. చనిపోతే వీని బాధ తొలగిపోవునేమొ యనుకొంటే నీ వాసనలనే త్రాళ్లతోనే బంధింపబడి, సుఖసంబంధమైన జ్ఞానవంతుడు, సుఖవంతుడు నిర్మలురనే పోలీసులచే గొనిపోబడును.

ప్ర॥ జ్ఞానాసక్తి, సుఖాసక్తి మంచిదేకదా. ఇది యేల బంధించును?

ఉ॥ ఒకనికి మంచిది, గ్రుడ్డిది, చెవిటిది ముగ్గురు భార్యలైన, ముగ్గురతోను చావే. బండికి నొకటి గంగెద్దు, నొకటి గానుగెద్దు, నొకటి మంచ

దైన కష్టమే. గానుగెద్దు గిట్టిన తిరిగితే, గంగెద్దు యింటింట నాగితే, మంచెద్దు పోనాగితే ప్రయాణమెట్లగును? అన్నిటిని వదలి జింకను సాకెను గదా జడభరతుడు. సత్వగుణ మేమొనర్చెను? వదలినానన్న యభిమాన మున్నదంటే మూటిలో నేదొక్కటి యుండినా తక్కినవి మరల నావిర్భవించును. "యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి" ఛాం॥ సనత్కుమారుడు నారదునితోననెను. సుఖేచ్ఛకై విషయముల నార్జింపవలె వాని సంయోగమువలన గలిగే సుఖమూ, నల్పము. "సుఖమల్పం బహు క్లేశః" సుఖమేమో క్షణికము, నా క్షణికసుఖమునకు బహుళ ప్రయాస పడవలె. సుఖముకొరకై వివిధోపాయములగు ప్రవృత్తుల ప్రవర్తింతురు. "యదర్థం సర్వం యచ్చ నానార్థం తత్సుఖమ్" సుఖ ప్రవృత్తులే జీవులెల్లరు. సుఖమెట్లుండునో యనుభవమొకింత తెలుపండన్న, తటపటాయింపబడుటగలదు. మౌనము వహింతురు. ఏ ప్రవృత్తి, యే సమయమున, నేయుపాయమున గలిగినను సుఖముకొరకే. సుఖము ప్రాప్తవస్తువా? ప్రాప్యవస్తువా? యని యెఱుగనంతవఱకు సత్వగుణ రాపిడి సుఖం, సుఖమ్మని యనిపించును. ఇంతలో నెప్పుడు వచ్చునో, రజోగుణము పగలుబో, తాను వచ్చు చీకటివగిది వచ్చును. సుఖాభిలాషకు రజోగుణము నాశ్రయించవలె. రజోగుణమువచ్చినా, సుఖమును దూరమొనర్చి తానే దాని స్థలము నాక్రమించును. సత్వమును వదలవలె, తదాసక్తి వలదు.

ప్ర॥ పూర్ణసుఖ మేలాగు నుండును?

ఉ॥ గుణత్రయములు మూడు లేనిది, ప్రతిబంధకములు లేనిది, యే యవస్థలు యే గొడవలు లేనిది, పెండ్లి కానిదానివంటిది. పున్నపుంసకస్త్రీత్వములు కానిది. పగలు చీకటి వెన్నెలలు లేనిది. నేను, నీవు, యది యను కర్తృత్వభోక్తృత్వాద్యభిమానములు లేనిది. జ్ఞాతృజ్ఞానజ్ఞేయములను త్రిపుటి, యిచ్ఛానిచ్ఛాపరేచ్ఛలను ప్రారబ్ధములు లేనిది. కాలత్రయాబాధితమైనది. జడములగు విషయములకు, నింద్రియములకు గలిగే సంయోగమువలన గలిగే నా యల్పసుఖము కాదు. అసలా సుఖము విషయములది కాదు. హృదయగుహాయందున్న యానంద రసము విషయేంద్రియసంయోగమున నాక్షణము సుఖముగల్గి, వాని

వియోగమున నది తొలగిపోవును. నిదురలో గలిగే యానందమునకు నేవిషయములున్నవి? నిదురించే దేహమునకు నింద్రియములు, విషయములు సమీపమున యుండనీ యప్పుడేల యానందము గలుగకూడదు? జాగ్రతలో కానీగాక, యానందము లేదు. సదా ప్రాప్తము తన యాత్మ. అద్దమునకు చేతికి కన్నులకు సంయోగమైనపు డద్దమున దోచు ప్రతిబింబము, నీటికి కన్నులకు సంయోగ మగునపు డగుపించు ప్రతిబింబము తనదే. అట్లే సంయోగమున కనిపించు సుఖలేశము సదా ప్రాప్తమైన యాత్మానందరసమే. జ్ఞానాసక్తి యనగా యాత్మ యానందమయమని బోధించే జ్ఞానాసక్తికంటే యన్యములగు తర్క మీమాంస యిత్యాది శాస్త్రజ్ఞానము, వీనిని చదివిచదివి, వినివిని, తర్కబుద్ధి యహంకారము గల్గించి బంధమున ముంచును. యథార్థజ్ఞానమునకు సాధన తత్వమస్యాది మహావాక్యమే యగును. సత్వగుణముగాదు జ్ఞానమును గల్గించునది. మఱియు సత్వగుణమున దేవ మానవ పశు పక్ష్యాది స్థావరముల సత్వగుణాభివృద్ధి గోచరించును. మూత మూయబడని ఘటమున నున్న దీపము వెలుగు లోపల వెలుపల ప్రకాశిల్లును. దేవతలీస్వభావము గలవారే. మానవులవలన యజ్ఞముల హవ్యకవ్యముల గొని, మన యభీప్సితముల దీర్తురు. దేశములకు నరిష్ట మొనరించు దైత్య దానవులను, తమచేత గాకపోతే వారిని ప్రోత్సహించి నిగ్రహింపజేసి లోకోపద్రవము దప్పింతురు. ఆరాధించినవారికి నభీప్సితము లొసంగుదురు. మానవులలో నుత్తములే సాత్త్వికగుణము గలవారు. నిరంతరము దైవకార్యములు, యిష్టా, పూర్త, దత్తకర్మల శాస్త్రవిధి ననుసరించి యాచరింతురు.

ప్ర॥ ఇష్టా పూర్త దత్తకర్మలంటే నేమి?

ఉ॥ కర్మలు వైదికములని, లౌకికములని రెండువిధములు. వీనినే ప్రవృత్తినివృత్తికర్మలనిగూడ యందురు. శరీరరక్షణార్థము చేయబడేవి లౌకికములు. వేదములచే జెప్పబడినవి వైదికములు. వైదికకర్మలే నిష్టా పూర్త దత్తములని మూడువిధములు; శ్రౌతస్మార్తములు. సత్వగుణవంతు లీకర్మల నొనర్చు స్వభావము గలిగియుందురు. మఱియు పెక్కువశలొనర్చి దేశముల విజ్ఞానాభివృద్ధి గావింతురు. నిరత సత్పురుషుల

సేవ, సత్యవాక్కు- లలవాటు గల్గియుందురు. ఒకప్పుడు శ్రీకృష్ణుడు ధర్మజ దుర్యోధను లిద్దరిని ధర్మజునితో నసత్యవంతుని, దుర్యోధనునితో సత్యవంతుని తోడితెమ్మన, ధర్మజు డసత్యవంతుడు లేనేలేడనియు, దుర్యోధనుడు సత్యవంతుడు లేనలేడనియు వచ్చిరి. చూచితివా ధర్మజుని సత్యము! శిథిలములైన లోకహిత గ్రంథముల ముద్ర వేయించుట, నవ్యనాగరికతకు సంబంధించి ప్రజోపకారకములగు గ్రంథముల నచ్చొత్తించుట, శిథిలములగు దేవస్థానముల, శిథిలములగు బీదజనగృహముల తయారుచేయింతురు. శ్రద్ధాశక్తి సాత్త్వికులు గల్గి గ్రంథముల పఠింతురు. సత్పురుషులచే సద్గోష్ఠి జేయుచుందురు. సదాచారము, విచారశీలత, తత్త్వజిజ్ఞాసత్వము, చక్కని యారోగ్యము, సత్సంతోషము, సద్ధర్మము, సత్కృప, సవినయము, సయుక్తము, సచ్ఛాంతి, సదాశుభ, దైవ పితృ మాతృ గురుభక్తి, సభ్యత్వము, హర్షము, చిరునవ్వు, స్మితవదనము, క్లుప్తసంభాషణ, నిత్యతృప్తి, దుష్టులలో గలిసినను తమసత్త్వము వారికి నలవాటు గలిగించటము, నే దేశమున నే కాలమున నెందున్న నా దేశములకు నా కాలస్థులకు క్షేమమే. పాండవు లజ్ఞాతవాసమున నుంట కనుగొనవలెనంటే, నందుకు గుర్తులు భారతమున చెప్పబడినవి. పశుసమృద్ధి, పాడిసమృద్ధి, పంటసమృద్ధి, వృక్ష పక్షి మృగముల వృద్ధి, మనుజులకు నాయురారోగ్యమైశ్వర్య నిత్యసంతోషము, ప్రజాసమృద్ధి, వర్షసమృద్ధి కూప తటాక వాపీ నదీత్యాదుల జలసమృద్ధి, యనిష్టదోషనివృత్తి, పుణ్యకార్యములు, పుణ్యాత్ముల సంఘములు విపులముగా వారున్నచోట నుండు ననిరి. విరాటపట్టణ మట్లుండుటచేతనే నందుందురని దుర్యోధనాదు లనుమానించిరి. ఆ విరాటపర్వము నేటికి వర్షారిష్టకాలమున ప్రతిచోట నియమముగా చదివింతురు. ఏకాంతో వర్షము వచ్చుచునేయున్నది. అడవి నున్న, జనపదముననున్న, నేకాంతమున నున్న, ధనధాన్యాది సమృద్ధితో గాని, పేదత్వముతోగాని, వసంతఋతువువలె, మార్గశిరమాసముభంగి, విభూతియోగమున జెప్పిన భగవద్విభూతులన్నియును, మఱియు రజోగుణ మెన్నడైన, తమోగుణ మెన్నడైన ప్రకోపించినను, నాగుణములు గలవారలతో గలిసినను, వెతలకైన నోర్చి, వారొనరించు నపకారములకు ప్రతి యొనరింపక నుపకార మొనర్తురు. చేసినమేలు చెప్పకొనరు.

ఆడంబరమునకు, గౌరవప్రతిష్ఠలకు, నితరుల ప్రేరణలకు నెన్నడు లొంగరు. మేఘముల జూచి నెమళ్లు నాట్యమాడుభంగి, సేవకుల గాంచి వెన్నంటు గండుతుమ్మెదలకేరు, తీపును గని బారులువెట్టు చీమలవిధము, వర్షమును జూచి మొక్క లెగబ్రాకురీతి లోకము సత్వగుణుల జూచి యానందింతురు. వారు లోకమును గని సేవింతురు. హృదయమున వ్యథ యనున దెన్నడు రానియ్యరు. సత్వగుణ మున్నచోట నరకము స్వర్గమే యగును. సత్వగుణవంతులు చలిపందిరి, చల్లని నీడగల చెట్లు, ధర్మశాలలు, దానకర్ణులు, చీకటికి వెలుతురువంటివారు. ఒక పట్టణమున నైదార్గురు బిడ్డలతో కడుపేదలగు భార్యాభర్తలు నివసించుచుండిరి. ప్రతిదినము కొండకు బోయి నొక మోపు కట్టెల గొట్టి మగడు తెచ్చి యమ్మినడబ్బుతో జీవించెడివారు. భర్తయొక్కడే కట్టెలకు జనును. బిడ్డల, నింటిపనుల భార్య చూచుకొనును. ఏమి దొరకనిదినముల నాలుమగ లుపవసించుట పెక్కుమార్లైనది. ఒకదినము కొండకుపోయి కట్టెల గొట్ట మగ డుపక్రమించినంతనే వర్షము ప్రారంభించి సాయంత్రమువర కాగకపోయెను. ఆ వర్షములో నొక పాడు దుర్గాలయమువద్ద తలదాచుకొని 'యీరోజు నాబిడ్డలు పస్తుగదా' యని వచ్చుచుండ, నాతని ముందర మామూలు కూలినాణెములు టంగుమని పడ, నాతడు 'దుర్గాదేవి యిచ్చియుండవచ్చు, కట్టెల రేపు నెక్కువకొట్టి యమ్మవారి బాకీ తీర్చవచ్చు' నను లెక్కతో దాని గొనిపోయి కాలము గడిపి, మరునాడు మామూలుగా కొండకు రా, వర్షము విడువక కురువసాగెను. 'అహా! అప్పుచేయని దినములనైన రాపైతివే వర్షమా! మా పాపఫలమా! కాలమా! యెన్నడైన నీడొక్క బెట్టుకొనుము. మమ్ము మలమల మాడించెదవేల? గొనిపొమ్ము నందఱ' ని యేమి దోచక నెక్కడ నిలువ స్థలములేక, దుర్గ గుడివెనుక నిలిచి బాకీ తీరుటెట్లని చింతించుచుండ, మామూలు కూలినాణెము ముందర పడ, నమ్మా! నీబాకి దీర్చలేనని పోవుచు 'రెండు దినము లుపవసించితినైన తీర్పలేమా' యను ధీమాతో గొనిపోయి నాదినకాలము గడిపి, మరుదినము కొండెక్కక మునుపే వర్షము ప్రారంభించి సాయంత్రమువఱకు నిలువదాయెను. అతడు దుర్గగుడివద్దకు పోవ యనుమానించుచు నొక చెట్టుమొదట

నిలబడి, 'మహాప్రాణము గొనిపోవ వచ్చితివి. కాలమా! దాగక వచ్చుచున్నావు. గొనిపొమ్ము. నీతో నా వెతలన్ని దీరిపోవును. కాని అమ్మగారి బాకీ కేమి జెప్పుదు? నమ్మకస్తుడని యడుగక మునుపే నిచ్చిన మహాతల్లి బాకి దీర్చి చచ్చిన మేలు' అని యనుకొంటూ, బాకీ బాకీ యని యెద గొట్టుకొనుచు నింటిముఖముబట్టి, నొక మణిహారము నతని ముంగిలబడ, నెగిసి నావంటి దుర్మతికన్న స్త్రీయైనా జూడక పోసాగెను. కారుణ్యమూర్తియగు నంబ మనుష్యభాషల, 'నరే! నిస్స్వార్థా! నిర్మోహా! దైవబాంధవా! ఆగుమాగుమన, 'నన్ను దప్పుగొని యెగురవేయుట, యొకటికి రెండు నెగ వ్రాయుట, పరుల సొత్తపహరించుట నా జీవితమున నెఱుగ. బొందిలో ప్రాణము లున్న నీ బాకి తీర్చి చచ్చెదను. శక్తిని జూడక నమ్మి నీయకు తల్లీ' యని ముందుకు సాగ, నామెయే వచ్చి రెట్టబట్టి యాపి, నీ హారమును గొనుమన, నేనీ బాకీ తీర్చలేననెను. 'నాయనా! ధన రాజ్య సంపదగర్వమున నున్మత్తులైన ప్రజాపరిపీడితులగు దుష్టాత్ములకు దర్శన మొసగుదానను గాను. నిను మెచ్చితి గొను' మన్న, చేతులెత్తి నమస్కరించి 'దేవుడిచ్చిన దేహేంద్రియములుండ కష్టమున జీవింతునుగాని సోమరిని, కపటిని, మందునిగాని నాకేల నీ హార' మన, భవాని 'ఓయీ! దీని నీ వమ్మవలదు. నీ యింట నుంచి పూజింపు; నీ దినకూలిచ్చును. నిన్ను మెచ్చి యిచ్చినది వలదనవ'ద్దన నీ దినకూలి దానము చేసి, నా దినకూలితో బ్రతికెద తెమ్మని గొనిపోయి నదేవిధము జేయుచుండెను. భవానీదేవి సంతసించి వేఱొక వర మడుగుమన, 'తల్లీ! బ్రతికినంతకాల మొకరిని యాచించకుండ తనువు కోరుపెట్టియైనా నితరులకుపకార మొనర్చులాగున దృఢము సన్నగిలకుండ వరమిమ్మనెను. తథాస్తని యామె అదృశ్యమాయెను. సాత్త్విక మెందున్న నాజీవుని శాంత సముద్రముగా తయారుచేయును. దైవమును దూరెనా? తన కెవరు సాహాయ్య మొనరింపరైరని వగచెనా? దూషించెనా? దిగులొందెనా? లేదు. రజోగుణవంతులైతే నెంతెంత యాగడ మొనరింతురు! వివాహములు జేసుకొని, ననేక సంతానములు గని, నిర్దయుడగు దేవు డిందర నేల యీయవలెనని, వారి పోషణకు ననేకుల ప్రాణముల దీయుదురు. హారము దొరికిన దిక పనిచేయుటేల యని మానెనా? లేదు. మఱి

యెట్లు విహరించుచుండిన కూలి పచ్చునుగదా యను గర్వము, దంభము, సంతసము గాని నొందజాలడు. విభీషణుడు రావణునకు నెన్ని బుద్ధులు చెప్పిన వినక కాలసన్న, యన్నను వదలి రాముని శరణు జొచ్చి చిరంజీవి యయ్యెను. భక్తుడు, యోగి, త్యాగి, నిష్కామకర్మి, జ్ఞాని, దేశసేవకత్వము, దేశోద్ధారకులు కాబోయిన సత్త్వగుణములు వారిని యాశ్రయించియుండును. కన్నులకు కనపడునవి, చెవులకు వినబడునవి, మనస్సున దలచునవి, కాయముతో జేయునవి, నోట మాటాడునవి తనకుగాని, తనవారికిగాని, యితరులకుగాని హాని గల్గేవిగా నుండవు. జ్ఞానేంద్రియ కర్మేంద్రియ నంతరేంద్రియముల భావక్రియలన్నియు పరోపకారములుగానె యుండును. ఇంద్రియమనోదేహముల వశమొనర్చుకొని, పావనగంగ, కల్పతరువు, చింతామణివలె నభయులై యుందురు. రజో గుణ తమోగుణములతో నెక్కుడు ప్రపంచము తుఫానురీతి, కలవు కాటకములు, యుద్ధములు, బద్ధద్వేషములు, క్రూరవంచకములచే తారుమారగుచుండినను, తమ స్థైర్యమును గోలుపోరు. సత్వగుణముగల యేనుగు, నొంటె, జింక, గుఱ్ఱము, నావు, నుడుత, కుక్క, వృషభము, హంస, నెమలి, చిలుక, పావురము, గోరువంక, కోయిల, కోళ్లు మానవులలో కలసిమెలసి యుంటున్నవి. శివవాహనము వృషభము, కుమారుని వాహనము నెమలి, హంస బ్రహ్మవాహనమని వినమా. శ్రేష్ఠములు శ్రేష్ఠులనే జెందును. ఒకరికి నపాయ మొనర్చుటయే యెఱుగవు. మానవులకే నుపకారమొనర్చుచున్నవి. కోడి కాలజ్ఞానము, కుక్క విషయ జ్ఞానము, చీమ దివ్యజ్ఞానము, పక్షులు స్పర్శజ్ఞానము గలవి. స్థావరముల లోను చందన, మామిడి, యరటి, పుష్పజాతులు, తీగజాతులు సత్త్వ గుణవంతములే ననవచ్చు. సాత్త్వికజీవులు స్థావరజంగమముల బెంపొంది ననే సకలజీవులకు సుఖదాయకము. తేనె, చెఱకురసము, గుడము, ద్రాక్ష, ఖర్జూరాదులరీతి, సత్వగుణప్రక్రియలన్ని యెుకప్పుడు గాకున్న నొకప్పుడైన రజోగుణ తమోగుణులకుగూడ సుగమదాయకములై కన వచ్చును. కీర్తి తనంతట దిశలు ప్రాకును.

ప్ర॥ సత్వగుణ మొక్కటే యుండిన యెడ స్వర్గమే యగును. ఆ ప్రకృతికేల తక్కిన రెండుగుణము లట్టిపెట్టియున్నవి? రజోగుణ మెట్టిది?

ఉ॥ "రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్" ఎల్లప్పుడు విషయవాసనలచే లిప్తమైయుండును. జీవుల దీనిని పోషింపగా, యగ్నిలో నెయ్యివేసిన ప్రబలమగుభంగి, విషము ప్రాకిన తలకెక్కురీతి, తేలు కుట్టిన బాధ మొదలైనగతి, కొలకుల రోగము వచ్చినా కొంచెము కొంచెము శరీరము తెగదినుపగిది, తీగ నొకదానినంటి ప్రాకుగతి, వాసనలు విషయభోగములవంకకు నీడ్చును. వెడదైన నావ్రల వెన్నంటు కోడెలు తోకలెత్తి పరుగెత్తువిధము, తోకద్రొక్కబడ కొట్టి ఫణములెత్తు విషసర్పములభంగి, వేసంగిరా మలమలమాడ్చ నెండించు సూర్యకిరణములవిధము, పగలుజన రాత్రించరులు పయనమౌపగిది, వసంతఋతువును దూషించుచు వచ్చు గ్రీష్మఋతు గాడ్పులవలె, యవ్వనముజన వేచియున్న జరయను చండరక్కసి శరీర మాక్రమించుపగిది, నియమము దప్పిన నాక్రమింప వేచిన శనిభంగి రజోగుణము బయలుదేరును. దశకంధరుడన్న దశేంద్రియముల దశదిశల తన్నే కలయజూచి భోగలంపటనొనర్చు రజోగుణమే, "నాదుశ్చరితాన్నావిరతః" పరిమితిలేని యాశ, వివిధములగు కర్మములం దాసక్తి గలిగించి, యనేకములగు ఫలముల బొందవలెనను యుద్దేశ్యము జీవుని పురికొల్పుచు బంధించును. పెద్ద పర్వతములనుండి జారిన గుండ్లు దిశలు మార్మ్రోయ శబ్దముచేయుచు తక్కిన చిన్నరాళ్ల నుగ్గుచేసుకుంటు, నల్పజంతువుల బలిగొనుచు, కొన్ని మృగపశువులకు వెఱపు గల్గింపుచు, పాంథులకు భయదాయకమై వడివడిగా వచ్చురీతి, పర్వతములనుండి పల్లములకు బారు నీరు కాలువలుగా చుట్టు దిరుగుచు నెంత యురవడితో వచ్చునో, మేఘ మాకసమున దట్టమైనప్పుడు సాగిన యొత్తు గాలియై ధూళిసమారముతో నంతరిక్షమున నడ్డులేక వీచుచు, మేఘముల నట్టిట్టు గదలించి పరుగిడ దూదివలె లేచిపోవజేయుచు, ప్రాకుల మొదళ్లతోగూడ గూలగూల్చుచు, బీదసాదల పూరిగుడిసెల నేలమట్ట మొనరించుచు, మార్గమధ్యమున జిక్కిన పాంథుల నెట్టి

వేయుచు, పెడత్రోవల బట్టించుచు, నిర్మల కమలాకరముల కలంకము కల్గ చెత్తచెదారముల నింపుచు, ఘూర్ణిళ్లో దళపెళల గాన్పింపకుండజేయుచు, నదులలోని పడవల నొడ్డగిల జలతరంగంబు లుప్పరంబున కెగయ దారి తప్పించి కొట్టుకొనిపోజేయుచు, కిఱ్ఱుకిఱ్ఱుమను మ్రాకుల రాపుశబ్దంబులతో, పక్షులు దెసచెడి పలవించెడి నాలాపములతో, బస్సబస్సని మ్రోయు సహజశబ్దంబుతో, మిన్ను మన్నొకటి జేయుచు, దిక్కుల తేరిపార జూడరాని భయకంపితగమనమైన వాయువుభంగి, కామ క్రోధ లోభ మోహ మద మత్సరములను జలచరముల, కోరికెలను యలల, సందేహములను సుడుల, త్రాగరాని యుప్పాతనముగల సముద్రముభంగి హృదయముతో బయలుదేఱు రజోగుణము కోరికెలపై కోరిక లుప్పొళ్లార, ననుభవించుటకు నారాటపడుచు, తమసుఖమునకై నెంత పెద్ద సమాజములనైన, నెంతమతము లెంతదేశములనైన, నెట్టివారినైన నెదిరించిన పడనడపుచు, బలవంతముననగాని, మోసమున క్రూరమున వంచకమున మఱేవిధముననైన హతమార్చుటయు, పరిభవించుటయు, భయకంపితులనొనర్చుటయు, నాస్తులువగైరాల నపహరించుటయు, ననాథుల బీడించుటయు, పారద్రోలుటయు, పిండిపిప్పిచేయుటయు, పేరుయూరు లేకుండ నొనర్చుటయు, నధిగమించినవారిపై ద్వేషాట్టహాసము జేయుటయు, ననుకూలురయెడ ప్రియత్వము, దంభ దర్ప పారుష్యాహంకారముల, బద్ధస్పర్ధాసూయాధర్మములతో లోకభయంకరమై తన కండఱు వశులై యుండవలె, తానన్నదె చెల్లవలె, చూచినది విన్నది పలికినది తలంచినది చేయునది యూహించునది యెట్టిదైన నందఱు మంచిదనవలె. పేరు ప్రఖ్యాతులు తనకే రావలె, తమతమ డబ్బులతో తామే శ్రామికులై యొనరించిన తనపేరే ముందుండవలె, తన్నే బాగడవలె, తనసరి యనేమాట విన సహింపుండదు. అడవిజంతువులకు పక్షులకు స్థావరములకు బాధయే. కొట్టు, గాల్చు, నఱకు యనుచుండుటయే పని. ఇంటనున్న, నూరనున్న, నడవియందున్న, వెలుపలనున్న, తక్కిన ప్రాణులకందఱకు భయమే. అందుకే భగవంతుడు దైవాసురసంపద్విభాగయోగమున చెప్పియేయున్నాడు. సత్వ రజో తమో గుణవంతుల దైవీభాగము నాసురీభాగమని, యహిరావణ మహిరావణ రావణ కుంభకర్ణ శిశు

పాల దంతవక్త్ర కంస జరాసంధాది పాత్రలు దుర్యోధనాదులు మనలోనే శాశ్వతులై కలిసిపోయినారు. వారుండిరో లేదో మనకేల? వారి గుణములు మనకున్నవా, లేదా, చూచుకోవలె. ఇటువంటివా రొక్కరా యిద్దరా, భూదేవి యెందఱ జూచినదో! నెందఱ మోసినదో! నెన్ని పాపుల గన్నదో! వీరివలన నెగులు దిగులు విహ్వలతతో జీవచ్ఛవములై నుండ, పవిత్రముల నపవిత్రము లొనర్పటము, దేవకార్యముల నడ్డగించుచు, ధిక్కరించుచు, దేవుళ్లనే యెత్తివేయుచు, తలలు చేతులు విఱుగ జేయుచు, దేవాదాయముల దిగమ్రింగుచు, దేవతల సొత్తుల నపహరించుచు, దేవస్థలముల నిల్లుకట్టుచు, దేవభక్తుల దూషించుచు, సోదర మానవుల తనవలె జూడక, పరోపద్రవకార్యము లదేపనిగా జేయుచు, నెంతపాపమైన తనదే నంచు బల్కుచు, కారణములేకనే నసూయచే కార్పణ్యము గల్గించుకొనుచు, చౌర్యము నీచము జంతుబలి పేకాట చిత్తాట నీచాతినీచకార్యము లొనరించుచు, కుటిలాత్ములకు దుర్మార్గులకు దోహద మొసగుచు, చెడ్డను మంచిగా నిరూపించుచు, మాటలగాని, చేతలగాని, మానసికముగగాని పుణ్యమనునది యొకటియైన చేయక, పుణ్యస్త్రీల నవమానించటము, బలాత్కరించటము, ఘాతుకమృగములగు చిఱుతపులి మున్నగు క్రూరమృగములు, కనపడిన నల్పజంతువులనెల్ల చంపుపగిది, నాదాయము వచ్చునంటే నెట్టికృత్యములకైన దొడంగుచు, నాస్తికుడుగ దేవుడు లేడనిపించుచు, కొక్కోకాది శాస్త్రముల జదివి, మనోహర కామభోగము లనుభవించుచు భోగముమేళముల మద్యమాంసయుక్తాహారముల మెక్కుచు, జీవహింస చేయని సమయమే యుండకుండును. తనవలె తక్కినమానవుల తయారుచేయుటము, తనకెందు నెదురు లేదనిపించుకోవటము, ఎఱ్ఱనువేసి చేపను బట్టినపగిది నధుగకనే కొన్ని వస్తువుల నిచ్చి, యిచ్చినవస్తువులకు వడ్డిని బెంచి, వారి రక్తనాళముల రక్తమును బీల్చి, నిలువున నెండించును. కఠోరవాక్యముల నితరుల నిందించుచు, నసత్యము, నసంబద్ధప్రలాపము లనర్థకములు, వ్యర్థములగు పనులు, కొలతల తూనికెల మోసము, నిచ్చినదొకటి యడుగునదొకటి, జ్ఞాపకమున్నవి లేనివి యడుగుట, నొకటాడిన కష్టమే, రెండాడిన ఘుషమే, నూరకున్న ఛావే, స్వార్థస్వజనార్థపిపాస, కూటసాక్ష్యముల

జెప్పుచు, దొమ్మీలు జపర్ద స్త్రీలు నాగడములు దురంతములు జలిసికొన, నెంతటి నెదిరిసైన లక్షింపక, పరపీడ్యమానంబగు జీవితంబును, పుణ్యపురుషుల నింద, పుణ్యకార్యముల పాల్గొనబోక, తమోగుణమును తోడు గోరు గాని సత్వగుణము నాశ్రయించటము లేదు. చేసినమేలు దలంచటము లేదు. ఏవస్తువు తనదిగానే యుండదలచును. తన్ను జూచిన, తనపేరు విన్న, లోకము వెఱచి పారిపోతే నున్నదంత తనదిగానే నుండగోరును. దుర్యోధను డెబ్బంగి నోర్పులేక పాండవుల కపకృతి గావించెను. అరయ మొసళ్లున్న చెఱువు, పాములున్న యిల్లు, శత్రులున్న బోను, పులులున్న గుహా, విషమున్న పదార్థము, దొంగలున్న రస్తా, దుర్మార్గుల సభ, కుత్సితుల స్నేహము, కృతఘ్నుల బంధుత్వమువంటివి రజోగుణప్రభుత్వము. సత్వగుణవంతులకు గూడ రానివి. మఱియు తలి తండ్రి గురు పెద్దలసేవ నేయనీయక బహుచింతలతో స్థిరబుద్ధిలేక చేసెడి కార్యము వదలి, నింకొక దాని వదలి, మఱొకటి జేయుచు, ప్రధానము హింస యసూయలను కవాటముల దెఱపించి, యహంకారసింహాసనమున గూర్చొని, యింద్రియ మంత్రుల విషయరాజ్య మనుభవింప గోరుదురు. రాముడు రావణున కేమొనర్చెను? కృష్ణబలరాములు కంసున కేమొనర్చిరి? నలుడు కలి కేమి యొనర్చె? హరిశ్చంద్రుడు విశ్వామిత్రున కేమి జేసె? ద్రౌపది యశ్వత్థామ కేమొనరించె? కారణము లేకనే నపకృతి యొనరింప, తారతమ్యము దోపనీయని రజోగుణముయొక్క వ్యవస్థ యిద్దియ. చిల్లులు పన్న పాత్రమున వెలుగు జ్యోతివలె సంపూర్ణముగా ప్రకాశించు జ్ఞానజ్యోతిగాక యజ్ఞానమున రజోగుణము మాధ్యందినమార్తాండునివలె లోకభీకరము స్వనాశకరము నీలక్షణములన్ని దానివే. యజ్ఞకర్మములందు తగులొకొన జేయును. గొప్పదన్నదంత కావింతమనును.

ప్ర॥ ఇక తమోగుణ మేరీతి యుండునో వివరింపుడి.

ఉ॥ "తమస్త్వజ్ఞానజం విద్ధి మోహానం సర్వదేహినాం" కొంచెముగా గనిపించు వెన్నెలసైతము గనిపింపకుండ జేయునో, మినుకుమినుకను దీపమునకు నుక్కుతెరవలె నడ్డము వచ్చునో, వయస్సు తగ్గుచుండగనే కన్నులకు చీకట్లెట్లు రాగలుగునో, నాతీరు జ్ఞానదృష్టికూడ మందగించునో,

సజ్ఞానమే తమమయముగా నుండునో, నవాలోచనకు మూలమంత్రియో, మూర్ఖత్వమనెడి భంగి ద్రాగించి తలత్రిప్పించునో, నెల్లప్రాణుల మోహ గ్రస్తుల జేయును. అలసత్వమును వర్షాగమమునకు పైరులు నిండినభంగి ప్రతియొకటి నష్టమే. అజాగ్రత, నిద్ర, సోమరితనముతో జడ్డుని జేయు జీవుని యొకప్పుడు రజోగుణమును గూడియుండును. ఒకప్పుడు సత్వ గుణమును గూడియుండును. మూతమూసిన పాత్రలో దీపమువలె జ్ఞాన ప్రకాశము కానిది, తమోగుణము నల్లని మేఘమువంటిది. దట్టమైన చీకటిలో నేవస్తువు కనిపింపదు. ఎటుబోవ దోచదు. ఎవరు కనిపింపరు. కనిపించిన భూతములో, దయ్యములో, పైశాచికములో మరేవో యని పించును. పిలచిన భయమే; తనకంతా నుపద్రవముగా గనిపించును. మోహము ప్రధానము తనకు నప్పుతమైనదే మరొకరు చెప్పిన విశ్వ-సించటము లేదు. యోచనాశక్తి యుండదు. ప్రారంభమున మధ్య యంత్యముల కార్యకార్యము విఘ్నమే, నష్టమే, ప్రతిష్ఠాభంగమే, దిగులే. శాస్త్రీయకార్యము లొప్పనీయదు. దాసరిపాము, కదలలేని యెద్దు, మొండి భిక్షకుడు, దీర్ఘజాడ్యము, వంజగొడ్డుకీతి నింటిగుట్టు బయట పెట్టడము, చెప్పినదే చెప్పుచుండటము, వినినదే వినుచుండటము, నెవరు బిలిచిన బలకటము లేక నవ్వటము, నెక్కిరించటము, నెప్పుడుజేయ వలసిన దప్పుడు చేయకపోవటము, తన పనివిడిచి మఱొకరిపని చేయ టము, వచ్చుచువచ్చుచు దారిలో నందఱితో ముచ్చటించుచు నుండ టము, నశుచియందు ప్రీతి, పరుల మాటలు పనికిమాలినవి వినటమున యిష్టము, పిలువకనే నితరుల బలకరించటము, తను మాటలాడినది తనకే నర్థము గాకపోవటము, నితరుల మాటలు తలకెక్కవు, నవి చెడ్డవి, పనులుమాని పొరుగిళ్లు తిరగటము, నేదోవిధము ప్రొద్దుపుచ్చటము, సిగ్గులేమి, నీచకార్యములకు పాల్పడటము, తప్పత్రాగి దొర్లటము, పెక్కుమార్లు కడుపెఱుంగక భుజించటము, నావలింపటము, నీల్గటము, నిలబడే తూగటము, రోగగ్రస్తము, నెప్పుడు వదరటము, కొట్టిన తిట్టిన శికలు బెట్టడము లేదా ఏమి తెలియకుండటము, చెప్పరానిది చెప్పవలసి నది తెలిసికోలేకపోవటము, బాహ్యశుచి లేదంతశ్శుచి లేదు. దైవశక్తి తక్కిన భక్తులు శూన్యము. మర్యాదంటే, పుణ్యమంటే, దానమంటే,

దానత్వమంటే తెలియకపోవటము, పనికెక్కక పోవటము, పరమలుబ్ధత్వము, నిల్లు వాకిలి, పిల్లపాపలనడలి నెంతైన నన్నోదకములు దొరుకుచున్నవంటే నెంతకాలమైన యుండడము, విలువకనే పోవటము, నడ్డమాటలు, పెంకెతనము, మొండిపట్టు, మంకుబుద్ధి, హీనకార్యము, మఱపు, కుంభకర్ణునివలె నతినిద్ర, యతిభోజనము, నింటా బయటా నంతా నశుచియే, నుచితానుచితముల ధ్యాసయే యుండదు. పతంగము కేవలము తన రెక్కలవల్లనే నడవి కంటుకొనిన యగ్నిని నార్పదలచినభంగి, బురదతోనే బురదబోవ తుడిచినరీతి, కుందేలు వెంటనంట కన్నులు మూసికొని నను కనుగొనలేరులే యనుకొనురీతి నేదైన దినును, మూగకుక్కవలె నుండును. ఒకడు గురూపదేశమై నిత్యము నుదయ సాయంతనముల నింటియందు కన్నులుమూసి ధ్యానమొనర్చుచుండ మూఢురాలగు భార్య నేదియో యొక రోగమని యెప్పుడు చచ్చునో యని కనపడినవారికెల్ల చెప్పుచుండును. కొద్దికాలమునకు నాతని ధ్యానము సిద్ధియై గోడకు నంటుకొని కూర్చుండి యుండటములో రాత్రినాలుగంటలగునప్పటికి చనిపోయినాడనియు, నీరోగము మొదటినుండి యుండెననియు, నీ రాత్రియే దహనము చేయించవలెనని ప్రలాపింప కొందఱియ్యకొని వచ్చిచూచి నిజమేనని, యాతడు పొడుగుగా నున్నాడు, ఇంటియావలికి గొనుపోవు టెట్లని వారాలోచించుచుండ, నామె యొక ఖడ్గమును దెచ్చి యిచ్చి, కడుపుపైన నుంచి మోకాళ్లవఱకు తెగనఱకండి, మరల నవలీలగ నీవల తేవచ్చునన, నామూర్ఖులట్లే చేయుచుండ, నాతనికి తెలివి వచ్చి కన్నులు విప్పి యిదియేమన వారురికిరి. ఈమె యందఱితో చచ్చినవాడు పలుకుచున్నాడు, భూతమో పిశాచమో చూతురు రండని యఱచెను. చూచితివా తమోగుణ మెంత యమాయికమై యజ్ఞానమయస్థితి నొనర్చుచున్నదో! తలలు విఱియబోసికొని నొకనియెదుట గూర్చొని తలలూపు గ్రహముగలవార మనువారు, నా గ్రహములు వీడిపించువారము, వీడిపింప ప్రయత్నించువారు నీ తమోగుణబంధువులే, తమోగుణగృహస్థులే. ఒక సోమరిపోతు తెలివిగల భార్య తెచ్చిన యాస్తితో బ్రతుకుచు వారమున కొకదినము గలవరమొచ్చెననియు, తనకు మంచితిండి పెట్టవలెనని చెప్ప, నామె పతిభక్తితో నట్లే చేయుచుండగ, కొద్దికాలమునకు

నీ పాదుకలవరకును బాగ ... , సేవంతకాల మొక్కనికి బెట్ట
గలశ్ర? నేసన్న్యసించెద ననుచుండెను. కొద్దికాలమునకు నామన విష
యము తెలిసి భార్య, సన్న్యసించితే నా నొక్కదాని నయ్యెదనే యని
సన్న్యసించవలదు, నీకేమి తలుపట్రకాశము జేసిపెట్టెదనని బెట్టుచుండ,
నాతడు పిల్లలనైన దలపక బొట్ట పిసుకొనుచుండెను. ఆమె యింటికి
రోజు నొక మహాత్ముడగు సన్న్యాసి భిక్షకు వచ్చుచుండ, నొకనా
డీ విషయము నాయనతో నామె జెప్ప, నామూర్ఖుడగు నలసుడగు
మగనికి తెలివి తెప్పింపదలచి, అమ్మా! ఇక నెప్పుడైనా నామాట
యనిన బొమ్మని తలుపు బిగించుమనెను. కొద్దిపాటికే మామూలుపాట
నే సన్న్యసించెదనన, వెళ్లుదని యామె యన, వెళ్లలే ననుకొంటివా?
యని బిగియగ వెళ్లి యా సన్న్యాసి యాశ్రమమే జేరెను. ఆ రాత్రికి
నతనికి పాపరకాయల వడ్డింపజేసెను. స్వామీ! తమశిష్యులు నాకు పాపర
కాయ లొడ్డించి తామన్నము గుడుచుచుండిరన, "నాయనా! క్రొత్తగా
సన్న్యసించువాడు వారముదినములు పాపరకాయలు దినవలెనన, పరుగెత్తి
యిల్లుజేరి భార్యతో నేనింక నెన్న దనను, సన్న్యాసమంటే సులభము
గాదని నాటినుండి నామె ననుసరించి జీవించెను. చూచితివా తమోగుణ
సన్న్యాసము! గ్రుడ్డివానిభంగి, కుటుంబము వదలని పాముభంగి భగవద్దూ
రులై పామరులై నిద్రలో జాగ్రత కార్యదక్షత లేనిదై యుండును.
ఒకచో నలుగురు తలలొకచో నుంచుకొని నిద్రించిరి. ఒకనికి నిద్రలో తల
నవ్వబెట్ట, మఱొకని తల గోక, వాడేమి నాతల గోకెనవన్న, మఱి నాదేది
యనువా డెట్టి మనుష్యుడో చూడుడు. కేవలము మాసిన యద్దమురీతి,
చిత్తము తేజోహీనమై నిరంతరము దుఃఖము, నష్టము, భయము, జడ్డు
తనము, కలను, జాగ్రత నెఱుగనితనము, కాలమును దేశమును వస్తువును
గ్రహించే శక్తి యీ గుణమున కుండదు. ఈ తమోగుణము పురుషుల
కుండెనా, వారు ప్రభువులైన, యజమానులైన, సేవకులైన దేశమునకు
గ్రామమునకు నింటికి ముప్పుతప్పదు. తప్పత్రాగినవాని గుణమెట్టిదో,
నీగుణవంతుల ధర్మ మాపరిపాటియై యుండును. సభ్యత్వమునకు, సద్వ్యక్తి
మునకు, సత్క్రియకు, సత్ఫలమునకు దూరము, సంధవిశ్వాసము, ననర్థ
దాయకము.

ప్ర॥ అన్నన్నా! కారాగారమున నున్నవానివలె స్వేచ్ఛలేక నీ గుణత్రయమువల్ల జీవుడు పరతంత్రుడై యుండవలసినదేనా? వీనిని భేదించనిచో నేమిగతి?

ఉ॥ నదిని దాటనిచో, పరీక్షలో నెగ్గనిచో, శత్రువుల గెలువనిచో, ఋణము తీర్చనిచో గలిగెడి ఫలముపగిది, నీ గుణముల నతిక్రమించనిచో సుఖము లేదు. జన్మబంధము తప్పదు. గుణాతీతుడు సర్వస్వతంత్రుడై నారామాంతఃకరణుడై, బంధరహితుడై దిగంతముల కీర్తిపరుడై, నభయుడై ననంతానందము ననుభవింపగలడు. ఈ గుణములవలన గలిగే జనన మరణ సుఖదుఃఖములు పరిమితములు, నల్పములు, బుద్ధియూహా కందునవి. ప్రపంచమంతయు ప్రకృతిమయమే. ప్రకృతియందున్న జీవులు ప్రకృతిని ప్రతిఘటించితేనేగాని, లేనిచో నధోగతి పాలుజేయును. ప్రకృతిని వదలితే సరిపోదా? యంటే, వదలుట పోవుట యనునవి ప్రకృతిస్వభావములే. అనాదినుండి యవివేకముచే వెంటనంటినరీతి యున్నది. స్వప్నమున భయపడి గంతులు వేయుచు, నలుచుచు, చిడిముడిపడువానికి భయము దీర్పవలెనంటే, స్వప్నములోనివారే తీర్పలేరు. లేదా జాగ్రత్తలోనివారిని సహాయ మపేక్షింప, స్వప్నమునందగతి వారికి తెలియదు. తెలిపేవారు లేరు. పగటివారుండేది స్వప్నభయగ్రస్తునకు తెలియదు. ఏమిచేయవలె? అటువంటప్పుడు మెలకువ గలిగించిన లేక గలిగిన చాలు, భయము పోయినది. కలయంతా నసృతమనుకున్నాడు. అజ్ఞాననిదురలో దోచే జగద్భ్రాంతిలోని యనర్థకములు తొలగ సత్యగురువు, సత్యశాస్త్రములు మెలకువ గలిగించితే చాలు, యీ ప్రకృతినుండి బయటపడగలరు. ప్రాతిభాసిక, వ్యావహారిక, పారమార్థికములను త్రిసత్తాలతో పారమార్థికము తెలియబడేవఱకు వ్యావహారికప్రపంచసత్తా తొలగదు. దేశములు పెక్కు తిరిగిన, క్రొత్తక్రొత్తవిషయము లనేకము గనిపెట్టిన, నెన్ని యుద్ధముల జయముగొన్న, వింతోపన్యాసముల జెప్పిన, నాస్తికుడనినా యాస్తికుడనినా, ధర్మము లెన్ని చెప్పగలిగిన, వింతమాటల ననగలిగిన, వేదాధ్యయనము లొనర్చిన, నెన్నిబిరుదు లెంతకీర్తి నొందిన, నెన్ని యుత్సవము లెన్ని గౌరవములైన పొందగలము. లేదా ధర్మమనుపేర నధర్మ దోపిడీలు చేయగలము. ఏ ప్రాతవిరోధా వదలి నే క్రొత్తవిరోధా చేయగలము.

అష్టావధాన శతావధానముల, నింద్రజాల మహేంద్రజాలాది చతుష్షష్టి కళల, చతుర్దశవిద్యల, షడంగములతో సహా నేర్వగలము, చేయగలము, చెప్పగలము. కొన్ని కొన్ని బహిస్సిద్ధుల బాహ్యక్రియల నొనర్పగలము. కాని తపవును సదా నుండ నిల్పుకో సాధ్యము కాదు. దుఃఖము లేకుండ, రోగము రాకుండ, చావకుండనుండ, భయపడకుండ నుండలేము. అవియన్ని ప్రకృతిపోకలేకాని ప్రకృత్యాతీతమగు పరమగతి కాదు. ప్రకృతి యంటే నేమో యెఱుగకపోవుటచేతనే భగవంతు డీయధ్యాయమును ప్రకృతిస్వభావము త్రిగుణములు యీ గుణస్వభావములను విభాగించి, యాత్మ నీ గుణవికారములు కలవాడో లేడో తెలుసుకొని గుణముల ధర్మముల కట్టుబడక స్వేచ్ఛగ సుఖముగ నుండ వీనిని విభాగించి చూపించెను. మహద్బ్రహ్మమను బిరుదు మాయకు తగిలించెను. వేదములు వర్ణించునది గుణత్రయములనే త్రిగుణముల కార్యమే సంసారము. ఆసంసారమును మఱింత వృద్ధిపఱుపగలవు వేదములు. కర్మఫలకాముకులు కర్మానుష్ఠాన మొనరించి, సంసారమున బద్ధులయ్యెదరు. ఈ సంసారమునకు చావుపుట్టుకలు, సుఖదుఃఖములు, బాధ్యతాబాధ్యతలు, సంపద్విపత్తులు, జయాపజయములు, వార్ధక్యయవ్వనములు, పరస్పర వ్యావర్తకములైన ద్వంద్వాలు నీడలవంటివి, ప్రకృతికల్పనలే. ఈ కల్పనల గ్రహింపక వ్యక్తికి వ్యక్తికి, జాతికి జాతికి, మతానికి మతానికి, సంఘానికి సంఘానికి, వర్గానికి వర్గానికి తమ్ముతాము రక్షించుటకొఱకై పడే వ్యవస్థలు ప్రకృతి చిలిపిచేష్టలే. ఒకే యుద్దేశ్య మొకే రూపు నొకే ప్రాపుగల జీవులు నీలాగు పటాలుపటాలుగా నేర్పడినవంటే, మాయామహిమగాక మరేమి కద్దు? ఒక మహాత్మునివద్దకు నొక వ్యక్తి వచ్చి 'స్వామీ! నాకు శక్తి యుపాసన జెప్పుడు. అది నా వశమైతే నాకేకొదవ లుండవు. అందఱకంటె మహిమగలవాడను, భోక్తనయ్యెద'నన, 'నాయనా! శక్తిని మించగల శక్తిలేకుంటే నది నిన్నే జంపును, వలదన, వినకపోవ, తన్మంత్రమునుపాసనావిధానము జెప్ప, వెడలిపోయి ననుష్ఠింప, శక్తి ప్రత్యక్షమై నేమియాజ్ఞ? యాజ్ఞ నివ్వజాలవైతివా నీ పనిపట్టెద ననెను. దీనికి పని జెప్పలేనా? నాపనిబట్టేటుగ నేల జేసుకొనెదనని, యంతుపొంతులేని పాడవు

వైశల్యముగల నొక పట్టణము, అందు చక్కని బజార్లు, భోగేంద్ర దేవేంద్ర పట్టణములమించిన సౌందర్యాంతఃపురములు, ప్రజారోగ్యమగు రచ్చ పట్టులు, ప్రమదావనములు, కోటలు, కొత్తలంబులు, చెఱువులు, బావులు, కాలువలు మొదలగునవి నిర్మింపుమని, యివిచేయుటలోనే యెంతోకాలము బట్టదా! అప్పుడు మరల పనిజెప్పలేనా! యని చెప్పెను. ఒకగంటలో నా కార్యములు ముగించి, యావల నేమి యాజ్ఞ? యన, జేసిన పనియంతయు జూచి యాశ్చర్యముతో దిగులుపడి, దీనికేమిచెప్ప గలను? దీనినుపాసించకుండినను బాగుండునే, మరొక పని చెప్పిచూచెదనని యనుకొని, యిప్పుడే నీవు నిర్మించిన పట్టణమున నేయింటజూచిన సంతాన వంతులై తమతమ నిత్యకృత్యములతో జీవనధర్మములలో నెవరిపనులు వారొనరించుకుంటూ, పురుషులు, స్త్రీలు, బాలబాలికలు, గర్భవతులు, పురిటిగృహములు, పశుపక్ష్యాదుల నిర్మింపుమన, నొకక్షణములో తయా రొనరించి యేమి యాజ్ఞ యన, మఱొక పనిజెప్ప నదియొకగంటలో నొనర్చ, నికనన్ను దినకమానదని పరువెత్తి మంత్రముజెప్పిన మహాత్ముని పాదముల బడి రక్షింపుమన, యాయన నవ్వి దానికి తెలియకుండ నొక వంకర రబ్బరునిచ్చి దీనిని పొడవుజేయుమని చెప్పుమని యిచ్చిపంప, నతడాలాగు యొనర్చి చక్కగ పొడవుజేయుమని యాజ్ఞాపింప, నది యాలాగొనర్పలేక నతనివద్దకు రాకపోయెను. చూడు! ప్రకృతిని వశమొనర్చుకొన్న మహాత్ములుతప్ప తక్కినవారల నది మ్రింగివేయుచున్నది. సురాపానముతో యాదవులు నీల్గిరి. సుందోపసుందులు కామశక్తిచే మడిసిరి. ప్రకృతి వశాత్ములకు శాశ్వతసుఖము లేదు. అనంతకాలములో నొనర్పగల కార్యము నొకక్షణములో నొనర్పగలదు. అయినదాని నొకనిమిషములో హతమొనరించును. దానికంత యద్భుతశక్తి కలదు. దానిని జయించు నుపాయములే నీ యధ్యాయమున జెప్పబడినవి. ప్రకృతి యంటే మూడక్షరములుగాదు. సత్వ రజో తమోగుణయుతమైనది. మూడుగుణముల ముప్పిరి త్రాడు. 14 నుండి 18-వ శ్లోకము వఱకు గుణములు వృద్ధి నొందగలుగుస్థితిని ఫలమును తెల్పెను.

ప్ర॥ ఈ ప్రకృతిని జయముగొనుట యెట్లు?

ఉ॥ భగవంతుని యధీనములోనిది యగుట భగవంతుని ప్రార్థించితే వారల నీయది యేమిచేయలేదు. రబ్బరును పొడవు చేయుమనుట యేమి, దాని స్వభావమునకు విరుద్ధమైన భగవచ్చింతనలో నుంచిన వికసించలేక మడియగలదు. కఫ వాత పిత్తము లతిశయించ దేహమునకు గలిగెడి రోగబాధలభంగి నీగుణత్రయము లొకదానిమించి యొకటి విజృంభించినపుడు "యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రళయం యాతి దేహభృత్" తలక్రిందుల నొనర్చును. ఏతమువలె లోనినుండి వెలుపలికి, వెలుపలినుండి లోనికి, సత్త్వమమించిన సత్త్వగుణకార్యములు, తక్కినవి మించిన తక్కిన గుణముల కార్యము లొనర్చును.

ప్ర॥ దేహ మాత్మది కాదు. దేహమునకంటె నాత్మ వేఱు. అయినప్పు డీ దేహమును వదల జీవుడు వేఱైతే నీ బంధము తప్పునుగా? దేహములో నుండు టెందుకు?

ఉ॥ దేహము వదలిపోవ నాత్మ పరిచ్ఛిన్నవస్తువు కాదు. దేహమే యాత్మను, యాకసమును జుట్టిన కోటగోడవలె జుట్టుకొనియున్నది. వదలవలెననుట, వదలకూడదనుట ప్రకృతిస్వభావములు. ఆత్మ వ్యాపకవస్తువైనపుడు నీ గుణములబంధ మెట్లగునన్న, ప్రకృతిస్వభావములు గుణములు. ఆ గుణప్రభావములే నవ్యక్తావ్యక్తము లగుచుండును. ఆత్మ తన యథార్థమును మఱచి యీ దేహాత్మభావనతో గుణసంగియగును. వాని ధర్మములు తనయం దారోపించుకొనును. స్వర్గసంబంధమైన కార్యము లొనర్చి స్వర్గగమన మొనర్చుటము, స్వర్గముననుండటము, స్వర్గస్థులతో కలియుటము, మఱే లోకములకైన వెళ్లటము, నట గలిగిన భోగము లనుభవించటము, విధిశాస్త్రము విహితకర్మలవల్లనౌ గలుగునవి గుణసంబంధమే. పాపమునకు సంబంధించినవి యొనర్చి, పాపలోకము పాపాత్ములసంగమము నీ గుణసంబంధమే. నిదురించుచుంటి వప్పుడొక క్రొత్తదేశములో క్రొత్తపద్ధతులుగల చోట క్రొత్తవింత గనుచుంటివి. నిన్నుగని వారలు పరిహసించటము మర్యాదయొనర్చుటము జరిగినది. మెలకువ వచ్చినది. నీ వెక్కడ బోలేదు. పోని విషయ మపద్ధమా? నీకనుభవమున్నది. దేనిగుండా బోతివి? పోయినదెవరు? ఈ గమనాగమనములు నీగుణముల వికల్పములే. వాని వెన్నంటిపోయినట్లు నీ యాభాస

కమేకాని వేరుకాదు. ఆభాసకుడే లేదా పోవుటయు నుండుటయు నను వికారాస్పదగుణములే లేవు. దేహ మంత్యకాలమున నీ గుణములలో దేనికి సంబంధించి ప్రాణము వదలిన నాలోకము ప్రాప్తించగలదు.

ప్ర॥ దేహపతనము ప్రకృతివల్లనే గలుగ దుఃఖించు టెందుకు? జ్ఞానసిద్ధి లేనిచో నీలాగు గలుగుననెదరా?

ఉ॥ జ్ఞానసిద్ధి లేనిచో దుఃఖ మనివార్యమే. జ్ఞానసిద్ధిపొంది యీ గుణముల నంటనివారు యేసమయముననైన నొకతీరు నుందురు. జీసస్ తన దేహపతనమున దీనత బొందలేదు. మహాత్మాగాంధీ తన్ను గాల్చుచుండ, హేరామ్ హేరామ్ హేరామ్ యనెను కాని, అధైర్యమున భయముతో దుఃఖముతో విలపింపలేదు. గుణాతీతులకు గుణముల వికారము లెట్లంటును? ఎట్టి విపద్దశలు బ్రతికియుండగ వచ్చినను భరించగల వారికి మృత్యువు క్రొత్తయగునా? ఆత్మ దృక్కులగుట నిశ్చలురై యుండగలరు. ప్రకృతి వారి వశవర్తియై సంచరించును. దేహము నాది, దేహమే నేనను యభిమానాహంకారముల తుడిచిపెట్టిన పురుషులు, కృతకృత్యులు. బాడుగయింటివారు వదలమని యనకముందే వదలిన తగాదేమున్నది? ఇవ్వవలసినది యిచ్చిన, నంటిన విడువనిదాని తగులకపోయిన చింతేమున్నది? రుచియంటే నాలుక జాపుమంచనును. నాయంటే వెన్నంటును. నేనంటే నత్తికక్కును. జిగట తగిలితే విడువదు. కన్నులకు కనిపింపకపోయిన కనిపింపజేయునవి గుణములే. ఒకప్పు డెఱుపద్దములు, నొకప్పుడు నలుపద్దములు, నొకప్పుడు పసుపద్దములు కంటికి వేసికొనిన కనిపించేవన్ని నా యద్దములభాతి యగుపించును. అద్దములభంగి యొచ్చటి కరిగిన గనపడును. అద్దముల వదలితివా నీకా వింతలు లేవు. నీకొక కారు, నొక యెద్దులబండి, కొయిక గుఱ్ఱమున్నది. దేనిమీద గమనమొనర్చిన దానివలన గలిగెడు ఫలిత మనుభవింతువు. సత్త్వగుణము మాగిన పండు; రజోగుణము మాగీమాగని పండు; కచ్చఫలము తమోగుణము. సత్వగుణము పాలు; రజోగుణము కల్లు; తమోగుణము బురదనీరు. సత్వగుణము వృద్ధియగునప్పటికి చనిపోయిన నూర్ధ్వలోకము, రజోగుణమైన మధ్యలోకము, తమోగుణమైన నధమలోకము గల్గును. వ్రత

ములు, బంగారు లోకమున నున్న వానికా గౌరవమే, వెండి కంచు రాగికి తమ గౌరవమే, యినుమునకు నినుము గౌరవమే యుండును. వసంత ఋతువొచ్చినది, అందఱకు నాహ్లాదమే; గ్రీష్మమొచ్చినది యందఱకు భయమే; వర్షఋతువు రాగానే యంతయు నీటిమయమే. మూడు గుణముల తీరులివి. ఒకనికి నలుగురు పుత్రులు. ఒక డేదివలదని వనమున తపమొనరించుచు హాయిగా నుండెను. ఒకడు నియంత కావలెనని యందరతో పోటీలు పెట్టుకొని చావోడుల జీవితములో నుండెను. మఱొకడు సకలశాస్త్రములు జదివి పండితుడై తలిదండ్రి గురుసేవా రతుడై యుండెను. వేఱొక డెందుకు సమర్థతలేక నింటింట భిక్షమెత్తుచు దొరకనిదిన వస్తువస్తు లుండుచు, నెందైన దొంగిలించుచు జిక్కినచోట శిక్షింపబడుచుండెను. చూచితివా! గుణత్రయాతీతుడు తపస్వునకు, సత్త్వగుణుడు తలిదండ్రిసేవ, ధర్మాచరణ, మూడవవాడు భయదవిహారణమిది రజోగుణము. తమోగుణమే నాల్గవవాడు. జ్ఞానసిద్ధులు "మాయామాత్రమిదం ద్వైతం వికల్పో న హి వస్తుతః" మాయయు దానికార్యమసత్యమని తెలిసేవరకు "ద్వైతమివ భవతి" నానావిధములుగా దోచుచుండును. తోచుటయే బంధము.

ప్ర॥ ఇట్టి మాయ నసత్యమనుటెట్లు? కనిపించుచున్నదికదా?

ఉ॥ "ప్రాగభావో నానుభూతశ్చేత్సిత్యా తతశ్చితిః। ద్వైతస్య ప్రాగభావస్తు చైతన్యేనానుభూయతే" పరమాత్మ ప్రాగభావము నెవ్వరిచేత ననుభవింపబడలేదు. కనుక నిది నిత్యము సత్యము. ద్వైతమగు మాయయొక్క ప్రాగభావము సుషుప్తికాలమున సాక్షిచైతన్యముతో ననుభవింపబడుచున్నది. కాన దానికి మిథ్యాత్వము చెప్పబడినది. పూర్వము లేనిది, యునికి లేనిది, నిన్ను మఱచితే గలిగేది, నిన్ను జూచితే లేదు. నిన్ను మఱచేదే మాయ. దానికార్యమే జగత్తు. నీవు జూచిన కనిపించుచున్నది. సుషుప్తి, ప్రళయము, జ్ఞానపరమావధి సమాధియందేల నుండరాదు? షోడశవికారములు మాయయే. ఆ వికారము లేనిస్థితి నీయది. నేను నీకు జెప్పుచున్నాను. నీవు వింటుంటివి. నే జెప్పుదానియందేకాగ్రము గలిగిన నీబుద్ధికి నావలివిషయము తెలియునా? తెలియదు. పోనీ నే నొకనియునే భావమైన యున్నదా? లేదు. నీవు నేనై నావు.

నేనొక్కనితప్ప నీతో ప్రపంచము లేదు. నీగ నీవుతప్ప నాతో ప్రపంచము లేదు. మిథ్యకాగా, మనస్సుండిన ప్రపంచమున్నది.

ప్ర॥ ఆహా! ఇప్పుడు విశదమైనది. త్రిగుణయుక్తమగు నంతఃకరణమే బంధము.

ఉ॥ ఒక గోడకు నలుపు, తెలుపు, ఎఱుపు రంగులువేసితే, రంగుల సంబంధముతో గోడ దానిచే బాధింపబడకపోయినను, తనయందు దధ్యస్తమైన రంగులతో రంగులగోడ యనిపించుచున్నది. గుణములతో గూడిన జీవుడు గోడవలె గుణములచే గట్టబడినరీతి యుండుచున్నాడు. ఒక గుణముపోయి మఱొకగుణము రాగా వానిచే బంధింపబడిన ట్లనుకొనుచున్నాడు. ఒకటి పోయి యొకటి రావటమున్నప్పుడు నవియేకదా అని యతములు. ఆ గుణముతో జీవుడు బోయెనని చెప్పుటకదా? లేదు. ఒకగుణముతో బోతే మరొకగుణము వచ్చుటకు నునికి యేది? పోయిన జీవుడు రావటమెలా యగును? పోయినవానికి ముందు విషయము లెట్లు తెలియును? లైటునకుండు మూడువన్నెలు తిరుగుచున్న నా జ్యోతి యేకరూప మొందును. ద్రౌపది యొకతెయే. ఎవనివద్ద నున్నప్పు డతని భార్య యనిపించుకొనుచున్నది. రావణ కుంభకర్ణ విభీషణులు, హిరణ్యాక్ష హిరణ్యకశిప ప్రహ్లాదు లీ మూడుగుణములే.

ప్ర॥ వారధియంటే నేమి యనెదరు?

ఉ॥ జననమరణరూప సంసారమనే సాగరమున నిష్కామకర్మ నిష్కామోపాసనలే వారధి.

ప్ర॥ వానరు లనగా నెవరు?

ఉ॥ సాధనలగు సత్వగుణధర్మములు.

ప్ర॥ అశోకవన మెయ్యది? సీత యెవరు?

ఉ॥ శోకసంబంధమగు వాసనలు లేనిది, "త్రివిధదుఃఖం" త్రివిధ తాపత్రయములు లేని హృదయమే అశోకవనము. శాంతమె సీత, శోకములేని స్థలమున నుండును. "రామ ఏవ పరబ్రహ్మ" పరబ్రహ్మమే నాత్మారాముడు. ప్రపంచమను పంచవటియందు నవిద్యయనే లేడివల్ల, దేహము నేననుకొనుటయే శాంతమగు సీతను మఱచటము. రజోగుణ

మనే రావణుడు సీతయందే శాంతము బొందదలచటము. ఒణుకుచు చేయి సూదికి బార మెక్కించలేనిభంగి, సత్త్వగుణాతీతుడు గానివానికి శాంత మబ్బదు. ఆ యాత్మారాముని తెలియకుండ నీగుణములు మూడు వంచించుచుండును. ఫలశ్రుతి క్లుప్తముగ భగవంతు డెఱిగించెను. ఈ దేహము నాత్మకు భోగాయతనము. ఎప్పు డింద్రియములు విషయ ప్రవృత్తుల నొందక జ్ఞానము నొందినవగుచున్నవో, అప్పుడు సత్త్వగుణము వృద్ధియైనదని తెలియవలెను. ఎంతధనము లభించినను ప్రవృత్తి పనుల మాననిది రజోగుణ మభివృద్ధియనియు, అవివేకత, కర్తవ్యభ్రష్టత, మిథ్యాభినివేశము, నిరాశాపూరితము, నిట్టూర్పు, వెనుకముందు జూచుట, ఏమి తోచకపోవుట, పరిభ్రమ, గుండెదడ, శరీరము వణకు, పెదవు లదరటము, మాట రాజాలకపోవటము, గ్రుడ్లు త్రిప్పటము, తల కంపించటము, యోచన దొర్లకపోవట మభివృద్ధియైనను, మలమూత్ర ములు తమంత స్రవించిన తమోగుణమని తెలియవలె. సత్త్వవృద్ధికాల మున మరణించిన హిరణ్యగర్భాది నుపాసకులకు లభించు దేవతాలోక ముల బొందుట, రజోగుణవృద్ధికాలమున మరణించిన కర్మాసక్తమగు మనుష్యలోకమున తమోగుణవృద్ధికాలమున మరణించిన పశ్వాది మూఢ యోనుల బుట్టెదరని భగవంతు డర్జునునితో జెప్పెను. సత్త్వగుణ రజోగుణ తమోగుణఫలములు వింటివిగదా! జ్ఞానము జెప్పేదేమిలేదు. గుణము లిట్టివి. నీవిట్టివాడవని వివరించినది. ఆవల నీయిష్టము. ఇదిగో నిది బంగారు. ఇది తక్కిన వెండి, రాగి, సీసముల గలిసెనా, దానివెల, దాని కాంతి, దానిగొప్ప యుండదు. ఆ టంకమును మరల ద్రావకముతో తీసివేసిన తాను బంగారే. వానిలో గలియకపోతే కఱిగించి ద్రావకము వేయవలసిన పనిలేదు. నీవు ఉత్తమకులుడవు, నాకలి గొంటివి. నీవారెవరు లేరు. నిబ్బరము లేదు. ఆకలి దీర్చుకోదలచితే నీచకులుర యింట నీవారగించితివా, ప్రాయశ్చిత్తముతో పవిత్రుడవయ్యెదవు. తద్రీతి గుణరహితుండగు సచ్చిదానందపరబ్రహ్మ తాను నీ మాయాగుణముల బంధింపబడినట్లు స్వర్గ మర్త్య పాతాళలోకములకు వీని నంటిపోయినట్లు పోబోయినరీతి, భ్రాంతి శాస్త్ర గురు సజ్జనుల యాప్తవాక్యమున ప్రాయ శ్చిత్తమన నీవీ గుణములు కాదని తెలియుటే జ్ఞానము జెప్పునది. వానిని

పోకవలదనియు వాని దోషముల నశిమానిపవలెను, నీవు వేఱుయని పలుమారు తెలుపుదు. ఒకనికి ముగ్గురు భార్యలు. వాడు దూరదేశము పోయివచ్చి యిల్లు చేరినాడు. రాత్రి యొకభార్యవద్దకు పోబోవ దాని చలి ఆమె బయట చేరెననెను. రెండవభార్యవద్దకఱుగ బాలింత యనిరి. మూడవభార్య నడుగ జాడ్యగ్రస్తురాలనిరి. కానిలే యని గవయ యుత్తము దరుగనా? అరుగడు. తాను పోవలసిన నొక పట్టణమునకు నొక త్రోవ యగడ్త, నొక త్రోవ క్రూరమృగములు, నొక త్రోవ దొంగలని తెలిసి నతడెందు కా త్రోవన బోవును? పోయెనా, ఫల మనుభవింపగలడు. కావున సత్త్వగుణము సుఖము, రాజసము కర్మఫలము, తామసము దుఃఖము. సత్త్వము జ్ఞానము, రజస్సు లోభము, తమస్సు యవివేకము. సాత్త్వికులు మనుష్యగంధర్వాది లోకములనుండి సత్యలోకమువఱకు, రాజసికులు మనుష్యలోకము, తామసికులు నధోలోకముల కరుగుదు రనెను. 19 నుండి 20 శ్లో॥ వఱకు గుణాతీతుడు ముక్తుడని తెలిపెను. “నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి” “గుణానేతాన తీత్య త్రీన్దేహీ దేహసముద్భవాన్” ఈ మూడుగుణములు దేహమును నిమిత్తముగా జేసుకొని తమతమ సామర్థ్యమును చూపించుననుసంగతి వింటివికదా! నిర్గుణుడైన యాత్మసన్నిధానమున నీగుణములు తమస్వభావ ముల ప్రవర్తించినను నాత్మకేమి న్యూనత లేదు. ఆకసమునకు గాని, సూర్యునకుగాని, పగలుగాని, రేయిగాని, మానవ మృగ పశ్వాదులు పాపమునుకొనునవి, న్యూనతలనునవి, పుణ్యములనునవి యొనర్చినను వానికేమి లేదు. ఈ త్రివిధకర్మల నవి యంటవు. ఆత్మయు నదేరీతి వీని యంటడు. ఈ రహస్యము నెఱింగి “అహం బ్రహ్మాఽస్మి” “శివోఽహం” ‘సోఽహం’ మను పీఠమై కూర్చొని స్వప్నజాగ్రత్సుషుప్తులులేక సాక్షివై యుండుటే నీ నిజధర్మము. అహంకారపీఠమున నెన్నడు కూర్చొనకుము. మూడుగుణముల స్థానమది. అప్పుడా గుణముల ననుసరింపవలె. నీవపుడు నేనుసాక్షిని, త్రిగుణాతీతుని, యవస్థాత్రయవిలక్షణుని “అహమస్మి సదా భామ కదాచిన్నాఽహమప్రియః। బ్రహ్మైవాహమతస్సిద్ధం సచ్చిదానంద లక్షణమ్” అహంకారములకు సాక్షిని, సద్రూప చిద్రూప స్వప్నసాక్షిని, యజ్ఞానసాక్షిని యని పలుకుచుండుము. మఱియు కర్మలోపము నాయందు

గలుగదు. నేను ప్రకటమగుటవలన గుణములు ప్రకాశిల్లుచున్నవి. నావల్లనే వానికి సామర్థ్యము గలుగుచున్నది. నిశ్చేష్టముగ గుణములు లేనప్పుడుండునవి నేనేనైయున్నాను అని యీరీతి వివేకబుద్ధి గలవాడు గుణముల కావలనున్నగతి నొందును. గుణముల నన్నింటిని నతిక్రమించిన వాడు స్వతంత్రతను పూర్తిగా నెఱుగును. అతనిపై జ్ఞానముద్ర వేయ బడియుండును. శ్రీరామరక్ష యనునది కట్టబడును. భగవంతు డట్టి వాడు నాతో సమానుడనెను. పంజరమునను న్న చిలుక తప్పించుకొన్న రీతి, గుణత్రయ పంజరమును నతిక్రమించిన జీవుడు దేవుడే; జీవుడుగాడు. సముద్రమున నలలవంటి జీవులు సముద్రము కన్నను వేఱుకాదు. జీవదేవులు వేఱుకాదు. గుణదోషమే యిట్లొనర్చినది. చంద్రుడు నీరునంటనిభంగి, యాకసమునకు దుమ్మంటనిపగిది, నీటి కళుచి యంటనిరీతి, దేహేంద్రియ గుణాతీతుడు దానియందున్నను నంటడు. ఎలుగును, కోతిని బట్టి నాడించి జీవించువారిరీతి, గుణములు జీవుని తమ్మభిమానించిన నాడింప గలవు. జలపూరితమైన ఘటముమీఁద నుచ్ఛస్థానమునుండి యొక పెద్ద రాయి యొకేతూరి పడిన నపుడొకేక్షణమున ఘటము శతధా చూర్ణమై నీళ్లు పారిపోయి భూమి యార్ద్రమగుచున్నది. ఈ సంగతి చెప్పువానికి చెప్పుటకు మూడుక్షణములైన కావలెను. కాని ఘటభంగము, జల ప్రసారణము, భూమ్యార్ద్రత యను నీమూడు వ్యవహారము లొకేక్షణమున నగుచున్నవి. అచ్చట మూడువ్యవహారములకొఱకు మూడు క్షణములయొక్క ప్రత్యేకత యావశ్యకత లేదు. 'అహం బ్రహ్మాస్మి' యను నీ చరమవృత్తియొక్క పర్యవసానమం దుదయించిన సాక్షాత్కార రూపమైన నిర్వికల్పసమాధియొక్క నుదయము, స్థితి, కారణాజ్ఞానమైన యావరణముయొక్క భంగము నన (యత్యంతనివృత్తి) యజ్ఞానకార్యమైన సకలప్రపంచముయొక్క యత్యంతనివృత్తి, బ్రహ్మసాక్షాత్కారము, జీవన్ముక్తి యీ యన్నివ్యవహారములు నొకేక్షణమునందు గలుగుచున్నవి. వానికి యనేకక్షణములయొక్క యావశ్యకత యవసరములేదు.

ప్ర॥ అర్జును డేమి యడుగలేదా?

ఉ॥ అడుగకేమి? గుణాతీతుని లక్షణము లెట్లుండునని "కైర్లింగై

స్త్రీన్గుణానేతానతీతో భవతి ప్రభో" గుణముల నతిక్రమించినవాని యాచరణ లీరీతి యుండునని యడిగెను.

ప్ర॥ భగవంతు డందుకు గుణాతీతుని లక్షణములు జెప్పెనా?

ఉ॥ 21 నుండి 25 శ్లో॥ వఱకు "ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ। న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి" గుణముల నతిక్రమించుట, గుణవిలక్షణముగ నుండుట మహాదాశ్చర్యకరము. ఏలాగు సూర్యుడు ప్రాతఃకాల, మధ్యాహ్న, సాయంకాల భేదముల నొనర్చుచు, మూడుకాలముల నంటడో, నట్టి గుణాతీతునియందు జ్ఞానోత్పత్తి దొనర్చుటకు నితరుని జ్ఞానప్రకాశముతో నవసర మేమికలదు? రజోగుణప్రభావమువలన శరీరమున కర్మాంకురము లుద్భవించును. మఱియు జీవుడు ప్రవృత్తులచే ముట్టడింపబడినవాడగును. ఆ స్థితిలో కేవలము నేనే కర్మల నొనర్చుచున్నాననెడి యభిమాన మెవనిని తాకనైన తాకదో, కర్మఫలములు తమంతతాము వరించినను నపుంసకునివలె సిగ్గుచే నవని చిత్తముండునో, నొకవేళ సత్త్వగుణప్రకాశములగు స్తోత్ర పూజాభిషేక బహూకృత గౌరవాతిశయములు స్వర్గమునందలి బృహస్పతి స్థితి తన్నుపరివేష్టించినను శిలావిగ్రహముభంగి తమోగుణసంయుతమోహ లక్షణాదు లనుకరించిన గృహాకాశంబువలె నుండును. అద్దములో దోచిన వస్తువులు కదలుచున్న, కదలకున్న నద్దమునకు తెలియదు. అద్దము కదలుటలేదు. రైలులో గూర్చున్నవాడు కదలక మెదలకయుండినను నిరుపార్శ్వముల చెట్లు గుట్టలు భూమి పరుగెత్తుచుండును. నిజముగా పరుగెత్తునది బండి. కదలనివి వృక్షభూమ్యాదులు, బండిలోనివాడు. ఆ ప్రకారము శరీరమను బండిలోనున్న యాత్మారాముడు కదలడు, మెదలడు. కదలునది, నిలుచునది దేహము. తతిమ్మాప్రపంచము కదలినరీతి యున్నది. అదియు కదలుటలేదు. భూమి తిరుగుచున్న సూర్యుడు తిరుగు చున్నట్లున్నది వాస్తవమా? సూర్యుడు కదలడు మెదలడు. మేఘము యొక్క వేగముచే సూర్యుడుగాని, చంద్రుడుగాని పరుగెత్తినరీతి యుండును. సత్యముగా నవి కదలుటలేదు. చంద్రునకు వృద్ధిక్షీణములు భూమివలన గలుగుచున్నవి. ఆయనకు నాక్షీణవృద్ధులు లేవు. పైత్యాగిం

చినవానికి తానుండినస్థలము తనతో పైకి తిరిగినట్లు లేచినరీతి యుండును. తప్పత్రాగినవానికి తలక్రిందులుగ తోచును. త్రివిధరంగులుగల మూడద్దముల కిటికీవద్ద నిలిచినవాడు చూపరులకు రంగులరీతి నుండును. రాత్రించరులకు పగలు చీకటిగ నుండును. తద్విధమున భ్రాంతిచేత త్రివిధ పరిణామము లొంద, గుణంబుల దోచు సమస్తము గుణవికాసమేగాని తనకేమి లేదనియు, గుణములే లేకున్న విశ్వమే లేదు. ఏ రంగువద్దనున్న నారంగు తాదాత్మ్యముగలిగినభంగి, నేగుణము నభిమానించిన నా గుణ వికారంబు తనుగా నారోపించుట యజ్ఞానము; గుణరహితుడని యుండుట జ్ఞానము. సత్త్వగుణప్రకాశము, రజోగుణప్రవృత్తి, తమోగుణమోహములు తమంతట యవి యావిర్భవించి తిరోభావము లొందుచున్నను గుణాతీతుడు కాంక్షించుట, ద్వేషించుట, మోహించుట లేదు. పగలు, రాత్రి వెన్నెల లొచ్చిపోవుచున్నను, నాకసము నుండుపగిది గుణాతీతుడు నిర్మోహుడై, నిర్వికారుడై, నిశ్చలత నుండును. అవిద్యాపరుడైన నేను సుఖిని, దుఃఖితుని, మూఢుడయనుకొనును. జ్ఞాని విమర్శించి తన స్వభావములు గావని సాక్షిభూతుడై, నుదాసీనుడై, గుణకార్యములకు చలితుడు కాడు. స్వరూపమునుండి జారిక గుణములు స్వకార్యముల ప్రవర్తిల్లుచున్నవి. అవి నాకు దృశ్యములు. "ఘటద్రష్టా ఘటాద్భిన్నః దేహద్రష్టా తథా దేహో నాహమితి" నేను వీనికి ద్రష్టను, వీనితో నాకు నేకత్వము, ఘటమును తెలియువానిరీతి, నీ దేహేంద్రియాది స్వభావముల గుర్తెఱుగు ద్రష్టను. గడియారములోని పెద్దముల్లు చిన్నముల్లు నిమిషగంటల తెలుపుచున్నను, కీయిచ్చునది యుదాసీనముగ నున్న కనిపింపకుండ నుండువిధము, చక్రములు దిరుగుచున్నను బండి యిరుసు తిరుగనిరీతి, చుక్కానివలె, మచ్చురాయివలె, డాకలిరీతి, తిరుగలి క్రింది రాయి నడిమి గుంజభంగి, రైలుజంక్షనురీతి, రైలులోని పెట్టెలభంగి, సెనరు వచ్చికూర్చొని, తిరిగి దిగి పోవుచున్నను నొకరీతియుండుట, గానుగ భంగి, సముద్రునితీరు గుణాతీతుడు. సత్త్వ రజో తమోగుణములు వాని స్వభావములు. విషయములు నేకమై, యిచ్చవచ్చినరీతి చెలగినను నొకే రీతి నుండును. సుఖ దుఃఖ మోహాకారణములకు చలింపడు. మన్ను శిల బంగారములు నొకటిగా జూచును. మట్టియుండెట్టి యయిష్టమో, బంగారు

నందారీతి వర్తించును. ప్రియము నప్రియములు నొకటిగా జూచును. నిందా స్తుతులను సమదృష్టి నెంచును. మానావమానముల శత్రుమిత్రుల నొకే భంగి జూచును. దృష్టఫల, మదృష్టఫల, దృష్టాదృష్టఫలములం దిచ్ఛ లేనివాడు కర్మఃంగి గాడు, సాధకుడు గాడు, సాధ్యము గాడు, సాధనయు కాడు; గుణాతీతుడు. గుణాతీతుని వర్ణింప గుణసంగులకు కాదు. గుణాతీతులకు గుణములు లేవు. దేహము నింద్రియగుణములు గుణాతీతుని చలింపజేయలేవు. ఒకప్పుడు జనకుడు శుకుని 'నీవు వచ్చుదారిలో చక్కెరవనములు, చక్కెరమృగములు, చక్కెరమనుష్యుల జూడలేదా?' యన, నవి వేడికి కరిగి రూపుమాసి యుండును. నేను జూడలేదనెను. ప్రపంచము మిథ్యాదృష్టితో బ్రహ్మభావముతో నున్న మహాత్మునకు నవి యెట్లు గాన్పించును? అథవా గాన్పించిన నీవేడికి నవి కఱుగకెట్లు రూపముల నిలుచును? ఈ రీతి గుణాతీతుని లక్షణములు భగవంతుడు వినిపింప నర్జునుడు నాశ్చర్యముతో నివ్వెరగంది యూరకుండెను. చూచితివా! వింటివా! గుణాతీతుడు, గుణములు, ప్రకృతి, పరమాత్మల రహస్యము. తలిదండ్రు లివి యెఱిగింతురా? ఇవి బోధింతురా? మదాలసభంగి చిన్నతనముననే నీమందు యిచ్చియుండిన నీ భవరోగము తప్పియుండును. కృపామయుడగు జనార్దనుండు మన తండ్రి, మన తల్లి యగుటచే నిట్టి రహస్యంబు నెఱిగించి భవసాగరమున మునుగవలదనియు, గుణవేశ్యల పొందు జెందకుడనియు, అవిద్యానాటకమున కేగకుడనియు, మాయానిద్ర తూగకుడనియు, జాగ్రత స్వప్నసుషుప్తులుకాని యభయమందిరమే తమ నివాసమనియు, నదే మదీయరూపంబని వచించెను.

ప్ర॥ "యథా చ తత్త్రోభయథా" వద్రంగివలె జీవుడు కర్తగా నున్నట్లున్నాడేగాని నిజమున కర్తయుగాడు, భోక్తయుగాడు, నకర్తయని తెలిసెను. అర్జును డూరకున్న భగవంతు డేమనెను?

ఉ॥ స్మితవదనుడై 'ధనంజయా! కిరీటీ! శ్వేతవాహనా!' యని సంబోధింప నిరుత్తరుడై మూర్ధన్యములో మూర్ధన్యముజేర్చి నించుక నేవుండి చేతులు జోడించి గురుదేవుండగు త్రిలోకారాధ్యుని, సాక్షిచిన్మయునియం దేకీభావుడై యుండ భగవంతు డిట్లనెను. "చక్షుషో ద్రష్టా,

శ్రోత్రస్య ద్రష్టా, వాచో ద్రష్టా" విషయములకు నింద్రియములు ద్రష్టలు, నింద్రియములకు నాత్మ ద్రష్ట. గుణవిషయములకు గలిగే సంయోగవియోగములకు సాక్షి. వాని సంయోగవియోగములు లేవా, సాక్షిత్వము లేదు. 'తజ్జీవోపయంతి' ఆత్మనెఱిగినవా డాత్మయే అగును. "తదాత్మతత్త్వం ప్రసమీక్ష్య దేహీ ఏకః కృతార్థో భవతే వీతశోకః" ఆత్మతత్త్వము గాంచినవాడు శోకరహితుడై కృతార్థుడగును. "తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః" అద్వితీయమగు బ్రహ్మమును గాంచినవాని కచ్చట శోకమోహములు లేవు, గనిపింపవు.

ప్ర॥ గుణాతీతుని మొదటి పాపకర్మలు నంటవుకదా ?

ఉ॥ "తం విదిత్వా న లిప్యతే కర్మణా పాపకేన" ఆ యాత్మజ్ఞుని పాపకర్మలు నడుసు కమలమున కంటనిభంగి యంటవు. అతడు సిద్ధుడు.

ప్ర॥ గుణాతీతత్వము వివేకాది సాధనచతుష్టయములకంటె వేఱు మార్గమున బడయు తాడా ?

ఉ॥ సప్తమాధ్యాయమున "దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా" త్రిగుణయుతమగు నా మాయ దాట దుస్సాధ్యము. ఇతరసాధనముల్పై నాధారపడక నన్నే ఆశ్రయించితే భయము లేదనెను. అందుకై నిరువదియారవ శ్లోకమున "మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే" ఎవడు నాయందు నేకాంతమగు భక్తితో చిత్తమునుంచి,నన్ను సేవించునో నతడు గుణముల నతిక్రమించి బ్రహ్మము నొంద సమర్థుడగుననెను. చాతకము లెవనికొఱకు వేచియుండునో, కమలములు నెవ్వనిరాక గోరునో, రాధాగోపికలు నెవ్వనియందు రమింతురో, ఘనులు, మునులు, నాత్మలో క్రీడింతురో, వేదము లెవ్వని స్తుత్య గద్యములో, సకలశాస్త్రము లెవ్వనిముంగిల పండితులో, నా నారాయణుని యందు మనస్సుంచిన పరభయంబు పునర్జన్మహేతువు లేదు. "బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమమృతస్యావ్యయస్య చ। శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ" బ్రహ్మకు నర్థము నేను, మఱి యీ విధమగు శబ్దములన్నింటి యభిప్రాయము నేనే యగుదును. చంద్రుడు నతని మండలము వేఱుగానిరీతి, సూర్యుడు నతని కిరణములు, పాలు తన తెలుపు వేఱు

గానిభంగి, నేను బ్రహ్మము నొక్కటే, నణుమాత్రమైన భేదము లేదు. శాశ్వతము నచలము స్పష్టము ధర్మస్వరూపము నానందమయము నపారము నేకమేవాద్వితీయము, కోరికెలవిడి వివేకము దేనినందునో, జ్ఞానమునకు పరమావధియో, నదంతయు నేనే యని భగవంతు డర్జునునితో ఫలశ్రుతితో సహా జెప్పెను. ఈ మూడుగుణముల నతిక్రమించుటకు నైర్మల్యమగు భక్తి యొక్కటియే చాలు. తద్వారా బ్రహ్మము నొందవచ్చును. జనసామాన్యమునకు భక్తి సులభమార్గము కావున భగవంతు డీదారి జూపెను. ఆస్తికులగువారు భగవద్భక్తి బడసి గుణాతీతులగుదురుగాక !

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
గుణత్రయవిభాగయోగో నామ
చతుర్దశోఽధ్యాయః

★

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## పంచదశాధ్యాయము

### పురుషోత్తమప్రాప్తియోగము

---

చ॥ ధరణి కృతార్థులౌ జనులు తథ్యము సంసరణంబు బాయగా
గురుతరత్యాగమూర్తులయి గోప్యతరాతిరతత్వమంతయుఙ్
వరుస నెఱింగి భక్తిరతభాజనులై పురుషోత్తమున్సదా
నిరుపమసేవ జేయుచు మనీష వెలంగుట క్షేమమెయ్యెడిన్.

శ్లో॥ సిద్ధం బ్రహ్మణి సత్యత్వం జ్ఞానత్వం తు పురేరితం। స్వయమేవానుభూతిత్వాదిత్యాదివచనైః స్ఫుటమ్॥ బ్రహ్మ మబాధితమగుట సత్యత్వము సాధింబబడినది. జ్ఞానత్వము స్పష్టముగా జెప్పబడెను. బ్రహ్మ మబాధితము. శ్లో॥ న వ్యాపిత్వాద్దేశతోఽంతో నిత్యత్వాన్నాపి కాలతః। న వస్తుతోఽపి సార్వాత్మ్యాదానంత్యం బ్రహ్మణి త్రిధా॥ "నిత్యం విభుం, సర్వగతం" యనెడి శ్రుతిచేత దేశకృత పరిచ్ఛేదములేదు. 'నిత్యం నిత్యానా'మను శ్రుతిచేత కాలకృతపరిచ్ఛేదములేదు. 'సర్వం హ్యేత ద్బ్రహ్మ' యనెడి శ్రుతిచేత వస్తుకృతపరిచ్ఛేదము లేనిదే బ్రహ్మము.

ప్ర॥ ఈ యాధ్యాయమునకు పేరేమి?

ఉ॥ పురుషోత్తమప్రాప్తియోగము.

ప్ర॥ పురుషోత్తమప్రాప్తియోగ మననేమి?

ఉ॥ పురుషు డుత్తమపురుషుని బొందు నుపాయము తెలుపునది.

ప్ర॥ పురుషు డెవడు? ఉత్తమపురుషు డెవడు? తత్ప్రాప్తి యెట్లు?

ఉ॥ "పురి శయనాద్వా పురుషః" జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, పంచప్రాణములు, పంచతన్మాత్రలు, నవిద్య, కామము, కర్మ

యీా యెనిమిది పురీవములతో గూడి "పంచుశుకీతి రాజః" పురమనే శరీరము, సింద్రియముల రంజింపజేయువాడు. పురుషుడు వ్యక్తిగత శరీరాధికారి. పురుషుడన దేహముకాదు. ప్రతిశరీరమునయున్నవాడే పురుషుడు. క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగమున నన్వయవ్యతిరేకముల క్షేత్రజ్ఞ క్షేత్రములు వేరని తెలిపెను భగవంతుడు. ఆ క్షేత్రజ్ఞుడే పురుషుడు. "పూర్ణమనేన సర్వమితి పూరుషః" బ్రహ్మాండ మెవనివలన పూర్ణమై యున్నదో, నతడే పురుషోత్తముడు. జీవుని చరమలక్ష్యమదియే; నాయనను జీవుడనే పురుషుడు బొందే సాధనయే యోగము.

ప్ర॥ పురుషులన, స్త్రీలన వేఱుగానుండ, పురుషుడు వేరంటా రెందుకు ?

ఉ॥ ఇట్టి రహస్యమెఱుగకనే ననాదినుండి జడబుద్ధిచేత మానవులు తమ జీవితమునే వ్యర్థమొనర్చికొనిరని తెలియుచున్నది. "శీర్యతే ఇతి శరీరః" జీర్ణమగు శరీరము పురుషుడైన జన్మమరణాదు లెట్లు రాగలవు? శరీరములు వేఱు, పురుషుడు వేరు; నతడే యాత్మ.

ప్ర॥ పురుషోత్తము డెందుల నేరూపమున నుండును?

ఉ॥ ఆ రహస్యము వివరించునది యగుటచేతనే గుహ్యతమమగు శాస్త్రమని యంత్యశ్లోకమున జెప్పబడినది.

ప్ర॥ ఈ యాధ్యాయమునకు శ్లోకము లెన్ని?

ఉ॥ ఇరువది శ్లోకములుగల చిన్నయాధ్యాయము. పాలకడలియందమృతము బుట్టినభంగి, గీతాపాలకడలియందీ గుహ్యతమమగు నమృతము జనించినది. దేవు డెందుండునో, దేవుని యాకార మెట్టిదియో, నాయనను పొందుటెట్లో యని పెక్కుమతము లిందుకయ్యేబుట్టి తమలో తాము మత్సరవంతులై, పోటీలతో, స్పర్ధలతో నొకరుజెప్పిన దొకరికి గిట్టక, నీళ్లులేని కుంటయందు కొంగలు, నక్కలు విహరించిన పగిది విహరించుచున్నారు. సమస్త గీతార్థము నిందు పొందింపబడినది. గీత యీా యధ్యాయముతో ముగిసినదగుట నంతిమాధ్యాయము. శాస్త్ర శబ్దము సమస్త గీతాపరమైనను ప్రత్యేకించి నీ యాధ్యాయమునకు వేదార్థనిహితము, గీతాసారము యనిరి. తక్కిన పదునాల్గధ్యాయముల

లోని యుపప్రాసము మీదయొక్క యీయాధ్యాయమున మూర్తీభవించి యుండుటచే నిది శాస్త్రమనిపించుచున్నది.

ప్ర: ఈ యాధ్యాయముతో గీత ముగిసినదంటిరి. తరువాతి 16, 17, 18 యాధ్యాయములు గీతలోనివి కావా? అవన్నియు యేల చెప్పబడినవి?

ఉ: పదునారు, పదునేడవ యాధ్యాయములు బద్ధ ముముక్షుజీవుల నాచారవ్యవహారములు, గీత కధికారానధికారుల నిర్ణయము, పదునెనిమిదవ యాధ్యాయము సమస్త గీతోపసంహారము, మోక్షోపాయము నిర్ణయించునది. వెలగల వస్తువుల మధ్యనుంచినరీతి, శిరస్సునకు తల మిగిలించి నాగాచుట్టినరీతి, గృహమునకు నలుదిశల బయలువదలినపగిది, భోజనానంతరము చేయి విస్తరనాకినసమము, రసపోషణకు వలయు సాహిత్యముండురీతి భగవానుడు విషాదయోగము ముందు 16, 17, 18 యాధ్యాయములను నీ యాధ్యాయములమధ్య వేదవేదాంతసారము నుంచెను. ఈ యాధ్యాయము చిన్నదియైనను, యరుంధతీనక్షత్రము, ధ్రువనక్షత్రమురీతి జన్మపావనకరము. గురుదేవుని దయయు, జగద్గురుండగు గీతాచార్యులకృపయు, పరమమహర్షుల యాశీర్వాదము, సజ్జనుల నిరంతర ప్రోద్బలము, హృదయవేదన నింత గొప్పదగు గీతాశాస్త్రమునకు వ్యాఖ్యానివేదన యొనరింపజేసినదంటే యాశ్చర్యము. ధనరాసు లెట్లార్జించిరో నాకవసరము లేదు. కాని, యాభాగ్యవంతులకంటే, మనుజపాలికులకంటే, శబ్దజాలమనేక మెఱిగిన విద్వాంసులకంటే, భౌతిక తత్త్వశాస్త్రజ్ఞులకంటే, భేదవాదజనులకంటే నేనే గొప్పభాగ్యవంతుడనని ఘంటాపథముగ జెప్పగల తుచ్ఛములగు నైహికాముష్మిక సుఖంబుల పొందిబోక గురుపాదద్వయ పుష్పమకరంద మాస్వాదించు నిజ భృంగమునై, నంతరంగదేవుడగు పార్థసారథి నా పక్షమై నటింపించినరీతి నడువగల నా జ్ఞానదేవుడు, నా విజ్ఞానగురుడు, నా సుఖసాగర శయనునిదే నీ భారమంతయు. మేఘమునుండి వర్షబిందువులు, చలమునుండి నీరు, తల్లిస్తన్యములనుండి పాలు, చెఱకునుండి రసమువగిది, నా దేవుడందించిన రీతి నీ సాహిత్యమును పోషించెద. శిష్యు డర్జునుడు, గురువు సాక్షాన్నారాయణుడు. శిష్యుని యేకాగ్రత, శ్రద్ధా, విశ్వాస, సమయస్ఫూర్తి,

భావైక్య, నిర్వ్యాజుడగుటచే పొంగి పొరలివచ్చు భావపరంపరల నక్కి నుంచక నఖిలమానవహృదయగుహాచిరతరాంధకారముతొలగ నీయాధ్యాయము తానే ప్రారంభించెను. ఉపాధ్యాయుడుగాని, గురువుగాని, తలిదండ్రులుగాని, శిష్యులకు లేదా బిడ్డలకు లౌకికధర్మములుగాని, పారమార్థికధర్మములుగాని మొదటినుండి చెప్పుకుంటువచ్చుచు ముగిసే సమయమున నిశ్చయవాక్యమును ఫలశ్రుతిని యొక్క సారాంశవాక్యము లోనే ముగింతురు. అదే విధము భగవంతుడు సమస్తమానవాళియ ముల ప్రాప్తిసాధనమగు శాస్త్రముగ దానిని గుఱించిన సిద్ధాంతముల చెప్పవలసినదంతయు పూర్తిజేసినాడు. కడపటి యాధ్యాయమనియే కాదు, వేదవేదాంతసారమంతయు, సమస్తమతముల సమ్మతమంతయు దీని యందు నింపి ప్రతియొక్కరికి చైతన్యశక్తి గలుగుటకు, తన యవతారము పూర్తియగుటకు నీయాధ్యాయమును జెప్పెను. లౌకికములగు చరిత్ర కాదు, కట్టుకథలు గాధలుగాదు, మనకథ యేమన మనమానవుల మెవరము? మన స్వరూపమేమి? మన స్వభావమేమి ? మనగతులేమని వివరించెను గీత. అందులో నీ యాధ్యాయము వినకపోయిన, చదువకపోయిన, గ్రహింపకపోయిన మన మానవత్వమే పాడుజేసికొన్నవారము కాగలము. "ప్రాప్యైతత్కృతకృత్యో హి నరో భవతి నాన్యథా" నరుడీ యాత్మతత్వమును పొందుటచేతనే కృతకృత్యుడగును; వేరువిధమున కాజాలడు. "తద్ధ్యగ్రం సర్వవిద్యానాం ప్రాప్యతే హ్యమృతం యతః" అన్నివిద్యలలో బ్రహ్మజ్ఞానము శ్రేష్ఠము. దానివలననే ముక్తినొందుదురను ప్రమాణముల సాధకావస్థ, సిద్ధావస్థల లక్ష్యమగు నీయాధ్యాయము బృహద్గౌరవము వహించినదంటే నతిశయోక్తి కాదు. తన స్వరూపమును వ్యక్తపఱచటమే నాయన కర్తవ్యము. గ్రహింపలేనివారికి యోచించి చిన్నచిన్న యుపాయముల గురువులు శిష్యుల కనుగ్రహించినట్లు; నిత్యపఠన, పాఠనల నీయాధ్యాయముతోనే నెట్టి మానవులైన తమ వ్యక్తిత్వము పూర్తి యొనరించుకొనుటకే నీయాధ్యాయము వెలిగించెను. పదమూడవ యాధ్యాయమున "బ్రహ్మైవేదం సర్వమ్" యని యాత్మ పరమాత్మల కభేదమును వివరించి గుణత్రయవిభాగయోగమున నాత్మ పరమాత్మల కభేదప్రతిబంధకములగు ప్రకృతిగుణముల నిరోధక సాధనల

జెప్పి రజోతమోగుణములను వైరాగ్య వివేకభక్తిభాజనులై త్యజించి సత్త్వగుణము నాశ్రయించి, యేరుదాటుట కుపయోగించు పడవ దాటిన మీాద వదలుభంగి, చితినికాల్చుట కుపయోగించుకొన్న కట్టె నాఖరులో నా చితిపైనరీతి, కాలిలోని ముల్లుతీయుటకు తెచ్చినముల్లు ముల్లుదీసిన వెనుక రెంటిని పారవేయులాగు, చీకటిలోనివస్తువు వెదకి తెచ్చినవెలుగు వస్తువు కనిపించినంతనె వదలుభంగి సత్త్వగుణమునుగూడ త్యజించమనెను.

ప్ర॥ గుణములు మూడువదలిన ప్రతిబంధకములు లేవుకదా? ఈ యాధ్యాయముతో నవసరమేమి? భక్తిగలిగి యుదాసీనుడైనున్న చాలు. దీని ప్రయోజనము?

ఉ॥ గుణములవలన గలిగే ననర్థకములజెప్పి వాని వదలుటకు భక్తి సాధనము జెప్పెను. అయితే రోగికి నారోగ్యము కావలెనను, పథ్యముండవలెనంటె కాదనును. అంజనతో గనిపించే మూలద్రవ్యము కావలెనంటారు, అంజనతో జూడుమనిన కాదందురు. కొండమీాదనున్న దేవుని జూడవలెనందురు. కొండెక్క కాదందురు. ఎవరో సాధించవలె, తమపంట బండవలె ననుదురు. రోగమురావట మొకరికి, పథ్య మొకరి కేలాగుజెప్పేది? గర్భము దాల్చితిగాని ప్రసవవేదన నెవరైన పడమంటే నెట్లు? గర్భముండేదెవరికి వారే నావేదన పడవలె. దేవుడేమి కావలె, సాధనలెవరో చేయవలె. ఉద్యోగము గావలె, చదువు నెవరైనచదివి సర్టిఫికేట్టు కావలె. అంటే నంతసునాయాసముగ లభ్యము కావలెనని ప్రతివారి యూహ. మనకై మనము వెతకుచుంటే నేమి ప్రయోజనము? ఫలానిదన్నపుడు దాని గుర్తులుజెప్పితే చూచినవారుగాని, విన్నవారుగాని, యున్నవారుగాని చెప్పుదురు. మావూరుకు టిక్కట్టిమ్మనెదవు. ఏవూరు? ఎన్నిమార్లడిగిన మాయూరే. అంగడికి వెళ్ళినావు. బేరమడిగినావు. నీవే యిమ్మంటే నేవి యివ్వగలడు? అంగడిలో నుండేదొకటి యమ్మేది యొకటి, చదివేదొకటి యర్థమొకటి, పొయ్యేదొకచోటికి నసలుచేరే దొకచోటికి, ననేది యొకటి యాచరించేదొకటి, యుండేదొకచోట వెదకే దొకచోట, నడిగేదొకటి యిచ్చేదొకటి, పుండొకచోట మందొకచోట, వ్యాధియొకరికి పథ్యమొకరికి, చూచేదొకటి చెప్పేదొకటి, మనస్సులో దొకటి మాటాడేదొకటి. వర్తకమర్మమువలె ననలెఱుంగనివారు దేవుని

మెఱుగుటలో, నాయనను బొందుటలో నీలాటివారైతే నెన్నికాలములకైన బొందలేరు. ముందు దేవుని లక్షణములు విశదముగ వినవలె, విన్నమీదట బాగుగ తర్కించవలె. తర్కించినమీదట నా దేవునికొఱకై ప్రయత్నించుచు సత్కార్యములలో గలియవలె. సందేహములు దీర్చుకోవలె. కాని ప్రయత్నములేని యాస్తికులు నాస్తికులిరువురు నొకటే. కలదంటే కలదన్నందుకు, తత్ప్రాప్తిబొందుట యాస్తికత, లేదంటే లేదన్నందుకు నాస్తికత నెదుర్కొనుటలో నిరువురకు సుఖమే శ్రేయమే. అందువలన భగవంతుడు యే సంసారమునైతే నంటబెట్టికొనియుండి దాని యాదిమధ్యాంతములు తెలియక నందులోనే నమసిపోవుచున్నారో, దాని రహస్యము తెలిసిన భయరహితులయ్యెదరో, మేలుకీడుల, మంచిచెడ్డల, హేయకారకముల నా సంసారములోనే జూపించి తత్త్యాజ్యమున గలిగే ప్రయోజనముకొఱకు నీయాధ్యాయ ముపక్రమించెను. ఆస్తికులు నాస్తికులు వినండి. వాదోపవాదములు విడువండి. చక్కగా విచారించండి. ఆవల గనుగొనుడి. మన మాచరించే ప్రతియొక్క క్రియలోగాని, సంకల్పములోగాని హేయమని తెలిసేవఱకు దానిని వదలి మఱొకదాని యాశ్రయించము. వదలేదానికి వైరాగ్యములేక త్యాగము త్యాజ్యమనెదరు. ప్రారంభించేదానికి వివేకమనెదరు. పండ్లజూచినావు రోతయనిపించి మఱొక మంచిపండ్లనద్ద కెళ్లెదవు. భోజనముచేయ నుద్యమించితివి. విషమున్నదన్న హేయవస్తువు కలిసినదన్న వదలుదువు. ఒకత్రోవ బోవుచున్నావు. దొంగలత్రోవయన నది వదలుదువు. రైలుపెట్టెక్కచున్నావు, దొంగలున్నారు జాగ్రత యనినంతనే మేలుకొనుచున్నావు. ఈ ప్రకారము నొక హేయవస్తువును వదలితే నవలంబించే పరమార్థమును హేయమును తెలిసిన సులభముగ దేవుని జూడగలరు. ద్వితీయ షట్కమంతయు శుద్ధభక్తిచే నాసాకారముగల్గించి తృతీయషట్కమున గూడ భక్తిని సాధ్యవస్తువగు జ్ఞానమునకు నుపాయముగ జెప్పెను. తనయందు ప్రేమగలిగినగాని పురుషోత్తముని గనుగొన నిచ్ఛగలుగదు. తన్ను తెలియనీకనుండు సంసారమును వివరించితే ప్రయోజనము గ్రహించెదరు. అందుకు భక్తి యవసరము. మూడుగుణముల మువ్వరియే సంసారము. ఒకడు తిరిగితిరిగి నాకలిదప్పికలకు నోర్చుకోలేక నొక యూరనున్న

నన్నుసత్రమునకరిగి [illegible] గను లభింప త్రిపుటికపరిశీలించి యీ పుణ్యాత్ములెవరో, వివేకులు తెలిసికొనవలెనని యక్కడి వారి నడిగెను. వారు ఫలానివారికని, ఆ ఫలానివారు తనతండ్రియే అని తెలిసికొని మిక్కిలి యానందించెను. సంసారమను దానికి మూలమెవరు? ఎప్పటినుండియున్నదని కొందరు ప్రశ్నించిన నన్ని తెలియును. సంసారమును రూపకాలంకారముగ నభివర్ణించి కొక్కొక్క గుణమును నదలదలచితే నెంతకాలమైన బట్టును. లేదా శరీరపతనమైన గావచ్చు. అసల గతి యెట్లో ననుసందేహముల బాయుటకు నొకకథ. సంసారమునే తెలిసి త్యజించితే కేవలము పురుషోత్తముని జేరవచ్చునను యుద్దేశ్యముతో దీనిని జెప్పెను. అదిగో నదియొక్క పెద్ద యాఫీసునందు తన తండ్రియే యుండేది. లోనికిబోవ జవానులు బోనివ్వరు. నాతండ్రియను గుర్తేమి? వారికి కావలసినది మామూలు. అక్కించేము మామూలు నీవు త్యాగము చేయలేనిచో నీ తండ్రియేమైనను నీకేలాగు తటస్థపడగలడు? ఇంటివద్దనంతే నాఫీసునందంతే మామూలు. త్యాగముఖంగి, సంసార మూలమగు వాడెవ్వడో తెలుసుకొన సంసారము త్యజింపవలె. దానిని త్యజింప మూలతత్త్వము తెలియుగలరు. ఈ నదికి మూలమేదో నని వెదకితే సముద్రమే. చుట్టు నద్దములుగల గోడల యింటిలోనికి పోయి నిలిచితే నందఱు నిలువబడినారు. ఎవరువీరని దగ్గరికిబోయి నొక్కొక్క-రినిజూచితే తానే. ఓరా! అద్దము లింతపనిజేసిన వనుకొనెను. అద్దములవంటి నంతఃకరణోపాధులతోచి సంసారియైనవాడెవ్వడా అని తర్కించినా సంసారమును త్యజించితే తానే మూలపురుషుడు. శాఖోపశాఖలకన్నిటికి నొకబీజమే. అందుకొకజానికన్న నొకటి సులభమార్గము జూపించటము మనకొఱకే. ఇద్దఱు స్నేహితులు లింటినుండి స్టేషనునకు బయలుదేరినదిమొదలు తమ ముఖ్యవిషయముల చర్చించుకొనుచు పోయినారు. రైలువచ్చువఱకు మాట్లాడినారు. ఒకడు రైలెక్కినాడు. బండి కదలిపోవుచున్నది. అప్పుడు కూడా మాటలాడినమాటలలోని ముఖ్యాంశములన్ని చెప్పుటకు బండి యాగదని తెలిసి తన యాదరము నుభయ సమ్మతమగునది మరువవద్దు, మరువవద్దని చెప్పినట్లు నాచరించుమని చేయి యెత్తి జ్ఞాపకముచేయుచు కేకవెట్టును. బండిలోనివాడు నిటుచూచుచు

నరేననురీతి కృష్ణార్జునులసంవాదము సాక్షియై నది. యుద్ధసంరంభసమయ మున తుదిమాటలుగా బోధ జెప్పదలచిన సంపూర్ణార్థములోని ముఖ్యాంశములే నిందులో తెలిపెను.

ప్ర! మతములన్నిటిని సమ్మతమంటిరి. మతమనగా నేమి? ఆ మతము లేవి ?

ఉ! ఇజమ్, రెలిజియన్ యను రెండుపేర్లు మతశబ్దమునకు నాంగ్లేయులు వాడెదరు. థియరీ లేక సిద్ధాంతమునకు ఇజమ్ యని ఉపయోగింతురు. పవిత్రమైన విశ్వాసము, దైవప్రార్థన మోహముతోగూడిన సమూహము మతమనెదరు. హిందూభాషయందు మతము సిద్ధాంతమను పదముల నుపయోగింతురు. మత మన సదభిప్రాయము. దాని తర్కవితర్కములతోను, ప్రత్యక్షాది ప్రమాణములతోను బలపడినపుడు సిద్ధాంతమనెదరు. సిద్ధాంతరూపములోనికి మారినపుడే మతము విస్తృతరూపము ధరించును. ప్రతి మతమునందు మొదటిది తత్వశాస్త్రము. ఇందామతము యొక్క మూలభావములు, లక్ష్యము, తత్సాధనమార్గములు విశదీకరింపబడియుండును. రెండవది పురాణవాఙ్మయము. ఇది స్థూలరూపముదాల్చిన తత్వశాస్త్రమనవచ్చును. ఇందు మానవులయొక్కయు, ప్రకృతి కతీతులగు పురుషులయొక్కయు జీవితములు తెలుపబడియుండును. ఈ జీవితము లించుమించు కల్పితములని చెప్పనచ్చు. తత్వశాస్త్రమునందు నిగూఢముగానున్న భావము లీకథారూపమున సుబోధములగును. మూడవయంగము కర్మకలాపము. ఇది పై దానికన్న స్థూలరూపమైనది. ఇందు విగ్రహములును, కర్మములు, సంగన్యాసములు, పుష్పదీపములు మున్నగు నింద్రియగోచరవిషయము లనేకములుండును. కొన్నిటిలో నొక యంగమునకు, మఱికొన్నిటిలో నింకొకయంగమునకు ప్రాముఖ్య మీయబడియుండును. మఱికొందఱు భగవంతునకు భక్తులకుగల మధ్యస్థితి మతమందురు. సకల జీవుల నాశయమునేదో- అదియే మతమనెదరు. ఏమన్న నభిప్రాయమనియే జెప్పవలె. ఇక మతము లేవేవి యనిగదా అడిగితిరి. ఏ ప్రాణికైన లక్ష్యము లేదా కేంద్రము నాశయమునుబట్టి యుండును. జీవులన్నిటికి కేంద్రమొక్కటియే, నాశయములబట్టి సులభముగా తెలియును. అసలు నాశయములే తెలియనివారి మతము పరభయంకరము,

దుష్ప్రాప్యమునై యుండును. ఆచారవ్యవహారములు వేలువేలుగా నుండును. ఏను గొల్లుండు మునిని నలుగురు గ్రుడ్డివాండ్ర నడిగిన, నొకడు చేటవలె, నొకడు చీపురుమాదిరి, యొకడు స్తంభముపగిది, యొకడు రోలమువలె నుండునందురు. వారు ఏనుగుయొక్క సాకల్యరూపమును జూడక తమ యెదుటనున్న గ్రుడ్డితో తడివినటుల వచించిరి. నలుగురు నొక యేనుగనే నాలుగురీతుల జెప్పిరి. అంతట మతాశయములకు నేనుగే కేంద్రము. స్పష్టముగ నేనుగును జూచినవాడు వారి యాశయముల తప్పని యెట్లు చెప్పగలడు? శాస్త్రానుకూలము వారివారి యుక్త్యనుసారము గ్రహించినదే మతము. ఎవరెవరి మతగ్రంథములు వారికి ప్రాముఖ్యమే. మతము లనేకములుగలవు. దేహాత్మవాదులగు లోకాయుతికులు, నింద్రియములే నాత్మయను చార్వాకైకులు, ప్రాణమేయాత్మయను సౌగతులు, దేహేంద్రియ ప్రాణముల సంకోచ వికాసావస్థలుగలవాడే యాత్మ నిత్యమును పరమాణురూపమున నలోకికాకాశమధ్యమందు క్రమక్రమముగ సంచరించుటయే మోక్షమను జైనులు, బుద్ధియే బ్రహ్మమను బౌద్ధులు, నార్హతులు, క్షపణులు, రుద్ర, కౌళవ, భైరవ,యామళులు, శాక్తేయులు, పాంచరాత్రులు, పాశుపతులు, కాపాలిక మహావ్రతులు, మాంత్రిక, వీరశైవ, శైవులు, లౌకికులు, పూర్వమీమాంసకులు, న్యాయవైశేషికులు, సాంఖ్యులు, పాతంజలులు, గాణాపత్య, సౌరులు, ద్వైతులు, స్వభావవాదులు, పరిణామవాదులు, క్రైస్తవ, మహమ్మదీయ, కాన్ ఫ్యూషియన్, జోరాష్టరు, దివ్యజ్ఞాన, ఆర్య, బ్రహ్మసమాజ, చైతన్య, కబీరు మొదలగు మతములు లెక్కలేనన్ని యున్నవి. ఇందుజెప్పినవి క్లుప్తము. కాని ఆశయసిద్ధికై తమతమ తెలివితేటలతో నేర్పఱచు కొన్నవే మతములు, తిరిగి స్వస్థానములో నుంచగలిగినది మతము.

ప్ర॥ భక్తి విడువకుండవలె సనుటలో నభిప్రాయ మేమి?

ఉ॥ భక్తివదలిన శ్రద్ధలేదనియు, నా మతలక్ష్యమును సాధింపలేడని యర్థము. గురితప్పిన లక్ష్యమును గొట్టలేడు. భక్తిలేదా? మఱి దేని యందైనా భక్తియుండవలె. భక్తి అనగా ప్రేమ భగవంతునియం దుంచలేకపోయిన మఱి భార్యయో, పిల్లలో నేవస్తువులపైన నుంచుచునే యుందురు. ఏ మతమునకైన భక్తి యవసరమే. “మోక్షసాధనసామ

గ్ర్యాం భక్తిరేవ గరీయసీ" "స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే" తనయందు తనకు ప్రేమలేని దెవ్వడేలేడు. తనయందు ప్రేమ గలవాడున్నాడా? యనిన యొకడుగూడ లేడు. దేహముపైననో, మత్తే వస్తువులపైననో నుంతురేగాని తనయందుంచిన మోహము నిత్యసిద్ధము. తనయందు ప్రేమగలిగిన భగవంతునియందు గలుగును. ప్రహ్లాదునిజూడుడు. మహాత్మాగాంధీ, రామతీర్థ, వివేకానంద, రామకృష్ణాదుల జూడుడు. తనయందు గలిగిన భగవంతునియందేకీభావము నొందువఱకు వదలడు. జనసామాన్యమునకు నడుబాటుమార్గమగుట యొకటి. ఎట్టి పాపాత్ములైనను "మహాపాతకినాం త్వార్తే" నార్తభక్తుడు గావచ్చుననెను. వేదాంతముచేత వన్నెకెక్కి మూఢవిశ్వాసాల శాస్త్రాలనుంచి విడదీసినది మతమని రామతీర్థ.

ప్ర॥ తనయందు తనకు భక్తిలేక మఱెవ్వరియందు ప్రతియొకరికి గలదు?

ఉ॥ తన్ను తెలియక దేహేంద్రియముల ప్రేమింతురు. దేహధర్మముల దేహాత్మబుద్ధిగలిగిన నవి తనయవే యనుభవింపవలెను. దేని నారాధించిన నద్దానివలనగలిగేవి ననుభవము తప్పదు. ఆత్మాభిమానులకు దుఃఖము లేదు. నా దేహము, నా కన్నులు, నా యింద్రియములు, నా చేతులు, నా బంధము, నారోగమున్నప్పుడు నాకునే సామాన్యజ్ఞానము వుండియే యున్నది. దాని కేమిలేవు. దేహము నింద్రియములు ప్రాణములై, దృశ్యములై, నెవ్వని యభిమానమునకు పాత్రములైననో, నాతని విశేషరూప జ్ఞానము లేకనే బంధము నెవ్వని ద్రష్టృత్వముతో తెలియబడునో నవి జడములు. వాని యందభిమానముంచ నవి యేమొసగగలవు? దుఃఖములనే నుంచగలవు. భగవంతు డందుకే తన యన నాత్మయందు భక్తి గలిగిన భగవంతుని ప్రేమింపగలరనెను. దేహభక్తి, ద్వైతభక్తి ద్వంద్వప్రాప్తి గల్గించును.

ప్ర॥ ఈ యధ్యాయాంత్యమున కృతకృత్యు డగునను వచనమునుబట్టి యేమేమి యీ యధ్యాయమున భగవంతుడు తెలిపెను?

ఉ॥ కృతకృత్యుడగుటకు గల ముఖ్యవిషయముల బ్రతిపాదించెను. పురుషుడు, నుత్తమపురుషులను వారియుభయులకు గల భేదమెట్టిది? పిండాండ

బ్రహ్మాండములు విమర్శ "యథా పిండే తథా బ్రహ్మాండే" పిండబ్రహ్మాండము లొకటియే. శాఖోపశాఖలు వేలువేలైన, ప్రతిశాఖకు గలుగు విత్తనములు వేలువేలైన, శాఖలకు బుట్టు విత్తనములు చెట్టుకారణమగు విత్తనమొకటేనని నిరూపించుకీతి నా త్తముపురుషుడే సమష్టిశరీరాంతర్యామియై వ్యష్టిదేహమున పురుషుడై న్నాడనియు, వ్యష్టిదేహమున నుంట పురుషుడు సమష్టిదేహములనుంట పురుషోత్తముడు ఉపాధుల తొలగింప నొక్కటియేనను యద్వితీయాభేదముచే "ద్వితీయాద్వై భయం భవతి" ద్వైతభయము తొలగిపోవును. అప్పుడు కృతకృత్యుడగును. మోక్షమునకు సాధనరూపముగా సంసారవృక్షము రూపకాలంకారముగ వర్ణించటము. వైరాగ్యమెట్యది? పురుషోత్తము డెవ్వడు? అతని యనుసంధానమెట్లుంగి? అధికారులగుణములు, భగవద్విభూతులు, జీవుని గమనాగమనములు, క్షరాక్షరవర్ణన జెప్పబడినది. ఈ లక్షణములు తెలిసిన కృతకృత్యుడగు ననుటకు సందేహము లేదు. మరొక రహస్యము. సంసారమెనర్చు ప్రతియొక్కరికి ద్వితీయషట్క ప్రథమాధ్యాయమున ఫలశ్రుతిని చెప్పెను. "జరామరణమోక్షాయ" వృద్ధాప్యము మరణము గలదని యష్టమ, నవమ, ద్వాదశ, త్రయోదశ, చతుర్దశాధ్యాయమున "జన్మమృత్యుజరాదుఃఖై ర్విముక్తోఽమృతమశ్నుతే" సంసారమూలమగు గుణముల నతిక్రమించలేనపుడు జన్మమరణవార్ధక్యదుఃఖములు తప్పవనెను. ఈ ప్రాప్తము సంసారికి; సంసారవిరక్తునకు మోక్షము జెప్పెను. ఏ విద్యకైన నర్హుని వెదకుదురు. ఈ యధ్యాయమునకు యోగ్యుడర్జునుడగుటచేతనే విరక్తిగలిగిన నీతనికి జెప్పెద, విరక్తిగలవారెవ్వరైన తత్ప్రాప్తి బొందవచ్చునని తలంచెను.

ప్ర॥ భోజనకాలమున నీ యధ్యాయము పారాయణజేయు టెందుకు?

జ॥ ఛాం॥ ఉ॥ ఉపాసనావిధానముగా జెప్పియుండుటచేతను, యిదే యధ్యాయమున "అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః" సకల సూక్ష్మశరీరాభిమానియగు హిరణ్యగర్భుడు చతుర్విధయన్నాదుల పచనమొనర్చునని చెప్పుటచేతను, భోజనము యజ్ఞాన్నము కాబట్టి యెందుచేత హిరణ్యగర్భుడు పచనమొనర్చుటచే నది యజ్ఞాన్న

మగును. అధియజ్ఞుడగు వారికి సమర్పింప కర్తృత్వాభిమానము, సమబుద్ధి, సమాధానచిత్తము గలుగుట "యజ్ఞో వై విష్ణుః" యజ్ఞస్వరూపము, యజ్ఞకర్త, సమస్తము భగవంతుడనే భావము గలుగుటకు సంసారమున తయారైన భోజనమే నా భోజనకాలమున పారాయణ జేయగజేయగ సంసారమెట్టిది, మూల మెవ్వరని గ్రహింపకపోరు. గ్రహించిన విరక్తి గలుగుననియు, నధియజ్ఞుడగు పురుషోత్తముని తెలిసి తన్నివర్తి కోరుదు రని జ్ఞాపకార్థము ప్రార్థింతురు.

ప్ర॥ భగవంతునిచే వివరించు నీ రహస్యము వినుచున్నందున తనివి దీరలేదు. వివరింపుడు.

ఉ॥ దేవుడెందో గలడని, యాలయిన బొంద నెన్నియో మార్గములు జెప్పిరికదా. భగవంతుడు చెప్పబోయే నీ సంసారవృక్షమును విన్నంతనే సర్వము విశదమగును. స్వేదజము, లండజములు, మావిజములు, నుద్భిజ్జములుగ కనిపించే సచరాచరము, మానవులలో న్యూనాధికములు, వివిధాకార, వర్ణ, భాష, పరివర్తనాదులెవ్వరైనది యొక్కసారి గమనించు. 1 నుండి 2 శ్లో॥ వరకు సంసారమును వృక్షముగా వర్ణించెను. అయితే నీ వర్ణన పెక్కురకములు వర్ణింతురు. కాని విను. "ఊర్ధ్వమూలమధ శ్శాఖమశ్వత్థం ప్రాహురవ్యయం। ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్" సంసార మనంతదిశల వ్యాపకమైన వృక్షము. దీనిమూలము పైన, శాఖలుక్రింద యనాదియై యశ్వత్థమనుపేర వేదములు పత్రములుగా గలిగియున్నదని వేదశాస్త్రపురాణములు జెప్పుచున్నవనెను హరి. అనగా నీ సంసారవృక్షము తానే కల్పించి యిప్పుడు నీకు చెప్పుచున్నాననుకోకు. వేదశాస్త్రములు ముందే చెప్పినవి యని ప్రమాణము జూపించెను. భగవంతు డర్జునునకు దీనిని తెలిసినవాడే వేదవేత్తయని ఫలశ్రుతినిగూడ తెల్పెను. దుఃఖమునకు కారణమజ్ఞానము. అజ్ఞాననివర్తికి జ్ఞానమవసరము. తెలియనిదంతయు దుఃఖమే. తెలిసినదంతయు సుఖమే. నీ వృక్షమునకు వ్రేళ్ళు శాఖలు పత్రములు కంటికి కనిపింపకున్నవి. ఫలితము దుఃఖముగా తేలుచున్నది. మఱ్ఱిచెట్టువంటిది వ్రేళ్లు పాయ్యేదిక్కు వ్రేళ్లుపోవుచుంటే కొమ్మలు దశదిశలా వ్యాపకములై పోవుచున్నవి. ఇది యనాదినుండి సాగివచ్చుచున్నది. దీని యాద్యంతము తెలియుగుట కష్టము. అయినా

నెఱుగుటయే జ్ఞానము. జ్ఞానప్రాప్తికపేక్ష నీ సంసారమును వర్ణింపబడెను. ఈ శ్లోకము కఠోపనిషత్తున గలదు. "బ్రహ్మవృక్షస్సనాతనః" అశ్వమేధమున జెప్పబడినది. ప్రపంచమున నెన్నిరకా వృక్షముల జూచుచున్నాము. అవి మూలము క్రింద, శాఖలు పైననున్నవి. మఱియు నే చెట్టుస్వభావము దానికుండును. పుల్లనిచెట్టు పుల్లగ, చేదుచెట్టు చేదుగనుండును. ఈ సంసారవృక్షమున కందమూ, మధురమగు చిద్రూపముగ నుండియున్నది. ఈ వృక్షవర్ణనగుఱించి నిరుక్తమేమి? జవాబు చెప్పలేదు. తత్త్వవేత్తలు మాత్రము ననేకవిధముల వర్ణించిరి.

ప్ర॥ వారెట్లు వర్ణించిరి? దీని రహస్యమేమిటి?

ఉ॥ బ్రహ్మాండమునే సంసారవృక్షముగ వర్ణించిరి. 'ఊర్ధ్వ మన' పైనని యర్థముకాదు. ఉత్కృష్టమనియు, నారంభమనియు, నథశబ్దమునకు తర్వాతయని యర్థము. వృక్షమునకు మూలమగు విత్తనమువలె నద్వితీయబ్రహ్మమే మూలము. ఆదిమధ్యమ యంతములు నాబ్రహ్మకు లేవు. సర్వత్రా నిండిన నా దేవుడే మూలము. ఉపాధివలన "యథోర్ణనాభి సృజతే" సాలెపురుగు గూటిసృష్టికి నిమిత్తకారణము. దారము గూడునకు నుపాదానకారణము. దాని పాదములు సహకారికారణములు. కుమ్మరి నిమిత్తకారణము, మట్టి ఘటమునకు ఉపాదానకారణము, చక్రదండాదులు సహకారికారణములు. భగవంతుడు జగత్తునకు నిమిత్తకారణుడు. మాయ యుపాదానము. ధర్మాధర్మపుణ్యాపాపమిశ్రమకర్మలు లేక కాలాదు లదృష్టములు. సహకారికారణములతోటి సృష్టి. ఇదియొకవిధము.

ప్ర॥ ఈ సంసారవృక్షము నవ్యయము లేదా యనాదియైనపుడు నాశమగు టెట్లు?

ఉ॥ అనాదియన నాదిమధ్యాంతములు లేనిది. ఎప్పటినుండి యెఱుగలేమో నప్పటినుండి యున్నది. తెలిసికొన్నంతనే యుండదు. అనాదికి నిదే యర్థము. తెలియునంతవఱకుండ నవ్యయము. తెలియుట వ్యయము. సదసద్విలక్షణమగు, ననిర్వచనీయప్రజ్ఞాన్వితయగు మాయ, నింద్రజాలకునియందలి మాయ వానియందున్న రీతి, బ్రహ్మమున నీమాయ గలదు. ఇంద్రజాలకుని మాయ నేమొనర్పలేదు. బ్రహ్మమందలి మాయ వివిధ

ములుగ పరిణామ మొందెను. బ్రహ్మమునందు లేకపోయిన నున్నటుల కనిపించును. ఇంద్రజాలకునివలన నానాత్వము గనుపించుభంగి, బ్రహ్మ శక్తిచే నా మాయ విస్తృతమగును. అయితే తన మూలస్వరూపమును మఱచినమఱపే నీ సంసారవృక్షమునకు మూలము. మూలము నిర్మలమైనదియే.

ప్ర॥ అశ్వత్థవృక్ష మననేమి?

ఉ॥ "న శ్వోపి స్థాస్యతీత్యశ్వత్థః" క్షణికముండినభంగి క్షణికముండదు. కదురుతిరుగులాగు తిరుగలివలె పారెడిజలముభంగి మారుచుండును. అశ్వత్థ మన రావిచెట్టునకు పేరు. ప్రపంచములోని వృక్షముల పత్రములు బొత్తిగా గాలిలేనిచో గదలవు. రావిపత్రములు గాలిలేకున్నను కదలుచుండును. ఆ చైతన్యశక్తి పరమాత్మయగుట రెండర్థములతో నేను రావిచెట్టు ననెను. రావిచెట్టు పత్రములవలె సంసారవృక్షము చలనరూపమైనదనియు, దాని కదలికకు తానే కారణమనెను. అన్ని వృక్షములకన్న రావిచెట్టున తనశక్తి యెక్కువనున్నదనియు, సంసారవృక్ష కదలికకు నేనే బీజము ననెను. మాయాసంసారవృక్షము నేనేనని యొకయర్థము. దీనియంకురము, త్రిగుణములు, త్రిశాఖలు, వేదములు పత్రములవంటివన కర్మలను, కర్మ సాధనలను, కర్మరూపములనే ధర్మాధర్మముల, కర్మఫలములనే సుఖదుఃఖ మోహముల, నిత్యములగు నిత్యాదిదోషముల గప్పిపుచ్చునవియై సంసార మును వృద్ధినొందించుచున్నవి. కావున వేదము లాకులు, ధర్మాధర్మములే పుష్పములు. జన్మమరణాదిదుఃఖమే ఫలముగనున్నది. "బ్రహ్మణో రవ్యక్తః, అవ్యక్తాన్మహాత్, మహతోఽహంకారః, అహంకారాత్ పంచ తన్మాత్రాణి, పంచతన్మాత్రేభ్యః పంచమహాభూతాని, పంచమహాభూతేభ్యోఽఖిలం జగత్" పరమాత్మ యూర్ధ్వమైన, నధః యనంతరము, మహ తత్వమంకురము, నహంకారమే స్కంధము, పంచతన్మాత్రలే శాఖలు, పంచ మహాభూతములే నుపశాఖలు, నటుమీద బ్రహ్మ విష్ణు రుద్రాశ్వరలోక, దేవతాలోక, మనుష్యపశుపక్ష్యాది పాతాళలోకములు గలిగెను. నేను నేనను ప్రతియొక జీవుడు నుపశాఖలగు పంచభూతముల పంచీకృత పంచ వింశతి తత్వమయశరీరమున కర్మఫలము లనుభవించుచుండును. అనగా

నొకొక్క శరీరమునకు బ్రహ్మాండవృక్ష శాఖోపశాఖలలోనిదేనని యర్థము.

ప్రః ఊర్ధ్వాధోలన్నప్పుడు రెండు నాదియంత్యములంటిరి. ఈ శాఖ లెక్కడికెక్కడ ప్రాకినవి ?

ఉ॥ మనుష్యులు మొదలుకొని బ్రహ్మలోకపర్యంతము నూర్ధ్వము. మనుష్యులు మొదలు పాతాళమునకు, లేదా స్థావరములవరకు ప్రాకినవి నధోర్థము. బాలబాలికలు చదివి క్రింది ఉద్యోగములకు, పై ఉద్యోగములకు బోవ కాలేజిమాదిరి, మనుష్యలోకము నేయే లోకములకు బోవ నాయాకర్మల నాచరించి తత్ఫలప్రాప్తికి బోవ నిది యొక కాలేజివలె నెల్ల జీవులకు హద్దుగానున్నది. ఇక్కడనుండియే నూర్ధ్వాధోగతుల పొందు చుందురు.

ప్ర॥ ఈ వృక్షము పెరుగుటకన వృద్ధియగుటకు సాధనలేవి ?

ఉ॥ "అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయ ప్రవాళాః" గుణములనే నీళ్లవలన రాగద్వేషమోహకారక కర్మలు వృద్ధి జెందును. వీనికి కారణమగు శబ్దస్పర్శాది భోగ్యపదార్థములే చిగుళ్లు. ఇవి దినదినమునకు లేతవిగుచు ప్రాకుచుండును. 'కర్మానుబంధీని' యన ఏయే కర్మచేత నేయే లోకప్రాప్తి బొందవలెనొ నందుకు కర్మయే కారణము. ఆ కర్మలు వేదవిహితకర్మలా? నిషిద్ధకర్మలా? మిశ్రమకర్మములా? శ్రౌతస్మార్తకర్మలేవైన కామ్యములైనచో సూక్ష్మశరీరాంతర్గతములైన విషయవాసనలవలన రాగలిగిన స్థూలదేహము అధశ్శబ్దార్థము. కారణ మగు సూక్ష్మశరీరము నూర్ధ్వార్థము. మనుష్యలోకమున విషయములతో కోరికలు గల్గించుచుండును. స్కంధముపశాఖలుగా వర్ణింపబడిన మహత్తు మున్నగు మాయాకార్యములే నుపాధిగాగల హిరణ్యగర్భాదులు, గుణ త్రయోపాధికులైన బ్రహ్మాదులు, దేవేంద్రాదులు నితరదేశముల, నితర మతముల నీలాగు నభివర్ణింపబడక పోయినను, త్రిగుణమయియగు మాయయే చతుర్దశ భువనములను, చతుర్దశ మనువులను, వైశ్వానర, సూత్రాత్మ, నంతర్యామి అను మహిమైశ్వర్య ననపాయినియైన మాయ నద్వితీయ బ్రహ్మవస్తువున ననంతశాఖలు స్థూల సూక్ష్మ కారణ శరీర ములుగ నవస్థాత్రయమై విరాజిల్లుచున్నది. కొందఱొక శరీరమునకే

నీ సంసారవృక్షమును నభివర్ణించెను. విశ్వరూపసందర్శనము నీ సంసారవృక్షమొకటియే. ఇగజెప్పు దేవుడేడీ? ఎంగుగలడు? బ్రహ్మాండ భాండమున కంత తానే మూలపురుషుడై యున్నాడు.

ప్ర॥ ఈ సంసారమునకు రూపమెట్టిది ?

ఉ॥ 3 నుండి 6-వ శ్లో॥ వఱకు వైరాగ్యాస్త్రమునవలన సంసారము ఛేదింప, లభించు నవ్యయపదము. ఒక దేశమునందు నుద్యోగుల ఫలితార్థములు తెలియునుగాని, యీగవన్నమెంటు రూపమంటే చెప్పలేరు. దానికి రూపములేదు. బ్రహ్మాండవృక్ష మెట్టిది, నదియు నట్టిదే. ఎట్లన పులుసునిమ్మ, క్రొత్తచింతపండు సమీపముననున్న మనుజుల నోట నీరూరును. నీరుల్లిగిల్ల కంట నీరుగ్రమ్మును. కారణమేమి? తద్విధముగ చైతన్యాత్మసన్నిధానమున మనస్సు క్షోభము గల్గును. ఆత్మను మఱచ నవిద్యయందు క్షోభగల్గి మాయాసంసారము దోచును. "న రూపమస్యేహ తథోపలభ్యతే" యన్నవిధము దీనికి నారంభము తెలియబడదు. అనాది యగుట నంతము లేదు. రాత్రి కలలో దోచిన వ్యవహారమునకు నాది యేది? మెలకువ వచ్చులోపల ముగియునది యంత్యమేది? మట్టికుండలకు నాద్యంతము లేవి? మధ్య దోచుచున్నవి. ఎండమావులరీతి దోచుచుండుటచేత నెవ్వరు నెఱుగజాలరైరి దృష్టి, సృష్టి అవిద్యావృత్తిరూపజ్ఞానసమయముందే సృష్టి. యథార్థజ్ఞానసమయముననే నష్టి, అంటే దృష్టనష్టము. దీనస్థితి యిట్లున్నది, యెవ్వరు ప్రామాణ్యము లేనిదగుట తెలియజాలరు. ప్రతీతి మాత్రము త్రాటిజ్ఞానము గల్గినంతనే పాము దాని జ్ఞానము మిథ్యయగును. నిజముగా దోచుచున్నది సంసారవృక్షము. ఎందుచేత? దీనిమూలము తెలియనందున. గట్టిగా వ్రేళ్లు పాదుకొనియున్నది దీనిమూలము. పాముభ్రాంతికి త్రాటిజ్ఞానము, జగద్భ్రాంతికి బ్రహ్మజ్ఞానము. "జ్ఞానాదేవ తు కైవల్యం" జ్ఞానముచే మోక్షము. "తద్విజ్ఞానాదమృతత్వం" బ్రహ్మము నెఱుగుటవలననే మోక్షము. ఆ బ్రహ్మజ్ఞానమువలన జగద్భ్రాంతి తొలగ బంధము లేదు. సంసారము లేనేలేదు. కొండలన్ని నొకప్పటికి మన్నైపోవును. మన్నే గట్టిపడి కొండలగుచుండును. సముద్రము నదులగుచుండును. నదులు, సముద్రము వర్షమువల్ల నేర్పడి నదుల సముద్రమగుచుండును. వృక్ష

ములు, విత్తనములే యగును. విత్తనములే వృక్షములగుచుండును. అండములనుండి పక్షిజాతు లావిర్భవించును. వానినుండి వరుసగా సంతతము లగుచుండును. ఈ ప్రకార మీ మాయామయసంసారము రాత్రింబవళ్ల భంగి నావిర్భావతిరోభావముల నొందుచుండును. దీనికి నియమములేదు. ఆడతాబేటికి పాలే యుండవు, పురుషుడెన్నడు ప్రసవించడు, దున్న వెన్న దొరకదు, స్వప్నస్త్రీ చిక్కదు. ఎండమావులవల్ల దప్పి దీరనిభంగి నీ సంసారమెంతో పెద్దదిగా కనిపించుచున్నది. మూలము శుద్ధము. ఇదిగో నీ వొక్కడవే కూర్చొంటివనుకో, నింద్రియములు కదలలేదు, మెదలలేదు. నీ సంకల్పము కొన్ని లోకభోగముల వర్జించి, కొన్ని క్రొత్తవి తయారు చేయుచున్నది. నీవా శుద్ధుడవు, నీ సంకల్పమా దృశ్యమై దృష్టి సృష్టి యగుచున్నది. దీని తెగవేయుటకు కత్తులు, శస్త్రములు పనికిరావు. ఏ విధమున తొలగదు. వివేకము గలిగెనా, మిథ్యయని తెలిసెనా, ఇక నది నిలువదు. దాని సత్యమే దానికే యెఱుక, నీకేమి లేదు. దీనికి నాద్యంతము లేవని జ్ఞాపకముంచుకో. నీవెన్ని యుపాయము లొనర్చిన నిది చావదు. జ్ఞానమనుదానిచేతనే నిది తొలగును. అతి వేడియన్నము దిన్న కుక్క వమన మొనర్చిన భంగి, నీ సంసారవైరాగ్యము వెంటనే గలుగును. మిథ్య యగు సంసారవృక్షము ఛేదింపబడినమీద నిక దోపదు. మాంత్రికునిచే మంత్రింపబడిన గ్రహము పెత్తనము చేయదు. వైద్యునిచే తొలగిన రోగ మిక రాదు. రాత్రి కలలో ననునిత్యమువచ్చు సమస్తజీవుల కేది స్థానము? ఎటు బోవుచున్నారు? వారితో నీ వెల్లవిధముల ననుభవించు చుంటివికదా? జ్ఞానము లేకనే, మెలకువతోనే వాని నీవే నమ్మవుకదా? వానియందే నమ్మకము లేనపుడు నీవా స్వప్న సూక్ష్మయవస్థ యనుభ వించునపు డీజాగ్రత్సృష్టి స్థూలభోగము లేవుకదా. ఉన్నవనే జ్ఞాపకమే లేదుకదా. పగటిబాధ కలలో నీకేమి లేదుకదా. కలలోనిబాధ పగలు లేదుకదా. ఈ యింద్రజాల మెక్కడినుండి గలుగుచున్నది? నీవు లేక పోయిన గలుగునా? నీ వుండబట్టి దోచు నీభ్రాంతి యసత్యమనియు, నీ వొక్కడవే సత్యమను జ్ఞానమే మందు. "తతః పదం తత్పరిమార్గితవ్యం" ఎవ్వనినుండి యీ జగత్సంసారము ప్రకటనమైనదో, ద్వైతులు దేనిని సత్యమని నమ్మెదరో, జ్ఞానులదృష్టిలో నేది యెప్పుడులేదో, సూర్యునకు

తాపము చీకటి నట్లు లేవో, చంద్రున కుష్ణమెక్కడిది? శుద్ధాద్వయ బ్రహ్మకు నాద్యంతములులేవు. అదియు నీవై యున్నావు. ఈ సంసారమును విచారించి మూలపురుషుడెవ్వడా? మూలపురుషుని నేనని తెలియుటకే. నీవా పరతత్వము నెఱిగితివా, నీకీ సంసారలేశము లేదు. హృదయమనే భూమియందు వ్రేళ్లుపాతుకొనియున్న సూక్ష్మములగు విషయవాసనా నట్టును వైరాగ్యమను గుద్దలిచే పెకలించివైచి, గురుసన్నిధి ప్రాప్తకాలమున బ్రహ్మబీజముల నిత్తుకొని పూర్ణపంట బండినంతనే నాకలిదప్పికలు, సుఖదుఃఖములు, జన్మమరణములు, స్వర్గనరకములు తొలగి సర్వస్వతంత్రుడవై యద్వితీయానందుడవయ్యెదవు. క్షణికమని, యసత్యమని తెలిసిన వాని గోరువాడెవ్వడు? ఇందుకై వృక్షరూపమున వర్ణింపబడెను.

ప్ర॥ సంసారవృక్షమునకు మూలము పరమాత్మ. సంసారమును ఛేదించి పరమాత్మను బొందితేమాత్ర మేమి ప్రయోజనము? మరల బుట్టడా? పరుగెత్తిపోయి సముద్రుని గలిసి నది ఆవిరియై మేఘమై వర్షరూపమున మరల నది యగుటలేదా? పరమాత్మనుండే బుట్టిన సంసారమాయను జేరిన మరల నిప్పటిరీతి గల్గించునుగదా?

ఉ॥ సంశయము, నసంభావన, విపరీతభావనలు, త్రికాలప్రతిబంధకములు, భేదవాదులు, పామరజనసంగమము, చిత్తదోషములున్న తిరిగిరాకతప్పదు. కర్పూరముగరిగి యగ్నికలియు మరల కర్పూరమగునా? సాధారణ లయనివృత్తికాక, నత్యంతనివృత్తియైన సంసారమెక్కడిది? సంసారమేమాత్రము కనిపించుచున్నను రాక తప్పదు. కనిపించనపుడు వచ్చుటెక్కడ? పరమాత్మను బొందటము కాదు, కలియుటము కాదు. సాధనాసాధ్యమైన వరమాత్మ యింద్రియాతీతుడు. ఇంద్రియములు విషయముల గ్రహించగలవు. శుద్ధబుద్ధిద్వారా నభేదమును గ్రహించవలెను. ఒక నృపతి శత్రువు చేతులలో జిక్కి తమదేశమునకు గొంపోబడెను. అతని భార్య గర్భవతిగానుండి పారి మరొకదేశము చేరెను. కొద్దికాలమునకు శత్రువులాక్రమించిన దేశప్రజలు తమనృపతి ప్రాతఫోటోలనుబట్టి దేశమంతటా క్రొత్తఫోటోలను, రాతి కంచు మొదలైన విగ్రహములజేయించి యెల్లెడల వ్యాపింపజేసి, యేకలవ్యునివలె తమ ప్రభువు,

ప్రభుసంతతి వారెవరైన వచ్చినా గుర్తులగని తమదేశమేలవిరా, వారికి పట్టాభిషేకము జేయ నిశ్చయించి యింటింట గొల్చుచు, ప్రభు రాక కెదురు చూచుచుండిరి. రాణి కన్నవాడు పెద్దవాడై దేశసంచారమువచ్చి, నా దేశమున తమ తండ్రిగుర్తు లెంచుజూచిన యుండగను, తమ తండ్రియే యని నిశ్చయించి నా దేశప్రజలతో తన్ను తెలుపుకొని, వారు గుర్తించి నాతని రాజ్యాభిషిక్తు నొనరించిరి. తండ్రి కొద్దివత్సరములకు తప్పించు కొని రాగ, నెక్కడజూచినను తనస్వరూపములే నుండుట తనదేశముని గ్రహించెను. ఎక్కడజూచిన తండ్రిని గ్రహించటను, ప్రపత్తి, భక్తి నెందుజూచిన ప్రత్యక్షముగ తానేయుండుట జ్ఞానము. ఎవ్వనిస్వరూపములే సర్వమాయెనో, యెవ్వని తెలిసిన నిక తెలియదగినదిలేదో నది బొందిన తిరిగి రావటములేదు. బొందుట యన తానేనని దృఢముగ నమ్మియుండు టయే జ్ఞానానికి యవధి.

ప్ర॥ ఆ పరమాత్మను బొందు సాధనలు, నధికారుల జెప్పుడి?

ఉ॥ "నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః" సాధనలన యుపాయములు. సంసారమిట్టిదని గీతాశాస్త్రముద్వారా నెఱుగుటయు, దానికి మూలము పరమాత్మ యనియు, వయ్యది మాయా కల్పితమై గంధర్వనగరమువలె గనిపించుచు పూర్ణశాంతము లేకున్న దనియు, దానివలన గలిగెడు నల్పసుఖము శాశ్వతసుఖాల్పాంశమనియు, శాశ్వతసుఖస్వరూపుడు పరమాత్మయని యెఱిగి సంసారవాంఛను నిర సించుట వైరాగ్యము. వివేకమున నా పరమాత్మ తానేనని యెఱుగుట పూర్ణశాంతము లభింపగలదు. అయితే సాధకుడు పట్టినపట్టు విడువక నశాశ్వతమగు సంసారాభిమానము వదలితే నహంకారము నంకరింప నపుడు, తల్లివేఱు గిల్లివేసిన చెట్టు సమూలము నెండుపగిది, సర్వసంసార నాశమగును. సినిమా వదలినమీదట నుండు నిర్మలమురీతి, మేఘము, దానివలన గలుగు నుఱుములు, పిడుగులు, వర్షములు తొలగిన నతినిర్మల మగనున్న యాకసముభంగి, నుఱుగుకుప్పలు, జలతరగలు, బుద్బుద ములు, సుడులు నీరే లేకపోయిన నీ కలకలము లేనిలాగు, గ్రీష్మఋతు వంతరింప వేడిపవనము లేనిపగిది, వలనుండి,బోనునుండి విడివడుమృగపక్షుల

చందము, దరిద్రత తొలగి సుఖమైన సంసారిభంగి, రోగములమాగి యారోగ్యమొదవినపగిది, గర్భస్థుండై పడుబాధల నావిర్భవించిన తప్పు జీవునిగతి, శత్రురాజునుండి విడుదలమైనవానిరీతి, నెవనిబంధుర సంసార మూలకారణమగు నభిమానాహంకారములు, వీనికి తల్లియగు నవిద్యయు, బాసటయగు నింద్రియములు, వాని యిరుగులగు విషయములు నార్జించి యుంచిన సంచిత త్రివిధకర్మఫలము, వీనివలన మాటిమాటికి గలిగెడు సంయోగవియోగఫలములగు సుఖదుఃఖములు, నుచ్చనీచ స్వచ్ఛతాస్వచ్ఛ తలను యనుయాయుల, బంధుమిత్ర, భృత్యకళత్ర, సుహృజ్జనగృహారామ క్షేత్రాదివస్తునిచయాసక్తివదలి నిరహంకారియై పూర్ణజ్ఞానవిజ్ఞాన తేజో మయుడై, కట్టలుదెగి పొరలివచ్చు చెలువునీటివలె, వజ్రకఠినమగు నజ్ఞాన కల్పిత మృతగోడలువిఱిగి తుత్తునియలై పూర్ణానందమయామృత సాగ రమునుండి పొంగి పొరలివచ్చు 'అహం బ్రహ్మాస్మి' యను వీచికల కడ్డులేని నిర్భయాద్వయాభేదుడై, స్వయంప్రకాశుడై వియన్నదీతరంగ ముల పద్మనాళములమెక్కుచు, వీచికల రెక్కలనుండి డోలికలనూగు రాజహంసభాతి యాత్మానాత్మలవిచారించి యసత్యమగు సంసారమునకు విలక్షణుడై, బ్రహ్మానందసుఖసాగరమున తేలు మహనీయమూర్తి యహం కారమభిమానము నాసక్తిలేక ద్వంద్వములు లేనివాడై యుండును. పైన జెప్పిన సాధనలబొందితే పరమపదుడగును.

ప్ర॥ ఆ పరమాత్మస్థానము పెద్దపెద్ద నగరములున్నట్లుండునా? లేక యెట్లుండును?

ఉ॥ పురుగులతో, దుర్వాసనతో, కుళ్లిన వస్తువులతో, చెమ్మ నేలతో, మలమూత్రముల రొంపితో, ఝుంమని మునరు నీగలగుంపులతో, దోమలతో, చీమలతో, గబ్బిలములు, రిల్లలు, మిడుతలు, చెదలు, ఎలు కలు, తొండలు, బల్లులు, నల్లులు, పాములు, కప్పలు, చెత్తచదార ముతో నెక్కువ వెలుతురుజొరని యిరుకుస్థలమున నెవరు నివసింతురు? ఇట్టి స్థలమును బహిష్కరించి నిర్మలము, సుగంధయుక్తము, తేజో మయము, పరభయదూరము, నిర్భయము కోరుదురు. అపగిది యీ లోకమేకాదు నేలోకమున కేగిన దుఃఖమయము బహిష్కరింపబడు నవిగానున్న, పెద్దనగరములైన నేమి, చిన్ననగరములైన నేమి, యివియన్ని

కల్పితకట్టడములు. ఒకదినము సుఖనిద్ర నొందితివనుకో. ఆ సుఖనిద్ర కేరూపము గలదు? ఎట్టి పట్టణములైన, నెట్టివస్తువులనైన సుఖనిమిత్తము లంటే. పట్టణాదులగు దృశ్యములవలన, సంకల్పములవలన నా సుఖము దొరకదు. సుఖమునకు రూపనామములులేవు. అదియే పరమపదము. పలుమారు మొఱబాసిన నీ తనయునిగుఱించి దుఃఖించు నీకు తనయుడగు పింప గలుగునదేమిటి? యానందముకదా? ఇది యెంతసేపుండును? వస్తువుల నానక్తివలన గలిగే యానందము క్షణికము. పూర్ణానందమే పరమ పదము. కామక్రోధాదులులేని యాస్థానము "న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః" సూర్యచంద్రాగ్నులు నేదిలేకున్న ప్రకాశింపగలవు. ఏదియుండిన ప్రకాశింపలేవు. సూర్యచంద్రాగ్నులు నెవ్వనివలన ప్రకాశింపుచున్నవి? చీకటి ప్రకాశింపజేయునది. శూన్యమును ప్రకాశింపజేసి, శూన్యముగాక తనకు తానేయైనది. తనయందొకటి లేదు, తానన్నిటి యందున్నది. అదిగో నదియొక రాతిగోడ. దానియందున్న వివిధవిగ్రహముల ప్రకాశింపజేసినది సూర్యచంద్రాగ్నులా? కాదు. రాయియే. రాతిని నా విగ్రహములు ప్రకాశింపజేయలేవు. విగ్రహముల ప్రకాశింప జేయునది, నవి యన్ని తానేయైనది. వాని ముక్కులు, కన్నులు, కాళ్లు వేయేల,నవయవముల ప్రకాశింపజేయుచున్నది. నావిగ్రహములు లేనపుడు తానే ప్రకాశించుచున్నది. అవి యున్నపుడు తాను ప్రకాశిల్లుచు వానిని ప్రకాశింపజేయుచున్నది. రాయియే లేదా, విగ్రహముల కునికియేలేదు. రాతినిగాదని విగ్రహముల వేఱుచేయ సాధ్యమా? కాదు. విగ్రహములు దేనిమఱపించుచున్నవి? రాతిని రాతిగగ్రహించిన విగ్రహములు బాధింపబడినరీతి, సమస్త లోకాలోకములు నెవ్వనియందు భాసిల్లును? ఎవ్వనిగాదని ప్రకాశింపలేవు? వేఱుచేయగాదు? ఎవ్వని మఱపింపజేయుచున్నవి? ఎవ్వని తెలిసిన నివి బాధింపబడును? అదియే సచ్చిదానంద ఘనపరబ్రహ్మము. సూర్యుడు ప్రకాశించిన నక్షత్రములు ప్రకాశింపనివగిది నా వ్యాపకమూర్తి ప్రకాశించిన నివియన్నియు తేజోహీనము లగును. "ఆనందం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి" ఆనందమయమునొందిన భయములేదు. ఉప్పుబొమ్మను సముద్రమునవేసిన, కర్పూరము నగ్నిలో వేసిన, మంచును నెండలోబెట్టిన మరల తమరూపము లొందలేవు.

భగవంతునకు సంసార నివర్తులగు దేహాభిమానయుతులై యుండిన జీవులకు నింతకుముందు భేదములేదు. భేదము భ్రాంతియే. భ్రాంతివదలిన యంతా నభేదమే.

ప్ర॥ జీవులెవరు? శరీరముల గ్రహించు టెట్లు? వారి స్థితిగతులు జెప్పండి.

ఉ॥ జీవులే లేరు. జీవులున్నారను ద్వైతమే స్వర్గనరకముల, పుణ్య పాపము లల్లినది. "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః" తూర్పు పడమరగ ప్రవహించేగాని నేమనెదరు? నదులనెదరు. ఈ నదు లెవరి యంశములు? సముద్రాంశములుగాదా! మేఘములై వర్షమై నదులుగా పారుచున్నది. అదిగో రాముడు, వసిష్ఠుడు. వసిష్ఠుడనెను: రామా! సీత నీకేమి కావలె? భార్య. లక్ష్మణా! సీత నీకేమి కావలె? వదిన. లవ కుశులారా! మీకు? తల్లి. హనుమా! నీకు? జగన్మాత. కౌసల్యా! నీకు? కోడలు. జనకా! తమకు? కూతురు. రాముడా! తల్లి, కోడలు, వదిన, కూతురు యనే వరస లెవరియంశములన సీతయంశములనెను. చూచితివా ఒక సీతయే వారి వారి యభిమానములకు నిన్ని యంశములైనది. ఒక్క దేవుడే కల్పిత మాయాశరీరముల నభిమానించుట నిన్ని యంశములాయెను. సర్వవ్యాపియగు బ్రహ్మమే నవిద్యోపాధిచే నాభాసుడు లేక జీవుడుగా నున్నాడు. "క్షిణోతి ఆత్మానం అవిద్యయా" అవిద్యచేత నానావిధము లుగా కనపడుచున్నాడు. "వాచారంభణం వికారో" వాక్కుయొక్క వికారములే నాకారములుగాని యాత్మ కేవికారము లేదు. జలమునందలి, యద్దమునందలి సూర్యప్రతిబింబములవలె నుపాధిభేదముల నంతఃకరణ యుక్తుడై, సుఖదుఃఖముల భోక్తగా, కర్తగా నున్నాడు. దేహేంద్రియ ప్రాణములన్నియు జడములు. జడమగు నంతఃకరణముతో గూడియుండ బట్టియే వ్యవహారము జరుగుచున్నది. గమనాగమనములు, పంచవిధ భ్రాంతులు, సప్తావస్థలు గలుగుచున్నవి. పరిమితిస్థలముల, పరిమితి కాల ముల నుండుటచే జీవుడనబడును. జన్మించుట, మరణించుట యను వ్యవ హారము నంగీకరించుట జీవలోకము లేక సంసారమనియందురు. బుద్ధి గాని, మనస్సుగాని పరిణామము నొందగలవి. వానికి నొకరూపములేదు. స్థూలమునుగాని, సూక్ష్మమునుగాని చూచి నా రూపము నొందును. ఆ రూపముల తెలుసుకొను శక్తి వాని కెక్కడిది? చిదాభాసయందుండియే

నవిద్యను భంగించి వస్తువూప [illegible] జూపి [illegible] నను కొనును. ఒక పట్టణమున నెక్కలేన్ని కొళాయిలున్నను, ఆ కొళాయిలన్నిటికి నొకే నీరు. కొళాయిలాలే [illegible]. కొళాయి యున్నంత స్థలమున, కావలసిన పరిమిత కాలములోనే నీరు కొళాయి నీరంచును గాని యుదెక్కడిది? [illegible] మైనది. అదేవిధముగా పూర్ణుడగు పరమాత్మ మూడవస్థలు, రెండవస్థలు, నొకే [illegible] వస్థగల సమానావయవముల నంతఃకరణోపాధులున్నచోట సుఖదుఃఖముల తెలిసికొనుచు [illegible] తనవిదేమే యనుకొనుచున్నాడు. అంతఃకరణము లేనిచో [illegible] నున్నాడు. పెక్కుజీవులుగా నా రెక్కడే [illegible] పించుచున్నాడు. పంచేంద్రియముల విషయముల తెలిసికొనుచు కర్తయు భోక్తగా నటించుచున్నాడు. [illegible] స్వరూపమును మఱచినాడు. ఆకాశమంతట [illegible] వాయువున్నదియా? లేదా? ఉన్నది. అయితే శరీరములలో జేరి [illegible] వాయువు యేమనిపించుచున్నది? ప్రాణమనిపించుచున్నది. మఱియు దశవాయువు లనిపించుచున్నది. పదివిధముల బరగుటచేతనయితే యది ఒకేవాయువు కాదందురా? ప్రతియింట వెలుగు కరెంటులైట్లు నొక్కవిద్యుత్కేంద్రములోనివి కాదందురా? ఎంతప్రపంచమున్న నన్ని బుడ్లు రంగురంగుల కలవు. బుడ్లు వేఱేకాని, జ్యోతి ఒకటియే. తత్స్వరూపము నుపాధినిబట్టి జీవుడందుము. లేనిచో “జీవో దేవో సనాతనః” సనాతనదేవుడె జీవుడు. సోని మఱొకరూపముగా నున్నాడని నిరూపించువారుగాని, ఏరూపములో తనను కన్నదేవుని దర్శనము గలిగెనన్న బొందెడిదేమి? ఆ పొందుస్థితి యెఱిగిన భేదములే లేవు. అయిదింద్రియములతో నెంత దేశమైన తిరుగగలడు. అంతరేంద్రియములకే నన్ని దేశములనైన జూడగలడు; సృష్టించగలడు. నిజముగా నీతడాతడేయున్నది యుపనిషత్తు. “శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః” నిప్పునుండి మిణుగురులవలె బయలుదేరిన యనంతాత్ములగు నాత్మ సూర్యరశ్మితో నీరు కంటికి నగుపించక మేఘమై, వర్షముగా నదియై, పరిమితస్థలమున ప్రవహించును. సంచితములోని కర్మఫలములగు సూక్ష్మవాసనలనే కోరికలతో బయలుదేరి యుద్యోగస్థుడు తన సామానులగొని మఱొకమార్పు స్థలమునకేగుభంగి, లేదా జయిలునుండి పోలీసులు మఱొక జయిలునకు

గొంపోవుభంగి, కర్మఫలమనె యుత్తర్వుతో పోలీసువలె నహంకార మమకారములు గొనిపోవును. "అస్థైనమేతే అభిసమాయాంతి అన్యన్నవతరం కురుతే కల్యాణతరం శరీరే" పుట్టునపుడు శరీరమునుండి వెళ్లునపుడు సుషుప్తినుండి వచ్చి నింద్రియాదుల నాకర్షించుచు తుమ్మెద ప్రతి పుష్పమున వ్రాలుచు లేచిపోవువిధము, వలయు శరీరమును బ్రతికియుండగనే వాంఛించి, వాయువు పుష్పాదుల గంధము హరించినరీతి నెవరికి గనిపింపక మానసేంద్రియాదుల వెంట గొనివెళ్లును. నూతన శరీరమున ప్రాత యింద్రియములే నుండును. సుషుప్తినుండి లేచినరీతి రెండవశరీరమున నీ యింద్రియాదులనే నాకర్షించును. ఆయన సర్వస్వము నేనుయన వ్యక్తిత్వము నేను యనుట నర్వమునైన నేను వ్యక్తమైతినని తెలుపుట. సూర్యుడస్తమించినపుడు తన కిరణములలోనికి గొనిపోవురీతి, తాబేలు శబ్దమును విని యవయవముల లోనికె ముడుచుకొనుపగిది, బొమ్మలాటకాడొకయూరు వదల తన బొమ్మల వెంట గొనిపోవుచందము, సూక్ష్మశరీరసంబంధముల గొనిపోవును.

ప్ర॥ జీవుడు పోవట మెవరికి కనిపింపకపోవటమేగాక, పునర్జన్మమెత్తునంటే నాకది సందేహము. దేహము పంచత్వమునొంద భూతాంశములు, భూతములు గలియ జన్మించు టెలాగు?

ఉ॥ నేను నీతో నొకవిషయము జెప్పుచున్నాను. నీవు వినుచున్నావు. ఒకప్పు డిప్పుడేమి జెప్పితినని యడుగ, వెంటనే యేమందువు? నేను వి న లే దు; నా మనస్సెకడికో పోయినదందువు. ఇకచెప్పు, నీ దేహమా యుండేయున్నది. ఇక్కడవిషయము తెలిసికొనేది లేదు. అక్కడింకొకవిషయము తె లి సి కొ ను చు న్న ది. ఆ విషయము సమీపమున నుండవచ్చు లేదా దూరమున నుండవచ్చు. ఆవిషయ పరిణామముదాల్చిన దేది? మనస్సుకాదా? ఆవిషయమును తెలిసికొనేదియేది? మనోపరిమితుడగు నాభాసుడే. నాభాసుడు మనస్సు లేకపోయినను, లేకపోయిన శూన్యము, మనోయాభాసకుల ప్రకాశింపజేయునదేది చెప్పుము? అదియే నంతరాత్మయగు తాను. సూక్ష్మశరీరములోని యిల్లుయనే వాసనతో వృత్తి నాకు తెలియకుండ పోయినది. అది యెవరు చూడలేదు. ఎవరికి గనిపింపలేదు. కోటలు, కొత్తళములు, వజ్ర కఠిన

గోడలు నావృత్తిని యడ్డగింపలేదా. ఆ పోయినవృత్తి జడము. వృత్తి విషయము గ్రహించునది ప్రమాతృచైతన్యము. ఇక్కడ మనస్సులేదు. వాడు లేడు. అందువలన వినలేదంటివి. ప్రాణవియోగకాలమున నే లోకము నే వాసనతో నుండే సాలెపురుగువలె గూడునల్లియుండు వాసన నా యింటికే తోడుకొనిపోవును. జనములగు టెలిఫోనుద్వారా మాట్లాడేది యెవరు? నాభాసకుడా? కాదా? చెప్పు. స్థూలదేహములోని భాగములు స్థూలభూతములలో కలిసినను సూక్ష్మశరీరముమాత్ర ముండును. అది యున్నంతవరకు సూక్ష్మశరీరముతో జన్మమరణములు తప్పవు. ఒక స్వప్నమున తానే నందరతో మాట్లాడటము, తనతో నందరు మాట్లాడటము జరుగును. అందు వచ్చినవారి రూపములు, వారివారి సంభాషణల నెఱుగుట, మాట్లాడినదెవరు? మెలకువరా నీవొక్కడివేకదా యుండటము? "శ్రోత్రం చక్షుఃస్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ" జీవుడు శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వా ఘ్రాణేంద్రియముల నాశ్రయించి, శబ్దస్పర్శరూప రసగంధ విషయములను మనస్సుయొక్క సహాయముతో ననుభవించును. ఒక పండితుడో, శిల్పియో, మరే లలితకళాపోషకుడో తనయున్న స్థలమునువదలి మరొకస్థలమునకు బోదురు. తమయందలి విద్యల పోవునప్పుడెచ్చట యుంచుకొని యుందురు? అక్కడ ప్రారంభమగుటకు ప్రాతదికానిది వారలకెట్లు స్ఫురించును? ఫోటోయెత్తినవాడు యిరుప్రక్కలనున్న వస్తువులకొన్ని యెత్తును, ఫోటోననుసరించి యువియున్నియు వచ్చును. ఎక్కడ పోయిన గొప్పయుద్యోగిని యనుసరించివచ్చు పరిజనులవలె నింద్రియములుండి, మనస్సుయుండి పోయిన స్థలవిషయముల నాకర్షించును.

ప్ర॥ జీవుడు యింద్రియములచే విషయముల భోగించటమేలాగు? మరణానంతరము సూక్ష్మశరీర ముండునా?

ఉ॥ తాను పురుషోత్తముడనునది యెఱుగక నవిద్యామహిమ స్వరూపానందము, వాని నిమిత్తమున నొక క్షణభంగురముగలుగ నా విషయేంద్రియసంయోగమువలన పూర్ణానందము లభించునేమోయను పొరబాటు లేక భ్రమ. విషయేంద్రియముల నా స్వల్పానందము లభించనిచో నాతడేల విషయముల సేకరించును? అవిద్యతోగూడినను స్వరూపానందమే గోరుచేల? ఎక్కడనో యున్నదని, యది తనయందే యున్నదని

నెఱిగిన ననిశ్చయమే లేదు. చంద్రుని గోత్రీయుని మఱచి ఎందింత గొల్లదు వెంట భంగి, పురుషుడు స్త్రీ సమానవేసి తన పురుషరూపము మఱచి పురుషుని కౌగలింపగోరురీతి, నీటివంతెన పై నోట మాంసమును పట్టుకొని పరుగెత్తు కుక్క నీటిలో తననీడను, మఱియొకకుక్క నోట మాంసమున్నది యని నవధారించు నీట దుముకిన చందము, తన్ను మఱచ గలిగిన యవిద్యయే మనోరూపపరిణామము నొంద దానితో నుపభోగిం చును. ఒకయింట కొడుకునకు తెలియకుండ తండ్రి నొక నిలువుటద్దము తెచ్చి గోడకు వేసియుండ, వెలుపలినుండి లోపలికి వచ్చుకొడుకు దానిగని దూరమునుండి యెవడనుకొనెను. కాని యా ప్రతిబింబము పలుకక పెదవు లల్లాడించి నోరు తెఱచుటగని గట్టిగనఱచ నాతడు మొదటిరీతి యుత్తిన యించెను. ఇంతలో తండ్రివచ్చి యేమిరా! గద్దించుచున్నావన, నా కాలు డెవడున నవ్వి నీవేననెను. దగ్గఱకు తోడుకొని పోయి చూపించ నతడే. తద్విధము అంతఃకరణోపాధిగుడెవరు యుని యెఱుగని యవిద్య సూక్ష్మశరీరాంతర్గతములగు వాసనలే బ్రతికియుండగ సంకల్పరూపమున విషయానుభవమునకు పరుగెత్తును. విషయానుభవమువలన గలిగే సుఖ లేశము, తన స్వరూపాంశము మేఘమున విద్యుల్లతవలె మెరసిపోవును. దగ్ధబీజవత్ జ్ఞానముచేత దహింపబడనంతవఱకు సూక్ష్మశరీరముండును. దానివలన స్థూలశరీరము ప్రాప్తించును. ఇంద్రియములల యేయొక్క విష యము స్ఫురించిన దానివలన గలిగే సుఖమో, దుఃఖమో యనుభ వించును. దుఃఖమననేమి? సుఖవియోగమే; లేక తనవియోగమే. రాముడు ముందు, మధ్య సీత, వెనుక లక్ష్మణుడు బోవుచుండిరి. రాముని విడువలేకనే భార్యను యింటవిడిచి లక్ష్మణుడు వచ్చెను. అయితే యేమి ప్రయోజనము? సీత మధ్యయుండుటయు నామె పైటచెఱగు రాముని గనకుండ చేయుచుండటయు, నీమె దగ్గరనున్న జోత్తిగా రామదర్శనము లేకునికి లక్ష్మణుడు దురపిల్లెను. దురపిల్లుటయే దుఃఖము. ఎందువలన? రామదర్శనము లేనికతన. అతీ యాత్మానందసుఖము లేకపోవుటయే దుఃఖము. "ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్" మనస్సు సహాయముతో నకర్తయైన, నభోక్తయైనను, కర్తృత్వభోక్తృ త్వములు గలవానిగా నుండు నా జీవుని రాకపోకలు, స్థితిగతులు యజ్ఞాను

తెలియజాలరు. విషయాసక్తులగువారు గాలిచేత మార్గము దప్పించబడిన నావవంటివారగుట వలననేమి. అంతర్ముఖ ప్రవృత్తిగలవారు జీవుని తెలియుదురు. బహిర్ముఖు లెన్నటికి తెలియలేరు. బుద్ధికి సాక్షిగాను, జాగ్రదాద్యవస్థల సాక్షిగాను నా యాత్మను శాస్త్రదుల, జ్ఞానాభ్యాసపరులు, యోగనిరతులు గుర్తెరుంగుదురు. శబ్దము వాస్తవముగ నాకాశముయొక్క గుణము. ఉరుములు మెరుపులందు శబ్దము మేఘములకే నారోపింతుము. ఆకాశమునందు మేఘము కలచోట గాన్పించును. ఘటాకాశ, మఠాకాశములు, ఘటమఠములవల్ల గలిగినవి. ఆకసము లేనిచో ఘటమఠములుండవు. "యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్" దృశ్యవస్తువువలె ప్రత్యక్షముగ నింద్రియములకు తెలియబడునా యనవచ్చు. దృశ్యములగు వస్తువుల జూచు దృక్కు మిథ్యాజ్ఞానమగుటచే మిథ్యావస్తువులు గాన్పించును. ద్రష్టయగు నాత్మను బోధపరముగ విధిముఖ నిషేధముఖమున జ్ఞానులు తెలియుదురు.

ప్ర॥ సప్తమనవమదశమాధ్యాయముల విభూతుల వివరించుట భగవత్తత్వము సులభముగా తెలిసికొనవచ్చు. ఈ యధ్యాయమున విభూతుల నేమైన జెప్పెనా?

ఉ॥ అవును వర్ణించియున్నాడు. "యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్" "గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా" "అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః" "సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్జ్ఞానమపోహనం చ" 12 నుండి 15 శ్లో॥ వఱకు విభూతుల తెలుపుచున్నాడు. తనయుడు వృద్ధుడగుచు రాగా తండ్రి తన యావదాస్తి యింతవున్నదని కొడుకునకు చెప్పినట్లుగ ఇది శ్రద్ధావంతుడై, నాకలింపు జేసుకొను నర్జునుని జూచి భగవంతు డిట్లనియె: అర్జునా! అతిరహస్యములగు వానినెల్ల నీకు వివరించుచుంటిని. శక్తించి చిలుకునపుడు పాలకడలిలో నమృతము, పెరుగున వెన్న గలుగురీతి విజ్ఞానవంతుడవై ప్రపంచము పారమార్థికములో లేదు. వ్యావహారికములో నుండునది బ్రహ్మమే. ప్రాతిభాసికముగ గల్గు భ్రాంతి వీడుటకు శ్రవణము సుఖసాధనము. నైమిశారణ్యమున మహామునులు నిరంతరము

మథించి పూర్ణానందమైన విపులరహస్యము నీకంటే నాకన్యుడు లేనందున తెల్పుచున్నాననెను. వివేకానందస్వామితో రామకృష్ణు డీరీతి జే యునెను. దశదిశలు వ్యాపించిన యపరిమిత సూర్యకిరణములకు కారణము సత్తా రెండు సూర్యుడే నంటాము. సర్వత్రనున్న యగ్ని వ్యాపకాగ్ని దానియంశములె. భిన్నములుగ దోచు దీపకలికలు, సూర్యచంద్రాగ్నులనుండి జగత్తును ప్రకాశింపజేయు తేజము యెవరిది? అది భగవంతునిదే. చరాచరముల భరించు, భూమియందలి సత్త, చంద్రుని యందుండి వ్రీహియవాదులగు నోషధులను పోషించుశక్తి భగవత్సత్తాయే. ఒక యంత్రము నీకుండే గ్యాస్ యనేది యంత్రచక్రములనన్నింటిని కదలించుచున్నది మనము జూచుచున్నాము. ఈ జగచ్చక్రమునకు శక్తి పరమాత్మయే. సకల ప్రాణులు తినబడు వివిధాహారముల జఠరాగ్నిరూపమున జీర్ణము జేయునదెవరు? పరమాత్మయే. "ఆత్మతః ప్రాణాః" తానే ప్రాణరూపుడై శరీరమునందంతట నిండియున్నాడు. అగ్ని ఘటమును వేడిగలిగించి యటువెనుక లోని నీటిని దానిమీద తండులముల నుడికించి యన్నమును గలిగించుచున్నది. అగ్నియే నింతటికి కారణము. భగవంతు డీరీతి సూర్యునినుండి చంద్రునికి, నాతనినుండి పృథివికి, దానినుండి నోషధులు పండుటకు కారణమగుచున్నాడు. ఒక్క కరెంటు జీవుల ప్రాణముల దీయుటకు, నెల్లదిశల లైట్లై వెలుగుటకు, రైలు విమానములుగా పోవుటకు జలయంత్రముగా పనిచేయునది యొకేయొకటి. అదియే నాత్మయగు పరమాత్మ. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని హరి యెక్కడెక్కడుండునన యంతటా నున్నాడనెను. శ్రద్ధాభక్తి, విశ్వాసక్తిగలిగి విపర్యయదురాగ్రహుడైన హిరణ్యకశిపుడు నీ స్తంభమున జూపగలవా? యన, జూపుమని నొక వ్రేటువేయ నందుండి నృసింహాకృతి యుద్భవించెను. ఆబ్రహ్మస్తంభపర్యంతంగల ప్రాణిజాతముయొక్క హృదయమున నివసించు చిలుక మొదలగు కల్పిత చక్కెర బొమ్మలనంతట చక్కెరయే లోపల వెలుపలనుండురీతి, పానకము పాత్రమున, నాకసమంత నిండియున్నవగిది, ప్రతి శరీరమున పూర్వజన్మస్మృతిని, యుత్తరజన్మస్మృతిని గలుగకుండ జేసి కాలదేశవస్తువుల నెఱుగక మఱపు గలిగించుచు, వేదముల నాల్గింటిని తెలియువాడు తానేయై, వేదాంత సంప్రదాయ ప్రవర్తకుడగు జ్ఞానగురువు

తానేయై, వేదార్థవేత్తయునైన మహామహుడు భగవానుడే. ముత్తెపు చిప్పను బడిన నీరు ముత్తెము, సర్పము పై బడిన విషమగును. ఒకే విద్యుత్కేంద్రమునుండి వెలిగించగల లైట్లు కొన్నిస్థలముల సరిగా వెలుగుటలేదు. కొన్ని స్థలముల స్వచ్ఛముగా నెక్కువ ప్రకాశవంతముగ ననేక స్థలములకు వెలుతురు నిచ్చునదిగా యుండును. ఉపాధుల భేదమే గాని వెలుతురు లోపములేదు. ఒక యింటికి చిన్నకిటికీలున్న వెలుతురు లోపల కొంచెముగా నుండును. కిటికీలు పెద్దవియైన సూర్యుని వెలుతురంతటా ప్రకాశిల్లును. భగవత్కళలు నెక్కువ ప్రకాశించుటకు నాయా యుపాధులభేదమే. సర్వసమానముగల భగవంతుడే నాయా నుపాధుల ప్రకాశిలుచున్నాడు. వ్రేలుజూపిన హస్తము దిగమ్రింగునను సామెతరీతి, రొకటిచెప్పిన నంతయు గ్రహించువాడీగురుతులబట్టి భగవంతుని సులభముగా తెలుసుకొనును. స్వాభావికమునుబట్టి క్రియలను, వాక్కులను బట్టి కొందఱు మనుష్యుల నెట్లు గ్రహింతుమో భగవంతుని నట్లు గ్రహింపవలె. గురుసేవారతులు, సజ్జనజనప్రియులు, వైరాగ్యవంతులు భగవంతుని సులభముగ గ్రహింతురు. ఎఱుక మఱుపులు గల్గించుట కహంకారాభిమానములే. దుర్యోధనాదులు యాదవుడు గొల్లకృష్ణన్న యనుకొన్నారు. పాండవ విదురాదులు మనపాలిటి పూర్ణావతారుడైన నారాయణ భగవంతుడనిరి. వారి హృదయ మారీతినున్నది. భూమి యొక్క లావునుబట్టి పంటపండును. స్వచ్ఛతాస్వచ్ఛతల బ్రకాశింతును. సందేహములేదు. అజ్ఞానమను సముద్రతరంగములు నీటిని మఱచిన రీతి, మత్స్యము నీటయుండి దప్పికైనతరి నీటిని గ్రహించుభంగి సర్వత్రా దేవుడేయుండి యహంకార మమకారముల తెరలచాటున మంచుగ్రమ్మిన, మేఘమాచ్ఛాదించిన కనపడని సూర్యునివలె యున్నాడు. జ్ఞానాజ్ఞానమునకు మూలము తానే. వివిధగతులగుటకు నాకసమె. త్రాడే సర్పము. త్రాడు జ్ఞానము, పాము జ్ఞానము భగవంతుడే వేదములు నాలుగుగా ప్రకాశించుటకు, నలుదిశల నదులు సముద్రమున గలయుకొఱకురీతి 'అహం బ్రహ్మాస్మి' యను హద్దువఱకు వచ్చిపోవును. భగవంతుడీరీతి నానందసాగరమున నుయ్యాలలూగించుచు నర్జునునితో తన విషయమంతయు జెప్పుచుండ నర్జును డీరీతి యడిగెను. మహాత్మా! నీవు చెప్పు

చుండ నంతపిండ బ్రహ్మాండ మంతయు నీవు నన్ను గుర్తెన్నటి గ్రహించు టయే లేదు. నేను యనెడు చిన్న అహంకార జలబిందువు నిండనగినదో తెలియదనెను. పిల్లమున పొందెడు ముప్పుగలిగినప్పుడు బోయిన తీర్పు చెడునను రీతి భగవంతుడు డీరీతి యనెను. జన్మమునకు కారణము, భిన్నములుగా దోచ టయు, నా యవ్యక్తతత్త్వమును వ్యక్తపరచుటకేగాని వేఱుకాదు. ఇంద్రియములద్వారా భూతభౌతికములుగాను, బుద్ధిద్వారా జీవులుగాను, పారమార్థికజ్ఞానముద్వారా బ్రహ్మముగను నెఱుగుచున్నారు. ప్రపంచమున పాపము, పుణ్యము, శుభము, అశుభములను ముసుగులతో తప్పుదారి నప్పుడొను నరున కీవిశ్వము వికారరూపముగ, ఘోరవస్తువుగ మారి కన్పించును. భోగముల వాంఛించువారికి నీ జగత్తేమారి స్వర్గముగ కనిపించును. ఇక జ్ఞానమూర్తికి నీ బ్రహ్మాండమెందు దోచక నంతయు తన యాత్మయే గానిపించును.

ప్ర॥ సర్వైక సమస్తము తానేయైతే చైతన్యము మనస్సు నేనేనని విభూతియోగమున జెప్పెను. ఇక పుణ్యమేమి? పాపమేది? చేసేదెవరు? జన్మమేది? దుఃఖమేది? బోధలేల? శ్రవణమేల?

ఉ॥ వినబట్టి యీ విషయ మిట్టిదని తెలియ నడిగితివి. శ్రవణము చేయనపుడు నీకేమి తెలియు? తెలియనితనమే సర్వానర్థకములు గల్గించును. నీకు తెలిసిన తెలియనివారికైన యవసరమేకదా! ఒకప్పుడు తన భార్య, తల్లి యొకేయెత్తులోని స్త్రీలు నొకే వలువలుధరించి నింటికి వచ్చుచుండ వెనుక నెచ్చటికో బోయివచ్చు పురుషుడు తల్లిని భార్యయనియు, భార్యను తల్లిగాదలచి పిలిచెను. వారు విని నిలిచిరి. తను దలంచిన తప్పుభావమునకు పశ్చాత్తాపపడెను. ముందెన్నడైన నట్లు చూడ గలడా? చూడడు. సమస్తము పరమాత్మయే, తాను పరమాత్మయే యన్నపుడు భిన్నభావ మంతరించినపుడు ద్వైతములేదు; బంధములేదు. ఇక చేయవలసినదేముండును? శుద్ధమైన మనస్సు, శుద్ధమైన చైతన్యము నేనన్నది నిజమే. మలినముతోడి మనస్సు తన్ను గనలేదు. మలినయుక్తచైతన్యము తన్ను తెలియలేదు. పరమాత్మవిషయమేమి తల పెట్టుదురు? తెలిసి సర్వము తానేనన్నపుడు పాపపుణ్య జన్మమరణములు

క్షేత్ర. జ్ఞాన [illegible] త్ర [illegible] క నవేషుసే? ధేమా!
అక్కడి [illegible] ?

ప్ర: [illegible] నయిత్రే
నుండి [illegible] ?

ఉ: అందఱను నీ దృష్టి భౌతికపదార్థముల జూచి భేదము సాధించెద వంతేకాని, యందఱిలో [illegible], [illegible] జీవాత్మానముగా ని జూచిన నీ మాట [illegible]. [illegible] శోకముల [illegible]? కాదా? ఇదిగో వస్త్రమున్నదొక [illegible] ని [illegible] నెఱ్ఱగా, నొకటో తెలుపుగా, నొకచో నలుపుగా, [illegible], [illegible] నవ్వుచున్న వర్షమును, మేఘమును [illegible] భేదము [illegible]? ఉపాధిభేదములే కొనరా? ఒకే చెట్టువిత్తనము లనేకస్థలములు, సరాలుముల వి త్తినను కొన్ని మొలవవు, కొన్ని మొలిచి వృద్ధినొందవు, కొన్ని ప్రసిద్ధినొందును. ఇప్పుడేమందువు? భూమిభేదమే యందువు గదా? ఒకే కాలేజిలో నొకేదినములో చేరిన కొందఱు తప్పుటయు, కొందఱు ప్యాసగుటయు, కాలేజీ టెక్స్టుబుక్స్, టీచర్లు తప్పిదమా? చదివెడివారి బుద్ధి పక్వమయా? ఇంతకెక్కడిదనుమన్న నీకే. పరమాత్మ [illegible]. [illegible] విషము, తేలుకొండియందు విషము, వస్తుపదార్థముల నుత్తయున్నను వానికేమి హానిలేదు. తక్కినవారికే ననగా భేదబుద్ధిగలవారికే ద్వంద్వము, బంధము తప్ప సమదృష్టుల కేమిలేదు [illegible]ముదము నన్నులకే భయము. భగవన్మాయ నితరులకే విషమువలె భయము. భగవంతునకు, భగవద్భక్తుల కేమిలేదు. మాయ భగవంతున కేలాటి నపకారమొనర్పలేకపోయినను తన పరిణామనామరూపముల ప్రతిబింబించిన పరమాత్మాంశముల పరమాత్మను వ్యక్తపఱచకుండ భేదబుద్ధి గలిగించుచున్నది. అనేక యుపాధుల నుండుటయు నవ్యక్తమగు తన్ను వ్యక్తీకరించుటయేగాని యే భేదములేదు, యే బంధములేదు. ఈ విమర్శచేయనపుడు విపరీతార్థము గలుగుట సహజమే. సంశయ మసంభావన విపరీతభావనలు "బహుజన్మదృఢాభ్యాసాద్దేహాదిష్వాత్మధీః క్షణాత్" అనేక జన్మములందలి దేహమే యాత్మయని, దేహేంద్రియాది జగత్తు సత్యమని దృఢాభ్యాసమైనది యొక క్షణములో తొలగదు. "అప్రవృత్తిరసకృదుపదేశాత్" అపరోక్ష

సాక్షాత్కారము గలిగిన పిదప మాటిమాటికి విచారించుచుండవలెను. మాయ మాయని భయపడటముగాని, సంతసించటముగాని భగవత్తత్త్వమును వ్యక్తపఱచటమే. భగవలీలనాట్యము, లలితకళల వ్యక్తపఱచుట కొఱకేనైతే మాయను తెలియుట నస్యములేనందున సదానందుడగును. 16 నుండి 19 శ్లో॥ వఱకు ప్రసిద్ధపురుషుల నిరువుర భగవంతుడు చెప్పచున్నాడు. ఇప్పటి మానవలోకమును జూచితే నొకప్పుడు నవ్వు, యొకప్పు డాశ్చర్యము గలుగును. ఎందుకన భగవదశ్రుమధ్య నీ తత్త్వరహస్యముల ధనంజయుడు వినటము, ముసురువర్షమువలె భగవంతుడు ధర్మామృతమును వర్షించటము, నా నరనారాయణులకే చెల్లునేమో నీ శ్రవణఫలము నిశ్శ్రేయసఫలమనిపించును. పనిలేక నూరక కాలము గడిపెదరు. తామెవరో, ఎందుకువచ్చిరో, ఎక్కడపోవలెనో కొంతయైన విచారింపరు. వారి కర్మఫలమో, దురదృష్టమో, సహవాసదోషమో, కాలమహిమయో తెలియదు. పురుషుడన శరీరధారి. పురుషోత్తముడన జగదాధారి యని మున్నే విన్నావు. క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగములోని క్షేత్రక్షేత్రజ్ఞులనే, ప్రకృతిపురుషులనే నిచ్చట క్షరాక్షరతత్త్వములతో నిరూపించుచున్నాడు. పురుషునకు, పురుషోత్తమునకు గల భేదబుద్ధిని తొలగించి సదా ప్రాప్తమైన పురుషోత్తమప్రాప్తి, భ్రాంతిని నివర్తిచేయుచున్నాడు భగవంతుడు.

ప్ర॥ ఆ పురుషుల పేరేమి? వారిని గ్రహించిన ప్రయోజన మేమి?

ఉ॥ చిన్నసంసారమునగాని, పెద్దసంసారమునగాని పురుషులు యిద్దరు ముగ్గురు కనిపింతురు. మొదటి యిద్దరు బాహాటముగ కనిపింతురు. కాని మూడవవాడు కనిపింపడు. అయితే నా మూడవవాని జూచిన, తెలిసిన నీ యిరువురు లేరు. వీరికి స్థానమేయుండదు. మూడవవాని యిష్టమదియే కూడ. తన్ను తెలిసితే మొదటి యిద్దరుండరు. ఒకడు మహమ్మదీయు, డొకడరవవాడు పానీయని, తన్నియని వాదులాడుచుండ, రెండుభాషలు వచ్చినవాడు తన్ని, పానీ యొకటే నర్థమని తగవుదిద్దెను. ఒకడు పలుకు రాయిగల స్థలమున నిలిచి రామారామా యని తనకై తానే తలచెను. మరొకడల్లా బిలిచెను. వీడనుకొనెను ఇక్కడుండేది నేను యొకనినేకదా? నాకు బదులనినదే, యనువాడొకడని నాలుగైదుతూర్లు బిలిచి వెదుక

సాగెను. కన్నులుండి వాని కనలేకపోవటము భ్రాంతి. తనశబ్దమేనని తెలియక పోవటము మోహము. తుదకు విచారించగ తానేనని తెలిసినది. రెండవ వాడులేడు. సంసారమున ముగ్గురున్న రొకడు క్షరుడు, మఱొకడక్షరుడు. వీరిరువురిని ముందుగ్రహించిన మూడవవాడగు పురుషోత్తముని బొందుటయే ప్రయోజనము. "ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ, క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే" ఒకడు నిలువుటద్దమువద్ద నిలిచెను. ఇప్పుడెందరైరి? ముగ్గురైరి. ఒక డద్దములోనివాడు, నొకటి యద్దము, నొకడు తాను. ఆ ప్రకారమే బ్రహ్మాదిస్థావరాంతములగు జడశరీరము లద్దమువలె ముందెన్నడు లేనివి, చనిపోయిన లేనివి, మధ్యలో గనిపించునవి క్షరపురుషు డనెదరు. ఇదిగో నిదియొక యిల్లు. దీనియందనేక గదులున్నవి. అయిన నేమందురు? గృహమని యందురు. దేహసమూహములతోటి బ్రహ్మాండమే క్షరము. అద్దమున ప్రతిబింబమును జూచుచు తన్ను మఱచిన భంగి, యాభాసకుడే నక్షరుడు. కొందఱు క్షరమునే జీవుడందురు. నేననుటకు స్థూలముగ కనిపించుచుండుటచే దీనినే క్షరుడగు జీవుడనియు, సాక్షియై మధ్యమస్థితిగలవాని నక్షరుడనుదురు. ఎవనియందు విశ్వాభాస నశించినప్పటికి నాత్మజ్ఞానోదయము కాలేదో నతనినే నక్షరుడందురు. సుషుప్తియవస్థయందుండు నీతడు స్వయంజ్యోతి యనియెదరు.

ప్ర॥ ఈ పేర్లు యేలాగువచ్చెను? ఎవరుంచిరి?

ఉ॥ బ్రహ్మ లేక పురుషోత్తముని యుపాధులగుట పురుషులనబడుచున్నారు. వ్యష్టిదేహము అనగా స్థూలసూక్ష్మకారణశరీరములతో, పంచకోశములతో, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మంతరేంద్రియ పంచప్రాణములతో స్త్రీ పురుషరూపముల నున్నదే క్షరము. గృహమన్న మట్టి, రాళ్లు, తలుపులు, దర్వాజాలు మొదలైనవి గలిసి యొకటిగా జెప్పుదురు. తద్విధము దేహమే క్షరము. దేహమునుండి దేహధర్మములు తెలుసుకొనుచు దేహము భోగ్యముగ, తాను భోక్తగ నాశములేని కూటస్థుడే నక్షరుడు. ఇతనినే పరా లేక మాయాశక్తి యందురు. మాయాశక్తి క్షరపురుషోత్పత్తికి బీజము. సంసారబీజమగు నిది యనంతమగుటచే నక్షరుడనబడెను. ఒకటి కారణ, మొకటి కార్యము, నందుకే వీరికీపేర్లు గలిగి

నవి. "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః" అచేతనమగు క్షరమునకంటె పలుకుటకు వనాత్మ యగుటచేత, చేతనుడగు జీవునికంటె పరుడగుటచేత పరమాత్మ యనబడెను. అక్షయమగు బ్రహ్మము, విశ్వమున ప్రవేశించి పరిపాలించుచున్నాడు. ఈతనినే పురుషోత్తముడు. "ఏకో వశీ సర్వభూతాంతరాత్మా ఏకం రూపం" ఒక్కడే పెక్కురూపముల సర్వాంతర్యామిగా నుండుచున్నాడు. "యస్మాత్క్షరమతీతో౽హమక్షరాదపి చోత్తమః" క్షరాక్షరములు రెండిటికి నతీతుడగుటచే వేదములు, లోకములు పురుషోత్తముడనియెందురు. గవర్నరు గొప్పఉద్యోగి; యింట గృహస్థుడు. ఈ రెండు పేర్లు నుపాధులతో నొకనికే పేర్లు. ఆ ప్రకారము క్షరాక్షరులగు గృహోద్యోగులు కాక, వ్యష్టిపరుడు తానేగాని వేరు లేరు. అద్దమువలన శరీరము, ముఖము ప్రతిబింబము. దీనికి నిలకడుడే సాక్షి.

ప్ర॥ అక్షరశబ్దము జీవుడు కాదా? మాయారూపి క్రియొనచో బంధమెవరికి? అక్షరపరబ్రహ్మయోగమున నక్షరశబ్దము బ్రహ్మవాచకముగనున్నది. ఇచ్చట పురుషోత్తము నచ్చట స్వభావమనియున్న, యధ్యాత్మశబ్దము, స్వభావశబ్దము లచ్చట నక్షరపురుషునకు క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగమున క్షేత్రజ్ఞుడే జీవుడుగాను, క్షేత్రజ్ఞుడే భగవంతుడుగా జెప్పుటచేత నీ పరిభాషార్థములు తికమకగల్గించుచు నిశ్చయము పొసగకుండుటను, విశ్వసించుటకు హేతువు గాకున్నది. కాదేమందురు?

ఉ॥ భగవంతుని యుద్దేశ్యము మానవుల బుద్ధుల కగోచరము. ఇంద్రియములద్వారా తెలియగలిగినదే మనబుద్ధికి గోచరము. భగవద్విషయము నందరేల సహజముగ తెలిసికోలేకపోదురు? గురుశాస్త్రాదుల నవసరమేల యుండును? మనబుద్ధుల గ్రహించియే నంతకంతకు సులభముగా మానవత్వము విపరీతబుద్ధిగల్గి భేదదృష్టిచే మానవత్వాన్ని కోల్పోకుండ రక్షించడానికే గీతనుపదేశించెను. ముఖ్యముగా మనము తెలిసికోదగినవి మూడే. ఒకటి బ్రహ్మాండము, రెండు జీవులు, మూడు పరమాత్మ. ఈ మూడింటిలో పరమాత్మ యెవరు? జీవుడెవరు? ప్రపంచమేది? జీవపరమాత్మలు చైతన్యములా? కాదా? చైతన్యమైతే నిద్దరొకటియా? కాదా? జీవుడు జీవుడే, దేవుడు దేవుడేనా? యని

విమర్శించుకోలేనివారికి తానే విమర్శించి తాత్పర్యము ప్రకటించెను. శిష్యులకు గురువు లుపదేశించునపు డర్థముగానివానిని భావక్రియారూపముల విశదీకరింతురు. ఉపాధ్యాయుడరే బాలకులారా! ఏనుగెటులుండునన్న, మాకు తెలియదుసార్ అన్న, నోటితో చెప్పి, యక్కడకు తెలియకపోతే, బోర్డుపైన యేనుగనువ్రాసి చూపించును. లేదా మట్టితో జేసిన దానిని జూపించి సంశయము తీర్చును. అర్జునుడంత మధ్యమస్థితిగలవాడు గాకపోయినను లోకదృష్టినుంచుకొని యారీతి వివరించెను. సూర్యుడేమొ నొక్కడే. నానావిధరంగులుగల పెక్కుకోట్ల యద్దములలో, నన్నిరంగులతో, నన్ని సూర్యప్రతిబింబములు కనిపించినవి. అద్దములోనుండటము, సూర్యునికి వెడతిరగటము, సూర్యునకు వేరైతోచింది ఇవి ప్రతిబింబముల ధర్మాలు, ప్రతీతిమాత్రాలు. రంగురంగులగు, నుపాధులగు నద్దములలోని సూర్యప్రతిబింబములు సూర్యునికంటే వేరుగావు. సూర్యుడే. అవి యన్ని భ్రాంతిరూపాలు. వానిని విచారించి వెడతిరగటము, వేరైతోచటము, నద్దములో నిలువటము మిథ్యయన్నపుడు నా మూడుధర్మాలు బాధింపబడెనా, అన్ని ప్రతిబింబాలు నొక్కబింబమే: నమేశ మభేదమే. క్షరములగు దేహములు ప్రవాహమువలె రావటము పోవటము ననంతములు. అక్షరములలోని నంతఃకరణము సత్త్వగుణము గలదియగుట, దేహాద్యంతము వ్యాపించిన ప్రత్యగభిన్న పరమాత్మ లేదా వ్యాపకుడగు పురుషోత్తముని యాభాసకములే నంతఃకరణములోదోచిన ప్రతిబింబముగు నక్షరపురుషుడు అనంతదేహాంతఃకరణముల దోచిన ప్రతిబింబములన్ని యక్షరపురుషులే. జీవులందఱు పురుషోత్తమునికంటే వేఱుగ దోచటము, నంతఃకరణములో నిలపటము, ననేక జీవులుగా కనిపించటము, నీ మూడు ధర్మాలు ప్రతీతిమాత్రములే. ఇవి మిథ్య. పరమాత్మకు ప్రతిబింబములకు సర్వదా నభేదమే. ఈ యభేదమే పురుషోత్తమప్రాప్తి. సర్వదా ప్రాప్తమై యున్న తన్ను యనేకముగా జూచుభ్రాంతి నివర్తియైతే పురుషోత్తముడు

తానే. కావున నొకటిగాని, యనేకముగాని, యణువుగాని, బ్రహ్మాండము
గాని దృశ్యములై యచేతనములగు శరీరసముదాయము క్షరము. ప్రతి
వృత్తితో విషయములదెలియు నంతఃకరణోపాధి ప్రమాతయేలేక జీవుడు,
నితడే నక్షరుడు. సమిష్టి శరీరముల నొక్కడే నక్షరుడు. దేహతాదాత్మ్య
ములతో నేనొక మనుష్యుడననుకున్న భేదబుద్ధి, నన్ని దేహముల నదేపగిది
బుద్ధు లనేక మనుష్యులు ననుకోవటము జరిగినది. ఆభాసకభ్రాంతియే
గాని మఱెవ్వరి భ్రాంతికాదు. క్షరాక్షరములదెలిసి క్షరమునకంటే విలక్షణ
మగు పురుషుడనని గ్రహించినపుడు తక్కిన పురుషులలో నుత్తముడు
కనుక పురుషోత్తము డగుచున్నాడు. "నష్టో మోహాస్స్మృతిర్లబ్ధా" అర్జు
నుడు నేను కుంతీపుత్రుడ నర్జునుడననే దేహాత్మబుద్ధి గలిగించే మోహము
తొలగినది, నే నాత్మస్వరూపుడ ననెను. ఆ యర్జునునకే సకల మానవుల
నుద్దేశించి క్షరాక్షరముల రెంటిని తెలిసికొన్న తెలియవలసినది మిగలదు.
"అంతర్ముఖా మిత్యేషా వృత్తిః కర్తారముల్లిఖేత్। బహిర్ముఖేద మిత్యేషా
బాహ్యం వస్త్విదముల్లిఖేత్" నేను యను నంతఃకరణవృత్తిలో జీవుడు
గోచరించును. ఇది యను ప్రపంచాభిముఖవృత్తిలో బాహ్యపదార్థము
గోచరించును. ఆ నేనను యక్షరపురుషుడే తానగు పురుషోత్తముడు.
అంతటా నున్నాడని యతనే తానని భజించటము, స్మరించటము నిత్యా
భేదమే. "యో మామేవమసంమూఢో జానాతి పురుషోత్తమం। స సర్వ
విద్భజతి మాం సర్వభావేన భారత" ఈరీతి ఎవడు వ్యష్టి సమిష్టి శరీర
త్రయాభిమానమువదలి సమస్త బ్రహ్మాండ సంసారశాఖోపశాఖలగు ప్రతి
బింబాభాసకములు పురుషోత్తముడగు తన్ను నాత్మరూపమున నెఱుగు
చున్నాడో, వాడు నాయందనురక్తుడై సర్వభావముల నన్నే భజించు
చున్నాడు. మఱియు సర్వజ్ఞత్వము బొందుచున్నాడు. ఇదిగో నిదియొక
త్రాడు. మందాంధకారమున కొందఱు దానిజూచి పామని, కఱ్ఱని,
జలధారయని, నేలపఱియ యని, గీతయని, పూలమాలయని వివిధముల
భావించిరి. వారి భావముల జోచిన మిథ్యావస్తువులు త్రాటియందే నారో

పింపబడినవి. త్రాడులేనిచో వానికి నునికియేలేదు. త్రాటికి వానియన్నిటికి నిత్యాభేదమే. అవి యన్నియు త్రాడే. వానిలో వానికి మాత్రము భేదము కనిపించుచున్నది. పామునకు, కఱ్ఱకు, పూలమాలకు, నట్లే నండజ, స్వేదజ, మాయిజ, యుద్భిజ్జములకు భేదము తోచునేగాని పరమాత్మకు వీనికి నిత్యాభేదమే. ఒక్కొక్కదానికి నొక్కరూపు పేరు వచ్చినపుడు పరస్పరము తోచటము భ్రాంతి సామాన్యజ్ఞానముండియు వానికి విశేష జ్ఞానము లేకపోవుటచే తోచినవి. ఇవియే పంచభ్రాంతులలో జేరును. అదే విధము నామరూపములకు వేఱుభేదము. పురుషోత్తమునియందే నవి తోచును. పురుషోత్తమునికంటే నన్యముగావు. నేను యనే సామాన్య జ్ఞానముండియు, నసంగుడ, కూటస్థుడ, ప్రత్యగాత్మనను విశేషజ్ఞానము లేకపోవుటచే నీభ్రాంతి గల్గినది. కావున బ్రహ్మాండమంతయు పురుషోత్త ముడే. త్రాటిపై దోచువస్తువులవలె నామరూపముల జగత్తు దోచు చున్నది. అవి యెట్లు మిథ్యయో, జగత్తారీతి మిథ్యయే. క్షరము, నక్ష రము, స్వభావ, మధ్యాత్మనము, పురుషోత్తముడు నివియన్నియు పురు షోత్తమునికంటే నన్యముగావు. అవిద్యోపాధికుడగుట మాయాశక్తి యనబడినది. అవిద్యలేనిచో నాభాసుడు లేడు, బంధమోక్షములు లేవు. ఉండునది పురుషోత్తము డొక్కడే. అవిద్యయే భ్రాంతి; భ్రాంతి నిర సనమే మోక్షము. జాగ్రత్స్వప్న సుషుప్తులుగాక, మూర్ఛగాక, త్రిపుటి రహితమైనదేది నదియే పురుషోత్తముడు. ఇదియే నద్వితీయవస్తువు. "ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయానఘ। ఏతద్బుద్ధ్వా బుద్ధి మాన్ స్యాత్కృతకృత్యశ్చ భారత" అర్జునా! భారతా! స్వప్రకాశము నందాసక్తుడవైన సమాహితచిత్తముగలవాడా! భ్రమరకీటకన్యాయము కాదు. "ఏకం సద్విప్రా బహుధా వదంతి" యనురీతి భేదనిరసనమే శ్రుతి తాత్పర్యము. వేదాంతలక్ష్మి చేకొని నీ భ్రాంతిని వదలి నిన్నే జూడుము. నీకు వచించు గీతాశాస్త్రము నిజముగ సంసారమును తరింపజేయగలది. ఎవరికి తెలియుటకు సాధ్యముగాని గుప్తధనము నీ కిచ్చితిని. దీన నీ, నా

భేదము తొలగినది. మోహనివారణకారియగు గీత మదీయ నపరస్వరూపము. అమృతము సేవించినవానికి మృతరోగములు లేనిరీతి, నమృతమగు గీతాసారము గ్రోలితివి. పాపపుణ్య మిశ్రమకర్మలు నశించినవి. నీవు చేయవలసినదేదో నీకే వదలితిని. భగవద్వాక్యములు విని యర్జును డంతరంగానందమున మునిగిపోయి నేమి వచింపక యూరకుండెను. కృతకృత్యుడగువాని కేమున్నది యొనర్ప? సకల ముముక్షు రసికజనమనోభిరామమైన గీతామృతము గ్రోలినవారలే ధన్యులు; పావనులు. ఈ గీతాశాస్త్రమున వచించినవి ప్రమాణమనెడి మచ్చురాతిపై సరిగానున్న సిద్ధాంతమును మీరు స్వీకరింపుడు. ఏవిధమున కొరతలున్న నాకే వదలుడు. భగవద్గీతామృతరసాయనము గ్రోలనిచో భవరోగముచే బాధింపబడుదురు. అమృతస్వరూపులారా! అనవరతము గీతాకల్పతరువును సేవించి ధన్యులుగండు. సంజయుడు సెప్ప ధృతరాష్ట్రుడు వినెను. వ్యాసభగవానుడు కూర్చినది భగవంతు డర్జునునకు దెల్పెను. సకల సంశయనివారకము, తారకము గీత.

ఇతి శ్రీ భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీ కృష్ణార్జునసంవాదే
పురుషోత్తమప్రాప్తియోగో నామ
పంచదశోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## షోడశాధ్యాయము

### దైవాసురసంపద్విభాగయోగము

ఉ॥ బద్ధులు శాస్త్రదూరులు నిబద్ధిగ సంసరణార్థపాశస
న్నద్ధులు ధర్మహీనులు మనోరుజతాపసులాసురీవరుల్
పెద్దలు శాస్త్రధర్మకృతవేషులు మోక్షరతుల్ నిజంబుగా
సిద్ధులు దైవసంపదలు నీచులు భావిజనాళి కెన్నడున్.

ప్ర॥ ఈ యధ్యాయము పేరేమి ?

ఉ॥ దైవాసురసంపద్విభాగయోగము, బద్ధముముక్షుజన యాచార వ్యవహారములను వివరించును.

ప్ర॥ భగవంతుడే యీ యధ్యాయము నుపక్రమించుటలో నేమైన విశేషము గలదా ?

ఉ॥ పురుషోత్తమప్రాప్తికి జ్ఞానమవసరము. దాన నెవ్వడైన కృతకృత్యుడు కాగలడు. జ్ఞానము గలుగుటకు సంసార మభివర్ణింపబడినది. సంసారమునకు రూపమా ? లేదు. లేదా ? యున్నది. అనిర్వచనీయ మాయాకల్పిత సంసారమునకు భగవంతుడే మూలపురుషుడు. అనాది సంసారవృక్షమునకు నాదిమధ్యాంతములు భగవంతుడేనని నిరూపింపబడినది. పురుషోత్తమప్రాప్తియోగము విన్నపిదప నికనేమి విందామని యాసక్తియే లేదు. సూర్యునివలన చీకటి తొలగిన నన్నివస్తువులు గనిపించు భాతి, జ్ఞానముగలిగినదా బంధమోక్షములు, అస్తినాస్తులు ద్వైతమే లేదు. సమస్త శాస్త్రీయసిద్ధాంతము గడచిన యధ్యాయమున ముగించెను. క్షరాక్షరపురుషోత్తముల ప్రభేదము నిరూపించి పురుషోత్తముడే సర్వము నని విశదపఱచెను. ప్రపంచమున మానవులలో గీతాధికారు

లెవరనునది వివరించుచున్నాను. జ్ఞానము లేనిగా, పూర్ణ శాంతి. జ్ఞానము గావలెనా, ద్వైవీసంపద గావలెనా. అనునవి యారేడో సప్తమ నవమా ధ్యాయముల దైవీయాసురసంపదల విస్పష్టముగజెప్పెను. ఆ సమయ ములో పూర్తిచేయ సమయముగాక, ఇప్పుడు సంపూర్తిచేయుచు, వానినే ప్రారంభించుచున్నాడు భగవంతుడు. ఇష్టాయిష్టములు, ఆస్తికనాస్తికులు, శాంతి యశాంతులు, సుఖదుఃఖము లెవరినునది, జ్ఞానయోగ్యు లెవరనునది మిగిలియుండుటచే నిప్పుడు భగవంతుడే ప్రారంభించెను. పార్థుడు యుద్ధ మధ్యమున నీ తత్వరహస్యము గ్రహించెనన్నచో, డెవ్వరైన నెచ్చటైనను గ్రహింపవచ్చుననియు ముందటిఫలము తప్పక యనుభవమునకు వచ్చిన దనుటకు దృష్టాంతము. గీతము చదవటమును, వినటము, తెలిసికొనటము గలిగినదంటే మన ప్రాప్తము. ధర్మజుని వెన్నంటిన నొక కుక్కకు స్వర్గ ప్రాప్తి లభించటము, సక్తుని ప్రస్థుని యాతిథ్యమున నొకప్రక్క బంగా రుగా శరీరము మునిగిన కొకదానికే నయినది. ఎన్నితూర్లు ధనంజయు డెన్ని యుద్ధము లొనర్పలేదు? మరెందఱు రాజు లొనర్పలేదు? అహింసా తత్వ మొక యశోకునకుదక్కెనే. కదనరంగమున మన సవ్యసాచికే గీత వినే యదృష్టముగలిగినది. శ్రీ కృష్ణుని యనన్యమైన ప్రేమ చిన్నతనము లోనే మురళికో, నే మూఢరాధకో, నేగోపగోపులకు యబ్బినది. గీతా సందర్శనప్రాప్తి యర్జునునివద్దనుండి సమస్తలోకములకు, సకలమానవులకు, భవిష్యజ్జీవులకు ప్రాప్తించుచున్నదనిన ధన్యులము. ఒక మానవులమే కాదు. జడభరతుడు జింకజన్మమున జ్ఞానమును విని ముముక్షువై నపగిది, సకల జీవజీవనదాయకమగు గీతాగానము, భవిష్యజ్జన్మ బంధరహితము. విషాదయోగమును గూర్చుటలో ప్రధానమేమన, ధృతరాష్ట్రునివలె నవివేకులై గీత యెంతవిన్నను సంశయరహితులుగాక, మోహానివృత్తి నొందక, త్యాగమూర్తులుగాక, ఋజువర్తనలేక, పారమార్థికజ్ఞాన గంభీ రత లేనివారికి శాశ్వతదుఃఖభాజనమే ఫలము. అర్జునునివలె సరళవర్తన గలిగినవారిదే గీతారాధ్యచరిత్ర. ద్వితీయాధ్యాయము మొదలు, నైదవ యాధ్యాయమువఱకు మానవజన్మముల వ్యక్తీకరించుకొనగలము, నా విధా నము తెలిసికొంటిమి. ఏడునెనిమిది మొదలు పండ్రెండవ యాధ్యాయము వఱకు ప్రవృత్తియొక్క లక్షణము గ్రహించితిమి. పండ్రెండవ యాధ్యాయ

మున శుద్ధభక్తిని సమ[illegible]క్షు[illegible]చి, భక్తుని లక్షణములు నలువదిరెండు తెలుపబడినది. పదమూడవ అధ్యాయము మొదలు, పదియైదవవఱకు దేహములు [illegible]; ఒక పరమాత్మయే సచరాచర దేహముల నా[illegible]త్రమైయుండి త్రిగుణములచేత తెలియబడక బంధింపబడటము; గుణములను జయించుటకు తగుమార్గము నిరూపింపబడినది. తుదకు సర్వత్ర "పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే" పరిపూర్ణపరబ్రహ్మగ సర్వము వేద్య మున కొన చెప్పబడినది. పురుషోత్తమయోగమున మానవుని జీవితము పూర్ణత బడయుటతో ముగిసినది పూర్ణతనొందిన యిక నేమున్నది? ఏమిలేదు. కర్మ భక్తి జ్ఞానములనెడు మూడు కర్త, కర్మ క్రియలవలె విడరానివై యొకదానికొకటి గదిసివచ్చి జ్ఞానత్వముతో పూర్ణత్వము నొందును. మొదటి రెండుషట్కముల కర్మభక్తిరహస్యములజెప్పి మూడవషట్కమున జ్ఞానమును వివరించుచు భక్తిని మిశ్రమముజేయబడినది. మిశ్రమమున నొకటి ఉపాయము, నొకటి యుపేయముగ నద్వైతబోధకొఱకు ద్వైతమంగీకరింపబడినది.

ప్ర॥ విభాగమనుట యెందుకు?

ఉ॥ సంపద యన సమూహమునకు పేరు. ఒకటి పూలసంపద యన్న వివిధపుష్పముల పట్టు. మత్స్యముల సంపదయన్న, మత్స్యము లనేక విధములుండుట. ఇందులో నొకటి శాంతము, సుఖము, నానందము నిచ్చునది. మఱియొకటి ద్వైతము, భేదము, నశాంతి, దుఃఖము నిచ్చునది. దైవీసంపద పొందుటకును, దైవీలక్షణములు తమలో ఉన్నవియా? లేవా? యని గమనించుటకు నాసురీసంపదవలన గలిగే ఫలము నిరూపించటమే విభాగము.

ప్ర॥ కొంతమంది కర్మకే ప్రాధాన్యము, కొందఱు భక్తికి, కొందరు ధ్యానమునకు, కొందఱు యోగనిష్ఠకు ప్రాధాన్యమిత్తురు. గీత వీనిని దేనిని కాని వదలిన పగిది కనిపింపదు. తమ యభిప్రాయ మేమి?

ఉ॥ త్రయోదశాధ్యాయమున నిరువదినాల్గు, నిరువదైదుశ్లోకముల బట్టి చూచితే దారము, నేకులు, కదురు, రాట్నము లెక్కవవస్తువులన్ని వస్త్రహేతువులేనని తెలియును. ఏది లోపించినను ప్రత్యేకించి నేర్పఱచు

దానము లభ్యము కాదు. దారమువలన వస్త్రము తయారగును. దారము జ్ఞానమువంటిది. ఏకనుండి వచ్చుచున్న జన్మప్రవాహము నేకాగ్రత కావలె. ఏకాగ్రతకు భక్తి రాట్నము తిరగటమనే కర్మ యవసరము. వస్త్ర సిద్ధికి నాలుగు ముఖ్యములే యని తోచుచున్నది. కర్మచేయకుండనే జ్ఞానియుండలేడు. జ్ఞానము లేకనే భక్తుడుండడు. ఇవినాల్గు తమలో తాము "సర్వం కర్మాఖిలం పార్థ" జ్ఞానములో సర్వకర్మల పరిసమాప్తియగు ననుట యాసక్తిలేకుండ పోవుట యంతేగాని, యుదాసీనకర్మలు నవసర కర్మలుండియే యుండును. కర్మ, భక్తి, జ్ఞానములు నిష్కామమైనపుడు మనుజత్వమునకు శోభగలుగును. జ్ఞానము దీని మూటిని ప్రకాశిల జేయు దివ్యజ్యోతి. పుష్పమునకు వాసన, పన్నీటికి సువాసన సహజ సిద్ధము లెట్లో, సద్రూపునకు జ్ఞానము సహజసిద్ధము. జ్ఞానముతోనే బంధురతేజస్సు, విజయోత్సాహము, నిర్గుణమగు జ్ఞానబోధ నొకరివల్ల జరుగుచున్నదన్నపుడు మనస్సునుండి సంకల్పించి, యవసరమునకుతగిన శబ్దముల, వాక్యముల నోటితో జెప్పగలిగినపుడు సంకల్పించుట, నోట జెప్పుట, నిలుచుట, కూర్చుండుట, చూచుట, యారంభించుట, చాలించుట మొదలైనవి కర్మలే. ఒకరి యాహ్వానముపై రావటము, శ్రోతల యందు ప్రేమయనే భక్తిలేకపోతే వారు కూర్చోలేరు. ఇతడు చెప్ప లేడు. చెప్పునపుడు జెప్పించుట, భక్తియుంటేనే. లేకపోతే రాకడపోకడలే యుండవు. ఇహపరలోక కామ్యకర్మలనుగాక, భక్తితో నాకేదేవు డున్నాడు. ఆయనను నారాధించవలెననుట భక్తి. అలాంటి భక్తిగాక వస్తుతత్వవిమర్శన యేదిగలదో యది జ్ఞానము. వస్తువు కొరకు విమర్శించేది కర్మయే, విమర్శన భక్తియే. సద్వస్తు తాత్పర్యము గ్రహించుట జ్ఞానము. నేదియుండిన తక్కినవి యుండియే యుండును. కాని, వ్యావహారికముగ వాస్తవములో నేవిలేవు. అంతయు పరమాత్మయే.

ప్ర॥ దైవాసురలంటే రూపములు, జన్మములు వేరా? దేశములు లేక లోకములు వేరా?

ఉ॥ మంచిలక్షణములన్ని ప్రోగుచేయుట దైవీ. చెడులక్షణముల ప్రోగుచేయుట నాసురీ. భక్తుడు గంధమక్షతలు వగైరాలు ప్రోగు చేయును. దుర్మార్గుడు కొట్టు, నరుకు, చంపుననుపలుకులు నాలాంటి

వస్తువుల చేకూర్చును. ఆవునుచూడు, పులినిజూడు. ఇటులే గుణవంతుల గుణహీనులజూడు. దేశములు, రూపములు వేరుకావు. జన్మములు వేఱుకాదు. స్వభావములే దైవాసురలు. మనుష్యులయందే నీ రెండు లక్షణములుండును. అనాచారులై, నీతినియమము లేనివారై, యంత శ్శుచి, బాహ్యశుచి, దయాదాక్షిణ్యములు లేక జ్ఞానయోగ్యులుగానివారు రాక్షసులు. జ్ఞానయోగ్యులైనవారు దైవీసంపదగలవారు.

ప్ర: ఆకార, జన్మదేశ భేదములేదు. కాని గుణకర్మస్వభావములే దైవాసురలనదరా ? సంపద యన గుణముల కూడికగదా ! ఏమనెదరు?

ఉ: అవును. ఒకే యడవిలో ముళ్ల చెట్లు, ఫలపుష్పవృక్షము లుండుట లేదా ? ఏ చెట్టుల నాశ్రయించు జీవులు వా చెట్టుల నాశ్రయించుదురు. దైవీసంపదగలవారల, రాక్షససంపదగలవారల మనమే నిర్ణయించు కొందుము.

ప్ర: ఉభయస్వభావుల గీతలోనుంచుట యెందుకు ?

ఉ: దైవీసంపదగలవారు దైవకరుణకు పాత్రులై దైవమునకు ప్రాతిపదికముగ ననేక గుణవంతులను నాశ్రయభూతులగుదురు. ముముక్షు లగుట గీతకు సంపూర్ణయధికారులు. సంసారబంధరహితులు, పూర్ణ పరమావధి దర్శనయోగ్యులు. గీతను పఠింపను, పఠింపింప జేయను, వ్రాయను దొరకొందురు. రాక్షసస్వభావముగలవారు బద్ధులు ననగా సంసారకర్మబద్ధులు, సంసారనివృత్తికి యోగ్యత చాలనివారు. అయితే నీ యాధ్యాయము చదివినంతనే తాము దైవీసంపదగలవారమా? రాక్షస సంపదగలవారమా ? యని తెలిసి యాసురసంపదగలవారు దైవీసంపద నొంద ప్రయత్నింతురు. మెల్లగ నభ్యసించి యాసురీస్వభావమును రూపుమాపుకొందురు. అద్దమునెదుట నిలిచినవారికి తమ స్వరూపమెట్లుం డునది తెలియును. గీతాధ్యయన మొనరించిన, శ్రవణమొనర్చిన, చదివిన తనస్వరూపము ద్వితీయ, త్రయోదశ, పంచదశాధ్యాయములను స్వభా వము నీ యాధ్యాయమున తెలుపబడినది. పాఠశాలలలో కాండక్ట్ సర్టిఫి కెట్టు బాలబాలిక లెట్టివారైనది యిత్తురు. యుద్ధమున విజయమొంద వలెనంటే, సైనికుల యోగ్యతలజూచి చేర్చుకొందురు. ఒక యెద్దునుగాని, పశువును, గుఱ్ఱమును, కుక్కనుగాని, లేక బాలికను వివాహమునకుగాని,

బాలునిగాని యే దేశస్థులైన యంచినే జూచెదరు. సంతానముగాని, దేశముగాని, గృహముగాని, కాలముగాని, సహవాసము, బంధుత్వము గాని, మిత్రత్వముగాని వారములు, దినములు, నక్షత్రములు, యోగ ములు, లగ్నము మొదలైనవి మంచివియే జూడవలెననియేకదా మాన వుల యభిప్రాయము. లేకపోయిన ముహూర్తములేల, నాశీర్వాదములేల? శుభముగలుగవలెననియే నందఱ కోరికె; చెడ్డగలిగిన యొప్పుకొనము. గీతకూడ రెండురకములను దెలిపి యాహ్వానించుచున్నది. అమోఘమైన, యపూర్వమైన, మోక్షమున కధికారికావలెనంటే నీ యాధ్యాయము నేర్పుటుపగలదు. ప్యాసుకానివారికి సర్టిఫికెటులేదు, యుద్యోగములేదు. ప్యాసైనవానికి యుద్యోగముతో సహా సర్టిఫికెట్టు ననుసరించియుండును. రావణకుంభకర్ణాదులు, దుర్యోధనాదులు నాసురసంపదగలవారు. కావు ననే దైవమును తెలిసికొనలేక దైవదూరులై నపజయమొందిరి. పాండ వులవంటివారు దైవబలమున, దైవసాక్షాత్కారము మోక్షము నొందిరి. దుర్యోధనపాండవులు, రావణకుంభకర్ణ రామచంద్రుల గుణకర్మస్వభావ ములే. వీరు స్థిరముగ మానవహృదయములో నిలిచిపోయిరి.

ప్ర॥ చేసినపనిని గమనించి ప్రభువు పారితోషక మొసగురీతి భగవంతు డీయాధ్యాయమున నర్హతల గమనించుటకు, యోగ్యతాపత్రములొసగ పరీక్షాగుణములనించెను. భగవద్గీత చదివినంతనే యెవరెవ రేడిగ్రీకి నర్హులను నది వారికివారికే తెలియుటవలన శ్రద్ధాభక్తి విశ్వాసవంతులు కాగలరు.

ఉ॥ కాశీయందు రామానందుల శిష్యులనేకులు సంభాషింప, కబీరును లోనికిరా, మ్లేచ్ఛుడా! రావలదని నెన్నితూరులో తరిమిరి విప్రబ్రహ్మ చారులు. కబీరు దుఃఖితుడై మహాత్ముడు రామానందులకీ బుద్ధియుం డునా? చూచిన నన్ను వలదనునా? ఎట్లు దర్శించేది? యని యొకనాడు వారు గంగనుండి స్నానమాడి వేకువఝామున రా, సమయమునుగని పాదములకడ్డుపడ, రామరామా యెవరన, స్వామీ! కబీరుడ, నీచుడనని, నీ శిష్యులీ నిర్భాగ్యుని నీవద్దకు రాకుండ నెన్నియోతూర్లు తరిమిరి; నేటికి ధన్యుడ. ఏమి శెలవన, నాయనా! నీ వీదినము నిర్భయముగ లోనికిరమ్ము; నేనున్నానన, నా తీరున శిష్యులు వారింపబోవ, రామానందులు వారల

వారించి కొన్ని వక్కలడెప్పించి మనిషికొకటి యిచ్చి మీ పండ్లతో నున్నగ నమిలి నాకు బెట్టుడని కబీరుచేతికి నొకటిచ్చెను. అందఱునమిలి యెంగిలితో గురువు ముందర నుమిసిరి. పొడియొక్కరైన బెట్టరైరి. కబీరు తాను యెంగిలి కాకుండా నమిలి పొడినితెచ్చి గురువునకొసగ, నోరీ శిష్యులారా! ఆచారకులములకన్న గుణాచారము గలవాడు దొడ్డ. నాచారము పెద్దదని యితరుల రాపిడిచేయుటము నాసురీయగును. ఆచారమెట్లున్న సాధు గుణముగలవాడే దైవీసంపద గలవాడనెను. ఒక దేశమునకు కఱవురా, ప్రజలందఱు మఱొకదేశమువెళ్ళి బ్రతుక ద్రిమ్మరులైరి. అందులో నొక గుంపు నొకదేశముచేరి యాదేశప్రభువును నాశ్రయింపగా, ఆయన తన మంత్రులతో మనిషికి నొక రొట్టె యిచ్చులాగున నేర్పాటుజేయించి యారొట్టెలనిచ్చు సమయమున తానచ్చటనే గూర్చుండి యాగుంపులోని జనులస్వభావముల నరయుచుండెను. రొట్టెలుతెచ్చుటకు ముందే వేచియుండిన జనసమూహము చేతులుజాపుచు, కేకలుబెట్టుచు నాకు ముందు నాకుముందని రొదచేయుచు రొట్టెనిచ్చువాని హస్తములపై నవే రొట్టెల నపహరించుచు జనులొక్కమ్మడి యూపిరియాడనివ్వకుండ తమలో తాము వాదులాడుచు, రొట్టెల తీసుకొనుచున్నను, తొమ్మిది పది వత్సరముల బాలిక తాను యేలాటి గలాటచేయక నాసందడణగి మిగులగా నుండిన దెంతరొట్టెనిచ్చిన తీసుకొని వెళ్ళుచుండెను. ప్రతిదిన మిట్లు జరుగుచుండ ప్రభువు రొకదినము రొట్టెలో తన యుంగరమునుంచి యాఖరున పిల్లకిప్పించెను. ఆ పిల్ల మామూలు స్థలమునకు కొనిపోయి తల్లికి జూపి రెండుభాగములొనరించి యెవరిభాగము వారు పుచ్చుకొనబోవ, మధ్యనున్న యుంగరము క్రిందపడ, తల్లి, అమ్మాయి! ఎవరిదో నుంగరమిచ్చిరమ్మన, నౌనని యాపిల్లది పరుగెత్తి రొట్టెలనిచ్చు స్థలమునకు వచ్చుచుండుట ప్రభువుచూచి యుత్కంఠుడై రొట్టెలనిచ్చువానితో మాటలాడుచున్న బాలికను తనవద్దకు రమ్మనకముందు నా బాలిక నిట్లనియెను. ఓ బాబూ! నాకు నిచ్చిన రొట్టెయందు నీ యుంగరముండినదనెను. ఆతడు నీవు దీసికొన కేల దెచ్చితివన, నాకు మీరు యిచ్చునది రొట్టెగాని యుంగరముకాదు. నేను రొట్టెకు వచ్చినదాననేకాని యుంగరమునకుకాదు. పొరబాటున రొట్టెలోనున్న యుంగరము పరులది. దాని

నపహరింపరాకే యధికారము నొసగను బాలిక పలుకులు విని ప్రభువు నానందబాష్పములు రాలుచుండగా, నా బాలికను తనచెంతకు బిలిచి, కౌగలించి ముద్దాడి యా యుంగరమేగాక తన వెంటనున్న హారమునిచ్చి గౌరవించి పంపెను. చూచితివా పరీక్షలో నెగ్గినపిల్ల పారితోషికమున కధికారిణియై ప్రభువున్నన బడసెను. భగవంతునిదయకు పాత్రుడగు కావలెనంటె దైవీసంపద యుండవలె, సృష్టిగా లోకమునకు జెప్పుటయేగాక, ప్రతియొకవ్యక్తిలో నంతరంగమున దైవీసంపద, యాసురీసంపద లుండనే యుండును. ఈ రెంటికి నంతరంగబహిరంగముల పోటీ జరుగుచుండును. పగలువంటిది, జ్యోతివంటిది, మణి, బంగారు, నిర్మల సరోవరమువంటిది దైవీ. రాత్రివంటిది మట్టి, యినుము, కంప, చెత్తచెదారముగల సరోవరమువంటిది యాసురీస్వభావము.

ప్ర॥ దైవీసంపద వివరింపుడి ?

ఉ॥ "అభయం సత్త్వసంశుద్ధిర్జ్ఞానయోగవ్యవస్థితిః । దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్" నుండి మూడు శ్లోకముల వర్ణించెను. ఇరువదినాలుగు శ్లోకము లీ యాధ్యాయమున నుండెది. చతుర్వింశతి తత్త్వములు జ్ఞాపకము తెచ్చులాగు నున్నవి. గుణములందమా ఇరువదారు. ఇవియు, సాంఖ్యతత్త్వమున పంచవింశతితత్త్వములు, నిరువది యారవవాడు నాత్మను జ్ఞాపక మొనర్చుచున్నవి. ద్వాదశాక్షరీమంత్రము వలె నీ యాధ్యాయము పేరు ప్రకాశిల్లుచున్నది. ఈ యిరువదారుగుణములలో మొదటిది యభయము. చతురాక్షరివలె నక్షరములు నాలుగే. కాని యిరువదియైదు గుణములకు నిది యొక్కటే, సేనకు సైన్యాధిపతి వలె, పూసలకు దారముభంగి, శరీరేంద్రియములకు ప్రాణము, నరునకు సింహద్వారము, దేహమునకు శిరస్సు, నింద్రియములన్నిటిలో కన్నులు, స్త్రీకి పాతివ్రత్యము, పురుషున కేకపత్నీవ్రతము, శిష్యునకు గురుశుశ్రూషవలె నగ్రగణ్యమైనది. పథ్యముండిన రోగభయము లేదు. ఏ ప్రాణికి హానిచేయకుండుట భయరహితము, గీతాశాస్త్రము, గుణవిషయములు మానవుల కూడి యోగ్యతాపత్రము లియ్యదలచినది. గీత గాని,యాచార్యకృష్ణుడుగాని యోగ్యతాపత్రముల నిచ్చినపుడే స్వరాజ్య,

స్వారాజ్యముల నొందగలరు. మనలో జరుగుచుండు సంగ్రామమున విజయమొందిన వీరుడెవడో యతడే యుండును.

ప్ర॥ మనలో సంగ్రామము జరుగుచున్నదని యంటిరి. ఆ సంగ్రామమున విజయమొందుటకు నుపాయమేమి?

ఉ॥ బాహ్య సంగ్రామమున నర్జునునకు శ్రీకృష్ణు డెట్లు సహాయకారియై జయము గల్గించెనో, నాపగిది భగవంతుడు చేయూత నొసగుచున్న నా పక్షమునకే నంతరంగ సంగ్రామమున జయము సిద్ధము. భగవద్దయ గలుగవలెనంటే భగవంతునకు సామీప్యము నేర్పరచవలె. మన కర్తవ్యములు, మన బాధ్యతలు, భారాలు, ఫలములు నాతని హస్తములలోనుంచి నిర్మోహముతో నాతని యాజ్ఞానుసారము నిలచి రణమొనర్చిన నపుడు జయము నంతర్బహిర్గతముల నొందుదుము. ఈ యేకైకధర్మమే యుపాయము, తలకు కిరీటము. అభయమను నిర్భయము, సాత్వికమంటిది. నాయకునివలె నుదాసీనునిరీతి తక్కినగుణములన్నిటికి స్థానమొసగి తనలోనె వీని నన్నిటిని సమర్థించుకొనగలదు; అట్టిదే యభయమంటిది. అభయమనేదిలేక తక్కిన గుణములుండినను పెద్దలులేని యిల్లు, భక్తిలేని పత్రము, జ్ఞానములేని జీవితము, దిక్కులేని దేశము, వైద్యుడులేని మందు, సభ్యత్వములేని చదువు, మంత్రములేని ధ్యానము, బీజములేని యంత్రము, వినయములేని గౌరవము, దైవములేని మందిరమురీతి నభయములేకున్న తక్కినవి యుండనేయుండవు. కట్టలేనిచో నీరు నిలువదు. రాజకీయ మత సాంఘిక మిత్యాదిరంగముల దీనికికూడ నభయము ముండుండవలె. అభయ మొకరివలన గలుగునదికాదు. అదియొక భగవద్భక్తునికి, సంపూర్ణజ్ఞానికి, విశ్వత్యాగికిమాత్రమే నా యభయముండును. వాసనత్రయము, ఏషణత్రయము, తాపత్రయము, గుణత్రయము, మవస్థాత్రయాదుల గలుగు శుభాశుభములకు, మానావమానములకు, ధర్మాధర్మములకు, బాహ్యాభ్యంతరముల చలనములేని ధీరతయేది? అదియే నభయము. చలి, మంచు, నెండ, గాలి, యుప్పెన, వర్షము, చీకటి, వికారమునకు, స్వప్నమునకు, మృగపక్ష్యాదులకు భయములేనివాడు నితరప్రాణులకు భయము గలిగించక గొడుగువలె నన్నిప్రాణులకు దిక్కైయుండుట, దేవేంద్రునిచే రాళ్లవాన గురియింప గోవర్ధనపర్వతము నెత్తి గోవుల, గోపికగోపకుల

భయమునీర్చి నభయమొసగువాడు భగవంతుడు. అభయము భగవత్స్వరూపమే. తస్కరులు లేనిమాటు తోడుపడి దోచుకొన్నభంగి, అభయములేక తక్కినగుణములుండ ప్రయోజనములేదు. అభయమును తక్కినగుణములు బుట్టించలేవు. అభయమొక్కటుండిన యన్నిగుణముల వృద్ధిచేయును. బీజముండిన నెన్నివృక్షములనైన బెంచును. వృక్షములు శాఖలుండి బీజములేనిచో, నవి నశించిన, మరి వృక్షములులేవు. అభయ మొక్కటి గలుగవలెనన్న పెద్దపట్టుదలతో సత్యము గనినమాత్రమే నభయము స్థిరమగును. తెలుగరయ్యేమార్గము కాలలోలేనిచో వెన్నబడయలేము. సత్త్వసంశుద్ధియుండిన భయమేలేదు. రజోగుణ తమోగుణములులేనిదై యింద్రియముల చలనత్వములేక తూసికెతూచునపుడు రెండుప్రక్కల సమముగ నుండుపగిది, మనస్సు కలతలులేనిదై యుండుట సత్త్వసంశుద్ధి. మిథ్యానిశ్చయమున నిరంతరము బ్రహ్మమును జూచునదే జ్ఞానయోగము. రాగద్వేషములు, నీవు నేనను భేదము, నానాత్వము లేనిది జ్ఞానయోగము. తగినవారికి నిచ్చు దానము, బాహ్యేంద్రియ సంయమము, శక్తి ననుసరించి యజ్ఞము, బ్రహ్మయజ్ఞము, తపస్సు, ఋజువర్తనము, నహింస, త్రికరణముల నేప్రాణికి హింస యొనరింపకుండుట, సత్యము, నక్రోధము, సన్న్యాసము, చిత్తోపరతి, కొండెములు జెప్పకుండుట, దీనుల యెడ దయ, దేనిని వాంఛింపకుండుట, మెత్తనిదనము, చెడుకార్యము చెడుతలంపులన్న సిగ్గు, వ్యర్థకార్యముల నొనర్పకుండుట, ప్రతిభ, క్షమ, ధైర్యము, బాహ్యాభ్యంతరశుచి, యెవ్వరితో వైరభావములేకుండుట, గౌరవముగలవాడ, పూజింపతగినవాడ నను భావము లేకుండుట నిక్కడికి నిరువదియారు గుణములు. అన్నిటినివదలి మొదట యభయము, కడపటిదగు నతిమానితము లేకుండుట ననేది. దండకు కొలికిదారముభంగి, వెనుకనున్నది దేహాభిమానము, దేశ, బంధు, మిత్ర, విద్యా, మిత్ర, జన, యైశ్వర్యములందలి యభిమానములేనివాడై నమ్రభావము గల్గియుండుట, దండయందలి నడిమివస్తువును కడపటిదియగు వస్తువులకుమధ్య పూసలన్ని వున్నరీతి తక్కిన గుణములన్ని నీ రెంటిమధ్య ప్రకాశింపుచున్నవి. ఒకప్పుడు సముద్రుడు నదులన్నిటిని జూచి, మీరేల పీనుగుల, వృక్షముల మొదలైనవానిని దెచ్చితిరి? తుంగముస్తల నేల తీసుక

రారనెను. నదులయ్యా! చెట్లు చేమలు, మనుష్య మృగాదులు గర్వముతో నహంకరించి మమ్మెదిరించును. మేము వానిని మొదలంట పెకలించి తెచ్చెదము. తుంగము స్తలు మాకాకగని స్వాగతమిచ్చుచు తలవంచి తమపై మేము ప్రవహింప నమ్రభావము కనుపించును. మమ్మెదిరించుట లేదు. నదులవలన తుంగము స్తలకు, తుంగము స్తలవలన నదులకు పరస్పర వైరుధ్యములేదు. అభిమానమున్న నహంకారము, కర్తృత్వము, దానివలన భయము గలుగును. అభయము, నమ్రతయే తక్కిన గుణములకు ప్రాణమిచ్చునవిగా నున్నవి. నమ్రతగలిగినా భయమేలేదు. విభీషణుడు నమ్రతచేత నభయ మొందెను. అర్జునకు నమ్రతయేలేనిచో భగవంతుడు యుద్ధమున నభయము గల్గించునెట్లు? నమ్రత బంగారు మాదిరి, నెన్నిరకముల నాభరణములుగానైన మారును. అందుకే దానికంత ప్రాముఖ్యత గౌరవము గలిగినది. "విద్యయొసగును వినయంబు వినయమున బాత్రత" నన్నునుడి సర్వస్వతంత్రత, స్వేచ్ఛ, సంతోషము, దాన నిర్భయము గలుగును. చంద్రమతి హరిశ్చంద్రుల, విశ్వామిత్ర, నక్షత్రక, కాలకౌశిక, కలహకంటికి, దొంగలు కాశీరాజు లిత్యాదులు పెట్టిన బాధలకు వినయము, ప్రేమ, ఓర్పుతో సహించిరంటే నభయముయొక్క చిహ్నమే గాని వేఱుకాదు. మహాత్మాగాంధీజీ విదేశములలో విదేశీయులవలన పెక్కుదఫాలు కారాగారశిక్షలిచ్చినను, యితరులనుండివచ్చిన యవమానమును, కొట్టుతిట్టులను యోర్చి చెఱుగుచేసినవారికే మేలొనరించెనంటే నితరచెఱుపులకు భయములేదు. ఎంత నిర్భయము. బాంబు వేసినవానికి నాత్మ చావదనియు, బాంబు దేహమును జంపుననియు, శిక్షించిన ప్రతీకార తలంపుగల్గుననియు, నపరాధికి బోధించుచున్న సహనవినయ సత్యాహింసల నభయము గన్నవాడు. ఆధునికకాలమున గాంధీజీవంటి దైవీసంపదతో దైవత్వ మొందగలిగినవాడు. "న భూతో న భవిష్యతి" ప్రతియొక్క సంశయమున గీతాశ్లోకార్థములచే నభయస్థితిని యార్జించిన యమరజీవి. అకుంఠితగాంభీర్య ధైర్యలక్షణములు సహజముగా గలవాడు. పూజనీయుడు. సత్యమున హరిశ్చంద్రుని, యహింసనుబుద్ధుని నాడు చెప్పుదురు. నేడు సత్యాహింసల నొక్కడే నడిపిన గురుతరప్రఖ్యాతశాలి. విశ్వవైతాలికుడు. సద్గుణంబులన్ని రాశియై ప్రహ్లాదు శేరెనని భాగవతము. సదు

ణంబులన్ని గాంధీజీని చేరినవి. విద్యాబుద్ధులు లేనికాలమున మనమెన్న డెఱుగనివారి ప్రతిభల నమ్మకములకంటె గాంధీజీని యెఱుగనివారీలోకము నొక్కరుకూడలేరు. గీతయందలి జ్ఞానలక్షణములు గుణాతీతుని, భక్తుని, స్థితప్రజ్ఞుని లక్షణములన్ని మూర్తీభవించిన భవ్యవిగ్రహమే గాంధీజీ. "పహలే కరో ఫిర్ బోలో" ముందుజేయుము, పిదప చెప్పుము వాడు. ఏయొక్క ధర్మము నార్జించిన, యేయొక్క నీతి, యేయొక్క యాచారముగల్గిన నాగైన వానితోనే పావనులమైతిమను పతితులెందఱో గీతాధర్మములగు దైవీసంపదను ముందు బాగుగా చదివి యా గుణములు తమయందు కలవా? లేవా? యని లెస్సగా విచారించవలెను. ఇరువది యారు గుణములలో పంద్రెండుగుణము లభయమునకు పంద్రెండతిమానితమునకు నంతర్భూతములుగా నున్నవి.

ప్ర॥ ఇరువదియారుగుణము లుండవలెనంటే ముందుజన్మమున కొంత పుణ్య మార్జించినవాడు గానిచో నీ జన్మముననే సంపాదింపవలెనంటే దుస్తర మనుకుంటాను. అసురస్వభావములు వివరింపుడు?

ఉ॥ "దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ" ఇది నాల్గవ శ్లోకము సంగ్రహముగజెప్పి 7 నుండి 20 శ్లో॥ వఱకు నాసుర స్వభావవర్ణన గలదు. నీరుగలచోట పాచియుండును. ధాన్యముగలచోట నెలుకలు కొన్నులుండును. పగటికి చీకటికి పరస్పర విరుద్ధమే. కురుపాండవులవలె దైవాసురస్వభావములే. వీనికి ప్రతిక్షణము వివాదమే. అసుర సంపదకుప్రధానమైనది కపటమగు ధర్మాచరణ, దంభము. గురువు చెప్పిన రహస్యములగాని, యింటిగుట్టులగాని రచ్చలబెట్టుట దంభము. విద్యా ధన స్థల దేహ జన దేశ కాల బల నిమిత్తములతోటి దర్పము, అతి పూజ్యతాభిమానము, నగ్నివంటికోపము, పరుషము వీనికి బల మొసగు నది యజ్ఞానము. కండెలకు, నూలునకు, నేతలకు కారణమైన దూదివలె నజ్ఞానము కారణమై చీకటివంటిది. చీకటిలో త్రోవ తెలియదు. ఎయ్యది గ్రహించలేము. మిట్టపల్లములు, దట్టమగు పొదలు దారితప్పించి దుర్దశల బొందజేయును. పై జెప్పిన గుణముల జ్ఞానస్వభావములు నీవెవరంటేగాని, మరేవిషయము నడిగినా నాకు తెలియదందుము. ఇదియే యజ్ఞానము. ఒక ప్రాణమె శరీరమున ప్రాణాపానసమానసుదానవ్యానవాయువులభాతి,

నొక యజ్ఞానమే కారణకార్యములై ప్రకాశించును. శిశుపాల దంతవక్త్రాదులు హరి నెఱుంగక మడిసిరంటే యజ్ఞానమే. మారీచుడు చిన్నతనములోనే రామునిశక్తి నెఱింగియు నీ కపటజింక కాగుటయు, ఋషివేషమున రావణుడు సీతను హరించుటయు, యహల్య నింద్రుడు మోసగించుటయు, పాండవుల జూదమున మోసగించుటయు కపటాచరణముల నేవరానవులైన జ్ఞానహీనులగుట చేతను. ఆదినుండి దైవీసంపద నాసురీసంపదయును వీనిలో దైవసంపద, విత్తనము వృక్షముగాఁగ వృద్ధిఁబొందుచు వచ్చుచున్నది. ఆసురి చీకటివలె వెలదాచుకొనుచున్నది. విద్యాధనప్రభుత్వములను, నార్యత్వప్రతిష్ఠయును తనతోడి మానవులని, దైవస్వరూపులని కొంచమైన విశ్వాసముంచక పైరును మెక్కిరాకుండ నాశముజేయు పొలములోని గడ్డిగాదముకంటివారు. తను తమ కుతంత్రములకు స్వస్తిజెప్పి, కన్నులుదెఱచి మానవులందఱొకటే, పరమాత్మయే సర్వాంతర్యామిగా నున్నాడని గ్రహించి సమానత్వము, సహనత్వము, సర్వత్వము, శాంతత్వము, సుత్కృష్టమైనదంటే, శుభము లేదంటే నాసురీస్వభావము. ధర్మరహితము కావున పైకి విసరినరాయి నిలుచుకొలేక నేలపడినభాతి నెన్నడైన పతితులుకాక తప్పదు. పారమార్థికజీవితమునకు విరుద్ధమగు నాసురధర్మములు నెందున్న తొలగింపదగినవే యనుటే భగవంతుని యాశయము, గీతామాత పిలుపు.

ప్ర॥ ఈ యాసురీసంపద వినిపించుచుంటే ధనంజయు డేమనలేదా?

ఉ॥ "దైవీసంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా । మాశుచస్సంపదం దైవీమభిజాతోఽసి పాండవ" అర్జునుడు కన్నుల నీరునించి తలవ్రేలవైచి చిడిముడిపడసాగెను.

ప్ర॥ ఎందుకావిధముగ కన్నుల నీరు నించెను?

ఉ॥ భగవంతు డాశ్చర్యపడి దుఃఖించినందుకు తెలిసికొని యర్జునా! నీవు నాసురసంపదకు సంబంధించిన వానివిగావు, దైవీసంపదగలవాని వని దుఃఖనివృత్తి యొనరించెను. జీవితమున దైవీసంపదలేనివో, భగవత్ప్రాప్తికి దూరుడనని యేడ్చెను. ఎంత కుశాగ్రతగలవాడో, ధర్మాచరణప్రవర్తకుడో, శీలవంతుడో లోకమెఱుఁగకపోలేదు. సంసారబంధకారణమాసురీగుణములు.

ప్ర॥ దైవీసంపద యాసురీసంపద లెప్పటినుండి యున్నారు? వీరెట్లు పుట్టిరి?

ఉ॥ "ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చః" దైవాసుర లనాదులు; ఎప్పటికున్నారు. వారివారి స్వభావములే వారిని బుట్టించుచుండును. ఒకటి పగటివంటి దొకటి రాత్రివంటిది. ఈ రెండు తెగల మనుష్యులు జగత్తున సృష్టింపబడుచున్నారు.

ప్ర॥ సృష్ట్యాది నీ రెండు తెగల నేల పుట్టింపవలె? సృష్టించువాడు భగవంతుడుకదా? వారిని పుట్టింపక నేయుంటే నీ లోకముల కెంతో సుఖముండెడిది కదా? సంతోషము ధర్మాచరణకు యోగ్యముగా నుండదా?

ఉ॥ ధర్మాచరణకు, సంతోషమునకు వారేమి యడ్డువచ్చెదరు? వారే లేనపుడు నీ ధర్మాచరణ లెందుకు? విను. పాఠశాల నిర్మించువారు చెడ్డవారికి లేక నుత్తీర్ణులు కానివారికి ప్రవేశము లేదు. మంచివారికే లేక నుత్తీర్ణులగువారికే ప్రవేశమని యేల యందురు? అసలు మంచిచెడ్డలు తొలుతనే యెట్లు తెలియును? లేదు భగవంతు డేల సృష్టింపవలెనంటే నాయన కేమి పక్షపాతము? చెడ్డవారే వెనక మంచివారు కాగలరు. మంచికియుండే సుఖముగన్న తరువాతనైన సుఖప్రయత్నము చేసెదరు. సోమరులుగాని, ప్రజ్ఞావంతులుగాని యుండటకు స్కూలున ప్రవేశముగలదు. వారివారి శ్రద్ధావిశ్వాసములబట్టి నుత్తీర్ణులు కాగలరు. లోకము దైవాసురస్వభావులతోనే సృష్టింపబడును. అసురీసంపద పరీక్షకు చదువతగ్గ టెక్స్టుబుక్స్‌వంటిది. అడుగడుగున వీరిని యనగా! నీ యాసురీసంపద నెదుర్కొనుచునే దైవీసంపద పరమగతిని బొందవలెను. దుస్స్వభావము, సుస్వభావము తెలియవలెనంటే రెండుస్వభావములుండియే తీరవలె. రావణుడు లేకపోయిన, చాకలివాడనకపోయిన సీతారాముల ఘనతకు ధర్మమునకు స్థానముండెడిది కాదు. చెడురస్తా వలానిదని తెలిస్తే మంచిరస్తా నడచెదరు. లేదా వెదకికొందురు. మణులు బంగారు రాళ్లలోనుండియే వేరుచేయుదురు. ఆ ఖనిజము లొకటిగానె యుండును. ఎవరు నడిచేమార్గము వారికి మంచిగానే యుండవచ్చును. ఇతరులకు బాగులేదనునది యితరులున్నకదా! తెలియును. భగవంతుడు నీ రెండు స్వభావములను దెలిపి లోకమున కెంతో మేలొనరించెను.

మానవులయొక్క స్వభావములచే రాక్షస, దైవీసంపదగ నభివర్ణించెను. ప్రత్యేకించి దేవతలు, రాక్షసులు నే దేశమున లేరు. రూపములు వేఱు కాదు. అటువంటప్పుడు కొందఱులు పుట్టుకతోనే వచ్చినవనెడి వారు యోచించుటము లేదు. కోతికి కొంకాయచిక్కితే తలబ్రద్దలు కొట్టుకున్నను, కొబ్బెర కానలేనిరీతి అజ్ఞానమును టెంకాయను విదళించలేని వారికి సృష్టితత్త్వము పారమార్థికజీవితవిధానము తెలియుట మృగ్యము. విచారించితే దైవాసురత్వములు రెండు మానవావివేకవివేకములేనని తెలియును. కొందఱసురలలో దైవీకులు, దైవీకులమనువారలలో నాసురీ స్వభావులు కోట్లకొలదిగ నుందురు. రెక్కలులేనిపక్షులు క్రిందపడుభంగి, ధర్మహీనులు క్రిందపడుదురు; పడిపోగలరుగూడ. మృగములలో వ్యాఘ్రమాదులు చెడ్డవియుందురు. వానిని మించిన పాపబుద్ధిగలిగి మానవుల నేచువారి నేమనవలె. క్రియలతో కొందరు,భావములకొందఱు, వాక్యముల కొందఱు లోకమును నిరంతరము హింసించువారలే నాసురీ స్వభావులు, రాక్షసులు.

ప్ర॥ దేవతలు సూక్ష్మశరీరులై నా యూ లోకములనుందురు కదా? తాము మానవులనే దైవాసురలగా జెప్పెదరే?

ఉ॥ స్వర్గమునందలి జీవులు దేవతలు. ఊహావేద్యములు. శాస్త్రము మాత్రమున్నదని తెలిపినదికాని యాసురలోకము జెప్పలేదు. అసురు లొకప్పుడు స్వర్గము నాక్రమించినట్లు తెలిపెదరు. స్వర్గలోకవాసు లనేక దిక్కుల చిక్కులపడినరీతి తెల్పెదరు. స్వర్గములో మాత్రము మంచిచెడ్డలు లేవా? విచారించితే నన్నియు రెండుస్వభావములు లేకయుండుటకాదు. తమకు తెలియక, తాము జూడక జరుగగల నమ్మకములకంటె ప్రత్యక్ష ప్రమాణముగ భూలోకముననే స్వర్గతుల్యము, నరకతుల్యము వారివారి యనుభవములబట్టి తెలియుటలేదా? లేక సూక్ష్మరూపులై యుండు రందుమా? ప్రళయములోను తమ పుణ్యక్షీణకాలమున మరల పతితు లగుచుందురు. ప్రజల మంచివాడైనవాడొక మిసిష్టరగును. తనకాలము ముగిసినంతనే క్రిందిగి దిగవలసినదే. స్వర్గఫలముచేసుకొంటెనే స్వర్గము దొరకును. ఫలముచేయునిది దొరకదు. వాని విచారించబోగా గ్రంథ విస్తరమగును. నిజముగా నాతడు రాక్షసుడురా! అబ్బా! ఆయన

యెంత దేవునివంటి వాడైనను. గుణములనా? దేహేంద్రియములనా? స్వభావములనే కదా ఛేదింపుము.

యుగములు నాలుగందురు. అందులో నొకపాలు ధర్మమునడచునది కలియుగమందురు. రెండుపాళ్లు ధర్మము ద్వాపరము, మూడుపాళ్లు త్రేత, నాలుగుపాళ్లు కృతయుగమనెదరు. ప్రతియుగమునందు దైవీసంపద, యాసురీసంపద యుండనేయున్నది. ఆ సృష్టికర్తలలోనే నొకరికొకరికి ప్రభేదము, వారికి వైరములుండెను. బ్రహ్మశిరస్సొకటి పోవటము, దక్షయజ్ఞమున పార్వతి తిరస్కృతయై మండిపోవటము, శివదక్షుల వైషమ్యము, మధుకైటభాదులకాలము, సుందోపసుందులవంటి తీవ్రతర భయంకరములు, వేదములు దొంగలించకపోవటము, దధీచివెన్నెముక కథ, త్రిపురాసుర, వృత్రాసురవధ, పాలకడలిద్రచ్చుకమునుపే దైవాసురులుండిరేకదా క్షీరవారాశి మథించిరి. తారకాసురవధ, అగ్నిదేవుని భార్యల చరిత్ర యిరువదొకమారవతారముల కథకు కారణము లుండవలదా? సృష్టిలోనే బ్రహ్మ సరస్వతిని మోహించటము, శంకరునికి గంగప్రాప్తము, నాయూపురాణము, లాయూదేవుడు పెద్ద, నాయునవలెనే సర్వమాయె నందురు. విమర్శింపబూనిన సత్యమెద్దియో తిలకింపకష్టము. ఒక్కొక్క వ్యక్తిలోనే నాలుగు యుగములున్నవి. యుగమన సంధి, రెయొక సమయముబోయి, నొకసమయము, వచ్చుసమయము యెచ్చోటనే యుగధర్మముండిన నా యుగధర్మమేనని నేనందును, హిందూశాస్త్రమనును. కృతయుగమున తాను గతింపదలంచుకొంటేనేగాని లేకపోతే చావే లేదందురు. మతికొందఱు నాలుగువందలయేండ్లు నాయువని యందురు. తమంతట చావవలెనని తలచటము చాలాపొరబాటు. ఏ బాధలేని నా యుగమున చావవలెననే తలంపేల? చచ్చి యింతకంటె మరేది యనుభవించవలెనని వారి యుద్దేశ్యము? త్రేత మూడువందల యేళ్లందురు. ద్వాపరము రెండువందలంద్రు. కలి నూరేండ్లందురు. శ్రీకృష్ణపరమాత్మకు నూటయిరువదేనేండ్లపైన యాయువని తెలిపిరి. తక్కిన దుర్యోధన పాండవులయాయువు స్వల్పమే. రెండువందలయేండ్లు వీరుండలేదు. రామచంద్రుడు పదకొండువేలయేండ్లు రాజ్యమేలెను. త్రేత మూడువందలైతే, రామునికింత యాయువు యెక్కడిది? కలి నూరేండ్లనదరుగాని, నూటికి

హైగా బ్రతికిన [illegible] ఐతరేయబ్రాహ్మణమున నూటపదియేండ్లు వారు పసివాళ్లవలె [illegible] తెలిసెను. ఈ విషయమున ఋజువు చిక్కదు. ఐతరేయ [illegible] "కలిశ్శయానో భవతి, సంజిహానం తు ద్వాపరః, ఉత్తిష్ఠన్ త్రేతా భవతి, కలి సంపద్యతే చరన్" ఇదే విషయము బ్రాహ్మణము [illegible] అలసట జెందు వాడు కలియుగంబు ద్వాపరంబెన్న [illegible] త్రేత యుత్థితుడు [illegible] కృత [illegible] బ్రాహ్మణమున వినవే మరొక [illegible] సద్ధర్మమొకర్వము పేరునకు మాత్రము నొకపాలు ధర్మముండుట కలియుగ మన్ని, రెండుపాళ్లు ధర్మము, రెండుపాళ్లు ధర్మ [illegible] ద్వాపరమన్ని, మూడుపాళ్లు ధర్మమొక్క పాలధర్మమొనర్చుట త్రేతయనియు, నాలుగుపాళ్లు ధర్మమొనర్చుట కృతయుగ [illegible]. మరొకవిధము బాల్యము కృతము, త్రేత కౌమారము, ద్వాపర [illegible] వనము, వృద్ధాప్యము కలియుగము. మరొకవిధము ధర్మార్థ కామమోక్షములు నాలుగు గలిగియుండుట కృతము. ధర్మార్థకామము మూడునుంట త్రేత, అర్థకామములు ద్వాపర, కామమేకలి. మరొకరీతి సత్యధర్మతపస్సాహింసలుంట కృతయుగము, సత్యధర్మాహింసలుండుట త్రేత, అహింససత్యములు రెండు ద్వాపర, దంభమొకటి కలియుగము. పరీక్షిత్తు కలి నిగ్రహించి కృతయుగధర్మము నడిపెనందురు. ఏ యుగధర్మమా యుగమునదైయితే దాని మార్చుట మేలాగు? మార్పుగల్గినపుడు యే యుగమైనను కృతయుగమునకు మార్పవచ్చుగదా? ఈలాటివి వెదకితే నపరిమితముగ దొరకగలవు. ఆత్మను తెలియకపోవు నజ్ఞానమె కలి, కామ్యకర్మలుగలుగుటే ద్వాపర, నిష్కామకర్మ, నిష్కామోపాసన గల్గుటే త్రేత, జ్ఞానముగలుగుటే కృతయుగము. ఇంద్రియములకు కామము, దేహమున కర్థము, మనస్సునకు ధర్మము, జీవునకు మోక్షము నివియే కృతయుగధర్మములు. ఇవి వ్యక్తిగతముగా గాని, సమిష్టిగా గాని, జరుగుస్థలమంతయు కృతయుగమే,

ప్ర॥ తాము జెప్పినదే బాగున్నది. భగవంతు డావల నేమిజెప్పెను?

ఉ॥ "ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః। న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే" ఏడవ శ్లోకమునుండి, యిరువ

దవశ్లోకమువఱకు నాసురసంపన్న జెప్పెను. [illegible] గూడ వచించెను. తానిప్పుడు దైవీసంపదను [illegible] గుణవంతుడు జెప్పెనో, అప్పటి నుండి యర్జునుడు అసుర స్వభావమును [illegible] చుండెను. మంచికార్యముల వైపు ప్రవృత్తి, పాప [illegible] వైపు నివృత్తి గలుగవలెననెడి యోచన లేకుండ మనస్సున ఘోరాంధకారము నిండియుండును. సత్యము చెప్ప టము గిట్టదు. సత్యము నణచిపెట్టి సత్యమురీతి నసత్యమునే నమ్మ బల్కుటము, అథవా! అది సత్యమేనైతే తమది పొరబాటనియో, లేక మాకర్లే దోచినదనియో, లేక మీరాడునది యసత్యము, మేమెన్న డసత్యమాడమందురు. అసత్యమునే సత్యముగా నిరూపింప నెంతకైన సాహసింతురు. మరణమునకైన వెనుదీయరు. సత్యాత్ముల, లేక పుణ్యా త్ముల చెలిమియనంటే నాశిష్టముండదు. వీరు సత్యపుణ్యములయందు దోషము లనేకము జూపుదురు. తపమంటె గినిసెదరు. ధర్మమంటె రోత, శుచియంటె కోపము, మంచియంటె విన సహింపరు. వాక్శుచి, శబ్దశుచి, శరీర, వస్త్ర, గృహ, పాత్ర, తదితర శుచులంటే సోమరులై యశుచి లోనె యుండ నిచ్ఛగింతురు. పెండ్రుకలకు నూనెరాసికోనక, లేక దువ్వ కోనక, తలవెండ్రుకలు విరియబోసికొని, తలనిండ స్వేదజములు, చెమట వాసన, కుళ్లుకంపుతో నేశుచియుతేసి వస్త్రములధరించి, దుర్వాసనతో నున్న స్త్రీ గర్భవతిగానుండ నొకరాజుచూచి తనమంత్రితో నీమె సాంగత్యముగోరు వాడెట్టివాడన, నుండు చూపింతునని యచ్చట తిరుగు చుండగనే కోతికి పారవేయ నేలబడిన గొంటునకఱుగొని, వాడిపోయిన తమలపాకుల నములుచు, తెల్లగోడలకున్న సున్నముగిల్లి, సైడుకాల్వలో నీటదడిపి, తాంబూలము వేయువానిని జూపెను. చూచితివా! తమో గుణముతోటి నాసురీవర్తన. ఆచారహీనులు, ధర్మోల్లంఘనులు, తమకు దోచినది, తాము మాట్లాడునది సత్యమందురు. పైరులు వర్షము రాకకు వేచియున్నవి. కాని మేఘము నిల్చి కురవకుండా వాయువు నెట్టి వేయుచున్నది. గాలిస్వభావము గాలికి, మేఘస్వభావము మేఘమునకు బాగున్నది. చిన్నపిల్లల వృద్ధికి తెచ్చుటకు తలిదండ్రులు ప్రయత్నించినట్లే నాసురీస్వభావము నొకవ్యక్తినుండి మఱొకవ్యక్తి వానినుండి మఱొక నికి సర్వత్రవ్యాపకము చేయుచుందురు. దైవీస్వభావమును సర్వదా నది

రించుచుందురు. ప్రవాహమున కొట్టుకొనిపోవు నట్టి ప్రవాహవేగము నెదుర్కొనవలసియే యుండును. ఈ సృష్టి యెట్లు సాధ్యమన్నాదనిన, వేదశాస్త్రములనిన, పరలోకమనిన, పురాణాదులన్న వినిన యసత్యము లని నమ్మనేనమ్మరు. నలుపువర్ణపు కంబళ్ళు తెలుపుగాదన్నరీతి నీ యాసురీ వరులు ప్రవర్తనభయమునకు కలుగుదురు. ఎట్లు గాత్ర కడగినను కల్లుతోనే కడిగితే నెట్లుండునో వీరి యాచారవ్యవహారములు మిగుల నీకృష్టములుగాను, హేయములుగా నుండును. సత్యము, శౌచము, అహింసయు సంతయు శూన్యమేయందురు. స్త్రీపురుషుల సంయోగ సృష్టియే యున్నదనియు, వేరే కారణము లేదనియు, సదా నాస్తికులై, వారి స్వభావము, క్రియలు, పులులు, చిఱుతలు, ఎలుగులు, తోడేళ్లు, పాములవలె, క్రూరములే. లోకక్షేమము వ్యక్తిక్షేమము, తమ కెన్నటికి క్షేమమేయుండదు. కటికవాని యంగడిమాదిరి, వధ్యశాలవలె, స్మశానమురీతి, యుద్ధనేల క్రియ, కల్లంగడివగిది, పరభయదమై, చూడరానిదియై, నరకము జ్ఞాపకము తెచ్చును. అపకారబుద్ధులై, అహంకార, దార్ఢ్య, దంభము లతో మంచిచెడ్డల తారతమ్యము గమనింపబమేలేదు. ప్రపంచవృద్ధిని, సుఖమును, శాంతమును, ఆనందముగా నుండతలంపరు. పేలాకుల ద్రిప్పువగిది, చెట్లాకులరాల్చురీతి, వడగళ్ళవాన భంగి, సెత్తునుండి పారు శెల యేఱువలె, తోడేళ్లగుంపు, గూబల సంచారమురీతి, పగలనక, రేయి యనక, పుణ్యస్త్రీల, పుణ్యస్థలముల, పుణ్యపురుషుల, పుణ్యచరిత్రముల, పుణ్యశ్రవణముల, పుణ్యవంతులపై దాడిచేసి వాని విధ్వంసమొనరింపటములోనే తమబలిమి, తమశక్తి, తమయుక్తి, తమపేరులుండునని తలంతురు. ఏదియో యొక యుపద్రవము నే ప్రాణికో నొక ప్రాణికి నే సమయములోనైన జేయుచుందురు. ఉల్టపల్ట్, తలక్రిందులజేయుటే వారి పని, వారిమతము. వికటహాస్య, పటాటోప, విజృంభణల నుత్పాత లూగింపుచుందురు ప్రజల. కోతి యూరుకోదు. పాము వంకరతిరుగక నుండదు. పాములకు పాలుబోసిన విషగుణముబోసిరీతి మంచిజెప్పినను, మఱేమైన నర్పించినను మఱింత క్రొవ్విల్లుదురు. చెట్టుకొమ్మల గొట్ట మరల సిగురుచ్చును. దైవము గుణవృద్ధికొఱకు నేకొందఱనో మర్దించినను, తమ స్వభావమును, తమసంతతిని మఱింత వృద్ధిజేతురు. గాహు, కేతువులు,

కని, పై కొచిన గ్రహాంబంగి, జబగలరి పలుకుచుండే వారలటము కష్టము. అభిమాన మూఢాగ్రహులై నపరిమిత లోభమున, నవివేకమున, నశుభ నిశ్చయమున, నపవిత్రములగు ప్రయత్నములంటే పిశాచగణములగు తవ యత్నములు నొనర్తురు. పెంకెతత్త్వము, పెంకెయాలు, పెంకెశిష్యుడు, పెంకెస్నేహితుడు, పెంకెపగడు, పెంకెప్రభావాకాంక్ష సత్యమైనను గ్రహింపరు, అహింసనుగూర్చి తలంపరు. ఈ నాస్తికులు విధిభ్రష్టులైనను, భయోద్భ్రాంతులైనను దుర్గుణముల నవలరు. ఆకలిగొన్న వ్యాడేమృగమైన కంటబడిన దానిని పట్టి తృప్తినొందదా! అట్లు తృప్తినొందక కనపడిన మృగమునన్నిటి వధించునంటే నదియే ఘాతుక కృత్యము. తమపని తమకెంతో గొప్పగా దోచును. అగ్నికి దాహకశక్తి, యెండ కుష్ణశక్తి కేవాడొసగే పగిదియుండును. దుష్టాత్ముల దుర్వృత్తి యెప్పటికీ ఒకే విధముండును. ఒక దుర్మార్గుల నాయకుడనును. చూచితిరా! ఒక దినములో నెంతమందినో వధించితినంటే, మోసగించితినంటే, చేయరాని కృత్యము లొనర్తునంటే నాకంటె యధికుడెవడైనయున్నాడా? అని గ్రుడ్లురిమి మీసములు బెదికి, తొడలు చరచి, కనుబొమలు ముడిచి బొబ్బపెట్టును. పుణ్యవంతులైన పురుషులు, స్త్రీలు వారివద్ద భంగకారులు కావలసినదే. పవిత్రవస్తువుల పాడునొనర్చుటే దేవస్థలముల, పుణ్యతీర్థముల, క్షేత్రముల, పుణ్యకార్యముల, యందు జూదములాడుట, మద్యమమ్ముట, సురాపానముట, మాంసాదుల నుపయోగించుట, జీవుల జంపుట, త్రాగుట, వాదులాడుట, దేవుని, దేవునిస్థలముల వస్తువుల తల క్రింద లొనర్చుట, మలమూత్రాదుల తొంగిళ్ళుల నందేవదలుట, దేవమందిరములోనివి నపహరించుట, విగ్రహముల చెడగొట్టుట, తక్కినవి నాశము చేయుట, దేవునినే వెలికివేయుట, మతాంతర మతధర్మముల ప్రతిష్ఠించుట, చచ్చువరకు చింతించుట, చాలాకాలము నుండకపోతిమేయనియు, మన భోగము లెవరో యనుభవింతురనియు, లోకము మఱే విధముగా మారునో, మేముంచినరీతి నుండునో యుండదో, తమతోపాటుగా కాని, తమ భోగ వస్తువులగొనిపోక పోతిమనియు, తమ శత్రువులు కొందఱు మిగిలిరనియు, తమతోపాటు నందఱు జచ్చితే బాగుండుననియు, తమ కేస్థితి గాగలదో యను చింతలోనే నుందురు. శక్తియున్నంతవఱకు దాని ప్రతిఘటింప

నెరుఁగఁజాలరు. నమ్మించియుగాని, బలవంతముగాని, చెఱబట్టిగాని స్త్రీల పరిగ్రహించుటయు, కామభోగముల ననుభవించుటయు, నదే పరమపురుషార్థమనుకొనెదరు. దానికి మించినది వేఱే లేదనుకొందురు. జీవితమంతయు నందుకొఱకే కొల్లబుచ్చెదరు. వారి మంత్రములు, యాగములు, తంత్రములు, వ్రతములు దేశోపద్రవములు, పరపీడాకరములు. నిత్యగండములే, దురితావరణములే, కలుషితవాతావరణములే, రక్తప్రవాహములే, తలల కొంకాయలే, కత్తులపూజలే హింసాప్రార్థనలే, దోషహారతులే, రోగపూజితులే, పాపాచార్యులే. పూజారులు తాము జేయు హితమంతయు తమపోటివారికే. నిష్కారణవైరము. ఒక మేక, పిల్లతో నేను లేనప్పుడు వెలుపలకు బోవవలదు. దుష్టులుందురని జెప్పి తల్లిపోయెను. మధ్యాహ్నమెవరు లేరుకదా యని పిల్లది నీటికై బయటికి వచ్చి తిరుగుచు నీటికాలువవద్ద చేరగనే నొక తోడేలు నీరు త్రాగుచు వార గంట, తన్ను గుర్తించినది గమనించి క్రిందివైపునకువచ్చి నీరుత్రావి మరలుసమయమున తోడేలువచ్చి నేను నీళ్లు త్రాగుచుండ నెంగిలిజేసెదవా? యనెను. లేదు బాబూ! నీళ్లు నావంకకు వారటము నీ యెంగిలినే నే త్రాగితిననెను. అదిపోనీ యారు నెలల క్రిందట నన్ను తిట్టితివంటనే యనెను. నేను పుట్టి మూడు నెలలేయైనదనెను. నీ తల్లికడుపులోనున్నపుడు మూడునెలలు, పుట్టి మూడునెలలు, నారునెలలు కాలేదా? యని పైబడి చంపెను. చూచితివా! ఆశాపాశముల కట్టబడి తుదిగతుల నొకించుకయైన తలంపని యాసురీయులు కామక్రోధాదులకు లోబడి విషయభోగముల ననుభవించుటకై యనేకయుపాయముల నవలంబించి ధనమునుగూర్ప ప్రయత్నింతురు. ఇప్పుడిది చేకూరినది, ఇక కొన్ని సాధించవలసియున్నది; ఇప్పుడింతయైశ్వర్యమున్నది, ఇక నింత రాగలదు; శత్రువుల కొందఱ జంపితి, మిగిలినవారల జంపెదను; మేమే ప్రభులము, భోగులము, పురుషార్థసంపన్నులము, బలవంతులము, సుఖవంతులము, గొప్ప కులమున బుట్టినవారము, మాకు సములేలేరు; యజ్ఞము లెన్నియైన యొనర్తుము, దానమిచ్చెదము, ఆనందించెదము నని పెక్కుసంకల్పములతో చిత్తము నిండ, మోహములనెడు వలలో తగులుకొని విషయభోగములం దిచ్ఛగలవారలై, యపవిత్రములగు నరకముల నజ్ఞానవంతులై బడిపోదురు.

ప్ర॥ వారికి నరకము తప్ప వేఱేలేదా?

ఉ॥ సముద్రము జొచ్చిన పవిత్రజలము నుప్పుదనముగాక మారునా? తమ్ము తామె పొగడుకొంచు సంపదగర్వమున శాస్త్రవిధులను సైతము నుల్లంఘించి పేరునకుమాత్రము యజ్ఞముల నొనర్తురు. దోషభూయిష్ఠ ములగు సర్వానర్థములకు మూలము మోహము, దాన యహంకారము, నితరులకు పీడ గల్గించు బలము, ధర్మోల్లంఘనహేతువగు దర్పమును, స్త్రీవిషయమగు కామమును, స్వాధీనములోలేని కోపమును, తెలియక వచ్చు మదమత్సరములను, ప్రతియణువు మొదలు మేఱువువఱకు, తృణము మొదలు ఘనమువఱకు, చీమ మొదలు బ్రహ్మపర్యంతము గల జీవు లందున్న బుద్ధిసాక్షియైయున్న భగవంతునిగూడ ద్వేషింతురు. భగవ చ్ఛాసనోల్లంఘన మొనరింతురు. సన్మార్గవర్తనుల గుణగణముల నిందిం తురు. కుక్కలు చెప్పుల వెదకురీతి దోషము వెదకుచు, నసూయల రెచ్చ గొట్టుచు బద్ధస్పర్ధల దేశములకు నున్న ప్రాంత్యములకు సమస్త స్థలములకు నశాంతమును భీతిని గలిగించెదరు. రావణుడొనర్చిన దుర్మంత్రముల చదివి యుంటిమి. దుర్యోధన, కీచక, హిడింబాసుర, కాలయవన, పౌండ్రక, హిట్లర్, నేపోలియనువంటివారల నియంతృత్వము, కఱకుశాసనము, దుర్వ్యాజము లోకమెఱుగదా! చదివితిమి, వింటిమి. పశుబలముతో పర పీడాపరులు నెంతవారైన తమతమ పాపఫలములతోనే నశింతురు. భారత రామాయణమున నున్న పేరులు, నిన్న మొన్న చనిన హిందూదేశ పీడాపరుల చరిత్రము చదివితిమి. వారెన్నడో నశించిపోయినవారలని కాదు భావన. రామ,రావణులు, సీతా మొదలైన పాత్రలు యెప్పటికి నూరూర, నింటింట, దేశదేశముల గలరు. లక్ష్మణసుగ్రీవాంగదహనుమంతార్జున ధర్మజ విదుర సంజయ గాంధీలవంటివార లుండియే యున్నారు. మతిమంతులు లేనిచో ప్రపంచమే నిలువదు. రామాయణమున ధర్మాచరణము నీతియు, భారతమున సాంఘికధర్మము ముక్తసరిగ మనము నేర్చుకొనవలసి యున్నది. మనుష్యుల మనుష్యుల పీడనొనరించువారు జంతువుల జంపట ములో వారికి నానందము గల్గుననుకొందురు.

ప్ర॥ ఏదొయొకధర్మము ననుష్ఠింపవలెనన్నను మనుజుడు శ్రద్ధాపరుడై పురు షార్థమును లక్ష్యమునందుంచుకొనకపోతే పతితుడు కాగలడనుకొనెదను.

ఉ॥ ఒకామె నొక చంక బిడ్డను, నొకచంక మఱొకబిడ్డను, నెత్తిన బిందెనుంచుకొని నడచుచున్నదనిన నామె లక్ష్యము దేనియందున్నది? బిందె యందే యున్నది. లక్ష్యమగు మోక్షమును హృదయమున నుంచుకొన్న, దైవీసంపద గలవారు. అశ్వత్థామ తన బిడ్డలజంపితే, నర్జునాదులు బట్టి తెచ్చిన నాతని చంపకుండ ద్రౌపది వదలింపజేసినదన నదియే దైవీ, పవిత్రభావన, పరమాదర్శకము, మానవకల్యాణదాయకమైనది. మానవుల ధర్మము, మాధవదర్శనము, మానవజననము, జననమరణరహిత మోక్షదాయకము. మానవుడంటే మాధవుడే. మనసులోని భావముల మాటలమూలకముగా తెలియజేయుటచే మానవుడనబడును. ఐతరేయోపనిషత్తున మాధవుడెందుకు మనుజుడై పుట్టవలెనంటే 'త్వం'పదార్థము గ్రహింపనన్న జవాబు, సకలమానవులు విమర్శింపవలె. అహింసయన నొక మాంసము తినకుండనుండుట కాదు. మాంసము తినుటకు జంతువును జంపితే నొక క్షణములో ప్రాణముబోవును. అది యంత లెక్కకురాదు. కాని తనజీవితములో నితరప్రాణులవలన తనకెట్లు బాధలేకుండ నుండవలె ననియనునో, నట్లు నితరప్రాణులకు బాధగలిగింపని ప్రవర్తనయే నహింస.

ప్ర॥ పరమమహాత్ము లెట్లు సాధించిరో కాని, యేధర్మమును శరీర పతనాంతమువఱకు సాధించవలెనంటే గొప్పపట్టుదల నుండవలెననుకొని యెదను.

ఉ॥ ఒకప్పుడు బుద్ధభగవాన్ శిష్యులతోఁగూడి యరణ్యమార్గమున నొకపట్టణము చేరబోవుచుండెను. ఇంతలో నొకడు గర్భవతియగు జింకను నొక చెట్టునకు గట్టుటచూచి తన మనస్సు తల్లడిల్ల, శిష్యుల పట్టణమునకంపి, తాను యాగి, జింకను కట్టివేయు నతని సమీపించి వర్తమానము తెలిసికొని, యతడు వెళ్లినమీదట జింకను వదలి, తన మెడకు త్రాడును తగిలించుకొని కూర్చుండెను. కొంతసేపటికి నా పట్టణపురాజు గుఱ్ఱము నెక్కి కొంతసేపు షికారుసల్పి, పట్టణముబోవుటకు మునుపు మామూలుగా తాను వేటాడుటకు తెచ్చి కట్టివేయు నేమృగమైనను సరే వచ్చి తుపాకిని బారుబెట్టి కాల్చెడివాడు. అదేరీతి తుపాకి బారుబెట్టి కాల్చబోవ, సేవకుడు సెప్పిన గర్భవతియగు జింకగాక, గొప్పశరీరము, దయాసముద్రుము, ప్రేమవీచికలవంటి కనురెప్పలు గొట్టు నాయనునుజూచి

రాజు యెవరక్కడ యనెను. జంతువు ననెను బుద్ధుడు. జంతువు మాట లాడదు, తాము మాటలాడుచున్నారు, జంతువెట్లయ్యెద రనెను. జంతువు కాదు, మనుష్యుడని విమర్శించు నీ తెలివి, నేను వేటాడుజంతువుల స్వేచ్ఛకు భంగముచేయుటయేగాక, కటికవానిరీతి, వానిని కరుణలేక చంపుటయందు నేల విమర్శింపవైతివో యని, అట్టి విమర్శలేక వేటా డుటే నలవాటు దృష్టిగలిగి వన్యప్రాణుల జంప పాడిగానున్న నీకు నాయందు కరుణయేల? నీవు గాకపోతే నరే, నవరైననేమి గాల్చువానికి? చనిపోవు నవన్నియు జంతువులే. నిర్హేతుకముగ నితరుల బీడించు పాపమునకు కరుణ యెక్కడిది? తామెన్నడు చావరుగాన వేటాడెదరు. మిమ్మును వేటాడు మృత్యువు, మీ పెద్దల నందఱ వేటాడినది. దాని వేటాడటము, దాని నుండి తప్పించుకొను నేఱవు తెలియుటయు లేక మృత్యువశపశువు కాబోయే నీ గుణము పశుపక్ష్యాదుల నేల చంపకుండును? అని బుద్ధుడూరకుండ, గుఱ్ఱము దిగివచ్చి రాజు బుద్ధుని పాదములకెఱగి క్షమింపవేడి, తనరాజ్య మున నహింసాధర్మమును నంతటినుండి స్థాపించెను. హింసాత్ములకు పాప పుణ్య విచారముండదు; నిదానముండదు. పుణ్యమేది, పాపమేది యని తలంపునకురాదు. మదించిన దున్న రైలునింజనుల తనసరి దున్నలేనని తాకి మడిసినరీతి, బలవంతులచే మడియుదురు. చిన్నచేపల మ్రింగు తిమింగిలములు, జాలరులచేత జిక్కుటలేదా? నిర్మలాకాశమున కేప్రతి ఘటన లుండవు. వింటివిగదా ఆసురీసంపద, దైవసంపద లెట్లుండునది.

ప్ర॥ ఆసురీసంపద గలవార లెందువలన మోక్షదూరులు? వారి గతి యేమి?

ఉ॥ అజ్ఞానమున శాస్త్రవిరహితులై, సజ్జనదూరులై, స్వార్థులై, కర్తృత్వ, భోక్తృత్వ వ్యాజత్వపరులై, ఫలకాంక్షాపరులై, తమబాధ్య తలు గలవారలై, హృదయమునగల కోరికెలనొండ నుఱ్ఱూతలూగుచు, ప్రతిప్రాణికి విరోధులై, క్రూరస్వభావులై, దుర్విమర్శకులై యుండుట చేత మరలమరల నాసురీజన్మములనే "ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని" భయంకర దుఃఖములతో నెత్తవలసియుందురు. పర్వతము నుండి జారిన రొయికగుండు పైకిపోలేనిమాడ్కి, యాసురీసంపదనుండి మెల్ల మెల్లగ తిర్యగ్యోనులగూడ జన్మింతురు.

ప్ర॥ ప్రతిజన్మమున బలవంతులుగా జన్మించుదురంటె తర్కవేముంది? అదే మంచిదిగా దోపదా మఱి?

ఉ॥ ఆ మూఢులు ప్రతిజన్మమున నాసురీశరీరముల దాల్చుచు, భగవంతుని గనలేక సన్మార్గవిరోధులై, పవిత్రవిషయవిముఖులై, యధోముఖవిషయులై క్రమక్రమముగా నధోగతిని బొందుదురు. వారికి శాశ్వతసుఖము లేదు. మానవులందఱు గీతామాతధర్మములను వినిన మీదట నాసురీసంపద యేమాత్రమున్నను దానిని వదలించుకొని దైవీసంపదపరులుగావలె. నడవనడవ గమ్యస్థానము చేరగల్గినపగిది, దైవీసంపద నభ్యసింపనభ్యసింప, తుదకు మోక్షము లేక భగవత్ప్రాప్తి గలుగును. "ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః। స్మృతిలాభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః" ఆహారనియమమువలన నంతఃకరణశుద్ధి, దానివలన భావనాశక్తి, పరాత్పరవిచారశక్తి, హృదయములోని గ్రంథులన్ని నశించును. మోక్షము నొందుదురు.

ప్ర॥ నరకము లనేకము జెప్పుదురు. అవి యేవి?

ఉ॥ "త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః" యిరువదోక శ్లోకమునుండి 22 వఱకు, నరకమేమైన యనుభవించునది అనుభవించు వారికే తెలియును. అందువలన నరకద్వారములు మూడుమాత్రము భగవంతుడు జెప్పుచున్నాడు. "కామః క్రోధ స్తథా లోభ స్తస్మాదేతత్త్రయం త్యజేత్" కామము, క్రోధము, లోభములను మూడే నరకద్వారములు. త్రికాలము, త్రిదవస్థలు, త్రిదేహములు నుత్పన్నమగుటకు మూలము, గర్భనరకముచూచినదే యది యనుభవించనివా రెవ్వరుగలరు? దుఃఖము లన్నిటికి నీ మూడే మార్గములు. కామాసక్తులు, క్రోధోద్దీపులు, లోభభూయిష్టులు, తమతమ ద్వారముల తామే సాలెపురుగువలె నిర్మించుకొందురు. శరీరమున త్రిదోషములుండురీతి, నంతఃకరణమున నీ దోషము లున్న నధోగతి బొందించును. యోచించితే నీ మూడే మానవులకు భవరోగోపాధులు. నీ యూధులు లేవా వ్యాధులులేవు. క్రోధము పులి, కామము పిచ్చుక, లోభము యేనుగువంటిది. ఈ మూడే నెట్టివారికి తగనివి. ఒకటి నెత్తు, రొకటి చీము, నొకటి పురుగువంటివి. హాయిగా నుండామనుకున్న నీ యంతరంగశత్రువుల వదలవలె. "ఏతైర్విము క్తః

కౌంతేయ తమోద్వారైస్త్రిభిర్నరః। ఆచరత్యాత్మనశ్శ్రేయ స్తతో యాతి పరాం గతిమ్" ఈ మహాపదేశము లెంత శ్రీఘ్రముగా పాటించుకున్న నంత మేలు. ప్రయాణమొనర్చువారు చత్తపవారము, కల్లగుట్ట, చెట్టు రాళ్లు, మిట్ట పల్లము, దారిదొంగలు, క్రూరమృగములు గలవి ప్రాణ భయ మొనర్చును. మఱొకటి చీకటిది, బొత్తిగా వెలుతురు లేనిది. క్రింద నఱుసు, పైన కంపుగలదొకటి. ఘోరారణ్యమువంటిదొకటి. ఈమూడు గమ్యస్థానము చేరనివ్వవు. మఱియు జీవులే లేనిది. జలము సుము యెక్కడ దాటవలెనో, యెంతలోతో తెలియదు. ఎక్కడుండవలెనో తెలియు నపుడు పాంథుని గతియేమి? ఆ విధము ఈ త్రివిధమార్గముల త్యజించ సుగమము. భగవత్కరుణకు భక్తియే మార్గము.

ప్ర॥ సుగమమార్గ మేదియో తెలుపుడీ?

ఉ॥ శాస్త్రము వచించిన మార్గము.

ప్ర॥ శాస్త్రనియమము దాటితే నేమి ప్రాప్తించును?

ఉ॥ "యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః। న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిమ్" శాస్త్రముయొక్క విహితమును వదలి, తన యిష్టమువచ్చినరీతి యెవడు వర్తించినా, అనగా విధినిషేధ ముల గమనింపక నడచునో, యట్టివాడు జ్ఞానసిద్ధిగాని, శాంతిగాని, మోక్షమునుగాని బొందడు. "ఇతో భ్రష్టస్తతో భ్రష్టః" యన్నరీతి నిహపరములకుదప్పి యుభయభ్రష్టుడగును. కనుక "తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ। జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి" ఇరువదినాలగవశ్లోకము. కర్తవ్యాకర్తవ్య విషయ నిర్ధారణకు శాస్త్రమొక్కటియే మానవులకు హితము నుపదేశించునది. ప్రవృత్తినుండి నివృత్తికి గొనిపోవుటయే శాస్త్రముయొక్క ఉద్దేశ్యము. మానవులకు తెలియని ధర్మముల నాదేశించునది శాస్త్రమే. వస్తువిషయ ముగు పరోక్షజ్ఞానమును, సాధనావిధానమును శాస్త్రము ప్రసాదించు

చున్నది. శాస్త్రనిర్దిష్టవిధానము ననుసరించి శాస్త్రజ్ఞానము ననుభవవేద్య మొనర్చుకొనవలెను. ఏయూరికి నేత్రోవ, నా త్రోవన గలిగే ఫలాఫలముల నిర్దేశించు దస్తావంటిది శాస్త్రము. దస్తావదలినవాడు తప్పుత్రోవల బోయి, గమ్యస్థానము చేరలేక నిరంతరదుఃఖముల బడగలడు. అంధకారములో ప్రయాణము, గ్రుడ్డివాని యాత్ర, ముంజేతులు లేనివాని క్రియాభాగ్యములు, కాళ్లులేని యవస్థ, చంద్రుడు లేని శరద్రాత్రి, సూర్యుడులేని పగలు, శుచిలేని జీవితమువలె వ్యర్థములు. శాస్త్రము రెండు కన్నులుగలవానివంటిది. శాస్త్రము వదలినవా రంధులు. శాస్త్రమెఱుగనివాని జీవితమె పరిహాసకము. ధర్మదూరు డధోగతి నొందును. శాస్త్రము స్వకల్పనలుగావు. అందువలన శాస్త్రీయములగు విధినిషేధముల స్వరూపమును శాస్త్రమనే యద్దముద్వారా గ్రహించి కర్మాధికారియగువాడు యథాధికారము కర్మనొనర్ప నర్హుడని యర్జునునితో భగవంతుడు వచించెను. ఆసురీసంపదకు సంబంధించిన నిషిద్ధకర్మలను పరిత్యజించి దైవీసంపదకు సంబంధమగు విధివిహితకర్మలనొనర్ప చిత్తశుద్ధి, కాయసిద్ధి, జ్ఞానసిద్ధి, మోక్షము సిద్ధించును. పవిత్రమైన మానవజన్మము, దైవానుగ్రహమున లభించినది. అట్టి మానవత్వమును దైవసాక్షాత్కారమునకే వినియోగించుట జ్ఞానము, స్వరూపానందమునకుపయోగించుట ధర్మము. ఏ యానందోద్దేశ్యముతో జన్మించితిమో, నా యుద్దేశ్యమును సాధించుకోలేక, నాసురీవృత్తిమెలగి తనయాత్మకు, తనుగన్నవారికి, తన యుండు ప్రదేశమునకు, తన దేశమునకు, తన్నను గ్రహించు గురుదైవములకు ద్రోహులై, యాత్మనాశనకారులై, పెక్కేండ్లు జీవించి పతితులై పోవుటకంటే, భగవంతుడు జూపిన తత్త్వసంవేదనమార్గులై, మోక్షమునొందుటలో స్వల్పకాలము జీవించి చన్నను మోక్షమే సిద్ధించును. లోకక్షేమము శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులు, స్వామి వివేకానంద, రామతీర్థ ప్రభృతు లెంతకాలము జీవించిరి. ఆ పరంజ్యోతులు, నా ధర్మోద్ధారకులు, నా యారాధ్యచరి

త్రులు, నశేషమానవలోకప్రియులు, నాపూజనీయులు, గీతామృతపాన మొనర్చిన భవ్యమూర్తులు, నచిరకాలములోనే లోకమునకు తమ దివ్యత్వమును దివ్యసందేశ మొనర్చిరి. కావున దైవాసురసంపద్విభాగ యోగములోని దైవీసంపద నార్జించమనియే భగవదుద్దేశ్యము; మన కర్తవ్యము.

ఇతి శ్రీ భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీ కృష్ణార్జున
సంవాదే దైవాసురసంపద్విభాగయోగో నామ
షోడశోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## సప్తదశాధ్యాయము

### శ్రద్ధాత్రయ విభాగయోగము

ఉ॥ శ్రద్ధ మహాతపంబు నరసభ్యమనోజ్ఞము పుణ్యకార్యముల్
సిద్ధరతాభియోగములు సేవితధర్మము లెల్ల శుష్కముల్
శ్రద్ధ యొకింత లేనిచో నిరాశను బొందక స్వాత్మబుద్ధి స
న్నద్ధులుగందు మోక్షము ననూనత వాటిలు నెట్టివారికిన్.

శ్లో॥ ఆబ్రహ్మతృణపర్యన్తం మాయయా కల్పితం జగత్ ।
సత్యమేకం పరబ్రహ్మ విదిత్త్వైనం సుఖీ భవేత్ ॥

తా॥ బ్రహ్మ మొదలు తృణమువఱకంతయు మాయాకల్పితము. ఒక పరబ్రహ్మమాత్రమే సత్యము. దానిని తెలిసికొనినవాడు సుఖవంతుడు. నిత్యము, వినాశి, యేకరసము, శుద్ధబోధము, చైతన్యము, వికారరహితమగునదియే సత్యము.

ప్ర॥ ఈ యధ్యాయమున ధనంజయుడే మొదట భగవంతుని ప్రశ్నించెను. కారణమేమై యుండును?

ఉ॥ వారిరువురి సంవాదము వ్యావహారికము కాదు; ప్రపంచమందలి ననాది తత్త్వవేత్తలందఱు నతీంద్రియజ్ఞానమునగన్న పరమసత్య గమ్యమునుగుఱించి. వినువాడర్జునుడు, ప్రవచించువాడు భగవంతుడు. మును వేనోము నోచెనో, యెట్టి తపంబాచరించెనో, యే ఋషుల యాశీర్వాదబలమో, మతేప్రాప్తమో, దేవదేవు డీశ్వరుడు చెప్పుచుండ నర్జునుడు వినుచుండెనన ఆ కాలము నేమనవలె? నా స్థలము నేమనవలె? మార్గశీర్షమే, పవిత్రపుణ్యక్షేత్రమే, ధర్మసందేశమే, పుణ్యతీర్థమే. దైవాసురసంపద్విభాగయోగాంత్యమున శాస్త్రమును శ్రద్ధచేవిని యాచరణలో

శాస్త్రవిధినుంచనిచో, నట్టివానికి పరలోకముగాని, యీ లోకభోగములు గాని లేవు; ఇక మోక్ష మెక్కడిదియనియు చెప్పియుండుటచేతను, శాస్త్రవిధి నుల్లంఘించరాదనే దానిపై మోక్షము జేర్చుటకు సాధనము శాస్త్రముతప్ప మఱేమిలేదనియా యనియు సంశయముగల్గిన నడుగుట సహజమే. చెప్పినదంతయునూ కొట్టుచు, నౌనని, కాదనియననివాడు యోగ్యుడుకాడు. ఏ విషయమునుగాని, యే వస్తువునుగాని విమర్శించు వాడు సత్యాసత్యములను తేల్చుకోగలడు. పిదప ననుభవైకవేద్య మొనరించుకోగలడని చెప్పవచ్చు. లలితకళలచే మాయావిలాసము జగత్తు చూడ మనోజ్ఞమై బుద్ధికి తెలియకుండనే మారిపోవుచున్నది. జగత్తు ప్రతిభకు కారణము నాత్మయే. ఆత్మయొక్క యానందాతిశయా విష్కారమే జగత్తు. ఈ పరమరహస్యము శ్రద్ధాభక్తులుగలిగిన శిష్యులు తప్ప తదితరులు గ్రహించలేరు. ఎన్నడైన చూచినదియో యనుభవ నీయమైనదో గాకపోతే తెలియ దుర్భరము. ఒకప్పు డొకగురువు గుఱ్ఱముపై గూర్చొని తన శిష్యులతో బయలుదేరి, తాను ముందుబోవుచు, గమనవేగమున దన పట్టుయుత్తరీయము జారి క్రిందపడెను. వెనుక వచ్చు శిష్యులు తెచ్చెద రనుకొని తా దిగవలసినచోట దిగెను. వెనుక వచ్చు శిష్యులు వస్త్రము గురువు నదేయని తెలిసి 'మనలను తెమ్మనలేదు, ఆయన చెప్పని పని మనమెన్నడు చేయగూడ'దని, గురువాజ్ఞ కాలేదని వస్త్రమును పుచ్చుకొనిరాక గురువును సమీపింప, దారిలో క్రిందపడిన నా వస్త్రము నేల కొనిరారైతిరనెను. తాము జెప్పలేదు, మేము తీసుకరాలేదనిరి. అటులనా! ఇప్పటినుండి మనవస్తు వెద్దియైనసరే ప్రయాణమున రస్తాలో బడిన తప్పక తెండని చెప్పి, యా మరుదినము తాను ముందు ప్రయాణ మొనర్చ, శిష్యులు వెనుక నడచుచుండిరి. గురువు తాను యనుకొన్న మజిలీచేరెను. వెనుకవచ్చు శిష్యులు గుఱ్ఱము విడిచిన లద్దెనుగని, మనవస్తు వెద్దియైన వదలక తెమ్మని మనగురువు చెప్పెను. ఇది మనగుఱ్ఱపు లద్దె వదలరాదని గురువుయొక్క పట్టువస్త్రములోనికి నెత్తి, యెవడు తెచ్చిన వానిపై గురువు కరుణయుండును. నలుగురము తీసుకొనిపోయిన నలుగురిపై ప్రేమయుండునని, యైనా! నింతమంది యుండ నా కొక్కనికేమి నియ్య తగవులాడుచు, నాలుగు చెఱగుల నలువురు బట్టుకొని లద్దె తెచ్చుట,

దారియందనేకులు నెదురుపడి యీ వింతనుజూచి గురువునకు తగిన శిష్యులని నగుచు బోవుచుండ, నెంత పెద్దకీర్తి! పనిచేయనిదే జనులీలాగు యనుకొందురా! యని తమలోతాము పొంగుచు గురువును సమీపించుచుండ, గురువేదియో యపూర్వవస్తువు తెచ్చుచున్నారనియు, శిష్యులంటే నీవిధముగ నుండవలెననియు నబ్బురపడుచు, నేమిటేమిటియని తీవ్రతతో నడుగ, తెచ్చి యాయన ముందుంచ, జూచి విస్తుపోయి, మూఢులారా! ఏమిటీపని యనెను. మనవస్తువెద్దియైన వెనుక వచ్చెడి మీరు దారిలో గనపడిన విడువక తెండనిగదా జెప్పితిరి? మన గుఱ్ఱము లద్దెగదా యని తెచ్చితిమనిరి. నలువురేల బట్టితిరన, నలువురము తమ శిష్యులమేనని మాపై ప్రీతిగలుగుటకు తెచ్చితిమనిరి. ఈలాటి శిష్యులున్న తనకేనాటికైన ముప్పుదప్పదని గురువు తనలో తా జింతించెను. చూచితివా! మందమతులు, నలసులు, సోమరులు, పరిజ్ఞానహీనులు, నవివేకులు, శ్రద్ధారహితులు, నయుక్తు లిట్లుందురు. అర్జునుడీ శిష్యులవంటివాడా? కాదు. అప్రమత్తుడు, నఖండప్రజ్ఞాధురంధరుడు, కార్యసాహసికుడు, కుశాగ్రబుద్ధి, స్మృతినిపుణుడు, విషయావగాహనరసికుడు, సమయానుకూల ప్రవర్తకుడు. షోడశాధ్యాయము విన్నమీదట దైవాసురత్వములకు "ద్వయా హ వై ప్రజాపత్యదేవాశ్చ అసురాశ్చ" బృ॥ శ్రద్ధయే వీని రెండింటి నిర్ణయమునకు కారణము, నా శ్రద్ధలబట్టి వారిని నిర్ణయించుకొనుటలో, సడలించుకొనుటలోను తనకే కాదు భావిమానవుల నుద్దేశించి యడిగెను. మఱియు వినదగినదేది, వినరానిదేది, చేయతగినదేది, చేయగూడనిదేది యనుట, శాస్త్రమునే వినమనటము. సంశయమైనదే. శాస్త్రము చెప్పనిది కర్మనుగుఱించిన ప్రశ్న నిశ్చయించనే రాదా? భిన్నభిన్న మతములు, భిన్నభిన్న శాస్త్రముల నెవడు పరిశోధింపగలడు? వానికి యేకైకత్వ మెక్కడలేదు. భిన్నభిన్న శాస్త్రముల నొకచోటజేర్చి యేదైన నిర్ణయముజేయుటకు వలనుపడునా? పడదు. ఒకవేళ పడిన వాని నాచరించుటకు యథేచ్ఛమగు సమయ మెవరికుండును? శాస్త్రము, వర్ణము, దేశము, సమయము, విషయము, కారణము వీని యన్నిటికి నొకే కార్యమున నుచితయోగము గలుగ కలుగుసట్టి యుపాయ మెటుల జేయనగును? ఇందువలననే నీ శాస్త్రోక్త ప్రకరణోపాయము

బహుళా కఠినమే. అనుభవమగునంతవఱకు దుర్భరముగానే యుండును. ఇక నజ్ఞానులై యుండి దానితోపాటు మోక్షమును సంపాదింపవలెననెడి కోరికగలవారికి ప్రవేశించగల సులభమార్గమేది? ఇదియే సంశయహేతు వగుటకు కారణము. పదమూడవాధ్యాయము మొదలు భగవంతుడు, రామరావణసంగ్రామమున నెడతెఱిపిలేని రామబాణములవలె, నర్జునుని సంగ్రామ, సవ్యసాచిత్వబాణ నిర్విరామము, వర్ష ఋతువునందలి వర్షము పగిది, నమృతవర్షము నెడతెఱిపిలేకుండ నర్జునుని హృదయక్షేత్రము బండ కురిపించి యుండునకు భక్తిజ్ఞానవైరాగ్యములు పట్టుదల విశ్వాసములుండి ననేగాని ప్రకృతినిరోధము చేయగలరు. ఘోరమృగసంకుల భీకరారణ్య మున నొంటిపాంథుడు తెరవుతప్పిన గమ్యము చేరలేనిపగిది, ననాది యవిద్యచే ప్రకృతివికృతులు పరిభవమొనరింప పురుషోత్తమునిగాంచ, ప్రకృతి హద్దులనుదాటి పరమాత్మస్వరూపులై కృతకృత్యులు గాగలరు. అందు కాసురీసంపద గలవా రనర్హులు. దైవీసంపదగలవారే సంపూర్ణాధి కారులని, శాస్త్రనిర్దిష్టము ననుసరింపనిచో, సర్వదా భ్రష్టులని తెలిపి శాస్త్రనియమము జెప్పినను, యనుష్ఠానము లేక ననునిత్యముంతలగిన విధమును శాస్త్రాభ్యాసములేనిచో గలిగెడు ననర్థకములు గలుగునని యర్జును డడిగిన దానికి నీ యాధ్యాయము జెప్పబడెను.

ప్ర॥ అర్జునునకు గలిగినది దేనిగుఱించి ?

ఉ॥ నిత్యకృత్యముల నెట్టి శ్రద్ధయుండిన పురుషోత్తముని నెఱుగు చిత్తము గలవాడగునను సంశయమున నడిగెను.

ప్ర॥ శ్రద్ధాత్రయవిభాగమన నేమి ?

ఉ॥ శ్రద్ధ ముఖ్యము, గౌణమని రెండు తెఱగులు. ముఖ్య శ్రద్ధయేది, గౌణశ్రద్ధలు మూడువిధములు. వానివలన గలిగెడు ప్రయోజనమును, వానినుండి ముఖ్యశ్రద్ధకు విధాయకము తెలుపునది.

ప్ర॥ శ్రద్ధలు మూడేకదా ? ముఖ్యశ్రద్ధ యనవరదేది ?

ఉ॥ శ్రద్ధ మానవజీవితకళలకు సాహిత్యమొసగి పోషించునది. సత్య శాస్త్రములగు వేదాంతప్రస్థానముల, సత్యగురువులయందుండు శ్రద్ధ ముఖ్యము. తక్కిన మూడు గౌణము లనగా నముఖ్యములు. జ్ఞానాధి కారికావలెనంటే ముఖ్యశ్రద్ధయుండే విశ్వాసముండవలెను. న మ్మ క ము

లేనపుడు గౌణశ్రద్ధలుగూడ ప్రయోజనకారులుగావు. "నాస్తి శ్రద్ధాసమం పుణ్యం నాస్తి శ్రద్ధాసమం తపః। నాస్తి శ్రద్ధాసమం యోగం తస్మాత్ శ్రద్ధాం సమాశ్రయ" శ్రద్ధ అన క్రమశిక్షణ, లేక నియమము, లేక పట్టుదల, లేక వ్రతము నొకేరీతి సదాయుండుటకు శ్రద్ధయందురు. ప్రతియొక విషయమునకు, కార్యమునకు శ్రద్ధయే ప్రధానము. లేనిచో పుణ్య, తప, యోగాదులకంటే గొప్పయనుటకు హేతువేమి? రాజకీయ, మత, సాంఘిక, నైతిక, కార్మిక, భౌతిక, రసాయన, నైమిత్తిక, మహాత్మ్యరంగముల నందంతట శ్రద్ధయే ముఖ్యము. సాధనచతుష్టయమును శ్రద్ధయందురు. కాని గీతయొక్క శ్రద్ధనే చాలన్నది. చిన్న పెద్ద కార్యములకు, జీవిత జీవితాంతరములకు నీ శ్రద్ధయే పరమప్రసాదము. శ్రద్ధచే సాధింపలేనికార్యమేదిలేదు. లౌకిక, పరలౌకిక, క్రియల ఫలాఫల, నిశ్చయములకన్నిటికి శ్రద్ధయే. దైవముకూడ శ్రద్ధతప్పిన కాలగతులు తలక్రిందులగును. ధర్మాధర్మములు, సత్యాసత్యములు, నుచ్చనీచతలు, స్వచ్ఛతాస్వచ్ఛతలు, పుణ్యపాపములు, బంధమోక్షములకు నీ శ్రద్ధయే పునాది. మాటకు, క్రియలకు, సంకల్పములకు, నిర్ణయములకు, విధులకు శ్రద్ధయే గీటురాయి. శ్రద్ధ తప్పినచో ఫలప్రదములు కావు. ఆ ప్రణాళి కేదియైన తప్పులతడక యగును. చెట్లనీడల వంటిది యెండు మడువులు, నకాల పంటలు, నకాలజనిత కార్యములవంటివగును. గీతయందు కర్మయోగమున "శ్రద్ధావంతోఽనసూయంతో" యని, "శ్రద్ధావాన్ లభతే జ్ఞాన"మ్మని, నాల్గవ యాధ్యాయమున "శ్రద్ధావాన్ భజతే యో మాం" ఆత్మసంయమయోగమున "శ్రద్దధానా మత్పరమా" భక్తియోగమున చెప్పుచు నిత్యశ్రద్ధయుండినగాని ప్రాప్యవస్తువు పొందజాలరనియు, శ్రద్ధయే భక్తి, జ్ఞాన, వైరాగ్య, ధ్యాన, త్యాగ, మోక్షములకు కారణమనెను. విద్యార్థికి, గురువునకు, శిష్యునకు, భార్యాభర్తలకు, దైవభక్తులకు, రాజప్రజలకు, నొకటననేల? దేనికైన శ్రద్ధయే. నూత్నవికాసమునకు, భావోద్దీపనకు, భవ్యచరిత్రలకు, లోకకల్యాణమునకు శ్రద్ధయే నవసరము. త్రిమూర్తుల సృష్టిస్థితిలయములకును, సూర్యచంద్రాగ్ని, సకలవాయ్వాకాశపృథివీ, యోషధీతరకాలవములకు నీ శ్రద్ధయే. నిత్యావసరవస్తువు, గడియారములోని చిన్నముల్లు పెద్దముల్లుల, నిమిషముల గంటల తెలుపు

టకు శ్రద్ధయే. రైలుబండ్ల రాకపోకలు, సంధ్యావందనాదులు, దినచర్యలు శ్రద్ధయే. కొద్దికాలము ప్రార్థనవదలిన, ఉపాసనవదలిన, పనులువదలిన, నడవదలిన, ఆలోచనవదలిన, నేటువదలిన సాధనాకార్యములు తలక్రిందులై నిష్ఫలములగును. ఒకప్పుడు దేవతలలో రంభా యూర్వశి తమలో తాము నేనెక్కువ నేనెక్కువ యనితగవులాడ, వారి యెక్కు తక్కువల దేవతలు నిర్దేశింపలేక భూలోకమున ప్రాజ్ఞుడగు నొకరాజు నాహ్వానించి యాయనవలన తీర్పుచేయను గలిగిరి. రంభాయూర్వశులిరువుర దొకే రూపము, నొకే వయస్సు, నొకే చాయ, నొకే వస్త్రములు గట్టియుందురు. పొడవు, బలము, సంగములు వీనిని జూచి నిర్ణయింప చతురాననునకు సాధ్యము కానివాని నారాజు పారిజాతకుసుమములతో మెడలోనికి హారములు, చేతబట్టుకొన పుష్పముల గుచ్ఛముల తయారుచేయించి సభకు వారిని రప్పించి వారిరువురి మెడ హారములువేసి చేతులకు పుష్పగుచ్ఛముల నిచ్చి యొకగంట నాట్యమాడ నియమింప నృత్యముచేసిరి. పిదప వారిరువుర చేతిగుచ్ఛముల దెమ్మని, తెచ్చినవాని రాజుచూచి రంభచేతిలోనివి నలిగి యుండుట, యూర్వశిచేతిలోనివి కందకయుండుట దేవతలందఱకుజూపించి యూర్వశి గొప్పయని నిర్దేశించెను. శ్రద్ధతప్పి యసూయచే గుచ్ఛము నదిమిపట్టడముతో, నృత్యగీతములందే తనదృష్టి కేంద్రీకరించి యుండుట చేతను చేతిలోని గుచ్ఛము నలిచినది. శ్రద్ధ తప్పినది. తాను ఓడినది. శ్రద్ధ నిర్దిష్టకార్యమునకు చుక్కానివంటిది. ఒక క్షణము నొక దినము నందలి శ్రద్ధయే ప్రాణవియోగమువఱకు, లేక తాను సాధింపదలచినది పొందువఱకు నుండవలెను. కంటిని నొకటియొనర్చుట శ్రద్ధయే. శ్రద్ధ హృదయమునందుండవలె. హృదయము పవిత్రముంగ, ప్రసన్నముగ నుండెనా, వ్యవహారములన్ని యొకేదిశకు నడుపగలవు. "అనగననగ రాగ మతిశయిల్లుచునుండు తినగతినగ వేము తియ్యనుండు" సాధనమున పనులు సమకూరుననుటకు శ్రద్ధయే హేతువు. మునుపటి జన్మములోని శ్రద్ధ యీ జన్మమునకును, యీ జన్మములోని శ్రద్ధ యుత్తరజన్మమునకు కారణమగు చుండును. శ్రద్ధాపరుడు తనకార్యమును నియమబద్ధ మొనర్చుకొని నడుపును. తుదకు ధన్యుడగును. వారమునకు నాల్గుపద్యములు నేర్చికొని పదకొండు మఱచుట శ్రద్ధగాదు. ఒక పని కొంతకాలము చేసివదలుట,

దేహారోగ్యము లేకపోవుట, ప్రతిపనులు కొదవలు కొఱఁతలుగా నుండుటయు, ఒక ప్రయాణముచేసిన కొంతదూరమరిగి వెనుకల వెనుదిరుగుట యొక మాట, యొక నిశ్చయము, నొకలక్ష్యము నొందజాలనిదద్దియు, శ్రద్ధలేక పోవుటచేతనే సత్యముగాని, ధర్మముగాని, జ్ఞానముగాని, నిష్కామకర్మోపాసనలుగాని మానవకల్యాణకరమగు నేకమైన శ్రద్ధచేతనే లభించును. శ్రద్ధగలవానికన్నియు సిద్ధించును. శ్రద్ధ మహోత్తరమానవబీజము, లేక కీలకము. తపమన్న, జప వ్రత నియమమన్న శ్రద్ధయే. అధోగతికి శ్రద్ధయే కారణము. సుగతికి శ్రద్ధయే హేతువు. ఇంజక్షను నీటి పారుదల వంటిది. జీవితమునకు మధురాతిమధురమై సమస్త కళలనిచ్చి సాహిత్యరసపోషకమునకు సిగ్గు దీర్చగలది. వానరులలో హనుమంతుడు, రాక్షసులలో విభీషణ, ప్రహ్లాద, బలి, బాణాసురలు, పక్షులలో గరుడుడు, పన్నగులలో వాసుకి, బిల్లులలో శబరి, మృగములలో నుడుత, కిరి యిత్యాదులకీర్తి సాయుజ్యములకు శ్రద్ధయేకదా! చిన్నతనము నుండి బాలబాలికల నేశ్రద్ధతో దిద్దిన నాప్రకారమే తీరగలరు. రాతివిగ్రహముల కొయ్యవిగ్రహముల కాగితపు బొమ్మల శిల్పులెట్లు దీర్చిన నట్లు దీరగలవు. జ్ఞానవిజ్ఞానములకు శ్రద్ధయే. పుణ్యమునకు, కీర్తికి, త్యాగమునకు, శీలమునకు, నాచారమునకు శ్రద్ధయే. శ్రద్ధకు సమము మఱొకటి లేదు. శ్రద్ధలేనిచో సమాధానమే యుండదు. "యుక్తాహార విహారస్య" నియమబద్ధమైన యాహారము, వ్యవహారము, నిద్ర, సంభాషణ, కర్మ, భావములు మొదలైనవి పరమశాంతాననము, నిత్యసంతోషము, దృఢము, ధీరత, యుత్తేజము, సౌభాగ్యత గలిగించును. ఏదైన యాలోచనజేయవలెనన్న భయములేనిది, మర్యాదగలది, ప్రపంచోద్దీపనమైనది, సుఖమైనది చూడగలుగును. నిత్యజీవితమున యీ యలవాటు వచ్చినగాని, సరళముగా మానవులు సంసారమునుండి తరింపలేరు. స్థావరజంగమము లందంతట నీ శ్రద్ధ స్వతస్సిద్ధముగ నుండనేయున్నది. ఈ శ్రద్ధను తప్పించిన ననర్థముల దెచ్చును. ఉచ్చనీచస్థితిగతులకు శ్రద్ధయే. ఊహ చేతగాక నీ యాధ్యాయమున చెప్పినరీతి సహజసిద్ధముగ జన్మతోడనే మనము ముఖ్యశ్రద్ధగాక, తక్కిన మూడు శ్రద్ధల ననగా,. సత్వరజోతమోయుతశ్రద్ధలను తీసికొని వచ్చుచున్నాము. ఇప్పటి విత్తనమే చెట్టు.

చెట్టునకు విత్తనమే కారణము. పేరు ప్రతిష్ఠలతో జ్ఞానులు, యోగులు, భక్తులిత్యాదులు శ్రద్ధలేక కాలేరు. పేరుతోనే వానివలన గలుగు ఫలము నొందజాలరు.

ప్ర॥ ఓహోహో! అందుకేనా భగవంతుడు మూడవ, నాల్గవ, యారవ, పండ్రెండవ యాధ్యాయముల కర్మ, జ్ఞాన, భక్తి, ధ్యానముల శ్రద్ధయే ముఖ్యమనెను? మొదటి శ్లోకార్థము, నీ యాధ్యాయశ్లోకము లెన్ని ?

ఉ॥ ఈయాధ్యాయమునకు శ్లోకము లిరువదియెనిమిది "యే శాస్త్రవిధి ముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః। తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వ మాహో రజస్తమః" అర్జును డడుగుచున్నాడు: హే భగవానుడా! మధుసూదనా! తాము చెప్పుట నాకు సంశయాస్పదముగ నున్నది. ఏ మందువా? శాస్త్రము జీవులకు మోక్షసాధనమనియు, మోక్షమునకు మరేది సాధన గాదంటిరి. శాస్త్రము నభ్యసింపవలెనా; సరియైన స్థలము, కాలము, వయస్సు, నధ్యాపకులు కావలెను. కాని యీ సౌకర్యములన్నియు తటస్థింపక, శాస్త్రాభ్యాసమునకు కావలసిన తక్కిన తదితర పరికరములులేక, పూర్వకాలపుణ్యములేక, బుద్ధిబలములేక, సజ్జనసహవాసము, ప్రోద్బల మొనర్చువారులేక, విధినిషేధముల కష్టతరములని తలచియో, నాదా సీన్యమును వహించియో, లేక తెలిసికొన ప్రయత్నింపకయో, శాస్త్రాభ్యాస మొనర్పలేక శాస్త్రవిశ్వాసమనెడి జంజాటమునే వదలి, శాస్త్రోక్త కర్మల ననుష్ఠించి, వాస్తవముగు పారలౌకికసుఖములను నార్జించువారి మాదిరి తాముకూడ కావలెననెడి యతిదృఢమగు నభిలాషగలిగి, యీ యభిలాషవలన శాస్త్రోక్త కర్మానుష్ఠాన మొనర్చువారి ననుకరించెడి ప్రయత్నము చేయువారు నాస్తిక్యబుద్ధితో ప్రాచీనుల నాచారములను,పరంపరగ వచ్చువానిని యనుసరించుచు దేవతాదుల నర్చించువారు ననగా, ఒరులొనర్చు తత్ప్రకారమాచరించువారి ప్రవృత్తి లేక శ్రద్ధ యెట్టిది? సాత్త్వికమా? రాజసికమా? తామసికమా? యని యడిగెను.

ప్ర॥ భళే! ధనంజయుడు లోకదృష్టిని హృదయమున నుంచుకొని యడిగెను. ఈ మూడుశ్రద్ధల బాహ్యాభ్యంతరముల నంటబెట్టుకొనియే ప్రపంచము వ్యవహరించుచున్నది. ముఖ్య గౌణశ్రద్ధలు జన్మముతోనే

వచ్చునా? మరేవిధమున వచ్చునా? గ్రుడ్డివాడు నొకమంచివాని వెన్నంటి నడచునట్టి, పండితులైనవారి ననుసరించుచు శ్రద్ధాపూర్వకముగ నిపుణులు బోధించు తెఱగు నెఱుగుచు శివాదిదేవతలను పూజించుటయో, షోడశదానముల నిచ్చుటయో, నగ్నిహోత్రాదికర్మముల నాచరించుచు నితరకర్మల నొనరించువారికి త్రిగుణములలో నేగతి ప్రాప్తించును?

ఉ॥ "త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా। సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శ్రుణు" భగవంతు డిచ్చిన సమాధానము: ప్రపంచము మాయామయము. అనాది మాయాగుణముల స్వాభావికులై జీవులుందురు. వీనిని యనుసరించియే శ్రద్ధగలుగును. ఏ గుణము తక్కిన రెంటిని నధిగమించియుండునో, నా గుణశ్రద్ధయే యుండును. ప్రవృత్తి యా గుణము ననుకరించును. వృత్తిని యనుసరించి మనస్సుండును. కర్మాచరణ మనోబుద్ధులబట్టియే నుండును. మరణానంతరము జీవులు తామొనర్చిన కర్మఫలముల ననుసరించియే నూతనశరీరముల నెత్తుదురు. లెక్కలేనన్ని జన్మము లెత్తుచున్నను గుణములెన్నడు వదలవు. చేదువిత్తనము, తీపు విత్తనముల స్వాభావికము, వృక్షములు పృథివి యందుత్పన్నమగుచున్న నా తీపుచేదు లనుసరించుచునే యుండును. వాత పిత్తశ్లేష్మములభంగి, ఫస్టుక్లాస్, సెకెండ్ క్లాస్, థర్డుక్లాసులభంగి, యుత్తమ మధ్యమాధమాదులకు నీ త్రిగుణములే మూలములు. సత్త్వగుణ మభివృద్ధినొందినచో, నా శ్రద్ధవలన సుఖసాధనమగు జ్ఞానము లభించును. కాని రజోతమోగుణములు సత్త్వముక్రింద నణగియుండును. సత్త్వగుణకార్యము మోక్షమువంక తిరుగసాగ, పొందియున్న తక్కిన గుణములలో నేది వృద్ధియైన మోక్షాభిలాష నణగద్రొక్కి తమమార్గముల నడిపించును. అప్పుడా శ్రద్ధయే కర్మలకు చాకిరి చేయసాగును. వాత మధికమైన పిత్తశ్లేష్మముల తగ్గించి తనబలమే చూపును. తక్కినవి యంతే సమయమునుబట్టి చేయును. ఒకదేశమున 2, 3 పార్టీ లుండినపుడు యే పార్టీ తక్కినవాని నధిగమించిన దాని ప్రణాళికలే యమలులోనికి వచ్చుట మనము చూచుటలేదా? "సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత। శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః" అగరుబత్తి వెలిగించకమునుపు దానియందున్న వాసన నిప్పంటించిన బాగలుగును.

కాష్ఠమునందణగి కనిపించనియగ్ని, చెకుముకియం దణగియున్నయగ్ని మథించినమీద గలగటము, ముందు లేనిచో నెట్లు బొడకట్టును? ఎప్పుడో పడి భూమియం దణగియున్న యే విత్తనములైన వర్షము పడినంతనే మొలచుటకు, పూర్వములేనిది యెట్లు మొలవగలవు? తొలిజన్మమునందలి సంస్కారముగాకపోతే స్తన్యము నోటియందుంచ శిశువేలాగు బీల్చును? ఎవరు నేర్పిరి? మత్స్యములకు నీత నెవ్వరు నేర్పిరి? వానరము లెక్కడ నైన ప్రాక నేర్పినదెవరు? తీగలు ప్రాక, వృక్షములు భూమిని పెకలించుకొని రావటము, నొక తలిదండ్రికి బుట్టినబిడ్డలు తలిదండ్రులు నేర్పినలాగుగాని వర్ణాచారప్రకారముగాక తలకొకవిధమున ప్రవర్తించటమెందుకు? అలాగు నైతే లోకములోని యన్నిప్రాణులకు నాశయమొకటేగాని శ్రద్ధలు వేలువేలుగా నున్నవి. సూర్యచంద్రగగనము లొక్కొక్కటియేయైనను, స్వచ్ఛతాస్వచ్ఛతలబట్టి గనిపించును. కేటనీట లేక కేటయద్దమున స్వచ్ఛముగను, మలినమున మలినముగను, కేవలబురదలో కనిపించకనే యుండును. ఇందు కుపాధులే కారణము. త్రిగుణములబట్టియే శ్రద్ధగూడ ప్రకాశించును. తొల్లిటికారణమే నిప్పటి కార్యమగును. సాననెట్లుబట్టిన వజ్రము లారీతి మెఱయును. కుమ్మరి కుండల, నగసాలి భూషణముల, సాలె వస్త్రముల, చాకలి వస్త్రముల నెట్లు తీర్చిన నట్లే తీరగలవు. మునుపటి జన్మల వాసనలే నీజన్మమందలి శ్రద్ధ. ఏ స్కూలులోనైనా శ్రద్ధగా చదువువాడెచ్చటి కరిగినా, నదే శ్రద్ధ నుపక్రమింపగలడు. శ్రద్ధతప్పినా, భగవన్నియమము అసలు జగచ్చక్రమే నడవదు. భగవంతుడు శ్రద్ధాపరుడగుటచేతనే కర్మల లిప్తుడుగాకుండ నేదేశముల నేకాలముల నధర్మము రేకెత్తి ధర్మహానియైన వెంటనే నవతరింపటము ధర్మము నుద్ధరించటము ఆయన శ్రద్ధయే. సమస్త దేవతలు, కాలములు, ప్రాణులు తమతమ గుణానుకరణి వృద్ధిక్షయముల నొందుచున్నారు. శ్రద్ధయే నాయన స్వరూపము. ప్రపంచమున నేప్రాణికి నేసమయమున నే కొఱతగల్గినది తెలిసికొని యుండజేయుచు నిస్స్వార్థుడై, నిర్వ్యాజమతియై, తన యైశ్వర్యము సకల జీవులకే నొసగెను. తల్లి తనపాల ప్రజలకు, భూమి తనయందలి సస్యముల జీవులకు నొసగు విధము నొసంగి యంతర్యామియై నిరీక్షించుచుండును. దోషరహిత శ్రద్ధ జీవుల కెక్కడ గలుగదు. అదియు పరతత్వమేయైనను గుణముల జుట్టబడియుండును.

ప్ర: భగవంతుడు కనిపించటమే లేదే? తన యైశ్వర్య మితరుల కెట్లు ప్రయోగించును?

ఉ: ఒకప్పుడు పార్వతి శంకరునిజూచి, మనదికూడ కాపురమేకదా? వేళకు సరిగా భోజనమునకు రావటములేదు. ఒకదినము సరిగా వచ్చెదవు. నొకదినము ప్రొద్దుబోయివచ్చెదవు. ఒకదినము రానేరావు. ఎక్కడుందువో, ఏమిపనియో తెలియదు. నాకు సంశయమనెను. సదాశివు డంతట నవ్వి, కాత్యాయనీ! లోకములోగల సకల జీవుల కేవేళ కేది యందియ్యవలెనో, నది యందించివచ్చుటలో నాలస్యమగుచుండు నాకు తీరికయే యుండదు. ప్రాణుల గతులు విచారింపనిచో విచారించువారెవ్వరు? ఆ మాటకు భవాని మరీ సందేహించి, నేను నీమాట నమ్మజాల. నానావిధ, నానాదిశ, నానాలోకముల జీవులకీ వొక్కండ వెట్లు నందివ్వ గలవనెను. ఇంతలో నామెకు నొక యూహాతట్టి, శంకరునకు తెలియ కుండ కొన్ని గండుచీమల బట్టించి, యొక సీసాలోనుంచి, మూతవేసి, సీలువేసి, వారము దినములు దాటినవెనుక భర్తతో, నీమాట యనృత మగు నీరోజు నన్నది. అదెట్లనెను శంకరుడు. ప్రాణుల కష్టసుఖముల జూచి వచ్చుచున్నానంటివి. మన ఇంటియందు, వారము దినములనుండి సీసాలోనున్న గండుచీమలకు మేతవెట్టితివా? యనెను. ఆహా, నాహార మిచ్చినా ననెను. పార్వతి పరుగునబోయి సీసాదెచ్చి, సీలు నూడదీసి, చీమలు చచ్చియుండునని, సీసా తలక్రిందుల ద్రిప్పి తట్టి క్రిందికిరాల్ప, నాహారముతో సహా చీమలు క్రిందపడి పరుగిడసాగెను. పార్వతి నివ్వెర పడి, నిశ్చేష్టితయై తన నాథుని యంతర్యామిత్వమపుడు గ్రహించెను. పాదములంటి, సకలజీవవశంకరా! శంకరా! హృత్పంకజభాస్కరా! యని పొగడ శంకరు డదృశ్యుడయ్యెను. గర్భజీవులకు పుట్టిన శిశువులకు పాలు, జప, తప, వ్రత, యోగ, యజ్ఞ, స్మరణ, నిష్కామకర్మ, నిష్కామోపాసన, జ్ఞానత్యాగులకు, రాతియందలి కప్పకు నాహార మొసగున దెవడు? ఆ శ్రద్ధాస్వరూపుడగు నీశ్వరుడే. నేవేళకా నావేళకు వారివారి శ్రద్ధాకార్యములబట్టి నాయనయే ననుగ్రహించుచుండును. "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం" ఎట్లు పాసించిన నట్లనుగ్రహించును. సర్వజ్ఞుడు, సర్వశక్తిమాన్ప్రభువు, నియత

స్వరూపుడు. యంత్రములోని చక్రములు, గడియారములోని ముల్లుల త్రిప్పుకీ వంటి సాధగుటచేతనే భగవంతుడు డనిపించుకున్నాడు. ఘనము శ్రద్ధతప్పిన గతులే నుండవు.

ప్ర॥ దేవుడను శబ్దమున కర్థమేమి ?

ఉ॥ నీ వడుగుట లోకక్షేమము. దేవుడని యనుట అలవాటై పోయి నదే కాని ఆయన యేతీరువా డెక్కడుండుననునదే విమర్శించక నాస్తిక లాస్తికులై పెక్కుమతములు బయలుదేరినవి. అరయొక్క దేవుని కొలకే నెవ్వరెవ్వరి భాషలో నాయాపేర్లు బెట్టుకొనిరి. స్వామి వివేకానంద దేవునికొఱకై పరితపించి, తుదకు రామకృష్ణ గురుకరుణ కనుగొనెను. మహమ్మదు నబి కొండలకేగి ప్రలాపించి కనెను. జీసస్ యదేరీతి గనెను. అయినా 'ద్యు' అను ధాతువునుండి ప్రకాశించు - తనంతటతాను ప్రకాశింపువాడు. జడప్రపంచమును ప్రకాశింపజేయువాడు "దేవస్య ఆా దీవ్యతి దీవ్యతే వా స దేవః" సమస్త సుఖములనిచ్చువాడు; నందఱిచేత గామింపబడువాడు. "యద్జ్ఞేయం తజ్జడమ్" ఏదిజడమా నది తెలియ దగినది. లేక నేది తెలియదగినదో నది జడము. ప్రపంచము, దాని కారణ మగుమాయ జడమగుట తమంతతాను ప్రకాశింపలేదు. హృదయచక్రము గాని, ప్రతిక్షణమున శరీరమునందంత వ్యాపకమగు నాళములందలి రక్తము గాని, శ్వాసగాని తమ నియమమువదప్పిన తబ్బిబ్బులగును. దీనికంతటికిని ప్రకాశిలజేయువాడు దేవుడే. ఏ వస్తువునైన విన్నంతనె నా వస్తువును నోటచెప్పగలముగాని, యది యెట్టిదనేది తెలియదు. దేవుడంటిమిగాని, యనుభవమునకు రావలెనంటే వెన్ననుపాలనుండి బడసినరీతి ప్రయత్నింపవలె. స్వతస్సిద్ధమై వ్యాపకమగు చైతన్యమేది ? నదియే దేవుడు. శ్రద్ధ దేవుని స్వభావమే. చంద్రుడు భూమిచుట్టుట, భూమి తనచుట్టు, తాను తిరుగుచు సూర్యునిచుట్టుట, మృత్యువేసమయమున నేజీవుని తీసికొనుట, యేప్రాణి యెప్పుడుద్భవించి యెచ్చటనుండుట, గవర్నమెంటురూలు యేప్రకారముండునో తత్ప్రకారమే సర్వము శ్రద్ధతోనే జరుగును. ఋతువులాంటి క్రమము శ్రద్ధయే. వేయేల? జీవితమంతయు క్రమబద్ధమగుటయే తెన్ను. తొందరలుండవు; తొందరగలిగింపవు. సర్వత్రా క్షేమమే. శ్రద్ధలేని లౌకిక, మతౌశికములన్ని వ్యర్థములే. తనయందలి

జలచరములకై తమ గనక చంద్రుని రాక కెదురుచూచు సముద్రము, చంద్రకిరణములకై వేచిన చకోరములు, మేఘముల రాక కెదురునడచు నెమిళ్లు, పతిరాక నిరీక్షించు సతి, వర్షమున కెదురుచూచు సస్యముల భంగి శ్రద్ధ మానవుల కేకైక దైనందిన సాధనము. సాత్త్విక శ్రద్ధగలవారు స్వర్గసుఖముల నభిలషింతురు. జ్ఞానాభివృద్ధిగల గ్రంథముల చదువుదురు; విందురు. శాస్త్రనియమము తప్పరు. సత్కార్యముల శక్తికొలది జేయుదురు. దేవతావిగ్రహముల, దేశచరిత్రల, దేవతల ఫోటోల, మహాత్ముల ఫోటోల గృహముల నలంకరించి, నిత్యము పూజించుచు దర్శించుచుందురు. తమకంతటిశక్తి యెప్పుడు గలుగునా ? యని వేచుచుందురు. పరోపకారపారీణధురీణులై దుఃఖములనైతము శాంతమున సహించటము, లోకశ్రేయస్సే తమశ్రేయస్సని స్మితవదనులై, నిత్యసంతోషులై యుందురు. రాజసిక శ్రద్ధగలవారందరూ — యజ్ఞాదుల నొనరించిన ఫలము కోఱకు, దంభమునకు, దర్పముగ, కామక్రోధలోభముగలవారై యట్టి వారలనే సత్కరింతురు; వారినే పూజింతురు. నవలల, కొక్కోకాది గ్రంథముల పఠింతురు. ఇండ్లయందలి ఫోటోలు స్త్రీ పురుష ప్రేమాతిశయములగు మోహకారకములనియుంతురు. సిగ్గుయుండదు. తామసిక శ్రద్ధగలవారా — శరీరశుద్ధి, వాక్శుద్ధి, గృహశుద్ధి, పాత్రశుద్ధి యుండదు. వారు చదువుగ్రంథములే యుండవు. వారికి శాస్త్రమేలేదు. మనస్సు కఠినము, కార్యమేదియైన భయంకరము, ప్రేతభూతముల పూజింపటము, మద్యమాంసాదుల విశేషించి సేవించటము, స్మశానములయందు, నపవిత్ర స్థలముల, నపశబ్దముల, నవాచ్యముల నసభ్యతతో వర్తింతురు. పుణ్య పాపములనే విషయమే చెప్పినను తెలియరు. ఈ శ్రద్ధలు మనుష్యులకు, పూర్వజన్మకృతములగు ధర్మాధర్మముల సంస్కారము ననుసరించియే గలుగును. ధృతరాష్ట్ర, పాండురాజ, విదురాదుల జన్మములు, హిరణ్యాక్షహిరణ్యకశిపుల జన్మము, పాండుపుత్రుల, దుర్యోధనుల జన్మాదుల విమర్శింప తొలి శ్రద్ధాసంస్కారబలములని చెప్పక తప్పదు. "అశాస్త్ర విహితం ఘోరం తప్యంతే యే తపో జనాః" అర్జునునకు చెప్పుటములో రాజసిక, తామసిక శ్రద్ధలు నీచ లేవని తెలుపుటకును, వేదశాస్త్రముల చదువకపోయినను శ్రద్ధగలవారు శ్రద్ధగలవారల ననుసరించియైనా సద్గతి

నొందవచ్చునని తెలియుటకును రొకని జ్ఞాన, మొకనిద్రవ్య, మొకనివిద్య, రొకనికార్య, మొకనికి ఫలవాటగుట మనకు చూడమూ? యజ్ఞము, దానము, తపస్సు చేయుటయందులో నెవ్వరి నుద్దేశించినదిగా నెందుకొఱకై యని తెలియవలెను. వాని నాచరించుటవలన మనము కృతార్థులము గావలె. నడవియందలి శబరి భిల్లకులవంతురాలై నను సాత్త్వికశ్రద్ధగలది యగుటచే తన కర్మఫలము నవతారమూర్తియైన రాముదర్శనము, రామ ప్రాప్తి గలిగినది. తాను తత్ఫలమునొందుటయేగాక తానున్న ప్రదేశ మును రాముపదస్పర్శ గలిగించజేసి పవిత్రమొనరింపజేసినది. సాత్త్వికుల శ్రద్ధాకార్యముతే దైవకార్యములు, స్థలములు, పుణ్యక్షేత్రములు, దర్శనములు, దైవదర్శనములు, దైవప్రీతికరములు, దైవస్వరూపమే నగును. శ్రద్ధయందలి రహస్యము, భ్రమరకీటకన్యాయము వగిది. ఏది తలంచితే నయ్యది భయముతో, నమముతో, జ్ఞానముతో నదేయగును. శాస్త్రములపేరు నుచ్చరించుటకై తమ గొంతును నవరించుకొన తల పరో, శాస్త్రవిషయమే నిష్టములేదో, మహాత్ముల వ్యవహారాచారముల తిరస్కరించటము, పరిహసించటము, తప్పటులు చటచటము, తమ గొప్పను చెప్పికొనటము, తమ సంపదలను గూడి మదించి, ధర్మవిరుద్ధ కార్యముల నొనర్తురో, యితరులకు బాధగలిగించి, వారి రక్తముదీసి యజ్ఞపాత్రల నిండింతురో, నారక్తమును యజ్ఞకుండమున బోయుదురో, దేవతలనోట రక్తమాంసములనుంతురో, మృగముల క్రొవ్వునే దీపముల వెలిగింతురో, పాపమనక పసికందుల తమ మ్రొక్కుబడులకై బలి నిత్తురో, వారవారముల, మాసమాసముల నుపవాసములుండి తమ క్షుద్రదేవతలను వరములకొఱకై పట్టుదలతో సేవింతురో, నట్టివారు తమోగుణవంతులై నాత్మక్లేశము పరపీడ రొనర్తురు. వారుచేసినదివారికే మరొకజన్మమున ననుభవింపవలసివచ్చును. "కర్శయంతిశ్శరీరస్థం భూత గ్రామమచేతసః। మాం చైవాంతశ్శరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్" అట్టివారొనరించు ప్రతిరొక్కటి తమకుగాని, యితరులకుగాని గలిగించు దుఃఖభాజనములు; సర్వాత్మనగు నాకే హానికలిగింతురు. ఇట్టివారిని వాక్కుతోగూడ పలుకరాదు. వీరి సంపర్కము పనికిరాదు. ఈలాంటి పాపాత్ముల దూరముగానుంచి వారిలో గలియకుండుటయే క్షేమమని

భగవంతుడనెను. అటువంటి దూరమొనరించినట్లు నీ యాసురీవృత్తిని దూర మొనర్చుటయే శ్రేయము.

ప్ర॥ భగవంతుడు పక్షపాతిగాడా? వారు పాపాత్ములని వదలిన పవిత్రులగు టెట్లు?

ఉ॥ భగవంతుడు పక్షపాతికాడు. పరమదయాళువు. ఒకరికి చెప్పిన ధర్మము మఱియొకరు గ్రహించుటకు కొద్దికాలమునకైన గ్రహించి, తమ తప్పుల వానిఫలమగు దుఃఖము దెలిసికొని తప్పనుకరింతురనియే జెప్పుటము.

ప్ర॥ యజ్ఞము పవిత్రమొనరించునదియైన దేల నందరొనర్పరు?

ఉ॥ భగవంతునియాజ్ఞ మనోవాక్కాయముల నాచరించు ప్రతికర్మ యజ్ఞముగా భావింపమనియు, దానివలన దివ్యత్వము, ప్రాభవము, భగవత్ప్రాప్తికరము, కృతజ్ఞులము కాగలమనియు తెలియుచున్నది. ఒక మాట. మనము బుట్టకమునుపు నీ ప్రపంచమున్నదియా? లేదా? ఉన్నది. మనపుట్టుకకు కారకులు తలిదండ్రులు కారా? ఈశ్వరానుగ్రహముకూడ కాదా? పంచభూతములు మన కనుక్షణము సహాయకారులుగావా? మన యుపయోగార్థమగు నోషధులు, సూర్యచంద్రనక్షత్రాదులు, పశుపక్షివృక్షాదులు, నదీశైలాదులు మన కవసరములే కదా?

ప్ర॥ అవును. తామన్నట్లు మనకవసరమే. మనకన్న ముందేయున్నవి. ఇప్పు డర్థమైనది. మనమెప్పుడు వీనియన్నింటికి మధ్యబుట్టితిమో, మన యందరవలన నీ పవిత్రమైన వీనిని పవిత్రమొనర్ప మనకవసరమే. మన కర్తవ్యమే.

ఉ॥ మన కన్నతల్లి యనేక కాన్పులుగని దుర్బలురాలైన యామెను పోషించటము. మనకు బీజకారకుడు, పోషకుడగు తండ్రికిని స్వతంత్రించి వీరికి మోక్షమును గలిగించవలె. మనమేలాగు చేయవలసియున్నదో, మనకైయున్న శాస్త్రవిధుల ననుసరించి మన యుపయోగముకొఱకై ముందే నాశీర్వదించి ప్రతీక్షించుచున్న దైవఋషి ప్రభృతులనందఱ క్షేమముకొఱకు ఋణపడియున్న ఋణము తీర్పకపోయిన మనము బాకీదారులమే. సర్వజీవులక్షేమమే మనక్షేమము. పవిత్రతకొఱకు యజ్ఞము, ఋణవిమోచనకొఱకు దానతపస్సు లొనరింపవలె. లేదా శరీరేంద్రియముల శుద్ధికొఱకైనా చేయవలెను.

ప్ర॥ తాము శ్రద్ధ నింతగా జెప్పితిరి. దొంగ, జార, క్రూర, వంచకాదులకుండు శ్రద్ధ నేమందురు?

ఉ॥ అవియుగూడ శ్రద్ధలే; నెవరు కాదందురు. అయితే నాలాంటి శ్రద్ధ వానికిగల ఫలమేనిచ్చును. సొత్తు పరులది దొరకలేదను దుఃఖము, దొరికిన కనుగొందురేమొ యను యనుమానదుఃఖము, పరులచేత జిక్కిన ప్రాణవియోగదుఃఖము. మరణించిన నాలాంటి లోకమున నట్టిజన్మమెత్తి యనుభవించుటే గలుగును. ఇద్దరు మిత్రులు, లోకడు భక్తు, డొకడు దొంగ. భక్తుని కెక్కడ మర్యాదసుఖమున్నది. దొంగకెక్కడ కొట్లు, తిట్లు, దండన దుఃఖమున్నది.

ప్ర॥ శ్రద్ధలేనివా డేఫలము నొందక బోయినపుడు శ్రద్ధతో పనియేల?

ఉ॥ శ్రద్ధలేనివాడు తనశరీరమే తనకు బరువగుటయేగాక, భూమికిని, లోకమునకు బరువేయగును. పూజలేని విగ్రహము, నూరద్రిప్పని తేరు, వాడకములేని కత్తి, చదవని పుస్తకము, నలవాటులేని పద్యము, పారుదల లేని నీరు, నివాసములేని యిల్లు, పాడుపడ్డ గ్రామము లయోగ్యములు. "అదానదోషేణ భవేద్దరిద్రో దారిద్రదోషేణ కరోతి పాపం। పాపాద వశ్యం నరకం ప్రయాతి పునర్దరిద్రో పునరేవ పాపీ" దానమివ్వకుండ దరిద్రుడై పుట్టును. దాన పాపము లాచరించి నరకమున కేగి తిరిగి దరిద్రుడై పుట్టును. వాని జీవితమే నాశమగునపుడు పరలోకములేదు. ఇహలోకము లేదు. రెండుశూన్యమే. కళ్లెమోయు గుఱ్ఱము,నాకులులేని చెట్టు, మలములోని పురుగు, నేయాదరణ స్వేచ్ఛలేని జీవితమే నధమము. అయితే నిట్టి వారి దిద్దిదీర్చుటకే గీత బయలుదేరినది. ఒకడు శ్రద్ధావంతుడైన నందఱి శ్రద్ధాపరులుగా జేయగలడు. జనకుడు తనపట్టణము గాలుచున్నదన్నను, వసిష్ఠునివద్దనుండి కదలలేదు. అష్టావక్రు డుత్తరవు నిచ్చువఱకు గుఱ్ఱము రొయికాలు రికాపులో రెండవకాలునుంపక జనకుడుండెను. గోపికలు, రాధ, విప్రకాంతలు, గోపాలురు, నందయశోదాదులు శ్రద్ధచేతనే హరిపరాయణులై హరిని గనిరి. ఈ త్రివిధశ్రద్ధావంతుల నాహారముల భగవంతుడు వివరించెను. "ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః। యజ్ఞ స్తపస్తథా దానం తేషాం భేదమిమాం శృణు" ఆహారము రుచికొఱకు తినుటయు, నాకలికొఱకు తినుట రెండువిధములు. రుచిగోరువారు గుణముల

ననుసరించి కర్తలై, భోక్తలగుదురు. మూడువిధ తపోదానముల వరుసగా జెప్పు. "ఆయుస్సత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః" దైవయోగముచే భుజించువానికి సాత్త్వికగుణము వైపు మనస్సు తిరుగుటచే మధురవంతమై, రసవంతమై, చూడ మనోజ్ఞమై, తిన రుచియై, జవసత్త్వము గలిగించునదియై, నాయువును, బలమును, యారోగ్యమును గలిగించునదియై, సుఖదాయకమై, శాంతికారణమై, భయరహితమైనదై, మనోయింద్రియనిగ్రహ పరివర్తనదాయకమై, దైవప్రీతికరమై, యజ్ఞాన్నమైనది, పరోపకారమైనది, సాత్త్వికాహారము. "కట్వామ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః" కారమెక్కువయగుటచే దాహమతిశయిల్లునదియు, నోటిలోపల మంటగలిగించునదియు, మిక్కిలి పులుపు, నతియుప్పు, నతియుష్ణము, తినుటలో తీక్ష్ణము, నెండబెట్టినవియు, కాలబెట్టినవియు, చేదు మెక్కువగ నుండుపదార్థములు తినటము, వీనివల్ల ననారోగ్యము, నజీర్ణము గలిగించి వ్యాధులుగా తయారై దుఃఖము గలిగించునవి రాజసికాహారము. "యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్" చల్దియన్నము, పారవేసిన యెంగిలియిస్తల్లలోనియన్నము, పాచినది, రసహీనమైనది, కుళ్లినది, దుర్గంధయుతమైనది, నిషిద్ధాన్న ముచ్ఛిష్టాన్నము తమోగుణులకాహారము. రైలునకు బొగ్గు నీరవసరముపగిది, దేహమునకు జలాన్నములు నవసరములే. జ్ఞానయోగమున జెప్పిన పదునాల్గుయజ్ఞములను, కర్మయోగమందలి శ్లో॥ 13 "యజ్ఞశిష్టాశినస్సంతో" యజ్ఞాన్నము సకలపాపహరమన్నది. ఆహారమును యజ్ఞాన్నముగా మార్చితే నిత్యయజ్ఞమగును. సమస్తవస్తువులనేకరించి యొనరించు యజ్ఞఫలమే నన్నయజ్ఞఫలముగూడ. అల్పమగు క్రియగూడ శ్రద్ధాన్వితుడై యాచరించిన యజ్ఞమేయగును. బాహ్యయజ్ఞము నంతఃకరణశుద్ధికి జ్ఞానమునకు పరంపరాసంబంధమగును.

ప్ర॥ త్రివిధయజ్ఞములంటిరే నవి యేవి?

ఉ॥ "అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే। యష్టవ్యమేవేతి మనస్సమాధాయ స సాత్త్వికః" సమస్తాంగములతోగూడి వేదోక్తమగు బ్రహ్మయేవచ్చి యొనర్చుచున్నాడా యనుభంగి, సముద్రమున గలిసిన

నదులభాతి పతివ్రతవలె నేయిచ్ఛలేక ఫలరహితమై నైహికాముష్మిక విరక్తుడై నాచరించుయజ్ఞమే సాత్త్వికము. "అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్" ప్రభువుగాని, గొప్పమహాత్ములుగాని, మన యింటికి వచ్చినఫలము దప్పదనువారిరీతి మఱియు శ్రాద్ధక్రియలో నేవిధమైన న్యూనతరాదు. యజ్ఞఫలమువలన స్వర్గము, కీర్తి, ప్రతిష్ఠ పేరులుండినను ఫలాసక్తి యజ్ఞము రాజసమందురు. "విధిహీన మసృష్టాన్నం మంత్రహీనమదక్షిణం। శ్రద్ధావిరహితం యజ్ఞమ్" తామసయజ్ఞము పశుపక్ష్యాదుల వివాహమునకు కామవాసనతప్ప మరేవిధమగు పౌరోహిత్య మవసరములేనివిధము, పీనుగబూడ్చను, విధవనొనర్పను, కాష్ఠము కాల్పను, వాయువువీవను, కల్లుకాల్వపారను ముహూర్తము లవసరము లేదు. తామసపురుషునకు విధినిషేధము లవసరములేదు. మంత్రము లేదు, కాలములేదు, నియమములేదు, స్థలములేదు, దక్షిణలేదు, శ్రద్ధ లేదు, పదార్థములగాని, మలమూత్రములగాని జూచినంతనే యాగవచ్చి ్రవాలును. సంతాపమొదవు యజ్ఞము తామసమనబడును.

ప్ర॥ త్రివిధ తపస్సు లంటిరి. అవి చెప్పుడి? తపస్సుచేయుట కడవికి పోవుటలేదా?

ఉ॥ తపస్సు కాష్ఠమానమని, సుషుప్తమానమని రెండువిధములు. కొండలకేగు నందైనయుండు భగవంతుడు చెప్పిన సుషుప్తమానమను మూడువిధములు. "దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్। బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే" శారీరక, వాచిక, మానసిక తపస్సులలో నిది కాయికతపస్సు. విను. ఏ పేరనే దైవమనసరియే ననవరతము ప్రేమించి, యా మందిరములకరిగి యాదేవతల నర్చించటము, భక్తుల కలియుటము, దేవుని ప్రాంగణమునందు సంచరించుట, ప్రదక్షిణము లొనర్చుట, నష్టవిధముల పూజించటము, ద్విజులను సేవించటము, తలిదండ్రుల సేవ యొనర్పటము, పండితులను, గురువులను నాదరాతిశయముల ప్రేమించి సేవించటము, నంతరంగ బహిరంగశుచి మృదుత్వము, బ్రహ్మనుగుఱించి తెలియుటము, బ్రహ్మచర్యము, నహింస తన కాయముతోనే జీవులకు కీడొనర్పకుండుట, సదా పరోపకారత నుంపబడుటయే కాయికతపస్సు. "అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం

చ యత్" పరుసవేదియున్నది ఇనుమును చెడగొట్టక బంగారముగ నొనర్చురీతి వాక్కుద్వారా చుట్టుప్రక్కల నేజీవికి భయముగాని, హాని, మఱొకపు దుఃఖముగాని గలుగునదిగానుండక ప్రతిజీవికి హితకారి యగునది, మధురమైనది, సుఖమిచ్చునది. నది ప్రవహించుచున్నదికాని యెన్నియోజీవుల కుపకారిగాయున్నది. సీత పలుకులకు కొన్నినాళ్లకు రాక్షసాంగనలు కైవశమగుట, యంగులీమాలుడు బుద్ధభగవానుని శిష్యుడగుట, పచ్చికిరాతుడు వాల్మీకినారదుని వాక్యము విశ్వసించటము, గాంధీజీవాణి నలువైపుల ప్రాణుల నున్నతికి హేతువగుట యిది సత్య వాక్కు. నాత్మసందర్శన మంతటనొనర్చి వేదాంతరహస్యము వేదముల రీతి నంతటగనుట, తనవాక్కు వేదశాలగాను, బ్రహ్మవాక్కుగాను, సరస్వతీమయముగాను "శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి" శబ్దబ్రహ్మనెఱింగిన పరబ్రహ్మము నొందునన్నపగిది సత్యవాక్కు నందరా శ్రయింపదగినది. వేదములగాని, నుపనిషద్గీతలగాని పారాయణ మొనర్ప తగినది వాక్తపస్సు. "మనఃప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః। భావసంశుద్ధిరిత్యేత త్తపో మానసముచ్యతే" అలలులేని కొలను, గాలి లేనపుడు దీపము, స్వప్నజాగృతిలేని సుప్తివలె, సంకల్పవికల్పము లేనిదై, యాత్మాకారతనొందినదై, మేఘము లడ్డులేనపుడు నిర్మలముగ ప్రకాశించు సూర్యునిపగిది నిశ్చలమైన మనస్సు పరిపూర్ణచంద్రునివలె నుండును; సౌందర్యవంతమై యుండును. విషయజంజాటములు లేక నాత్మమయమై యుండును. ఒకరు చెప్పునపు, డొకరు నోరుమెదల్పక మౌనముగ నుందురు. ఆత్మదర్శనమైనతరి మనస్సు మౌనియగును. అరచేతిలో వెంద్రుకలు, నరికాలున కన్నులు మొలవనిరీతి మనస్సు శుద్ధమైయుండును. ఇదియే మానసికతపస్సు. "శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః" త్రివిధములగు తపస్సులు వాని ఫలప్రాప్తినిగుఱించిన సమస్త యాశలను పరిత్యజించి చేయబడినప్పుడును, యీ తపస్సులు శుద్ధసాత్త్విక వృత్తితోను, నాస్తికత్వములేని బుద్ధితోను యొనర్పబడినట్టి తపస్సును బుద్ధిమంతులు సాత్త్వికతపస్సందురు. "సత్కారమానపూజార్థం తపో దంభేన చైవ యత్। క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్"

ప్ర॥ వివరించుడి యర్జునున కానాటి యదృష్టము, యాకీనాటి యదృష్టము.

ఉ॥ నాతపస్సే గొప్పది, నేనే గొప్పవాని, నే నొనర్చుచోటికే నందరు రావలె, త్రిభువనములకీర్తి ఘటిల్లవలె, ప్రతిష్ఠ నాకంటె మించి యితరులకు రాకూడదు, నన్నే యెక్కుడ సన్మానింపవలె, లోకులందఱు తన పాదములకే మడుగులొత్తవలెననియు, తనవద్దకే రావలెనని, రోగగ్రస్తుడారోగ్యముగా నుండురీతి, కనపడవేషము వేసినరీతి, బడాయితో, నాడంబరముతో తపస్సనెడి పూతను వాక్కుపై పూసికొని, గొప్పతనమును యినుమడింపజేసుకొనుటకై జేయబడు తపస్సు రాజసమనబడును. వీరి తపస్సులో స్థిరత్వముండదు. ఏ కారణమువల్లనైనా విఘ్నముగా నిలిచి వేతురు. వంధ్యవలె, వర్షములేని మేఘమువలె నాచరణయోగ్యము కానిదై పోవును. "మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః"

ప్ర॥ ఫలాపేక్షగలిగిన ననుభవింప జన్మమెత్తవలెనా ?

ఉ॥ అవును. జన్మమరణము లొందవలసినదే. శరీరమును సైతము నాశనమొనర్చునో, శరీరము తపింపబడునో, రాళ్లు, ముళ్లు, కల్లలవలన వళ్లు చీల్చబడునో, శ్వాసోచ్ఛ్వాసలను బంధించి శరీరముబ్బించునో, తల క్రిందులుగ వ్రేలుచు ధూమపానమొనర్చబడునో, స్తంభించు శీతలజలమున కంఠమువఱకు నిలబడునో, తనశరీరమును కత్తితో మాంసమును చీల్పించునో, ధగధగ మండు వేసవిలో పొరలటమో, నొంటికాలిపై నిలవటమో, నీలాటి తపస్సు తమోగుణమయమై, పరపీడావహమై యుండును.

ప్ర॥ రావణ కుంభకర్ణ హిరణ్యాక్ష హిరణ్యకశిపుల తపస్సు యిట్టిదే కదా ?

ఉ॥ నిజము. వారితపస్సు లీరీతియుండును. పరభయంకరము, లోకనాశనకరము, నగ్నితో తలగోకికొన్నరీతి నుభయులకు దుఃఖహేతువేను. ఇట్లు త్రివిధతపస్సులు జెప్పి, త్రివిధదానముల భగవంతుడు జెప్పుచున్నాడు. "దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే। దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్" "న్యాయాగతేన ద్రవ్యేణ కర్తవ్యం పారలౌకికమ్" న్యాయముగా నార్జించినవానిని యితరుల

కన్యాదరముతో నివ్వవలెను. దానములు షోడశములు గలవు. "తటాకం ధవనిక్షేపం బ్రహ్మస్థాప్యం సురాలయం: ఆరామస్త్రతిసత్రాణి సప్త సంతానసంజ్ఞికాః" ఇవియే సప్తసంతానములు. దానమిచ్చుట, సంగీతము, కవిత్వము, శూరత్వము బుట్టుకతో రావలెనేగాని నొకరుజెప్పిన, ప్రోత్సహించినను రావు. అయినను పుణ్యక్షేత్రముల, త్రిసంధ్యల, యజ్ఞతపముల నమావాస్యపౌర్ణమి శుభదినముల దానముచేయుట మంచిదియంద్రు. సపరుదానము నంతఃకరణశుద్ధిగల బ్రహ్మచారులకుగాని, తపోవంతులకుగాని, సన్న్యాసులకుగాని, యోగులకుగాని, వేదపారాయణాదులొనరించు విధుర, గృహస్థ, నైష్ఠిక బ్రహ్మచారులకుగాని, స్త్రీలకుగాని, పురుషులకుగాని దానమియ్య నర్హులు. ఇది యుత్తమము. విద్యకు, రోగమునకు, నిల్లు, గుడ్డ, తిండిలేక బలహీనులగువారికి చేయుట మధ్యమము. అతిథిఅభ్యాగతులకు, పరదేశస్థులకు, పరుల పాలొనర్చుకొన్నవారికి, పరుల గుంజుకొన్న దిక్కులేనివారికి చేయుట నధమము. "పరోపకారార్థం" పరోపకారమే తన కర్తవ్యమనువారు కరచరణాద్యవయవములుగలిగి కష్టించి పనిచేయుచు, నితరులకు నుపకారమొనర్పగలవారెవరైన స్త్రీలుగాని, పురుషులుగాని మాటలు జెప్పెడివారు, మంత్రగాండ్రు, యుక్తిచే ధనము లాగువారికి దానము చేయరాదు. దానమడగటము పాపమే, నివ్వటము పాపమే. తనార్జించిన విద్యను, లేక జ్ఞానము నతేవిధవిద్యనైన నుచితముగ లోకసేవకై నుపయోగించువారికి దానమియ్యవలెను. మన మొసగు దానమువలన ఫలముగావలెనన్న, నివ్వగల పుణ్యమూర్తులకిచ్చిన నదియే పర్వదినము; పుణ్యక్షేత్రము; పావనకరము. దానమువలన సోమరులై, పాపచింతల తిరస్కారపురస్కారబుద్ధులొదవి సంకల్పవికల్పముల బహిరంగముగగాని, నంతరంగముగగాని లోకోపద్రవ మొనరించువారికి దానమివ్వరాదు. దానమునకు బదులు వల్లువంచి పనిచేయనేర్పించి స్వతంత్రులజేయుట గొప్పదానమగును. క్రమశిక్షణలతోటి ప్రణాళికపథమున లోకమును నడిపింప నంతఃకరణశుద్ధిగలిగి సర్వభూతాంతర్యామియగు భగవంతు నన్నిభూతములలో దర్శించుచు, త్రికరణములసేవించు పావనగంగ యకలంకాగ్నివంటి వారలకిచ్చు దానముత్తమోత్తమము. ఒకరి ప్రేరణవలనగాని, మొక్కడజూచిన

ధనము పూలుగుచుండేగాని, గవర్నమెంటుభయము, చోరులభయము, దుష్టులభయము, నిర్భయముగ నిర్వహింపు నిరాశతో నిచ్చుదానము ఫలకారి కాదు. భయముచేత, పరిహాసముతో నిచ్చునది యంతగ ఫలకారి కాదు. అర్థికివగింపు దాన మివ్వకున్న దానఫలముబోగా ఋణపడవలసివచ్చును. పొగడ్తలకు, నాడంబరములకు, ప్రతిష్ఠలకిచ్చినది ఇచ్చినకాలములలోని ఫలమేగాని, వెనుక ఫలకారికాదు. నిత్యదాతకు, నిత్యాధికారికి కాలములులేవు. ఆకలిగొన్నప్పుడన్నము, దప్పిగొన్నప్పుడు నీళ్లు దానమునకు ప్రధానద్వారములు. తనకు ప్రత్యుపకారమునుగోరక నడుగకమునుపే నిచ్చుదానము మహత్తరమైనది. బలి, శిబి, మాంధాత, కర్ణ, దధీచి, రంతిదేవులవంటి యుత్తములు. భగవద్విభూతులుగలచోట, భగవత్సంబంధకార్యకాలముల నొసగుదానము సాత్త్వికము. దానము పుచ్చుకొని దాను, తనవారు పవిత్రులగుట సాత్త్వికము. ఇష్టావిహారముల ఖర్చుసర్చువారికి, సోమరులకు, నలంకారవస్తువులకు, వంచకులకు, ధూర్తులకు, దుర్జనులకు దానమొసగరాదు. దానము గొన్నవానికి భగవంతునకు దప్ప, దానిచ్చినది తనకే తెలియనిదానము సాత్త్వికమే. "యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః" ఫలములలోన నుంచికొని వృక్షముల పెంచురీతి, పాలను వెన్నను కోన లోననుంచి పశువుల బోషించుమాడ్కి, ధాన్యమునింపుకొన పొలమువిత్తురీతి, కానుకలుగొన విందు కావ్యానించు పగిది, లంచముగొన ప్లీడరువృత్తికై చదివినపగిది, వేతనముగాని, లంచము గొనిగాని చికిత్సనొనరించువానివిధము, కొంచెముతో నెక్కువలాభము పేక్షించురీతి, దానమునలన భవిష్యత్తున తనకుపకరించుననురీతి, స్వల్పధనముతో నరకముతొలగి, స్వర్గముగలుగ పితృలుసంతసింప దానము గొన్నవాడు చనినవెనుక నీకొంతయివ్వక పోయినా బాగుండునేమోయని లోన చింతించుచు నిచ్చినదానము రాజసము. "అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే। అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్" దేశకాలముల లెక్కచేయక దొంగిలినధనమో, మోసపుధనమో, పాపిధనమో, మతేవిధమైనధనముతో, వేశ్యలకు, భోగముమేళములకు, గారడీలకు, జూదగాండ్రకు, సినటులకు, పేరుకొఱకు, దుష్టవిషయములకు, తన్నుపొగడువారికి, నాట్యగాండ్రకు, నీచులకొసగు దానము తామస

మంత్రము. ఇది యశాస్త్రీయము, నరకకారకమైనది. మహాత్ములు, సజ్జనులకు దానమివ్వబడుటలేదు. ఈ త్రివిధత్యాగము ఏల నుంచబడినవి? త్యాగము గలిగినగాని మోక్షము లేదు. ఈషణత్రయత్యాగముచేత సంపూర్ణాధికారికాగలడు. మానవుడు సాధించగలది యాశయగమ్యమగు సంపూర్ణాఖండవిరామము. దీనికి పరిత్యాగమే నీతిసూత్రమున కాధారము త్యాగశీలముపై నాధారపడని నీతిశాస్త్రమెన్నడుగాని బోధింపబడియుండలేదు. ప్రతియొక్క మతము త్యాగమును సాధనముగా నంగీకరించి యింద్రియాతీతమగు మతమూలసూత్రములను గ్రహించవచ్చుననుచున్నది. విషయేచ్ఛల త్యజించనిది యింద్రియాతీతవస్తువును గ్రహింపలేము. 'నా దేశమున నొకకుక్కయైనను బస్సుపడియున్నంతవరకు దానికాహారమిడి రక్షించుటయే నా పరమధర్మము. ఇదియే నామతము, తద్భిన్నమంతయు నధర్మము, కృత్రిమ ధర్మ' మనెను స్వామి వివేకానంద. చూచితివా! త్యాగధర్మము, పరోపకారపారీణత్వము, మార్గదర్శకత్వము. ఉడుత జన్మమూరకపోయినదా! గడవుంటే నావ కేబాధాలేదు. దేవుడి దగ్గర నీకూపంలో దెచ్చుకొన్న యుప్పు, చిన్నవేషాలువద్దు, పెద్దమోసాలు వద్దు, ప్రతిదినము దేశములో నెంతపెరిగినావో కొల్చుకోమనునీతు లరసితే త్యాగము పురుషార్థప్రదము.

ప్ర॥ వీని యన్నిటికంటె గొప్ప దానమేమి?

ఉ॥ ఒక్కొక్క దాన ముత్తరోత్తరశ్రేష్ఠములే. క్రింది తరగతినుండి పై తరగతికి వెళ్లు విద్యార్థి సాధనములంటివి. అయిన నన్నిటికంటె జ్ఞానదానము శ్రేష్ఠము. జ్ఞానియైతేనే సమస్త దానములు పరబ్రహ్మముగా భావించి యకర్మగా చేయగలడు. జ్ఞానము వచ్చుటకొఱకే కాని, తిండి, బట్ట, నివాసములేక జ్ఞానదాన మేమిచేయగలదు? భుక్తి ముక్తిగదా? యనెదవా, జ్ఞానముగలిగిన సహనశక్తి, సమాదరణ, సంఘక్షేమము చూడగల్గుతాడు. తక్కిన దానములు యొకమార్గము బట్టించగలవు. నియమబద్ధముగా దిద్దితీర్చగలది జ్ఞానము. జ్ఞానభాగ్యము గల్గించిన వ్యావహారికజీవన దరిద్రులేయుండరు. అందలు పారమార్థికజీవన జ్ఞానభాగ్యవంతులేమైన కొఱతలేలేవు. న్యూనాధికతలే నుండవు. తమోరజో గుణములనుండి మెల్లగా సత్త్వగుణవంతుడై యజ్ఞాదికర్మల నొనర్చిన

జ్ఞానముగల్గును, శాంతము ప్రాప్తించుననన, పార్థుడు సంతసిల్లి కరములు మోడ్చి, సత్త్వగుణము వృద్ధినొందిన చాలునా? యనెను. దానికి భగవంతుడు, నానామమునకు రాజముద్రవలె, నిర్మలము చల్లనైన సుగంధితమైన జలము సుఖకరమేగాని, నదియే దైవతీర్థముతో సంబంధియుండవలె. దానమిచ్చునాణెమును నీటదడిపి యిచ్చురీతి నీ సాత్త్విక దానకర్మనొనర్చు వారికే నేవిధమైన నడ్డంకులుండవు. కాని జడములగు నాకర్మల ప్రతిష్ఠకు, వాటిఫలములకు నేది యాద్యంతములనుంచిన ఫలకారులగునో వానిని జెప్పుచున్నాడు. గూడ్సుపెట్టెలకు నింజనులేనిచో నెట్టి లోడును నవియే ప్రాప్తిస్థలముల జేర్పలేవు. అందువలన కర్మలకు ఫలకారముల దెల్పెను. విను. "ఓమ్‌తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధస్స్మృతః। బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా" సమస్త విశ్వమున కధిష్ఠానమగు బ్రహ్మకు పేరొక్కటే. అదియు సాపేక్షమే. బ్రహ్మము నిరపేక్షము. అయినను మూడు పేరులుగలవు. బ్రహ్మనుగురించిన కాల్పనికభావమును గలుగజేయుటకు నామము నుంచబడెను. సూర్యునకు ప్రాతఃమధ్యాహ్న సాయంసమయములనుబట్టి పేర్లు పెట్టలేదా? ఉద్యోగమునకు తగిన పేరులుంతురు. సంసారమున తగులువడ్డ జీవుడు తన దుఃఖములనుగురించి పలుకసాగినప్పుడు పిలిచిన పరమాత్మతత్త్వము మారుపలికి నతనికి జవాబిచ్చునో, నదియే నీ సాంకేతికము. అనగా గుర్తించుటకుగాను యేర్పడ్డ పేరు. వేదములు బ్రహ్మతత్త్వమును వాక్యలమునకు తెచ్చుటకు సహాయపడెడి నొకమంత్రము నన్వేషించినవి. అద్వైతస్వరూపము దీనిసాహాయ్యమున వ్యక్తముగ ననుభవమునకు దెచ్చుకోవచ్చు. నామంత్రము నుచ్చరించిన వెనుకనున్నప్పటికి నాయన ముందుకువచ్చును. ఏ నామమహిమచే బ్రహ్మ సృష్టినొనర్చెనో, నదియే నీ మంత్రము. మంత్రములన్నిటికి ప్రధానమైనదీ ప్రణవము. రెండవవర్ణము 'తత్' మూడవది 'సత్' ఓం తత్సత్తననదే బ్రహ్మయొక్క త్రివిధనామము. ఉపనిషత్సారరూపియగు నీ మధురసుగంధము ననుభవించదగినది. ఈ నామముతో నేకరూపమునొంది సాత్త్విక కర్మాచరణ మొనర్చినపుడు మానవుడు కైవల్యమును తనహక్కుగా జేసికోగలడు. సత్కర్మల నాచరింపవచ్చు. బ్రహ్మయొక్క నామ ముచ్చరింపవచ్చు. అయిన వినియోగమునుగురించిన

జ్ఞానము లేకపోయిన (అనగా శాస్త్రోక్తవిధులు), మన యింటికి మాటి మాటికి వచ్చు సాధుసత్పురుషుల తగురీతి సత్కరింపనిచో, మనకున్న పుణ్యముకూడ నాశమగువిధము, సాత్త్వికకృత్యము లాచరించుచున్నను వ్యర్థములగును. దప్పికి నీరు దగ్గరనుండుచు, అయితే త్రాగలేనపుడు దప్పి తీరదు మార్గము, కన్నులున్నచో చేరుస్థలము తెలియును గాని నడవ లేనిచో నేమిప్రయోజనము? శాస్త్రవిధిననుసరించి కర్మ జరుగుచు, దాని మంత్రము స్మరించుచున్నప్పటికి, దాని వినియోగవిధాయకము తెలియకున్నచో, నిదియంతయు నిష్ఫలమే. కావున నీ మూడువర్ణముల కూడిక వలన నేర్పడిన పరబ్రహ్మనామముయొక్క వినియోగవిధానము చెప్పెను భగవంతుడు.

ప్ర వేదములందు 'ఓమ్ తత్సత్'ను నీ మూడిటిని ప్రసిద్ధ బ్రహ్మ వాచకములుగా చెప్పటము, తాము వివరముగా తెల్పుడి?

ఉ॥ 'ఓమ్తత్సత్'ను మూడిటిలో నేయొకటి యుచ్చరించిన పరమాత్మకే యర్థమగును. లేక మూడిటిచేర్చి యుచ్చరించిన పరబ్రహ్మకే యర్థము. కేశవ, నారాయణ, శివ, శంకరనామములవలె, 'ఓం' సగుణనిర్గుణములను, 'తత్' అది యను దూరార్థము, నిర్గుణమును, యింద్రియాతీతము. అయితే ననుభవైకవేద్యముతో తెలియదగినది, 'సత్' సాపేక్షనీయమైనది సగుణమును తెల్పును. ఒక్కొక్కటి ముందు క్లుప్తముగ తెల్పెద. వృక్షమునకు బీజమురీతి, సకలశబ్దములు వేదములు లోకములున్న ప్రణవమున జన్మించిన వనెదరు. "అష్టాంగం చ చతుష్పాదం త్రిస్థానం పంచదైవతమ్" ఎనిమిదంగములు, నాలుగుపాదములు, మూడుస్థానములు, పంచ దైవతములు గలదియంత్రము. 56 అంత్రశబ్దములు కంఠ్యముల, తాలవ్యముల, మూర్ధన్యముల, దంత్యముల, నోష్ఠ్యముల, ననునాసికముల, కంఠతాలవ్యముల, కంఠోష్ఠ్యముల నెనిమిది స్థానముల బుట్టినవి. ప్రణవ మీస్థానముల నెందు బుట్టుటలేదు. "తస్య వాచకః ప్రణవః" పరమేశ్వరునికి వాచకమను పతంజలి సూత్రము. 'ఓమితి బ్రహ్మ' 'ఓమితీదం సర్వం' యని ప్రమాణము. ప్రణవమే బ్రహ్మము, నదియే సర్వమనిరి. ఇది యేభాషకు సంబంధించినదికాదు, స్వాభావికశబ్దము. సంస్కృతశబ్దముగాదు, ప్రకృతిమంత్రము, సంస్కృత

శబ్దమనే భ్రమచే కొందఱుచ్చరించుట కిచ్ఛగించుటలేదు. వాస్తవముగ సంస్కృతమున నోమ్మనుశబ్దమునకు రూపమేలేదు. వ్యాకరణప్రక్రియ లందుగూడ దీని జేర్చబడలేదు. నిజముగా సంస్కృతశబ్దముగాదు; ఏభాషా శబ్దము గాదు. కేవలం ప్రకృతియొక్క విశుద్ధమైన శబ్దమని స్వామి రామతీర్థ. బిడ్డలు పుట్టునపుడే ఓ, ఊ, ఓం, మాం యని, అ, ఉ, మ్ లయొక్క కలియకలేక యొక్కొక్కటి పలుక 'నోం' యగును. ప్రపంచ ములో నేభాషగల నే దేశమైన, దే దేశస్థులైన తాము పుట్టునపుడు 'ఓ' యని యుచ్చరించుచు పుట్టును. రోగికూడ బాధనుండి విశ్రాంతికిగాను ఊ, ఓ యనుచున్నాడు. ఈ ధ్వనియే 'ఓం' యగుచున్నది. సంబోధనలో నీ 'ఓం' యున్నది. ఆశ్చర్యార్థమున, నిశ్చయార్థమున నీ 'ఓం' యున్నది. ప్రపంచములో నెందేజూచిన, నే జాతికి నే ధర్మమునకుజెందిన బాలబాలిక లైన సంతోషమున నెగురుచు నాడునపుడు, ఓ, ఓ యని ధ్వనిచేయుచు తమ సంతోషప్రసన్నతలను తెలియజేసెదరు. రాగము నాలాపించునపుడు, శ్రామిక మొనర్చునపుడే 'ఓం'కారమును నుచ్చరించెదరు. ఈ 'ఓం' ఆత్మయొక్క నిరహంకార, నిర్లిప్త, నిర్ద్వంద్వ, యానందావస్థల తెలుపు సూచకశబ్దము. అహంకార మమకారావస్థలనుండి యాత్మ శరీరములో బంధింపబడక నానందము నొందుటకు నీ యోంకారమే చిహ్నమగు చున్నది. ఇది వాక్కునకతీతము. శ్వాసప్రశ్వాసక్రియల ధ్వని యెట్లున్న దని చూచితే, లోనికి బోవునపుడు 'సో' వెలికివచ్చునపుడు 'హం' యను చున్నది. కలిపితే 'సోఽహం' యగును. సంస్కృతమున గాంభీర్యార్థ గర్భితశబ్దము.

ప్ర॥ ఆ యర్థమును వివరించుడి?

ఉ॥ చూచుటకు 'సోఽహం' రెండక్షరములే. 'స్' యను హల్లుకు 'ఓ' యాకారమునకు వెనుకనున్న బిందువునుకలిపిన 'ఓం'; యగును. 'స'కారము మాయతోగూడిన నీశ్వరునివాచ్యము. 'అహం' యవిద్యతో గూడిన జీవునివాచ్యము. ఇవి రెంటిని బాధించిన నోంకారవాచ్య బ్రహ్మ మొకక్కటియేనని యర్థము. మఱొకర్థము: ఆ పరబ్రహ్మము నేనని యర్థము. 'సోఽహం' మన ప్రాణవాయువుయొక్క సూక్ష్మధ్వని. దీనిలో రెండుహల్లులు, నొకయచ్చుగలదు. రెండుహల్లుల నాశ్రయించియున్నది.

స, హా యిది ప్రాణమునకు ప్రాణము, "ఆత్మతః ప్రాణః" పరమాత్మకు వాచకము ప్రతీకముగూడ. ఆ యా దేవతల నుపాసించేవారికి నాయా దేవతల పేరులుండును. అవియే మంత్రములు. 'శివ' శివునికి రూప మున్నదా? లేదు. శివ రెండక్షరాలుగల మంత్రము పేరు. శివుడు వేఱు. శివుని రూపాన్ని ప్రతీకమని, మంత్రమును వాచకమనెదరు. ఒకొ్కకచోట దేవతలు దేవుళ్లరూపములుగా ప్రతిష్ఠించితే నవి ప్రతీకములగును, మంత్రము, నా దేవునిపేరు వాచకమగును. ప్రతియొకచోట ప్రతీకము వాచకము భిన్నభిన్నముగా నుండును. ధ్యానము చేయును, జపమే జేయును, ప్రతీకము ధ్యానానికి, వాచకము, జపముగా పనిచేయును. ఓంకారమాలాకాదు. ధ్యానము జేయవచ్చు, జపము చేయవచ్చును. ప్రతీక, వాచకములు రెండు నొకటే. అంత్యకాలములో దీని నుచ్చరించు చుండవలెనని భగవంతుడు.

ప్ర॥ ఉచ్చరించుటకుగూడ నానావిధమానవులకు సులభసాధ్యము. వైదికమంత్రాలలో దీనికి మించినదిలేదు, యొకేయక్షరము. అవలజెప్పుడి?

ఉ॥ ఒక్కక్షరమనుటలో సులభమేకాదు. నాశములేని యొక పర బ్రహ్మమేనని సూచన. అందువలన పరబ్రహ్మకు వాచకము, పరబ్రహ్మ ప్రాప్తికి పరమసాధనము. సాధనమేగాదు, సాధ్యముకు నదైనది. వాచ్య వాచకముల కభేదము. పేరునకు, పేరుగలవానికి; వాచకమగు నోంకారమే సాక్షాత్తు వాచ్యమైన బ్రహ్మము. క్రమముక్తి దీననే గల్గును.

ప్ర॥ ఓంకారమును వాక్కుతో నుచ్చరింపవలెనా? మనస్సుతోనా?

ఉ॥ అజామిలుడు నారాయణాయన్నది వాక్కుతోనేగా? ఇతరులకు వినబడులాగున, పెదవులతో తనకే వినబడులాగున మానసికమున ధ్యానించుట, జ్ఞాపకముతో నాల్గురీతుల నుచ్చరించవచ్చును. సాధకుడు మొదట వాక్కుతోను, యనుభవమున, మరణమున, మనస్సుతో నుచ్చ రించవలె. ఓంకారమునకు నర్థానుస్వారమున్నది. అది రోంకారముతో తెలుపబడే పరమాత్మను స్మరించవలెను. "తజ్జపస్తదర్థభావనం" ఓంకార మును జపించుచు, నర్థాన్ని భావనచేయవలెననును. మంత్రమును జపిం చుచు, మంత్రార్థమగు పరమాత్మను భావించుట యెట్లనగూడదు. ఇష్ట

మైన వస్తువును మానసమునసుంచుకొని, మాటిమాటికి జపమురీతి, వ్యావహారిక మొనర్పటము లేదా?

ప్ర॥ ఓంకారాన్ని యుచ్చరించుచు, పరమాత్మను భావించుచు, దేహము వదలటము పరమగతి నొందెదరు వాస్తవమే. గృహస్థులు, స్త్రీలు, శూద్రులు, వైశ్యులిత్యాదులు నామాదిరి యోంకారము నుచ్చరింపవచ్చునా?

ఉ॥ భగవంతుడు చెప్పినది గీత. అష్టమాధ్యాయమున, సంక్రాంతికాలమున జీవు లేభావసగలిగియుంటే నాస్థితి బొందుదురనెను. భ్రమరకీటక న్యాయమున, ఫోటోగ్రాఫురీతి, నీట యద్దమున ప్రతిబింబించురీతి, నామ్యాది తలంచిన నమ్యాదియే యగును. భగవంతునే స్మరించిన భగవంతునే పొందగలరు. ప్రయాణకాలమున నిన్ను జెందు పెట్లన, యోంకారము నుచ్చరించుచు, పరమాత్మయగు తన్ను భావించుచు, శరీరమువదలి మోక్షము నొందుదురనియు, యుచ్ఛబ్దప్రయోగముతో నెవ్వడైన యని యర్థము. స్త్రీలుగాని, మఱెవ్వరైనగాని, లేక స్త్రీదేహ, పురుషదేహములకు, వర్ణాశ్రమాదులకుగాదు చెప్పినది. సర్వశరీరములనుండు జీవులకు చెప్పినది.

ప్ర॥ తచ్ఛబ్దమునొక్క యర్థము చెప్పుడి?

ఉ॥ "తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞ దాన తపః క్రియాః। ప్రవర్తంతే విధానోక్తా స్సతతం బ్రహ్మవాదినామ్" కర్మయొక్క యాది మధ్యాంతముల మూడుస్థానములందు మూడక్షరముల నుపయోగించవలెను. బ్రహ్మవేత్తలు బ్రహ్మస్వరూపము నీ యేర్పాటుతోనే బొందిరి. యజ్ఞ, దాన, తపముల నోంకారము నుచ్చరించి యొనరింతురు. నావల వలన నేరుదాటురీతి నీ త్రివిధకర్మల నోంకారము నుచ్చరించుచు మోక్షము నొందవలెను. కర్మలకు ప్రాణము లేక శక్తి ఓం తత్సత్తనునవి. వీనిలో నేయొక్కటి యుంచిన జీవకళ లుట్టిపడును. లేదా ప్రాణవియోగ శవము వలె కర్మ ప్రయోజనహీనమగును. ఓంకారసహాయముచే హితకరములగుచున్నవి. ఈ కర్మలు ఫలమునకు కొంచెము సమీపమునకు జేరినప్పుడు 'తత్' శబ్దప్రయోగము జరుగును. "తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞ తపః క్రియాః" 'తత్' అన్నిటికి నతీతమగు నిర్గుణమే తచ్ఛబ్దార్థము.

మనస్సున స్మరించి వాక్కున స్తుతింతురు. తత్ = అది, ఆ యని యర్థము. మఱియు నొకవిశేషము సుందరముగా నిరూపించు విశేషణవాచకముగూడ నగును. 'తత్' బ్రహ్మవాచకము విశేషణము. బ్రహ్మశబ్దముతో చెప్పబడేవి కొన్ని యుండుటచే నవి కానిది బ్రహ్మమని తెలుపుటకు తత్ శబ్దము యొక్క పరిభాష.

ప్ర॥ బ్రహ్మశబ్దము మఱి వేనికి పర్యాయమగుచు ?

ఉ॥ వేదము, ప్రణవము, మాయ, చతుర్ముఖుడు, యజ్ఞము యివి సోపాధికములు. సవిశేషము, నిరుపాధికము, నిర్వికారమగు బ్రహ్మమును తెలుపుట తచ్ఛబ్దము. ఉపనిషత్తులు, వేదశాస్త్రములు తత్పదమును బ్రహ్మమనినవి. సమిష్టి స్థూల సూక్ష్మ కారణ శరీరములనే విరాట్, హిరణ్యగర్భ, యవ్యాకృతులు, వాని యభిమానజీవులగు సూత్రాత్మ వైశ్వానర యంతర్యాములు, సృష్టి, స్థితి, లయములు, మాయా యాశ్వరులను వాచ్యమువదలితే నుండు లక్ష్యమగు బ్రహ్మమే తచ్ఛబ్దార్థము. తత్ ప్రతీకము, వాచకము ప్రణవమువలెనే యగును. అట్టి బ్రహ్మకు నోంకారముచే నారంభింపబడిన సమస్తకర్మలు బ్రహ్మార్పణ మొనర్పబడిన కర్మలు బ్రహ్మము నొందును. కర్మల బ్రహ్మార్పణమొనర్చితిమను ద్వైతభావము కర్తలో నిలిచియుండును. బ్రహ్మము తాను, తానువేఱని గలిగెడిభావముపై నాత్మత్వమునెఱిగి ప్రత్యక్షము గలుగుటకొఱకే 'సత్' శబ్దమేర్పడినది. ప్రశస్తకర్మలు నోంకారముద్వారా బ్రహ్మము నొందుటచే 'సత్' శబ్దము చేర్చబడును.

ప్ర॥ సచ్ఛబ్దముయొక్క యర్థమేమి ?

ఉ॥ ఇత్యాది పరబ్రహ్మకు సగుణలక్షణము, స్వరూపము, గుణము కాదు. "సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే" సత్ యన, నసత్తొక టుండవలె. వీడు మంచివాడన్న, చెడ్డవాడొక డుండెనని తెలియకపోదు. అసత్తు వంధ్యాపుత్రునివలె నెప్పుడులేనిది. అదికాదు లేకున్నను యున్నటుల దోచునది. రజ్జుసర్పముభంగి యట్లు సత్యముగా గనిపించు భూతభౌతికాది ప్రపంచము సత్యముగాగ, త్రికాలముల, త్రిదవస్థల నబాధితంబగు జాతి, గుణ, సంబంధ, క్రియ, రూఢత్వములవలె శబ్దగ్రాహ్యముకానిదై విధిముఖ, నిషేధముఖ ప్రత్యయముల విలక్షణ

మగునదేదో నదియే సచ్ఛబ్దమున జెప్పబడు బ్రహ్మము. ఆత్మస్వరూపుడగు బ్రహ్మ గాన్పించనగును. కర్మ[illegible]యు పరిపక్వమై సద్రూపము నొందును. ఒకవేళ సత్కర్మలుగూడ నేదోయొక లోపముగల్గ నసత్కర్మలగును. అంతట నోంకారమును జేర్చిన సత్కారము వచ్చును. హీనకర్మలహీన కర్మలగును. పొరబాటునగల్గిన కర్మలు విధినియమముల నుల్లంఘితములైన సచ్ఛబ్దప్రయోగమును, ఓంకారమును, మఱియు తత్కారప్రయోగమున కంటె జాగరూకతతో జేయుచో నిర్మలకర్మల నొనర్చును. ఓం తత్సత్తను పరబ్రహ్మమే సమస్తమగుట పరమాత్మసాధనములగును. బహిరంగ మంతరంగసాధనలలో యజ్ఞదానతపస్సులను బహిస్సాధనముల, నారంభాంత్యముల నీ మూటిని యుచ్చరించుచు, కర్మ లాచరించుమని యొక యర్థము. నిర్విఘ్నముగ నెరవేరుటకని యొక యర్థము. ఉపలక్షణములగు సాధనలు సాధ్యవస్తు ప్రతీకములేననియు, మూడిటిలో నేది యుచ్చరించిన పరమాత్మకే యర్థమనియు, పరమాత్మప్రాప్తమనియు "బ్రహ్మార్పణం బ్రహ్మహవి" యనురీతి యజ్ఞ, దాన, తపస్సు లొక్కొక్కటిగాని, మూడుగాని యొనరించువాడు, నొనరించుట, ఫలము బ్రహ్మమేనని యర్థము. "కర్మాణి చిత్తశుద్ధ్యర్థం" చిత్తశుద్ధికొఱకు నా బ్రహ్మమునకే యర్పించు టొకర్థము. "యజ్ఞే తపసి దానే చ స్థితిస్సదితి చోచ్యతే। కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే" ఈ నామము కేవలము మూడువర్ణముల సమూహము మాత్రమే తలంచకుము. ప్రత్యక్షముగ బ్రహ్మమేను. ఏయే కర్మల నొనర్చినప్పటికి నవి యజ్ఞములేగాని, దానములగుగాక, తపస్సు మొదలైనవి యగుగాక, యథావిధిగా జరుపబడినవే యగుగాక, లేక న్యూనతబొందినవేగాని, సమస్త కర్మలు బ్రహ్మార్పణమని నపుడు బ్రహ్మరూపమే నగును. సముద్రములోజేరిన నదులు వేఱువేఱు జెప్ప సాధ్యముకానిరీతి, న్యూనాధికకర్మ లేర్పఱుపజాలక బ్రహ్మమగు చున్నవి. 'సత్'శబ్దవ్యవస్థాప్రయోగముగల కర్మ సాంగవేదానుష్ఠానముతో సమమగును. "అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్। అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ".

ప్ర॥ శ్రద్ధలేనివి, ఓం తత్సత్తను బ్రహ్మనామము నుచ్చరింపని కర్మ లేమగును?

ఉ॥ శ్రద్ధనువిడిచి పట్టుదలయగు దురాగ్రహముతో వేనవేలశ్వమేధ యాగము లొనర్చినను, షోడశదానముల నిచ్చినప్పటికి, తలక్రిందుగ పెక్కుకాలము తపస్సునరించినప్పటికి, చెఱువులు, కుంటలు, బావులు త్రవ్వించిన, సత్రములు, ధర్మశాలలు కట్టించిన నివి యన్నియు నిష్ఫలములే. రాతిపైని వాన, బూడిదెలోబోసిన నెయ్యి, ప్రతిమనాలింగన మొనర్చుకొనుట, ప్రవాహముపై రువ్విన రాళ్లు, దప్పిదీర సముద్రపు నీరువలె వ్యర్థములు. ఈ కర్మసమారంభములన్నియుగూడ వ్యర్థములే. గానుగలో రాళ్లువేసిన నూనెరాదు. ఈ విధముగ పారలౌకికలాభము లేకపోగా నైహికలాభముగూడ నుండదు. ఉభయభ్రష్టత్వము, నుట్టికి, స్వర్గమునకు లేనిరీతి, యశ్రద్ధావంతుని కర్మ లసద్రూపములగునని భగవంతు డర్జునునితో జెప్ప, నర్జునుడు, సంజయుడు, ధృతరాష్ట్రులు వినిరి. కాని సంజయార్జునులు హృదయస్ఫురిత మనోరంజనులైరి. ధృతరాష్ట్రుడు చంద్రుడులేని రాత్రి, మబ్బుపట్టిన పగలు, తలలేని మొండెము వలె నుండెను. శ్రద్ధయనే సాధనతో నెవ్వరైన చరమలక్ష్యమగు పురుషార్థము నొందవచ్చును.

ఇతి శ్రీ భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం

యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే

శ్రద్ధాత్రయవిభాగయోగో నామ

సప్తదశోఽధ్యాయః

ఓం

శ్రీ సహజానందకృష్ణపరబ్రహ్మణే నమః

# ప్రశ్నోత్తరీ ప్రవచనగీత

## అష్టాదశాధ్యాయము

### మోక్షసన్న్యాసయోగము

శా॥ మోక్షాపేక్షయుగూడ బంధమె సదా ముక్తుండె గాయాత్మ యా
పేక్షావిద్యయె దానిబాధ పఱపన్ హృద్యూత్థప్రజ్ఞానతా
వీక్షత్వంబొగి జూడలేవు భవముల్ యేప్రొద్దు పొమ్మంచనన్
సాక్షాత్కృష్ణుడు తా ధనంజయునితో సంగ్రామరంగంబునన్.

శ్లో॥ అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితం ।
మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి ।

తా॥ ఆత్మస్వరూపముచే నాకాశతుల్యుడు, కావున నశరీరి యనబడుచున్నాడు. అనిత్యములగు దేవ, పితృ, మనుష్యాది శరీరములందున్నవాడు, నిత్యుడు, వికారరహితుడు, గొప్పవానిగను, విభువుగను, సర్వవ్యాపిగను యాత్మనుతలంచి, ఆయాత్మ నేనని తలంచుచున్న విద్వాంసుడు శోకింపడు.

ప్ర॥ మోక్షసన్న్యాసయోగమన నేమి? ఎన్ని శ్లోకములు? అర్జునుడే యేల మొదట నడిగెను?

ఉ॥ ఈ యాధ్యాయము కడపటిదగును. సమస్త గీతార్థము నుపసంహార మొనర్పబడినది. కోవెలకు గాలిగోపురముంచిన దేవాలయము సమాప్తమైనదని యర్థము. పాలకడలియను భారతయుద్ధమధ్యమున దైవాసుర మథనోత్పన్నమగు నమృతరసము గీత. కృష్ణార్జునసంవాద గగనధునీపావనప్రవాహమే గీత. అకుంఠిత దైవాత్మశక్తులకు దృఢవిశ్వాసకార్యదీక్షాపరతులకు, నిస్స్వార్థులకు, నిరుపమాననిర్వ్యాజప్రేమమయులకు, సునిశితమేధాశక్తిసంపన్నులకు, జీవితపాలనాచాకచక్యులకు, దేశవిప్లవ

కారులకు నైతము గ్రహింపరాని వేదాంతపరిభాషార్థసిద్ధాంతముల నవలీల గ్రహింపదగు సాధనల మోక్షబోధము చేయునదే గీత. తక్కిన యాధ్యాయశ్లోకార్థములకు సంబంధమే నీ యాధ్యాయము శ్లోకార్థములు. అన్ని శ్లోకముల యర్థము చేకూర్చు ప్రబోధకముతే. యజ్ఞమునకు పదునైదుగురు ఋత్విక్కులవలె, పదునైదవ యాధ్యాయము ముగిసినది. యజ్ఞకర్త భార్యవలె పదహారు, యజ్ఞకర్తవలె పదహేనవయాధ్యాయము, పదునెనిమిది యుపద్రష్టవంటిది. గీతకే కాదు సమస్త మతాదర్శకము, సర్వవేదాంతసారసంగ్రహము, షడ్దర్శన, షట్శాస్త్ర, షడంగములు పదునెనిమిదిలో నుత్తరమీమాంసవలె కడపటి యాధ్యాయము సకల మానవుల పుణ్యఫలసమూహము. డెబ్బదెనిమిది శ్లోకములుగలది. గీతాసారమును, లేక సారాంశమును, ఫలశ్రుతిని వివరింపబడినది. గీతావృక్షము పదునెనిమిది శాఖలతో భవ్యమై, దశదిశల ధృవోత్తారకమై వ్యాపించినది. అర్జున ఉడుగ లేదనే యుపక్రమముతో, కృష్ణుడు చెప్ప లేదనే యుపసంహారముతో ముగిసినది. అర్జునుడే కాదు, సకల మానవులు మహిమాన్వితమగు గీతామాధుర్యము గ్రోలి, పూర్ణానందులు కావలసియున్నది. అర్జునుడు తన సందేహనివృత్తియైనదని యీ యాధ్యాయమునసే బాహాటముగ జెప్పెను. సంజయుడు తనివితీరలేదు. మాటిమాటికి కృష్ణార్జునసంవాదమును తలచితలచి యానందించుచున్నాననెను. ధృతరాష్ట్రుడొక్కడుమాత్రమే నేమియు పలుకలేదు. ఆవల నేమి చేసిరి యని యడిగెను. గీతను సంజయునివలన పూర్ణముగా వినెనుగాని, జీర్ణించుకొనలేకపోయెను. రెండుతూములుగల చెఱువురీతి. ఒక చెవివింటే, నొకచెవి వినినది వదలుటకైనది. ఇదియే నతడుపొందిన యనుభవము. ధృతరాష్ట్రునివంటివారు యెంతవిన్నను స్వాతంత్ర్యము లేకపోవుటయేగాక, తమ నైజబుద్ధివలన ప్రాప్తించే ఫలకారులేకాని మోక్షార్హులుగారు. వ్యావహారికమున స్వప్నప్రపంచమువలె దోచు జగత్తున జాతి, మత, స్వార్థ, స్వజనార్థప్రియులై, స్వరూపమును మఱచి తిరుగు ప్రమత్తులకు 'యద్భావం తద్భవతి' యను గతియేగాని గీతార్థమును, గీతామృతమును ద్రావియుంటే ధృతరాష్ట్రులెందుకైతారు? స్వరాజ్యము లేక రామరాజ్యము స్వారాజ్యము. సర్వమతసమ్మతమూలము నేల నొల్లరు?

మోక్షమనే యభిమానముకూడ వదలమని రెండవయర్థము. అదికూడ బంధమే, నభిమానమే. సదా ప్రాప్తివస్తువునకు పొందవలసిన దేమికలదు? ప్రాప్తమైనది దేహము ప్రారబ్ధమునుబట్టి జరుగును. వ్యాపకవస్తువగు నాత్మ కెవ్వరు మోక్షమిచ్చునది? బంధమనే భ్రాంతి నివర్తిమాత్రమే యవసరము. ఒకడు బందిఖానాలో జిక్కికొంటి ననుకొనుచున్నాడు. వాని కాపలావాడు వానికంటే బందియైయున్నాడు. బందిలోయున్న వాడేకదా బంధవిముక్తికాలములో నుండునది. జన్మమరణ సంసార నివర్తియే మోక్షము. ఆ సంసారనివర్తి దేనివల్లనగు నది మోక్షోపాయము. ఇవి యౌపచారికములంతేగాని, మరేమికాదు. మోక్షముకొఱకు బంధ రూపమగు, సంసారకారణములగు సర్వకర్మల త్యజించటము లేక సర్వ కర్మ ఫలత్యాగ మొనరించటము. మోక్షమన యనేకార్థములు గలవు. సన్న్యాసమన వదలటమనియు, బ్రహ్మమనియు నర్థము. సచ్చిదానంద నిర్గుణబ్రహ్మమే సగుణమగు నామరూపముల వ్యక్తమగుటయే సన్న్యాస మనియు, నిఖిలరూపముల వ్యక్తమగు పరమాత్మయే తానని గ్రహించుట మోక్షము. కుక్క యిల్లిల్లు వెదకుచున్నదన్న, యాకలిదీర్చుకొనుట కొఱకే. మానవులట్లే జిజ్ఞాసులై తిరిగితిరిగి విచారించుచున్నారన్న తమ సాక్షాత్కారము తామెవరైనది తెలియుటకొఱకే. జిజ్ఞాసపరులు మానవ వ్రతే. జంతుజాలమునకు జిజ్ఞాసలేదు. జంతువులవలె జిజ్ఞాసలేనివారు జంతు వ్రతే. ఆ జిజ్ఞాస దేనికొఱకు? సుఖము లేక యానందముకొరకేగా. ఆ యానందము విషయములగు జడవస్తువుల నెట్లు లభించును, తత్ప్రాప్తికై పరితపించుచు జడవిషయముల భ్రాంతిత్యాగ మొనర్చుటయే సన్న్యాసము. పురుషుల యిచ్ఛకు విషయమేదో, దానినే పురుషార్థమనెదరు. పురు షార్థము నాలుగుగా శాస్త్రకారులు విభజించిరి. ధర్మము, అర్థము, కామము, మోక్షమని పేర్లు. ధర్మార్థకామముల మూడిటిని ప్రేయ మగుట గౌణమంద్రము. నాల్గవదగు మోక్షమునే ముఖ్య పురుషార్థమనెదరు. ఇదితమే నిశ్రేయసము. పురుషార్థమన పురుషు డెవడనియే యర్థము. ఆ పురుషుని తెలియుటే మోక్షము. "కథం బంధః, కథం మోక్షః" పురు షుని తెలియకపోవటము బంధము. పురుషుని తెలియుట మోక్షము.

ప్రశ్న: పురుషుడంటే మగవాడే కదా?

ఉ॥ వ్యావహారికముగ బిలువబడు మాయామయములగు శరీరములు పురుషులుకాదు, స్త్రీలుగాదు. ఇవి జడములు; సృష్టిహేతువులు. ఒకటి క్షర, మొకటి యక్షరము. అకారము మొదలు క్షకారము వఱకు నక్షరమే. చలనత్వముగల జీవత్వమే పురుషుడు. జడములగు నానారూప శరీరాభిమాని చైతన్యవస్తువు. గుహ్యము, యింద్రియములవలన తెలియరానివి, గుహ్యతరము, గుహ్యతమమనుపేళ్ల త్రిమట్టముల త్వంపద వాచ్యము, తత్పదవాచ్యముల తొలగింప, త్వంపద తత్పదలక్ష్యార్థమే నసిపదార్థము. ఈ మూడు రహస్యముల భగవంతుడుజెప్పి కర్మత్యాగము చేయవలదని యనేకమారులు చెప్పుచురావటము మనకు గనపడుచున్నది. కర్మసన్న్యాసియైనగాని మోక్షమున కర్హుడుగాడని కొందఱు పండితులందురు. గీతలో నెచ్చటజూచినను కర్మ వదలరాదనియు, ఫలమాశింపవలదనియు చెప్పబడినది. అయితే కొన్నికర్మలు చేయవలెనని, కొన్ని త్యజించవలెనను విచారమెందుకలదు. ఈ రహస్యము భగవంతుని నుండియే వినుటవలన నేసంశయము లుండవు. ధర్మముల నాచరించువారము మనము. ధర్మస్వరూపియే తాను, తాను ధర్మి, తన ధర్మమే ప్రపంచము. శ్రద్ధాత్రయవిభాగయోగమున, నశ్రద్ధావంతుని కర్మలు అసద్రూపములని చెప్పుటచే శ్రద్ధవిడువరాదని తెలిసినది. శ్రద్ధలేక వినెడివారు, వినెడివారి పాపముల బంచుకొందురు. మఱి పాపవంతులయ్యెదరు. తమ పుణ్యము బోగొట్టుకుందురు. అయినను కర్మల నాచరించువారికి సజ్ఞానముచే నీశ్వరుడున్నాడని, యాత్మ యెవడని తెలియదు. దేహాత్మబుద్ధితో చార్వాకులవలె నింద్రియభోగములే పరమార్థమనుకొందురు. భగవద్గీత శ్రవణమున ధృతరాష్ట్రుడు, చతుర్ముఖునివద్ద శ్రవణముచేయుటలో విరోచనుడు, వసిష్ఠునివద్ద శ్రవణముచేయుటలో విప్రులు విపరీతార్థులై యాత్మజ్ఞానమునే మరచిరి. రజోతమోగుణశ్రద్ధ యున్నంతవఱకు శ్రద్ధావంతులమే ననుకుంటారుగాని మోక్షమున కర్హులుగారు. అహంకార మమకారములనే తెరలను, లేదా కవాటముల నెల్లప్పుడు తెఱవబడి యుండిన మోక్షము కరతలామలకమే.

ప్ర॥ ఫలత్యాగపూర్వకముగ కర్మలనన్నిటిని చేయవలెనని, కొన్ని కర్మలను విధిగా జేయరాదని, కొన్నిమాత్రమే జేయవచ్చునని చెప్పుటలో

శ్రోతలగు నధికారులకు నిశ్చయము చేసికొను టెట్లు? ప్రవర్తించుట మేలా?

ఉ॥ కొందఱు శాస్త్రవిహితకర్మలను సత్కర్మలనియు, తక్కినవి దుష్కర్మలనియు యందురు. శాస్త్రవిధి ననుసరించి కర్మల నాచరించు మానవులకంటె, శాస్త్రవిధిలేకనే ఫలత్యాగముతో కర్మల నొనరించు విజాతీయములు సాత్త్వికప్రమాణములుగా నున్నవి. అడవియందు మనుష్యులు నేత్రపాణుల కపకార మొనర్పక భయరహితులై, తేనె, గడ్డల, నాకుల దిని యభిమానరహితులై జీవించుచున్నారు. కొన్నికొన్ని దేశముల వ్యవహారములు, కాలవ్యవస్థలు నా దేశధర్మము లీ దేశమునకు పనిమీద పడవు. కర్మఫలత్యాగముయొక్క, కర్మసన్న్యాసముయొక్క రహస్యము తెలియుటకే నర్జును డడిగెను. శాస్త్రదృష్టినిబట్టి సన్న్యాస మనగా సర్వకర్మపరిత్యాగము. ఫలత్యాగ మనగా, కర్మఫలమును త్యజించుట. సన్న్యాస ఫలత్యాగముల లక్షణముల తెలియుట ముఖ్యము. అడవినుండు, యూరనుండు, యేకాకివిగా, లేక సాంఘికునివిగా, సన్న్యాసత్యాగముల రెంటిని తెలియనిచో నరత్వమే నిష్ఫలము. కర్మలు విడువ సాధ్యము గాదు. కర్మల వదలమనదు గీత. కర్మలవలన ఫలానుభవము చేయక, నీ జన్మముతో సరిపోక మరల జన్మించవలెనని తెలియుచున్నది. కర్మల వదలిన శరీరయాత్ర నడవదు. కర్మలవలన దుఃఖము, తుదకు బంధము తప్పదు. కర్మపరులకు మోక్షమెక్కడ? కర్మల నాచరించుటములో పుణ్యమో, పాపమో, పుణ్యపాపమిశ్రమమో సంకరించుకొనియే యుండును. కర్మల నన్నిటిని త్యజించవలెను. సర్వదోషరహితమైన సన్న్యాసమునే స్వీకరింపవలెను. కర్మబాధాభయమనెడి వార్తయే వినిపించదో, కేవలము యోగమువలన మాత్రమే దేనియందు నాత్మజ్ఞానము లభించునో, యేది జ్ఞానమును నావాహన మొనర్చెడి మంత్రక్రియవంటిదో, విజ్ఞానమును బయలుపఱపగల నంజనవంటిదో, అట్టివి రెండు సన్న్యాసము త్యాగములై యున్నవి. ఈ రెంటిని యాశ్రయించినంతనే సంసారసంబంధము తెగిపోవును. సన్న్యాసత్యాగముల నిరూపణయే యీ యాధ్యాయము. జన్యజనకభావమువలె నొకదానికొకటి కారణము. సంపూర్ణమైన గీత మరల నుపక్రమించుటకు నర్జునుని సంశయమే. భగవానుడా! సన్న్యాస

త్యాగముల రెంటి కర్థము లెట్లున్నదన, యనేకవిధన్న, బహువిధమున్న రీతి నొకటిగా నా బుద్ధికి తోచుచున్నది ఈ రెండుశబ్దముల భేదమును తెలుప వలసినదన, భగవంతు డిట్లనెను. శబ్దభేదమున్నది విను మనెను.

ప్ర॥ సన్న్యాసత్యాగశబ్దముల భేదమున్నదని భగవంతుడననా? అట్లయిన నేమి భేదము చెప్పెను? ఫలత్యాగపూర్వకకర్మలు చేయుమనెను. ఏమి చేయవలెనో, నేవి చెయ్యగూడదో తెలుపలేదు.

ఉ॥ అట్లు తలంపరాదు. కర్మఫలత్యాగమన్న నేవి వదలవలెనో, యేవి వదలకూడదో నవిషయము మనకే యర్థమగుచుండలేదా? శాస్త్రనిషిద్ధకర్మలు మనమెందుకు చేయుదుము? కర్మఫలత్యాగమొనర్చితే చాలని, యసత్యము, చౌర్యము, క్రూరత్వము, నమ్మకద్రోహము, హింసాత్మకకర్మల చేయుదుమా? చేయరాదు. శరీరము తనంత తానే జన్మించినప్పటికి దానిజీవితమునకు కావలసిన యన్నోదకములు, అలంకారములు మొదలగువానికొఱకు పరిశ్రమ చేయవలెను. ఇదేరీతి నిత్య, నైమిత్తికకర్మలు స్వాభావికముగ జరుగుచుండును. మనస్సులో వాని ఫలాశలేకున్నచో కర్మలు కామికలుగావు. మఱియు క్రొత్తవి యంట బెట్టుకొంటిమంటే ఫలాపేక్షయుండినట్లే. చెడినకన్ను తీయబోతే మంచి కన్ను బోయినరీతి, స్వధర్మమునందే ఫలత్యాగ మొనర్పవలెను. ఫల త్యాగము జేయనేచేసితే యే కర్మలు చేసినట్లే యుండదు. ఫలాసక్తి లేకుండ కర్మల జేయుటయన సులభముకాదు. కొంతకాలము ననుభవ మయ్యేటంతవఱకు గాని, లేక నిజమైనభక్తి భగవంతునిపై గలిగినగాని, లేదా పురుషార్థము సాధింపవలెననిగాని యుంటే చేయగలడు. లేనిచో దుస్తరము.

ప్ర॥ అందులకు భగవంతుడు మఱేమి చెప్పెను?

ఉ॥ స్వర్గాదిఫలములనొసగు యిష్టాపూర్తదత్తములగు కామ్యకర్మముల పరిత్యాగమునే పండితులు సన్న్యాసమందురు. నిత్యనైమిత్తికములగు సమస్తకర్మముల ఫలత్యాగమును జ్ఞానులు త్యాగమందురు. సన్న్యాసము ముఖ్యమని, గౌణమని రెండువిధములు. ముఖ్యసన్న్యాసము వివిదిష, విద్వత్సన్న్యాసమని రెండువిధములు. సాత్త్విక, రాజసిక, తామసికముల గౌణసన్న్యాసమందురు. పై రెండువిధములు ఆశ్రమసన్న్యాసము

లంద్రము. ముఖ్యసన్న్యాసికి నిత్యకర్మములు విహితముకాదు. అయినను లోకహితార్థము కర్మల కర్తృత్వాద్యభిమానము లేక నాచరించును. కర్మయోగియు నింతే. సన్న్యాసము ననేకరకముల జెప్పెదరు. బౌద్ధ, జైన సన్న్యాసులు గలరు. "యదహరేవ విరజేత్, తదహరేవ ప్రవ్రజేత్" ఎప్పుడు విరక్తిగలుగునో యప్పుడు సన్న్యసించుటము ముఖ్యమందురు. "త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః" నుండి "ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ" వఱకు త్యాగముల వివరించుచున్నాడు. అజ్ఞానియొనర్చు ఫలత్యాగమే త్యాగము. కర్మత్యాగము త్యాగము కాదు. సాంఖ్యులు కర్మమే బంధకారణము కనుక కర్మలనన్నిటిని పరిత్యజింపనగునని చెప్పెదరు. మీమాంసకులందరూ, యజ్ఞదానతపోరూప కర్మముల త్యజించుట కాదందురు. కర్మల చేయకూరకుండుటయే యుత్తమమని కొందఱందురు. భగవంతుడు తనయభిప్రాయము త్యాగము మూడు విధములని యర్జునునకు దెల్పెను. యజ్ఞ, దాన, తపముల త్యజించ కూడదు. వీనిని యాచరించుటయే కర్తవ్యము. ఎందుకంటే, ఫలాపేక్షను వదలుటచే బుద్ధిమంతులకివి చిత్తశుద్ధి నొసంగుచున్నవి. ఆసక్తిని, కర్తృత్వాభిమానమును, ఫలాభిసంధిని వదలి నీ యజ్ఞదానతపఃకర్మల నాకుగా నర్పించుట నాయభిమతమనెను. కాశీకి బోయితిని, క్రోధమును వదలి వచ్చితి ననునొకడు. నీవు వదలిన దెవరికి తెలుసునని నాలుగైదుసారు లడిగిన స్పర్థగల్గును. తాను వదలినదేది? త్యాగముచేయుట యెందుకు? త్యాగముచేయ లభించు వస్తువు లభ్యమగువఱకు త్యాగకర్మ వదల కూడదు. అనుకున్నస్థలము చేఱువఱకు పాంథుడు ప్రయాణమాపడు. కడుపునిండువఱకు గుఱ్ఱము దానావదలదు. రోగము తీరువఱకు పథ్యముండవలదా? జయము గల్గునంతవఱకు పట్టినకార్యము వదలరాదు.

ప్ర॥ భగవంతుడు చెప్పినది సరే, తామేమనెదరు?

ఉ॥ కర్మల వదలవలెనంటే కర్మఫలముల తెలియవలె. కర్మల నేల వదలవలెనో, నదియు తెలియవలె. ధూమమగ్ని నాశ్రయించినరీతి, ప్రతికర్మము ఫలమాశ్రితమై యుండును. ఏ కర్మ యొనరించినను, యే లోకమో నొక లోకప్రాప్తి, ఫలానుభవము తప్పదు. అది యనుభవించవలె. అనుభవము దుఃఖముతోటిదే. పూర్ణానందముండదు. అనంతమే

యున్న భయసందేహకారకములగు జన్మము లేల వచ్చును? ఆయాసిద్ధి లేని కర్మల చేయుటకంటె నడచుటయే మంచిదనియు, ననిర్వచనీయ సుఖ ప్రాప్తికి కర్మలవదలటము శ్రేష్ఠమే. కర్మలవదలి నెచ్చుటయున్నను, యే కర్మయో నొకకర్మ చేయవలసినదిగా నున్నప్పుడు, చేయవలెనని యభిలాష యున్నపుడు, కర్మఫలమువదలి కర్మచేయుటయే శ్రేష్ఠము. మోక్షము కొరకైన సన్న్యాసత్యాగముల ఫలమొక్కటే. వేఱువేఱుకాదు. గిరీశ బాబను నతడు రామకృష్ణుని చేరి, స్వామీ! తరించుటకు నన్నేమిచేయ మందురన, నాపేరు దినమునకు ముమ్మారుచ్చరింపుమన, నో మహాత్మా! నా పరిస్థితులు మీకు తెలియును. నాకు వ్యవహారములు మెండు. పాపాత్ముడను, ముమ్మారు నిమ్మెట్లు దలతునన, రెండుతూర్లైన దలంపుమన, నదియు నావలనగాదన, నట్లైన నొకపర్యాయము తలచికొనుమన, నట్లు కూడ వాగ్దానము చేయజాలనన, నట్లైన నీ భారమంతయు నాపైనుంచుము, నీవు శాంతి నొందగలవు, నీ ముక్తి నా చేతిలో నున్నదనుకొనుమన, నిది బాగున్నదనెను గిరీశబాబు. ఆ ప్రకారమే భగవంతుడు కర్మఫలములు గాని, కర్మములుగాని తనకే నర్పించి సుఖముగ నుండుమనెను. "నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే" నుండి "న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే" అనువఱకు త్రివిధత్యాగముల విసిపించెను. ఒకడు నెండపై కోపగించుకొని స్వయముగా తనశరీరమునే తాను నఱుకుకొను భంగి, కర్మలు బంధకరములని, వానిపై కోపగించుకొని వాని నాచరించుట మానటము తామసికత్యాగము. తలనొప్పికి కోపమువచ్చుకొని, నితరుల తలల పగలగొట్ట ప్రయత్నించినరీతి, తన స్థితిని తెలిసికొనలేనివాని త్యాగము తామసికమే. వెనుక గలుగు సౌఖ్యమునకు తొలుత కష్టపడ వలసినదే. నీరుత్రాగ చెలమచల్లవలె, తిన నన్నమువండవలె. ఆచరింప మొదలుబెట్టినకార్యము కష్టమనిపించిన, వెంగారుపడిన సంపూర్ణముగ వదలును. ఆ ప్రాప్తమైన నీ శరీరమును దరిద్రునివలె నేల శుష్కింపజేయవలె? ఆయాసముతోగాని, యిష్టములేకగాని, కర్మల త్యజించినయెడల రాజస త్యాగమగును. ఈ రెండుత్యాగములు త్యాగఫలమును బొందవు. శాస్త్రనియమమునుబట్టి తనవంతునకు వచ్చినకర్మల నాచరించును. కర్మలకు కర్తననెడు యహంకారముండదు. ఫలాసక్తియుండదు. తల్లిని, గురు

భార్యను, తనయుని భ్రమయని పురుషునిపగిది, యేయాశలేని కర్మల నాచరించిన నదియే మోక్షసాధనమగు సాత్త్వికత్యాగమందురు. కామ్య కర్మల ద్వేషింపడు. మోక్షకారణములని నిత్యకర్మల ప్రేమింపడు. ఎండ మావులు సంధ్యాకాలమునకు తమంతతామే లేకుండబోవుచందమున సాత్త్వికత్యాగికి కర్మబంధమే లేదు.

ప్ర॥ సన్న్యాసత్యాగములవిమర్శ ముఖ్యముగ తెలియవలెను. సన్న్యాసమున కర్మల వదలుట, త్యాగమున కర్మల ఫలముల వదలుట. భగవంతు డీరహస్యమును తెలుపుట లోకమున కెంత యుపకారము! శరీరయాత్ర జరుగును. బంధము దప్పును.

ఉ॥ "న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః" శరీరధారులై యుండి కర్మలను తిరస్కరించువారు మూర్ఖులు, నజ్ఞానులు ననబడుదురు. దేహమే నేనను యభిమానముగలవారు సంపూర్ణముగా త్రికరణముల కర్మను వదలలేరు. కర్మల వదలిన సన్న్యాసియే. కావున కర్మలజేయుచు, కర్మఫలముల త్యజించుట త్యాగియనబడును. మోక్షముపై నాసక్తి గలిగితేనే త్యాగిగాని, సన్న్యాసిగాని యీ రెండువిధముల శ్రద్ధతో నాచరింతురు. లేనిచో శాస్త్రమునే వదలుదురు. ఏమైనజెప్పు మెప్పటికైన, నెవ్వరైన కర్మల సన్న్యసించవలసినదే. అటువంటప్పుడు కర్మము సంకరముగాకుండ, కర్మలనొనర్చును, ఫలత్యాగమొనరింప నేర్చుకొన్నచో నుచ్చనీచతలు, స్వర్గనరకములు, పుణ్యపాపములు, జన్మమరణములు తప్పును. కర్మఫలములు త్యజింపలేనపుడు కర్మఫలకాములకు త్రివిధకర్మఫలము మరణానంతరము గలుగుచున్నది. శరీరమున కలంకారముల నుంతుము, నిష్టము లేనిచో తీసివైతుము. కాని యీపాడు శరీరమేలయని కొంతసేపుంచుకొని, కొంతసేపు తీసివేయుమనగునా? గృహమును నాప్రకారము చేయుతరమా? శాస్త్రీయకర్మల నొకవేళ వదలినను స్వాభావిక కర్మల వదలలేము. శరీరముచు వదలినా కర్మఫలము వదలదు. ఫలాశరహితులకు శరీరమున్నను బంధములేదు. ఇష్టము, ననిష్టము, నిష్టానిష్టమని మూడురకములు. అనిష్టకర్మ దేవమనుష్యజన్మముల తప్పించును. ఇష్టకర్మ నుత్తమమగు దేవతాజన్మముల నిచ్చును. ఇష్టానిష్టము మనుష్యజన్మము ప్రాప్తింపజేయును. వీనిలోనే దృష్టము, అదృష్టము,

దృష్టాదృష్టములని మూఁడువిధములు. దృష్టమన యీ జన్మముననే చేయబడి, యీ జన్మముననే ఫలమివ్వఁగలవి. అదృష్టమన యిప్పుడు చేయబడి. మఱొకజన్మమున యనుభవమునకు వచ్చునవి. దృష్టాదృష్టములన యీ జన్మములోనే కొంత యనుభవము, రాఁగలజన్మములో కొంత యనుభవమునకు రాఁగలవి.

ప్ర॥ త్రివిధఫలముల దృష్టాదృష్టముల వివరింపుడి?

ఉ॥ ఇష్టకర్మఫలము నుత్తమజన్మము నిచ్చును. అయిష్టకర్మఫలము నధోగతి బొందించును. మిశ్రమఫలము భూలోకమున మనుష్యత్వమును గలిగించును. వరిజొన్నవంటి సస్యములు, కొన్నిగడ్డలు, ఆకుకూరలు, కాయగూరలు, కొన్నిఫలవృక్షాదులు, తటాకాదులలోని నీరు, సంతానము, విద్యా,గౌరవము, నుద్యోగము, కొన్నిభోగములు దృష్టఫలములు. ఈ శరీరముండఁగ యనుభవమునకు వచ్చును. సత్సంతానఫలము, పంచయజ్ఞముల, నిష్టాపూర్తకర్మల ఫలమిత్యాదులు మరణానంతర మనుభవనీయము. కొన్ని యీ జన్మముతో, కొన్ని మఱొకజన్మమున యనుభవనీయములగును. జీవులు నీ మూఁడింటిలో నేదియొకదానినో యంటఁబెట్టుకొనియే యుండవలెను. వీని వదలియుండ సాధ్యముకాదు. తమతమ వర్ణాశ్రమధర్మముననో, లేక బుద్ధిపూర్వకముగ నొనరించినవానికి తత్ఫలము నొందక తప్పదు. కర్మఫలత్యాగులను, సన్న్యాసులను నివి యేవియు బంధింపవు. వీని చేయుచున్నను ఫలాసక్తి లేనందున వానినంటవు. ఎట్టి పదార్థములలో కలియుదిరిగిన గంటె కేయనుభవమెట్లులేదో, త్యాగికి త్రివిధదోషములులేవు. బిడ్డలకన్న తల్లికి, బిడ్డలకర్మఫలము తల్లికంటదు. విషపు విత్తనములిచ్చినవాని కేమిలేదు. వానిని బండించి తినినవానికే విషము. సోకితేస్పర్శ; సోకలేదా, స్పర్శయెక్కడిది? కీయిచ్చితేనే గడియారమాడును. కీయివ్వలేదు, గంటలు నిమిషములు తెలియవు. పల్లముదీసిన నీరుపారును. పల్లములేదు, నీరుపారదు. ఇచ్ఛయనునది యుంటేనే కర్మకుగాని, దానిఫలమునకుగాని ప్రాణము. ఆసక్తియే లేనపుడు యే కర్మయు తనకంటదు. ప్రపంచమంతయు కర్మఫలరూపమే. స్వప్నమంతయు కర్మఫలబీజమే లేక సూక్ష్మవాసనలు. దేవ మనుష్య స్థావరములయొక్క త్రిపుటివర్తన సంసారమే జగత్తు. వాని పరిణామమే యిది. నాలుకరుచికొఱకు కొన్నిపదార్థ

ములు తినినపుడు శరీరమునకు వంటనిచో, రోగము, దాని బాధ, దుఃఖ మనివార్యము. నదిలో పడ్డవాడేదరిజేరిన నచ్చట నివసింపవలసినదే. ధర్మాధర్మ, న్యాయాన్యాయ, సత్యాసత్య, సంసారనదిని బడినజీవులకు కర్మఫలములే బహుజన్మఫలకారియగును. కాగితము కాలినా, కాగితములోని యక్షరములు నిలుచునా? చిత్తనమే నశించిన వృత్తియెక్కడిది? స్వప్నమే లేదా, జాగ్రతెక్కడిది? జాగ్రతయేలేదా, జన్మమెక్కడిది? కర్మమూలమగు నాసక్తియే లేనపుడు, వీనివలనగలిగే త్రివిధఫలములు లేవు. అయితే నీ కర్మలమూల మజ్ఞానము. అయ్యది బాధింపబడనంతవఱకు నాత్మ కర్తృత్వాద్యభిమానముచే శుభాశుభ కర్మఫలములు వెన్నింటియే యుండును. దృష్టిలో దోషమున్న యథార్థ మగుపించదు. చెవుడైన వినిపించదు. చీకటైయైన వస్తువే కనిపింపదు. దరిద్రమైన భోగమే శూన్యము. అవిద్యయున్నంతవఱకు నీకర్మల త్యజించటమే దుర్లభము. హరికథలు, పురాణములు, పుక్కిటికథలు, నుపన్యాసములు విందమన్న కొందఱకు నిదురవచ్చును. నెత్తికెక్కిన నిద్ర వదలించుకొనుటకు నిద్రబోదామని యందుకుంటే, నాలోచనతో నిద్రరాదు. నిదురరాక, వినజాలక, గ్రహింపలేనివారిచందమున కర్మఫలము కొందఱ పయోముఖవిషకుంభముల, కొందఱ గోముఖవ్యాఘ్రముల, కొందఱ తేనెబూసిన కత్తుల, కొందఱ మేకవన్నెచిఱుతలుల, కొందఱ మత్స్యరూపపాముల, కొందఱ నాడరూపమునున్న కొజ్జలవలె తయారుచేయును. కామ్యకర్మ పదకొండువిధముల మనుష్య, మనుష్యగంధర్వ, దేవగంధర్వ, అజానదేవతా, కర్మదేవతానందములవంటివి యనుభవించి "ఆబ్రహ్మభువనాల్లోకా పునరావర్తినోఽర్జున" యన్నరీతి క్రిందుమీదుల తిరుగుచుండవలసినదే. కర్మఫలరహితులుచూడు. పహ్వారిబాబు, తన యింట దొంగలుపడ, తాను మేలుకొనుట చూచి పరుగెత్త, తనయింటియందు దొంగిలించి, పారవైచినవస్తువుల గొని, యాదొంగలు శ్రీకృష్ణస్వరూపులేనని వారివెన్నంటి యీ వస్తువులివిగో పారవేయుటమేలా? యని పరుగెత్తి పరుగెత్తి, కూకేసి కూకేసి, వారిని నిలిపి, నా వస్తువుల వారిచేతనుంచి, సంతసమున నింటికివచ్చెను. చూచితివా! ఆయన యనాసక్తి. ఒకప్పుడు ఖుదీరామచటర్జీ జమీందారుకి తప్పుడు సాక్ష్యము చెప్పలేదని పట్టణమే వదలిపోవ్మన, గొప్పదగు

నాస్తి వదలివెళ్లెను. పోతనయు సింగభూపాలునివలన గ్రామము వదలెను. చూచితివా! నిష్కాముల త్యాగము. వీరికెక్కడిది బంధము? "అభ్యాగతం విష్ణు" వనుమాటమఱచి తిరస్కరించి పిడికెడుధాన్యముగాని, కబళముగాని చేయజాలక దూషించి సాగనంపు కృతఘ్నులు, దురితాత్ములు, కర్మఫలులు కాకేమున్నది? అసలు భగవద్గీతకు కర్మసన్న్యాసమునకంటె కామనాసన్న్యాసముపై పక్షపాతము మెండు. విత్తనములుగాలిన తమ వృక్షములనే పుట్టించుటలేదా? రూపమునుజూచి వేశ్యను పోకిన డబ్బు వ్యయము, రోగబాధ, యపకీర్తియు వచ్చుటలేదా? ఈ విధమున జీవులు కర్మఫలకాములై సంసారమున భ్రమించుచుందురు. కర్మకు నిమిత్తకారకులైనవారు కర్తృత్వమునువదలి, కర్మఫలముల త్యాగమొనరించి, గురుదేవు కృప కృతకృత్యులగుదురు. ఆత్మజ్ఞానరతులై, ద్వైతభావమువదలి, భోక్తయు, భోగము, భోగ్యవస్తువులు, స్వప్నమయములై, గంధర్వనగరము, గగనకుసుమము, మరుమరీచకమురీతి, స్వకల్పితజగత్తున స్వస్వరూపభారులై, సుఖసాగరనిమగ్నులై యుందురు. జ్ఞానహేతువైన సన్న్యాస, త్యాగములు రెండు ఫలభోగవాసనల నంతమొందించును. ఆత్మస్వరూపమునందు కేవల విస్మృత దృష్టిగలవారైన కర్మలు స్వతంత్రమైనవియా? లేక భిన్నమైనవియా? యనెడి ప్రశ్నయే యుదయించదు. గోడపడిన గోడపైని గీతలు నిలుచునా? వెలుతురుగలిగినా చీకటియుండునా? మూలవిగ్రహమే నాశమైన నుత్సవవిగ్రహ మెక్కడిది? అద్దములేదా, ముఖమెక్కడ? నిద్రయేలేదా, స్వప్నమేది? సుషుప్తియేలేదా, సత్యాసత్యముల ప్రశ్నయే యుండదు. పుట్టనేలేదా, కర్మబంధమే లేదు. మొదలే గొడ్రాలైన పిల్లలబాధ యేది? కర్మలకారణమగు నవిద్యయే లేదా, కర్మలు బోడములెట్లు? అయినను శరీరమున నవిద్య యున్నంతవఱకు లేక దృష్టిలో భేదభావములున్నంతవఱకు శుభాశుభకర్మలు వెంటాడియే యుండును.

ప్ర॥ ఆత్మజ్ఞానముగలిగి యావరణదోషము తొలగితే చాలు. విక్షేపశక్తియుండిన జ్ఞానికి బంధము లేదందురు. అదియె బాధితానువృత్తి. జీవన్ముక్తికి మాత్రము విక్షేపశక్తి ప్రతిబంధకము. ప్రారబ్ధముండువఱకు విక్షేపముండునందురు. దీనినికూడ తాము దోషదృష్టి యవిద్య యందురా?

ఉ॥ గురుదేవుని దయవలన, నీశ్వరానుగ్రహమున శ్రద్ధా సమాధాన వంతుడై, మహావాక్యార్థరహస్యమువిని, తాను బ్రహ్మనే, శివస్వరూపమే నను దృఢముగల్గినను భూతప్రతిబంధకాదులుగాని, సంశయాస్త్రయము గాని మతేదోషములుండినను, లేకపోయినను యుండే విక్షేపమునకు పునర్జన్మములేదు. కర్ణుడు తాను కుంతీపుత్రుడనని తెలిసి, సూతుని యింట నున్నను సూతవంశుడుగాడు. ఆత్మస్వరూప విశేషజ్ఞానము గలిగినమీదట బాధింపబడిన పాముభయములేని భంగి, జన్మ మరణ సంసారభయము లేదు. దేహేంద్రియప్రపంచము మిథ్యాత్వనిశ్చయము. తన సత్యత్వమునకు హానిలేదు. నీ వన్నట్లు జీవన్ముక్తసుఖ ముండదు. ఆత్మయందు సద్దము నందలి మసివలె, నీ కర్మ యవిద్యచే నేకాంతయుండిన నవి యాత్మచే జరుగును. అందునకు నితరకారణములే. వానివల్లనే మాటిమాటికి నుత్పన్నమగుచున్నవి. దీనికిగల కారణము లైదు. ఈ యైదు లేనిచో నేకర్మ యుత్పన్నము కాదు.

ప్ర॥ కర్మయొనరించుటకు కారణములు గలవా ? అవి యెన్ని ?

ఉ॥ "పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే" కర్మకాండాత్మకమగు వేదమున నీయైదు కారణములు నిరూపించబడినవది. సమస్త కర్మలకు నీ యైదే కారణములు. ఇందులో నేయొకటి లోపించిన కర్మ యుత్పత్తేలేదు. అయితే నాత్మతో వానికి సంబంధమేర్పఱచటము పొరబాటు. ఈ యైదుకారణముల తెలిసిన, తనవల్ల కర్మ బుట్టుచున్నదా ? లేక నెవరివల్లనని గ్రహించిన, కర్మఫలాసక్తి తొలగగలదు. కర్మకు, నాత్మకు నే పరస్పరసంబంధము లేనేలేదు. అదిగో నదియొక ఫ్యాక్టరీ. ఇంజనుకు పెట్రోలువల్లగాని, బొగ్గునీటిద్వారాగాని గ్యాసు లేక పవర్ గల్గించును డ్రైవరు. ఇంజనప్పు కదలిక గల్గినదో, నొకచక్రము తిరిగిన నన్నిచక్రములు తమంతటతాము తిరుగుచు, వేరుశనగకాయలగాని, ప్రత్తి గింజలగాని, దూదిని వేఱు ప్రత్తిగింజల వేఱుచేయును. చనగకాయ పప్పును వేఱు, బొట్టును వేఱుచేయును. నూనెనుగూడ వేఱుచేయును. డ్రైవరు దీనిని గమనించుచుండును. ఓనరున కేమి సంబంధములేదుగాని యజమానిపక్ష, దాని కర్మకలాపమంతయు తనదిగా యభిమానించి, దానివలన గలిగే లాభనష్టములు తనపై నుంచుకొనును. ఆ ప్రకారము కర్మకూడ

నాత్మ నభిమానించితేనేగాని అభిమానము లేదా, బంధములేదు. అభిమానించుకుచో జీవుడు, నభిమానములేనిచో శివుడగుచున్నాడు. భగవంతుని యపారకరుణ జీవులు తత్స్వరూపులే. జీవులకు శరీరసంబంధ కర్మాభిమానము వదలితేచాలు. కానని తెలిసికొంటే పరితాపము నొంద బోరని యాయన మతము. "అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్" ఒకటిగా కనిపించి భ్రమింపజేయు పొరబాటు వినుటవలన, తెలిసికొనుటవలన తొలగును. ఇదిగో రైలందును. పెట్రొలువేఱు, యింజను వేఱు, డ్రైవరు వేఱు, గార్డువేఱని తెలిసిన తెలియుటదగ్గఱుండదు. దేహము మొదటికారణము; నిదియే నధిష్ఠానము; ఇదియే భోగ్యవస్తువు. ఇది పుణ్యపాప, సుఖదుఃఖ, మోక్షహేతువుకూడ. ఇది ఆత్మకు దృశ్యము, నచేతనము. త్రివిధావస్థలకు కారణము నిదియే. రెండవ కారణము చైతన్య ప్రతిబింబమగు నాభాసకుడు లేక జీవుడు. తాను చైతన్యమనే మఱపురా, అప్పుడతనికి దేహాభాసగల్గును. ఇంద్రియములే సాధనములు. ఇవి జ్ఞానక్రియారూపములు. సర్వత్ర వ్యాపించిన వాయువు శరీరమున వెలిసి పదివిధములగు ప్రాణాపాన, సమాన, ఉదాన, వ్యాన, నాగ, కూర్మ కృకర, దేవదత్త, ధనంజయ నామముల శరీరయంత్రమునకు చక్రములవలె లేక చక్రములు తిరుగు పట్టవంటిదై యుండును. ఇది నాల్గవ సాధనము. అంతరింద్రియ, బహిరింద్రియముల నధిదైవతములగు వరుణాగ్ని, సూర్యయమాశ్వినీ దేవతాదులు కర్మప్రేరకులు. ఈ యైదుకలసి కర్మమును గల్పించును. ఇంద్రియ ప్రాణాధిదేవత లాత్మకు దృశ్యములు. ఆత్మసత్తచే నవి తమకార్యముల నడుపును. ఆత్మలేనిచో నివి శూన్యక్రియలగును. వీనికి నాత్మ సాక్షి. ఓనరువంటివాడాత్మ. నాభాసకుడే డ్రైవరు. అతనికికూడ సంబంధములేదు. గానుగాడువానికి నేది లోపించిన గానుగాడదు; నూనెరాదు. ఈ యైదులో నేయొకటి లేకుండిన కర్మతంత్రమే నిలిచిపోవును. "శరీరవాఙ్మనోభిర్యత్కర్మ ప్రారభతే నరః" సముద్రములోని జలమును మేఘముగా సూర్యుడు మార్చును. ఆ మేఘము వర్షించి నదుల తయారుచేయును. నదులు ప్రవహించి సముద్రమున కలియును. ఆరీతి మనస్సు కర్మలను గల్గింప సంకల్పకారణమై యున్నది. ఈ సంకల్పమువల్ల వాణి యను డమరుకము వాగుచుండును.

శరీరము మూడవది. శరీరమనోవాక్కులు మూడు క్రియల కారణము లగును.

ప్ర॥ ఈ మూడు లేకనే కర్మమూలము మనస్సు కాదా? మనస్సు ముందుబుట్టును. దీని నేల జెప్పలేదు?

ఉ॥ నీ వనునది నిజమే. అన్నిటికి మూలమవిద్య యని తొలుతనే జెప్పలేదా? అజ్ఞానపరిణామమే మనస్సు. ఒకవేళ మనస్సున సంకల్పము తొలుతగల్గిన నీ మూడింటికంటు కర్మనొనర్చు, కర్తను వెంటబెట్టుకొని యుండియే యున్నదిగదా? అందువలన నా సంశయము తగదు. శరీర మనోవాక్కులచే నొనర్చు న్యాయమైన, యన్యాయమైన లేక న్యాయా న్యాయ కర్మల కీ మూడే కారణములు. ఆత్మకు నచేతనమగు కర్మకు యేకత్వము పొసగదు. కరెంటువంటిది యాత్మ. కరెంటుచే నడచు బండ్ల వంటివి క్రియ కారణములు.

ప్ర॥ తామే యంటిరికదా చైతన్యము కర్తయని? ఆత్మలేనిచో జడములగు వీనికి కర్మచేయ సాధ్యమా?

ఉ॥ రైలుబండి, ఫ్యాక్టరీలు, యంత్రములుచేయు పనులన్నియు తమవల్లనే యగుచున్నవి. మనుష్యుడు సాక్షిగా యుండును. వానిని నావి యనియు, పనిచేయుచున్న వని నభిమానించును. అభిమానమే లేనిచో నేకర్మ జరుగదు. ఆ రీతి యాత్మాభిమానముచేత ప్రతిబింబచైతన్యశక్తి కర్మలకు కర్తగానున్నది. కర్మలవలన గలిగే ఫలముగాని, కర్మలగుటగాని యాత్మకులేదు. అవిద్యచే నాత్మయం దారోపించుటయే. అవిద్యచేతనే కర్తృత్వ, భోక్తృత్వాదు లున్నట్లున్నవి. సత్యములో నాత్మకు నేవికార ములు లేవు.

ప్ర॥ ఆత్మకు కర్మలతో సంబంధము లేనపుడు బంధమోక్షము లాత్మకు నంటగట్టు టెట్లు?

ఉ॥ కర్మలు గ్రుడ్డిగా నుండగూడదు. కర్మలకు శాస్త్రమనెడి వెలుగు లభించినచో వాటిని న్యాయసంగతమైన కర్మలనియే జెప్పవలెను. శాస్త్ర నియమములేని కర్మలు, నిష్ఫలములు. పోగొట్టుకొన్న సొత్తు నేల ఖాతాలో వ్రాయుదుము? ఏ మంత్రమైన గైకొమ్ము. వర్ణముల యేబదియారు లోని యక్షరములేకదా? ఈ యక్షరములుగాదని యుచ్చరింప నెవరికి సాధ్య

మగును? అయినకారణమేమనగు కర్మల శాస్త్రనియమిత మొనర్పనిచో మనుష్యులులేని బండి, కాపురములేని యిల్లు, నీళ్లులేని నది, కోయిల కూతలేని వసంతఋతువు, గురువులేని యుపదేశమురీతి, కర్మలు నిష్ఫలము లగును; అన్యాయవంతములగును. "తత్రైవం సతి కర్తారమాత్మానం కేవలం తు యః" సమస్తవస్తువుల జూడవలెనంటే సూర్యుడు కావలె. చూచునది కన్నులేకాని సూర్యుడు కాదు. తద్రీతి నాత్మయును కర్తగాదు. ఆత్మయునికిచేతనే నీకర్మలు జరుగును అద్దమునందలి ప్రతిబింబమును, నద్దమును ప్రకాశింపజేయున దెవరు? అద్దమా? యందలి ప్రతిబింబమా? రాత్రింబగళ్లు సూర్యునకు లేవు. ఆ విధము కర్మలకు కర్త కానప్పటికీ కర్మల ప్రకటిత మొనర్చునదియైయున్నది. ఎవరు చైతన్యమగు నాత్మను శరీరమున బంధింపబడుదురో, నట్టివారికి నాత్మయే కర్తయనెడి సిద్ధాంతము దోచును. కర్మల కన్నింటికి కర్త నేనేయని వారంగీకరింతురు. నేనాత్మను, కర్మలసాక్షిని, తటస్థుడనునది వారెన్నడు విశ్వసించరు. మఱియు గురుమూర్తిని, శాస్త్రమును, సజ్జనులప్రాపు జొచ్చని మూర్ఖులకే నాత్మశరీరమనెదరు. స్వప్నరోగము గలవాడు నిజమనుకొనురీతి తన నిర్మలమగు నాత్మస్వరూపము మాయచే మఱచును. మఱచిపోయిన నాత్మస్వరూపమును విచారించిన స్మృతిగల్గును. మహాత్ములవలన నిరంతరము శ్రవణము చేయుచుండవలెను. ఈ విధముగా విచారించి నేనకర్తనను బంధవిముక్తిని లక్షణముల జెప్పెను. "యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే। హత్వాపి స ఇమాం లోకాన్న హంతి న నిబధ్యతే" అగ్ని యేవస్తువును తాకిన నది యగ్నిరూపమే యగును. మఱియు రెండిటి యందు దహ్యాదాహకభావము తనంతతానే నశించిపోవును. తత్వమస్యాది మహావాక్యార్థమనే పరుసవేది సోకినంతనే ఇనుమువంటి జీవుడు నాత్మయే యగును. ఇనుమువంటి యన నజ్ఞానముతో గూడినవాడు. ఆత్మస్వరూపము గలిగినమీదట తుచ్ఛమగు దేహాభిమానము వదలిన, పాలకడలి యందలి యమృతమువలె జీవుడు వేదవేద్యుడగును. తనకన్న భిన్నము లేని యద్వైతుడే, సర్వవ్యాపకుడే నీవిధముననే కర్మతో కర్తృత్వాభిమానుడగును. ఈ విధముగ నెవని కహంభావన భస్మమైపోయినదో నతని కర్మలు తన శరీరమునందు వఱకుండును. ఎవని ద్రష్టత్వము దృశ్యవస్తువుతో

కలిసి యేకరూపమై పోయినదో, వానికి నింద్రియములే కర్మ నొనరించు చున్ననుకూడా తెలియదు. సాక్షియగు నాత్మ స్వయముగా కర్మ ప్రవృత్తికి సంబంధించిన సంకల్పములు, కర్మప్రవృత్తివలన గలిగెడి క్లేశములు నాత్మకు లేనేలేవు. ఆత్మ చంపునదికాదు; చచ్చునదికాదు.

ప్ర॥ కొందఱాత్మ దేనినంటదు. కర్తృత్వము లేక చేయుకర్మకు బంధములేదని జీవహింస లొనరింతురే?

ఉ॥ వారు జ్ఞానులుకారు, ఆత్మవిచారపరులుకారు, ఆత్మదర్శనులుగారు. అనుభవములేని వాచావేదాంతులు తీవ్రముముక్షులుగూడ కాదు. కపటవేష బుభుక్షులు, అనులోమ విలోమముల నొక్కటి బ్రహ్మమే, నా బ్రహ్మమే తానను యనుభవముగల బ్రహ్మజ్ఞునికి నీనాభేదము లెట్లొదవు? హింసాదు లెట్లొనరించును? తన దేహమువలె బ్రహ్మాండమే తనరూపమైన నెందుకై యెవ్వరిని హింసించును? హింసింపబడునది, హింసించువాడను ద్వైతుడా! మృత్యుగతుడు, గ్రుడ్డిపాత మొనర్చిన వాడు దుర్మతియని గ్రహింపుము. స్వదృష్టి, లోకదృష్టి, శాస్త్రదృష్టి యను మూటియందు స్వదృష్టిలో, శాస్త్రలోకదృష్టులు రెండులేవు. స్వదృష్టిలో చంపుట, చంపబడుట మిథ్య కలవంటిది. హత్యయొనర్చునది, వ్యక్తపడుచునది యొకటి యుండియేయున్నది. నీనా కర్తవ్యములేల? హతమొనర్చుటము లోకదృష్టి. ఫలమనుభవించటము శాస్త్రదృష్టి. అజ్ఞానభూమిక కలమేల్కన్నరీతి స్వదృష్టియగు జ్ఞానమున నామరూపాదులే లేనపుడు హత్యయొనర్చుటము దేని? ప్రకృతియే షడ్భావవికారముల నావిర్భావతిరోభావముల జెందుచున్నది. ఏ కర్మమైన నెందుకు చేయగల్గుదురు? ఆకసమును గొలవటము, గొడ్రాలి బిడ్డ నెత్తుకొనటము, నపుంసకునితో మాచకమ్మ సంతానప్రాప్తి, గ్రుడ్డివాని వస్తుదర్శనమువలె సంకల్పములులేని యంతఃకరణముగలవాడెట్లు కర్మచేయబడును? "జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా" జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత యను త్రిపుటి ప్రపంచమునకు బీజమైయున్నది. కర్మప్రవృత్తి దీనివల్లనే నేర్పడుచున్నదనుటలో సంశయమే లేదు. కర్మప్రవృత్తికి హేతువులు మూడు. కర్మాచరణమునకు కర్త కర్మ కరణములు మూలములు. అంతర్బహిస్సుల, సూక్ష్మస్థూలకర్మలన్నియు నీత్రిపుటులచే విస్తృతములగును.

అనాదియగు నజ్ఞానకార్యమగు కర్మ వాసనారూపముగా ననాదినుండియే యున్నది. చిత్తనములో వృత్తిమున్నవిధము మొదట సంకల్ప ముదయించి పిదప స్థూలమగు కార్యమగును. అజ్ఞానము నివర్తింపబడినా, సంకల్ప ములుండవు. స్థూలకర్మ యుండదు. తెలియదగిన కర్మ జ్ఞేయము, తెలియు నది జ్ఞానము, తెలిసికొనెడివాడు జ్ఞాత. వీనినే ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయము లందురు. పంచవిషయములే జ్ఞేయము. వానినిరూపించు జ్ఞానము, వాని ననుభవించదలచు కర్త జ్ఞాత. ఈ జ్ఞాతయే కర్త యగును. సాధనములుగా నింద్రియములగును. కర్త చేయుపకరణముల ద్వారా క్రియలనొనర్చునో, నా క్రియల వ్యాప్తియే కర్మయనబడును. కర్తకరణముల త్రిపుటికిగల లక్షణములు జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములనునవి కర్మప్రవృత్తికి చెందిన త్రికూటములు. ఈ విధమగు కర్మకు నాత్మ, సూర్యునివలె సాక్షిగా నుండును, కర్మలవలన గలిగే కర్తృత్వ, భోక్తృత్వ, స్మర్తృత్వ, జ్ఞాతృత్వ, మంతృత్వ, హంతృత్వ, ప్రమాతృత్వ, ధ్యాతృత్వాదులు, సుఖదుఃఖములు, మేలు కీడులు, జన్మమరణము లాత్మకు లేవు. నిస్సంగుడగు నాత్మయందు "నింద్రియద్వా విషయద్వా" దోషః ఎల జీవుడారోపించునేగాని తన స్మృతిగలిగిన తనకే బంధముక్తులు లేవు. అనియతములగు కర్మప్రవృత్తికి హేతువుకాడు. కర్మాచరణుడు కాడు. సమస్త శాస్త్రములు కర్మనుగుఱించి విమర్శించి కర్మలే సంసార బీజము లనటము నాత్మ వీనికి కారణము కాదని యెఱుగుటకే.

ప్ర॥ అజ్ఞానమే కర్మకారణమైతే సత్వరజోతమోగుణములు, దాని స్వభావములగుట ప్రతికర్మ యీ త్రిపుటిని కూడియుండదా?

ఉ॥ ప్రపంచపటమును విద్యార్థులకు జూపినమీాషట నే దేశము యెక్క డున్నది యెట్లు తెలియునో, శ్రీభగవంతుడు దేహతాదాత్మ్యముతో తన్ను మఱచిన జీవులకు నే సముదాయమునన్న మాయావిద్యలచేత భేదింప రానిదై 'ఇదం' శబ్దముచే చెప్పబడు సాకారాన్యాంశమును విశేషార్థము గ్రహింపబడుటకు, భ్రాంతినాశముకొఱకు, నవిద్యానివృత్తికొఱకు, కల్పి తాంశసకాసార్థము నీ త్రిపుటిని చెప్పెను. కుమ్మరి జ్ఞాత, కుండ యిట్లుండ వలయునను ట జ్ఞానము, కుండ చేయవలెననుకొనుట జ్ఞేయము. ఇట్లు నిశ్చయించి మృత్తికతెచ్చి యితరసాధనములతో గుండ నొనర్చును.

కుండకు మృత్తిక కర్తయగుచున్నది. చక్రము మొదలైనవి సాధనములు. కుండ కర్మమగుచున్నది. ఇట్లు త్రిపుటిని విభాగించిన యాత్మ సులభముగా తెలియబడును. "జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః" జ్ఞానము, కర్మ, క్రియలు, ఫలములు, త్రిగుణభేదముల నిర్వచింపబడెను. వీని స్వరూపమేమిటియన "సర్వభూతేషు యేనైకం భావమవ్యయ మీక్షతే" స్థావరజంగమాత్మకమగు బ్రహ్మాండము నామరూపములతో భిన్నభిన్నముగదోచినను, పూసలు వేఱువేఱైన దారమొక్కటియనురీతి, పరమాత్మయే నామరూపముల వెలయుచున్నాడు. కల్పితచిత్రితములకు నభిన్నముగ గీత యొక్కటియేయగుభాతి, నేనునేనని ప్రతిశరీరమున వెలయు నాత్మయే పరమాత్మయని గ్రహించు జ్ఞానము సాత్త్విక మనెదరు. ఆత్మయొక్కటియైనను, శరీరప్రభిన్నముల నాత్మలు వేఱువేఱని తెలియు జ్ఞానము రాజసము. ఒకానొక శరీరమున లేక ప్రతిమయందే సంపూర్ణ మగు నాత్మ లేక నీశ్వరుడని తెలియుజ్ఞానము తామసికమని సాంఖ్య శాస్త్రము జెప్పెను. సంపూర్ణాకాశమద్దములలో నీటియుపాధుల, ననేక ముగా దోచినను అద్దములభేదమేగాని, యాకాశభేదములేదు. త్రిపుటియు కూడ నద్వితీయ బ్రహ్మమే. "పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్" జ్ఞాతమఱచి నానాత్వమును గోచరింపజేయునది రాజ సము. పశువులమాటున దాగిన పాలవలె, నామరూపములు దాగిన పర మాత్మను తెలియనీక పలురూపముల భావించు జ్ఞానము రాజసము. "యత్తు కృత్స్నవదేకస్మిన్కార్యే సక్తమహైతుకమ్" కేవల సంకేతము కొఱకు చెప్పిన నీతామసజ్ఞానము, బాగోగుల సత్యాసత్యముల నిర్దేశింప లేదు. ఇంటిలోని వస్తువులు మంచివియా, చెడ్డవియా యని దొంగకేమి తెలియును? తాను తినకపోయినను వస్తువు కనిపించినంతనే లోనికి లాగి కొని పోవును. ఎలుకభాతి శాస్త్రీయము నలక్ష్యముచేయు జ్ఞానము తామసికము. త్రిగుణముల జ్ఞానము లీరీతినుండును.

ప్ర॥ గీతాసూర్యోదయమైనంతనే తమతమ తెలివితక్కువయనే చీకటి తొలగి శాస్త్రీయప్రవృత్తులగుటకు గీత వచించిన నీ గుర్తుల గ్రహించిన వెంటనే నిద్రనుంచి మేల్కొనినట్లు మేల్కొందురు. కర్మల వివరింపుడి?

ఉ॥ "నియతం సంగరహితమరాగద్వేషతః కృతమ్" నిత్యనైమిత్తిక కర్మలనేగాక, తదితర శాస్త్రనియతకర్మఫలరహితుడై, బ్రహ్మార్పణ బుద్ధితో నాచరించుచు, చేతిలోని సాధనమువలె, నద్దములోని ప్రతిబింబము వలె, పతివ్రతవలె, చిత్తసమాహితకర్మలు సాత్త్వికములు. "యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః" ఇంటిలో చూచెదమా, ప్రతివారితో పేచియే. వెలుపల చూచెదమా, అందరతో స్నేహితమే. నిత్యనైమిత్తికకర్మలనేగాదు, ఫలాభిలాషతో, కర్తృత్వబుద్ధితో నాచరించుకర్మ రాజసమనిపించును. "అనుబంధం క్షయం హింసామనపేక్ష్య చ పౌరుషమ్" ఆకసమున గీసిన గీతలవలె, నీతిని మూటగట్టురీతి, నేకర్మల నాచరించిన మొదట మధ్య నంతమున నేమిగలదో, నాదియందు, మధ్యాంతములందు నిష్ఫలములో, పరపీడాకరములో, చేయవలెనను పట్టుదల, ఫలాఫలముల గ్రహించలేని కర్మ తామసికమగును.

ప్ర॥ త్రివిధరీతుల స్వభావముల నెఱిగిన ప్రతియొకరు తమ కర్తవ్యమును నిశ్చయించుకొనుటకు భగవంతుడు తెల్పు నీ రహస్యములు మానవులాతురులై తెలియవలె.

ఉ॥ "ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః" నుండి "అయుక్తః ప్రాకృతః స్తబ్ధశ్శఠో నైష్కృతికోఽలసః" త్రివిధకర్తల వివరించెను. పశుస్తన్యముల పాలవలె సాత్త్విక కర్త కర్మలు వృథాగాక నుత్తరోత్తర ఫలకారకములై, చిత్తశుద్ధికరములై, దైవప్రీతికరములై, శాస్త్రానుకూలములై, ధర్మపత్నిభంగి, పిల్లల పోషించుతల్లి కర్తవ్యము వలె, పాలకడలిమాదిరి యనహంకారుడై, నుచితస్థలముల, నుచితభంగి, స్వాత్మస్తుతి లేనివాడై, తన్ను బాగడిన, దూషించిన సమముగనుండు కర్త సాత్త్వికుడు. దినము పిండదమేలనని పశుస్తన్యముల గోసి పాలు బడయలేని రీతి, ప్రపంచమంత వాసనగలిగి, పెంటకుప్పపై పరుండి స్వర్గసుకలలగన్న మాదిక్రి, ఫలముల చిల్లిగింజయైన నొరులకియ్యడో, ననాదిజన్మపరంపరా సంబంధవాసనాకులచిత్తుడును, కర్మఫలముల నాసక్తుడు, సముద్రునిభంగి తనసొమ్ము లెవ్వరపహరింపకుండ నుప్పుగాజేయువాడు బాహ్యాంతశ్శుచి లేనివాడు. ప్రాప్తించకపోయిన గోడుగోడున దుఃఖించువాడు, ఏకాగ్రత లేనివాడు, గర్వి, దంభుడు రాజసకర్త. వంచకుడు, పరుల వ్యాపారముల

పాడుజేయువాడు, తను జేసెడి కార్య మేమగునో యని యెఱుంగడో, మాంసములేని యెముకను గొఱుకుచు, నంతనుగాంచిన రక్తము తేజంతువునకు దొరకలేదని సంతసించు కుక్కమాదిరి, కొంపలు చిత్తచదారము వేయు నిండు పెంటదిబ్బవలె పనికిరానివస్తువుల ననేకము కూర్చి వాని తలక్రింద నుంచుకొని నిద్రించువాడు. ఏ కార్యమాచరించినను, నేజన్మమునకైన తనకు సుగతిగల్గే మార్గమునకు సంబంధింపనివి చేయును. ప్రతికర్మయందు పాపమాత్రమించియుండును. ఇతడే తామసకర్త. ఒక పట్టణములోని ముగ్గురు మిత్రులు తపస్సు చేయ వెళ్లిరి. దైవము మొదటివానికి ప్రత్యక్షమై వరమడుగమన, రెండవవానివద్దకెళ్లి వాడడిగిన మీద రండియున, వానివద్ద కరిగి యడుగ, వాడు మొదటివానికి నొక కన్ను, నొకచెయ్యి, నొకకాలు పోవునట్లడిగెను. మొదటివాని దగ్గరకు రాగ, తనకు నొక కన్ను కాలు పోవగోరినవానికి రెండుకన్నులు, రెండు చేతులు, కాళ్లు రెండుబోవ వరమడిగెను. మూడవవానివద్దకరిగి, వీరిరువుర విషయమడుగ, తెల్సి, నాతడు వారిరువురికి పోయిన యంగముల మరల నిమ్మనెను. చూచితివా! మొదటివాడు తామసికుడు. రెండవ వాడు రాజసికుడు. మూడవవాడు సాత్త్వికుడు. అర్జునా! త్రివిధకర్తలను వింటివి. త్రివిధబుద్ధుల, త్రివిధధృతుల భేదభేద వినుమని భగవంతుడనెను.

ప్ర॥ ఈ కర్తలను, కర్మలను నెవరు చదివి విమర్శింతురో, వెంటనే తామే కర్తకు నేకర్మకు సంబంధించినవారమని తెలియుదురు. అందుకే గీతకింత ఘనత, భగవంతునకింత పురుషోత్తము డనిపించుకొనుటము. "వాసనా వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం। సర్వభూతనివ సోఽసి వాసుదేవ నమోఽస్తుతే" సర్వభూతముల వసియించునట్టి యే వాసుదేవు డున్నాడో, నట్టివానికి నమస్కారము.

ఉ॥ ప్రస్థానత్రయముల ప్రసిద్ధమైన గీత, మానవప్రస్థానముల నిర్ణయించుటలో తనదే ముందంజ. తాను నడచునది తనకు మంచిదిగాదను వాడెవ్వడు? నడుచుమార్గములవలన గలిగే ప్రయోజనము తెలిసినవారి వలన విన్న వెంటనే నస్తవ్యస్తప్రవర్తనముల మానుదురు. అనుభవజ్ఞుల మాటాంత్యనిశ్చయమైనది. ఒకప్పుడు శివాజీ పెద్దచెఱువును గట్టించి, సమర్థగురుడు రా, నాయనను తోడికొని చని యింతకార్య మొనరించితినన,

...ంచేయున్న యొక్క పెద్ద ...ను ...ంప, నంమిళ్ళ కన్ను తెలికిరా, అమ్మా! ఈ కప్పను నీవేనా యూశారిపించుచున్నావి? యన, శివాజీ తన కర్తవ్యాహంకారము పసిలించుకొనెను. ... చేయించువాడు భగవంతుడు. ఆయన చేతిలోని సాధన నీవు యన, శివాజీ తన పొరపాటునకు పశ్చాత్తాపపడెను. ఇటులనే మేము కర్తల మనువారు గీతను చదివిన యొవరు కర్తలో గ్రహింపగలరు. కర్మల నాచరింపక నుండరాదు. ఆచరించియే తీరవలెను. శ్రద్ధను, వైరాగ్యమును గల్గించి, మోక్షమునకు హేతువులను శాస్త్రవిహిత కర్మల నివృత్తిలోనికి ప్రవృత్తులనున్న బుద్ధి సాత్త్వికము. లనకుగాని, ఇతరప్రాణులకుగాని, ప్రస్తుతమునగాని, మతొకప్పుడుగాని పాపభూయిష్టములై, భయదాయకములై, అక్రమములై యుండని కర్మల నొనరించు బుద్ధి సాత్త్వికము. "బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు" నుండి "అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా" వఱకు త్రివిధబుద్ధులు ధృతుల త్రివిధము జెప్పెను. కన్నులు కనిపించి కనిపించనిరీతి, చెవులువినిపించి వినిపించనిరీతి, నొకపని చేసీచేయని విధము, నుచితమనుచితము నెఱుంగక నధర్మములగు నిషిద్ధకర్మలను గుఱించి యోచించకుండ, తనకు నితరప్రాణులకు హానిగల్గునది భయహేతువై, పాత్రాపాత్రత నెఱుగక చేయవచ్చు, చేయరాదనుకొనక నాచరించునది రాజసబుద్ధి. ధర్మములన్ని యధర్మములుగ దోచునో, పైత్యజించినవానికి తలదిరుగ ప్రపంచము తిరుగుభంగి, విపరీతములుగ దోచు బుద్ధి తామసికము. ఇదిగో నదియొక యిల్లు. నిత్యము శుచిరొనర్చి బాడుగకుండె నొకడు. అతను జనిన మరొకడువచ్చి వారమున కొకదినము శుచియొనర్చెను. అతడు జన మతొకడువచ్చి బొత్తిగా శుచి చేయనిచో నాతని నేమందురు? మొదటిది సాత్త్వికము, రెండవది రాజసము, మూడవది తామసికబుద్ధి.

ప్ర॥ త్రివిధములగు ధృతులను వివరింపుడి?

ఉ॥ "ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియక్రియాః" నుండి "యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ" వఱకు త్రివిధ ధృతుల జెప్పెను. సావిత్రి, సత్యహరిశ్చంద్ర, గాంధీజీ, ధ్రువ, ప్రహ్లాద, మీరా, వివేకానంద, రామతీర్థ మొదలగువారి ధృతి సాత్త్వికము. ప్రాణ

యమునందు దుర్బలత్వముగలవానికి స్వరాజ్యస్వారాజ్యములు లేవని గాంధీ యనెను. జన్మమరణములకు సంబంధించిన భయముగలదంటే, సకలేంద్రియముల సమబుద్ధిలేక నిరంతరము శల్యసారథ్యముగు కర్ణనియుద్ధము వంటిదిగాక, యర్జునునకు హరి సారథ్యమగుట చేటులేక నున్నభంగి, యేకాగ్రత, నచంచలస్థితి, మనఃప్రాణములయొక్కయు, నింద్రియముల యొక్కయు క్రియలు శాస్త్రబద్ధములో నా ధృతి సాత్త్వికము. సైంధవునివంటి, శకుని ఉత్తరలవంటి, కంసునివంటి, పౌండ్రకునివంటి ధృతి. అర్థకామములనే గ్రహించు ధర్మము. మోక్షమున్నదనిగాని, లేదనిగాని, యుండిన ప్రయత్నింపక, రావణహిరణ్యకశిపులవంటి ధృతి రాజసికము. కుంభకర్ణ, హిరణ్యాక్ష, ధృతరాష్ట్ర, దుర్యోధన, యెలుగు నూరబండుల వంటి ధృతి, పాముల సాకినరీతి, పాపముల సాకుట, కోతుల బెంచినభంగి, గుణముల మార్చుట, భయము, శోకము, నెల్లప్పుడు నిద్ర విషాదములో, నేను చెప్పిన భయపడుచు, నీవుజెప్పిన భయపడుచు, నశాస్త్రీయమగు నిషిద్ధకర్మలంపటములో, చుక్కనుర్రైనరీతి యుండు ధృతి తామసికము. చాల శ్రద్ధతో వినుచున్న నర్జునునకు భగవానుడు త్రివిధసుఖములను తెలుపదలచె. "సుఖం త్విదానీం త్రివిధం శ్రుణు మే భరతర్షభ" నుండి "యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః" వఱకు జెప్పెను.

ప్ర॥ ఈ త్రిగుణములే లేనిచో నిత్యానందమే నిత్యసిద్ధమని తెలుచున్నది. నీరు పారుచుండ సూర్యుడు నీట తడియుభంగి, రెయిద్దున నడువ నీట తలక్రిందైనవిధము, భూమి తిరుగుచుండ సూర్యుడు కదలిన రీతి, గుణసంకరమువలన నాత్మకు నిన్నివిధములున్నట్లు, నవిద్యచే నారోపితములగుచున్నవి. స్వచ్ఛతాస్వచ్ఛతమగు నంతఃకరణనుబట్టియే సుఖ శోకము గలుగుచున్నది. ఈ సుఖరహస్యము తెలిసినగాని, త్రిపుటినిగాని, దాని కారణమునుగాని నంతరింపజేయక మానరు.

ఉ॥ ఈ సుఖేచ్ఛ యొకరు తెల్పినదిగాదు. ప్రతిప్రాణికి గలదీసుఖేచ్ఛయే. దుఃఖము కావలెననే యిచ్ఛ యెవరికి లేదు? ఒక నాటకమును వేసి సంతోషించెదము. ఆడుచు సుఖించుచుదా మనుకొన్న వ్యక్తులు, ఒకడు సీతను బోగొట్టుకొని దుఃఖించటము, రాముని బాసి సీత యేడవడము, సీతను గానక హనుమంతుడు విలపించటము యెందుకొఱకు? సుఖముకొఱకే

తమ రూపముల జ్ఞాపకము బోయినది. వేషముల గడబిడలో, కలగాపులగ ములో సుఖముకొఱకే నేడ్చిరి. తామేమ్పటయేగాక నెందఱినో యేడ్పించినచే తమకు సుఖము. కావున సుఖప్రవృత్తులే నివియన్నియు ఇంద్రియ విషయసంయోగమువలన సుఖము దొరకుననుకొని విధివిరామము లేకుండ ప్రవర్తించెదరుగాని, సుఖమందుల లేదు. పూర్ణసుఖము తన స్వరూపమే. అంతర్బహిరంగ వృత్తులకు స్వస్తిజెప్పి యాత్మనుగన్న కృతకృత్యుడగును. ఆ యాత్మనుగనలేక గలిగెడి త్రివిధసుఖముల వినుము. త్రిగుణములబట్టి యుండును. ఎవని కేగుణముండునో నా సుఖమే ప్రాప్తించును.

ప్ర: తాము చెప్పగా, విన్న మీదట గుణత్రయాతీతసుఖమును బొంద ప్రయత్నింపవచ్చుగదా? లేక సాత్త్వికసుఖమునైనా యార్జింపవచ్చునా?

ఉ: క్రింది తరగతినుండి పై తరగతికి విద్యార్థులు బోవటము లేదా? త్యాగముండిన పట్టుక్లాసుపెట్టెలో గూర్చొనుటలేదా? డబ్బుతో రిజర్వుడు చేయించుకొనుటలేదా? శ్రద్ధా, విశ్వాసముల క్రిందనుండి పైకిపోవచ్చును. శ్రద్ధా, విశ్వాసములు లేనిచో, క్రిందికి రాగలుగుదురు. ఇహాపరలోక వాంఛలవలన, భోగలాలసమైయున్న చిత్తమును, నింద్రియములవలన తాత్కాలికముగ గల్గు సుఖము క్షణభంగురమని దీర్ఘమగు నభ్యాసము వలన, సంసారక్లేశములనుండి విడివడునో, మఱియు మొదటి యభ్యాసము కష్టతరమైనను, తుదకు స్వాభావికమగునో, భయరహితమై అమృతమయ మగునో, మఱియు నాత్మనిష్ఠయగు బుద్ధియొక్క పరాకాష్ఠలేక నిర్మలము నుండి యుత్పన్నమగుచున్నదో, నది సాత్త్వికసుఖము. విషయేచ్ఛవలన విషయముల జ్ఞానేంద్రియముల కూడికవలన గలిగినసుఖము, మొదట ననుభవించునపు డమృతమువలె తోచును. అనుభవానంతరము విష తుల్యమై యోతప్రోతభావమున శాంతిలేక దుఃఖమయమగు సుఖము రాజసము. పేకాట, పందెములాట, మధుపాన, స్త్రీలోలత, యార్జనత్వ ముల, రకరకములగు పిండివంటల, హోటళ్లలో నందఱి యెంగిలుల గుడుచు నపుడు, దుర్జనసహవాసమున నశాస్త్రీయ విధులొనరించు, దౌర్జన్య, దంభ, దర్పముల గలిగెడు సుఖము రాజసము. ప్రారంభమున మోహ ముతో, తుద దుఃఖముతో, నాత్మకు విస్మృతి గలిగించునదియు, రైళ్లలో టిక్కట్టులేక బల్లలక్రింద పరుండి తప్పించుకొంటిమనియు,

చిక్కిన తన్ను వదలిన నిక్క శిష్యజెప్పిన చెప్పినదియేయనియు, చెప్పెడి వాక్యముల యర్థము గ్రహింపలేకయు, తోచినట్టుగా పదార్థముల భుజించుటయు, లోకవిషయముల నిరసించుటయు, ముక్కలి సోమరితనమున, నిద్రవలన, తూగువలన, మసుగువలన, భయమువలన, లభించినకాలములోనే కలిగిన సుఖమునది తామసికము.

ప్ర॥ ఈ త్రివిధసుఖము లొక్కొక్కరియందే యుండునా? ఒక్కొక్కటి యొక్కరియందుండునా?

ఉ॥ వారివారి తొలిజన్మకృతకర్మఫలమునుబట్టి, తలిదండ్రి పామరజన సంబంధముల బట్టి, యొక్కొక్కరిలో నొక్కొక్కటియే నతిశయించి యుండును. అట్టివారి సంబంధమేయుండును. ఒక్కొక్కప్పుడు మూడు నొకరియందే కాలముల వయస్సునుబట్టి యుండును. అనుభవముచేత కనుగొనవచ్చును. ఒకరు తన్నవమానింప వ్యథచే మోహితుడై, దీనుడగు సుఖము తామసికము. అవమానమునకు ప్రతీకారము చేయకపోతినే యని సమయముజూచి ప్రతీకారమొనర్చి, పొందుసుఖము రాజసికము. చేసిన యవమానమునకోర్చి ప్రతీకార మొనర్పదలంపక, తిరిగి మేలు చేయకోరటము సాత్త్వికసుఖము.

ప్ర॥ ఈ మూడుగుణముల విడువ బొత్తిగా సాధ్యముకాదా? ఈ మూడుగుణము లీ లోకముననేనా?

ఉ॥ "న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః" ఈలోకమే కాదు; మరేలోకమైనగాని, గుణములవల్లనే లోకము లావిర్భవించినవి. కాలము సైతము గుణమయము మే. నీ లోకములోను, నీ మూడుగుణము లతోగూడక యుండినవస్తువేలేదు. దేవతలు, త్రిమూర్తులు, త్రివర్గములు, త్రిదవస్థలు, స్వర్గమర్త్యపాతాళములు గుణమయములే. ఈ గుణములే చాతుర్వర్ణ్యములకు భిన్నభిన్నకర్మలనెడి ఝంఝాటకము కలిగించెను. ఈ గుణము లెవ్వనికి లేవో, నెవ్వనివలన నీ గుణవికారము లతిశయిల్లునో, నతడే యక్షరపరబ్రహ్మము, సచ్చిదానంద ఘనస్వరూపము.

ప్ర॥ నాలగవాధ్యాయమున, చాతుర్వర్ణ్యములు గుణకర్మవిభాగముల నాలుగుగా జెప్పెను. మరల వర్ణవిషయ మిచ్చట చెప్పుటలో నేమైన విశేషమున్నదా?

ఉ॥ విశేషములేనిది భగవంతుడెన్నడు జెప్పడు. ఒకవేళ జెప్పిన సర్వజ్ఞుడుమాత్ర మంగీకరించుటకు సామాన్యుడా! కాదు. ఒక్కొక్క వర్ణములోనే ననేక శాఖలున్నవి. ఒకరిమత మొకరికి యంగీకారము కాదు. ఒకరియింట నొకరు భుజింపరు. ఒకరికొకరికి విరోధము. ఒకరిశాస్త్రము లొకరికి నింద్యములు. ఆచారములలో భేదములున్నవి. అదిగో! దొంగలు పట్టుకొండియన్న, పట్టుకొని దొంగలచేతిలోది హరించి పరుగెత్తిన, దొంగ లెవరన పోలీసులకు దెలియురీతి, ధర్మమనుపేర నధర్మవర్తనులై నింద్రియ వేదికల, నుపన్యాసవేదికల చెయ్యి బల్లగ్రుద్ది వాదించువారలకు పక్షపాత సాంప్రదాయ స్వార్థపరాయణులకు నౌదార్యగుణరహితుల నుద్దేశించి భగవంతుడు జెప్పెను. "మనుశ్చ పిత మానవానాం" మానవులకెల్ల మనువు పితరుడు. మనుష్యులెల్లరు మనుసంతతియే. పుట్టుకతో నాలుగు జాతులు లేవు. పోలికలో లేవు. చావుపుట్టుకలు, రోగరాగముల నందఱొకటియే. కాలేజిలో చేరినపుడు బాలబాలికలందఱొక్కటే. భిన్నభిన్న డిగ్రీలు చదివియా యుద్యోగముల తారతమ్యములుండునేగాని, మానవులు మానవులే. నాయురారోగ్యముల నడవిజాతులు బలిష్ఠములై ధైర్యవంతములై భీకరారణ్యములు నెట్టి యుత్పాతములైన నెదుర్కొన వీర లేజాతియందము? కులకట్టుబాటుల, మతదీక్షల, కోర్టులకెక్కక, సత్యమనుదానిపై నాధారపడి యగ్నితప్తమైననూ నేల తమ పరీక్షల నీనాటికి నెగ్గించుకొను కోయల దేజాతి? ఇంద్రియచాపల్యమున విషయలోలురై తంత్రముల నిర్మించుకొని భోగములచాటున యనుభవించుచు మేలన్న, లాభమన్న, ప్రతిష్ఠయన్న, పేరన్న, పెద్దన్న, నెట్టికుకర్మలకైన, నెట్టి యుద్యోగములకైన, నెట్టి మార్గములనైన, విధియైన, నిషిద్ధమైన తమతో తమ జాతి నంతయు గొనిపోవువారల దేజాతియనదవు? మనుష్యజాతియొక్కటియే ధరణి దర్పమున బాలించినవా రనేకులుగలరు. వారి దేజాతి? నియమబద్ధమైన నీతిని చరియించి తమ్ము తమవారల తమ దేశముల రక్షించుకొన్న వారి దేజాతి? ప్రతిగృహముల, ప్రతిదేవస్థలముల, ప్రతిచర్చిల, ప్రతి మసీదుల, పిల్లులు, కుక్కలు, నడవిజంతువులు, పాములు, తేళ్ళు, నెలుకలు, నూరబందులు, ఎలుగులు, కోతులు, పశువులు, గుఱ్ఱములు, కోళ్లు,

పావురములు, నెమళ్ళు, కాకులు, కొంగలు, కోయిలలు, వినోదమృగములు, ముంగిసలాది జంతువులు, నిప్పుకోడివంటి వినోదపక్షులు, తొండలు, బల్లులు, పందికొక్కులు సంచరించిన నివసించిన దోషములేదు. పాపము లేదు. ప్రాయశ్చిత్తములేదు. నిజమైన మనుష్యులే వచ్చిన సహ్యతలేదని తొలగించుటయు, నిందించుటయు, తలుపులు బిగించుటయు, ప్రాయశ్చిత్తమొనర్చుటయు, కోర్టులకెక్కడము, కాళ్ల చెప్పులదన్నుటయు, కేకలు వేయుటయు, నిట్లొనర్చువారిది యేజాతి? ఆస్తికులా? నాస్తికులా? దేశ విప్లవకారుల, జాతివిప్లవకారులజూచియే భగవంతుడు యీ యధ్యాయమున సమగ్రమగు గుణకర్మల విభాగించెను. మతములు, జాతులు, జీవులకా? లేక నాత్మకా? జడములగు దేహేంద్రియ ప్రపంచములకా? ప్రపంచములోని పంచభూతములు, నోషధులు, సూర్యచంద్రులు, నదీనదములకు జాతులుగలవా? జాతి జాతికి పంచభూతముల సూర్యచంద్రాదుల వేఱువేఱు కావలెనన్న సృష్టి మనచేతిలో నుండవలెను. అనంతంబులైన దిక్కు తోచదు. సృష్టిలోనుండియే యెవరివి వారికుండిన నిక కలహములేల? మోసములేల? అవి సాధ్యములుగావా? వాసికికసిమసంగడమేల? అయిన విను. పుట్టినవీగాకట త్రిగుణములు యెవ్వనియందధికముగనుండి, యా గుణమునకు దగిన కర్మప్రవృత్తుడగునో నా స్వభావము గలవాడని తెలియుటకు వర్ణముచేత, వేషముచేత, భాషచేత, పాండిత్యముచేత వర్ణములేర్పడవు. గుణకర్మస్వభావములేనని యకుంఠితనాదముతో భగవంతుడు సెలవిచ్చెను.

ప్ర॥ పుట్టుకతో శూద్రులైనా కర్మలచేత బ్రాహ్మణత్వాదులు రావచ్చుగదా?

ఉ॥ ఆ మాట సత్యమే. పుట్టుకతో శూద్రుడనియేకదా "జన్మనా జాయతే శూద్రః" యన్నది శ్రుతి. పుట్టుకతో బ్రాహ్మణత్వాదులుండిన తిరిగి శాస్త్రనియతకర్మ ననుసరించి ద్విజత్వము వేదపఠనమున విప్రత్వమని యేల? ప్రమాణముల జెప్పుటయేగాక, తద్విధులనుసరించుటయేల? క్షత్రియ వైశ్యులకు ద్విజత్వకర్మ మొనరించుకొనుచున్నారు. కాని, వీరల వైశ్యులు, క్షత్రియులనదరేకాని ద్విజులనరు. ఇక పంచములనువారెట్లు వచ్చిరో గీతకు తెలియదు. మఱెచ్చట తెలుపబడలేదు. ఈ విమర్శకుతగిన

గ్రంథవిస్తరము గాకపోదు. భగవంతునకు తెలియకపోదు. మహమ్మదీయులు, క్రైస్తవులు, బౌద్ధ, జైన, కమ్యూనిస్టు మొదలైన జాతులు వారివారి ధర్మములు సమస్తదేశములందు విస్తరిల్లియున్నవి. వారిదేజాతియో? వారు సమస్త మానవుల తమ మతములలో జేర్చుకొని సౌభ్రాతృత్వము వెదజల్లుచున్నారు. బ్రాహ్మణులమనువారలు శూద్ర, పంచమ, వైశ్య, క్షత్రియ కర్మల నాచరించువారు నూటికి నూరుమందిగలరు. పంచమ, శూద్ర, వైశ్య, క్షత్రియులు బ్రాహ్మణకర్మల నాచరించువారునుగలరు. మరేమన ప్రతియొక్కరిలోను సమయానుసందర్భముల దేశకాలములబట్టి నాలుగువర్ణములు గానిపించుచున్నవి. ఎవరివతివి వారివేయైతే మరొకరికి నెట్లువచ్చును? వెండి వెండియే. బంగారు బంగారే. ఇనుము యినుమే. వాటిని మార్చుటను కష్టము. వానియంతనవిమారవు. జాగ్రదవస్థయను వ్యావహారికయవనిక ముగిసిన సుషుప్తికాలమున నేపథ్యమున నెవ్వరిదేజాతి, యెందఱుగలరు? కలరనుగుర్తుగలదా? ఇదియొక భ్రాంతి, యున్మత్తప్రలాపము, నాత్మవంచకము; దుఃఖభాజనము. సంఘకట్టుబాట్లంతవఱకు నవసరమో తెలియవలెను. ఆత్మకు నేకట్టుబాట్లు లేవు. భగవద్వాక్యము సత్యము. సత్త్వగుణముగలవారు బ్రాహ్మణులు. సత్త్వము రెండుభాగము, రజస్సు రెండుభాగములు గలవారు క్షత్రియులు. సత్త్వమొకభాగము, రజస్సు రెండుభాగములు, తమస్సొకభాగము గలవారు వైశ్యులు. తమస్సధికముగాను, రజస్సు స్వల్పముగాగలవారు శూద్రులనుదురు. శంకరభాష్యమునజూడుడు. నాటకములలో, చలనచిత్రములలోని పాత్రలకే నాయావర్ణములు చెప్పనగునా? మోక్షముకొఱకై యేర్పడిన నీగుణకర్మ స్వభావములు అవినాభావసంబంధముచే ప్రతియొకవ్యక్తియందున్నవి. ఈశ్వరసృష్టిలో నేవర్ణములులేవు. స్వేదజములు, అండజములు, మావిజములు, ఉద్భిజ్జములే నుండెవి. ఈ సంకరమంతయు పుస్తకములలో బుట్టినదికాదు, మస్తకాలలోనుండి బుట్టినది. ఈ గుణత్రయస్వభావ మజ్ఞానజనితము. అజ్ఞానము తొలగనిది, యెవ్వరికి మోక్షమే లేదు. మోక్షము పుట్టుకతో, నాచారముతో రాదు. 'భిద్యతే హృదయగ్రంథిః' హృదయగ్రంథులు నశించి, సకలసంశయములు తొలగి, పుణ్యాపాపములు వేత్తై,

చిత్తసమాహితులై, మహావాక్యార్థము గురువువలన విన్న సజ్జనులకే గాని తక్కినవారికి మోక్షప్రాప్తిలేదు.

ప్ర॥ భగవంతు డొక్కడా? అనేకములా?

ఉ॥ అనేకులని యెవ్వరు చెప్పుదురు? భగవంతు డొక్కడే. అనేకులు లేరు.

ప్ర॥ ఒక్కడేయైన నొక యాసియాఖండమున నరబ్బుల కొక వేదము, నాంగ్లేయుల కొక వేదము, బౌద్ధ జైనులకు వేరు వేదములు, ద్రావిడుల కొక వేదము. ఇకను వేదములు తమ తమ సాంప్రదాయముల ననుసరించి యున్నవనుచున్నారు. వేదములు వేఱు, దైవములు వేఱు, తత్వము వేఱు, ముక్తులు వేఱు, పద్ధతులు వేఱు; నొకరి పద్ధతి నొకరు యొప్పక, నెన్నియో మారణకృత్యము లొనరించుకొనిరి. నేటికిని యుద్దేపద్ధతిలో నున్నారు. మఱియు తక్కిన జాతుల వేదములలో జాతులనిగాని, గుణకర్మలతో నవసరము లేకుండ యుండుటేలా? భగవంతు డొక్కడేయైన భారతవాసులే కాదు, తదితర ఖండవాసులున్నారు; వారి భాషలు వేఱు, వారి యాచారములు వేరని తెలిసియుంటే, సింధులో వారిని జేర్పక లేక వారిలో భారతీయుల గలుపకుండటమేలా? ఒక భారతీయులు కుల మత స్పర్ధలతో ననాదినుండి సతమతమై దేశవిచ్ఛిన్నత్వము సంఘవిచ్ఛిన్నులై బద్ధస్పర్థల పరదేశస్థుల పాదాక్రాంతులైనా యొక్యోదరుగాని స్వజాతిమత్సరము లగులుకొని చల్లారకయున్నదే! తక్కిన మతములలో నీ పోరాటములు లేక హాయిగా నున్నారే, దీని కేమనెదరు?

ఉ॥ ఓయి బాలా! నీవడిగిన ప్రశ్నలన్నిటికి జవాబు చెప్ప గ్రంథ విస్తరము, పనికిమాలినపనికాగలదు. విశాలహృదయము, సకలజీవులక్షేమము, సదానందపరులుతప్ప తక్కినవార లూహాపోహాల జెప్పతగినదికాదు. అయినను సంక్షిప్తముగ చెప్పెద. భగవంతు డొకడే, ననేకులు లేరు. ఇది సత్యము. భాష లాచారములు వేఱైన దేవు డొక్కడే, వందనీయుడే. ఇక నన్నిటికి నొకే జవాబేమన తమస్సునుండి రజస్సునకు, రజస్సునుండి సత్త్వమునకు, సత్త్వమునుండి స్వతస్సిద్ధమగు నద్వితీయ బ్రహ్మసిద్ధికి నేర్పఱచిన సోపానములలో స్వభావజాతములగు కర్మలు నెవ్వనియందుండునో, వాడాగుణము గలవాడని గ్రహించు. అయా కాలముల, నాయా

దేశముల, నాయా యవసరములబట్టి యాయా వేదములు బయలుదేరి యుండును. అందఱు నేకీభవించినపుడు చెడుగును తొలగించి, మంచిని గ్రహించితే సరిపోవును. గంజాయి త్రాగువానికి దానికన్న మంచి మెన్ని జెప్పిన యొప్పడు. అటులే నొక్కొక్క మతమనే బావులో నున్నవానికి నట్టిదియైనకాని వానికదే మంచిది. బావిలోని కప్పకు సముద్రవిషయ మెట్లు తెలియును? తుపానులతో, భూకంపములతో, నదీజలముంపులతో, చిత్రతరవ్యాధులతో, కఱవుకాటకములతో ప్రతిదేశమునందలి ప్రజలు కాలగర్భములో గలిసిపోవుచుందురు. ఒకదేశముపై నొకదేశము దండెత్తి జయించటము, దురాచారము లోనర్పటము, మతవ్యాప్తమొనరించటము, నన్యమతముల నణచటము, స్వమతస్థుల క్షేమము కోరునపుడు, తాము నమ్మిన పద్ధతులు, వేదములు, తమ మతమే లేమాయెనో యెవరి కెఱుక? మావి మంచివనుకున్నవి, యితరులకు చెడ్డవికావటమేలా? ఒక్కొక్కప్పుడు కాలగర్భములో నన్ని కలిసిపోవుట చూచుచున్నాము. ఏ మతమును విమర్శించిన నలసులు లేకపోలేదు. వ్రాత బాగున్నది, మాటలు బాగున్నవి, చేయుములు లోకోపద్రవములు. కొందఱిమాట యింటిలో, కొందఱి మాట యూరిలో, కొందఱి మాట యొకప్రాంత్యములో, కొందఱి మాట నొకదేశములో, నొకనాడో, యొక యర్ధదినమో చెల్లును. కొందఱిమాట యన్నిప్రదేశముల నన్నికాలముల జెల్లును. ఇట్టివారి మాట మాత్రము మాననీయము.

ప్ర॥ దౌర్జన్యముతో, దండనముతో, భేదముతో, దానముతో నార్జించిన మాటగూడ మాననీయమేనా?

ఉ॥ దౌర్జన్యాదులతో మాట వ్యాపకమైన నది మానసికమైనదిగాదు గావున వారు మసినంతకాలమే మాట యుండును. వారు పోతానే పోవును. యుగములు మారినను మారకూడదు. అదియే సత్యము. మానవుల శాశ్వతధర్మరక్షణము. రాతియందు బంగారుండును, రాతిని వదలి బంగారును గ్రహింతుము. ఆ మాదిరి చెడుగువదలి సత్యమును గ్రహించవలె. వేదములకు ఋషులు మంత్రద్రష్టలు. వేదములలోని విభాజ్యమునువదలి, యవిభాజ్యమునే గ్రహింపవలెను. బ్రాహ్మణకర్మల విను "బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప" నుండి

"కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజం" యని భగవంతుడు చెప్పినది చూడుము. ఇంద్రియనిగ్రహము: కొంగవలె కన్నులు మూసినను, లోపల చేపలదిను బుద్ధి లేకుండుట, యనుభవించినవి జ్ఞాపకమునకు రానీక, శ్రోత్రవి యూహాపోహాలుగాని, చూచినవి స్మరించుటము లేక యుష్ణములేని నిప్పువలె, కోరలులేని మృగమువలె, మిట్టపల్లములులేని సమస్థలమువలె, పౌర్ణమినాటి చంద్రునివలె, రాగద్వేషములులేక యుండుట శమము. పంచవిషయములలో తనకై తానుగాని, యితర ప్రోత్సాహములవలనగాని, తనంత తానుయే వచ్చినగాని కలవరముచెందని బహిరింద్రియనిగ్రహము దమము. కాష్ఠమౌనముగాక సుషుప్తి మౌనమను తపస్సు, శ్రద్ధాత్రయవిభాగయోగములో చెప్పిన త్రికరణతపస్సు. శరీరశుద్ధి, వాక్శుద్ధి, మనోశుద్ధి. భృగువు కాల రొమ్మునదన్న సహించిన విష్ణునివంటి యోర్పు. మనసులో నొకటి, మాటలలో నొకటి యుండక సత్యము చెప్పుట. తన బ్రతుకునకై యనేకజీవుల హాని గావించే రసాయన శాస్త్రములవంటివిగాక, నాత్మ పరమాత్మ ప్రపంచసమస్యల తెలియజేయు శాస్త్రజ్ఞానము, తద్వారా ప్రపంచమిట్టిది, పరమాత్మ యాత్మ లిట్టివారని గ్రహించిన యనుభవజ్ఞానము. భగవంతుడు, వేదము, పరలోకము, సర్వభూతదయ గలిగియుండు టాస్తిక్యము. ఇవి బ్రాహ్మణులకు స్వభావజాతములు. "బ్రహ్మ జానాతి బ్రాహ్మణః" ఇవి లేనివాడు శూద్రుడే. సమయము వచ్చినపుడు పరాక్రమము, దానికి దగిన తేజస్సు, వీనికి కీలకమగు ధైర్యము, అనాయాసకర్మ, యుద్ధమున పారిపోకుండుట, యుదారస్వభావము, అధర్ముల దండించు శక్తి యివి క్షత్రియస్వభావములు. ఇవి యెవరియందుగలవో వారే క్షత్రియులు. ఆంగ్లేయుల నీదేశమునుండి పారదోలుటకు లోకదృష్ట్యా యెవరు సాహసించిరో నా స్త్రీ పురుషులే క్షత్రియులు. భూమి దున్నుటము, గోసంరక్షణ, వ్యాపారము వైశ్యస్వభావములు. ఇవి యెవరియందు లేవు? ప్రతియొకమానవునియందు గలవు. ఎవరివి వారికే స్వభావములైతే నేర్పించినను స్వభావము మారకూడదు. కార్మికత్వమొనరించుట శూద్రస్వభావము. ఎవరెవరొనరించు కర్మ నిష్కామముగా నొనరించిన చిత్తశుద్ధి, మోక్షదాయకములే. ఒకరివృత్తి మరొకరి వృత్తికి పెద్ద చిన్నటికినిగాదు. బ్రాహ్మణవృత్తి గలవానికి తక్కినవృత్తులు

రావు. అటువంటప్పుడు సతని జీవితమే జరుగదు. శూద్రవృత్తి గలవారికి తక్కినవృత్తులు లేనిచో మోక్షమే లేదు. ఇది ముముక్షువులకు జెప్పినది; ఆరూఢులకు కాదు. స్వధర్మమునకు ప్రతిబంధకమగు మోహనివృత్తికి బయలుదేరిన, గీతాశయము యీ వర్ణసంకరముల ప్రసంగ మెందుకు జేసినదియా యని విచారించవలసి వచ్చుచున్నది. ప్రాణవియోగకాలమున పెండ్లి విషయము, సంకటకాల మున లేనివిషయము వచ్చుట యోచింప తగినది. పరబ్రహ్మను తెలియుట బ్రాహ్మణత్వము "బ్రహ్మవిద్బ్రహ్మ". బ్రహ్మత్వము నొందుట కెదిరించు ప్రకృతిశక్తుల నెదిరించు ధీమా క్షత్రియత్వము "క్షతాత్త్రాయతే క్షత్రియః". సత్యధర్మశాస్త్రముల పరిశోధించి, మహాత్ముల సేవించి, తల్లక్షణమునకై కృషిజేయుట వైశ్యత్వము. బ్రహ్మసిద్ధికొఱకు మూడు విధముల పాటుబడుటే శూద్రత్వము. మఱొక విధము. ఆత్మపరమాత్మల తెలియకపోవుటయు నిజమైన శూద్రత్వము. తెలియ నిచ్చగించుట వైశ్యత్వము. ఎట్లైన సాధించుట క్షత్రియత్వము. ఆ సాధించినది యనుభవించుట బ్రాహ్మణత్వము.

ప్ర॥ అహా! ఈ కడపటి వాక్యములే ప్రహామోదములుగా నున్నవి. మొదలే వీనిని జెప్పక తామేల యుపేక్షించితిరి?

ఉ॥ నీవాక్కనివేనా యుండేది? లోకము, లోకముయొక్క భావిదశ యున్నది. అందుకొఱకు శాస్త్రదృష్టి, లోకదృష్టి, స్వదృష్టులు మూడవసరములే. భగవంతుడు నిరాకారుడు, సగుణముగా తానే వ్యక్తమైనాడు. ఈ రహస్యము తెలియుట చాలు. నర మృగ పక్షి క్రిమి కీటక స్థావరాది బ్రహ్మండము పరమేశ్వరుని వ్యక్తరూపము. బ్రాహ్మణత్వమంటే వర్ణత్వముకాదు. బౌద్ధ, జైన, మహమ్మదు, క్రైస్తవ, నానక్ మొదలైనవారేవర్ణమువారందాము? జపాను, చీనా మొదలగు దేశస్థులదేవర్ణము? వర్ణమును గుఱించి దేవులాడువారు దేవుని కనుగొనజాలరు. ఇంద్రియాతీతమైన పరమగమ్యము. ఇంద్రియహద్దులవలన తెలియగలుగుదురే. ఇంతకధర్మ మెప్పటికైన నిలువదు, ధర్మమెప్పుడు నశించదు.

ప్ర॥ ఈ వర్ణవివక్షతను గుఱించి యర్జునుడేమి యడుగలేదా?

ఉ॥ అర్జునునకు వీనితో బని యేమున్నది? తన క్షత్రియత్వమునకే స్వస్తిజెప్పి, స్వధర్మమగు నాత్మస్వరూపమును తెలిసికొన్నవానికి తనది

గాని దేహబుద్ధి, పశుబుద్ధినలె నేల ప్రశ్నించుచు? మేరువెక్కినవానికి గుట్టలతో పని యేమి? స్వయంప్రభువైనవానికి చాకిరిపని యేల? ఋషులచా నతీంద్రియజ్ఞానసిద్ధిబడసిన మహామహులగు సర్వజ్ఞుడీ ద్వైతసంకుచిత మృతధర్మమున కేలవచ్చు? రాదు. పుట్టకమునుపు లేనివి, చనిపోయిన మీదట కనరానివి, మధ్యలో మాత్రము దోచు నవరంధ్రములతో, మూత్రపురీషములతో, దుర్గంధమగు హేయ సప్త ధాతువులతో, షడ్భావయుత దేహమునకే శూద్రత్వ, వైశ్యత్వ, క్షత్రియత్వ, బ్రాహ్మణత్వము లిచ్చినను, దేహములు దేహములే. దేహములు వర్ణములు కావలెనన లేదు. ఇవ్వకుంటే నేడ్వలేదు. ఎవ్వరితో చెప్పలేదు. జడములు, దుఃఖమయములు. నాలుగు వర్ణములు శబ్దత్వములకేగాని, దేహములకు, నింద్రియములకు, ప్రాణమునకు, నాత్మకుగాని సంబంధము లేదు. దేని పేరు దానికుండియేయున్నది. మనము తగిలించిన నవి తగులుకొనవు. ఏ యధికారము లేకుండ, పశువులవలె జేసిన, స్త్రీలరక్తముతో బుట్టిన పురుషుల కధికారములు నవ్వులాటలుగాక మతేమి? అద్వైతము నాకలింపు జేసుకున్న యనుభవజ్ఞుల వ్రాతలలోను, మాటలలోను, చెయ్దములలోను యీ నాలుగు వర్ణములు తల లెత్తుచున్నవన్న "దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యేద్బ్రహ్మమయం జగత్" అను ప్రమాణ మన్నృతమేమో యనవలసివచ్చుచున్నది. "స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః"నుండి "అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః, నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి" వఱకు స్వధర్మమును పాలించిన నైష్కర్మ్యసిద్ధి లభించునను విషయము పార్థునకు భగవానుడు జెప్పెను.

ప్ర॥ స్వధర్మమన్నప్పుడు క్షత్రియధర్మమేకదా? వర్ణములు లేకుండ యెక్కడ బోయినవి?

ఉ॥ స్వధర్మమన నాత్మధర్మమనియే యర్థము. నీవంటే, నేనంటే దేహములా? కాదుగదా! "స్వస్య రూపస్వభావః" స్వధర్మ మాత్మధర్మమగును. దేహధర్మమును వదలి, యాత్మబుద్ధితో కర్మల నాచరించునపు డనాసక్తియగును. శాస్త్రనియతకర్మలన్నప్పుడు నాత్మోద్ధారకములైనవి. ప్రపంచమునగల ప్రతిప్రాణి తనకన్న యన్యము గాదనియు, తనవంటి యభిలాషయే వానికి గలదనియు, నేజీవి కపకారమొనర్ప తన కధికారము

లేదనియు, ప్రతీకార మొనర్పదలపక సత్య ధర్మ దయాహింసల నడుచు వారి ధర్మమే స్వధర్మము. అదియె శాస్త్రీయము, మానవధర్మము. మానవుని మానవునిగా, జంతువుల జంతువులగా జూచు బుద్ధి, శాస్త్ర నియమము నుల్లంఘించదు, చిత్తశుద్ధికరములు, జ్ఞానయోగ్యములు, మోక్షదాయకములై భవబంధరహితములైన కర్మలే స్వధర్మములు. భగవత్ప్రీతికరములో, నాదర్శనీయములో, చేయుటలోనే సంతోషకరములో, సమస్తజీవుల కభిమానవంతములో, నరుణోదయమునవలె, పావనకరములో నవి సేవితకర్మలు. దేనినుండి బ్రహ్మాండము జనించి వృద్ధి నొందుచున్నదో, దేనియందు సమస్తము నివసించుచున్నవో, నాయాద్య తన వస్తువు సంతసించునది యగు కర్మ స్వధర్మము. ప్రతికర్మయు మోక్ష సిద్ధికేనని తెలిసిన ఫలకాంక్ష యుండదు. రంతిదేవు డొనర్చినది, రామకృష్ణు డొనర్చినది, శబరి యొనర్చినది, యుడుత యొనర్చినది, విభీషణ హనుమంతాంగద గుహాదు లొనర్చిన కర్మ, మహాత్మగాంధీజీ యొనర్చిన విశుద్ధ జగత్సేవ స్వధర్మకర్మములు. తన ధర్మము నాచరించుటలో కష్టము గలుగనీగాక, మఱెట్టి యశుభములు తటస్థింపనీగాక దాని పరిణామస్వరూపముగ మన కెట్టి యున్నతి గలుగునను విషయముపై ధ్యానముంచవలె. పథ్యముండుట కష్టమే, రోగము తొలగుట తెలిసిన పథ్యముండక తప్పునా? స్వధర్మము నాచరించుట కష్టమనిపించును. మోక్షము వచ్చుటెట్లు? చదవలేమా పరీక్ష ప్యాసగుటెట్లు? మనము నడచెడి త్రోవ వంకరయైనదియైనను గమ్యస్థానము చేర్చగలదు. పశువు గ్రుడ్డిదియైన పాల కొరత లేదు. తల్లి కుంటిదియైన యామె ప్రేమ కుంటిదికాదు. "సర్వం కర్మాఖిలం పార్థ" కర్మలన్నియు దేనితో పరిసమాప్తి నొందునో, అట్టి కర్మలు విడువరానివి. ఇది మంచిదిగాదని వదలిపోయిన నిక మంచి యెక్కడ? మొదలే యిల్లువెడలి భర్త యిల్లుచేర, నటనుండి యడవి, యటనుండి రావణు యశోకవనము జేరిన సీత కష్టములని యెంచిన తన స్వస్థాన మెట్లు చేరగలదు? రాముడు సంతసింప లోకములన్ని సంతసిల్లెనుగూడ. హనుమంతుని కార్యసాధన, సుగ్రీవ విశ్వాసకర్మలు ఆరాధకస్థితి గలుగువఱకు నాచరింపవలెను. ఒక వ్యక్తి భోజనము చేయును. అయ్యది లోనికరిగి

పచనమై దేహమంతకు పుష్టి నిచ్చుననియేకదా యుద్దేశ్యము. అట్లు స్నానము, నలంకారములు, కృషి, వృత్తి మొదలైనవి యాయొక్క వ్యక్తిలోని సర్వేంద్రియసహిత దేహముపై ప్రేమతో కర్మ యొనరించిన మాడ్కి సమస్తము హరిమయముగా జూచి, యాచరించు త్రికరణముల కర్మ స్వకర్మ యనిపించుకొనును. లేదా బంధమగును. తన దేహమునందలి యవయవములు తనవిగావనువా డెవ్వడుకలడు? అదే పరధర్మము. స్వధర్మమన తన బుట్టువునకు హేతుభూతములగు తల్లిదండ్రి తక్కిన మానవసోదరప్రపంచము సేవజేయుట, యట్లొనర్చక సన్న్యసించుట అపర ధర్మము. సన్న్యసించవలసిన కాలమున సన్న్యసించటము స్వధర్మమే. తగని కాలమున సన్న్యసించకూడదనుట స్వధర్మమే. నాకసమేలేదా శబ్ద గ్రహణ మెట్లగును? వాయు వెట్లువీచు, నీరెట్లు కదలు, నగ్ని యెలామండును, భూమి యెట్లుండును, ప్రాణమెట్లునిలువగలదు, మన మెట్లు బ్రతుకగలము? అన్నిటికి నాధారమాకసమువలె వ్యాపకమూర్తియగు పరమాత్మగలడు. అతనిని దెలిసి తన స్వీయకర్మమున నర్చించిన మానవుడు మాధవుడు కాగలడు. నరుడు నారాయణుడుగ సిద్ధి బొందగలడు. స్వధర్మము పురుషధర్మమే, స్త్రీ ధర్మము ప్రకృతిధర్మముకాదు. పురుషస్త్రీలన దేహములే. పురుషుడన పరమాత్మ, స్త్రీయన ప్రకృతి. అంతే కాని వేఱర్థముకాదు. స్వధర్మమగు పురుషుని తెలిసికొనుటకయ్యే సన్న్యసించటము, పరధర్మమగు ప్రకృతిధర్మము వదలుట. చక్కగా నాచరింపబడిన పరధర్మముకంటె తన వర్ణమును, యాశ్రమమును విధించు ధర్మము నంగహీనముగ ననుష్ఠింపబడినను శ్రేష్ఠమే. స్వభావజాతములగు కర్మల నీశ్వరార్పితబుద్ధితో నాచరించువాడు పాపము బొందడు.

ప్ర॥ ఇక్కడ వర్ణాశ్రమము విధించు ధర్మమని తామే యంటున్నారెందుకు? ఆత్మధర్మము దెలిసినమీదట బంధువుల వధించుట స్వధర్మమగునా?

ఉ॥ వర్ణమన యక్షరసంజ్ఞ, లేక మానవత్వము. ఆశ్రమమన గృహస్థము. గృహస్థుడు గృహములోనివారల, గృహాశ్రితుల మానవులుగా జూచడము స్వధర్మము. తన దేహమున కెట్లు సేవ జేయుచున్నాడో నట్లు గృహములోనివారల, తక్కంగలవారల సేవించటము. సేవించటములో

లోపము చేయక నాచరించునది పాపరహిత మొనర్చును. లోపముతో నొనర్చిన స్వధర్మ హానియగును. దేహముల వధించకపోయినను, మృత్యువుచే వధింపబడునవియే. దేహములకు బాధగాని, చావు పుట్టుకల దుఃఖముగాని తెలియదు. దేహముల నభిమానించు జీవులకే నీ తొందరలు. చచ్చు దేహములజూచి చావని దేహముల నభిమానించువాడు చత్తునని తలంచుటయేగాని, చచ్చే దేహములకు చచ్చుట తెలియదు. చచ్చునపుడు దేహికి తెలియదు. మోటారులో ప్రయాణమొనర్చువారు తమ గమ్యస్థానమునకు బోవుచుండ మధ్యలో బ్రేకు చెడి, మోటారు చెట్టునకు ఢీకొన మోటారు నాశనము, దానిలోనివారు చనిపోవుదురు. దీని కెవరు కారణులందువు? బ్రేకు చెడినంతనే కారులోనివారు మనకపాయము గలుగుచున్న దనుకొనుచునే ప్రాణముల బాసెదరు. తద్రీతి మనకు తెలిసియే ప్రాణవియోగము గలుగుచున్నది. ఒకప్పుడు తెలియక గలుగవచ్చు. దీనికి కారణము మనమేకాని యన్యులుకారు. అన్యులు నిమిత్తమాత్రమే. యుద్ధమున కెదిరించినవారు, తమ శరీరముల నభిమానములున్న యుద్ధమునకే రారు. అభిమానము లేదు; చచ్చుటో, జయించుటో నను కృతనిశ్చయులై యున్నారు. అటువంటప్పు డొకరిని చంపుటలో తమ యుద్దేశ్య మెద్దియో, చచ్చుటలో నదే యుద్దేశ్యమే యుండును. రామతీర్థ గంగలోని దుటికెనంటే, తాను దేహమునని గాని, జొచ్చునది గంగయనే ద్వైతభావముండిన నొకయడుగైన నుంపలేడు. తన్మయత్వములో దేహమెట్లుపోయినది వ్యావహారికములోని మనకు తెలియునుగాని, యాయనకు తెలియదు. స్వధర్మనిరతుడు చేయుట, చేయించుట యనునది వేఱువేఱుగ నుండదు. దీనినే యావేశమనెదరు. కుంతీనందనా! అని సంబోధించి యీ రహస్యము తెలిపెను. ప్రతికర్మ దోషయుక్తమే. దోషములేని కర్మలే లేవు. నిత్యనైమిత్తిక కామ్యకర్మలు గాని, తదితరకర్మలుగాని దోషయుతములే. దోషమని వదలితే జీవితమే జరుగదు. లౌకికములు, వైదికములగు కర్మలు శరీరమున్నంతవఱకు నవసరమే. దోషమంటే సవ్యమపసవ్యముగ నెటుజూచిన గనిపించును. నిషిద్ధములుగాని, విధివిహితములుగాని దోషములుగానే కనిపించును. అగ్ని

ధూమముచే నావృతమైన భంగి, కర్మలన్నియు నేదోషమో నొక దోషముతో గూడియే యుండును.

ప్ర॥ సర్వకర్మలు దోషయుక్తములే, వానిని స్వధర్మముగా జేయు టెట్లు?

ఉ॥ పొగను విడిచి యగ్నిని గైకొందుము. చలి, చీకటిపోవుటకు వగ్ని నుపయోగింతుము. కర్మములందలి దోషములు చూడక, నాత్మ దృష్టితో సేవించిన, యందలి గుణాంశము చిత్తశుద్ధినొసగగలదు. దోషాంశమునువదలి గుణాంశమును గ్రహించుట యెట్లగునన్న, పెరుగును మథించి వెన్నను బడిసి, మజ్జిగను వేఱు జేయుచుందుము. బియ్యమున రాయి, మన్నును వేఱుజేసి బియ్యమును గ్రహింతుము. అట్లే జడచైతన్యములు వేఱుజేసి యనాసక్తిపరుడై, నిరహంకారియై, ఫలాభిలాష లేనివాడై సాత్త్వికత్యాగమువలన సర్వకర్మనివృత్తిరూపమగు నైష్కర్మ్యసిద్ధిని ననగా జ్ఞానము నొందును. పండు మాగిన తొడిమె వదలును, ప్రయత్నమవసరము లేదు. కర్మత్యాగి, ఫలత్యాగి యిరువు రొకటే. స్వరూపమును తెలియక కర్మవదలిన, కర్మ యొనరించిన రెండు నొకటే. స్వరూపమును తెలిసి కర్మవదలిన వదలకున్నను యొకటే. మేఘము వర్షించురీతి, సూర్యుని జూచి మంచు తొలగిన రీతి, జ్ఞానికి నాసక్తియుండదు. ఒంటె పరోపకారార్థము మోపును మోయుటలేదా. స్వధర్మ స్వకర్మము పునర్జన్మహేతువు కాదు. నపుంసకుడు జవరాండ్రలోనున్నను దోషమురాదు. పుంసకుడు జవరాండ్రలో లేక తలంచినను దోషమగును. కావున నేలాటికర్మ లేగాని యాసక్తి గలిగిన బంధము దుఃఖకారకములగును. ఆసక్తి లేనివి కల్యాణదాయకములగును. "తదేతత్ ప్రేయః పుత్రాత్ ప్రేయో విత్తాత్ ప్రేయో ఆత్మానమేవ ప్రియముపాసీత" కుమారునికంటే, ధనముకంటే తన యాత్మయే తనకు ప్రియము. కావున యాత్మోద్ధరణకర్మ మనివార్యము. తిలక్ మహాశయులనను: చిత్తశాంతియే మరల లోకసంగ్రహార్థమై కర్మ లాచరించుటకు సాధనమనెను. ఒకచేత మట్టిని, యొకచేత రూపాయను బట్టుకొని గంగానదియొడ్డున రామకృష్ణుడు ఓ మన్నా! నీ చేత గోడలు తయారగును. ఓ రూపాయా! నీవల్ల కొంత సదుపాయ మున్నది. కాని మీరిరువురు మోక్షమివ్వలేరని గంగలో వైచెను. ఒక

సాధు దున్నను జూచుచుండ, నొకాయన యేలట్లు జూచెదవన, బ్రహ్మ మును గాంచుచున్నాననెను. రామకృష్ణు డహంకార నిరసమునకు సాక్షీవని చేసెను. గాంధీజీ యనుదినము నిట్టి కార్యముల జేయుచుండెను.

ప్ర॥ సిద్ధిని బొందిన వ్యక్తి యెట్టి నిష్ఠగలవాడై బొందబోవునదేది?

ఉ॥ "సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే" నుండి "మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి" వఱకు భగవంతు డర్జునున కుపదేశించెను.

ప్ర॥ ముందు చిత్తశుద్ధికరమగు నిష్కామకర్మ నొనర్చువిధము జెప్పి, యిప్పుడు చిత్తశుద్ధిని బొందిన వ్యక్తి బొందబోయే విధమును తెలుపుచున్నాడన నా దయామయుని గుణము వర్ణింప నేరికితరంబు! నానావిధ మానవుల యాశయసిద్ధికి నెన్ని సాధనల తెలిపెను?

ఉ॥ భగవంతుడు యుద్ధమధ్య ధనంజయుని యుద్దేశించి వచించిన ప్రవచనములు విను భాగ్యము, చదివి, వ్రాసి, చెప్పెడి యదృష్టము లభించినవారు నిజముగ నర్జునునివంటివారే యనవలె. చీకటిలో దెసచెడి ద్రిమ్మరు పాంథులకు వెలుగునిచ్చి, మార్గము జూపించును సూర్యుడు. నీరు దప్పిదీర్చు, వృక్షములు ఫలముల నొసగుగాని మోక్ష మీయజాలవు. దేవదేవుడు, దేవకీతనయుడు, లోకగురుం డజ్ఞానమను చీకటిలో తెరపిగానక జననమరణ సంసారరూప దుర్గమారణ్యముల దిక్కులేక దుఃఖితులైన వారికి జ్ఞానభాస్కరుని వెలిగించి సుఖమార్గంబున శాశ్వత స్వారాజ్యాభిషిక్తుల నొనరింప గీత బాడెనన్న మనపైగల దయగాక మఱేమి? సిద్ధిని బొందిన వ్యక్తి యే జ్ఞాననిష్ఠ ననుసరించి పరబ్రహ్మము నొందునో, యేది జ్ఞానముచేత పరిసమాప్తిరూ, నా జ్ఞాననిష్ఠా ప్రాప్తికరమును సంక్షేపముగ నర్జునునకు తెలియజేయుచున్నాడు. సంశయము, అసంభావన, విపరీత భావనలు, భూత, వర్తమాన, భవిష్యత్ప్రతిబంధకములు, జ్ఞానానికి ప్రతిబంధకములు. "బాఢం సంతి హ్యభార్థస్య హేతవశ్శ్రుత్యనేకతా। అసంభావ్యత్వమర్థస్య విపరీతా చ భావనా" శ్రుతులనేకములుగా నుండుట వలన, బ్రహ్మవిషయమున సంశయము గలుగుట, యఖండైకరసరూపమగు నద్వితీయబ్రహ్మవస్తువు లోకవిలక్షణవస్తువుగ భావింపకపోవుట యసంభావన. నేను కర్తను, నేను భోక్తను, నే ఫలానివాడనను యభిమానము

గలుగుట విపరీతభావన. అనుభవించినదే మాటిమాటికి జ్ఞాపకమువచ్చుట భూతప్రతిబంధకము గూఢమగు నాసక్తివిషయములందుండుట విషయాసక్తి. గురువులు చెప్పిన మహావాక్యార్థము బుద్ధికెక్కకపోవుట ప్రజ్ఞామాంద్యము. గురువు లానతిచ్చినదానికి విపరీతార్థము దోచుట కుతర్కము. నేను ఫలానివాడనను దేహాభిమానము విపర్యయ దురాగ్రహము. ఆగామి పాపకర్మవలన కాలనియతి దెలియకవచ్చుట భవిష్యత్ప్రతిబంధకము. సీతను వెతక వారిధిదాటు హనుమంతునకు సురస యడ్డపడినరీతి, రావణుని బరిమార్చి సీతాసమేతుడై వచ్చు రాముని విమానము లంకదాటి యావల కదలని భంగి, యుద్ధసమయమున కర్ణునకు బాణములు జ్ఞప్తిరానిపగిది, లంక చొరబోవ హనుమంతునకు లంక యడ్డపడినరీతి, జ్ఞానవికాసమునకు ప్రతిబంధకములు పైన చెప్పిన విషయములు.

ప్ర॥ అయితే వీని నెట్లు నివర్తింపజేసుకొని జ్ఞానమును ప్రకాశింపజేసుకోవలెను?

ఉ॥ "ఆవృత్తిరసకృదుపదేశాత్" అపరోక్షజ్ఞానము గలిగెడివఱకు మరల మరల సతద్వ్యావృత్తిరూపముగ నాత్మవిచారము చేయ శమషట్కమువలన విషయాసక్తి, శ్రవణమువలన ప్రజ్ఞామాంద్యము, మననమువలన కుతర్కము, నిధిధ్యాసమువలన విపర్యయ దురాగ్రహము నశించును.

ప్ర॥ ఎందుకట్లు సంశయాదులు గల్గును?

ఉ॥ "బహుజన్మదృఢాభ్యాసాద్దేహాదిష్వాత్మ వీక్షణాత్" దేహాదులే నాత్మయనియు, దేహేంద్రియాది జగత్తు సత్యమైనదిగ ననేకజన్మములందలి దృఢాభ్యాసమువలన ప్రతిబంధకమగును. "అనేకజన్మభజనాత్ స్వవిచారం చికీర్షతి" అనేకజన్మములందలి భజనాదులవలన గలిగిన సుకృతముతో నీ జన్మమున స్వవిచారాసక్తి గలిగి విధి ముఖ నిషేధముఖమున తెలియదగిన బ్రహ్మవస్తువు తానని నిశ్చయమైనంతనే సంశయాదులు తొలగును. వెంటనే ధైర్యము రెట్టింపగును. వైరాగ్యమున శరీరేంద్రియముల వశమొనర్చుకొని శరీరస్థితికి ప్రయోజనము లగువానినేగాక మిగిలిన శబ్దాదివిషయములన్నిటిని పరిత్యజించి దేహస్థితికి ప్రయోజనములగు విషయములందలి యనురాగద్వేషములు త్యజించి ద్వైతబుద్ధి నశించ యాత్మ

యందలి ప్రీతిగలిగి యే కొరతలు లేనివాడై బ్రహ్మ మొక్కటి మాత్రము తప్ప తక్కిన నామరూపాదులు మిథ్యలని నిశ్చయమైనంతనే కాలాను గుణ్యముగ సకల త్రిపుటుల నధిగమించి రాహువునుండి వెడలిన సూర్యుని భంగి, కడలి మథనమున జనియించు నమృతమువలె ప్రకాశించుచు, నాత్మ స్వరూపానుభవయోగ్యత పొందునో, నట్టివారు యే క్రమము ననుస రించునో నా లక్షణముల దెల్పెను. గురువు యాజ్ఞను వివేకమను మార్గము గుండా నిషేధముల వైరాగ్యవంతుడై బుద్ధియందలి మాలిన్యముల మననకొలనిలో కడిగి శుచిజేసి, యా బుద్ధిని నాత్మతో నేకీభవింపజేయును. శబ్దస్పర్శాది విషయములు భర్త లేని సతివలె నైపోవును. వమన మొనర్చి నది తిరుగ తిన కోరని భంగి, విషయవాసనలే దూరమగును. ఇంద్రియముల ధైర్యముతో నడవిజంతువుల వశమొనర్చుకున్న రీతి వశ మొనర్చుకొని, యిష్టానిష్టాదుల సమబుద్ధి గలిగి, హర్షశోకములు లేనివాడై యేకాంత మున విహరించును.

ప్ర॥ నిర్జనప్రదేశమున నెవ్వరులేని స్థలమనికదా యర్థము?

ఉ॥ అవును. తన యాత్మానుభూతికి ప్రతిబంధకములు లేని స్థలమనియు, నేలాటి వాసనలు లేని నిర్మలహృదయదేశమని యొకర్థము. ఏకాంతస్థితి యుభయత్ర లేనివానికి బ్రహ్మసిద్ధి దుర్లభము. ఏకాంతస్థితియే పరమ సత్యమగు పరమగతికూడ. ఈ క్రమము లనుసరించి బ్రహ్మస్వరూపము బొంద సమర్థుడైనవాడు, కర్తృత్వాదులనుండి విముక్తి నొందినవాడు, చిక్కినదానితో తృప్తినొంది కలంకములేని కొలనివలె నభేద్యమగు వైరా గ్యము గొడుగుబట్ట, వివేకము రాజయోగమార్గము జూప, శ్రద్ధాత్మాను రతి నొంద, బుద్ధి విషయముల మఱచ, మోక్షలక్ష్మినిగూడి జ్ఞాన విజ్ఞాన ప్రభ లనంతముఖముల నతిశయిల్లి సవిశేష నిర్విశేషములగు భగవత్స్వరూ పముల నొకే తత్త్వమున గ్రహించి యద్వైతబ్రహ్మసాక్షాత్కారము నొంద యభయుడై యుండును.

ప్ర॥ ఈ లోకముననే నీ శరీరముండగనే ముక్తుడగునా?

ఉ॥ అవును. సందేహము లేదు. ఈ లోకమున నీ జన్మముననే పొందని ముక్తి మరలెప్పుడు పొందెదరు? అహంకార మమకార బలదర్ప కామ క్రోధాదు లన్నిటిని రక రక మత్స్యములను నొక్కేతాటనుగూర్చిన బెస్త

వానివలె నాహమ్మను దారమునగూర్చి మమకారరహితుడై బ్రహ్మ
బొంద సమర్థుడగును. జ్ఞానమనే భక్తివలన భగవత్స్వరూపమును బొం
దును. అజ్ఞానము తొలగినంతనే ప్రతిబింబముండదు. ఎల్లెడల నేనే గాన్పిం
తును. జ్ఞానభక్తివలన నన్ను బొంది స్వాభావికరూపమున సమరసత్వము
నొందెడు భక్తుడు భక్తుడుగాడు. నేనేనని తెలిసికొమ్మని యర్జునునితో
భగవంతుడనెను. నారాయణుడను, శివుడను, శక్తిని, బౌద్ధుల, నిర్వాణము
జైనులసిద్ధి యనెడు సమస్తనామములు నావియే. ఈ యవస్థలో వివేక
ముతోపాటు వైరాగ్యము, మోక్షముతో బంధము, నివృత్తితో సర్వ
వృత్తులు నాశనమొందును. భగవంతు డర్జునునకు చెప్పిన రహస్యము
తిరిగి చెప్పుటకు, విన్నది మనస్సునకెక్కని జనులెందఱో యుందురు. వారల
నుద్దేశించి సిద్ధాంతవాక్యముల మరల జెప్పెను. మోక్షసంపాదనమునకు
నవిద్యానాశనమే ఫలము. ఈ రెంటికి జ్ఞానమే సాధనము. కర్మయోగి
తన స్థిరభక్తిచే నేనే యగుననికూడ భగవంతుడనెను. నన్నాశ్రయించి
సర్వకర్మల నాకే నర్పించి పురుషార్థమగు మోక్షమే దైవమని, బుద్ధిని
శుద్ధమొనరించి సమాహితచిత్తమున ననన్యశరణ్యుడై నన్నే శరణు
బొందమనెను. చూచితివా! ఇంద్రియజ్ఞానముచే తెలియదగిన విషయ
ప్రపంచమును నమ్మి ప్రపంచపరివ్యాప్తుడగు హరిని మఱచి చరించు
నాతని జీవితము నిరర్థకము. ఎక్కరాని కొండల నెక్కవచ్చు, ప్రాకరాని
యాకసమైన ప్రాకగలరు, మ్రింగరాని యగ్నినైన మ్రింగగలరు, గ్రహ
మండల తారామండలములనైన గ్రహింపగలరుగాని, రూపునామములేని
సంసారము నతిక్రమింప దుస్సాధ్యము. సంసారమున నొక నిమిషమైన
సుఖము లేదు. వచ్చేజన్మము లొచ్చుచుంటే, చచ్చేదేహములు చచ్చు
చుంటే సర్వానర్థకములు బడకతప్పదు. అందువలన భగవంతునియందు
చిత్తముంచిన భగవదనుగ్రహము గలుగును. ఆయన యనుగ్రహమున
సంసారము, దాని కారణము హరింపబడి ముక్తి గలుగును. ఎవరైన
హఠముతో, పాండిత్యాభిమానముతో, మరే యితర యభిమానముతో
భగవద్వాక్యము విశ్వసింపక స్వాపరాధుడైన పురుషార్థభ్రష్టుడగునని
చెప్పెను, అర్జునా! నీవు మాత్రము నా మాట విశ్వసించి నన్నే నమ్మి సర్వ
[illegible] నాశ్రయించి కోరికలు, చింతలు, బాధలు, బాధ్యతలు, భారములు,

యూహాలు లేనివాడవై నా యనుగ్రహమున పురుషార్థమును బొందుమనెను.

ప్ర॥ భగవద్వాక్యము నమ్మనివారికి పురుషార్థము లేదుకదా? బలవంతులకు భగవంతుడు కావలెనా?

ఉ॥ దుర్యోధనాదులలో భీష్మద్రోణకర్ణాదులు బలవంతులు కారా? ఆ బల మెవ్వరిస్వరూపము? అయ్యది యర్జునునిదిక్కు మొగ్గినది. ఇక వారేమిచేతురు? ప్రకృతిబలము లెన్నియున్న నేమి ప్రయోజనము! కరంటులేనిది యెంత పెద్దలైటులైతేనేమి? ఇంజను లేనిది యెన్ని పెట్టెలున్ననేమి? ప్రాణశక్తి లేకపోయిన నెన్నినాడులున్ననేమి? దైవబల మొందుచాలు. విద్యా, ధన, స్థాన, జన, దేహబలమిత్యాదులు భగవత్స్వరూపములే. వానిని విమర్శింపక యహంకరించి దురాగ్రహులైరేని, కొండను పొట్టేలు ఢీకొని మడియునట్లు మడియుదురు. మనోబుద్ధులు చెప్పినరీతి వంచింపబడి, యవిద్యాపరిభ్రాంతులై, దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకుటకంటె హరిజెప్పినరీతి జీవించుట మనకేమి కొంచెమా! మృత్యువనేయగ్ని, విషయసుఖముల పరిభ్రమింపజేసి, యొకతూరి తాను కబళించుటకు నాశజూపి తీసుకపోవును. బలవంతులమని గర్వించిన, బ్రహ్మరుద్రేంద్రాదులు, రాక్షసులు, పశుబలవంతులు, నియంతలు, దురాశాపరులు నీల్గుట మనము వినమా? గనమా? అంతయేల; భారతదేశము నాక్రమించిన యాంగ్లేయుల, యాటంబాంబులు గలవారల భగవద్భక్తుడగు మహాత్మాగాంధీజీ తన భక్తిచేతనే భగవంతుని ముందుంచుకొనియే జయించెను. ఎవరిబలము గొప్పదనెదరు?

ప్ర॥ భగవదనుగ్రహముగల్గితేనే మానవత్వమునకు శోభ. భగవద్భక్తి నిరంతరము నన్నుపాయకనుండుగాక! ఆవల భగవంతు డేమనెను?

ఉ॥ "యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే" అర్జునా! యుద్ధము చేయవచ్చి, యుద్ధమధ్యమున నిలిచి, పాపహేతువని దోచి యిప్పుడు యుద్ధము మానినను, నిన్ను మొదట నేను క్షత్రియుడనను, యహంకారస్వభావమే మరల నిన్ను యుద్ధమొనర్పజేయును. యుద్ధమొనర్పననే పట్టుదల శుష్కమగును. భ్రమ. నీ ప్రయత్నము వ్యర్థమే. నీ స్వధర్మ మెక్కడ పోయినది? నీ యందే యున్నది. సోపాధిక వైరా

గ్యము తలంచినప్పటికిని స్థిరముగ నుండనీయదు. అనాది వాసనామయస్వభావము కన్నులుమూసిన, గోడల పర్వతముల నడ్డముల దాటిపోవును. ప్రవహించునీటికి నడ్డలుగట్టినను, పల్లమునకు పరుగెత్తగలదు. "స్వభావజేన కౌంతేయ నిబద్ధస్స్వేన కర్మణా" కౌంతేయా! మోహముతో నేయుద్ధము నైతే చేయనని యిచ్ఛగింతువో, నిదేయుద్ధమును పూర్వజన్మసంస్కారమునగల్గు శౌర్యాదులచే నియమింపబడి లోనై, నీవు యుద్ధమొనర్చియే తీరుదువు. ద్రౌపది ధర్మజుని యింటనుండ, విప్రుని గోవుల దొంగలపహరింప, వారినడంప గాండీవమునకై, పోరాని ధర్మజుని యింటికి పోజేసినదెవరు? నీ స్వభావముకాదా! ఈశ్వరశక్తి నీయందుండియేయున్నది.

ప్ర: స్వభావమంత పట్టుదలగలదనెదరా? ఔనౌను. ఎందఱో మహాత్ములనో తలక్రిందొనర్చినది యీ స్వభావమే. అందు కర్జునుడేమనెను?

ఉ: ఒక బీజమున్నదనుకో. నేను మొలకెత్తనని యున్నది. నీటదడసినా వెంటనే మొలకెత్తెను. వథ్యమునుంటివి. వస్తువులు కనిపించకపోతేనేగాని, కనిపించితే పరిగ్రహింతువు. అడవినున్న యాకారమున్న స్వభావము నిశ్చలముగ నుండనివ్వదు. అర్జునుడు భగవదాజ్ఞ నంగీకరించెను. అర్జునునకే కాదు; సకల మానవులకు పరమరహస్యమగు బ్రహ్మతత్వమును బొందు సాధనమగు శరణాగతితత్వముపదేశించెను. "ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి, భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" ఈశ్వరుడు రంగులరాట్నపు బొమ్మల త్రిప్పువానిమాదిరి, తనమాయచేత తెరమరుగుననే సమస్త సూత్రములను సంచాలన మొనర్చుచుండును. సినిమాలోని బొమ్మలకు డైనమోవలె, తన మాయయనెడి డైనమోచే సచరాచర చిత్రసంజాతజీవుల నాడించుచుండును. ఏ యాకారము నైపుణ్యముతో సింగారించియుంచ, నీ జీవులందు ప్రవేశించి నేనే యీ దేహమనే భావబంధితులగుదురు. ప్రాచీన కర్మలనే సూత్రములచే హృదయమధ్యస్థ యీశ్వరుడు, జీవుల బుద్ధిపోకల గల్గించుచుండును. ఈనుపటి సూత్రములే నుత్తగగతికి కారణములగును. అర్జునా! అర్జునత్వమును నీయంగములకు తాకనివ్వకుండ, నీ మనస్సున వెడలుచున్న నేనున్నాను అనునెడిభావమే నహంకారమగు నా యీశ్వరునిరొక్క నిజ

మగు స్వరూపము. కావున నా యీశ్వరుడే ప్రకృతిశక్తిని వశీకరించుననెడి విషయమందేమాత్రము సందేహాము లేదు. నేను చేయుటము వ్యర్థము. ఇక సకల జీవులు నాయన శరణుజొచ్చుటయే సులభ మార్గము. ఒక గృహ ములో ప్రతియొక్కరి యోగక్షేమముల నా యింటి యజమానుడే జూచును. తల్లి తన బిడ్డల బ్రతుకు చూచుటలేదా! ఫలములు, ఫలకారక ములు వేఱు. విషయముల మోహామేల? ధనవంతుడైనగాని దరిద్రుడు కావలెనని కోరునా? భగవత్కృపతప్పిన ధనవంతుడుమాత్రము దరిద్రత యనుభవింపక తప్పునా? ఎన్ని బానసజేసిన వేశ్య, యొక్కవ ధనమును జూప మఱోకపతిము నిచ్ఛగింపకుండునా? భక్ష్యభోజ్యములనిచ్చినను, కుక్కయెముక కసిపించిన నూరకొనునా? అనాథలయొద్ద బలవంతముగ సొత్తు నపహరించువారలజూచి బలవంతు డూరకొనునా? యుండదు. ఆలాటి స్వభావమును చిన్నతనములో తలిదండ్రులు, వయస్సులో మగడు, ముసలితనమున కొడుకుల యధీనములో నేవరొనరించు స్త్రీవలె, నోటి లోని నాలుకవలె, చేతిలోని కలమువలె, "తమేవం శరణం గచ్ఛ సర్వ భావేన భారత" యను ప్రమాణమును వినిపించెను.

ప్ర॥ భగవంతుడు తాను చెప్పుచున్నాడు. ఒక్కొకచోట నన్నే యాశ్రయించు మనును. ఇప్పుడు "తమేవ" యాయననే శరణుజొచ్చు మనుచున్నాడు. ఈలాటి శబ్దార్థము లనేకములున్నవి. ఏమని యర్థము చేసికోవలెను?

ఉ॥ ఈశ్వర త్రిశరీరాభిమానులగు సూత్రాత్మ, వైశ్వానర, యంత ర్యాములున్నారు. ద్వైతవిశిష్టాద్వైత మద్వైతమతస్థులున్నారు. గీత యందఱకు ప్రమాణగ్రంథమే. ఎవరెట్టిభావమున నర్థమొనరించుకొన్న, నట్టి యభిప్రాయమొనగ తన మహిమను జూపించెను. తత్పదలక్ష్యమగు నా బ్రహ్మమే నీవు, నీవే నది. దానికన్న యన్యములేదు. నేననునది యదియే. నీవదియే నని యొకర్థము. సర్వభూతాంతర్యామినే శరణు జొచ్చుము. నీ కర్తవ్యములన్ని యాయనకే వదలుము. ఆయన కృపవలన పరమశాంతమగు మోక్షము బొందగలవనెను. ఇది యొకర్థము.

ప్ర॥ అన్నిమార్గములకంటె నీ మార్గము చాల సులభము. నాది, నేను యనేచోట నహంకారముండును. అదియుండిన నన్నియుండును.

నేను యనుచోట నీవనునది యుంచిన జీవితమునకే యలంకారము. 'తత్' యనునది నీవేయనుట. నేను నీవే యని యర్థము. ప్రతిబింబము బింబముననుట. రోగములేదు మందేలా? ఆకలిలేదా యన్నమేలా? కర్తృత్వాద్యభిమానాహంకారమే లేదా ఇక బంధమేది? భయమేది?

ఉ॥ అహంకారము లేదా, కర్తృత్వముండదు. కర్తృత్వములేని వ్యావహారిక లౌకికజీవితము భగవంతునిపై నుండును. భగవత్ప్రాప్తికి నిరహంకారమె సుకరము, శివకరము. ప్రపంచమున నమరజీవులైనవారు హరిపరాయత్తచిత్తులేకదా! రాధకుండెడి ఘనత సత్యకేల లేదు? రుక్మిణీ, యక్రూర, యుద్ధవ, గోప, గోపిక, గోవులకు, సంజయ, విదురాదులకుండు ఘనత వారి సమకాలికుల కేల లేదు? హరిచేరి మురళీ, శంఖ చక్రాదులకుండు ఘనత పౌండ్రకుని కల్పితవస్తువుల కెక్కడిది? హరి విశ్వమయుండు. హరిమరుగుజొచ్చిన విశ్వమయులగుదురు. "ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా" అతిరహస్యములగు మంత్ర లయ హఠయోగములకన్నను గుహ్యమగు నీ గీతాతత్వమును నీకు జెప్పితిని. దీనినంతటిని బాగుగా నాలోచించి నీకు మంచిదని తోచిన రీతి జేయుమని యర్జునునితో భగవంతుడనెను. నీవెవ్వరైనది, నేనెవ్వరైనది, యీ విశ్వమెవ్వరైనది, స్వధర్మమెయ్యది యను రహస్యము దాచుకొనకుండ నీకు జెప్పితిని. అట్లు చెప్పుటకు నీ శ్రద్ధాభక్తులే కారణము. 'ఒకతూరి నేను చెప్పగా నీవు విన్నదానిని సింహావలోకన మొనర్చుకొనుము. బంధుభావముతో జెప్పలేదు, నరనారాయణభావముతో జెప్పితిని యన నర్జునుడు స్తబ్ధుడయ్యెను, పలుకడయ్యెను. అది భగవంతుడు గ్రహించి యింకను జెప్పవలసియున్నట్లు గ్రహించి "సర్వగుహ్యతమం భూయశ్శృణు మే పరమం వచః। ఇష్టోఽసి మే దృఢమితి" చెప్పవలసినదేమిలేదు. మన ముఖముల జూచుకొను యద్దముల మనమే శుభ్రమొనరింతుము. నిన్ను నిమిత్తముజేసి నాకై నేనే జెప్పుకొనుచున్నాను. అద్దములోని ప్రతిబింబమును నిమిత్తముజేసి, తనకై తాను శంకాసమాధానములు నొందు వ్యక్తివలె. కర్పూరము కర్పూరముగా నుంటె కర్పూరమందురు. అగ్నిలో కలిసితే నగ్నియే యనెదరు. నల్లనిమందుగల నిప్పుపుల్ల పెట్టెపై రాపిడి నొనరింప నలుపు లోపించి వెలుతురు గలుగుచున్నది. అహంకారమే

నలుపుచుండు. శ్రవణమననాదులచే దాపిడి అహంకారము తొలగినా నీవు నేననేదేమున్నది? కాష్ఠమును మథించిన నగ్ని బుట్టి కాష్ఠమునే దహించును. అజ్ఞానమును బాధించగా వెలసిన జ్ఞానమునే నజ్ఞానము బాధింపబడిన నజ్ఞానకార్య ప్రపంచమే లేదు. ఇది లోకమాట. అనగా నదియొక రూపము. అందులో నొక నిడుపాటి కొయ్యనుంచ నిప్పుడు నుయ్యి యెన్నిభాగము లైనది? రెండు. కొయ్యనుతీసిన యొకటియే, కొయ్యయుండిన నొకటియే, కొయ్య వేయకమునుపు నొకటియే. అక్షేత్రజ్ఞ మవిద్యా మనునది నిన్ను నన్ను వేఱుజేసినది. అవిద్య లేనపుడు నేనే, కలదియున్నపుడు నేనే, యది తొలగినను నేనే, నీవను భిన్నత్వమునకు, ద్వైతమునకు నవిద్యయే, నవిద్యయే బాధింపబడి నింకేమనవలెనుయను. అవిద్యయే నహంకార మగును. అది పూర్తితొలగినముడి మరల కలుగకుండ "మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు" వివాహము కాకమునుపు స్త్రీ యెవరో- పురుషుడెవరో వివాహమైనదా. నేను భార్యను, నేను భర్తను యనుకొనుట చూడుమా! స్త్రీ తన వ్యక్తిత్వమును భర్తతో నేకత్వ మొనరించును. శిష్యుడు గురువునందేకత్వమొందును. తత్ప్రకారము అర్జునా! నీచిత్తమును నాకు పీఠగ నొనరింపుము. బుద్ధిని నా కైంకర్య పనివతిగానుంచుము, యింద్రియముల యజ్ఞసంభారముల నార్జింపనుంచు, చెవులు సత్కథల విన, కన్నులు సద్గ్రంథముల, సత్పురుషుల, సత్కార్య ములజూడ, నాలుక నానామముల నుచ్చరింప, నా యజ్ఞాన్నము భుజింప, నోరు నన్నె పలుక, చర్మము నన్నెస్పర్శింప, నాసికములు నన్నె యాఘ్రాణింప, చేతులు, కాళ్లు నాపనిలో నియోగించు, "తచ్చింతనం తత్కథనం, అన్యోన్యం"అనురీతి శంకరుడు మానసిక భక్తిని వర్ణించెను. "ఆత్మా త్వం గిరిజా మతిః పరిజనాః ప్రాణాః శరీరం గృహం, పూజా తే విషయోపభోగ రచనా, నిద్రా సమాధిస్థితిః। సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వాగిరో,యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్॥"అన్న పగిది, శరణాగతి, లేక సేవకభావముతో రెండవవాడున్నాడను స్మృతిని వదలుము. జ్ఞానవిషయమిదియే. నీపై ప్రేమచేత నేను నీవై తిరదా! సంశ యింపక యొట్టుబెట్టుకొనుము. నేను యొట్టుబెట్టుకొనియే చెప్పుచున్నాను. నిక్కముగా నీవే నేను. నేనే నీవు. ఇందుకే గీత జోకొట్టి జోలపాడు

చున్నది. అనేక దృష్టాంతములతో నీవు నేనే యను జ్ఞానమే గీత. దీనిని సమగ్రముగ పాలింపుము.

ప్ర॥ గృహస్థుడైనవానికి భార్యా పిల్లలు, పశుధన మిత్ర భృత్యాప్త బంధువులాదులుందురు. గృహస్థధర్మము లాచరింపవలసివచ్చితే నప్పుడు భక్తి యెట్లు చేయవలె? భగవంతుని యా సమయముల మఱువవచ్చునా?

ఉ॥ కాముకురాలు తను వలసిన పురుషునిపై ప్రేమతోనే సమస్త పనులు చేయుటలేదా? గొప్ప యాదాయము రానున్నదన, దానిదృష్టి యందుంచుకొని కర్మము లాచరింపటములేదా? విధవ నేను విధవననియే సంచరించును. సేవకుడు సేవకుడననియే సంచరించును. యజమానినియని యనుకొనునా? శరణాగతిజొచ్చినవా డంతర్బహిరంగముల తాను పర మాత్మననియే సేవించును. సీతను త్రిజట యడిగినది — నీవు రామరామ యని కలవరించి రామునివైతే రాముని గతేమన, సీతసీతయని యాయన సీతకాగలడని సీత జవాబిచ్చెను. ఖజానావద్దనున్నవాడు ప్రతి దినము పైకము యివ్వటము, పుచ్చుకొనటము జరుగుచున్నను, నాది కాదని తెలిసియేకదా యొనరించును? అట్లులేక ప్రేమ యొకవంకనుండి, యొకప్రక్క పూజలొనరింప వ్యర్థము. కర్పూర తాంబూల నారికేళ పత్రపుష్పాక్షతలు, పండ్లు కైంకర్యమునకు తెచ్చునపుడు భగవంతుని వనియేకదా తెచ్చుచున్నాము! ఈమాదిరి యొనరింపటమేగాక, నవ యవములు వేయువేలైన, గృహము, గృహములోని యనేకవస్తువుల నావియనుచున్నపుడన్నియు యేకైకమైనరీతి, గృహస్థుడు తనలో గృహ ములోని వన్ని భగవంతునివే భగవత్స్వరూపమే యనుకొని సులభ ముగా సంసారము తరించును. "సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ। అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" దుఃఖింపవలదన, నర్జునునితో భగవంతు డెందుకన, సమస్త ధర్మాధర్మముల యనుష్ఠానము పరిత్యజించి నన్నే శరణుజొచ్చుమనుచున్నాడే, తక్కినవి యేలాగని, యింతకుమునుపు నీవడిగినవిధము దుఃఖింప యీ మాటనెను. సర్వాత్ముడును, పరమేశ్వరుడనగు నన్ను శరణుబొందుము. నేనుగాక మరేమి లేదని దృఢముగ నిశ్చయించుకొమ్ము. ఈ విధముగ నిశ్చయబుద్ధిగలవాడ నైతే నాకేమి ఫలమని చింతింపవలదు. నేను నీకు నా స్వరూపమును ప్రక

టించితిని. నీ కేదేదిగలదో నదియంతయు నన్నుగా జూడుము. నాకంటె నన్యముగా జూచుట యధర్మము, నన్నుగా జూచుట ధర్మము. పుణ్యపాపముల నుండిముక్తినొందవచ్చును. ఇదియే ఫలము. వర్ణధర్మము, ఆశ్రమధర్మము, సామాన్యధర్మములని యెన్నియో యున్నవికదా! వానినన్నిటిని వదలుమనియు, నా యన్నిధర్మముల నన్నొకనే ప్రతిష్ఠించుచున్నప్పుడు దుఃఖము వచ్చినది. వానియందలి ప్రాతయభిమానముల వదలలేక సన్న్యసించువాడు, పుట్టింటనుండి యత్తవారిల్లు జొచ్చుయువతి, పెనిమిటి చావ విధవయగు యువతి, శిక్షచెప్ప జయిలున కేగువాడు, దారితప్పి యడవిజేరినవాడు, శత్రువులచేజిక్కినవాడు తమతమ పూర్వస్థితుల స్మరించుకొందురు. అదే విధము నన్నియువదలి నన్నే శరణుబొందితే తక్కిన దేవతలు దుఃఖితులెట్లు, నందువలనగలిగె ప్రత్యవాయము లెట్లుయనిగూడ దుఃఖము రావచ్చు. ఒకడు చిన్నయుద్యోగిగానుండి ప్రభువుయగును. అప్పుడు తక్కిన వారితో నేనెట్లమెలగేదన, ప్రభుధర్మముతోనే మెలగవలె. అవిద్యావృత్తితో నేనర్జునుడను, కుంతీపాండుభూపతుల తనయుడ, యుద్ధవీరుడ, సమస్త బంధు వర్గముగలవాడ, రాజ్యాభిలాషిని, యుద్ధమధ్యముననుంటి యనుకొనెను తొలుత. కాని యిప్పుడు జ్ఞానవంతుడై దేహేంద్రియములకు, నవస్థాత్రయములకు విలక్షణమై, బ్రహ్మాండమునకు నధిష్ఠానమై, సర్వసాక్షియగు చేతనపరబ్రహ్మమేనేను. జడవస్తు వెద్దియుగాదని తెలిసెను. ఆ పూర్వస్మృతి, యా ద్వైతబుద్ధి, నానాత్వము కంగారుగలిగించ, దర్పణముకై వడి, గురుదేవుడగు నచ్యుతుడు నాతని కౌగలించుకొనుటలో నిరుపరోక్షమై, 'సర్వధర్మాన్' సమస్త యారాధ్యదైవము లుపలక్షణములు లేదా కల్పితములు. నేను వేఱు, నీవు వేఱుగజూచు దేహాత్మబుద్ధి 'మాం' నన్ను 'ఏకం' ఒక్కటిగ, నంటే నీవేవిధర్మములు దైవతములని తలంచితివో, నవియన్నియు నేనే. అటువంటప్పుడు నీవునేనే, నేనే నీవు; నిక దుఃఖించుటకు భేదభావములేదు గాన "మాశుచః" యనెను. "నావిరతో దుశ్చరితాన్నాశాంతో నాసమాహితః" బ్రహ్మవిజ్ఞానముచేతనే నాత్మప్రాప్తి శక్యమగును. శ్రుతి, స్మృత్యవిహితమైనట్టియు, శ్రుతిస్మృతి ప్రతిషిద్ధమైనట్టియు, పాపపుణ్యకర్మములనుండి విముఖుడో, నింద్రియ చాపల్యవిముఖుడో, సమాహితచిత్తుడో, పుణ్యలోకాదులగూడ నభిలషిం

పడో నట్టినాడూ గుర్వనుగ్రహము బొందును. ఆత్మసాక్షాత్కారత బొందును. పాపములన్నియు విడువబడినదో, పుణ్యములన్నియు విడువబడినదే. దేహేంద్రియముల శరణుజొచ్చుటకాదు, సర్వవ్యాపకమగు తన్నే ననగా ఆ వ్యాపకమూర్తి తానే యను దృఢభావనతోనే శరణుజొచ్చుట. శుద్ధ భక్తి కేవల శుద్ధజ్ఞానము రెండు నొకటియే యనుట, అంతా తానే యిదియే భక్తి. సర్వము నేనే జ్ఞానభక్తి. అంతా సత్యము. తానే సత్యము. సర్వము నేనే, సర్వముసత్యము. తాను సర్వము. "యథానద్య స్స్యందమానా సముద్రేఽస్తంగచ్ఛంతి నామరూపే విహాయ" నదులు తమ నామరూపములవీడి, సముద్రమే యెటులై పోవుచున్నవో, నవిద్యా సంబంధమగు సర్వరూపనామములను పరిత్యజించ "అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపంచకం। జగద్రూపం తతోద్వయం" జగద్రూపము బాధింప నస్తి భాతి ప్రియులక్షణుడగు సచ్చిదానందపరబ్రహ్మమే నైజైక రూపము. ఇదియే రహస్యము. విషాదయోగమునుండి యింతవఱకు నడిచినదే గీత. ద్వైతవిశిష్టాద్వైతాద్వైతార్థముల త్రిమతస్థులు, గీతా శ్లోకములకు భాష్యములు వ్రాసిరి. ఆ విషయము వినుపింతు వినుము. సమస్త జీవుల యాశయము, స్వాతంత్ర్యత, స్వేచ్ఛ, నిత్యసుఖముతప్ప మఱేమికోరవు. ఈ యాశయము శాస్త్రీయముగాదు. స్వాభావికము. ఆశయసిద్ధికి సాధనలే శాస్త్రనిష్పన్నములు. అంతేగాక నీ జీవులకు పైగా నొక యధికారియుండి శాసించటము ససేమిరా సుతరాం యిష్టము లేదు, ఇక నుపనిషత్తులందమూ అనేక దేవతలగాని, యేకేశ్వరునిగాని యొప్పుకొనవు. లోకపాలకు లనేకులుగలరను భావమే కాదు. దుస్సహ మైనది. ఈప్రపంచ మొకరిపాలనలో నున్నదనుభావముగూడ దుస్సహమే నుపనిషత్తులకు. సగుణదేవుని. జగత్పరిపాలకునే యొప్పవు. జగమే దబ్బర యైన పరిపాలకుడెక్కడ? మఱియు నిర్గుణతత్త్వమునొక్క వ్యక్తత్వమే సగుణమనును. నీటియొక్క సగుణత్వమే యుప్పు, చక్కెరయొక్క సగుణ త్వమే చిలకలాదులు, నిర్గుణముయొక్క సగుణరూపమే జగమనును. ఏదేశములోనో దైవమున్నాడనునది నమ్మవు. అది నమ్మక సర్వాంత ర్యామియైయున్నాడను నమ్మకము యిప్పుడు లోకమునకు గలిగినది. ఉప నిషత్తులలో పరిణామక్రమము వివరింపబడినది. 'తత్త్వమసి' అది నీవేయను

నదియే ప్రతియొక యుపనిషత్తు తుదిమాట. ఇదియే మహారహస్యము, అనుభవార్థము. ఒక్క నిత్యానందతత్త్వముతప్ప మఱేమిలేదు. అద్వ్యాదియే యీ నానాత్వముగా, దూదివస్త్రములవలె వ్యక్తమగుచున్నది అని యుపనిషత్తు లీ సిద్ధాంతముతో తామెచ్చిన కార్యమును ముగించుకొనెను — మద్రాసు, ఆంధ్ర సరిహద్దుల [illegible]నము చేయువారు, ఇది మీది, యిదిమీది యని హద్దుల తీ[illegible]ంచి వెళ్ళులాగు. తదనంతరం వీరుచేసిన తీర్మానము సరియా? కాదా? యని తర్కించువారివలె, నుపనిషత్తులవెనుక తత్త్వవిచారపరులు వచ్చిరి. ఉపనిషత్తుల మూలభావమునకు సూత్రాంశవివరణ మొనర్చుటే వారిపని. అప్పు డనేక సమస్యలెదుర్కొననగుట యొక వింతయా! ఈ భారతదేశము మాదేనని ఋజువుపఱచి, యాంగ్లేయుల గెంటివేయుట కెన్ని ప్రతిఘటన లెదుర్కొనుట మనకు తెలియదా! ఒక నిర్గుణతత్త్వమే నీ నామరూపాదులతో గోచరించుచున్నదని యంగీకరించినచో నేకత్వము బహుత్వమెట్లైనది? ఈ సమస్యయే నాటినుండి నేటివఱకు ప్రతివారి హృదయమున కలవరము గలిగించి, బాధించుసంశయము. ఒక్కటే యనేకమైతే యీ సుఖదుఃఖములు, స్వల్పాయువులు, వయోవృద్ధులు, నుచ్చనీచములు, మేలుకీడులు, వ్యత్యాసములు కలుగుటకు కారణమేమి అని తామున్న యింద్రియగద్దియను వదలి, తత్త్వవిచారగద్దియనుండి యడుగుటయు, నపరిపక్వరూపమున, ప్రతి మానవహృదయమున నీ సమస్య నిలిచియున్నది. అయితే నీ నానాత్వమునకు కారణమేమంటే మాయ యని సమాధానము యెప్పుడో యియ్యబడినది. ఇదియే సత్యోత్తమమైన సమాధానమని తేలుచున్నది. గీత సప్తమ, నవమాధ్యాయముల విశదీకరించినది. విమర్శకుల కీయకే భావము నొప్పుదల కాలేదు. మాయావాదము నంగీకరింపరు. ఎవరు? వీరే ద్వైతులు. మఱియు నీవిచారమును నారంభముననే ఖండింపజూతురు. చెప్పుట కవకాశమే నివ్వరు. వారిట్లందురు. ప్రశ్నవేయుటకుగాని, దానికి సమాధానము కోరుటకుగాని, మఱొకటి యాలోచించుటకుగాని, మీ కధికారము లేదందురు. అది యీశ్వరేచ్ఛ, దానికి మనము లొంగియుండవలెను. నోరెత్తకూడదు. మన యాత్మలకు స్వతంత్రత లేదు. మనమేమి చేయునది, మనమేమి పొందునది, మనమేమి

యనుభవించునది సర్వము ద్వైతము యిప్పటికే నిర్ణయించినారు. వచ్చే విపత్తులను ప్రశాంతముతో ననుభవించుటే మనధర్మము అట్లానవ్వ మేని ఇకను ఘోరకష్టము లనుభవింప విధింపబడుదురు. ఈ విషయము మీ కెట్లు తెలియుననగా, వేదములట్లు చెప్పుచున్నవందురు. వారి ప్రమాణ ములకును, యా వేదప్రమాణములకు, వారు కల్పించు నర్థములకు నంగీ కరించి యా ప్రకారము నడచుకొనుట మనవిధి యందురు. ఇది నియంతృ పరిపాలనమువలె వీరి శాసనము నట్టిదే.

ప్ర॥ వేదముల యర్థము, నద్వైతులు చెప్పిన యర్థముగాక, వేఱే యర్థమును ప్రతిపాదించునా ?

ఉ॥ ప్రతిపాదింపనిచో యద్వైతము, విశిష్టాద్వైతము, ద్వైతము, శుద్ధాద్వైతము, నచింత్యభేదాభేదము, భేదాభేదము, సమన్వయము, శివాద్వైతము, నార్యమతే, బ్రహ్మమతము, దివ్యజ్ఞానసమాజము లిత్యా దులనేకము లెట్లురాగలవు? ఏకనుండి ఒకరు 0 నెంబరు దారముదీస్తే తదితరులు 12 - 14 - 15 - 60 - 80 - 100 - 120 నెంబరు దారము తీయుట మనమెఱుంగనా! ఈ దారములజూచి పదవనెంబరుదారము దీసినవాడు గ్రహింపడా! అయినను దానితోను లోకమున కవసర మిండియేయున్నది. అటులనే ద్వైతుల వేదార్థప్రతిపాదన ప్రమాణ ప్రకారము వారు త్రికరణముల నడిచి తేచాలు. తెరచాటు విషయము తెలిసికోగలుగుతారు. భావతర్కమునకు, శుష్కతర్కమునకు, క్రియా రూపమునకు భేదమున్నది. భావముతోటి విషయమును, క్రియలో గనపరచలేనపు డేమఱ్ఱైన పతనమగుట తథ్యము. క్రియాభావములు రెండొకటై తేనే మతవిస్ఫూర్తి. మతాంతరత్వము ధ్రువము గాగలదు. మాయావాదము నొప్పక, ద్వైతవాదము నొప్పక మధ్యమతస్థులే విశిష్టాద్వైతులు.

ప్ర॥ వారి సిద్ధాంతమేమి? వారేమనెదరు?

ఉ॥ అది ప్రవృత్తిమార్గము. ఈ సృష్టియంతయు నీశ్వరుని శరీర ముగ భావింపదగు ననెదరు. ఆత్మ లన్నిటికిని, ప్రకృతికంతటికిని యాయు నదే యాత్మ. జీవులయాత్మలు దుష్కృతములచే ముడిచికొనిపోవును. అప్పుడు వారిప్రభావము సన్నగిల్లుచుండును. మరల సత్కార్యముల

నొసల్చినగాని, జపుని పిలిచి నోంగవందురు. అయితే హిందూదేశము మతములన్నికూడ సామాన్యభావము గలవియే. అన్నిమతముల కీ భావము గడియేయుండును, విచారావిచారభేదమే మతభేదముకాదు. మానవుని దివ్యత్వమనునదే నీ రహస్యము. మనకు తెలియవలసినది జీవుడనగా నెవడు? భగవంతుడన నెవడు? ప్రపంచమేమిటి? ఈ జీవదేవులకుగల భేదము సత్యమా? యసత్యమా? అను విషయములో నేకదా! ఎవరెవరి యూహకందినరీతి భావింతురు. స్వామి వివేకానంద సిమ్హాగర్జనలో నీ విచారము విశదమొనర్పబడినది. తెలియగోరువారు వివేకానందజ్ఞానయోగము చూడుడి. "సర్వధర్మాన్" శ్లోకమునకు త్రిమతస్థులభావము తెలిపితిని. భగవంతుడు పరిపూర్ణుడు; నిరాకారుడు. "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్" ఎవరేలాగు భావించి భజించితే, వారి ననుగ్రహింతుననెను. చక్కెరతో యొక్కటేయైనా యెవరెవరి యిచ్ఛననుసరించి యాలాగు తయారుచేసి భుజింపచేయుదురు. భగవంతునిచే యనుభవింప, తమతమబుద్ధుల ననుసరించియే యనుగ్రహము బొందుదురు. భగవానువాచ - అనుటబట్టి కృష్ణుడుగాదనియు, విభూతియోగమున "వృష్ణీనాం వాసుదేవోఽస్మి" యాదవులలో వాసుదేవుడననెను. ఈలాటి యాయన భావములగుర్తింప నెవరికగును? సముద్రము నదుల ప్రేమించటము, బీజము శాఖల ప్రేమించటము, విశ్వములోని సమస్తమాత్మ ప్రేమించటము, విశ్వమును భగవంతుడు ప్రేమించటము, తమతమ స్వరూపముల బొందుటకొఱకే. సకల జీవుల యాశయము భగవంతుడే. తానే యన్నిరూపులు, తన్నుగలియుటే నాయన యుద్దేశ్యము. ఇదే సత్యము. ఆస్తికులుగాని, నాస్తికులుగాని రెండుపక్షములు భగవంతునివే.

ప్ర: భగవంతు డెందుకు నీ గీతాశాస్త్రము నెవరికి చెప్పవద్దనెను?

ఉ: "ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన" భగవంతుని యుద్దేశ్యము మనము గ్రహించుట కష్టము. సకల మానవుల నుద్దేశించియే చెప్పినపుడెవరికి చెప్పవద్దని యనటము చెప్పుమనియే యర్థము. ఒకప్పుడు రామానుజులు, గురువెవరికి చెప్పవలదన్న మహామంత్రమును గోపుర మెక్కి సమస్తజనులకు బోధించెను. నేనొకమున కేగినసరే, లోకక్షేమ ముంటే చాలుననుకొనెను. వినకూడదనేటుగానుంటే, యుద్ధమధ్యమున

యిరుపార్శ్వములవారు విన నేల గర్జించి యర్జునునకు జెప్పెను? అయితే నెందఱు గీతామృతము గ్రోలిరి? అర్జునుడొక్కడే. తత్ప్రకారము లోక దృష్టిలో చెప్పినమాటకైన శ్రద్ధగలిగి వినవలెనని యనినదేకాని వేఱు గాదు. తపస్సు చేయునివానికి, గురుభక్తి, యీశ్వరభక్తి గలుగనివానికి, భక్తుడు, తపస్వియైనను, వినగోరనిచో చెప్పగుము. వాసుదేవుడనగు నన్ను సామాన్యమనుష్యునిగ దలంచి, నా యీశ్వరత్వ మంగీకరింపని వారికి చెప్పవలదనెను. తపస్సు, భక్తి, వినగోరటము, నాస్తిక్యము నివి బొత్తిగాలేనివారు గలరు. ఈ నాలుగొక్కనియందే కలవారుగలరు. ఒక్కొక్కరిలో నొక్కొక్కటియే గలవారుగలరు. ఇదొ బజారు. ఒకటి బియ్యమంగడి, మఱొకటి పండ్లంగడి, బట్టలంగడి, నూనెయంగడి యీ నాలుగంగళ్లవారికి తమ యంగడిసరకుల మంచిచెడ్డ, లాభనష్టములు తెలుసును. కాని తక్కిన యంగళ్ల మంచిచెడ్డలు తెలియవు. రకములన్ని యొకే యంగడిలోనున్న యన్నిసంగతులు తెలియును. కొనెడివారికి నొక యంగడిలో నొకటి, మరొకంగడిలో నొకటి కొనటములో కష్టనష్టములు తొందరయుండును. లేక తక్కినయంగళ్లు లేవేమో యనుకోవచ్చు. లేక నంగడివాడే తనయంగడికంటె వేఱంగళ్లున్నవంటె వానిపై యాశచే తన యంగడికి రాబడి తగ్గునని లేవనవచ్చును. అన్నిటితో పనిబడి విచారింప శక్తిగలవాడైతేనేతప్ప తక్కినవాడు తిరిగి విచారించలేడు. తపస్సొకటే గలవాడదే గొప్పనుకొనును, భక్తుడు భక్తి గొప్పనుకొనును, ఇష్టము లేనివాడు విననిదే మంచిదనుకొనును. భగవంతునియందు నమ్మకములేని వాడు మనుష్యుడే ననుకొనును. ఇట్లు లేకుండయుండు వ్యక్తులేనుండరు. ఈ నాలుగొక్కనియందుంటే గీతాశాస్త్రము సులభముగా తెలిసికొని, తోడిసోదరమానవులకు నందించును. కొనుటకు కష్టములేకుండ గుజరాతీ భాషలో, రెండణాలవెలతో సోదరమానవుల కందించెను. పై నాల్గులక్షణ ములుగల మహాత్మాగాంధీ లేక ఒక్కొక్క ధర్మమేయుంటే, తనకు మాత్రమే తెలియునని యొకని యర్థము. భక్తి, తపస్సు, వినటములేని వారు విన్నమీదటనైన యీ మాట తృప్తిలోనుంచికొని పట్టుదలతో చైతన్యవంతులై తారని యొకర్థము. తపస్సు, భక్తి, శ్రవణముచేయుగల వారలునన్ను సులభముగా గ్రహించగలుగును. బంగారుగాని, యినుము

గాని, యగ్నితప్తమైన కస్తూరి మార్బ్బిసరీతి కొరముట్లగును. ఆ రీతి సత్త్వసంపత్తిగలబుద్ధి వివేకయుక్తముగానుండి చెప్పినంతనే గ్రహించును. భక్తిచేతనే, తపస్సుచేతనే, వినుటచేతనే, భగవంతుని లేక గీతాతత్త్వము తెలియబడదు. అన్నికలిసితేగాని, లేక నన్నిటికి శ్రద్ధా, శ్రవణ, మాస్తి క్యత గలిగిన తెలియబడును. అందరికాని చెప్పకూడదు, వినకూడదని భావనుగాదు. మఱొకమాట. ఫలాసక్తిగల భక్తి, తపస్సు, శ్రవణాదులు కాదనియర్థము. భగవద్గీత చూచిన, విన్నను, భగవంతుడే హృద్గోచర మగుచుండ వలదనుట బాసగునా? కానగదు. గీతా-ఫలశ్రుతిని వివరించు చున్నాడు. "య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి" గీతను చెప్పెడివారికి, విన్నవారికి గలుగు ఫలము విను. గీతాప్రబోధము చేయుటవలన ఫలమేమని కొందఱు తలంతురు. ఫలములేని కర్మయేలేదు. ప్రబోధమునకు ఫలములేదా? ఫలకాంక్షులకు ఫలముండును. ఇహలోక పరలోక ఫలముకోరితే నవియే యిచ్చును. నిష్కాముడై భగవత్సేవయే, భగవత్తపస్సే, భగవద్భక్తియే, భగవచ్ఛరణాగతియే యని గీతాశాస్త్ర మును భగవద్భక్తులకు వినిపించిన నతడు పరమభక్తిచేసి నిస్సంశయుడై నన్నే జేరుననను భగవంతుడు.

ప్ర॥ తన భక్తులకే చెప్పమన్నాడుగాని, భక్తులు గానివారికి చెప్ప మన లేదుగ?

ఉ॥ ఒకాయన తనకొడుకు చూచుచుండ భార్యతో వారి పిల్లవాడు చాలయుత్తముడన, తన కుమారుని యనలేదనియా! తన కుమారునిగూర్చి కదయ్యా యనటము. తత్ప్రకారము భగవంతుడనటము, నందఱు తన భక్తులు కావలెననియే లేకపోతే నా మాటనడు. ఇదిగో స్వామి ప్రసాద మని వినియోగించునప్పుడు ప్రసాదము కొనువారంత భక్తులే. గీతను జెప్పగా వినెడివారు, పారాయణము జేయించగా జేయువారు, గీతను విను పించువారెల్ల భగవంతుని జేరుదురు. సందేహమేలేదు. ముఱికికాల్వలు నదులలోగలిసి సముద్రములో జేరటములేదా? "న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః" గీతోపదేశము చేయువానికంటె నధికప్రియుడు నాకు నీ జగత్తున మఱొకడులేడు. అతనికంటె పరమప్రియుడగువాడిక ముందు గలుగబోడనికూడా యనెను.

ప్ర॥ గీతను ప్రచారము [illegible] నా [illegible]? [illegible] దుష్టి [illegible] పాపాత్ముడైన గాని, నిషిద్ధ [illegible], మతేతరులు గాని భగవంతుని జ్ఞాతికి మోక్షము గలుగునా? అటువంటి ప్రపంచమునందు ప్రచారము చేయవచ్చునుగదా!

ఉ॥ ప్రచారము చేయుమని గీతాచార్యుని దివ్యసందేశము. వట్టిపాపాత్ముల నెందఱు పవిత్రులనుగా జేయునో? పవిత్రవంతుల జేయుటకే ప్రచారము. ప్రపంచమునందు పవిత్రులైనచో ప్రచారమేల? రోగగ్రస్తులకేగదా మందు? రోగము లేనివారి కేల? పరుసవేది సోకినంతనే కటికి వాసకత్తి బంగారైనట్లు, పాపాత్ములైనను పవిత్రులగుదురు. అట్టివాడు కానిచో జటిలమగు వేదాంతవిశేషములు నేరినచో చెప్పుటెట్లు? "అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః" అను యీ ధర్మసంవాదమును జపరూపముగా నెవరు పఠించుచున్నారో, వారిచే నన్ను సర్వయజ్ఞములలో శ్రేష్ఠమగు జ్ఞానయజ్ఞముచే నర్చించుచున్నాను. ఇది నా యభిప్రాయమని భగవంతుడు దక్షిణముగా జెప్పెను.

ప్ర॥ అన్నియజ్ఞములలో జ్ఞానయజ్ఞమే శ్రేష్ఠమా? భగవంతుడు దానికే నంత గౌరవమిచ్చిన తక్కినవాని నేల జెప్పవలె?

ఉ॥ అందఱు జ్ఞానయజ్ఞమునకు నర్హులుగారు. అందువలన జ్ఞానయజ్ఞమునకు పరస్పరసంబంధములగు నితరయజ్ఞముల జెప్పెను. తక్కిన యజ్ఞములు పరోక్షఫలప్రదములు. జ్ఞానయజ్ఞము సాక్షాత్ప్రమాణము, సద్యోముక్తిదాయకమగుటచే శ్రేష్ఠము. 'దశమోఽస్తి' పదియవవాడు కలడను పరోక్షమునకంటె "దశమస్త్వమసి" పదియవవాడవు నీవే యనునది గొప్ప గాదా! సకలసంశయచ్ఛేదకరమైనది. అవిద్యాంధకారము దూరము చేయు భాస్కరుడు జ్ఞానము. బ్రహ్మజ్ఞానమునకు సంబంధించిన తక్కిన యజ్ఞములకంటె బ్రహ్మజ్ఞానము గొప్పది యగుటచేతనే "న హి జ్ఞానేన సదృశం" యనటము. శ్రుతిస్మృత్యనుసారముగా నాచరించు కర్మల పరిసమాప్తికి జ్ఞానమే సమాప్తిసీమ. జ్ఞానము గలిగితేనే కృతకృత్యుడగును. లేదా కృతకృత్యు డెవరికి లేదు. కర్మసిద్ధాంతమున గొప్పయనిపించుకున్న సురేశ్వరుడు జ్ఞానమూర్తి జ్ఞానసిద్ధాంతవేత్తయగు శంకరునిచే తన సిద్ధాంతమునకు స్వస్తిచెప్పి శిష్యుడే కాలేదా? "శ్రద్ధావాననసూయశ్చ శృణు

యాదపి యో నరః" గీతను వినువారిని గురించి ఫలము జెప్పుచున్నారు.
చదువు రానివారు, వచ్చినను బుద్ధి మెరుగనివారు, నెన్నడు విననివారు,
ముదుసళ్లు, స్త్రీలు, నానారక ములవారు నిర్దేశించి, సినిమావారు సర్వుల
కధికార మొసగినరీతి విన నర్హులు. అయితే వారికి ఫలము - గీతను స్వయము
ముగ పఠియించలేకపోయినను, యితరులు పఠించుచుండగానిని లేదా చెప్పెడి
దానిని అర్థము తెలియకపోయిన సరివి సరిచి చదవటము, చెప్పటములా
యని విద్వేషింపక, నశాంతిపడక, గగ్గోలుచేయక గీతనువిన్నచో పుణ్య
కర్మల నొనర్చువారికి ప్రాప్యములగు స్వర్గలోకముల బొందుదురు.

ప్ర॥ విద్య రానివారుకూడ వినిన స్వర్గలోకము గలుగునదరా?

ఉ॥ తీర్థయాత్రలు సేవించటము, దక్షులై ధనవంతులై సకలయజ్ఞము
లొనర్పటమువలన గలిగే ఫలము ధనహీనులకు, శక్తిపాటవము లేనివారి
కెక్కడిది? భగవంతుడు దయచేసి గీతను వింటేచాలు, శాస్త్ర నియమ
సత్కర్మలవలన గలిగే ఫలము గలుగునని. అజామిళుడు మరణకాల
మున నారాయణాయని కొడుకును బిలిచినంతనే మోక్షము గలిగినది.
బాలబాలికలు, వయోవృద్ధులు, స్త్రీలు, పురుషులు, యెవరైన సరియే,
శ్రద్ధగా వింటే చాలు. ఎండకు చలివిచ్చినరీతి, వెలుగునకు చీకటి తొలగు
రీతి, తము తమ పాపములనుండి విముక్తులై పుణ్యగతులు బొందెదరు.
పాండవులు ప్రేమచేత, కంసుడు భయముతో, యాదవులు బంధుత్వ
ముతో, గోపికలు మోహముతో, శిశుపాలాదులు వైరముతో, నార
దాదులు భక్తితో, మహాత్ములగు బుధులు నాత్మరూపమున భగవం
తుని జూచి యుండటు ముక్తులైరి. మనసార గీతను విన్నవారికి గలిగే
భాగ్యము, పుణ్యకర్మ లొనరించని లోభి ధనికులకంటే, సద్గ్రంథముల
రచించని కవులకంటే, హరికథలు చెప్పక నన్యకథలు చెప్పు భాగవతుల
కంటే, భక్తి శ్రద్ధ విశ్వాసములేక దేవతార్చన లాచరించు నర్చకులకంటే,
వేదధర్మములు నోటజెప్పి, యాచరించలేని ప్రత్యక్షపాఖండులకంటే,
శుష్కజ్ఞానులకంటే, నాడంబరజ్ఞానులు, పరపీడ్యజ్ఞానులు, తమ తప్పే
తెలిసికోలేని వేషధారి, మాటలజ్ఞానులకంటే, నాడంబరమునకు, పేరు
ప్రతిష్ఠలకై యజ్ఞకర్మముల నాచరించువారికంటే, జాత్యాచార మత
సంప్రదాయ సంకుచిత పక్షపాత స్వఘాతకులకంటే, పీఠస్థులమని తమ

ధర్మము మఱచి పరపీడాపరులైన మతాభిమానులకంటెను, నిర్దయులు, నధర్ములు, క్రోధులు, దురహంకారులు, ధనరాశిపిపాసులు, స్వార్థులు, స్వజనార్థులు, పటాటోపపరివర్తనులగు ధర్మకర్తలు, ధర్మాదాయఘాతకులు, నియమబద్ధపరిపాలనలేని పాలకులకంటె వీరే మూటికి ముమ్మాటికి శ్రేష్ఠులు. గీతాయనే రెండక్షరముల మంత్రమును పఠింపుచు గతించినను, వింటు మరణించినను, చెప్పుచు, చూచుచు, చదువుచు జచ్చినను మోక్షమే సిద్ధము సిద్ధము.

ప్ర॥ అందుకే గీతకింత ప్రశస్తత వచ్చినది. గీతలేని గ్రామము, యిల్లు, ప్రాంత్యము, దేశము లేనేలేదు. సర్వప్రపంచవ్యవస్థకు గీతయే ప్రాతిపదికము గాగలదనుట మహాత్మాగాంధీగారిచేతనే సుస్థాపన చేయబడినది. ఇప్పటికే ప్రాక్పశ్చిమముల వ్యాపించి, సర్వమతముల, సర్వధర్మముల నగ్రపీఠ మలంకరించినదంటే, "న భూతో న భవిష్యతి" వాస్తవము. అగాధ లోకాలోకములుగల హృదయుడగు నధ్యాత్మపూర్ణుడగు భగవంతుని పరావాణినుండి బయలుదేరి, పెఱుగు మథించినపుడు కల్లు మధ్యమున నుదయించుచు వెన్నవలె, నాయన వైఖరీవాణినుండి ఝల్లులాడుచు వచ్చి, యదృష్టవంతుడగు నర్జునుని కర్ణపుటముల భేదించి, యతని హృదయక్షేత్రమున ప్రవహించి భ్రమాజ్ఞాన జన్మమరణబంధ సంబంధ కల్మషపటలముల దూరమొనరించి తత్త్వమసియను నామరూపముల మిథ్య జేసి ప్రమాజ్ఞానమున భేదముబాపి బయలెల్లి ఖండఖండాంతరవాస జన హృదయముల వెల్లివిరియుచున్నదంటే, సామాన్యమా! గీతా గీతా, నమో నమోస్తు. తదుపరి యర్జునుడేమనెను? భగవంతుడేమనెను?

ఉ॥ ఈ గీతాతత్త్వము గురుశిష్యులైన నరనారాయణులకు జరిగినది. ఫలశ్రుతి జెప్పినమీదట నర్జునునితో భగవంతుడు కడసారి వాక్యము నర్జునుని దృఢాదృఢముల కనుగొనుటకు సాంప్రదాయక గురువులు, శిష్యులు శ్రవణ మొనర్చిన వెనుక శిష్యుడా! నీ సందేహములు తీరెనా? కృతకృత్యుడవైతివా? మరేమైన జెప్పవలెనా? అని యడుగుటకలదు. అడిగి తెలిసికొనకపోతే శ్రోతయొక్క యభిప్రాయ మేమైనట్లు? ఎద్దాని గుఱించి ప్రశ్నింపబడునో, దానికి సరియైన జవాబురానిచో, పృచ్ఛకుడు విడువడు, తృప్తిపడడు. జవాబు చెప్పువారు ప్రశ్నకు సరిగా జవాబు

యివ్వగలిగితినా? లేదా? అని తెలిసికొనుట తమ విధి, లోకమాట. లౌకిక మలౌకిక విషయములం దెల్లెడల నీ యలవాటుంటున్నది. "కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా, కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ" అర్జునా! నేను జెప్పిన యీ ధర్మమును నీవు ఏకాగ్రచిత్తుడవై వింటివికదా! ఇందువలన నీ యజ్ఞానమువలన గలిగిన మోహము వినష్టమైనదియా? అనగా తొలగినదా? అని యడిగెను. ఒకవేళ నా మోహము నికను తొలగలేదన్న మరల జెప్పుటకు, తొలగినదన్న తాను చేసిన బోధవలన కిరీటి కృతకృత్యుడైన తన యాధ్యాత్మికదృష్టి యవతారము సంపూర్ణమైనదని తాను కృతకృత్యుడగుటకు నడిగెను. పాఠములను బోధించిన యుపాధ్యాయుడు చెప్పిన పాఠములు మనసు కెక్కెనా? అని యడుగుట, డాక్టరు తానిచ్చిన యౌషధమువలన వ్యాధి నయమైనా? అని రోగిని యడుగుట, వడ్డించువాడు నాహారము బుచ్చుకొనువాని తృప్తి యైనదియా? అనియు, దానమిచ్చుదాత చాలునా? ఇక నవసరమా? అని యడుగురీతి భగవంతుడు నర్జునునికి గలిగిన మోహనివృత్తి యైనదియా? లేదా? అని కనుగొనుటకు.

ప్ర॥ అర్జునుడందు కేమి జవాబు యిచ్చెను?

ఉ॥ భగవంతుడడిగీయడుగక మునుపే నుత్సాహపూరితుడై తండ్రి చెప్పకమునుపే రాము డడవిప్రయాణమునకు సిద్ధుడైన భంగి, చిఱునగవు మొలకెత్త యుత్సుకతతో సంపూర్ణముగా భోంచేసినమీదట గుఱ్ఱుమని త్రేపినరీతి, తన తృప్తిని కృతకృత్యతను, చాతకము చంద్రకిరణముల ద్రావినమీదట, దేవత లమృతమును హరివలన త్రాగినమీదట, గర్భస్థుడగు పరీక్షిత్తును రక్షించినమీద, గాఢనిద్రలో జ్ఞానాభాసకుడు జ్ఞానమును బొందినరీతి నిట్లు వచించెను. "నష్టో మోహస్స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత। స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ" అచ్యుతా! నీ కృపవలన నా మోహము తొలగినది. కుంతీపుత్రుడను, పాండవమధ్యముడను, ఎముకల గూడమగు నీ శరీరము నేనుయనే కర్తృత్వాద్యభిమానముతో సహా వినష్టమై, యనాది యఖండజ్ఞానమయుడగు సచ్చిదానందుడ ననే జ్ఞాపకము వచ్చినది. సకల సందేహములు తొలగినవి. నానార్థభావన తుదముట్టినది. నీ సేవ ఫలించినది. నీ కృపాకటాక్షము వృథాపోలేదు. ఇక

నీవేమి యాజ్ఞాపింతువో, నది చెల్ల నొనర్చెదను అనెను. గీతా యుపక్రమోపసంహారములగు షడ్లింగముల సారాంశము సంపూర్ణమైనది. గీత యెందు కుపక్రమింపబడెను? అర్జునునికి గలిగిన మోహనివృత్తికొఱకు. మోహము దేని కార్యము? అవిద్యాకార్యము. అవిద్యానివృత్తి కేది కావలెను? జ్ఞానము. తొలుత మోహముతోనే కర్తృత్వభ్రాంతుడయ్యెను. ఉపక్రమములోనే నీవీ దేహము కాదు; కల్పితములగు దేహేంద్రియ ప్రపంచములకు నీవు ద్రష్టవు. నీవు, నేను, యీ లోకస్థులు మందొకే స్వరూపులము. మిథ్యాజ్ఞానముచే నానాత్వము గనుపించుట, యభ్యాస యపూర్వతలతో నీవే సర్వము 'తత్త్వమసి' 'త్వం తదసి' యని బోధించ "అహం బ్రహ్మాస్మి" యను బాధసమానాధికరణముచే దృఢతరజ్ఞానమాయెను. గతసందేహుడయ్యెను. భయదూరుడై, నారాయణుడై, పరత్వము వ్యావహారికము లనకు లేనిదై, కదలికలేని దధివలె, నచలమువలె నూరకుండెను. వర్షము కురియు సస్యములు ఫలించెను. ప్రశ్నలకు ప్రత్యుత్తరములు వ్రాసి, బాలబాలిక లుత్తీర్ణులైరి. శ్రవణమననమువలన ధీమంతులు ప్రశాంతులైరి. తద్విధంబున లోకేశ్వరుండగు కృష్ణుడును, పాండుపుత్రుండగు కృష్ణుండును ద్వయదోషరహితులై నేకత్వంబున సచ్చిదానందసాగరతరంగోత్తుంగతరంగప్రేమడోలికల నూగుచు నహంశబ్దఘోష మద్వితీయమై వెలుగొందె. తమఃపటలంబు జాడ గనిపించదయ్యె. పరస్పరంబస్మృతంబయ్యె, సమానవిభవోపేతుండగు నిరుపాధిక పరబ్రహ్మ స్వయంజ్యోతియై పరిపూర్ణంబై యుండె, గీతా నీరాజనం బీయబడె, నది యుద్ధభూమియా? గీతా నినాద భవ్యస్థలమా! కుంఠితములు లేని వైకుంఠమా! నిర్వికల్పమా! యన నొప్పుచుండె,

ప్ర॥ ఎంత ధన్యుడు ధనంజయుడు! దేవదేవునివలన గీతనువిని కృతకృత్యుడయ్యెను!

ఉ॥ గీతోద్దేశము, భగవదుద్దేశము రెండొకటియే. మోహమనే రోగనివృత్తి కొనరించుటేనని సమస్త మానవులు గ్రహించునది. ఈ మోహమునకు కారణ మజ్ఞానము. అజ్ఞానమే ప్రపంచము. "ద్వైతమివ భవతి" అజ్ఞానముతో నానాత్వము గోచరించును. జ్ఞానత్వముతో నేకత్వము గోచరించును. నానావిధమానవు లందఱు, స్త్రీపురుషులనే

భేదము దేహములకు గలిగినదేకాని, యన్నిదేహముల ధరించువాడే పురుషుండు. "జాగ్రత్స్వప్నసుషుప్త్యాది ప్రపంచం యత్ప్రకాశతే, తద్బ్రహ్మాఽహమితి జ్ఞాత్వా" త్రిదవస్థల ప్రకాశించు నే ప్రపంచముగలదో నది బ్రహ్మమే. "యదన్త్యాదౌ యద న్త్యంతే యన్మధ్యే భాతి తత్స్వయమ్" మొదట నేదిగలదో, చివర నేదియుండునో స్వయముగా నదియే మధ్య కాలమునగలదు. ఈ సత్యవస్తువు బ్రహ్మమే. "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత" అన్నిక్షేత్రముల క్షేత్రజ్ఞుడ నేనే, నేను తప్ప వేఱువేఱాత్మలులేవని తెలియుటదే జ్ఞానము. తక్కిన దజ్ఞానమని భగవంతుడు. దేహేంద్రియములు జడములగుట నేననజాలవు. జడములగు దేహేంద్రియదృశ్యముల నేననుకొనుటే మోహము. అదే యవిద్య. తన్నివృత్తి యాత్మజ్ఞానముగాక, మఱొద్దానిచే తొలగదు. ఏ వ్యాధికే యేమందు, నేపథ్యమవసరమో, నట్లు జ్ఞాననివృత్తికి తక్కిన మార్గము లుపయోగపడవు.

ప్ర॥ అయితే కులములు, మతములు నజ్ఞానజాతములేనా? అజ్ఞాననివృత్తికి జ్ఞానము కావలెనా? కులమతములతో జ్ఞానము రాదంటారా?

ఉ॥ ఎన్నటికిరాదు. పారమార్థికసంబంధమైనది జ్ఞానము. వ్యావహారికములగు కులమతము లజ్ఞానభాజనములు. మహత్తరజ్ఞానమునకు నంతఃకాలము సాధనచతుష్టయసంపన్నత్వము లేదా నైతిక సాంఘిక ధర్మముల నిష్కామముగ నాచరించి, మలవిక్షేపదోషనివృత్తి జేసికొని గురువుల నాశ్రయింపనిది యావరణభంగకారణమగు జ్ఞానమురాదు. గురువుల నాశ్రయింపక, పైనజెప్పినతీరు ప్రయత్నము జేయనిదే, నేకుల మున కేమతమునకు జ్ఞానమురాదు. అట్లు వచ్చేటుగానుంటే, నిప్పుడు చదివెడు నింగ్లీషువగైరా భాషలుగాని, సంస్కృతాదుల భాషాజ్ఞానము గాని చదువకనే రావలసియుండును. అట్లెవరికి నొచ్చుటలేదు. అథవా జ్ఞానము వచ్చియుంటే, నజ్ఞానకార్యములగు వానిలో పాల్గొని జాతిమతాదుల పేర్కొనుటేలా? తనవలెనే సర్వమును జూడక గ్రుడ్డిచూపేల జూచును? యాజ్ఞవల్క్యుడు సూర్యునివలన, సుమంతజైమిన్యాదులు వ్యాసునివలన, పద్మపాదసురేశ్వరాచార్యాదులు శంకరునితో నేల జ్ఞానమును బడయుదురు? ఇట్లే నొక్కొక్కరివలన ననేకులు జ్ఞానము బడయు

దురు. బుద్ధుడు ధర్మచక్రమును ననగా జ్ఞానమునుబూని, జ్ఞానోపదేశము నీతిమార్గమున జేయుచు, వైశాలినగరమునువీడి సమీపమునగల మామిడితోపులో నివసించెను. అయ్యది నామ్రపాలియను వేశ్యది. బుద్ధుమందు కెఱింగి, వైశాలిప్రభుని యుంపుడుగత్తెయగు నామ్రపాలి, నాయననుజేరి నమస్కరించి, తనయింటికి భిక్షకురా బ్రతిమాల, గౌతము డంగీకరించెను. చూచితివా! మహారాజు లనేకులుండ నామెయింటికి గౌతము డంగీకరించెననిన, నాయన దృష్టిలో జాతిమతములులేవు. "ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా" ఈశ్వరానుగ్రహము లేనిది యద్వైతవాసనయే గలుగదు. "న కామ్యప్రతిషిద్ధాభిః క్రియాభిః మోక్షవాసనా, ఈశ్వరానుగ్రహాత్సా స్యాత్" ఈశ్వరానుగ్రహమే నిచ్చుటకూడ జెప్పబడినది. కామ్యకర్మలచేతను, నిషిద్ధకర్మలచేతను మోక్షవాసన గలుగదు. దైవానుగ్రహమువల్లనే గల్గును. "న వర్ణాశ్రమ సంకేతైః న కర్మోపాసనాదిభిః, బ్రహ్మజ్ఞానం వినా మోక్షః" వర్ణము లాశ్రమములు. వీటికి సంబంధించిన వేషభాషలు, కర్మలవల్ల, నుపాసనవల్ల మోక్షము దొరకదు. ఒక్క బ్రహ్మజ్ఞానముచేతనే లభించును.

ప్ర॥ కృష్ణార్జునులిరువు రిట్లుండిరి. అక్కడ సంజయు ధృతరాష్ట్రులేమైరి?

ఉ॥ ఆత్మబుద్ధిగల సంజయుడు భగవంతుడు చెప్పినది తాను వ్యాసదేవుని దయ దివ్యములగు చక్షుశ్శ్రోత్రాదులుబడసి, ధృతరాష్ట్రునకొకవంక వినిపించుచు, నర్జునుడు సందేహరహితానందుడయ్యెవటకు తానట్లనేయై, సమస్తమునుమఱచి, భావావేశుడై కొంతవడికి, విస్మయముతో నేమేమొ పలుకసాగెను. ధృతరాష్ట్రునికి నాయదృష్టములేనిదాన సిగ్గుపడి, తానేమి సంజయునితో ననజాలక నూరకుండెను. "ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః, సంవాదమిమమశ్రౌషమద్భుతమ్" ఓ ధృతరాష్ట్రా! తమ తమ్ముని కుమారుడగు నర్జునునకు, శ్రీకృష్ణునకు గలిగిన సంవాదమును విన్నందున, నేనేమి చెప్పుచుంటినో, తామేమి వినుచుంటిరో తెలియదు. ఆ నరనారాయణుల రహస్యమగు నాధ్యాత్మిక గోష్ఠి విన్నవారిదే యదృష్టము. "వ్యాసప్రసాదాచ్ఛ్రుతవానేతద్గుహ్యమహం పరం, యోగం యోగేశ్వరాత్కృష్ణాత్సాక్షాత్కథయతః స్వయమ్" అపరనారాయణుడగు వ్యాసానుగ్రహమున పరమగుహ్య

మును, బుధజనమథనోద్భవ యింద్రియాతీతగమ్యము, యోగతత్వ పూర్ణమునగు గీతాశాస్త్రమును, విజ్ఞానమయమును, సాకారతత్వ మగు యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడు వచింపుచుండ మనసార నేత్రానంద ముగ చూడడము, శ్రవణానందకరముగ వినటము, హృదయము శివ మెత్తి ధన్యుడనైతిని. "రాజన్సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమ మద్భుతం, కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః" ఎన్నడు విననిదియు, పరమమహర్షుల నాశీర్వాదప్రేరితమును, మదీయ సుకృతమును, భవబంధరహితంబును, నరనారాయణ వ్యావహారిక సంవాదంబును, పారమార్థికస్వప్నంబును, మఱల మఱల స్మరింపుచు, ననుక్షణము హర్షమును బొందుచుంటిని. "తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః। విస్మయో మే మహాన్రాజన్హృష్యామి చ పునః పునః" ఓ మహారాజా! అద్భుతమగు శ్రీకృష్ణదేవుని విశ్వరూపమును మరల మరల జ్ఞాపకము చేసుకొనుచుంటే నీవెవరవయ్యా, నేనెవరవయ్యా! కురుపాండవు లెవరు? ప్రపంచమేమిటి? హరిగాదా, హరి మాయాపర వశులు హరిలీలలు గుర్తించలేరు. నేనుమాత్రము యింతవానినైనాను, నా తలిదండ్రులు బంధులాప్తులవల్లగాని, తక్కిన కర్మజాలములవల్లగాని, తెలియరాని యమోఘమును గంటిని, యెంతయాశ్చర్య మెంతయాశ్చ ర్యము! పాలకడలిద్రిచ్చునా డొక్కొక్క రొకవస్తువును పుచ్చుకొనిరిగాని, వారికింత యానందములేదు. దేవకీ వసుదేవ నంద యశోదాదులకు లేదు నాయానందము భళీ. హే మధుసూదనా! హే యదువంశప్రభో! పాహిమాం! పాహిమాం! ప్రాప్తమంటే యెట్టిదో, సంజయుడు చెప్ప ధృత రాష్ట్రుడు వినెను. సంజయార్జునులకు గలిగిన యభేదానందము కృత ఘ్నుడగు ధృతరాష్ట్రునకు కలుగదాయెను. గీతను వినెనుగాని, యేమి ప్రయోజనము? ప్రథమాధ్యాయారంభమునవున్న ధృతరాష్ట్రుడే మోక్ష సన్న్యాసయోగాధ్యాయాంతమందు నున్నాడుగాని, ధృతరాష్ట్రుడే వారికి యానందము నేకస్థితి, యితనికి దుఃఖము ద్వైతస్థితి గలిగినది.

ప్ర॥ ఎందువలన ధృతరాష్ట్రునకు సంశయముదీరి యర్జునునివలె సంజ యునితో ననలేదు?

ఉ॥ ఈ మలత్రయము, మలవిక్షేపావరణ దోష మాత్మగరిమముగలవారి కెవ్వరికైనను, యెంత విన్నను, యెటువంటివారు చెప్పినను మోహము వదలదు. తమోగుణ మతిశయించి, మోహమేఘములు దట్టము, చిదాకాశమును నావరించియుండును. అందువలన త్యాగము రాదు, ఆనందము లభింపదు, బంధ విముక్తులు గారు. ఆ విషయము వెనుకటి శ్లోకముగ "యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః। తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువానీతిర్మతిర్మమ" సంజయుడు తన యభిప్రాయమును యిట్లు చెప్పెను.

ప్ర॥ ఏమని వివరించెను? ధృతరాష్ట్రు డేల గ్రహింపలేదు?

ఉ॥ ఏ పక్షమున యోగేశ్వరుడగు కృష్ణుడుండునో, గాండీవధారి యగు నర్జునుడుండియుండునో, నా పక్షమున స్థిరమగు రాజ్యలక్ష్మియును, శత్రుజయమును, అభ్యుదయమును, న్యాయము నుండునని, యిది నా నిశ్చయమని వివరించెను. ఇందువల్లనైన తాను తెలిసికొని పాండవుల భాగము వారికిచ్చి, యుభయకులములు నిర్మలముగా మనుటచే నీవంటి వానికి క్షేమమగుననెను. కాని యా యజ్ఞానాంధుడు దేహాభిమానము, దేశాభిమానము, పుత్రాభిమానము వదలక జయము తమకే గల్గునని యెంచెను. మరొకర్థము: సంజయః = మిక్కిలి శ్రద్ధతో నింద్రియముల జయించినవాడు. పుణ్యకర్మమనే గాండీవ మెవ్వనిచేత నుండునో, దైవము వాని పక్షమున నుండును. అహంకారస్థానమున దైవము నుంచడు. అప్పుడు శ్రీ యన మోక్షమునకు ప్రతిబంధకములగు నింద్రియవిషయాదుల విజయము, న్యాయమగు ననగా తనదైన సహజస్వరూపమే తుదకు సిద్ధించునని యర్థము. పుణ్యకర్మలేలేని ధృతరాష్ట్రాదుల పక్షమున నహంకారాడంబర బలదర్పములు తప్ప, దైవబలము లేనందున మోక్షలక్ష్మి గాని, భూలోకరాజ్యలక్ష్మిగాని దక్కదనియు, ప్రాప్తించదనియు తెలియవలెను. ధనమందు, పుత్ర మిత్ర కళత్ర పశు గేహ బంధు భృత్యాదులందలి మమకారము, దేహేంద్రియాదులయందలి కర్తృత్వాద్యభిమానము త్యాగమొనర్పని ధృతరాష్ట్రులవంటివారికి జయములేదు. భాగ్యలక్ష్మి లేదా మోక్షలక్ష్మిగల భగవంతుడే పక్షమున నుండు నా పక్షమునకు విజయమునకు కొరతగలదా! పౌర్ణమి చకోరములకు చంద్రకిరణములకొఱత,

కల్పతరువు క్రింద కోరికెలకు ఫలమూలస్యముండదు. భగవంతు డనుగ్రహింప నసురులు సురలు, రాళ్లు వజ్రములు, మానవులు మాధవులు, జలము యమృతము, ద్వైతమద్వైతము, భయమభయము, నధర్మము ధర్మము, అపూజ్యత పూజ్యత, భీరువు ధీరత, విష్ణుపాదజలము, శివుని జటాజూటముననుండి, బ్రహ్మకమండలువునుండి, దివినుండి, కపిలుని చెవినుండి ప్రవహించి జీవుల పవిత్రుల నొనర్చినట్లొనర్చుట తథ్యము. భీష్ముడొకరిచే జయింపబడనివాడనిన్ని, ద్రోణుడట్టివాడేననిన్ని, ధర్మక్షేత్రమగు కురుక్షేత్రమహిమ, నా తనయులకుగాని, లేక పాండవులకుగాని, లేక నుభయులకు మంచిబుద్ధిగలిగి పోరుమానగలరా! యనియు, ధర్మజుడాడితప్పనివా డింతయనర్థకము గలుగనివ్వడనియు, నన్నదమ్ములలో పెద్దవాడ నేనగుట, రాజ్యలక్ష్మి మాకేదక్కుననియు, భుజబలశాలియగు కర్ణుడుగలడనియు, భగవంతునకు పాండవులవలె మేము చుట్టములమేకదా! ఆ మహానుభావుడు, నీ రణమును కొనసాగనీయక మనవగలడనియు, పదకొండ క్షోహిణుల సైన్యము మనదనియు, పదమూడువత్సరములడవియందాకులలములుదిని బలహీనులై, బుద్ధిబలము, దేహబలము క్షీణించిన పాండవులు మమ్మెదిరించలేరనియు, భీమునకు జోడు సుయోధను, డర్జునునకు కర్ణుడు, ధర్మజునకు శల్యుడు, నకులసహదేవాదులకు నశ్వత్థామ కృపాచార్యాదులు సములు. ఇక మిగిలిన భీష్మద్రోణు లెంతబలమైన బరిమార్పగలరని యాశామానసుడై, గోడమీదిపిల్లివలె, గుడిలోనికోతివలె, కొంగజపముమాదిరి ధృతరాష్ట్రుడు, సంజయుడు తనకు గలిగిన గీతామృతము, నర్జునునకు భగవంతుడు వినిపించినదంతయువిని సంతసించుచు, బొగడుకొనుచు, నంతర్బహిస్సుల హరినేగనుచు, ప్రహ్లాదునివలె కరచరణాద్యవయవముల సైతము హరి సేవయందే నర్పించి యకుటిలమానసుడై, విస్ఫూర్జితహృదయుడై, చక్రహస్తుడు గాండీవధారి, వ్యాసుడొక వనమాలియై, సుదర్శనమగు గీతా కుదర్శనహాని యొనర్చెను. ఏడువందల శ్లోకములుగల గీతాభగవతి, సమస్తమానవసంసేవితురాలు. ఒక్కొక్క శ్లోకార్థమే, సంసారసాగరమును తరింపజేయగలిగిన నావవంటిది. అనుక్షణము పఠించిన నాత్మవికాసమున ప్రజ్వరిల్లు వికుంఠుని గరుడధ్వజము వంటిది. వాచ్యుడైన భగవంతుని వాచకముగూడ. వాచ్యవాచకములు

రెండు భగవానుడే. సమస్త పుణ్యతీర్థములు, సకల క్షేత్రములు, సకల మునిగణసేవిత ఫలప్రదమే గీత. ఎన్నియో శాస్త్రములున్నవి. కాని యవియన్నియు తమ విభాగమును తెలిపి, సంతటితో లుప్తమగును. గీత యట్టిదికాదు. అవ్యయము; బ్రహ్మస్వరూపమే సందేహములేదు. సృష్ట్యాది యాదిత్యుని మొదలుగా ద్వాపరమున కురుక్షేత్రమున నర్జునుని నిమిత్తము జేసికొని, భగవంతుని హృదయకుహరమునుండి బయలుదేరి విశ్వమానవ కళ్యాణరూపిణియై వెలయుచున్నది. సంశయవంతుడు, పరమ లుబ్ధుడు, నజ్ఞానియగు ధృతరాష్ట్రుడు, వ్యాసార్జునసంజయాదులు, గీతోపదిష్టులై భగవంతుని యేకైకస్థులైతే పాండవులు, మావారు యేమిజేసిరి? అని యడిగెనంటే, నితనిఫలము ద్వైతస్థే, బంధమే, దుఃఖమే పర్యవసానముగా గల్గినవాడు. ప్రపంచమానవులు ధృతరాష్ట్రునివంటివారు కాకపోయిన శేషార్థిలో నైన గలసిపోగలరు. మూఢులు, పామరులు, విషయాసక్తులు, సంగదలు దుర్బలురని వేదాంతశాస్త్రము ఘోషించుచున్నది. మృగములవంటి శరీరబలము, వంచకబలము బలముగాదు. ప్రకృతికి లొంగిపోయి మనోదాసులైనవా రెంతబలవంతులు, తీగె దేనినో యొకదాని నాశ్రయించవలె, రోగి యేవైద్యునో నొక వైద్యుని యాశ్రయింపవలె, చంద్రుడు సూర్యుని, నదులు సముద్రమును, కోయిలలు కాకులను, పశు కుక్క పిల్లి కోడి యిత్యాదులు మనుష్యులను, దేవతలు భగవంతుని, నియంతలుగాని ప్రభువులు ప్రజల నాశ్రయింపవలె. అట్లు బలహీనులు, ధనము మొదలు నన్నిటి నాశ్రయింపవలసినదే. భౌతిక విజ్ఞానవేత్తలుగాని గాక, కడుదుర్బలురు,ప్రకృతిగాపులు,చలితజీవులు,సచలితశివులుగారు. కర్మపరులు బుద్ధినిష్ఠులుగారు. దూది యెగురునపుడు గాలిలో గలిసిపోవు తుక్కు, పెద్దగాలిలో వేయు చెత్తచదారమువంటివారు. ధర్మమును గ్రహింపలేరు. ధర్మమును గ్రహించినవారివలె నటింతురు. ఒకడొక యింటివద్ద భిక్షమునకు బోవ,నాయింటికోడలు లేదనిన,పోవుచుండ,నత్తయెదురై మాయింటికి వెళ్ళితివా? యన, యౌను లేదనెనన, గారమ్మ్మయని పిలిచికొనిపోయి లోనికి జని లేదు పొమ్మనెను. ఎందుకు రమ్మంటివన, లేదుపో యను నధికారము నాదికాని, కోడలిది గాదని తెలియుటకనెను. 'చూచితివా! యిట్లాంటి యప్రయోజకులు మోక్షముతో నిపుడేమి పని? ప్రాప్తమున్న

తప్పునా? దానికై యదియేవచ్చును. అయినను కాలమెంతోయున్నది కదా! ఇపుడేల ప్రయత్నము? బంగారువంటి కాపురములకు నీళ్లువిడనా! ప్రాప్తములేనిది యేలావచ్చును? ఇంత ప్రపంచమున్నది యెవరైన ముక్తి కొఱకై పరుగెత్త గలిగిరా? లేదు. పరియోగ్యగో సోమరులై, తిండి పోతులై, ద్రిమ్మరులై తిరిగెదరు. సంసారము భంగపఱుపరాదు. బంధు లాప్తు లనేకులుండ వీరు నన్ను రక్షించరేరా! ముగియవలసిన కార్యము లన్ని ముగియనీ, జయముగలుగునని యెవరైన దీవించని, విషయము లనుభవించుచునే మోక్షము రావలె, భిక్షకులవలె సండలి యాచించుట మేలా? యని సామాన్యజనులు తమలోతామిట్లు సమాధానము లిచ్చు కుంటు నుపేక్షించుదురు.

ప్ర॥ తామన్నమాట సత్యము. మోక్షకామి ప్రపంచమున నేవెయ్యింటి కొకడో గనిపించును. ధృతరాష్ట్రునివంటివారే తక్కుంగలవారు. గీతా బృందావనమున విహరించి, గీతాయమునలో స్నానమాడి, గీతాశ్రమమున విశ్రమించినవారే ధన్యులు. క్షణభంగురమగు జీవితములో నెవ్వాడో, యెయ్యది యేమగునో నెవ్వరికెఱుక! గీతాచార్యుని సంపూర్ణదృష్టితో నాకీ గీతాశాస్త్రము విన ప్రాప్తించుటయు నాసుకృత మనుకొనెదను. తమ కడపటి సందేశము వినిపింపుడి.

ఉ॥ మానవుల సంస్కారవంతులుగాచేసి భయరహితులను, సందేహ రహితుల నొనర్చుటకై భారతామ్నాయమున, నీ గీతాజ్ఞానోదయ మాయెనన నిస్సందేహముగ మానవులకొఱకే. పాపాత్ములుగాని, పుణ్యా త్ములుగాని గీతాధర్మములువిని, యనుభూతికి దెచ్చుకొనుటకు పరుస వేదివంటిది. కలుషితహృదయములగు నినుమునుగూడ బంగారువంటి జ్ఞానమును ప్రకాశింపజేయును. గీతాకల్పతరువును, లేక కామధేనువును, లేక చింతామణిని నాశ్రయించిన గురుతరహృదయులు నిజముగ భవ సాగరమును తరింపగలరు. ఏ యుద్దేశ్యముతో గీతనువిన్నను, చదివినను, వినిపించినను, వ్రాసినను, మోక్షమే మరేదిలేదు. సముద్రమును జేర

నుష్ణనీరిచ్చును. కల్పతరువును జేర కామితములనిచ్చును. గంగనుజేర మలవిమోచన మొనర్చును. సూర్యుడు వెలుగును, చంద్రుడు శీతలమును, భూమి సస్యఫలముల నీమాదిరి దేనినాశ్రయింప దానిస్వభావములె మన కిచ్చును. గీత నాశ్రయింప నవిద్యను ధ్వంసమొనర్చి, స్వరూపమును మోక్షమిచ్చును. కావున తత్వవేత్తల నాశ్రయించి గీతనే సేవింపవలెను. భగవద్వాక్యోల్లంఘన మొనర్ప భవబంధము తప్పదు. అర్జునునికి ప్రబోధించి, యాతనికి మోక్షమొసంగిన దేవుడు మనలను రక్షింపడా! ఏడీ, ఎక్కడ యనుకొననలదు. హృదయముననే గదా యున్నాడు! దేశము లెల్ల తిరుగుట మేలా? సర్వత్ర వ్యాపించిన చిద్రూపుడే మనయాత్మ. ఇందు వలన వ్యాసునివలె, నర్జునునిమాడ్కి, సంజయునిరీతి గీతాపాన మొనర్చి భృంగిసముదాయము సేనగు వసధువుసేవించి, మత్తత ఝుంకరణమొనర్చినమాడ్కి "అహమేవ సర్వమ్" "త్వమేవ సర్వమ్" యను నిరాడంబర, నిర్వ్యాజ ప్రేమ బాడి, భగవద్రూపులమగుటయే మన జన్మకు ఫలము. అర్జునుడు తానేయై తనకుతానే తనస్వరూపమును గీతారూపమున జెప్పిన సర్వాంతర్యామియగు గీతాచార్యుడే, రాధామనోహరుడే, చిదచిద్విలాసుడే, సద్గురురూపుడై నన్ను నిమిత్తమొనర్చి కురుక్షేత్రమగు ధరణిక్షేత్రమందున్న సకలవిధ మానవుల నుద్దేశించి ప్రశ్నోత్తరరూపంబున నాబాలగోపాలము గీతాతత్వరహస్యము, గీతాసందేశము తెలియ మూలమూలల పరివ్యాప్తమొనరించి మోక్షమును నైకైకభావమును, సుస్థిరశాంతసదనమును, స్వసంవేద్యస్వేచ్ఛాపూర్వపూర్ణస్థితిని బడయ ప్రాయించెను. కురుక్షేత్రమున జరుగు నంతర్బహిరంగయుద్ధమున జయము నొందవలెనన్న ప్రతియొక్కరు గీతాచార్యుని, గీతను నాశ్రయింపక తప్పదు. అప్పుడే పురుషత్వ పౌరుషేయప్రయోజనము, పరమపురుషార్థప్రదము గాగలదు. భీష్మపర్వమున పాలకడలి లక్ష్మి జనించినమాడ్కి, సకలోపనిషత్తులసారము, సకలమతసమన్వయము, సర్వసిద్ధాంతముల సమగ్ర భావము, భవబంధరసాయనము, యోగులకు యోగభూమి, జ్ఞానులకు

సౌందర్యభూషణము, త్యాగులకు సంకేతస్థానము, భక్తులకు వైకుంఠము, ధ్యాన కర్మ లయ హఠయోగులకు సమాధిస్థానము, సకలమతస్థులకు యాత్రాస్థలము, అధికారులకు విద్యాలయము, శ్రోతలకు విశ్రాంతి స్థానము, ప్రబోధకులకు తత్త్వవేదికము, సుధారులకు నాటపట్టు, పరమ హంసలకు మంథానము, యతులకు వ్రతరూపము, బ్రహ్మచారుల కౌప చారిక సంయమిత శిక్షణము, తదితరులకు కాశీ, హరిద్వార, ఋషీకేశ, కేదార, బదరీ పవిత్రసేవిత పుణ్యస్థలము లేక తీర్థస్థలము వారి ముఖార వింతమునుండి బయలుదేరిన గీతా.

శ్లో॥ మంగళం శ్రీకురుక్షేత్రరణక్షోణివిహారిణే ।
పార్థసారథిరూపాయ గీతాచార్యాయ మంగళమ్ ॥

ఇతి శ్రీ భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే మోక్షసన్న్యాసయోగో నామ
అష్టాదశోఽధ్యాయః
ఓమ్ తత్ సత్

ప్రశ్నోత్తరీప్రవచనగీత సంపూర్ణము.

